హరే కృష్ణ

# భగవద్గీత

## యథాతథము

కృష్ణకృపామూర్తి

శ్రీ శ్రీల ఏ.సి.భక్తివేదాంతస్వామి ప్రభుపాదులు

అంతర్జాతీయ కృష్ణచైతన్యసంఘ సంస్థాపకాచార్యులు

# ప్రథమాధ్యాయము
# కురుక్షేత్ర రణరంగమున సైనిక పరిశీలనము

**1.1**

**ధృతరాష్ట్ర ఉవాచ**

**ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవ: ।**

**మామకా: పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥**

## అనువాదము

**ధృతరాష్ట్రుడు ఇట్లు పలికెను: ఓ సంజయా! ధర్మ క్షేత్రమైన కురుక్షేత్రము నందు నా తనయులు మరియు పాండురాజు తనయులు యుద్ధము చేయగోరువారై సమకూడిన పిమ్మట ఏమి చేసిరి?**

## భాష్యము

శ్రీమద్భగవద్గీత విస్తారముగా పఠింపబడు ఆస్తిక విజ్ఞానశాస్త్రము. అది గీతామాహాత్మ్యము నందు సంగ్రహింపబడినది. భగవద్గీతను కృష్ణభక్తుని సహకారమున పరిశీలనాత్మకముగా పఠించి ఎటువంటి స్వంత వ్యాఖ్యానములు లేకుండా అవగాహనము చేసికొనుటకు యత్నించవలెనని దానియందు తెలుపబడినది. గీతను అర్జునుడు శ్రీకృష్ణభగవానుని నుండి ప్రత్యక్షముగా శ్రవణము చేసి అవగాహన చేసికొనెను. ఈ విధముగా స్పష్టమైన అవగాహన కలుగగలదనుటకు భగవద్గీత యందే నిదర్శనము లభించుచున్నది. మనుజుడు ఆ గురుశిష్యపరంపరలో స్వకల్పిత వ్యాఖ్యానములు లేకుండా భగవద్గీతను అవగతము చేసికొనగలిగినంతటి భాగ్యవంతుడైనచో సమస్త వేదజ్ఞానమును, ప్రపంచమునందలి ఇతర శాస్త్రములను అతిశయించగలడు. ఇతర శాస్త్రములందు గల విషయమునే గాక అన్యత్రా గోచరించని విషయములను కూడా పాఠకుడు భగవద్గీత యందు గాంచగలడు. అదియే గీత యొక్క విశిష్టమైన ప్రామాణికత. పూర్ణపురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానుని ద్వారా ప్రత్యక్షముగా పలుకబడినందున ఈ భగవద్గీత సంపూర్ణ ఆధ్యాత్మిక విజ్ఞానశాస్త్రమై విరాజిల్లుచున్నది.

మహాభారతమునందు వర్ణింపబడిన ధృతరాష్ట్ర, సంజయుల సంవాదవిషయములు ఈ ఉత్కృష్ట తత్త్వశాస్త్రమునకు మూల సిద్ధాంతములై యున్నవి. అనాదియైన వేదకాలము నుండియు తీర్థస్థలముగా ప్రసిద్ధినొందిన కురుక్షేత్రమునందు ఈ తత్త్వశాస్త్రము ఉద్భవించినట్లుగా తెలియవచ్చుచున్నది. ఈ భూమిపై శ్రీకృష్ణభగవానుడు స్వయముగా స్వయముగా ప్రత్యక్షమైయున్నప్పుడు మానవాళి నిర్దేశానార్థము దీనిని పలికియుండెను.

కురుక్షేత్ర రణరంగమున శ్రీకృష్ణభగవానుడు అర్జునుని పక్షమున నిలిచియుండుటచే ధర్మ క్షేత్రము (ధర్మాచారములు నిర్వహింపబడు స్థలము) పదము ప్రాధాన్యతను సంతరించుకున్నది. కౌరవుల తండ్రియైన ధృతరాష్ట్రుడు తన తనయుల

విజయావకాశమును గూర్చి గొప్ప సందేహగ్రస్తుడై యుండెను. కనుకనే తన సందేశమున అతడు “వారు ఏమి చేసిరి?” అని కార్యదర్శియైన సంజయుని ప్రశ్నించెను. తన పుత్రులు మరియు పాండురాజు తనయులు యుద్ధము చేయవలెనను నిశ్చయముతో కురుక్షేత్రమున సమకూడిరని అతనికి తెలిసియు ఆవిధముగా విచారణ కావించుటలో ఒక ప్రాముఖ్యము కలదు. జ్ఞాతులైన సోదరుల నడుమ అతడు రాజీని వాంఛింపలేదు. అదియును గాక రణరంగమున తన పుత్రుల విధి ఏ రీతి కలదో అతడు తెలిసికొనగోరెను. కాని దేవతలకు సైతము పూజనీయ స్థానముగా వేదములలో తెలుపబడియున్న కురుక్షేత్రమునందు యుద్ధము ఏర్పాటుచేయబడుటచే యుద్ధపరిణామముపై స్థలప్రభావమును గూర్చి అతడు మిగుల భీతినొందెను. స్వభావరీత్యా ధర్మాత్ములైనందున అర్జునుడు మరియు ఇతర పాండుతనయులకు అది అనుకూల ప్రభావము చూపునని అతడెరిగి యుండెను. సంజయుడు వ్యాసదేవుని శిష్యుడు. ధృతరాష్ట్రుని మందిరముననే నిలిచియున్నను అతడు వ్యాసుని కరుణచే కురుక్షేత్ర రంగమును గాంచగలిగెను. కనుకనే యుద్ధరంగమందలి పరిస్థితిని గూర్చి సంజయుని అడిగెను.

పాండవులు మరియు ధృతరాష్ట్రుని తనయులు ఒకే వంశమునకు చెందినవారు. కాని కేవలము తన పుత్రులనే కురుసంతానముగా పలికి పాండు సంతానమును వంశమునుండి వేరుపరుచుట ద్వారా ధృతరాష్ట్రుడు ఇచ్చట తన మనస్సును విశదపరుచుచున్నాడు. సోదరుని తనయులైన పాండవుల యెడ ధృతరాష్ట్రునికి గల సంబంధమును దీని ద్వారా ఎవరైననూ అవగతము చేసికొనవచ్చును. పంటపొలము నుండి కలుపుమొక్కలు తీసివేయబడు రీతి, ధర్మపితయైన శ్రీకృష్ణభగవానుడు నిలిచియున్న ధర్మ క్షేత్రమగు కురుక్షేత్రము నుండి కలుపుమొక్కల వంటి దుర్యోధనాది ధృతరాష్ట్రుని తనయులు తీసివేయబడుదురనియు, యుధిష్ఠరుని అధ్యక్షతన గల ధర్మయుతులైన పాండవులు భగవానునిచే సుప్రతిష్ఠితులు కాగలరనియు ఆది నుండియే ఈవిధముగా ఊహింపబడినది. చారిత్రిక మరియు వైదిక ప్రాముఖ్యమే గాక “ధర్మ క్షేత్రము” మరియు “కురుక్షేత్రము” అనెడి పదములకు గల విశేషార్థమిదియే.

## 1.2

### సంజయ ఉవాచ

**దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।**
**ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥**

**<u>అనువాదము</u>**

**సంజయుడు పలికెను: ఓ రాజా! పాండుతనయులచే వ్యూహముగా ఏర్పాటు చేయబడిన సైన్యమును గాంచిన పిమ్మట దుర్యోధనుడు తన గురువు చెంతకు చేరి ఈ క్రింది విధముగా పలికెను.**

**<u>భాష్యము</u>**

ధృతరాష్ట్రుడు పుట్టుకతో అంధుడు. దురదృష్టవశాత్తు అతనికి ఆధ్యాత్మికదృష్టి సైతము లోపించెను. ధర్మ విషయమున తన పుత్రులు తనతో సమానముగా అంధులని అతడు ఎరిగియుండెను. పుట్టుకనుండియు ధర్మాత్ములైన పాండవులతో వారు ఒడంబడికకు రాలేరని అతడు నిశ్చయముగా ఎరిగియుండెను. అయినను తీర్థక్షేత్రమైన కురుక్షేత్ర ప్రభావమును గూర్చి అతడు సందేహాస్పదుడై యుండెను.

యుద్ధరంగమందలి పరిస్థితిని గూర్చి ప్రశ్నించుటలో అతని అంతరార్థమును సంజయుడు అవగతము చేసికొనగలిగెను. కనుకనే సంజయుడు ఆ నిరాశ చెందియున్న రాజును ఉత్సాహపరచనెంచి, పవిత్ర స్థలముచే ప్రభావితులై అతని పుత్రులు రాజీకి సిద్ధపడుట జరుగబోదని ఆశ్వాసము నొసగెను. పాండవ సేనాబలమును గాంచిన పిమ్మట అతని తనయుడైన దుర్యోధనుడు నిజస్థితిని ఎరుకపరుచుటకు శీఘ్రమే సైన్యాధిపతియైన ద్రోణాచార్యుని చెంతకు చేరెనని సంజయుడు ధృతరాష్ట్రునికి తెలియజేసెను. దుర్యోధనుడు రాజుగా పేర్కొనబడినను పరిస్థితి యొక్క తీవ్రత ననుసరించి స్వయముగా సైన్యాధిపతి వద్దకు వెడలవలసి వచ్చెను. కనుకనే రాజకీయవేత్త యనుటకు అతడు చక్కగా తగియున్నాడు. కాని పాండవ సేనా వ్యూహమును గాంచిన పిమ్మట అతడు పొందిన భయమును ఆ రాజనీతి నిపుణత మరుగుపరచలేక పోయెను.

## 1.3

**పశ్యైతాం పాణ్డుపుత్రాణామాచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥**

### అనువాదము

**ఓ ఆచార్యా! మీ బుద్ధి కుశలుడైన శిష్యుడగు ద్రుపదతనయునితో దక్షతగా ఏర్పాటు చేయబడిన పాండుసుతుల గొప్ప సేనను గాంచుము.**

### భాష్యము

బ్రాహ్మణుడును, గొప్ప సైన్యాధిపతియునైన ద్రోణాచార్యుని లోపములను రాజనీతి నిపుణుడైన దుర్యోధనుడు ఎత్తిచూప నెంచెను. ద్రౌపది (అర్జునుని భార్య) జనకుడైన ద్రుపదమహారాజుతో ద్రోణాచార్యుడు రాజకీయ వైరమును కలిగియుండెను. ఆ వైర కారణముగా ద్రుపదుడు ఒక గొప్ప యజ్ఞమునాచరించి ద్రోణుని సంహరింపగల పుత్రుని వరముగా పొందియుండెను. ద్రోణాచార్యుడు ఈ విషయమును సంపూర్ణముగా ఎరిగియున్నను ద్రుపదతనయుడైన ధృష్టద్యుమ్నుడు యుద్ధవిద్యను నేర్చుటకై తన చెంతకు చేరినపుడు విశాల హృదయము కలిగిన బ్రాహ్మణునిగా వర్తించి అతనికి యుద్ధ రహస్యములను తెలియజేయుటలో సంకోచమును కనబరచలేదు. ఇపుడు ధృష్టద్యుమ్నుడు కురుక్షేత్ర యుద్ధరంగమున పాండవుల పక్షము వహించెను. ద్రోణాచార్యుని నుండి నేర్చిన విద్యతో అతడే పాండవ సేనా వ్యూహమును సైతము రచించెను. ద్రోణాచార్యుడు సావధానుడై రాజీధోరణి లేని యుద్ధము చేయవలెనను ఉద్దేశ్యముతో అతని ఈ తప్పిదమును దుర్యోధనుడు ఎత్తి చూపెను. ప్రియతమ శిష్యులైన పాండవుల యెడ యుద్ధరంగమున అతడు అదేవిధముగా మృదుస్వభావముతో వర్తించరాదని తెలియజేయుటయు దుర్యోధనుని ఉద్దేశ్యమైయుండెను. ముఖ్యముగా అర్జునుడు అతనికి ప్రియతముడును మరియు తెలివిగలవాడును అయిన శిష్యుడు. యుద్ధమునందు అటువంటి కనికర భావము అపజయమునకు దారితీయుననియు దుర్యోధనుడు హెచ్చరించెను.

**1.4**

**అత్ర శూరా మహేశ్వాసా భీమార్జున సమా యుధి ।**
**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథ: ॥**

**<u>అనువాదము</u>**

**ఈ సైన్యమునందు భీమార్జునులతో సమానముగా యుద్ధము చేయగల శూరులైన ధనుర్ధరులు పెక్కురు గలరు. యుయుధానుడు, విరాటుడు, ద్రుపదుడు మొదలగువారు అటువంటి మహాయోధులు.**

**<u>భాష్యము</u>**

యుద్ధవిద్య యందు ద్రోణాచార్యుని గొప్పశక్తి దృష్ట్యా ధృష్టద్యుమ్నుడు ముఖ్యమైన అవరోధము కాకున్నను భయమునకు కారణమైనవారు పెక్కురు కలరు. విజయపథములో వారు గొప్ప అవరోధములవంటివారని దుర్యోధనుడు తెలియజేయుచున్నాడు. వారిలో ప్రతియొక్కరును భీముడు మరియు అర్జునుని వలె నిరోధింపశక్యము కానివారగుటయే అందులకు కారణము. భీమార్జునుల శక్తిని తెలిసియుండుట చేతనే ఇతరులను వారితో అతడు పోల్చిచూపెను.

**1.5**

**ధృష్ట కేతు శ్చేకితాన: కాశీరాజశ్చ వీర్యవాన్ ।**
**పురుజిత్ కున్తిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవ: ॥**

**<u>అనువాదము</u>**

**ధృష్ట కేతువు, చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తుడు, కుంతీభోజుడు, శైబ్యుడు వంటి శూరులైన మహాయోధులును అందున్నారు.**

**1.6**

**యుధామన్యుశ్చ విక్రాన్త ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।**
**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథా: ॥**

**<u>అనువాదము</u>**

**పరాక్రమవంతుడైన యుధామన్యుడు, శక్తిశాలియైన ఉత్తమౌజుడు, సుభద్రాతనయుడు, ద్రౌపదికుమారులును అందున్నారు. ఈ వీరులందరును మహారథులు.**

**1.7**

**అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥**

## అనువాదము

**కాని ఓ బ్రాహ్మణోత్తమా! నా సేనాబలమును నడుపుటకై ప్రత్యేకముగా యోగ్యులైనట్టి నాయకులను గూర్చి మీ కొరకై నేను తెలియజేసెదను.**

**1.8**

**భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయ: ।**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥**

## అనువాదము

**యుద్ధమునందు ఎల్లప్పుడును విజయమును సాధించు మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు మరియు సోమదత్తుని తనయుడైన భూరిశ్రవుడు వంటివారు మన సైన్యము నందున్నారు.**

## భాష్యము

యుద్ధరంగమున గల నిత్య జయశీలురైన ప్రముఖవీరులను దుర్యోధనుడు పేర్కొనుచున్నాడు. వికర్ణుడు దుర్యోధనుని సోదరుడు. అశ్వత్థామ ద్రోణాచార్యుని పుత్రుడు. సౌమదత్తుడు లేదా భూరిశ్రవుడు బాహ్లీకరాజు తనయుడు. పాండురాజుతో వివాహమునకు పూర్వము కుంతీదేవికి జన్మించియున్నందున కర్ణుడు అర్జునుని సోదరుడు. కృపాచార్యుని కవల సోదరి ద్రోణాచార్యుని భార్య.

**1.9**

**అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితా: ।**
**నానాశస్త్రప్రహరణా: సర్వే యుద్ధవిశారదా: ॥**

## అనువాదము

**నా కొరకు తమ జీవితములను త్యాగము చేయుటకు సిద్ధపడియున్న వీరులు ఇంకను పలువురు కలరు. వారందరును పలువిధములైన ఆయుధములను దాల్చినవారు మరియు యుద్ధనిపుణతను కలిగినవారును అయియున్నారు.**

## భాష్యము

జయద్రదుడు, కృతవర్మ, శల్యుడు వంటి ఇతర వీరులు సైతము దుర్యోధనుని కొరకు తమజీవితమును త్యాగము చేయుటకు కృతనిశ్చయులైయున్నారు. వేరుమాటలలో పాపియైన దుర్యోధనుని పక్షము వహించియున్నందున కురుక్షేత్రమునందు వారందరును మరణించి తీరుదురని ఇదివరకే నిర్ణయింపబడినది. కాని దుర్యోధనుడు మాత్రము పైన తెలుపబడిన సంఘటిత మిత్ర శక్తివలన తనకు విజయము తప్పక లభించునని ధైర్యము కలిగియుండెను.

## 1.10

**అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥**

## అనువాదము

**మన సైన్యబలము లెక్కింప వీలులేనిదిగా నున్నది మరియు మనము పితామహుడైన భీష్మునిచే సంపూర్ణముగా రక్షింపబడుచున్నాము. కాని భీమునిచే జాగరూకతతో రక్షింపబడుచున్న పాండవసైన్యము పరిమితముగా నున్నది.**

## భాష్యము

ఇచ్చట దుర్యోధనుడు ఇరు సేనాబలముల తులనాత్మక అంచనా వేయుచున్నాడు. అత్యంత అనుభవజ్ఞుడగు సేనానియైన భీష్మపితామహునిచే ప్రత్యేకముగా రక్షింపబడు తన సైన్యబలము అపరితముగా నున్నట్లు అతడు భావించెను. అదే సమయమున భీష్ముని సమ్ముఖమున తృణప్రాయము వంటి అల్ప అనుభవజ్ఞుడగు సేనానియైన భీమునిచే రక్షింపబడుచున్న పాండవ సేనాబలము పరిమితముగా నున్నట్లు అతనికి గోచరించెను. దుర్యోధనుడు సదా భీమునిపట్ల అసూయ కలిగియుండెను. తాను మరణింపవలసియే వచ్చినచో భీముని చేతనే తాను సంహరింపబడుదునని అతడు ఎరిగియుండుటయే అందులకు కారణము. కాని అదే సమయమున పరమోత్తమ సేనానియైన భీష్ముని సన్నిధిని తలచుకొని అతడు తన విజయము పట్ల విశ్వాసమును కలిగియుండెను. యుద్ధరంగమున తాను విజయము సాధించుట తథ్యమనియే అతడు తెలియపరచెను.

## 1.11

**అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితా:।**
**భీష్మమేవాభిరక్షన్తు భవన్త: సర్వ ఏవ హి॥**

### అనువాదము

**సేనావ్యూహ ద్వారమునందలి మీ ముఖ్యస్థానములలో నిలిచియుండి మీరు పితామహుడైన భీష్మదేవునకు సంపూర్ణ రక్షణమును కూర్చవలసియున్నది.**

### భాష్యము

భీష్ముని నైపుణ్యమును శ్లాఘించిన పిదప దుర్యోధనుడు ఇతరులు తాము తక్కువ ప్రాముఖ్యము కలిగినవారిగా తలతురేమోనని భావించెను. తత్కారణముగా తన సహజ రాజనీతి ధోరణిలో అతడు పై వాక్యముల ద్వారా పరిస్థితిని చక్కబరచ యత్నించెను. భీష్మదేవుడు నిస్సందేహముగా గొప్ప వీరుడే అయినను వృద్ధుడైనందున ప్రతియొక్కరు అన్నివైపుల నుండి అతని రక్షణమును గూర్చి ప్రత్యేకముగా ఆలోచించవలెనని అతడు వక్కాణించెను. అతడు యుద్ధమునందు నియుక్తుడైనపుడు ఒకే ప్రక్క అతని పూర్తి సంలగ్నతను శత్రువులు అనువుగా తీసికొనగలరు. కనుక ఇతర వీరులందరును తమ ముఖ్యస్థానములను వీడకుండుట మరియు సేనావ్యూహమును శత్రువు భేదించుటకు అవకాశ మీయకపోవుట అతి ముఖ్యమై యున్నవి. కౌరవుల విజయము భీష్ముని సన్నిధి పైననే ఆధారపడియున్నదని దుర్యోధనుడు స్పష్టముగా తలచెను. యుద్ధమందు భీష్ముడు, ద్రోణాచార్యుని సంపూర్ణ సహకారము పట్ల అతడు పూర్ణ విశ్వాసమును కలిగియుండెను. సభలో మహాసేనానాయకుల సమక్షమున నగ్నముగా నిలుపుటకు బలవంతము చేసెడి సమయమున అర్జునుని భార్యయైన ద్రౌపది నిస్సహాయస్థితిలో వారిని న్యాయముకొరకు అర్థించినపుడు వారు ఒక్క మాటైనను పలుకలేదని అతడెరుగుటయే అందులకు కారణము. ఆ ఇరువురు సేనానులు పాండవుల యెడ ఏదియో ఒక మమకారమును కలిగియున్నారని తెలిసినప్పటికిని పాచికల సమయమున గావించినట్లు వారిపుడు ఆ మమకారమును పూర్ణముగా త్యజింతురని అతడు ఆశించెను.

## 1.12

**తస్య సంజనయన్ హర్షం కురువృద్ధ: పితామహ: ।**
**సింహనాదం వినద్యోచ్చై: శంఖం దధ్మౌ ప్రతాపవాన్॥**

### అనువాదము

**అప్పుడు కురువృద్ధుడును, యోధుల పితామహుడును అగు భీష్ముడు దుర్యోధనునకు ఆనందమును గూర్చుచు సింహగర్జన వంటి ధ్వని కలుగునట్లుగా తన శంఖమును బిగ్గరగా పూరించెను.**

## భాష్యము

కురువృద్ధుడు తన మనుమడైన దుర్యోధనుని హృదయమందలి భావనను అవగతము చేసికొనగలిగెను. అంతట దుర్యోధనుని యెడ గల సహజ కరుణతో అతడు సింహముగా తన స్థితికి తగినట్లు అతిబిగ్గరగా శంఖమును పూరించి అతనిని సంతోషింపజేయ యత్నించెను. దేవదేవుడైన శ్రీకృష్ణుడు ప్రతిపక్షమున ఉన్నందున అతనికి యుద్ధమందు విజయావకాశమే లేదని శంఖము యొక్క సంకేతము ద్వారా భీష్ముడు విషణ్ణుడగు దుర్యోధనునికి (మనుమనికి) పరోక్షముగా తెలియజేసెను. అయినప్పటికిని యుద్ధమును నిర్వహించుట అతని ధర్మమైయున్నది. ఆ విషయమున ఎట్టి కష్టమునకైనను అతడు వెనుదీయరాదు.

### 1.13

**తత: శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖా: ।**

**సహసైవాభ్యహన్యన్త స శబ్దస్తుములో భవత్॥**

## అనువాదము

**అటు పిమ్మట శంఖములు, వివిధములైన వాద్యములు, భేరులు, శృంగములన్నియు ఒక్కసారిగా మ్రోగింపబడెను. ఆ సంఘటిత ధ్వని మిక్కిలి భీకరముగా నుండెను.**

### 1.14

**తత: శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ ।**

**మాధవ: పాణ్డవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతు:॥**

## అనువాదము

**ఎదుటి పక్షమున తెల్లని గుఱ్ఱములతో పూన్చబడిన మహారథమునందు స్థితులైనట్టి శ్రీకృష్ణభగవానుడు, అర్జునుడును కూడ తమ దివ్యములైన శంఖములను పూరించిరి.**

## భాష్యము

భీష్మదేవుడు పూరించిన శంఖమునకు భిన్నముగా శ్రీకృష్ణార్జునుల హస్తములందలి శంఖములు దివ్యములని వర్ణింపబడినవి. శ్రీకృష్ణుడు పాండవుల పక్షమున నిలిచియుండుటచే ప్రతిపక్షము వారికి విజయావకాశమే లేదని ఆ దివ్యశంఖముల ధ్వని సూచించినది. "జయస్తు పాణ్డుపుత్రాణాం యేషాం పక్షే జనార్ధన:" – "శ్రీకృష్ణభగవానుడు పాండవ పక్షమునందుండుటచేత ఎప్పుడును విజయము పాండుపుత్రులకే లభించును." శ్రీకృష్ణభగవానుడు ఎప్పుడు ఎక్కడ నిలిచియుండునో అక్కడ లక్ష్మీదేవి కూడా నిలిచియుండును. ఎందుకనగా, లక్ష్మీదేవి తన భర్తను వీడి ఎన్నడును ఒంటరిగా

నివసింపదు. అనగా విష్ణువు లేదా శ్రీకృష్ణ భగవానుని శంఖము నుండి ఉద్భవించిన దివ్యధ్వని సూచించినట్లుగా విజయము మరియు సంపదలును (అదృష్టము) అర్జునుని కొరకు వేచియున్నవి. అంతేకాకుండ, మిత్రులిరువరును ఆసీనులైనట్టి రథము అగ్నిదేవునిచే అర్జునునకు అందింపబడినది. దానిని ముల్లోకములలో ఎక్కడకు తీసుకెళ్ళినను అది అన్ని దిక్కులను జయించుటకు సామర్థ్యమును కలిగియున్నదను విషయమును సూచించెను.

## 1.15

**పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పాంచజన్యమనెడి తన శంఖమును పూరించెను; అర్జునుడు దేవదత్తమనెడి తన శంఖమును పూరించెను. భోజనప్రియుడును, ఘనకార్యములను చేయువాడును అయిన భీముడు పౌండ్రమను తన మహాశంఖమును పూరించెను.**

## భాష్యము

సర్వేంద్రియములకు స్వామియగుట చేత శ్రీకృష్ణభగవానుడు ఈ శ్లోకము నందు హృషీకేశుడని తెలుపబడెను. జీవులందరును అతని అంశలగుటచే ఆ జీవుల ఇంద్రియములన్నీ అతని ఇంద్రియముల అంశములే. నిరాకారవాదులు జీవుల ఇంద్రియములను గూర్చి వివరింప లేనందున వారిని ఇంద్రియ రహితులు లేదా నిరాకారులుగా వర్ణింపగోరుదురు. భగవానుడు జీవుల హృదయము నందు నెలకొని వారి ఇంద్రియములను నిర్దేశించుచుండును. శుద్ధభక్తుని విషయమున అతడు ఇంద్రియములను స్వయంగా నియంత్రించును. ఇక్కడ కురుక్షేత్ర సంగ్రామమునందు భగవానుడు అర్జునుని ఆధ్యాత్మిక ఇంద్రియములను ప్రత్యక్షముగా నియంత్రించుట చేత అతడు 'హృషీకేశుడు' అని ప్రత్యేకముగా పేర్కొనబడెను. భగవానుని వివిధ లీలల ననుసరించి ఆయనకు వివిధ నామములేర్పడుచుండును. ఉదాహరణకు మధు అను రాక్షసుని సంహరించుటచే అతనికి మధుసూదనుడనెడి నామము కలిగెను. అతడు గోవులకును మరియు ఇంద్రియములకును ఆనందము కలిగించుటచే 'గోవిందుడు' అను నామము కలిగెను. వసుదేవుని పుత్రునిగా జన్మించుట చేత 'వాసుదేవుడు' అను నామము కలిగెను. దేవకీదేవిని తల్లిగా అంగీకరించుట చేత 'దేవకీనందన' అను నామము కలిగెను. వృందావనమున యశోదమ్మకు బాల్యలీలలను దర్శించు అవకాశము కలిగించుట చేత 'యశోదనందన' అను నామము కలిగెను. మిత్రుడైన అర్జునునకు సారథిగా నుండుట చేత 'పార్థసారథి' అను నామము కలిగెను. అట్లే కురుక్షేత్ర రణరంగమున అతడు అర్జునునకు నిర్దేశము కావించుట చేత 'హృషీకేశుడు' అను నామము కలిగెను.

ధర్మరాజు చేయు వివిధ యజ్ఞముల నిర్వహణకు కావలసిన సంపదను సంపాదించుటలో అగ్రజునికి తోడ్పడుటచే అర్జునుడు ఈ శ్లోకమున ధనుంజయుడని పేర్కొనబడెను. అట్లే, భీముడు వృకోదరునిగా తెలుపబడెను. ఎందుకనగా, అతడు

విపరీతముగా తినుటయే కాకుండ దానికి తగినట్లు హిడింబాసురుని వధించుట వంటి ఘనకార్యములను చేసెను. ఈ విధముగా పాండవపక్షము నందలి శ్రీకృష్ణ భగవానుడు మొదలుకొని వివిధ మహాయోధులచే పూరింపబడిన వారి ప్రత్యేక శంఖములు యోధులకు ఉత్సాహమును కలిగించెను. ప్రతిపక్షమున అట్టి ఘనతలు గాని, దివ్యనిర్దేశకుడైన శ్రీకృష్ణభగవానుని సన్నిధి గాని, భాగ్యదేవతయైన లక్ష్మీదేవి సన్నిధి గాని లేకుండెను. కనుకనే వారు యుద్ధమున పరాజయము పొందుదురనుట ముందే నిశ్చయింపబడెను. ఆ సందేశమే శంఖధ్వనుల ద్వారా ప్రకటించబడినది.

**1.16 – 18**

**అనన్తవిజయం రాజా కున్తీపుత్రో యుధిష్ఠర:।**

**నకుల: సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ॥**

**కాశ్యశ్చ పరమేష్వాస: శిఖణ్డీ చ మహారథః।**

**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజిత: ॥**

**ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశ: పృథివీపతే।**

**సౌభద్రశ్చ మహాబాహు: శంఖాన్ దధ్ము: పృథక్ పృథక్॥**

**<u>అనువాదము</u>**

**ఓ రాజా! కుంతీపుత్రుడైన యుధిష్ఠరుడు అనంత విజయమను నామము గల తన శంఖమును పూరించగా, నకుల సహదేవులు సుఘోష, మణిపుష్పకమనెడి శంఖములను పూరించిరి. గొప్ప విలుకారుడైన కాశీరాజును, మహాయోధుడైన శిఖండియు, ధృష్టద్యుమ్నుడును, విరాటుడును, అజేయుడైన సాత్యకియు, ద్రుపదుడును, ద్రౌపది పుత్రులును, గొప్ప భుజపరాక్రమము గల సుభద్రాపుత్రుడు మొదలైన వీరులందరును తమ తమ శంఖములను పూరించిరి.**

**<u>భాష్యము</u>**

అన్యాయముగా పాండుపుత్రులను మోసగించి తన పుత్రులకు రాజసింహాసనమును కట్టబెట్టుటకు యత్నించటమనెడి అధర్మ యోచన ఏమాత్రము ప్రశంసనీయము కాదని ధృతరాష్ట్రునకు సంజయుడు మిక్కిలి నేర్పుతో తెలియజేసెను. కురువంశమంతయు ఆ మహాసంగ్రామమున సంహరింప బడుననెడి సూచనలు అప్పటికే స్పష్టముగా కనిపించెను. పితామహుడైన భీష్ముడు మొదలుకొని మనుమలైన అభిమన్యుడు వంటివారు మరియు ఇతర అనేక ప్రపంచ దేశములనుండి విచ్చేసిన రాజులును యుద్ధరంగమున నిలిచియుండిరి. వారికందరికిని మృత్యువు తప్పదు. ఈ విపత్తుల కన్నింటికిని ధృతరాష్ట్రుడు తన పుత్రుల ఆలోచన ధోరణిని ప్రోత్సహించుటయే కారణము.

**1.19**

**స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।**
**నభశ్చ పృథివీం చైవ తుములోభ్యనునాదయన్॥**

**అనువాదము**

**వివిధములైన ఆ శంఖములు ధ్వని మిక్కిలి భీకరమయ్యెను. అది భూమ్యాకాశములను రెండింటిని ప్రతిధ్వనింపజేయుచు ధృతరాష్ట్ర పుత్రుల హృదయములను ఛేదించెను.**

**భాష్యము**

దుర్యోధనుని పక్షమునందున్న భీష్మాదులు వివిధ శంఖధ్వనులు చేసినప్పుడు పాండవ పక్షమువారి హృదయములు ఛేదించబడలేదు. అట్టి సన్నివేశములేవియును పేర్కొనబడలేదు. కాని పాండవపక్షపువారు కావించిన ధ్వనుల ప్రతిధ్వనులచే ధృతరాష్ట్రుని పుత్రుల హృదయములు ఛేదించబడినవని (బ్రద్దలయ్యెనని) ఈ శ్లోకమున ప్రత్యేకముగా తెలుపబడినది. పాండవులకు శ్రీకృష్ణభగవానునియందు గల విశ్వాసమే అందుకు కారణము. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని శరణుపొందిన వారికి ఎట్టి ఘోరవిపత్తునందైనను భయము నొందనవసరము లేదు.

**1.20**

**అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజ: ।**
**ప్రవృత్తే శస్త్రసమ్పాతే ధనురుద్యమ్య పాణ్డవ: ।**
**హృషీకేశం తదా వాక్యమిదమాహ మహీపతే ॥**

**అనువాదము**

**ఆ సమయమున పాండుసుతుడైన అర్జునుడు కపిధ్వజము కూర్చబడిన రథము నందు స్థితుడై, తన ధనుస్సును చేపట్టి బాణములను విసురుటకు సంసిద్ధుడయ్యెను. ఓ రాజా! వ్యూహములుగా ఏర్పడియున్న ధృతరాష్ట్ర పుత్రులను గాంచి అర్జునుడు శ్రీకృష్ణభగవానునితో ఈ వాక్యములను పలికెను.**

**భాష్యము**

యుద్ధము కొద్ది సమయములో ఆరంభము కానుండెను. యుద్ధరంగమున శ్రీకృష్ణభగవానుని ప్రత్యక్ష ఆదేశములననుసరించి పాండవులచే ఏర్పాటు చేయబడిన అనూహ్యమైన సేనావ్యూహ రచనను చూచి ధృతరాష్ట్ర పుత్రులు పూర్తిగా నిరుత్సాహపడినట్లు పై వాక్యముల ద్వారా తెలియుచున్నది. అర్జునుని ధ్వజముపై హనుమంతుని చిహ్నము కూడ పాండవుల విజయమునకు మరియొక సూచన. ఎందుకనగా, రామరావణుల మధ్యజరిగిన యుద్ధమున హనుమంతుడు శ్రీరామునికి తోడ్పడగా శ్రీరాముడు విజయమునొందుట సంభవించెను. ఇప్పుడు శ్రీరాముడు మరియు

హనుమంతులు ఇరువరును కూడ అర్జునునికి తోడ్పడుటకై అతని రథము నందుండిరి. శ్రీకృష్ణభగవానుడు స్వయముగా శ్రీరామచంద్రుడే! అంతేకాకుండ, శ్రీరామచంద్రుడు ఎక్కడుండునో అక్కడనే అతని నిత్యదాసుడైన హనుమంతుడును, మరియు అతని నిత్యసహచరణియైన సీతాదేవి (లక్ష్మీదేవి) కూడ అక్కడుండును. కనుక, వాస్తవమునకు అర్జునుడు ఏ కారణము చేతను శత్రువులను గూర్చి భయము నొందనవసరము లేదు. అంతేకాకుండ, హృషీకేశుడైన శ్రీకృష్ణభగవానుడు అతనికి మార్గదర్శనము చేయుటకై స్వయముగా ప్రత్యక్షమైయుండెను. ఇట్లు యుద్ధము చేయుటకు కావలసిన సదుపాయమంతయు అర్జునునకు సమకూడియుండెను. తన నిత్యసహచర భక్తుడైన అర్జునుని కొరకు భగవానునిచే సమకూర్చబడిన అట్టి శుభకరమైన పరిస్థితులన్నియు విజయము తథ్యమని సూచించుచున్నవి.

## 1.21 – 22

**అర్జున ఉవాచ**

**సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేచ్యుత ।**

**యావదేతాన్నిరీక్షేహం యోద్ధుకామానవస్థితాన్ ॥**

**కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్ రణసముద్యమే ॥**

### అనువాదము

**అర్జునుడిట్లు పలికెను: ఓ అచ్యుతా! దయచేసి నా రథమును రెండు సేనల నడుమ నిలుపుము. తద్ద్వారా యుద్ధము చేయగోరి ఇచ్చట ఉపస్థితులైనవారిని మరియు ఈ మహాసంగ్రామమున నేను ఎవరితో యుద్ధము చేయవలసి యున్నదో వారిని గాంచగలుగుదును.**

### భాష్యము

శ్రీకృష్ణభగవానుడు దేవాదిదేవుడైనను తన నిర్హేతుక కృపతో తన మిత్రుని సేవయందు నెలకొనెను. తన భక్తుల యెడ ప్రేమను చూపుటయందు ఆతడెన్నడును విఫలుడు కాడు. కనుకనే అతడు ఇక్కడ 'అచ్యుతుడు'గా సంబోధింపబడెను. రథసారథిగా అర్జునుని ఆజ్ఞలను పాటింపవలెను. ఆవిధముగా వర్తించుటకు భగవానుడు సంకోచింపనందున అతడు అచ్యుతుడని సంబోధింపబడెను. అతడు తన భక్తుని కొరకై రథసారథి స్థానమును గ్రహించినను ఆతని దివ్యస్థితికి ఎన్నడును భంగము వాటిల్లదు. అన్ని పరిస్థితులయందును అతడు దేవాదిదేవుడే మరియు ఇంద్రియాధిపతియైన హృషీకేశుడే. భగవానుడు మరియు ఆతని సేవకుల నడుమ గల సంబంధము దివ్యమైనది మరియు మధురమైనది. సేవకుడు భగవానునికి సేవ చేయుటకొరకై సర్వదా సంసిద్ధుడైయుండును. అట్లే, భగవానుడు కూడ తన భక్తునికి సేవచేయు అవకాశము కొరకై ఎల్లప్పుడు ఎదురు చూచుచుండును. తాను ఆజ్ఞాపించువాడుగా నుండుట కంటెను తన శుద్ధభక్తుడు తనను ఆజ్ఞాపించ గలుగునట్టి ఉత్తమ స్థితి యందుండినచో భగవానుడు మిక్కిలి సంతోషించును. వాస్తవమునకు, అతడు ప్రభువైనందున ప్రతియొక్కరు అతని ఆజ్ఞలకు లోబడియేయుందురు. ఎవ్వరును అతనిని ఆజ్ఞాపించగల ఉన్నత స్థితియందుండరు. కాని, అన్ని పరిస్థితుల యందును తాను

అచ్యుతుడైన ప్రభువేనైనను శుద్ధభక్తుడు తనను ఆజ్ఞాపించుచున్నాడని ఎరిగినప్పుడు దేవాదిదేవుడు దివ్యానందము ననుభవించును.

భగవానుని శుద్ధభక్తుడైన అర్జునుడు తన దాయాదులతోను మరియు సోదరులతోను యుద్ధము చేయగోరలేదు. కాని ఏ విధమైన శాంతిరాయభారముకు అంగీకరింపని దుర్యోధనుని మొండిపట్టుదల చేతనే అతడు బలవంతముగా యుద్ధరంగమునకు రావలసి వచ్చెను. కనుకనే యుద్ధరంగము నందు నాయకత్వము వహించు ప్రముఖ వ్యక్తులెవరో తెలుసుకొనుటకై అతడు కుతూహల పడుచుండెను. యుద్ధరంగమున శాంతియత్నములు చేయుటయను ప్రశ్నే ఉదయింపకున్నను వారిని మరొకసారి అతడు తిరిగి చూడదలచెను. అంతేకాకుండ, అవాంఛనీయమైన యుద్ధమును చేయుటకు వారెంతగా మ్రొగ్గుచూపుతుండిరో కూడ అతడు చూడదలచెను.

## 1.23

**యోత్స్యమానానవేక్షేహం య ఏతేత్ర సమాగతా: ।**
**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవ: ॥**

### అనువాదము

**దుర్బుద్ధిగల ధృతరాష్ట్ర పుత్రునికి ప్రియమును గూర్చ కోరికతో యుద్ధము చేయుటకై విచ్చేసిన వారిని నేను చూచెదను.**

### భాష్యము

దుర్యోధనుడు తన తండ్రియైన ధృతరాష్ట్రుని సహాయమున దుష్ట ప్రణాళికల ద్వారా పాండవుల రాజ్యమును అపహరింప దలచెననుట సర్వ విదితమే. కనుక దుర్యోధనుని పక్షమున చేరిన వ్యక్తులందరును ఆ విధమైన మనో:ప్రవృత్తి లక్షణములను పోలినవారే అయియుండవలెను. యుద్ధమును ఆరంభించుటకు పూర్వము వారెవరో ఎరుగుటకై అర్జునుడు యుద్ధరంగమున వారిని చూడదలచెను. అంతేకాని వారితో శాంతిమంతనములు జరిపెడి ఉద్దేశము అతనికి ఏమాత్రము లేదు. శ్రీకృష్ణుడు తన చెంత నుండుటచే తనకు తప్పక విజయము సిద్ధించునని సంపూర్ణ విశ్వాసమును కలిగియున్నప్పటికిని తానెదురించవలసి యున్నవారి శక్తి ఎట్టిదో అంచనా వేయుటకు అర్జునుడు వారిని తిరిగి చూడగోరెననుట కూడ యథార్థ విషయము.

## 1.24

**సంజయ ఉవాచ**

**ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।**

**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥**

### అనువాదము

**సంజయుడు పలికెను: ఓ భరతవంశీయుడా! అర్జునునిచే ఆవిధముగా సంబోధింప బడినవాడై శ్రీకృష్ణభగవానుడు ఉత్తమమైన రథమును ఇరుపక్షములకు చెందిన సేనల నడుమ నిలిపెను.**

### భాష్యము

ఈ శ్లోకమునందు అర్జునుడు 'గుడాకేశుడు'గా పేర్కొనబడెను. 'గుడాకా' అనగా నిద్ర. నిద్రను జయించినవాడు 'గుడాకేశుడు'. నిద్రయనగా అజ్ఞానమను అర్థము కూడ కలదు. కనుక అర్జునుడు శ్రీకృష్ణభగవానునితో తనకు గల మైత్రిచే నిద్ర మరియు అజ్ఞానము రెండింటిని జయింపగలిగెను. శ్రీకుష్ణుని శుద్ధ భక్తుడగుటచే అతడు శ్రీకృష్ణుని క్షణమైనను విస్మరింపకుండెను. అదియే భక్తుని స్వభావము. నిద్రయందైనను లేదా మెలుకువ యందైనను భక్తుడెన్నడును శ్రీకృష్ణుని నామ, రూప, గుణ, లీలలను స్మరింపకుండ ఉండజాలడు. ఈవిధముగా కృష్ణభక్తుడు నిరంతరము శ్రీకృష్ణుణ్తే స్మరిస్తూ నిద్ర మరియు అజ్ఞానములనెడి రెండింటిని సులభముగా జయింపగలుగును. ఇదియే 'కృష్ణచైతన్యము' లేదా 'సమాధి'యని పిలువబడుచున్నది. సర్వ జీవుల ఇంద్రియములను, మనస్సులను నియంత్రించునట్టి 'హృషీకేశు'డగుటచే శ్రీకృష్ణభగవానుడు రెండు సేనల నడుమ రథము నిలుపుమనుటలో ఉద్దేశమును గ్రహింపగలిగెను. కనుకనే అతడు అట్లు చేసి ఈ క్రింది విధముగా పలికెను.

## 1.25

**భీష్మద్రోణప్రముఖత: సర్వేషాం చ మహీక్షితామ్ ।**

**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥**

### అనువాదము

**భీష్ముడు, ద్రోణుడు మరియు ఇతర భూపాలకుల సమక్షమున భగవానుడిట్లు పలికెను : "ఓ పార్థా! ఇచ్చట సమావేశమై యున్నటువంటి కురువంశీయులందరినీ గాంచుము"**

### భాష్యము

సర్వ జీవులయందు నెలకొని యున్నట్టి పరమాత్మగా శ్రీకృష్ణభగవానుడు అర్జునుని మనస్సులోని ఆలోచనలను గ్రహింపగలిగెను. ఈ సందర్భమున ఉపయోగింపబడిన 'హృషీకేశ' అను శబ్ద ప్రయోగము భగవానుడు సర్వమును ఎరుగునని

సూచిస్తున్నది. అట్లే, అర్జునుని విషయమున 'పార్థ' లేక కుంతీపుత్రుడు లేదా పృథా అను పదము కూడా సార్థకమై యున్నది. అర్జునునికి మిత్రుడగుటచే శ్రీకృష్ణుడు తన తండ్రియైన వసుదేవునికి సోదరియైన పృథకు పుత్రుడైనందున తాను అతనికి సారథియగుటకు అంగీకరించితినని అర్జునునకు చెప్పదలచెను. "కురువంశీయులందరిని గాంచుము" అని అర్జునునకు చెప్పుటలో శ్రీకృష్ణుని ఉద్దేశ్యమేమిటి? అర్జునుడు అక్కడే యుద్ధము నిలిపివేయవలెనని కోరియుండెనా? తన మేనత్త పుత్రుడైన అర్జునుడు అట్లు చేయునని శ్రీకృష్ణుడెన్నడును భావించి యుండలేదు. స్నేహపూరితమైన హాస్యధోరణిలో శ్రీకృష్ణభగవానుడు అర్జునుని మనోభావము ఇట్లు ప్రకటించి యుండెను.

### 1.26

**తత్రాపశ్యత్ స్థితాన్ పార్థ: పితౄనథ పితామహాన్ ।**

**ఆచార్యాన్మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ।**

**శ్వశురాన్ సుహృదశ్చైవ సేనాయోరుభయోరపి ॥**

**<u>అనువాదము</u>**

**ఇరుపక్షపు సేనల నడుమ నిలిచిన అర్జునుడు అచ్చట తండ్రులను, తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, మనుమలను, మిత్రులను, మామలను, హితులను గాంచెను.**

**<u>భాష్యము</u>**

యుద్ధరంగము నందు అర్జునుడు వివిధ రకములైన బంధువులను చూచెను. అతడు తన తండ్రికి సమకాలికులైన భూరిశ్రవుని వంటివారిని, భీష్ముడు మరియు సోమదత్తులవంటి తాతలను, ద్రోణాచార్య, కృపాచార్యులవంటి గురువులను, శల్యుడు, శకుని వంటి మేనమామలను, దుర్యోధనుని వంటి సోదరులను, లక్ష్మణుని వంటి పుత్రులను, అశ్వత్థామ వంటి మిత్రులను, కృతవర్మ వంటి శ్రేయోభిలాషులను అతడు చూచెను. అంతేకాకుండ, అతడు పలువురు మిత్రులతో కూడిన సేనలను కూడ చూడగలిగెను.

**1.27**

**తాన్ సమీక్ష్య స కౌన్తేయ: సర్వాన్ బన్ధూనవస్థితాన్ ।**
**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ॥**

## అనువాదము

**నానావిధ బంధువులను, మిత్రులను గాంచినంతట కుంతీపుత్రుడైన అర్జునుడు దయార్ద్ర హృదయుడై ఇట్లు పలికెను.**

**1.28**

**అర్జున ఉవాచ**

**దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ।**
**సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ॥**

## అనువాదము

**అర్జునుడు పలికెను: ప్రియమైన ఓ కృష్ణా! యుద్ధోత్సాహముతో నా యెదుట నిలిచియున్న మిత్రులను, బంధువులను గాంచి నా శరీరావయవములు కంపించుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది.**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుని పట్ల నిష్కపటమైన భక్తిగల ఏ వ్యక్తియందైనను సత్పురుషులందు లేదా దేవతల యందు కనిపించు సమస్త సద్గుణములు కనిపించును. అభక్తుడైనవాడు విద్యాసంస్కృతుల ద్వారా ఎంతటి లౌకిక యోగ్యతలను సాధించినప్పటికిని వారిలో దేవతా గుణములు లోపించి యుండును. కనుక తమలోతాము పోరాడుటకు నిశ్చయించుకొనిన దాయాదులను, మిత్రులను, బంధువులను చూచినంతటనే అర్జునుడు వారిపట్ల దయార్ద్ర హృదయుడయ్యెను. తన పక్షము నందున్నట్టి సైనికులకు సంబంధించినంత వరకు అతడు వారిపట్ల ఆరంభము నుండి సానుభూతిని కలిగియుండెను. అంతేకాకుండ, శత్రుపక్షములోని సైనికుల పట్ల కూడ వారి నిశ్చయమైన మరణమును వీక్షించుచు జాలి పొందెను. అతడట్లు ఆలోచించుచుండగా అతని శరీరావయవములు కంపించ నారంభించెను. నోరు ఎండిపోయెను. వారి యుద్ధోత్సాహమును చూచి అతడు పూర్తిగా ఆశ్చర్యమునకు గురయ్యెను. దాదాపు తన రక్తసంబంధీకులైన బంధువుల సమూహమంతయూ అతనితో యుద్ధము చేయుటకు వచ్చియుండెను. దయార్ద్ర హృదయుడైన అర్జునునికి ఈ విషయము కలత కలిగించెను. ఇక్కడ పేర్కొనబడక పోయినను అతని శరీరావయవములు కంపించుట, నోరెండిపోవుటయే కాకుండ అతడు జాలిచే రోధించు చుండెననియు కూడ ఎవ్వరైనను సులభముగ ఊహింపగలరు. అర్జునుని యందలి ఇట్టి లక్షణములకు అతని కోమల హృదయమే కారణము కాని బలహీనత కాదు, అట్టి కోమల హృదయము శుద్ధభక్తుని

ప్రధాన లక్షణము. కనుకనే శ్రీమద్భాగవతము నందు ఈ విధముగా చెప్పబడినది (5.18.12):

యస్యాస్తి భక్తిర్భగవత్యకించనా సర్వైర్గుణైస్తత్ర సమాసతే సురా:

హరావభక్తస్య కుతో మహద్గుణా: మనోరథేనాసతి ధావతో బహి:

"దేవాదిదేవుని యందు అచంచలమైన భక్తిగలవాడు దేవతల సద్గుణములను కలిగియుండును. అట్లుకాక భగవానుని పట్ల భక్తిలేనివాడు అల్పములైనట్టి లౌకిక గుణములను మాత్రమే కలిగియుండును. ఇందుకు అతడు మానసిక స్థితినందు వర్తించుచు స్పష్టముగ కనవచ్చు భౌతికశక్తిచే ఆకర్షింపబడుటయే కారణము."

## 1.29

**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ।**

**గాణ్డీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ॥**

### అనువాదము

**నా దేహమంతయూ కంపించుచున్నది. నాకు రోమాంచమగుచున్నది. గాండీవ ధనుస్సు నాచేతి నుండి జారిపోవుచున్నది, నా చర్మము మండిపోవుచున్నది.**

### భాష్యము

దేహకంపనములు రెండు విధములు. అట్లే రోమాంచితమగుట కూడా రెండు విధములు. అధికమైన ఆధ్యాత్మిక పారవశ్యము కలిగినప్పుడు గాని, భౌతిక పరిస్థితియందు తీవ్రమైన భయము కలిగినప్పుడు గాని అట్టి స్థితి సంభవించును. ఆధ్యాత్మికానుభూతి యందు భయమనునది ఉండదు. ఈ సందర్భమున అర్జునుని శరీరమునందు గోచరించు లక్షణములకు ప్రాణనష్టం జరుగుచున్నదను భౌతిక భయమే కారణము. అతని ఇతర లక్షణముల ననుసరించి కూడ ఈ విషయము వ్యక్తమగుచున్నది. సుప్రసిద్ధమైన గాండీవ ధనుస్సు చేతినుండి జారిపోవుచుండుట చేత అతడు మిక్కిలి అసహనమునకు గురయ్యెను. తనలోని హృదయము రగులుచుండుట చేత బయట చర్మము కూడ మండిపోవుచున్నట్లుగా అతనికి అనుభూతి కలుగుచుండెను. వీటన్నింటికిని దేహాత్మబుద్ధియే కారణము.

### 1.30

**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మన: ।**
**నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ॥**

**అనువాదము**

**కేశి యను రాక్షసుని సంహరించిన ఓ కృష్ణా! నేను ఇప్పుడు ఏ మాత్రము నిలబడలేక పోవుచున్నాను. నన్ను నేను మరచిపోవుచున్నాను. నా మనస్సు చలించుచున్నది. కేవలము విపరీతములనే నేను గాంచుచున్నాను.**

**భాష్యము**

అసహనము వలన అర్జునుడు యుద్ధరంగమున నిలబడలేకపోవుచుండెను. అంతేకాకుండ ఈ మనోదుర్బలతచే అతడు తననుతానే విస్మరించుచుండెను. భౌతిక విషయముల పట్ల అధికాసక్తి మానవుని అట్టి భ్రాంతిపూరితమైన జీవనస్థితియందుంచును. "భయం ద్వితీయాభినివేశత: స్యాత్" (భాగ.11.2.37) అనగా భౌతిక బంధపరిస్థితుల చేత అధికముగా ప్రభావితులైన వారి యందు అట్టి భయము మరియు మానసిక అస్థిరత కలుగుచుండును. అర్జునుడు యుద్ధరంగమున బాధాకరములైన విపరీత పరిస్థితులనే దర్శింపసాగెను. శత్రువులపై విజయము సాధించినను అతడు ఆనందము అనుభవింపజాలడు. ఇక్కడ "**నిమిత్తాని విపరీతాని**" అను పదములు ప్రాధాన్యతను కలిగియున్నవి. మానవుడు తన తలంపులలో నిరాశయే గోచరించినప్పుడు, "నేనిక్కడ ఎందుకున్నాను?" అని తలచును. సాధారణముగా ప్రతియొక్కరు తన యందు తన హితము నందు ఆసక్తిని కలిగియుండును. పరమాత్మ యందు ఎవ్వరును ఆసక్తిని కలిగియుండరు. ఇక్కడ శ్రీకృష్ణుని సంకల్పముచే అర్జునుడు తన నిజస్వార్థగతి విషయమున అజ్ఞానమును ప్రదర్శించుచున్నాడు. ప్రతియొక్కరి స్వార్థగతి విష్ణువు లేదా శ్రీకృష్ణునియందే గలదు. బద్ధజీవుడు ఈ విషయమును విస్మరించుట చేతనే భౌతికక్లేశముల ననుభవించును. యుద్ధ రంగము నందు లభించెడి విజయము తనకు దుఃఖ కారణమే కాగలదని అర్జునుడు భావించెను.

### 1.31

**న చ శ్రేయో నుపశ్యామి హత్వా స్వజనమాహవే ।**
**న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ॥**

**అనువాదము**

**ప్రియమైన ఓ కృష్ణా! ఈ యుద్ధమునందు నా స్వజనమును చంపుట ద్వారా ఏ విధముగా శ్రేయస్సు కలుగగలదో నేను గాంచలేకున్నాను. తదనంతర విషయమును గాని, రాజ్యమును గాని, సుఖమును గాని నేను వాంఛింపలేకున్నాను.**

## భాష్యము

తన నిజ స్వార్థగతి విష్ణువు లేదా శ్రీకృష్ణునియందే కలదని తెలియక బద్ధజీవులు దేహసంబంధములందే సుఖము కలదని భావించుచు, వాటిచే ఆకర్షింపబడుదురు. జీవితముకు సంబంధించిన అట్టి అంధ విశ్వాశముతో వారు భౌతిక సుఖములకు హేతువులైన వాటిని కూడా విస్మరించుదురు. ఇక్కడ అర్జునుడు క్షత్రియ ధర్మములను కూడ విస్మరించినట్లుగా కనిపించును. శ్రీకృష్ణుని ప్రత్యక్ష ఆదేశములచే యుద్ధరంగమున మరణించు క్షత్రియుడు మరియు పూర్తిగా ఆధ్యాత్మికానుభూతి కొరకే అంకితమైన సన్యాసి అను ఇరువరును శక్తివంతము మరియు తేజోవంతమైన సూర్యమండలమున ప్రవేశించుటకు యోగ్యులు కాగలరని తెలుపబడినది. బంధువుల విషయమును ప్రక్కకు పెట్టినను, తన శత్రువులను సైతము వధించుటను అర్జునుడు వాంఛించుట లేదు. బంధువులను చంపుటచే జీవితమున తనకు ఎట్టి సుఖము లభింపదని అతడు భావించుచున్నాడు. కనుకనే ఆకలి లేనివాడు వండుటకు ఇష్టపడనట్లుగా అతడు యుద్ధము చేయుటకు అంగీకరింప లేకున్నాడు. ఇప్పుడు అతడు నిరాశతో అడవికి వెళ్ళి ఏకాంత జీవితమును గడప నిశ్చయించుకొనెను. కాని క్షత్రియులు ఇతర వృత్తులను చేపట్టకూడదు. కనుక జీవనోపాధికై క్షత్రియునిగా అతనికి రాజ్యము కావలసియున్నది. కాని ప్రస్తుతము అర్జునునకు రాజ్యము లేదు. బంధువులతోను, సోదరులతోను తనకు ఇష్టములేకున్నను యుద్ధము చేసి పితృదత్తమైన రాజ్యమును తిరిగి సంపాదించుటయే అర్జునునకు గల ఏకైక అవకాశమై యున్నది. కాని అట్లు చేయుటను అతడు వాంఛించుట లేదు. కనుక అడవికేగి నిరాశతో కూడిన ఏకాంత జీవితమును గడుపుటయే తనకు తగినదని అతడు భావించెను.

### 1.32 - 35

**కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగైర్జీవితేన వా ।**
**యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగా: సుఖాని చ ॥**
**త ఇమే వస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ ।**
**ఆచార్యా: పితర: పుత్రాస్తథైవ చ పితామహా: ॥**
**మాతులా: శ్వశురా: పౌత్రా: శ్యాలా: సంబంధినస్తథా ।**
**ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతో పి మధుసూదన ॥**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతో: కిం ను మహీకృతే ।**
**నిహత్య ధార్తరాష్ట్రాన్న: కా ప్రీతి: స్యాజ్జనార్ధన ॥**

## అనువాదము

**ఓ గోవిందా! మేమెవరి కొరకు రాజ్యమును, సుఖమును, చివరకు జీవనమును కూడ కోరుచున్నామో వారందరును ఈ యుద్ధరంగమున సన్నద్ధులై నిలిచియుండగా ఆ రాజ్యాదుల వలన మాకేమి ప్రయోజనము? ఓ మధుసూదనా! గురువులు, తండ్రులు, పుత్రులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరుదులు ఇంకను ఇతర బంధువులందరును తమ ప్రాణములను మరియు**

**సంపదలను విడుచుటకు సంసిద్ధులై నా యెదుట నిలబడియుండగా, వారు నన్ను చంపగోరినను, నేనెందులకు వారిని చంపగోరవలెను? ఓ జనార్ధనా! కేవలము ఈ భూలోక రాజ్యమటుంచి ముల్లోక రాజ్యాధిపత్యమునకైనను నేను వారితో యుద్ధము చేయుటకు సిద్ధముగా లేను. ధృతరాష్ట్రుని పుత్రులను చంపుటవలన మేమెట్టి ఆనందమును పొందగలము?**

## భాష్యము

శ్రీకృష్ణుడు గోవులకు మరియు ఇంద్రియములకు ఆనందమును చేకూర్చువాడగుటచే అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని ఇక్కడ 'గోవింద' అని సంబోధించెను. ఈ ప్రత్యేక పదప్రయోగము ద్వారా అర్జునుడు ఏది తన ఇంద్రియములను తృప్తిపరచగలదో శ్రీకృష్ణుడు ఎరుగవలెనని సూచించుచున్నాడు. కాని గోవిందుడు మన ఇంద్రియములను తృప్తి పరుచుట కొరకై నిర్దేశింపబడలేదు. కాని మనము గోవిందుని ఇంద్రియములను తృప్తి పరుచుటకు యత్నించినచో అప్రయత్నముగనే మన ఇంద్రియములు కూడా తృప్తినొందగలవు. ప్రపంచమునందు ప్రతి మానవుడు భౌతికముగ తన ఇంద్రియములను సంతృప్తి పరుచుకొనవలెనని, అట్టి తృప్తిని భగవానుడు సమకూర్చవలెననియు వాంఛించును. కాని భగవానుడు జీవుల అర్హతల ననుసరించియే వారికి ఇంద్రియ తృప్తిని కలుగజేయును. అంతేకాని, భగవానుడు కోరినదానినంతటిని ప్రసాదింపడు. కాని ఏ మానవుడైనను అట్లుకాకుండ భిన్నమార్గమును చేపట్టినపుడు అనగా తన ఇంద్రియ తృప్తిని కోరకుండ గోవిందుని ఇంద్రియములను సంతృప్తి పరచ యత్నించినప్పుడు, గోవిందుని కృపచే జీవుల సమస్త కోరికలు తృప్తినొందును. అర్జునునకు తన జాతి మరియు కుటుంబ సభ్యులయెడ గల దృఢమైన ప్రేమకు వారిపై అతనికి గల సహజ కరుణయే కొంతవరకు కారణమని ఇక్కడ చూపబడినది. కనుకనే అతడు యుద్ధము చేయుటకు సంసిద్ధుడుగ లేడు. సాధారణముగా, ప్రతియొక్కరు తమ వైభవములను బంధుమిత్రుల ఎదుట ప్రదర్శింప గోరుదురు. తన బంధుమిత్రులందరును యుద్ధరంగమున చంపబడినచో విజయానంతరము తన సంపదలను వారితో కలిసి పంచుకొనుటకు అవకాశము లభింపదని అర్జునుడు భయపడుచున్నాడు. భౌతికజీవితము నందలి భావములు ఈ విధముగనే పరిగణింప బడుచుండును. కాని ఆధ్యాత్మిక జీవితము దీనికి పూర్తిగా భిన్నమైనది. భక్తుడు ఎల్లప్పుడు భగవానుని కోరికలను సంతృప్తి పరచదలచును. కనుక భక్తుడు భగవానుడు అనుమతిస్తే భగవత్సేవ కొరకు అన్నిరకాల సంపదలను గ్రహింపవచ్చును. భగవానుడు అనుమతించనిచో ఆ భక్తుడు చిల్లిగవ్వైనను గ్రహింపరాదు. అర్జునుడు తన బంధువులను చంపగోరలేదు. వారిని చంపవలసియే వచ్చినచో శ్రీకృష్ణుడే స్వయముగా వారిని సంహరింపవలెనని అతడు వాంఛించెను. ఈ సందర్భమున యుద్ధరంగమునకు రాకముందే శ్రీకృష్ణుడు వారినందరినీ చంపియుండెననియు మరియు తాను శ్రీకృష్ణునికి సాధనము (పనిముట్టు) మాత్రమే కావలసి యున్నదని అర్జునుడు ఎరుగలేకున్నాడు. ఈ సత్యము రాబోవు అధ్యాయములందు వివరింపబడును. భగవానుని సహజ భక్తుడైన అర్జునుడు దుష్టులైన తన దాయాదులు మరియు సోదరుల పట్ల ప్రతీకారము చేయగోరలేదు. కాని భగవానుడు వారందరు చంపబడవలెనని సంకల్పించెను. భగవద్భక్తు డెన్నడును దుష్టుని పట్ల ప్రతీకారము చేయగోరడు. కాని భక్తుల యెడ దుష్టులు చేయు దోషములను భగవానుడు ఏమాత్రము సహింపడు. భగవానుడు తన విషయమున ఎవరినైనను క్షమింపవచ్చునేమో గాని, తన భక్తులకు హాని చేసిన వారినెవ్వరిని క్షమింపడు. కనుకనే

అర్జునుడు దుష్టులను క్షమింపగోరినను భగవానుడు సంహరింప వలెననియే నిశ్చయించెను.

## 1.36

**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయిన: ।**
**తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ సబాన్ధవాన్ ।**
**స్వజనం హి కథం హత్వా సుఖిన: శ్యామ మాధవ ॥**

### అనువాదము

**ఇట్టి దుర్మార్గులను చంపినచో మాకు పాపమే సంక్రమించును. అందుచే ధృతరాష్ట్రుని పుత్రులను, మా మిత్రులను సంహరించుట మాకు ఉచితము కాదు. లక్ష్మీపతివైన ఓ శ్రీకృష్ణా! స్వజనమును చంపుటవలన మాకు కలుగు లాభమేమి? ఆ కార్యముచే మేమెట్లు సుఖము పొందగలము?**

### భాష్యము

వేదనిర్దేశముల ననుసరించి : 1. విషము పెట్టువాడు, 2. గృహమునకు నిప్పు పెట్టువాడు, 3. మారణాయుధాలతో దాడి చేయువాడు, 4. సంపదను కొల్లగొట్టువాడు, 5. ఇతరుల భూమిని ఆక్రమించెడివాడు, 6. ఇతరుల భార్యను చేపట్టెడివాడు అను ఆరురకముల దుర్మార్గులు కలరు. అట్టి దుర్మార్గులను అట్టి దుర్మార్గులను వెంటనే సంహరింపవలెను. వారిని సంహరించుటచేత ఎట్టి పాపము కలుగదు. అట్టి దుర్మార్గుల వధ సామాన్య మానవులకైనను సముచితమే. కాని కాని అర్జునుడు సామాన్య మానవుడు కాడు. సాధుస్వభావము కలిగియున్నందున వారిపట్ల అతడు సాధుస్వభావము ప్రదర్శింపదలచెను. కాని ఈ రకమైన సాధువర్తనము క్షత్రియునకు ఉచితము కాదు. రాజ్యమును పాలించు బాధ్యతాయుతుడైన రాజు సాధుస్వభావమును కలిగియుండవలెనే కాని పిరికివాడై యుండకూడదు. ఉదాహరణకు శ్రీరామచంద్రుడు సాధుస్వభావమును కలిగియుండెను. కనుకనే ప్రజలు కనుకనే ప్రజలు నేటికినీ రామరాజ్యమునందు నివసింపవలెనని ఆరాటపడుతుంటారు. శ్రీరాముడు ఎన్నడును పిరికితనము పిరికితనము ప్రదర్శించి యుండలేదు. సీతాదేవిని అపహరించి రావణుడు శ్రీరాముని పట్ల దుర్మార్గముగా ప్రవర్తించెను. కాని శ్రీరాముడు ప్రపంచ చరిత్రలోనే చరిత్రలోనే సాటిలేని విధముగా అతనికి గుణపాఠము నేర్పెను. కాని అర్జునుని విషయమున దుర్మార్గముగా దుర్మార్గముగా దుర్మార్గముగా ప్రవర్తించిన వారు అతని తాత, గురువు, మిత్రులు, బంధువులు, పుత్రులు, మనుమలు మున్నగు ప్రత్యేక బంధు వర్గము వారే. కనుకనే సాధారణ దుర్మార్గులపట్ల చూపవలసి నటువంటి తీవ్రవిధానము తాను వారిపట్ల అవలంబింపరాదని అర్జునుడు భావించెను. అంతేకాకుండ, సాధువులు క్షమాశీలురుగా నుండవలెనని ఆదేశింపబడినది. సాధువులైనట్టి వారికి అట్టి నిర్దేశములు రాజకీయమైన అత్యవసర పరిస్థితుల కంటెను అత్యంత ప్రధానమైనవి. రాజకీయ కారణములచే స్వజనమును చంపుటకు బదులు వారిని ధర్మదృష్టితోను, సాధువర్తనముతోను క్షమించుటయే ఉత్తమమని అర్జునుడు భావించెను. కనుకనే తాత్కాలికమైన దేహసుఖముల కొరకై అట్టివారిని సంహరించుట లాభదాయకమని అతడు భావించలేదు. అట్టి కార్యము ద్వారా లభించు రాజ్యము మరియు సౌఖ్యములు

శాశ్వతములు కానందున స్వజనమును చంపుటవలన తన జీవితమును మరియు నిత్యమైన ముక్తిని అతడెందుకు పణముగా పెట్టుకొనవలెను? ఈ సందర్భమున అర్జునుడు ఇక్కడ శ్రీకృష్ణుని 'మాధవా' అని సంబోధించుట యందు ఒక విశేషము గలదు. లక్ష్మీదేవి భర్తగా తనను చివరికి అశుభమునే కలుగజేయు కార్యము నందు శ్రీకృష్ణుడు ప్రోత్సహింపరాదని అర్జునుడు సూచింపదలచెను. వాస్తవమునకు, శ్రీకృష్ణుడు ఎవరికిని అశుభములను కలుగజేయడు. కనుక తన భక్తులకు అట్టి పరిస్థితులను కలుగజేయడని ప్రత్యేకించి తెలుపనవసరము లేదు.

## 1.37-38

**యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః ।**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥**
**కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।**
**కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥**

### అనువాదము

**ఓ జనార్దనా! లోభముచే ఆవరింపబడిన హృదయములు గల వీరందరును కులసంహారము నందు గాని, బంధువులతో కలహము నందు గాని దోషమును గాంచకున్నను, వంశనాశనము నందు దోషమును గాంచగలిగిన మేమెందులకు ఇట్టి పాపకార్యము నందు నియుక్తులము కావలెను?**

### భాష్యము

ప్రతిపక్షము వారు ఆహ్వానించినప్పుడు క్షత్రియుడు యుద్ధము చేయుటకుగాని, జూదమాడుటకుగాని నిరాకరింపరాదు. కావున అట్టి నియమము ననుసరించి అర్జునుడు యుద్ధము చేయుటకు నిరాకరింపరాదు. ఎందుకనగా అతడు దుర్యోధనుని పక్షము వారిచే యుద్ధమునకు ఆహ్వానింపబడెను. ఈ సందర్భమున, అట్టి సవాలు వలన కలిగెడి ప్రభావములను ప్రతిపక్షమువారు గుర్తింపలేకున్నారని అర్జునుడు భావించెను. కాని అర్జునుడు ఆ దుష్ఫలితములను చూడగలుగుటచే ప్రతిపక్షమువారి ఆ సవాలును అంగీకరింపలేకపోయెను. ఫలితము మంచిదైనచో నియమములు కచ్చితముగా పాటింపవచ్చును. కాని ఫలితము విరుద్ధమైనప్పుడు నియమములకు కట్టుబడజాలరు. ఈవిధమైన మంచి చెడులను ఆలోచించియే అర్జునుడు యుద్ధము చేయరాదని నిశ్చయించెను.

## 1.39

**కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మా: సనాతనా: ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మో భిభవత్యుత ॥**

## అనువాదము

**కులక్షయము వలన శాశ్వతమైన వంశాచారములు నశించిపోవును. ఆ విధముగా వంశమున మిగిలినవారు అధర్మవర్తనులగుదురు.**

## భాష్యము

వంశము నందలి వారు సక్రమముగా వృద్ధినొంది ఆధ్యాత్మిక విలువలను సంపాదించుటకు తోడ్పడు అనేక ధర్మాచారణలు, సంప్రదాయములు వర్ణాశ్రమ వ్యవస్థనందు ఏర్పరుచబడినవి. జననము మొదలు మరణము వరకును గల అట్టి అనేక సంస్కారములకు (శుద్ధికర్మలు) వంశములోని పెద్దలు బాధ్యతను వహింతురు. కాని అట్టి పెద్దలు అంతరించినచో అట్టి సంస్కారములు ఆ వంశములో నిలిచిపోవును. ఆ వంశములోని యువత అధర్మమార్గమును అవలంబించుటకు అవకాశము కలదు. అంతేకాకుండ, ఆధ్యాత్మిక ముక్తిని సాధించు అవకాశమును కూడ వారు కోల్పోవుదురు. కనుక ఏ ప్రయోజనము కొరకైనను వంశములోని పెద్దలను సంహరించుట తగదు.

## 1.40

**అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః ।**
**స్త్రీషు దుష్టాషు వార్ష్ణేయ జాయతే వర్ణసంకర: ॥**

## అనువాదము

**ఓ కృష్ణా! వంశమునందు అధర్మవాదము ప్రబలమగుటచేత కులస్త్రీలు కులటలగుదురు. ఓ వృష్ణివంశ సంజాతుడా! అట్టి కులస్త్రీలు పతితలయినచో అవాంఛనీయ సంతానము ఉత్పన్నమగును.**

## భాష్యము

జీవితము నందలి శాంతిసౌభాగ్యములకు మరియు ఆధ్యాత్మికోన్నతికి మానవసంఘము నందలి సత్ప్రవర్తన కలిగిన జనులే మూలాధారము. దేశము మరియు సమాజము ఆధ్యాత్మికాభివృద్ధిని సాధించుటకు వీలుగా మరియు సంఘములోని జనులు సత్ప్రవర్తనులగునట్లుగా వర్ణాశ్రమ ధర్మములు ఏర్పాటు చేయబడినవి. అట్టి ఉత్తమ పౌరులు జన్మించుట స్త్రీల ధర్మవర్తనము మరియు పాతివ్రత్యము పైననే ఆధారపడి యుండును. బాలురు సులభముగా తప్పుదారి పట్టుటకు అవకాశమున్నట్లుగానే, స్త్రీలు కూడా పతనమగుటకు అవకాశములు అధికములుగా నుండును. కనుకనే పిల్లలకును, స్త్రీలకును కూడా కుటుంబములోని పెద్దల సంరక్షణ అవసరము. స్త్రీలు వివిధ

ధర్మాచరణములందు నెలకొనుట ద్వారా వారి దృష్టి పెడదారి పట్టకుండును. చాణక్య పండితుని అభిప్రాయము ననుసరించి స్త్రీలు సాధారణముగ గొప్ప వివేకవంతులు కానందున వారు విశ్వసింపదగినవారు కారు. కనుకనే స్త్రీలను ధర్మకార్యములకు సంబంధించిన వివిధ వంశాచారములలో నిమగ్నులను చేసినచో వారి పాతివ్రత్యము మరియు భక్తివలన వర్ణాశ్రమ పద్ధతిని పాటించుటకు యోగ్యులైన ఉత్తమ సంతానము జన్మించును. అట్టి వర్ణాశ్రమ ధర్మము విఫలమైనచో సహజముగనే స్త్రీలు కట్టుబాట్లను విడిచి పురుషులతో విచ్చలవిడిగా కలియుదురు. దానితో అవాంఛనీయ సంతానము ఉత్పన్నమవుతూ వ్యభిచారము ప్రబలమగును. సంఘమున బాధ్యతారహితులైనట్టి వ్యక్తులు వ్యభిచారమును ప్రోత్సహించు చుందురు. మానవ సంఘమున అవాంఛనీయ సంతానము పెచ్చు పెరిగి యుద్ధములకును మరియు అశాంతికిని దారితీయును.

## 1.41

**సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।**
**పతన్తి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియా: ॥**

## అనువాదము

**అవాంఛిత సంతానము వృద్ధియగుటచేత కుటుంబమువారికిని, కుటుంబ ఆచారమును నాశనము చేసిన వారిరువరికిని నరక జీవితము సంప్రాప్తించును. పిండోదక క్రియలు సంపూర్ణముగా నిలిపివేయబడుటచే అట్టి అధర్మ కుటుంబములకు చెందిన పితరులు పతనము నొందుదురు.**

## భాష్యము

కర్మకాండకు సంబంధించిన విధులననుసరించి వంశములోని పితరులకు నియమానుసారముగా పిందోడక ప్రదానముతో పితృతర్పణములు చేయవలసిన అవసరము గలదు. విష్ణువును ఆరాధించుట ద్వారా ఈ పిండోదక ప్రదానము జరపబడును. ఎందుకనగా, విష్ణుభగవానునికి అర్పించిన ఆహారమును ప్రసాదముగా స్వీకరించుట చేత సమస్త పాపఫలములును నశించును. కొన్నిమార్లు పితరులు వివిధ పాపఫలితములననుభవించు చుండవచ్చును. మరికొన్నిమార్లు వారికి తిరిగి స్థూలదేహము లభింపక భూతప్రేతములుగా సూక్ష్మదేహమునందే బలవంతముగా నిలువవలసివచ్చును. కాని వారి సంతానము వారికి భగవత్ ప్రసాదమును అర్పించినచో ఆ పితరులు భూతప్రేత రూపముల నుండి మరియు ఇతర దుర్భర జీవన పరిస్థితుల నుండి విడుదలను పొందగలుగుదురు. పితరులకు అట్లు సహాయము చేయుట ఒక వంశాచారము. వాస్తవమునకు భక్తియుక్త సేవయందు నెలకొననివారు అట్టి కర్మకాండలను తప్పక చేయవలెను. కాని భక్తియుక్తసేవ యందు నెలకొనినట్టివారు అట్టి కర్మలను చేయనవసరము లేదు. కేవలము భక్తియుక్త సేవయందు నెలకొనుట ద్వారానే మానవుడు తమ వేలకొలది పితృదేవతలను వారు అనుభవించు అన్నిరకాల దుఃఖముల నుండి విముక్తులను చేయగలుగును. ఈ విషయమే శ్రీమద్భాగవతము (11.5.41) నందు ఇట్లు చెప్పబడినది :

దేవర్షిభూతాప్తనృణాం పితౄణాం న కింకరో నాయమృణీ చ రాజన్

సర్వాత్మనా య: శరణ్యం గతో ముకున్దం పరిహృత్య కర్తుమ్

"సమస్త ధర్మములను విడిచి ముక్తినొసగెడి ముకుందుని పాదారవిందములను ఆశ్రయించిన వాడు మరియు తాను చేపట్టిన భక్తిమార్గమునందు పూర్తి శ్రద్ధను గలిగినట్టి వ్యక్తికి దేవతల పట్ల, ఋషులపట్ల, కుటుంబము పట్ల, పితృదేవతల పట్ల ఎట్టి విధులుగాని, బాధ్యతలు గాని లేవు. అతడు వారికి ఋణపడి యుండడు." దేవాదిదేవునికి భక్తియుక్త సేవ చేయుట ద్వారా అట్టి బాధ్యతలన్నియు సహజముగానే నిర్వర్తింపబడును.

## 1.42

**దోషైరేతై: కులఘ్నానం వర్ణసంకరకారకై: ।**

**ఉత్సాద్యన్తే జాతిధర్మా: కులధర్మాశ్చ శాశ్వతా: ॥**

### అనువాదము

**దుష్టచర్యల చేత కులాచారములను నశింపజేసి, అవాంఛనీయ సంతానమునకు కారణమగు వారి పాపకర్మల చేత అన్ని రకముల కులధర్మములు మరియు జాతి ధర్మములు నాశనమగును.**

### భాష్యము

మానవుడు తన చరమ గమ్యమైన మోక్షమును సాధించు విధముగా సంఘములోని నాలుగు వర్ణముల వారి సంక్షేమ కార్యాలు నిర్ణయింపబడినవి. అవి సనాతన ధర్మము లేదా వర్ణాశ్రమ ధర్మముచే నిర్దేశింపబడినవి. కనుకనే సనాతన ధర్మ సంప్రదాయమునకు భంగము కలిగించు బాధ్యతారహితులైన సంఘనాయకులచే సంఘమునందు అయోమయ పరిస్థితి ఏర్పడుచున్నది. తత్ఫలితముగా ప్రజలు తమ జీవితలక్ష్యమైన విష్ణువును విస్మరించుదురు. అట్టి నాయకులు అంధులుగా పిలువబడుదురు. అంతేకాకుండ, వారిని అనుసరించు జనులు నిశ్చయముగా అయోమయస్థితికి గురికాక తప్పదు.

## 1.43

**ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।**

**నరకే నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥**

### అనువాదము

**ఓ కృష్ణా! జనార్దనా! కులధర్మములను నాశనము చేయువారు శాశ్వతముగా నరకలోక నివాసులగుదురని గురుశిష్య పరంపరాగతముగా నేను వినియుంటిని.**

## భాష్యము

అర్జునుడు ఇక్కడ తన వాదమునకు తన స్వానుభవమును కాకుండ, ప్రామాణికుల ద్వారా వినియున్న వచనములను ఆధారముగా గ్రహించుచున్నాడు. వాస్తవ జ్ఞానమును పొందుటకు అదియే సరియైన మార్గము. వాస్తవ జ్ఞానము నందు ఇదివరకే సుస్థిరులై యున్నవారి సహాయము లేనిదే ఎవ్వరును వాస్తవ జ్ఞానపు ముఖ్యాంశమును అవగతము చేసుకొనజాలరు. మరణమునకు పూర్వమే ఒక వ్యక్తి తాను చేసిన పాపకర్మలకు ప్రాయశ్చిత్తము చేసుకును ఒక పద్ధతి వర్ణాశ్రమపద్ధతియందు గలదు. నిరంతరము పాపకర్మల యందే నిమగ్నమైనట్టి వ్యక్తి ఈ ప్రాయశ్చిత్తమని పిలువబడు విధానమును తప్పక అనుసరింపవలెను. అట్లు చేయనిచో అతడు తన పాపకర్మలకు ఫలితముగా నరక లోకములపాలై దుర్భర జీవితమును పొందవలసివచ్చును.

### 1.44

**అహో బత మహత్ పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।**
**యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనముద్యతా: ॥**

## అనువాదము

**అహో! ఎంత విచిత్రము! ఘోరమైన పాపకర్మలను చేయుటకు మేము మేము సిద్ధపడుతుండిమి. రాజ్యసుఖమును అనుభవింప వలెననిడి ఆశతో మేము స్వజనమును వధింపగోరుచున్నాము.**

## భాష్యము

స్వార్థపూరితుడైన ఒక వ్యక్తి తన స్వంత సోదరుని, తండ్రిని లేదా తల్లిని కూడా వధించుట వంటి పాపకార్యమునకు పూనుకొనవచ్చును. ప్రపంచ చరిత్రలో అట్టి సంఘటనలకు అనేక ఉదాహరణలు గలవు. కాని అర్జునుడు శ్రీకృష్ణభగవానుని భక్తుడైనందున నీతిమార్గములను ఎరిగియుండెను. కనుకనే అట్టి పాపకార్యములు జరగకుండునట్లు జాగరూకత వహించుచుండును.

### 1.45

**యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయ: ।**
**ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమతరం భవేత్ ॥**

## అనువాదము

**ఒకవేళ శస్త్రధారులైన ధృతరాష్ట్రుని పుత్రులు నిరాయుధుడును మరియు ప్రతీకారము చేయనివాడను అగు నన్ను రణరంగమున వధించినచో అది నాకు క్షేమకరమే కాగలదు.**

## భాష్యము

క్షత్రియ యుద్ధధర్మముల ననుసరించి నిరాయుధుడైన వానిని మరియు యుద్ధము చేయగోరని శత్రువును ఎదుర్కొనరాదు. అది నియమము. ఒకవేళ ఏదైన అట్టి అసందర్భమైన పరిస్థితి ఏర్పడి తన శత్రువు తనతో యుద్ధము చేయదలచినను తాను యుద్ధము చేయరాదని అర్జునుడు నిశ్చయించుకొనెను. ప్రతి పక్షము వారు ఎంత సమరోత్సాహముతో నున్నారో అతడు దానిని పరిగణింప లేదు. ఈ లక్షణము లన్నియు శ్రీకృష్ణభగవానునికి అతడు గొప్ప భక్తుడగుట చేత కలిగినట్టి అతని కోమల హృదయమునే సూచించుచున్నవి.

## 1.46

**సంజయ ఉవాచ**

**ఏవముక్త్వార్జున: సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**

**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానస: ॥**

## అనువాదము

**సంజయుడిట్లు పలికెను: అర్జునుడు రణరంగము నందు ఆ విధముగా పలికి ధనుర్బాణములను ప్రక్కగా పడవేసి దుఃఖముచే కల్లోలితమైన మనస్సు కలవాడై రథము నందు చదికిలబడెను.**

## భాష్యము

శత్రుసైన్యము నందలి పరిస్థితిని వీక్షించునపుడు రథమునందు అర్జునుడు నిలబడియే యుండెను. కాని అతడు శోకముచే పూర్తిగ వివశుడగుట చేత ధనుర్బాణములను విడిచి రథమునందు తిరిగి కూర్చుండిపోయెను. ఆ విధముగ దయ మరియు కోమల హృదయమును కలిగి శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనిన మానవుడే ఆత్మజ్ఞానమును పొందుటకు అర్హుడై యున్నాడు.

**శ్రీమద్భగవద్గీత యందలి 'కురుక్షేత్ర రణరంగమున సైనిక పరిశీలనము' అను ప్రథమాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---------

# ద్వితీయాధ్యాయము
# గీతాసారము

### 2.1

**సంజయ ఉవాచ**

**తం తథా కృపయావిష్టమశ్రుపూర్ణాకులేక్షణమ్ ।**
**విషీదన్తమిదం వాక్యమువాచ మధుసూదన: ॥**

## అనువాదము

**సంజయుడు పలికెను: చింతాక్రాంతుడై అశ్రువులతో నిండిన నేత్రములు గలవాడు, జాలితో నిండినవాడును అగు అర్జునుని గాంచిన మధుసూదనుడైన శ్రీకృష్ణుడు ఈ విధముగా పలికెను.**

## భాష్యము

లౌకికమైన జాలి, చింత, అశ్రువులు అనునవి ఆత్మజ్ఞాన రాహిత్యమునకు చిహ్నములు. నిత్యమైన ఆత్మకొరకు చూపెడి జాలియే వాస్తవమునకు ఆత్మానుభూతియనబడును. ఈ శ్లోకమున 'మధుసూదన:' అను పదము మిక్కిలి ప్రధానమైనది. శ్రీకృష్ణ భగవానుడు మధు అను రాక్షసుని సంహరించి యుండెను. ఇప్పుడు కర్తవ్య నిర్వహణమున అవరోధము కలిగించిన భ్రాంతియను రాక్షసుని సంహరింపవలెనని అర్జునుడు శ్రీకృష్ణుని కోరుచున్నాడు. జాలిని ఎప్పుడు ఎక్కడ చూపవలెనో ఎవ్వరును ఎరుగరు. నీటిలో మునిగిపోవుచున్న మానవుని బాహ్యమైన దుస్తులపై జాలిచూపుట మూర్ఖత్వమే కాగలదు. అజ్ఞానమను సాగరమున పడిన మానవుని బాహ్యమైన దుస్తులను అనగా స్థూలమైన దేహమును కాపాడుట ద్వారా అతడు ఎన్నడును రక్షింపబడడు. ఈ విషయమును తెలియక బాహ్యవస్త్రము వంటి దేహము కొరకే చింతించువాడు 'శూద్రుడు' (అకారణముగా చింతించువాడు) అని పిలువబడును. అర్జునుడు క్షత్రియుడైనందున ఇట్టి ప్రవర్తన అతనికి యోగ్యము కాదు. జ్ఞానహీనుడైన మానవుని దుఃఖమును శ్రీకృష్ణభగవానుడు తొలగింపగలడు. ఆ ప్రయోజనము కొరకై భగవానుడు ఈ గీతాగానము చేసియుండెను. ఈ అధ్యాయమునందు భౌతిక దేహము మరియు ఆత్మను గూర్చిన విశ్లేషణాత్మకమైన అధ్యయనము గలదు. ఇది పరమ ప్రామాణికుడైన శ్రీకృష్ణుని చేత వివరింపబడి ఆత్మసాక్షాత్కార శాస్త్రమును గూర్చి మనకు బోధించుచున్నది. మానవుడు ఫలాపేక్ష లేకుండ కర్మలనొనరించుచు యథార్థమైన ఆత్మతత్త్వము నందు స్థితుడైనట్టి వానికే ఇట్టి ఆత్మానుభూతి సాధ్యమగును.

## 2.2

### శ్రీభగవానువాచ

**కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగావానుడిట్లు పలికెను: ఓ ప్రియమైన అర్జునా! ఈ క్లిష్టసమయమునందు ఇట్టి కల్మషము నీకు ఎచటి నుండి దాపురించినది? జీవితపు విలువల నెరిగిన మానవునకు ఇది అర్హము కానట్టిది. ఇది ఉన్నత లోకములకు దారి తీయదు సరికదా అపకీర్తిని కలిగించును.**

## భాష్యము

శ్రీకృష్ణుడన్నను దేవాదిదేవుడన్నను ఒక్కటియే. కనుకనే శ్రీకృష్ణుడు భగవద్గీత యందంతటను భగవానునిగా పేర్కొనబడెను. పరతత్త్వానుభూతి యందు భగవానుడే చరమాంశము. పరతత్త్వమనునది బ్రహ్మము (సర్వవ్యాపకమైన నిరాకార తత్త్వము) పరమాత్మ (సర్వజీవుల హృదయములందు నెలకొనినట్టి పరమ పురుషుని విశిష్టరూపముగను) భగవానుడు (దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు) అనెడి మూడు దశలుగా అనుభూతమగుచున్నది. శ్రీమద్భాగవతము (1.2.11) నందు పరతత్త్వపు లక్షణములు ఈవిధముగా వర్ణింపబడినవి.

వదన్తి తత్తత్త్వవిదస్తత్త్వం యత్ జ్ఞానమద్వయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే

"పరతత్త్వ మనునది తత్త్వవిదులచే మూడుదశలలో అనుభూతమగు చుండును. అవన్నియును కూడ అభిన్నములై యున్నవి. పరతత్త్వపు అట్టి వివిధ దశలే బ్రహ్మము, పరమాత్మ, భగవానునిగా వ్యక్తము చేయబడును."

సూర్యుని ఉపమానముతో ఈ దివ్యమైన మూడు అంశములను చక్కగా వివరింపవచ్చును. సూర్యునియందు కూడ సూర్యకాంతి, సూర్యబింబము, సూర్యమండలము అను మూడు అంశములు గలవు. సూర్యకాంతిని మాత్రమే అధ్యయనము చేయువాడు ప్రాథమిక విద్యార్థి కాగా, సూర్యబింబమును అనగా ఉపరితలమును గూర్చి అవగాహన చేసికొనినవాడు అంతకంటె మరింత అభివృద్ధిని సాధించిన ఉన్నత విద్యార్థియగును. కాని సూర్యగ్రహము నందు ప్రవేశింప గలిగినవాడు అత్యున్నత విద్యార్థి యగును. కేవలము సూర్యకాంతిని గూర్చి అనగా దాని విశ్వవ్యాపకత్వమును గూర్చి నిరాకారమైనట్టి దాని ఉజ్జ్వల కాంతిని గురించి మాత్రమే అధ్యయనము చేయుచు సంతృప్తి చెందెడి సాధారణ విద్యార్థులను పరతత్త్వపు బ్రహ్మానుభూతిని పొందినవారితో పోల్చవచ్చును. మరింతగా పురోగమించిన విద్యార్థి సూర్యబింబమును ఎరుగగలుగును. కనుక అట్టి సూర్యబింబముతో పరతత్త్వపు పరమాత్మ జ్ఞానము పోల్చబడినది. సూర్య మండలము లోనికే ప్రవేశింపగలిగిన విద్యార్థిని పరతత్త్వపు రూప లక్షణములను అనుభూతి చెందిన వారితో పోల్చవచ్చును. కనుకనే పరతత్త్వమును గూర్చి అధ్యయనము అధ్యయనము చేయుట యందు నిమగ్నులైన వారందరూ ఒకే విషయమునకు సంబంధించిన వారైనప్పటికిని భక్తులు లేక

పరతత్త్వము యొక్క భగవానుని లక్షనమును గూర్చి అనుభూతి చెందిన ఆధ్యాత్మికవాదులు అత్యుత్తమ తత్త్వజ్ఞాన సంపన్నులై యుందురు. సూర్యకాంతి, సూర్యబింబము, సూర్యమండలము నందలి అంతరకర్మలు అభిన్నములైనను ఈ మూడు దశలను అధ్యయనము చేయు విద్యార్థులు ఒకే తరగతికి చెందినవారని మాత్రం చెప్పరాదు.

పరమ ప్రామాణికుడును, వ్యాసదేవుని తండ్రియైన పరాశరమునిచే 'భగవానుడు' అను సంస్కృత పదము చక్కగా వివరింపబడినది : "సర్వ సంపదలను, సర్వశక్తిని, సర్వకీర్తిని, సర్వసౌందర్యమును, సర్వజ్ఞానమును, సంపూర్ణవైరాగ్యములను సంపూర్ణముగా కలిగిన పరమ పురుషుడు భగవానుడని పిలువబడును." గొప్ప ధనవంతులు, గొప్ప శక్తిమంతులు, గొప్ప సౌందర్యవంతులు, గొప్పకీర్తిమంతులు, గొప్ప జ్ఞానవంతులు, గొప్ప వైరాగ్యవంతులనేకులు ఉన్నప్పటికిని తామే సర్వసంపదలను, సర్వశక్తులను సంపూర్ణముగా కలిగి యున్నామని ఎవ్వరును చెప్పజాలరు. శ్రీకృష్ణుడే దేవాదిదేవుడైనందున అట్లు చెప్పుటకు అర్హుడై యున్నాడు. ఏ జీవుడైనను బ్రహ్మ, శివుడు, లేదా నారాయణుడు వంటి వారెవ్వరైనను శ్రీకృష్ణునితో సమానముగా సంపూర్ణ విభూతులను కలిగియుండరు. కనుకనే 'బ్రహ్మ సంహిత' (5.1) యందు శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని బ్రహ్మదేవుడు నిర్ధారించి యుండెను. అతనితో సమానుడు గాని అధికుడు గాని మరెవ్వరును లేరు. అతడే గోవిందుడు అనబడు ఆదిదేవుడు లేక భగవానుడు. అతడే సర్వకారణములకు మూలకారణుడు :

ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానందవిగ్రహ:

అనాదిరాదిర్గోవింద: సర్వకారణకారణమ్

"భగవానుని లక్షణములను పలువురు పురుషులు కలిగి యుండవచ్చును. అయినను ఎవ్వరును శ్రీకృష్ణుని అధిగమింప లేనందున శ్రీకృష్ణుడు పరమపురుషుడు. అతడు సచ్చిదానంద విగ్రహుడు. ఆదిదేవుడైన ఆ గోవిందుడే సర్వకారణములకు కారణుడు."

శ్రీమద్భాగవతము నందు కూడ దేవాదిదేవుని పలు అవతారముల పట్టిక వివరింప బడినది. కాని శ్రీకృష్ణుడు మాత్రము స్వయం దేవాదిదేవుడైన భగవానునిగా వర్ణింపబడి యున్నాడు. అతని నుండియే అనేకములైన అవతారములు మరియు వివిధ స్వాంశరూపములు విస్తరించును :

ఏతే చాంశకలా: పుంస: కృష్ణస్తు భగవాన్ స్వయమ్
ఇంద్రారివ్యాకులం లోకం మృడయన్తి యుగే యుడే

"ఇచ్చట పేర్కొనబడినట్టి ఆదిదేవుని అవతారములన్నియును ఆతని స్వాంశ అవతారములు లేక స్వాంశాంశ అవతారములు (కళావతారములై) అయియున్నవి. కాని శ్రీకృష్ణుడు మాత్రమే స్వయం భగవానుడు." (శ్రీమద్భాగవతము 1.3.28)

కనుకనే శ్రీకృష్ణుడు ఆదియైన దేవాదిదేవుడు మరియు పరతత్త్వ స్వరూపుడు. ఆయనే పరమాత్మకును, నిరాకార బ్రహ్మమునకును మూలాధారుడై యున్నాడు. వాస్తవమునకు దేవాదిదేవుని సమక్షమున బంధువులకొరకు అర్జునుడు చింతించుట అనుచితము. కనుకనే శ్రీకృష్ణుడు 'కుత:' (ఎచటి నుండి) అను పదముతో తన ఆశ్చర్యమును వ్యక్తము చేసియున్నాడు. 'ఆర్యులు'గా పిలువబడు నాగరికజాతికి చెందిన మానవులనుండి అట్టి కల్మషము ఎన్నడును ఊహింపలేనట్టిది. 'ఆర్య' అను పదము జీవితపు విలువలను ఎరిగి ఆత్మజ్ఞానముపై ఆధారపడిన నాగరికతను కలిగియుండు మానవులకే వాడబడును. దేహాత్మబుద్ధి కలిగినవారు పరతత్త్వమైన విష్ణువును లేక

భగవానుని అనుభూతి పొందుటయే జీవిత లక్ష్యమని ఎరుగక భౌతిక జగత్తుయొక్క బాహ్య లక్షనములచే ఆకర్షింపబడుదురు. కనుకనే ముక్తియనగానేమో వారెరుగరు. భౌతిక బంధము నుండి విముక్తిని గూర్చిన జ్ఞానము లేనివారు 'అనార్యులు'గా పిలువబడుదురు. అర్జునుడు క్షత్రియుడైనప్పటికిని యుద్ధము చేయుటకు నిరాకరించుట ద్వారా తన విధ్యుక్త ధర్మములనుండి తప్పుకొనుచున్నాడు. అట్టి పిరికి కార్యము 'అనార్య'లకు మాత్రమే తగినదని వివరింపబడినది. అట్లు విధ్యుక్త ధర్మము నుండి తప్పుకొనుట ఆధ్యాత్మిక జీవన పురోగతికి తోడ్పడక పోవుటయే కాకుండ, ఈ లోకమున ప్రసిద్ధి గాంచుటకు కూడ మానవునికి అవకాశమివ్వదు. కనుకనే బంధువుల యెడ అర్జునుడు చూపిన సానుభూతియని పిలువబడు దానిని శ్రీకృష్ణభగవానుడు ఏ మాత్రము ఆమోదించియుండలేదు.

## 2.3

**క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥**

## అనువాదము

**ఓ పార్థా! పతనకారకమైన ఈ నపుంసకత్వమునకు లొంగకుము. ఇది నీకు తగదు. ఓ పరంతపా! ఇట్టి తుచ్ఛమైన హృదయ దౌర్బల్యమును విడిచి వెంటనే లెమ్ము.**

## భాష్యము

ఇక్కడ అర్జునుడు పృథకుమారునిగా సంబోధింపబడినాడు. పృథ శ్రీకృష్ణుని తండ్రియైన వసుదేవునికి సోదరి. కనుక అర్జునుడు శ్రీకృష్ణునితో రక్త సంబంధమును కలిగియున్నట్లు తెలియుచున్నది. క్షత్రియుని పుత్రుడు యుద్ధము చేయుటకు నిరాకరించినచో అతడు నామమాత్ర క్షత్రియుడగును. అట్లే బ్రాహ్మణ పుత్రుడు పాపవర్తనను కలిగియున్నచో అతడు నామమాత్ర బ్రాహ్మణుడగును. అట్టి క్షత్రియుడును, బ్రాహ్మణుడును తమ తండ్రులకు తగిన పుత్రులు కాజాలరు. కనుకనే అర్జునుడు అనర్హుడైన క్షత్రియపుత్రునిగా నుండుటకు శ్రీకృష్ణుడు అంగీకరింపలేదు. అర్జునుడు శ్రీకృష్ణునికి మిక్కిలి ఆప్తమిత్రుడు. అంతేకాకుండ శ్రీకృష్ణుడు ప్రత్యక్షముగా రథమునందుండి అతనికి మార్గము నిర్దేశించుచుండెను. ఇన్ని అవకాశములు ఉన్నప్పటికిని అర్జునుడు యుద్ధమును త్యజించినచో, అతడు అపకీర్తిని కలిగించు కార్యము చేసినవాడగును. కనుకనే శ్రీకృష్ణుడు అట్టి ప్రవృత్తి అర్జునుని వ్యక్తిత్వమునకు తగదని చెప్పియుండెను. పూజ్యులైన భీష్ముడు మరియు బంధువుల పట్ల తనకు గల ఉదార స్వభావము చేత తాను యుద్ధము త్యజించుచున్నానని అర్జునుడు వాదింపవచ్చును. కాని అట్టి ఔదార్యము కేవలము హృదయ దౌర్బల్యమేనని శ్రీకృష్ణుడు భావించెను. ఏ ప్రామాణికుడును అజ్ఞానముతో కూడిన అట్టి ఔదార్యమును ఆమోదింపడు. కనుక అర్జునుని వంటి వ్యక్తులు అట్టి ఔదార్యమును లేక అట్టి నామమాత్ర అహింసను శ్రీకృష్ణుని ప్రత్యక్ష నిర్దేశమున వెంటనే విడవవలెను.

## 2.4

**అర్జున ఉవాచ**

**కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభి: ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥**

### అనువాదము

**అర్జునుడు పలికెను: ఓ శత్రుసంహారకా! ఓ మధుసూదనా! పూజనీయులైన భీష్మ ద్రోణులవంటివారిని నేనెట్లు బాణములతో యుద్ధము నందు ఎదుర్కొనగలను?**

### భాష్యము

పితామహుడైన భీష్ముడును, గురువైన ద్రోణుడును ఎల్లప్పుడు పూజింపదగినవారు. వారొకవేళ దాడిచేసినను వారిని ఎదుర్కొనరాదు. పెద్దలతో వాగ్వాదమునకు దిగరాదనుట సాధారణ మర్యాద. కొన్నిమార్లు వారు కఠినముగా ప్రవర్తించినను వారిపట్ల కఠినముగా వర్తింపరాదు. అయినచో అట్టివారిని ఎదుర్కొనుట అర్జునునికి ఎట్లు సాధ్యమగును? శ్రీకృష్ణుడు ఎన్నడైనను తన తాతయైనట్టి ఉగ్రసేనుని గాని, గురువైన సాందీపని మునిని గాని ఎదుర్కొనునా? ఈ విధమైన వాదనలను కొన్నింటిని అర్జునుడు శ్రీకృష్ణుని ముందుంచెను.

## 2.5

**గురూనహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।**
**హత్వార్థకామాంస్తు గురూనిహైవ భుఞ్జీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥**

### అనువాదము

**గురువులైన మహాత్ముల జీవితములను పణముగా పెట్టి జీవించుట కంటెను ఈ లోకమున బిక్షమెత్తి జీవించుట ఉత్తమమైనది. ప్రాపంచిక లాభమును కోరుచున్నప్పటికిని వారందరును పెద్దలే. వారిని వధించినచో మేము అనుభవించు సమస్తమును రక్తపంకిలమగును.**

### భాష్యము

శాస్త్రాదేశముల ననుసరించి ఘోరమైన కార్యములకు పాల్పడుతూ యుక్తాయుక్త జ్ఞానమును కోల్పోయిన గురువును త్యజింపవచ్చును. దుర్యోధనుని నుండి ఆర్థిక సహాయమును పొందుచుండుట చేత భీష్మద్రోణు లిరువరును ఆతని పక్షము వహింపవలసి వచ్చినది. కాని కేవలము అట్టి ఆర్థిక కారణములచే వారట్టి పరిస్థితిని అంగీకరింపకుండ ఉండవలసినది. ఇట్టి పరిస్థితులలో వారు గురువులుగా తమ గౌరవమును కోల్పోయిరి. అయినను వారు తనకు గౌరవించదగిన పెద్దలేననియు వారిని సంహరించి భౌతిక లాభాముల ననుభవింప దలచినచో రక్తసిక్తమైన వాటిని అనుభవించుట యనియే అర్జునుడు భావించెను.

## 2.6

**న చైతద్ విద్మ: కతరన్నో గరీయో యద్ వా జయేమ యది వా నో జయేయు: ।**
**యానేవ హత్వా న జిజీవిషామస్తే వస్థితా: ప్రముఖే ధార్తరాష్ట్రా: ॥**

### అనువాదము

**మేము వారిని జయించుటయో, వారు మమ్ములను జయించుటయో, ఏది హితకరమైనదో తెలియకున్నాము. ధృతరాష్ట్ర పుత్రులను చంపి మేము జీవింప వాంఛింపము. అయినను వారిపుడు యుద్ధ రంగమున మా యెదుట నిలిచియున్నారు.**

### భాష్యము

క్షత్రియులకు యుద్ధము చేయుట ధర్మమైనను తాను అనవసర హింసకు కారణమగుచు యుద్ధము చేయవలెనా లేక యుద్ధమును త్యజించి భిక్షాటనతో జీవించవలెనా అనునది అర్జునునికి తెలియకున్నది. అతడు శత్రువులను జయింపలేకున్నచో భిక్షాటనయే అతనికి జీవనోపాధియగును. అట్లే, విజయము నిశ్చయముగా లభింపగలదని కూడా లేదు. ఎందుకనగా, యుద్ధము నందు ఇరు పక్షములలో ఎవరైనను విజయము సాధింపవచ్చును. ఒకవేళ తమ పక్షముకే విజయము లభించినను, తన పక్షమే ధర్మ సమ్మతమైనను ధృతరాష్ట్రుని పుత్రులు యుద్ధమున మరణించినచో వారు లేకుండ తాము జీవించుట దుర్లభమగును. అట్టి పరిస్థితులలో అది వారికి మరొక విధమైన పరాజయమే! ఈ భావములన్నియును అర్జునుడు గొప్ప భగవద్భక్తుడే కాకుండ గొప్ప జ్ఞాని మరియు మనస్సు, ఇంద్రియములపై పూర్తి నియంత్రణ గలవాడనియు స్పష్టముగా నిరూపించుచున్నవి. రాజవంశమున జన్మించినను భిక్షాటనతో జీవింపవలెనని వాంఛించుట అతని వైరాగ్యమునకు మరొక నిదర్శనము. ఈ గుణములు మరియు అట్లే తన ఆధ్యాత్మికాచార్యుడైనశ్రీకృష్ణుని బోధనలపై అతని విశ్వాసము మరియు శ్రద్ధయనునవి అతడిని నిజమైన ధార్మికుడని సూచించుచున్నవి. కనుకనే అర్జునుడు ముక్తినొందుటకు అర్హుడని స్పష్టముగా నిర్ధారింపబడినది. ఇంద్రియములను నియంత్రింపకుండ జ్ఞానస్థితికి ఉద్ధరింపబడు అవకాశమే లేదు. జ్ఞానము మరియు భక్తి లేనిదే ముక్తినొందు అవకాశము లేదు. ఐహిక సంబంధములలోని ఉత్తమ గుణములతో పాటుగా అర్జునుడు పై గుణములందును యోగ్యుడై యుండెను.

## 2.7

**కార్పణ్యదోషోపహతస్వభావ: పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతా: ।**
**యచ్ఛ్రేయ: స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తే హం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**

## అనువాదము

**నాయందలి కార్పణ్య దోష కారణమున నేనిప్పుడు స్వధర్మ విషయమున మోహము చెంది శాంతిని కోల్పోయితిని. ఇట్టి స్థితిలో ఏది నాకు మిక్కిలి హితకరమో నిశ్చయముగా తెలుపుమని నిన్ను నేను అడుగుచున్నాను. నేనిపుడు నీకు శిష్యుడను మరియు శరణాగతుడను. దయచేసి నాకు ఉపదేశము కావింపుము.**

## భాష్యము

ప్రకృతి నియమముల ననుసరించి భౌతిక కర్మలే ప్రతియొక్కరి కలతలకు మూలకారణము లగుచున్నవి. ప్రతి అడుగులోను కలతలే ఎదురగుచుండును. కనుక జీవిత లక్ష్యమును సాధించుటలో సరియైన నిర్దేశమునొసగు ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయించుట అందరికి ఉత్తమము. మనము వాంఛింపకున్నను కలుగునట్టి జీవితము నందలి కలతల నుండి విముక్తి సాధించుట కొరకై ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయింపవలెనని వేదశాస్త్రములు మనలను ఆదేశించుచున్నవి. ఎవరి ప్రమేయము లేకుండగనే రగుల్కొనెడు దావాగ్ని వంటివి అట్టి కలతలు. అట్లే, ఈలోకపు పరిస్థితి ఎట్టిదనగా మనము వాంఛింపకున్నను జీవితమున కలతలు కొన్ని వాటంతటవే కలుగుచుండును. దావాగ్నిని ఎవరు కోరుకొనరు. అయినను అది విజృంభించి మనకు కలతను కలిగించుచుండును. కనుక జీవితము నందలి కలతలను పరిష్కరించు కొనుటకును మరియు పరిష్కారపు జ్ఞానమును జ్ఞానమును అవగాహన చేసుకొనుటకును, ప్రామాణిక గురుశిష్య పరంపరలో గల ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయింపవలెనని వేదవిజ్ఞానము ఆదేశించుచున్నది. అట్టి ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయించిన మానవుడే సర్వమును ఎరుగ గలుగును. కనుక మానవుడు భౌతిక కలతల యందే ఉండిపోకుండ ఆధ్యాత్మికాచార్యుని తప్పక ఆశ్రయింపవలెను. ఇదియే ఈ శ్లోకపు సారాంశము.

లౌకికమైన కలతలతో చిక్కుకొనెడి వాడెవ్వడు? ఎవరు జీవితమునందలి క్లిష్ట సమస్యలను అవగాహన చేసుకొనజాలడో అట్టి మానవుడని చెప్పబడినది. 'బృహదారణ్యకోపనిషత్తు'(3.8.10) నందు కలత చెందిన మానవుడు ఇట్లు వర్ణింపబడెను : "యో వా ఏతదక్షరం గార్గి అవిదిత్వా స్మాల్లోకాత్ ప్రైతి స కృపణ:" – "ఎవడు మానవునిగా క్లిష్టమైన జీవిత సమస్యలను పరిష్కరింపడో, ఆత్మానుభూతి విజ్ఞానమును అవగాహనము చేసుకొనకుండ శునకము వలె మరియు మార్జాలము వలె ఎవడు ఈ ప్రపంచమును వీడిపోవునో వాడు కృపణుడు." మానవ జన్మము జీవునికి జీవిత సమస్యలను పరిష్కరించుటకు ఉపయోగపడు అత్యంత విలువైన సాధనము. కనుక ఈ అవకాశమును సద్వినియోగపరచు కొననివాడు కృపణుడు (లోభి) అగును. అట్టి కృపణునికి భిన్నముగా గలవాడు బ్రాహ్మణుడు. అతడే జీవిత సమస్యలన్నింటి పరిష్కారమునకు ఈ మానవ జన్మను ఉపయోగించుకొనగల వివేకవంతుడు. "య ఏతదక్షరం గార్గి విదిత్వా స్మాల్లోకాత్ ప్రైతి స బ్రాహ్మణ:"

'కృపణులు' భౌతికబుద్ధి భావనతో కుటుంబము, సంఘము, దేశము వంటివాని కొరకు గొప్ప ప్రేమను ప్రదర్శించుచు కాలమును వృథా చేయుచుందురు. సాధారణముగా, మానవుడు జాడ్యమైన దేహసంబంధముల ననుసరించి భార్య, సంతానము, ఇతర బంధువులతో కూడిన కుటుంబ జీవితము నందు ఆశక్తుడై యుండును. కృపణుడైనవాడు తాను తన కుటుంబ సభ్యులను మరణము నుండి రక్షింపగలుగుననియు లేక తన కుటుంబము లేక సంఘము తనను మరణము నుండి రక్షించుననియు భావించుచుండును. అట్టి సంసారిక ఆసక్తి హీనజంతువులందును గోచరించును. అవి కూడా తమ కుటుంబపు రక్షణాభారము స్వీకరించు చున్నవి. అర్జునుడు వివేకవంతుడగుటచే కుటుంబ సభ్యుల పట్ల ఆసక్తి మరియు వారిని మృత్యువునుండి రక్షింపవలెనను వాంఛయే తన కలతకు కారణములని ఎరుగగలిగెను. యుద్ధము చేయుట తన విధ్యుక్తధర్మమని అవగాహన చేసికొనినను తుచ్ఛమైన హృదయ దౌర్బల్యముచే అతడు తన ధర్మములను నిర్వర్తింపలేక పోవుచున్నట్లుగా అవగతము చేసుకొనెను. కనుక అతడు పరమాచార్యుడైన శ్రీకృష్ణభగవానుని నిశ్చయ పరిష్కారమును చూపించమని అర్థించుచున్నాడు. శ్రీకృష్ణునికి అర్జునుడు శిష్యుడనని శరణు వేడుతున్నాడు. స్నేహపూర్వకమైన సంభాషణలను అతడు ఆపదలచెను. గురుశిష్యుల నడుమ జరుగు సంభాషణలు మిక్కిలి గంభీరములుగా నుండును. కనుకనే ఇప్పుడు ప్రామాణికాచార్యుని ఎదుట అర్జునుడు గంభీరముగా పలుకదలచెను. కనుకనే భగవద్గీత జ్ఞానమునకు ఆదిగురువు శ్రీకృష్ణుడు కాగా, దానిని అవగతము చేసుకొనుటలో ప్రథమ శిష్యుడు అర్జునుడయ్యెను. అర్జునుడు భగవద్గీతను అవగాహన చేసుకొనిన విధానము గీతయందే తెలుపబడినది. అయినను మూర్ఖులైన భౌతిక విద్వాంసులు వ్యక్తియైన శ్రీకృష్ణునికి శరణు పొందనవసరము లేదనియు, శ్రీకృష్ణుని యందుగల అంతరాత్మను 'అజుడు' అయినట్టి వానిని శరణు వేడవలెననియు వ్యాఖ్యానించు చుందురు. వాస్తవమునకు శ్రీకృష్ణుని అంతరబాహ్యములకు ఎట్టి భేదము లేదు. ఇట్టి అవగాహన లేకుండా భగవద్గీతను అవగతము చేసుకొనుటకు యత్నించినచో అంతకంటె గొప్ప మూర్ఖుడుండడు.

## 2.8

**న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ యచ్ఛోకముచ్ఛోషణమిన్ద్రియాణామ్।**
**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥**

## అనువాదము

**ఇంద్రియములను శోషింపజేయునటువంటి ఈ శోకమును తొలగించుకొను మార్గమును నేను గాంచలేకున్నాను. దేవతల స్వర్గాధిపత్యము వలె సంపత్సమృద్ధమును మరియు శత్రురహితము అగు రాజ్యమును ధరిత్రిపై సాధించినను ఈ శోకమును నేను తొలగించుకొనజాలను.**

## భాష్యము

ధర్మమునకును, నీతిశాస్త్రములకును సంబంధించిన సిద్ధాంతముల పరిజ్ఞానముపై ఆధారపడునట్టి పలు హేతువాదములను అర్జునుడు ప్రతిపాదించుచున్నను, ఆధ్యాత్మికాచార్యుడైన శ్రీకృష్ణభగవానుని సహాయము లేకుండ

తన వాస్తవ సమస్యను అతడు పరిష్కరించు కొనజాలనట్లు తెలియుచున్నది. తన జీవన మనుగడను వృథా చేయుచున్నట్టి క్లిష్టసమస్యలను తొలగించుకొనుటకు తన నామమాత్ర జ్ఞానము నిరుపయోగమని అతడు గ్రహింపగలిగెను. అంతేకాకుండ, శ్రీకృష్ణభగవానుని వంటి ఆచార్యుని సహాయము లేకుండా అట్టి క్లిష్టసమస్యలను పరిష్కరించుకొనుట అతనికి అసాధ్యముగా కనిపించుచున్నది. కేవలము పాండిత్యము, ఉన్నత పదవుల వంటివి జీవిత సమస్యల పరిష్కారమునకు ఉపయోగకరములు కాజాలవు. శ్రీకృష్ణునివంటి ఆధ్యాత్మికాచార్యుడు మాత్రమే అట్టి సమస్యల పరిష్కారమునకు తోడ్పడగలడు. కనుక సారాంశమేమనగా, నూటికి నూరుపాళ్ళు కృష్ణచైతన్యవంతుడైన ఆధ్యాత్మికాచార్యుడే ప్రామాణికాచార్యుడు కాగలడు. ఎందుకనగా, అట్టివాడే జీవిత సమస్యలను పరిష్కరింపగలడు. సాంఘిక స్థితితో ఎట్టి సంబంధము లేకుండ, కృష్ణ చైతన్య విజ్ఞానము నందు నిష్ణాతుడైనవాడు మాత్రమే నిజమైన ఆధ్యాత్మికాచార్యుడని శ్రీచైతన్య మహాప్రభువు తెలిపియుండెను:

కిబా విప్ర, కిబా న్యాసి, శూద్ర కేనే నయ్
యేయి కృష్ణతత్త్వవేత్తా సేయ్ 'గురు' హెూయ్

"ఒకవ్యక్తి వేదవిజ్ఞానము నందు విద్వాంసుడైన విప్రుడైనను లేక హీన కుటుంబము నందు జన్మించిన వాడైనను, సన్న్యాసాశ్రమమును స్వీకరించినవాడైనను, కృష్ణ విజ్ఞానమున నిష్ణాతుడైనప్పుడు మాత్రమే పరిపూర్ణుడును, ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుడు కాగలడు." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 8.128)

కనుకనే కృష్ణచైతన్య విజ్ఞానమునందు నిష్ణాతుడు కాకుండ ఎవ్వరును ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుడు కాజాలడు. వైధిక గ్రంథములందు కూడ ఈ విషయము ఇట్లు చెప్పబడినది :

షట్కర్మనిపుణో విప్రో మంత్రతంత్రవిశారద:
అవైష్ణవో గురుర్ న స్యాద్ వైష్ణవ: శ్వపచో గురు:

"వేదవిజ్ఞానము నందు పండితుడైన బ్రాహ్మణుడైనను కృష్ణచైతన్య విజ్ఞానమునందు నిష్ణాతుడు కానిచో లేక వైష్ణవుడు కానిచో అతడు ఆధ్యాత్మికాచార్యుడగుటకు అర్హుడు కాజాలడు. కాని ఎవరైనను హీనకులము నందు జన్మించినప్పటికిని అతడు వైష్ణవుడైనచో లేదా కృష్ణచైతన్య వంతుడైనచో ఆధ్యాత్మికాచార్యుడు కాగలడు." (పద్మ పురాణము)

జన్మము, మృత్యువు, వృద్ధాప్యము, వ్యాధులనెడి భౌతిక దు:ఖములు ధనమును కూడబెట్టుట ద్వారా లేదా ఆర్థికాభివృద్ధిని సాధించుట ద్వారా తొలగింపబడవు. ప్రపంచము నందలి పలు ప్రాంతములలో సమస్త జీవన సౌకర్యములతో కూడి, ఆర్థికముగా విశేషాభివృద్ధి పొందినట్టి దేశములెన్ని ఉన్నప్పటికిని అక్కడ కూడ భౌతిక క్లేశములు ఇంకను ఎన్నోగలవు. అక్కడి ప్రజలు వివిధ రకాలుగా శాంతికొరకై అన్వేషించుచున్నారు. కాని వారు నిజమైన ఆనందమును శ్రీకృష్ణుని లేక భగవద్గీత మరియు శ్రీమద్భాగవతమును ఆశ్రయించినప్పుడు మాత్రమే పొందగలుగుదురు. అట్టి గ్రంథములు కృష్ణసంబంధ విజ్ఞానముతో కూడియున్నట్టివి. కృష్ణచైతన్యవంతుడు ప్రామాణికుడైన శ్రీకృష్ణుని ప్రతినిధి ద్వారా వాటిని అవగతము చేసుకొనినపుడే అట్టి ఆనందము ప్రాప్తింపగలదు.

ఆర్థికాభివృద్ధి మరియు భౌతిక సుఖములనునవి మానవుని సాంసారిక, సాంఘిక, జాతీయ లేక అంతర్జాతీయ సంక్షోభములను నివారింపగలిగినచో, ధరిత్రిపై

శత్రురహితమైన రాజ్యముగాని లేదా దేవతల స్వర్గాధిపత్యము గాని తన శోకమును తొలగింపజాలవని అర్జునుడు చెప్పియుండెడివాడు కాదు. కనుకనే, అతడు కృష్ణచైతన్యమును ఆశ్రయింపదలచెను. అదియే శాంతిసామరస్యములకు సరియైన మార్గము. ఆర్థికాభివృద్ధి లేక ప్రపంచాధిపత్యము అనునది ప్రకృతి సంక్షోభములచే ఏ క్షణమునందైనను నాశనము చేయబడవచ్చును. ప్రస్తుతము చంద్రలోకమును మానవుడు చేరగోరినట్లుగా, ఉన్నత లోకములకు చేరు యత్నము కూడ ఒక్కదెబ్బతో తుడిచి పెట్టబడవచ్చును. భగవద్గీత (9.21) నందు కూడ : "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" – "పుణ్యకర్మల ఫలితములు క్షీణించినంతనే, జీవితము నందలి ఆనంద శిఖరము నుండి అతి హీన స్థితికి జీవుడు పతనము చెందును" అని చెప్పి ఈ విషయము సమర్థింపబడుచున్నది. అట్లు ప్రపంచము నందలి పలువురు రాజకీయనేతలు పతనము చెందియున్నారు. అట్టి పతనములు మరింత అధిక శోకమునకు కారణములగు చున్నవి.

కనుక దుఃఖములను పూర్తిగా తొలగించుకొనదలిచినచో అర్జునుని వలె మనము కూడ శ్రీకృష్ణుని ఆశ్రయింపవలెను. కనుకనే అర్జునుడు తన సమస్యను నిశ్చయముగా పరిష్కరింపుమని శ్రీకృష్ణుని అర్థించెను. అదియే కృష్ణచైతన్యమార్గము.

## 2.9

**సంజయ ఉవాచ**

**ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశ: పరన్తప: ।**

**న యోత్స్య ఇతి గోవిన్దముక్త్వా తూష్ణీం బభూవ హ ॥**

### అనువాదము

**సంజయుడు పలికెను: శత్రువులను జయించు అర్జునుడు ఆ విధముగా పలికి, శ్రీకృష్ణునితో : "గోవిందా! నేను యుద్ధము చేయను" అని తెలిపి మౌనము వహించెను.**

### భాష్యము

అర్జునుడు యుద్ధమును మాని యుద్ధరంగమును వీడి భిక్షాటనను చేపట్టనున్నాడని తెలుసుకుని ధృతరాష్ట్రుడు మిక్కిలి సంతోషించి యుండవచ్చును. కాని, సంజయుడు అర్జునుని పరంతపుడు అనగా శత్రువులను సంహరింప సమర్థుడని తెలిపి అతనిని తిరిగి నిరాశపరచెను. బంధుప్రీతి కారణముచే అర్జునుడు తాత్కాలికముగా అజ్ఞానముచే శోకమునకు గురైనను, పరమాచార్యుడైన శ్రీకృష్ణునకు శిష్యుడని శరణుపొందెను. కుటుంబ బంధముల వలన ఏర్పడిన శోకమునుండి అతడు వెంటనే విడివడి కృష్ణచైతన్యము లేక ఆత్మానుభూతి యొక్క పరిపూర్ణ జ్ఞానము చేత జ్ఞానప్రకాశమును పొంది తప్పక యుద్ధము చేయునని ఇది సూచించుచున్నది. అర్జునుడు శ్రీకృష్ణుని నుండి జ్ఞానప్రకాశమును పొంది చివరి వరకు యుద్ధము చేయనున్నందున ధృతరాష్ట్రుని సంతోషము నిరాశగా మారవచ్చును.

## 2.10

**తమువాచ హృషీకేశ: ప్రహసన్నివ భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే విషీదన్తమిదం వచ: ॥**

### అనువాదము

**ఓ భరతవంశీయుడా! ఆ సమయమున నవ్వుచు శ్రీకృష్ణుడు ఇరుసేనల నడుమ దుఃఖమగ్నుడైన అర్జునునితో ఇట్లనెను.**

### భాష్యము

హృషీకేశుడు మరియు గుడాకేశుడు అను ఇరువరు సన్నిహిత మిత్రుల మధ్య సంభాషణము జరుగుచుండెను. మిత్రులుగా వారిరువరును సమాన స్థితి యందుండిరి. కాని వారిలో ఒకరు స్వచ్ఛందముగా మరొకరికి శిష్యుడయ్యెను. మిత్రుడు శిష్యునిగా మారగోరినందున శ్రీకృష్ణుడు నవ్వుచుండెను. అయినను తన భక్తుడు కోరునట్లు మిత్రునిగా గాని, పుత్రునిగా గాని, ప్రియునిగా గాని వర్తించుటకు భగవానుడు అంగీకరించును. కనుకనే భక్తుడు తనను గురువుగా అంగీకరించినంతనే అతడు ఆ స్థానము స్వీకరించి శిష్యునితో అవసరమైన గాంభీర్యముతో సంభాషించెను. సర్వులకు లాభము కలుగునట్లుగా ఆ గురుశిష్యుల నడుమ సంభాషణము ఇరుసేనల సమక్షమున బహిరంగముగా జరిగినట్లు తెలియుచున్నది. కనుకనే భగవద్గీతా బోధనలు ఒక ప్రత్యేక వ్యక్తికి గాని, సంఘమునకు గాని, జాతికి గాని సంబంధించినది కాకుండ మానవులందరికొరకు నిర్దేశింపబడియున్నవి. శత్రుమిత్రు లందరును సమానముగా దానిని వినుటకు అర్హులైయున్నారు.

## 2.11

**శ్రీభగవానువాచ**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితా: ॥**

### అనువాదము

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను: ప్రజ్ఞను గూడిన పలుకులను పలుకుచునే నీవు దుఃఖింపదగని విషయమును గూర్చి దుఃఖించుచున్నావు. జీవించియున్నవారిని గూర్చిగాని, మరణించిన వారిని గూర్చి గాని పండితులైనవారు శోకించరు.**

### భాష్యము

భగవానుడు వెంటనే గురుస్థానమును స్వీకరించి శిష్యుని పరోక్షముగా మూర్ఖుడని పిలుచుచు గట్టిగా మందలించెను. భగవానుడిట్లు పలికెను: "నీవు పండితుని వలె భాషిస్తున్నావు. కాని నిజముగా పండితుడైనవాడు అనగా దేహమును మరియు ఆత్మను గూర్చి ఎరిగినవాడు, దేహము యొక్క ఏ స్థితిని గూర్చియు (జీవించియున్న స్థితియందు

గాని, మృత స్థితియందు గాని) శోకింపడని నీవెరుగవు." తదుపరి అధ్యాయములందు వివరింపబడునట్లుగా, భౌతిక పదార్థము, ఆధ్యాత్మిక (జీవ) పదార్థము మరియు ఆ రెండింటిని నియంత్రించువానిని గూర్చి ఎరుగుటయే జ్ఞానము. అర్జునుడు రాజకీయములు లేదా సాంఘిక ఆచార విషయములకంటెను, మతధర్మ నియమములకే అధిక ప్రాధాన్యమివ్వవలెనని వాదించెను. కాని భౌతిక పదార్థము, ఆత్మ, భగవానుని గూర్చిన జ్ఞానము మత ధార్మిక నియమములకంటెను మరింత ప్రధానమైనదని అతడెరుగ కుండెను. అట్టి జ్ఞానము లోపించుటచేత అతడు తనను తాను గొప్ప ప్రజ్ఞావంతునిగా ప్రదర్శించుకొంటూ భాషించి యుండకూడదు. అతడు సహజముగా గొప్ప పండితుడు కాకపోవుటచే అతడు విచారింపదగని విషయమును గూర్చి విచారించుచుండెను. దేహము ఒకప్పుడు పుట్టును, అది నేడు గాని రేపు గాని నశింపక తప్పదు. కనుకనే దేహము ఆత్మవలె ముఖ్యమైనది కాదు. ఇది ఎరిగిన వాడే నిజమైన పండితుడు. అట్టివానికి భౌతికదేహము ఏ స్థితి యందున్నను దుఃఖకారణము కాజాలదు.

## 2.12

**న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపా: ।**
**న చైవ న భవిష్యామ: సర్వే వయమత: పరమ్ ॥**

## అనువాదము

**నేనుగాని, నీవు గాని, ఈ రాజులందరుగాని నిలిచియుండని సమయమేదియును లేదు. ఇక ముందు భవిష్యత్తు నందు మనమెవ్వరము ఉండకపోము.**

## భాష్యము

వేదములందును, 'కఠోపనిషత్తు' నందును, 'శ్వేతాశ్వతరోపనిషత్తు' నందును అసంఖ్యాకులైన జీవులను, వారి వ్యక్తిగతమైన కర్మలను, కర్మఫలములననుసరించి, వారి వివిధ స్థితుల ననుసరించి దేవాదిదేవుడు వారిని పోషించుచుండునని చెప్పబడియున్నది. దేవాదిదేవుడు ప్రతిజీవి హృదయము నందు తన స్వరూపాంతర రూపమున నెలకొనియుండును. బాహ్యాంతరములలో భగవానుని దర్శింపగలిగిన సాధుపురుషులు మాత్రమే సంపూర్ణమును మరియు శాశ్వతమునైన శాంతిని విజయముగా పొందుచున్నారు:వ్యక్తిత్వమును

నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానామ్ ఏకో బహూనాం యో విదధాతి కామాన్
తమాత్మస్థం యే సుపశ్యన్తి ధీరాస్తేషాం శాన్తి: శాశ్వతీ నేతారేషామ్
( కఠోపనిషత్తు 2.2.13)

అర్జునునకు తెలుపబడిన ఈ వైదిక సత్యము వాస్తవమునకు జ్ఞానరహితులైనను గొప్ప జ్ఞానవంతులుగా నటించు జనులందరి కొరకై చెప్పబడినది. తానును, అర్జునుడు మరియు యుద్ధరంగమున సమకూడిన రాజులందరును నిత్యులైన జీవులనియు మరియు బద్ధావస్థలోను, ముక్తావస్థలోను వ్యక్తిగత జీవులందరికిని తానే శాశ్వత పోషకుడనియు భగవానుడిక్కడ స్పష్టముగా చెప్పుచున్నాడు. దేవాదిదేవుడే పరమ పురుషుడు. భగవానుని శాశ్వత సహచరుడైన అర్జునుడును అక్కడ సమకూడిన రాజులందరును శాశ్వతులైన వ్యక్తిగత ఆత్మలు. వారు భూతకాలమున ఏ సమయమందును వ్యక్తిగత జీవులుగా ఉండకపోలేదు. ఇక ముందు కూడా శాశ్వత

వ్యక్తిగత ఆత్మలుగా ఉండకపోరు. అనగా వారి వ్యక్తిత్వము భూతకాలమునందు నిలిచియుండెను, భవిష్యత్తునందును కూడ ఎట్టి అవరోధము లేకుండా నిరంతరము కొనసాగనున్నది. కనుక ఎవరి కొరకును శోకించుటకు ఎట్టి కారణము లేదు.

మోక్షానంతరము జీవాత్మ మాయాచ్ఛాదన నుండి బయటపడి నిరాకార బ్రహ్మము నందు లీనమై తన వ్యక్తిత్వమును కోల్పోవునని పలుకు మాయావాద సిద్ధాంతమును పరమ ప్రామాణికుడైన శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ సమర్థించుట లేదు. అట్లే జీవుని వ్యక్తిత్వము కేవలము బద్ధస్థితియందు మాత్రమే నిలిచియుండునను సిద్ధాంతము కూడ ఇక్కడ సమర్థింపబడుటలేదు. ఉపనిషత్తులందు నిర్ధారింపబడినట్లు భగవానుని వ్యక్తిత్వము మరియు ఇతరులందరి వ్యక్తిత్వము కూడ భవిష్యత్తునందు శాశ్వతముగా కొనసాగునని శ్రీకృష్ణుడు స్పష్టముగా తెలియజేయుచున్నాడు. మాయాతీతుడైనందున శ్రీకృష్ణుని ఈ వచనము గొప్ప ప్రామాణికమైనది. ఇక్కడ శ్రీకృష్ణుడు తెలిపిన జీవుని వ్యక్తిత్వము భౌతికమే గాని ఆధ్యాత్మికము కాదని మాయావాదులు వాదింపవచ్చును. ఒకవేళ జీవుని వ్యక్తిత్వము భౌతికమనెడి ఆ వాదనను అంగీకరించినను శ్రీకృష్ణభగవానుని వ్యక్తిత్వము నందలి భేదమును ఎట్లు గుర్తింపగలము? శ్రీకృష్ణుడు తాను గతమునందు ఉంటిననియు మరియు భవిష్యత్తునందు కూడ ఉందుననియు స్పష్టముగా నిర్ధారించి తెలిపెను. అతడు తన వ్యక్తిత్వమును అనేక విధములుగా నిరూపించి యుండెను. అంతేకాకుండ నిరాకారబ్రహ్మము అతనికి లోబడి యుండునని ప్రకటింపబడినది. ఈ విధముగా శ్రీకృష్ణుడు తన ఆధ్యాత్మిక వ్యక్తిత్వమును సర్వదా కొనసాగించుచుండును. ఒకవేళ అతనిని సాధారణ బద్ధజీవునిగా అంగీకరించినచో ప్రామాణిక ధర్మ శాస్త్రముగా అతని భగవద్గీతకు విలువయే ఉండదు. మానవ సహజమైన నాలుగురకాల దోషములతో కూడియుండెడి సామాన్య మానవుడు శ్రవణదాయకమైన బోధనల నెన్నడును బోధింపజాలడు. భగవద్గీత అనునది అట్టి సాహిత్యములన్నింటికిని అతీతమైన శాస్త్రము. భౌతిక గ్రంథమేదియును భగవద్గీతకు సాటిరాదు. కాని ఎవ్వరైనను శ్రీకృష్ణభగవానుని సామాన్య మానవుడని భావించినచో వెంటనే అది తన ప్రాముఖ్యతను కోల్పోవును. ఈ శ్లోకమునందు పేర్కొనబడిన బహుత్వము అనునది వ్యవహారికమనియు, అది దేహములకు సంబంధించినదనియు మాయావాదులు వాదించుదురు. కాని ఈ శ్లోకమునందు ఇది వరకే దేహాత్మబుద్ధి ఖండించబడినది. జీవుల దేహాత్మ బుద్ధిని ఖండించిన పిదప దేహమును గూర్చిన వ్యవహారిక భావనే శ్రీకృష్ణుడు శ్రీకృష్ణుడు ఎందుకు ప్రతిపాదించును? అనగా ఇక్కడ వ్యక్తుల వ్యక్తిత్వము ఆధ్యాత్మిక పరిధిలోనే ప్రస్తావింపబడినదని తెలియుచున్నది. దీనిని శ్రీరామానుజాచార్యులు వంటి గొప్ప ఆచార్యులందరూ సమర్థించి యున్నారు. కనుక భగవద్భక్తులచే ఆధ్యాత్మిక వ్యక్తిత్వము అవగతము చెసుకొనబడునని భగవద్గీతయందు పలుచోట్ల స్పష్టముగా పేర్కొనబడినది. శ్రీకృష్ణుని దేవాదిదేవత్వము పట్ల అసూయను కలిగియుండువారు ఈ గ్రంథమును అవగాహన చేసుకొనుటకు ప్రయత్నించుటమనునది రుచికొరకై తేనెటీగ తేనెసీసాను నాకిన చందముగానుండును. ఆ సీసా మూతను తెరవనిదే ఎవ్వరును తేనె రుచిని చూడలేరు. అట్లే గీతయందలి చతుర్థ అధ్యాయమునందు తెలుపబడినట్లు, శ్రీకృష్ణుని భక్తులైనవారికే భగవద్గీత మహిమ చక్కగా అవగాహన కాగలదు. ఇతరులెవ్వరును దీని రుచి చూడలేరు. భగవానుని ఉనికినే సందేహించు అసూయగ్రస్థులైన వ్యక్తులు గీతను స్పృశించుటకు కూడ సమర్థులు కాజాలరు. కనుకనే గీతయొక్క మాయావాద భాష్యము సంపూర్ణత్వమును తప్పుదారి పట్టించుటయే యగును. శ్రీచైతన్య మహాప్రభువు మాయావాద భాష్యము పఠింపరాదనియు, అట్టి మాయావాద తత్త్వమును అంగీకరించినవాడు నిజమైన గీతారహస్యమును అవగతము చేసుకొను శక్తినంతటిని కోల్పోవునని హెచ్చరించిరి. వ్యక్తిత్వమనునది అశాశ్వతమైన భౌతిక జగత్తునకు

సంబంధించినదైనచో భగవానుడు గీతను బోధింపనవసరమే లేదు. అనగా జీవుని మరియు భగవానుని వ్యక్తిత్వము నిత్యసత్యము. పైన పేర్కొనబడినట్లు ఈ విషయము వేదముల చేత సమర్థింపబడినది.

## 2.13

**దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।**
**తథా దేహాన్తరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి ॥**

## అనువాదము

**దేహధారి నిరంతరముగా ఈ దేహము నందు బాల్యము నుండి యౌవనమును, యౌవనము నుండి వృద్ధాప్యమును క్రమముగా పొందుచుండునట్లు జీవాత్మ కూడ మరణసమయమున మరొక దేహమును పొందును. అట్టి మార్పుచే ధీరుడెప్పుడును మోహము నొందడు.**

## భాష్యము

ప్రతిజీవుడును వ్యక్తిగత ఆత్మయైనందున, ఒకప్పుడు బాలుడిగను, ఒకప్పుడు యువకునిగను మరియొకప్పుడు వృద్ధునిగను వ్యక్తమగుచు ప్రతిక్షణము తన దేహమును మార్పుచుండును. అయినను ఆత్మ మాత్రము అక్కడే నిలిచియుండి ఎట్టి మార్పును పొందదు. ఈ జీవాత్మ చివరికి మరణసమయమున దేహమును మార్చి మరొక దేహమునకు పరిణామము చెందుచుండును. తదుపరి జన్మలో భౌతికమైన లేదా ఆధ్యాత్మికమైన మరొక దేహమును పొందుట నిశ్చయమగుటచే, అర్జునుడు తనకెంతో ప్రీతిపాత్రులైనట్టి భీష్మద్రోణుల మరణ విషయమున చింతింపనవసరము లేదు. అంతేకాకుండ, వారు తమ పాత దేహములను విడిచి నూతన దేహములను పొందుట ద్వారా నూతన శక్తిని పొందగలరని అతడు సంతోషింపవలెను. జీవితమున మానవుని కర్మననుసరించి వివిధములైన సుఖముల కొరకు లేదా దుఃఖముల కొరకు అట్టి దేహమార్పులు కలుగుచుండును. భీష్ముడు మరియు ద్రోణుడు ఇరువురును పుణ్యాత్ములైనందున తదుపరి జన్మమున తప్పక ఆధ్యాత్మిక దేహములను పొందనున్నారు లేదా కనీసము ఉన్నత సుఖముల కొరకై స్వర్గవాసులగుదురు. కనుకనే పైరెండింటిలో ఏ విధముగా జరిగినను చింతించుటకు కారణమేదియును లేదు.

జీవాత్మ, పరమాత్మ మరియు భౌతిక, ఆధ్యాత్మిక ప్రకృతులకు సంబంధించిన జ్ఞానమును పరిపూర్ణముగా కలిగియుండువాడు ధీరుడనబడును. అట్టివాడు దేహముల మార్పుచే ఎన్నడును మోహము నొందడు.

ఆత్మ ముక్కలుగా ఖండించుటకు వీలులేదనే ప్రతిపాదనను ఆధారముగా చేసుకుని పలుకు మాయావాదుల ఏకాత్మవాదమును (అద్వైతవాదమును) మనము ఏ మాత్రము అంగీకరింపబోము. అట్లు వివిధ ప్రత్యగాత్మలుగా ఖండింపబడుట పరమాత్మను మార్పునొందగల దానినిగా చేయును. ఇది పరమాత్మ మార్పురహితమనెడి సిద్ధాంతమునకు వ్యతిరేకము. భగవద్గీతయందు నిర్ధారింపబడినట్లుగా భగవానుని అంశలు నిత్యముగా (సనాతులు) నిలిచియుండి 'క్షరము'లుగా పిలువబడును. అనగా వారు భౌతిక ప్రకృతికి పతనమగు స్వభావమును కలిగియుందురు. ముక్తిని పొందినపిమ్మట కూడ జీవుడు అట్లే అంశరూపమున మిగిలియుండును. జీవాత్మ దేవాది

దేవునితో పాటు జ్ఞానమును, ఆనందమును అనుభవించుచు నిత్యజీవితమును కొనసాగించును. ప్రతివ్యక్తి దేహమునందు నెలకొని పరమాత్మగా పిలవబడు అంతర్యామికి బింబ ప్రతిబింబ సిద్ధాంతమును అన్వయింపవచ్చును. అతడు బద్ధజీవునికి భిన్నుడు. ఆకాశము నీటియందు ప్రతిబింబించినపుడు, ఆ ప్రతిబింబమునందు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు కూడ గోచరించును. నక్షత్రములను జీవుల తోడను, సూర్యుని లేక చంద్రుని పరమ పురుషునితో పోల్చవచ్చును. ఇక్కడ అర్జునుడు అంశ భూతుడైన జీవాత్మకు ప్రాతినిధ్యము వహించును. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు పరమాత్మయై యున్నాడు. చతుర్థపు అధ్యాయపు ఆరంభమున తెలియబడునట్లు, వారిరువరును సమానస్థితికి చెందినవారు కారు. అర్జునుడు కూడ శ్రీకృష్ణునితో సమాన స్థితి గలవాడైనచో లేదా శ్రీకృష్ణుడు అర్జునుని కంటెను ఉన్నత స్థితియందున్నవాడు కానిచో, వారిరువారి నడుమ గల ఉపదేశకుడు మరియు ఉపదేశము నొందువాడు అను సంబంధము అర్థరహితమగును. వారిరువరును కూడ మాయాశక్తిచే మోహితులైనచో అందులో ఒకరు గురువు, మరొకరు శిష్యుడగు అవసరమే లేదు. మాయాబంధములో చిక్కుకొనిన వారెవ్వరును ప్రామాణిక బోధకులుగా ఉండజాలరు. అట్టి ఉపదేశము నిరుపయోగమగును. కనుక ఇట్టి ప్రస్తుత పరిస్థితులలో మాయామోహితుడు, విస్మృతాత్ముడగు జీవుడైన అర్జునుని కంటెను దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఉన్నతస్థితి యందున్నట్లు అంగీకరింపబడెను.

## 2.14

**మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణసుఖదుఃఖదా: ।**
**ఆగమాపాయినో నిత్యాస్తాంస్తితిక్షస్వ భారత ॥**

## అనువాదము

**కుంతీపుత్రా! సుఖదుఃఖముల తాత్కాలికమైనట్టి రాకయు, కాలక్రమమున వాటి పోకయు శీతగ్రీష్మకాలముల రాకపోకల వంటివి. ఓ భరత వంశీయుడా! అవి ఇంద్రియానుభవముల వలన కలుగుచుండును. ఎల్లరును కలతనొందక వాటిని సహించుటను నేర్చుకొనవలెను.**

## భాష్యము

విద్యుక్త ధర్మమును చక్కగా నిర్వహించుటయందు సుఖదుఃఖముల తాత్కాలికమైన రాకపోకలను సహించుట మానవుడు నేర్చుకొనవలెను. వైదిక నియమముల ననుసరించి మాఘమాసము (జనవరి – ఫిబ్రవరి) నందు వాతావరణము అత్యంత చలిగా నుండినను తెల్లవారు ఝామునే స్నానమాచరింప వలెను. వైదిక నియమముల ననుసరించువాడు అట్లు స్నానమాచరించుటకు సంకోచింపడు. అట్లే, వేసవికాలమున అత్యంత వేడిగానుండు సమయమున అనగా మే, జూన్ మాసములలో కూడ స్త్రీలు వంటశాలలో వండుటకు సంకోచింపరు. వాతావరణముల వలన అసౌకర్యములు కలిగినప్పటికినీ మానవుడు తన విధ్యుక్త ధర్మమును నిర్వర్తింపవలెను. అట్లే యుద్ధము చేయుట క్షత్రియుల యొక్క ధర్మము. కనుక క్షత్రియుడు తన మిత్రునితో గాని, బంధువుతో గాని యుద్ధము చేయవలసి వచ్చినను తన విధ్యుక్త

ధర్మమునుండి తొలగిపోరాదు. జ్ఞానము మరియు భక్తివలననే మానవుడు మాయాబంధముల నుండి తనను విడిపించుకొనగలడు. కనుక ఆ జ్ఞాన స్థితికి ఎదుగుట కొరకై అతడు ధర్మనిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలననుసరింపవలెను.

ఈ శ్లోకమున అర్జునుని సంబోధించిన రెండు నామములకు ప్రాధాన్యము కలదు. అతనిని 'కౌంతేయ' అని సంబోధించుటవలన అతని తల్లి పక్షమున గల రక్త సంబంధమును, 'భారత' అని సంబోధించుట వలన అతని తండ్రి వైపున గల గొప్పతనమును సూచించును. ఈ విధముగా రెండు వైపుల నుండియు అర్జునుడు గొప్ప వారసత్వమును కలిగియున్నాడు. అట్టి వారసత్వము స్వధర్మనిర్వహణ యందు అతనికి గొప్ప బాధ్యతను కలిగించుచున్నందున అతడు యుద్ధమును నిరాకరించుటకు అవకాశము లేదు.

## 2.15

**యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమదుఃఖసుఖం ధీరం సో మృతత్వాయ కల్పతే ॥**

## అనువాదము

**పురుష శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! సుఖదు:ఖములచే కలతనొందక, ఆ రెండింటి యందును ధీరుడై నిలుచువాడు నిశ్చయముగ మోక్షమునకు అర్హుడగును.**

## భాష్యము

ఉన్నతమైన ఆధ్యాత్మికానుభూతిని పొందుటకు స్థిరనిశ్చయమును కలిగి, సుఖదుఃఖముల రాకపోకలను సమానముగా సహింపగలిగిన మానవుడే మోక్షమునకు వాస్తవముగా అర్హుడు.వర్ణాశ్రమ విధానమునందు నాల్గవ ఆశ్రమమైన సన్యాసము వాస్తవమునకు మిక్కిలి కష్టదాయకమైనది. అయినను జీవితమును పరిపూర్ణము చేసుకొనుటయందు నిశ్చయము కలిగినవాడు కష్టములెన్ని ఎదురైనను తప్పక సన్యాసాశ్రమమును స్వీకరించును. అట్టి కష్టములు సాధారణముగా గృహబంధములను త్రెంపుకొనవలసి యున్నందున కలుగుచుండును. కాని ఎవరైనను అట్టి కష్టములను సహింపగలిగినచో మానవుని ఆధ్యాత్మికానుభూతి పరిపూర్ణము కాగలదు. అట్లే, స్వీయవంశీయులతో లేదా ప్రియమైన వారితో యుద్ధము చేయుట కష్టమైనను, క్షత్రియునిగా అర్జునుడు ధర్మపాలన విషయమున దృఢనిశ్చయము కలిగి యుండవలెనని ఆదేశింపబడినది. శ్రీచైతన్య మహాప్రభువు ఇరువది నాలుగేండ్ల వయస్సునందు సన్యాసమును స్వీకరించెను. అతనిపైన ఆధారపడినట్టి యువతియైన భార్యను గాని వృద్ధురాలైన తల్లిని గాని చూచుటకు ఇతరులెవ్వరును లేరు. అయినను ఉన్నత ప్రయోజనము కొరకై సన్యాసమును స్వీకరించి, ఉన్నత ధర్మకార్యములను నిర్వహించుటయందు ధీరుడై నిలిచెను. భౌతిక బంధముల నుండి విముక్తిని సాధించుటకు అదియే మార్గము.

## 2.16

**నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సత:।**
**ఉభయోరపి దృష్టో౽న్తస్త్వనయోస్తత్త్వదర్శిభి: ॥**

## అనువాదము

**అసత్తునకు(భౌతిక దేహము) ఉనికి లేదనియు మరియు నిత్యమైనదానికి (ఆత్మ) మార్పులేదనియు సత్యద్రష్టలైనవారు నిశ్చయించి యున్నారు. ఈ రెండింటి తత్త్వమును బాగుగా పరిశీలించి వారీ విషయమును ధ్రువీకరించిరి.**

## భాష్యము

మార్పుచెందు దేహమునకు ఉనికి లేదు. దేహమునందలి వివిధ జీవకణముల క్రియా ప్రతిక్రియలచే దేహము ప్రతిక్షణము మార్పునకు లోనగుచున్నదని ఆధునిక వైద్య శాస్త్రము కూడ అంగీకరించుచున్నది. ఈ విధముగా దేహము నందు పెరుగుదల మరియు వృద్ధాప్యములు కలుగుచున్నవి. కాని ఎల్లప్పుడు మనస్సు మరియు దేహమునందు అట్లు ఎన్ని మార్పులు కలిగినను ఆత్మ మాత్రము ఎట్టి మార్పు లేకుండా శాశ్వతముగా నిలిచియుండును. అదియే భౌతిక పదార్థమునకు మరియు జీవపదార్థమునకు నడుమ గల భేదము. స్వభావరీత్యా దేహము నిత్యపరివర్తనము చెందుచుండును, ఆత్మ శాశ్వత లక్షణమును కలిగియుండును. అన్ని తరగతుల సత్యద్రష్టలచే నిరాకారవాదులు మరియు సాకారవాదులైన ఇరువరిచే ఈ విషయము ధ్రువీకరింపబడినది. విష్ణువు మరియు అతని ధామములన్నీ కూడ స్వయంప్రకాశముతో కూడిన ఆధ్యాత్మిక స్థితిని కలిగియున్నట్లు(జ్యోతీంషి విష్ణుర్భువనాని విష్ణు:)'విష్ణుపురాణము' (2.12.38) నందు చెప్పబడినది. అనగా 'సత్తు', 'అసత్తు' అను పదములు రెండును వరుసగా ఆత్మ మరియు భౌతికపదార్థములనే సూచించుచున్నవి. ఇది సత్యద్రష్టలందరి అభిప్రాయము.

అజ్ఞాన ప్రభావముచే కలతనొందిన జీవులకు శ్రీకృష్ణ భగవానుడు ఒసగిన ఉపదేశమునకు ఆరంభమిదియే. అర్చకుడు మరియు అర్చనీయ భగవానుని నడుమ గల నిత్యసంబంధమును పున: స్థాపించుట, భగవానుడు మరియు అతని అంశలైన జీవుల నడుమగల భేదమును పరిపూర్ణముగా అవగాహన చేసుకొనుట అను అంశములతో కూడియుండును. భగవానుడు మరియు తనకు నడుమ గల భేదము సంపూర్ణతకును మరియు అంశమునకు నడుమ గల సంబంధము వంటిదని తెలిసి, తనను గూర్చి సంపూర్ణాధ్యయనము కావించుట ద్వారా మానవుడు భగవత్తత్త్వమును గ్రహింపగలుగును. 'వేదాంత సూత్రము' లందు మరియు శ్రీమద్భాగవతము నందు సమస్త సృష్టికి శ్రీకృష్ణభగవానుడే మూలమని అంగీకరింపబడినది. ఉన్నత మరియు న్యూనప్రకృతుల ద్వారా అట్టి సృష్టి వ్యక్తమగుచుండును. సప్తమాధ్యాయమున తెలుపబడనున్నట్లు జీవుడు ఉన్నత ప్రకృతికి చెందినవాడైయున్నాడు. శక్తి మరియు శక్తిమంతునికి నడుమ భేదము లేకపోయినను, శక్తిమంతుడు దివ్యుడనియు మరియు శక్తి లేక ప్రకృతి యనునది అతని ఆధీనమునందుండునదనియు అంగీకరింపబడినది. కనుకనే యజమాని మరియు సేవకుల విషయము వలె లేదా గురువు మరియు శిష్యుల విషయము వలె జీవులందరును సదా శ్రీకృష్ణభగవానుని ఆధీనము నందుందురు. అజ్ఞానము నందున్నంత కాలము అట్టి స్పష్టమైన జ్ఞానమును పొందుట అసంభవము. అట్టి

అజ్ఞానమును తొలగించి శాశ్వతముగా సర్వకాలజనుల జ్ఞానాభివృద్ధి కొరకే శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతను బోధించుచున్నాడు.

## 2.17

**అవినాశి తు తద్విద్ధి యేనసర్వమిదం తతమ్ ।
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥**

### అనువాదము

**శరీర మందంతటను వ్యాపించియున్న ఆత్మ నాశనము లేనిదని నీవు తెలిసికొనుము. అట్టి అవినాశియైన ఆత్మను నశింపజేయుటకు ఎవ్వడును సమర్థుడు కాడు.**

### భాష్యము

ఈ శ్లోకము దేహమంతటా వ్యాపించియున్నటువంటి ఆత్మయొక్క నిత్య తత్త్వమును మరింత స్పష్టముగా వివరించుచున్నది. దేహమందంతటను వ్యాపించియున్న దానిని ఎవ్వరైనను గ్రహింపగలరు. అదియే చైతన్యము. కనుకనే సంపూర్ణదేహము నందు లేక ఏదైన ఒక భాగమునందు కలుగు సుఖదుఃఖములను ప్రతియొక్కరు ఎరుగగలుగుచున్నారు. కాని ఈ చైతన్యము యొక్క వ్యాప్తి శరీర అంతర్భాగమునకు మాత్రమే పరిమితమై యున్నది. ఒక దేహము పొందు సుఖదు:ఖములు మరొక దేహమునకు తెలియవు. కనుకనే ప్రతిదేహము ఒక ప్రత్యేక జీవాత్మ యొక్క ఆచ్ఛాదనమై యున్నది. అట్టి దేహమునందు ఆత్మయొక్క ఉనికి చైతన్యము ద్వారా అనుభూతమగును. ఈ ఆత్మ కేశాగ్రము నందలి పదివేలవవంతు పరిణామము కలదిగా వర్ణింపబడినది. 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (5.9) దీనిని ఇట్లు సమర్థించుచున్నది :

బాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ
భాగో జీవ: స విజ్ఞేయ: స చానన్త్యాయ కల్పతే

"కేశాగ్రమును వంద భాగములుగా విభజించి, మరల ఒక్కొక్క భాగమును వందేసి భాగములుగా విభజించినచో అట్టి ఒక భాగపు పరిమాణమును ఆత్మ కలిగియుండును."

అట్టి విషయమే శ్రీమద్భాగవతము (10.87.30) నందు శ్రీధరస్వామి భాష్యములో ఇట్లు చెప్పబడినది :

కేశాగ్రశతభాగస్య శతాంశ: సాదృశాత్మక:
జీవ: సూక్ష్మస్వరూపోయం సంఖ్యాతీతో హి చిత్కణ:

"కేశాగ్రము యొక్క పదివేలవ భాగమంత పరిమాణము గల ఆధ్యాత్మిక చిత్ కణములు అసంఖ్యాకములుగా గలవు."

ఆధ్యాత్మిక అణువులైన ఆత్మలు భౌతికాంశముల కంటెను సూక్ష్మమై యున్నవి. అట్టి అణువులు అసంఖ్యాకములైనట్టివి. అట్టి సూక్ష్మమైన ఆధ్యాత్మిక విస్ఫులింగమే భౌతిక దేహమునకు మూలాధారము. ఔషదపు ప్రభావము దేహమంతటను వ్యాపించునట్లు అట్టి ఆధ్యాత్మిక విస్ఫులింగపు ప్రభావము దేహమంతటను

వ్యాపించియుండును. ఆత్మయొక్క ప్రభావము దేహమంతటను చైతన్య రూపమున అనుభూతమగు చుండును. అదియే ఆత్మ ఉనికికి నిదర్శనము. చైతన్యములేనట్టి భౌతిక దేహము మృత శరీరమనియు, ఎట్టి భౌతిక సాధనము ద్వారాను అట్టి దేహమున తిరిగి చైతన్యమును కలిగింపలేమనియు ఎంతటి అమాయకుడైనను ఎరుగును. కనుక చైతన్యము ఆత్మ వలననే కాని ఎట్టి భౌతిక మూలకణముల సమ్మేళనములచే కలుగజాలదు. 'ముండకోపనిషత్తు'(3.1.9) నందు అణు ఆత్మ పరిమాణము గూర్చి మరింత స్పష్టముగ వివరింపబడినది :

ఏషోఽనురాత్మా చేతసా వేదితవ్యో యస్మిన్ ప్రాణా: పంచధా సంవివేశ
ప్రాణైశ్చిత్తం సర్వమోతం ప్రజానాం యస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా

"అణు పరిమాణము గల ఆత్మ సంపూర్ణ జ్ఞానముచే గ్రహింపబడును. అణురూపమైన ఈ ఆత్మ 'ప్రాణ', 'అపాన', 'వ్యాన', 'సమాన', 'ఉదాన'ములు అను ఐదు విషయములైన వాయువులతో తేలుచు హృదయమున నెలకొనియుండి బద్ధ జీవుల దేహమునంతటను తన ప్రభావమును వ్యాపింప చేయుచుండును. ఐదురకాల భౌతిక వాయువుల కల్మషమునుండి ఆత్మ శుద్ధమైనప్పుడు దాని ఆధ్యాత్మిక ప్రభావము ప్రకటితమగును."

శుద్ధమైన ఆత్మను ఆవరించినట్టి పంచవాయువులను వివిధములైన ఆసనముల ద్వారా నిగ్రహించుట కొరకై హఠయోగ విధానము ఉద్దేశింపబడినది. అణుఆత్మను అట్టి భౌతికవాతావరణ బంధము నుండి విముక్తి కలిగించుట కొరకై అది నిర్దేశింపబడినది కాని భౌతిక ప్రయోజనము కొరకు కాదు.

ఈవిధముగా వేదవాఙ్మయ మంతటను అణురూపమైన ఆత్మ నిర్మాణము అంగీకరింపబడినది. అంతేకాకుండ, బుద్ధిమంతుడు అనుభవముతో దీనిని ప్రత్యక్షముగా గ్రహింపగలుగును. కేవలము బుద్ధి హీనుడు మాత్రమే అట్టి 'అణు' ఆత్మను సర్వ వ్యాపకమైన విష్ణుతత్త్వమని భావించును.

అణురూపమైన ఆత్మ ప్రభావము దేహమంతటను వ్యాపించి యుండును. 'ముండకోపనిషత్తు'(3.1.9) ననుసరించి, అణురూపమైన అట్టి ఆత్మ ప్రతిజీవి హృదయమునందును నెలకొని యుండును. ఈ ఆత్మ పరిమాణము అతి సూక్ష్మమై శాస్త్రజ్ఞుల దృష్టిపరిధికి అతీతమై యుండుట చేత, వారిలో కొందరు మూర్ఖముగా ఆత్మయే లేదని చెప్పుదురు. కాని వాస్తవమునకు ప్రతియొక్కరి హృదయమునందును అణురూపమైన ఆత్మ పరమాత్మతో కూడి నిశ్చయముగా నిలిచియున్నది. కనుకనే దేహపు ఈ భాగము నుండి దేహపు కదలికలకు అవసరమైన శక్తులన్నియు వెలువడుచున్నవి. ఊపిరితిత్తుల నుండి ప్రాణవాయువును గ్రహించు రక్తకణములన్నియు ఆత్మనుండియే శక్తిని గ్రహించును. ఆత్మ ఈ స్థితి నుండి వెడలినంతనే రక్తప్రసరణక్రియ ఆగిపోవును. రక్తకణముల ప్రాముఖ్యతను అంగీకరించిన వైద్యశాస్త్రము ఆత్మయే మూలమన్నది ఎరుగకున్నది. అయినను వైద్య శాస్త్రము దేహము యొక్క సర్వ శక్తులకు హృదయమే కూడలి స్థానమని అంగీకరించును.

పరమాత్మ యొక్క అట్టి అణురూప ఆత్మలు సూర్యకాంతి కణములతో పోల్చబడినవి. సూర్యకాంతి యందు ప్రకాశవంతము లైనట్టి అసంఖ్యాక కణములు గలవు. అట్లే, అణురూప ఆత్మలు ఆ భగవానుని నుండి వెలువడు కాంతిలో కణములై యున్నవి. వానిని 'ప్రభా' లేక ఉన్నత శక్తి అందురు. కనుక వేద విజ్ఞానము ననుసరించినను లేదా ఆధునిక విజ్ఞానము ననుసరించినను దేహమునందలి

ఆత్మయొక్క ఉనికిని ఎవ్వరును కాదనజాలరు. అట్టి ఆత్మను గూర్చిన విజ్ఞానము దేవాదిదేవునిచే భగవద్గీత యందు స్వయముగా వివరింపబడినది.

### 2.18

**అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తా: శరీరిణ: ।**
**అనాశినో ప్రమేయస్య తస్మాత్ యుధ్యస్వ భారత ॥**

## అనువాదము

**నాశనము లేనట్టియు, అపారమైనట్టియు, శాశ్వత మైనట్టియు అగు జీవాత్మ దేహము తప్పక నశించియే తీరును. కావున ఓ భరత వంశీయుడా! నీవు యుద్ధము చేయుము.**

## భాష్యము

భౌతిక దేహము స్వభావరీత్యా నశించు స్వభావము కలిగియున్నది. అది వెంటనే నశింపవచ్చును లేక వంద సంవత్సరముల పిదపైనను నశింపవచ్చును. కాలభేదము మాత్రమే గలదు. దానిని శాశ్వతముగా నిలుపుటకు అవకాశమే లేదు. కాని ఆత్మ అతి సూక్ష్మమైనదగుటచే అది శత్రువునకు కూడ గోచరింపదు. అప్పుడు దానిని చంపుటను గూర్చి వేరుగా చెప్పనవసరము లేదు. గతశ్లోకమునందు చెప్పబడినట్లు, అత్యంత సూక్ష్మమైన ఆత్మయొక్క పరిమాణమును కొలుచు పద్ధతిని ఎవ్వరును ఎరుగరు. అట్టి ఆత్మ ఎవరి చేతను చంపబడదు. కనుక దేహము కోరినంతకాలము గాని శాశ్వతముగా గాని రక్షింపబడదు. ఈ రెండు కోనములలో దేని ద్వారా చూచినను దుఃఖమునకు ఎట్టి కారణము లేదు. కర్మానుసారముగా అణు పరిమాణ ఆత్మ వివిధములైన దేహములను పొందుచుండును. కనుక ధర్మనియమములను మనమందరము తప్పక పాటింపవలసియున్నది. జీవుడు పరంజ్యోతి అంశమగుటచే 'వేదాంత సూత్రము' (2.3.26) నందు అతడు జ్యోతిస్వరూపుడుగా వర్ణింపబడినాడు. కనుకనే సూర్యకాంతి సమస్త జగత్తును పోషించునట్లుగా ఆత్మకాంతి ఈ దేహమును పోషించుచున్నది. అట్టి ఆత్మ దేహమును వీడినంతనే దేహము క్రుళ్ళుట నారంభించును. అనగా ఆత్మయే దేహమును పోషించుచున్నదని తెలియుచున్నది. దేహమునకు ఎట్టి ప్రాముఖ్యత లేదు. కనుకనే శ్రీకృష్ణుడు భౌతికమైన, దేహపరమైన ప్రయోజనముల కొరకై తమ విధ్యుక్త ధర్మములను త్యజింపక యుద్ధము చేయవలెనని అర్జునునికి ఆదేశించెను.

### 2.19

**య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥**

## అనువాదము

**జీవుడు చంపువాడని తలచువాడు, చంపబడువాడని తలచువాడు ఇరువరును అజ్ఞానులే! ఏలయన ఆత్మ చంపదు మరియు చంపబడదు.**

## భాష్యము

మారణాయుధములచే దేహధారియైన జీవుడు గాయపడినపుడు దేహమందలి జీవుడు మాత్రము చంపబడడని ఎరుగవలెను. రాబోవు శ్లోకముల ద్వారా వ్యక్తమగునట్లు, అత్యంత సూక్ష్మమైన అట్టి ఆత్మను వధించుట ఎట్టి ఆయుధముల చేతను సాధ్యపడదు. దాని ఆధ్యాత్మిక స్థితి కారణమున జీవాత్మ చంపదగినది కాదు. చంపబడునది లేదా చంపబడవలసినది కేవలము దేహము మాత్రమే. అనగా దీని ఉద్దేశ్యము దేహవధను ప్రోత్సహించుట కాదు. "మా హింస్యాత్ సర్వా భూతాని" అను వేదనియమము శాశించుచున్నది. దీనిననుసరించి, ఎవ్వరిని హింసింపరాదు. అట్లే జీవాత్మ చంపబడదని భావించుట కూడ జంతు హింసను ఎన్నడు ప్రోత్సహించుట కాదు. అధికారము లేకుండ ఎవ్వరి దేహమునైనను వధించుట అత్యంత హేయమైన కార్యము. అట్టి చర్య ప్రభుత్వ శాశనము ప్రకారము మరియు భగవానుని శాశనము ప్రకారము దండనీయమే కాగలదు. కాని ఏది ఏమైనను ఇక్కడ అర్జునుడు ధర్మము కొరకే శత్రుసంహారము నందు వినియోగింప బడుచుండెను గాని ఇచ్చానుసారముగా విపరీత తలంపుతో కాదు.

## 2.20

**న జాయతే మ్రియతే వా కదాచిన్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతో యం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥**

## అనువాదము

**ఆత్మకు ఎన్నడును జననము గాని, మరణము గాని లేదు. ఆత్మ జన్మింప లేదు, జన్మింపదు, జన్మింపబోదు. అది జన్మ రహితము, నిత్యము, శాశ్వతము, పురాతనము, దేహము చంపబడినను అట్టి ఆత్మ చంపబడదు.**

## భాష్యము

అణు పరిమాణ అంశయైనట్టి ఆత్మ భగవానునితో గుణైక్యమును కలిగినటువంటిది. దేహము వలె అది ఎట్టి మార్పునొందదు. కొన్నిసార్లు ఆత్మ స్థిరము లేదా 'కూతస్థ' మని పిలువబడును. దేహము ఆరు విధములైన మార్పులకు లోబడియుండును. అది తల్లి గర్భము నుండి జన్మించును, కొంత కాలముండును, వృద్ధియగును, ఇతరములను సృష్టించును, క్రమముగా క్షీణించును. చివరికి నశించి శాశ్వతముగా అంతర్ధానమగును. కాని ఆత్మ ఎన్నడును అట్టి మార్పులను పొందదు. ఆత్మ జననమును పొందదు. కాని ఆత్మ భౌతిక దేహమును స్వీకరించుట వలన దేహము జననము పొందుచున్నది. ఆత్మ ఎన్నడును జననము మరియు మరణమును పొందదు. జన్మించిన ప్రతిదానికి మరణము తప్పదు. ఆత్మకు జననము లేనందున భూత, భవిష్యత్తు, వర్తమానములు అనునవి దానికి లేవు. అది నిత్యము, శాశ్వతము, సనాతనము. అనగా చరిత్ర యందు ఆత్మ ఆవిర్భావమును సూచించు ఆధారము ఎక్కడ గోచరింపదు. దేహాత్మబుద్ధి చేత మనము ఆత్మ యొక్క జననాదుల విషయములను గూర్చి అన్వేషింతుము. నిత్యమైన ఆత్మ దేహము వలె ఎన్నడును వృద్ధాప్యమునొందదు. కనుకనే వృద్ధుడైనవాడు కూడ తన బాల్యము నందును లేదా యౌవనము నందును కలిగియున్న ఉత్సాహమునే కలిగియుండును. దేహమునందలి మార్పులు ఆత్మపై ప్రభావమును చూపవు. ఆత్మ

వృక్షము వలె మరియు ఏ ఇతర భౌతిక వస్తువు వలె గాని క్షీణింపదు. అది ఇతర జన్యములను కూడా సృష్టింపదు. దేహము ద్వారా సృష్టింపబడు సంతానము వాస్తవమునకు భిన్న జీవాత్మలే! కాని దేహమును కలిగియున్న కారణముగా వారు ఒక ప్రత్యేక వ్యక్తికి సంతానముగా గోచరింతురు. ఆత్మ ఉనికి చేతనే దేహము వృద్ధినొందుచున్నది. అయినను ఆత్మయందు మార్పులు లేదా దానినుండి ఇతర జన్యములు కాని ఉత్పత్తులు కావు. కనుకనే దేహమునకు కలిగెడి ఆరు మార్పులకు ఆత్మ అతీతమై యున్నది.

'కఠోపనిషత్తు' (1.2.18) నందు ఈ విషయమును పోలిన విషయమునే మనము చూడవచ్చును :

న జాయతే మ్రియతే వా విపశ్చిన్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్
అజో నిత్య: శాశ్వతో యం పురాణో న హన్యతే హన్యమానే శరీరే

ఈ శ్లోకము యొక్క భావము ప్రస్తుత గీతాశ్లోకపు భావముతో సమానమైననుదీనియందు 'విపశ్చిత్' అను పదము ప్రత్యేకముగా ప్రయోగింపబడినది. దానికి విద్వాంసుడు లేదా జ్ఞాని అని అర్థము.

ఆత్మయనునది జ్ఞానపూర్ణము లేదా సదా చైతన్య పూర్ణము. కనుక, చైతన్యము ఆత్మకు చిహ్నము. ఎవరైనను హృదయము నందు నెలకొనినట్టి ఆత్మను కనుగొన లేకపోయినను, చైతన్యవంతమైన ఆత్మ ఉనికి చేతనే వారు దానిని గుర్తింపవచ్చును. కొన్నిమార్లు మేఘముల కారణము చేత లేదా ఇతర కారణముల చేత ఆకాశమున సూర్యుని మనము చూడలేకపోవచ్చును. కాని సూర్యకాంతిని బట్టి అది పగటి సమయమని మనము విశ్వశించుదుము. తెల్లవారు ఝామున కొంత వెలుగు కనిపించినంతనే సూర్యుడు ఆకాశమున ఉదయించెనని మనము గ్రహింప గలుగుదుము. అట్లే, మానవుడైనను లేక జంతువైనను దేహము లన్నింటియందు చైతన్యముండుట చేతనే ఆత్మ ఉనికి మనకు తెలియుచున్నది. కాని, ఈ జీవచైతన్యము భగవానుని చైతన్యమునకు కొద్దిగా భిన్నమైనది. ఎందుకనగా, భగవానుని చైతన్యము భూత, భవిష్యత్తు, వర్తమాన సర్వజ్ఞానమై యుండగా, జీవ చైతన్యము విస్మరణ అను స్వభావమును కలిగియున్నది. జీవుడు తన నిజస్థితిని విస్మరించినపుడు దానిని పునరిద్ధరించు కొనుటకై శ్రీకృష్ణ భగవానుని ఉత్తమ బోధనలద్వారా జ్ఞానమును మరియు వికాసమును పొందగలడు. అంతేకాని విస్మరణ స్వభావము కలిగినట్టి జీవాత్మ వంటివాడు కాడు శ్రీకృష్ణభగవానుడు. లేనిచో అతని భగవద్గీత బోధనలు నిరుపయోగములగును.

అణు పరిమాణ ఆత్మ 'అణు ఆత్మ' మరియు పరమాత్మ 'విభు ఆత్మ' అని రెండు రకములైన ఆత్మలు కలవు. ఈ విషయము 'కఠోపనిషత్తు' (1.2.20) నందు ఈ క్రింది విధముగా నిర్ధారింపబడినది :

అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మాస్య జంతోర్నిహితో గుహాయామ్
తమక్రతు: ప్రశ్యతి వీతశోకో ధాతు: ప్రాసాదాన్మహిమానమాత్మన:

"జీవాత్మ మరియు పరమాత్మ లిరువరును దేహమనెడి ఒకే వృక్షముపై జీవుని హృదయమునందు నిలిచియున్నవి. భౌతిక వాంఛల నుండి శోకముల నుండి విముక్తుడైనట్టి వాడే పరమపురుషుని కృపచే పరమాత్ముని మహిమలను ఎరుగగలుగును."

రాబోవు అధ్యాయములందు తెలుపబడినట్లు, శ్రీకృష్ణ భగవానుడు పరమాత్మకు కూడ మూలకారణుడు. ఇక్కడ అర్జునుడు తన యథార్ధ స్వభావమును విస్మరించిన

‘అణు ఆత్మ’యై యున్నాడు. కనుక అతడు శ్రీకృష్ణుని నుండి లేదా అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నుండి ఆత్మవికాసము నొందవలసిన అవసరమున్నది.

## 2.21

**వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుష: పార్థ కం ఘాతయతి హన్తి కమ్ ॥**

### అనువాదము

**ఓ పార్థా! ఆత్మ నాశనము లేనిదనియు, శాశ్వతమైనదనియు, పుట్టుక లేనిదనియు, క్షయము లేనిదనియు తెలిసిన వ్యక్తి ఎవ్వరినేని ఎట్లు చంపును? లేదా ఎట్లు చంపించును?**

### భాష్యము

వాస్తవమునకు ప్రతి వస్తువునకును ఒక ప్రయోజనముండును. పరిపూర్ణ జ్ఞానము గల మానవుడు సరియైన ప్రయోజనము కొరకై ఏ వస్తువును ఎక్కడ ఎట్లు ఉపయోగింపవలెనో ఎరుగును. అట్లే హింసకు కూడ ప్రయోజనము గలదు. కాని దానిని ఎట్లు వినియోగింపవలెనను విషయము జ్ఞానవంతునిపై ఆధారపడి యుండును. హంతకునికి ఉరిశిక్ష విధించినను న్యాయమూర్తి నిందనీయుడు కాజాలడు. ఎందుకనగా, అతడు ఉరి శిక్ష అను హింసను న్యాయశాస్త్ర సూత్రములననుసరించియే అమలుపరుచును. హత్యచేసిన వానికి మరణదండనను విధింపవలెననియు, దానితో అతడు చేసిన ఘోరపాపమునకు మరుసటి జన్మలో దుఃఖితుడు కావలసిన అవసరము కలుగదనియు మనుధర్మ శాస్త్రమైన ‘మను సంహిత’ తెలుపుచున్నది. హత్యచేసిన వారికి రాజు ఉరిశిక్ష విధించుట నిజముగా ప్రయోజనకరమైనది. అట్లే శ్రీకృష్ణుడు యుద్ధము చేయుమని ఆజ్ఞాపించినపుడు అట్టి హింస పరమ ధర్మము కొరకేనని నిర్ధారింపవలసి యున్నది. ఈ విధముగా అర్జునుడు శ్రీకృష్ణుని కొరకై చేయబడు యుద్ధమున సంభవించు హింస యనునది హింస ఏమాత్రము కానేరదని ఎరిగి, అతడు అట్టి ఆదేశముల ననుసరింపవలెను. ఎందుకనగా వ్యక్తిని అనగా ఆత్మను చంపుట యనునది అసాధ్యము. కనుక న్యాయపరిపాలన కొరకై అట్టి నామమాత్ర హింస అంగీకరింపబడును. శస్త్రచికిత్స రోగిని బాగుచేయుటకే గాని చంపుటకు కాదు. కనుకనే శ్రీకృష్ణుని ఆదేశము ననుసరించి అర్జునుడు కావించు యుద్ధము పరిపూర్ణ జ్ఞానముతో కూడుకున్నది. కనుక దానియందు పాపఫలమునకు ఏ మాత్రము అవకాశము లేదు.

## 2.22

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥**

### అనువాదము

**మానవుడు జీర్ణవస్త్రములను విడిచి నూతన వస్త్రములను ధరించునట్లు, ఆత్మ జీర్ణమైన దేహములను విడిచి నూతన దేహములను గ్రహించుచున్నది.**

### భాష్యము

ఆత్మ దేహములను మార్చుననెడి విషయము అంగీకరింపబడిన సత్యము. ఆత్మ ఉనికిని విశ్వశింపని ఆధునిక విజ్ఞానశాస్త్రజ్ఞులు ఏ విధముగా హృదయము నుండి శక్తి కలుగునో వివరింపలేకున్నను, శైశవము నుండి బాల్యము వరకు, బాల్యము నుండి యౌవనము వరకు, యౌవనము నుండి వృద్ధాప్యము వరకు దేహమునందు కలిగే మార్పులను వారు అంగీకరింపక తప్పదు. వృద్ధాప్యము నుండి మరియొక దేహమునకు మార్పు అనునది జరుగును. ఈ విషయము ఇదివరకే పూర్వశ్లోకము (2.13) నందు వివరింపబడినది.

ఒక దేహము నుండి మరొక దేహమునకు ఆత్మయొక్క మార్పు పరమాత్మ కృపచేతనే సాధ్యమగుచున్నది. ఒక మిత్రుని కోరికను మరొక మిత్రుడు తీర్చునట్లు ఆత్మయొక్క కోరికను పరమాత్మ తీర్చును. 'ముండకోపనిషత్తు' వంటి వేద విభాగములను, 'శ్వేతాశ్వతరోపనిషత్తు' వంటివి జీవాత్మను మరియు పరమాత్మను ఒకే వృక్షముపై కూర్చున్న మిత్రపక్షులతో పోల్చినవి. ఆ రెండు పక్షులలో ఒకటి (ఆత్మ) వృక్షపు ఫలములను ఆరగించుచుండగా, మరొక పక్షి (శ్రీకృష్ణుడు) తన మిత్రుని గమనించుచుండును. ఈ రెండు పక్షులును గుణైక్యమును కలిగి యున్నప్పటికిని, అందులో ఒకటి భౌతిక వృక్షపు ఫలములచే ఆకర్షింపబడగా, రెండవది తన మిత్రుని కార్యములకు కేవలము సాక్షిభూతమగుచున్నది. ఇక్కడ శ్రీకృష్ణుడు సాక్షియైన పక్షి కాగా, అర్జునుడు ఫలమారగించు పక్షియై యున్నాడు. వారిరువరు మిత్రులేయైనను, ఒకటి ప్రభువు కాగా, రెండవది సేవకుడు. ఈ సంబంధమును విస్మరించుట చేతనే జీవాత్మ ఒక వృక్షము నుండి మరొక వృక్షమునకు లేదా ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పు చెందుటకు కారణమగుచున్నది. భౌతిక దేహమనెడి వృక్షముపై జీవాత్మ తీవ్రప్రయాసకు గురవుతుండును. కాని అది చెంతనే ఉన్నట్టి మిత్రుడైన మరొక పక్షిని (ఉపదేశము కొరకై అర్జునుడు శ్రీకృష్ణునికి స్వచ్ఛందముగా శరణుపొందునట్లు) పరమాచార్యునిగా అంగీకరించినంతనే సర్వ శోకములనుండి అది విముక్తినొందగలదు. 'ముండకోపనిషత్తు' (3.1.2) మరియు 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (4.2) రెండును కూడ ఈ విషయమును సమర్థించుచున్నవి :

సమానే వృక్షే పురుషో నిమగ్నో నీశయా శోచతి ముహ్యమాన:

జుష్టం యదా పశ్యత్యన్యమీశమస్య మహిమానమితి వీతశోక:

"రెండు పక్షులును ఒకే వృక్షముపై నున్నను ఫలమారగించు పక్షి ఫలభోక్తగా చింత మరియు దు:ఖములతో పూర్తిగా మునిగియుండును. కాని, ఆ పక్షి భగవానుడైనటువంటి

తన మిత్రుని వైపునకు ఏదియో ఒక విధముగా దృష్టిని సారించి అతని మహాత్మ్యమును ఎరుగగలిగినచో వెంటనే ఆ దుఃఖిత పక్షి సర్వ చింతలనుండి విముక్తమగును."

అర్జునుడు ఇప్పుడు తన శాశ్వత మిత్రుడైన శ్రీకృష్ణుని వంకకు తిరిగి, అతని నుండి భగవద్గీతను అవగాహన చేసుకొనుచున్నాడు. ఆ విధముగా అతడు ఉపదేశములను శ్రవణము చేయుట ద్వారా శ్రీకృష్ణభగవానుని మహాత్మ్యమును పూర్తిగా గ్రహించి శోకము నుండి దూరము కాగలడు.

పితామహుడు మరియు గురువుల దేహమార్పును గూర్చి చింతింపవలదని భగవానుడు అర్జునునకు ఇక్కడ ఆదేశించెను. వాస్తవమునకు, ధర్మ యుద్ధము నందు వారి దేహములను సంహరించుటకు అతడు ఆనందింపవలెను. ఎందుకనగా, ఆ విధముగా వారు తమ వివిధ దేహ కర్మల ద్వారా సంక్రమించిన పాపమును నశింపజేసికొనగలుగుదురు. యజ్ఞవేదికపై లేదా ధర్మ యుద్ధమునందు కాని తన దేహమును త్యజించినవాడు వెంటనే సమస్త దేహప్రతి ఫలకర్మల నుండి విముక్తుడై ఉత్తమజన్మ నొందును. కనుకనే అర్జునుని చింతకు ఎట్టి కారణము లేదు.

## 2.23

**నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావక: ।**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుత: ॥**

### అనువాదము

**ఆత్మ ఎట్టి ఆయుధముల చేతను ముక్కలుగా ఖండింపబడదు. అగ్నిచే దహింపబడదు. నీటిచే తడుపబడదు. వాయువుచే ఎండింపబడదు.**

### భాష్యము

ఖడ్గములు, ఆగ్నేయాశ్త్రములు, వారుణాశ్త్రములు, వాయువ్యాస్త్రములు వంటి ఏ ఆయుధములైనను ఆత్మను నశింపజేయలేవు. ఆధునికములైన అగ్ని అస్త్రములే కాకుండ భూమి, జలము, వాయువు, ఆకాశములతో తయారు చేయబడిన అస్త్రములు కూడ అనేకము గలవని తెలియుచున్నది. ఈనాటి అణ్వస్త్రములు కూడ ఆగ్నేయాస్త్రముల కోవకే చెందినవి. కాని, పూర్వము అన్ని రకములైన పంచభూతములతో అస్త్రములు చేయబడి యుండెడివి. ఆగ్నేయాస్త్రములను వారుణాశ్త్రములతో శాంతింపజేయుట వంటి ఆనాటి పద్ధతులు నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రమునకు తెలియవు. అంతేకాకుండ ఆధునిక శాస్త్రజ్ఞులకు వాయవ్యాస్త్రముల గూర్చి ఎట్టి జ్ఞానము లేదు. ఏది ఏమైనను, ఎన్ని ఆయుధములను ఉపయోగించినను (అవి ఎంతటి వైజ్ఞానికములైనను) ఆత్మ ముక్కలుగా ఖండింపబడదు లేదా నశింపబడదు.

ఏవిధముగా జీవాత్మ కేవలము అజ్ఞానముచే ఉనికిలోకి వచ్చి, పిదప మాయచే ఎట్లు మాయామోహితమయ్యెనో మాయావాదులు వివరింపజాలరు. అట్లే మూలమైన పరమాత్మ నుండి ఆత్మలను ఖండించుట యనునది సాధ్యపడు విషయము కాదు. వాస్తవమునకు, జీవాత్మలు పరమాత్ముని నుండి నిత్యముగా విడివడి యుండెడి అంశలు. నిత్యముగా (సనాతనముగా) విడివడియుండెడి అంశలైనందునే ఆత్మలు మాయచే ఆవరింపబడుటకు అవకాశమున్నది. అగ్నికణములు అగ్ని గుణమునే కలిగియున్నను

అగ్నినుండి విడివడినంతనే చల్లారిపోవు స్వభావమును కలిగియున్నట్లు, భగవానుని సాహచర్యము నుండి ఆ విధముగా ఆత్మలు విడివడగలవు. జీవులు శ్రీకృష్ణభగవానుని నుండి విడివడియున్న అంశలుగా (విభిన్నాంశలుగా) 'వరాహపురాణము' నందు వర్ణింపబడినది. భగవద్గీతననుసరించి కూడ అవి శాశ్వతముగా అట్లే నిలిచియుండును. కనుకనే మాయ నుండి విముక్తిని పొందినప్పుడు కూడ జీవుడు తన వ్యక్తిగత ఉనికిని కలిగియే యుండును. ఈ విషయమే అర్జునునకు భగవానుడు చేసిన ఉపదేశము ద్వారా విదితమగుచున్నది. శ్రీకృష్ణుని ద్వారా గ్రహించిన జ్ఞానముచేత అర్జునుడు ముక్తుడయ్యెను. అంతేకాని అతడు శ్రీకృష్ణునితో ఎన్నడును ఏకము కాలేదు.

## 2.24

**అచ్ఛేద్యో యమదాహ్యో యమక్లేద్యో శోష్య ఏవ చ ।**
**నిత్య: సర్వగత: స్థాణురచలో యం సనాతన: ॥**

## అనువాదము

**జీవాత్మ ఛేదించుటకు వీలులేనిది. నీటిలో కరిగించుటకు వీలులేనిది. దానిని దహించుట గాని ఎండించుట గాని శక్యము కాదు. అది నిత్యము, సర్వ వ్యాపకము, మార్పురహితము, అచలమును, సనాతనమును అయియున్నది.**

## భాష్యము

జీవాత్మ యొక్క ఈ లక్షణము లన్నియు దానిని పరమాత్ముని శాశ్వతమైన అణుఅంశగా నిరోపించుచున్నవి. అది ఎట్టి మార్పులేకుండా తన అణు రూపముననే శాశ్వతముగా నిలిచి యుండును. జీవాత్మ పరమాత్మతో ఐక్యము నొందుట యనునది ఆత్మ విషయమున ఊహింపరానిదైనందున అద్వైత సిద్ధాంతమును అన్వయించుట కుదరదు. భౌతిక సంపర్కము నుండి ముక్తినొందిన పిమ్మట అణు ఆత్మ దేవాదిదేవుని బ్రహ్మజ్యోతి నందు ఒక ఆధ్యాత్మిక కణముగా నిలిచిపోవుటను వాంఛింపవచ్చును. కాని, బుద్ధిమంతులైన జీవులు మాత్రము దేవాదిదేవుని సాహచర్యము ననుభవించుటకు ఆధ్యాత్మిక లోకములందు ప్రవేశింతురు.

ఇక్కడ 'సర్వగత' అను పదము మిక్కిలి ప్రధానమైనది. ఎందుకనగా జీవులన్నియు భగవానుని సృష్టిలో సర్వత్రా వ్యాపించి యున్నవి అనుటలో సందేహము లేదు. అవి భూమినందును, జలము నందును, వాయువు నందును, భూమి అడుగు భాగము నందును, చివరికి అగ్ని యందును నివసించును. జీవాత్మ అగ్నిచే దహింపబడదను విషయము ఇక్కడ స్పష్టముగా తెలుపబడినందున, అగ్నియందు జీవులు దగ్ధమైపోవుదురనెడి అభిప్రాయమును నిరాకరింపవచ్చును. కనుక సూర్యగ్రహమునందు కూడ జీవులు జీవించుదురనుటలో ఎట్టి సందేహము లేదు. అట్టి లోకమున అవి తగిన దేహములతో జీవించును. సూర్యమండలము నివాస యోగ్యము కానిచో 'సర్వగత' అను పదము అర్థరహితమగును.

## 2.25

**అవ్యక్తో యమచిన్త్యో యమవికార్యో యముచ్యతే।**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ॥**

## అనువాదము

**ఆత్మ అవ్యక్తము, అచింత్యము, మార్పు రహితమని చెప్పబడినది. ఈ విషయమును తెలిసికొనిన పిమ్మట దేహమును గూర్చి నీవు చింతింపరాదు.**

## భాష్యము

ఇదివరకే వివరింపబడినట్లు, ఆత్మ యొక్క పరిమాణము అత్యంత సూక్ష్మమైనట్టిది. శక్తిమంతమైన సూక్ష్మదర్శినితో కూడ ఆత్మను మనము చూడజాలము. కనుకనే అది అవ్యక్తము. జీవాత్మ యొక్క అస్తిత్వమునకు సంబంధించినంత వరకు శృతి లేదా వేదజ్ఞాన ప్రమాణము మినహా దానిని ఎవరును ప్రయోగాత్మకముగా నిర్ధారింపలేరు. అది అనుభవ భావనలో యథార్థమైనదైనను ఆత్మను తెలియుటకై ఇతర మార్గములు వేరేవియును లేనందున ఈ సత్యమును మనము అంగీకరింపవలసి యున్నది. కొన్ని విషయములను మనము ఉన్నత ప్రామాణికతపై ఆధారపడియే అంగీకరింపవలసి వచ్చును. ఉదాహరణకు, తల్లి యొక్క ప్రామాణికముపై ఆధారపడి ఎవరును తండ్రి ఉనికిని కాదనలేరు. అదేవిధముగా, ఆత్మను అవగతము చేసుకొనుటకు కేవలము వేదములను అధ్యయనము చేయుట తప్ప మరోమార్గము లేదు. మరోమాటలో, ఆత్మయనునది మానవ ప్రయోగాత్మక జ్ఞానము చేత అవగతము కానట్టిది. ఆత్మ చైతన్య స్వరూపము మరియు చైతన్య సహితమనియు వేదములందు తెలుపబడినది. ఆ విషయమును మనము అంగీకరింపవలెను. దేహమునందు మార్పులు జరుగునట్లుగా ఆత్మయందు మార్పులు సంభవింపవు. ఆత్మ శాశ్వతముగా అణుపరిమాణ స్వరూపమైయుండును. పరమాత్మ అనంతమైనది. జీవాత్మ అణువుకంటె అత్యంత సూక్ష్మమై యున్నది. కనుక సూక్ష్మమైన జీవాత్మ మార్పు లేనిదగుటచే అనంతమైన పరమాత్మతో లేక దేవాదిదేవునితో అది ఎన్నడును సమానము కాజాలదు. ఆత్మయొక్క మార్పురహిత స్థితిని సమర్థించుటకై ఈ సిద్ధాంతము వేదములందు వివిధరకములుగా మరల మరల చెప్పబడినది. ఒక విషయమును దోషరహితముగాను, పరిపూర్ణము గాను అవగాహనము చేసికొనుటకై దానిని మరల మరల వివరించుట అత్యంత అవసరము.

## 2.26

**అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।**
**తథాపి త్వం మహాబాహో నైనం శోచితుమర్హసి ॥**

## అనువాదము

**ఓ మహాబాహో! ఒకవేళ నీవీ ఆత్మ(లేక జీవలక్షణములు) ఎల్లప్పుడు జనించుచు, మరణించునని భావించినను దుఃఖించుటకు ఎట్టి కారణము లేదు.**

## భాష్యము

దేహమునకు భిన్నముగా ఆత్మకు ఒక ప్రత్యేక ఉనికి కలదని విశ్వసింపని బౌద్ధులవంటి తత్త్వవేత్తలు కొందరు కలరు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతను బోధించిన కాలమునందును 'లోకాయతికులు' మరియు 'వైభాషికులు' అని పిలువబడు కొందరు తాత్త్వికులు కలరు. అట్టి తాత్త్వికులు భౌతిక మూలకముల సరియైన సమ్మేళనము వలన జీవోత్పత్తి కలుగునని పలుకుదురు. నేటి ఆధునిక శాస్త్రవేత్తలు మరియు భౌతిక తాత్త్వికులు కూడా అట్లే భావింతురు. వారి సిద్ధాంతమునననుసరించి మూలకముల కలయికలో కొన్ని భౌతిక, రసాయనిక చర్యల వలన జీవ చిహ్నములు సంభవించును. ప్రస్తుత కాలమున అమెరికాలో ప్రచారము చెందుతున్న కొన్ని కుహనామతములు సహితము ఈ సిద్ధాంతమును భక్తిరహితమైన బౌద్ధుల శూన్యవాదమును అనుసరించుచున్నవి.

ఒకవేళ అర్జునుడు 'వైభాషిక' సిద్ధాంతమునందు వలె ఆత్మ ఉనికిని గుర్తింపజాలకున్నను దుఃఖించుటకు కారణము లేదు. ఎవ్వరును కొన్ని రసాయన వస్తువుల నష్టమునకు చింతిస్తూ విధ్యుక్త ధర్మమును విడనాడరు. పైగా, నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రమునందు మరియు వైజ్ఞానిక యుద్ధ విధానములందును శత్రువుపై విజయమును సాధించుటకు మానవుడు అనేక టన్నుల కొలది రాసాయనములను వృథా చేయుచున్నాడు. 'వైభాషిక' సిద్ధాంతము ననుసరించి, దేహముతో పాటు ఆత్మ కూడ నశించును. కనుకనే ఏ విధముగా చూచినను, అర్జునుడు ఆత్మ ఉనికిని గూర్చి వేద నిర్ణయమును విశ్వసించినను లేదా విశ్వసింపకపోయినను అతడు చింతించుటకు ఎట్టి కారణము లేదు. ఈ సిద్ధాంతముననుసరించి, ప్రతిక్షణము భౌతిక వస్తువుల నుండి అనేక జీవులు ఉత్పత్తియగుచు, వానిలో అనేకము ప్రతిక్షణము నశించుట చేతను అట్టి సంఘటనల విషయమున చింతింపనవసరము లేదు. కనుకనే ఆత్మకు పునర్జన్మ లేనిచో పితామహుడు మరియు గురువులను సంహరించుట చేత పాపఫలితములు కలుగునని అర్జునుడు భయము నొందనవసరము లేదు. ఈ సందర్భమున శ్రీకృష్ణుడు అర్జునుని 'మహాబాహో' అని వ్యంగ్యముగా సంబోధించుచున్నాడు. ఎందుకనగా, వేదమార్గమును పాటింపకున్నను కనీసము అర్జునుడు వేదజ్ఞానమును త్రోసిపుచ్చు 'వైభాషిక' సిద్ధాంతమును అంగీకరింపనందులకు భగవానుడట్లు పలికెను. క్షత్రియునిగా అర్జునుడు వైదిక సంస్కృతికి చెందినవాడు. కనుకనే ఆ సంస్కృతి అతనిని ఆ సిద్ధాంతములననుసరించువానిగా చేసినది.

## 2.27

**జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యే ర్థే న త్వం శోచితుమర్హసి ॥**

## అనువాదము

**పుట్టినవానికి మరణము తప్పదు మరియు మరణము పిదప జన్మము తప్పదు. అందుచే పరిహరించుటకు వీలులేని నీ విధ్యుక్త ధర్మ నిర్వహణము నందు నీవు దుఃఖింపరాదు.**

## భాష్యము

జీవితమునందలి కర్మలననుసరించి ఎవ్వరైనను తిరిగి జన్మింపవలసియున్నది. నిర్ణీత కాల కార్యములు ముగిసిన పిమ్మట మరణించి మరొక జన్మనొందవలసి యుండును. ఈ విధముగా, జననమరణ చక్రమున మానవుడు ముక్తి యనునది లేకుండా సంచరించుచున్నాడు. ఇట్టి జననమరణ చక్రము అనవసర హత్యలు, జంతుహింస, యుద్ధము వంటివానిని సమర్థింపదు. కాని అదే సమయమున, మానవ సంఘములో శాంతి భద్రతలను నెలకొల్పుటకై అట్టి హింసాయుతమైన యుద్ధములు అనివార్య అంశములు కాగలవు.

శ్రీకృష్ణ భగవానుని సంకల్పమగుటచే కురుక్షేత్ర సంగ్రామము అనివార్యమై యుండెను. అంతేకాకుండ ధర్మము కొరకై యుద్ధము చేయుట క్షత్రియుల విధ్యుక్త ధర్మము. తాను స్వధర్మమును నిర్వర్తించుచున్నప్పుడు అర్జునుడు ఎందుకు తన బంధువుల మరణమును గూర్చి చింతింపవలెను లేదా భయపడవలెను? క్షత్రియ ధర్మమును త్యజించినచో, తాను భయపడుచున్న పాపఫలములను అనుభవింపవలసి వచ్చును. అంతేకాకుండ స్వధర్మమైన యుద్ధమును విడనాడుట ద్వారా ఎన్నడును తన బంధువుల మరణమును ఆపలేడు. అధర్మ మార్గమును ఎంచుకొనుట చేత అతడు పతనము నొందవలసివచ్చును.

## 2.28

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥**

## అనువాదము

**సృజింపబడిన జీవులందరును ఆదిలో అవ్యక్తములై మధ్యలో వ్యక్తములగుచున్నవి. నశించిన పిమ్మట తిరిగి అవ్యక్తములగును. అట్టియెడ దుఃఖించుటకు కారణమేమి కలదు?**

## భాష్యము

ఆత్మ ఉనికిని విశ్వసించువారు మరియు విశ్వసింపనివారు అని రెండురకములు తత్త్వవేత్తలు గలరు. వీరిలో ఎవరిని అనుసరించినను దుఃఖించుటకు ఎట్టి కారణము లేదు. వేదవిజ్ఞానము ననుసరించి, ఆత్మ ఉనికి యందు విశ్వాశము లేనివారు నాస్తికులుగా పిలువబడుదురు. వాదము కొరకు ఈ నాస్తిక వాదమును మనము అంగీకరించినను దుఃఖమునకు ఎట్టి కారణము లేదు. ఆత్మ ప్రత్యేకమైన ఉనికిని కలిగియుండగా, సృష్టికి పూర్వము భౌతికంశములన్నియు అవ్యక్తములై యుండును. సూక్ష్మమైన ఈ అవ్యక్త స్థితినుండియే సృష్టి వ్యక్తమగును. ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటినుండి భూమి ప్రకటమగును. ఆ భూమి నుండి అనేకములు సృష్టింపబడుచున్నవి. ఒక పెద్ద ఆకాశసౌధమును ఉదాహరణగా తీసికొనినచో, అది భూమియొక్క పదార్థముల నుండియే వ్యక్తమగుచున్నది. దానిని పడగొట్టినప్పుడు అది తిరిగి అవ్యక్తమై దాని పదార్థములన్నీ కూడ చివరికి భూమిలో కలిసిపోవును. శక్తినిత్యత్వ నియమము ననుసరించి కాలక్రమమున వస్తువులు వ్యక్తములు, అవ్యక్తములగుచుండును. అదియే బేధము. కనుక వ్యక్తస్థితిని గూర్చి గాని

లేదా అవ్యక్తస్థితిని గూర్చి గాని దుఃఖించుట మెందులకు? అవ్యక్తస్థితియందు కూడ వాటికి నాశనము లేదు, ఆరంభమునందును మరియు అంతము నందును భౌతిక వస్తువులన్నియు అవ్యక్తములుగనే నిలిచియుండి మధ్యకాలమున వ్యక్తములగుచుండును. కాని అది ఎట్టి నిజమైన భేదమును కలుగజేయదు .

భగవద్గీత (2.18) యందు చెప్పబడినట్లు, భౌతిక దేహము కాలక్రమమున నశించు స్వభావము గలదనియు (అన్తవన్త ఇమే దేహా:), ఆత్మ నిత్యమైనదను (నిత్యస్యోక్తా: శరీరణ:) వేదసారాంశమును మనము అంగీకరించు చున్నప్పటికిని, ఈ దేహము ఒక వస్త్రము వంటిదని మనము నిరంతరము గుర్తుంచుకోవలెను. కనుకనే వస్త్రము యొక్క మార్పునకు ఎందులకు దుఃఖింపవలెను? నిత్యమైన ఆత్మతో పోల్చిచూచినప్పుడు భౌతికమైన దేహమునకెట్టి యథార్థమైన ఉనికి లేదు. అది ఒక విధమైన స్వప్నము వంటిది. కొన్నిమార్లు మనము స్వప్నమందు ఆకాశములో ఎగురుచున్నట్లు లేదా రాజు వలె ఒక రథమునందు కూర్చొనినట్లు గాంచవచ్చును. కాని మేల్కొనగానే మనము ఆకాశమున గాని, రథమునందు గాని లేమని గ్రహింపగలుగుదుము. భౌతికదేహముయొక్క అనిత్యతపై ఆధారపడి వైదిక విజ్ఞానము మానవుని ఆత్మానుభూతికి ప్రోత్సహించుచున్నది. కనుకనే ఎవరైనను ఆత్మ ఉనికిని విశ్వసించినను లేదా విశ్వసించక పోయినను దేహము నశించు విషయమున చింతించుటకు ఎట్టి కారణము లేదు.

## 2.29

**ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్ వదతి తథైవ చాన్య: ।**
**ఆశ్చర్యవచ్చైనమన్య: శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**

### అనువాదము

**కొందరు ఆత్మను అద్భుతమైన దానిగా గాంచుదురు. కొందరు దానిని అద్భుతమైన దానిగా వర్ణింతురు. మరికొందరు దానిని అద్భుతమైనదిగా విందురు. ఇంకొందరు వినిన పిమ్మటను దానిని గూర్చి ఏమాత్రము గ్రహింపకుందురు.**

### భాష్యము

గీతోపనిషత్తు ఉపనిషత్తుల సిద్ధాంతముల పైననే అధికముగా ఆధారపడియుండుటవలన ఈక్రింది శ్లోకము 'కఠోపనిషత్తు'(1.2.7) నందు గోచరించుట ఆశ్చర్యమును కలిగింపదు.

శ్రవణయాపి బహుభిర్ యో న లభ్య: శృణ్వన్తో పి బహవో యం న విద్యు:
ఆశ్చర్యో వక్తా కుశలో స్య లబ్ధా ఆశ్చర్యో స్య జ్ఞాతా కుశలానుశిష్ట:

అధికపరిమాణ దేహము గల జంతువునందు మరియు విస్తృతమైన మర్రివృక్షపు ఆకారమునందే కాకుండ, ఒక అంగుళమాత్ర ప్రదేశమున కూడా కోట్లాదిసంఖ్యలో ఇమిడియుండు సూక్ష్మజీవుల యందును ఆత్మ కలదనెడు యథార్థ విషయము ఎంతో అద్భుతమైనది. అల్పజ్ఞులు మరియు శ్రద్ధారహితులును ఇట్టి ఆత్మ యొక్క అద్భుతములను గ్రహింపకున్నారు. విశ్వము నందు తొలిజీవియైన బ్రహ్మదేవునకు కూడ

జ్ఞానము ప్రసాదించిన పరమ ప్రామాణికుడు పరమాచార్యుడైన శ్రీకృష్ణభగవానుడే స్వయముగా ఉపదేశించినను వారు ఆ విషయమును గ్రహింపజాలరు. కేవలము భౌతికభావనే కలిగియుండుట వలన ఎట్లు అణుపరిమాణ ఆత్మ అతిపెద్దదిగా మరియు అంత చిన్నదిగా కాగలుగున్నదో ఈ యుగపు జనులు ఊహింపజాలరు. కనుకనే వారు ఆత్మను నిర్మాణరీత్యా లేదా వర్ణనరీత్యా అద్భుతమైనదిగా భావించుదురు. భౌతికశక్తిచే మోహితులైన జనులు ఇంద్రియభోగ విషయములందే అధికముగా మునిగియుందురు. ఆత్మానుభూతిని పొందకున్నచో జీవన సంఘర్షణలో కర్మలన్నియును అంత్యమున ఓటమినే కలుగజేయుననుట వాస్తవమైనను వారు దానికొరకై సమయమును కేటాయింపరు. ప్రతియొక్కరు ఆత్మను గూర్చి తెలిసికొని తద్ద్వారా భౌతిక క్లేశములకు పరిష్కారము కనుగొనవలెనను ఆలోచనయే వారికి కలుగదు.

ఆత్మను గూర్చి వినగోరిన కొందరు సత్సాంగత్యమున ప్రవచనములను వినుచుందురు. కాని కొన్నిమార్లు అజ్ఞానము కొద్ది వారు ఆత్మ మరియు పరమాత్మలిరువురును ఒక్కటేననియు, వారిరువరి నడుమ పరిమాణము నందు కూడ భేదము లేదని భావించి తప్పుమార్గమును పట్టుచుందురు. ఆత్మ మరియు పరమాత్మల నిజస్థితిని, వారి కర్మలను, వారి నడుమగల సంబంధమును, వారికి సంబంధించిన సూక్ష్మస్థూల వివరములను సంపూర్ణముగా అవగాహన చేసుకొనగల మానవుడు అరుదు. ఇది ఇట్లుండగా ఆత్మజ్ఞానమునుండి సంపూర్ణ లాభమును పొంది, ఆత్మయొక్క స్థితిని వివిధ కోణముల ద్వారా వివరింపగలిగిన మహాత్ముడు మరింత మిక్కిలి అరుదు. కాని ఏదో ఒక విధముగా ఈ ఆత్మానుభూతిని గూర్చిన విషయమును మానవుడు అవగతము చేసుకొనినచో జీవితము పరిపూర్ణము కాగలదు.

ఇతర సిద్ధాంతములచే మార్గము తప్పకుండా పరమ ప్రామాణికుడైన శ్రీకృష్ణభగవానుడు పలికిన గీతావాక్యములను యథాతథముగా అంగీకరించుటయే ఆత్మను గూర్చిన అవగాహనకు గల అత్యంత సరళమైన మార్గము. కాని శ్రీకృష్ణభగవానుని దేవాదిదేవునిగా అంగీకరించుటకు ముందు మానవుడు ఈ జన్మయందు గాని లేదా పూర్వజన్మనందు గాని అధికమైన తపస్సు మరియు త్యాగము చేసియుండవలెను. శుద్ధభక్తుని అవ్యాజకృప చేతనే శ్రీకృష్ణుడు యథాతథముగా అవగతమగును. దానికి మరియొక మార్గము లేదు.

## 2.30

**దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥**

## అనువాదము

**ఓ భరతవంశీయుడా! దేహమందు వసించు దేహి ఎన్నడును చంపబడదు. కావున ఏ జీవిని గూర్చియు నీవు దుఃఖింపనవసరము లేదు.**

## భాష్యము

మార్పులేని ఆత్మను గూర్చి బోధించు భాగమును ఇప్పుడు శ్రీకృష్ణభగవానుడు ముగించుచున్నాడు. అనశ్వరమైన ఆత్మను గూర్చి అనేక విధములుగా వర్ణించుచు ఆత్మ నిత్యమైనదనియు, దేహము తాత్కాలికమైనదనియు భగవానుడు నిరూపించెను. కనుక

పితామహుడైన భీష్ముడు మరియు గురువు అయినట్టి ద్రోణుడు యుద్ధమున మరణింతురని భయముతో క్షత్రియుడైన అర్జునుడు యుద్ధమును విడువరాదు. శ్రీకృష్ణుని ప్రామాణికతపై ఆధారపడి దేహమునకు అన్యముగా ఆత్మ కలదని ప్రతియొక్కరు విశ్వసింపవలెను. ఆత్మయనునది లేనేలేదనియు లేదా రసాయన వస్తువుల పరస్పర కలయికతో ఏర్పడు ఒకానొక స్థితిలో జీవము పుట్టుననియు భావింపరాదు. ఆత్మ నిత్యమైనను, హింసను ఎన్నడును ప్రోత్సహింపరాదు. కాని యుద్ధసమయమున దాని నిజమైన అవసరము కలిగినపుడు మాత్రము దానిని త్యజింపరాదు. అట్టి అవసరమును యథేచ్ఛగా కాకుండ భగవానుని ఆదేశము పైననే సమర్థింపవలెను.

## 2.31

**స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితుమర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయో న్యత్ క్షత్రియస్య న విద్యతే ॥**

### అనువాదము

**క్షత్రియునిగా నీ స్వధర్మము ననుసరించి ధర్మానుగుణమైన యుద్ధము చేయుటకంటెను మేలైనది మరియొకటి లేదని నీవు గ్రహింపవలెను. అందుచే నీవీ విషయమున సంశయింపనవసరము లేదు.**

### భాష్యము

వర్ణాశ్రమములకు సంబంధించిన నాలుగు వర్ణములలో సత్పరిపాలనకు సంబంధించిన రెండవ వర్ణమునకు క్షత్రియ వర్ణమని పేరు. 'క్షత్' (క్షత్రము) అనగా హాని. హాని నుండి రక్షించువాడు కనుక క్షత్రియుడని పిలువబడును ('త్రాయతే' అనగా రక్షించును). సాధారణముగా అడవిలో క్రూరజంతువులను చంపుటకు క్షత్రియులకు శిక్షణ ఇవ్వబడును. క్షత్రియులు అడవికి వెళ్ళి ఒంటరిగా పులిని ముఖాముఖి ఎదిరించి ఖడ్గసహాయముతో పోరాడును. ఆ పులి మరణించినచో దానికి రాజలాంఛనములతో దహనక్రియలు జరుపబడును. ఇప్పటికిని రాజస్థాన్ రాష్ట్రము జైపూరు నందలి క్షత్రియ వంశరాజులచేత ఈ విధానము అనుసరించబడుచున్నది. కొన్నిసార్లు ధర్మముకొరకై హింస యనునది అవసరమగు చుండుటచేత క్షత్రియులను ఎదిరించి చంపుటకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడును. కనుకనే క్షత్రియులు నేరుగా సన్యాసాశ్రమమును గ్రహించుటకు ఉద్దేశింపబడలేదు. రాజకీయములందు 'అహింస' యనునది ఒక తంత్రము కావచ్చునేమో గాని అది ఎన్నడును ఒక సిద్ధాంతము కాదు. కనుకనే ధర్మశాస్త్ర గ్రంథములందు ఈ క్రింది విధముగా తెలుపబడినది :

అహవేషు మిథోన్యోన్యం జిఘాంసన్తో మహీక్షిత:

యుద్ధమానా: పరం శక్త్యా స్వర్గం యాన్త్యపరాఙ్ముఖా:

(మనుస్మృతి 7.89)

యజ్ఞేషు పశవో బ్రాహ్మన్ హన్యన్తే శతతం ద్విజై:

సంస్కృతా: కిల మన్త్రైశ్చ తేపి స్వర్గమవాప్నువన్

(మహాభారతము 3.199.93)

"యాగాగ్నిలో పశువులను హోమము చేయుట ద్వారా బ్రాహ్మణులు స్వర్గలోకములను పొందునట్లు, శత్రురాజులతో యుద్ధరంగమున పోరాడుతూ మరణించునట్టి రాజు లేదా క్షత్రియుడు స్వర్గలోకములను పొందుటకు అర్హుడగును."

కనుక ధర్మము కొరకై యుద్ధరంగమున చంపుట మరియు యాగాగ్నిలో పశువులను హోమము చేయుట ఏమాత్రము హింసాయుత కార్యక్రమములుగా భావింపబడవు. ఎందుకనగా, ధర్మ సూత్రముల వలన ప్రతియొక్కరికి లాభమే కలుగగలదు. ఒక దేహము నుండి మరొక దేహమును పొందుట అను పరిణామ పద్ధతి లేకుండగనే యజ్ఞమునందు వధింపబడిన జంతువు వెంటనే ఉత్తమమైన మానవ జన్మను నేరుగా పొందును. అట్లే యజ్ఞములు అనుసరించు బ్రాహ్మణులు స్వర్గలోకములను పొందునట్లుగా, యుద్ధమునందు మరణించిన క్షత్రియులు కూడ స్వర్గలోకములను పొందుదురు.

'స్వధర్మము' రెండు రకములు : ముక్తిని పొందనంత వరకు మానవుడు తాను పొందినట్టి ప్రత్యేక దేహమునకు అనుగుణమైన ధర్మసూత్రములననుసరించి ముక్తిని పొందుట కొరకే విధ్యుక్త ధర్మములను నిర్వర్తింపవలెను. ముక్తిని పొందిన పిమ్మట 'స్వధర్మము' దేహాత్మబుద్ధికి సంబంధించినది కాకుండ ఆధ్యాత్మికము కాగలదు. దేహాత్మబుద్ధిని కలిగియున్నంత కాలము బ్రాహ్మణులకు మరియు క్షత్రియులకు ప్రత్యేకమైన స్వధర్మములు కలవు. ఈ స్వధర్మములు అనివార్యములు. వాస్తవమునకు స్వధర్మము భగవానునిచే నిర్ణయింపబడును. ఈ విషయము చతుర్థ అధ్యాయమునందు వివరింపబడును. దేహాత్మ బుద్ధితో చేయబడెడి 'స్వధర్మము' వర్ణాశ్రమ ధర్మమనబడును. ఇది మానవుని ఆధ్యాత్మిక అవగాహనకు సోపానము వంటిది. వర్ణాశ్రమ ధర్మనిర్వహణ యందు (గుణముల ననుసరించి యున్నట్టి ప్రత్యేక ధర్మములు) మానవనాగరికత ఆరంభమగును. ఉత్తమ ప్రమాణముల ననుసరించి ఏ రంగము నందైనను స్వధర్మమును నిర్వహించినచో అది మానవుని ఉత్తమ జన్మమునకు ఉద్ధరించును.

## 2.32

**యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।**
**సుఖిన: క్షత్రియా: పార్థ లభన్తే యుద్ధమీదృశమ్ ॥**

### అనువాదము

**ఓ పార్థా! స్వర్గద్వారములను తెరుచునటువంటి యుద్ధావకాశమును కోరకనే అప్రయత్నముగా పొందునటువంటి క్షత్రియులు సౌఖ్యవంతులు.**

### భాష్యము

"ఈ యుద్ధము నందు నాకేమియు శుభము కన్పించుట లేదు. ఇది శాశ్వత నరకవాస స్థితినే కలిగించును" అని పలుకుచున్న అర్జునుని నైజమును జగద్గురువుగా శ్రీకృష్ణభగవానుడు ఖండించుచున్నాడు. కేవలము అజ్ఞానము చేతనే అర్జునుడు అట్లు పలుకుచుండెను. అతడు తన స్వధర్మ నిర్వహణము నందు అహింసను పాటింపదలచెను. క్షత్రియుడు యుద్ధరంగమున నిలిచి అహింసను పాటింపదలచుట

యనునది మూర్ఖుల సిద్ధాంతము. వ్యాసదేవుని జనకుడు గొప్ప ఋషియైన పరాశరుడు రచించిన 'పరాశరస్మృతి' (1.58) నందు ఈక్రింది విధముగా చెప్పబడినది :

క్షత్రియో హి ప్రజా రక్షన్ శస్త్రపాణి: ప్రదణ్డయన్

నిర్జిత్య పరసైన్యాది క్షితిం ధర్మేణ పాలయేత్

"ప్రజలను అన్ని రకములైన కష్టముల నుండి రక్షించుట క్షత్రియుని ధర్మము. శాంతిభద్రతలను నెలకొల్పుట కొరకై తగిన సమయములందు అతడు హింసావృత్తిని అవలంబింపవలసి యుండును. అతడు శత్రురాజుల సైన్యమును ఓడించిన పిమ్మట ధర్మానుసారముగా రాజ్యపాలన చేయవలెను."

ఈ విషయములను పరిశీలించినచో అర్జునుడు యుద్ధమును త్యజించుటకు ఎట్టి కారణము కనపడదు. అతడు శత్రువులను జయించినచో రాజ్యముననుభవించును. ఒకవేళ యుద్ధరంగమున మరణించినచో స్వర్గద్వారములు తెరవబడును. దానితో అతడు స్వర్గాలోకములను చేరగలడు. కనుక ఏవిధముగా చూచినను యుద్ధము చేయుట అతనికి లాభదాయకమే.

## 2.33

**అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తత: స్వధర్మ కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥**

### అనువాదము

**ఒకవేళ నీవు నీ స్వధర్మమైన యుద్ధమును నిర్వహింపనిచో స్వధర్మమును నిర్లక్ష్యపరచినందులకు నిశ్చయముగా పాపము నొందుటయే కాక, యోధుడుగా నీ కీర్తిని కూడా నీవు కోల్పోవుదువు.**

### భాష్యము

అర్జునుడు ప్రసిద్ధిగాంచిన యోధుడు. శివునితో సహా పలువురు దేవతలతో యుద్ధము చేసి అతడు గొప్ప కీర్తిని సంపాదించెను. వేటగాని రూపములో నున్నట్టి శివునితో పోరాడి అతనిని ఓడించెను. ఆ విధముగా అతడు శివుని మెప్పించి అతని నుండి 'పాశుపతాస్త్రము'ను బహుమానముగా పొందెను. అర్జునుడు గొప్ప యోధుడని అందరూ ఎరుగుదురు. ద్రోణాచార్యుడు కూడ అతనికి అనేక వరములను మరియు గురువును కూడ వధింపగల శక్తివంతమైన ప్రత్యేక ఆయుధమును అతనికి ప్రసాదించెను. ఈ విధముగా అర్జునుడు పలువురు పెద్దల నుండియు యుద్ధమునకు కావలసిన అర్హతలను సాధించెను. ఈవిధముగా స్వర్గాధిపతి మరియు జనకుడైన ఇంద్రుని నుండి అతడు వరములను పొందెను. కాని ఇప్పుడు అతడు యుద్ధమును త్యజించినచో అతడు క్షత్రియునిగా తన స్వధర్మమును నిర్లక్ష్యపరుచుటయే కాకుండ, యుద్ధము నుండి విరమించుట ద్వారా అతడు నరకమును పొందును.

## 2.34

**అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తే వ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥**

### అనువాదము

**జనులు నీ అపకీర్తిని ఎల్లప్పుడు చెప్పుకొందురు. గౌరవము గలవానికి అపకీర్తి యనునది మరణము కంటెను దారుణమైనది.**

### భాష్యము

అర్జునుని యుద్ధవిముఖతను గూర్చి శ్రీకృష్ణభగవానుడు తత్త్వబోధకునిగా మరియు మిత్రునిగా తన తుదితీర్పును ఈ విధముగా తెలుపుచున్నాడు : “ఓ అర్జునా! యుద్ధమును ఆరంభించుటకు మునుపే నీవు యుద్ధరంగమును వీడినచో జనులు నిన్ను పిరికివాడందురు. ఒకవేళ జనులు నిన్ను నిందించినను రణరంగము నుండి పారిపోవుట చేత ప్రాణములను దక్కించుకోవచ్చునని భావించుటకంటెను నీవు యుద్ధమున మరణించుటయే ఉత్తమమని నా అభిప్రాయము. గౌరవము గల నీవంటివానికి అపకీర్తి యనునది మరణము కంటెను దారుణమైనది. కనుక ప్రాణభీతితో నీవు యుద్ధము నుండి పారిపోరాదు. యుద్ధమున మరణించుటయే ఉత్తమము. అది నా స్నేహమును దుర్వినియోగపరచుట నుండియు మరియు సంఘము నందు గౌరవమును కోల్పోయి అపకీర్తిని పొందుట నుండియు నిన్ను కాపాడును.”

కనుకనే అర్జునుడు యుద్ధరంగమును వీడిపోవుట కంటెను దానియందు మరణించుటయే ఉత్తమమని భగవానుని తుది తీర్పు.

## 2.35

**భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥**

### అనువాదము

**నీ పేరు ప్రతిష్ఠల యెడ గొప్ప గౌరవమును కలిగియున్న సేనానాయకులు భయము చేతనే యుద్ధరంగమును నీవు వీడితివని భావించి నిన్ను చులకన చేయుదురు.**

### భాష్యము

శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి తన తుదితీర్పును ఇంకను ఇట్లు కొనసాగించుచున్నాడు : “సోదరులు మరియు పితామహుని పట్ల గల జాలిచేతనే యుద్ధరంగమును వీడితివని దుర్యోధనుడు, కర్ణుడు వంటి సేనానాయకులు భావింతురని నీవు భావింపకుము. ప్రాణభయము చేతనే నీవు అట్లు పలాయనమైతివని వారు భావించెదరు. దానితో నీ పేరుప్రతిష్ఠల యెడ గల వారి గొప్ప అభిప్రాయము నశించిపోవును.”

## 2.36

**అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యన్తి తవాహితా: ।**
**నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥**

### అనువాదము

**నీ శత్రువులు నిన్ను పలు నిర్దయ వాక్యములతో వర్ణించుచు నీ సామర్థ్యమును నిందింతురు. ఇంతకంటెను నీకు దుఃఖతరమైనది మరేమీ గలదు?**

### భాష్యము

అర్జునుడు చూపించిన అవాంఛితమైన జాలిని చూసి శ్రీకృష్ణభగవానుడు తొలుత ఆశ్చర్యపడెను. అట్టి జాలి అనార్యులకు మాత్రమే తగినదని అతడు వివరించి తెలిపెను. ఈవిధముగా భగవానుడు అనేక వాక్యములతో అర్జునుని దాక్షిణ్యబుద్ధికి విరుద్ధముగా తన వాదనను నిరూపించి యున్నాడు.

## 2.37

**అహతో వా ప్రాప్యసి స్వర్గం జిత్వా నా భోక్ష్యసే మహీమ్ ।**
**తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృత నిశ్చయ: ॥**

### అనువాదము

**ఓ కౌన్తేయ! నీవు యుద్ధరంగమున చంపబడి స్వర్గమును పొందుటయో లేక యుద్ధమును జయించి రాజ్యమును అనుభవించుటయో జరుగగలదు. కావున కృత నిశ్చయుడవై నిలిచి యుద్ధము చేయుము.**

### భాష్యము

అర్జునుని పక్షమునకు జయము కలుగునను నిశ్చయము లేకున్నను అతడు యుద్ధము చేయవలసియే యున్నది. ఎందుకనగా అట్టి యుద్ధమునందు మరణించినను అతడు స్వర్గ లోకములను పొందుటకు అవకాశము కలదు.

## 2.38

**సుఖదు:ఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥**

### అనువాదము

**సుఖదుఃఖములను గాని, లాభనష్టములను గాని, జయాపజయములను గాని లెక్కింపక యుద్ధము కొరకే నీవు యుద్ధము చేయుము. అట్లు చేయుటచే నీకెప్పుడును పాపము కలుగదు.**

### భాష్యము

తాను యుద్ధమును వాంఛించుచున్నందున యుద్ధము కొరకే అర్జునుడు యుద్ధము చేయవలెనని శ్రీకృష్ణ భగవానుడు ఇప్పుడు నేరుగా చెప్పుచున్నాడు. కృష్ణచైతన్యముతో కూడిన కర్మల యందు సుఖదుఃఖములకు కాని, లాభనష్టములకు కాని, జయాపజయములకు కాని ఎట్టి పరిగణము లేదు. ప్రతికార్యమును శ్రీకృష్ణుని సంతృప్తి కొరకే చేయవలెననునది ఆధ్యాత్మిక చైతన్యము. కనుకనే అట్టి భౌతిక కర్మల వలన ఎట్టి బంధము కలుగదు. తన ఇంద్రియతృప్తి కొరకు కర్మ చేయువాడు తప్పక బద్ధుడగును. అట్టి కర్మ సాత్త్వికమైనను లేక రాజసికమైనను వాటిని అనుగుణమైన మంచి లేదా చెడు ఫలములు అతనికి ప్రాప్తించియే తీరును. కాని కృష్ణ చైతన్యము నందు సంపూర్ణముగా శరణు పొందినవాడు అట్లుగాక ఎవ్వరికినీ ఋణపడడు మరియు బద్ధుడు కాడు. కాని సామాన్య కార్యములందు ఆసక్తుడైనవాడు ఋణపడియుండును. శ్రీమద్భాగవతము (11.5.41) నందు ఈ విషయమును గూర్చి ఇట్లు చెప్పబడినది :

దేవర్షిభూతాప్తనృణాం పితౄణాం న కింకరో నాయమృణీ చ రాజన్
సర్వాత్మనా య: శరణం శరణ్యం గతో ముకున్దం పరిహృత్య కర్తమ్

"సర్వధర్మములను విడిచి ముకుందుడైన శ్రీకృష్ణునికి సంపూర్ణముగా శరణుపొందినవాడు దేవతలకు గాని ఋషులకు గాని సామాన్య జనులకు గాని బంధువులకు గాని పితృదేవతలకు గాని ఋణపడి యుండడు మరియు వారికి సేవకుడు కాబోడు." ఈ శ్లోకమున శ్రీకృష్ణుడు అర్జునునకు చేసిన పరోక్ష సూచన ఇదియే. రాబోవు శ్లోకములలో ఈ విషయము మరింత స్పష్టముగా వివరింపబడును.

## 2.39

**ఏషా తే భిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥**

### అనువాదము

**ఇంతవరకు నేను సాంఖ్యము ననుసరించి ఈ ఆత్మజ్ఞానమును నీకు వివరించితిని. ఇప్పుడు దానిని ఫలాపేక్ష లేనటువంటి కర్మరూపమున**

**వివరించెదను వినుము. ఓ పృథుకుమారా! నీవు అట్టి జ్ఞానముననుసరించి వర్తించినచో కర్మబంధమునుండి విముక్తుడవు కాగలవు.**

## భాష్యము

వైదిక నిఘంటువైన 'నిరుక్తి' ననుసరించి 'సాంఖ్యము' అనగా సంపూర్ణముగా వివరించునదని అర్థము. 'సాంఖ్యము' అనునది ఆత్మ యొక్క వాస్తవ స్వభావమును వివరించు తత్త్వము. యోగ అనగా ఇంద్రియముల నియంత్రణను కూడియుండును. ఇక్కడ యుద్ధము చేయరాదనెడి అర్జునుని ప్రతిపాదన ఇంద్రియ తృప్తిపై ఆధారపడియున్నది. ధృతరాష్ట్రుని పుత్రులైన తన సోదరులను, బంధువులను యుద్ధములో జయించి రాజ్యము ననుభవించుట కంటెను వారిని యుద్ధములో వధింపకుండుట తనకు అధికమైన ఆనందమును కలగజేయునని భావించుట చేత అతడు తన ప్రధాన ధర్మమును విస్మరించి యుద్ధమునుండి విరమింపగోరెను. అర్జునుడు యోచించిన ఈ రెండు విషయములును ఇంద్రియ తృప్తికి సంబంధించిన మూల సిద్ధాంతములే. వారిని జయించుటచే కలిగెడి ఆనందము మరియు వారిని సజీవులుగా చూచుటచే కలుగు ఆనందమును రెండును కూడ జ్ఞానధర్మములను త్యజించి దేహాత్మబుద్ధి సిద్ధాంతముపై ఆధారపడియున్నవి. కనుక పితామహుని దేహమును వధించుట, అతని నిజమైన ఆత్మను వధించుట కాదని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు వివరింపదలిచెను. జీవులందరునూ ఆత్మస్వరూపులైనందున తాను మరియు ఇతరులందరునూ శాశ్వతముగా వ్యక్తిత్వము గలవారిగా అన్నివేళలా భూత, భవిష్యత్తు, వర్తమానములందు కొనసాగగలరని భగవానుడు వివరించెను. కేవలము మనము దేహములనే ఎన్నో విధములుగా మార్చుచున్నాము. అయినను, వాస్తవమునకు దేహబంధము నుండి విముక్తి పొందినను మనము వ్యక్తిత్వమును నిలుపుకుందుము. ఈ విధముగా ఆత్మ మరియు దేహములకు సంబంధించిన విశ్లేషాత్మక వివరణను శ్రీకృష్ణభగవానుడు తెలియజేసెను. వివిధ దృక్కోణములలో కావింపబడిన ఆత్మ మరియు దేహములకు సంబంధించిన వివరణాత్మక జ్ఞానమే 'నిరుక్తి' ననుసరించి సాంఖ్యజ్ఞానముగా తెలుపబడినది. ఈ సాంఖ్య జ్ఞానమునకు మరియు నాస్తికుడైన కపిలునిచే తెలుపబడిన సాంఖ్య తత్త్వమునకు ఎట్టి సంబంధము లేదు. నాస్తికుడైన ఈ కపిలుని సాంఖ్యమునకు చాలాకాలము క్రితమే శ్రీకృష్ణుని అవతారమైన కపిలభగవానునిచే శ్రీమద్భాగవతము నందు తన తల్లియైన దేవాహూతికి సాంఖ్యతత్త్వము వివరింపబడినది. అతడు అందులో పరమపురుషుడు లేదా భగవానుడు క్రియాశీలుడుగానుండుననియు మరియు అతడు ప్రకృతిపై దృష్టిని ప్రసరించుట చేత సృష్టికార్యక్రమమును నిర్వహించుననియు స్పష్టముగా తెలియజేసెను. ఈ విషయము వేదములందు మరియు గీతయందును అంగీకరింపబడినది. భగవానుడు ప్రకృతిపై దృష్టిని సారించి, దాని గర్భమునందు అణు జీవాత్మలను ప్రవేశ పెట్టెననియు వేదములు తెలియజేయుచున్నవి. ఆ జీవులందరును ఈ భౌతికజగత్తున ఇంద్రియతృప్తి కొరకై శ్రమించుచు, భౌతిక శక్తియైన మాయవశమున తమకు తాము భోక్తలుగా భావించుచున్నారు. ఈ భోగానుభవమనెడి మనోప్రవృత్తి జీవుడు ముక్తస్థితి యందును భగవానునిలో ఐక్యము కావలెనని భావనగా జీవుని పీడించును. ఇట్టి భావనయే 'మాయ' (ఇంద్రియ భోగాపు భ్రాంతి) యొక్క చివరి వల. అట్టి ఇంద్రియతృప్తి కర్మలతో కూడినట్టి అనేక జన్మలు అట్లు గడిచిన పిమ్మట మహాత్ముడైనట్టి వాడు వాసుదేవుడైన శ్రీకృష్ణభగవానుని శరణు పొందుట చేత పరతత్త్వాన్వేషణ సఫలము కాగలదు.

అర్జునుడు ఇదివరకే శ్రీకృష్ణుని శరణు వేడి అతనిని తన ఆధ్యాత్మికాచార్యునిగా అంగీకరించి యుండెను : "శిష్యస్తే హం శాధి మాం త్వాం ప్రపన్నమ్." కనుకనే ఏ విధముగా అర్జునుడు బుద్ధియోగము లేక కర్మయోగము ద్వారా కర్మనొనరింప వలెనో భగవానుడిప్పుడు తెలుపబోవుచున్నాడు. మరోమాటలో శ్రీకృష్ణ భగవానుని ప్రీతికొరకై భక్తియుక్తసేవా సాధన విధానము బోధించుచున్నాడు. ప్రతియొక్కరి హృదయము నందు పరమాత్మ రూపమున నెలకొనినట్టి భగవానునితో ప్రత్యక్ష సంబంధమును కలిగియుండుటయే బుద్ధియోగమని దశమధ్యాయపు పదవ శ్లోకమునందు స్పష్టముగా వివరింపబడినది. అట్టి ప్రత్యక్ష సంబంధము భక్తియుక్త సేవ లేకుండా కలుగబోదు. కనుకనే కృష్ణ చైతన్యమున భక్తియుక్తసేవ యందు నెలకొనినవాడు శ్రీకృష్ణ భగవానుని ప్రత్యేక కృపచే బుద్ధియోగ స్థితిని వెంటనే పొందగలుగును. కనుక శుద్ధ ప్రేమతో తన భక్తియుక్త సేవయందు నెలకొనిన వారికే భక్తియోగమును గూర్చిన శుద్ధ జ్ఞానమును ప్రసాదింతునని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. దానితో భక్తుడు శాశ్వతానందముతో కూడినట్టి భగవద్ధామమున భగవానుని సులభముగా చేరగలడు.

ఈ విధముగా ఈ శ్లోకమునందు తెలుపబడిన బుద్ధియోగమనునది భగవానుని భక్తియుక్త సేవయే. ఇందులో పేర్కొనబడిన సాంఖ్యమను పదమునకు నాస్తికుడైన కపిలుడు ప్రతిపాదించిన సాంఖ్యయోగకును ఎట్టి సంబంధమును లేదు. కనుకనే ఇక్కడ తెలుపబడిన సాంఖ్యయోగకును మరియు నాస్తిక సాంఖ్యకును సంబంధము కలదని ఎవ్వరును భావింపరాదు. ఆ కాలమున అట్టి తత్త్వమునకు ఎట్టి ప్రభావము లేకుండెను. అంతేకాకుండ, నాస్తికమైన అట్టి తాత్త్విక కల్పనలను ఎందుకు శ్రీకృష్ణభగవానుడు ప్రస్తావించుటకు యత్నించును? శ్రీమద్భాగవతము నందు యథార్థమైన సాంఖ్యతత్త్వము కపిలభగవానునిచే వర్ణింపబడినది. ఆ సాంఖ్యమునకు కూడ ప్రస్తుతాంశములతో ఎట్టి సంబంధము లేదు. ఇక్కడ సాంఖ్యము అనగా ఆత్మ మరియు దేహముల విశ్లేషనాత్మక వివరణము. అర్జునుని బుద్ధియోగకు లేక భక్తియోగస్థితికి ఉద్ధరించుటకొరకై శ్రీకృష్ణభగవానుడు ఆత్మ యొక్క విశ్లేషాత్మకమైన వివరణము అందించెను. కనుకనే, శ్రీకృష్ణభగవానుడు తెలిపిన సాంఖ్యము మరియు శ్రీమద్భాగవతమునందు కపిలుడు తెలిపిన సాంఖ్యములు సమానములు మరియు ఒకటే. అవి రెండును భక్తియోగమునే వివరించుచున్నవి. కనుకనే శ్రీకృష్ణభగవానుడు బుద్ధిహీనులైనవారు మాత్రమే సాంఖ్యయోగము మరియు భక్తియోగముల నడుమ భేదమును కల్పింతురని చెప్పుచున్నాడు (సాంఖ్యయోగౌ పృథక్ బాలా: ప్రవదన్తి న పండితా:).

నాస్తిక సాంఖ్యయోగతో భక్తియోగకు ఎట్టి సంబంధము లేదు. అయినను కొందరు అల్పబుద్ధులు భగవద్గీత యందును ఆ నాస్తిక సాంఖ్యయోగమే తెలుపబడినదని పలుకుదురు.

కనుక బుద్ధియోగము అనగా భక్తియుక్త సేవ (కృష్ణచైతన్యము) యొక్క పరిపూర్ణ జ్ఞానము మరియు ఆనందముతో కర్మనొనరించుట అని ప్రతియొక్కరు ఎరుగవలెను. భగవానుని ప్రీతికొరకై కర్మనొనరించువాడు ఆ కార్యము ఎంత కష్టమైనను బుద్ధియోగ సిద్ధాంతములననుసరించి కర్మ చేయుచు సర్వదా పరమానందమును పొందుచుండును. ఆ విధమైన భగవత్ సేవ ద్వారా భగవానుని కృపచే మానవుడు ఆధ్యాత్మిక అవగాహనను అప్రయత్నముగానే పొందును. ఆ విధముగా జ్ఞాన సముపార్జనకొరకై ఇతర ప్రత్యేక ప్రయత్నములేవి చేయకుండగనే అతనికి ముక్తి లభించుచున్నది. కృష్ణచైతన్యమునందు కర్మచేయుటకు మరియు ఫలాపేక్షతో కర్మచేయుటకును, ముఖ్యముగా తన కుటుంబము కొరకు గాని భౌతిక సుఖము కొరకు

గాని చేయబడు కర్మకు గొప్ప భేదము గలదు. కనుకనే బుద్ధియోగము అనగా మనము చేయు కర్మయొక్క ఆధ్యాత్మిక గుణమైయున్నది.

## 2.40

**నేహాభిక్రమనాశో స్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥**

## అనువాదము

**ఈ ప్రయత్నమునందు నష్టము గాని, హాని గాని లేదు. ఈ మార్గమున స్వల్పపురోగతియు మహత్తరమైన భయము నుండి మానవుని రక్షించును.**

## భాష్యము

కృష్ణచైతన్యముతో కర్మనొనరించుట లేక శ్రీకృష్ణుని సంతృప్తి కొరకు ఎటువంటి ఇంద్రియ భోగాభిలాష లేకుండ కర్మను చేయుటయే మిక్కిలి మహోన్నత దివ్యకార్యము. అటువంటి కార్యమును స్వల్పముగా ఆరంభించినను అందులో ఎటువంటి ఆటంకములు ఏర్పడవు. అంతేకాకుండ, అట్టి స్వల్పయత్నము ఏనాడును నశించదు. భౌతిక పరిధిలో ప్రారంభించబడు ఏ కర్మనైనను (కార్యమైనను) పూర్తిచేయవలసియే యుండును. లేనిచో ఆ యత్నమంతయు విఫలమగును. కాని కృష్ణచైతన్యమునందు ప్రారంభింపబడిన కర్మ పూర్తిచేయబడక పోయినను శాశ్వత ప్రభావమును కలిగియుండును. కనుకనే కృష్ణచైతన్యము నందు చేయబడు అట్టి కార్యము పూర్తి కాలేకపోయినను దాని కర్త ఏ విధమైన నష్టమును పొందడు. కృష్ణచైతన్య కార్యము ఒక్క శాతము పూర్తియైనను శాశ్వత ఫలమును కలిగియుండి తదుపరి ప్రారంభము రెండవ శాతము నుండి మొదలగును. కాని భౌతిక కర్మయందు నూటికి నూరుపాళ్ళు సఫలత కలగనిదే లాభము చేకూరదు. అజామిళుడు తన ధర్మమును కృష్ణచైతన్యమునందు స్వల్పముగానే నిర్వర్తించినను, భగవానుని కృపచే అతడు చివరికి నూటికినూరుపాళ్ళ ఫలితమును పొందెను. శ్రీమద్భాగవతము (1.5.17) నందు ఈ విషయమునకు సంబంధించి ఒక చక్కని శ్లోకము గలదు:

త్యక్త్వా స్వధర్మం చరణామ్బుజం హరేర్భజన్నపక్వో/థ పతేత్తతో యది
యత్ర క్వ వాభద్రమభూదముష్య కిం కో వార్థ ఆప్తో/భజతాం స్వధర్మత:

"ఎవ్వరైనను స్వధర్మములను విడిచి కృష్ణచైతన్యమునందు కర్మలు చేయువాడు ఆ కర్మలను పూర్తి చేయజాలనందున పతనమైనచో అతనికి ఎట్టి నష్టము కలుగును? మరియు అతడు లౌకిక కర్మలను పరిపూర్ణముగా నొనరించువాడు పొందు లాభమేమిటి?"

క్రైస్తవులు కూడ ఈ విషయమునే ఇట్లు పలుకుదురు: "మానవుడు సమస్త ప్రపంచమును సాధించినను శాశ్వతమైన ఆత్మను కోల్పోయినచో అతడెట్టి లాభమును పొందగలుగును?"

భౌతిక కర్మలు మరియు వాటి ఫలితములు దేహముతోనే ముగిసిపోవును. కాని కృష్ణచైతన్యము నందు చేయబడు కర్మలు దేహత్యాగానంతరము కూడ మానవుని తిరిగి కృష్ణచైతన్యము వైపుకే గొనిపోవును. తదుపరి జన్మమున అట్టివాడు ఉత్తమ సంస్కృతి కలిగిన బ్రాహ్మణుల గృహమునందు గాని లేదా సంపన్నుల గృహము నందు గాని

జన్మించుటకు అవకాశము తప్పక పొందగలుగును. అట్టి జన్మము మానవునకు మరింత పురోగతి సాధించుటకు అవకాశము కలిగించును. ఇదియే కృష్ణచైతన్యముతో చేయబడు కర్మయొక్క అద్వితీయ లక్షణము.

## 2.41

**వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునన్దన ।**
**బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయో/వ్యవసాయినామ్ ॥**

## అనువాదము

**ఈ మార్గమునందున్నవారు స్థిరమైన బుద్ధితో ఒకేలక్ష్యమును కలిగియుందురు. ఓ కురునందనా! స్థిరనిశ్చయము లేనివారి బుద్ధి అనేక విధములుగా నుండును.**

## భాష్యము

కృష్ణచైతన్యము ద్వారా మానవుడు జీవితపు అత్యున్నత పరిపూర్ణత్వ స్థితికి చేరగలడనెడి మానవుని దృఢనిశ్చయమే 'వ్యవసాయాత్మికాబుద్ధి' యనబడును. 'శ్రీ చైతన్య చరితామృతము' (మధ్యలీల 22.62) ఇట్లు తెలుపుచున్నది:

'శ్రద్ధా' శబ్దే – విశ్వాస కహే సుదృఢ నిశ్చయమ్
కృష్ణే భక్తి కోయిలే సర్వ కర్మ కృత హొయ్

'శ్రద్ధ' అనగా ఉదాత్తమైన ఒక విషయమునందు నిశ్చల విశ్వాసము. మానవుడు కృష్ణ చైతన్య కార్యములందు నెలకొని యున్నప్పుడు వంశాచారములకు గాని, సంఘాచారములకు గాని లేక దేహాచారములకు గాని లోబడి కర్మ నొనరింపనవసరము లేదు.

కామ్య కర్మలు మానవుని పూర్వజన్మము నందలి మంచిచెడుల ఫలితముల ననుసరించి చేయునట్టివి. హృదయమునందు కృష్ణ చైతన్యము జాగృతమైనవాడు తన కార్యములయందు సత్ఫలితముల కొరకై యత్నింప నవసరము లేదు. అతడు కృష్ణచైతన్యమున స్థితుడైనంతటనే కార్యకలాపములన్నీ కూడ గుణాతీత స్థితికి చెందినవి కాగలవు. మంచి చెడులను ద్వంద్వములచే అవి ప్రభావితములు కాకపోవుటయే అందులకు కారణము. జీవితపు భౌతిక భావనను సంపూర్ణముగా త్యాగము చేయుట యనునది కృష్ణచైతన్యపు పరిపూర్ణ స్థితి. కృష్ణచైతన్యము నందు క్రమమైన పురోగతి ద్వారా అట్టిస్థితి సహజముగానే లభింపగలదు.

కృష్ణచైతన్యవంతుడైన మానవుని స్థిర ప్రయోజనము అతని జ్ఞానముపై ఆధారపడియుండును. "వాసుదేవ: సర్వమితి స మహాత్మా సుదుర్లభ:" (భ.గీ.7.19) అనగా సర్వ వ్యక్తకారణములకు వాసుదేవుడు లేక శ్రీకృష్ణుడే మూలకారణమని పూర్తిగా ఎరిగినట్టి కృష్ణచైతన్య వంతుడైన మహాత్ముడు మిక్కిలి అరుదుగా నుండును. వృక్షపు మూలమునకు నీరుపోయుటచే మానవుడు అప్రయత్నముగనే దాని పత్రములకును, శాఖలకును నీరు అందించినట్లగును. అట్లే కృష్ణచైతన్యమున కర్మ చేయుట ద్వారా మానవుడు తనకు, తన కుటుంబమునకు, సంఘమునకు, దేశమునకు, మానవాళి

సమస్తమునకు అత్యుత్తమ సేవచేసినవాడగును. శ్రీకృష్ణుడు సంతృప్తి నొందినచో ప్రతియొక్కరు సంతృప్తి నొందగలుగుదురు.

అట్టి కృష్ణచైతన్యవంతమైన సేవ శ్రీకృష్ణుని ప్రామాణిక ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశమునందు చక్కగా అభ్యసింపబడును. శ్రీకృష్ణుని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుడు శిష్యుని స్వభావము నెరిగి కృష్ణచైతన్యమునందు వర్తించునట్లుగా అతనిని నిర్దేశించును. కృష్ణచైతన్యమును పరిపూర్ణముగా ఎరుగుటకు మానవుడు స్థిరచిత్తముతో వర్తించుచు, శ్రీకృష్ణుని ప్రతినిధియైన గురువును అంగీకరించి మరియు అతని ఆదేశములను జీవిత పరమ లక్ష్యములుగా భావించి వాటిని అంగీకరింపవలెను. శ్రీల విశ్వనాథ చక్రవర్తి ఠాకూరు తమ సుప్రసిద్ధ ప్రార్థనయైన 'గుర్వాష్టకము' (8) నందు ఇట్లు తెలిపిరి :

యస్య ప్రసాదాద్ భగవత్ప్రసాదో యస్యాప్రసాదాన్న గతి: కుతో౽పి
ధ్యాయన్ స్తువంస్తస్య యశస్త్రిసన్ధ్యం వన్దే గురో: శ్రీచరణారవిన్దమ్

"ఆధ్యాత్మికాచార్యుడు సంతృప్తి చెందుట ద్వారా దేవాదిదేవుడు కూడ సంతృప్తి చెందును. ఆధ్యాత్మికాచార్యుని సంతృప్తి పరచకుండా కృష్ణచైతన్య స్థితికి ఉద్ధరింపబడు అవకాశమే లేదు. కనుకనే దినమునకు మూడుసార్లు నేను ఆధ్యాత్మికాచార్యుని కృపకై ధ్యానించి, ప్రార్థించి, గౌరవపూర్వక ప్రణామములునర్పింతును."

కాని ఈ విదానమంతయు దేహాత్మ బుద్ధికి అతీతమైన ఆత్మజ్ఞానముపై ఆధారపడియుండును. అది కేవలము సిద్ధాంతపరమైనది మాత్రమే కాకుండ ఆచరింప దగినదై యుండవలెను. అప్పుడు కామ్యకర్మల చేత వ్యక్తము చేయబడు ఇంద్రియ సుఖమునకు అవకాశముండదు. ఆ విధముగా స్థిరచిత్తము లేనివాడు పలురకాలైన కామ్యకర్మలచే ఆకర్షింపబడును.

### 2.42- 43

**యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్యవిపశ్చిత: ।
వేదవాదరతా: పార్థ నాన్యదస్తీతి వాదిన: ॥**

**కామాత్మాన: స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥**

## అనువాదము

**అల్పజ్ఞులు స్వర్గలోక ప్రాప్తి, ఉత్తమ జన్మము, అధికారము వంటివానిని పొందుటకై వివిధములైన కామ్యకర్మలను ఉపదేశించు వేదములందలి మృదుమధురమైన వాక్కులచే ఆకర్షింపబడుదురు. ఇంద్రియ తృప్తిని మరియు సంపన్నమైన జీవితమును కోరువారగుటచే అట్టివారు దానికి మించినది మరొకటి లేదని చెప్పుదురు.**

## భాష్యము

సాధారణముగా జనులు మందమతులై యుందురు. అజ్ఞానవశమున వారు వేదములందలి 'కర్మకాండ' భాగములోని కామ్యకర్మల పట్లనే ఆసక్తులగుదురు. మదిర,

మగువ, భౌతిక వైభవములు పుష్కలముగా లభించునట్టి స్వర్గలోకము లందలి సుఖజీవనమును అనుభవించుటకు కావలసిన ఇంద్రియ తృప్తిని కలిగించు కార్యముల కంటెను మరేదియును వారు వాంఛింపరు. అట్టి స్వర్గలోకములను పొందుటకు అనేకవిధములైన యజ్ఞములు (ముఖ్యముగా 'జ్యోతిష్టోమ' యజ్ఞములు వేదములందు ప్రతిపాదింపబడినవి.వాస్తవమునకు స్వర్గలోక ప్రాప్తిని గోరువారు అట్టి యజ్ఞములను తప్పక ఆచరించి తీరవలెనని వాటియందు చెప్పబడినది. కాని అల్పజ్ఞులు ఇదియే వేదవిజ్ఞానపు సమస్త ప్రయోజనమని భావింతురు. అట్టి అనుభవశూన్య జనులకు కృష్ణచైతన్యమునకు సంబంధించిన నిశ్చితమైన కర్మలందు నెలకొనియుండుట మిక్కిలి కష్టము. అజ్ఞానులు విషవృక్షపు పుష్పములను చూచి వాని పరిణామములనెరుగక వానిచే ఆకర్షింపబడినట్లు, అల్పజ్ఞులైన మానవులు స్వర్గసంపదల చేతను, అక్కడ ఇంద్రియ తృప్తి భోగములచేతను ఆకర్షింపబడుదురు.

వేదములలోని కర్మకాండ భాగము నందు ఇట్లు తెలుపబడినది : "అపామ సోమమమృతా అభూమ" (ఋగ్వేదము 8.48.3) – "మేము సోమరసమును త్రాగి అమరత్వమును పొందితిమి." మరియు "అక్షయం హ వై చాతుర్మాస్య యాజిన:సుకృతం భవతి" (కృష్ణయుజుర్వేదము 8.1.1) – "చాతుర్మాస్య వ్రతమును పాటించిన వారెవరైనను అక్షయ సుకృతమును పొందుదురు." అనగా, 'చాతుర్మాస్య వ్రతము'ను పాటించిన వారెవరైనను సోమరసమును త్రాగి అమృతత్వమును మరియు ఆనందమును పొందుటకు అర్హుడగును. ఈ భౌతిక జగత్తు నందలి ఇంద్రియ భోగములననుభవించుటకు కావలసిన శక్తిని పొందుట కొరకై కొందరు సోమరసమును త్రాగుటకు మిక్కిలి ఆరాటపడుతుందురు. అట్టి మానవులు భౌతిక బంధవిముక్తిపట్ల శ్రద్ధను చూపక కేవలము ఆర్భాటము కలిగిన వైదిక యజ్ఞముల యెడనే ఆకర్షితులగుదురు. సాధారణముగా, భోగాలాలసులైన అట్టివారు స్వర్గసుఖములను తప్ప మరేదియును వాంఛింపరు. స్వర్గము నందు నందనకాననమను ఉద్యానవనములు గలవు. అంతేకాకుండ అక్కడ అందమైన స్త్రీల సాంగత్యము, కోరినంత సోమరసము కూడ లభించునని కూడ తెలుపబడినది. అట్లు దేహమునకు సంబంధించిన సుఖములనేవి నిస్సందేహముగ ఇంద్రియములకు సంబంధించి నట్టివి. కనుకనే భౌతిక జగత్తునకు అధిపతులమని భావించెడి వారెందరో అట్టి భౌతికమైన తాత్కాలిక సుఖముల పట్ల పూర్తిగా ఆసక్తులైయుందురు.

## 2.44

**భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధి: సమాధౌ న విధీయతే ॥**

## అనువాదము

**భోగానుభవము నందును, లౌకిక సంపదలందును మిక్కిలి ఆసక్తులై, వానిచే మోహపరావశులగు వారి మనస్సు నందు భగవానుని భక్తియుక్త సేవ కొరకు స్థిరమైన నిశ్చయము కలుగదు.**

## భాష్యము

'సమాధి'యనగా స్థిరమైన చిత్తము. వైదిక నిఘంటువైన 'నిరుక్తి' ఇట్లు తెలుపుచున్నది : "సమ్యగాధీయతే/స్మిన్ ఆత్మతత్త్వయాతాత్మ్యమ్" – "ఆత్మను అవగాహన చేసుకొనుటలో చిత్తము స్థిరముగా నెలకొనినచో అది 'సమాధి' స్థితమగును." భౌతిక ఇంద్రియ తృప్తిపట్ల ఆశక్తులైన వారికి గాని అట్టి తాత్కాలికమైన వాటిచే మొహితులగు వారికి గాని ఎన్నడును 'సమాధి' సాధ్యపడదు. అట్టివారందరును దాదాపు భౌతిక శక్తిచే శిక్షింపబడినట్టివారే.

## 2.45

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున।**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్॥**

## అనువాదము

**వేదముల ప్రదానముగా త్రిగుణములకు సంబంధించిన విషయములను గూర్చి చర్చించును. ఓ అర్జునా! నీవు ఈ త్రిగుణములకు అతీతుడవు కమ్ము. సుఖదుఃఖాది ద్వంద్వముల నుండియు మరియు యోగాక్షేమములనెడి చింతలనుండియు విడివడినవాడివై ఆత్మనిష్ఠుడవు కమ్ము!**

## భాష్యము

భౌతికకార్యములన్నియును త్రిగుణములతో కూడిన కర్మలతోను మరియు ఫలములతోను కూడియుండును. భౌతిక జగత్తున బంధములను కలిగించు కామ్య (సకామ) ఫలములను పొందుటకే అవి ఉద్దేశింపబడినవి. వేదములు సామాన్య మానవులను ఇంద్రియ తృప్తిని కోరు స్థితినుండి ఆధ్యాత్మిక స్థితికి క్రమముగా ఉద్ధరించుటకొరకై ఉపయోగపడు సకామకర్మలను ఎక్కువగా ఉపదేశించును. శ్రీకృష్ణభగవానునికి మిత్రునిగా మరియు శిష్యునిగా అర్జునుడు వేదాంత తత్త్వము యొక్క ఆధ్యాత్మిక స్థితికి ఎదుగవలసినదిగా ఇక్కడ ఆదేశింపబడెను. 'బ్రహ్మజిజ్ఞాసా' లేదా పరబ్రహ్మమును గూర్చిన ప్రశ్నలే ఆ వేదాంతతత్త్వము యొక్క ఆరంభములోని అంశము. భౌతిక ప్రపంచమునందలి జీవులందరును మనుగడ కొరకై తీవ్ర సంఘర్షణమును సలుపుచుందురు. భగవానుడు అట్టివారికొరకై భౌతిక ప్రపంచమును సృష్టించిన పిమ్మట ఆ భౌతిక బంధములనుండి విడివడి జీవించుట ఎట్లో కూడ ఉపదేశించు వైదిక జ్ఞానమును ప్రసాదించెను. ఇంద్రియ తృప్తిని కలిగించు కర్మలు అనగా 'కర్మకాండ'తో కూడిన భాగము ముగిసినంతనే ఉపనిషత్తుల రూపమున ఆధ్యాత్మికానుభూతిని సాధించుటకు అవకాశము కల్పింపబడినది. భగవద్గీత పంచమ వేదమైన 'మహాభారతము' యొక్క భాగమైనట్లు, ఉపనిషత్తులు కూడ వివిధ వేదములందలి భాగములు. ఈ ఉపనిషత్తులు ఆధ్యాత్మిక జీవితారంభమును సూచించును.

భౌతిక దేహము నిలిచియున్నంతకాలము కర్మలు మరియు త్రిగుణములకు సంబంధించిన ఫలితములు కూడ నిలిచియుండును. కనుక మానవుడు సుఖదుఃఖములు, శీతోష్ణము వంటి ద్వంద్వములను సహించుట అభ్యసింపవలెను. అట్టి ద్వంద్వ సహనముచే లాభనష్టములందు కలత పొందకుండ నుండవలెను.

శ్రీకృష్ణుని సత్సంకల్పముపై మానవుడు పూర్తిగా ఆధారపడినప్పుడు అట్టి ఆధ్యాత్మిక స్థితి (సంపూర్ణ కృష్ణచైతన్యమునందు) సిద్ధింపగలదు.

## 2.46

**యావానర్థ ఉదపానే సర్వత: సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానత: ॥**

## అనువాదము

**చిన్న నూతివలన కలుగు ప్రయోజనములన్నియును శీఘ్రమే పెద్ద జలాశయము నందలి జలముచే సిద్ధించినట్లు వేదముల సమస్త ప్రయోజనములు వాని అంతరార్థమును గ్రహించిన వానికి సిద్ధించుచున్నవి.**

## భాష్యము

వేదవాఙ్మయము నందలి 'కర్మకాండ' భాగమున పేర్కొనబడిన యజ్ఞములు మరియు కర్మలును క్రమానుగతమైన ఆత్మానుభూతిని ప్రోత్సహించుట కొరకే నిర్దేశింపబడినవి. ఇక ఆత్మానుభూతియొక్క ప్రయోజనము భగవద్గీత (15.15) నందు స్పష్టముగా తెలుపబడినది. సమస్తమునకు ఆదికారణుడైన శ్రీకృష్ణభగవానుని ఎరుగుటయే వేదాధ్యయనము గల ముఖ్య ప్రయోజనమని అక్కడ వివరింపబడినది. అనగా శ్రీకృష్ణుని గూర్చియు మరియు అతనితో జీవునికి గల నిత్య సంబంధమును గూర్చియు అవగాహన చేసుకొనుటయే ఆత్మానుభూతి. శ్రీకృష్ణభగవానునితో జీవులకు గల సంబంధము కూడ భగవద్గీత (15.7) నందు వివరింపబడినది. జీవులందరును శ్రీకృష్ణుని అంశలే! కనుకనే జీవునిలో కృష్ణచైతన్యమును పునరిద్ధరించుట వేదవిజ్ఞానపు పరిపూర్ణస్థితి. ఈవిషయము శ్రీమద్భాగవతము (3.33.7) నందు ఇట్లు నిర్ధారింపబడినది :

అహెూ బత శ్వపచో/తో గరీయాన్ యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్
తేపుస్తపస్తే జుహువు: సస్నురార్యా బ్రహ్మానూచుర్నామ గృణన్తి యే తే

"హే ప్రభూ! నీ పవిత్ర నామ సంకీర్తన చేయువాడు శునక మాంసమును తిను చండాలుని కుటుంబము వంటి అధమ కుటుంబమున జన్మించినను అతడు అత్యున్నత ఆత్మానుభూత స్థితి నొందినట్టివాడే. అట్టి వ్యక్తి వైదిక కర్మకలాపము లన్నింటిని అనగా అన్ని విధములైన యజ్ఞములను, తపస్సులను ఆచరించినట్టి వానితో సమానమగును! అతడు సమస్త పుణ్య తీర్థములలో స్నానమాచరించినట్టివానితో, వేదగ్రంథములను పలుమార్లు అధ్యయనము చేసినట్టివానితో సమానుడగును. అట్టివ్యక్తి ఆర్యకుటుంబమున ఉత్తమోత్తముడుగా పరిగణింపబడును."

కనుకనే కేవలము కర్మకాండకు మాత్రమే ఆకర్షితులు కాకుండ ప్రతియొక్కరు వేదప్రయోజనమును చక్కటి వివేకముతో అవగాహన చేసికొనవలెను. అట్లే మరింత అధికమైన ఇంద్రియతృప్తి కొరకై స్వర్గలోకములను చేరవలెనని వాంఛింపకూడదు. ఈ యుగములో, సామాన్య మానవునికి వైదిక కర్మకాండల యందు విధింపబడిన నియమ నిబంధనల నన్నింటిని అనుసరించుట లేక వేదాంతమును, ఉపనిషత్తులను లోతుగా అధ్యయనము చేయుట గాని సాధ్యపడదు. వేదముల ప్రయోజనములను సాధించుటకు అధికమైన కాలము, శక్తి, జ్ఞానము, వనరుల వంటి సాధనముల అవసరముండును.

అవియన్నియును ఈ యుగమున అత్యంత దుర్లభములు. కాని పతిత పావనుడైన శ్రీ చైతన్య మహాప్రభువు చేత ఆదేశింపబడినట్లు, భగవానుని పవిత్ర నామసంకీర్తనము ద్వారా వేదముల ఉత్తమ ప్రయోజనము సాధింపబడును. గొప్ప వేదవిద్వాంసుడైన ప్రకాశానంద సరస్వతీ శ్రీచైతన్య మహాప్రభువును ఇట్లు ప్రశ్నించెను. "మీరు 'వేదాంత సూత్రము' లను అధ్యయనము చేయుటకు బదులుగా భావావిష్టుని వలె భగవన్నామములను ఎందుకు కీర్తించుచుంటిరి?" అందుకు మహాప్రభువు తనను తన ఆధ్యాత్మికాచార్యుడు మూర్ఖునిగా భావించి, శ్రీకృష్ణుని పవిత్ర నామ సంకీర్తన చేయమని ఆదేశించుట చేత, తాను ఆ విధముగనే కీర్తిస్తూ ఉన్మాదినైతినని సమాధానమిచ్చిరి. ఈ కలియుగమున జనులలో అధికభాగము వేదాంత జ్ఞానమును అవగాహన చేసుకొనగలిగినంత విద్యాపాటవము లేని మూర్ఖులుగానుందురు. అపరాధరహితముగా పవిత్ర హరినామ సంకీర్తనము చేయువారికి వేదాంతతత్త్వపు ముఖ్య ప్రయోజనము సిద్ధింపగలదు. వేదవిజ్ఞానము నందు వేదాంతమే చరమ అంశము. ఈ వేదాంతతత్త్వమును రచించినవాడు మరియు ఎరిగినవాడును శ్రీకృష్ణభగవానుడే! భగవానుని పవిత్రనామ సంకీర్తనలో దివ్యానందమునను భవించు మహాత్ముడే అత్యున్నత వేదాంతి. ఇదియే సమస్త వేదజ్ఞానము యొక్క పరమ ప్రయోజనము.

## 2.47

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూర్మా తే సఙ్గో'స్త్వకర్మణి ॥**

## అనువాదము

**విధ్యుక్త ధర్మమును నిర్వర్తించుటయందే నీకు అధికారము కలదు గాని కర్మఫలమునందు కాదు. నీ కర్మ ఫలములకు నీవే కారణమని ఎన్నడును భావింపకుము. అలాగుననే విధ్యుక్త ధర్మమును వీడుటయందు ఆసక్తుడవు కాకుము.**

## భాష్యము

కర్మలు మూడురకములు : విధ్యుక్త ధర్మములు (కర్మ), దుష్కర్మలు (వికర్మ), అకర్మలు. మానవుని భౌతిక గుణస్వభావము ననుసరించి విధింపబడిన కర్మలు విధ్యుక్త ధర్మములు. ప్రామాణిక గ్రంథములు అంగీకరింపని కర్మలు దుష్కర్మలుగా పిలువబడును. అకర్మ అనగా విధ్యుక్త ధర్మమును చేయకుండుట. ఇక్కడ భగవానుడు అర్జునునికి కర్మచేయకుండ ఉండరాదనియు మరియు ఫలము నందు ఆసక్తి లేకుండా విధ్యుక్త ధర్మమును విధిగా నిర్వహింప వలెననియు ఆదేశించెను. కర్మఫలముల యందు ఆసక్తిని కలిగియుండువాడు అట్టి కర్మమునకు కూడ కారణమగును. ఇట్లు అతడు అట్టికర్మల ఫలితముల వలన సుఖపడువాడో లేక దుఃఖపడువాడో యగుచున్నాడు.

విధ్యుక్త ధర్మములను నిత్యకర్మలు, అత్యవసర కర్మలు, కామ్య కర్మలని మూడు విధములుగా విభజింపవచ్చును. వైదిక శాస్త్రాదేశాల ననుసరించి ఎట్టి లాభాపేక్షను కోరకుండ స్వధర్మముగా చేయబడు నిత్యకర్మము సత్త్వగుణ కర్మయనబడును. ఫలితమును వాంఛించుచు చేయబడు కర్మ బంధకారణమైనందున అది శుభప్రదము

కాజాలదు. ప్రతియొక్కరికిని వారి విధ్యుక్త ధర్మమునందు అధికారము కలదు. కాని, అతడు ఆ ధర్మమును ఫలాపేక్షరహితముగా నిర్వర్తింప వలెను. అట్టి ఫలాపేక్ష రహితమైన విధ్యుక్త ధర్మపాలనము మానవుని నిస్సందేహముగ ముక్తిమార్గము వైపునకు నడిపించును.

కనుకనే ఫలాసక్తి లేకుండ, స్వధర్మముగా భావించి యుద్ధమును చేయుమని భగవానుడు అర్జునునికి బోధించి యుండెను. యుద్ధమున పాల్గొనకుండుట కూడ మరొకవిధమైన ఆసక్తియే యగును. అట్టి ఆసక్తి ఎన్నడును మానవుని మోక్షమార్గము నందు నడిపించదు. ఆసక్తి అనుకూలమైనను లేక ప్రతికూలమైనను అది బంధకారణమే కాగలదు. అకర్మము పాపపూరితమైనది. కనుకనే స్వధర్మముగా భావించి యుద్ధము చేయుటయే అర్జునునికి శుభప్రదమైన మోక్షమార్గమై యున్నది.

## 2.48

**యోగస్థ: కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యో: సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥**

### అనువాదము

**ఓ ధనంజయా! జయాపజయము లందు ఆసక్తిని విడనాడి సమభావముతో నీ విధ్యుక్త ధర్మమును నిర్వహింపుము. అట్టి సమభావమే యోగమనబడును.**

### భాష్యము

శ్రీకృష్ణుడు అర్జునునికి యోగమందు వర్తించమని బోధించుచున్నాడు. ఆ యోగమనగానేమిటి? సదా కలతలకు గురిచేయు ఇంద్రియములను నియంత్రించి, మనస్సుని భగవానునిపై కేంద్రీకరించుటయే యోగమనబడును. ఆ భగవానుడెవ్వరు? దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే భగవానుడు. అట్టి శ్రీకృష్ణుడే యుద్ధము చేయమని అర్జునునితో స్వయముగా చెప్పుచుండుట చేత యుద్ధ ఫలితములతో అర్జునునికి ఎట్టి సంబంధము లేదు. లాభము లేదా విజయము అనునది శ్రీకృష్ణుని సంకల్పమునకు సంబంధించినది. తన ఆదేశానుసారము వర్తించమని శ్రీకృష్ణుడు అర్జునుని ఆదేశించెను. శ్రీకృష్ణుని ఆజ్ఞ ననుసరించుటయే నిజమైన యోగము. అట్టి విధానము కృష్ణ చైతన్యము నందు అభ్యసింపబడును. కృష్ణచైతన్యమునందే మానవుడు తాను యజమాని యనెడి భావనను విడువగలుగును. మానవుడు శ్రీకృష్ణునికి లేదా శ్రీకృష్ణుని దాసునికి దాసుడు కావలెను. కృష్ణచైతన్యమునందు స్వధర్మమును నిర్వహించుటకు అదియే సరియైన మార్గము. అట్టి మార్గమే యోగమునందు వర్తించుటకు అతనికి తోడ్పడగలదు.

అర్జునుడు క్షత్రియుడగుట చేత వర్ణాశ్రమ ధర్మవ్యవస్థను పాటించువాడు. వర్ణాశ్రమ ధర్మముల ముఖ్యోద్దేశ్యము విష్ణువును సంతృప్తి పరుచుటయేనని ‘విష్ణుపురాణము’ నందు చెప్పబడినది. ఈ భౌతికజగత్తునందు ప్రతియొక్కరును స్వార్థముతో కూడిన స్వీయతృప్తినే వాంఛింతురు. కాని వాస్తవమునకు ప్రతియొక్కరు శ్రీకృష్ణుణ్ణే సంతృప్తి పరచవలెనే కాని తమ ఇంద్రియ తృప్తికై ఆరాటపడరాదు. అనగా

శ్రీకృష్ణుని సంతృప్తి పరుపనిదే వర్ణాశ్రమ ధర్మ నియమములను ఎవ్వరును చక్కగా పాటింపలేరు. శ్రీకృష్ణుడు తెలిపినట్లుగా వర్తింపవలెనని అర్జునుడు పరోక్షముగా ఆదేశింపబడుచున్నాడు.

## 2.49

**దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।**
**బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణా: ఫలహేతవ: ॥**

### అనువాదము

**ఓ ధనంజయా! భక్తియుక్త సేవచే హీనకర్మల నన్నింటిని దూరము చేసి ఆ భావనలోనే భగవానుని శరణు వేడుము. కర్మఫలములను అనుభవింప గోరువారు లోభులు.**

### భాష్యము

శ్రీకృష్ణ భగవానుని నిత్యదాసునిగా తన నిజస్థితిని అవగతము చేసికొనినవాడు కృష్ణచైతన్యము నందు వర్తించుట తప్ప మిగిలిన కార్యకలాపములనన్నింటిని త్యజించును. ఇదివరకే వివరింపబడినట్లు, 'బుద్ధి యోగము' అనగా శ్రీకృష్ణభగవానుని దివ్యమగు ప్రేమయుక్త సేవ. అట్టి భక్తియుక్త సేవయే జీవునికి సరియైన కర్మ విధానము. లోభులు మాత్రమే భౌతిక బంధములలో మరింత అధికముగా చిక్కుకొనుచు తమ కర్మ ఫలితముల ననుభవింప గోరుదురు. కృష్ణచైతన్యముతో చేయబడు కర్మలు తప్ప మిగిలిన కర్మలన్నియును కర్తను జననమరణ చక్రమునందు ఎల్లపుడు బంధించునందున అవి హేయములైనట్టివే! కనుకనే ఎవ్వరును అట్టి కర్మలకు కారణమవ్వాలని వాంఛింపకూడదు. ప్రతి కర్మయు శ్రీకృష్ణుని సంతృప్తి కొరకై కృష్ణచైతన్యముతో నిర్వర్తింపవలెను. లోభులు కష్టముతో లేదా అదృష్టముతో సంపాదించిన ధనమును ఎట్లు వినియోగింపవలెనో ఎరుగరు. వాస్తవమునకు మానవుడు తన శక్తి సామర్థ్యములనన్నింటిని కృష్ణచైతన్యము కొరకే వినియోగింపవలెను. అదియే మానవుని జన్మను పరిపూర్ణము చేయగలదు. దురదృష్టవంతులైన వ్యక్తులు లోభులవలె తమ మానవ శక్తిని భగవత్సేవ యందు వినియోగింపరు.

## 2.50

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగ: కర్మసు కౌశలమ్ ॥**

### అనువాదము

**భక్తియుక్త సేవయందు నియుక్తుడైనవాడు ఈ జన్మమునందే సుకృత దుష్కృత ఫలములనుండి విముక్తుడగును. అందుచే సర్వకర్మల యందలి నేర్పుయైనటువంటి ఆ యోగము కొరకు యత్నింపుము.**

## భాష్యము

అనాది కాలమునుండి ప్రతిజీవుడు తాను చేసిన వివిధములైన సుకృత దుష్కృత ఫలములను ప్రోగుచేసుకుని యున్నాడు. కనుకనే అతడు తన నిజస్థితిని గూర్చి ఎరుగలేకున్నాడు. జీవుని అట్టి అజ్ఞానము భగవద్గీత ఉపదేశముచే నశించిపోగలదు. శ్రీకృష్ణభగవానునికి అన్ని రకములుగా శరణు పొందుటచేత, జన్మజన్మల నుండి కలుగుచున్న కర్మలు మరియు వాటి క్రియాప్రతిక్రియ ఫలములనే గొలుసులనుండి ముక్తి నొందవచ్చునని భగవద్గీత జీవునికి బోధించుచున్నది. కనుకనే కర్మఫలములను శుద్ధిచేయు విధానమైనటువంటి కృష్ణచైతన్యమునందు కర్మనొనరింపుమని అర్జునుడు ఆదేశింపబడెను.

## 2.51

**కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణ: ।
జన్మబన్ధవినిర్ముక్తా: పదం గచ్ఛన్త్యనామయమ్ ॥**

## అనువాదము

**ఆ విధముగా భక్తియుక్తసేవ యందు నియుక్తులై మునులు లేక భక్తులు ఈ భౌతిక జగత్తు నందు కర్మఫలముల నుండి తమను విముక్తులను కావించుకొందురు. ఈ విధముగా వారు జననమరణ చక్రము నుండి విడివడి (భగవద్ధామమును తిరిగి చేరుట ద్వారా) దుఃఖరహితమైన స్థితిని పొందుదురు.**

## భాష్యము

ముక్తజీవులు దుఃఖరహితమైన లోకమునకు చెందినవారు. శ్రీమద్భాగవతము (10.14.58) ఇట్లు తెలుపుచున్నది :

సమాశ్రితా యే పదపల్లవప్లవం మహత్పదం పుణ్యయశో మురారే:
భవామ్బుధిర్వత్సపదం పరం పదం పదం పదం యద్విపదాం న తేషామ్

"భౌతికసృష్టికి శరణ్యుడు మరియు ముక్తినిచ్చువాడు లేక ముకుందునిగా ప్రసిద్ధినొందినవాడును అగు భగవానుని పాదపద్మములనెడి నౌకను ఆశ్రయించిన వానికి సంసార సాగరము గోవత్స (ఆవుదూడ) పాదముద్ర యందలి జలము కాగలదు. పరమపదము లేదా భౌతిక దుఃఖరహితమైన ప్రదేశము లేక వైకుంఠమే ఆ భక్తునికి గమ్యస్థానము. అంతే కాని అడుగడుగున అపాయములు ఎరుగు అన్యస్థానము కాదు."

ఈ భౌతిక జగత్తు అడుగడుగున అపాయములతో నిండిన దుఃఖపూరితమైన ప్రదేశమని అజ్ఞానవశమున మానవుడు గుర్తింపజాలడు. అట్టి అజ్ఞానము చేతనే బుద్ధిహీనులు కామ్యకర్మల ద్వారా తమ స్థితిని చక్కపరుచుకొనుటకు యత్నించుదురు. అట్టి కర్మ ఫలములు తమకు ఆనందమును కలిగింప వచ్చునని కూడ వారు భావింతురు. కాని విశ్వమునందు ఎక్కడ ఏ విధమైన భౌతిక శరీరము కూడ దుఃఖరహితమైన జన్మను కలిగింపలేదని వారెరుగరు. ఈ విశ్వమంతటను జన్మము, మృత్యువు, వృద్ధాప్యము, వ్యాధి అనెడి నాలుగురకాల దుఃఖములు వ్యాపించియున్నవి. కాని భగవానుని నిత్యసేవకుడనను తన నిజరూప స్థితిని అవగతము చేసికొనినవాడు, దేవాదిదేవుని స్థితిని ఎరిగి అతని భక్తియుక్త సేవయందు నియుక్తుడగును. తత్ఫలితముగా, అతడు

భౌతికమైనట్టి దుఃఖపూరిత జీవితమునకు గాని కాలము మరియు మరణముల ప్రభావము గాని లేనటువంటి వైకుంఠలోకములందు ప్రవేశించుటకు అర్హుడగుచున్నాడు. వాస్తవమునకు తన నిజ స్థితిని ఎరుగుట యనగా భగవానుని పరమోన్నత స్థితిని ఎరుగటయే. జీవుని స్థితి మరియు భగవానుని స్థితి సమానములేనని తప్పుగా భావించువాడు అంధకారమునందున్నట్టివాడు. కనుక అట్టివాడు భగవానుని భక్తియుక్త సేవయందు ఎన్నడును నెలకొనజాలడు. అట్టివాడు తనకుతానే భగవానుడనని భావిస్తూ జన్మమృత్యు పరంపరకు మార్గమునేర్పరచుకొనును. కాని 'సేవయే తన నిజస్థితి' యని ఎరిగినవాడు శ్రీకృష్ణభగవానుని సేవకు అంకితుడై శీఘ్రమే వైకుంఠ లోకములను పొందుటకు అర్హుడగుచున్నాడు. భగవానుని కొరకు సేవచేయుటయే 'కర్మయోగము' లేక 'బుద్ధియోగము' యనబడును. స్పష్టముగా చెప్పవలెనన్న అదియే భగవానుని పట్ల భక్తియుక్త సేవ యనబడును.

## 2.52

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥**

### అనువాదము

**ఎప్పుడు నీ బుద్ధి మోహమను దట్టమైన అరణ్యమును దాటునో అప్పుడు నీవు వినిన దాని యెడ మరియు వినవలసిన దానియెడ విరక్తిని కలిగిన వాడవగుదువు.**

### భాష్యము

కేవలము భగవానుని పట్ల భక్తియుక్త సేవయందు నెలకొని వేదశాస్త్ర గ్రంథములందు చెప్పబడిన కర్మవిధులను నిర్లక్ష్యపరచిన మహాభక్తుల జీవితముల ఉదాహరణలు అనేకము కలవు. మానవుడు వాస్తవముగా శ్రీకృష్ణుని గూర్చియు మరియు శ్రీకృష్ణునితో తనకు గల సంబంధమును గూర్చియు ఎరిగినప్పుడు తాను అనుభవజ్ఞుడైన బ్రాహ్మణుడు అయినప్పటికిని అతడు పూర్తిగా అన్ని విధములైన కామ్యకర్మల యెడ సహజముగానే విరక్తుడగును. పరమ భక్తుడును మరియు గౌడీయ భక్తిపరంపరలో ఆచారుడైన శ్రీ మాధవేంద్రపురి ఈ క్రింది విధముగా చెబుతున్నాడు :

సంధ్యావందన భద్రమస్తు భవతో భో: స్నాన తుభ్యం నమో
భో దేవా: పితరశ్చ తర్పణవిధౌ నాహం క్షమ: క్షమ్యతామ్
యత్ర క్వాపి నిషద్య యాదవకులోత్తమస్య కంసద్విష:
స్మారం స్మారమఘం హరామి తదలం మన్యే కిమన్యేన మే

"ఓ సంధ్యావందనమా! నీకు జయమగు గాక! ఓ స్నానమా! నేను నీకు ప్రణామములు అర్పింతును. ఓ దేవతలారా! ఓ పితృదేవతలారా! మీకు తర్పణములను అర్పించలేని నా అశక్తతకు నన్ను దయచేసి క్షమింపుడు. ఇప్పుడు నేనెక్కడ నిలిచి యున్నను యదువంశ తిలకుడును కంస విరోధియైన శ్రీకృష్ణుని స్మరించుచు సమస్త పాపబంధములనుండి నేను విముక్తుడను కాగలను. ఇదియే నాకు చాలునని నేను భావించుచున్నాను."

త్రిసంధ్యల యందును వివిధ స్తుతులను కావించుట, ప్రాత:కాలము నందే స్నానము చేయుట, పితృదేవతలకు తర్పణములొసగుట వంటి వేదవిహిత కర్మలు మరియు పద్ధతులు ప్రారంభదశ నందున్న భక్తులకు తప్పని సరియైనవి. కాని, ఎవరైనను పూర్తి కృష్ణ చైతన్యవంతుడై దేవాదిదేవుని ప్రేమయుక్త సేవయందు నెలకొనినప్పుడు అతడు ఈ విధి విధానములన్నింటిని నిర్లక్ష్యపరుచును. ఎందుకనగా, అతడు ఇదివరకే పరిపూర్ణత్వమును పొందియుండెను. శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవద్వారా మానవుడు ఉత్తమ అవగాహన స్థితిని పొందగలిగినచో, శాస్త్రగ్రంథము లందు నిర్దేశింపబడిన వివిధములైన తపస్సులను గాని, యజ్ఞములను గాని అతడు చేయనవసరము లేదు. అట్లే అతడు వేదముల ముఖ్యోద్దేశము శ్రీకృష్ణుని పొందుటయేనని గ్రహింపక కేవలము కర్మకాండలయందే నిమగ్నమైనచో వాటివలన అతడు కాలమును వృథాచేసినట్లే యగును. కృష్ణచైతన్యవంతులు 'శబ్దబ్రహ్మ' పరిమితులకు లేక వేదోపనిషత్తుల ఆదేశములకు అతీతులగుదురు.

## 2.53

**శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥**

## అనువాదము

**ఎప్పుడు నీ బుద్ధి వేదములందలి మృదుమధురమైన వాక్కులచే కలతనొందక ఆత్మానుభూతి యనెడి సమాధియందు స్థితమగునో అప్పుడు నీవు దివ్య చైతన్యమును పొందగలుగుదువు.**

## భాష్యము

ఎవరైన 'సమాధి' మగ్నుడైనాడని చెప్పినచో అతడు కృష్ణచైతన్యమును పూర్తిగా అనుభూతి నొందినవాడని అర్థము. అనగా సంపూర్ణ 'సమాధి' యందు నెలకొనిన మానవుడు బ్రహ్మము, పరమాత్మ, భగవానుడు యనెడి తత్త్వముల అనుభూతిని పొందియుండును. తాను శ్రీకృష్ణుని నిత్య దాసుడననియు మరియు శ్రీకృష్ణుని పట్ల భక్తియుక్త సేవయే నిజమైన స్వధర్మమని ఎరుగుటయే ఆత్మానుభూతి యందలి పరిపూర్ణత్వ స్థితి. కృష్ణచైతన్యవంతుడు లేక శుద్ధభక్తుడు ఎన్నడును వేదముల మృదుమధురమైన వాక్కులచే ఆకర్షింపబడి స్వర్గలోకములను పొందుటకై కామ్యకర్మల యందు నెలకొనరాదు. కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణునితో ప్రత్యక్ష సంబంధమును పొందును కనుక అట్టి ఆధ్యాత్మిక స్థితియందు అతడు శ్రీకృష్ణుని ఆదేశముల నన్నింటిని గ్రహింపగలుగును. అట్టికర్మల ద్వారా అతడు తప్పక సత్ఫలితములను, నిశ్చలమైన జ్ఞానమును పొందగలుగును. దానికొరకై అతడు శ్రీకృష్ణుని లేదా అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని ఆదేశములను మాత్రమే నిర్వహింపవలసి యుండును.

**2.54**
**అర్జున ఉవాచ**
**స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ।**
**స్థితధీ: కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిం ॥**

## అనువాదము

**అర్జునుడు పలికెను : ఓ కృష్ణా! సమాధి మగ్నమైన చైతన్యము గలవాని లక్షణములెట్టివి? అతడు ఎట్లు భాషించును, అతని భాష ఎట్టిది? అతడెట్లు కూర్చుండును మరియు ఎట్లు నడుచును?**

## భాష్యము

ప్రతి మానవునికి తన ప్రత్యేక స్థితి ననుసరించి కొన్ని లక్షణములు ఉండునట్లుగా కృష్ణచైతన్యవంతుడు కూడ తన ప్రత్యేక స్వభావమునకు తగినటు వంటి మాట, నడక, ఆలోచన, భావనాదులు కలిగియుండును. ధనికుడైనవాడు ధనికునిగా గుర్తింపబడుటకు కొన్ని ప్రత్యేక లక్షణములను కలిగి యుండునట్లుగా మరియు రోగియైనవాడు రోగిగా గుర్తింపబడుటకు కొన్ని లక్షణములను కలిగి యుండునట్లుగా, విద్వాంసునికి కొన్ని ప్రత్యేక లక్షణము లుండునట్లుగా, దివ్యమైన కృష్ణచైతన్యమునందున్న వ్యక్తి తన వివిధ వ్యవహారములందు కొన్ని ప్రత్యేక లక్షణములను కలిగియుండును. భక్తుని అట్టి ప్రత్యేక లక్షణముల గూర్చి భగవద్గీత నుండి తెలుసుకోవచ్చును. భాషించుట అనునది మానవుని ప్రధాన లక్షణమగుటచే కృష్ణచైతన్యవంతుడు ఎట్లు భాషించుననెడి విషయము అత్యంత ముఖ్యమైనది. మూర్ఖుడు భాషించనంత వరకే మూర్ఖుడుగా గుర్తింపబడడనెది తెలిసిన విషయమే. మూర్ఖుడు చక్కటి దుస్తులను ధరించినను అతడు భాషించనంత వరకే మూర్ఖుడుగా గుర్తింపబడకున్నను, అతడు భాషించినంతటనే నిజస్థితి వెల్లడియగును. కృష్ణచైతన్యవంతుని ముఖ్య లక్షణమేమనగా అతడు కేవలము శ్రీకృష్ణుని గూర్చి మరియు అతనికి సంబంధించిన విషయములను గూర్చి మాత్రమే భాషించును. క్రింద తెలుపబడనున్నట్లు, ఇతర లక్షణములు సహజముగానే సమకూరును.

**2.55**
**శ్రీభగవానువాచ**
**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్।**
**ఆత్మన్యేవాత్మనా తుష్ట: స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥**

## అనువాదము

**దేవాదిదేవుడు పలికెను : ఓ పార్థా! మనోకల్పితములైన ఇంద్రియతృప్తిని కలిగించు సర్వవిధములైన కోరికలను మానవుడెప్పుడు త్యజించునో మరియు ఆ విధముగా శుద్ధిపడిన మనస్సు ఎప్పుడు ఆత్మయందు తృప్తినొందునో అప్పుడతడు స్థితప్రజ్ఞుడని చెప్పబడును?**

## భాష్యము

కృష్ణచైతన్యము నందు లేక భక్తియుక్తమైన భగవత్సేవయందు పూర్తిగా నెలకొనినట్టి వ్యక్తి సమస్త సాధుసద్గుణములను కలిగి యుండుననియు, అట్లు దివ్యమైన ఆధ్యాత్మిక స్థితియందు నెలకొననివాడు తన మనోకల్పనలను ఆశ్రయించుచుండుటచే ఎట్టి సద్గుణములను కలిగియుండజాలడనియు శ్రీమద్భాగవతము (5.18.12) చెప్పుచున్నది. కనుకనే మనోకల్పితములైన అన్నిరకాల ఇంద్రియ భోగములను మానవుడు త్యజింపవలెనని ఇక్కడ చక్కగా చెప్పబడినది. వాస్తవమునకు అట్టి ఇంద్రియ వాంఛలను కృత్రిమముగా త్యజించుట కష్టము. కాని ఎవరైనను కృష్ణచైతన్యమునందు నెలకొనినంతనే అప్రయత్నముగానే బాహ్య ప్రయత్నములేవి లేకుండ ఇంద్రియ వాంఛలన్నియు నశించుపోవును. కనుకనే మానవుడు నిశ్శంకోచముగాకృష్ణచైతన్యమునందు నెలకొనవలెను. ఎందుకనగా, ఈ భక్తియుక్త సేవయే మానవుని ఆధ్యాత్మికస్థితి నందుకొనుటకు వెంటనే తోడ్పడును. పరిపక్వ బుద్ధిగల జీవుడు (మహాత్ముడైనట్టి వాడు) తాను భగవానుని నిత్యదాసుడునని గుర్తించి సదా తనయందు తానే తృప్తినొందుచుండును. అట్టి ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొనినట్టి వ్యక్తి తుచ్ఛమైన భౌతిక ఇంద్రియ వాంఛలకు లోబడియుండడు. అనగా దేవాదిదేవుని నిత్యసేవయనెడి తన సహజ స్థితి యందు అతడు సదా ప్రసన్నుడై యుండును.

### 2.56

**దుఃఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగతస్పృహ: ।**
**వీతరాగభయక్రోధ: స్థితధీర్మునిరుచ్యతే ॥**

## అనువాదము

**త్రివిధ తాపములందును కలతనొందని మనస్సు గలవాడును, సుఖము కలిగినప్పుడు ఉప్పొంగనివాడును, ఆశక్తి, భయము, క్రోధముల నుండి విడివడినవాడును అగు మానవుడు స్థిరమైన మనస్సు గల ముని యని చెప్పబడును.**

## భాష్యము

'ముని' అను పదమునకు ఒక స్థిరమైన నిర్ణయమునకు రాకుండ మానసిక కల్పనలతో అనేక విధములుగ మనస్సును కలతపెట్టు వాడని అర్థము. ప్రతి మునికి కూడ ఒక ప్రత్యేక దృక్కోణముండును. ఒక ముని ఇతర మునులకు భిన్నముగా ఉండనిచో వాస్తవ అర్థములో అతడు ముని అని పిలువాబడుటకు అర్హుడు కాజాలడు. "నా చాసావృషిర్యస్య మతం న భిన్నమ్." (మహాభారతము, వనపర్వము 313.117) కాని భగవానుడు ఇక్కడ తెలిపిన 'స్థితధీర్ముని' సామాన్య మునులకంటె భిన్నుడు. అట్టి 'స్థితధీర్ముని' మనోకల్పిత భావములనన్నింటిని త్యజించుటచే సదా కృష్ణచైతన్యమునందుండును. 'స్తోత్ర రత్నము' (43) ననుసరించి, 'ప్రశాంతనిశ్శేషమనోరథాంతర' అతడు అన్ని రకముల మనో కల్పనాభావములను అధిగమించి శ్రీకృష్ణుడే లేక వాసుదేవుడే సర్వమనెడి స్థిరనిశ్చయమును కలిగియుండును – 'వాసుదేవ: సర్వమితి మహాత్మా సుదుర్లభ:' (భ.గీ.7.19). అట్టివాడే

స్థిరబుద్ధి కలిగినట్టి ముని అని చెప్పబడును. అట్టి సంపూర్ణ కృష్ణచైతన్య వంతుడైన వ్యక్తి త్రివిధతాపములందును ఎట్టి కలతనొందడు. ఎందుకనగా, అతడు తన పూర్వజన్మ కర్మల చేత మరింత అధిక దుఃఖములను పొందుటకు పాత్రుడునని భావించును. అట్టి తాపత్రయముల నన్నింటిని భగవానుని కృపగా అంగీకరించును. అంతేకాకుండ, భగవానుని కృపచేత తన దుఃఖములన్నియు సాధ్యమైనంత తక్కువ పరిమాణమున కలుగుచున్నవనియు అతడు విశ్వశించును. అట్లే సుఖము కలిగినప్పుడు అతడు ఆ సుఖమునకు తాను అర్హుడను కానని భావిస్తూ అట్టి కీర్తిని శ్రీకృష్ణునకు ఆపాదించును. అతడు భగవానుని కృపచేతనే అట్టి అనుకూల సుఖ వాతావరణము నందు నిలిచి భగవానునికి చక్కటి సేవను అందించగలుగుతున్నానని గ్రహింపగలుగును. భగవత్సేవ కొరకు ఆ భక్తుడు ఎల్లప్పుడును ధైర్యమును కలిగియుండి క్రియాశీలుడై ఆసక్తి (రాగ) మరియు అనాసక్తులచే (ద్వేష) ప్రభావితుడు కాకుండును. ఇంద్రియ సుఖము కొరకు దేనినైనను గ్రహించుట యనునది ఆసక్తి కాగా, అట్టి భౌతిక ఇంద్రియ సుఖములందు ఆసక్తి లేకుండుట అనాసక్తి యనబడును. కాని కృష్ణ చైతన్యమునందు నెలకొనినట్టి వ్యక్తి జీవితము శ్రీకృష్ణభగవానుని సేవ కొరకే అంకితమైయుండుటచేత అతడు అట్టి ఆశక్తి మరియు అనాసక్తులకు అతీతుడగును. కనుకనే తన ప్రయత్నములు విఫలమైనను అతడు ఏమాత్రము క్రోధమునకు గురికాడు. విజయము లభించినను, లభింపకున్నను కృష్ణచైతన్యవంతుడు సర్వదా స్థిరనిశ్చయమును కలిగియుండును.

## 2.57

**యః సర్వత్రానభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

### అనువాదము

**ఈ భౌతిక జగత్తునందు ప్రాప్తించిన మంచి, చెడులను ప్రశంసించుట గాని, ద్వేషించుట గాని చేయక వాటిచే ప్రభావితుడు కానివాడు సంపూర్ణ జ్ఞానము నందు సుస్థిరుడై యుండును.**

### భాష్యము

భౌతిక జగత్తు నందు ఎల్లప్పుడును మంచిచెడులలో ఏదియోనొకటి సంభవించుచుండును. అట్టి భౌతికములైన ఒడిదుడుకులచే కలతనొందక మంచిచెడులచే ప్రభావితుడు కానివాడు కృష్ణచైతన్యము నందు ఈస్థిరుడైనవాడని అవగతము చేసుకొనవచ్చును. భౌతిక జగత్తు ద్వంద్వములతో నిండియుండుట చేత ఈ జగత్తున జీవించియున్నంతకాలము మంచిచెడులలో ఏదియోనొకటి సంభవించుచునే యుండును. కాని కృష్ణచైతన్యము నందు నెలకొని యుండువాడు ద్వంద్వ రహితుడై శ్రీకృష్ణుని గూర్చియే సదా స్మరించుట చేత అట్టి మంచి చెడులచే ప్రభావితుడు కాడు. అట్టి కృష్ణచైతన్యము పారిభాషికముగా 'సమాధి' యనబడు పరిపూర్ణ ఆధ్యాత్మిక స్థితియందు మానవుని నెలకొల్ప గలదు.

## 2.58
**యదా సంహరతే చాయం కూర్మో౾/ఙ్గానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

## అనువాదము

**తాబేలు తన అవయవములను లోనికి ముడుచుకొనునట్లు, ఇంద్రియార్థముల నుండి తన ఇంద్రియములను మరలించువాడు సంపూర్ణజ్ఞానము నందు సుస్థిరముగా నున్నవాడగును.**

## భాష్యము

తన ఇంద్రియములను తాను కోరినట్లుగా ఒక పద్ధతి ప్రకారము నియంత్రింప గలుగుటయే యోగికి లేదా భక్తునికి లేదా ఆత్మానుభూతిని పొందినవానికి పరీక్షయై యున్నది. సాధారణముగా జనులు ఇంద్రియములకు దాసులై వాటి ఆదేశములననుసరించి వర్తించుదురు. యోగి ఎట్లుండునను ప్రశ్నకు ఇదియే సమాధానము. ఇంద్రియములు విషసర్పములతో పోల్చబడినవి. అవి సదా తమ ఇష్టానుసారము ఎట్టి నియంత్రణ లేకుండ విచ్చలవిడిగా యథేచ్ఛగా వర్తింపగోరుచుండును. కనుక పాములవాడు పాములను నియంత్రించినట్లు యోగి లేక భక్తుడు ఈ సర్పములను నియంత్రించు పాములవానివలె గొప్ప సామర్థ్యమును కలిగియుండవలెను. అతడు వానినెప్పుడును యథేచ్ఛగా సంచరించుటకు అనుమతించరాదు. వేదములు మున్నగు ప్రామాణిక గ్రంథములందు ఈ విషయమును గూర్చి అనేక ఆదేశములు గలవు. అందులో కొన్ని విధులు కొన్ని నేషేదములు గలవు. మానవుడు విధినిషేధములను అనుసరింపగలిగి ఇంద్రియ భోగానుభవములను నియంత్రింపనిదే కృష్ణచైతన్యము నందు స్థిరత్వము సాధ్యము కాదు. ఈ విషయమున తాబేలు ఒక మంచి ఉపమానముగా తెలుపబడినది. తాబేలు తన అవయవములను ఏ సమయమునందైనను ముడుచుకొని, ప్రత్యేక ప్రయోజనము కొరకు మరల ఏ క్షణమైనను వానిని ప్రదర్శింపగలదు. అట్లే, కృష్ణచైతన్యవంతులైన వ్యక్తుల ఇంద్రియములు కేవలము భగవత్సేవలో ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకై వినియోగింపబడి, ఇతర విషయముల నుండి ఉపసంహరింపబడును. ఇంద్రియములను స్వయంతృప్తి కొరకు కాకుండ భగవత్సేవ కొరకు వినియోగింప వలెనని అర్జునునికి ఇక్కడ ఆదేశింపబడుచున్నది. ఇంద్రియముల నన్నింటిని శ్రీకృష్ణభగవానుని సేవయందే నెలకొల్పవలెనను విషయమునకు ఇక్కడ ఇంద్రియములను సదా తన యందే ముడుచుకొని యుండు తాబేలు ఉపమానముతో పోల్చి తెలుపబడినది.

**2.59**
**విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహిన: ।**
**రసవర్జం రసో౭ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥**

## అనువాదము

**బద్ధజీవుడు ఇంద్రియభోగముల నుండి నిగ్రహించబడినను ఇంద్రియార్థముల పట్ల రుచి అట్లే నిలిచియుండును. కాని అత్యున్నతమైన కృష్ణ చైతన్యమను రసాస్వాదన పిమ్మట అతనికి ఇంద్రియార్థముల పట్ల రుచి కూడ నశించును.**

## భాష్యము

మానవుడు ఆధ్యాత్మిక స్థితియందు నెలకొనకుండ ఇంద్రియ భోగముల నుండి విడివడుట సాధ్యము కాదు. నియమ నిబంధనల ద్వారా ఇంద్రియ భోగానుభావమును నిగ్రహించుట యనునది రోగిని కొన్ని ఆహారపదార్థములనుండి నిగ్రహించుట వంటిది. ఆ రోగికెన్నడును అట్టి నియమములు రుచింపవు. అంతేకాకుండ, అతడు ఆహారపదార్థముల యందు కోరికను పోగొట్టుకొనజాలడు. అట్లే, అల్పజ్ఞులైన మానవుల కొరకు 'యమ', 'నియమ', 'ఆసనము', 'ప్రాణాయామ', 'ప్రత్యాహార', 'ధారణా', 'ధ్యాన', ప్రక్రియలు కలిగిన 'అష్టాంగయోగ' విధానము ఇంద్రియ నియంత్రణ కొరకై నిర్దేశింపబడినది. కాని కృష్ణచైతన్యము నందు పురోభివృద్ధి నొంది శ్రీకృష్ణభగవానుని దివ్య సౌందర్యమును ఆస్వాదించిన భక్తుడు శుష్కములైన భౌతిక విషయముల పట్ల రుచిని కలిగియుండడు. అనగా నియమ నిబంధనలనునవి ఆరంభదశ నందున్న భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధి కొరకై ఏర్పాటు చేయబడినవి. కృష్ణచైతన్యము నందు నిజమైన రసాస్వాదనము కలుగనంత వరకే అవి ఉచితములుగా నుండును. కాని మానవుడు కృష్ణచైతన్యమున స్థితుడైనంతనే, శుష్క విషయములందు అప్రయత్నముగనే రుచిని కోల్పోవును.

**2.60**
**యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చిత: ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మన: ॥**

## అనువాదము

**ఓ అర్జునా! ఇంద్రియములు బలవంతములును మరియు దృఢములును అయియున్నవి. వానిని నిగ్రహించుటకు గాఢముగా యత్నించు యుక్తాయుక్త జ్ఞానము గల పండితుని యొక్క మనస్సును కూడ అవి బలవంతముగా హరించి వేయుచున్నవి.**

## భాష్యము

ఇంద్రియములను జయించుటకు యత్నించు మునులు, తత్త్వజ్ఞులు, జ్ఞానులు ఈ లోకమునందు ఎందరో కలరు. కాని వారట్లు ఎంత తీవ్రముగా యత్నించినను వారియందు మిక్కిలి గొప్పవారు కూడ ఒకప్పుడు కలత పొందిన మనస్సు కారణముగా

భౌతికమైన ఇంద్రియానుభవమునకు వశులగుదురు. మహాయోగి, మహాతాపసియైన విశ్వామిత్రుడు కూడ కఠిన తపస్సు చేతను, యోగాభ్యాసము చేతను ఇంద్రియములను నియంత్రించుటకు యత్నించినను, మేనక చేత ఆకర్షింపబడి భోగానుభవమునకు వశుడయ్యెను. ప్రపంచ చరిత్ర యందు ఇట్టి ఉదాహరణలు అనేకము గలవు. కనుక సంపూర్ణముగా కృష్ణచైతన్యము నందు నెలకొననిచో ఇంద్రియములను మరియు మనస్సును నియంత్రించుట మిక్కిలి కష్టము. మనస్సును శ్రీకృష్ణునికి అర్పింపకుండ అట్టి భౌతిక కార్యకలాపములను విరమించుట ఎవ్వరికిని సాధ్యముకాదు. గొప్పముని, భక్తుడైన శ్రీయమునాచార్యులు ఒక చక్కని ఉదాహరణను ఈ క్రింది శ్లోకమున ఈ విధముగా అందించిరి :

యదవధి మమ కృష్ణపదారవిన్దే
నవనవరసధామన్యుద్యతం రంతుమాసీత్
తదవధి బత నారీసంగమే స్మర్యమాణే
భవతి ముఖవికార: సుష్ఠు నిష్ఠీవనం చ

"శ్రీకృష్ణభగవానుని పాదపద్మ సేవయందు నా మనస్సు సదా నెలకొని యుండుట చేతను మరియు అనుక్షణము నేనొక నవ్య దివ్యరసమును ఆస్వాదించుట చేతను, స్త్రీతో సంభోగవాంఛ స్ఫురించినంతనే నేను విముఖుడనై ఆ భావముపై ఉమ్మి వేయుదును."

కృష్ణచైతన్యము దివ్యమైనదగుటచే దానిని పొందినవాడు భౌతిక భోగానుభవము పట్ల రుచిని సహజముగానే కోల్పోవును. అట్టి కృష్ణచైతన్యవంతుడు పుష్టికరమైన ఆహారముతో ఆకలిని పోగొట్టుకొనుటవంటిది. అంబరీష మహారాజు తన మనస్సును సదా కృష్ణచైతన్యమునందు సంలగ్నము చేసి యుండుటచే అతడు గొప్ప మునియైన దుర్వాసునిని కూడ జయింపగలిగెను. "స వై మన: కృష్ణపాదారవిన్దయోర్వచాంసి వైకుంఠగుణానవర్ణనే" (భాగ. 9.4.18)

## 2.61

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పర: ।**
**వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

### అనువాదము

**తన ఇంద్రియములను నిగ్రహించి వానిని పూర్తిగా తన వశము నందుంచుకొని బుద్ధిని నాయందే స్థిరముగా లగ్నము చేయువాడు స్థితప్రజ్ఞుడనబడును.**

### భాష్యము

కృష్ణచైతన్య మనునది అత్యున్నతమైన యోగాపరిపూర్ణత్వమని ఈ శ్లోకమునందు స్పష్టముగా వివరింపబడినది. కృష్ణచైతన్యము లేకుండ ఎవ్వరికిని ఇంద్రియములు నిగ్రహించుట సాధ్యపడదు. పైన తెలుపబడినట్లు, దుర్వాసుడు అంబరీష మహారాజుతో కలహించి గర్వముచే అనవసరముగా క్రోధితుడై తన ఇంద్రియములను నిగ్రహించలేకపోయెను. మరోప్రక్క అంబరీష మహారాజు అతనివలె గొప్ప యోగశక్తి శంపన్నుడు కాకున్నను, భగవద్భక్తుడగుటచే ఆ ముని కావించిన అన్యాయములన్నింటిని మౌనముగా భరించి చివరకు విజయవంతుడయ్యెను.

శ్రీమద్భాగవతము (9.4.18-20) నందు చెప్పబడినట్లు, ఈ క్రింది గుణవిశేషములచే రాజు తన ఇంద్రియములను నియంత్రింపగలిగెను :

స వై మన: కృష్ణపదారవిన్దయోర్వచాంసి వైకుంఠగుణానువర్ణనే
కరౌ హరేర్మన్దిరమార్జనాదిషు శ్రుతిం చకారాచ్యుతసత్కథోదయే

ముకున్దలింగాలయదర్శనే దృశౌ తద్భృత్యగాత్రస్పర్శే/ంగసంగమమ్
ఘ్రాణం చ తత్పాదసరోజసౌరభే శ్రీమత్తులస్యా రసనాం తదర్పితే

పాదౌ హరే: క్షేత్రపదానుసర్పణే శిరో హృషీకేశపదాభివన్దనే
కామం చ దాస్యే న తు కామకామ్యయా యథోత్తమశ్లోకజనాశ్రయా రతి:

అంబరీష మహారాజు తన మనస్సును శ్రీకృష్ణభగవానుని పాదపద్మములయందు సుస్థిరముగా నెలకొల్పెను. అతడు శ్రీకృష్ణుని ధామమును వర్ణించుట యందు తన వాక్కును వినియోగించెను. శ్రీకృష్ణుని మందిరములను శుభ్రపరుచుటయందు తన హస్తములను, ఆ భగవానుని లీలాకథలను శ్రవణము చేయుట యందు తన వీనులను, ఆ దేవాదిదేవుని సుందరమైన రూపమును గాంచుట యందు తన నేత్రములను, భక్తుల దేహములను స్పృశించుట యందు తన దేహమును, ఆ దేవాదిదేవుని పాదపద్మముల చెంత అర్పింపబడిన పుష్పముల సుగంధమును ఆస్వాదించుట యందు తన నాసికను, భగవానునికి అర్పింపబడిన తులసీదళములను రుచిచూచుట యందు తన జిహ్వను, ఆ శ్రీహరి మందిరములు గల పవిత్ర క్షేత్రములను సందర్శించుట యందు తన పాదములను, ఆ హృషీకేశుని పాదములకు ప్రణామము లర్పించుట యందు తన శిరమును, తన వాంఛలనన్నింటిని ఆ ఉత్తమశ్లోకుడు, శ్రీకృష్ణుని కోరికలను తీర్చుటయందు పూర్తిగా వినియోగించెను.” ఈ గుణలక్షణములన్నియు అతణ్ణి ‘మత్పర:’ భగవంతుని భక్తుడగుటకు అర్హుని చేసినవి.

ఈ సందర్భమున ‘మత్పర:’ అను పదము మిక్కిలి ప్రాధాన్యతను కలిగియున్నది. మానవుడు ఏ విధముగా ‘మత్పర:’ భక్తుడు కాగలడో అంబరీషమహారాజు జీవితము ద్వారా వర్ణింపబడినది. గొప్ప విద్వాంసుడు మరియు ‘మత్పర:’ భక్తిపరంపరలో ఆచార్యుడైన శ్రీల బలదేవ విద్యాభూషణులు ఈ విధముగా తెలిపెను : “మద్భక్తిప్రభావేన సర్వేంద్రియ విజయపూర్వికా స్వాత్మదృష్టి: సులభేతి భావ:” – “శ్రీకృష్ణుని కొరకై చేయు భక్తియుక్తసేవా బలము చేతనే ఇంద్రియములను పూర్తిగ నియంత్రింపవచ్చును.” ఈ విషయమున అగ్నియొక్క ఉదాహరణము కూడ కొన్నిమార్లు ఇవ్వబడుచుండును. “మండుచున్న అగ్ని గదిలోని వస్తువులనన్నింటిని దహించునట్లుగా, యోగి హృదయము నందు నెలకొనినట్టి విష్ణుభగవానుడు అన్నిరకములైన పాపములను దహించివేయుచుండును.” శూన్యమును కాకుండ విష్ణుభగవానునే ధ్యానింపవలెనని ‘యోగసూత్రము’లు కూడ చెప్పుచున్నవి. విష్ణువు కొరకై కాకుండ ఇతరములైన వాటిని ధ్యానించు నామమాత్ర యోగులు ఊహాకల్పిత విషయముల కొరకై అన్వేషించుచు కాలము వృథాచేయుదురు. కాని మనము కేవలము కృష్ణచైతన్యవంతులము కావలెను. అనగా దేవాదిదేవునియందు భక్తిని కలిగియుండవలెను. అదియే నిజమైన యోగము యొక్క ముఖ్యోద్దేశము.

**2.62**
**ధ్యాయతో విషయాన్ పుంస: సంఙ్గస్తేషూపజాయతే ।**
**సంఙ్గాత్సంజాయతే కామ: కామాత్క్రోధో/భిజాయతే ॥**

## అనువాదము

**ఇంద్రియార్థములను గూర్చి ధ్యానించునపుడు వాని యెడ మానవునికి ఆసక్తి కలుగును. అట్టి ఆసక్తి నుండి కామము జనించును. కామము నుండి క్రోధము ఉద్భవించును.**

## భాష్యము

కృష్ణచైతన్యము లేనివాడు ఇంద్రియార్థములను గూర్చి చింతించుచున్నప్పుడు భౌతిక వాంఛలచే ప్రభావితుడగును. వాస్తవమునకు ఇంద్రియములకు మంచి కార్యక్రమములు ఎల్లవేళలా అవసరము. శ్రీకృష్ణభగవానుని ప్రేమయుక్త సేవయందు వాటిని వినియోగించనిచో అవి భౌతికవస్తు సేవలో తప్పక నెలకొనదలచును. ఈ భౌతిక ప్రపంచమున బ్రహ్మ రుద్రాదులతో సహా ప్రతియొక్కరు ఇంద్రియార్థ ప్రభావమునకు లోనగుదురు. అట్టియెడ స్వర్గలోకములందలి దేవతల గూర్చి వేరుగా చెప్పనవసరము లేదు. భౌతికజగత్తు యొక్క ఈ బంధముల చిక్కుముడి నుండి బయటపడుటకు కృష్ణచైతన్యము స్వీకరించుట ఒక్కటే మార్గము. పరమశివుడు గాఢముగా ధ్యానమగ్నుడై యుండగా పార్వతీదేవి ఇంద్రియభోగము కొరకై అతనిని చలింపజేసెను. అందుకు అతడు అంగీకరించుట, కార్తికేయుడు జనించుట సంభవించెను. శ్రీకృష్ణభగవానుని భక్తుడైన హరిదాస ఠాకూరును కూడ మాయాదేవి అవతారము అట్లే మోహమునకు గురిచేయుటకు యత్నించెను. కాని యువకుడైన హరిదాసుడు శ్రీకృష్ణభగవానుని పట్ల గల అచంచలమైన భక్తికారణమున అట్టి పరీక్షలో సులభముగా ఉత్తీర్ణుడు కాగాలిగెను. పూర్వపు శ్లోక భాష్యములో శ్రీయమునాచార్యులచే చెప్పబడినట్లుగా, భగవానుని సహచర్యమున కలుగు ఆధ్యాత్మికానుభూతి యొక్క దివ్య రసాస్వాదనము కారణమున శుద్ధభక్తుడు సర్వవిధములైన ఇంద్రియ భోగములను త్యజించును. భక్తుల విజయ రహస్యమిదియే. కనుక కృష్ణ చైతన్యము నందు నెలకొననివారు కృత్రిమ మార్గములచే ఇంద్రియములను అణుచటలో ఎంతటి శక్తి సంపన్నులైనను చివరికి పరాజయమునే పొంది తీరుదురు. ఇంద్రియ తృప్తికి సంబంధించిన లేశమాత్ర చింతయైనను కోరికలను తృప్తిపరచుకొనుటకై అతనిని ప్రేరేపించును.

**2.63**
**క్రోధాద్భవతి సమ్మోహ: సమ్మోహాత్ స్మృతివిభ్రమ: ।**
**స్మృతిభ్రంశాద్ బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥**

## అనువాదము

**క్రోధము వలన అధిక మోహము కలుగును. అధికమైన మోహము వలన స్మృతి భ్రాంతికి గురియగును. స్మృతి భ్రాంతిచే బుద్ధి నశించును. బుద్ధి నశించినపుడు మానవుడు తిరిగి సంసారసాగరమున పడిపోవును.**

## భాష్యము

శ్రీల రూపగోస్వామి మనకు ఈక్రింది ఉపదేశమును ఇట్లు అందించిరి :

ప్రాపంచికతయా బుద్ధ్యా హరిసమ్బన్ధివస్తున:
ముముక్షుభి: పరిత్యాగో వైరాగ్యం ఫల్గు కథ్యతే

(భక్తిరసామృత సింధువు 1.2.258)

కృష్ణచైతన్యము నందు పురోభివృద్ధిని సాధించినప్పుడు ప్రతిదియు భగవత్సేవ యందు వినియోగపడునను విషయమును మానవుడు ఎరుగగలడు. కృష్ణచైతన్య విజ్ఞానము లోపించిన కొందరు కృత్రిమముగా విషయ వస్తువులను త్యజించుటకు ప్రయత్నింతురు. తత్ఫలితముగా, భౌతిక బంధముల నుండి వారు విముక్తిని కోరుకున్నను వైరాగ్యమునందు పరిపూర్ణస్థితిని మాత్రము పొందజాలరు. వారి వైరాగ్యము 'ఫల్గు' అనగా 'అప్రధానమైనది' యనబడును. కాని, కృష్ణచైతన్యవంతుడు ఏ విధముగా ప్రతిదానిని శ్రీకృష్ణుని సేవయందు వినియోగింపవలెనో ఎరిగియుండును. కనుకనే అతడు భౌతికచైతన్యమునకు ఎన్నడు బలికాజాలడు. ఉదాహరణకు భగవానుడు లేక పరమ సత్యము నిరాకారుడు అయినందున భుజింపడని భావించి, నిరాకారవాది రుచికరమైనట్టి ఆహారపదార్థములను త్యజించుటకు యత్నించును. కాని భక్తుడైనవాడు శ్రీకృష్ణుడు పరమభోక్తయనియు మరియు భక్తితో అర్పించిన దానినంతటిని ఆరగించుననియు ఎరుగును. కనుక రుచికరమైన ఆహారపదార్థములను తొలుత భగవానునికి అర్పించి పిదప ప్రసాదముగా పిలువబడు ఉచ్ఛిష్టమును అతడు గ్రహించును. ఆవిధముగా ప్రతిది ఆధ్యాత్మికమగుట చేత భక్తునికి పతనభయముండదు. భక్తుడు ప్రసాదమును భక్తితో అనగా కృష్ణచైతన్యముతో స్వీకరింపగా, అభక్తుడైనవాడు దానిని భౌతికమైనదని భావించివర్జించును. కనుకనే నిరాకారవాదులు తమ కృత్రిమ వైరాగ్యము వలన జీవితానందమును అనుభవింపజాలరు. ఈ కారణము చేతనే స్వల్పమైన మానసిక సంక్షోభము కూడ అతడిని మరల భౌతిక జీవితమను కూపమునందే పడవేయును. భక్తియుక్త సేవను ఆశ్రయింపనందున వారు ముక్తినొందు స్థితికి ఎదిగినను, అట్టివారు తిరిగి పతనము నొందుదురని తెలుపబడినది.

## 2.64

**రాగద్వేషవిముక్తైస్తు విషయానిన్ద్రియైశ్చరన్ ।**
**ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥**

## అనువాదము

**కాని సమస్త రాగద్వేషముల నుండి విముక్తి నొందినవాడును మరియు నియమ నిబంధనలననుసరించి వర్తించుట ద్వారా ఇంద్రియములను నిగ్రహింప గలిగినవాడును అగు మానవుడు భగవానుని సంపూర్ణ కృపను పొందగలుగును.**

## భాష్యము

కృత్రిమమైన విధానములచే ఇంద్రియములను బాహ్యముగా నియంత్రించినను వానిని భగవానుని దివ్య ప్రేమయుక్త సేవయందు నెలకొల్పనిచో పతనము తప్పదని ఇదివరకే వివరింపబడినది. కృష్ణచైతన్యము నందు సంపూర్ణముగా నెలకొనినట్టి వ్యక్తి బాహ్యమునకు భోగానుభవస్థితిలో నున్నట్లుగా కనబడినను తాను కృష్ణచైతన్యము కలిగియుండుట చేత ఇంద్రియ భోగకర్మల యెడ ఆశక్తిలేనివాడై యుండును. కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణుని తృప్తి పరచుటను తప్ప మరిదేనిని వాంఛింపడు. కనుకనే అతడు సమస్త రాగద్వేషములకు అతీతుడైయుండును. శ్రీకృష్ణుడు కోరినచో సామాన్య దృష్టికి వాంఛనీయము కాని కార్యమును కూడ భక్తుడు చేయును. అట్లే శ్రీకృష్ణుడు కోరనిచో అతడు సామాన్య పరిస్థితులలో తన తృప్తికొరకై ఒనరించు కర్మను కూడ చేయకుండును. అతడు కేవలము శ్రీకృష్ణుని ఆదేశముల ననుసరించియే వర్తించుచుండును. కనుక దేనినైనను చేయుట లేక చేయకపోవుట యనెడి రెండు విషయములు ఆ భక్తుని ఆధీనములోనే యుండును. భక్తుని ఇట్టి చైతన్యము కేవలము భగవానుని అవ్యాజ కృప మాత్రమే. భోగానుభవ స్థితియందున్నప్పటికిని భక్తుడు ఈ చైతన్యమును పొందగలడు.

**2.65**

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధి: పర్యవతిష్ఠతే ॥**

## అనువాదము

**ఈ విధముగా కృష్ణచైతన్యము నందు సంతృప్తి చెందినవానికి భౌతిక జీవితమునకు సంబంధించిన త్రివిధ తాపములు కలుగవు. అట్టి సంతృప్తితో కూడిన చైతన్యము కలిగిన మానవుని బుద్ధి శీఘ్రమే సుస్థిరమగును.**

**2.66**

**నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చాభావయత: శాన్తిరశాన్తస్య కుత: సుఖమ్ ॥**

## అనువాదము

**భగవానునితో సంబంధమును పొందనివాడు (కృష్ణచైతన్యము లేనివానికి) విశుద్ధ బుద్ధిని గాని, స్థిరమైన మనస్సును గాని కలిగి యుండజాలడు. అవి లేనిదే శాంతిని పొందుటకు అవకాశము లేదు. ఇక శాంతి లేనిదే సుఖమెట్లు కలుగును?**

## భాష్యము

మానవుడు కృష్ణచైతన్యము నందు నెలకొననిదే శాంతిని పొందుటకు అవకాశమే లేదు. శ్రీకృష్ణుడే సకల యజ్ఞములకును, తపస్సులకును ఫలభోక్తయనియు, అతడే సకల సృష్టులకు ప్రభువనియు, అతడే సకల జీవులకు నిజమైన మిత్రుడనియు

మానవుడు అవగతము చేసికొనినప్పుడే నిజమైన శాంతిని పొందగలడని భగవద్గీత (5.29) యందు వివరింపబడినది. కనుకనే మానవుడు కృష్ణచైతన్యవంతుడు కానిచో అతని మనస్సునకు పరమలక్ష్యము లభింపదు. పరమలక్ష్యము లేనందునే మనస్సు చంచలమగును. శ్రీకృష్ణుడే సర్వులకు మరియు సమస్తమునకు భోక్త, ప్రభువు, మిత్రుడని ఎరిగినప్పుడే మానవుడు స్థిరమైన మనస్సుతో శాంతిని పొందగలడు. కనుక శ్రీకృష్ణునితో ఎటువంటి సంబంధము లేకుండా వివిధ కార్యములలో నెలకొనినవాడు జీవితమునందు శాంతిని, ఆధ్యాత్మిక పురోగతిని సాధించుచున్నట్లు పైకి కనబడుచున్నను వాస్తవమునకు అశాంతితో ఎల్లప్పుడు ఆందోళన చెందుచుండును. కృష్ణచైతన్యము అనునది సహజముగా వ్యక్తమయ్యే దివ్యమైన శాంతిస్థితి. అట్టి దివ్యస్థితి శ్రీకృష్ణునితో గల దివ్య సంబంధముతోనే ప్రాప్తమగును.

## 2.67

**ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనో౽నువిధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివామ్భసి ॥**

### అనువాదము

**బలమైన వాయువుచే నీటియందలి నావ త్రోసివేయబడినట్లు, మనస్సు దానియందు లగ్నమైనప్పుడు చంచలమైన ఏ ఒక్క ఇంద్రియమైనను మానవుని బుద్ధిని హరింపగలదు.**

### భాష్యము

ఇంద్రియములన్నింటిని భగవత్సేవ యందు నెలకొల్పవలెను. ఏ ఒక్క ఇంద్రియమైనను భోగానుభవములో నెలకొనినచో అది భక్తుని ఆధ్యాత్మిక పురోగతి మార్గము నుండి పతనము కావింపగలదు. అంబరీష మహారాజు జీవితమున వివరింపబడినట్లు, ఇంద్రియములన్నీ కృష్ణచైతన్యము నందు తప్పక వినియోగింపవలెను. మనస్సును నియంత్రించుటకు అదియే సరియైన విధానము.

## 2.68

**తస్మాద్ యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।**
**ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

### అనువాదము

**అందుచే, ఓ మహాబాహో! ఎవ్వని ఇంద్రియములు వాని ఇంద్రియార్థముల నుండి నిగ్రహింపబడి యుండునో అతడు నిశ్చయముగా స్థితప్రజ్ఞుడగును.**

### భాష్యము

మానవుడు ఇంద్రియములను కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణభగవానుని ప్రేమయుక్త సేవయందు నెలకొల్పుట ద్వారా ఇంద్రియ వేగమును నిగ్రహింపవచ్చును. శత్రువులను అధికమైన శక్తిచే నియంత్రించునట్లుగా ఇంద్రియ వేగమును కూడ నియంత్రింప

వచ్చును. ఇంద్రియవేగమును ఎట్టి మానవ ప్రయత్నముచే కాకుండ, వానిని శ్రీకృష్ణభగవానుని సేవయందు నెలకొల్పుటచేతనే మానవుడు నిజముగా స్థితప్రజ్ఞుడు కాగలడనియు మరియు అతడు ఈ దివ్యకళను ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశమునందే అభ్యసింపవలెననియు అవగతము చేసికొనినవాడు 'సాధకుడు' లేక ముక్తిని పొందుటకు యోగ్యుడనబడును.

### 2.69

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥**

## అనువాదము

**సర్వజీవులకు ఏది రాత్రియో అదియే ఆత్మనిగ్రహము కలవానికి మేల్కొనియుండు సమయము. సర్వజీవులు మేల్కొనియుండు సమయము అంతర్ముఖుడైన మునికి రాత్రి సమయము.**

## భాష్యము

తెలివిగల మానవులలో రెండురకముల వారు కలరు. అందులో ఒకరు ఇంద్రియ తృప్తి కొరకు భౌతిక కర్మలయందు తెలివికలిగి యుందురు. మరొక రకము వారు అంతర్ముఖులు మరియు ఆత్మానుభూతి కొరకు గల అభ్యాసము నందు ఉత్సాహము కలిగియుందురు. అంతర్ముఖుడైన ముని (తెలివి గల మానవుని) కర్మలు భౌతిక భావనలో మునిగియున్న మానవులకు రాత్రి వంటివి. ఆత్మానుభూతి తెలియని వారగుట చేత అట్టి రాత్రియందు భౌతిక జనులు నిద్రించుచుందురు. కాని అట్టి భౌతికవ్యక్తుల 'రాత్రి' సమయము నందు అంతర్ముఖుడైన ముని జాగృతుడై యుండును. కాని అట్టి భౌతికవ్యక్తుల 'రాత్రి' సమయమునందు అంతర్ముఖుడైన ముని జాగృతుడైయుండును. ముని క్రమముగా ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధించుచుండుట చేత అత్యున్నత ఆధ్యాత్మికానందమును అనగా దివ్యానందమును అనుభవించుచుండును. భౌతికవ్యక్తి ఆత్మానుభూతి విషయము నందు నిద్రితుడైయుండుటచేత తన నిద్రా సమయమున కొన్నిమార్లు సుఖమును, కొన్నిమార్లు దుఃఖమును పొందుతూ వివిధములైన ఇంద్రియ సుఖములను గూర్చి స్వప్నములను చూచుచుండును. అంతర్ముఖుడైన ముని భౌతికములైన సుఖదుఃఖములకు అతీతుడుగా నుండును. అతడు భౌతిక ప్రతిక్రియలచే ఏమాత్రము కలతనొందక ఆత్మానుభూతి కార్యములను కొనసాగించుచుండును.

## 2.70

**అపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాప: పవిశన్తి యద్వత్।**
**తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తిమాప్నోతి న కామకామీ ॥**

### అనువాదము

**నదులు సర్వదా నీటిని పూరించుచున్నను నిశ్చలముగా నుండు సముద్రము వలె తనయందు కోరికలు నిరంతరము ప్రవేశించుచున్నను ఆ ప్రవాహముచే కలత నొందని మానవుడే శాంతిని పొందగలుగును. కోరికలను తృప్తినొందింప యత్నించు వారెల్లప్పుడును అట్టి శాంతిని పొందజాలరు.**

### భాష్యము

విస్తారమైన సముద్రము ఎల్లప్పుడు జలముచే పూరింపబడుచునే యుండును. ముఖ్యముగా వర్షాకాలము అది మరింత అధికముగా నీటిచే పూరింపబడుచుండును. అయినను సముద్రము ఒకేమాదిరిగా స్థిరముగా నిలిచియుండును. అది కలత నొందకపోవుటయే కాకుండ కనీసము చెలియలి కట్టనైనను ఎన్నడు అతిక్రమించదు. కృష్ణచైతన్యవంతుడైన మానవుని విషయమున కూడ ఇది సత్యమైయున్నది. మానవుడు భౌతికదేహమును ధరించి యున్నంత కాలము ఆ దేహమునకు సంబంధించిన ఇంద్రియతృప్తి వాంఛలు కొనసాగుతుండును. కాని భక్తుడు సంతృప్తిచెందియుండుటచేత అట్టి కోరికలచే కలతనొందడు. భగవానుడు కృష్ణచైతన్యవంతుని అవసరములను నెరవేర్చుచుండుటచేత అతడు దేనిని వాంఛింపడు. కనుకనే అతడు సముద్రము వలె సదా తనయందే పరిపూర్ణుడై నిశ్చలముగానుండును. సముద్రమునందు ప్రవహించు నదీజలముల వలె తనయందు వాంఛలు ప్రవేశించినను, అతడు తన కార్యకలాపముల యందు స్థిరుడై యుండుటచేత, ఇంద్రియతృప్తి వాంఛలచే ఏమాత్రము కలతనొందడు. భౌతికమైన ఇంద్రియతృప్తి వాంఛలు కలుగుచున్నప్పటికిని వాటన్నింటి పట్ల అనాసక్తుడై యుండెడి కృష్ణచైతన్య వంతునికి ఇదియే నిదర్శనము. భక్తుడు భగవానుని ప్రేమయుక్త సేవయందు సంతృప్తి నొందుచుండుట చేత సముద్రము వలె స్థిరుడైయున్నందున ఆ భక్తుడు సంపూర్ణ శాంతిననుభవించును. కాని మోక్షదశ వరకును(భౌతిక విజయమును గూర్చి వేరుగా తెలుపనవసరము లేదు) కోరికలను పూరించుకొన దలచువారు ఎన్నడును శాంతిని పొందజాలరు. కామ్యకర్మలలో నెలకొనినట్టివారు, మోక్షకాములును, యోగసిద్ధులను పొందుటకు ప్రయతించు యోగులవంటి వారందరును తీరని కోరికలచే ఎల్లపుడును దుఃఖమునే కలిగియుందురు. కాని, కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణభగవానుని సేవయందు నిరంతరము ఆనందముననుభవించుట చేత ఎట్టి కోరికలను కలిగియుండడు. వాస్తవమునకు అతడు భౌతిక బంధములని పిలువబడు బంధముల నుండి కూడ విముక్తిని వాంఛింపడు. ఎట్టి భౌతికవాంఛలు లేనందునే కృష్ణభక్తుడు సదా పూర్ణశాంతిని కలిగియుండును.

**2.71**
**విహాయ కామాన్ య: సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహ: ।**
**నిర్మమో నిరహంకార: స శాన్తిమధిగచ్ఛతి ॥**

## అనువాదము

**ఇంద్రియ భోగానుభవ కోరికలన్నింటిని త్యజించి నిష్కామునిగా జీవించువాడును, ఇంద్రియ మమకారము మరియు అహంకారములను విడిచిపెట్టిన వాడు మాత్రమే నిజమైన శాంతిని పొందగలుగును.**

## భాష్యము

నిష్కాముడు అనగా ఇంద్రియసుఖము కొరకై దేనిని వాంఛింపకుండుట అని అర్థము. అనగా కృష్ణచైతన్యము నందు నిమగ్నమై యుండవలెనని వాంఛించుటయే నిజమైన నిష్కామత్వము. దేహాత్మబుద్ధి లేనివాడు ప్రపంచమునందు దేనిపైనను ఆధిపత్యమును కలిగియుండక శ్రీకృష్ణుని దాసునిగా జీవుని యదార్థస్థితిని అవగతము చేసుకొనుటయే కృష్ణచైతన్యమునందలి పరిపూర్ణస్థితి. అట్టి పరిపూర్ణస్థితియందు నెలకొనినవాడు శ్రీకృష్ణుడే సకలమునకు అధిపతి అయినందున సమస్తమును అతని సంతృప్తికొరకే వినియోగింపవలెనని ఎరిగియుండును. అర్జునుడు మొదట తన ఇంద్రియ తృప్తికై యుద్ధమును చేయుటకు నిరాకరించినను, అతడు పూర్తి కృష్ణచైతన్యవంతుడు అయినంతనే యుద్ధము చేయుమని శ్రీకృష్ణుడు కోరుటచే యుద్ధమున పోరాడెను. ఎందుకనగా, అర్జునునకు యుద్ధము చేయవలెనన్నడి కోరిక లేకున్నను, శ్రీకృష్ణుని కొరకై అతడు తన శక్త్యానుసారము యుద్ధము చేసెను. కృత్రిమముగా కోరికలను నశింపజేయుటకంటె శ్రీకృష్ణుని సంతృప్తిని కోరుకొనుటయే నిజమైన నిష్కామత్వము. జీవుడెన్నడును వాంఛారహితుడు కాజాలడు. కాని, అతడు తన కోరికల విధానమును (గుణమును) మార్చుకొనవలెను. భౌతికవాంఛా రహితుడైన వ్యక్తి సర్వము శ్రీకృష్ణునికే చెందినదని ఎరిగియుండుట చేత(ఈశావాస్యమిదం సర్వమ్) దేనియందును వ్యర్థముగా యజమానిత్వమును కలిగియుండడు. ఆధ్యాత్మికముగా శ్రీకృష్ణుని నిత్యాంశయైన జీవుడు తన నిజస్థితి కారణముగా ఎన్నడును శ్రీకృష్ణునితో సమానుడు గాని, అధికుడు గాని కాజాలడనెడి ఆత్మానుభూతి పైననే ఈ ఆద్యాత్మిక జ్ఞానము ఆధారపడియున్నది. ఇట్టి కృష్ణచైతన్య అవగాహనయే పరిపూర్ణశాంతికి మూలసిద్ధాంతము.

**2.72**
**ఏషా బ్రహ్మీ స్థితి: పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యామన్తకాలే/పి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥**

## అనువాదము

**ఇదియే ఆధ్యాత్మికమును, దివ్యమును అయిన జీవనవిధానము. దీనిని పొందిన పిమ్మట మానవుడు కలత నొందడు. మరణసమయమునందును అతడట్లు స్థితుడైనచో భగవద్రాజ్యమున ప్రవేశింపగలుగును.**

## భాష్యము

కృష్ణచైతన్యమును లేక ఆధ్యాత్మిక జీవితమును మానవుడు క్షణములో పొందవచ్చును లేదా కోట్లాది జన్మలు ఎత్తినను పొందలేకపోవచ్చును. ఇది కేవలము తత్త్వముయొక్క అవగాహన మరియు సత్యమును అంగీకరించుట పైననే ఆధారపడియుండును. శ్రీకృష్ణునికి శరణు పొందుటద్వారా ఖట్వాంగమహారాజు తన మరణమునకు కొన్నినిమిషముల ముందే అట్టి జీవన స్థితిని పొందగలిగెను. వాస్తవమునకు, 'నిర్వాణ' మనగా భౌతిక జీవన విధానమును ముగించుటయే. భౌద్ధతత్త్వము ననుసరించి భౌతిక జీవనము పిమ్మట శూన్యము మాత్రమే ఉండును. కాని శ్రీమద్భగవద్గీత దీనికి భిన్నముగా ఉపదేశించుచున్నది. నిజమైన జీవితము ఈ భౌతిక జీవితమును పూర్తిచేసిన పిమ్మటనే ఆరంభమగును. ఈ భౌతిక జీవన విధానమును ముగించుకొనవలెనని తెలిసికొనుటయే లౌకికవాదికి సరిపోవును. కాని ఆధ్యాత్మికముగా పురోభివృద్ధి నొందినవాడు ఈ భౌతికజీవితము పిమ్మట ఆధ్యాత్మిక జీవితము గలదని ఎరుగును. ఈ జీవితమును ముగించుటకు పూర్వమే మానవుడు అదృష్టవశాత్తు కృష్ణచైతన్య వంతుడైనచో, వారు వెంటనే 'బ్రహ్మనిర్వాణ' స్థితిని పొందగలుగుదురు. భగవద్ధామమునకు మరియు భగవానుని సేవకు నడుమ భేదము లేదు. ఆ రెండును గుణాతీత స్థితియందుండుట చేత భగవానుని పట్ల ప్రేమయుక్త సేవ యందు నెలకొనుట భగవద్ధామమును పొందినట్లే యగును. భౌతిక జగత్తు నందు ఇంద్రియతృప్తికి సంబంధించిన కార్యకలాపములుండగా, ఆధ్యాత్మిక జగత్తునందు కృష్ణచైతన్య కార్యకలాపములుండును. ఈ జీవితము నందే కృష్ణచైతన్యమును పొందుటయనునది శీఘ్రమే 'బ్రహ్మస్థితి'ని పొందగలుగుట యగును. కనుకనే కృష్ణచైతన్యవంతుడు భగవద్రాజ్యమున నిశ్చయముగా ప్రవేశించినట్టి వాడేయగును.

బ్రహ్మము అనునది భౌతికత్వమునకు వ్యతిరేకమైనది. కనుక 'బ్రాహ్మీస్థితి' అనగా 'భౌతిక కర్మకలాపములతో కూడిన స్థితియందు నెలకొనకుండుట' యని అర్థము. భగవానునికి చేయబడు భక్తియుక్త సేవ భగవద్గీత (14.26) నందు ముక్తస్థితిగా అంగీకరింపబడినది, "స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే." కనుక భౌతికబంధ విముక్తియే 'బ్రాహ్మీస్థితి'.

భగవద్గీత యొక్క ఈ ద్వితీయాధ్యాయము గీతాసారమని శ్రీల భక్తివినోద ఠాకూరులు తెలిపియుండిరి. కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము యనునవి భగవద్గీత యందలి చర్చనీయాంశములు. ఈ ద్వితీయాధ్యాయము నందు సంపూర్ణ గీతాసారముగా కర్మయోగము, జ్ఞానయోగము స్పష్టముగా వివరింపబడి భక్తియోగము కూడ స్వల్పముగా సూచింపబడినది.

**శ్రీమద్భగవద్గీత యందలి 'గీతాసారము' అను ద్వితీయాధ్యాయమునకు భక్తి వేదాంత భాష్యము సమాప్తము.**

---------

# తృతీయాధ్యాయము
# కర్మయోగము

**3.1**

**అర్జున ఉవాచ**

**జ్యాయసీ చేత్ కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ।**
**తత్ కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥**

## అనువాదము

**అర్జునుడు పలికెను: ఓ జనార్దనా! కేశవా! కామ్యకర్మము కంటెను బుద్ధియే ప్రశస్తరమని నీవు భావించినచో నన్ను ఇట్టి ఘోరమైన యుద్ధమునందు ఎందులకు నియోగింప గోరుచున్నావు?**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు తన ఆప్తమిత్రుడైన అర్జునుని భౌతిక దుఃఖ సాగరమునుండి తరింపజేయు ఉద్దేశముతో ఆత్మయొక్క నిజస్థితిని గడచిన . అధ్యాయమునందు మిక్కిలి స్పష్టముగా వివరించెను. అందులో ఆత్మానుభూతి మార్గమైన 'బుద్ధియోగము' లేక కృష్ణచైతన్యము ఆదేశింపబడినది. కొన్నిసార్లు కృష్ణచైతన్యము జడత్వమని(కర్మసన్యాసము) తప్పుగా భావింపబడును. అట్లు తప్పుగా భావించినవాడు శ్రీకృష్ణభగవానుని పవిత్ర నామమును జపించుచు, పరిపూర్ణ కృష్ణచైతన్య వంతుడగుటకు ఏకాంత ప్రదేశమునకు తరలిపోవుచుండును. కాని, కృష్ణచైతన్య(భక్తి) తత్త్వమున సంపూర్ణ శిక్షణను పొందనిదే ఎవ్వరును ఏకాంత ప్రదేశమున కృష్ణనామ జపమును చేయుట వాంఛనీయము కాదు. అట్టి కార్యము ద్వారా కేవలము అమాయక జనుల నుండి భక్తిప్రశంసలు మాత్రమే మానవునకు లభింపగలవు. అర్జునుడు కూడ కృష్ణచైతన్యము 'బుద్ధియోగము' లేక ఆధ్యాత్మిక జ్ఞానపురోభివృద్ధి నందు బుద్ధి యనగా క్రియాశీలక జీవనము నుండి విరమించి ఏకాంత ప్రదేశములో తపోధ్యానములు ఆచరించుటయని భావించెను. మరోవిధముగా చెప్పవలెననిన, కృష్ణచైతన్యము నెపముతో అతడు యుద్ధము చేయుటనుండి నేర్పుగా తప్పించుకోదలచెను. కాని అతడు ఉత్తమ సాధకుని వలె అతడీ విషయమున తన గురువైన శ్రీకృష్ణభగవానునికి విన్నవించి ఉత్తమ మార్గమును గూర్చి అతనిని ప్రశ్నించెను. అర్జునుని ఈ ప్రశ్నకు సమాధానముగా శ్రీకృష్ణభగవానుడు 'కర్మయోగ'ను లేక కృష్ణచైతన్యముతో చేయు కర్మవిధానమును గూర్చి ఈ తృతీయాధ్యాయము నందు విపులముగా వివరించెను.

**3.2**

**వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।**
**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయో/హమాప్నుయామ్ ॥**

**అనువాదము**

**అనేకార్థములు కలిగిన నీ బోధనలచే నా బుద్ధి మోహము నొందినది. అందుచే నాకు ఏది అత్యంత శ్రేయోదాయకమో దయయుంచి నిశ్చయముగా తెలుపుము.**

**భాష్యము**

భగవద్గీతకు ఉపోద్ఘాతముగా గడచిన అధ్యాయములో 'సాంఖ్యయోగము', 'బుద్ధియోగము', బుద్ధిచేత ఇంద్రియములను నిగ్రహించుట, ఫలాపేక్ష రహిత కర్మము, ప్రారంభదశలో గల సాధకుని స్థితులనెడి వివిధ విషయములు వివరింపబడినవి. కాని అవన్నియును ఒక క్రమపద్ధతిలో వివరింపబడలేదు. కాని వాని సంపూర్ణావగాహనకు మరియు కార్యాచరణ కొరకు ఒక క్రమమైన పద్ధతి అవసరమై యున్నది. కనుకనే అర్జునుడు బాహ్యమునకు అస్పష్టముగా గోచరించు ఆ విషయములను స్పష్టము చేయగోరెను. తద్వారా సాధారణ వ్యక్తి కూడ వాటిని ఎటువంటి మనోకల్పనలు మరియు వ్యతిరేక వివరణలు లేకుండా అంగీకరించు అవకాశము కలుగును. తన పదప్రయోగముచే అర్జునునికి కలత కలిగించు అద్దేశము శ్రీకృష్ణభగవానునికి లేకున్నను, కృష్ణచైతన్యము అనగా క్రియారహితమో లేక క్రియాశీలక సేవయో అర్జునుడు ఎరుగలేకపోయెను. మరోమాటలో చెప్పవలెనన్నిన, అర్జునుడు తన ప్రశ్నల ద్వారా భగవద్గీత రహస్యమును తెలిసికొనగోరు శ్రద్ధావంతులైన అభ్యాసకులందరి కొరకు కృష్ణచైతన్య మార్గమును సుగమము చేయుచున్నాడు.

**3.3**

**శ్రీభగవానువాచ**

**లోకే/స్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥**

**అనువాదము**

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : పాపరహితుడైన ఓ అర్జునా! ఆత్మానుభూతిని పొందగోరు మానవులు రెండురకములని ఇదివరకే నేను వివరించితిని. కొందరు దానిని సాంఖ్యము మరియు తాత్త్వికకల్పనల ద్వారా అవగాహన చేసికొనగోరగా, మరికొందరు భక్తియోగము ద్వారా దానిని అవగాహన చేసికొనగోరుదురు.**

## భాష్యము

ద్వితీయాధ్యాయపు ముప్పది తొమ్మిదవ శ్లోకమున 'సాంఖ్యయోగము' మరియు 'కర్మయోగము' లేక 'బుద్ధియోగము' అనెడి రెండువిధములైన పద్ధతులను శ్రీకృష్ణభగవానుడు వివరించెను. ఈ శ్లోకమున భగవానుడు దానిని మరింత స్పష్టముగా వివరించుచున్నాడు. ఆత్మ మరియు భౌతిక పదార్థముల విశ్లేషణాత్మక అధ్యయనమైన 'సాంఖ్యయోగము' మానసిక కల్పనలను కావించుట యందును మరియు ఏదేని విషయమును ప్రయోగాత్మక జ్ఞానము, తాత్త్విక చింతన ద్వారా ఎరుగుట యందును అభిరుచిని కలిగినట్టి మానవులకు చెందినట్టిది. ఇక రెండవ రకము వారు కృష్ణచైతన్య భావన యందు కర్మనొనరించెడివారు. ఈ విషయము ద్వితీయాధ్యాయము నందలి అరువది యొకటవ శ్లోకమునందు వివరింపబడినది. ముప్పది తొమ్మిదవ శ్లోకమునందు 'బుద్ధియోగము' లేక కృష్ణచైతన్యము యొక్క సిద్ధాంతముల ననుసరించి కర్మచేయుట వలన మానవుడు కర్మబంధముల నుండి విడివడ గలడనియు, పైగా అట్టికర్మ వలన ఎట్టి దోషములు కలుగవనియు శ్రీకృష్ణభగవానుడు తెలిపియున్నాడు. అరువది యొకటవ శ్లోకమున 'బుద్ధియోగము' అనగా భగవానుని పైననే (మరింత విశదముగా చెప్పవలెనన్నిన శ్రీకృష్ణుని పైననే) పూర్తిగా ఆధారపడుటచే, ఇంద్రియములన్నింటిని సులభముగా నియంత్రింప వచ్చుననియు స్పష్టముగా వివరింపబడినది. కనుక ధర్మము, తత్త్వశాస్త్రముల వలె ఈ రెండు యోగములు పరస్పరము ఒకదానిపై మరొకటి ఆధారపడియున్నవి. తత్త్వము లేనటువంటి ధర్మము కేవలము సిద్ధాంతము లేక మూఢ విశ్వాసము. కాగా ధర్మము లేనటువంటి తత్త్వము కొన్నిమార్లు మూర్ఖపు పట్టుదల, మానసిక కల్పనము మాత్రమే కాగలదు. ఎందుకనగా, పరతత్త్వానుభూతి కొరకు శ్రద్ధతో యత్నించువారు కూడ చివరకు కృష్ణచైతన్య మార్గమునకే వత్తురు. కనుక శ్రీకృష్ణుడే పరమలక్ష్యమై యున్నాడు. ఈ విషయము భగవద్గీత యందును తెలుపబడినది. జీవాత్మ మరియు పరమాత్మకు మధ్యగల యథార్థ సంబంధమును అవగాహన చేసుకొనుటయే అన్నింటియందు ముఖ్యాంశమై యున్నది. పరోక్ష మార్గమైన తాత్త్విక మానసిక కల్పనలను కావించుచు మానవుడు క్రమముగా కృష్ణచైతన్య స్థితికి రావచ్చును లేదా రెండవ మార్గమున కృష్ణచైతన్యము యందు ప్రత్యక్ష సంబంధమును ఏర్పరచుకొనవచ్చును. తాత్త్విక విధానము ద్వారా ఇంద్రియములను శుద్ధిపరచుకొనుటపై ఆధారపడనందున ఈ రెండింటిలో కృష్ణచైతన్య మార్గము ఉత్తమమైనది. కృష్ణచైతన్యము అనునది స్వయముగానే ఒక పవిత్రీకరణ విధానము. అంతేకాకుండ భక్తియుక్త సేవ యనెడి ప్రత్యక్ష విధానము చేత ఆ కార్యము సులభమును మరియు ఉదాత్తమును అయియున్నది.

### 3.4

**న కర్మణామనారమ్భాన్ నైష్కర్మ్యం పురుషో/శ్నుతే।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥**

## అనువాదము

**కేవలము కర్మ చేయకుండుట ద్వారా ఎవ్వరును కర్మఫలమునుండి విముక్తిని పొందలేరు. అట్లే కేవలము సన్న్యాసము ద్వారా ఎవ్వరును పరిపూర్ణత్వమును పొందలేరు.**

## భాష్యము

భౌతిక జనుల హృదయములను శుద్ధిపరచుట కొరకై విధింపబడినటువంటి విధ్యుక్త ధర్మములను నియమముగా పాటించి పవిత్రుడైనప్పుడు మానవుడు సన్న్యాసాశ్రమమును స్వీకరింపవచ్చును. అట్టి పవిత్రీకరణము లేకుండ హఠాత్తుగా సన్న్యాసము స్వీకరించుట ద్వారా మానవునికి జయము సిద్ధింపదు. కేవలము సన్న్యాసము స్వీకరించినంతనే లేక కామ్యకర్మలనుండి విరమణ పొందినంతనే మానవుడు నారాయణునితో సమానుడు కాగలడనునది అద్వైతవాదుల ఉద్దేశము. కాని ఈ సిద్ధాంతమును శ్రీకృష్ణభగవానుడు ఆమోదించుటలేదు. హృదయము పవిత్రము కానిదే సన్న్యాసము స్వీకరించినచో అది కేవలము సాంఘిక జీవిత క్రమమునకు సంక్షోభము మాత్రమే కలిగించును. అట్లుకాకుండ, మానవుడు తన విధ్యుక్త ధర్మములను నిర్వర్తింపకున్నను దివ్యమైన భగవత్ సేవను స్వీకరించి తన శక్త్యానుసారము పురోగమించినచో (బుద్ధియోగము) భగవానునిచే ఆమోధింపబడును. "స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"(భ.గీ.2.40) అనగా అట్టి ధర్మాచరణము స్వల్పముగా ఆచరింపబడినను, అది మానవుని ఘోరభయములనుండి తరింపజేయగలదు.

### 3.5

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశ: కర్మ సర్వ: ప్రకృతిజైర్గుణై: ॥**

## అనువాదము

**ప్రతి జీవుడును భౌతిక ప్రకృతి వలన తాను పొందినటువంటి గుణముననుసరించి వివశుడై కర్మచేయుటకు ప్రేరేపింపబడును. కావున ఏదియును చెయ్యకుండ క్షణకాలము కూడా ఎవ్వరును ఉండజాలడు.**

## భాష్యము

బద్ధజీవితము నందే కాకుండ ఎల్లప్పుడును క్రియాశీలిగా నుండుట ఆత్మ స్వభావము. జీవాత్మ లేనిదే భౌతిక దేహము కొద్దిగానైనను కదలదు. దేహము కేవలము ఒక జడమైన వాహనము వంటిది. దానిని క్రియాశీలకమైన జీవాత్మ నడుపుచుండును. ఈ నిత్యక్రియాశీలకమైన ఆత్మ క్షణకాలమైనను పనిచేయకుండ జడత్వమును కలిగియుండదు. కనుకనే ఈ ఆత్మను కృష్ణచైతన్యముతో కూడిన సత్కార్యములయందే నెలకొల్పవలెను. లేనిచో అది మాయాశక్తిచే నిర్దేశింపబడిన కర్మలయందు నెలకొనగలదు. భౌతికశక్తి సంపర్కము నందే ఆత్మ కూడ భౌతిక గుణమును పొందుచున్నది. అట్టి గుణసంపర్కమునుండి ఆత్మను శుద్ధిపరచుటకు శాస్త్రములందు విధింపబడిన విధ్యుక్త ధర్మములను విధిగా ఆచరింపవలసియున్నది. కాని ఆత్మ దాని నిజకర్మమైన కృష్ణచైతన్యమునందు నెలకొనినప్పుడు అది ఏది చేయగలిగినను అది శ్రేయస్సునే కలిగించును. శ్రీమద్భాగవతము (1.5.17) ఈ విషయమునే ధ్రువీకరించుచున్నది :

త్యక్త్వా స్వధర్మం చరనామ్బుజం హరేర్భజన్నపక్వో/థ పతేత్తతో యది
యత్ర క్వ వాభద్రమభూదమ్య కిం కో వార్థ ఆప్తో/భజతాం స్వధర్మత:

"మానవుడు కృష్ణచైతన్యమును స్వీకరించినచో శాస్త్రవిహితములైన కర్మలను అనుసరింపకున్నను, భక్తియుక్త సేవను సక్రమముగా నిర్వర్తింపకున్నను, అతడు తన ఉత్తమ స్థితినుండి పతనమైనను ఎట్టి నష్టమును గాని పాపమును గాని పొందడు. అట్లుగాక అతడు శాస్త్రములలో తెలిపిన అన్ని పవిత్రీకరణ విధానములను నిర్వహించినను కృష్ణచైతన్యవంతుడు కానిచో అతడెట్టి లాభమును పొందగలడు?" కావున సన్న్యాసము లేదా ఏ పవిత్రీకరణ విధానమైనను పరమ లక్ష్యమైన కృష్ణచైతన్య భావనను పొందుటకు తోడ్పడవలెను. అట్టి కృష్ణచైతన్యము ప్రాప్తించనిచో సర్వము నిరర్థకమే!

## 3.6

**కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచార: స ఉచ్యతే ॥**

### అనువాదము

**కర్మేంద్రియములను నిగ్రహించినను మనస్సుచే ఇంద్రియార్థములను ధ్యానించువాడు నిశ్చయముగా తననుతాను మోసగించుకొనును. అట్టివాడు మిథ్యాచారి యనబడును.**

### భాష్యము

కృష్ణచైతన్యముతో కర్మను చేయుటకు నిరాకరించుచు, వాస్తవముగా మనస్సునందు ఇంద్రియ భోగములను గూర్చి ఆలోచించుచునే ఆడంబరముగా ధ్యానతత్పరతను ప్రదర్శించు కపటులు ఎందరోగలరు. అట్టి కపటులు (మిథ్యాచారులు) తమను అనుసరించు అనుచరులను భ్రమింపజేయుటకై శుష్కవేదాంతమును కూడ చెప్పవచ్చును. ఈ శ్లోకమునను సరించి అట్టి వారందరును గొప్పవంచకులు. ఇంద్రియతృప్తి కొరకై మానవుడు తన శక్త్యానుసారము వర్ణాశ్రమధర్మమును పాటించుచున్నను, తన సాంఘిక స్థితికి సంబంధించిన నియమములననుసరించినచో క్రమముగా తన జీవితమును తాను పవిత్రీకరించు కొనగలడు. కాని యోగివలె నటించుచు ఇంద్రియభోగముల కొరకై అన్వేషించువాడు కొన్నిమార్లు తత్త్వమును గూర్చి చెప్పినను గొప్ప వంచకుడనియే పిలువబడును. అట్టి పాపియొక్క జ్ఞానము భగవానుని మాయాశక్తి చేత హరింపబడినందున వాని జ్ఞానమునకు ఎట్టి విలువయు లేదు. అట్లు కపటముగా వర్తించువాని మనస్సు సదా అపవిత్రమై యుండుటచేత అతని ధ్యానప్రదర్శనము సర్వదా ప్రయోజన శూన్యమై యుండును.

## 3.7

**యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతే೭ర్జున ।**
**కర్మేన్ద్రియై: కర్మయోగమసక్త: స విశిష్యతే ॥**

## అనువాదము

**ఓ అర్జునా! అట్లుగాక మనస్సుచేత క్రియాశీలక ఇంద్రియములను నిగ్రహించుటకు యత్నించి, ఆసక్తిలేనివాడై కర్మయోగమును (కృష్ణచైతన్యము యందు) ఆరంభించు శ్రద్ధావంతుడు అత్యుత్తముడు.**

## భాష్యము

యథేచ్ఛాజీవనము కొరకును మరియు ఇంద్రియభోగముల కొరకును కపట యోగిగా నటించుట కంటెను, భౌతిక బంధములనుండి విడివడి, భగవద్ధామమున ప్రవేశింపచేయు స్వధర్మమున నిలిచి జీవితలక్ష్యము కొరకై యత్నించుటయే అత్యంత ఉత్తమము. వాస్తవమునకు, విష్ణువును చేరుటయే నిజమైన 'స్వార్థగతి' లేదా జీవితపరమార్థము. మనకు జీవిత పరమ లక్ష్యమును సాధించుటలో తోడ్పడుట కొరకై ఈ వర్ణాశ్రమ పద్ధతులు ఉద్దేశింపబడినవి. గృహస్థుడు కూడా కృష్ణచైతన్యము నందలి నియమిత సేవ చేయుట ద్వారా ఈ లక్ష్యమును పొందవచ్చును. ఆత్మానుభూతి కొరకై ప్రతియొక్కరు శాస్త్రములలో తెలుపబడినట్లుగా నియమిత జీవితమును గడుపుతూ ఆశక్తిలేకుండ తన కర్మనొనరిస్తూ పురోభివృద్ధిని సాధింపగలరు. ఈ విధానము ననుసరించు శ్రద్ధావంతుడు అమాయకులైన జనులను మోసగించుటకై ఆడంబరముగా కపట భక్తిని ప్రదర్శించు కపటయోగి కంటెను అత్యంత ఉత్తముడు. కేవలము జీవనోపాధి కొరకై కపట ధ్యానము చేయువాని కంటెను శ్రద్ధగా వీధులను శుభ్రపరచువాడు ఎంతో ఉత్తముడు.

## 3.8

**నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణ: ।**
**శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణ: ॥**

## అనువాదము

**నీ విధ్యుక్త ధర్మమును నీవు శ్రద్ధగా నిర్వర్తింపుము. అట్లు చేయుట అసలు కర్మ చేయకపోవుట కంటెను ఉత్తమము. మానవుడు కర్మ చేయకుండ భౌతికమైన దేహమును కూడ పోషించుకొనజాలడు.**

## భాష్యము

తాము ఉత్తమ వంశమునకు చెందిన వారమనియు, గొప్ప పదవులలో నుండెడి వారమనియు చెప్పుకొనుచు ఆధ్యాత్మిక పురోభివృద్ధి కొరకు సర్వమును త్యాగము చేసినట్లుగా మిథ్యాప్రదర్శనలు చేయు కపటయోగులెందరో కలరు. కాని అర్జునుడు ఆ విధముగా వంచకుడు కారాదని శ్రీకృష్ణుడు భావించెను. అంతేకాకుండ క్షత్రియులకు విధింపబడిన ధర్మములను అర్జునుడు పాటింపవలెనని భగవానుడు వాంఛించెను.

అర్జునుడు గృహస్థుడు మరియు క్షత్రియ యోధుడైనందున అతడు తన స్థితియందే నిలిచి గృహస్థుడైన క్షత్రియునకు విధింపబడిన ధర్మ నియమములను నిర్వహించుట ఉత్తమకార్యము. అట్టి కర్మలు లౌకికుడైన మానవుని హృదయమును శుద్ధిపరచి అతనిని భౌతిక కాలుష్యము నుండి విముక్తిని చేయగలదు. జీవనార్థమై ఆచరింపబడు కపట సన్న్యాసము అవలంబించుటను భగవానుడు కాని, ఏ మత ధర్మశాస్త్రము గాని ఎన్నడును అంగీకరింపదు. వాస్తవమునకు మానవుడు ఏదియో ఒక కర్మచేయుచు జీవనాధారమును సంపాదింపవలెను. అతడు భౌతిక ప్రవృత్తులను పవిత్రీకరించుకొనకుండ ఇచ్ఛానుసారముగా కర్మలను త్యజింపరాదు. భౌతిక ప్రపంచమున నివసించువాడెవడైనను భౌతిక ప్రకృతిపై అధికారమును వహించుట కొరకు లేక ఇంద్రియ తృప్తికొరకు కొన్ని కలుషిత ప్రవృత్తులను కలిగియుండును. అట్టి కలుషిత ప్రవృత్తులను తప్పక క్షాలనము చేసుకొనవలెను. విధ్యుక్త ధర్మముల ద్వారా అట్టి కార్యమును సాధింపక మునుపే కర్మను త్యజించి ఇతరులపై ఆధారపడుతు జీవించు కపట యోగివలె మారుటకు ఎవ్వరును యత్నింపరాదు.

## 3.9

**యజ్ఞార్థాత్ కర్మణో'న్యత్ర లోకో'యం కర్మబన్ధన: ।**
**తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసంగ: సమాచర ॥**

## అనువాదము

**విష్ణువు కొరకై యజ్ఞ రూపమున కర్మనొనరింపవలెను. లేనిచో ఈ భౌతిక జగత్తున కర్మ బంధకారము కాగలదు. అందుచే ఓ కుంతీపుత్రా! విష్ణువు ప్రీత్యర్థమే నీ విధ్యుక్త ధర్మముల నొనరింపుము.**

## భాష్యము

సాధారణముగా దేహపోషణ కొరకైనను మానవుడు కర్మచేయవలసి యుండుటచే ఆ ప్రయోజనము సిద్ధించునట్లుగా వర్ణాశ్రమములకు సంబంధించిన విధ్యుక్త ధర్మములు నిర్దేశింపబడినవి. 'యజ్ఞము' అనగా విష్ణువు లేదా యజ్ఞాచరణము. యజ్ఞాచరణము లన్నియు విష్ణుప్రీతి కొరకై ఉద్దేశింపబడినవి. "యజ్ఞో వై విష్ణు:" అని (తైత్తిరియ సంహిత 1.7.4) చెప్పుచున్నది. మానవుడు తనకు విధింపబడిన యజ్ఞములను ఆచరించినను లేదా విష్ణుభగవానుని ప్రత్యక్షముగా ఆరాధించినను ఒకే ప్రయోజనమును పొందగలడు. అనగా ఈ శ్లోకమున తెలిపినట్లుగా కృష్ణచైతన్య మనునది యజ్ఞము ఆచరించుటయే. వర్ణాశ్రమ పద్ధతి కూడ విష్ణుప్రీతినే లక్ష్యముగా భావించును. "వర్ణాశ్రమాచారవతా పురుషేణ పర: పుమాన్/విష్ణురారాధ్యతే." (విష్ణుపురాణము 3.8.8)

కనుకనే మానవుడు విష్ణుప్రీత్యర్థమే కర్మనొనరింపవలసి యున్నది. ఈ భౌతిక జగత్తున చేయబడు ఇతర కర్మయేదైనను బంధకారణమగును. ఎందుకనగా శుభాశుభకర్మల రెండింటికిని ఫలములుండును మరియు అవి కర్తను బంధించును. కనుక ప్రతియొక్కరు శ్రీకృష్ణుని లేదా విష్ణువును సంతృప్తి పరచుట కొరకు కృష్ణచైతన్యమున కర్మనొనరింపవలెను. అట్టి కర్మలను చేయునపుడు అతడు ముక్తస్థితి యందుండును. ఇది గొప్ప కర్మాచరణ కళ. ఆరంభమునందు ఈ విధానమునకు నిష్ణాతులైనవారి నిర్దేశము అవసరమైయున్నది. కనుకనే మానవుడు కృష్ణభక్తుని అనుభవపూర్వకమైన నిర్దేశము ననుసరించి గాని లేదా (ఎవరి సమక్షమున అర్జునునకు

కర్మ చేయు అవకాశము కలిగెనో శ్రీకృష్ణభగవానుని ప్రత్యక్ష బోధనలననుసరించి గాని నేర్పుతో వర్తింపవలసి యుండును. ఇంద్రియ సంతృప్తి కొరకు కాకుండ శ్రీకృష్ణుని సంతృప్తి కొరకు ప్రతి కర్మను నిర్వహింపవలెను. ఇట్టి అభ్యాసము మానవుని కర్మ ఫలములనుండి రక్షించుటయే కాకుండ, భగవద్ధామమునకు చేర్చగల ఉత్తమమైన భగవానుని ప్రేమయుక్త సేవాస్థితికి అతనిని క్రమముగా ఉద్ధరింపగలదు.

## 3.10

**సహ యజ్ఞా: ప్రజా: సృష్ట్వా పురోవాచ ప్రజాపతి: ।**
**అనేక ప్రసవిష్యధ్వమేష వో/స్త్విష్టకామధుక్ ॥**

## అనువాదము

**సృష్ట్యారంభమున సర్వజీవులకు ప్రభువైన భగవానుడు మానవులను మరియు దేవతా సమూహములను విష్ణు ప్రీత్యర్థమైన యజ్ఞములతో సహా సృష్టించి జగత్తునకు పంపి : "ఈ యజ్ఞములచే మీరు సంపన్నులు కండు. ఏలయన వీని ఆచరణము మీ సుఖజీవనమునకు మరియు బంధవిముక్తికి కావలసిన సర్వాభీష్టముల నొసంగును" అని ఆశీర్వదించెను.**

## భాష్యము

సర్వజీవులకు ప్రభువైన భగవానునిచే (విష్ణువు) సృష్టింపబడిన భౌతిక జగత్తు బద్ధజీవులు భగవద్ధామమును తిరిగి చేరేందుకు ఒక అవకాశముగా ఇవ్వబడినది. జీవులందరును దేవాదిదేవుడైన విష్ణువు లేక శ్రీకృష్ణునితో తమకు గల సంబంధమును విస్మరించుట చేతనే ఈ భౌతిక జగత్తునందు ప్రకృతిచే బద్ధులగుచున్నారు. జీవులు అట్టి సంబంధమును అవగాహనము చేసుకొనుటకు వైదిక నియమములు తోడ్పడును. భగవద్గీత (15.15) నందు భగవానుడు చెబుతున్నట్లు " వేదైశ్చ సర్వైరహమేవ వేద్య:" – "సమస్త వేదముల చేతను నేనే తెలియదగినవాడను." "పతిం విశ్వస్యాత్మేశ్వరమ్" అని 'తైత్తిరీయారణ్యకము' లోని 'మహానారాయణోపనిషత్తు'(11.3) నందు దేవాదిదేవుడైన విష్ణువే జీవులందరికిని ప్రభువు అని తెలుపబడినది. శ్రీమద్భాగవతము (2.4.20) నందు కూడ శ్రీల శుకదేవ గోస్వామి భగవానుడే 'పతి' అని అనేక విధముల పేర్కొనెను :

శ్రియ: పతిర్యజ్ఞపతి: ప్రజాపతిర్ధియాం పతిర్లోకపతిర్ధరాపతి:
పతిర్గతిశ్చాన్ధకవృష్ణిసాత్వతాం ప్రసీదతాం మే భగవాన్ సతాం పతి:

భగవానుడైన విష్ణువే 'ప్రజాపతి'. అతడే సమస్త జీవులకును, సమస్త లోకములకును, సమస్త సౌందర్యములకును పతియై యున్నాడు. సర్వమునకు అతడే సంరక్షకుడు. విష్ణుప్రీతి కొరకు యజ్ఞములెట్లు నిర్వహింపవలెనో బద్ధజీవులు ఎరుగుట కొరకై వారిని ఈ భౌతికజగత్తునందు భగవానుడు సృష్టించెను. తద్ద్వారా వారు ఈ జగత్తునందున్నంత వరకు వారెట్టి కలతలు లేకుండ సుఖముగా జీవించి, దేహ త్యాగానంతరము భగవద్ధామమును తిరిగి ప్రవేశింపగలుగుదురు. అదియే బద్ధజీవులకొరకై ఏర్పాటుచేయబడిన కార్యక్రమము. యజ్ఞాచారముచే బద్ధజీవులు క్రమముగా కృష్ణచైతన్యవంతులై సర్వవిధముల దివ్యగుణ సంపన్నులగుదురు. ఈ కలియుగమునకు వేదశాస్త్రములు హరినామ 'సంకీర్తన యజ్ఞము'ను ఆదేశించుచున్నవి. ఈ దివ్య విధానమును ఈ యుగజనోద్ధరణ కొరకై శ్రీకృష్ణచైతన్య మహాప్రభువుచే

ప్రవేశపెట్టబడినది. అట్టి 'సంకీర్తనా యజ్ఞము' కృష్ణచైతన్యముతో కూడియుండును. శ్రీమద్భాగవతము (11.5.32) నందు శ్రీకృష్ణభగవానుని భక్తుని రూపము గూర్చి (శ్రీ చైతన్య మహాప్రభువుగా) ఇట్లు తెలుపబడెను. దీనియందు 'సంకీర్తనా యజ్ఞము' కూడా ప్రత్యేకముగా ప్రస్తావింపబడినది :

కృష్ణవర్ణం త్విషాకృష్ణం సాంగోపాంగాస్త్రపార్షదమ్
యజ్ఞై: సంకీర్తనప్రాయైర్ యజన్తి హి సుమేధస:

"ఈ కలియుగము నందు మేధాసంపన్నులైన మానవులు నిత్యపార్షదులతో కూడియుండెడి భగవానుని సంకీర్తనా యజ్ఞాచరముచే పూజింతురు." వేదములందు తెలుపబడిన ఇతర యజ్ఞములు నిర్వహణము ఈ కలియుగము నందు నిర్వహించుట సులభము కాదు. కాని భగవద్గీత (9.14) నందు కూడ ఆదేశింపబడినట్లు సంకీర్తనాయజ్ఞము సర్వప్రయోజనములకు సులభము మరియు ఉదాత్తమైనదియై యున్నదని కూడ గ్రహింపవలెను.

## 3.11

**దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వ: ।**
**పరస్పరం భావయన్త: శ్రేయ: పరమవాప్స్యథ ॥**

## అనువాదము

**యజ్ఞములచే సంతృప్తి నొందిన దేవతలు మీకు తృప్తి కలిగింతురు. ఆ విధముగా మానవులు మరియు దేవతల నడుమ గల పరస్పర సహకారముచే సర్వులకు శ్రేయస్సు కలుగగలదు.**

## భాష్యము

లోకకార్యములను నిర్వహించుటకై నియమింపబడిన పాలకులే దేవతలు. దేహాత్మల పోషనార్థమై కావలసిన గాలి, వెలుతురు, నీరు మరియు ఇతర వరముల నన్నింటిని సమకూర్చు కార్యము అట్టి దేవతలకు ఇవ్వబడినది. అసంఖ్యాక సహాయకులైనట్టి అట్టి దేవతలు దేవాదిదేవుని దేహములోని వివిధ భాగములు. అట్టి దేవతల తృప్తి మరియు అసంతృప్తి లనునవి మానవులు చేయు యజ్ఞాచారములపై ఆధారపడియుండును. కొన్ని యజ్ఞములు ప్రత్యేకించి కొందరు దేవతలను తృప్తిపరచుట కొరకై ఉద్దేశింపబడినవి. అయినను వానిని చేసినచో ప్రధానభోక్త అయిన విష్ణుభగవానుడు పూజింపబడును. భగవద్గీత (5.29) నందు శ్రీకృష్ణుడే సకల యజ్ఞములకు భోక్తయని తెలుపబడినది : 'భోక్తారం యజ్ఞతపసామ్'. కనుక సమస్త యజ్ఞముల ముఖ్యోద్దేశము 'యజ్ఞపతి' ప్రీతియే. ఈ యజ్ఞములను యథావిధిగా నిర్వహించినపుడు మానవావసరములను అందించు వివిధ శాఖలకు చెందిన దేవతలు సహజముగానే సంతృప్తులగుదురు. దానితో ప్రకృతిచే ఉత్పాదింపబడు వస్తుపదార్థములందు ఎట్టి కొరతయు ఏర్పడదు.

యజ్ఞాచరణము అనేక ఇతర లాభము లెన్నింటినో చేకూర్చును. చివరికి అవి భౌతిక బంధముల నుండి విముక్తిని కూడ ప్రసాదించును. అనగా సమస్త కర్మలు పరిశుద్ధములు కాగలవు. "ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధి: సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతి: స్మృతిలాభే

సర్వగ్రంథీనాం విప్రమోక్షః" అని ఛాందోగ్యోపనిషత్తు 7.26.2 నందు తెలుపబడినట్లు – "యజ్ఞాచరణముచే ఆహారపదార్థములు శుద్ధములగును; పరిశుద్ధాహారమును భుజించుటచేత మానవుని జీవనస్థితి పరిశుద్ధమగును. అట్టి జీవనస్థితి పరిశుద్ధిద్వారా స్మృతి యందలి సూక్ష్మగ్రంథులన్నియు పవిత్రములగును. ఆ విధముగా స్మృతి పరిశుద్ధమైనప్పుడు మానవుడు మోక్షమార్గమును గూర్చి చింతింపగలుగును." ఇవన్నియును కలిసి చివరికి ప్రస్తుత మానవ సమాజమునకు అత్యంత ఆవశ్యకమైన కృష్ణచైతన్యమునకు దారితీయును.

## 3.12

**ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥**

### అనువాదము

**"వివిధ జీవనావశ్యకములను ఒనగూర్చు కార్యమున నియుక్తులైన దేవతలు యజ్ఞాచరముచే సంతృప్తినొంది మీకు కావలసిన వస్తువులనన్నింటిని ఒసంగుదురు. కాని దేవతలిచ్చు వస్తువులను తిరిగి వారికే అర్పింపకయే తాను అనుభవించువాడు నిక్కముగా చోరుడే యగును.**

### భాష్యము

దేవాదిదేవుడైన విష్ణువు తరపున జీవితావసరములను సమకూర్చుటకు వినియోగింపబడిన అధికారులే దేవతలు. కావున వారిని విధిపూర్వకమైన యజ్ఞములచే తప్పక సంతృప్తి పరుపవలెను. వేదములందు వివిధ దేవతల కొరకు వివిధములైన యజ్ఞములు నిర్దేశింపబడియున్నవి. కాని అవన్నియు చివరికి దేవాదిదేవునకే అర్పింపబడును. దేవాదిదేవుని తత్త్వమును గూర్చి తెలియనివారికే దేవతాయజ్ఞములు ఆదేశింపబడినవి. మానవుని వివిధ భౌతిక గుణములననుసరించి వివిధరకములైన యజ్ఞములు వేదములందు నిర్దేశింపబడినవి. వివిధ దేవతల పూజలు కూడా అదేవిధముగా వివిధ గుణముల ననుసరించియే వివరింపబడినవి. ఉదాహరణకు మాంసభక్షకులకు ప్రకృతియొక్క భీకరరూపమైన కాళీదేవి పూజ సూచింపబడినది. వారు ఆ దేవత ఎదుట జంతువులను బలి ఈయవచ్చును. కాని సత్త్వగుణము నందున్న వారికి విష్ణుభగవానుని ఆరాధన మాత్రమే ఆదేశింపబడినది. క్రమముగా ఆధ్యాత్మిక స్థితిని పొందుటయే ఈ యజ్ఞముల ఉద్దేశ్యము. సామాన్య మానవులు 'పంచ మహాయజ్ఞము'లనబడు ఐదు యజ్ఞములను తప్పనిసరిగా చేయవలెను.

అయినను మానవ సంఘమునకు అవసరమైనట్టి జీవితావసరములన్నియు శ్రీకృష్ణభగవానుని ప్రతినిధులైన దేవతలచే సమకూర్చబడునని ప్రతియొక్కరు ఎరుగవలెను. మానవులెవ్వరును ఏ ఒక్క వస్తువును సృష్టింపజాలరు. ఉదాహరణకు మానవులు భుజించెడి ఆహార పదార్థములను పరిశీలించినచో, సత్త్వగుణ ప్రధానులు స్వీకరించెడి ధాన్యము, పండ్లు, కూరలు, పాలు, పంచదార మున్నగునవియే కాకుండ మాంసాహారులు భుజించెడి వివిధములైన మాంసము మరియు ఏదియును కూడ మానవుని చేత సృష్టింపబడలేదు. అట్లే మానవ జీవితావసరములైన వేడి, వెలుతురు, నీరు, వాయువు వంటి దేనిని కూడా మానవులు తయారు చేయజాలరు. దేవాదిదేవుడు

లేకుండ సూర్యకాంతి, చంద్రకాంతి, వర్షము, వాయువు వంటివి కలుగజాలవు. అవిలేకుండ ఎవ్వరును జీవింపజాలరు. దీనిని బట్టి భగవానుడు కృపతో సమకూర్చు వస్తువులపైననే మన జీవితము ఆధారపడి యున్నదను విషయము స్పష్టమగును. చివరికి మనము నిర్వహించు కర్మాగారముల కొరకు కూడ లోహము, గంధకము, పాదరసము, మ్యాంగనీసు వంటి ఎన్నో వస్తువుల లేదా ముడిపదార్థముల అవసరము కలదు. ఈ వస్తువులన్నియు భగవానుని ప్రతినిధుల చేత సమకూర్చబడును. అట్లు లభించిన వానిని తగినట్లు సద్వినియోగ పరుచుకుంటూ ఆనందముతో ఆరోగ్యవంతులై ఆత్మానుభూతిని గూర్చి చింతించుచు, జీవిత పరమ లక్ష్యమును అనగా జీవిత సంఘర్షణ నుండి విముక్తిని సాధింతురనెడి ఉద్దేశము చేతనే వారట్లు మనకు సర్వమును అందించుచున్నారు. అట్లు చేసినచో జీవిత లక్ష్యము యజ్ఞాచరముచే సిద్ధించును. కాని మనము మానవజన్మ లక్ష్యమును విస్మరించి, భగవానుని ప్రతినిధులచే ఒసగబడిన వాటిని కేవలము ఇంద్రియ తృప్తికొరకే వినియోగించి భౌతిక సంసారము నందే మరింత అధికముగా చిక్కుకొని బద్ధులైపోవుచున్నాము. సృష్టి ప్రయోజనము అది కాదు. కనుక మనము దొంగలుగా పరిగణింపబడి భౌతిక ప్రకృతి నియమములచే శిక్షింపబడుదుము. ఎటువంటి ప్రత్యేక జీవితోద్దేశ్యమును కలిగి యుండనందున దొంగలతో నిండియున్న సంఘమెన్నడును సుఖవంతము కాజాలదు. కేవలము దొంగలైనట్టి భౌతిక జనులకు ఎట్టి జీవిత లక్ష్యముండదు. వారికి ఇంద్రియతృప్తియే ముఖ్యోద్దేశ్యము. యజ్ఞమును ఎట్లు ఆచరింపవలెనో వారెరుగజాలరు. కనుకనే అత్యంత సులభముగా నిర్వహింపబడెడి 'సంకీర్తన యజ్ఞ'మనెడి యజ్ఞమును శ్రీ చైతన్య మహాప్రభువు ప్రారంభించిరి. కృష్ణచైతన్య సిద్ధాంతమును అంగీకరించగలిగిన ప్రపంచ జనులెవ్వరైనను ఈ సంకీర్తన యజ్ఞమును ఆచరింపవచ్చును.

## 3.13

**యజ్ఞశిష్టాశిన: సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషై: ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్ ॥**

### అనువాదము

**"యజ్ఞమున అర్పింపబడిన ఆహారమును స్వీకరించుట వలన భగవద్భక్తులు సర్వ విధములైన పాపములనుండి విముక్తులగుదురు. తమ ఇంద్రియ ప్రీతి కొరకే ఆహారమును సిద్ధము చేసుకొను వారు కేవలము పాపమునే భుజింతురు."**

### భాష్యము

భగవద్భక్తులు లేదా కృష్ణచైతన్యములోని వ్యక్తులు 'సంత' అనగా సత్పురుషులని పిలువబడుదురు. 'బ్రహ్మసంహిత'(5.38) నందు తెలుపబడినట్లు, వారెల్లప్పుడును భగవానుని ప్రేమయందే నిలిచియుందురు : " ప్రేమాఞ్జనచ్ఛురిత భక్తి విలోచనేన సన్త: సదైవ హృదయేషు విలోకయన్తి." వారెల్లప్పుడును దేవాదిదేవుడైన గోవిందుని (అన్ని ఆనందములనొసగువానిని) లేక ముకుందుని (ముక్తి నొసగువాడు) లేక శ్రీకృష్ణుని (సర్వాకర్షకుడు) ప్రేమయందు దృఢముగా నెలకొనియుందురు. కనుక దేవాదిదేవునకు తొలుత అర్పింపకుండ దేనిని వారు స్వీకరింపరు. కనుకనే అట్టి భక్తులు శ్రవణము, కీర్తనము, విష్ణోస్మరణము, అర్చనము వంటి పలు భక్తియుక్త సేవలతో కూడిన యజ్ఞములను సదా నిర్వహించుచునే యుందురు. ఈ యజ్ఞాచరములు వారిని సదా

భౌతిక జగత్తు నందలి అన్నిరకాల పాప సాంగత్యములతో కూడిన అన్ని విధములైన కాలుష్యముల నుండి దూరముగా నుంచును. అట్లుగాక తమ ఆనందము కొరకే లేక ఇంద్రియతృప్తి కొరకే ఆహారమును సిద్ధము చేసుకొనువారు దొంగలగుటయే కాకుండ అన్నిరకాల పాపములను భుజించినట్టివారే కాగలరు. దొంగ మరియు పాపాత్ముడైనవాడు ఎట్లు సౌఖ్యవంతుడు కాగలడు? అది అసాధ్యము. కనుకనే జనులు అన్ని విధములుగా ఆనందమయమగుటకు సులభ విధానములతో కూడిన ఈ 'సంకీర్తన యజ్ఞము'ను సంపూర్ణ కృష్ణచైతన్యముతో నిర్వహించేలా వారికి బోధింపవలసి యున్నది. లేనిచో ప్రపంచమునందు శాంతిగాని, సుఖము గాని నెలకొనజాలవు.

## 3.14

**అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్నసమ్భవ: ।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞ: కర్మసముద్భవ: ॥**

## అనువాదము

**జీవ దేహములన్నియును వర్షము వలన ఉత్పన్నమైనట్టి ఆహార ధాన్యముపై ఆధారపడి జీవించును. వర్షము యజ్ఞాచరము వలన కలుగును. విహిత కర్మాచరణము నుండి యజ్ఞము ఉద్భవించుచున్నది.**

## భాష్యము

భగవద్గీతకు గొప్ప వ్యాఖ్యాతయైన శ్రీల బలదేవ విద్యాభూషణులు ఇట్లు రచించియున్నారు : "యే ఇంద్రాద్యంగతయావస్థితం యజ్ఞం సర్వేశ్వరం విష్ణుమభ్యర్చ్య తచ్ఛేషమశ్నన్తి తేన తద్దేహయాత్రాం సమ్పాదయన్తి, తే సంత: సర్వేశ్వరస్య యజ్ఞ పురుషస్య భక్తా: సర్వకిల్బిషైర్ అనాదికాలవివృద్ధైర్ ఆత్మానుభవ ప్రతిబన్ధ కైర్నిఖిలై: పాపైర్విముచ్యన్తే" (గీతాభూషణ 2.13) – "యజ్ఞపురుషునిగా లేక సర్వయజ్ఞ భోక్తగా ప్రసిద్ధినొందిన పరమపురుషుడు దేవతలందరికిని ప్రభువు. దేహమునందలి సర్వావయవములు దేహమును సేవించినట్లుగా ఆ దేవతలందరును భగవానుని సేవింతురు. ఇంద్రుడు,చంద్రుడు,వరుణుడు వంటి దేవతలు సృష్టి పాలనకై నియమింపబడిన అధికారు లైనందున వారి సంతృప్తి కొరకై వేదములు యజ్ఞములను నిర్దేశించుచున్నవి. యజ్ఞముల వలన తృప్తినొంది దేవతలు ధాన్యమును సమృద్ధిగా ఉత్పత్తి చేయుటకు కావలసినంత గాలిని, వెలుతురును, నీటిని సమకూర్చుచుందురు. శ్రీకృష్ణభగవానుని అర్చించినచో అతని వివిధ అంగములైన దేవతలను కూడ సహజముగానే పూజించినట్లగును. కనుకనే ఆ దేవతలను ప్రత్యేకించి పూజింపనవసరము లేదు. కనుకనే కృష్ణ చైతన్యవంతులైన భగవద్భక్తులు ఆహారమును తొలుత శ్రీకృష్ణునకు అర్పించి పిదప దానిని గ్రహింతురు. ఈ విధమైన కర్మ ద్వారా దేహము ఆధ్యాత్మికముగా పోషింపగలదు. దేహమునందలి పూర్వపు పాపములన్నినశించుటయే కాకుండ దేహము భౌతిక ప్రకృతిలోని సమస్త కల్మషముల నుండి కూడ విముక్తమగును." అంటువ్యాధి వ్యాపించినప్పుడు వ్యాధి నిరోధక ఔషధము అట్టి అంటువ్యాధినుండి మానవుని రక్షించునట్లుగా, విష్ణువుకు అర్పింపబడిన ఆహారము మనలను భౌతిక విషయాశక్తి నుండి రక్షించును. ఇట్టి అభ్యాసమునకు అలవాటుపడినవాడే భగవద్భక్తుడుగా పిలువబడును. కనుక కృష్ణప్రసాదమునే భుజించు కృష్ణచైతన్యవంతుడు ఆత్మానుభూతి మార్గములో పురోభివృద్ధికి అవరోధముల

వంటి పూర్వపు పాపప్రతిక్రియల నన్నింటిని నశింపజేసుకొనును. ఈ విధముగా చేయనివాడు పాపభారమును క్రమముగా పెంచుకొని పోవుచుండును. అవి అతనిని భవిష్యత్తు జీవితమున పాపఫలములను అనుభవించుటకు హీనమైన సూకరములు, శునకముల దేహములను తయారు చేసుకొనుచుండును. వాస్తవమునకు ఈ భౌతిక జగత్తు కల్మషములతో నిండియున్నట్టిది. భగవత్ప్రసాదమును స్వీకరించువాడు మాత్రమే వాని ప్రభావము నుండి రక్షింపబడును. అట్లు చేయనివాడు కల్మషమునకు గురియగును.

వాస్తవమునకు ఆహారధాన్యములు మరియు కాయకూరలే ఆహారయోగ్యము లైనట్టివి. మానవులు వివిధములైన ధాన్యములు, కూరలు, ఫలములు వంటివాటిని భుజింతురు. జంతువులు ఆహారధాన్యముల నుండియు కాయకూరల నుండియు తొలగింపబడిన వ్యర్థపదార్థములను, గడ్డిని, మొక్కలను ఆహారముగా గ్రహించును. మాంసము భుజించుటకు అలవాటు పడిన వారు కూడ ఆ జంతు మాంసమును తినుటకు వృక్షజాలపు ఉత్పత్తులపైనే ఆధారపడవలసి యుండును. కనుక చివరికి మనము కర్మాగారములలో ఉత్పన్నములగు పదార్థములపై కాకుండ పొలములో పండు పదార్థముల పైననే ఆధారపడవలెను. పొలములలో పండు ధాన్యాదులు ఆకాశము నుండి వర్షించు వర్షముపై ఆధారపడి పండుచుండును. అట్టి వర్షము ఇంద్రుడు, చంద్రుడు, సూర్యాది దేవతలచే నియంత్రింపబడును. ఆ దేవతలందరును శ్రీకృష్ణభగవానుని సేవకులు. అట్టి భగవానుడు యజ్ఞముచే సంప్రీతుడగును. కనుక యజ్ఞాచరణము కావించువానికి ఎట్టి కొరతయు ఏర్పడదు. అది ప్రకృతి నియమము. కనుక కనీసము ఆహార పదార్థముల కొరత నుండి రక్షింపబడుటకైనను ప్రత్యేకించి ఈ యుగమునకు నిర్దేశింపబడిన 'సంకీర్తన యజ్ఞము'ను నిర్వహింపవలసి యున్నది.

## 3.15

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥**

### అనువాదము

**నియమిత కర్మలు వేదములందు నిర్దేశింపబడగా, అట్టి వేదములు దేవాదిదేవుని నుండి ప్రత్యక్షముగా వ్యక్తము చేయబడినవి. అందుచే సర్వ వ్యాపకమైన పరబ్రహ్మము యజ్ఞకర్మ లందు నిత్యముగా ప్రతిష్ఠితమై యుండును.**

### భాష్యము

'యజ్ఞార్థ కర్మము' లేక శ్రీకృష్ణుని ప్రీతి కొరకు మాత్రమే కర్మనొనరింపవలసిన అవసరము ఈ శ్లోకమునందు మరింతగా నొక్కిచెప్పబడినది. 'యజ్ఞపురుష'డైన విష్ణువు ప్రీత్యర్థమే మనము కర్మ చేయవలెనన్నచో ఆ కర్మకు సంబంధించిన మార్గదర్శనమును బ్రహ్మమునందు లేక ఉత్కృష్టమైన వేదములనుండి పొందవలెను. కనుకనే వేదములు కర్మనొనరించుటకు మార్గదర్శక సూత్రములై యున్నవి. వేదనిర్దేశము లేకుండ చేయబడెడి కర్మ 'వికర్మము' (అప్రమాణిక కర్మ) లేక 'పాపకర్మ'గా తెలియబడును. కనుకనే మానవుడు కర్మ ఫలముల నుండి రక్షింపబడుటకు వేదములనుండి ఆదేశములను పొందవలెను. సామాన్య జీవితమున మానవుడు దేశము యొక్క రాజ్యాంగ నిర్దేశము ననుసరించి వర్తింపవలెను. ప్రతియొక్కరు భగవానుని నిర్దేశము ననుసరించియే కర్మ

నొసరింపవలెను. వేదములందలి అట్టి నిర్దేశములు దేవాదిదేవుని నిశ్వాస నుండి స్వయంగా వ్యక్తమైయున్నవి. అందులో ఇట్లు చెప్పబడినది : "అస్య మహతో భూతస్య ని:శ్వసితయేతద్ యద్ ఋగ్వేదో యుజర్వేద: సామవేదో/థర్వాంగి రస:" – "ఋగ్వేదము, యుజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము అను నాలుగు వేదములు దేవాదిదేవుని శ్వాస నుండి వ్యక్తమైనవి" (బృహదారణ్యకోపనిషత్తు 4.5.11). సర్వశక్తి మంతుడగుటచే భగవానుడు శ్వాస ద్వారా కూడ సంభాషింపగలడు. భగవానుడు తన ప్రతి ఇంద్రియము ద్వారా ఇతర ఇంద్రియ కార్యములను చేయగల సర్వశక్తిసంపన్నుడని 'బ్రహ్మ సంహిత' (5.32) నిర్ధారించుచున్నది. అనగా ఉదాహరణకు, భగవానుడు శ్వాస ద్వారా సంభాషింపగలడు. కన్నుల ద్వారా సృజింపగలడు. వాస్తవమునకు అతడు భౌతిక ప్రకృతిపై దృష్టి సారించి జీవులను దానియందు ప్రవేశపెట్టెనని తెలుపబడినది. భౌతిక ప్రకృతిగర్భము నందు బద్ధ జీవులను ప్రవేశపెట్టిన పిమ్మట ఆ బద్ధజీవులు తమ ధామమును ఎట్లు తిరిగి చేరగలరో తెలుపుటకు అతడు వేదవిజ్ఞానము నందు నిర్దేశముల నొసగెను. భౌతిక ప్రకృతి యందలి బద్ధజీవులందరును భౌతిక సుఖాభిలాష కొరకై ఎల్లప్పుడు ఉత్సాహమును కలిగియుందురని మనమెరుగవలెను. కాని జీవుడు అట్టి తన విపరీత కోరికలను సంతృప్తి పరచుకొనిన పిమ్మట ఎట్లు భగవద్ధామమును తిరిగి చేరుకోవచ్చునో తెలుపునట్లుగా వేదనిర్దేశములు చేయబడినవి. ఇది బద్ధజీవులు ముక్తిని పొందుటకొరకై కల్పింపబడిన ఒక అవకాశము. కనుకనే వారందరును కృష్ణచైతన్యవంతులై యజ్ఞవిధానము ననుసరించుటకు యత్నింపవలెను. వైదిక శాసనముల ననుసరింపని వారు కూడ కృష్ణచైతన్య సిద్ధాంతములను స్వీకరింపవచ్చును. అట్టికార్యము వైదిక యజ్ఞాచరణమే లేక వైదిక కర్మాచరణమే కాగలదు.

## 3.16

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ య: ।**
**అఘాయురిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥**

## అనువాదము

**ప్రియమైన ఓ అర్జునా! ఈ విధముగా వేదములచే స్థాపింపబడిన యజ్ఞ చక్రమును మానవ జీవితమున అనుసరింపనివాడు నిజముగా పాప జీవనుడగును. కేవలము ఇంద్రియ తృప్తి కొరకే జీవించుచు అట్టివాడు నిరర్థకముగా జీవనమును గడుపును.**

## భాష్యము

'కష్టించి పనిచేసి పిదప ఇంద్రియభోగము ననుభవింపుము' అని చెప్పే ధనలోభపూరితమైన తత్త్వము శ్రీకృష్ణభగవానునిచే ఇక్కడ ఖండింపబడినది. కనుక ఈ భౌతిక జగత్తును అనుభవింపగోరు వారికి పైన పేర్కొనబడిన యజ్ఞాచరణ చక్రము అత్యంత అవసరము. అట్టి నియమములను అనుసరింపలేనివాడు మిక్కిలి గర్వితుడై మిక్కిలి అపాయకరమైన జీవితమును గడుపును. ప్రకృతి నియమానుసారము మానవజన్మ యనునది కర్మజ్ఞాన భక్తియోగములనెడి ఏదియో ఒక మార్గముననుసరించి ఆత్మానుభూతిని పొందుట కొరకే ప్రత్యేకముగా ఉద్దేశింపబడినది. గుణదోషాతీతులైన

మహాత్ములు వేదవిహితమైన యజ్ఞకర్మాచరణమును ఖచ్చితముగా అనుసరింపనవసరము లేదు. కాని ఇంద్రియ భోగములందు నిమగ్నులైన వారికి పైన తెలుపబడిన యజ్ఞాచరణ చక్రము ద్వారా పవిత్రతను పొందవలసి యున్నది. వాస్తవమునకు కర్మలు అనేక రకములు. కృష్ణచైతన్యము నందు నెలకొననివారు ఇంద్రియభోగ భావనయందే నెలకొనియుందురు. కనుక అట్టివారు పుణ్యకర్మలను చేయవలసి యున్నది. ఇంద్రియ తృప్తిని వాంచించు వారు ఇంద్రియ తృప్తి ఫలమునందు చిక్కుకొనకుండ తమ కోరికలను సంతృప్తి పరచుకొనగలుగునట్లుగా యజ్ఞ విధానము ఏర్పాటు చేయబడినది. ఈ జగత్తుయొక్క పురోభివృద్ధి మన స్వంత ప్రయత్నముపై కాకుండ, పరోక్షముగా దేవతల చేత నిర్వహింప బడునట్లు భగవానుడు చేసిన ప్రణాళికపై ఆధారపడియున్నది. కనుకనే వేదములందు చెప్పబడిన ప్రత్యేక దేవతల కొరకే యజ్ఞములు ప్రత్యక్షముగా ఉద్దేశింపబడినవి. పరోక్షముగా అది కృష్ణచైతన్య అభ్యాసమే అయియున్నది. ఎందుకనగా, యజ్ఞాచరణము నందు నిష్ణాతుడైనవాడు తప్పక కృష్ణచైతన్యవంతుడై తీరును. కాని అట్టి యజ్ఞాచరణము ద్వారా మానవుడు కృష్ణచైతన్య వంతుడైనచో అట్టి సిద్ధాంతములు కేవలము నీతి సూత్రములుగా మాత్రమే పరిగణింపబడును. కనుక మానవుడు తమ పురోగతిని కేవలము నీతిసూత్రముల వరకే పరిమితము చేసికొనక, వాటిని అధిగమించి కృష్ణచైతన్యమును పొందవలసియున్నది.

## 3.17

**యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవ: ।**
**ఆత్మన్యేవ చ సన్తుష్టస్తస్య కార్యం న విద్యతే ॥**

### అనువాదము

**కాని ఆత్మానుభవ పూరితమైన జీవితముతో ఆత్మయందే ఆనందమును గొనుచు, ఆత్మయందే తృప్తుడై పరిపూర్ణ సంతుష్టిని పొందినవానికి చేయవలసిన కర్మమేమియును లేదు.**

### భాష్యము

సంపూర్ణ కృష్ణచైతన్యవంతుడై కృష్ణచైతన్యములోని తన కర్మలచే పూర్తిగ తృప్తి నొందినవానికి చేయవలసిన కర్తవ్యమేదియును ఉండదు. కృష్ణచైతన్యవంతుడగుటచే అతనిలోని పాపకర్మయంతయు(కల్మష) వెంటనే తొలగింపబడుచున్నది. అది వేలకొలది యజ్ఞాచరణముల ఫలముతో సమానమైనది. ఆ విధముగా చైతన్యము శుద్ధిపడినపుడు భగవానుని సంబంధముతో కూడిన తన నిజ స్వరూప స్థితిని మానవుడు అనుభూతి చెందగలుగును. అట్టివానికి భగవానుని కృపచే అతని విధ్యుక్త ధర్మము స్వయముగా స్ఫురించును. కనుకనే అతడు వేదనిర్దేశములననుసరింపవలసిన నిర్బంధము లేదు. అట్టి కృష్ణచైతన్యవంతుడు ఎట్టి భౌతిక కర్మల యందును ఆసక్తిని కలిగియుండడు. అంతేకాకుండ, అతడు మద్యము, స్త్రీవంటి వ్యసనములతో కూడిన మొహపూరితమైన భౌతిక భోగములందు ఏమాత్రము ఆనందమును పొందడు.

### 3.18

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయ: ॥**

## అనువాదము

**ఆత్మానుభవమును పొందిన మానవుడు తన విధ్యుక్త ధర్మనిర్వహణము ద్వారా పొందవలసిన ప్రయోజనమేదియును ఉండదు. అయినను అట్టి కర్మను నిర్వర్తింపకపోవుటకు కారణము గాని, ఇతర జీవులపై ఆధారపడవలసిన అవసరము గాని అతనికి ఉండదు.**

## భాష్యము

ఆత్మానుభవమును పొందిన మానవునికి కృష్ణచైతన్యముతో కూడిన కార్యములను తప్ప అన్యమైన ఇతర విధ్యుక్తధర్మ నిర్వహణమేదియును అవసరము లేదు. రాబోవు శ్లోకములలో వివరింపబడినట్లు, కృష్ణచైతన్యము అనగా కర్మ రాహిత్యము కూడా కాదు. కృష్ణచైతన్యవంతుడు ఏ మానవుని గాని, దేవతను గాని ఆశ్రయింపడు. కృష్ణచైతన్యము నందు నెలకొని అతడు ఏది చేసినను అది అతని విధినిర్వహణకు సరిపోవును.

### 3.19

**తస్మాదసక్త: సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పురుష: ॥**

## అనువాదము

**అందుచే మానవుడు కర్మఫలముల యందు ఆసక్తి లేనివాడై తన ధర్మముగా భావించుచు కర్మలనాచరింపవలెను. ఏలయనగా ఆసక్తిలేకుండ కర్మనొనరించుట ద్వారా మానవుడు పరమసత్యమును పొందగలడు.**

## భాష్యము

భక్తులకు దేవాదిదేవుడు, నిరాకారవాదులకు మోక్షము అనునవి పరమావధులు. కనుకనే సరియైన నిర్దేశమున కర్మఫలముల యందు ఆసక్తి లేకుండా శ్రీకృష్ణుని కొరకు లేక కృష్ణచైతన్యముతో కర్మచేయు మానవుడు తప్పక జీవిత పరమ లక్ష్యము వైపునకు పురోగమించును. శ్రీకృష్ణుని ప్రీతికొరకే యుద్ధము చేయుమని కురుక్షేత్ర రణరంగమున అర్జునుడు ఆదేశింపబడెను. శ్రీకృష్ణుడు అతనిని యుద్ధము చేయమని కోరియుండుటయే అందుకు కారణము. సాధువుగా లేక అసింహాపరునిగా వర్తించుట యనునది వ్యక్తిగత ఆసక్తిని సూచించును. కాని దేవాదిదేవుని పక్షమున కర్మచేయుట యనగా ఫలమునందు ఆసక్తి లేకుండా కర్మ చేయుటయే యగును. దేవాదిదేవుడైన శ్రీక్రుష్ణునిచే ఆదేశింపబడిన శ్రేష్ఠమైన, అత్యుత్తమమైన పరిపూర్ణ కర్మమదియే.

ఇంద్రియ తృప్తి కొరకై ఆచరింపబడు పాపకర్మలను పవిత్రము చేయుట కొరకై యజ్ఞముల వంటి వేదవిహిత కర్మలు నిర్వహింపబడును. కాని కృష్ణచైతన్యముతో

చేయబడు కర్మలు శుభాశుభ కర్మఫలములకు అతీతములైనవి. కృష్ణచైతన్యవంతుడు కర్మ ఫలాసక్తి లేకుండ శ్రీకృష్ణుని కొరకు మాత్రమే కర్మను కొనసాగించును. అతడు అన్నిరకముల కార్యములను నిర్వహించినను సంపూర్ణముగా అనాసక్తుడై యుండును.

## 3.20

**కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥**

### అనువాదము

**జనకుడు వంటి మహారాజులు కేవలము విధ్యుక్త ధర్మములను నిర్వర్తించుట ద్వారానే పరిపూర్ణత్వమును పొందగలిగిరి. అందుచే జనసామాన్యమునకు బోధించు నిమిత్తమై తప్పక నీవు నీ కర్మను చేయవలయును.**

### భాష్యము

జనకుడు వంటి మహారాజులందరూ ఆత్మానుభూతిని పొందిన మహాత్ములు. కనుకనే వారికి వేదనిర్దేశములైన కర్మలనాచరింపవలసిన అవసరము లేదు. అయినను, సామాన్యజనులకు ఆదర్శప్రాయులుగా నుండుటకై వారు విధ్యుక్త ధర్మముల నన్నింటిని ఆచరించిరి. జనకమహారాజు సీతాదేవికి తండ్రి మరియు శ్రీరామచంద్రునికి మామగారు. అతడు గొప్పభక్తుడగుట చేత అత్యున్నత స్థితియందు నెలకొనినను మిథిలా నగరమునకు (బీహారు రాష్ట్రమునకు) రాజగుటచేత విధ్యుక్తధర్మములను ఎట్లు ఆచరింపవలెనో తన ప్రజలకు స్వయముగా బోధింపవలసి వచ్చెను. శ్రీకృష్ణభగవానుడు మరియు అతని శాశ్వత మిత్రుడైన అర్జునునకు కురుక్షేత్ర సంగ్రామమున యుద్ధము చేయనవసరము లేదు. కాని మంచి యుక్తులు లేక వాదములు విఫలమైనచో హింసకూడ అవసరమని సామాన్యజనులకు బోధించుట కొరకై వారు యుద్ధము చేసిరి. కురుక్షేత్ర యుద్ధము జరుగుటకు మునుపు యుద్ధమును నివారించుటకు సర్వవిధములైన ప్రయత్నములు జరిగెను. స్వయముగా దేవాదిదేవుడే యుద్ధమును నివారించుటకు యత్నించినను ప్రతిపక్షము వారు యుద్ధము చేయుటకే దృఢనిశ్చయులైరి. న్యాయ సమ్మతమైన అట్టి విషయమున యుద్ధము తప్పనిసరి అయ్యెను. కృష్ణచైతన్యము నందు నెలకొనినట్టి వానికి ప్రపంచమునందు ఎట్టి ఆసక్తి లేకపోయినను, ప్రజలు ఎట్లు జీవింపవలెనో మరియు ఎట్లు కర్మచేయవలెనో బోధించుట కొరకై అతడు కర్మల నొనరించుచుండును. కృష్ణచైతన్యము నందు అనుభవజ్ఞులైన వ్యక్తులు ఇతరులు తమను అనుసరించునట్లుగా వర్తించుదురు. ఈ విషయము తరువాతి శ్లోకమునందు వివరింపబడినది.

## 3.21

**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥**

## అనువాదము

**మహనీయుడైన వ్యక్తి ఎట్టి కార్యములను చేయునో వానిని సామాన్య జనులు అనుసరింతురు. తన ఆదర్శప్రాయ కర్మము ద్వారా దేనిని అతడు ప్రమాణముగా నిర్ణయించునో దానినే లోకమంతయు అనుసరించును.**

## భాష్యము

స్వీయాచరణము ద్వారా ప్రజలకు బోధింపగల నాయకుడు జనులకు ఎల్లప్పుడు అవసరము. నాయకుడే స్వయముగా ధూమపానము చేస్తూ ధూమపానము చేయవద్దని జనులకు బోధింపలేడు. బోధింపనారంభించుటకు పూర్వమే బోధకుడు చక్కని ఆచరణను కలిగియుండవలెనని శ్రీ చైతన్యమహాప్రభువు తెలిపిరి. ఆవిధముగా బోధించువాడే 'ఆచార్యుడు' లేక ఆదర్శబోధకుడని చెప్పబడును. కనుకనే సామాన్య జనులకు బోధించుటకొరకై గురువు తాను ముందుగా శాస్త్రనియమముల ననుసరింపవలెను. బోధకుడు శాస్త్రనియమములకు విరుద్ధమైన నియమములను సృష్టింపరాదు. 'మనుసంహిత' వంటి అనేక శాస్త్రగ్రంథములు మానవాళి అనుసరించుటకు గల ప్రామాణిక గ్రంథములుగా పరిగణింపబడినవి. ఈవిధముగా నాయకుడైన వాని బోధనలు అట్టి ప్రామాణిక శాస్త్రనియమములపై ఆధారపడి యుండవలెను. తమ ఉన్నతిని వాంఛించువాడు గొప్ప మహాత్ములైన ఆచార్యులచే ఆచరింపబడినట్లు ప్రామాణిక నియమములను చక్కగా పాటింపవలెను. ఆత్మానుభూతి మార్గమున పురోగతికి ఇదియే సరియైన విధానమని శ్రీమద్భాగవతము(5.5.2) కూడ ధ్రువీకరించుచున్నది. దేశమునందు కార్యములను నిర్వహించు రాజు లేక రాజ్యాధికారి, తండ్రి, పాఠశాల యందు విద్య నేర్పెడి ఉపాధ్యాయుడు అమాయక జన సామాన్యమునకు సహజ నాయకులుగా పరిగణింపబడుదురు. తమపై ఆధారపడిన అనుచరులకు బోధింపవలసిన గొప్పబాధ్యత అట్టి సహజ నాయకు లందరును కలిగియున్నారు. కనుకనే వారు నీతి మరియు ఆధ్యాత్మిక తత్త్వసూత్రములకు సంబంధించిన ప్రామాణిక గ్రంథములందు నిష్ణాతులై యుండవలెను.

**3.22**

**న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।**
**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥**

**అనువాదము**

**ఓ పార్థా! ముల్లోకములందును నాకు నిర్దేశింపబడిన కర్తవ్య మేదియును లేదు. నేను కోరునది కాని పొందునది కాని ఏదియును లేకున్నను విహితకర్మల యందు నేను నియుక్తుడనై యున్నాను.**

**భాష్యము**

దేవాదిదేవుడు వైదిక గ్రంథములందు ఈవిధముగా వర్ణింపబడినాడు:

తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తం దేవతానాం పరమం చ దైవతమ్
పతిం పతీనాం పరమం పరస్తాద్ విదామదేవం భువనేశమీడ్యమ్

న తస్య కార్యం కరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే
పరాస్య శక్తిర్వివిధై శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ

"భగవానుడు నియామకులందరికి నియామకుడైనట్టివాడు. అతడు సమస్త లోక పాలకులలోకి శ్రేష్ఠుడు. ఎల్లరును అతని ఆధీనమునందే యుందురు. అతడే జీవులందరికి ప్రత్యేక శక్తుల నొసగుచుండును. కనుకనే ఆ జీవులెన్నడును పరమోన్నతులు కాజాలరు. అతనిని దేవతలందరును పూజింతురు. అతడు నిర్దేశకులందరిలోకి పరమ నిర్దేశకుడు. కనుకనే అతడు సమస్త లోకపాలకులకు మరియు నియామకులకు అతీతుడై అందరికి పూజనీయుడై యుండును. అతడు అందరికంటెను మహత్తరుడు. అతడే సర్వకారణములకు పరమకారణుడు.

భగవానుడు సాధారణ జీవుని దేహము వంటి దేహమును కలిగియుండడు. అతని దేహమునకు మరియు ఆత్మకును బేధము లేదు. అతడు పరమ పురుషుడు. అతని ఇంద్రియములన్నియు దివ్యములు. అతని ఏ ఇంద్రియమైనను ఇతర ఏ ఇంద్రియ కార్యమునైనను చేయగల సామర్థ్యమును కలిగియుండును. కనుకనే ఎవ్వరును అతనికంటె మహత్తరుడు కాని, సమానుడు కాని లేదు. అతని శక్తులు అనేకములు. ఈవిధముగా అతని కార్యములన్నీ సహజముగానే నిర్వహింపబడును." (శ్వేతాశ్వతరోపనిషత్తు 6.7.8)

దేవాదిదేవుని యందు సమస్తము సంపూర్ణముగాను మరియు సత్యముగాను నెలకొనియుండుట చేత అతడు నిర్వర్తింపవలసిన కర్తవ్యమేదియును లేదు. తన కర్మఫలమును పొందగోరువానికి మాత్రమే విహితకర్మలు ఉండును. కాని ముల్లోకములందును పొందవలసినదేదియు లేనివానికి తప్పక చేయవలసిన కర్మమేదియు ఉండదు. అయినను శ్రీకృష్ణభగవానుడు క్షత్రియులకు నాయకుడుగా కురుక్షేత్ర సంగ్రామమున నెలకొనెను. ఎందుకనగా, దీనులకు, దుఃఖితులకు రక్షణమొసగుట క్షత్రియుల విధ్యుక్త ధర్మము. తాను శాస్త్ర విధులన్నింటికి అతీతుడై యున్నను శాస్త్రములలో చెప్పబడిన దానికి విరుద్ధముగా ఏమియును చేయడు.

## 3.23

**యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతన్ద్రిత: ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యా: పార్థ సర్వశ: ॥**

### అనువాదము

**ఓ పార్థా! ఒకవేళ నేను విధ్యుక్త ధర్మమును చక్కగా నిర్వహింపనిచో మానవులందరును తప్పక నా మార్గమునే అనుసరింతురు.**

### భాష్యము

ఆధ్యాత్మిక జీవితమునందు పురోగతిని సాధించుటకు వీలుగా సామాజిక శాంతిని నెలకొల్పుటకై ప్రతినాగరిక మానవునికి కొన్ని వంశాచారములు నిర్ణయింపబడినవి. కాని అట్టి నిబంధనలు బద్ధజీవునికే గాని శ్రీకృష్ణభగవానునికి వర్తింపవు. అయినను భగవానుడు ధర్మసంస్థాపన కొరకై అవతరించి యుండుటచేత ఆ విహిత కర్మలనన్నింటిని అనుసరించెను. శ్రీకృష్ణుడు పరమ ప్రామాణికుడగుట చేత సామాన్య జనులు అతని అడుగుజాడలనే అనుసరింతురు. గృహము నందును మరియు గృహము వెలుపలను శ్రీకృష్ణభగవానుడు గృహస్థ ధర్మములన్నింటిని నిర్వర్తించెనని శ్రీమద్భాగవతము ద్వారా తెలియుచున్నది.

## 3.24

**ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమా: ప్రజా: ॥**

### అనువాదము

**నేను విధ్యుక్త ధర్మములను నిర్వహింపనిచో లోకములన్నియును నాశనమునకు గురికావలసి వచ్చును. నేను అవాంఛనీయమైన ప్రజాబాహుళ్యమునకు కారకుడనై తద్ద్వారా సర్వజీవుల శాంతిని ధ్వంసము చేసినవాడనగుదును.**

### భాష్యము

'వర్ణసంకరము' అనగా సమాజ శాంతికి భంగము కలిగించు అవాంఛనీయమైన ప్రజాబాహుళ్యమని భావము. ఈ సాంఘిక సంక్షోభమును నివారించుటకే నియమ నిబంధనములు కలవు. వీటిని ఆచరించుటచే జనులు సహజముగానే శాంతిని పొంది ఆధ్యాత్మిక పురోగతిని సాధింపగలరు. శ్రీకృష్ణభగవానుడు అవతరించినప్పుడు, అతడు అట్టి కర్మాచరణముల అవసరమును మరియు వాటి గౌరవమును కాపాడుటకై వాటిని అనుసరించును. శ్రీకృష్ణభగవానుడు జీవులందరికీ తండ్రి గనుక జీవులు తప్పుత్రోవపట్టినచో పరోక్షముగా ఆ బాధ్యతయంతయు భగవానునికే చెందును. కనుకనే ధర్మాచరణములు నిర్లక్ష్యపరచబడినప్పుడు భగవానుడే స్వయముగా అవతరించి సమాజమును సంస్కరించును. కనుకనే భగవానుని అడుగుజాడలను శ్రద్ధతో అనుసరింపవలసి యున్నను, ఎన్నడును అతనిని అనుకరించలేమనెడి సత్యమును మనము గ్రహింపవలెను. అనుసరించుట మరియు అనుకరించుట అనునవి

సమానములు కాజాలవు. ఉదాహరణమునకు, శ్రీకృష్ణుడు బాల్యము నందు చేసినట్లు గోవర్ధన పర్వతమునెత్తి మనము అతనిని అనుకరింపలేము. అది ఎట్టి మానవునికైనను అసంభవమైనదే. అతని బోధనలను మనము అనుసరింపగలమే గాని ఎన్నడును అతనిని అనుకరింపలేము. శ్రీమద్భాగవతము (10.33.30,31) దీనిని నిర్ధారించుచున్నది :

నైతత్సమాచరేజ్జాతు మనసాపి హ్యనీశ్వర:

వినశ్యత్యాచరన్ మౌఢ్యాద్యథా/రుద్రో/బ్ధిజం విషమ్

ఈశ్వరాణాం వచ: సత్యం తథైవాచరితం క్వచిత్

తేషాం యత్ స్వవచోయుక్తం బుద్ధిమాంస్తత్సమాచరేత్

"భగవానుడు మరియు అతని ప్రామాణికులైన సేవకుల బోధనలను ప్రతియొక్కరు పాటింపవలెను. ఆ బోధనలన్నియును మనకు సర్వ శుభదాయకములు. కనుకనే ఏ బుద్ధిమంతుడైనను ఉపదేశింప బడినట్లుగనే వాటిని అనుసరించును. కాని వారి కార్యములను మాత్రమే మానవుడు అనుకరించుటకు ప్రయత్నింపకుండ జాగరూకత వహింపవలెను. పరమశివుని అనుసరించుచు ఎవ్వరును విషసముద్రమును పానము చేయుటకు యత్నింపరాదు."

ఈశ్వరుల యొక్క (సూర్యచంద్రాదుల గమనములను నియమించు శక్తి కలిగినవారి యొక్క) స్థితి, మన స్థితికంటె అధికమైనదని మనము గుర్తింపవలెను. అట్టి శక్తి లేనిదే సర్వశక్తిమంతులైన అట్టి అట్టి ఈశ్వరులను ఎవ్వరును అనుకరింపలేరు. పరమశివుడు సముద్రమంత విస్తృతమైన విషమును త్రాగియుండెను. కాని సామాన్యమానవుడెవ్వడైనను ఆ విషమును స్వల్పముగానైనను త్రాగుటకు యత్నించినచో వెంటనే మరణించును. కాని గంజాయిని పీల్చుతూ, ఇతర మాదకద్రవ్యముల వంటివాటిని సేవిస్తూ, శివుని భక్తులమని చెప్పుకొనువారెందరో గలరు. అట్లు చేయుటచే అనగా శివుని కార్యములను అనుకరించుట ద్వారా వారు మృత్యువును సమీపమునకు ఆహ్వానిస్తున్నారని తెలిసికొనజాలరు. అట్లే, గోవర్ధన పర్వతమును ఎత్తలేనట్టి తమ అసమర్థతను విస్మరించి రాసలీలలయందు శ్రీకృష్ణభగవానుని అనుకరించుటకు ప్రయత్నించు మిథ్యాభక్తులు కొందరుగలరు. కనుకనే శక్తిమంతులను అనుకరించుట కంటెను వారి బోధనలననుసరించుట మానవులకు ఉత్తమము. అట్లే మానవులెవ్వరును అర్హతలేకుండా ప్రామాణికుల స్థానములను ఆక్రమించుటకు యత్నింపరాదు. దేవాదిదేవునికి ఉండవలసిన శక్తిలేకుండ 'భగవదవతారము'లుగా చెప్పుకొను 'అవతారములు' ఈనాడు అనేకములు గలవు.

## 3.25

**సక్తా: కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।
కుర్యాద్ విద్వాంస్తథాసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥**

### అనువాదము

**పామరులు కర్మఫలములందు ఆసక్తులై తమ కర్మనొనరించునట్లు, విద్వాంసుడైనవాడు సామాన్యజనులను ధర్మమార్గమున వర్తింప జేయుటకై ఆసక్తిరహితముగా విహిత కర్మల నాచరింపవలెను.**

### భాష్యము

కృష్ణచైతన్యవంతుని మరియు కృష్ణచైతన్యమునందు నెలకొనని వ్యక్తిని వారియందుండు వివిధకోరికల ననుసరించి వేరుపరుపవచ్చును. కృష్ణచైతన్యమున నెలకొనినవాడు కృష్ణచైతన్య పురోగతికి తోడ్పడనటువంటి ఎట్టి కర్మను అనుసరింపడు. భౌతిక కర్మ ఫలములందు ఆసక్తులైన పామరులు చేసినట్లే కృష్ణచైతన్యవంతుడు కూడ కర్మ చేయవచ్చును. కాని పామరులు తమ ఇంద్రియతృప్తికొరకై కర్మల నాచారించుదురు, కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణుని తృప్తికొరకై కర్మలనాచరించును. కనుకనే సామాన్యజనులు ఏవిధముగా కర్మ చేయవలెనో మరియు కర్మఫలములను ఎట్లు కృష్ణభక్తి ప్రయోజనార్థమై వినియోగింపవలెనో ఉదాహరణగా చూపుటకు కృష్ణచైతన్యవంతుని అవసరమెంతో గలదు.

## 3.26

**న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసఙ్గినామ్ ।
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్త: సమాచరన్ ॥**

### అనువాదము

**విధ్యుక్త ధర్మపు ఫలముల యెడ ఆశక్తిని కలిగిన పామరుల మనస్సు కలత పడునట్లుగా విద్వాంసుడు వారిని కర్మ మానుమని ప్రేరేపింపరాదు. అట్లుకాక, అతడు భక్తిభావముతో కర్మనొనరించుచు (కృష్ణచైతన్యము నందు పురోభివృద్ధిని పొందుటకై) వారిని వివిధ కర్మల యందు నిమగ్నులను చేయవలెను.**

### భాష్యము

'వేదైశ్చ సర్వైరహమేవ వేద్య:' (భ.గీ. 15.15) సమస్త వైదిక కర్మలన్నింటికిని చరమ ప్రయోజనమిదియే. వేదములందు తెలుపబడిన సమస్త కర్మలు, యజ్ఞాచరణములు (భౌతిక కర్మలకు సంబంధించిన నిర్దేశములతో కూడి) ఇతరములైన అన్ని విషయములు జీవిత పరమగమ్యమైన శ్రీకృష్ణభగవానుని అవగతము చేసుకొనుటకొరకై ఉద్దేశింపబడి యున్నవి. కాని బద్ధజీవులు ఇంద్రియ భోగముల కంటెను అన్యమైన వాటిని ఎరుగనందున అట్టి ప్రయోజనము కొరకే వేదాధ్యయనము చేయుదురు. అయినను వేదకర్మల ద్వారా నియమింపబడిన కామ్యకర్మలు మరియు ఇంద్రియ భోగములచే మానవుడు క్రమముగా కృష్ణచైతన్య స్థితికి ఉద్ధరింపబడును. కనుకనే

కృష్ణచైతన్యవంతుడు ఇతరుల కర్మలయందు లేదా అవగాహన యందు కలతను కలిగించరాదు. అట్లుకాకుండ, అతడు కర్మఫలములన్నింటిని కృష్ణసేవకు ఎట్లు అర్పింపవలెనో చూపుచు కర్మలనాచరింపవలెను. ఇంద్రియ తృప్తి కొరకై కర్మనొనరించు అజ్ఞాని ఏవిధముగా కర్మను ఆచరింపవలెనో, వాస్తవమునకు ఏవిధముగా వర్తింపవలెనో తెలుసుకొనునట్లుగా కృష్ణచైతన్యవంతుడైన విద్వాంశుడు కర్మల నాచరించి చూపవలెను. పామరులను వారి కర్మలయందు కలత పరచరాదు. కాని కృష్ణచైతన్యమున స్వల్పముగా పురోభివృద్ధి సాధించిన వ్యక్తి ఎట్టి ఇతర వైదికకర్మల ననుసరింపక ప్రత్యక్షముగా భగవత్సేవ యందు నెలకొనవచ్చును. అట్టి అదృష్టవంతునికి వైదిక కర్మల ననుసరింపనవసరమేదియు లేదు. ఎందుకనగా, ప్రత్యక్ష కృష్ణచైతన్యము వలన విధ్యుక్త ధర్మ నిర్వహణము ద్వారా కలుగు ఫలితముల నన్నింటిని మానవుడు కృష్ణచైతన్యమునందు ప్రత్యక్షముగా నెలకొనుట ద్వారా సాధింపగలుగును.

## 3.27

**ప్రకృతే క్రియమాణాని గుణై: కర్మాణి సర్వశ: ।**
**అహంకార విమూఢాత్మా కర్తహమితి మన్యతే ॥**

## అనువాదము

**అహంకార ప్రభావముచే మోహితుడైన జీవాత్మ వాస్తవముగా ప్రకృతి త్రిగుణములచే నిర్వహింపబడు కర్మలకు తానే కర్తగా భావించును.**

## భాష్యము

కృష్ణచైతన్యవంతుడు, భౌతిక చైతన్యము నందున్న వ్యక్తి అను ఇరువరు ఒకేవిధముగా కర్మనొనరించు చున్నట్లు, ఒకే స్థితియందున్నట్లుగా గోచరించును. కాని వాస్తవమునకు వారి స్థితుల నడుమ విశేషమైన వ్యత్యాసము కనిపించును. భౌతికభావన యందున్నవాడు అహంకారముచే సర్వమునకు తానే కర్తనని విశ్వసించును. దేహరచన పరమపురుషుని పర్యవేక్షణమున వర్తించు భౌతికశక్తి చేతనే ఉత్పాదింపబడినదని అతడెరుగడు. భౌతికవాది చివరకు తాను శ్రీకృష్ణుని నియంత్రణలోనే ఉన్నాననెడి జ్ఞానమును కలిగియుండడు. అహంకారము గల మానవుడు తానే స్వతంత్రముగ వర్తించుచున్నానని భావించును. అది అతని అజ్ఞానమునకు చిహ్నము. అట్టివాడు స్థూల(భౌతిక) మరియు సూక్ష్మదేహములు రెండును భగవానుని ఆదేశానుసారమే ప్రకృతిచేత సృష్టింపబడినవనియు, కనుకనే అతని దైహిక మానసిక కర్మలన్నియు కృష్ణచైతన్యమును కలిగి శ్రీకృష్ణభగవానుని సేవయందు నియుక్తము కావలెననియు ఎరుగడు. అజ్ఞాని ఎంతోకాలముగా తన ఇంద్రియములను ఇంద్రియ భోగకార్యములందే దుర్వినియోగపరచి యున్నందున, దేవాదిదేవుడు 'హృషీకేశుడు' లేక భౌతిక దేహమునందు గల ఇంద్రియములకు ప్రభువని విస్మరించును. అట్టివాడు శ్రీకృష్ణునితో తనకు గల నిత్యసంబంధమును విస్మరింపజేయు అహంకారముచే తప్పక మోహితుడగును.

## 3.28

**తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయో: ।**
**గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే ॥**

### అనువాదము

**ఓ మహాబాహో! పరతత్త్వ జ్ఞానము కలిగినవాడు భక్తియుక్త కర్మలకును, కామ్యకర్మలకును నడుమ బేధమును పూర్తిగానెరిగి, ఇంద్రియములందును మరియు ఇంద్రియ భోగములందును ఆసక్తుడు గాకుండును.**

### భాష్యము

పరతత్త్వము నెరిగినవాడు భౌతిక సంపర్కములో తన హేయస్థితిని గుర్తింప గలుగును. తాను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అంశననియు మరియు తన స్థితి భౌతిక జగత్తునందు ఉండరాదనియు అతడెరుగును. అతడు సచ్చిదానంద స్వరూపుడైన భగవానుని అంశగా తన నిజస్థితిని గుర్తించి, తాను ఎట్లు భౌతిక జీవితభావన యందు చిక్కుకొంటినని తెలుసుకొనగలుగును. వాస్తవమునకు, శుద్ధస్థితియందు అతడు తన కర్మల నన్నింటిని శ్రీకృష్ణభగవానునికి భక్తియుక్తసేవగా నొనరింపవలెను. కనుక అతడు కృష్ణచైతన్య కర్మలయందు నెలకొని సమయానుగుణములు మరియు తాత్కాలికములు అయిన భౌతిక ఇంద్రియ కర్మల యందు సహజముగానే అనాసక్తుడై యుండును. అట్టివాడు తన భౌతిక బద్ధస్థితి పూర్తిగా భగవానుని ఆధీనమున ఉన్నటువంటిదని ఎరిగి, ఎట్టి భౌతిక కర్మఫలము చేతను కలతనొందకుండును. పైగా వాటిని అతడు భగవానుని కృపగా భావించును. బ్రహ్మము, పరమాత్మ, భగవానుడనెడి మూడు తత్త్వములుగా పరతత్త్వము నెరిగినవాడు శ్రీమద్భాగవతము (1.2.11) ననుసరించి 'తత్త్వవిత్' యనబడును. ఎందుకనగా, దేవాదిదేవుని సంబంధములో నిజస్వరూప స్థితిని కూడ అతడు పూర్తిగా ఎరిగియుండును.

## 3.29

**ప్రకృతేర్గుణసమ్మూఢా: సజ్జన్తే గుణకర్మసు ।**
**తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్ ॥**

### అనువాదము

**భౌతికప్రకృతి గుణములచే మోహితులైన అజ్ఞానులు భౌతిక కర్మల యందు పూర్తిగా నిమగ్నులై ఆసక్తులై యుందురు. కర్తయొక్క అజ్ఞాన కారణమున ఆ కర్మలు అధమములైనప్పటికిని జ్ఞానవంతుడు వారిని కలతపెట్టరాదు.**

### భాష్యము

అజ్ఞానులైన వ్యక్తులు స్థూలభౌతిక భావనతో తాదాత్మ్యము నొంది, భౌతిక ఉపాధుల భావనలో మునిగియుందురు. ఈ దేహము భౌతిక ప్రకృతియొక్క వరము. అట్టి దేహాత్మబుద్ధి గలవాడు 'మందుడు' లేదా ఆత్మనెరుగని సోమరి అని పిలువబడును. అజ్ఞానులు దేహమునే ఆత్మగా భావింతురు. అట్టివారు దేహమునకు సంబంధించిన

వారిని బంధువులుగా భావించుచు, జన్మనొసగిన ప్రదేశమును పూజనీయ స్థానముగా భావించుచు, మతధర్మ కార్యములే సర్వమని భావించుదురు. సామాజిక సేవ, జాతీయభావముపరహితము వాంఛించుట యనునవి అట్టి భౌతిక భావనాపరుల కార్యకలాపములలో కొన్ని. అట్టి ఉపాధుల భావనలో వారెల్లప్పుడు భౌతిక జగత్తునందు తీరికలేకుండా నుందురు. వారు ఆధ్యాత్మికానుభూతిని మిథ్యయని భావించుదురు. కనుక వారు దానియందు ఆసక్తిని కనపరచరు. అయినను ఆధ్యాత్మిక జీవితమున జ్ఞానవికాసము నొందినవారు అట్టి భౌతిక కార్య నిమగ్నులైన వ్యక్తులను కలతపెట్టక తమ ఆధ్యాత్మిక కార్యక్రమములను ప్రశాంతముగా సాగించుటయే మేలు. అట్టి మోహగ్రస్థులైన మానవులను అహింస మరియు భౌతికముగా ప్రయోజనకరము లైనట్టి దానధర్మ కార్యములవంప్రాథమిక నీతి టి ధర్మములందు నిమగ్నము చేయవచ్చును.

అజ్ఞానులైన వారు కృష్ణచైతన్యము నందలి కర్మలను అభినందింపజాలరు. కనుక అట్టివారిని కలతపెట్టి విలువైన కాలమును వృథాపరచరాదని శ్రీకృష్ణభగవానుడు మనకు ఆదేశించుచున్నాడు. కాని భగవద్భక్తులు భగవానుని కంటెను అధికమైన దయను కలిగియుందురు. ఎందుకనగా వారు భగవానుని ఉద్దేశమును గ్రహింప గలుగుదురు. కాబట్టి వారు అజ్ఞానులను చేరి వారికి అత్యంత అవసరమైన కృష్ణచైతన్య కార్యములందు వారిని నెలకొల్పుటకు ప్రయత్నించి, అన్ని విధములైన కష్టనష్టముల ననుభవించుటకు అంగీకరింతురు.

## 3.30

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుద్ధ్యస్వ విగతజ్వర: ॥**

## అనువాదము

**అందుచే ఓ అర్జునా! నన్ను గూర్చిన పరిపూర్ణ జ్ఞానము కలవాడవై ఫలాపేక్ష మరియు మమత్వములను విడిచి, నీ కర్మల నన్నింటిని నాకు సమర్పించి అలసత్వమును వీడి యుద్ధము చేయుము.**

## భాష్యము

ఈ శ్లోకము భగవద్గీత యొక్క ఉద్దేశమును స్పష్టముగా తెలుపుచున్నది. సైనిక క్రమశిక్షణ వలె మానవుడు తన విధ్యుక్త ధర్మమును నిర్వహించుటయందు పూర్తిగా కృష్ణచైతన్యవంతుడై యుండవలెనని శ్రీకృష్ణభగవానుడు బోధించుచున్నాడు. అట్టి ఆదేశము విషయమును కొంత కష్టతరము కావించినను, శ్రీకృష్ణునిపై ఆధారపడి కర్మములను నిర్వహింపవలెను. ఎందుకనగా అదియే జీవుని సహజ స్థితి. భగవానుని ఆజ్ఞలకు లోబడి యుండుటయే జీవుని నిజ స్థితి. కనుక భగవానుని సహకారము లేకుండ జీవుడు స్వయముగ స్వతంత్రునిగా ఆనందము ననుభవింపలేడు. కనుకనే సైన్యాధ్యక్షుడైనట్లుగా శ్రీకృష్ణుడు అర్జునునికి యుద్ధము చేయమని ఆజ్ఞాపించు చున్నాడు. భగవానుని సత్సంకల్పము కొరకై మానవుడు సర్వమును త్యాగము చేయుటయే కాకుండ, విధ్యుక్త ధర్మములను కూడ ఎటువంటి యజమానిత్వము (మమకారము) లేకుండా నిర్వహింపవలెను. అర్జునుడు ఇక్కడ భగవానుని ఆజ్ఞను గూర్చి చింతింపనవసరము లేదు. కేవలము అతని ఆజ్ఞను అమలుపరచుటయే అతని

కర్తవ్యము. శ్రీకృష్ణభగవానుడు సర్వాత్మలకు ఆత్మయైనవాడు. కనుక వ్యక్తిగతమైన స్వంత భావనము ఏమాత్రము లేకుండ అనగా సంపూర్ణ కృష్ణచైతన్యవంతుడై, పరమ పురుషునిపై సంపూర్ణముగా ఆధారపడినవాడే 'ఆధ్యాత్మ చేతస్కుడు' అని పిలువబడును. 'నిరాశీ:' అనగా కర్మఫలములను ఆశింపక ప్రభువు యొక్క ఆజ్ఞ ననుసరించి వర్తించువాడు. ధనమును లెక్కించు గుమస్తా తన యజమాని కొరకు లక్షలాది రూపాయలను లెక్కింపవచ్చును. అయినను అతడు అందులోని ఒక్కపైసా పైనను కూడ యజమానిత్వమును చూపడు. అదేవిధముగా ఈ జగత్తునందు ఏదియు కూడ ఏ ఒక్కవ్యక్తికి చెందినది కాదనియు సర్వము భగవానునికే చెందినదనియు ప్రతియొక్కరు గుర్తింపవలెను. 'మయి' (నాయందు) అను పదమునకు నిజమైన అర్థమిదియే. మానవుడు అట్టి కృష్ణచైతన్యము నందు వర్తించునప్పుడు నిజముగా తనకు దేనిపైనను ఆధిపత్యము (మమత్వము) కలదని భావింపడు. అట్టి భావనయే 'నిర్మమత్వము' (ఏదియును నాది కాదు) అనబడును. దేహసంబంధము వలన బంధువులను భావముతో అట్టి కఠినమైన నియమమును పాటించుటకు ఏదేని విముఖత కలిగినచో దానిని వెంటనే త్యజింపవలెను. అట్లు చేసినచో మానవుడు 'విగతజ్వరుడు' (అలసత్వము లేనివాడు) కాగలడు. ప్రతి మానవుడును తన గుణము మరియు స్థితి ననుసరించి ఒక ప్రత్యేకమైన కర్మనొనరింపవలసి యుండును. పైన వివరింపబడినట్లు, అతడు అట్టి కర్మల నన్నింటిని కృష్ణచైతన్య భావముతో నిర్వహింపవలెను. అది మానవుని ముక్తిమార్గమున నడిపింపగలదు.

## 3.31

**యే యే మతమిదం నిత్యమనుతిష్ఠన్తి మానవా: ।**
**శ్రద్ధావన్తో/నసూయన్తో ముచ్యన్తే తే/పి కర్మభి: ॥**

### అనువాదము

**నా ఆజ్ఞల ననుసరించి తమ కర్మలను నిర్వహించుచు శ్రద్ధతో ఈ ఉపదేశమును అసూయారహితులై అనుసరించువారు కామ్యకర్మ బంధముల నుండి విడువడబడుదురు.**

### భాష్యము

శ్రీకృష్ణభగవానుని ఆదేశము సర్వవైదిక విజ్ఞాన సారమగుటచే ఎట్టి వాదములకు తావు లేకుండా సంపూర్ణ శాశ్వత సత్యమై యున్నది. వేదములు శాశ్వతములైనట్లే, కృష్ణచైతన్యమునందలి ఈ సత్యము కూడా శాశ్వతమైనది. కనుకనే మానవుడు శ్రీకృష్ణ భగవానుని పట్ల అసూయను విడిచి అతని ఆదేశములందు దృఢవిశ్వాసము కలిగియుండవలెను. శ్రీకృష్ణునియందు శ్రద్ధాభక్తులు లేకున్నను భగవద్గీతపై వ్యాఖ్యానములను రచించు తత్త్వవేత్తలెందరో గలరు. అట్టి వారెన్నడును కామ్యకర్మ బంధమునుండి విముక్తిని పొందజాలరు. కాని భగవానుని శాశ్వతోపదేశములపై దృఢవిశ్వాసమును కలిగియున్న సామాన్య వ్యక్తి అట్టి ఆజ్ఞలను నిర్వహింప శక్తి లేనివాడైనను కర్మసూత్ర బంధము నుండి విముక్తిని పొందగలడు. మానవుడు కృష్ణచైతన్యము నందలి ఆరంభదశలో భగవానుని ఆదేశములను సంపూర్ణముగా నిర్వహింప లేకపోవచ్చును. కాని ఆ నియమము పట్ల ఎట్టి ద్వేషమును చూపక నిరాశ

మరియు అపజయములనెడి భయమును వీడి మానవుడు హృదయపూర్వకముగా కర్మనొనరించినచో తప్పక శుద్ధకృష్ణచైతన్య స్థితికి ఉద్ధరింపబడును.

## 3.32

**యే త్వేతదభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్ ।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతస: ॥**

### అనువాదము

**కాని అసూయతో ఎవరు ఈ ఉపదేశములను మన్నింపరో, అనుసరింపరో అట్టివారిని జ్ఞానవిహీనులుగను, మూఢులుగను, పరిపూర్ణత్వమును పొందు యత్నములలో భ్రష్టులుగను భావింపబడుదురు.**

### భాష్యము

కృష్ణచైతన్యమును పొందకపోవుట యందలి దోషము ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. అత్యున్నత అధికారి ఆజ్ఞ యెడ అవిధేయతకు శిక్ష తప్పక విధింపబడినట్లు, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ఆజ్ఞ ఎడ అవిధేయతకు కూడ శిక్ష తప్పనిసరిగా విధింపబడును. అట్టి అవిధేయుడైన మానవుడు ఎంతటి గొప్పవాడైనను రిక్త హృదయుడగుటచే తన ఆత్మను గూర్చియు, పరబ్రహ్మమును (పరమాత్మ) దేవాదిదేవుని గూర్చియు జ్ఞానరహితుడై యుండును. కనుకనే అతడు జీవిత పరిపూర్ణత్వమును పొందుటకు అవకాశమే లేదు.

## 3.33

**సదృశం చేష్టతే స్వస్యా: ప్రకృతేర్ జ్ఞానవానపి ।**
**ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహ: కిం కరిష్యతి ॥**

### అనువాదము

**ప్రతియొక్కరు త్రిగుణములనుండి తాము పొందిన స్వభావమునే అనుసరింతురు. జ్ఞానవంతుడైన మానవుడు కూడ తన స్వభావమునకు తగినట్లు కర్మనొనరించును. అట్టి యెడ నిగ్రహమేమి చేయగలదు?**

### భాష్యము

సప్తమాధ్యాయపు పదునాలుగువ శ్లోకమున శ్రీకృష్ణభగవానుడు నిర్ధారించి తెలిపినట్లుగా, మానవుడు సంపూర్ణ కృష్ణచైతన్యమనెడి ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొననిదే భౌతిక ప్రకృతి త్రిగుణముల నుండి విముక్తిని పొందలేడు. కనుకనే భౌతిక భావనలో గల గొప్ప విద్యావంతుడు కూడ కేవలము కేవలము సిద్ధాంతమాత్ర పరిజ్ఞానముచే(ఆత్మను దేహమునకు అతీతముగా గాంచుట) 'మాయా' బంధము నుండి విముక్తిని సాధించుట సాధ్యము కాదు. ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞానము నందు పురోగతి

సాధించిన వారిగా పైకి ప్రదర్శిస్తూ, అంతరమున తాము జయింపలేని గుణములకు పూర్తిగా వశులై యుండునట్టి నామమాత్ర ఆధ్యాత్మిక వాదులెందరో గలరు. మానవుడు విద్యాజ్ఞాన సంపన్నుడైనను, భౌతిక ప్రకృతితో గల సుదీర్ఘసంబంధముచే బద్ధుడైయుండును. మానవుడు తన భౌతిక స్థితిననుసరించి వివిధకర్మలలో నెలకొని యున్నప్పటికినీ, భౌతిక బంధములనుండి విముక్తి నొందుటకు కృష్ణచైతన్యము తోడ్పడును. కనుకనే సంపూర్ణముగా కృష్ణచైతన్యవంతులు కానిదే ఎవ్వరును విధ్యుక్త ధర్మములను త్యజింపరాదు. విధ్యుక్త ధర్మములను హఠాత్తుగా త్యజించి నామమాత్ర యోగిగా లేదా కృత్రిమముగా ఆధ్యాత్మిక వ్యక్తిగా మారుటకు యత్నింపరాదు. మానవుడు తానున్న స్థితియందే నిలిచి, ఉత్తమ శిక్షణ ద్వారా కృష్ణచైతన్యమును పొందుటకు యత్నించుతయే ఉత్తమమైన విధానము. ఆ విధముగా అతడు శ్రీకృష్ణుని 'మాయా' బంధము నుండి విడుదలను పొందగలడు.

## 3.34

**ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ ॥**

### అనువాదము

**ఇంద్రియములకును ఇంద్రియార్థములకును సంబంధించిన రాగద్వేషములను నియంత్రించుటకు కొన్ని నియమములు కలవు. ఆత్మానుభూతి మార్గమున ఆ రాగద్వేషములు ఆటంకములగుటచే మానవుడు వాటికి వశము కాకూడదు.**

### భాష్యము

సహజముగానే కృష్ణచైతన్యవంతులు భౌతికమైన ఇంద్రియభోగముల యెడ ఆసక్తి లేనివారై యుందురు. కాని అట్టి చైతన్యము నందు నెలకొనని వారు స్వయం వ్యక్తములైనట్టి శాస్త్రములందు తెలుపబడిన నియమ నిబంధనలను తప్పక అనుసరింపవలసి యుండును. అపరిమితమైన ఇంద్రియ తృప్తియే భౌతిక బంధములను కలిగించగలదు. కాని శాస్త్రములందు తెలుపబడిన నియమ నిబంధనలను పాటించువారు ఇంద్రియార్థములచే బంధింపబడరు. ఉదాహరణకు, మైథున భోగమనునది బద్ధజీవునకు అవసరమైనందున అట్టి సుఖానుభవము వివాహసంబంధము ద్వారా అంగీకరింపబడుచున్నది. ఎవరును తమ భార్యతో తప్ప ఇతర స్త్రీలతో సంబంధము పెట్టుకొనరాదని శాస్త్రములు తెలుపుచున్నవి. పరస్త్రీని తల్లిగా భావింపవలెను. ఇట్టి ఆదేశములు అనేకము ఉన్నప్పటికిని, మానవులు పరస్త్రీలతో సంబంధమును పొందగోరుదురు. ఇట్టి భావములను త్యజింపవలెను. లేనిచో అవి ఆత్మానుభూతి మార్గమున గొప్ప ఆటంకములు కాగలవు. భౌతిక దేహము ఉన్నంతకాలము దేహావసరములు తప్పవు. కనుక అవి నియమ నిబంధనల ననుసరించి అనుభవించుటకు అంగీకరింపబడినవి. అయినను అట్టి నిబంధనలతో కూడిన ఆమోదములపై పూర్తిగా మనము ఆధారపడరాదు. అట్టి నియమ నిబంధనలను కూడ మనము అనాసక్తితోనే ఆచరింపవలెను. ఎందుకనగా, నియమ నిబంధనల ననుసరించి పొందబడు ఇంద్రియ తృప్తి కూడ కొన్నిమార్లు మానవుని తప్పుద్రోవను పట్టించు ప్రమాదము గలదు. రాచమార్గము నందు ప్రయాణించు వారికి కూడ కొన్నిమార్లు ప్రమాదములు ఎదురయ్యే అవకాశ ముండుననెడి విషయము తెలిసినదే కదా!

సురక్షితములైన రహదారులు చక్కగా ఎటువంటి ఆటంకములు మరియు అవరోధములు లేకుండా ఏర్పాటు చేయబడినను, వాటిపై ఎట్టి ప్రమాదములు జరుగవని ఎవ్వరును హామీ ఇవ్వజాలరు. భౌతిక ప్రకృతి సంపర్కము కారణమున భోగవాంఛ అనంత కాలమునుండి వచ్చుచున్నది. కావున ఇంద్రియ భోగము నియంత్రించ బడినను మానవుడు పతనము నొందుటకు అవకాశము కలదు. కనుకనే నియమితమైన ఇంద్రియానుభవమును కూడ త్యజింపవలసి యున్నది. కృష్ణచైతన్యము నందు ఆసక్తితో అనగా శ్రీకృష్ణుని పట్ల ప్రేమయుక్త సేవయందు నెలకొనినచో అది అన్ని విధములైన ఇంద్రియతృప్తి కార్యముల పట్ల అనాసక్తిని కలిగించును. కనుక జీవితపు ఏ స్థితియందును మానవుడు కృష్ణచైతన్యమును వీడుటకు యత్నింపరాదు. సర్వవిధములైన ఇంద్రియాసక్తుల నుండి అనాసక్తి వలన కలుగు ప్రయోజనము అంత్యమున కృష్ణచైతన్య స్థితి యందు స్థిరత్వమును పొందుటయే.

## 3.35

**శ్రేయాన్ స్వధర్మో విగుణ: పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వధర్మే నిధనం శ్రేయ: పరధర్మో భయావహః ॥**

### అనువాదము

**పర ధర్మమును చక్కగా నిర్వహించుట కంటెను గుణరహితమైనను స్వధర్మమును ఆచరించుట ఉత్తమము. పరధర్మానుచరణము హానికరమగుటచే దానిని పాటించుట కంటెను స్వధర్మానుచరణము నందు నాశము పొందుటయైనను ఉత్తమమైనదే!**

### భాష్యము

ప్రతియొక్కరు పరధర్మమును నిర్వహించుటకు బదులు సంపూర్ణ కృష్ణచైతన్యము నందు తమ విధ్యుక్తధర్మములను నిర్వహింపవలెను. భౌతిక భావన ననుసరించి, భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణముల ప్రభావములో మానవుని మనస్తత్వ స్థితిననుసరించి విధింపబడిన ధర్మములే విధ్యుక్త ధర్మములు. కాని శ్రీకృష్ణుని దివ్యసేవ కొరకు ఆధ్యాత్మికాచార్యుని చేత ఆదేశింపబడిన కర్మలు ఆధ్యాత్మిక కర్మలు. పరధర్మమును అనుసరించుటకు బదులు తమ విధ్యుక్త ధర్మములు భౌతికములైనను లేదా ఆధ్యాత్మికములైనను మరణము వరకు ప్రతియొక్కరు నిర్వహింపవలెను. ఆధ్యాత్మిక స్థితియందు లేక భౌతిక స్థితియందు చేయబడు కర్మలు భిన్నములుగా నుండవచ్చును. కాని ప్రామాణిక నిర్దేశములను అనుసరించుట కర్తకు సదా హితమునే చేకూర్చును. భౌతిక గుణప్రభావము నందున్న మానవుడు ఇతరులను అనుకరింపక తమ స్థితికి అనుగుణముగా విధింపబడిన నియమములను చక్కగా పాటింపవలెను. ఉదాహరణకు సత్త్వ గుణము నందుండెడి బ్రాహ్మణులు అహింసాపరుడుగా నుండును. కాని రజోగుణము నందుండెడి క్షత్రియుడు అహింసాసిద్ధాంతము ననుసరించు బ్రాహ్మణుని అనుసరించుట కంటె హింసాపద్ధతి ననుసరించుచు పరాజయము పొందుట ఉత్తమము. ప్రతియొక్కరు కూడ తమ హృదయ కల్మషమును క్రమ పద్ధతి ద్వారా శుద్ధిపరుచుకొనవలెనే గాని హఠాత్తుగా కాదు. భౌతిక త్రిగుణములకు అతీతమై పూర్తిగా కృష్ణచైతన్యమునందు నెలకొనినప్పుడు మానవుడు ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి ఏదైనను లేక దేనినైనను చేయగల

సమర్థుడగును. అట్టి సంపూర్ణ కృష్ణచైతన్య స్థితియందు క్షత్రియుడు బ్రాహ్మణునిగా, బ్రాహ్మణుడు క్షత్రియునిగా వర్తింపవచ్చును. అనగా అట్టి ఆధ్యాత్మిక స్థితియందు భౌతిక జగత్తునకు సంబంధించిన భేదములు ఏమాత్రము వర్తింపవు. ఉదాహరణకు, సహజముగానే విశ్వామిత్రుడు మొదట క్షత్రియుడైనను పిదప బ్రాహ్మణునిగా ధర్మమును ఆచరించెను. కాని పరశురాముడు బ్రాహ్మణుడైనను పిదప క్షత్రియునిగా వర్తించెను. ఆధ్యాత్మికస్థితి యందు నెలకొనినందునే వారు ఆవిధముగా చేయగలిగిరి. కాని మానవుడు భౌతిక స్థితి యందున్నంత కాలము భౌతికగుణ స్వభావముల ననుసరించి తన ధర్మములను చేయుచుండవలెను. అట్లు చేయుచునే అతడు పూర్తి కృష్ణచైతన్యమును కలిగియుండవలెను.

## 3.36

**అర్జున ఉవాచ**

**అథ కేన ప్రయుక్తో౽యం పాపం చరతి పూరుష: ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజిత: ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : ఓ వృష్ణివంశసంజాతుడా! అనిష్టముగానైనను బలవంతముగా నియుక్తమైన వాని వలె మానవుడు దేనిచే పాపకర్మలు చేయుటయందు ప్రేరేపింపబడుచున్నాడు?**

**భాష్యము**

పరమాత్మ యొక్క అంశమగుట చేత జీవుడు సహజముగానే ఆధ్యాత్మికుడై, పవిత్రుడై సమస్త భౌతిక కల్మషముల నుండి విడివడియుండెను. కనుకనే స్వభావరీత్యా అతడు భౌతిక జగత్తునకు సంబంధించిన పాపములకు అతీతుడు. కాని భౌతిక ప్రకృతితో సంపర్కమును కలిగియున్నప్పుడు కొన్నిమార్లు ఎట్టి సంకోచము లేకుండా తన సంకల్పమునకు విరుద్ధముగా కూడ ఎన్నో రకాల పాపకార్యములను చేయుచుండును. కనుకనే అర్జునుడు విరుద్ధ స్వభావమును గూర్చి శ్రీకృష్ణుని ముందుంచిన ప్రశ్న ఆలోచనా పూరితమైనట్టిది. జీవుడు కొన్నిమార్లు పాపకార్యము చేయుట వాంఛింపకున్నను బలవంతముగా వారు అట్లు చేయుటకు ప్రేరేపింపబడుదురు. అట్టి పాపకార్యములు అంతరమందున్న పరమాత్మచే ప్రేరేపింపబడినవి కావు. తరువాతి శ్లోకమున భగవానునిచే వివరింపబడినట్లు దానికి మరోకారణము గలదు.

**3.37**

**శ్రీభగవానువాచ**

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవ: ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : అర్జునా! రజోగుణ సంపర్కము వలన పుట్టిన కామమే తదుపరి క్రోధముగా పరిణమించును. అదియే ఈ ప్రపంచమునకు సర్వమును హరించునట్టియు, పాపభూయిష్ఠమైన గొప్ప శత్రువు.**

## భాష్యము

జీవుడు భౌతిక సృష్టితో సంపర్కమును పొందినంతనే శ్రీకృష్ణుని పట్ల గల అతని నిత్యప్రేమ రజోగుణ సంబంధము వలన కామముగా మార్పు చెందును. మరోమాటలో, పాలు పుల్లని చింతపండుతో కలిసినంతనే పెరుగుగా మారినట్లు, భగవత్ప్రేమ కామముగా మార్పునొందుచున్నది. పిదప ఆ కామము సంతృప్తి పొందనప్పుడు అది క్రోధముగా మార్పు నొందుచున్నది. అటుపిమ్మట క్రోధము మోహముగా మార్పునొందును. ఈ మోహమే జీవుని భౌతిక జీవితమును కొనసాగించును. కనుక కామమే జీవునకు గొప్ప శత్రువు. ఈ కామమే పవిత్రుడైన జీవుని భౌతిక జగత్తున బద్ధునిగా చిక్కుకొని యుండునట్లు ప్రేరేపించు చుండును. క్రోధము తమో గుణమునకు మరో రూపము. ఈ గుణములు ఈ విధముగా క్రోధము మరియు ఇతర నీచ గుణములుగా ప్రకటితమగుచుండును. కనుకనే నిర్దేశింపబడిన జీవన విధానము మరియు కర్మము ద్వారా రజోగుణము నుండి తమోగుణమునకు పతనము చెందుటకు బదులు సత్త్వ గుణమునకు ఉద్ధరింపబడినచో మానవుడు ఆధ్యాత్మిక ఆసక్తితో క్రోధము చేత పతనము పొందకుండ రక్షింపబడును.

నిత్యము వృద్ధి చెందెడి తన చిదానందము కొరకు భగవానుడు అనేక రూపములుగా విస్తరించెను. జీవులందరును అట్టి చిదానందపు అంశలు. వారు కూడ పాక్షిక స్వాతంత్ర్యమును కలిగియుందురు. కాని సేవాప్రవృత్తి ఇంద్రియ భోగవాంఛగా మారి వారి స్వాతంత్ర్యము దుర్వినియోగమైనపుడు వారు కామమునకు వశమగుదురు. బద్ధజీవులు ఈ కామాది ప్రవృత్తులను సంతృప్తి పరచు కొనుటకై భగవానుడు ఈ భౌతిక జగత్తును సృష్టించెను. అట్టి నితంతర కామప్రవృత్తి కర్మలచే పూర్తిగా విసుగుచెంది, నిరాశ చెందినప్పుడు వారు తమ నిజస్థితిని గూర్చి ప్రశ్నించుట నారంభింతురు.

ఇట్లు ప్రశ్నించుటయే 'వేదాంత సూత్రము'లకు ఆరంభమై యున్నది. అట్టి ఆరంభమున 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' అని చెప్పబడినది. అనగా మానవుడు పరబ్రహ్మమును గూర్చి విచారణ చేయవలెనని అర్థము. ఈ బ్రహ్మము అనునది శ్రీమద్భాగవతము(1.1.1) నందు : జన్మాద్యస్యయతో/న్వయాదితరతశ్చ"-"సర్వ సృష్టికి పరబ్రహ్మమే మూలకారణము" అని నిర్వచింపబడినది. కనుక కామమునకు మూలము కూడ పరబ్రహ్మము నందే కలదు. కనుక అట్టి కామము భగవత్ప్రేమగా మారినచో లేక కృష్ణచైతన్యముగా అనగా శ్రీకృష్ణుని కొరకే సర్వమును వాంఛించుట యను భావనకు మార్పుచెందినచో కామక్రోధములు రెండును ఆధ్యాత్మికములు కాగలవు. శ్రీరామచంద్రుని గొప్ప సేవకుడైన హనుమంతుడు రావణుని సువర్ణలంకా నగరమును దహించుట ద్వారా తన క్రోధమును ప్రదర్శించెను. అయినను అట్టి కార్యముచే అతడు

గొప్ప రామభక్తునిగా కీర్తినొందెను. ఇక్కడ భగవద్గీత యందు కూడా భగవానుడు తన ప్రీతికొరకై శత్రువులపై క్రోధమును చూపుమని అర్జునుని ప్రేరేపించుచున్నాడు. కనుకనే కామక్రోధములు కృష్ణచైతన్యమునందు వినియోగింపబడినప్పుడు అవి శత్రువులుగా కాకుండా మనకు మిత్రులుగా మారగలవు.

## 3.38

**ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ ।**
**యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ ॥**

## అనువాదము

**అగ్ని పొగ చేతను, అద్దము ధూళి చేతను, గర్భము మావిచేతను కప్పబడి యుండునట్లు జీవుడు కూడ కామము యొక్క వివిధ దశలచే కప్పబడి యుండును.**

## భాష్యము

జీవుని శుద్ధచైతన్యమును మరుగుపరుచు ఆవరణ దశలు మూడు కలవు. అట్టి ఆవరణయే కామము. అదియే అగ్నియందలి పొగ, అద్దము పై నుండెడి ధూళి మరియు గర్భస్థ పిండము పైని మావి వలె వివిధ రూపములుగా నుండును. కామమును పొగతో పోల్చినపుడు జీవుడు అను అగ్ని స్వల్పముగా అనుభూతమగునని ఎరుగవచ్చును. మరోమాటలో, జీవుడు కృష్ణచైతన్యమును స్వల్పముగా ప్రదర్శించినపుడు అతడు పొగచేత కప్పబడిన అగ్నిని పోలియుండును. పొగ ఉన్నచోట అగ్ని యున్నను ఆరంభదశలో అగ్ని ప్రదర్శితము కాకుండ గుప్తముగా నుండును. ఈ స్థితిని కృష్ణ చైతన్యము నందలి తొలి దశతో పోల్చవచ్చును. అద్దముపై గల ధూళి వివిధ ఆధ్యాత్మిక పద్ధతుల ద్వారా మనోదర్పణము పైన గల మాలిన్యమును తొలగించు విధానమును సూచించును. దాని కొరకు భగవన్నామ సంకీర్తనమే అత్యుత్తమమైన విధానము. మావిచేత కప్పబడిన పిండము యొక్క ఉదాహరణ నిస్సహాయ స్థితిని సూచించును. ఎందుకనగా గర్భస్థశిశువు కదులుటకు కూడ వీలులేని నిస్సహాయ స్థితియందుండును. ఇట్టి జీవిత స్థితిని వృక్షముల స్థితితో పోల్చవచ్చును. వృక్షములు కూడ జీవులే. కాని అత్యధిక కామమును వారు ప్రదర్శించి యుండుటచేత దాదాపు ఎట్టి చైతన్యమును లేనట్లుగా కనిపించు జీవన స్థితిని పొందిరి. ధూళిచేత కప్పబడిన అద్దము యొక్క ఉపమానమును పక్షులు మరియు జంతువులతో పోల్చవచ్చును. ఆ విధముగనే పొగచేత కప్పబడిన అగ్ని యొక్క ఉపమానమును మానవులకు అన్వయింప వచ్చును. మానవ జన్మమునందు జీవుడు స్వల్పముగానైన కృష్ణచైతన్యమును జాగృతము చేసికొనవచ్చును. అంతేకాకుండ, మానవజన్మమున అతడు దానియందు పురోగమించినచో ఆధ్యాత్మిక జీవనమనెడి అగ్ని రగుల్కొనుటకు అవకాశము గలదు. తదుపరి అగ్నియందలి పొగను నేర్పుతో నివారించినచో అగ్నిని ప్రజ్వలింప చేయవచ్చును. కనుకనే జీవునకు ఈ మానవజన్మ భౌతిక భవబంధము నుండి విడివడుటకు ఒక చక్కని అవకాశమును కల్పించును. అట్టి మానవ జన్మమునందు సమర్థవంతమైన మార్గనిర్దేశకమున కృష్ణచైతన్యమును అలవరుచుకొనుట ద్వారా మానవుడు కామమనెడి శత్రువును జయింపగలడు.

## 3.39

**ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।**
**కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ ॥**

### అనువాదము

**ఈ విధముగా జ్ఞానవంతుడైన జీవుని శుద్ధచైతన్యము ఎన్నడును తృప్తి చెందనిదియు మరియు అగ్నివలె దహించునదియునైన కామమనెడి నిత్య శత్రువుచే ఆవరింపబడి యుండును.**

### భాష్యము

ఇందనముచే అగ్ని ఆర్పబడనట్లు, ఇంద్రియ భోగానుభవము చేత కామము ఎన్నడును సంతృప్తి నొందజాలదని 'మనుస్మృతి' (2.94) నందు తెలుపబడినది. ఈ భౌతిక జగత్తునందు సర్వకర్మలకును మైథున భోగానుభవనమే కేంద్రముగా నుండును. కనుకనే ఈ జగత్తు 'మైథునాగారము' లేక 'మైథున భోగబంధముగా' పిలువబడినది. కారాగారము నందు నేరస్థులు బంధింపబడినట్లు, భగవానుని ఆజ్ఞలను ఉల్లంఘించువారు మైథున భోగము ద్వారా బంధింపబడుదురు. ఇంద్రియ భోగానుభవమును పరమావధిగా భావించుచు సాధించెడి భౌతిక నాగరిక పురోగతియనునది జీవుని భౌతిక సంసార బంధములను పొడుగించునని భావము. కనుక అజ్ఞానమునకు చిహ్నమైన కామమే జీవుని భౌతిక జగత్తు నందు బంధించుచున్నది. మానవుడు ఇంద్రియ భోగము ననుభవించునప్పుడు కొంత సుఖభావము కలుగవచ్చును. వాస్తవమునకు అట్టి నామమాత్ర సుఖభావ మనునది ఇంద్రియభోగికి నిత్య శత్రువు.

## 3.40

**ఇంద్రియాణి మనోబుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥**

### అనువాదము

**ఇంద్రియములు, మనస్సు, బుద్ధి యనునవి ఈ కామము నివసించు స్థావరములు. వీని ద్వారా కామము జీవుని యథార్థ జ్ఞానమును ఆవరించి అతనిని మోహింప జేయును.**

### భాష్యము

బద్ధజీవుని దేహమందలి వివిధ ముఖ్య స్థానములను శత్రువు ఆక్రమించి యున్నాడు. కనుకనే అట్టి శత్రువును జయింపగోరువారు అతడు ఎక్కడ కనుగొనబడునో తెలియుట కొరకై శ్రీకృష్ణభగవానుడు ఆయా స్థానములను గూర్చి తెలుపుచున్నాడు. ఇంద్రియముల కర్మలన్నింటికిని మనస్సు కేంద్రము. సాధారణముగా మనము ఇంద్రియార్థములను గూర్చి వినినప్పుడు ఇంద్రియతృప్తికి సంబంధించిన భావములకు మనస్సు నిలయమగును. దానికి ఫలితముగా, మనస్సు మరియు ఇంద్రియములు కామమునకు నిలయములగును. తరువాత బుద్ధి అట్టి కామ ప్రవృత్తులకు కేంద్రమగును.

బుద్ధియనునది జీవాత్మకు పొరుగున ఉన్నటు వంటిది. కామపూరితమైన బుద్ధి జీవాత్మపై ప్రభావమును చూపి, అది అహంకారమును పొంది, భౌతిక భావనలో ఇంద్రియ, మనస్సులతో తాదాత్మ్యము చెందునట్లుగా ప్రభావితము చేయును. తద్ద్వారా జీవాత్మ ఇంద్రియ సుఖములకు అలవాటుపడి అదియే నిజమని భ్రమించును. జీవుని అట్టి భ్రాంతి శ్రీమద్భాగవతము (10.84.13) నందు ఈ క్రింది విధముగా చక్కగా వివరింపబడినది :

యస్యాత్మబుద్ధి: కుణపే త్రిధాతుకే స్వధీ: కలత్రాదిషు భౌమ ఇజ్యధీ:
యత్తీర్థబుద్ధి: సలిలే న కర్హిచిత్ జనేష్వభిజ్ఞేషు స ఏవ గోఖర:

“త్రిధాతువులతో కూడిన దేహమే ఆత్మగను, దేహమునకు సంబంధించిన వారే తమ బంధువులుగను, జన్మభూమియే పూజాస్థానముగా భావించినట్టియు మరియు ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులైన మహాత్ముల సాంగత్యమును పొందుటకు కాకుండ కేవలము స్నానమాచరించుటకు మాత్రమే తీర్థయాత్రలకు పోవునట్టి మానవుని గార్ధభము లేక గోవుగా భావింపబడును.”

## 3.41

**తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానం ప్రజాహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥**

### అనువాదము

**అందుచే భరతవంశీయులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! ఇంద్రియ నిగ్రహము ద్వారా గొప్ప పాపచిహ్నమైన ఈ కామమును మొట్టమొదటనే అదుపు చేసి, జ్ఞానము మరియు ఆత్మానుభవములను నాశనము చేయునట్టి దానిని నశింపజేయుము.**

### భాష్యము

శ్రీకృష్ణభగవానుడు అర్జునునికి ఆది నుండియు ఇంద్రియములను నిగ్రహింపుమని, అట్లు చేయుట చేత ఆత్మకు సంబంధించిన విజ్ఞానమును మరియు ఆత్మానుభవ వాంఛను నాశనము చేయు గొప్ప పాపశత్రువైన కామమును నశింప చేయవచ్చునని ఆదేశించెను. ఇక్కడ అనాత్మ మరియు ఆత్మకు నడుమ గల బేధమును తెలుసుకొనుటయే ‘జ్ఞానము’. మరోలా చెప్పవలెనన్న, ఆత్మ జ్ఞానము కాదని తెలుపునటువంటిది జ్ఞానము. ‘విజ్ఞానము’ అనగా ఆత్మయొక్క నిజ స్వరూప స్థితిని మరియు దానికి పరమాత్మతో గల సంబంధమును తెలుపునట్టి విశిష్ఠ జ్ఞానము. శ్రీమద్భాగవతము (2.9.31) నందు ఇట్లు వివరింపబడినది :

జ్ఞానం పరమగుహ్యం మే యద్విజ్ఞానసమన్వితమ్
సరహస్యం తదంగం చ గృహాణ గదితం మయా

“ఆత్మ మరియు పరిమాత్మలజ్ఞానము మిక్కిలి గుహ్యమైనది మరియు అద్భుతమైనది. కాని అట్టి జ్ఞానము మరియు ప్రత్యేక అనుభూతిని వాటి వివిధ అంశములతో భగవానుడే స్వయముగా వివరించినచో అవగాహన చేసికొనవచ్చు.” భగవద్గీత మనకు ఆత్మయొక్క అట్టి అసాధారణ మరియు విశేష జ్ఞానమును అందించుచున్నది. వాస్తవమునకు జీవులు భగవానుని అంశలైనందున అతనిని

సేవించుటకే వారు ఉద్దేశింపబడి యున్నారు. అట్టి చైతన్యమే కృష్ణచైతన్యము. కనుక మానవుడు జీవితారంభము నుండి కృష్ణచైతన్యమును అలవరచుకొనుటకు యత్నింపవలెను. తద్ద్వారా వారు సంపూర్ణ కృష్ణచైతన్యవంతులై తదనుసారముగా వర్తింపగలరు.

ప్రతి జీవునకు సహజమైనటు వంటి భగవత్ప్రేమ యొక్క వికృత ప్రతిబింబమే కామము. కాని మానవుడు ఆది నుండి కృష్ణచైతన్యమునందు సుశిక్షితుడైనచో సహజమైన భగవత్ప్రేమ హీనమైన కామముగా పతనము చెందదు. భగవత్ప్రేమ కామముగా పతనము చెందినప్పుడు తిరిగి సాధారణ స్థితికి చేరగలుగుట ఎంతో కష్టము. అయినను కృష్ణచైతన్యము మిక్కిలి శక్తివంతమైనదగుటచే ఆలస్యముగా ఆరంభించినవాడు కూడ భక్తియుక్త సేవానియమములను చక్కగా అనుసరిస్తూ, శ్రీకృష్ణుని ప్రేమించువాడు కాగలడు. కనుక జీవితమునందలి ఏ దశ నందైనను లేక దాని అవసరము గుర్తించినప్పటి నుండియైనను మానవుడు కృష్ణచైతన్యమున భగవత్ప్రేమ యందు ఇంద్రియములను నియంత్రించుటనారంభించి కామమును శ్రీకృష్ణభగవానుని పట్ల ప్రేమగా మార్చవచ్చును. ఇది మానవ జీవితము నందలి పరమోన్నత పరిపూర్ణ స్థితియై యున్నది.

## 3.42

**ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్య: పరం మన: ।**
**మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధే: పరతస్తు స: ॥**

### అనువాదము

**జడపదార్థము కంటెను ఇంద్రియములు ఉత్తమములు; ఇంద్రియముల కంటెను మనస్సు ఉత్తమము. మనస్సు కంటెను కూడ బుద్ధి మరింత ఉత్తమము; బుద్ధికంటెను ఆత్మ అత్యంత ఉత్తమము.**

### భాష్యము

ఇంద్రియములు కామము యొక్క కర్మలకు వివిధ మార్గములై యున్నవి. కామము దేహమునందుండి వివిధములైన ఇంద్రియముల ద్వారా వ్యక్తమగుచుండును. కనుకనే దేహముకంటెను ఇంద్రియములు శ్రేష్ఠములైనవి. కాని కృష్ణచైతన్యము (ఉత్తమ చైతన్యము) కలిగినప్పుడు ఇంద్రియములు కామప్రవృత్తులను ప్రకటించు మార్గములు బహిర్గతమగుటకు ఉపయోగింపబడవు. కృష్ణచైతన్యము నందు ఆత్మ దేవాదిదేవునితో ప్రత్యక్ష సంబంధమును ఏర్పరచుకొనును. కనుకనే ఇక్కడ వర్ణింపబడిన దేహకర్మాది సమస్త విషయములు చివరికి పరమాత్మయందే ముగియును. దేహకార్యములు అనగా ఇంద్రియ కార్యములే. ఇంద్రియములను నిరోధించుట యనగా దేహకార్యములను నిలిపివేయుటయే. కాని ఆ మనస్సు క్రియాశీలమగుటచే, దేహము ఎట్టి కర్మను చేయక నిశ్చలముగా నున్నను స్వప్న సమయమునందు వలె సదా సంచరిస్తూనే యుండును. కాని ఆ మనస్సు కంటె ఉన్నతమైనది బుద్ధి మరియు మరియు ఆ బుద్ధి కంటె ఉన్నతమైనదే ఆత్మ. కనుకనే ఆత్మను ప్రత్యక్షముగా శ్రీకృష్ణభగవానుని సంబంధమునందు నెలకొల్పినచో, దాని వశమునందున్నట్టి ఇతర అంగములు అనగా బుద్ధి, మనస్సు, ఇంద్రియములనునవి కూడ సహజముగానే భగవత్సేవ యందు నెలకొనును. 'కఠోపనిషత్తు' ఈ విషయము (1.3.10) చెప్పబడినది. దానిననుసరించి, ఇంద్రియార్థములు ఇంద్రియముల కంటె ఉత్తములనియు, మనస్సు ఇంద్రియార్థముల

కంటె ఉత్తమమనియు చెప్పబడినది. కనుకనే మనస్సు నిరంతరము భగవత్సేవ యందు ప్రత్యక్షముగ నెలకొనినచో, ఇంద్రియములు ఇతర విషయ మార్గములందు నెలకొని యుండుటకు అవకాశముండదు. "పరం దృష్ట్వా నివర్తతే' (భ.గీ.2.59) అని ఇట్టి మానసిక స్థితి ఇదివరకే వివరింపబడినది. మనస్సు దివ్యమైన భగవత్సేవయందు నెలకొనినచో అది ఇతర హీనప్రవృత్తులలో నెలకొనుటకు అవకాశముండదు. 'కఠోపనిషత్తు' నందు ఆత్మ 'మహాన్' (ఘనమైనది) అని వర్ణింపబడినది. కనుక ఆత్మ ఇంద్రియార్థముల కంటెను, ఇంద్రియముల కంటెను, మనస్సు కంటెను, బుద్ధి కంటెను ఉత్తమ స్థితి నందుండును. కనుక ఆత్మ యొక్క నిజ స్వరూప స్థితిని ప్రత్యక్షముగా అవగాహన చేసుకొనుటయే ఈ సమస్యా పరిష్కారమునకు మార్గమై యున్నది.

బుద్ధిచే మానవుడు ఆత్మ యొక్క నిజ స్వరూప స్థితిని ఎరిగి, మనస్సును ఎల్లప్పుడు కృష్ణ చైతన్యము నందు నెలకొల్పవలెను. అది సమస్యల నన్నింటిని పూర్తిగా పరిష్కరించును. ఇంద్రియార్థముల నుండి దూరముగా నుండవలెనని ప్రారంభదశలో గల సాధకునికి సాధారణముగా ఆదేశింపబడును. కాని దానితో పాటుగా, మానవుడు బుద్ధి చేత మనస్సును దృఢపరుచుకోవ వలెను. బుద్ధిని వినియోగించి మానవుడు దేవాదిదేవునికి సంపూర్ణముగా శరణువేడి, తన మనస్సును కృష్ణచైతన్యము నందు నెలకొల్పినచో, అతని మనస్సు సహజముగనే దృఢతరమగును. అప్పుడు సర్పమువలె బలమైన ఇంద్రియ కోరలు తీసిన పాములవలె శక్తి హీనములగును. కాని బుద్ధి, మనస్సు, ఇంద్రియములకు ఆత్మ ప్రభువైనను కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణభగవానుని సహచర్యము నందు బలపడక పోయినచో, కల్లోలిత మనస్సు కారణముగా పతనము చెందుటకు అవకాశములు అనేకము కలవు.

## 3.43

**ఏవం బుద్ధే: పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥**

## <u>అనువాదము</u>

**ఓ గొప్ప బాహువులు గల అర్జునా! ఈ విధముగా భౌతికమైన ఇంద్రియముల కంటెను, మనస్సు కంటెను, బుద్ధి కంటెను ఆత్మ అతీతమని ఎరిగి, అత్యున్నతమైన ఆధ్యాత్మిక బుద్ధిచే (కృష్ణచైతన్యముచే) మనస్సును స్థిరపరిచి, ఆవిధముగా ఆధ్యాత్మిక బలముచే మానవుడు అనచశక్యము గాని కామమనెడి ఈ శత్రువును జయింపవలెను.**

## <u>భాష్యము</u>

భగవద్గీత యందలి తృతీయాధ్యాయమున మానవుడు నిర్గుణమైన శూన్యమును పరమ లక్ష్యముగా .భావింపక, తాను దేవాదిదేవునికి నిత్య దాసుడునని గుర్తించి చివరికి కృష్ణచైతన్యమును అవలంబింపవలెనని నిర్దేశించుచున్నది. భౌతిక జీవితము నందు మానవులు కామవాంఛను మరియు భౌతిక ప్రకృతిని వశము చేసుకొనవలెనను వాంఛించుదురు. అట్టి ఇంద్రియ తృప్తి వాంఛ మరియు ఆధిపత్య భావనయే బద్ధ జీవునకు పరమశత్రువులు. కాని కృష్ణచైతన్యమను బలము చేత మానవుడు ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని నియంత్రింపగలడు. అనగా తన కర్మను

మరియు విధ్యుక్త ధర్మములను ఎవ్వరును హఠాత్తుగా త్యజింపనవసరము లేదు. కాని కృష్ణ చైతన్యమును క్రమముగా వృద్ధిపరచుకొనుచు, భౌతికములైన మనో ఇంద్రియములచే ప్రభావితము కానటువంటి ఆధ్యాత్మిక స్థితియందు మానవుడు నెలకొనగలడు. నిజస్వరూప స్థితిని సాధించుట కొరకై యత్నించెడి స్థిరమైన బుద్ధి చేతనే అది సాధ్యపడగలదు. ఇదియే ఈ అధ్యాయపు సంపూర్ణ సారాంశము. అపరిపక్వమైన భౌతికజీవిత స్థితిలో తాత్త్విక కల్పనలు మరియు నామమాత్రపు యోగాసనాదుల అభ్యాసము ద్వారా ఇంద్రియములను నిగ్రహించుటకు చేయు కృత్రిమ ప్రయత్నములనునవి మానవుని ఆధ్యాత్మిక జీవనమునకు తోడ్పడజాలవు. కనుక, అతడు ఉన్నత బుద్ధిద్వారా కృష్ణచైతన్యము నందు సుశిక్షితుడు కావలసి యున్నది.

***శ్రీమద్భగవద్గీత యందలి 'కర్మయోగము' లేదా 'కృష్ణచైతన్యము నందు విధ్యుక్త ధర్మ నిర్వహణము' అను తృతీయాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.***

---------

# చతుర్థాధ్యాయము
# దివ్య జ్ఞానము

## 4.1

**శ్రీభగవానువాచ**

**ఇవం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవేऽబ్రవీత్ ॥**

### అనువాదము

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను: నాశము లేని ఈ యోగ శాస్త్రమును నేను వివస్వానునకు (సూర్యదేవునకు) ఉపదేశించితిని; వివస్వానుడు దానిని మానవ జాతి పితయైన మనువునకు ఉపదేశించెను; మనువు దానిని ఇక్ష్వాక రాజునకు ఉపదేశించెను.**

### భాష్యము

సూర్యలోకము మొదలుకొని ఇతర లోకములందలి రాజులందరికిని ప్రాచీన కాలము నుండియే భగవద్గీత బోధింపబడినట్లు భగవద్గీత చరిత్ర వలన మనకు ఇక్కడ తెలియుచున్నది. సమస్త లోకములకు చెందిన రాజులు తమతమ లోకములలోని ప్రజలను సంరక్షించుట కొరకై ప్రత్యేకముగా నిర్దేశింపబడి యున్నారు. కనుక ప్రత్యేకించి రాజవంశీయులందరు ప్రజలను చక్కగా పరిపాలించి, వారిని లౌకిక బంధముల నుండియు, కామబంధముల నుండియు రక్షించుట కొరకై భగవద్గీత శాస్త్రమును సంపూర్ణముగా అవగాహన చేసుకొని యుండవలెను. మానవజన్మ యనునది దేవాదిదేవుడైన శ్రీకృష్ణ భగవానుని నిత్య సంబంధముతో కూడిన ఆధ్యాత్మిక జ్ఞానమును అలవరచుకొనుటకై ఉద్దేశింపబడినది. ఈ సందేశమును విద్య, సంస్కృతి, భక్తి ద్వారా ప్రజలందరికి తెలియజేయుట అన్ని దేశపాలకుల బాధ్యతయై యున్నది. మరోవిధముగా చెప్పవలెననిన, అన్నిదేశాల పాలకులు ప్రజల శ్రేయస్సు కొరకు ఈ కృష్ణచైతన్య విజ్ఞానమును విస్తృతముగా ప్రచారము చేయవలెను. తద్వారా జనులందరును, ఈ గొప్ప శాస్త్రపు సహాయముచే, తమకు లభించిన మానవజన్మను సద్వినియోగ పరచుకొనుచు, జయప్రదమైన మార్గమునందు పయనింప గలుగుదురు.

ఈ మన్వంతరము నందు సూర్యదేవుడు వివస్వానుడని పిలువబడును. అతడు సూర్యగ్రహమండల మందలి సర్వగ్రహములకు మూలమైన సూర్యలోకాధిపతి. 'బ్రహ్మ సంహిత' (5.52) నందు ఈ క్రింది విధముగా తెలుపబడినది :

యచ్చక్షురేష సవితా సకలగ్రహాణాం
రాజా సమస్తసురమూర్తిరశేషతేజా:
యస్యాజ్ఞయా భ్రమతి సంభృతకాలచక్రో
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఏ ఆదిపురుషుని ఆజ్ఞచే గ్రహములకు రాజైన సూర్యుడు అత్యధిక శక్తిని మరియు ఉష్ణమును పొందుచున్నాడో అట్టి దేవాదిదేవుడైన గోవిందుని (శ్రీకృష్ణుని) నేను

భజింతును. అట్టి సూర్యుడు ఆ భగవానుని నేత్రమై భాషించుచు, అతని ఆజ్ఞలకు లోబడి తన కక్ష్యయందు పరిభ్రమించుచుండును" అని బ్రహ్మదేవుడు స్తుతించెను.

సూర్యుడే సమస్త గ్రహములకు రాజై యున్నాడు. ప్రస్తుతము వివస్వానుడను పేరుగల సూర్యదేవుడు ఇతర గ్రహములన్నింటికిని ఉష్ణమును మరియు వెలుగును సమకూర్చుచు వాటిని నియంత్రించెడి సూర్యమండలమును పరిపాలించును. అతడు శ్రీకృష్ణుని ఆజ్ఞననుసరించి తన కక్ష్యలో పరిభ్రమించుచుండును. ఈ భగవద్గీత శాస్త్రమును అవగాహన చేసుకొనుటకు శ్రీకృష్ణభగవానుడు తొలుత వివశ్వానుని ప్రథమ శిష్యునిగా చేసుకొనెను. కనుకనే గీత అనాదికాలము నుండి వచ్చుచున్న ప్రామాణిక శాస్త్రగ్రంథమే గాని అప్రామాణికమైన లౌకిక పండితుల కొరకు ఉద్దేశింపబడిన ఊహాకల్పితమైన గ్రంథము కాదు.

'మహాభారతము' (శాంతిపర్వము 348.51,52) నందు భగవద్గీత యొక్క చరిత్రను ఈక్రింది విధముగా మనము కనుగొనవచ్చును :

త్రేతాయుగాదౌ చ తతో వివస్వాన్ మనవే దదౌ
మనుశ్చ లోకభృత్యర్థం సుతాయేక్ష్వాకవే దదౌ
ఇక్ష్వాకుణా చ కథితో వ్యాప్య లోకానవస్థిత:

"త్రేతాయుగారంభమున మానవునికి భగవానునితో గల సంబంధమును తెలుపు ఈ శాస్త్రము వివస్వానునిచే మనువుకు బోధింపబడినది. మానవ జాతికి మనువు తండ్రియగుటచే దానిని తన పుత్రుడును, భూమండలమునకు రాజును, శ్రీరామచంద్రుడు అవతరించిన రఘువంశమునకు మూల పురుషుడైన ఇక్ష్వాకు మహారాజునకు అందించెను." కనుక భగవద్గీత ఇక్ష్వాకు మహారాజు కాలము నుండియే మానవ సంఘమునందు నెలకొనియున్నది.

ప్రస్తుతము 4,32, 000 సంవత్సరముల కాలపరిమితి గల కలియుగమున కేవలము 5,000 సంవత్సరములు మాత్రమే గడిచినవి. ఈ యుగమునకు పూర్వము ద్వాపరయుగము 8,00,000 సంవత్సరములు, దానికి పూర్వము త్రేతాయుగము 12,00,000 సంవత్సరములు గడిచియున్నవి. ఈవిధముగా దాదాపు 20 లక్షల 5 వేల సంవత్సరములకు పూర్వము మనువు తన శిష్యుడును మరియు భూమండలమునకు రాజును అగు ఇక్ష్వాకునకు ఈ భగవద్గీతను బోధించెను. ప్రస్తుతము మనువు యొక్క జీవిత కాలము 30,53,00,000 సంవత్సరములుగా లెక్కింపబడినవి. అందులో 12,04,00,000 సంవత్సరములు మాత్రమే గడిచినవి. మనువు జన్మించుటకు పూర్వమే భగవద్గీత భగవానునిచే తన శిష్యుడైన వివస్వానునకు (సూర్యదేవునకు) తెలుపబడిన విషయము ననుసరించి దాదాపు 12,04,00,000 సంవత్సరములకు పూర్వమే ఇది చెప్పబడినట్లు భావింపవచ్చును. అదే జ్ఞానము మానవసంఘమున దాదాపు ఇరువది లక్షల సంవత్సరముల నుండి వ్యాప్తి యందున్నది. ఐదు వేల సంవత్సరములకు పూర్వము శ్రీకృష్ణ భగవానుడు తిరిగి దానిని అర్జునునికి ఉపదేశించెను. గీతననుసరించియు, గీతను ఉపదేశించిన శ్రీకృష్ణభగవానుననుసరించియు ఇదియే భగవద్గీత యొక్క స్థూలచరిత్ర. సూర్యదేవుడైన వివస్వంతుడు కూడ స్వయముగా క్షత్రియుడును మరియు సూర్యవంశ క్షత్రియులందరికిని పూర్వ పితామహుడు (తండ్రియును) అగుటచేత అతనికి ఈ భగవద్గీత జ్ఞానము బోధింపబడినది. భగవద్గీత శ్రీకృష్ణభగవానుని చేత స్వయముగా ఉపదేశింపబడుట చేత వేదసదృశమైనట్టిది. గీతలోని జ్ఞానము 'అపౌరుషేయము' (మానవాతీతము) అయియున్నది. మానవ కల్పిత వివరములతో సంబంధము లేకుండా వేదమునందలి ఉపదేశములను కూడ ఎటువంటి

లౌకిక వివరణలు లేకుండా యథాతథముగా అంగీకరింపవలసి యున్నది. లౌకిక విద్వాంసులు తమ ఇష్టానుసారము భగవద్గీతను గూర్చి ఊహాగానాలను చేయవచ్చును. కాని అది ఎన్నటికిని భగవద్గీత యథాతథము కాజాలదు. కనుకనే భగవద్గీతను యథాతథముగా గురుశిష్య పరంపర నుండి అంగీకరింపవలెను. అట్టి దివ్యజ్ఞానమును శ్రీకృష్ణభగవానుడు తొలుత సూర్యదేవునికి బోధింపగా, సూర్యదేవుడు తనపుత్రుడైన మనువునకు, పిదప మనువు తన పుత్రుడైన ఇక్ష్వాకునకు బోధించినట్లుగా ఇక్కడ వర్ణింపబడినది.

## 4.2

**ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదు: ।**
**స కాలేనేహ మహతా యోగో నష్ట: పరన్తప ॥**

## <u>అనువాదము</u>

**ఈ దివ్యజ్ఞానము ఈ విధముగా గురుశిష్య పరంపరాక్రమమున గ్రహింపబడినది. రాజర్షులు దానిని ఆ విధముగా అవగతము చేసికొనిరి. కాని కాలచక్రమమున ఆ పరంపర విచ్ఛిన్నమగుట వలన ఆ శాస్త్రము నశించినట్లుగా కనిపించుచున్నది.**

## <u>భాష్యము</u>

రాజర్షులు ప్రజలను పాలించుట యందు భగవద్గీత ప్రయోజనమును నెరవేర్చవలెను. కనుక వారికొరకే ప్రత్యేకముగా ఈ గీతాజ్ఞానము ఉద్దేశింపబడినదని ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. నిశ్చయముగా ఇది దానవ ప్రవృత్తి గల వారికి ఉద్దేశింపబడలేదు. ఎవ్వరికిని లాభము చేకూరనట్లుగా వారు దీని విలువను నష్టపరచుటయే కాకుండ, వ్యక్తిగత అభిప్రాయముల ననుసరించి దీనికి వివిధములైన వివరణలను కల్పించుచుందురు. ఈ విధముగా గీతయొక్క మూలప్రయోజనము అటువంటి అధర్మపరులైన విపరీత వ్యాఖ్యాతలచే నష్టపడినప్పుడు, గురుశిష్య పరంపరను తిరిగి పున:స్థాపించుటకు అవసరమేర్పడును. శ్రీకృష్ణ భగవానుడు ఐదు వేల సంవత్సరములకు పూర్వము దివ్యమైన గురుపరంపర విచ్ఛిన్నమైనదని గుర్తించి, గీతాప్రయోజనము నష్టమైనట్లుగా కనిపించుచున్నదని అతడు ప్రకటించెను. అట్లే ప్రస్తుత కాలమున కూడ అనేక గీతావ్యాఖ్యానములు (ముఖ్యముగా ఆంగ్లములో) వ్యాప్తియందున్నను అవియన్నియును ప్రామాణిక పరంపరాగతములు కావు. లౌకిక విద్వాంసులు రచించిన వ్యాఖ్యానములు అనేకము లభించుచున్నను, దాదాపు వారందరును శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అంగీకరించియుండలేదు. కాని వారు శ్రీకృష్ణభగవానుని వచనములపై ఆధారపడి గొప్పవ్యాపారమును మాత్రము కొనసాగించు చుందురు. ఇదియే దానవప్రవృత్తి. ఎందుకనగా, దానవులు భగవానునియందు విశ్వాసము ఉంచకున్నను, భగవానుని సంపదలను అనుభవింపవలెనని వాంఛించుచుందురు. గురుశిష్య పరంపరాగతమైన వివరణలతో కూడిన భగవద్గీత సంపుటములు (ఆంగ్లభాష యందు వెలువరించుట) అవసరమై యున్నందున ఈ రచనా యత్నము చేయబడుచున్నది. యథాతథముగా అంగీకరింపబడిన భగవద్గీత మానవ సంఘమంతటికి గల ఒక గొప్ప వరప్రసాదము. కాని అట్లు గాక దీనిని ఒక కాల్పనిక తాత్త్విక గ్రంథముగా స్వీకరించినచో అది కాలమును వృథా పరచినట్లే కాగలదు.

**4.3**

**స ఏవాయం మయా తే/ద్య యోగ: ప్రోక్త: పురాతన: ।**
**భక్తో/సి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥**

**అనువాదము**

**నీవు నా భక్తుడవు మరియు మిత్రుడవు కావున ఈ శాస్త్రము ఉత్తమమైన రహస్యమును అర్థము చేసికొనగలవని భగవానునితో గల సంబంధమును తెలియజేయు పురాతన శాస్త్రమును నేడు నీకు తెలుపుచున్నాను.**

**భాష్యము**

సురులు (భక్తులు) మరియు అసురులు అని మానవులలో రెండు తరగతుల వారు కలరు. అర్జునుడు గొప్ప భగవద్భక్తుడైనందున భగవానుడు అతనిని ఈ గొప్ప శాస్త్రమునకు గ్రహీతగా ఎంచుకొనెను. ఈ గొప్పరహస్య శాస్త్రమును గ్రహించుట దానవ ప్రవృత్తి గలవారికి సాధ్యము కాదు. ఈ దివ్యజ్ఞాన గ్రంథమునకు అనేక వ్యాఖ్యానములు కలవు. ఈ వ్యాఖ్యానములు కొన్ని భక్తులచే రచింపబడగా, మరికొన్ని దానవ ప్రవృత్తి గలవారిచే రచింపబడి యున్నవి. భక్తుల వ్యాఖ్యానములు యథాతథములు కాగా దానవులు రచించినవి నిష్ప్రయోజనములై యున్నవి. అర్జునుడు శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అంగీకరించెను. అర్జునుని అడుగుజాడల ననుసరించి రచింపబడిన ఏ గీతా వ్యాఖ్యానమైనను ఈ దివ్యశాస్త్రమునకు చేయబడు యథార్థ భక్తియుక్త సేవ కాగలదు. దానవ ప్రవృత్తి గలవారు శ్రీకృష్ణభగవానుని యథాతథముగా అంగీకరింపరు. అంతేకాకుండ, వారు శ్రీకృష్ణుని గూర్చి ఏవేవో కల్పనలను చేయుచు శ్రీకృష్ణుని బోధనల నుండి సామాన్య పాఠకులకు పెడత్రోవ పట్టింతురు. అట్టి పెడత్రోవ మార్గములను గూర్చి ఇక్కడ హెచ్చరింపబడుచున్నది. కనుక ప్రతియొక్కరు అర్జునుని నుండి వచ్చిన గురుశిష్య పరంపరను అనుసరించుటకు యత్నించి శ్రీమద్భగవద్గీత యనెడి ఈ దివ్యశాస్త్రము ద్వారా లబ్ధి పొందవలెను.

**4.4**

**అర్జున ఉవాచ**
**అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వత: ।**
**కథమేతద్ విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను: సూర్యదేవుడైన వివస్వానుడు జన్మచే నీ కంటెను పూర్వుడు. అట్టియెడ ఆదిలో నీవీ శాస్త్రమును అతనికి ఉపదేశించితివనుటను నేనెట్లు అర్థము చేసుకొనగలను?**

**భాష్యము**

అర్జునుడు శ్రీకృష్ణభగవానుని యొక్క పరమభక్తుడు. అయినచో, శ్రీకృష్ణుని వచనములను విశ్వసింపకుండుట ఎట్లు సంభవించెను? వాస్తవమేమనగా అర్జునుడు ఈ

విషయమును తనకొరకు గాక దేవాదిదేవునియందు విశ్వాసము లేనివారి కొరకు లేదా శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనెడి విషయమును అంగీకరింపని దానవ ప్రవృత్తి కలవారి కొరకు ప్రశ్నించుచున్నాడు. అనగా వారి కొరకై అర్జునుడు దేవాదిదేవుని లేక శ్రీకృష్ణుని గూర్చి తానేమీ తెలియని వాని వలె ఈ విషయమున విచారణ కావించు చున్నాడు. దశమాధ్యాయమున శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనియు, సర్వమునకు మూలమనియు, పరతత్త్వపు చరమానుభూతియనియు అర్జునుడు సంపూర్ణముగా ఎరిగియుండెను. అయినను ఆ దేవాదిదేవుడు కూడ దేవకీదేవికి పుత్రునిగా ధరిత్రిపై అవతరించెను. శ్రీకృష్ణుడు ఎట్లు దేవాదిదేవునిగను, ఆదిపురుషునిగను నిలిచియున్నాడో అర్థము చేసుకొనుట సామాన్య మానవునకు చాలా కష్టము. కనుకనే ఆ విషయమును స్పష్టపరచుటకై శ్రీకృష్ణుడొక్కడే ఈ విషయమును గూర్చి ప్రామాణికముగా చెప్పగలడని భావించి నందున అర్జునుడీ ప్రశ్నను అడిగియుండెను. శ్రీకృష్ణుడు పరమ ప్రామాణికుడనెడి సత్యమును ఈనాడే కాకుండ, అనాది నుండియు కూడా సమస్త ప్రపంచము అంగీకరించెను. దానవులు మాత్రమే అతనిని నిరాకరింతురు. శ్రీకృష్ణుడే అందరిచేత అంగీకరింపబడిన పరమ ప్రామాణికుడని అర్జునుడు అతని ఈ ప్రశ్నను అతని ముందుంచుచున్నాడు. తద్ద్వారా దానవ ప్రవృత్తి గలవారిచే వివరింపబడుటకు బదులుగా శ్రీకృష్ణుడు తనను గూర్చి తానే ప్రత్యక్షముగా వివరించుటకు ఒక అవకాశము ఏర్పడగలదు. అట్టి దానవ ప్రవృత్తి గలవారు దానవ స్వభావులైన తమ అనుయాయుల కొరకై సదా వక్రభాష్యము కావింతురు. కాని వాస్తవమునకు ప్రతియొక్కరు తమ శ్రేయస్సు కొరకు కృష్ణసంబంధ విజ్ఞానము నెరుగుట ఎంతో అవసరము. కనుక శ్రీకృష్ణుడే తనను గూర్చి తాను ప్రవచించినప్పుడు అది సమస్త లోకములకు మంగళకరమగును. దానవ ప్రవృత్తి గలవారు శ్రీకృష్ణుని ఎల్లప్పుడును తమ దృక్పథము ననుసరించియే అధ్యయనము చేయుదురు. కనుక దేవాదిదేవుడే తనను గూర్చి వివరించు వివరణలు వారికి వింతగా తోచినను, వాస్తవముగా భక్తులైనవారు శ్రీకృష్ణుడే స్వయముగా పలికిన విషయములను హృదయ పూర్వకముగా అంగీకరింతురు. శ్రీకృష్ణుని గూర్చి అధికాధికముగా తెలుసుకొనుటకు భక్తులు ఆరాటపడుచుందురు. కనుక భక్తులు శ్రీకృష్ణుడు తెలిపిన ప్రామాణిక వచనములను ఎల్లప్పుడు భక్తితో ఆరాధింతురు. శ్రీకృష్ణుని సామాన్య మానవునిగా భావించు నాస్తికులు కూడా ఈ విధముగా శ్రీకృష్ణుడు మానవాతీతుడనియు, సచ్చిదానంద విగ్రహుడనియు, దివ్యుడనియు, త్రిగుణాతీతుడనియు, దేశకాల ప్రభావములకు అతీతుడనియు ఎరుగగలుగుదురు. అర్జునుని వంటి భక్తుడు శ్రీకృష్ణుని దివ్యస్థితిని గూర్చి ఎట్టి అపోహలను కలిగియుండడు. శ్రీకృష్ణుడు భౌతిక ప్రకృతి గుణములచే ప్రభావితుడయ్యెడి సామాన్యమానవుడేనని భావించు వారి నాస్తిక భావమును నిరాకరించుటకు అర్జునుడు చేసిన యత్నమే ఈ ప్రశ్నను శ్రీకృష్ణుని ముందుంచుట.

**4.5**

**శ్రీభగవానువాచ**
**బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ॥**

## అనువాదము

**దేవాదిదేవుడు పలికెను: ఓ పరంపరా! నీకును మరియు నాకును పలు జన్మములు గడిచినవి. అవన్నియును నాకు జ్ఞప్తియందున్నవి. కాని నీవు వానిని జ్ఞప్తియందుంచు కొనజాలవు.**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుని అనేకానేక అవతారములను గూర్చిన సమాచారము 'బ్రహ్మసంహిత'(5.33) యందు మనకు లభించుచున్నది. దానియందు ఇట్లు తెలుపబడినది:

అద్వైతమచ్యుతమనాదిమనన్తరూపమ్
ఆద్యం పురాణపురుషం నవయౌవనం చ
వేదేషు దుర్లభమదుర్లభమాత్మభక్తౌ
గోవిందమాదిపురుషం తమహం భజామి

"అద్వితీయుడును, అచ్యుతుడును, అనాదియును అగు దేవాదిదేవుడైన గోవిందుని (శ్రీకృష్ణుని) నేను భజింతును. అతడు అనంతరూపములుగా వ్యాప్తినొందినను పురాణపురుషునిగా, నిత్యయౌవనముతో అలరారువానిగా భాషించును. భగవానుని అట్టి సచ్చిదానంద విగ్రహరూపములు వేదవేత్తలకు సాధారణముగా దుర్లభములైనను, శుద్ధభక్తులకు మాత్రము అవి స్వయముగా ప్రకటితమగుచుండును."

'బ్రహ్మసంహిత'(5.33)నందు కూడా ఇట్లు తెలుపబడినది :

రామాదిమూర్తిషు కలానియమేన తిష్ఠన్
నానావతారమకరోద్భువనేషు కింతు
కృష్ణ: స్వయం సమభవత్పరమ: పుమాన్ యో
గోవిందమాదిపురుషం తమహం భజామి

"రామ, నృసింహాది వంటి అనేక అవతారములను, ఇతరములైన అనేక అంశావతారములను ధరించు వాడును మరియు ఆదిదేవుడైన శ్రీకృష్ణునిగా తెలియబడుచు స్వయముగా అవతరించెడివాడును అగు గోవిందుని(శ్రీకృష్ణుని) భజింతును.

భగవానుడు అద్వితీయుడని తెలియబడినను అనేక రూపములతో అవతరించుచుండునని వేదములందు తెలుపబడినది. అతడు అనేక రంగులను మార్చినను వాస్తవమునకు మార్పురహితముగా నుండు వైడూర్యమణితో అతనిని పోల్చవచ్చును. బహుళములైన ఆ రూపములన్నింటిని శుద్ధభక్తులు మాత్రమే అవగతము చేసుకొందురు. కేవలము వేదాధ్యయనముచే అవి అవగతము కావు (వేదేషు దుర్లభమదుర్లభమాత్మభక్తౌ). అర్జునుని వంటి భక్తులు శ్రీకృష్ణభగవానుని

నిత్యసహచరులు. భగవానుడెప్పుడు అవతరించినను, వివిధ స్థాయిలలో అతనిని సేవించుటకై ఆ నిత్యసహచరులైన భక్తులును అవతరింతురు. అర్జునుడు అట్టి భక్తులలో ఒకడు. కొన్ని లక్షల సంవత్సరములకు పూర్వము శ్రీకృష్ణభగవానుడు సూర్యదేవుడైన వివస్వానునకు గీతాజ్ఞానమును బోధించినపుడు అర్జునుడు కూడ తనస్థాయిలో మరొక రూపములో భగవానుని చెంతనే నిలిచియున్నాడని ఈ శ్లోకము ద్వారా మనకు తెలియుచున్నది. కాని అర్జునుడు మరియు భగవానునికి బేధముగా భగవానుడు ఆ విషయమును గుర్తుంచుకొనెను. అర్జునుడు అట్లు గుర్తుంచుకొనుటకు సమర్థుడు కాకుండెను (పరంతప). ఇదియే అంశలైన జీవులకును మరియు భగవానునికిని నడుమ గల భేదము. ఇక్కడ అర్జునుడు శత్రువులను అణచగల గొప్పయోధునిగా (పరంతప) సంబోధింపబడినను, తమ పూర్వజన్మలలో జరిగిన విషయములను జ్ఞప్తికి తెచ్చుకొనలేకున్నాడు. కనుక జీవుడు లౌకిక పరిగణననుసరించి ఎంత గొప్పవాడైనను, జీవుడు పరమపురుషునికి సమానుడు కాజాలడు. శ్రీకృష్ణభగవానునితో శాశ్వత సహచార్యమును కలిగినవాడు నిశ్చయముగా ముక్త పురుషుడే. కాని అతడెన్నడును భగవానునితో సమానుడు కాజాలడు. 'బ్రహ్మసంహిత' (5.33) యందు శ్రీకృష్ణుడు అచ్యుతునిగా వర్ణింపబడెను. భౌతిక ప్రకృతి సంపర్కము నందున్నప్పటికిని అతడు తన దివ్యత్వమును విస్మరింపడు. కనుక జీవుడు అర్జునుని వంటి ముక్తపురుషుడైనను అన్ని విషయములలో భగవానునితో సమానము కాజాలడు. అర్జునుడు భగవానుని భక్తుడైనను కొన్నిమార్లు భగవానుని స్థితిని అతడు విస్మరించును. కాని దివ్యానుగ్రహముచే భక్తుడు వెంటనే తిరిగి భగవానుని అచ్యుతమైనట్టి స్థితిని ఎరుగగలుగును. కాని అభక్తులు లేక దానవ ప్రవృత్తి గలవారు భగవానుని ఈ దివ్యస్థితిని ఎరుగజాలరు. కనుకనే గీతయందలి ఈ వివరణలు ఆభక్తులకు మరియు దానవ ప్రవృత్తి గలవారికి ఎన్నటికిని అవగతము కాజాలవు. శ్రీకృష్ణార్జును లిరువరును స్వభావరీత్యా నిత్యులైనను, లక్షలాది సంవత్సరముల పూర్వము తాను చేసిన కర్మలనన్నింటిని శ్రీకృష్ణభగవానుడు జ్ఞప్తియందుంచుకొనగా, అర్జునుడు అట్లు జ్ఞప్తియందుంచు కొనలేకపోయెను. జీవుడు తన దేహ పరివర్తనము వలన సర్వమును విస్మరించుననియు మరియు శ్రీకృష్ణభగవానుడు తన సచ్చిదానంద దేహమును మార్చని కారణముగా సర్వమును జ్ఞప్తియందుంచు కొనుననియు మనమిక్కడ గమనింపవచ్చును. అతడు అద్వైతుడు. అతనికి మరియు అతని దేహమునకు మధ్య భేదము లేదు. అతనికి సంబంధించిన ప్రతిదియును బ్రహ్మమే. కాని బద్ధజీవుని విషయమున అతని ఆత్మ దేహము కంటెను భిన్నమైనది. భగవానుని మరియు అతని దేహమునకు బేధము లేకుండుటచే, అతడు భౌతిక జగత్తు నందు అవతరించినను, ఆతని స్థితి సామాన్య జీవుని స్థితికి ఎల్లప్పుడును భిన్నముగా నుండును. భగవానుని ఇట్టి దివ్యస్వభావమును దానవ ప్రవృత్తిగలవారు అవగతము చేసుకొనజాలరు. ఈ విషయమును భగవానుడే తరువాతి శ్లోకమున వివరించును.

## 4.6

**అజో'పి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరో'పి సన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥**

## అనువాదము

**పుట్టుకలేని వాడైనను, నా దివ్య దేహమెన్నడును నశింపనిదైనను, సకల జీవులకు ఈశ్వరుడైనను ఆదియైన దివ్య స్వరూపముతో నేను ప్రతియుగము నందున నా ఆంతరంగిక శక్తిచే అవతరించుచుందును.**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుడు తన జన్మయందలి ప్రత్యేకతను గూర్చి పలుకుచున్నాడు. అతడు సాధారణ మానవుని వలె గోచరించినను తన పూర్వ జన్మల యందు జరిగిన విషయముల నన్నింటిని జ్ఞప్తియందుంచుకొనెను. కాని సామాన్య మానవుడు కొద్ది గంటలకు పూర్వము తాను చేసిన దానిని కూడ జ్ఞప్తియందుంచు కొనలేడు. ఎవరినైనను గడచిన దినమునందు సరిగా అదే సమయమున ఏమి చేసితివని ప్రశ్నించినచో వెంటనే సమాధానమిచ్చుట సామాన్య మానవునికి ఎంతో కష్టము. క్రిందటి రోజున అదేసమయమున తానేమి చేయుచుండెనో గుర్తు తెచ్చుకొనుటకు అతడు ఎంతగానో యత్నింపవలసి వచ్చును. అయినప్పటికిని కొందరు మానవులు తామే భగవానులమని చెప్పుటకు సాహసించెదరు. కాని అట్టి అర్థరహిత వాక్యములచే ఎవ్వరును మోసపోరాదు. తరువాత ఇక్కడ భగవానుడు తన 'ప్రకృతి'ని లేక తన దివ్యరూపమును గూర్చి వివరిస్తున్నాడు. 'ప్రకృతి' అనగా, స్వభావము లేక స్వరూపము. తాను తన దివ్య దేహముతో అవతరింతునని భగవానుడు తెలుపుచున్నాడు. సామాన్య జీవుడు ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పు చెందునట్లుగా భగవానుడు తన దేహమును మార్చడు. బద్ధజీవుడు ప్రస్తుత జన్మమున ఒకరకమైన దేహమును, మరుసటి జన్మమున మరొక రకమైన దేహమును పొందవచ్చును. అనగా భౌతిక జగత్తు నందు జీవుడు స్థిరమైన దేహమును కలిగియుండడు. అతడు ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పు చెందుచునే యుండును. కాని భగవానుడు ఎన్నడును అట్లు మార్పు చెందడు. అతడెన్నడు అవతరించినను తన ఆంతరంగిక శక్తిచేత తన ఆదియైన దివ్యదేహముతోనే అవతరించుచుండును. మరోమాటలో, వేణువును ధరించి ద్విభుజములతో తన దివ్య స్వరూపముతో శ్రీకృష్ణుడు భౌతిక జగత్తు నందు అవతరించు చుండును. అతడు ఈ భౌతిక జగత్తు యొక్క కల్మషములచే ప్రభావితుడు కాకుండా తన దివ్య స్వరూపముతోనే అవతరించును. అతడు జగదీశ్వరుడైనను, దివ్యదేహముతో అవతరించినను సామాన్యజీవుని వలెనే జన్మను గ్రహించినట్లుగా గోచరించును. భౌతిక దేహము వలె అతని దేహము మార్పు చెందకపోయినను(జీర్ణము) అతని దేహము కూడ శైశవము నుండి బాల్యమునకు, బాల్యము నుండి యౌవనమునకు మార్పు చెందుచున్నట్లు గోచరించును. కాని ఆశ్చర్యకరమైన విషయమేమనగా, అతని దేహము యౌవనము పిదప ఎటువంటి మార్పునకు గురికాదు. కురుక్షేత్ర యుద్ధ కాలమునాటికి శ్రీకృష్ణుడు తన గృహము నందు మనుమల నెందరినో కలిగియుండెను. అనగా లౌకిక పరిగణ ననుసరించి అతడప్పటికి వయసు మీరిన వాడైనను, అతడప్పుడు ఇరువదియో లేక ఇరువది యైదేళ్ళ వయస్సుగల యువకునిగానే మాత్రమే గోచరించును. శ్రీకృష్ణుని మనము ఏ చిత్రములోను వృద్ధునిగా చూడము. ఎందుకనగా, సమస్త సృష్టియందు భూత, భవిష్యత్తు, వర్తమానములతో కూడిన అతడు అనాదియైనను మనకు వలె

అతడెన్నడును వృద్ధాప్యమును పొందడు. అతని దేహము, బుద్ధి ఎన్నడును మార్పు చెందదు మరియు నష్టము కాదు. కనుకనే భౌతిక జగత్తునందున్నప్పటికిని అతడు పుట్టుక లేనివాడే. సచ్చిదానంద విగ్రహుడే. అతడు తన దివ్యదేహము నందు మరియు బుద్ధి నందు మార్పు లేనటువంటివాడే. వాస్తవమునకు, శ్రీకృష్ణుని జన్మము మరియు అవతార పరిసమాప్తములు సూర్యుడు ఉదయించి, మన ఎదుటనే కదులుతూ, తిరిగి మన దృష్టి నుండి అగోచరమగుట వంటిది. సూర్యుడు మన దృష్టికి అగోచరుడైనంతనే అస్తమించెననియు మరియు మన ఎదుట గోచరించినంతటనే ఉదయించెననియు భావిస్తుంటాము. వాస్తవమునకు సూర్యుడు ఎల్లప్పుడు స్థిరముగ తన స్థానమునందే నిలిచియుండును. కాని మన ఇంద్రియములు దోషపూరితములగుట చేత మనము సూర్యుడు ఆకాశము నందు ఉదయించె ననియు, అస్తమించెననియు భావింతుము. శ్రీకృష్ణభగవానుని అవతార అంతర్ధానములు సామాన్యజీవుల జననము, అస్తమయములకు పూర్తిగా భిన్నములగుటచేత అతడు తన ఆంతరంగిక శక్తి కారణముగా సచ్చిదానంద స్వరూపుడనియు మరియు భౌతిక ప్రకృతి చేత ప్రభావితుడు కాబోడనియు నిరూపితమగుచున్నది. 'మహానారాయణోపనిషత్తు' (2.3) కూడ దేవాదిదేవుడు పుట్టుకలేనివాడైనను అనేక అవతారములుగ జన్మించుచుండునని నిర్ధారించుచున్నది. 'పద్మపురాణము' కూడ భగవానుడు జన్మించినట్లు గోచరించినను, దేహాంతర పరిణామము లేనివాడై యుండునని తెలుపుచున్నది. శ్రీకృష్ణుడు తన తల్లి ఎదుట చతుర్భుజములతో మరియు షడైశ్వర్య సంపన్నమైన అలంకరణలతో దర్శనమిచ్చెనని శ్రీమద్భాగవతము తెలుపుచున్నది. అతడు తన ఆదియైన మూల రూపముతో అవతరించుట జీవులపై ఆతనికి గల అవ్యాజకృపయే అందులకు కారణము. తద్ద్వారా వారు వివిధ మానసిక కల్పనల చేతను, భావనల చేతను మాయావాదులు తప్పుగా ఊహించు రూపములతో కాకుండ దేవాదిదేవుని యదార్థ రూపమునే జీవులు ధ్యానించు అవకాశము కలుగును. 'విశ్వకోశ' నిఘంటువు ననుసరించి 'ఆత్మమాయ' అనగా భగవానుని అవ్యాజకృప అని భావము. శ్రీకృష్ణభగవానుడు తన పూర్వావతారములను మరియు వాటి అంతర్ధానములను ఎరిగియుండును. కాని సామాన్య జీవుడు నూతన దేహమును పొందినంతనే తన పూర్వపు దేహమును గూర్చి పూర్తిగా విస్మరించును. భగవానుడు ఈ భూమిపై నిలిచి యున్నప్పుడు అద్భుతములు మరియు మానవాతీతములైన కర్మలను చేయుటచేతనే భగవానుడు జీవులకు ప్రభువని (ఈశ్వరుడని) తెలుపబడెను. కనుక భగవానుడు ఎల్లప్పుడు పరతత్త్వమై యున్నాడు. అంతేకాకుండ అతనికి మరియు అతని రూపమునకు (గుణమునకు మరియు దేహమునకు) మధ్య ఎట్టి భేదము లేకుండును. అట్టి భగవానుడు ఈ జగత్తు నందు అవతరించి తిరిగి అంతర్ధానమగుటకు గల కారణమేమిటను ప్రశ్న ఉదయింపవచ్చును. ఈ విషయము తరువాతి శ్లోకమునందు వివరింపబడినది.

## 4.7

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥**

## అనువాదము

**ఓ భరతవంశీయుడా! ఎప్పుడెప్పుడు మరియు ఎచ్చటెచ్చట ధర్మాచరణమునకు హాని కలుగుచుండునో మరియు అధర్మము వృద్ధినొందునో ఆ సమయమున నేను స్వయముగా అవతరింతును.**

## భాష్యము

ఇక్కడ 'సృజామి' అను పదము ముఖ్యమైనది.దానినెన్నడును సృష్టింపబడుననెడి అర్థములో ఉపయోగించరాదు. ఎందుకనగా గత శ్లోకము ననుసరించి, భగవానుని రూపము లన్నియు నిత్యములైనందున,అతని దేహమునకు లేదా రూపమునకు సృష్టి యనునది లేదు.కనుక 'సృజామి' అనగా భగవానుడే యదాతదముగా అవతరించునని అర్థము. శ్రీ కృష్ణభగవానుడు నియమానసాసరముగా ద్వాపరాంతమున ఏడవ మనువు యొక్క ఇరువది ఎనిమిదవ మహాయుగమందు (నాలుగు యుగముల కాలము) ప్రతి బ్రహ్మదేవుని దినమునందు అవతరించుచుండును.కాని అతనికి అట్టి నియమ నిబంధనలను అనుసరింపనవసరము లేదు. ఎందుకనగా అతడు తన ఇచ్ఛానుసారము ఎన్నో రకములుగ ప్రకటించు కొనుటకు సర్వ స్వతంత్రుడై యుండును. కనుక అధర్మము ప్రబలి నిజమైన ధర్మమునకు హాని కలిగినప్పుడు, అతడు తన సంకల్పానుసారమే అవతరించుచుండును. ధర్మసూత్రములు వేదములందు వివరించబడినవి. అట్టి వేద నియమాచరణకు భంగము కల్గినచో మానవుడు అధర్మపరుడగును. వేదములలోని ఆ నియమాలు భగవత్ శాసనములని శ్రీమదభాగవతం(6.3.19) తెలుపుచున్నది. భగవానుడు మాత్రమే ధర్మ విధానమును సృజింపగలడు. వేదములు కూడ తొలుత బ్రహ్మదేవుని హృదయమున భగవానునిచే తెలుపబడినవని తెలియుచున్నవి. కనుకనే ధర్మ నియమములు దేవాది దేవుని ప్రత్యక్ష నిర్దేశములు - "ధర్మం తు సాక్షాద్భగవత్ప్రణీతమ్". ఈ నియమము లన్నియు భగవద్గీత అంతటా స్పష్టంగా వివరింపబడినవి. దేవాదిదేవుని అధ్యక్షతన అట్టి నియమములను స్థాపించుటయే వేదముల ప్రయోజనము. భగవద్గీత అంత్యమున తనను శరణు పొందుటయే అత్యున్నత ధర్మాచరణమనియు, అంతకుమించి మరొకటి లేదనియు శ్రీకృష్ణభగవానుడు స్వయం గా ఆదేశించియున్నాడు. వైదిక ధర్మములు మానవుని అట్టి సంపూర్ణ శరణాగతినే ప్రేరేపించును. అట్టి నియమములు దానవ ప్రవృత్తిచే నశింపజేయ బడినప్పుడు శ్రీకృష్ణభగవానుడు అవతరించును. భౌతిక భావము వృద్ధిచెంది, లౌకికులు వేదముల ప్రామాణ్యమును ఇష్టానుసారము ఉపయోగించినప్పుడు శ్రీకృష్ణుని అవతారమైన బుద్ధభగవానుడు అవతరించెనని శ్రీమద్భాగవము నుండి మనకు తెలియుచున్నది. కొన్ని ప్రత్యేక ప్రయోజనముల కొరకై వేదములందు జంతుబలిని చేయుటకు తగిన నియమ నిబంధనలు ఉన్నప్పటికిని, దానవ ప్రవృత్తి గలవారు ఆ నియమములును అనుసరింపకనే జంతుబలులతో కూడిన యజ్ఞములు కొనసాగింపసాగిరి. అట్టి విపరీత కార్యములను నిలిపి, వేదోచితమయిన అహింసా సిద్ధాంతములను స్థాపించుట కొరకై బుద్ధభగవానుడు అవతరించెను. అనగా భగవానుని ప్రతి అవతారమునకు ప్రత్యేక ప్రయోజనము కలదు. స్వయం వ్యక్తములైన

ధర్మ గ్రంథములందు అవన్నియును సంపూర్ణముగా వర్ణించబడినవి. కనుక శాస్త్రములందు నిర్దేశింపబడనిదే ఎవ్వరిని అవతారముగా అంగీకరింపరాదు. భగవానుడు భారతదేశ భూమిపైననే అవతరించుననుట సత్యము కాదు. అతడెక్కడయినను, ఎన్నడయినను తన ఇచ్చానుసారము అవతరింపవచ్చును. భగవత్చైతన్యము వైపునకు మానవులను మరలించుట మరియు ధర్మ నియమములను వారిచే పాటింప జేయుటయే అతని అన్ని అవతారముల ఉద్దేశ్యము. అతని అన్ని అవతారముల యందును అతడు వివిధ పరిస్థితులకు చెందిన ఆయా జనులు అవగాహన చేసుకొనునట్లుగా ధర్మమును గూర్చియే అతడు ఉపదేశించును. కొన్నిమార్లు అతడు స్వయముగా అవతరించును. కొన్నిమార్లు అతడు తన ప్రామాణిక ప్రతినిధిని పుత్రుని రూపముననో, సేవకుని రూపముననో గాని పంపును. లేక తానే స్వయంగా గూఢమైన(చెన్న)రూపములో అవతరించుట గాని చేయుచుండును.

భగవద్గీత సిద్ధాంతములు అర్జునునకు మరియు అత్యుత్తమ బుద్ధిశాలురైన ఇతర మానవుల కొరకై చెప్పబడినవి. ఎందుకనగా, ప్రపంచము నందలి ఇతర భాగములలోని సామాన్య మానవులతో పోల్చిచూచినచో అర్జునుడు గొప్ప ఉన్నతిని పొందినట్టివాడు. రెండును రెండుచే కలిపినచో నాలుగగుననుట ప్రాథమిక మరియు ఉన్నత తరగతికి సంబంధించిన వ్యక్తులందరికీ సమానమే. అయినను, గణితము నందు కూడ ప్రాథమిక, ఉన్నత, అల్ప ప్రమాణములనునవి గలవు. అట్లే, భగవానుని సర్వావతారము లందును ఒకేరకమైన ధర్మ సిద్ధాంతములే బోధింపబడును. కాని భిన్నపరిస్థితుల ననుసరించి అవి ప్రాథమికములుగా లేక ఉన్నతములుగా గోచరించును. తరువాత వివరింపబడ బోవునట్లుగా, వర్ణాశ్రమ ధర్మమునకు సంబందించిన ఉన్నత సిద్ధాంతములు నాలుగు ఆశ్రమములను, సంఘము నందలి నాలుగు వర్ణములను అంగీకరించుటతో ఆరంభమగును. అనగా, సర్వత్రా కృష్ణ చైతన్యమును జాగృతము చేయుటయే అన్ని అవతారముల ముఖ్య ప్రయోజనము. కాని అట్టి చైతన్యము భిన్నపరిస్థితుల ననుసరించి కొన్నిమార్లు వ్యక్తమగుట, మరికొన్నిమార్లు అవ్యక్తమగుటను సంభవించును.

## 4.8

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

## అనువాదము

**సాధువులను రక్షించుట కొరకును, దుర్మార్గులను నశింపజేయుటకును మరియు ధర్మమును పున:స్థాపించుట కొరకును ప్రతి యుగమునందున నేనే స్వయముగా అవతరించుచుందును.**

## భాష్యము

భగవద్గీత ననుసరించి సాధువు అనగా కృష్ణచైతన్యవంతుడని అర్థము. ఒకవ్యక్తి అధర్మవర్తునిగా గోచరించినను కృష్ణచైతన్యమునకు సంబంధించిన లక్షణములను సంపూర్ణముగా కలిగియున్నచో అతనిని సాధువుగా గ్రహింపవచ్చును. ‘దుష్కృతు’లనగా కృష్ణచైతన్యమును లెక్కజేయనివారు. అట్టి ‘దుష్కృతులు’ లౌకిక విద్యాపారంగతులైనను మూర్ఖులుగను, నరాధములగను వర్ణింపబడుదురు.నూటికి నూరుపాళ్ళు కృష్ణచైతన్యము

నందు నెలకొనినవాడు విద్యావంతుడు లేక నాగరికుడు కాకపోయినను సాధువుగా పరిగణింపబడును. భగవానుడు రావణుడు, కంసుడు వంటి రాక్షసులను సంహరించుటకు అవతరించునట్లుగా, నాస్తికులను నశింపజేయుటకు భగవానుడు స్వయముగా అవతరింప నవసరము లేదు.

ఎందుకనగా అట్టి రాక్షసులను సంహరించుటకు యోగ్యులైన భగవత్ ప్రతినిధులెందరో గలరు. కాని ఎల్లప్పుడు దానవులచే పీడింపబడు తన శుద్ధభక్తులను ఆనందింప జేయుట కొరకై భగవానుడు ప్రత్యేకముగా అవతరించును. భక్తుడు తనకు సన్నిహిత బంధువైనను దానవ ప్రవృత్తి గలవాడు అతనిని సదా పీడించును. ప్రహ్లాదుడు తన పుత్రుడైనను హిరణ్యకశిపుడు అతనిని బాధించి యుండెను. అట్లే శ్రీకృష్ణుని తల్లియైన దేవకి కంసునికి సోదరియైనను, శ్రీకృష్ణునికి జన్మనొసుగుచున్నందున దేవకి మరియు వసుదేవుడు ఇరువురును కష్టములకు గురిచేయబడిరి. కనుకనే కంసుని సంహరించుట కంటెను ముఖ్యముగా దేవకిని రక్షించుట కొరకే శ్రీకృష్ణభగవానుడు అవతరించెను. అయినను ఆ రెండు కార్యములు ఏకకాలము నందే జరిగెను. కనుకనే భక్తుని రక్షించుట కొరకును, దుష్టులను నశింపజేయుట కొరకును భగవానుడు వివిధ అవతారములుగా అవతరించునని ఇక్కడ చెప్పబడినది.

కృష్ణదాస కవిరాజ గోస్వామి రచించిన 'శ్రీ చైతన్య చరితామృతము' (మధ్యలీల20.263,264) యందలి ఈ క్రింది శ్లోకములు అవతార రహస్యములను సంగ్రహపరచుచున్నవి :

సృష్టి- హేతు యెయి మూర్తి ప్రపంచే అవతరే
సెయి ఈశ్వరమూర్తి 'అవతార' నామ ధరే

మాయాతీత పరవ్యోమే సబార అవస్థాన
విశ్వే అవతరి ధరే 'అవతార' నామ

"భౌతిక సృష్టి కొరకై భగవానుడు భగవద్ధామము నుండి అవతరించు చుండును. అట్లు అవతరించు దేవాదిదేవుని ప్రత్యేక రూపమే అవతారమనబడును. అట్టి అవతారములు ఆధ్యాత్మిక జగత్తునందు నెలకొనియుండును. భౌతిక జగత్తు నందు అవతరించినపుడు అవతార నామమును పొందుచున్నవి."

పురుషావతారములు, గుణావతారములు, లీలావతారములు, శక్త్యావేశావతారములు, మన్వంతరావతారములు, యుగావతారములు వంటి వివిధ అవతారములు విశ్వమందంతటను నియమానుసారముగా అవతరించుచుండును. కాని ఆదిపురుషుడైన శ్రీకృష్ణభగవానుడు సర్వావతారములకును మూలము. శ్రీకృష్ణుడు తన గోలోక వృందావన లీలలను దర్శించుటకై కుతూహల పడుచుండెడి శుద్ధభక్తుల కలతలనన్నింటిని నశింపజేయుటమను ప్రత్యేక ప్రయోజనము కొరకై అవతరించును. అనగా తన శుద్ధ భక్తులను సంతృప్తి పరచుటయే శ్రీకృష్ణభగవానుని అవతార ముఖ్యోద్దేశము.

ప్రతి యుగమునందు తాను అవతరింతునని భగవానుడు చెప్పుచున్నాడు. దీనివలన కలియుగము నందు కూడ అతడు అవతరించునని తెలియుచున్నది. శ్రీమద్భాగవతము (11.5.32) ననుసరించి శ్రీ చైతన్య మహాప్రభువు మాత్రమే కలియుగమునందలి భగవానుని అవతారము. ఆతడే సంకీర్తనోద్యమము (సామూహిక హరినామ సంకీర్తన) ద్వారా కృష్ణభక్తిని ప్రచారము చేసి, భారత దేశమంతటను కృష్ణచైతన్యమును వ్యాపింపజేసెను. అట్టి సంకీర్తనోద్యమము ప్రపంచము నందలి ప్రతి నగరము మరియు ప్రతి గ్రామము నందు ప్రచారము కాగలదనేది ఆయన భవిష్యవాణి. శ్రీ చైతన్య మహాప్రభువు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవతారమని ప్రత్యక్షముగా కాక

అతిరహస్యముగా ఉపనిషత్తులు, మహాభారతము, శ్రీమద్భాగవతము వంటి శాస్త్ర రహస్య భాగములలో తెలుపబడినది. శ్రీ చైతన్య మహాప్రభువు యొక్క ఈ సంకీర్తనోద్యమము యెడ శ్రీకృష్ణభగవానుని భక్తులందరును ఎంతగానో ఆకర్షింపబడిరి. శ్రీకృష్ణభగవానుని ఈ అవతారము దుష్టులను వధించుట కొరకు కాక తన అవ్యాజ కృపతో వారిని ఉద్ధరించునదై యున్నది.

## 4.9

**జన్మ కర్మచ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వత: ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సో/ర్జున ॥**

## అనువాదము

**ఓ అర్జునా! నా జన్మము మరియు కర్మల దివ్యత్వము నెరిగినవాడు దేహమును విడిచిన పిమ్మట తిరిగి ఈ భౌతిక జగత్తున జన్మింపక నా శాశ్వతమైన ధామమున నన్నే పొందగలడు.**

## భాష్యము

భగవానుని అవతరణము అతని దివ్యధామము నుండియే జరుగుననెడి విషయము ఆరవ శ్లోకమున ఇదివరకే వివరింపబడినది. అట్టి దేవాదిదేవుని అవతార తత్త్వము నెరిగినవాడు భవబంధములనుండి ముందే ముక్తిని పొందినట్టి వాడైనందున అట్టివాడు ప్రస్తుత భౌతిక దేహమును విడిచిన వెంటనే భగవద్ధామమునకు తిరిగి చేరుకొనును. జీవుడు అట్లు భవబంధముల నుండి విముక్తుడగుట అంత సులభమైన కార్యమేమి కాదు. నిరాకారవాదులు, ధ్యానయోగులు కూడ బహుజన్మల పిమ్మట అత్యంత కష్టముతో తిరిగి ముక్తిని పొందుదురు. అప్పుడు కూడ వారు పొందెడి ముక్తి (నిరాకార బ్రహ్మజ్యోతిలో లీనమగుట) కేవలము పాక్షికమైనదగుటచే వారు మరల ఈ భౌతిక జగత్తునకు వచ్చు ప్రమాదము కలదు. కాని భగవానుని రూపము మరియు కర్మల దివ్య స్వభావమును ఎరుగుట ద్వారా భక్తులు దేహత్యాగము పిమ్మట కృష్ణధామమును పొంది ఈ భౌతిక జగత్తునకు తిరిగివచ్చు ప్రమాదము నుండి బయటపడుదురు. 'బ్రహ్మసంహిత' (5.33) నందు భగవానునకు అనేక రూపములు మరియు అనేక అవతారములు కలవని చెప్పబడినది (అద్వైతమచ్యుతమనాది మనంతరూపమ్). ఈవిధముగా భగవానునకు అనేక దివ్య రూపము లున్నను, ఆ రూపములన్నియును ఏకమే అయియున్నవి మరియు ఆ దేవాదిదేవుడు అద్వితీయుడై యున్నాడు. ఈ సత్యమును అవగాహన చేసికొనుట లౌకిక విద్వాంసులకు మరియు సాంఖ్య తత్త్వవేత్తలకు కష్టమైనను, ప్రతియొక్కరు ఈ విషయమును విశ్వాసముతో అవగాహన చేసికొనవలెను. వేదము లందు (పురుషబోధినీ శ్రుతి) ఈ విధముగా తెలుపబడినది :

ఏకో దేవో నిత్యలీలానురక్తో భక్తవ్యాపీ భక్తహృద్యంతరాత్మా

"దేవాదిదేవుడు తన శుద్ధభక్తుల కొరకై శాశ్వతముగా అనేకానేక దివ్యరూపములను నిత్యము దాల్చుచునే యుండును" అని చెప్పబడినది.

ఈ వైదిక సత్యము భగవద్గీత యందలి ఈ శ్లోకము ద్వారా శ్రీకృష్ణభాగ్వానునిచే నిర్ధారింపబడినది. కనుక వేదప్రమాణము మరియు భగవానుని ప్రమాణము ననుసరించి

ఈ సత్యమును అంగీకరించి కాలమును తాత్త్వికభావకల్పనలచే వృథా చేయనివాడు అత్యుత్తమమైన సంపూర్ణ ముక్త స్థితిని తప్పక పొందగలుగును. అనగా విశ్వాసముతో ఈ సత్యమును అంగీకరించినంత మాత్రముననే మానవుడు నిస్సందేహముగా ముక్తిని పొందుచున్నాడు. వాస్తవమునకు, ఈ విషయమున 'తత్త్వమసి' అనెడి వేదవాక్యమును అన్వయింపవచ్చును. ఎందుకనగా, ఎవ్వరు శ్రీకృష్ణభగవానుని పరమపురుషునిగా ఎరుగుదురో లేక భగవానునితో: "ఓ కృష్ణా! నీవే ఆ పరబ్రహ్మవైన దేవాదిదేవుడవు" అని పలుకుదురో వారే వెంటనే ముక్తిని పొందగలరు. తద్వారా భగవానుని దివ్య సహచార్యమును పొందగలుగుట వారికి నిశ్చయమగును. అనగా, అట్టి విశ్వాసపూరితుడైన భగవద్భక్తుడు పరిపూర్ణత్వమును సాధింపగలడు. ఈ క్రింది వేదవాక్యము నందు ఈ విషయము నిర్ధారితమైనది :

తమేవ విదిత్వాతి మృత్యుమేతి నాన్య: పంథా విద్యతే/యనాయ

"కేవలము దేవాదిదేవుని గూర్చి ఎరుగుట చేతనే జననమరణముల నుండి ముక్తమైన సంపూర్ణస్థితినే మానవుడు పొందగలడు. అట్టి సంపూర్ణత్వమును పొందుటకు మరోకమార్గము లేదు."(శ్వేతాశ్వతరోపనిషత్తు3.8)

మరొక మార్గము లేదు అనగా శ్రీ కృష్ణభగవానుని దేవాదిదేవునిగా గ్రహింపనివాడు తప్పక తమోగుణము నందున్నట్టి వాడేనని అర్థము. తేనే సీసాయందలి తేనెను కేవలము సీసాను నాకుట ద్వారానే ఆస్వాదింపలేనట్లుగా, లౌకిక పాండిత్యము ననుసరించి భగవద్గీతను వ్యాఖ్యానించుటచే అట్టి తమోగుణము నందున్నవారు ముక్తిని సాధింపలేరు. అట్టి లౌకిక తత్త్వవేత్తలు లౌకిక ప్రపంచమున అత్యంత ప్రధానమైన పాత్రను పోషింపవచ్చును. కాని ముక్తికి మాత్రము వారు అర్హులు కాజాలరు. అట్టి గర్వితులైనట్టి లౌకిక విద్వాంసులు భగవద్భక్తుని అవ్యాజకృప కొరకై వేచి యుండవలసినదే.

కనుకనే ప్రతియొక్కరు కృష్ణచైతన్యమును జ్ఞాన మరియు విశ్వాసములతో అలవరుచుకొని ఆ మార్గమున జీవన పరిపూర్ణత్వమును పొంద వలసియున్నది.

## 4.10

**వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితా: ।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతా: ॥**

### అనువాదము

**రాగము, భయము, క్రోదము నుండి విడివడి, నా యందు సంపూర్ణముగా ముగ్ధులై నన్ను శరణుజొచ్చిన కారణముగా పూర్వము పలువురు వ్యక్తులు నన్ను గూర్చిన జ్ఞానతపస్సులచే పవిత్రులై నా యెడ దివ్యప్రేమను పొందగలిగిరి.**

### భాష్యము

పైన వర్ణింపబడినట్లు లౌకిక వ్యవహారములలో అధికముగా నిమగ్నమైనవానికి పరతత్త్వము యొక్క సాకార స్వభావమును అవగాహన చేసికొనుట అసాధ్యము. దేహాత్మభావన యందు మునిగిన జనులు సాధారణముగా భౌతికత్వము నందే మునిగి యున్నందున పరతత్త్వము ఏ విధముగా సాకారమై యున్నదో అవగతము చేసికొనుట

అసంభవమగును. అట్టి లౌకికవాదులు నాశము లేనట్టి, జ్ఞానానంద రూపమైనట్టి, ఆనంద స్వరూపమైనట్టి ఒక ఆధ్యాత్మిక దేహము గలదని ఊహింపనైన ఊహింపజాలరు. భౌతిక భావన యందు దేహము నశించునదియై, అజ్ఞానపూరితమై పూర్తిగా ధుఃఖపూరితమై యున్నది. కనుకనే భగవానుని రూపమును గూర్చి ఎవ్వరైనను తెలిపినప్పుడు సాధారణముగా సామాన్యజనులు అట్టి దేహభావననే మనస్సులో ఊహించుకొందురు. అట్టి లౌకిక వ్యక్తులకు భౌతికమైన విశ్వరూపమే పరతత్త్వము. కనుకనే పరతత్త్వమును నిరాకారమని భావింతురు. అంతేకాకుండ, అట్టి లౌకికవాదులు భౌతిక విషయ భావనలో పూర్తిగా మునిగి యున్నందున, ముక్తిని పొందిన పిదప కూడా తమ వ్యక్తిత్వము నిలిచి వ్యక్తిగతము మరియు సాకరమని తెలిపినపుడు  మరల రూపమును పొందుటకు వారు ఎంతగానో భయపడుదురు. కనుక వారు సహజము గనే నిరాకారము మరియు శూన్యము నందు లీనమగుటనే వాంఛించుదురు. సాధారణముగా అట్టివారు జీవాత్మలను సముద్రము నందు లీనమగు నీటి బుడగలతో పోల్చుదురు. నీటి  బుడగలు సముద్రపు నీటియందు కలిసిపోవు నట్లుగా ప్రత్యేక వ్యక్తిత్వ మనునది లేకుండ బ్రహ్మములో లీనమగుటయే వారికి అత్యుత్తమ పరిపూర్ణత్వపు స్థితియై యున్నది. వాస్తవమునకు వారికి ఆధ్యాత్మికతను గూర్చిన పరిపూర్ణమైన అవగాహన లేనందునే వారు ఈ విధమైన ఘోరమైన జీవనస్థితిని పొందుదురు. ఇది ఇట్లుండగా ఆధ్యాత్మిక పరిపూర్ణత్వపు స్థితిని గూర్చి ఏ మాత్రము ఎరుగానివారు కూడ అనేకమంది గలరు. పెక్కు సిద్ధాంతముల చేతను, తాత్త్విక కల్పనలకు సంబంధించిన  అనేక విరుద్ధ వాదముల చేతను విసిగి లేక కోపముతో వారు పరమైన కారణమేదియు లేదనియు, చివరికి సమస్తము శూన్యమేననియు మూర్ఖముగా నిర్ధారింతురు. అట్టివారు జీవితమున రోగగ్రస్థ స్థితి యందున్నట్టివారు. కొందరు భౌతికత్వము నందు ఆసక్తులై ఆధ్యాత్మిక జీవితము నందు ఆసక్తిని చూపరు. కొందరు పరబ్రహ్మము నందు లీనము కాగోరుదురు. మరికొందరు నిరాశతో సర్వవిధములైన తాత్త్విక భావనాకల్పనల పట్ల క్రోధమును బూని దేనిని కూడా విశ్వసింపక చివరికి మాదకద్రవ్యములను ఆశ్రయించి, వాటి ద్వారా కలిగెడి మత్తునే కొన్నిమార్లు ఆధ్యాత్మికానుభూతిగా భావింతురు. ఈ విధమైన ఆధ్యాత్మిక జీవితము పట్ల నిర్లక్ష్యము, ఆధ్యాత్మిక వ్యక్తిత్వము పట్ల భయము, జీవితము నందలి నిరాశ వలన కలిగెడి శూన్యభావనమను మూడు రకములైన భౌతిక ప్రపంచాసక్తిని మానవుడు త్యజింపవలెను. భౌతిక జీవితమునకు సంబంధించిన లౌకికభావనతో కూడిన ఈ మూడు దశల నుండి బయటపడుటకు మానవుడు ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని మార్గనిర్దేశము నందు భగవానుని సంపూర్ణముగా శరణుపొంది, ఆధ్యాత్మిక జీవితమునకు సంబంధించిన నియమ నిబంధనలను క్రమశిక్షణతో అనుసరింపవలెను. అట్టి ఆధ్యాత్మిక జీవితము నందలి చివరి స్థితియే ‘భావము’ లేక శ్రీకృష్ణభగవానుని దివ్యప్రేమగా పిలువబడును.

భక్తియుక్తసేవా శాస్త్రమును బోధించు ‘భక్తిరసామృత సింధువు’ (1.4.15,16) ఈ క్రింది విధముగా చెప్పుచున్నది :

ఆదౌ శ్రద్ధా తతః సాధుసంగో థ భజనక్రియా
తతో నర్థనివృత్తిః స్యాత్ తతో నిష్ఠా రుచిస్తతః

అథాసక్తిస్తతో భావస్తతః ప్రేమాభ్యుదఞ్చతి
సాధకానామయం ప్రేమ్ణః ప్రాదుర్భావే భవేత్ క్రమః

ఆరంభదశలో  మానవుడు ఆత్మానుభూతిని గూర్చిన ప్రాథమిక కోరికను కలిగి యుండవలెను. అట్టి కోరిక ఆధ్యాత్మికముగా ఉన్నతి చెందిన భక్తులతో సాంగత్యము చేయుటకై యత్నించు స్థితికి అతనిని కొని పోవును. పిదప ఆధ్యాత్మికోన్నతుడైన ఆధ్యాత్మికాచార్యుని నుండి మంత్రదీక్షను పొందును. అతని ఆదేశముల ననుసరించి సాధకుడు భక్తియుక్త సేవా విధానమును ఆరంభించును. ఆ విధముగా,

ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి భక్తియుక్త సేవను నిర్వహించుట ద్వారా అతడు అన్నిరకములైన భౌతికాసక్తుల నుండి విముక్తిని పొంది, ఆత్మానుభూతి విషయమున నిష్ఠను అనగా స్థిరత్వమును సాధించును. తదుపరి అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుట యందు రుచిని అలవరుచు కొనును. ఆ రుచి అతనిని కృష్ణచైతన్యము నందు మరింత అధికముగా ఆసక్తుని చేసి పరిపక్వ 'భావ' స్థితికి లేక శ్రీకృష్ణభగవానుని దివ్యప్రేమ యందలి తొలి దశకు గొనిపోవును. భావస్థితి యందలి పరిపక్వమే నిజమైన ప్రేమ యనబడును. ఈ యథార్థమైన భగవత్ ప్రేమయే మానవజన్మ యొక్క అత్యున్నత పరిపూర్ణత్వపు స్థితి." అట్టి ప్రేమ స్థితి యందే భగవానుని పట్ల నిరంతర ప్రేమ యుక్తమైన సేవ కొనసాగగలదు. కనుకనే ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి చేయబడు క్రమానుగతమైన భక్తియుక్త సేవ ద్వారా మానవుడు సమస్త భౌతికాసక్తుల నుండియు, ఆధ్యాత్మిక వ్యక్తిత్వము పట్ల గల భయము నుండియు, శూన్యవాదపు ఫలితముగా కలిగిన నిరాశ నుండియు విముక్తి నొంది అత్యున్నత స్థితిని సాధింప వచ్చును. అంత్యమున అతడు భగవద్ధామమును పొందును.

## 4.11

**యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యా: పార్థ సర్వశ: ॥**

### అనువాదము

**ఎవరు ఏ విధముగా నన్ను శరణువేడుదురో వారిని ఆ విధముగా నేను అనుగ్రహింతును. ఓ పార్థా! ప్రతియొక్కరు అన్ని విధములా నా మార్గమునే అనుసరింతురు.**

### భాష్యము

ప్రతియొక్కరు శ్రీకృష్ణభగవానునే ఆతని వివిధ రూపములందు అన్వేషించు చున్నారు. నిరాకార బ్రహ్మజ్యోతి నందును, అణు పరమాణువులతో సహా సర్వము నందు నిలిచియుండు సర్వవ్యాప్తియైన పరమాత్మ యందును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు పాక్షికముగా మాత్రమే అనుభూతుడగును. కాని శుద్ధ భక్తులు మాత్రమే శ్రీకృష్ణుని సంపూర్ణ అనుభూతిని పొందగలుగుదురు. అనగా ప్రతియొక్కరికి శ్రీకృష్ణుడే అనుభూతి విషయమై యున్నాడు. ఆవిధముగా ప్రతియొక్కరు దేవాదిదేవుని పొందగోరిన విధముననుసరించి తృప్తిని పొందుచుందురు. ఆధ్యాత్మిక జగత్తు నందు కూడ శ్రీకృష్ణుడు తన శుద్ధభక్తులు కోరినట్లుగా దివ్య భావనలో వారితో వర్తించును. ఒక భక్తుడు శ్రీకృష్ణుడు తనకు పరమ ప్రభువుగా నుండవలెననియు, మరియొకడు ఆత్మమిత్రుడగ నుండవలెననియు, మరొకడు ఆతనిని తన పుత్రునిగా నుండవలెననియు, మరొకడు తనకు ప్రియుడుగ నుండవలెననియు కోరవచ్చును. తనపట్ల వారికి గల ప్రేమ తీవ్రతల ననుసరించి శ్రీకృష్ణుడు భక్తులనందరిని సమానముగా తృప్తిపరచును. భౌతిక జగత్తు నందు కూడా ఇట్టి పరస్పర భావవినిమయములే కనిపించును. అట్టి భావవినిమయములు భగవానుడు మరియు వివిధ భక్తుల నడుమ కూడ వ్యక్తమగుచుండును. అనగా శుద్ధభక్తులు భౌతికజగత్తు నందును మరియు ఆధ్యాత్మిక జగత్తు నందును భగవానుని సహచార్యమును పొంది, భగవానుని సేవిస్తూ, ఆ విధముగా అతని ప్రేమయుక్త సేవ యందు దివ్యమైన ఆధ్యాత్మిక ఆనందమును అనుభవింతురు. జీవుని వ్యక్తిత్వమును

నశింప జేసుకొనుచు ఆధ్యాత్మిక ఆత్మహత్యకు పాల్పడే నిరాకారవాదులకు కూడా శ్రీకృష్ణుడు తన బ్రహ్మజ్యోతి నందు ఐక్యమొనర్చుకొని తోడ్పడుచుండును. అట్టి నిరాకారవాదులు భగవానుని సచ్చిదానంద విగ్రహమును అంగీకరింపని కారణముగా వారు తమ వ్యక్తిత్వమును కోల్పోవుటచే, భగవానుని దివ్యమైన ఆంతరంగిక సేవయందలి ఆనందము ననుభవింపజాలరు. అట్టి నిరాకారత్వము నందు కూడా స్థిరముగా నెలకొనలేని వారు కొందరు తమలో నిద్రాణముగా నున్నట్టి కోరికలను తీర్చుకొనుటకు భౌతికమైన ఈ జగత్తునకు మరల తిరిగివత్తురు. వారికెన్నటికిని ఆధ్యాత్మిక లోకములందు ప్రవేశము లభింపదు. కాని ఈ భౌతికజగత్తు నందే తిరిగి వర్తించుటకు వారికి అవకాశము కల్పింపబడును. కామ్యకర్మల నొనరించువారికి శ్రీకృష్ణభగవానుడు యజ్ఞేశ్వరుని రూపమున వారి విధ్యుక్త ధర్మములకు తగిన ఫలములను ప్రసాదించుచుండును. అదేవిధముగా, యోగసిద్ధులను వాంఛించు యోగులకు అట్టి సిద్ధులను ప్రసాదించు చుండెను. అనగా, ప్రతియొక్కరు తమ కర్మల యందు జయము కొరకు శ్రీ కృష్ణుని దయపైననే ఆధారపడుదురు. అట్టి అన్నిరకాల ఆధ్యాత్మిక విధానము లన్నియును ఒకే మార్గము నందు విజయము సాధించుటలో గల వివిధ దశలుగా మాత్రమే కనిపించును. మానవుడు కృష్ణచైతన్యము నందలి అత్యున్నతమైన పరిపూర్ణత్వ స్థితికి చేరనంత వరకు సర్వ యత్నములు అసంపూర్ణములే కాగలవు. శ్రీమద్భాగవతము (2.3.10) నందు ఇట్లు చెప్పబడినది:

అకామ: సర్వకామో వా మోక్షకామ ఉదారధీ:
తీవ్రేణ భక్తియోగేన యజేత పురుషం పరమ్

"మానవుడు వాంఛారహితుడైనను (భక్తుల వాస్తవ స్థితి) లేదా ఫలాపేక్ష కలిగి యున్నను లేదా మోక్షకామియైనను ప్రతియొక్కరు పరిపూర్ణత్వము కొరకై కృష్ణచైతన్యము నందు శాయశక్తులా దేవాదిదేవుని భజించుటకు యత్నింపవలెను."

## 4.12

**కాంక్షన్త: కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతా: ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥**

### అనువాదము

**ఈ భౌతిక జగత్తున జనులు కామ్యకర్మల యందు జయమును వాంఛించు కారణముగా దేవతలను పూజింతురు. ఈ జగత్తునందు వారు తమ కామ్యకర్మలకు శీఘ్రముగా ఫలమును పొందుచున్నారు.**

### భాష్యము

ఈలోకమున దేవతలను గూర్చిన అపోహలు అనేకములు గలవు. అల్పజ్ఞులైనవారు విద్వాంసులుగా చలామణి అగుచున్నను వారు ఈ దేవతలను భగవానుని వివిధ రూపములుగా భావింతురు. కాని వాస్తవమునకు దేవతలు భగవానుని వివిధ రూపములు కారు. వారు కేవలము భగవానుని విభిన్నాంశములు మాత్రమే. భగవానుడొక్కడే కాని అతని అంశలు మాత్రము అనేకము. 'శ్వేతాశ్వతరోపనిషత్తు'(2.2.13) నందు : "నిత్యోనిత్యానామ్" – భగవానుడొక్కడేనని చెప్పుచున్నది. "ఈశ్వర: పరమ: కృష్ణ:" – "శ్రీకృష్ణుడొక్కడే పరమేశ్వరుడు."(బ్రహ్మసంహిత 5.1) భగవానుడు ఈ భౌతిక జగత్తును

పరిపాలించుట కొరకై దేవతలకు కొంత పాలనాధికార మిచ్చెను. ఈ దేవతలందరును వివిధస్థాయిలకు చెందిన భౌతిక శక్తులను కలిగియున్నట్టి జీవులు (నిత్యానామ్). వారెన్నడును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు లేదా నారాయణుడు లేదా విష్ణువుతో సమానులు కాజాలరు. అట్టి దేవతలు మరియు భగవానుడు సమాన స్థితులయందు కలరని భావించువాడు 'పాషండుడు' లేదా 'నాస్తికుడు' యనబడును. దేవతలలో శ్రేష్ఠులైన బ్రహ్మ మరియు శివుడు వంటివారు కూడ ఆ భగవానునకు సమానులు కాజాలరు. వాస్తవమునకు భగవానుడు బ్రహ్మరుద్రాదుల వంటి దేవతలందరిచే పూజలందుకొనుచుండును (శివవిరించినుతమ్). అయినను విచిత్రమైన విషయమేమిటంటే, కొందరు మూర్ఖులు పలువురు మానవ నేతలను లేక కొన్ని జంతు రూపములను భగవానుని అవతారమనెడి అపోహలతో పూజించుచుందురు. ఈ శ్లోకము నందు 'ఇహ దేవతా:' అను పదము ఈ లోకమునకు సంబంధించిన శక్తిమంతులైన మానవులను లేక దేవతలను సూచించును. కాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు (నారాయణుడు లేదా విష్ణువు) ఈ లోకమునకు చెందినవాడు కాడు. అతడు ఈ భౌతిక జగత్తునకు అతీతమైనవాడు. శ్రీకృష్ణుడు లేదా నారాయణుడు భౌతిక సృష్టికి అతీతుడని మాయావాదులకు గురువు అయినట్టి శంకరాచార్యులు కూడ అంగీకరించిరి. కాని మూర్ఖపు జనులు(హృతజ్ఞానా:) శీఘ్ర ఫలితముల కొరకై వివిధ దేవతలను పూజింతురు. వారు తాము కోరిన ఫలములను శీఘ్రమే పొందగలిగినను, అట్లు పొందబడిన ఫలములు తాత్కాలికములు మరియు బుద్ధిహీనులకు మాత్రమే ఉద్దేశింపబడినవని ఎరుగజాలరు. కాని బుద్ధిమంతుడు కృష్ణచైతన్యము నందుండుట చేత అతడు సత్వరమును మరియు తాత్కాలిక లాభముల కొరకై వివిధ దేవతలను అర్చింపనవసరము లేదు. వాస్తవమునకు భౌతిక జగత్తునకు సంబంధించిన దేవతలు మరియు వారిని పూజించెడి వారందరును విశ్వప్రళయమున నశించుదురు. అంతేకాకుండ, దేవతలు ఇచ్చు వరములన్నియును భౌతికములు మరియు అశాశ్వతములు. భౌతిక జగత్తులు మరియు వాటియందు నివసించు వారును (దేవతలను మరియు వారిని అర్చించు వారును) కూడ విశ్వ సముద్రములోని బుడగల వంటివారు. అయినను, ఈ జగత్తునందలి మానవులు భూమిని, చక్కని కుటుంబము, భోగభాగ్యముల వంటి భౌతిక విషయముల పట్ల వెర్రివారగుదురు. అట్టి తాత్కాలిక వస్తువులను పొందుటకు మానవులు దేవతలను గాని, శక్తిమంతుడైన మానవుని గాని పూజించుదురు. ఎవరైనను ఒక రాజకీయ నాయకుని సేవించుట ద్వారా ప్రభుత్వము నందు మంత్రి పదవి లభించినచో, మానవుడు గొప్ప లాభమును పొందినట్లుగా భావించును. కనుకనే ప్రతియొక్కరు అట్టి తాత్కాలిక ఫలములను పొందుటకు నేతలనబడు వారికి దండ ప్రణామము లాచరించుచుందురు. వారు ఆ ఫలములను తప్పక పొందుదురు. కాని అట్టి మూర్ఖులు భౌతిక దుఃఖములకు శాశ్వత పరిష్కారమును కలగజేయు కృష్ణచైతన్యము నందు ఆసక్తిని చూపరు. వారందరును ఎల్లప్పుడు ఇంద్రియ తృప్తినే వాంఛించుదురు. కొద్దిపాటి ఇంద్రియతృప్తి సౌకర్యముల నొందుటకు శక్తినొసగబడిన జీవులను (దేవతల) పూజించుటకు ఆకర్షితులగుదురు. సాధారణముగా జనులు కృష్ణచైతన్యము నందు అరుదుగా ఆసక్తిని కలిగి యుందురని ఈ శ్లోకము తెలుపుచున్నది. వారు దాదాపు భౌతిక భోగము నందే ఆసక్తిని కలిగియుండుట చేత వారు ఎవరో ఒక శక్తిమంతుడైన జీవుని పూజించుచుందురు.

## 4.13

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥**

## అనువాదము

**భౌతిక ప్రకృతి త్రిగుణములు మరియు తత్సంబంధిత కర్మల ననుసరించి మానవ సమాజము నందలి చాతుర్వర్ణ్యములు నాచే సృజింపబడినవి. ఈ విధానమునకు నేనే కర్తనైనను అవ్యయుడనగుటచే ఆ కర్తగానే నన్ను నీవు తెలిసికొనుము.**

## భాష్యము

సర్వమును సృష్టించువాడు శ్రీకృష్ణభగవానుడే. సర్వము అతని నుండియే సృష్టింపబడి, అతని చేతనే పోషింపబడి, ప్రళయానంతరము అతనియందే విశ్రమించును. కనుకనే అతడు సత్త్వగుణము నందు నిలిచి బ్రాహ్మణులుగా పిలువబడు మేధావివర్గముతో మొదలయ్యేడి సమాజము నందలి నాలుగు విభాగములకు (చాతుర్వర్ణములు) ఆతడే సృష్టికర్త అయినాడు. బ్రాహ్మణుల పిదప ఈ వ్యవస్థ యందలి తరువాతివారు రజోగుణము గలవారగుటచే క్షత్రియులనబడు వారితో కూడు పాలకావర్గము వచ్చును. తరువాతి వారు రజస్తమోగుణముల మిశ్రమము కలిగి వైశ్యులుగా పిలువబడు వ్యాపారస్థులు. ఇక నాలుగవ వర్ణము వారు తమోగుణము నందుంది శూద్రులుగా పిలువబడు శ్రామిక వర్గము. శ్రీకృష్ణభగవానుడే మానవ సంఘము నందలి ఈ నాలుగు విభాగములను సృష్టించినప్పటికిని, బద్ధజీవులలో ఒక భాగమైన మానవసంఘమున తాను ఒక బద్ధజీవి కానందున శ్రీకృష్ణభగవానుడు ఈ వర్ణములలో దేనికి చెందినవాడు కాడు. వాస్తవమునకు, మానవ సమాజము కూడ పశు సమాజముతో సమానమైనట్టిదే. కాని మానవులను అట్టి జంతుస్థితి నుండి ఉద్ధరించి, అతనియందు కృష్ణచైతన్యమును వృద్ధిచేయుట కొరకే పైన పేర్కొనబడిన ఈ నాలుగు విధానములు శ్రీకృష్ణభగవానుని చేత సృష్టింపబడినవి. మానవుడు పొందియున్నట్టి గుణముల ననుసరించి కర్మ ప్రవృత్తి నిర్ణయింపబడును. భౌతిక స్వభావమునకు సంబంధించిన ఈ త్రిగుణముల ననుసరించి కలిగెడి జీవిత లక్షణములను (స్వభావములను) గూర్చి భగవద్గీత యందు అష్టాదశాధ్యాయమున వివరింపబడినది. ఏమైనను, కృష్ణచైతన్యవంతుడు బ్రాహ్మణుల కంటెను మహోన్నతుడు. బ్రాహ్మణులు తమ గుణముల ననుసరించి పరతత్త్వమును ఎరగవలసి యున్నను, వారిలో అధిక భాగము శ్రీకృష్ణభగవానుని నిరాకార బ్రహ్మమునే ఆశ్రయింతురు. కాని మానవుడు అట్టి పరిమితమైన బాహ్మణజ్ఞానమును అధిగమించి, దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని గూర్చిన దివ్యజ్ఞానమును పొందగలిగినచో అతడు కృష్ణచైతన్యవంతుడు లేక వైష్ణవుడు కాగలడు. శ్రీరాముడు, నృసింహుడు, వరాహాది అనేకమైన శ్రీకృష్ణుని దివ్య అవతారములకు సంబంధించిన జ్ఞానము ఈ కృష్ణచైతన్య జ్ఞానమునందు ఇమిడియున్నది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు చాతుర్వర్ణ్య విధానమునకు అతీతుడైనట్లే, కృష్ణ చైతన్యవంతుడు కూడ వర్ణ, దేశ, వర్గాది మానవసంఘ విభాగములకు అతీతుడై యుండును.

## 4.14

**న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా।
ఇతి మాం యో భిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥**

## అనువాదము

**నన్ను ప్రభావితము చేయు కర్మమేదియును లేదు; నేను యెట్టి కర్మఫలమును వాంఛింపను. నన్ను గూర్చిన ఈ సత్యము నెరిగినవాడు కూడ కర్మఫలములచే బంధింపబడదు.**

## భాష్యము

రాజు తప్పు చేయడనియు లేక రాజ్యాంగ శాసనములకు లోబడి యుండడనియు పలికెడు భౌతిక జగత్తుకు సంబంధించిన రాజ్యాంగ శాసనములు ఎన్నోగలవు. అదేవిధముగా, ఈ భౌతిక జగత్తునకు భగవానుడే సృష్టికర్త యైనప్పటికిని, అతడు అట్టి భౌతికజగత్తు కర్మలచే ప్రభావితుడు కాడు. అతడు సృష్టించిన సృష్టికి అతడు అతీతుడుగా నిలిచియుండును. ప్రకృతి వనరులపై ఆధిపత్యము వహింపవలెననెడి ప్రవృత్తి చేత జీవులు వివిధ కామ్యకర్మ ఫలములచే బంధింపబడుదురు. ఉదాహరణకు ఒక సంస్థ యందలి కార్మికులు చేయు మంచి చెడు కర్మలకు ఆకార్మికులే బాధ్యులు కాగలరు . కాని సంస్థ యొక్క యజమాని కాదు. అదేవిధముగా, ఈ జగత్తునందు జీవులందరును తమ తమ ఇంద్రియతృప్తికి సబంధించిన కర్మలయందు నెలకొనియున్నారు. అట్టి కర్మలు భగవానుని చేత నిర్ణయింపబడినవి కావు. అయినను జీవులు అధికమైన ఇంద్రియతృప్తి కొరకు ఈ జగత్తు నందలి కర్మలయందు నెలకొని, మరణానంతరము స్వర్గలోక సుఖములను వాంఛింతురు. భగవానుడు ఆత్మారాముడైనందున అతనెన్నడును అట్టి స్వర్గసుఖముల పట్ల ఏ విధమైన ఆకర్షణను కలిగియుండడు. వాస్తవమునకు స్వర్గలోకపు దేవతలందరును అతని చేత నియమింపబడునట్టి సేవకులే. సాధారణముగా కార్మికులు వాంఛించెడి తక్కువరకపు సుఖమును, యజమాని ఎన్నడును వాంఛింపడు. కర్మలకు మరియు కర్మఫలములకు అతడు సర్వదా అతీతుడై యుండును. ఉదాహరణకు, భూమిపై ఉత్పన్నమగునట్టి వివిధరకాల వృక్ష జాలమునకు వర్షము కారణము కాకున్నను, వర్షము లేకుండా అవి వృద్ధి చెందు అవకాశమే లేదు. ఈ విషయమున వేదస్మృతి (విష్ణుపురాణము 1.4.51) ఇట్లు నిర్ధారించుచున్నది.

నిమిత్తమాత్రమేవాసౌ సృజ్యానాం సర్గకర్మణి
ప్రధానకారణీభూతా యతో వై సృజ్యశక్తయః

"భౌతిక సృష్టికి భగవానుడు ప్రధానకారణుడు మాత్రమే. భౌతిక ప్రకృతియే నిమిత్త కారణముగా ఈ జగత్తు వ్యక్తమగుచున్నది." సృష్టింపబడిన జీవులలో దేవతలు, మానవులు, జంతువులు వంటి అనేకరకాల జీవులు గత జన్మ పుణ్య పాపకర్మల ఫలములకు లోబడియుందురు. భగవానుడు వారికి అట్టి కర్మలను ఆచరించుటకు తగిన సదుపాయములను సమకూర్చుచు త్రిగుణములను నియంత్రించునే గాని వారి పూర్వ, ప్రస్తుత కర్మలకు బాధ్యత వహింపడు. "వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్" – "భగవానుడు ఏ జీవిపట్లను పక్షపాతమును కలిగియుండడు" అని 'వేదాంతసూత్రము'(2.1.34) నిర్ధారించుచున్నది. వాస్తవమునకు, జీవుడు తన కర్మలకు తానే బాధ్యుడై యుండును. భగవానుడు తన బహిరంగ శక్తియైన భౌతిక ప్రకృతి ద్వారా అతనికి సౌకర్యములను

మాత్రమే సమకూర్చుచుండును. కర్మసిద్ధాంతము నందలి ఈ రహస్యముల నన్నింటిని పూర్తిగా ఎరిగినవాడు తన కర్మఫలములచే ఎన్నడును ప్రభావితుడు కాడు. అనగా, శ్రీకృష్ణభగవానుని దివ్య తత్త్వమును అవగాహన చేసికొనినవాడు కృష్ణచైతన్యమునందు నిష్ణాతుడగును. కనుక అతడెన్నడును కర్మసిద్ధాంతములకు లోబడియుండడు. అట్లుకాకుండ శ్రీకృష్ణుని దివ్యస్వభావమునెరుగక, సాధారణ మానవుల కర్మల వలెనే భగవానుని కర్మలు కూడ కర్మప్రాప్తి కొరకే ఉద్దేశింపబడినవని భ్రమించువాడు కర్మఫలములచే తప్పక బంధింపబడును. కాని పరసత్యము నెరిగినవాడు కృష్ణచైతన్యము నందు స్థితుడైనట్టి ముక్తపురుషుడు.

## 4.15

**ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥**

## అనువాదము

**పూర్వకాలమున ముక్తాత్మలందరును నా దివ్యస్వభావపు ఈ అవగాహనతోనే కర్మల నొనరించి యుండిరి. అందుచే నీవు కూడ వారి అడుగుజాడల ననుసరించుచు నీ కర్మ నొనరింపుము.**

## భాష్యము

మానవులలో రెండు తరగతుల వారు కలరు. వారిలో కొందరు హృదయము నందు మలిన భావములు కలవారు కాగా, మరి కొందరు అట్టి భౌతిక భావనల నుండి విముక్తులై యుందురు. ఈ ఇరువురికిని కృష్ణచైతన్యము సమానముగా శ్రేయోదాయకమైనది. మలినచిత్తులు భక్తియుక్త సేవకు సంబంధించిన నియమిత సూత్రముల ననుసరించుచు పవిత్రతను పొందుటకై కృష్ణచైతన్య విధానమును గ్రహింపవచ్చును. విషయ మాలిన్యములను తొలగించు కొనినవారు కూడా ఈ కృష్ణచైతన్యము నందు కొనసాగుతూ, ఇతరులు తమ ఆదర్శకర్మల ననుసరించి లాభపడునట్లుగా ఆదర్శముగా కర్మల నొనరింప వచ్చును. మూర్ఖులు లేక కృష్ణచైతన్యపు ఆరంభదశలో నున్నవారు కృష్ణచైతన్య జ్ఞానము లేకుండుట చేత కర్మల నుండి విరమింపగోరుదురు. యుద్ధరంగ కార్యము నుండి విరమింప వలెననెడి అర్జునుని కోరికను శ్రీకృష్ణభగవానుడు ఆమోదింపలేదు. మానవుడు కర్మలనెట్లు చేయవలెనో ఎరుగవలెను. కృష్ణచైతన్య కార్యముల నుండి విరమించి నిర్జన భజనతో కృష్ణభక్తిని ప్రదర్శించుట యనునది కృష్ణచైతన్యమును కలిగిచేయు కర్మల కంటె ముఖ్యమైనది కాబోదు. కనుకనే శ్రీకృష్ణుడిచ్చట అర్జునకు తెలుపబడిన వివస్వానుడు వంటి భగవానుని పూర్వపు శిష్యుల అడుగు జాడల ననుసరించి కృష్ణచైతన్యముతో వర్తింపవలెనని ఇక్కడ బోధింపబడెను. శ్రీకృష్ణభగవానుడు దివ్యములగు తన పూర్వకర్మల నన్నింటిని మరియు పూర్వము కృష్ణచైతన్యముతో వర్తించిన వారి కర్మలనన్నింటిని పూర్తిగా ఎరిగియుండెను. కనుకనే తన నుండి కొన్నివేల లక్షల సంవత్సరములకు పూర్వము ఈ కళను ఎరిగిన సూర్యదేవుని కార్యకలాపములు అర్జునునకు కూడా అనుసరణీయములని పలుకుచున్నాడు. దేవాది దేవుడైన శ్రీకృష్ణభగవానుడు నిర్దేశించిన కార్యనిర్వహణ యందు నెలకొనినట్టి పూర్వపు భక్తులే ఇక్కడ ముక్తాత్మలుగా పేర్కొనబడిరి.

## 4.16

**కిం కర్మ కిమకర్మేతి కవయో ప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్ జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్ ॥**

### అనువాదము

**బుద్ధిమంతులు కూడ కర్మయనగానేమో మరియు ఆకర్మయనగానేమో నిర్ణయించుట యందు భ్రాంతి నొందియున్నారు. అందుచే కర్మయనగానేమో ఇప్పుడు నేను వివరింతును. దానిని తెలిసికొని నీవు అన్ని అశుభముల నుండియు విముక్తుడవగుదువు.**

### భాష్యము

కృష్ణచైతన్య సిద్ధాంతము ననుసరించి పూర్వపు ప్రామాణిక భక్తులను ఆదర్శముగా తీసుకొని కర్మచేయవలెను. క్రిందటి పదునైదవ శ్లోకమున ఈ విషయము ఉపదేశింపబడినది. అట్టి కర్మను ఎందుకు స్వతంత్రముగా ఇచ్చానుసారముగా చేయరాదో రాబోవు శ్లోకము నందు వివరింపబడును.

ఈ అధ్యాయపు ఆరంభమున తెలుపబడినట్లు కృష్ణచైతన్యము నందు కర్మ నొనరించుటకు గురుశిష్య పరంపరలో వచ్చుచున్న ప్రామాణిక వ్యక్తుల ననుసరింపవలెను. ఈ కృష్ణచైతన్య సిద్ధాంతము తొలుత సూర్యదేవునకు వివరింపబడగా, సూర్యుడు తన పుత్రుడైన మనువునకు దానిని బోధించెను. పిదప మనువు దానిని తన పుత్రుడైన ఇక్ష్వాకునకు విశదీకరించెను. ఈ సిద్ధాంతము ఆనాటి నుండి ఈ ధరిత్రి యందు కొనసాగుచున్నది. కనుకనే మానవుడు గురుశిష్య పరంపర నందున్న పూర్వపు ప్రామాణిక భక్తుల అడుగుజాడల ననుసరింపవలెను. లేనిచో మిక్కిలి బుద్ధిమంతులైనవారు కూడా కృష్ణచైతన్యమునకు సంబంధించిన ప్రామాణిక కర్మల విషయమున భ్రాంతికి గురియగుదురు. కనుకనే శ్రీకృష్ణుడు అర్జునునకు ప్రత్యక్షముగా ఉపదేశించుటకు నిశ్చయించుకొనెను. భగవానుడే ప్రత్యక్షముగా అర్జునునకు ఉపదేశించి యున్నందున, అర్జునుని అడుగుజాడల ననుసరించు వారెల్లప్పుడును ఈ విషయమున భ్రాంతినొందరు.

అసంపూర్ణమైనట్టి ప్రయోగాత్మక జ్ఞానము ద్వారా ధర్మవిధానమును గూర్చి ఎవ్వరును తెలిసికొనజాలరు. వాస్తవమునకు ధర్మసిద్ధాంతములు భగవానుని చేతనే స్వయముగా నిర్ధారింపబడును. "ధర్మం తు సాక్షాత్ భగవత్ప్రణీతమ్" (భాగవతము 6.3.19) ఎవ్వరును తమ అసంపూర్ణమైన మానసిక కల్పనలచే ధర్మ సిద్ధాంతములను సృష్టింపజాలరు. ఈ విషయమున బ్రహ్మ, శివుడు, నారదుడు, మనువు, సనక సనందనాదులు, కపిలుడు, ప్రహ్లాదుడు, భీష్ముడు, శుకదేవగోస్వామి, యమరాజు, జనకుడు, బలిమహారాజు వంటి మహాజనుల అడుగుజాడలను ప్రతి యొక్కరు అనుసరింపవలెను. మానసిక కల్పనల ద్వారా ఎవ్వరును ధర్మమనగానేమో లేదా ఆత్మానుభూతి అనగానేమిటో తెలుసుకొనజాలరు. కనుక భక్తుల పట్ల గల అవ్యాజకృప కారణముగా కర్మయననేమో మరియు అకర్మ యననేమో అర్జునునకు భగవానుడు ప్రత్యక్షముగా బోధించుచున్నాడు. కృష్ణచైతన్యముతో చేయబడు కర్మమాత్రమే భవబంధముల నుండి మానవుని విముక్తిని చేయగలదు.

**4.17**
**కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥**

**అనువాదము**

**కర్మగతులను అవగాహన చేసుకొనుట అత్యంత కష్టము. అందుచే కర్మ యననేమో, వికర్మ యననేమో, అకర్మ యననేమో మానవుడు చక్కగా ఎరుగవలెను.**

**భాష్యము**

ఎవరైనను భౌతిక బంధముల నుండి విముక్తిని పొందు విషయమున నిజముగా ఆసక్తులైనచో కర్మము, వికర్మము (నిషిద్ధకర్మ), అకర్మముల నడుమ గల భేదములను గ్రహింపవలెను. ఈ కర్మసంబంధ విషయము అత్యంత కఠిన మైనందున ప్రతియొక్కరు అటువంటి వివిధ కర్మలను విశ్లేషించి ఎరుగవలెను. కృష్ణచైతన్యమును మరియు దానికి సంబంధించిన కర్మలను అవగతము చేసికొనుటకు ప్రతియొక్కరు భగవానునితో తమకు గల సంబంధమును ఎరుగ వలెను. జ్ఞానవంతుడైనట్టివాడు ప్రతిజీవియు భగవానుని నిత్యదాసుడనియు, తత్కారణముగా అతడు కృష్ణచైతన్యముతో వర్తింపవలసి యుండుననియు అవగాహన చేసుకొనగలడు. భగవద్గీత అంతటను ఈ సారాంశమునే నిర్దేశించు చున్నది. ఈ చైతన్యమునకు మరియు దానిననుసరించి చేయు కర్మలకును విరుద్ధములైన ఇతర నిర్ణయము లన్నియును నిషిద్ధకర్మలే (వికర్మలే). దీనినంతటిని సంపూర్ణముగా నెరుగుటకు కృష్ణచైతన్యము నందలి శ్రేష్ఠభక్తుల సాంగత్యమును పొంది వారినుండి ఈ కర్మల రహస్యమును ఎరుగవలెను. ఆ విధముగా చేయుట ప్రత్యక్షముగా భగవానుని నుండి ఎరుగుటయే కాగలదు. లేనిచో అత్యంత బుద్ధిమంతులైన వారు కూడ భ్రాంతికి గురికాగలరు.

**4.18**

**కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥**

**అనువాదము**

**కర్మ యందు ఆకర్మను మరియు అకర్మ యందు కర్మను గాంచువాడు మానవులలో బుద్ధిమంతుడు. అట్టివాడు అన్ని రకముల కర్మల యందు నియుక్తుడైనను ఆధ్యాత్మిక స్థితి యందున్నవాడే యగును.**

**భాష్యము**

కృష్ణచైతన్యమున కర్మనొనరించువాడు సహజముగానే కర్మబంధము లన్నింటి నుండి విముక్తుడై యుండును. అతడు కర్మలన్నింటిని శ్రీకృష్ణుని సంతృప్తి పరచుట కొరకై చేయును. కనుకనే అతడు కర్మప్రభావముచే సుఖదుఃఖములకు లోనుగాడు. తత్ఫలితముగా అతడు శ్రీకృష్ణుని కొరకై అన్నిరకముల కర్మల యందు నెలకొనినను మానవులలో అత్యంత బుద్ధిమంతుడుగా పరిగణింపబడును. 'అకర్మ' అనగా

ఫలరహితమైన కర్మ. ఆత్మానుభూతి మార్గమున కర్మఫలములు అవరోధము కాకూడదని భావించి, నిరాకారవాదులు భయముతో కామ్యకర్మల నుండి విరమింతురు. కాని సాకారవాది దేవాదిదేవుని నిత్యదాసునిగా తన స్థితిని చక్కగా ఎరుగును. కనుకనే అతడు కృష్ణచైతన్య కార్యకలాపము లందు నెలకొనియుండును. ప్రతిదియు శ్రీకృష్ణుని కొరకే చేయబడుచుండుట చేత అతడు తన సేవాకార్యము నందు పరమానందము ననుభవించును. ఇట్టి విధానము నందు నెలకొనినట్టివారు నిష్కాములుగా తెలియబడుదురు. శ్రీకృష్ణుని యెడ గల నిత్యదాసత్వ భావము సర్వవిధములైన కర్మఫలముల నుండి మానవుని విముక్తిని చేయగలదు.

## 4.19

**యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః ॥**

**అనువాదము**

**ఎవని ప్రతికర్మయు భోగవాంఛారహితముగా నుండునో అతడు సంపూర్ణ జ్ఞానము కలిగినట్టివాడు. జ్ఞానాగ్నిచే దహింపబడిన కామ్యకర్మలు గలవానిని పండితుడని మహర్షులు చెప్పుదురు.**

**భాష్యము**

కృష్ణచైతన్యవంతుని కార్యకలాపములను సంపూర్ణ జ్ఞానము గలవాడే అవగాహన చేసుకొనగలడు. ఎందుకనగా కృష్ణచైతన్యవంతుడు అన్నిరకాల ఇంద్రియభోగవాంఛల నుండి విడివడియుండును. దేవాదిదేవునికి నిత్య దాసుడనెడి తన నిజస్థితిని గూర్చిన సంపూర్ణ జ్ఞానముతో తన కర్మఫలముల నన్నింటిని అతడు దహించుకొనెనని ఎరుగవలెను. అట్టి సంపూర్ణ జ్ఞానమును పొందినవాడే నిజమైన 'పండితుడు'. భగవానునితో గల నిత్యదాసత్వమను సంబంధమును గూర్చిన ఈ జ్ఞానాభివృద్ధిని అగ్నితో పోల్చవచ్చును. అట్టి అగ్ని ఒకమారు రగిలింప బడినచో అది అన్నిరకములైన కర్మఫలములను సమూలముగా దహించివేయును.

## 4.20

**త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః ॥**

**అనువాదము**

**కర్మఫలముల యెడ ఆసక్తిని విడిచి నిత్య సంతృప్తుడును, నిరాశ్రయుడును అయి యుండెడి వాడు అన్ని విధములైన కర్మలయందు నియుక్తుడైనను కామ్యకర్మలు చేయనివాడే యగును.**

**భాష్యము**

మానవుడు ప్రతిదియు కృష్ణచైతన్యము నందు శ్రీకృష్ణుని కొరకే చేయునపుడు ఆ భావన యందే కర్మబంధముల నుండి ముక్తి సాధ్యపడును. కృష్ణచైతన్యవంతుడైన భక్తుడు దేవాదిదేవుని యెడ గల శుద్ధప్రేమతోనే వర్తించును కనుక కర్మఫలముల యెడ ఆసక్తిని కలిగియుండడు. అతడు సమస్త భారమును శ్రీకృష్ణునికే విడిచి వేయుటచే స్వీయపోషణము నందు కూడ ఆసక్తిని కలిగి యుండడు. అతడు లేనివాటిని సంపాదించుటకు గాని, లేక ఇదివరకే తన అధీనము నందున్న వానిని రక్షించుకొనుటకు గాని ఆసక్తిని కనపరచడు. తన ధర్మమును శక్త్యానుసారము నిర్వహించి పిదప సర్వమును శ్రీకృష్ణునికే విడుచును. అట్టి అనాసక్తుడైన భక్తుడు ఏమియును చేయనివాని చందమున కర్మల యొక్క మంచిచెడు ఫలముల నుండి సర్వదా విముక్తుడై యుండును. ఇట్టి స్థితి 'అకర్మ'కు అనగా ఫలాపేక్షలేని కర్మకు చిహ్నము. కనుకనే కృష్ణచైతన్య రహితమైన ఏ కర్మయైనను కర్తను తప్పక బంధించును. అది ఇదివరకే తెలుపబడినట్లు, అదియే 'వికర్మ' యొక్క నిజమైన స్వరూపమై యున్నది.

## 4.21

**నిరాశీర్యతచిత్తాత్మ త్యక్తసర్వపరిగ్రహః**
**శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్**

**అనువాదము**

**అట్టి అవగాహనము కలిగిన మానవుడు మనోబుద్ధులను పూర్తిగా నిగ్రహించి తనకున్న వస్తువులపై స్వామ్యభావనను విడిచి, కేవలము జీవనావసరముల కొరకే కర్మనొనరించును. ఆ విధముగా వర్తించుచు అతడు పాపఫలితములచే ప్రభావితుడు కాకుండును.**

**భాష్యము**

కృష్ణచైతన్యవంతుడు తన కర్మల యందు మంచిచెడు ఫలములను వాంఛింపడు. అతని మనోబుద్ధులు సదా నియంత్రింప బడియుండును. జీవుడు భగవానుని అంశయైనందున, సంపూర్ణము (అంశి) యొక్క అంశగా తనచే చేయబడు కార్యము వాస్తవమునకు తాను చేయుట లేదనియు, ఆ కార్యము తన ద్వారా భగవానునిచే చేయబడుచున్నదనియు ఎరు గును. దేహము నందలి హస్తము స్వతంత్రముగా తనంతట తానుగా కదలకుండ, దేహావసరార్థమే దాని ప్రయత్నము చేతనే అది కదులును. అదేవిధముగా, కృష్ణచైతన్యవంతుడు స్వీయ సంతృప్తిని వాంఛింపని వాడగుటచే పరమపురుషుని సంకల్పమునే సదా నెరవేర్చుచుండును. అట్టిభక్తుడు సరిగా ఒక యంత్రమందలి భాగము వలెనే వ ర్తించును. యంత్ర భాగము చక్కగా పనిచేయుట కొరకై దానిని శుభ్రపరుచుట మరియు దానికి తైలాదులు వంటివాటి అవసరమైనట్లే, భగవానుని దివ్యమైన భక్తియుక్త సేవా కార్యమున నేలకొనియుండుట కొరకై కృష్ణచైతన్యవంతుడు కావలసిన కర్మను మాత్రమే చేసి దేహమును పోషించుకొనును. కనుకనే తన కర్మఫలము లన్నింటికిని అతడు అతీతుడై యుండును. యజమాని ఆధీనము నందు గల జంతువు వలె అతడు తన దేహముపై ఎట్టి అధికారమును కలిగియుండడు. క్రూరుడైన యజమాని కొన్నిమార్లు తన అధీనమునందు

గల జంతువును చంప యత్నించినను అట్టి జంతువు అందులకు ప్రతిఘటించదు. వాస్తవమునకు అది ఎట్టి స్వాతంత్ర్యమును కలిగియుండదు. కృష్ణచైతన్యవంతుడు ఆత్మానుభూతి మార్గమున పూర్తిగా నిమగ్నుడై యుండుటచే, అతడు భౌతిక వస్తువులను పొందుటకు కావలసిన తగినంత తీరిక సమయమును కూడ కలిగియుండడు. దేహాత్మలను పోషించుట కొరకై అతడు అక్రమ మార్గముల ద్వారా ధనమును సేకరింపనవసరము లేదు. కనుక అట్టి లౌకిక పాపములచే అతడెన్నడును కలుషితుడు కాడు. ఈ విధముగా అతడు తన సమస్త కర్మఫలముల నుండి విముక్తుడై యుండును.

## 4.22

**యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సర: ।**
**సమ: సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥**

### అనువాదము

**యాదృచ్ఛికముగా లభించినదానితో సంతుష్టుడగువాడును, ద్వంద్వాతీతుడును, అసూయారహితుడును, జయాపజయముల రెండింటి యందు స్థిరుడై యుండెడివాడును అగు మానవుడు కర్మలను చేయుచున్నను ఎన్నడును వానిచే బద్ధుడు కాడు.**

### భాష్యము

కృష్ణచైతన్యవంతుడు దేహపోషణ కొరకై ఎక్కువగా శ్రమింపడు. అతడు యాదృచ్ఛికముగా అనగా తనంతతానుగా ప్రాప్తించిన దానితోనే సంతుష్టి నొందును. ఇతరులను యాచించుట గాని, అప్పుచేయుట గాని చేయక న్యాయముగా తన శక్తికొలది కర్మనొనరించి, తద్వారా లభించిన దానితో అతడు సంతృప్తి నొందును. కనుక జీవనోపాధి విషయమున అతడు స్వతంత్రుడై యుండును. తాను కృష్ణచైతన్యముతో చేయు సేవకు ఇతరుల సేవ వలన అంతరాయము కలుగ కుండునట్లుగా చూచుకొనును. అయినను భగవానుని సేవకొరకు భౌతిక జగత్తు యొక్క ద్వంద్వములచే ఏ మాత్రము కలత నొందక ఎట్టి కర్మయందైనను అతడు పాల్గొనవచ్చును. భౌతిక జగత్తు నందలి ద్వంద్వములనునవి శీతోష్ణముల రూపములో సుఖదుఃఖముల రూపమున అనుభూతము లగుచుండును. కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణుని సంతృప్తి కొరకు ఏ విధముగానైనను తన కర్మల నొనరించుటకు వెనుకాడడు. ద్వంద్వాతీతుడు కనుకనే అతడు జయాపజయములు రెండింటి యందును స్థిరుడై యుండును. మానవుడు దివ్యజ్ఞాన సంపూర్ణుడైనప్పుడు ఈ విధమైన లక్షణములు గోచరించును.

### 4.23

**గత సఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతస: ।**
**యజ్ఞాయాచరత: కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥**

## అనువాదము

**భౌతిక ప్రకృతి త్రిగుణముల యెడ అనాసక్తుడై దివ్యజ్ఞానము నందు సంపూర్ణముగా స్థితుడైన మానవుని సమస్త కర్మలు పూర్తిగా దివ్యత్వము నందే లీనమగును.**

## భాష్యము

సంపూర్ణ కృష్ణచైతన్యవంతుడు అన్ని ద్వంద్వముల నుండి విముక్తుడై క్రమముగా భౌతిక త్రిగుణముల సంపర్కము నుండి విడివడును. శ్రీకృష్ణునితో గల సంబంధ విషయమున తన నిజస్థితిని ఎరిగియుండుటచే అతడు ముక్తిని పొందవచ్చును. ఈ విధముగా అతని మనస్సు ఎన్నడును కృష్ణచైతన్యము నుండి మరలింపబడదు. తత్కారణముగా అతడేమి చేసినను ఆదివిష్ణువైన శ్రీకృష్ణుని కొరకే చేయబడుచుండును. కనుకనే అతడు చేయు కర్మలన్నియు సాంకేతికములుగా యజ్ఞములే యగుచున్నవి. ఎందుకనగా యజ్ఞము పరమపురుషుడైన విష్ణువు లేక శ్రీకృష్ణుని సంతృప్తి కొరకై ఉద్దేశింపబడినది. అట్టి యజ్ఞరూప కర్మల ఫలము లన్నియు నిశ్చయముగా దివ్యత్వము నందు లీనమగుటచే వానిని ఒనరించు వారెవ్వరును కర్మ పరిణామములచే ప్రభావితులు కారు.

### 4.24

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥**

## అనువాదము

**కృష్ణచైతన్యము నందు సంపూర్ణముగా నిమగ్నుడైన మానవుడు భగవద్ధామమును నిస్సందేహముగా పొందితీరును. స్వీకరించునది మరియు అర్పింపబడునది యను రెండును బ్రహ్మమే యైనటువంటి ఆధ్యాత్మిక కర్మల యందు అతడు పూర్తిగా తత్పరుడై యుండుటయే అందులకు కారణము.**

## భాష్యము

కృష్ణచైతన్యముతో కూడిన కర్మలు ఏ విధముగా మానవుని చివరకు ఆధ్యాత్మిక గమ్యమును చేర్చగలవో ఇక్కడ వివరింపబడినది. కృష్ణచైతన్యము నందు వివిధ కార్యక్రమములు గలవు. అవియన్నియును రాబోవు శ్లోకములందు వివరింపబడినను ప్రస్తుతము మాత్రము కృష్ణచైతన్యము నందలి సిద్ధాంతము వివరింపబడినది. భౌతికత్వమున బద్ధుడైన బద్ధజీవి భౌతికభావన యందే కర్మనొనరింప వలసి వచ్చినను,

ఏదియో ఒక విధముగా అట్టి వాతావరణము నుండి అతడు బయటపడవలెను. ఆ విధముగా బద్ధజీవుడు భౌతిక వాతావరణము నుండి బయటపడు విధానమే కృష్ణచైతన్యము. ఉదాహరణకు, పాలపదార్థములను అధికముగా భుజించుట చేత కలిగిన అజీర్ణవ్యాధినే బాధపడు రోగి మరొక పాలపదార్థముచే అనగా పెరుగు వంటివాటి చేత ఆరోగ్యమును తిరిగి పొంద వచ్చును. ఇక్కడ భగవద్గీత యందు చెప్పబడినట్లు భౌతిక భావనలో మునిగిన బద్ధజీవుని కృష్ణచైతన్యముతో బాగుపరచవచ్చును. ఈ విధానము సాధారణముగా యజ్ఞము లేక విష్ణువు లేక శ్రీకృష్ణుని సంతృప్తి కొరకు చేయబడు కర్మగా తెలియబడు చున్నది. భౌతిక జగత్తునందలి కర్మలు ఎంత అధికముగా కృష్ణచైతన్యము నందు లేక విష్ణువు కొరకై నిర్వహింపబడునో అంత అధికముగా వాతావరణము ఆధ్యాత్మికముగా రూపొందగలదు. 'బ్రహ్మము' అను శబ్దమునకు 'ఆధ్యాత్మికము' అని అర్థము. శ్రీకృష్ణభగవానుడే పరబ్రహ్మము. అతని దివ్యశరీర కాంతియే ఆధ్యాత్మిక తేజమైన 'బ్రహ్మజ్యోతి'గా పిలువబడును. స్థితిని కలిగిన ప్రతిదియు ఆ బ్రహ్మజ్యోతి యందే నిలిచియుండును. కాని అట్టిజ్యోతి మాయచే లేక ఇంద్రియ తృప్తిచేత ఆవరింపబడినప్పుడు భౌతికమని పిలువబడును. ఈ భౌతికమైన తెరను వెంటనే కృష్ణచైతన్యముతో తొలగింపవచ్చును. అట్లు కృష్ణచైతన్యముతో అర్పింపబడిన వస్తువును, అట్లు అర్పితమైన దానిని గ్రహించువాడును, గ్రహించు విధానమును, అర్పించువాడును, దాని ఫలితము లన్నియును బ్రహ్మము లేక పరతత్త్వమే యనబడును. 'మాయ'చే ఆవరింపబడినట్లు కనిపించు బ్రహ్మము భౌతిక పదార్థముగా పిలువబడును. బ్రహ్మము కొరకు వినియోగింపబడిన భౌతిక పదార్థము తన ఆధ్యాత్మిక గుణమును తిరిగి పొందును. భ్రాంతిపూరితమైన చైతన్యమును బ్రహ్మముగా (ఆధ్యాత్మిక తత్త్వములోనికి) మార్చుటయే కృష్ణచైతన్య విధానము. అట్టి కృష్ణచైతన్యము నందు మనస్సు పూర్తిగా నెలకొనియుండు స్థితియే 'సమాధి'యని పిలువబడును. అట్టి ఆధ్యాత్మిక స్థితి యందు చేయబడు సర్వము యజ్ఞము లేక భగవానుని కొరకు చేయబడు సేవ యనబడును. కనుక అట్టి ఆధ్యాత్మిక చైతన్యస్థితి యందు అర్పించువాడు. అర్పణము, గ్రహించువారు లేక నిర్వహించు వారు(కర్త) ఫలము లేక అంతిమ లాభము లన్నియు పరబ్రహ్మముతో ఏకమగును. అదియే కృష్ణచైతన్య విధానము.

## 4.25

**దైవమేవాపరే యజ్ఞం యోగిన: పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥**

**అనువాదము**

**కొందరు యోగులు వివిధ యజ్ఞముల ద్వారా దేవతలను లెస్సగా పూజింతురు. మరికొందరు పరబ్రహ్మమనెడి అగ్నియందు హోమమును చేయుదురు.**

**భాష్యము**

పైన వివరించినట్లుగా, కృష్ణచైతన్యమున విధ్యుక్తధర్మ నిర్వహణ యందు నెలకొనినవాడు పరిపూర్ణయోగి లేక ప్రథమ శ్రేణియోగి యని పిలువ బడును. కాని అటువంటి యజ్ఞములనే దేవతార్చనము నందు ఒనరించువారును కొందరు గలరు. మరికొందరు పరబ్రహ్మమును లేక నిరాకార బ్రహ్మమును ఉపాసించు వారు కలరు. ఇట్లు వివిధ వర్గముల ననుసరించి వివిధములైన యజ్ఞములు కలవు. కాని వాస్తవమునకు,

వివిధ కర్తలచే చేయబడు అట్టి యజ్ఞము లందలి వివిధ వర్గములు కేవలము యజ్ఞము యొక్క బాహ్య వర్గీకరణమును మాత్రమే సూచించును. కాని వాస్తవమునకు, యజ్ఞమనగా యజ్ఞుడని పిలువబడు దేవాదిదేవుని అనగా విష్ణువు ప్రీత్యర్థము చేయబడునది. కనుక వివిధములైన యజ్ఞముల నన్నింటిని రెండు ప్రధాన తరగతులుగా విభజింపవచ్చును. ఒకటి లౌకిక సంపదల కొరకై చేయబడు యజ్ఞము, మరొకటి దివ్యజ్ఞాన ప్రాప్తి కొరకు చేయబడు యజ్ఞము. కృష్ణచైతన్యవంతులు దేవాదిదేవుని సంతృప్తి పరచుటకై భౌతిక వస్తువుల నన్నింటిని త్యజింతురు. తాత్కాలిక సుఖమును గోరువారు తమ భౌతికార్థములను ఇంద్రుడు, సూర్యుడు వంటి దేవతలను సంతృప్తి పరచుటకై అర్పింతురు. ఇతరులైన నిరాకారవాదులు (మాయావాదులు) నిరాకారబ్రహ్మము నందు లీనమగుట ద్వారా తమ వ్యక్తిత్వమును అర్పింతురు. భౌతిక జగత్తును పాలించుట మరియు దాని యందు వెలుగు, జలము, ఉష్ణము మున్నగు వాటిని సమకూర్చెందుకు దేవాదిదేవునిచే నియమింపబడిన శక్తివంతులైన జీవులే వివిధ దేవతలు. భౌతిక లాభములందు ఆసక్తి కలిగినవారు అట్టి దేవతలను వైదిక కర్మకాండ ననుసరించి చేయబడు పలు యజ్ఞముల ద్వారా పూజింతురు. అట్టివారు 'బహ్వీశ్వరవాదులు' లేక పలు దేవతలను విశ్వసించువారు అని పిలువబడుదురు. కాని కొందరు దేవతల రూపములను తాత్కాలికములని భావించి పరతత్త్వము యొక్క నిరాకార తత్త్వమును ఉపాసించుచు, బ్రహ్మాగ్ని యందు తమ వ్యక్తిత్వమును ఆహుతి చేసి బ్రహ్మము నందు లీనమగుదురు. అట్టి నిరాకారవాదులు (మాయావాదులు) భగవానుని దివ్యస్వభావమును అవగతము చేసికొనుటకై చేయు తాత్త్విక కల్పనలలో తమ కాలమును వినియోగింతురు. ఈ విషయమున కామ్యకర్మలను చేయువారు తమ భోగానుభవము కొరకు తమకున్న భౌతికార్థములను అర్పింపగా, మాయావాదులు పరబ్రహ్మము నందు లీనమయ్యే ఉద్దేశముతో తమ భౌతిక ఉపాధులను అర్పింతురని మరోమాటలో చెప్పవచ్చును. అట్టి నిరాకారవాదికి పరబ్రహ్మమే యజ్ఞగుండము మరియు వ్యక్తిత్వమే బ్రహ్మాగ్ని యందు అర్పింపబడెడి ఆహుతి. కాని అర్జునుని వంటి కృష్ణచైతన్యవంతుడు కేవలము శ్రీకృష్ణుని ప్రీతికొరకై సర్వమును అర్పించును. ఈ విధముగా అతని భౌతిక సంపదలు మరియు ఆత్మ అన్నియును శ్రీకృష్ణునికి అర్పింపబడును. ఈ విధముగా అతడు ప్రథమశ్రేణి యోగి అయియున్నాడు. కాని అతడు తన వ్యక్తిత్వము నెన్నడును కోల్పోవడు.

## 4.26

**శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీన్విషయానన్య ఇంద్రి యాగ్నిషు జుహ్వతి ॥**

### అనువాదము

**కొందరు నైష్ఠిక బ్రహ్మచారులు శ్రవణాది ఇంద్రియ కార్యములను మరియు ఇంద్రియములను మనోనిగ్రహమనెడి అగ్నియందు హోమము చేయుదురు. మరికొందరు నియమబద్ధులైన గృహస్థులు ఇంద్రియార్థములను ఇంద్రియము లనెడి అగ్నియందు ఆహుతి చేయుదురు.**

**భాష్యము**

బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి అను నాలుగు ఆశ్రమముల మానవులందరును ఉత్తమ యోగులు లేదా ఆధ్యాత్మికులు కాగలుగునట్లుగా మానవ సమాజ విభజన ఉద్దేశింపబడినది. మానవ జన్మ జంతువుల వలె ఇంద్రియానుభవమును అనుభవించుటకు ఉద్దేశింప బడినందున, మానవుడు క్రమముగా ఆధ్యాత్మిక జీవనమందు పరిపూర్ణుడయ్యేడి విధముగా నాలుగు ఆశ్రమములు ఏర్పాటు చేయబడినవి. బ్రహ్మచారులు ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశమున ఇంద్రియ భోగములను త్యజించుట ద్వారా మనస్సును నిగ్రహించుటకు యత్నింతురు. శ్రవణమనునది అవగాహన కొరకు మూల సూత్రమైనందున బ్రహ్మచారి కేవలము కృష్ణచైతన్యమునకు సంబంధించిన వచనములను మాత్రమే శ్రవణము చేయును. అనగా అతడు శ్రీకృష్ణభగవానుని లీలల శ్రవణ కీర్తనము లందు పూర్తిగా నిమగ్నుడై యుండును (హరేర్నామానుకీర్తనమ్). అతడు తన శ్రవణమును 'హరేకృష్ణ హరేకృష్ణ' అను దివ్యశబ్ద తరంగముల శ్రవణము నందే వినియోగించుచు ఇతర భౌతిక ధ్వని తరంగముల నుండి తనను నిగ్రహించుకొనును. అట్లే ఇంద్రియతృప్తి కొరకు కొంతవరకు అనుమతింపబడినట్టి గృహస్థులు కూడా అట్టి అనుమతిని అత్యంత నిగ్రహముతో నిర్వర్తింతురు. మైథునభోగము, మత్తు పదార్థములను సేవించుట, మాంసభక్షణము అనునవి మానవ సంఘము యొక్క సాధారణ స్వభావములు. కాని నియమబద్ధుడైన గృహస్థుడు నియంత్రణలేని మైథున భోగము నందు కాని ఇతర ఇంద్రియ భోగము లందు కాని నిమగ్నుడు కాడు. మైథున జీవనమును నియత్రింపగలిగేది కావుననే ధర్మసమ్మతమైన వివాహము నాగరిక సమాజమంతటా ప్రచారము నొందియున్నది. నియమ బద్ధుడైన గృహస్థుడు ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవితము కొరకు తన సాధారణ స్వభావమైన ఇంద్రియతృప్తిని త్యజించు చున్నందున, అట్టి నియమితమైన అనాసక్తితో కూడిన ఈ సంభోగజీవితము కూడా ఒకవిధమైన యజ్ఞముగనే పరిగణింపబడును.

**4.27**

**సర్వాణీన్ద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।**
**ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥**

**అనువాదము**

**ఇంద్రియ, మనోనిగ్రహము ద్వారా ఆత్మానుభవమును సాధించుట యందు ఆసక్తి గలవారు కొందరు ఇంద్రియ కర్మలను మరియు ప్రాణవాయువు కర్మలను మనోనియమమనెడి అగ్నియందు ఆహుతులుగా అర్పింతురు.**

**భాష్యము**

ఇందులో పతంజలిచే ప్రతిపాదింపబడిన యోగపద్ధతి సూచింపబడినది. పతంజలి యోగసూత్రము లందు ఆత్మ 'ప్రత్యగాత్మ'గా మరియు 'పరాగాత్మ'గా చెప్పబడినది. ఆత్మ ఇంద్రియతృప్తి పట్ల ఆసక్తిని కలిగియున్నంత వరకు 'పరాగాత్మ'గా పిలువబడును. కాని అట్టి ఆత్మ ఇంద్రియతృప్తి ఆసక్తిని విడిచి నంతటనే 'ప్రత్యగాత్మ'గా పిలువబడును. ఆత్మదేహము నందలి పది రకములైన వాయువులచే ప్రభావితమగుచుండును. దీనిని ప్రాణాయామము ద్వారా అనుభూతి పొందవచ్చును. దేహము నందలి వాయువులు నియత్రింపబడి భౌతికాసక్తుల నుండి ఆత్మ శుద్ధిపడుటకు

ఎట్లు తోడ్పడగలదో తెలిపెడి సాంకేతిక విధానమును, మానవునకు ఈ పతంజలి యోగసిద్ధాంతము ఉపదేశించును. ఈ యోగపద్ధతి ననుసరించి 'ప్రత్యగాత్మ'యే చరమ లక్ష్యము. అట్టి 'ప్రత్యగాత్మ' భౌతిక కర్మల నుండి విరమింపబడును. కర్ణములు శ్రవణము నందు, నేత్రములు దృశ్యము నందు, నాసిక వాసన చూచుట యందు, జిహ్వ రుచిచూచుట యందు, హస్తములు స్పర్శయందు లగ్నమయ్యేడి విధముగా ఇంద్రియము లన్నియు ఇంద్రియ విషయము లందు లగ్నమై ఆత్మకు అన్యమైన బాహ్య కార్యములందు నెలకొనుటకు తోడ్పడును.అవి 'ప్రాణవాయువు' కార్యములుగా చెప్పబడును. 'అపానవాయువు' అధోముఖముగా(క్రిందకు) ప్రసరించును. 'వ్యానవాయువు' సంకోచ, వ్యాకోచ (సంకోచించుటకును, విస్తరించుటకును) ములకు కారణమగును. 'సమానవాయువు' సమానత్వమును నెలకొల్పును. 'ఉదానవాయువు' ఊర్ధ్వముఖముగా(పైకి) ప్రసరించును. ఎవరైనను జ్ఞానప్రకాశమును పొందినపుడు వీటినన్నింటిని ఆత్మానుభూతి అన్వేషణలో వినియోగింతురు.

### 4.28

**ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే।**

**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయ: సంశితవ్రతా: ॥**

**<u>అనువాదము</u>**

**కఠిన వ్రతములను పాటించుచు కొందరు తమ సంపదలను అర్పించుట ద్వారా, మరికొందరు తీవ్ర తపోనియమములను ఆచరించుట ద్వారా, అష్టాంగయోగ విధానమును అనుసరించుట ద్వారా లేదా దివ్య జ్ఞానాభివృద్ధికై వేదాధ్యయనము నొనరించుట ద్వారా జ్ఞానప్రకాశమును పొందుదురు.**

**<u>భాష్యము</u>**

ఈ యజ్ఞములను వివిధ భాగములుగా విభజింపవచ్చును. పలు విధములైన దానధర్మముల రూపములో తమ సంపదలను త్యాగము చేయువారు కొందరు గలరు. భారతదేశము నందు ధనికులైన వర్తకులు లేదా రాజవంశీయులు ధర్మశాలలు, అన్నక్షేత్రములు, అతిథిశాలలు, అనాథాలయములు, విద్యాపీఠములు వంటి పలు విధములైన ధార్మికసంస్థలను స్థాపించుచుందురు. అదేవిధముగా, ఇతర దేశాములందు కూడా పేదలకు అన్నము, విద్య వైద్య సౌకర్యములను ఉచితముగా కల్పించు ధర్మసంస్థలు, వైద్యశాలలు, వృద్ధాశ్రమములు అనేకము కలవు. ఇటువంటి ధార్మిక కర్మలన్నియును 'ద్రవ్యమయ యజ్ఞము'లుగా పిలువ బడును. మరికొందరు ఉన్నత జీవన ప్రాప్తి కొరకు లేదా ఉన్నత లోకములకు ఉద్ధరింపబడుట కొరకు 'చంద్రాయనము' మరియు 'చాతుర్మాస్యము' వంటి పలురకములైన కఠిన వ్రత నియమములను, తపస్సులను స్వచ్ఛందముగా స్వీకరింతురు. ఈ విధానములందు నియమ నిబంధనలతో కూడిన జీవితమును గడుపుట కొరకు తీవ్రవ్రతములను అవలంబింపవలసి వచ్చును. ఉదాహరణకు, 'చాతుర్మాస్య' దీక్షయందు మానవుడు నాలుగు నెలలు (జూలై నుండి అక్టోబరు) గడ్డమును తొలగించుకొనడు. కొన్నిరకముల ఆహారపదార్థములను భుజింపక ఏకభుక్త ముండును. గృహమును విడిచి వెళ్ళడు. ఇట్టి జీవిత సుఖమును త్యాగము చేయునటు వంటివి 'తపోమయ యజ్ఞము'లుగా పిలువబడును. ఇంకను మరికొందరు బ్రహ్మము నందు లీనముకాగోరి పతంజలి

యోగవిధానము నందు గాని, హఠయోగ'ము లేదా 'అష్టాంగయోగ'ము నందు గాని (సిద్ధులను కోరి) నెలకొని యుందురు. మరికొందరు వివిధములైన తీర్థయాత్ర ప్రదేశములను దర్శింతురు. ఈ అభ్యాసము లన్నియు భౌతిక ప్రపంచము నందు ఏదియో ఒక సిద్ధిని కోరి చేయబడు 'యోగయజ్ఞ'ములు. మరికొందరు ఉపనిషత్తులు, 'వేదాంత సూత్రము'ల వంటి వేదశాస్త్రములను లేదా సాంఖ్యజ్ఞానమును అధ్యయనము చేయుటయందు నెలకొందురు. అవియన్నియును 'స్వాధ్యాయ యజ్ఞములు' లేక అధ్యయన యజ్ఞము నందు నెలకొనుట యనబడును. ఈ విధముగా యోగులందరును అనేక రకములైన యజ్ఞములందు శ్రద్ధగా నెలకొని ఉన్నత జీవన స్థితి కొరకు అన్వేషింతురు. కాని భగవానుని ప్రత్యక్ష సేవయై యున్నందున కృష్ణచైతన్య మనునది వీనికి భిన్నమైనది. దానిని పైన తెలుపబడిన ఏ విధమైన యజ్ఞముల చేతను పొందజాలరు. కేవలము భగవానుని మరియు అతని ప్రామాణిక భక్తుల కృపచేతనే దానిని పొందవచ్చును. కనుకనే కృష్ణచైతన్యము దివ్యమైనది.

## 4.29

**అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే పానం తథాపరే ।**

**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణా: ।**

**అపరే నియతాహారా: ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ॥**

### అనువాదము

**ప్రాణాయామము ద్వారా సమాధి యందు నిలువగోరు ఇంకొందురు ప్రాణమును అపానము నందు మరియు అపానమును ప్రాణము నందు అర్పింప యత్నించి, శ్వాసను సంపూర్ణముగా బంధించి, అంత్యమున సమాధి మగ్నులగుదురు. మరికొందరు ఆహారమును నియత్రించి ప్రాణవాయువును ప్రాణవాయువు నందే యజ్ఞముగా అర్పింతురు.**

### భాష్యము

శ్వాసను నియత్రించునట్టి ఈ యోగపద్ధతి 'ప్రాణాయామము' అనబడును. ఈ యోగపద్ధతి వివిధములైన ఆసనముల ద్వారా 'హఠయోగ' పద్ధతి నందలి ప్రారంభదశలో అభ్యసింపబడును. ఇంద్రియ నిగ్రహము కొరకు మరియు ఆధ్యాత్మికానుభూతి నందు పురోగతి సాధించుట కొరకు ఈ పద్ధతు లన్నియును ఉద్దేశింపబడినవి. ఈ అభ్యాసమున దేహములందలి వాయు చలన మార్గములను నియంత్రించి, వాటిని వాటి విరుద్ధదశలో ప్రసరింపజేయుట ఈ యోగపద్ధతి యందు యత్నింపబడును. 'అపానవాయువు' అధోముఖముగా (క్రిందికి) ప్రసరింపగా, 'ప్రాణవాయువు' ఊర్ధ్వముగా (పైకి) ప్రసరించును. ఈ రెండు వాయువులు విరుద్ధ దశలలో ప్రసరింపగా, చివరికి 'పూరక' స్థితియందు తటస్థములగునట్లుగా 'ప్రాణాయామ యోగి' ప్రయత్నించును. ఉచ్ఛ్వాసమును నిశ్వాసము నందు అర్పించుట యనునది 'రేచకము'గా పిలువబడును. ప్రాణాపాన వాయువుల చలనము సంపూర్ణముగా స్తంభించినప్పుడు యోగి 'కుంభక యోగము' నందున్నట్లుగా చెప్పబడును. అట్టి 'కుంభక యోగము' ద్వారా ఆధ్యాత్మిక జీవన పరిపూర్ణత్వము కొరకై మానవుడు ఆయుర్వృద్ధిని సాధింప వచ్చును. వివేకవంతుడైన యోగి మరొక జన్మకై వేచియుండక ఈ జన్మము నందే పరిపూర్ణత్వమును సాధించుట యందు ఆసక్తుడై యుండును. దానికొరకై యోగి 'కుంభకయోగము' ద్వారా జీవిత పరిమాణమును అనేక సంవత్సరములకు వృద్ధి చేసికొనును. కాని కృష్ణచైతన్యవంతుడు

ఎల్లప్పుడు శ్రీకృష్ణభగవానుని దివ్య సేవయందు నెలకొని యున్నందున సహజముగానే ఇంద్రియములను నియంత్రించినవాడగును. అతని ఇంద్రియములు ఎల్లప్పుడు శ్రీకృష్ణుని సేవ యందు నెలకొని యున్నందున అవి ఇతర కర్మలలో నెలకొనుటకు అవకాశముండదు. కనుక జీవితాంతమున అట్టిభక్తుడు సహజముగానే శ్రీకృష్ణుని ధామమునకే చేర్చబడును. కనుక అతడు జీవిత పరిమాణమును పొడిగించు యత్నములను ఎన్నడును చేయడు. భగవద్గీత(14.26)యందు తెలిపినట్లుగా అతడు శీఘ్రమే ముక్తస్థితికి చేర్చబడును:

మాం చ యో వ్యభిచారేణ భక్తియోగేన సేవతే
స గుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే

"భగవానుని అనన్యమైన భక్తియుక్త సేవ యందు నెలకొనినవాడు భౌతిక ప్రకృతి గుణములను అధిగమించి వెంటనే ఆధ్యాత్మిక స్థితికి ఉద్ధరింపబడును." కృష్ణచైతన్య వంతుడు అట్టి ఆధ్యాత్మిక స్థితిలోనే జీవితము నారంభించి అట్టి చైతన్యము నందే నిరంతరము కొనసాగును. కనుక పతనమనెడి ప్రశ్నయే ఉదయింపదు. చివరికి ఎట్టి ఆలస్యము లేకుండా శీఘ్రమే అతడు భగవద్ధామమును చేరును. కేవలము కృష్ణప్రసాదమును గ్రహించుట ద్వారా మానవుడు అప్రయత్నముగానే ఆహారమును నియత్రించిన వాడగును. అట్టి ఆహారనియంత్రణ ఇంద్రియ నిగ్రహమునకు ఎంతగానో తోడ్పడగలదు. అట్టి ఇంద్రియ నిగ్రహము లేనిదే భౌతిక భవబంధముల నుండి ముక్తిని సాధించుటకు అవకాశమే లేదు.

## 4.30

**సర్వే ప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషా: ॥**
**యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్ ।**

### అనువాదము

**యజ్ఞప్రయోజనము నెరిగిన ఈ కర్తలందరును పాపఫలముల నుండి శుద్ధులగుదురు. అట్టి యజ్ఞఫలమనెడి అమృతమును ఆస్వాదించిన వారు సనాతన ధామము వైపునకు పురోగమింతురు.**

### భాష్యము

పైన తెలుపబడిన వివిధ యజ్ఞముల(ద్రవ్యమయ యజ్ఞము, స్వాధ్యాయ యజ్ఞము, యోగయజ్ఞము) వివరణను బట్టి ఇంద్రియ నిగ్రహమే వాటన్నింటి పరమలక్ష్యమని తెలియచున్నది. ఇంద్రియతృప్తియే భవబంధమునకు మూల కారణము. కనుకనే ఇంద్రియతృప్తి నుండి విడివడినట్టి భిన్న స్థితి యందు నెలకొననిదే ఎవ్వరును సంపూర్ణ జ్ఞానమును మరియు ఆనందములతో (సచ్చిదానందము) కూడినట్టి శాశ్వతస్థితికి ఉద్ధరింపబడు అవకాశమే లేదు. అట్టి స్థితి సనాతన జగత్తు నందు (పరబ్రహ్మకాశమున) గలదు. పైన పేర్కొనబడిన యజ్ఞము లన్నియును, భౌతిక జీవితపు పాపఫలముల నుండి శుద్ధినొందుటకు మానవునకు తోడ్పడును. జీవితము నందలి ఇట్టి పురోగతి ద్వారానే మానవుడు ఈ జీవితము నందు సుఖమును మరియు సంపదలను పొందుటయే కాకుండ, చివరికి నిరాకార బ్రహ్మము నందు లీనమగుట ద్వారా కాని లేదా దేవాదిదేవుడైన

శ్రీకృష్ణునితో సాంగత్యము పొందుట ద్వారా కాని శాశ్వతమైన భగవద్ధామమును ప్రవేశింపగలడు.

## 4.31

**నాయం లోకో స్త్యయజ్ఞస్య కుతో న్య: కురుసత్తమ ॥**

**అనువాదము**

**ఓ కురువంశశ్రేష్ఠుడా! యజ్ఞమును నిర్వహింపకుండా ఎవరును ఈ లోకమున గాని ఈ జన్మము నందు గాని ఆనందముగా జీవింపలేరు. అట్టియెడ ఇక తరువాతి జన్మమును గూర్చి వేరుగా చెప్పనేల?**

**భాష్యము**

జీవుడు ఎటువంటి భౌతికస్థితి యందున్నను తన నిజస్థితి పట్ల అజ్ఞానమును కలిగియుండును. అనగా, మన పాపజన్మల ఫలముల కారణముగానే భౌతిక జీవిత మేర్పడుచున్నది. పాపజన్మమునకు అజ్ఞానమే కారణము. అట్టి భౌతిక బంధములతో జీవనము కొనసాగించుటకు పాపజీవితమే కారణము. భవబంధము నుండి విముక్తి పొందుటకు మానవ రూపమైన జీవితమొక్కటే సరియైన సాధనము. కనుకనే వేదములు దానిని సాధించుటకు ధర్మము, అర్థము, నియమిత ఇంద్రియతృప్తి, చివరికి దు:ఖపూరితస్థితి నుండి సంపూర్ణముగా విముక్తి యనెడి మార్గములను చూపుట ద్వారా మనకు ఒక అవకాశము నొసుగు చున్నవి. ధర్మమార్గము (లేక పైన తెలుపబడిన వివిధ యజ్ఞనిర్వహణలు) సహజముగానే మన సమస్త ఆర్థిక సమస్యలను పరిష్కరింపగలదు. జనాభా పెరుగుదల అధిక మైనను యజ్ఞనిర్వహణము ద్వారా సమృద్ధిగా ఆహారము, పాలు మున్నగునవి లభింపగలవు. దేహము చక్కగా పోషింప బడినప్పుడు సహజముగానే ఇంద్రియ భోగానుభవ భావము కలుగును. కనుకనే వేదములు నియమిత ఇంద్రియ తృప్తి కొరకై పవిత్ర వివాహపద్ధతిని నిర్దేశించుచున్నవి. తద్ద్వారా మానవుడు క్రమముగా భౌతిక బంధము నుండి విముక్తుడై ఉన్నతస్థితికి ఉద్ధరింపబడును. భగవానునితో సాంగత్యమును పొందుటయే అట్టి ముక్తజీవిత స్థితియందలి అత్యున్నత పరిపూర్ణత్వము. ఇదివరకే వివరించినట్లు, అట్టి పరిపూర్ణత్వము యజ్ఞాచరణము ద్వారానే లభింపగలదు. అట్లు వేదముల ననుసరించి, యజ్ఞములను నిర్వహించుట యందు మానవుడు ఆసక్తుడు కానిచో, ఈ జీవితము నందు సుఖమును ఊహింపలేడు. ఇక ఇతర దేహము నందు, ఇతర లోకములందు గల సుఖమును గూర్చి చెప్పేదేమున్నది? వివిధయజ్ఞములను నిర్వహించువారికి అమితానందమును కలిగించుటకు స్వర్గలోకములందు వివిధ ప్రమాణములలో భౌతిక సుఖములు గలవు. కాని కృష్ణచైతన్య అభ్యాసము ద్వారా ఆధ్యాత్మిక లోకములకు ఉద్ధరింప బడుటయే మానవునికి అత్యున్నతమైన ఆనందమై యున్నది. కనుకనే కృష్ణచైతన్యముతో కూడిన జీవితము మాత్రమే సమస్త భౌతిక జీవన సమస్యలకు పరిష్కారమై యున్నది.

**4.32**

**ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రాహ్మణో ముఖే ।**

**కర్మజాన్ విద్ధితాన్ సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥**

**<u>అనువాదము</u>**

**ఈ వివిధ యజ్ఞము లన్నియును వేదములచే ఆమోదింపబడినవి మరియు అవియన్నియును వివిధ రకములైన కర్మలనుండి ఉద్భవించినవి. వానిని యథార్థ రూపమున ఎరుగుట ద్వారా నీవు ముక్తిని పొందగలవు.**

**<u>భాష్యము</u>**

ఇంతకుమునుపు చర్చింపబడినట్లు వివిధ కర్తలకు అనుగుణముగా వివిధములైన యజ్ఞములు వేదములందు పేర్కొనబడినవి. మానవులు దేహాత్మ బుద్ధిభావనలో అత్యధికముగా ఆసక్తులై యుండుటచేత వారు దేహముతో గాని, మనస్సుతో గాని, బుద్ధితో గాని, కర్మనొనరించునట్లుగా ఈ యజ్ఞములు ఏర్పరుపబడినవి. అంత్యమున దేహము నుండి విముక్తిని కలిగించుటకై అవియన్నియును ఉపదేశింపబడి యున్నవి. ఈ విషయము ఇక్కడ స్వయముగా భగవానుని ముఖత: నిర్ధారింపబడినది.

**4.33**

**శ్రేయాన్ ద్రవ్యమయాద్ యజ్ఞాత్ జ్ఞానయజ్ఞ: పరన్తప ।**

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥**

**<u>అనువాదము</u>**

**ఓ పరంతపా! జ్ఞానయజ్ఞము ద్రవ్యయజ్ఞము కంటెను మహత్తరమైనది.ఓ పార్థా! కర్మయజ్ఞము లన్నియును చివరికి దివ్యజ్ఞానము నందే పరిసమాప్తి నొందును.**

**<u>భాష్యము</u>**

పరిపూర్ణ జ్ఞానస్థితిని సాధించి తద్వారా భౌతిక క్లేశముల నుండి ముక్తి నొంది చివరికి ప్రేమయుక్త భగవత్సేవ యందు (కృష్ణచైతన్యము నందు) నెలకొనుటయే సర్వయజ్ఞముల ముఖ్యోద్దేశము. అయినను, ఈ విధములైన యజ్ఞకార్యములకు సంబంధించిన విషయమున ఒక రహస్యము గలదు. ప్రతియొక్కరు ఈ రహస్యము తప్పక ఎరుగవలెను. కనుక కర్త యొక్క ప్రత్యేక శ్రద్ధ ననుసరించి యజ్ఞములు కొన్నిమార్లు వివిధ రూపములను దాల్చుచుండును. కర్తకు గల ప్రత్యేక శ్రద్ధ దివ్యజ్ఞానస్థితికి చేరినప్పుడు,అట్టి యజ్ఞకర్త జ్ఞాన రహితముగా ద్రవ్యయజ్ఞములను అనగా సంపదలను త్యాగము చేయు వారి కంటెను అధిక అభివృద్ధి పొందినవాడుగా పరిగణింపబడును. ఎందుకనగా జ్ఞానప్రాప్తి కలుగనిచో యజ్ఞములు భౌతికస్థితికే చెంది ఎట్టి ఆధ్యాత్మిక లాభమును కలిగింపజాలవు. అట్టి నిజమైన జ్ఞానము చివరికి దివ్యజ్ఞానము యొక్క ఉత్కృష్ట స్థితియైన కృష్ణచైతన్యము నందు పరిసమాప్తి నొందును. జ్ఞానవృద్ధిలేకుండా చేయబడు యజ్ఞములు కేవలము భౌతిక కర్మలే కాగలవు. కాని అవి దివ్యజ్ఞాన స్థితికి చేర గలిగినపుడు అట్టి కార్యకలాపములన్నియు పూర్తి ఆధ్యాత్మికస్థితికి చేరగలవు. చైతన్యము

నందలి భేదముల ననుసరించి యజ్ఞకర్మలు కొన్నిమార్లు 'కర్మకాండ'గా (కామ్యకర్మలు) మరికొన్నిసార్లు 'జ్ఞానకాండ' (పరమ సత్యాన్వేషణకు కావలసిన జ్ఞానముగ)గా పిలువబడును. వాటి పరమలక్ష్యము జ్ఞానమగుట అత్యంత శ్రేష్ఠము.

## 4.34

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శిన: ॥**

## అనువాదము

**ఆధ్యాత్మికాచార్యుని సమీపించి సత్యము నెరుగుట కొరకై యత్నింపుము. వినయపూర్వకముగా ప్రశ్నించి, అతనికి సేవ చేయుము. ఆత్మదర్శులు తత్వమును దర్శించిన వారగుటచే నీకు జ్ఞానమును ఉపదేశింతురు.**

## భాష్యము

ఆత్మానుభూతి మార్గము నిస్సందేహముగా కఠినమైనది. కనుకనే తననుండియే వచ్చుచున్నట్టి ప్రామాణిక గురుశిష్య పరంపరలోని ఆధ్యాత్మికాచార్యుని సమీపింపమని భగవానుడు ఉపదేశించు చున్నాడు. గురుశిష్య పరంపర సిద్ధాంతమును అనుసరింపకుండ ఎవ్వరును ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుడు కాజాలడు. శ్రీకృష్ణభగవానుడే పరమాచార్యుడు. అట్టి భగవానుని నుండి వచ్చుచున్న పరంపరలో నున్నవాడే ఆ ఆదిదేవుని ఆదేశమును యథాతథముగా తన శిష్యులకు అందజేయగలడు. మూర్ఖులైనట్టి కపటులు చేయునట్లు తమ ఊహాగానాల ద్వారా ఎవరును ఆధ్యాత్మికానుభూతిని పొందజాలరు. "ధర్మం తు సాక్షాత్ భగవత్ప్రణీతమ్" – ధర్మమార్గము భగవానునిచే స్వయముగా నిర్దేశింపబడినది" అని శ్రీమద్భాగవతము (6.3.19) తెలుపుచున్నది. కనుక మానసిక ఊహాగానాలు లేదా శుష్కవాదనలు మానవుని సరియైన మార్గము వైపునకు నడుపజాలవు. అట్లే స్వతంత్రముగా చేయబడు శాస్త్రాధ్యయనము చేత ఎవ్వరును ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధింపలేరు. కనుక ప్రతియొక్కరు జ్ఞానమును పొందుటకు తప్పక ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని సమీపించి సంపూర్ణ శరణాగతిని పొంది, ఆయనను ఎట్టి అహంకారమును లేకుండా శ్రద్ధతో అల్పసేవకుని వలె సేవింపవలెను. వాస్తవమునకు ఆత్మదర్శియైన ఆధ్యాత్మికాచార్యుని సంతృప్తియే ఆధ్యాత్మిక జీవన పురోభివృద్ధికి గల రహస్యము. శరణాగతి మరియు పరిప్రశ్నల సమ్మేళనమే ఆధ్యాత్మిక అవగాహనకు తగిన సాధనములు. ఎందుకనగా, శరణాగతి మరియు సేవ లేకుండ ఆధ్యాత్మికాచార్యుని ప్రశ్నించు ప్రశ్నలు నిష్ప్రయోజనములు మరియు శక్తిహీనములు కాగలవు. ప్రతియొక్కరు ఆధ్యాత్మికాచార్యుడు చేయు పరీక్షలో ఉత్తీర్ణుడు కావలెను. సహజముగానే శిష్యుని యందలి శ్రద్ధను గమనించిన ఆధ్యాత్మికాచార్యుడు వెంటనే అతనికి నిజమైన ఆధ్యాత్మిక అవగాహన కలుగునట్లుగా ఆశీర్వదించును. ఈ శ్లోకమున గ్రుడ్డిగా అనుసరించుట మరియు వ్యర్థ ప్రశ్న లనునవి నిరసింపబడినవి. ప్రతియొక్కరు ఆధ్యాత్మికాచార్యుని నుండి వినయముతో కూడి శ్రవణమును చేయుటయే కాకుండ వినయము, సేవ, పరిప్రశ్నలతో జ్ఞానము యొక్క స్పష్టమైన అవగాహనను కూడ పొందవలసియున్నది. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుడు తన స్వభావరీత్యా సహజముగానే శిష్యునిపట్ల దయను కలిగియుండును. కనుక శిష్యుడు అణుకువతో సదా

సేవ చేయుట కొరకై సిద్ధపడినపుడు అతని ప్రశ్నలు మరియు జ్ఞానబోధనల యొక్క ఆదాన ప్రదానము లు పూర్ణత్వము నొందగలవు.

## 4.35

**యద్ జ్ఞాత్వా న పునర్మోహమేవం యాస్యసి పాణ్డవ।**
**యేన భూతాన్యశేషాణి ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥**

**అనువాదము**

**ఆత్మదర్శియైన మహాత్ముని నుండి యథార్థ జ్ఞానమును పొందినపుడు మరల నీవెప్పుడును ఇట్టి మోహమునకు గురికావు. అట్టి జ్ఞానముచే సమస్త జీవులు పరమాత్మ అంశలేయనియు లేక వేరుమాటలో అవియన్నియును నాకు సంబంధించినవిగా తెలిసికొందువు.**

**భాష్యము**

ఆత్మానుభూతిని పొందిన మహాత్ముని నుండి కాని, తత్త్వజ్ఞుల నుండి కాని జ్ఞానమును పొందుట వలన కలిగెడి ఫలితము జీవులన్నియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అంశలేనని ఎరుగ గలుగుటయే. శ్రీకృష్ణుని కంటెను భిన్నమైన జీవనస్థితి గలదను భావనయే 'మాయ' (మా : కాదు; యా : ఇది)యనబడును. కొందరు మాకు శ్రీకృష్ణునితో ఎట్టి సంబంధము లేదనియు, అతడు కేవలము ఒక చారిత్రిక పురుషుడు మాత్రమేననియు మరియు పరతత్త్వమనునది నిరాకార బ్రహ్మమేననియు భావింతురు. కాని వాస్తవమునకు భగవద్గీత యందు చెప్పబడినట్లు, నిరాకార బ్రహ్మము శ్రీకృష్ణుని దేహకాంతియై యున్నది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే అన్నింటికిని మూలకారణము. 'బ్రహ్మ సంహిత' యందు శ్రీకృష్ణుడు దేవాది దేవుడనియు, సర్వకారణములకు కారణుడనియు చెప్పబడినది. లక్షలకొలది అవతారములు కూడ అతని విభిన్న విస్తరణములై యున్నవి. అట్లే, జీవులు కూడ శ్రీకృష్ణుని విస్తారములే. శ్రీకృష్ణుడు అట్టి భిన్న విస్తారములందు తన ప్రత్యేక స్థితిని కోల్పోవునని మాయావాద తాత్త్వికులు తప్పుగా భావింతురు. వాస్తవమునకు, అట్టి భావము స్వభావరీత్యా భౌతికమైనది. భౌతిక ప్రపంచమున ఏదైన వస్తువును భాగములుగా విభజించినచో అది తన మూలస్వరూపమును కోల్పోవుననుట మనకు అనుభవ సిద్ధమైన విషయము. కాని మాయావాదులు పరత్త్వమనగా ఒకటిని ఒకటితో కలిపినప్పుడు ఒకటితో సమానమనియు, ఒకటి నుండి ఒకటిని తీసివేసినను ఒకటితో సమానమనియు ఎరుగజాలకున్నారు. కాని ఆధ్యాత్మికి జగత్తునకు సంబంధించిన సమస్తము ఈ విధముగనే యుండును.

పరత్త్వమును గూర్చిన తగిన జ్ఞానము లేనందున మనము మాయచే కప్పబడి శ్రీకృష్ణునితో మనకెట్టి సంబంధము లేదని భావింతుము. శ్రీకృష్ణుని విభిన్నాంశలమైనను మనము అతని నుండి భిన్నులము కాము. మనము అన్ని విధముల శ్రీకృష్ణునితో సంబంధము గలవారమే. జీవుల దేహభేదములు మాయయే గాని వాస్తవము కాదు. మనమందరము శ్రీకృష్ణుని సంతృప్తిపరచుట కొరకే ఉద్దేశింపబడి యున్నాము. 'మాయ' కారణముననే అర్జునుడు తన బంధువులతో గల తాత్కాలిక దేహసంబంధము శ్రీకృష్ణునితో తనకు గల నిత్య ఆధ్యాత్మిక సంబంధము కంటెను మిక్కిలి ప్రధానమైనదిగా భావించెను. శ్రీకృష్ణుని నిత్య దాసునిగా, జీవుడెన్నడును శ్రీకృష్ణుని నుండి వేరుకాడనియు మరియు శ్రీకృష్ణుని నుండి తాను స్వతంత్రుడనను జీవుని భావన 'మాయ' అని

ఉపదేశించుట కొరకే భగవద్గీత ఉద్దేశింపబడినది. భగవానుని నిత్యాంశలుగా జీవులు నిర్వహింప వలసిన ప్రయోజనమొకటి గలదు. అయినను జీవులు ఆ ప్రయోజనమును అనాదికాలముగా విస్మరించి దేవతలు, మానవులు, మృగములు వంటి భిన్న దేహములలో నెలకొల్పబడియుండిరి. భగవానుని దివ్యసేవను విస్మరించుట చేతనే అట్టి వివిధ దేహములు కలుగుచున్నవి. కాని మానవుడు కృష్ణచైతన్యము ద్వారా భగవానుని దివ్యసేవ యందు నేలకొనినంతనే ఇట్టి భ్రాంతి నుండి విముక్తుడగును. కేవలము అట్టి శుద్ధజ్ఞానమును ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని ద్వారానే పొందగలడు. దానితో జీవునకు శ్రీకృష్ణునితో సమానమను భ్రాంతి తొలగిపోవును. పరమాత్మడు, శ్రీకృష్ణుడు సమస్త జీవులకు పరమాశ్రయుడనియు మరియు అట్టి ఆశ్రయమును విడిచి జీవులు ప్రకృతిచే భ్రాంతినొందుట చేత జీవులు తమకుతాము స్వతంత్రులుగా భావించుచున్నారనియు ఎరుగ గలుగుటయే వాస్తవమునకు పరిపూర్ణ జ్ఞానము. అ కారణముననే వారు భౌతిక దేహబుద్ధిచేత శ్రీకృష్ణుని విస్మరించుచున్నారు. అట్టి మాయామోహిత జీవులు కృష్ణచైతన్యము నందు నెలకొనినప్పుడు, ముక్తిమార్గము నందు నెలకొనినట్టి వారని శ్రీమద్భాగవతము(2.10.6) నిర్ధారించు చున్నది : "ముక్తిర్హిత్వాన్యథా రూపం స్వరూపేణ వ్యవస్థితి:"- శ్రీకృష్ణభగవానుని నిత్యదాసునిగా(కృష్ణచైతన్యముతో) జీవుడు తన నిజ స్వరూపస్థితి యందు నిలిచియుండుటయే ముక్తి యనబడును.

## 4.36

**అపి చేదసి పాపేభ్య: సర్వేభ్య: పాపకృత్తమ: ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥**

### అనువాదము

**ఒకవేళ నీవు పాపాత్ములందరిలోను పరమపాపిగా భావింపబడినను దివ్య జ్ఞానమనెడి పడవ యందు స్థితుడవైనచో దు:ఖసముద్రమును దాటగలవు.**

### భాష్యము

శ్రీకృష్ణుని సంబంధమున తన నిజస్తితికి గల సంబంధమును మానవుడు సరిగా అవగతము చేసుకొనుట పరమోత్కృష్టమైనది. అది అజ్ఞానసాగరము నందు జరిగెడి జీవనసంఘర్షణ నుండి అతనిని వెంటనే ఉద్ధరించును. ఈ భౌతిక జగత్తు కొన్నిమార్లు అజ్ఞాన సాగరముగను మరికొన్నిమార్లు దావానలముతో చుట్టబడిన అరణ్యముగను వర్ణింపబడును. ఎంతటి ప్రవీణుడైన ఈతగానికైనను సముద్రము నందు ప్రాణరక్షణము కష్టమైనదే. ఎవరైనను ముందుకువచ్చి అతనిని ఆ సముద్రము నుండి పైకి తీసి రక్షించినచో అట్టి వానిని గొప్ప రక్షకుడని భావింప వచ్చును. దేవాదిదేవుని నుండి గ్రహింపబడిన పరిపూర్ణ జ్ఞానము ముక్తికి మార్గము. అట్టి కృష్ణచైతన్యమను నౌక మిక్కిలి సరళమైనను మహోన్నతమైనది.

## 4.37

**యథైధాంసి సమిద్ధో గ్నిర్భస్మసాత్కురుతే ర్జున ।**

**జ్ఞానాగ్ని: సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా ॥**

**అనువాదము**

**ఓ అర్జునా! మండుచున్న అగ్నికట్టెలను బూడిదగా చేయునట్లు, జ్ఞానమనెడి అగ్ని భౌతిక కర్మ ఫలముల నన్నింటిని బూడిదగా చేసివేయును.**

**భాష్యము**

ఆత్మ మరియు పరమాత్మ మరియు వాని పరస్పర సంబంధమును గూర్చిన పరిపూర్ణ జ్ఞానము ఇక్కడ అగ్నితో పోల్చబడినది.ఈ అగ్ని పాపఫలములనే కాకుండ పుణ్యకర్మ ఫలములను కూడా కాల్చి బూడిద చేయును. కర్మఫలములలో వివిధ దశలు గలవు: కలుగబోవు ఫలము, ఫలించుచున్న ఫలము, అనుభవించుచున్న ఫలము(సంచిత ఫలము). కాని జీవుని నిజస్థితికి సంబంధించిన జ్ఞానము సర్వమును బూడిద చేయగలదు. మానవుడు సంపూర్ణ జ్ఞానమును పొందినప్పుడు సంచిత, ప్రారబ్ధము వంటి సమస్త కర్మఫలములన్నియు నశించిపోవును. 'బృహదారణ్యకోపనిషత్తు'(4.4.22) నందు ఇట్లు చెప్పబడినది : "ఉభే ఉ హైవైష ఏతే తరత్యమృత: సాధ్వసాధూనీ" - "ఎవరైనను పాపపుణ్య కర్మఫలము లన్నింటిని అధిగమించును."

## 4.38

**న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।**

**తత్స్వయం యోగసంసిద్ధ: కాలేనాత్మని విన్దతి ॥**

**అనువాదము**

**ఈ జగత్తు నందు దివ్య జ్ఞానము వలె పవిత్రము మరియు మహోన్నతమైనది వేరొక్కటిలేదు. అట్టి జ్ఞానము సమస్త యోగముల పరిపక్వఫలము. భక్తియుక్త సేవ యందు పరిపూర్ణత్వమును సాధించినవాడు కాలక్రమమున అట్టి జ్ఞానమును తన యందే అనుభవించును.**

**భాష్యము**

మనము దివ్యజ్ఞానమును గూర్చి ప్రస్తావించునపుడు దానిని ఆధ్యాత్మిక అవగాహనతోనే ఆ కార్యమును చేయుదుము. అట్టిదివ్యజ్ఞానము వలె పవిత్రమైనది. మరియు ఉన్నతమైనది మరొక్కటి లేదు. అజ్ఞానము మన బంధముకును, జ్ఞానము ముక్తికిని కారణములు. భక్తియుక్త సేవ యొక్క పరిపక్వ ఫలమే జ్ఞానము. మానవుడు అట్టి దివ్యజ్ఞానమును పొందినపుడు శాంతిని తన యందే అనుభవించుట చేత దానికొరకు బాహ్యమున వెదుకనవసరము లేదు. మరొకవిధముగా చెప్పవలెనన్న, ఈ జ్ఞానము మరియు శాంతికి పరమలక్ష్యమే కృష్ణచైతన్యము. ఇదియే భగవద్గీత యొక్క తుదివాక్యము.

## 4.39

**శ్రద్ధవాన్ లభతే జ్ఞానం తాత్పర: సంయతేన్ద్రియ: ।**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥**

### అనువాదము

**దివ్యజ్ఞానతత్పరుడైన శ్రద్ధావంతుడు ఇంద్రియములను నిగ్రహించి అట్టి దివ్యజ్ఞానమును పొందుటకు అర్హుడగును. దానిని సాధించి అతడు శీఘ్రముగా పరమశాంతిని పొందును.**

### భాష్యము

శ్రీకృష్ణుని యందు దృఢవిశ్వాసము కలిగిన మానవునికి అట్టి కృష్ణచైతన్య జ్ఞానము లభింపగలదు. కృష్ణచైతన్యము నందు కర్మలాచరించుట చేతనే పరిపూర్ణత్వము సిద్ధించునని భావించువాడు శ్రద్ధావంతు డనబడును. భక్తియుక్త సేవ చేయుట ద్వారాను 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరేరామ హరేరామ రామ రామ హరే హరే' అను మహామంత్ర జపకీర్తనముల ద్వారానే అట్టి శ్రద్ధను పొందవచ్చును. అది మానవహృదయము నందలి భౌతిక మాలిన్యము నంతటిని శుద్ధిచేయును. వీనితోపాటుగా,మానవుడు ఇంద్రియములను కూడ నిగ్రహింపవలెను. శ్రీకృష్ణుని యందు దృఢవిశ్వాసము గలవాడు మరియు ఇంద్రియములను నియంత్రించువాడు కృష్ణచైతన్య జ్ఞానము నందు ఎట్టి జాప్యము లేకుండ సులభముగా పరిపూర్ణత్వమును పొందగలడు.

## 4.40

**అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకో ऽస్తి న పరో న సుఖం సంశయాత్మన: ॥**

### అనువాదము

**అపౌరుషేయములైన శాస్త్రగ్రంథములను సందేహించు అజ్ఞానులు మరియు శ్రద్ధారహితులు భగవత్ జ్ఞానమును పొందజాలక పతనము చెందుదురు. సంశయాత్ములైనవారికి ఈ లోకమున గాని, పరలోకమున గాని సుఖము లేదు.**

### భాష్యము

అధికారములు మరియు ప్రామాణికములు అగు అనేకమైన శాస్ర గ్రంథములలో భగవద్గీత శ్రేష్ఠమైనది. పశుప్రాయులైన మానవులకు ప్రామాణిక శాస్రము లందు శ్రద్ధ గాని, జ్ఞానము గాని ఉండదు. కొందరికి అట్టి శాస్త్రములను గూర్చి కొంత జ్ఞానమున్నను మరియు సందర్భోచితముగా వానినుండి కొన్ని విషయములను ఉదహరింప గలిగినను, వారికి శాస్రవచనముల పై పూర్తి విశ్వాసముండదు. మరికొందరు భగవద్గీత వంటి శాస్త్రగ్రంథముల యెడ శ్రద్ధా విశ్వాసములను కలిగియున్నను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని విశ్వసించుట గాని, అతనిని అర్చించుట గాని చేయరు. అట్టివారు కృష్ణచైతన్యము నందు నెలకొన జాలరు. వారు పతనము చెందుదురు. పైన పేర్కొనబడిన వారందరిలో శ్రద్ధ లేనివారు మరియు సందేహములతో కూడియుండువారు ఎన్నడును ఎట్టి పురోభివృద్ధిని సాధింపలేరు. భగవానుని యందు అతని వాక్కుల యందు శ్రద్ధా

విశ్వాసములు లేనివారు ఈ లోకమున కాని పరలోకమున కాని ఎట్టి శుభములను పొందజాలరు. వారికెట్టి సుఖముండదు. కనుకనే మానవుడు శాస్త్రగ్రంథముల సిద్ధాంతములను శ్రద్ధతో అనుసరించుచు జ్ఞానస్థితికి ఉద్ధరింపబడవలెను. ఈ జ్ఞానమే ఆధ్యాత్మిక అవగాహనతో కూడిన దివ్యస్థితి నందుకొనుటకు తోడ్పడగలడు. అనగా సందేహస్థులకు ఆధ్యాత్మిక ముక్తి విషయమున ఎట్టి స్థానము లేదు. కనుకనే ప్రతియొక్కరు గురుశిష్య పరాంపరానుగతముగా వచ్చుచున్న గొప్ప ఆచార్యుల అడుగుజాడల ననుసరించుచు విజయమును సాధింపవలెను.

## 4.41

**యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।**

**ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనంజయ ॥**

**అనువాదము**

**కర్మఫలముల నన్నింటిని త్యజించి భక్తియోగము నందు వర్తించుచు దివ్య జ్ఞానముచే సందేహములు నశించియున్నవాడు వాస్తవముగా ఆత్మజ్ఞానము నందే స్థితుడైనట్టి వాడు. ఓ ధనంజయా! ఆ విధముగా అతడు కర్మఫలములచే బంధింపబడును.**

**భాష్యము**

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునిచే స్వయముగా బోధింపబడిన భగవద్గీత ఉపదేశముల ననుసరించువాడు దివ్యజ్ఞానము ద్వారా అన్ని సందేహముల నుండి విముక్తుడగును. సంపూర్ణ కృష్ణచైతన్యములో తనను భగవానుని అంశరూపముగా గుర్తించినవాడు అప్పటికే ఆత్మజ్ఞానము నందు స్థితుడై యుండును. కనుకనే అతడు నిస్సందేహముగా కర్మబంధములకు అతీతుడై యుండును.

## 4.42

**తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మన: ।**

**ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత ॥**

**అనువాదము**

**అందుచే అజ్ఞానము వలన నీ హృదయము నందు కలిగిన సందేహములను జ్ఞానఖడ్గముచే ఛేదించి వేయుము. ఓ భారత! యోగసమన్వితుడవై యుద్ధము చేయుటకు లెమ్ము.**

**భాష్యము**

ఈ అధ్యాయము నందు ఉపదేశింపబడిన యోగపద్ధతి 'సనాతన యోగము' లేక జీవునిచే నిర్వహింపబడు నిత్యకర్మలని పిలువబడును. ఈ యోగ విధానము యజ్ఞకర్మలకు సంబంధించిన రెండు విభాగములను కలిగియుండును : అందులో ఒకటి ద్రవ్యమయ యజ్ఞమని(భౌతిక వస్తుత్యాగము) పిలువబడుగా, రెండవది శుద్ధ ఆధ్యాత్మిక కర్మయైనటువంటి ఆత్మజ్ఞానముగా పిలువబడును. ద్రవ్యమయ యజ్ఞము

ఆత్మానుభూతితో అనుసంధింప బడనిచో అది భౌతికకర్మగా పరిణమించును. కాని అట్టి యజ్ఞములను ఆధ్యాత్మిక లక్ష్యముతో లేక భక్తియుక్త సేవతో నిర్వహించువాడు పరిపూర్ణ యజ్ఞమును చేసినవాడగును. ఇక మనము ఆధ్యాత్మిక కార్యకలాపములను గూర్చి పరిశీలించినచో వాటియందు రెండు విభాగములను చూడవచ్చును. అందులో ఒకటి తనను గూర్చి అనగా ఆత్మను ఎరుగుట (స్వీయ సహజ స్థితి) కాగా, రెండవది దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని గూర్చిన సత్యమును ఎరుగుట కాగలదు. భగవద్గీత మార్గమును యథాతథముగా అనుసరించువాడు ఆధ్యాత్మిక జ్ఞానము నందలి ఈ రెండు ముఖ్య విభాగములను సులభముగా తెలిసికొనగలడు. అట్టివానిని ఆత్మ భగవానుని యందలి అంశ యనెడి పరిపూర్ణ జ్ఞానమును సులభముగా లభించును. అట్టివాడు భగవానుని దివ్యకర్మలను సులభముగా అవగతము చేసికొనగలడు కావున అతనికి గల జ్ఞానము లాభదాయకము కాగలదు. ఈ అధ్యాయపు ఆరంభమున భగవానుని దివ్యకర్మలు అతని చేతనే చర్చింపబడినవి. అట్టి గీత బోధనలను అవగాహన చేసికొనినవాడు శ్రద్ధాహీనుడు మరియు భగవానునిచే ప్రసాదింపబడిన కొద్దిపాటి స్వాతంత్ర్యమును దుర్వినియోగపరచు కొనినవాడుగా భావింపబడును. అట్టి బోధనలు లభించిన పిమ్మట కూడ భగవానుడు సత్, చిత్, జ్ఞానస్వరూపునిగా అతని నిజతత్త్వమును తెలిసికొనలేనివాడు నిజముగా మూర్ఖాగ్రేసరుడే. అట్టి అజ్ఞానము కృష్ణచైతన్యము నందిలి నియమములను పాటించుట ద్వారా క్రమముగా తొలగిపోగలదు. వివిధ దేవతల కొరకై చేయబడు వివిధ యజ్ఞముల ద్వారా, పరబ్రహ్మోపాసన ద్వారా, బ్రహ్మచర్యము ద్వారా, నియమిత గృహస్థ జీవనము ద్వారా, యోగము ద్వారా, తపస్సు ద్వారా, భౌతిక సంపదల త్యాగము ద్వారా, వేదాధ్యయనము ద్వారా, వర్ణాశ్రమ ధర్మము ననుసరించుట ద్వారా కృష్ణచైతన్యము జాగృతము కాగలదు. ఇవియన్నియును నియమిత కర్మలపై ఆధారపడి యాగాములుగా పిలువబడును. కాని ఈ కార్యకలాపము లన్నింటిలో ఆత్మానుభూతియే ప్రధానాంశము. కనుక ఆ లక్ష్యసాధనను వాంఛించువాడు భగవద్గీత యొక్క నిజమైన విద్యార్థి(సాధకుడు) కాగలడు. అట్లుగాక శ్రీకృష్ణుని ప్రామాణికత్వమును సందేహించువాడు పతనము చెందును. కనుకనే ఎవరైనను భగవద్గీతను గాని లేక మరో ఇతర ధార్మిక గ్రంథమును గాని ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని సన్నిధిన సేవ మరియు శరణాగతితో అధ్యయనము చేయవలెను. అనాది నుండి అవిచ్ఛిన్నముగా కొనసాగుతూ వచ్చుచున్న గురుశిష్య పరంపర నుండి ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుడు వచ్చును. అనేక లక్షల సంవత్సరములకు పూర్వము సూర్యదేవునకు ఉపదేశింపబడి, తదుపరి అతని ద్వారా ఈ ధరిత్రి యందు వ్యాప్తినొందిన శ్రీకృష్ణభగవానుని ఉపదేశముల నుండి అట్టి ఆచార్యుడు ఏమాత్రము వైదొలగడు. కనుకనే ప్రతియొక్కరు భగవద్గీత మార్గమును గీతయందే తెలుపబడినట్లు అనుసరించుచు, ఇతరులను నిజమైన మార్గము నుండి పెడత్రోవను పట్టించునట్టి స్వార్థపరుల విషయమున జాగరూకత వహింపవలెను. శ్రీకృష్ణభగవానుడు దివ్యపురుషుడు మరియు అతని కర్మలన్నియును నిస్సందేహముగా దివ్యములు. ఈ విషయమును అవగతము చేసికొనినవాడు గీతాధ్యయనపు ఆరంభము నుండియే ముక్తపురుషుడై యుండును.

**శ్రీమద్భగవద్గీత యందలి 'దివ్యజ్ఞానము' అను చతుర్థాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---------

# పంచమాధ్యాయము

# కర్మయోగము – కృష్ణచైతన్యసహితకర్మ

## 5.1

**అర్జున ఉవాచ**
**సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి ।**
**యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితం ॥**

### అనువాదము

**అర్జునుడిట్లు పలికెను : ఓ కృష్ణా! తొలుత నన్ను కర్మత్యాగము చేయమని తెలిపి తిరిగి భక్తి యుక్త కర్మను చేయమని ఆదేశించు చున్నావు. ఈ రెండింటిలో ఏది ఎక్కువ శ్రేయోదాయకమో దయతో నాకు నిశ్చయముగా తెలియ జేయుము.**

### భాష్యము

భగవద్గీత యందలి ఈ పంచామాధ్యాయములో భగవానుడు శుష్కమైన మానసిక కల్పనల కంటెను భక్తితో చేయబడు కర్మ శ్రేయస్కరమని చెప్పుచున్నాడు. భక్తియుక్త సేవ భౌతిక ప్రకృతి గుణములకు అతీతమైనడగుటచే అది మానవుని కర్మఫలముల నుండి విముక్తుని చేయును. కనుక భక్తియుక్త సేవ వాస్తవమునకు మానసిక కల్పనల కంటెను సులభమైనది. ద్వితీయాధ్యాయమున ఆత్మను గూర్చిన ప్రాథమిక జ్ఞానము మరియు అది దేహమునందు బంధింపబడిన విధానము వివరింప బడినది. 'బుద్ధియోగము' లేక భక్తియుక్త సేవ ద్వారా భౌతిక బంధముల నుండి విడివడుట ఎట్లో కూడా ఆ అధ్యాయము నందు వివరింపబడినది. జ్ఞాన స్థితి యందు నెలకొని యున్నవాడు చేయవలసిన ధర్మము లేవియును ఉండవని తృతీయాధ్యాయమున తెలుపబడినది. వివిధ రకములైన కర్మయజ్ఞములు చివరకు దివ్యజ్ఞానము నందే పరిసమాప్తి నొందునని అర్జుననకు శ్రీకృష్ణభగవానుడు చతుర్థాధ్యాయమున బోధించును. అయినను పరిపూర్ణ జ్ఞానమందు స్థితిని కలిగి యుద్ధము చేయమని చతుర్థాధ్యాయపు చివరన భగవానుడు అర్జుననకు ఉపదేశించెను. ఈ విదముగా భక్తియుక్త కర్మ మరియు జ్ఞానముతో కూడిన కర్మ పరిత్యాగముల ప్రాముఖ్యమును శ్రీకృష్ణుడు ఒకేసారి నొక్కిచెబుతూ అర్జునుని భ్రమకు గురిచేసి అతని నిశ్చయమును కలవరపరచెను. జ్ఞానముతో కూడిన కర్మసన్న్యాసమనగా, ఇంద్రియతృప్తి కార్యముల నన్నింటిని విరమించుట యని అర్జునుడు ఎరిగి యుండెను. కాని ఎవరైనను భక్తియుక్త సేవతో కర్మనోనరించినచో, కర్మను విడిచివేయుట ఎట్లగును? మరోమాటలో చెప్పవలెననినా, కర్మ మరియు త్యాగము రెండు పరస్పర విరుద్ధములు. కనుక సన్న్యాసమనగా(జ్ఞానముతో కూడిన త్యాగము) అన్నిరకముల కర్మల నుండి పూర్తిగా విడివడి యుండవలెనని అర్జునుడు భావించెను. పరిపూర్ణ జ్ఞానముతో కూడిన కర్మ ఎట్టి బంధమును కలుగజేయ నందున అది కర్మపరిత్యాగముతో సమానమని అర్జునుడు అవగతము చేసికొన నట్లుగా ఇక్కడ కనిపించుచున్నది. కాబట్టి తాను కర్మలను పూర్తిగా విరమింపవలెనా లేక పరిపూర్ణ జ్ఞానముతో కర్మనొనరింపవలెనా అని అతడు తెలియగోరుచున్నాడు.

### 5.2
**శ్రీభగవానువాచ**
**సన్న్యాస: కర్మయోగశ్చ ని:శ్రేయసకరావుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥**

**అనువాదము**

**దేవాదిదేవుడు సమాధానమిచ్చెను: కర్మపరిత్యాగము మరియు భక్తితో కూడిన కర్మము రెండును ముక్తికి శ్రేయోదాయకములే. కాని ఆ రెండింటిలో కర్మ పరిత్యాగము కంటెను భక్తియుక్త సేవతో కూడిన కర్మము ఉత్తమమైనది.**

**భాష్యము**

కామ్యకర్మలు (ఇంద్రియతృప్తిని కోరునవి) భౌతిక బంధమునకు కారణములు. దేహసౌఖ్యమును పెంపొందించుకొను ఉద్దేశముతో కర్మల నొనరించు నంతకాలము జీవుడు వివిధరకాల దేహములను పొందుచు భవబంధమున నిరంతరము కొనసాగావలసియే యుండును. దీనిని శ్రీమద్భాగవతము(5.5.4-6) నందు ఈ క్రింది విధముగ నిర్ధారించుచున్నది :

నూనం ప్రమత్త: కురుతే వికర్మ యదింద్రియప్రీతయ ఆ పృణోతి
న సాధు మన్యే యత ఆత్మనో యమసన్నపి క్లేశద ఆస దేహ:

పరాభవస్తావదబోధజాతో యావన్న జిజ్ఞాసత ఆత్మతత్త్వమ్
యావత్క్రియాస్తావదిదం మనో వై కర్మాత్మకం యేన శరీరబంధ:

ఏవం మన: కర్మవశం ప్రయుంక్తే అవిద్యయాత్మన్యుపధీయమానే
ప్రీతిర్న యావన్మయి వాసుదేవే న ముచ్యతే దేహయోగేన తావత్

"మానవులు ఇంద్రియ ప్రీతి యందు అత్యాసక్తులై యుందురు. దుఃఖపూరితమైన ప్రస్తుత దేహము పూర్వజన్మ కర్మఫలముగా లభించినదేనని వారెరుగజాలరు. ఈ దేహము తాత్కాలికమైనను జీవులకు అనేక రకములుగా బాధలు కలిగించు చున్నది. కనుకనే ఇంద్రియతృప్తి కొరకు వర్తించుట సరియైనది కాదు. మానవుడు తన నిజస్థితిని గూర్చి ప్రశ్నించనంత కాలము అతడు జీవితములో పరాజయమును పొందినట్లుగా భావింపవలెను. మానవుడు తన నిజస్థితిని ఎరుగనంతకాలము ఇంద్రియ తృప్తి ఫలముల నాశించి కర్మలు చేయవలసి వచ్చును. అట్టి ఇంద్రియతృప్తి భావములో నిమగ్నుడై యుండునంత కాలము అతడు ఒక దేహము నుండి మరొక దేహమునకు పరిణామము చెందవలసివచ్చును. మనస్సు ఆ విధముగా కామ్యకర్మల యందు లగ్నమై యున్నను మరియు అజ్ఞానముచే ప్రభావితమై యున్నను ఏదియో ఒకవిధముగా ప్రతియొక్కరు వాసుదేవుని భక్తియుక్త సేవ యందు ఆసక్తిని పెంపొందించు కొనవలెను. అప్పుడే ఎవ్వరైనను భౌతిక భవ బంధము నుండి విముక్తిని పొందు అవకాశమును పొందగలరు."

కనుక జ్ఞానమొక్కటే(తాను ఈ భౌతిక దేహము కాదనియు ఆత్మ స్వరూపమనియు తెలిసికొను జ్ఞానము) ముక్తిని పొందుటకు సరిపోదు. మానవుడు జీవాత్మ భావముతో వర్తింపవలెను. అట్లు చేయనిచో భౌతిక బంధముల నుండి తప్పించుకొనుట ఎవ్వరికినీ

సాధ్యము కాదు. కాని కృష్ణచైతన్యముతో కూడిన కర్మఫలాపేక్షతో కూడిన కర్మకాదు. అట్లు పరిపూర్ణ జ్ఞానముతో చేయబడు కర్మలు మానవుని నిజమైన జ్ఞానపురోగతిని మరింత దృఢతరము చేయగలవు. వాస్తవమునకు, కృష్ణచైతన్యము లేకుండా కేవలము కామ్యకర్మలను త్యజించుట వలన బద్ధజీవి నిజముగా తన హృదయమును పవిత్రము చేసికొనజాలడు. హృదయము పవిత్రము కానంతవరకు మానవుడు ఫలాపేక్ష భావనతో కూడిన కర్మలను చేయవలసివచ్చును. కాని కృష్ణచైతన్యముతో చేయబడు కర్మ సర్వకర్మ ఫలముల నుండి తప్పించుకొనుటకు సహజముగానే తోడ్పడును. అట్టి కర్మ వలన భౌతిక స్థితికి ఎవరును పతనము చెందు అవకాశముండదు. కనుకనే పతనాపాయమునకు గురిచేయు కర్మపరిత్యాగము కంటెను కృష్ణచైతన్యసహిత కర్మము ఉత్కృష్టమైనది. కృష్ణచైతన్యము లేకుండ చేయబడు కర్మపరిత్యాగము అసంపూర్ణము. ఈ విషయము 'భక్తిరసామృత సింధువు'(1.2.256) నందు శ్రీల రూప గోస్వామి ఇట్లు నిర్ధారించిరి :

ప్రాపంచికతయా బుద్ధ్యా హరిసంబంధివస్తున:
ముముక్షుభి: పరిత్యాగో వైరాగ్యం ఫల్గు కథ్యతే

"మానవులు ముక్తిని పొందవలెనను ఉత్సాహముతో దేవాదిదేవునకు సంబంధించిన వస్తువులను మరియు విషయములను సైతము భౌతికములనే భ్రాంతితో పరిత్యజించినచో, వారి త్యాగము అసంపూర్ణ మనబడును." సర్వము భగవానునికే చెందినదనియు మరియు ఎవ్వరును దేనిపైనను ఆధిపత్యమును కలిగి యుండ రాదనియు తెలిపెడి జ్ఞానమును కూదియున్నప్పుడే త్యాగము పరిపూర్ణము కాగలదు. వాస్తవమునకు ఏదియును ఎవ్వరికిని చెందినది కాదని ప్రతియొక్కరు అవగాహన చేసుకొనవలెను. అప్పుడు త్యాగమనెడి ప్రశ్న ఎట్లు ఉదయించును? సర్వమును శ్రీకృష్ణునికి చెందినదని ఎరిగినవాడు ఎల్లప్పుడు త్యాగమునందు నెలకొనినట్టివాడే కాగలడు. సర్వము శ్రీకృష్ణునికే చెందియుండుట చేత అతని సేవకొరకే సమస్తమును వినియోగింపవలెను. కర్మ యొక్క సమగ్ర రూపమైన ఇట్టి కృష్ణచైతన్యసహిత కర్మ యనునది మాయావాద సంప్రదాయమునకు చెందిన సన్న్యాసులు అవలంబించు కృత్రిమమైన పరిత్యాగము కంటెను అత్యంత శ్రేష్ఠమైనది.

## 5.3

**జ్ఞేయ: స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బన్ధాత్ ప్రముచ్యతే ॥**

### అనువాదము

**గొప్ప బాహుపరాక్రమము గల ఓ అర్జునా! కర్మఫలములను ద్వేషించుట గాని, వాంచించుట గాని చేయనివాడు నిత్య సన్యాసిగా తెలియబడును. ద్వంద్వముల నుండి విడివడియుండు అట్టి వ్యక్తి లౌకిక బంధములను సులభముగా అధిగమించి సంపూర్ణముగా విముక్తుడగును.**

### భాష్యము

కృష్ణచైతన్యము నందు పూర్తిగా నిమగ్నుడైనవాడు నిత్యసన్యాసి యగును. ఎందుకనగా, అతడు కర్మఫలములను ద్వేషించుట గాని వాంచించుట గాని చేయడు. అట్టివాడు శ్రీకృష్ణునితో తనకు గల నిత్యసంబంధ విషయమున తన నిజస్థితిని ఎరిగియుండును. నిత్యము దివ్యమైన భక్తియుక్తసేవకు అంకితుడై యుండును. అట్టి త్యాగి పరిపూర్ణ

జ్ఞానవంతుడగును. శ్రీకృష్ణుడు సంపూర్ణడనియు మరియు తాను అట్టి సంపూర్ణపు యొక్క అంశననియు అతడు పూర్తిగా ఎరిగి యుండును. అట్టి జ్ఞానమే గుణరీతిన మరియు పరిమాణరీతిన సరియైనందున అది సంపూర్ణమై యున్నది. అంశమెన్నడును సంపూర్ణముతో సమానము కాలేనందున జీవుడు శ్రీకృష్ణునితో ఐక్యము చెందుట మనెడి భావనము ఎన్నడును సరియైనది కాదు. జీవుడు భగవానునితో గుణరీతిగనే సమానుడు కాని పరిమాణ రీతిని కాదనెడి నిజమైన దివ్యజ్ఞానము కోరికలు, చింతలు లేనటువంటి పరిపూర్ణ మానవుని చేయగలదు. అట్టివాడు ఏది చేసినను శ్రీకృష్ణుని కొరకే చేయును కనుక అతని మనస్సు నందు ద్వంద్వభావములు కనిపించవు. ఈ విధముగా ద్వంద్వాతీతుడై అతడు ఈ జగత్తునందును ముక్తుడై యుండును.

## 5.4

**సాంఖ్యయోగౌ పృథగ్బాలా: ప్రవదన్తి న పన్డితా: ।**
**ఏకమప్యాస్థిత: సమ్యగుభయోర్విన్దతే ఫలమ్ ॥**

**<u>అనువాదము</u>**

**కేవలము అల్పజ్ఞులే భక్తియుక్త సేవను(కర్మయోగమును) భౌతిక జగత్తు యొక్క విశ్లేషనాత్మక అధ్యయనమునకు (సాంఖ్యమునకు) భిన్నమైనదిగా పలుకుదురు. కాని ఈ రెండు మార్గములలో ఏ ఒక్కదానిని సమగ్రముగా అనుసరించినను రెండింటి ఫలములను మానవుడు పొందగలడని నిజమైన పండితులు చెప్పుదురు.**

**<u>భాష్యము</u>**

ఆత్మ ఉనికిని తెలిసికొనుటయే భౌతికజగత్తును గూర్చిన విశ్లేషనాత్మక అధ్యయనము యొక్క లక్ష్యము. విష్ణువు లేదా పరమాత్మయే ఈ భౌతిక జగత్తునకు ఆత్మయై యున్నాడు. భగవానుని భక్తియుక్త సేవయందు పరమాత్మ సేవ కూడ మిళితమై యున్నది. వృక్షము యొక్క మూలమును కనుగొనుట ఒక పద్ధతికాగా, ఆ మూలమునకు నీరుపోయుట మరొకపద్ధతి. నిజమైన 'సాంఖ్యజ్ఞాన' తత్త్వమును అధ్యయనము చేయువాడు భౌతిక జగత్తునకు మూలమైన విష్ణువును కనుగొనిన పిదప పరిపూర్ణమైన జ్ఞానముతో భగవానుని సేవ యందు నెలకొనును. కనుకనే, దీనిసారాంశమును ననుసరించి చూచినచో, రెండింటి లక్ష్యమును విష్ణువే యైనందున ఆ రెండింటికిని భేదము లేదు. పరమలక్ష్యమును తెలియనివారే 'సాంఖ్యము' మరియు 'కర్మయోగ'ముల ప్రయోజనములు భిన్నములని పలుకుదురు. కాని పండితులైనవారు మాత్రము ఈ రెండు భిన్నపద్ధతుల లక్ష్యము ఒక్కటేనని పూర్తిగా ఎరిగియుండును.

## 5.5

**యత్సాంఖ్యై: ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ య: పశ్యతి స పశ్యతి ॥**

**<u>అనువాదము</u>**

**సాంఖ్యతత్త్వ విశ్లేషణము ద్వారా పొందబడు స్థితిని భక్తియుక్తసేవ ద్వారాను పొందవచ్చునని ఎరిగి తత్కారణముగా సాంఖ్య మరియు భక్తియోగము రెండును ఒకేస్థాయిలో నున్నవానిగా గుర్తించువాడు యథార్థదృష్టి కలిగినవాడగును.**

## భాష్యము

జీవితపు పరమలక్ష్యమును కనుగొనుటయే తాత్త్విక పరిశోధనల వాస్తవ ప్రయోజనము. జీవిత పరమలక్ష్యము ఆత్మానుభూతి అయినందున, ఈ రెండు మార్గముల యందలి పరిణామములందు ఎట్టి భేదము లేదు. 'సాంఖ్య' తత్త్వపరిశోధన ద్వారా జీవుడు భౌతిక జగత్తు యొక్క అంశ కాదనియు, సంపూర్ణుడైన పరమాత్మని యొక్క అంశయేననియు మానవుడు నిర్ధారణకు వచ్చును. కనుకనే జీవాత్మకు భౌతిక జగత్తులో ఎట్టి సంబంధము లేదనియు మరియు దాని కర్మ లన్నియును పరమాత్మతో ఏదైన సంబంధమును కలిగి యుండవలెనని మానవుడు ఎరుగగలుగును. అట్టి కృష్ణచైతన్య భావనతో కర్మనొనరించినచో అతడు తన నిజస్థితియందు నెలకొనినవాడగును. మొదటి పద్ధతియైన 'సాంఖ్య' విధానమున మానవుడు భౌతికపదార్థము నుండి అనాసక్తుడు కావలెను. రెండవ పద్ధతియైన భక్తియోగము నందు అతడు కృష్ణచైతన్యసహిత కర్మలయందు పూర్తిగా ఆసక్తుడు కావలెను.బాహ్యదృష్టికి ఒక విధానము నందు అనాసక్తియు మరొక విధానము నందు ఆసక్తియు గోచరించినను నిజమునకు రెండు పద్ధతులు ఒక్కటే. భౌతికత్వము నుండి అనాసక్తి మరియు శ్రీకృష్ణుని పట్ల ఆసక్తి రెండును ఒక్కటేననెడి విషయమును గాంచగలిగిననాడు యథార్థదృష్టిని కలిగియుండును.

## 5.6

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగత: ।**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥**

## అనువాదము

**ఓ మహా బాహుడవైన అర్జునా! భక్తియుక్త సేవ యందు నెలకొనకుండ కేవలము కర్మలను త్యజించుట ద్వారా ఎవ్వరును సుఖమును పొందజాలరు. కాని భక్తియుక్త సేవ యందు నెలకొనిన ముని శీఘ్రముగా పరబ్రహ్మమును పొందగలడు.**

## భాష్యము

సాన్న్యాసుల యందు(సన్న్యాసాశ్రమము నందున్నవారు) రెండు తరగతుల వారు కలరు. మాయావాది సన్న్యాసులు 'సాంఖ్య'తత్త్వమును అధ్యయనము చేయుట యందును, వైష్ణవ సన్న్యాసులు 'వేదాంత సూత్రము'లకు తగిన భాష్యమునిచ్చు శ్రీమద్భాగవత తత్త్వమును అధ్యయనము చేయుట యందును నెలకొని యుందురు. మాయావాది సన్న్యాసులు కూడ 'వేదాంత సూత్రము'లను పఠింతురు. కాని దానికొరకై వారు శంకరాచార్యులచే రచించబడిన 'శారీరక భాష్యము' అనబడు తమ సొంత వ్యాఖ్యానమును ఉపయోగింతురు. భాగవతధర్మ సంప్రదాయమునకు చెందిన సాధకులు 'పాంచరాత్రిక' విధానము ననుసరించి భగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనియుందురు. కనుకనే వైష్ణవ సన్న్యాసులకు భగవానునికి చేయు దివ్య సేవయందు ఎన్నోరకములైన కార్యకలాపము లుండును. వారికి భౌతికకర్మలతో ఎట్టి సంబంధము లేకున్నను,వారు భగవత్సేవ కొరకై వివిధ రకాలకర్మల యందు నెలకొనియుందురు. కాని మాయావాది సన్న్యాసులు సాంఖ్యము, వేదాంతాధ్యయనము, మానసిక కల్పనము లందు నెలకొని భగవానుని దివ్యసేవా మధురిమను అనుభవింపజాలరు. అతి దీర్ఘములైన తమ అధ్యయనముల చేత వారు కొన్నిమార్లు పరబ్రహ్మమును గూర్చిన మానసిక కల్పనల పట్ల విసుగు చెంది సరియైన అవగాహనము

లేకుండానే శ్రీమద్భాగవతమును ఆశ్రయింతురు. కనుక వారికి శ్రీమద్భాగవత అధ్యయనము అనునది కేవలము శ్రమయే కాగలదు. వాస్తవమునకు అట్టి శుష్క మానసిక కల్పనలు మరియు కృత్రిమములైన నిరాకార వివరణము లన్నియును మాయావాది సన్న్యాసులకు నిరర్థకకార్యములు. భక్తియుక్తసేవ యందు నెలకొని యున్నట్టి వైష్ణవ సన్న్యాసులు తమ ఆధ్యాత్మిక కార్యక్రమములను నిర్వహించుచు, ఆనందము ననుభవించుచు, చివరికి భగవద్ధామమును చేరుదుమనెడి విశ్వాసమును కలిగియుందురు. కాని మాయావాది సన్న్యాసులు కొన్నిమార్లు ఆత్మానుభూతి మార్గము నుండి పతనము చెంది ధార్మిక మరియు పరహిత కార్యముల వంటి భౌతిక కర్మలను తిరిగి ఆరంభింతురు. సారాంశమేమనగా, ఏది బ్రహ్మము, ఏది బ్రహ్మము కాదనెడి మానసిక కల్పనల యందే నిమగ్నులై యుండు మాయావాది సాన్న్యాసుల కంటెను కృష్ణచైతన్యసహిత కర్మల యందు నెలకొనినవారు ఉత్తమస్థితి యందు నెలకొనినట్టివారు. అయినను ఆయావాద సన్న్యాసులు కూడా బహుజన్మల పిదప కృష్ణచైతన్యమును పొందగలరు.

## 5.7

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియ: ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥**

### అనువాదము

**భక్తియోగముతో కర్మనొనరించువాడును, విశుద్ధాత్ముడును, తన మనస్సును, ఇంద్రియములను జయించినవాడును అగు మానవుడు సర్వులకు ప్రియుడై యుండెను. అందరును అతనికి ప్రియులై ఉందురు. అట్టివాడు సదా కర్మల నాచారించుచున్నను ఎన్నడును బద్ధుడు కాదు.**

### భాష్యము

కృష్ణచైతన్యము ద్వారా ముక్తిమార్గమున పయనించువాడు సర్వ జీవులకు పరమ ప్రియుడై యుండెను. సర్వజీవులు అతనికి ప్రియమై యుందురు. అందుకు అతని యందలి కృష్ణచైతన్యమే కారణము. వృక్షము యొక్క పత్రములును, శాఖలును వృక్షమునకు భిన్నములు కానట్లుగా, ఏ జీవియు శ్రీకృష్ణుని నుండి భిన్నము కాదని అట్టివ్యక్తి భావించును. వృక్షపు మొదలుకు నీరుపోయుట ద్వారా ఆ నీరు పత్రములకును, శాఖలన్నింటికిని సరఫరా యగుననియు, ఉదరమునకు ఆహారము సమకూర్చుట ద్వారా శక్తి సహజముగానే దేహమంతటికిని వ్యాపించు ననియు అతడు చక్కగా ఎరిగియుండును. కృష్ణచైతన్యముతో కూడి కర్మనొనరించు వాడు సేవకుని వలె అందరిని సేవించుట చేత అతడు అందరికిని ప్రియమగును. అందరును అతని సేవచే తృప్తినొందుటచే అతడు శుద్ధమైన అంతరంగమును కలిగియుండును. అతడు అట్లు శుద్ధుడైయుండుట చేత అతని మనస్సు పూర్తిగా నిగ్రహింపబడి, అట్టి నిగ్రహమనస్సు ద్వారా ఇంద్రియములన్నీ పూర్తిగా నిగ్రహింప బడును. మనస్సు సదా శ్రీకృష్ణుని యందు లగ్నమై యుండుట చేత శ్రీకృష్ణుని నుండి అతడు దూరమగుట గాని, కృష్ణసేవకంటె ఇతరములైన కర్మలలో ఇంద్రియములను నెలకొల్పుటకు గాని అవకాశముండదు. శ్రీకృష్ణునితో సంబంధము లేని ఏ విషయములను అతడు వినగోరడు. శ్రీకృష్ణునికి అర్పింపబడని ఏ పదార్థమును అతడు తినగోరడు. అదేవిధముగా శ్రీకృష్ణునితో ఏ సంబంధములేని ప్రదేశమునకు అతడు పోగోరడు. కనుకనే అతని ఇంద్రియములు

పూర్తిగా నియంత్రింపబడి యుండెను. ఆ విధముగా నియంత్రింపబడిన ఇంద్రియములు గలవాడు ఎవ్వరికినీ అపకారమును చేయడు. అయినచో : యుద్ధరంగము నందు అర్జునుడు ఇతరులకు ఎందుకు అపకారము చేయదలచెను? అతడు కృష్ణచైతన్యవంతుడు కాడా?" అని ఎవ్వరైనను ప్రశ్నించు అవకాశము కలదు. అర్జునుడు చేయు అపకారము కేవలము బాహ్యమునకు మాత్రమే. ఎందుకనగా (ద్వితీయాధ్యాయమున ఇదివరకే వివరింపబడినట్లు) ఆత్మ చంపబదనందున యుద్ధరంగమున సమకూడిన వారందరును వ్యక్తిగతముగా ఆత్మరూపమున జీవించుచునే యుందురు. ఆధ్యాత్మికదృష్టితో చూచినచో కురుక్షేత్ర సంగ్రామ రంగము నందు ఎవ్వరును మరణింపలేదు. స్వయముగా రణరంగమున నిలిచి యున్నట్టి శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారమే వస్త్రముల వంటి వారి దేహములు మాత్రమే మార్చబడినవి. అనగా అర్జునుడు కురుక్షేత్ర యుద్ధరంగము నందు యుద్ధము చేయుచున్నను కేవలము శ్రీకృష్ణభగవానుని ఆజ్ఞలను సంపూర్ణ కృష్ణచైతన్యముతో నిర్వర్తింపజేసి యున్నందున అతడు వాస్తవమునకు యుద్ధము చేయనివాడే అయ్యెను. అట్టివాడు ఎన్నడును కర్మఫలములచే బద్ధుడు కాడు.

**5.8- 9**

**నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥**

**అనువాదము**

**దివ్య చైతన్యవంతుడైన వ్యక్తి చూచుట, వినుట, తాకుట, వాసనజూచుట, భుజించుట, అటునిటు కదులుట, నిద్రించుట, శ్వాసించుట వంటి కార్యములను చేయుచున్నను తాను వాస్తవముగా ఏమియును చేయుచుండుట లేదనియే తనలోతాను ఎరిగియుండును. ఏలయన మాట్లాడునపుడు, విసర్జించు చున్నప్పుడు, గ్రహించునప్పుడును లేక కన్నులను తెరుచునప్పుడును లేక మూయుచున్నప్పుడును, భౌతికములైన ఇంద్రియములు మాత్రమే ఇంద్రియార్ధ విషయములలో నెలకొని యున్నవనియు మరియు తాను మాత్రము వాని నుండి దూరముగా నుంటిననియు సదా ఎరిగి యుండును.**

**భాష్యము**

కృష్ణచైతన్యవంతుడు శుద్ధస్థితి యందున్నందున కర్త, కర్మ, సన్నివేశము, ప్రయత్నము, అదృష్టములను ఐదు విధములైన కారణములపై ఆధారపడియున్న ఎట్టి కర్మలతోను అతడు సంబంధమును కలిగియుండడు. అతడు శ్రీకృష్ణభగవానుని దివ్యమైన భక్తియుక్తసేవ యందు నెలకొని యుండుటయే అందుకు కారణము. తన దేహముతోడను, ఇంద్రియములతోడను వర్తించుచున్నట్లు కనపడినను, అతడు ఆధ్యాత్మిక కలాపమైన తన వాస్తవ స్వరూపస్థితిని గూర్చి సదా ఎరిగియుండును. భౌతిక భావనలో ఇంద్రియములు ఇంద్రియ భోగము కొరకై నెలకొని యుండగా, కృష్ణచైతన్యము నందు అవి శ్రీకృష్ణుని ఇంద్రియ ప్రీతికొరకై వినియోగింపబడును. కనుకనే కృష్ణచైతన్యవంతుడు ఇంద్రియకర్మలలో నెలకొనినట్లు కనిపించినను అతడు ఎల్లవేళలా ముక్తుడై యుండును. జ్ఞానేంద్రియములు చూచుట మరియు వినుట వంటి

కార్యకలాపాలు జ్ఞానసముపార్జన కొరకు కాగా, నడుచుట, మాట్లాడుట, విసర్జించుట వంటి కర్మేంద్రియములు కర్మకోసమై ఉద్దేశింపబడినవి. కృష్ణచైతన్యవంతుడు అట్టి ఇంద్రియకర్మలచే ఎన్నడు ప్రభావితుడు కాడు. అతడు భగవానుని నిత్యదాసుడనిన ఎరిగియుండుటచే భగవానుని సేవను తప్ప అన్యకార్యమును చేయకుండును.

## 5.10

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సఙ్గం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివామ్భసా ॥**

## అనువాదము

**కర్మఫలముల నన్నింటిని భగవానునకు అర్పించి ఆసక్తి లేకుండా తన ధర్మములను నిర్వహించువాడు నీటిచే అంటబడని తామరాకువలె పాపకర్మ ఫలితములచే ప్రభావితుడు కాదు.**

## భాష్యము

ఇక్కడ 'బ్రాహ్మణి' అనగా కృష్ణచైతన్యము నందు అని అర్థము. సాంకేతికముగా 'ప్రధాన' అని పిలువబడు భౌతిక జగత్తు ప్రకృతి త్రిగుణముల సంపూర్ణ ప్రదర్శనము. "సర్వం హేతద్ బ్రహ్మ"(మాండూక్యోపనిషత్తు 2), "తస్మాదేతద్ బ్రహ్మ నామరూపమన్నం చ జాయతే" (ముండకోపనిషత్తు 1.1.9) అను వేదమంత్రములు మరియు భగవద్గీత (14.3) యందలి, "మమ యోనిర్మహద్ బ్రహ్మ" అను శ్లోకమునను భౌతిక జగత్తు నందలి సర్వమును బ్రహ్మము యొక్క శక్తియేనని సూచించుచున్నవి. అనగా జగత్తు నందలి కార్యములు తమకు కారణమైన బ్రహ్మము కంటెను భిన్నములుగా వ్యక్తీకరింపబడినను వాస్తవమునకు అవి కారణము కంటె అభిన్నములై యున్నవి. 'ఈశోపనిషత్తు' నందు సర్వమును పరబ్రహ్మమునకు లేక శ్రీకృష్ణునికి సంబంధించినదేనని చెప్పబడినది. కనుక సర్వమును శ్రీకృష్ణునికే చెందినదనియు శ్రీకృష్ణుడే సర్వమునకు స్వామి యనియు, తత్కారణముగా సర్వమును ఆ భగవానుని సేవయందే నెలకొల్పవలెనని ఎరిగిన వాడు తన పాపపుణ్యకర్మల ఫలములతో ఎట్టి సంబంధమును కలిగియుండడు. భౌతిక దేహము కూడ ఒక ప్రత్యేక కార్యము కొరకై భగవానునిచే ప్రసాదింప బడినందున, భౌతిక దేహమును కూడ కృష్ణచైతన్యము నందు వినియోగింపవలెను. అప్పుడు నీటి యందు గల తామరాకు తడియబడనట్లు అది పాపకర్మ ఫలములకు అతీతమగును. భగవానుడు భగవద్గీత(3.30) యందు : "మయి సర్వాణి కర్మాణి సన్న్యస్య"-"నీ కర్మలనన్నింటిని నాకర్పింపుము" అని చెబుతున్నాడు. సారాంశమేమనగా, కృష్ణచైతన్యము నందు లేనివాడు దేహేంద్రియముల భావన ననుసరించి వర్తింపగా, కృష్ణచైతన్యవంతుడు దేహము శ్రీకృష్ణుని సొత్తు కనుక దానిని శ్రీకృష్ణుని సేవయందే వినియోగింప వలెనను జ్ఞానముతో వర్తించును.

**5.11**
**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరిన్ద్రియైరపి ।**
**యోగిన: కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాత్మశుద్ధయే ॥**

**అనువాదము**

**యోగులు ఆసక్తిని విడిచి ఆత్మశుద్ధి యను ప్రయోజనము కొరకు మాత్రమే దేహము తోడను, మనస్సు తోడను, బుద్ధి తోడను మరియు ఇంద్రియముల తోడను కర్మనొనరింతురు.**

**భాష్యము**

ఎవరైనను శ్రీకృష్ణుని ఇంద్రియప్రీతికొరకు కృష్ణచైతన్యముతో కర్మనొనరించినప్పుడు దేహము, మనస్సు, బుద్ధి లేదా ఇంద్రియములతో చేయబడు ఎ కర్మయైనను భౌతిక కాలుష్యము నుండి పవిత్రమగును. అనగా కృష్ణచైతన్య వంతుడు చేయు కర్మలకు ఎటువంటి భౌతిక కర్మఫలములు కలుగజాలవు. కనుకనే సాధారణముగా 'సదాచారము'లని పిలువబడు పవిత్ర కర్మలను కృష్ణచైతన్యము నందు నెలకొని సులభముగా నిర్వర్తింపవచ్చును శ్రీల రూప గోస్వామి 'భక్తిరసామృత సింధువు'(1.2.187) నందు ఇట్లు వివరించిరి :

ఈహా యస్య హరేర్దాస్యే కర్మణా మనసా గిరా
నిఖిలాస్వప్యవస్థాసు జీవన్ముక్త: స ఉచ్యతే

"కృష్ణచైతన్యము నందు వర్తించెడివాడు (శ్రీకృష్ణుని సేవలో) దేహము, మనస్సు, బుద్ధి, వాక్కులచే భౌతికములని పిలువబడు కర్మల యందు నెలకొనినప్పటికిని భౌతిక జగత్తున ముక్తపురుషుడే యగును."

దేహాత్మబుద్ధి లేనందున అతనికి అహంకారము లేకుండును. తాను దేహమును కాదనియు మరియు ఈ దేహము తనకు చెందదనియు అతడు పూర్తిగా ఎరుగును. తాను శ్రీకృష్ణునికి చెందినవాడగుట చేత అతని దేహము కూడ శ్రీకృష్ణునికే చెందినదని భావించును. అతడు తన ఆధీనము నందు గల సమస్తమును అనగా దేహము, బుద్ధి, వాక్కు, జీవితము, ధనము వంటివాని నుండి ఉత్పన్నమైన సర్వమును శ్రీకృష్ణుని సేవయందే వినియోగించును. కనుక అతడు వెంటనే శ్రీకృష్ణునితో సన్నిహిత సంబంధమును పొందును. శ్రీకృష్ణునితో అతడు గుహ్యైక్యమును కలిగియుండి దేహాత్మబుద్ధి వలన కలుగు అహంకారమునకు దూరముగా నుండును. ఇదియే కృష్ణచైతన్యము నందలి పరిపూర్ణత్వ స్థితియై యున్నది.

**5.12**
**యుక్త: కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్త: కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥**

**అనువాదము**

**స్థిరమైన భక్తిని కలిగినవాడు సర్వకర్మఫలములను నాకు అర్పించుటచే నిర్మలమైన శాంతిని పొందును. అట్లుగాక భగవద్భావనము లేనివాడును మరియు తన కర్మఫలముల యెడ ఆసక్తిని కలిగియున్నవాడును అగు మానవుడు బద్ధుడగును.**

## భాష్యము

కృష్ణచైతన్యవంతునికి మరియు దేహాత్మబుద్ధిని కలిగియున్నట్టి వ్యక్తికిని నడుమ గల భేదమేమనగా మొదటివాడు శ్రీకృష్ణుని యందు ఆసక్తుడై యుండగా, రెండవవాడు తన కర్మఫలముల యందు ఆసక్తుడై యుండును. శ్రీకృష్ణుని యందు ఆసక్తుడై యుండి కేవలము అతని కొరకే కర్మలను ఆచరించువాడు నిశ్చయముగా ముక్తపురుషుడు. అట్టివాడు తన కర్మఫలముల యందు ఎట్టి ఆసక్తిని కలిగి యుండడు. కర్మఫలముల యందు ఆసక్తిని కలిగియుండుటకు కారణము ద్వితీయ భావముతో కర్మనొనరించుట యనగా పరతత్త్వపు జ్ఞానము లేకుండ స్వతంత్రముగా కర్మనొనరించుటయని శ్రీమద్భాగవతము (11.2.37) నందు వివరింపబడినది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే ఆ పరతత్త్వము. కృష్ణచైతన్యము నందు ద్వితీయభావనము లేదు. సర్వము సర్వమంగళకరుడైన శ్రీకృష్ణుని శక్తిఫలమే అయినందున కృష్ణచైతన్య కర్మలన్నియును అలౌకికములు, దివ్యములు మరియు భౌతిక ప్రభావము లేనట్టివి. కనుకనే కృష్ణచైతన్యము నందు మానవుడు పరిపూర్ణ శాంతితో నిండి యుండును. కాని ఇంద్రియతృప్తి కొరకు లాభమును గణించుటలో చిక్కుకొనినట్టి వాడు అట్టి శాంతిని పొందజాలడు. శ్రీకృష్ణునికి అన్యముగా దేనికిని స్వతంత్రమైన అస్తిత్వము లేదని గుర్తించుటయే శాంతికి, నిర్భయత్వమునకు ఆధారమై యున్నది. ఇదియే కృష్ణచైతన్యము నందలి రహస్యము.

### 5.13

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥**

## అనువాదము

**దేహదారియైన జీవుడు తన స్వభావమును నియంత్రించి మానసికముగా కర్మల నన్నింటిని త్యజించినప్పుడు, నవద్వారములు గల పురమునందు (భౌతిక దేహము నందు) తాను కర్మను చేయకుండ మరియు కర్మకు కారణము కాకుండ సుఖముగా వసించును.**

## భాష్యము

బద్ధజీవుడు నవద్వారములు గల దేహమనెడి పురము నందు నివసించును. దేహకర్మలు(దేహమనెడి పురము యొక్క కర్మలు) ప్రత్యేక గుణస్వభావము ననుసరించి అప్రయత్నముగనే నిర్వహింపబడును. దేహ పరిస్థితుల ప్రభావమునకు అధీనుడై యుండెడి జీవుడు తాను కోరుకున్నచో వాటి ప్రభావమునకు అతీతుడు కావచ్చును. జీవుడు తమ ఉన్నత స్వభావమును విస్మరించుట చేతనే దేహాత్మబుద్ధిని కలిగి దానికి ఫలితముగా దుఃఖమును పొందు చున్నాడు. కృష్ణచైతన్యము నందు అతడు తన నిజస్థితిని పునరుద్ధరించుకొని అట్లు బద్ధజీవితము నుండి బయటపడును. కృష్ణచైతన్యవంతుడైన మానవుడు వెంటనే దేహకర్మలకు పూర్తిగా అతీతుడగును. అటువంటి మారిన ప్రవృత్తులు కలిగిన నియమిత జీవితము నందు అతడు నవద్వారములు గల పురములో సుఖముగా జీవించును. నవద్వారములు గల పురము ఈ క్రింది విధముగా వర్ణింపబడినది :

నవద్వారే పురే దేహీ హంసో లీలాయతే బహి:
వశీ సర్వస్య లోకస్య స్థావరస్య చరస్య చ

"నవ ద్వారములు గల పురమున అనగా జీవుని దేహమునందు నిలిచి యుండెడి దేవాదిదేవుడు విశ్వము నందలి సమస్త జీవులను నియంత్రించువాడు." (శ్వేతాశ్వతరోపనిషత్తు 3.18) ఈ దేహము నవద్వారములను కలిగి యుండును (రెండుకన్నులు, రెండు నాసికారంధ్రములు, రెండుకర్ణములు, ఒకనోరు, మర్మావయవము, గుదస్థానము). బద్ధస్థితిలో జీవి తనదేహమే తానని భావించును. కాని తన హృదయము నందు గల పరమాత్మతో గుణైక్యమును గుర్తించినప్పుడు, అతడు దేహము నందున్నప్పటికిని భగవానుని వలె (భయ శోకాదుల నుండి) స్వతంత్రుడు కాగలడు.

కనుకనే కృష్ణచైతన్యవంతుడు భౌతికదేహము యొక్క బాహ్యాంతర కర్మలన్నింటి నుండి విడివడి యుండును.

## 5.14

**న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభు: ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥**

**అనువాదము**

**తన దేహమనెడి పురము యొక్క అధిపతియైన జీవాత్మ కర్మలను సృష్టింపడు, జనులను కర్మలు చేయమని ప్రేరేపింపడు. కర్మఫలములను సృష్టింపడు. ఇదియంతయు ప్రకృతి త్రిగుణముల చేతనే చేయబడుచున్నది.**

**భాష్యము**

సప్తమాధ్యాయమున వివరింపబడనున్నట్లు జీవాత్మ దేవాదిదేవుని శక్తులలో (ప్రకృతులలో) ఒకడై యున్నాడు. కాని భగవానుని మరొక శక్తియైన (న్యూన) భౌతిక ప్రకృతికి అతడు భిన్నుడైనట్టివాడు. అట్టి ఉన్నత ప్రకృతికి చెందిన జీవుడు అనాదికాలముగా ఏదియో ఒక విధముగా భౌతిక ప్రకృతితో సంబంధమును కలిగియుండును. అతడు పొందినటువంటి తాత్కాలిక దేహము (నివాసస్థానము) వివిధములైన కర్మలకు మరియు వాని ఫలములకును కారణమగు చున్నది. ఇట్టి బద్ధవాతావరణము నందు జీవించుచు జీవుడు అజ్ఞానము వలన దేహాత్మబుద్ధి భావనచే దేహకర్మఫలముల చేత పీడితుడగును. అనాదికాలము నుండి ప్రాప్తించిన అట్టి అజ్ఞానమే దేహము యొక్క దుఃఖమునకును, చింతకును కారణమగుచున్నది. జీవుడు దేహపర కార్యముల నుండి విడివడినంతనే వాటి ఫలముల నుండి కూడా విడివడును. దేహమను పురమునందు నిలిచి యున్నంత కాలము జీవుడు దానికి అధిపతిగా కనిపించినను, వాస్తవమునకు అతడు దేహమునకు అధిపతి కాని, దాని కర్మలకు మరియు కర్మఫలములను నియంత్రించు యజమాని కాని కాడు. అతడు కేవలము భౌతిక సాగరమున జీవన పోరాటము చేయుచున్నట్టివాడు. సముద్రపు అలలు అతనిని క్రిందికి మీదికి ఊపుచుండును. వాటిపై అతడు ఎట్టి నియంత్రణాధికారమును కలిగి యుండడు. కనుక దివ్యమైన కృష్ణచైతన్యము ద్వారా ఆ భవజలముల నుండి బయట పడుటయే అతనికి గల ఉత్తమ పరిష్కార మార్గము. అదే అతనిని సర్వ క్లేశముల నుండి రక్షించగలదు.

## 5.15
**నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభు: I**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవ: II**

### అనువాదము
**భగవానుడు ఎవరి పాపమును గాని, పుణ్యమును గాని గ్రహింపడు. అయినను జీవులు వారి నిజ జ్ఞానమును ఆవరించిన అజ్ఞానముచే మోహము నొందు చుందురు.**

### భాష్యము
సంస్కృతమున 'విభు:' అను సంస్కృత శబ్దమునకు అపరిమితమైన జ్ఞానము, సంపద, బలము, యశస్సు, సౌందర్యము, వైరాగ్యము అనేడి షడ్గునములను సంపూర్ణముగా కలిగియున్న భగవానుడని అర్థము. పాపపుణ్య కార్యములచే కలతనొందక అతడెల్లప్పుడును తనయందే సంత్రుప్తుడై (ఆత్మారాముడై) యుండును. ఏ జీవుని స్థితికి కూడ అతడెన్నడును కారణుడు కాడు. జీవుడే అజ్ఞానముచే మోహితుడై వివిధ రకములైన భౌతిక జీవనస్థితుల యందు ఆసక్తు డైనందున తన కర్మఫలములనే సంకెళ్ళలో చిక్కుకొనును. వాస్తమునకు ఉన్నత ప్రకృతికి చెందిన జీవుడు జ్ఞానసంపూర్ణుడై యుండును. అయినను తనకు గల పరిమితశక్తి వలన అతడు అజ్ఞానముచే ప్రభావితుడగును. భగవానుడు సర్వశక్తిమంతుడు. కాని జీవుడు అట్టివాడు కాడు. భగవానుడు 'విభు:' లేక సర్వజ్ఞుడు. కాని జీవుడు అణుమాత్రము. కాని అతడు జీవాత్మయైనందున తన ఇచ్చానుసారము దేనినైనను కోరుకొను శక్తిని కలిగియుండును. అతని అట్టి కోరిక సర్వశక్తిమంతుడైన భగవానుని చేతనే పూరింపబడును.కనుకనే జీవుడు తన కోరికల విషయమున కలత నొందునప్పుడు భగవానుడు వాటిని నెరవేర్చు కొనుటకు అవకాశమిచ్చును. కాని జీవుడు వాంఛించినట్టి ప్రత్యేక పరిస్థితి యందలి కర్మలకు గాని, ఫలములకు గాని భగవాను డెన్నడును బాధ్యుడు కాడు. కనుకనే మోహపూరిత పరిస్థితులలో నుండుటచే జీవుడు భౌతికదేహమే తానని భావించి, జీవితము యొక్క తాత్కాలిక సుఖదుఃఖములకు గురియగుచుండును. భగవానుడు సదా పరమాత్మనిగా జీవికి నిత్యసహచరుడై యుండి, పుష్పము దగ్గరగా ఉన్నప్పుడు ఎవరైనను దాని యొక్క సువాసనను గ్రహింప గలిగినట్లుగా జీవాత్మ కోరికల నన్నింటిని గ్రహింపగలుగును. వాస్తవమునకు కోరిక యనునది జీవునకు సూక్ష్మరూప బంధమైనను, భగవానుడు జీవుల అర్హతను బట్టి వారి కోరికలను తీర్చుచుండును. ఈ విధముగా, 'మానవుడు తలచుట భగవానుడు దానిని పూరించుట' జరుగుచుండును. అనగా మానవుడు తన కోరికలను నెరవేర్చుకొనుట యందు సర్వశక్తిమంతుడు కాడు. కాని భగవానుడు మాత్రము తన కోరికల నన్నింటిని నెరవేర్చుకొనగలడు. అతడు అందరి పట్ల తటస్థుడై యుండును కనుకనే స్వల్ప స్వాతంత్ర్యమును కలిగియున్నటువంటి జీవుల కోరికలలో అతడు ఎట్టి జోక్యమును కలిగించుకొనడు. అయినను శ్రీకృష్ణుని పొందవలెనను ఇచ్చను ఎవరేని వాంఛించినచో భగవానుడు వారిపట్ల ప్రత్యేక శ్రద్ధవహించి వారు తననుపొంది శాశ్వతానందమును అనుభవించునట్లుగా వారి కోరికను వృద్ధిచేస్తూ ప్రోత్సహించును. కనుకనే వేదమంత్రములు ఇట్లు తెలుపుచున్నవి : "ఏష ఉ హ్యేవ సాధు కర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే / ఏష ఉ ఏవసాధు కర్మ కారయతి తం యమధో నినీషతే" – " జీవుడు ఉద్ధరింప బడునట్లుగా అతనిని భగవానుడు పుణ్యకార్యము లందు నెలకొల్పును. అట్లే అతడు నరకమునకు పోవునట్లుగా పాపకార్యము లందును నెలకొల్పును."(కౌషీతకి ఉపనిషత్తు 3.8)

అజ్ఞో జంతురనీశో యమాత్మన: సుఖదుఃఖయో:
ఈశ్వరప్రేరితో గచ్చేత్ స్వర్గం వాశ్వభ్రమేవ చ

"జీవుడు తన సుఖదుఃఖములందు సంపూర్ణముగా పరతంత్రుడై యుండును. వాయువుచే మేఘము కదిలినట్లు, అతడు భగవానుని సంకల్పముచే స్వర్గమునకు గాని, నరకమునకు గాని ప్రయాణించును." (మహాభారత 3.31.273)

కృష్ణచైతన్యమునకు దూరముగా ఉండవలెనను చిరకాల వాంఛచే జీవుడు స్వయముగా మోహమునకు గురియగుచున్నాడు. తత్ఫలితముగా, జీవుడు సహజముగానే నిత్యుడును, ఆనందస్వరూపుడును, జ్ఞానసంపూర్ణుడును అయినప్పటికిని తన అణుమాత్ర స్థితి వలన భగవానునికి సేవ చేయుతమను తన సహజనిజస్థితిని విస్మరించి అజ్ఞానముచే బద్ధుడగుచున్నాడు. అట్టి ఆజ్ఞానవశమున జీవి తన బద్ధస్థితికి భగవానుడే కారణమని భావించును. "వైషమ్య నైర్ఘృన్యే న సాపేక్షత్వాత్ తథా హి దర్శయతి" – "భగవానుడు బాహ్యముగా ద్వేషించు చున్నట్లు లేదా ప్రేమించుచున్నట్లు కనిపించినను వాస్తవమునకు అతడు ఎవ్వరినీ ద్వేషించుట గాని, ప్రేమించుట గాని చేయడు" అని 'వేదాంత సూత్రము' కూడ (2.1.34) ఈ విషయమునే నిర్ధారించుచున్నది.

## 5.16

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మన: ।**
**తేషామాదిత్యవజ్ జ్ఞానం ప్రకాశయతి తత్ పరమ్ ॥**

### అనువాదము

**మానవుడు అజ్ఞానమును నశింపజేయు జ్ఞానముచే ప్రకాశవంతు డైనప్పుడు, పగటిపూట సూర్యుడు సర్వమును ప్రకాశింపజేయునట్లు, అతని జ్ఞానము సర్వమును వ్యక్తపరచును.**

### భాష్యము

శ్రీకృష్ణుని విస్మరించినవారు నిశ్చయముగా మోహమునకు గురగుదురు. కాని కృష్ణచైతన్యవంతుడు ఎన్నడును అట్టి మోహమునకు గురికాడు. "సర్వం జ్ఞానప్లవేనైవ", "జ్ఞానాగ్ని: సర్వకర్మాణి", "న హి జ్ఞానేన సదృశమ్" అని భగవద్గీత యందు జ్ఞానము ఎంతగానో ప్రశంసింపబడినది. ఆ జ్ఞానమెట్టిది? సప్తమ నందు అధ్యాయపు పంతొమ్మిదవ శ్లోకము చెప్పబడినట్లు, ఎవరైనను శ్రీకృష్ణునికి సంపూర్ణ శరణాగతులై అతనికి సర్వమును సమర్పించుట ద్వారా పరిపూర్ణ జ్ఞానమును పొందుదురు : "బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే"- అనేకానేక జన్మలు గడిచిన పిమ్మట జ్ఞానవంతుడైనవాడు శ్రీకృష్ణుని శరణు పొందినప్పుడు లేక కృష్ణచైతన్యమును పొందినపుడు వారి పగటి పూట సూర్యుని వలన సర్వము గోచరమైనట్లు సర్వము వ్యక్తము కాబడును. వాస్తవమునకు జీవులు అనేక రకములుగా భ్రాంతికి గురియగుచుందురు. ఉదాహరణకు, అతడు అహంకారముతో తానే భగవానునిగా భావించినపుడు అజ్ఞానముతో అతడు మాయ పన్నెడి చివరిఉచ్చులో పడిపోవును. జీవుడు భగవాను డేయైనచో అతడు అజ్ఞానముచే ఎట్లు మొహితుడగును? అజ్ఞానముచే భగవానుడు మొహితుడగునా? ఒకవేళ అదే వాస్తవమైనచో అజ్ఞానము భగవానుని కంటె గొప్పదని చెప్పవచ్చును. సంపూర్ణ కృష్ణచైతన్యవంతుని నుండియే యదార్థ జ్ఞానము లభించును. కనుకనే మానవుడు అట్టి ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని అన్వేషించి, అతని నిర్దేశమున కృష్ణచైతన్య మనగానేమిటో ఎరుగవలెను. ఎందుకనగా, సూర్యుడు అంధకారమును తరిమి వేయుచున్నట్లే కృష్ణచైతన్యము అజ్ఞానము నంతటిని ఖచ్చితముగా పారద్రోలగలదు. కాని తాను ఈ దేహమును కాదనియు, ఈ దేహమునకు అతీతుడననెడి పరిపూర్ణ జ్ఞానము

ఉన్నప్పటికిని, ఆత్మ మరియు పరమాత్మునికి నడుమగల భేదమును అతడు గ్రహింపలేక పోవచ్చును. కాని ఎవరైనను ప్రామాణికుడు, పరిపూర్ణ కృష్ణచైతన్య వంతుడైనట్టి ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయించినచో అతనికి సర్వము విదితము కాగలదు. ఎవరైనను స్వయముగా భగవానుని ప్రతినిధిని ఆశ్రయించినపుడే, శ్రీకృష్ణభగవానుని గూర్చియు మరియు దేవాదిదేవునితో తమకు గల సంబంధమును గూర్చియు వాస్తవముగా ఎరుగ గలుగును. సాధారనముగా భగవానుని ప్రతినిధి యైనవాడు భగవానునికి సంబంధిచిన జ్ఞానమును పరిపూర్ణముగా కలిగియుండుటచే భగవానునితో సమానముగా భక్తిగౌరవములు లభించినను తానేన్నడును భగవానుడనని పలుకడు. భగవానునికి మరియు జీవునికి నడుమ గల భేదమును ప్రతియొక్కరు ఎరుగవలెను. కనుకనే శ్రీకృష్ణభగవానుడు ద్వితీయాధ్యాయము(2.12) నందు ప్రతిజీవియు వ్యక్తిత్వమును కలిగి యుండుననియు, భగవానుడు కూడ వ్యక్తిత్వమును కలిగి యుండునని తెలిపియుండెను. జీవులందరును భూతకాలమందును, వర్తమాన కాలము నందును, భవిష్యత్తు కాలము నందును వ్యక్తిత్వమును కలిగియుందురు. జీవులు ముక్తినొందిన పిమ్మట కూడ తమ వ్యక్తిత్వమును కలిగియుందురు. రాత్రియందు చీకటిలో సర్వము ఒకేవిధముగ గోచరించినను సూర్యోదయ మైనంతనే ప్రతిదియు వాటి యదార్థ రూపములో గోచరించును. ఆధ్యాత్మిక జీవితము నందలి జీవ స్వరూపముతో కూడిన వ్యక్తిత్వముతో కూడిన గుర్తింపే యదార్థ జ్ఞానమై యున్నది.

## 5.17

**తద్బుద్ధయస్తదాత్మానస్తన్నిష్ఠాస్తత్పరాయణా: ।**
**గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషా: ॥**

## అనువాదము

**బుద్ధి, మనస్సు, విశ్వాసము, ఆశ్రయము లన్నియును భగవానుని యందే లగ్నమైనప్పుడు మానవుడు సంపూర్ణ జ్ఞానముచే కల్మషరహితుడై నేరుగా ముక్తి మార్గమున పయనించును.**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుడు దివ్యమైన పరతత్వము. గీతాజ్ఞాన మంతయు శ్రీకృష్ణభగవానుడే దేవాదిదేవుడని ప్రతిపాదించుట యందే కేంద్రీకరింపబడినది. వేదవాఙ్మయ మంతయు ఈ విషయమునే తెలుపుచున్నది. పరతత్త్వమనగా పరమ సత్యత్వమని భావము. పరతత్త్వము నెరిగినవారే దానిని నిరాకార బ్రహ్మము, పరమాత్మ, భగవానుడనెడి తత్త్వములుగా అవగాహన చేసికొనగలరు. 'పరతత్త్వ' విషయమున భగవానుడు లేక దేవాదిదేవుడే చరమానుభవము. భగవానునకు మించినది మరొక్కటి లేదు. కనుకనే భగవానుడు (7.7) నందు : "మత్త: పరతరం నాన్యత్ కించిదస్తి ధనుంజయ" – "ఓ అర్జునా! నా కంటె పరతరమైనది మరొక్కటి లేదు" అని బోధించెను. నిరాకారబ్రహ్మము కూడ శ్రీకృష్ణుని పైననే ఆధారపడి యున్నదని తెలుపబడినది : "బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్" (గీత 14.27). కనుక అన్నివిధముల శ్రీకృష్ణుడే పరతత్త్వము. ఎవరి మనస్సు, బుద్ధి, విశ్వాసము, ఆశ్రయము సదా శ్రీకృష్ణుని యందే నెలకొని యుండునో(ఎవరు సంపూర్ణ కృష్ణచైతన్యము కలవారై యుండురో) వారు నిస్సందేహముగా అపోహల నుండి పూర్తిగా తొలగింపబడి కల్మషరహితులై పరతత్త్వమునకు సంబంధించిన సర్వ విషయము లందును పరిపూర్ణ జ్ఞానము గలవారై

యుందురు. కృష్ణచైతన్య వంతుడు శ్రీకృష్ణుని యందు వివిధ తత్త్వములు కలవని(ఏక కాలమున నిరాకారము మరియు సాకారము) సంపూర్ణముగా అవగతము చేసికొనగలుగును. అట్టి దివ్యజ్ఞానముతో మానవుడు ముక్తిమార్గమున నిశ్చలమైన పురోభివృద్ధిని సాధించగలడు.

## 5.18

**విద్యావినయసమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితా: సమదర్శిన: ॥**

### అనువాదము

**వినమ్రులైన పండితులు యథార్థమైన జ్ఞానము కలిగినవారగుటచే విద్యా వినయములతో కూడిన బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, శునకమును, శునకమాంసము తినువానిని (చండాలుని) సమదృష్టితో వీక్షింతురు.**

### భాష్యము

కృష్ణచైతన్యవంతుడు జాతి కులవిచక్షనను చూపడు. సంఘదృష్టిలో బ్రాహ్మణుడు మరియు చండాలుడు వేరుకావచ్చును. అట్లే జాతిని బట్టి శునకము, గోవు, ఏనుగు మున్నగునవి వేరుకావచ్చును. కాని ఈ విధమైన దేహపర భేదములు దివ్యజ్ఞాని దృష్టిలో అర్థరహితములు. ఇందుకు దేవాదిదేవునితో వానికి గల సంబంధమే కారణము. ఎందుకనగా, దేవాదిదేవుడు తన స్వరూపాంశయైన పరమాత్మ రూపముభగవానుడు న ఎల్లరి హృదయము లందును నెలకొనియుండును. దేవాదిదేవుని గూర్చిన ఇట్టి అవగాహనయే యథార్థమైన జ్ఞానము. ప్రతిజీవిని భగవానుడు మిత్రునిగానే భావించును. కనుక జీవుల యందలి దేహములు వివిధ వర్ణములు లేదా జాతుల యందున్నను అతడు మాత్రము అందరిపట్లను సమానమైన దయను కలిగియుండును. జీవుల యొక్క స్థితులలో సంబంధము లేకుండ అతడు వారియందు పరమాత్మ రూపమున నెలకొనియుండును. బ్రాహ్మణుని మరియు చండాలుని దేహములు సమానములు కాకపోయినను భగవానుడు పరమాత్మగా ఆ రెండింటి యందును నెలకొని యుండును. దేహము లనునవి భిన్న బౌతిక ప్రకృతిజన్య త్రిగుణముల ద్వారా రూపొందినవైనను, దేహము నందుండెడి ఆత్మ, పరమాత్మ మాత్రము ఒకే ఆధ్యాత్మిక స్వభావమును కలిగి యుండును. ఆత్మ మరియు పరమాత్మ గుణైక్యమును కలిగి యున్నప్పటికిని,అవి పరిమాణములో ఎన్నడును సమానులు కాజాలవు. ఎందుకనగా జీవాత్మ తాను నిలిచియున్న ఆ ప్రత్యేక దేహమునకే పరిమితమవ్వగా, పరమాత్మ ప్రతిజీవి దేహము నందును నిలిచియుండును. ఈ జ్ఞానమును సంపూర్ణముగా కలిగి యుండుటచే కృష్ణచైతన్యవంతుడు నిజమైన జ్ఞానవంతుడు మరియు సమదృష్టి గలవాడగును. చైతన్యము, శాశ్వతత్త్వము, ఆనం దమయము లనునవి ఆత్మ, పరమాత్మల ఒకేరకమైన లక్షణములు. కాని, జీవాత్మ తాను నిలిచియున్న దేహ పరిధి యందే చైతన్యమును కలిగియుండును; కాని పరమాత్మ సర్వదేహముల చైతన్యమును (జ్ఞానము) కలిగియుండును.

ఇదియే వాటికి నడుమ గల భేదము. అట్టి పరమాత్మ ఎట్టి విచక్షణలేక సర్వదేహము లందును నిలిచియుండును.

**5.19**

**ఇహైవ తైర్జిత: సర్గో యేషాం సామ్యే స్థితం మన: I**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రాహ్మణి తే స్థితా: II**

**అనువాదము**

**సమానత్వము మరియు ఎకత్వములతో కూడిన మనస్సు కలవారు జననమరణ స్థితులను జయించినట్టివారై యుందురు. వారు బ్రహ్మము వలె దోషరహితులైనట్టి వారు. ఆ విధముగా వారు బ్రహ్మము నందు స్థితిని కలిగియున్నట్టి వారే యగుదురు.**

**భాష్యము**

పైన పేర్కొనబడినట్లుగా మనస్సు నందలి సమానత్వము ఆత్మానుభూతికి చిహ్నము. వాస్తవముగా అట్టిస్థితిని పొందినవారిని బౌతిక పరిస్థితులను ముఖ్యముగా జననమరణములను జయించినవారుగా భావింపవలెను. మానవుడు దేహాత్మబుద్ధిని కలిగియున్నంత వరకు బద్ధజీవునిగానే బావింపబడినను, ఆత్మజ్ఞానము ద్వారా సమత్వస్థితికి ఉద్ధరింపబడినంతనే బద్ధజీవితము నుండి విముక్తుడగును. అనగా మరణానంతరము అతడు తిరిగి ఈ బౌతిక జగత్తున జన్మింపక ఆధ్యాత్మిక జగత్తునందు ప్రవేశించును. రాగద్వేషములు లేనివాడగుటచే భగవానుడు దోషరహితుడు. అట్లే జీవి కూడ రాగద్వేషముల నుండి విడివడినపుడు అతడు కూడ దోషరహితుడై ఆధ్యాత్మిక జగత్తున ప్రవేశించుటకు అర్హుడగును. అట్టి వ్యక్తులను ముందుగానే ముక్తులైనట్టివారిగానే బావింపవలెను. అతని లక్షణములు తరువాతి శ్లోకము నందు వర్ణింపబడినవి.

**5.20**

**న ప్రహృశ్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ I**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రాహ్మణి స్థిత: II**

**అనువాదము**

**ప్రియమైన దానీ పొందినప్పుడు ఉప్పొంగక అప్రియమైన దానిని పొందినప్పుడు కలత నొందనివాడును, స్థిరబుద్ధిని కలిగినవాడును, మోహితుడు కానివాడును, భగవద్విజ్ఞానమును పూర్తిగా నెరింగినవాడును అగు మానవుడు పరబ్రహ్మము నందు స్థితిని కలిగియున్నట్టివాడే యగును.**

**భాష్యము**

ఆత్మానుభూతిని పొందిన మహాత్ముని లక్షణములు ఇక్కడ తెలుప బడినవి. ఆత్మ మరియు దేహము ఒకటే అను దేహాత్మబుద్ధితో మోహగ్రస్థుడు కాకపోవుటయే అతని ప్రథమలక్షణము. తాను ఈ దేహమును కాదనియు దేవాదిదేవుని అంశననియు అతడు పూర్తిగా ఎరిగియుండును. కనుకనే దేహమునకు సంబంధించిన దేనినైనను అతడు సాధింపగలిగినప్పుడు సంతోషింపడు మరియు నష్టపోయినప్పుడును చింతింపడు. మనస్సు యొక్క ఈ స్థిరత్వమే 'స్థిరబుద్ధి' యనబడును. కనుకనే అతడు ఈ బౌతిక దేహమే ఆత్మగా భ్రమించుట గాని దేహమును శాశ్వతమని భావించి ఆత్మ యొక్క ఉనికిని నిర్లక్ష్యపరుచుట గాని చేయడు. ఇట్టి జ్ఞానము అతనిని బ్రహ్మము, పరమాత్మ, భగవానుడనెడి పరతత్త్వ జ్ఞానమును పరిపూర్ణముగా అవగాహన చేసుకొనగలిగెడి

ఉన్నతస్థితికి చేర్చగలదు. ఈ విధముగా అట్టిభక్తుడు అన్ని విధములుగా పరబ్రహ్మములో ఐక్యము నొందుటకు యత్నింపక, తన నిజస్వరూప స్థితిని పూర్తిగా ఎరుగగలడు. ఇదియే బ్రహ్మానుభూతి లేదా ఆత్మానుభూతి యనబడును. అట్టి స్థిరమైన చైతన్యమే కృష్ణచైతన్యము.

**5.21**

**బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్ సుఖమ్ ।**
**స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥**

**అనువాదము**

**అట్టి ముక్తపురుషుడు బాహ్యేంద్రియ ఆనందమునకు ఆకర్షింపబడక అంతరమైన ఆత్మయందే సౌఖ్యము ననుభవించుచు సదా ధ్యానమగ్నుడై యుండును. ఆ విధముగా ఆత్మదర్శియైన వ్యక్తి పరబ్రహ్మమును ధ్యానించు కారణమున అపారమైన సుఖము ననుభవించును.**

**భాష్యము**

కృష్ణచైతన్యవంతుడు గొప్పభక్తుడైన శ్రీ యమునాచార్యులు ఈ క్రింది విధముగా చెప్పియుండిరి:

యదవధి మమ చేత: కృష్ణపాదారవిన్దే
నవనవరసధామన్యుద్యతం రంతుమాసీత్
తదవధి బత నారీసంగమే స్మర్యమాణే
భవతి ముఖవికార: సుష్టు నిష్ఠీవనం చ

"శ్రీకృష్ణభగవానుని దివ్యమైన ప్రేమయుక్త సేవ యందు నెలకొని దేవాదిదేవుని యందు నిత్యనూతనమైన ఆనందమును నేను అనుభవించు చున్నందున మైథున సుఖభావన కలిగినంతనే అరుచిచే ముఖవికారము కలిగి నేను ఆ భావముపై ఉమ్మివేయుదును." 'బ్రహ్మయోగము' లేక కృష్ణచైతన్యము నందున్నవాడు శ్రీకృష్ణభగవానుని దివ్యమైన భక్తియుక్తసేవ యందు నెలకొని యున్నందున బౌతిక సుఖముల పట్ల రుచిని పూర్తిగా కోల్పోవును. బౌతిక భావనలో అత్యున్నత సుఖము మైథునభోగము. ప్రపంచమంతయు ఈ భ్రమతోనే కొనసాగుచున్నది. బౌతికవాది ఇట్టి భావన లేకుండ ఎట్టి కర్మను చేయజాలడు. కాని కృష్ణచైతన్యము నందు నెలకొనిన అట్టివ్యక్తి మైథున సుఖమును త్యజించి అధికమైన ఉత్సాహముతో కర్మచేయును. అట్టి భోగత్యాగము ఆత్మానుభూతికి ఒక పరీక్ష. ఎందుకనగా, ఆత్మానుభూతి మరియు మైథున సుఖమునకు పొత్తు ఎన్నడును కుదరదు. కృష్ణచైతన్యవంతుడు ముక్తాత్మడగుటచేత ఏ విధమైన ఇంద్రియ సుఖముల పట్లను ఆకర్షణను కలిగియుండడు.

**5.22**
**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యన్తవన్త: కౌన్తేయ న తేషు రమతే బుధ: ॥**

**అనువాదము**

**బుద్ధిమంతుడు ఇంద్రియ సంపర్కముచే కలుగు దుఃఖకారణములైన భోగము లందు పాల్గొనడు. ఓ కౌంతేయ! అట్టి సుఖములు ఆద్యంతములను కలిగి యుండును. అందుచేత వివేకవంతుడు వాని యందు ప్రీతినొందడు.**

**భాష్యము**

భౌతిక సుఖములు ఇంద్రియ సంపర్కముచే కలుగుచుండును. కాని దేహము అశాశ్వత మైనందున అట్టి భౌతిక సుఖములన్నియు అశాశ్వతములగును. ముక్తాత్ముడు అశాశ్వతమైన దేనియందును ఆసక్తిని కనపరచడు. ఆధ్యాత్మికానందపు అనుభూతిని చవిచూచిన ముక్తాత్ముడు తుచ్ఛమైన సుఖము ననుభవించుటకు ఎట్లు అంగీకరించును? ఈ విషయమును గూర్చి 'పద్మపురాణము' (శ్రీరామచంద్రశతనామ స్తోత్రము-8) నందు ఇట్లు తెలుపబడినది :

రమంతే యోగినో నన్తే సత్యానందే చిదాత్మని।
ఇతి రామపదేనాసౌ పరం బ్రహ్మాభిధీయతే ॥

"యోగులు పరతత్త్వము నందు రమించుచు అనంతముగా దివ్యానందము ననుభవింతురు. కనుకనే పరతత్త్వము దేవాదిదేవుడు శ్రీరాముడని తెలియబడును."

శ్రీమద్భాగవతము(5.5.1)నందు కూడ ఈ విధముగా తెలుపబడినది :

నాయం దేహో దేహభాజాం నృలోకే కష్టాన్ కామనర్హతే విడ్భుజాం యే।
తపో దివ్యం పుత్రకా యేన సత్త్వం శుద్ధ్యేద్యస్మాద్ బ్రహ్మసౌఖ్యం త్వనంతమ్ ॥

ఋషభదేవుడు ఇలా చెబుతున్నాడు: "ప్రియమైన పుత్రులారా! మానవ జన్మయందు ఇంద్రియప్రీతి కొరకై తీవ్రముగా యత్నించుట యుక్తము కాదు. అట్టి ఇంద్రియ సుఖములు మలభక్షణము చేయు సూకరములకు కూడ లభించును. అట్లుగాక, ఈ జీవిత మనుగడను శుద్ధిచేయు తపస్సును మీరు చేపట్టవలెను. తత్ఫలితముగా మీరు అనంతమైన ఆధ్యాత్మికానందము ననుభవింపగలరు."

కనుకనే నిజమైన యోగులు లేక వివేకమంతుడు నిరంతర భవబంధమునకు కారణమైన ఇంద్రియసుఖములచే ఆకర్షణకు గురికారు. మానవుడు బౌతిక విషయ సుఖముల పట్ల ఎంత అధికముగా ఆసక్తిని పెంచుకొనునో అంత అధికముగా భౌతిక దుఃఖములందు బంధింపబడును.

**5.23**
**శక్నోతీహైవ య: సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్త: స సుఖీ నర: ॥**

**అనువాదము**

**ఈ వర్తమాన దేహమును విడుచుటకు పూర్వమే ఎవడు భౌతికేంద్రియ ప్రేరణములను సహించగలుగునో, కామక్రోధముల తీవ్రతను నిరోధింపజాలునో, అతడే దివ్యస్థితి యందున్నట్టివాడై ఈ జగత్తునందు సౌఖ్యవంతుడు కాగలడు.**

**భాష్యము**

ఆత్మానుభూతి మార్గమున స్థిరమైన పురోభివృద్ధిని పొందగోరువాడు భౌతిక ఇంద్రియ వేగములను నియంత్రించుటకు యత్నంపవలెను. వాచావేగము, క్రోధవేగము, మనోవేగము, ఉదరవేగము, ఉపవస్థవేగము, జిహ్వావేగము అను అనేక ఇంద్రియ వేగములు కలవు. ఈ వివిధేంద్రియ వేగములను మరియు మనస్సును నిగ్రహింప గలిగినవాడు 'గోస్వామి' లేక 'స్వామి' యనబడును (ఉపదేశామృతము,1). అట్టి గోస్వాములు నియంత్రింపబడిన కఠినమైన జీవితములను గడుపుతూ ఇంద్రియ వేగములకు దూరమై యుందురు. భౌతిక వాంఛలు సంతృప్తి నొందనప్పుడు అవి క్రోధమును కలిగించును. కనుకనే భౌతికమైన మనస్సు, నేత్రములు, హృదయము కలతనొందును. కనుకనే ఈ భౌతిక దేహమును విడుచుటకు పూర్వమే మానవుడు వానిని నియంత్రించుటను అభ్యసింపవలెను. అట్లు చేయగలిగినవాడు ఆత్మానుభూతిని పొందినట్టివాడై అట్టి స్థితియందు అతడు పూర్ణానందము ననుభవించును. కనుక కోరిక మరియు క్రోధములను నియంత్రించుటకు తీవ్రముగా యత్నించుటయే యోగసంపన్నుని విధ్యుక్తధర్మమై యున్నది.

**5.24**
**యో న్త:సుఖో న్త రారామస్తథాన్తర్జ్యోతిరేవ య: ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతో ధిగచ్ఛతి ॥**

**అనువాదము**

**తన అంతరంగమందే ఆనందమును కలిగినవాడును, ఉత్సాహవంతుడై అంతరంగమందే రమించువాడును, అంతరంగమందే లక్ష్యమును కలిగిన వాడును అగు మానవుడే నిజమైన యోగిశ్రేష్ఠుడు. బ్రహ్మభూతుడైన అట్టివాడు అంత్యమున పరబ్రహ్మమునే పొందగలడు.**

**భాష్యము**

అంతరంగము నందు ఆనందమును అనుభవించనివాడు పై పై సుఖములను కలుగజేయు బాహ్యకర్మల నుండి ఎట్లు విరమింపగలడు? ముక్తాత్ముడు యథార్థమైన అనుభవము చేతనే సుఖము ననుభవించును. కనుకనే అతడు ఎక్కడైనను మౌనముగా కూర్చొని అంతరంగము నందే సుఖమును అనుభవింపగలడు. అట్టి ముక్తపురుషుడు బాహ్యసుఖము నెన్నడును వాంఛింపడు. ఈ స్థితి 'బ్రహ్మభూత స్థితి' యని

పిలువబడును. అట్టి స్థితిని పొందిన మానవుడు భగవద్ధామమును నిశ్చయముగా చేరగలడు.

**5.25**
**లభన్తే బ్రహ్మనిర్వాణమ్ ఋషయ: క్షీణకల్మషా: I**
**ఛిన్నద్వైధా యతాత్మాన: సర్వభూతహితే రతా: II**

**అనువాదము**

**అంతరంగమందే మనస్సు సంలగ్నమై సందేహముల నుండి ఉత్పన్నమైనట్టి ద్వంద్వములకు అతీతమైనవారును, సర్వజీవుల సంక్షేమము కొరకే ఉత్సాహముతో పనిచేయువారును, సర్వ పాపరహితులైన వారును అగు ఋషులే బ్రహ్మ నిర్వాణమును పొందుదురు.**

**భాష్యము**

సంపూర్ణముగా కృష్ణచైతన్యము నందున్నవాడే వాస్తవమునకు సర్వజీవుల సంక్షేమ కార్యమునందు నెలకొనినట్టివాడని చెప్పబడును. శ్రీకృష్ణుడే సర్వమునకు మూలకారణమనెడి వాస్తవజ్ఞానము గల వ్యక్తి ఆ భావముతో వర్తించినచో అందరి సంక్షేమము కొరకును వర్తించినవాడగును. శ్రీకృష్ణభగవానుడు సర్వభోక్త, పరమ ప్రభువని, పరమ మిత్రుడనెడి విషయమును మరచుటయే మానవుల దుఃఖమునకు కారణము. కనుకనే మానవసమాజ మందంతటను ఈ చైతన్యమును పునరుద్ధరించుటయే వాస్తవమునకు అత్యున్నత సంక్షేమ కార్యము. బ్రహ్మ నిర్వాణమును పొందకుండ ఎవ్వరును అట్టి ఉత్తమ సంక్షేమ కార్యము నందు నెలకొనజాలరు. కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణుని దేవాదిదేవత్వము నందు ఎట్టి సందేహమును కలిగియుండడు. అతడు పూర్తిగా పాప రహితుడగుటయే అందులకు కారణము. అదియే దివ్యమైన ప్రేమస్థితి.

మానవ సమాజమునకు భౌతిక సంక్షేమమును చూచుట యందు మాత్రమే ఆసక్తుడైనవాడు వాస్తవమునకు ఎవ్వరికిని హితమును చేగూర్చజాలడు. బాహ్య దేహమునకు, మనస్సునకు చేకూర్చబడు తాత్కాలిక ఉపశమనము సంతృప్తిని కలుగజేయదు. జీవన సంఘర్షణ మందలి దుఃఖములకు నిజమైన కారణము శ్రీకృష్ణభగవానునితో తమకు గల సంబంధమును జీవుడు మరచుటయే. శ్రీకృష్ణునితో తనకు గల నిత్యసంబంధమును మానవుడు పూర్తిగా ఎరిగినప్పుడు భౌతిక దేహము నందున్నప్పటికిని అతడు ముక్తాత్ముడే యగును.

**5.26**
**కామక్రోధవిముక్తానాం యతీనాం యతచేతసామ్ I**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ II**

**అనువాదము**

**కామక్రోధముల నుండి విడివడినవారును, ఆత్మదర్శులును, ఆత్మ సంయమనము కలిగినవారును, సంపూర్ణత్వము కొరకు నిరంతరము యత్నించువారును అగు**

**మహాత్ములు నిశ్చయముగా అచిరకాలములోనే బ్రహ్మనిర్వాణమును పొందుదురు.**

భాష్యము

ముక్తిని పొందుట కొరకై నిరంతరము యత్నించు సాధుపురుషులలో కృష్ణచైతన్యము నందున్నవాడు అత్యంత శ్రేష్ఠుడు. శ్రీమద్భాగవతము(4.22.39) ఈ విషయమునే ఇట్లు నిర్ధారించుచున్నది :

యత్పాదపంకజపలాశవిలాసభక్త్యా కర్మాశయం గ్రథితముద్గ్రథయన్తి సంత:।
తద్వన్న రిక్తమతయో యతయో పి రుద్ధస్రోతోగణాస్తమరణం భజ వాసుదేవమ్॥

"దేవాదిదేవుడైన వాసుదేవుని భక్తియుక్త సేవతో అర్చించుటకు యత్నింపుము. కామ్యకర్మల యందు గల నిగూఢమైన వాంఛను సమూలముగా నశింప జేసికొనుచు భగవానుని పాదపద్మములను సేవించుటచే గలుగు దివ్యానందము ననుభవించు భక్తులు తమ ఇంద్రియ వేగములను అణచగలిగినట్లుగా మహామునులు కూడ ఇంద్రియ వేగములను నియత్రింప లేకున్నారు."

కామ్యకర్మల ఫలమును అనుభవింప వలెనను కోరిక బద్ధజీవుని యందు మిక్కిలి గాఢముగా నుండును. మహామునులైన వారు కూడ ఎంతగా ప్రయత్నించినను అట్టివాంఛలను నియంత్రింపజాలరు. కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణభగవానుని సేవయందు సదా నెలకొనియుండు భగవద్భక్తుడు ఆత్మజ్ఞాన పూర్ణుడై శీఘ్రమే 'బ్రహ్మనిర్వాణ' స్థితిని (బ్రహ్మమునందు ముక్తిని) పొందును. అతడు ఆత్మానుభూతి విషయమున సమగ్రజ్ఞానము గలవాడగుట చేత నిరంతరము ధ్యానమగ్నుడై యుండును. దీనికి ఈ క్రింది ఉదాహరణను తెలుపవచ్చును :

దర్శనధ్యానసంస్పర్శైర్ మత్స్యకూర్మవిహంగమా:
స్వాన్యపత్యాని పుష్ణన్తి తథాహమపి పద్మజ

దేవాదిదేవుడు బ్రహ్మదేవునితో ఇట్లు పలికెను : "మత్స్యము దృష్టి చేతను, తాబేలు ధ్యానము చేతను, పక్షులు స్పర్శచేతను తమ సంతానమును పోషించును. అట్లే, ఓ పద్మజా! నేను కూడా నా భక్తులను ఆ విధముగానే పోషించు చుందును."
(పద్మపురాణము)

మత్స్యము కేవలము తమ సంతానమును దర్శనము ద్వారానే పోషించును. తాబేలు ధ్యానము ద్వారా తన సంతానమును పోషించును. తాబేలు తన గ్రుడ్లను తీరము నందు గల భూమిలో పెట్టి తాను నీటిలో తిరుగుచు వానిని గూర్చి ధ్యానించు చుండును. అట్లే కృష్ణచైతన్యవంతుడైన భక్తుడు భగవద్ధామము నుండి అత్యంత దూరము నందున్నప్పటికిని కృష్ణచైతన్యము నందు నెలకొనుట ద్వారా నిరంతరము దేవాదిదేవుని
ధ్యానిస్తూ అతని కృపచేతనే భగవద్ధామమును చేరగలడు. అతడెన్నడును భౌతిక దుఃఖములచే ప్రభావితుడుకాడు. అట్టి జీవన స్థితియే 'బ్రహ్మనిర్వాణము' (నిరంతర బ్రహ్మభావనచే భౌతిక దుఃఖములు లేకుండుట) యనబడును.

**5.27- 28**

**స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాన్తరే భ్రువో: ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యన్తరచారిణౌ ॥**
**యతేన్ద్రియమనోబుద్ధిర్మునిర్మోక్షపరాయణ: ।**
**విగతేచ్ఛాభయక్రోధో య: సదా ముక్త ఏవ స: ॥**

## అనువాదము

**బాహ్యేంద్రియార్థము లన్నింటిని త్యజించి, దృష్టిని కనుబొమ్మల నడుమ కేంద్రీకరించి, ప్రాణాపాన వాయువులను నాసికారంధ్రముల యందే సమములుగా నిలిపి తద్వారా మనస్సును, బుద్ధిని, ఇంద్రియములను నియంత్రించుచు మోక్షమును వాంఛించు ముని కోరిక, భయము, క్రోధము నుండి విముక్తుడగును. సదా అట్టి స్థితిలో నిలిచియుండువాడు నిశ్చయముగా ముక్తిని పొందగలడు.**

## భాష్యము

కృష్ణచైతన్యము నందు నెలకొనుట ద్వారా మానవుడు వెంటనే తన ఆధ్యాత్మిక స్వరూపమును గుర్తింపగలుగును. తదుపరి అతడు భక్తియుక్త సేవ ద్వారా భగవానుని అవగతము చేసికొనగలడు. భక్తియుక్త సేవ యందు నెలకొని నప్పుడు, మానవుడు దివ్యమైన ఆధ్యాత్మిక స్థితికి చేరి తన కర్మలన్నింటి యందును శ్రీకృష్ణుని దర్శింప గలుగును. ఇట్టి ప్రత్యేక స్థితియే పరబ్రహ్మము నందు ముక్తస్థితి యనబడును.

పరబ్రహ్మము నందు ముక్తస్థితిని సాధించు విషయమును గూర్చి అర్జునునకు వివరించిన పిమ్మట శ్రీకృష్ణభగవానుడు యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధి అను యెనిమిది అంగములుగా గల 'అష్టాంగయోగ' ద్వారా ఎట్లు మానవుడు అట్టి స్థితిని పొంద గలడో ఉపదేశించుచున్నాడు. రాబోవు షష్ఠాధ్యాయము నందు వివరముగను, పంచమాధ్యాయపు చివరన స్వల్పముగా ఈ యోగవిషయము తెలుపబడినది. శబ్దము, స్పర్శ, రూపము, రుచి(రసము), వాసన (గంధము) వంటి ఇంద్రియార్థములను యోగము నందలి 'ప్రత్యాహార' విధానము ద్వారా తొలగించి,

దృష్టిని కనుబొమ్మల నడుమ నిలిపి, సగంమూసిన కనులతో నాసికాగ్రమున కేంద్రీకరింపవలెను. కనులను పూర్తిగా మూసినచో నిద్రించు అవకాశము కలదు. అంతేకాకుండ, ఇంద్రియార్థములచే ఆకర్షింపబడు అపాయము కూడ కలదు. కనుక కనులను పూర్తిగా తెరిచియుండుట చేత కూడ ఎట్టిలాభము కలుగదు. కనుకనే సగం మూసిన కనులతో, ఉచ్ఛ్వాస నిశ్వాసములను క్రమబద్ధము చేయుట ద్వారా శ్వాసచలనములను నాసిక యందే నియంత్రింపవలెను. ఇట్టి యోగభ్యాసము ద్వారా మానవుడు ఇంద్రియములను నియంత్రింప గలిగి బాహ్యములైన ఇంద్రియార్థములను త్యజింపగలుగును." ఆ విధముగా అతడు బ్రహ్మనిర్వాణమును పొందుటకు సన్నద్ధుడగును.

ఈ యోగవిధానము మానవుడు అన్నివిధములైన భయము, క్రోధముల నుండి విముక్తుడై దివ్యస్థితి యందు పరమాత్మ ఉనికిని అనుభూతి చెందుటకు ఎంతగానో తోడ్పడును. మరోమాటలో చెప్పాలంటే, యోగాసిద్ధాంతములను నిర్వహించుటలో కృష్ణచైతన్యము అత్యంత సులభమైన విధానము. ఈ విషయము రాబోవు అధ్యాయము నందు చక్కగా వివరింపబడును. కృష్ణచైతన్యవంతుడు నిరంతరము భక్తియుక్తసేవ యందు నెలకొని యుండుటచే తన ఇంద్రియములను మరే ఇతర కార్యములందును నెలకొల్పడు.

ఇంద్రియములను నియంత్రించుటకు ఈ పద్ధాతియే 'అష్టాంగ యోగ' పద్ధతి కంటెను ఉత్తమమై యున్నది.

**5.29**
**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తిమృచ్ఛతి ॥**

**అనువాదము**

**నా సంపూర్ణ చైతన్యము నందున్నవాడు నన్ను సర్వయజ్ఞములకు, తపోనియమములకు చరమ భోక్తగను, సర్వ లోకములకు మరియు దేవతలకు పరమేశ్వరునిగను, సకల జీవులకు లాభమును గూర్చువానిగను మరియు శ్రేయోభిలాషిగను తెలిసికొని భౌతిక దుఃఖముల నుండి విడివడి పరమశాంతిని పొందును.**

**భాష్యము**

మాయాశక్తి బంధములోనున్న బద్ధజీవులు భౌతిక జగత్తునందు శాంతిని పొందుటకై ఆరాటపడుచుందురు. కాని భగవద్గీత యందలి ఈ భాగమున వివరింపబడిన ఈ శాంతిసూత్రమును మాత్రము వారెరుగరు. అట్టి అత్యున్నతమైన శాంతిసూత్రము ఇక్కడ ఈ విధముగా వివరింపబడినది. సమస్త మానవ కర్మలకు శ్రీకృష్ణభగవానుడే దివ్యభోక్త. అతడే సర్వలోకములకు మరియు అక్కడి దేవతలకును ప్రభువగుటచే, అతని దివ్యసేవకై జనులు సర్వమును అర్పింపవలెను. అతని కంటెను మహత్తరుడు మరొక్కడు లేడు. దేవతలలో శ్రేష్ఠులైన బ్రహ్మరుద్రాదుల వంటి దేవతల కంటెను అతడు శ్రేష్ఠుడు. కనుకనే భగవానుడు "తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్" అని వేదములందు (శ్వేతాశ్వతరోపనిషత్తు 6.7) వర్ణింప బడెను. మాయామోహితులైన జీవులు తాము చూచు దాని కంతటికిని ఈశ్వరులు కావలెనని యత్నించు చున్నారు. కాని వాస్తవమునకు వారు దేవాదిదేవుని యొక్క మాయాశక్తి ఆధీనము నందున్నట్టివారే. శ్రీకృష్ణభగవానుడు భౌతిక ప్రకృతికి ప్రభువు. బద్ధజీవులు కఠినమగు ప్రకృతి నియమములకు లోబడియుండువారు. ఈ నగ్నసత్యమును ఎరుగనంతకాలము ప్రపంచమునందు వ్యక్తిగతముగా గాని, సామూహికముగా గాని విశ్వశాంతిని సాధించు అవకాశమే లేదు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే పరమేశ్వరుడు. శ్రేష్ఠులైన దేవతలతో సహా జీవులందరును అతని ఆధీనము నందుండువారు అనుటయే కృష్ణచైతన్యము. అట్టి సంపూర్ణ కృష్ణచైతన్యము నందే మానవుడు పరమశాంతిని పొందగలడు.

సాధారణముగా 'కర్మయోగ'మని తెలియబడు కృష్ణచైతన్యమునకు ఈ పంచామాధ్యాయము ప్రయోగాత్మక వివరనయై యున్నది. 'కర్మయోగ'ము ఏ విధముగా ముక్తిని చేకూర్చగలదనెడి మానసిక కల్పనతో కూడిన ప్రశ్నకు ఇక్కడ సమాధాన మివ్వబడినది. కృష్ణచైతన్యముతో కర్మచేయుట అనగా శ్రీకృష్ణుడే సర్వమునకు పరమేశ్వరుడు అను సంపూర్ణ జ్ఞానముతో కర్మచేయుటయని భావము. అట్టి కర్మ దివ్యజ్ఞానము కంటెను అన్యమైనది కాదు. భక్తియోగము ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము కాగా, జ్ఞానయోగము అట్టి భక్తియోగమునకు చేరు మార్గము వంటిది. పరతత్త్వముతో తనకు గల సంబంధ జ్ఞానముతో కర్మచేయుటయే కృష్ణచైతన్యము. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గూర్చిన పరిపూర్ణజ్ఞానమే ఈ చైతన్యము నందలి పరిపూర్ణ స్థితి. వాస్తవమునకు శుద్ధాత్మ భగవానుని అంశగా అతనికి నిత్యదాసుడై యుండును. కాని 'మాయ'పై

అధికారము వహింపవలెనను కోరికచే అతడు 'మాయ'తో సంపర్కమును కలిగించుకొనును. ఆ సంపర్కమే అతని సమస్త దుఃఖములకు కారణమగును. అతడు భౌతిక జగత్తులో సంపర్కమును కలిగి యున్నంతకాలము భౌతికావసరముల కొరకై కర్మనొనరింప వలసివచ్చును. కృష్ణచైతన్యమనునది అభ్యాసము ద్వారా ఆధ్యాత్మిక స్థితిని ఈ జగత్తునందు జాగృతము చేయునదైనందున మానవుడట్లు భౌతికత్వము నందున్నను క్రమముగా అది అతనిని ఆధ్యాత్మికతకు గొనిరాగలదు. ఆధ్యాత్మిక జీవితమున అతడు ఎంత అధికముగా పురోభివృద్ధిని సాధించునో అంత అధికముగా భౌతిక బంధముల నుండి విడివడగలుగును. భగవానుడు ఎవరి పట్లను పక్షపాతమును కలిగి యుండడు. కనుక మానవుని ఆధ్యాత్మిక పురోభివృద్ధి కృష్ణచైతన్యము నందు అతని విధ్యుక్తధర్మ నిర్వహణము పైననే ఆధారపడియుండును. అట్టి కృష్ణచైతన్య సహితకర్మ అన్నివిధముల ఇంద్రియములను నిగ్రహించుట యందును మరియు కామక్రోధముల వేగమును జయించుట యందును తోడ్పడును. ఈ విధముగా ఇంద్రియముల పలువేగములను నియంత్రించి, కృష్ణచైతన్యము నందు స్థిరముగా నెలకొనినవాడు నిజముగా 'బ్రహ్మనిర్వాణము' లేక ఆధ్యాత్మికస్థితి యందు నెలకొనిన వాడగును. యోగము యొక్క పరమ ప్రయోజనము నిర్వహింపబడు చున్నందున కృష్ణచైతన్యమందు 'అష్టాంగయోగ'ము అప్రయత్నముగా నిర్వహింపబడినట్లే యగును. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధి యను యెనిమిది అంగములు గల యోగాభ్యాసము మానవుని క్రమముగా ఉద్ధరించును. అది భక్తియుక్త సేవచే పరిపూర్ణత్వము నొందుట యందు ఉపోద్ఘాతము వంటిది మాత్రమే. భక్తియుక్త సేవయందలి పరిపూర్ణత్వమే మానవునకు శాంతిని ప్రసాదింపగలదు. అదియే మానవజన్మ పరమసంసిద్ధి.

**శ్రీమద్భగవద్గీత యందలి 'కర్మయోగము – కృష్ణచైతన్య సహితకర్మ' అను పంచమాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---------

# షష్ఠాధ్యాయము

# ధ్యానయోగము

**6.1**

**శ్రీభగవానువాచ**

**అనాశ్రిత: కర్మఫలం కార్యం కర్మ కరోతి య: ।**

**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియ: ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : తాను చేసిన కర్మఫలముల యందు ఆసక్తిని కలిగియుండక చేయవలిసిన కార్యములను చేయువాడే నిజమైన సన్న్యాసి కాగలడు. అతడే నిజమైన యోగి. అంతియేగాని కేవలము అగ్నిని రగిలింపక మరియు కర్మలను ఆచరింపక యుండెడివాడు యోగి కాజాలడు.**

## భాష్యము

ఈ అధ్యాయమున శ్రీకృష్ణభగవానుడు మనస్సును మరియు ఇంద్రియములను నియంత్రించుటకు ఒక సాధనముగా 'అష్టాంగ యోగ' పద్ధతిని వివరించుచున్నాడు. సాధారణముగా ముఖ్యముగా ఈ కలియుగములో దీనిని ఆచరించుట మానవులకు మిక్కిలి అసాధ్యమైన కార్యము. ఈ అధ్యాయమున అష్టాంగయోగ పద్ధతి ప్రతిపాదింపబడినను కర్మయోగము లేక కృష్ణచైతన్యముతో కర్మచేయుటయే ఉత్తమమని శ్రీకృష్ణభగవానుడు నొక్కిచెప్పుచున్నాడు. ప్రతియొక్కరు ఈ ప్రపంచము నందు తన కుటుంబమును పోషించు కొనుటకును, దానికి కావలిసిన సాధన సంపత్తిని సమకూర్చు కొనుటకును కర్మను చేయుచుందురు. కాని ఎవ్వరును తన కొరకు లేదా తన వారి కొరకు అను స్వార్థము లేకుండా కర్మచేయుట లేదు. కాని కర్మఫలములను ఆశింపక కృష్ణచైతన్యము నందు కర్మ చేయుటయే పరిపూర్ణత్వ లక్షణమై యున్నది. సహజముగ జీవులందరును శ్రీకృష్ణభగవానుని అంశలైనందున వారందరు వాస్తవమునకు కృష్ణచైతన్యము యందే కర్మనొనరింపవలెను. అదియే ప్రతిజీవికిని విధ్యుక్త ధర్మమగుచున్నది. దేహాంగములు దేహతృప్తి కొరకేగాని తమ తృప్తికొరకు వర్తించవు. అదేవిధముగా స్వీయసంతృప్తి కొరకు కాకుండ సంపూర్ణుడైనట్టి భగవానుని సంతృప్తికొరకు కర్మనొనరించు జీవుడే నిజమైన పరిపూర్ణ సన్న్యాసి లేక పరిపూర్ణయోగి యనబడును.

కొన్నిమార్లు సన్న్యాసులైన వారు కృత్రిమముగా తమనుతాము అన్ని భౌతిక కర్మల నుండి విముక్తుల మైతిమని భావించి, 'అగ్నిహోత్ర యజ్ఞములు' చేయుటను కూడ విరమింతురు. కాని వారి లక్ష్యము నిరాకార పరబ్రహ్మముతో ఏకమగుటయే అయినందున వాస్తవముగా వారు స్వార్థపరులై యున్నారు. అట్టి వాంఛ భౌతిక వాంఛకంటెను ఉత్తమమైనది. అయినప్పటికిని స్వార్థరహితమైనది కాజాలదు. అదేవిధముగా ఈ భౌతిక కర్మలన్నింటి నుండి విడివడి సగం మూసిన కనులతో యోగనభ్యసించు యోగి కూడ

ఏదోకొంత స్వీయలాభమును వాంఛించును. కాని కృష్ణచైతన్యమున కర్మచేయు వ్యక్తి ఎట్టిస్వార్థము లేకుండ కేవలము సంపూర్ణుడైన భగవానుని సంతృప్తి కొరకే కర్మనొనరించును. అట్టి కృష్ణచైతన్యవంతుడు తన స్వయంసంతృప్తి నందు ఎట్టి కోరికను కలిగియుండడు. అతని ఆధ్యాత్మిక విజయమునకు శ్రీకృష్ణభగవానుని సంతృప్తియే ప్రమాణమగును. ఈ విధముగా అతడు పరిపూర్ణమైన సన్న్యాసి లేక పరిపూర్ణుడైన యోగి యనబడును. సన్న్యాసమునకు పరిపూర్ణ ప్రతీకయైన శ్రీ చైతన్య మహాప్రభువు ఈ క్రింది విధముగా ప్రార్థించెను :

న ధనం న జనం న సుందరీం కవితాం వా జగదీశ కామయే
మమ జన్మని జన్మనీశ్వరే భావతాద్భక్తిరహైతుకీ త్వయి

"ఓ ప్రభూ! ధనము కూడబబెట్టవలెనని గాని, అందమైన స్త్రీలను అనుభవింప వలెనని గాని, అనేకముగా శిష్యులు కావలెనని గాని నేను వాంఛింపను. ఎన్ని జన్మలు కలిగినను ప్రతిజన్మము నందును నీ భక్తియుక్త సేవ యనెడి నిర్హేతుక కృపనే నేను వాంఛించుచున్నాను."(శిక్షాష్టకము-4)

## 6.2

**యం సన్న్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాణ్డవ ।**
**న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥**

### అనువాదము

**ఏది సన్న్యాసమని పిలువబడునో దానిని యోగముతో సమానమనియు (దేవాదిదేవునితో సంయోగము) నీవు తెలిసికొనుము. ఓ పాండుకుమారా! ఇంద్రియ తృప్తి వాంఛను విడువనిదే ఎవ్వడును యోగి కాజాలడు.**

### భాష్యము

మానవుడు జీవునిగా తన నిజస్వరూప స్థితిని ఎరిగి, తదనుగుణముగా వర్తించుటయే నిజమైన 'సన్న్యాసయోగము'(భక్తి) అనబడును. వాస్తవమునకు జీవునికి ప్రత్యేకమైన స్వతంత్ర స్వరూపము లేదు. అతడు భగవానుని తటస్థశక్తి. అతడు బహిరంగ శక్తిచే బంధితుడైనప్పుడు బద్ధుడగును మరియు కృష్ణచైతన్య వంతుడైనప్పుడు లేక ఆధ్యాత్మిక శక్తిని గుర్తించినప్పుడు తన నిజస్వరూపస్థితి యందు నెలకొనినవానిగను తెలియబడును. కనుక మానవుడు పరిపూర్ణజ్ఞానవంతుడైనప్పుడు అన్నిరకములైన ఇంద్రియ భోగకర్మలను (కామ్యకర్మలను) విడుచును. భౌతికాసక్తి నుండి ఇంద్రియములను నియంత్రించుచు యోగులు ఈ పద్ధతిని అభ్యసింతురు. కాని కృష్ణచైతన్యవంతుడు కృష్ణప్రయోజనము కొరకు ఉద్దేశింపబడని కర్మల యందు తన ఇంద్రియములను వినియోగించు అవకాశముండదు. కనుకనే కృష్ణచైతన్యవంతుడు ఒకేసారి సన్న్యాసియు మరియు యోగి అయియున్నాడు. జ్ఞాన, యోగ విధానములందు తెలుపబడిన జ్ఞానము, ఇంద్రియ నిగ్రహమును వాని ప్రయోజనము కృష్ణచైతన్యము నందు సహజముగానే సిద్ధించును. మానవుడు స్వార్థబుద్ధితో కూడిన కర్మలను విడువనిచో అట్టి జ్ఞానము, యోగము నిష్ఫలమగును. స్వార్థపూరితమైన చింతను విడిచి భగవానుని సంతృప్తి పరచుట కొరకై సంసిద్ధుడగుటయే జీవుని వాస్తవ లక్ష్యమై యున్నది.

కనుకనే కృష్ణచైతన్యవంతుడు స్వీయతృప్తి కొరకు ఎట్టి వాంఛను కలిగియుండక సదా భగవానునికి ప్రీతిచేకూర్చుట యందే ఆసక్తుడై యుండును. ఎవ్వరును కర్మచేయకుండ ఉండలేనందున భగవానుని గూర్చిన జ్ఞానము లేనివాడు స్వీయ సంతృప్తి కార్యము నందు ఆసక్తుడై యుండును. కాని వాస్తవమునకు కృష్ణచైతన్యమును అభ్యసించుట ద్వారా సర్వ ప్రయోజనములు మానవునకు సంపూర్ణముగా నెరవేరగలవు.

## 6.3

**ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।**

**యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥**

## అనువాదము

**అష్టాంగ యోగపద్ధతి యందు ఆరంభ స్థితిలో నున్న యోగికి కర్మము సాధనముగా చెప్పబడుచున్నది. యోగము నందు సిద్ధిని పొందిన వానికి సర్వ భౌతిక కర్మల విరమణ సాధనముగా చెప్పబడినది.**

## భాష్యము

మానవుడు భగవానునితో సంబంధమును ఏర్పరచుకొను పద్ధతియే 'యోగ'మని పిలువబడును. అత్యున్నతమైన ఆధ్యాత్మికానుభూతిని పొందుటకు అట్టి యోగమును ఒక నిచ్చెనగా భావించవచ్చును. ఆ నిచ్చెన జీవుని అత్యంత హీన స్థితి నుండి ఆరంభమై పరిపూర్ణమైన ఆత్మానుభూతి స్థితి వరకు వ్యాపించి యుండును. వివిధములైన యోగసాధనల యొక్క ఉన్నతస్థితుల ననుసరించి ఆ నిచ్చెన యొక్క వివిధ భాగములు వివిధ నామములతో పిలువబడును. ఏమైనను అట్టి యోగమను నిచ్చెనను జ్ఞానయోగము, ధ్యానయోగము, భక్తియోగము అని మూడు భాగములుగా విభజింపవచ్చును. ఆ యోగ నిచ్చెన యొక్క ఆరంభము 'యోగారురుక్షువు' స్థితియనియు, దాని అత్యున్నతమైన చివరిమెట్టు 'యోగారూఢ' స్థితి యనియు పిలువబడును.

ఆరంభదశలో వివిధరకాల నియమముల ద్వారా మరియు వివిధరకాల ఆసనముల ద్వారా (దాదాపు శరీరవ్యాయామము వంటివి మాత్రమే) ధ్యానము నందు ప్రవేశించుటకు చేయు అష్టాంగయోగనిలో పద్ధతులు కామ్యకర్మలుగనే పరిగణింపబడును. అయినను అట్టి కార్యకలాపాలన్నియు ఇంద్రియములను నియంత్రించుటకు అవసరమగు సంపూర్ణ మానసిక స్థిరత్వమును సాధించుటకు తోడ్పడును. అట్టి ధ్యానాభ్యాసము నందు పరిపూర్ణత్వమును సాధించినవాడు కలత కలిగించెడి సమస్త మనోకర్మలకు దూరముగా నుండును.

కృష్ణచైతన్యవంతుడు ఎల్లప్పుడు శ్రీకృష్ణుని గూర్చియే స్మరించు చుండుట చేత ఆరంభము నుండియే ధ్యానస్థితి యందు నెలకొనియుండును. అట్లే శ్రీకృష్ణుని సేవయందు సదా నిమగ్నుడై యుండును. కావున అతడు అన్నిరకాల భౌతిక కర్మలను త్యజించినవానిగా భావింపబడును.

6.4

**యదా హి నేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥**

**అనువాదము**

**భౌతికములైన కోరికల నన్నింటిని విడిచి ఇంద్రియతృప్తి కొరకు వర్తించుట గాని, కామ్యకర్మలందు నియుక్తుడగుట గాని చేయని మానవుడు యోగారూఢుడని చెప్పబడును.**

**భాష్యము**

శ్రీకృష్ణభగవానుని దివ్యమైన ప్రేమయుక్త సేవ యందు సంపూర్ణముగా నెలకొనినట్టి మానవుడు తనయందే తృప్తి ననుభవించును. కావున ఇంద్రియతృప్తి యందు కాని, కామ్యకర్మల యందు కాని ఎన్నడును ఆసక్తుడు కాడు. కర్మను చేయకుండ ఎవ్వరును ఉండలేనందున అట్లు కృష్ణచైతన్యవంతుడు కానిచో మానవుడు ఇంద్రియతృప్తి కార్యములందు నెలకొనవలసి వచ్చును. కృష్ణచైతన్యము లేనప్పుడు ప్రతియొక్కరు తమకు సంబంధించినట్టి గాని లేదా తనవారి కొరకు గాని సంబంధించిన స్వార్థపూరిత కర్మల యందు పాల్గొనుచుందురు. కాని కృష్ణచైతన్యవంతుడు మాత్రము ప్రతిదియు శ్రీకృష్ణుని సంతృప్తి కొరకే చేయుచు ఇంద్రియతృప్తి నుండి సంపూర్ణముగా అనాసక్తుడై యుండును. అట్టి అనుభవజ్ఞానము లేనివాడు యోగ అనెడి నిచ్చెన యొక్క ఉన్నతమైన చివరి మెట్టును చేరుటకు ముందుగానే యాంత్రికమైన విధానము ద్వారా భౌతికవాంఛల నుండి బయటపడుటకు యత్నింపవలసి వచ్చును.

6.5

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మనమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మన: ॥**

**అనువాదము**

**మానవుడు తన మనస్సు యొక్క సహాయముచే తననుతాను ఉద్ధరించు కొనవలెనే గాని అధోగతిపాలు చేసికొనరాదు. బద్ధజీవునికి మనస్సు అనునది మిత్రుడును, అలాగుననే శత్రువును అయియున్నది.**

**భాష్యము**

వివిధ పరిస్థితుల ననుసరించి 'ఆత్మ' యను పదము దేహమును, మనస్సును, జీవాత్మను కూడ సూచించును. యోగవిధాన మందు మనస్సు మరియు బద్ధజీవి అను అంశములు ప్రత్యేకించి ప్రధానములైనవి. యోగాభ్యాసమునకు మనస్సు కేంద్ర విషయమైనందున ఇక్కడ 'ఆత్మ' యనగా మనస్సు అని భావము. అట్టి మనస్సును నియంత్రించి, దానిని ఇంద్రియార్థముల నుండి తొలగించుటయే యోగవిధానముకు గల ముఖ్య ప్రయోజనము. బద్ధజీవునికి అజ్ఞానమనెడి బురద నుండి ఉద్ధరింప గలుగునట్లుగా మనస్సునకు శిక్షణ నొసగవలెనని ఇక్కడ నొక్కి చెప్పబడినది. వాస్తవమునకు భౌతిక స్థితి యందు మానవులు మనస్సు మరియు ఇంద్రియముల ప్రభావమునకు

లోబడియుందురు. భౌతిక ప్రకృతిపై ఆధిపత్యమును వహింపవలెనని కోరికను కలిగించు అహంకారముతో మనస్సు కూడియుండుట చేతనే, భౌతిక జగత్తునందు శుద్ధాత్మ భవబంధములలో చిక్కుకొనును. కనుక భౌతిక ప్రకృతి యొక్క పై పై మెరుగులకు ఆకర్షింపబడకుండునట్లుగా మనస్సునకు శిక్షణనీయవలెను. ఈ విధముగనే బద్ధజీవుడు రక్షింప బడగలడు. ఇంద్రియార్థముల యెడ ఆకర్షణతో ఎవరును తమనుతాము అధోగతి పాలు చేసికొనరాదు. ఇంద్రియార్థముల పట్ల మానవుడు ఎంత అధికముగా ఆకర్షింపబడునో, అంత అధికముగా అతడు భవబంధములలో చిక్కుకొనును. అట్టి భవబంధముల నుండి తప్పించుకొనుటకు మనస్సును సదా కృష్ణచైతన్యము నందు నిమగ్నము చేయుటయే అత్యుత్తమ మార్గము. ఈ విషయమును నొక్కి చెప్పుటకే ఈ శ్లోకమునందు 'హి' అను పదము ప్రయోగింపబడినది. అనగా ప్రతియొక్కరు దీనిని తప్పక ఆచరించవలెను. 'అమృత బిందూపనిషత్తు'(2) నందు ఇట్లు చెప్పబడినది :

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:
బంధాయ విషయాసంగో ముక్త్యై నిర్విషయం

"మానవునకు మనస్సే బంధమోక్షములకు కారణము. ఇంద్రియార్థము లందు లగ్నమైన మనస్సు బంధమునకు కారణము కాగా, ఇంద్రియార్థముల నుండి అనాసక్తమైన మనస్సు మోక్షమునకు కారణమగుచున్నది." అనగా కృష్ణచైతన్యము నందు నిరంతరము నెలకొనినట్టి మనస్సే మోక్షమునకు కారణమగును.

**6.6**

**బన్ధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జిత: ।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥**

**అనువాదము**

**మనస్సును జయించినవానికి మనస్సే ఉత్తమ మిత్రుడు. కాని అట్లు చేయలేని వానికి అతని మనస్సే గొప్ప శత్రువుగా వర్తించును.**

**భాష్యము**

నియంత్రించుటయే అష్టాంగయోగాభ్యాసపు ప్రయోజనమై యున్నది. మనస్సు నియంత్రింపబడనిచో యోగాభ్యాసము కాలయాపన మాత్రమే కాగలదు. మనస్సును అదుపు చేయలేనివాడు నిరంతరము గొప్ప శత్రువుతో కలసి జీవించు చున్నవాడగును. ఈ విధముగా అతని జన్మ మరియు జన్మ ప్రయోజనమును సంపూర్ణముగా వ్యర్థమగును. తనకంటెను ఉన్నతుడైన యజమాని ఆజ్ఞలను నిర్వర్తించుట యనునది జీవుల సహజ నిజస్థితి. మనస్సు జయింపరాని శత్రువుగా నున్నంత కాలము అతడు కామము, క్రోధము, ద్వేషము, లోభము, మోహము వంటివాటి ఆజ్ఞలను సేవింపవలసి వచ్చును. కాని మనస్సు జయింప ఆజ్ఞల ననుసరించుటకు స్వచ్ఛందముగా అంగీకరించును. హృదయస్థుడైన పరమాత్మతో కూడి, అతని ఆజ్ఞల ననుసరించుటనే నిజమైన యోగము ఉపదేశించును. కృష్ణచైతన్యము నందు ప్రత్యక్షముగా నెలకొనిన వానికి భగవానుని ఆజ్ఞలను సంపూర్ణముగా పాటించుట అప్రయత్నముగా జరిగిపోవును.

**6.7**

**జితాత్మన: ప్రశాన్తస్య పరమాత్మా సమాహిత: ।**

**శీతోష్ణసుఖదు:ఖేషు తథా మానాపమానయో: ॥**

**అనువాదము**

**మనస్సును జయించిననాడు శాంతిని పొందియుండుటచే పరమాత్మను చేరినట్టి వాడేయగును. అట్టి వానికి సుఖదుఃఖములు, శీతోష్ణములు మానపమానములు అన్నియును సమానములే అయియున్నవి.**

**భాష్యము**

వాస్తవమునకు అందరి హృదయము లందు పరమాత్మ రూపమున నెలకొనినట్టి దేవాదిదేవుని ఆజ్ఞలను పాటించుటకే సర్వజీవులు ఉద్దేశింపబడి యున్నారు. కాని మనస్సు బహిరంగశక్తిచే భ్రాంతిచెంది పెడదారి పట్టినప్పుడు మానవుడు భౌతిక కర్మలయందు చిక్కుకొనును. కనుక ఏదేని ఒక యోగపద్ధతి ద్వారా మనస్సు నియంత్రింప బడినంతనే అతడు గమ్యస్థానమును చేరినట్టివానిగా భావింపవచ్చును. వాస్తవమునకు ప్రతివ్యక్తియు ఉన్నతమైన ఆజ్ఞల ననుసరింప వలసి వచ్చును. కనుక మానవుని మనస్సు ఉన్నతప్రకృతి నందు నెలకొనినప్పుడు అతడు భగవానుని ఆజ్ఞల ననుసరించుట తప్ప అన్యమును ఎరుగజాలడు. మనస్సు సదా ఉన్నత ఆజ్ఞలను గ్రహించి వానిని అనుసరింపవలసి యుండును. కనుక మనస్సు నియంత్రింప బడినప్పుడు అప్రయత్నముగా పరమాత్మ ఆజ్ఞలను అనుసరించును. ఇట్టి ఆధ్యాత్మిక స్థితిని కృష్ణచైతన్యవంతుడు వెంటనే పొంది యుండుట చేత అతడు సుఖదుఃఖములు, శీతోష్ణములు (చలి,వేడి) వంటి ప్రకృతి ద్వంద్వములచే ప్రభావితుడు కాకుండును. ఇట్టి స్థితియే ప్రత్యక్ష 'సమాధి' లేక పరబ్రహ్మము నందు సంలగ్నమైన స్థితి యనబడును.

**6.8**

**జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియ: ।**

**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్ట్రాశ్మకాంచన: ॥**

**అనువాదము**

**మానవుడు తాను పొందినటువంటి జ్ఞానవిజ్ఞానములచే సంపూర్ణముగా సంతృప్తి చెందినప్పుడు ఆత్మానుభూతి నందు స్థిరత్వమును పొందినట్టివాడై యోగి యనబడును. అట్టివ్యక్తి ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొని ఆత్మనిగ్రహమును కలిగియుండును. అతడు ప్రతి వస్తువును - లకరాళ్ళనైనను, రాళ్ళనైనను లేదా బంగారమునైనను సమానముగా గాంచును.**

**భాష్యము**

పరతత్త్వమును అనుభవపూర్వకముగా గ్రహింపని పుస్తక జ్ఞానము నిష్ప్రయోజనము. అది ఈ విధముగా తెలుపబడినది :

అత: శ్రీకృష్ణనామాది న భవేద్ గ్రాహ్యమింద్రియై: ।
సేవోన్ముఖే హి జిహ్వాదౌ స్వయమేవ స్ఫురత్యధ: ॥

"భౌతికముగా కలుషితమైన ఇంద్రియముల ద్వారా ఎవ్వరును శ్రీకృష్ణుని నామము, రూపము, గుణము, లీలల దివ్యస్వభావమును గ్రహింపజాలరు. కేవలము దివ్యమైన భక్తియుక్తసేవ ద్వారా ఆధ్యాత్మికముగా పరిపూర్ణుడైనప్పుడే మానవునకు ఆ భగవానుని దివ్య నామ రూప గుణలీలలు వ్యక్తములగును." (భక్తిరసామృతసింధువు 1.2.234)

కృష్ణచైతన్య శాస్త్రమే ఈ భగవద్గీత. లౌకిక పాండిత్యము ద్వారా ఎవ్వరును కృష్ణచైతన్యవంతులు కాజాలరు. అందులకై శుద్ధచైతన్యము గల వ్యక్తితో సాంగత్యము చేయు అదృష్టము వారికి యుండవలెను. కృష్ణచైతన్యవంతుడు శుద్ధమైన భక్తియుక్త సేవతో సంతృప్తుడై యుండుటచే శ్రీకృష్ణుని కృపచేత అనుభవపూర్వకమైన జ్ఞానమును గ్రహింపగలుగును. అట్టి అనుభవపూర్వకమైన జ్ఞానము చేతనే ఎవ్వరైనను పరిపూర్ణులగుదురు మరియు తమ విశ్వాసము నందు స్థిరముగా నెలకొన గలుగుదురు. కాని అనుభవపూర్వకమైన జ్ఞానము లేక కేవలము పుస్తకజ్ఞానము గలవారు బాహ్యమైన భిన్న వైరుధ్యములచే సులభముగా భ్రాంతికి మరియు కలతకు గురియగుదురు. ఆత్మజ్ఞానము గలవాడే శ్రీకృష్ణునికి సంపూర్ణముగా శరణు పొంది యున్నందున నిజముగా ఆత్మనిగ్రహమును కలిగియున్న వాడగును. లౌకిక పాండిత్యముతో ఎట్టి సంబంధము లేనివాడగుట చేత అతడు ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొనియుండును. లౌకికపాండిత్యము మరియు మనోకల్పనలు ఇతరులకు బంగారము వంటివైనను అతనికి మాత్రము గులకరాళ్ళు లేదా రాళ్ళతో సమానమై యుండును.

## 6.9

**సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబన్ధుషు ।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥**

### అనువాదము

**ఋజువర్తనులైన శ్రేయోభిలాషులను, ప్రియమైన మిత్రులను, తటస్థులను, మధ్యవర్తులను, ఈర్ష్యపరులను, శత్రుమిత్రులను, పాపపుణ్యులను సమబుద్ధితో చూచువ్యక్తి మరింత పురోభివృద్ధి నొందినవానిగా పరిగణింపబడును.**

## 6.10

**యోగీ యుఞ్జీత సతతమాత్మానం రహసి స్థిత: ।**
**ఏకాకి యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహ: ॥**

### అనువాదము

**యోగియైనవాడు తన దేహమును, మనస్సును, ఆత్మను సర్వదా పరతత్త్వముతో సంధాన పరచుటయందే నిమగ్నము చేయవలెను. అతడు ఏకాంత ప్రదేశము**

**నందు ఒంటరిగా నివసించుచు సావధానముగా మనస్సును ఎల్లప్పుడు నియత్రింప వలెను. అతడు కోరికల నుండియు మరియు సమస్తమును కలిగియుండవలెను. భావనల నుండియు విముక్తుడై యుండవలెను.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు బ్రహ్మము, పరమాత్మ, భగవానుడను మూడు విధములుగా వివిధ దశలలో అనుభవమునకు వచ్చును. అట్టి భగవానుని దివ్యమగు ప్రేమయుక్తసేవ యందు సదా నెలకొనియుండుటయే కృష్ణచైతన్యమని సంక్షిప్తముగా తెలుపవచ్చును. కాని నిరాకారబ్రహ్మము లేదా పరమాత్మానుభూతి నందు ఆసక్తులైనవారు కూడ పాక్షికముగా కృష్ణచైతన్యవంతులే యనబడుదురు. ఎందుకనగా నిరాకారబ్రహ్మము శ్రీకృష్ణుని దివ్యమైన దేహకాంతి కాగా, పరమాత్మ సర్వాంతర్యామియైన శ్రీకృష్ణుని స్వాంశరూపము. ఈ విధముగా నిరాకారవాదులు మరియు ధ్యానయోగులు కూడ పరోక్షముగా కృష్ణచైతన్యవంతులే. కాని ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము నందు నెలకొనినవాడు బ్రహ్మమననేమో మరియు పరమాత్మ యననేమో సంపూర్ణముగా ఎరిగియున్నందున అతడు సర్వోన్నత యోగి యనబడును. పరతత్త్వమును గూర్చిన అతని జ్ఞానము సంపూర్ణమైనది. అట్లుగాక నిరాకరవాదులు మరియు ధ్యానయోగులు కృష్ణచైతన్యము నందు అసంపూర్ణులై యుందురు.

అయినను వీరందరును శీఘ్రముగనో లేక ఆలస్యముగనో సర్వోన్నతమైన పరిపూర్ణత్వమును పొందుటకై తమ ప్రత్యేక సాధనల యందు నిరంతరము శ్రద్ధతో నిమగ్నులై యుండవలెనని ఇక్కడ బోధింపబడిరి. శ్రీకృష్ణుని యందే మనస్సును ఎల్లప్పుడు ఎకాగ్రము చేయుట భగవానునియోగి ప్రథమ కర్తవ్యము. ప్రతియొక్కరు నిరంతరము శ్రీకృష్ణునినే స్మరిస్తూ అతనిని క్షనమైనను విస్మరింపరాదు. ఆ విధముగా శ్రీకృష్ణభగవానునిపై మనస్సును కేంద్రీకరించుటయే 'సమాధి' యనబడును. మనస్సును కేంద్రీకరించుట కొరకై ఎవ్వరైనను ఏకాంతముగా నివసిస్తూ, బాహ్య విషయముల వలన కలిగెడి ఆందోళనలను పరిహరింపవలెను. అతడు తన ఆత్మానుభూతికి అనుకూలమైన వానిని స్వీకరించుట మరియు ప్రతికూలమైన వానిని త్యజించుట యందు మిక్కిలి శ్రద్ధ వహింపవలెను. విషయ వస్తువులను కూడబెట్టు కోవలెనను భావనతో తనను బంధించునటువంటి అనవసరమైన భౌతిక విషయముల కొరకై అతడు ఏ మాత్రము ప్రాకులాడరాదు.

మానవుడు ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము నందు నేలకొనినప్పుడు ఈ యోగపరిపూర్ణత్వము, నియమములను అప్రయత్నముగనే చక్కగా నిర్వహింప బడును. ఎందుకనగా, ప్రత్యక్ష కృష్ణచైతన్యము అనగా ఆత్మ సమర్పణమని భావము. అందులో నాది అను భౌతిక భావనకు ఏమాత్రము అవకాశముండదు. కనుకనే శ్రీల రూప గోస్వామి కృష్ణచైతన్యపు లక్షణములను ఈ క్రింది విధముగా (భక్తిరసామృత సింధువు 1.2.255, 256) వివరిస్తున్నారు :

అనాసక్తస్య విషయాన్ యథార్హాముపయుంజత:
నిర్బంద: కృష్ణసంబంధే యుక్తం వైరాగ్యముచ్యతే
ప్రాపంచికతయా బుద్ధ్యా హరిసంబంధివస్తున:
ముముక్షుభి: పరిత్యాగో వైరాగ్యం ఫల్గు కథ్యతే

మానవుడు సర్వమును తానే కలిగి యుండవలెనను భావనకు(స్వామిత్వమునకు) అతీతుడైనట్టివాడు. అట్లుగాక శ్రీకృష్ణునితో వాటికి గల సంబంధమును ఎరుగకుండ సర్వమును త్యజించువాడు వైరాగ్యము నందు పరిపూర్ణత్వము పొందినవాడు కాజాలడు,"

కృష్ణచైతన్యవంతుడు సర్వము శ్రీకృష్ణునకే చెందినదని పూర్తిగా ఎరుగుటచేత 'నాది' అను భావన నుండి విముక్తుడగును. కనుకనే, అతడు తన కొరకై దేని కొరకును ప్రాకులాడడు. కృష్ణచైతన్యమునకు అనుకూలమైన విషయములను ఎట్లు గ్రహింపవలెనో మరియు దానికి ప్రతికూలమైన వానిని ఎట్లు పరిత్యజింప వలెనో అతడు సంపూర్ణముగా ఎరిగియుండును. ఆధ్యాత్మికస్థితి యందుండుటచే అతడు సదా భౌతిక విషయ వస్తువుల నుండి దూరముగా నుండును. కృష్ణచైతన్యము లేని వారితో అతడు సంబంధము లేకుండటచే సదా ఒంటరియై యుండును. కనుకనే కృష్ణచైతన్యవంతుడే పరిపూర్ణయోగి యనబడును.

## 6.11-12

**శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మన: ।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలా జినకు శోత్తరమ్ ॥**
**తత్రైకాగ్రం మన: కృత్వా యతచిత్తేన్ద్రియక్రియ: ।**
**ఉపవిశ్యాసనే యుఇజ్యాద్ యోగమాత్మవిశుద్ధయే ॥**

### అనువాదము

**యోగభ్యాసము కొరకు యోగి ఏకాంత స్థలమున కేగి నేలపై కుశగ్రాసమును పరచి, దానిని లేడిచర్మము మరియు మృదువైన వస్త్రముతో కప్పవలెను. అట్టి ఆసనము అతి ఎత్తుగాను లేదా అతిక్రిందుగాను ఉండక పవిత్రమైన ప్రదేశము నందు ఏర్పరచుకోవలెను. పిదప యోగి దానిపై స్థిరముగా కూర్చుండి తన మనస్సును ఇంద్రియములను మరియు ఇతర కార్యకలాపములను నియంత్రించుచు, ఒకేలక్ష్యము నందు మనస్సును ఏకాగ్రపరచి హృదయ శుద్ధికొరకు యోగము నభ్యసించవలెను.**

### భాష్యము

'శుచౌ దేశే' అను పదము ఇక్కడ తీర్థస్థలములను సూచించుచున్నది. భారతదేశము నందు ధ్యానయోగులు లేక భక్తులందరును గృహములను వీడి గంగ, యమున వంటి పవిత్ర నదులు ప్రవహించు ప్రయోగ, మథుర, వృందావనము, హృషీకేశము, హరిద్వారము వంటి పవిత్ర ప్రదేశములను చేరి అక్కడ ఏకాంతముగా యోగనభ్యసింతురు. కాని ఇది అన్నివేళలా సర్వులకు (ముఖ్యముగా పాశ్చాత్యదేశవాసులకు) సాధ్యము కాదు. పెద్దపెద్ద పట్టణములలో యోగసమాజము లనబడేడివి కేవలము భౌతిక లాభములను గడింప వచ్చునేమో గాని నిజమైన యోగభ్యాసమునకు అవి ఏమాత్రము తగినవి కావు. ఆత్మనిగ్రహము లేనివాడు మరియు మనోచంచలము కలవాడు ధ్యానమును అభ్యసింపజాలడు. సాధారణముగా కలియుగము నందు జనులు అల్పాయుష్కులు, ఆధ్యాత్మిక పురోగతిని సాధించుటలో బద్ధకస్తులు, వివిధములైన దు:ఖములచే సదా కలత నొందినవారగుటచే ఈ

కలియుగమున భగవానుని పవిత్ర నామ సంకీర్తనమే ఆత్మానుభూతికి సర్వోన్నతమైన సాధన మార్గమని 'బృహన్నారదీయ పురాణము' నందు చెప్పబడినది :

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

"కపటము మరియు కలహములతో కూడిన ఈ యుగమునందు భగవానుని పవిత్రనామ సంకీర్తనమే ముక్తికి ఏకైక సాధనము. మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు."

**6.13-14**

**సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిర: ।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥**
**ప్రశాన్తాత్మా విగాతభీర్బ్రహ్మచారివ్రతే స్థిత: ।**
**మాన: సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పర: ॥**

**అనువాదము**

**శరీరమును, మెడను, శిరమును చక్కగా సమముగా(ఋజురేఖలో) నిలిపి దృష్టిని నాసికాగ్రముపై కేంద్రీకరింప వలెను. ఆ విధముగా కలత నొందనటు వంటి నియమిత మనస్సుతో, భయమును వీడి, బ్రహ్మచర్యమును పాటించుచు యోగియైనవాడు నన్నే హృదయము నందు ధ్యానించుచు నన్నే జీవిత పరమ లక్ష్యముగా చేసికొనవలెను.**

**భాష్యము**

చతుర్భుజుడైన విష్ణురూపము గల పరమాత్మగా ప్రతిజీవి హృదయము నందు నేలకొనియున్నట్టి శ్రీకృష్ణుని తెలిసికొనుటయే మానవజన్మయొక్క ప్రధాన లక్ష్యమై యున్నగలది. సర్వాంతర్యామియైన విష్ణురూపమును శోధించి దర్శించుట కొరకై యోగవిధానము అభ్యసింప బడవలెను గాని మరి యే ఇతర ప్రయోజనము కొరకు కాదు. జీవులందరి హృదయమునందు నెలకొనినట్టి సర్వాంతర్యామియైన ఆ విష్ణురూపము శ్రీకృష్ణుని సంపూర్ణాంశయే. అట్టి విష్ణుమూర్తి సాక్షాత్కారము లేదా అనుభవమనునది ఉద్దేశము కానప్పుడు, మానవుడు ఆచరించు యోగాభ్యాసము కేవలము బూటకమై కాలమును వృథాచేయునదే కాగలదు. జీవితపు పరమలక్ష్యము శ్రీకృష్ణభగవానుడే! హృదయస్థుడైన విష్ణుమూర్తి అనుభూతియే యోగాభ్యాసమునకు లక్ష్యము. ఈ హృదయము నందు నెలకొనినట్టి విష్ణుమూర్తి సాక్షాత్కారమునకు మానవుడు సంపూర్ణముగా మైథునభోగ జీవితము నుండి విదివడవలెను. కనుకనే అతడు గృహమును వీడి పైన పేర్కొన బడినట్లుగా ఆసీనుడై, ఏకాంత ప్రదేశమున ఒంటరిగా నివసింపవలెను. గృహమున కాని మరియొక చోట కాని మైథున సుఖమును అనుభవిస్తూ, యోగ తరగతుల యందు పాల్గొనుట ద్వారా ఎవ్వరును యోగులు కాజాలరు. ఎవ్వరైనను మనస్సును మరియు అన్నిరకాల ఇంద్రియతృప్తి కార్యములను, వీటిలో ప్రధానముగా

మైథునభోగత్యాగమును అభ్యసింపవలెను. యాజ్ఞవల్క్యమఅన్ని హర్షి సూచించిన బ్రహ్మచర్య నియమములను గూర్చి ఈ విధముగా చెప్పబడినది :

కర్మణా మనసా వాచా సర్వావస్థాసు సర్వదా
సర్వత్ర మైథునత్యాగో బ్రహ్మచర్యం ప్రచక్షతే

"అన్ని కాలములలో, అన్ని పరిస్థితులలో, ప్రదేశములలో మనసా, వాచా, కర్మణా మైథున భోగమును త్యజించుట కొరకే బ్రహ్మచర్య వ్రతము ఉద్దేశింప బడినది."

మైథునభోగము ననుభవించుచు ఎవ్వరును నిజమైన యోగాభ్యాసమును అభ్యసింపజాలరు. కనుకనే మైథున భోగసుఖమును గూర్చిన జ్ఞానము లేని బాల్యము నుండియే బ్రహ్మచర్యము బోధింపబడుచున్నది. ఐదేండ్లు వయస్సు నందే పిల్లలను గురుకులమునకు లేదా ఆధ్యాత్మికాచార్యుడు నివసించు ప్రదేశమునకు పంపినచో అతడు వారిని చక్కటి బ్రహ్మచారు లగునట్లుగా శిక్షణను ఒసగగలడు. ధ్యానమార్గము, జ్ఞానమార్గము లేదా భక్తిమార్గము ఏదైనను సరియే అట్టి బ్రాహ్మచార్యాభ్యాసము లేనిదే ఎవ్వరును వారీ యోగము నందు అభివృద్ధిని సాధింపజాలరు. అయినను గృహస్థజీవన ధర్మమును చక్కగా పాటించుచు, కేవలము భార్యతోనే నియమబద్ధముగా మైథున సుఖమును కలిగియున్నవాడు కూడ బ్రహ్మచారి యనబడును. అట్టి నిగ్రహము గల గృహస్థ బ్రహ్మచారులు భక్తిమార్గము నందు ఆమోదింపబడుదురు. కాని జ్ఞానము మరియు ధ్యానమార్గ సంప్రదాయములు అట్టి గృహస్థ బ్రహ్మచారులను తమ యందు చేర్చుకొనుటకు అంగీకరింపవు. అట్టి సంప్రదాయములు ఎటువంటి సడలింపు లేకుండ పూర్తిగా మైథున జీవన నియంత్రణను విధించును. భక్తిసంప్రదాయము మిక్కిలి శక్తిమంతమైన డగుటచే భక్తుడు భగవానుని దివ్యసేవ యందు నెలకొనుటచేత సహజముగనే మైథున సుఖము నందు ఆకర్షణను కోల్పోవును. కనుకనే భక్తి సంప్రదాయము నందు గృహస్థ బ్రహ్మచారికి నియమిత మైథున సుఖము ఆమోదింపబడినది. భగవద్గీత (2.59) యందలి శ్లోకము నందు ఈ విషయము ఇట్లు చెప్పబడినది:

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహిన:
రసవర్జం రసో ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే

ఇతరులు బలవంతముగా ఇంద్రియతృప్తిని నియంత్రింపగా భగవద్భక్తులు సర్వోన్నతమైన దివ్యరసాస్వాదన కారణముగా సహజముగనే ఇంద్రియ భోగముల నుండి వైదొలగుచున్నారు. భక్తులకు తప్ప అన్యులకు ఆ దివ్యరసాస్వాదనపు జ్ఞానము ఏ మాత్రము ఉండదు.

'విగతభీ:' – సంపూర్ణముగా కృష్ణచైతన్యము నందు నెలకొననిదే ఎవ్వరును భయరహితులు కాజాలరు. బద్ధజీవి తనకు శ్రీకృష్ణునితో గల నిత్య సంబంధమును విస్మరించుట చేతనే భయమును కలిగియుండును. "భయం ద్వితీయాభినివేశత: స్యాదీశాదాపేతస్య విపర్యయో స్మృతి:" అని శ్రీమద్భాగవతము(11.2.37) చెప్పుచున్నది. భయరాహిత్యమునకు కృష్ణచైతన్యమే ఏకైక మార్గము. కనుకనే కృష్ణచైతన్యవంతునకు పరిపూర్ణ అభ్యాసము సాధ్యపడును. అంతేకాకుండ, యోగాభ్యాసపు ముఖ్యోద్దేశ్యము హృదయము నందు నెలకొనినట్టి పరమాత్ముని దర్శించుటయే గనుక కృష్ణచైతన్యవంతుడు సహజముగనే యోగులందరిలోకి శ్రేష్ఠుడగు చున్నాడు. ఇక్కడ

తెలుపబడిన యోగసిద్ధాంతములు జనాదరణ పొందిన నామమాత్ర యోగసమాజముల సిద్ధాంతములకు భిన్నములై యున్నవి.

### 6.15

**యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానస: ।**
**శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి ॥**

**అనువాదము**

**ఈ విధముగా నిరంతరము దేహము, మనస్సు, కర్మలను నియంత్రించుచు ధ్యాన యోగియైనవాడు క్రమబద్ధమైన మనస్సు కలవాడై భౌతిక జీవిత స్థితి నుండి విరమించుట ద్వారా భగవద్రాజ్యమును (కృష్ణధామమును) పొందును.**

**భాష్యము**

యోగాభ్యాసపు పరమలక్ష్యము ఇప్పుడు స్పష్టముగా వివరింపబడినది. యోగాభ్యాసమును ఏ విధమైన భౌతిక సుఖములను పొందుట కొరకు కాకుండ, భౌతిక జీవనస్థితి నుండి విరమణ పొందుటకై ఉద్దేశింపబడినది. ఆరోగ్యాభివృద్ధి కొరకై ప్రయత్నించువాడు కాని భౌతికసిద్ధిని పొందగోరువాడు కాని భగవద్గీత ననుసరించి యోగికాజాలడు. అట్లే భౌతిక జీవన స్థితి నుండి విరమణము కూడ మానవుడు 'శూన్యము' నందు ప్రవేశింపజేయదు. వాస్తవమునకు అట్టి భావన మిథ్య. భగవానుని సృష్టిలో ఎక్కడను శూన్యమనునది లేదు. భౌతిక స్థితి నుండి విరమణ వాస్తవమునకు ఆధ్యాత్మిక లోకమైన భగవద్ధామమునకు చేర్చగలదు. భగవద్ధామము సూర్యచంద్రులు లేదా విద్యుత్తు యొక్క అవసరము లేని ప్రదేశమని భగవద్గీత(15.6) యందు స్పష్టముగా వర్ణింపబడినది. ఆధ్యాత్మిక జగత్తు నందలి లోకములన్నీ కూడ భౌతిక జగత్తు నందలి సూరునివలె స్వయం ప్రకాశమానములై యుండును. సృష్టి సర్వము భగవద్రాజ్యమేయైనను, ఆధ్యాత్మికాకాశము మరియు దానియందలి లోకములు మాత్రమే 'పరంధామము' అని పిలువబడును.

శ్రీకృష్ణభగవానునిచే భగవద్గీత యందు స్వయముగా చెప్పబడినట్లు, అతనిని గూర్చిన పరిపూర్ణ జ్ఞానమును కలిగినట్టి పరిపూర్ణయోగి(మచ్చిత్త:, మత్పర:, మత్ స్థానమ్) నిజమైన శాంతిని పొంది, అంత్యమున గోలోక వృందావనమని తెలియబడు అతని దివ్యధామమైన కృష్ణలోకమును చేరగలడు. "గోలోక ఏవనివసత్యఖిలాత్మ భూత:" -శ్రీకృష్ణభగవానుడు సదా తన స్వీయధామమైన గోలోకము నందు నివసించుచున్నను, తన స్వరూప శక్తులే సర్వత్రా వ్యాపించియున్న పరబ్రహ్మముగా మరియు అంతర్యామియైన పరమాత్మగా తెలియబడునని స్పష్టముగా 'బ్రహ్మ సంహిత' (5.37) నందు తెలుపబడినది. అట్టి శ్రీకృష్ణభగవానుని గూర్చిన సంపూర్ణావగాహనము మరియు అతని సంపూర్ణాంశయైన విష్ణువు యొక్క అవగాహనము లేనిదే ఎవ్వరును ఆధ్యాత్మిక జగత్తు నందు గాని (వైకుంఠము) భగవద్ధామము నందు గాని, గోలోక వృందావనము నందు గాని ప్రవేశింప జాలరు. కనుకనే కృష్ణచైతన్యమున కర్మనొనరించువాని మనస్సు ఎల్లప్పుడును కృష్ణలీలల యందే నిమగ్నమై యుండును. కనుక అతడు శ్రేష్ఠయోగి యనబడును (స వై మన: కృష్ణపదారవిందయో:). వేదము లందలి 'శ్వేతాశ్వతరోపనిషత్తు'(3.8) నందు కూడ : "తమేవ విదిత్వాతి మృత్యుమేతి"- "దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట చేతనే మానవుడు జన్మమృత్యువులో

త్యు చక్రమును జయింప గలదు." మరోవిధముగా చెప్పవలెననిన, యోగపరిపూర్ణత్వము అనగా భౌతిక జీవితము నుండి ముక్తిని సాధించుటయే. కాని ఇది ఇంద్రజాలము గాని అమాయకులైన ప్రజలను మోసపుచ్చు వ్యాయామ ప్రదర్శనము గాని కానేరదు.

## 6.16

**నాత్యశ్నతస్తు స్తి న చైకాన్తమనశ్నత: ।**

**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥**

## అనువాదము

**ఓ అర్జునా! అతిగా భుజించువానికి లేదా అతి తక్కువ భుజించు వానికి, అతిగా నిద్రించు వానికి లేదా తగినంత నిద్రలేనివానికి యోగి యగుటకు అవకాశము లేదు.**

## భాష్యము

ఇక్కడ యోగులకు ఆహారము మరియు నిద్రయందు నియమము విధింపబడినది. అధికముగా భుజించుట యనగా దేహపోషణకు అవసరమైన దానికంటెను అధికముగా భుజించుట. సమృద్ధిగా ధాన్యము, కాయకూరలు, ఫలములు, పాలు లభించు చున్నందున మానవులు జంతుమాంసమును భుజింప నవసరము లేదు. భగవద్గీత(17.8) ననుసరించి అట్టి సరళమైన ఆహారము సాత్త్విక ఆహారముగా పరిగణింపబడినది. తమోగుణము నందున్నవారు మాత్రమే మాంసాహారమును భుజింతురు. కనుకనే మాంసాహారమును భుజించువాడును, మద్యపానము, ధూమపానము చేయువాడును మరియు శ్రీకృష్ణునకు తొలుత అర్పింపని ఆహారమును భుజించువాడును పాపమునే భుజించుటచేత పాపకర్మ ఫలముల ననుభవింపవలసి వచ్చును. "భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మ కారణాత్" (భ.గీ.3.13) అనగా "శ్రీకృష్ణునికి అర్పింపకుండ ఇంద్రియతృప్తి కొరకై భుజించువాడును లేక తమకొరకు మాత్రమే ఆహారమును సిద్ధము చేసుకొనువారును పాపమునే భుజించువారు కాగలరు." పాపమునే భుజించువాడును మరియు తనకు అవసరమైన దానికంటెను అధికముగా భుజించువాడును పరిపూర్ణ యోగను అభ్యసింపలేడు. కనుకనే శ్రీకృష్ణునకు అర్పింపబడిన ఆహారమును భుజించుటయే సర్వులకు శ్రేష్ఠము. శ్రీకృష్ణునికి తొలుత అరింపబడని ఎట్టి ఆహారమును కృష్ణచైతన్యవంతుడు అంగీకరింపడు. కృష్ణచైతన్యవంతుడు మాత్రమే యోగాభ్యాసము నందు పరిపూర్ణత్వమును సాధింపగలడు. అట్లుగాక కేవలము తమ ఇచ్ఛానుసారము ఉపవాస విధానములను కల్పించుకొనుచు, కృత్రిమముగా ఆహారమును త్యజించు వ్యక్తియోగను అభ్యసింపజాలడు. కృష్ణచైతన్యవంతుడు శాస్త్రములలో తెలుప బడినట్లుగా ఉపవాసములను పాటించును. అతడు అతిగా భుజించుట లేదా అతిగా ఉపవసించుట కాని చేయనందున యోగాభ్యాసమును చక్కగా పాటింపగలుగును. అధికముగా భుజించువాడు స్వప్నములను చూచుచు అధిక సమయము నిద్రించును. దానికి ఫలితముగా, అతడు అవసరమైన దానికంటెను అధిక సమయము నిద్రింపవలసివచ్చును. వాస్తవమునకు మానవుడు ఆరుగంటల కంటెను అధికముగా నిద్రింపరాదు. ఆ విధముగా రోజులో ఆరుగంటల కంటెను అధికముగా నిద్రించువాడు తప్పక తమోగునముచే ప్రభావితుడైనట్టివాడే. అతడు సోమరియై అధికముగా నిద్రించును. కనుక అట్టివ్యక్తి ఎన్నడును యోగను అభ్యసింపజాలడు.

## 6.17

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥**

### అనువాదము

**నియమితములైన ఆహారము, నిద్ర, విశ్రాంతి, కర్మములు గలవాడు యోగాభ్యాసము ద్వారా భౌతిక క్లేశములను శమింప జేసికొనగలడు.**

### భాష్యము

దేహావసరములైన ఆహారము, నిద్ర, భయము(రక్షణ) మైథునములందు అతి యనునది యోగాభ్యాసము నందు పురోభివృద్ధికి ఆటంకము కలిగించును. కృష్ణభగవానునికి అర్పింపబడిన ఆహారమును పవిత్రమైన ప్రసాద రూపమున గ్రహించుట ద్వారా ఆహార నియమమును పాటింపవచ్చును. భగవద్గీత (9.26) ననుసరించి కాయకూరలు, పుష్పములు, ఫలములు, ధాన్యములు, పాలు మున్నగునవి శ్రీకృష్ణునకు అర్పింపబడును. ఈ విధముగా కృష్ణచైతన్య వంతుడు సాత్త్వికములు కానట్టియు, మానవులకు ఉద్దేశింప బడనట్టియు ఆహారమును స్వీకరింపకుండుట యందు అప్రయత్నముగానే శిక్షితుడు లేక నియమితుడు కాగలడు. కృష్ణచైతన్యవంతుడు తాను కృష్ణచైతన్య కర్మలను నిర్వహించుట యందు సదా జాగరూకుడై యుండును. కనుక అనవసరముగా నిద్రిస్తూ గడుపు కాలమును గొప్పనష్టముగా పరిగణించును. ‘అవ్యర్థకాలత్వమ్’- కృష్ణచైతన్యవంతుడు భక్తియుక్త సేవలేకుండ క్షణమైనను వృథాయగుటను సహింపడు. కనుకనే అతడు సాధ్యమైనంత అతి తక్కువ సమయము నిద్రించును. ఈ విషయమున అతనికి శ్రీల రూప గంటలు మాత్రమే నిద్రించెడువాడు. కొన్నిమార్లు ఆ మాత్రమును కూడ అతడు నిద్రించెవారు కాదు. హరిదాసు ఠాకూరుల వారు తన నిత్యనియమమైన మూడులక్షల హరినామము జపమాలపై పూర్తికానిదే ప్రసాదమును గ్రహించుట గాని లేదా క్షణమైనను నిద్రించుటను గాని చేసెడివారుకాదు. ఇక కర్మకు సంబంధించినంత వరకు కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణునితో సంబంధము లేనటువంటి ఏ కర్మను చేయ కున్నందున, అతని కర్మము ఇంద్రియతృప్తి భావనచే కలుషితము కాకుండ సర్వదా క్రమబద్ధమై యుండును. ఇంద్రియ భోగమనెడి ప్రశ్నయే లేనందున కృష్ణచైతన్యవంతునికి భౌతికమైన విశ్రాంతి ఉండదు. ఈ విధముగా తన కర్మ, వాక్కు, నిద్ర, జాగరణ, ఇతర దైహిక కార్యకలాపము లన్నింటి యందును నియమ బద్ధుడై యుండును. కావున అతనికి భౌతిక క్లేశము లేవియును లేకుండును.

## 6.18

**యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే ।**
**ని:స్పృహ: సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥**

### అనువాదము

**యోగాభ్యాసము ద్వారా యోగి తన మనోకర్మల నన్నింటిని నియంత్రించి, భౌతికములైన వాంఛలేమియు లేకుండ ఆధ్యాత్మిక స్థితి యందు ప్రతిష్ఠితుడైనప్పుడు యోగమునందు స్థిరుడైనట్లుగా చెప్పబడును.**

### భాష్యము

యోగి అనువాడు సహజముగనే అన్నిరకాల భౌతికవాంఛల నుండి (వాటిలో ముఖ్యముగా మైథునభోగము) విరమణ పొందియుండును. కనుక యోగికర్మల సాధారణ జనుల కర్మలకు భిన్నములుగా నుండును. పరిపూర్ణయోగి తన మనోకర్మలను చక్కగా నియంత్రించి ఏ విధమైన భౌతికవాంఛ చేతను కలతకు గురికాడు. శ్రీమద్భాగవతము(9.4.18-20) నందు తెలుపబడినట్లు, అట్టి పరిపూర్ణత్వ స్థితిని కృష్ణచైతన్యవంతులు అప్రయత్నముగానే పొందుదురు :

స వై మన: కృష్ణపదారవిన్దయోర్వచాంసి వైకుంఠగుణానువర్ణనే ।
కరౌ హరేర్మన్దిరమార్జనాదిషు శ్రుతిం చకారాచ్యుతసత్కథోదయే ॥

ముకున్దలింగాలయదర్శనే దృశౌ తద్భృత్యగాత్రస్పర్శే ఞ్గసజగమమ్ ।
ఘ్రాణం చ తత్పాదసరోజసౌరభే శ్రీమత్తులస్యా రసనాం తదర్పితే ॥

పాదౌ హరే: క్షేత్రపదానుసర్పణే శిరో హృషీకేశపదాభివన్దనే ।
కామం చ దాస్యే న తు కామకామ్యయా యథోత్తమశ్లోకజనాశ్రయా రతి: ॥

“అంబరీష మహారాజు మొట్టమొదట తన మనస్సును శ్రీకృష్ణుని పాదపద్మముల చెంత నిలిపెను. తదుపరి అతడు తన పలుకులను ఆ దేవాదిదేవుని దివ్య గుణములను వర్ణించుట యందును, తన హస్తములను శ్రీహరి మందిరములను శుభ్రము చేయుట యందును, తన కర్ణములను అచ్యుతుని లీలలను శ్రవణము చేయుట యందును, తన చక్షువులను ముకుందుని దివ్య రూపములను వీక్షించుట యందును, తన దేహమును భక్తుల దేహములను స్పృశించుట యందును, తన నాసికను శ్రీకృష్ణభగవానునకు అర్పింపబడిన పద్మముల సువాసనను గ్రహించుట యందును, తన జిహ్వను ఆ భగవానుని చరణకమలములకు అర్పించిన తులసి దళములను రుచిచూచుట యందును, తన పాదములను శ్రీహరి తీర్థక్షేత్రములకు మరియు మందిరములకు వెళ్ళుట యందును, తన శిరమును హృషీకేశునికి ప్రణామము లర్పించుట యందును వినియోగించెను. అతడు తన కోరికలను ఉత్తమ శ్లోకుడైన శ్రీకృష్ణుని కార్యములను నిర్వహించుట యందు వినియోగించెను. అతని ఈ ఆధ్యాత్మిక కార్యము లన్నియును శుద్ధభక్తుల లక్షణములై యున్నవి.”

నిరాకారమార్గమును అవలంబించు వారికి ఇట్టి ఆధ్యాత్మిక స్థితిని వర్ణించుట సాధ్యము కాదు. కృష్ణచైతన్యవంతునికి అది అత్యంత సులభము మరియు ఆచరణ యోగ్యమగును. ఈ విషయము పైన వర్ణింపబడిన అంబరీషుని కార్యముల ద్వారా విదితమగుచున్నది. నిత్యస్మరణము ద్వారా శ్రీకృష్ణభగవానుని చరణ కమలముల చెంత మనస్సు లగ్నము కానిదే అట్టి ఆధ్యాత్మిక కర్మలు ఆచరణీయములు కాజాలవు. కనుక శ్రీకృష్ణుని భక్తియుక్తసేవ యందలి కర్మలు ‘అర్చనము’ (ఇంద్రియముల నన్నింటిని

శ్రీకృష్ణభగవానుని సేవలో నెలకొల్పుట) అనబడును. వాస్తవమునకు మనస్సుకు, ఇంద్రియములకు ఏదియో ఒక వ్యాపక ముందవలెను. కర్మలను త్యజించుట ఆచరణీయము కాదు. కనుకనే సామాన్య జనులకు, ముఖ్యముగా సంన్యాసాశ్రమమునందు లేనివారికి, పైన వర్ణింప బడినటు వంటి దివ్యమైన ఇంద్రియములను, మనస్సును ఆధ్యాత్మిక కార్యముల యందు నెలకొల్పుటయే ఆధ్యాత్మికానుభూతి ప్రాప్తికై చక్కని విధానము. అదియే 'యుక్తము' అని భగవద్గీత తెలుపుచున్నది.

## 6.19

**యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా ।**

**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మన: ॥**

### అనువాదము

**గాలిలేని చోట నున్న దీపము కదలకుండ నిశ్చలముగా నుండునట్లుగా, నిగ్రహింపబడిన మనస్సుగల యోగి తన పరతత్త్వ ధ్యానమున సదా స్థిరుడై యుండును.**

### భాష్యము

ఎల్లప్పుడు తనకు ఆరాధనీయుడైనట్టి భగవానుని పట్ల స్థిరమైన, కలతనొందని ధ్యానముతో ఆధ్యాత్మిక స్థితియందు నిమగ్నుడై యుండు నిజమైన కృష్ణచైతన్యవంతుడు గాలిలేని చోటనుండు దీపమువలె స్థిరుడై యుండును.

## 6.20-23

**యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।**

**యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥**

**సుఖమాత్యన్తికం యత్తద్ బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియమ్ ।**

**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వత: ॥**

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తత: ।**

**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥**

**తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితం ।**

### అనువాదము

**సమాధి యనబడు పరిపూర్ణత్వ స్థితిలో మానవుని మనస్సు సమస్త మానసిక కలాపముల నుండి యోగాభ్యాసము చేత నిరోధింపబడియుండును. శుద్ధమైన మనస్సుతో ఆత్మను వీక్షింపగలుగుట మరియు ఆత్మ యందే ఆనందమును, సుఖమును అనుభవించుట యందును అతనికి గల సమర్థతను బట్టి అట్టి పరిపూర్ణత్వ స్థితిని నిర్ధారింపవచ్చును. అట్టి ఆనందమయ స్థితిలో పవిత్రమైన ఇంద్రియముల ద్వారా అనుభవమునకు వచ్చు అపరిమిత దివ్యానందములో**

**మానవుడు ప్రతిష్ఠితుడైన అతడు సత్యము నుండి వైదొల్లగాక, దానికి మించిన మరొక అధిక లాభము లేదని భావించును. అట్టి స్థితిలో నిలిచినవాడు గొప్ప కష్టము నందైనను చలింపడు. భౌతిక సంపర్కముచే ఉత్పన్నమగు సమస్త దుఃఖముల నుండి పొందబడు వాస్తవమైన ముక్తి ఇదియే.**

## భాష్యము

యోగభ్యాసము ద్వారా మానవుడు భౌతిక భావనల నుండి క్రమముగా విముక్తుడగును. ఇదే యోగసిద్ధాంతపు ప్రధాన లక్షణము. దీని తరువాత అతడు 'సమాధి' యందు నిమగ్నుడగును. అనగా యోగి ఆత్మను పరమాత్మతో సమాన మనెడి ఎట్టి అపోహలు లేకుండ, పవిత్రమైన మనస్సు మరియు బుద్ధిచేతను హృదయము నందు నెలకొనినట్టి పరమాత్మను గుర్తింపగలుగు స్థితియే సమాధి యనబడును. వాస్తవమునకు యోగపద్ధతి దాదాపు 'పతంజలి' యోగ సిద్ధాంతముల పైననే ఆధారపడి యున్నది. కొందరు అప్రామాణికులైన వ్యాఖ్యాతలు ఆత్మను పరమాత్మగా గుర్తించుటకు ప్రయత్నింతురు. అద్వైతులు అట్టిదానినే ముక్తి యని భావింతురు. కాని వారందరును 'పతంజలి' యోగపద్ధతి యొక్క వాస్తవ ప్రయోజనమును అవగాహన చేసుకొనజాలరు. 'పతంజలి' యోగపద్ధతి నందు దివ్యానందమను విషయము అంగీకరింపబడినను అద్వైతులు అద్వైత సిద్ధాంతమునకు భంగము కలుగునేమోనను భయముచే అట్టి దివ్యానందమును అంగీకరింపరు. అద్వైతులు జ్ఞానము మరియు జ్ఞాత అను ద్వైతమును అంగీకరింపకున్నను ఈ శ్లోకము నందు ఆధ్యాత్మిక ఇంద్రియముల ద్వారా అనుభవింపబడెడి దివ్యానందము అంగీకరింపబడినది. యోగపద్ధతి యొక్క సుప్రసిద్ధ వివరణ కర్తయైన పతంజలి ముని చేతను ఇది ఆమోదింపబడినది.ఆ మహాముని 'యోగాసూత్రము' (4.33) నందు : "పురుషార్థశూన్యానాం గుణానాం ప్రతిప్రసవ: కైవల్యం స్వరూపప్రతిష్ఠా వా చిత్తిశక్తిరితి" అని ప్రకటించి యున్నాడు.

పై సూత్రము నందలి 'చిత్తిశక్తి' లేదా 'అంతరంగశక్తి' దివ్యమైనది. ధర్మము, అర్థము, కామము, చివరకి పరబ్రహ్మము నందు ఐక్యమయ్యె మోక్షము అనునవియే 'పురుషార్థము' లనబడును. ఈ 'పురుషార్థము' లందలి భగవదైక్యము అద్వైతులచే 'కైవల్యము'గా పిలువబడును. కాని పతంజలి ననుసరించి 'కైవల్యము' అనునది జీవుని తన నిజస్థితిని గూర్చి తెలిపెడి అంతరంగిక శక్తి లేక దివ్యశక్తియే. శ్రీ చైతన్య మహాప్రభువు వాక్కులలో ఇదియే 'చేతోదర్పణమార్జనమ్' లేక మనస్సు అను దర్పణముపై గల మాలిన్యమును శుభ్రపరుచుకొను కార్యము. వాస్తవమునకు ఈ మనోమాలిన్య నిర్మూలనమే నిజమైన ముక్తి లేక 'భవమహాదావాగ్ని నిర్వాపణమ్'. 'నిర్వాణ'మను సిద్ధాంతము(ఇది కూడ ప్రాథమికమైనదే) ఈ సిద్ధాంతముతో సరిపోవును.

'నిర్వాణము' (భౌతిక విషయ విరమణము) పిదప ఆధ్యాత్మిక కార్యకలాపము లేక కృష్ణచైతన్యము అనబడు భక్తియుక్త సేవ ఆరంభమగును. శ్రీమద్భాగవతము(2.10.6) ననుసరించి జీవుని నిజస్వరూప స్థితి అదియే (స్వరూపేణ వ్యవస్థితి:). అట్టి జీవుని ఆధ్యాత్మిక జీవనస్థితి భౌతిక సంపర్కముచే కలుషిత మైనప్పుడు అది 'మాయ' అనబడును. అట్టి భౌతిక సంపర్కము నుండి ముక్తిని పొందుట అనగా జీవుని నిత్యమైన నిజస్వరూప స్థితిని నశింపజేయుట కాదు. "కైవల్యం స్వరూపప్రతిష్ఠా వా చిత్తిశక్తిరితి" యని తన వాక్యముల ద్వారా పతంజలి మునియు దీనిని ఆమోదించిరి. ఈ 'చిత్తిశక్తి'యే లేక దివ్యానందమే యథార్థజీవితము. దీనిని 'వేదాంత సూత్రము' (1.1.12) నందు "ఆనందమయో భ్యాసాత్" అని నిర్ధారించుచున్నది. ఈ సమాజమైన దివ్యానందమే యోగకు పరమ లక్ష్యము. ఇది భక్తియుక్త సేవా నిర్వాహణచే లేక భక్తియోగము ద్వారా అత్యంత సులభముగా పొందబడును. ఈ భక్తియోగము భగవద్గీత యందలి సప్తమాధ్యాయమున వివరముగా వర్ణింపబడినది.

ఈ అధ్యాయము నందు వివరింపబడినట్లు యోగవిధానములో 'సంప్రజ్ఞాత సమాధి' మరియు 'అసంప్రజ్ఞాత సమాధి' అను రెండు రకములైన సమాధి స్థితులు కలవు. దీనిని వివిధ తాత్త్విక పరిశోధనలచే ఎవ్వరైనను దివ్యస్థితిని పొందినప్పుడు అతడు 'సంప్రజ్ఞాత సమాధి' ని సాధించినట్లు చెప్పబడును. 'అసంప్రజ్ఞాత సమాధి' యందు ఇంద్రియములు ద్వారా లభించెడి లౌకిక ఆనందముతో ఏ విధమైన సంబంధమును కలిగియుండడు. ఎందుకనగా, అతడు ఇంద్రియముల ద్వారా లభించెడి సర్వానందములకు దూరుడై యుండును. అట్టి దివ్యస్థితి యందు నిలిచిన యోగి దాని నుండి ఏ మాత్రమును వైదొలగడు. అట్టి స్థితిని పొందలేకపోయినచో యోగి అపజయమును పొందినవాడేయగును. వివిధములైన ఇంద్రియానందములతో కూడిన నేటికాలపు నామమాత్ర యోగభ్యాస మనునది నిజమైన పద్ధతికి విరుద్ధమైనది. మైథున భోగము నందు పాల్గొంటూ, మత్తుపదార్థములను సేవించు యోగి కపటియే కాగలడు. యోగవిధానము నందలి సిద్ధుల పట్ల ఆకర్షింపబడిన యోగులు కూడ యోగము నందు పరిపూర్ణత్వమును పొందినవారు కాజాలరు. యోగకు సంబంధించిన ఇతర ఫలములచే ఆకర్షితులైనచో ఈ శ్లోకము నందు తెలుపబడినట్లు వారు పరిపూర్ణత్వపు స్థితిని ఎన్నడును పొందజాలరు. కనుకనే యోగను ఆడంబరముగా వ్యాయమ ప్రదర్శనముగా చేయువారు లేదా సిద్ధుల నిమిత్తమై యోగనభ్యసించు వ్యక్తులు ఆ మార్గము నందు తమ యోగలక్ష్యము నష్టమైనదని గ్రహింపవలెను.

ఈ యుగము నందు చక్కగా ఎట్టి కలత లేకుండా నిర్వహింపదగిన కృష్ణచైతన్యమే అత్యుత్తమమైన యోగాభ్యాసము. కృష్ణచైతన్యవంతుడు తన కార్యకలాపములలో మిక్కిలి ఆనందము పొందినవాడై ఇతర ఆనందములకై ప్రాకులాడడు. ముఖ్యముగా, ఈ కపట యుగమున హఠయోగము, ధ్యానయోగము, జ్ఞానయోగము వంటి వాటిని అభ్యసించుట యందు అనేక ఆటంకములు కలుగవచ్చును. కాని కర్మయోగ లేక భక్తియోగను అభ్యసించుట యందు ఎట్టి అవరోధము, ఎట్టి సమస్యయు కలుగబోదు.

ఈ భౌతిక దేహమున్నంత వరకు మానవుడు ఆహారము, నిద్ర, భయము, మైథునము అను దేహావసరములను నెరవేర్చుకోవలసి యుండును. కాని శుద్ధభక్తి యోగము లేక కృష్ణచైతన్యవంతుడు అట్టి దేహావసరములను తీర్చుకొనునప్పుడు ఇంద్రియములను అనవసరముగా ప్రేరేపింపడు. పైగా అతడు కేవలము దేహపోషణార్థమై కావలసినదానిని గ్రహించి(చెడ్డబేరపు ఉత్తమ లాభమును పొందుచు) ఉన్నదానితో సంతృప్తి పొందుతూ అతడు కృష్ణచైతన్యపు దివ్య సుఖముల ననుభవించును. యాదృచ్ఛికముగా జరుగు ప్రమాదము, రోగము, అభావము (కొరత ఏర్పడవు), ఆప్తబంధువుల మృతి వంటివానిని లెక్కచేయక అతడు కృష్ణచైతన్యము లేక భక్తియోగము నందు తన ధర్మమును నెరవేర్చుట యందు మిక్కిలి జాగరూకుడై యుండును. యాదృచ్ఛిక సంఘటన లెన్నడును అతనిని ధర్మనిర్వహణ నుండి మరలింపవు. "ఆగమాపాయినో నిత్యాస్తాంస్తితిక్షస్వ భారత" అని భగవద్గీత (2.14) చెప్పుచున్నది. అట్టి యాదృచ్ఛిక సంఘటనల నన్నింటిని అతడు ఓర్పుతో సహించును. ఎందుకనగా అవి రాకపోకలను మాత్రమే కలిగి యుండి తన ధర్మములకు భంగము కలిగింపవని ఎరుగును. ఈ విధముగా అతడు యోగాభ్యాసము నందు అత్యున్నత పరిపూర్ణత్వమును సాధింపగలడు.

## 6.24

**స నిశ్చయేన యోక్తవ్యో యోగో నిర్విణ్ణచేతసా**
**సంకల్పప్రభవాన్ కామాంస్త్యక్త్వా సర్వానశేషత:**
**మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమన్తత:**

**అనువాదము**

**స్థిరనిశ్చయము తోడను, విశ్వాసము తోడను యోగమభ్యసించుచు మానవుడు ఆ మార్గము నుండి వైదొలగరాదు. మానసిక కల్పనల నుండి ఉత్పన్నమైన భౌతిక కోరికల నన్నింటిని ఎటువంటి మినహాయింపు లేకుండా త్యజించి, అతడు మనస్సు ద్వారా సర్వేంద్రియములను అన్ని వైపుల నుండి నియంత్రింప వలెను.**

**భాష్యము**

యోగాభ్యాసకుడు స్థిరనిశ్చయమును కలిగి ఏ మాత్రము మార్గము నుండి వైదొలగాక ఓర్పుతో తన యోగాభ్యాసమును కొనసాగింపవలెను. అంత్యమున విజయము ప్రాప్తించుననెడు విశ్వాసమును కలిగియుండి, గొప్ప పట్టుదలతో ఆ మార్గమును అనుసరింపవలెను. విజయమును సాధించుట యందు ఆలస్యమైనను అతడెన్నడును నిరుత్సాహము పొందకూడదు. దృఢవ్రతుడై శ్రద్ధతో అభ్యాసము కావించువానికి విజయము తప్పక లభించును. భక్తియోగను గూర్చి శ్రీల రూప గోస్వామి ఈ విధముగా చెప్పుచున్నారు.

ఉత్సాహాన్నిశ్చయద్ ధైర్యాత్ తత్తత్కర్మప్రవర్తనాత్
సంగత్యాగాత్సతో వృత్తే: షడ్భిర్భక్తి: ప్రసిధ్యతి

"హృదయపూర్వకమైన ఉత్సాహముతోడను, పట్టుదలతోడను, నిశ్చయము తోడను, భక్తుల సాంగత్యములో విధ్యుక్త ధర్మములను నిర్వర్తించుట మరియు సత్వగుణ కార్యములందే సంపూర్ణముగా నెలకొనుట ద్వారా మానవుడు భక్తియోగ విధానమును విజయవంతముగా నిర్వహింపగలడు." (ఉపదేశామృతము-3)

నిశ్చయము విషయమున మానవుడు సముద్ర తరంగములలో తన గ్రుడ్లను కోల్పోయిన ఆడుపిచ్చుక వృత్తాంతమును ఉదాహరణముగా తీసుకొనవచ్చును. ఒకానొకసారి ఒక పిచ్చుక సముద్ర తీరమున గ్రుడ్లుపెట్టెను, కాని మహాసముద్రము వానిని తన కెరటములతో కొట్టుకుపోయెను. పిచ్చుక ఎంతగానో కలత చెంది తన గ్రుడ్లను తనకు తిరిగి ఇమ్మని సముద్రుని ప్రార్థించెను. సముద్రుడు దాని ప్రార్థనను మన్నింపలేదు. కనుకనే పిచ్చుక సముద్రమును శుష్కింప చేయవలెనని నిశ్చయించుకొని తన చిన్న ముక్కుతో సముద్రమందలి జలమునంతటిని తీసివేయ నారభించెను. అసాధ్యమైన దాని నిశ్చయమును చూచి అందరును పరిహసించిరి. అది చేయు కార్యమును గూర్చిన వార్త నెమ్మదిగా సర్వత్రా వ్యాపించెను. చివరికి మహావిష్ణువు వాహనమైన గరుడుడు కూడ ఆ వార్తను వినెను. తన చిన్నపక్షి సోదరి పట్ల జాలి కలిగి అతడు దానిని చూచుటకు వెళ్ళెను. చిన్నిపిచ్చుక నిశ్చయమునకు అతడు ఎంతగానో సంతసించి, దానికి సహాయము చేయుదునని వాగ్దానము చేసెను. పిదప గరుడుడు ఆ పిచ్చుక గ్రుడ్లను దానికి తిరిగి ఇమ్మని సముద్రునితో పలికి లేనిచో ఆ పిచ్చుక కార్యమును తానే చేసెదనని పలికెను. దానికి సముద్రుడు భయపడి వెంటనే గ్రుడ్లను పిచ్చుకకు తిరిగి ఇచ్చివేసెను. ఈ విధముగా గరుడుని కృపతో పిచ్చుక ఆనందమును పొందెను.

ఇట్లే యోగభ్యాసము – ముఖ్యముగా కృష్ణచైతన్యముతో కూడిన భక్తియోగము అత్యంత కఠినమైనదిగా కనిపింపవచ్చును. కాని ఎవరైనను దృఢ నిశ్చయముతో పై

సిద్ధాంతములను అనుసరించినచో భగవానుడు తప్పక సహకరించును. ఎందుకనగా, తనకుతాను సహాయము చేసుకొనెడివానికి భగవానుడు తప్పక సహాయ మందించునను విషయము తెలిసినదే కదా!

## 6.25

**శనై: శనైరుపరమేద్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।**

**ఆత్మసంస్థం మన: కృత్వా న కించిదపి చిన్తయేత్ ॥**

### అనువాదము

**నిశ్చయమైన బుద్ధితో క్రమముగా నెమ్మది నెమ్మదిగా మానవుడు సమాధి స్థితిని పొందవలెను. ఆ విధముగా మనస్సును ఆత్మయందే స్థిరము చేసి అతడు ఇక దేనిని గూర్చియు చింతింపరాదు.**

### భాష్యము

దృఢవిశ్వాసము మరియు బుద్ధితోను మానవుడు క్రమముగా ఇంద్రియ కర్మల నుండి విరమింప వలెను. ఇదియే 'ప్రత్యాహారము' అనబడును. అనగా విశ్వాసము చేతను, ధ్యానము చేతను, ఇంద్రియకర్మల విరమణ చేతను నియంత్రింపబడిన మనస్సు 'సమాది' పొందవలెను. ఆ సమయమున భౌతిక జీవిత భావన యందు ఆసక్తి కలిగి యుండుటయనెడి భయము ఏ మాత్రము కలుగదు. మరోమాటలో చెప్పవలెననిన, భౌతిక దేహమున్నంత కాలము మానవుడు భౌతిక విషయ సంబంధములను కలిగియుండినను ఇంద్రియ తృప్తి భావనను ఏ మాత్రము కలిగియుండరాదు. పరమాత్మ సంతృప్తిని తప్ప అన్యమైన తృప్తిని గూర్చి అతడు చింతింపరాదు. కృష్ణచైతన్యమును ప్రత్యక్షముగా అభ్యసించుట ద్వారా ఈ స్థితి సులభముగా పొందబడును.

## 6.26

**యతో యతో నిశ్చలతి మనశ్చంచలమస్థిరమ్ ।**

**తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥**

### అనువాదము

**చంచలత్వము మరియు అస్థిరత్వము కారణమున మనస్సు ఎచ్చట పరిభ్రమించినను మానవుడు దానిని అచటి నుండి తప్పక మరలించి ఆత్మ వశమునకు గోనిరావలెను.**

### భాష్యము

చంచలత్వము, అస్థిరత్వమనునవి మనస్సు యొక్క స్వభావములు. కాని ఆత్మదర్శియైన యోగి అట్టి మనస్సును నియంత్రింపవలెను. మనస్సు అతనిని నియంత్రింపకూడదు. మనస్సును నియంత్రించినవాడు (తద్ద్వారా ఇంద్రియములను కూడ నియంత్రించువాడు) 'గోస్వామి' లేదా 'స్వామి' యనబడును. అట్లుగాక మనస్సు చేతనే నియంత్రింప బడెడివాడు 'గోదాసుడు' లేక ఇంద్రియ దాసుడని పిలువబడును. ఇంద్రియముల వలన కలిగే సుఖ పరిమాణమును 'గోస్వామి' ఎరుగును. కనుకనే ఆధ్యాత్మికానంద భావనలో అతని ఇంద్రియములు హృషీకేశుని (ఇంద్రియములకు

ప్రభువైన (శ్రీకృష్ణుని) సేవయందు నెలకొనియుండును. ఆ విధముగా పవిత్రములైన ఇంద్రియములతో శ్రీకృష్ణుని సేవించుటయే కృష్ణచైతన్య మనబడును. ఇంద్రియములను పూర్తి ఆధీనములోకి తెచ్చుకొనుటకు ఇదియే ఉత్తమ మార్గము. అదియే యోగాభ్యాసపు అత్యున్నత పరిపూర్ణత్వమైన స్థితి దీనికి మించినది మరొక్కటి లేదు.

## 6.27

**ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।**
**ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥**

### అనువాదము

**నా యందు మనస్సు లగ్నము చేసిన యోగి తప్పక ఆధ్యాత్మికానందపు అత్యున్నత పరిపూర్ణత్వమును పొందును. అతడు రజోగుణమునకు అతీతుడై పరబ్రహ్మముతో తనకు గల గుణైక్యమును గుర్తించును. ఈ విధముగా అతడు పూర్వకర్మ ఫలము లన్నింటి నుండి విముక్తుడగును.**

### భాష్యము

'బ్రహ్మభూత' అనగా భౌతిక కల్మషముల నుండి ముక్తిని పొంది భగవానుని దివ్యమైన భక్తియుక్త సేవ యందు నెలకొనియుండు స్థితి. "మద్భక్తిం లభతే పరామ్" (భగవద్గీత 18.54) – మనస్సు భగవానుని పాదపద్మము లందు లగ్నము కానిదే ఎవరును పరబ్రహ్మముతో గుణైక్యమును పొందజాలరు. "స వై మన: కృష్ణపాదారవిందయో:" (భాగ.9.4.18) భగవానుని ప్రేమయుక్త సేవ యందు సదా నెలకొనియుండుట లేక కృష్ణచైతన్యము నందు నిమగ్నమగుట మనునది నిజముగా రజోగుణము నుండియు సమస్త భౌతిక కల్మషముల నుండియు ముక్తిని పొందుటయే యగును.

## 6.28

**యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మష: ।**
**సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యన్తం సుఖమశ్నుతే ॥**

### అనువాదము

**ఆ విధముగా ఆత్మనిగ్రహుడైన యోగి నిరంతరము యోగమభ్యసించుచు సమస్త భౌతిక కల్మషముల నుండి విముక్తుడై భగవానుని దివ్యమైన ప్రేమ యుక్త సేవ యందు అత్యున్నతమైన సౌఖ్యమును పొందును.**

### భాష్యము

ఆత్మానుభూతి అనగా భగవానునితో తనకు గల సంబంధమును ఎరుగ గలుగుటయే ప్రతి జీవాత్మ భగవానుని అంశయైనందున ఆ భగవానునికి దివ్యమైన సేవ

చేయుటయే దాని నిజస్థితి. ఆత్మకు భగవానునితో గల ఇట్టి దివ్య సంబంధమే 'బ్రహ్మ సంస్పర్శ' మని పిలువబడును.

## 6.29

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శన: ॥**

**అనువాదము**

**నిజమైన యోగి నన్ను సర్వజీవుల యందును మరియు సర్వజీవులను నా యందునుగాంచును. నిజమునకు ఆత్మదర్శియైన అట్టివ్యక్తి దేవాదిదేవుడనైన నన్నే సర్వత్రా గాంచును.**

**భాష్యము**

అందరి హృదయములో పరమాత్మ రూపమున నేలకొనియున్నట్టి శ్రీకృష్ణభగవానుని దర్శింప గలిగినందున కృష్ణచైతన్య వంతుడైన యోగియే నిజమైన ద్రష్ట యనబడును. "ఈశ్వర: సర్వభూతానాం హృద్దేశే ర్జున తిష్ఠతి" (18.61). భగవానుడు శునక హృదయము నందును మరియు బ్రాహ్మణుని హృదయము నందును కూడా పరమాత్మ రూపమున నెలకొనియుండును. భగవానుడు శాశ్వతముగా దివ్యుడు. అంతేకాకుండ అతడు శునకము లేదా బ్రాహ్మణుని హృదయము నందు నిలుచుటచే భౌతికముగా మార్పుచెందడని పరిపూర్ణుడైన యోగి ఎరిగియుండును. అదియే భగవానుని సర్వాసమానత్వము. పరమాత్మతో పాటు జీవాత్మయు హృదయము నందున్నప్పటికిని, పరమాత్మ వలె జీవాత్మ అందరి హృదయములలో నెలకొనియుండలేదు. ఇదియే జీవాత్మకు మరియు పరమాత్మనకు నడుమ గల భేదము. నిజమునకు యోగభ్యాసము నందు ప్రవేశము లేనివాడు దీనిని స్పష్టముగా గుర్తింపజాలడు. కాని కృష్ణచైతన్యవంతుడు ఆస్తికుని మరియు నాస్తికుని ఇరువురి హృదయము లందును శ్రీకృష్ణుని దర్శింప గలుగును. ఈ విషయము స్మృతిశాస్త్రము నందు ఇట్లు నిర్ధరింపబడినది : "ఆతతత్త్వచ్చ మాతృత్వాచ్చ ఆత్మ హి పరమో హరి:"- భగవానుడు సర్వప్రాణులకు మూలకారణమగుట చేత అతడు తల్లి లేదా పోషకుని వంటివాడు. తల్లి తన సమస్త సంతానము పట్ల సమభావముతో నుండునట్లు భగవానుడు(పరమపిత లేక మాత) కూడ అట్లే సమభావముతో నుండును. సర్వజీవుల యందును అతడు పరమాత్మగా సదా నిలిచియుండునని భావము.

బాహ్యముగా కూడ జీవులు సదా భగవానుని శక్తియందే నిలిచియుండును. సప్తమాధ్యాయమున వివరింపబడినట్లు, భగవానునికి ఆధ్యాత్మిక (ఉన్నత) శక్తి, భౌతిక(న్యూన)శక్తి అని ప్రధానముగా రెండు శక్తులుండును. జీవుడు ఉన్నత(పర)శక్తి అంశయైనను భౌతికమైన న్యూన(అపర)శక్తిచే బంధితుడై యుండును. ఈ విధముగా అతడెల్లప్పుడును భగవానుని శక్తియందున్నట్టివాడే. అనగా జీవుడు భగవానుని యందే ఏదోఒక విధముగా స్థితిని కలిగియున్నట్టివాడే యగుచున్నాడు.

జీవులందరును తమ కర్మఫలముల ననుసరించి వివిధ స్థితుల యందు నిలిచి యున్నప్పటికిని అన్ని పరిస్థితుల యందును వారు భగవానుని దాసులేనని గుర్తింప గలిగినందున యోగి సమదర్శియై యుండును. భౌతికశక్తి యందు నెలకొనినప్పుడు

జీవుడు భౌతిక ఇంద్రియములను సేవించును. కాని అదే జీవుడు ఆధ్యాత్మిక శక్తి యందు నెలకొనినప్పుడు మాత్రము ప్రత్యక్షముగా దేవాదిదేవుని సేవించును. ఈ రెండు స్థితుల యందును జీవుడు భగవానుని దాసుడే. ఇట్టి సమదృష్టి కృష్ణచైతన్యవంతుడైన వ్యక్తియందు పరిపూర్ణముగా నుండును.

## 6.30

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**

**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥**

### అనువాదము

**నన్ను సర్వత్రా వీక్షించువానికి మరియు నా యందు సమస్తమును గాంచువానికి నేను కనబడకపోవుట గాని, నాకు అతడు కనబడకపోవుట గాని జరుగదు.**

### భాష్యము

కృష్ణచైతన్యవంతుడు శ్రీకృష్ణభగవానుని సర్వత్రా నిలిచియున్నట్లుగా దర్శించును. అంతేకాకుండ, అతడు ఆ దేవాదిదేవుని యందు సమస్తమును వీక్షించును. అట్టివ్యక్తి ప్రకృతి యొక్క విభిన్న రూపములను దర్శించినట్లు గోచరించినను సర్వము శ్రీకృష్ణుని శక్తి ప్రదర్శనయేనని ఎరిగి అన్నివేళలా కృష్ణచైతన్యమును (పరిజ్ఞానము) కలిగియుండును. శ్రీకృష్ణుడే సర్వమునకు ప్రభువు. శ్రీకృష్ణుడు లేకుండా ఏదియు స్థితిని కలిగియుండలేదను భావనయే కృష్ణచైతన్యపు మూలసిద్ధాంతము. కృష్ణప్రేమ వృద్ధియే కృష్ణచైతన్యము. ఇదియే భౌతికమైన ముక్తికి కూడ అతీతమైనది. ఆత్మానుభూతికి అతీతమైన అట్టి కృష్ణచైతన్యపు స్థితిలో భక్తుడు శ్రీకృష్ణునితో ఏకమగును. అనగా భక్తునికి శ్రీకృష్ణుడే సర్వస్వమగును. అంతేకాకుండ భక్తుడు కృష్ణప్రేమతో నిండిపోవును. అప్పుడు భగవానునికి మరియు భక్తునికిని నడుమ ఒక సన్నిహిత సంబంధ మేర్పడును. అట్టిస్థితిలో జీవుడు ఎన్నడు నశింపడు. అట్లే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు భక్తుని దృష్టి నుండి దూరమగుట జరుగదు. వాస్తవమునకు శ్రీకృష్ణుని యందు ఐక్యమగుట అనునది ఆధ్యాత్మిక వినాశనము వంటిది. కనుకనే భక్తుడెప్పుడును అట్టి ప్రమాదమును వాంఛింపడు. 'బ్రహ్మ సంహిత' (5.38) యందు ఇట్లు తెలుపబడినది :

ప్రేమాంజనచ్ఛురితభక్తివిలోచనేన ।
సన్తస్సదైవ హృదయేషు విలోకయన్తి ॥
యం శ్యామసుందరమచింత్యగుణస్వరూపం ।
గోవిందమాదిపురుషం తమహం భజామి ॥

"ప్రేమ అనునది అంజనముతో (కాటుకతో) కూడిన కన్నులతో కూడియున్నట్టి భక్తులచే సదా వీక్షింపబడు ఆదిదేవుడైన గోవిందుని నేను భజింతును. భక్తుని హృదయములో అతడు తన నిత్యమైన శ్యామసుందర రూపముతో సదా దర్శింపబడును."

ఈ స్థితిలో శ్రీకృష్ణభగవానుడు భక్తుని దృష్టి నుండి ఎన్నడును దూరము కాదు. అట్లే భక్తుడు కూడ ఎన్నడును భగవానుని దర్శనము నుండి దూరముగా వెళ్ళడు. హృదయమునందు భగవానుని పరమాత్మగా దర్శించు యోగి విషయమున కూడ ఇది వర్తించును. అట్టియోగి క్రమముగా శుద్ధభక్తునిగా మారి, హృదయము నందు భగవానుని దర్శింపకుండ క్షణకాలమును జీవింపలేని స్థితికి వచ్చును.

## 6.31

**సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థిత:।**
**సర్వథా వర్తమానో పి స యోగీ మయి వర్తతే ॥**

### అనువాదము

**నేనును మరియు హృదయస్థుడైన పరమాత్మయు ఒక్కడేనని ఎరిగి పరమాత్మ భజనయందు నియక్తుడైన యోగి అన్ని పరిస్థితుల యందును నా యందే సదా నిలిచియుండును.**

### భాష్యము

పరమాత్మ ధ్యానమును అభ్యసించు యోగి తనయందు శ్రీకృష్ణుని స్వరూపాంశను – శంఖమును, చక్రమును, గదను, పద్మమును దాల్చిన చతుర్భుజ విష్ణువుగా హృదయము నందు వీక్షించును. యోగియైనవాడు విష్ణువు, శ్రీకృష్ణునకు భిన్నుడు కాడని ఎరుగవలెను. వాస్తవమునకు శ్రీకృష్ణుడే అట్టి పరమాత్మ రూపమున అందరి హృదయము లందును నిలిచియుండును. అంతేకాకుండ, అసంఖ్యాక జీవరాశుల హృదయములలో నెలకొనియున్న అసంఖ్యాక పరమాత్మల నడుమను ఎట్టి భేదము లేదు. అట్లే శ్రీకృష్ణభగవానుని దివ్యమైన భక్తియుక్త సేవ యందు నిరంతరము నెలకొనియున్న కృష్ణచైతన్య వంతునికి మరియు పరమాత్మ ధ్యానము నందు నిమగ్నమైన పరిపూర్ణ యోగికి ఎట్టి భేదము లేదు. కృష్ణచైతన్యవంతుడైన యోగి భౌతిక జీవన స్థితిలో వివిధ కర్మల యందు నేలకొనినను సదా శ్రీకృష్ణుని స్మరించు చుండును. శ్రీల రూప గోస్వామి 'భక్తిరసామృత సింధువు' (1.2.187) నందు : "నిఖిలాస్వప్యవస్థాసు జీవన్ముక్త: స ఉచ్యతే" అనుచు ఈ విషయము నిర్ధారింపబడినది. అనగా నిరంతరము కృష్ణచైతన్యమునందు వర్తించు భక్తుడు అప్రయత్నముగనే ముక్తుడగుచున్నాడు. ఈ విషయము 'నారద పంచరాత్రము' నందు ఈ క్రింది విధముగా సమర్థింపబడినది.

దిక్కాలాద్యనవచ్ఛిన్నే కృష్ణే చేతో విధాయ చ
తన్మయో భవతి క్షిప్రం జీవో బ్రాహ్మణి యోజయేత్

"సర్వవ్యాపియు మరియు దేశకాలాతీతుడును అగు శ్రీకృష్ణుని దివ్యరూపము నందు తన మనస్సును ఎకాగ్రము చేయుటచే మానవుడు శ్రీకృష్ణుని గూర్చిన ధ్యానమునందే నిమగ్నుడగును. తదనంతరము ఆ భగవానుని దివ్య సహచర్యమును ఆనందమయ స్థితిని పొందగలడు."

కృష్ణచైతన్య మనునది యోగాభ్యాసము నందలి అత్యున్నత 'సమాధి' స్థితి. శ్రీకృష్ణుడు పరమాత్మరూపమున అందరి హృదయములందు నెలకొని యున్నాడనెడి ఈ అవగాహనయే యోగిని దోషరహితునిగా చేయగలదు. "ఏకో పి సన్ బహుధా యో వభాతి" – "భగవానుడొక్కడే అయినను అసంఖ్యాకమైన హృదయములందు బహురూపములుగా నిలిచియుండును" అని వేదములు (గోపాలతాపన్యుపనిషత్తు 1.21) ఆ భగవానుని అచింత్యశక్తిని నిరూపించుచున్నవి. అట్లే స్మృతిశాస్త్రము నందును ఇట్లు తెలుపబడినది :

ఏక ఏవ పరో విష్ణు: సర్వవ్యాపీ న సంశయ:
ఐశ్వర్యాద్రూపమేకం చ సూర్యవత్ బహుధేయతే

"విష్ణువొక్కడే అయినను నిశ్చయముగా సర్వత్రా వ్యాపించి యుండును. సూర్యుడు ఒకే సమయమున అనేక ప్రదేశములలో కనిపించునట్లుగా, అతడు ఏకరూపుడైనను తన అచింత్య శక్తిచేత సర్వత్రా నిలిచియుండును." (మత్స్యపురాణము)

## 6.32

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యో ర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మత: ॥**

## అనువాదము

**ఓ అర్జునా! ఎవడు తన ఆత్మతో పోల్చుకొని సమస్త జీవులను వాటి సుఖ దుఃఖములందు సమముగా గాంచునో అతడే ఉత్తమ యోగి యనబడును.**

## భాష్యము

వాస్తవమునకు కృష్ణచైతన్యము గలవాడు ఉత్తమయోగి. అతడు తన స్వానుభవముచే అందరి సుఖదుఃఖములను తెలిసియుండును. భగవానునితో తనకు గల సంబంధమును విస్మరించుటయే జీవుని దుఃఖమునకు కారణము. కాని శ్రీకృష్ణుడే సమస్త మానవ కార్యకలాపాలకు దివ్యభోక్తగను, సర్వలోకములకు ప్రభువనియు, సర్వజీవులకు ఆప్తమిత్రుడనియు ఎరుగుటయే జీవుని సుఖమునకు కారణము కాగలదు (భ.గీ.5.29). భౌతిక ప్రకృతి త్రిగుణములచే నియంత్రింపబడెడి జీవుడు తనకు శ్రీకృష్ణునితో గల సంబంధమును విస్మరించుట చేతనే త్రివిధ క్లేశములకు గురియగునని ఉత్తమయోగి ఎరిగియుండును. కృష్ణచైతన్యము నందు గల అట్టి యోగి సుఖియై యుండును. కనుక కృష్ణసంబంధ విజ్ఞానమును సర్వత్రా వ్యాపింప జేయుటకు యత్నించును. ప్రతియొక్కరు కృష్ణచైతన్యవంతులు కావలసిన అవసరమును అతడు ప్రచారము చేయుటకు యత్నించు చున్నందున అతడే నిజముగా జగత్తున గల అత్యున్నత పరోపకారి మరియు శ్రీకృష్ణునకు ప్రియమైన సేవకుడు కాగలడు. "న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమ:" (భగవద్గీత 18.69). భగవద్భక్తుడు జీవులందరి సంక్షేమమును సదా కాంక్షించును. కనుక అతడు అందరికి ఆప్తమిత్రుడు. స్వలాభము కొరకై యోగము నందు పరిపూర్ణత్వమును ఆశింపక ఇతరుల కొరకే యత్నించును కనుక అతడు ఉత్తమ యోగి కాగలడు. ఇతర జీవుల పట్ల అతడెన్నడును ఈర్ష్యచెందడు. శుద్ధభక్తునికి మరియు స్వీయోద్ధారము కొరకై యత్నించు సాధారణయోగికి నడుమ వ్యత్యాసము ఇక్కడ కలదు. నిర్విఘ్నముగా ధ్యానము చేయుట కొరకు ఏకాంత ప్రదేశమునకు వెళ్ళెడి యోగి, ప్రతియొక్కరిని తన శక్తికొలది కృష్ణచైతన్యవంతులుగా మార్చుటకు యత్నించు భక్తుని కంటె పరిపూర్ణుడు కాకపోవచ్చును.

## 6.33

**అర్జున ఉవాచ**

**యో యం యోగస్త్వయా ప్రోక్త: సామ్యేన మధుసూదన ।**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : ఓ మధుసూదనా! మనస్సు చంచలమును మరియు అస్థిరమును అయియున్నందున నీవు సంగ్రహముగా తెలిపినటువంటి యోగపద్ధతి ఆచరణకు అసాధ్యమైనదిగను మరియు ఆశక్యముగను నాకు తోచుచున్నది.**

**భాష్యము**

'శుచౌ దేశే' యను పదముతో ఆరంభమై 'యోగీపరమ:' అను పదములతో ముగియున్నట్లుగా యోగపద్ధతిని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు బోధింపగా, దానికి తాను అశక్తుడననెడి భావనలో అర్జునుడు ఆ పద్ధతిని ఇక్కడ తిరస్కరించు చున్నాడు. ఈ కలియుగమున సాధారణ మానవునికి గృహమును విడిచి కొండలలో, అడవులలో ఏకాంత ప్రదేశమును చేరి యోగాభ్యాసము చేయుట సాధ్యపడదు. స్వల్పమైన జీవితము కొరకు తీవ్రసంఘర్షణ మనునది ఈ యుగలక్షనము. ఈ కాలమున జనులు ఆత్మానుభూతి విషయము పట్ల శ్రద్ధవహింపరు. సామాన్యములు మరియు ఆచరణ యోగ్యములైన పద్ధతులనే వారు స్వీకరింప లేరనినచో నియమిత జీవనవిధానమును, ప్రత్యేక ఆసన పద్ధతి, స్థాననిర్దేశము, విషయకర్మల నుండి మనస్సును నిగ్రహించుట వంటి కఠిన కార్యములు గల యోగపద్ధతిని అనుసరింప లేరనెడి విషయమును గూర్చి వేరుగా చెప్పనవసరము లేదు. ఎన్నోరకాల అనుకూల పరిస్థితులను కలిగి యున్నప్పటికినీ, క్రియాశీలునిగా అర్జునుడు అట్టియోగను ఆచరించుట తనకు సాధ్యపడదని భావించెను. అతడు రాచకుటుంబమునకు చెందిన వాడగుటయే కాకుండ, అతడు అనేక అత్యుత్తమ గుణములను కూడ కలిగియుండెను. అతడు గొప్పవీరుడు, దీర్ఘాయువు గలవాడు, అన్నింటికిని మించి దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రియ మిత్రుడు. ఐదువేల సంవత్సరములకు పూర్వము అర్జునుడు మనకున్నటువంటి పరిస్థితుల కంటెను చక్కటి అనుకూల పరిస్థితులను కలిగియున్నప్పటికిని ఈ యోగపద్ధతిని తిరస్కరించెను. వాస్తవమునకు చరిత్ర యందు అతడు యోగను అభ్యసించినట్లుగా తెలుపు చారిత్రికాధారమేదియును మనకు లభింపదు. కనుకనే ఈ యోగపద్ధతి కలియుగమున అసాధ్యమని భావింపబడినది. ఒకవేళ ఏ కొద్దిమందికో (అసాధారణ పురుషులకు) అది సాధ్యపడినను సామాన్యులకు మాత్రము అది ఏమాత్రము సాధ్యపడదు. ఐదువేల సంవత్సరముల క్రిందటనే ఈ విషయ మిట్లుండినచో ఇక వర్తమానకాల పరిస్థితిని గూర్చి చెప్పేదేమున్నది? నామమాత్ర యోగపాఠశాలల యందు మరియు యోగసమాజములని పిలువబడు ప్రదేశము లందు ఈ యోగవిధానమును అనుకరించుటకు యత్నించువారు, తమనుతాము కృతార్థులైనట్లుగా భావించినను, తప్పక వారు తమ కాలమును వృథా పరచునట్టివారే యగుచున్నారు. వాంఛిత లక్ష్యమును గూర్చిన విషయమున వారు పూర్తిగా అజ్ఞానులై యున్నారు.

## 6.34

**చంచలం హి మన: కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥**

**అనువాదము**

**ఓ కృష్ణా! మనస్సు చంచలమును, కలత నొందించు నదియును, దృఢమును, మిక్కిలి బలవత్తరమును అగుటచే దీనిని నిగ్రహించుట వాయువును నిగ్రహించుట కంటెను కష్టతరమని నేను భావించుచున్నాను**

**భాష్యము**

మనస్సు మిక్కిలి బలవత్తరము, దృఢమైనది. వాస్తవమునకు మనస్సు బుద్ధికి విధేయమై యుండవలెనని పరిగణింప బడుచున్నప్పటికిని కొన్నిమార్లు అది బుద్ధినే అతిక్రమించును. క్రియాశీలమైన భౌతికజగత్తు నందు పెక్కు విరుద్ధములైన అంశములతో పోరాడు మానవునకు అట్టి మనస్సును నియంత్రించుట నిశ్చయముగా మిక్కిలి కష్టము. కృత్రిమముగా ఎవరైనను శత్రు మిత్రుల పట్ల సమానవైఖరిని ప్రదర్శింపవచ్చును. కాని లౌకికవాది మాత్రము అట్లు ఎన్నటికిని చేయజాలడు. మనస్సును నిగ్రహించుట తీవ్రమైన వాయువును నియమించుట కంటెను అతికష్టమైన కార్యమగుటయే అందులకు కారణము. 'కఠోపనిషత్తు' (3.3,4) నందు ఈ విషయమును గూర్చి ఇట్లు చెప్పబడినది :

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ చ ।
బుద్ధిం తు సారథిం విద్ధి మన: ప్రగ్రహమేవ చ ॥

ఇంద్రియాణీ హయాన్యాహుర్విషయాం స్తేషు గోచరాన్ ।
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణ: ॥

"భౌతిక దేహము రథము నందు జీవుడు ప్రయాణికుడు. బుద్ధి రథచోదకుడు. మనస్సు రథమును నడుపునట్టి సాధనము. ఇంద్రియములు గుర్రములు. ఈ విధముగా జీవుడు మనస్సు మరియు ఇంద్రియముల సహచర్యమున భోక్తయగు చున్నాడని గొప్ప పండితులైన మునులచే అవగాహన చేసికొనబడినది." వాస్తవమునకు బుద్ధి మనస్సును నిర్దేశింపవలెను. కాని బలమైనదియు మరియు దృఢమైనదియు అగు మనస్సు అనునది తీవ్రమైన అంటువ్యాధి ఔషదము యొక్క శక్తిని కూడ అధిగమించునట్లు తరచుగా అది మానవుని బుద్ధిని కూడ అధిగమించు చుండును. అట్టి బలమైన మనస్సును యోగపద్ధతిచే నిగ్రహింప వలసి యున్నది. అయినను అట్టి అభ్యాసము అర్జునుని వంటివానికి కూడ ఆచరణీయమైనదిగా లేదు. అట్లయినచో, నేటి ఆధునిక మానవుని గూర్చి చెప్పవలసిన అవసరమేమున్నది? ఇక్కడ వాడబడిన వాయువు ఉదాహరణము అత్యంత సమంజసమైనది. ఎందుకనగా, ఎవరును వీచుచున్న వాయువును బంధింపజాలరు. కాని దాని కంటెను చంచలమైన (కలత నొందిన) మనస్సును నియంత్రించుట మరింత కష్టము. అట్టి మనస్సును నియంత్రించుటకు శ్రీ చైతన్య మహాప్రభువు నిర్దేశించిన భవతారకమైన 'హరేకృష్ణ' మహామంత్రమును నమ్రతతో కీర్తించుటయే అత్యంత సులభమైన మార్గము. "స వై మన: కృష్ణపదారవిందయో:" (భాగ.9.4.18) అనగా ప్రతియొక్కరూ తమ మనస్సును శ్రీకృష్ణుని స్మరణ యందు

నెలకొల్పవలెను. అప్పుడే మనస్సును కలవరపరచునట్టి ఇతర కార్యములేవి మానవునకు లేకుండును.

### 6.35

**శ్రీభగవానువాచ**

**అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**

**అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥**

**అనువాదము**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : మహాబాహువులు గల ఓ కున్తీపుత్రా! చంచలమైన మనస్సును నిగ్రహించుట నిస్సందేహముగా మిక్కిలి కష్టమైనను దానిని తగిన అభ్యాసము మరియు వైరాగ్యములచే సాధింపవచ్చును.**

**భాష్యము**

దృఢమైన మనస్సును నిగ్రహించుట కష్టమని అర్జునుడు వ్యక్తపరచిన అభిప్రాయమును శ్రీకృష్ణభగవానుడు అంగీకరించెను. కాని అట్టి కార్యము అభ్యాసము మరియు వైరాగ్యములచే సాధ్యపడునని అదే సమయమున అతడు సూచించుచున్నాడు. అట్టి అభ్యాసమనగానేమిటి? వర్తమాన కాలమున పుణ్యక్షేత్రములను దర్శించుట, మనస్సును పరమాత్మ యందు కేంద్రీకరించుట, ఇంద్రియములను మనస్సును నియంత్రించుట, బ్రహ్మచర్యమును పాటించుట, ఏకాంతముగా వసించుట వంటి కఠిన నియమ నిబంధనలను ఎవరును వాస్తవముగా పాటించలేరు. కాని కృష్ణచైతన్యమును అభ్యసించుట ద్వారా మానవుడు భగవానుని నవవిధ భక్తియుక్త సేవయందు పాల్గొనగలడు. అట్టి భక్తియుక్త సేవాకార్యములలో శ్రీకృష్ణుని గూర్చిన శ్రవణము ప్రప్రథమమైనది. మనస్సు నుండి అన్నిరకాల అపోహలను తొలగించుటకు ఇది మిక్కిలి శక్తిమంతమైన దివ్యవిధానము. మానవుడు శ్రీకృష్ణుని గూర్చిన శ్రవణమును ఎంత అధికముగా చేసినచో అంత అధికముగా జ్ఞానవికాసమును పొంది, శ్రీకృష్ణుని నుండి మనస్సును దూరము చేయు సమస్త విషయములందును అనాసక్తుడగును. భగవానుని పట్ల భక్తితో కూడియుండని కార్యముల నుండి మనస్సును నిగ్రహించుట ద్వారా మానవుడు 'వైరాగ్యము'ను సులభముగా అలవరచుకొనును. 'వైరాగ్యము' అనగా భౌతిక విషయముల నుండి విడివడిన మనస్సును ఆధ్యాత్మిక విషయము లందు లగ్నము చేయుట. వాస్తవమునకు మనస్సును శ్రీకృష్ణునికి సంబంధించిన కార్యము లందు నెలకొల్పుట కంటెను నిరాకార తత్త్వముతో వైరాగ్యమును పొందుట మిక్కిలి కష్టము. కనుకనే కృష్ణభక్తి సులభముగా ఆచరింపదగిన పద్ధతి. ఎందుకనగా శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుట ద్వారా మానవుడు అప్రయత్నముగానే పరతత్త్వము నందు ఆసక్తుడగును. అట్టి ఆసక్తియే 'పరేశానుభూతి' (ఆధ్యాత్మిక సంతృప్తి) యనబడును. ఇది ఆకలి గొనినవాడు ఎంత అధికముగా భుజించినచో అంత అధికముగా శక్తిని బలమును పొందును. అట్లే భక్తియుక్త సేవను అధిక ఉత్సాహముతో నిర్వహించు చున్నప్పుడు మనస్సు భౌతిక విషయముల నుండి దూరమగుచుండును. కనుక అతడు అధికమైన ఆధ్యాత్మిక సంతృప్తిని పొందు చుండును. ఇది చక్కని వైద్యము మరియు తగిన ఆహారము చేతను(పథ్యము) రోగమును నయము చేయు ప్రక్రియ వంటిది. శ్రీకృష్ణభగవానుని దివ్యలీలలను శ్రవణము చేయుట

వెర్రి మనస్సునకు గల అత్యుత్తమ వైద్యము కాగా, కృష్ణప్రసాదమును భుజించుట భవరోగికి సరియైన పథ్యాహారము. ఇట్టి చికిత్స విధానమే కృష్ణచైతన్య విధానము.

## 6.36

**అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతి: ।**

**వశ్యాత్మనా తు యతతా శక్యో వాప్తుముపాయత: ॥**

### అనువాదము

**నిగ్రహింపబడని మనస్సు గలవానికి ఆత్మానుభూతి అతికష్టకార్యము. కాని మనోనిగ్రహము కలిగి, తగిన పద్ధతుల ద్వారా యత్నించువానికి జయము తప్పక సిద్ధించును. ఇది నా అభిప్రాయము.**

### భాష్యము

భౌతిక కార్యముల నుండి మనస్సును దూరము చేయుటకు తగిన చికిత్సను గ్రహింపనివాడు ఆత్మానుభూతి నందు విజయమును సాధింపలేడని దేవాదిదేవుడు ఇక్కడ ప్రకటించుచున్నాడు. భౌతికానందమున మనస్సును నిమగ్నము చేయుచు యోగాభ్యాసమునకు ప్రయత్నించుట మనునది పై నుండి నీరు పోయుచు అగ్నిని జ్వలింపజేయు యత్నము వంటిది.మనోనిగ్రహము లేనట్టి యోగాభ్యాసము కేవలము కాలమును వృథాచేయుటయే అగును. అట్టి యోగప్రదర్శనము బాహ్యమునకు ఆకర్షణీయము కావచ్చును కాని ఆత్మానుభూతికి సంబంధించినంత వరకు మాత్రము అది నిరుపయోగము. కనుక మానవుడు సదా భగవానుని దివ్యమైన భక్తియుక్త సేవ యందు మనస్సును నెలకొల్పుతూ దానిని నియంత్రించవలెను. మానవుడు కృష్ణచైతన్యము నందు నెలకొననిదే తన మనస్సును స్థిరముగా నియంత్రింపజాలడు. అనగా కృష్ణచైతన్యవంతుడు యోగాభ్యాసపు ఫలమును ఎట్టి ప్రత్యేక ప్రయత్నము లేకుండగనే సులభముగా పొందగలడు. కాని కృష్ణచైతన్యవంతుడు కానిదే యోగాభ్యాసకుడు విజయమును సాధింపలేడు.

## 6.37

**అర్జున ఉవాచ**

**అయతి: శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానస: ।**

**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥**

### అనువాదము

**అర్జునుడు పలికెను : ఓ కృష్ణా! తొలుత ఆత్మానుభూతి మార్గమును శ్రద్ధతో ననుసరించి, పిదప లౌకికభావన కారణముగా దానిని త్యజించి, యోగము నందు పరిపూర్ణత్వమును పొందలేని విఫలుడైన యోగి గమ్యమేట్టిది?**

## భాష్యము

ఆత్మానుభూతిని పొందు మార్గము లేక యోగమార్గము భగవద్గీత యందు వర్ణింపబడినది. జీవుడు వాస్తవమునకు ఈ పాంచభౌతిక దేహము కాదనియు దానికి భిన్నుడనియు మరియు సత్, చిత్, ఆనందమందే అతనికి నిజమైన ఆనందము కలదనియు తెలిపెడి జ్ఞానమే ఆత్మానుభూతికి గల మూల సూత్రము. ఇట్టి నిత్యజీవనము, జ్ఞానము మరియు ఆనందము లనునవి ఆధ్యాత్మికము లైనందున మనోదేహములు రెండింటికిని అతీతములు. ఇట్టి ఆత్మానుభూతిని జ్ఞానమార్గము ద్వారా, అష్టాంగ యోగమార్గము ద్వారా లేక భక్తిమార్గము ద్వారా కాని పొందవచ్చును. ఈ మార్గము లన్నింటి యందును జీవుడు తన నిజస్థితిని మరియు తనకు భగవానునితో గల సంబంధమును పునరుద్ధరించుకొని కృష్ణచైతన్య స్థితి యందలి అత్యున్నత పరిపూర్ణత్వపు స్థితిని సాధించుటకు కావలిసిన కర్మలను ఎరుగవలసియున్నది. పైన పేర్కొనబడినట్లు, ఈ మూడు మార్గములలో దేనిననుసరించినను శీఘ్రముగనో లేక ఆలస్యముగనో తప్పక మానవుడు పరమ లక్ష్యమును పొందగలడు. ద్వితీయాధ్యాయము నందు ఆధ్యాత్మిక మార్గమున చేయబడు స్వల్పప్రయత్నము కూడ ముక్తికి ఎంతగానో తోడ్పడగలదని తెలుపుతూ శ్రీకృష్ణభగవానుడు ఈ విషయమున నిర్ధారించి యున్నాడు. ఈ మూడు మార్గములలో భక్తియోగమార్గము ఈ యుగమునకు మిక్కిలి అనుకూలమైనది. ఎందుకనగా, భగవదనుభూతిని పొందుటకు అది మిక్కిలి ప్రత్యక్షమైన పద్ధతి. భగవానుడు గతము నందు తెలిపియున్న విషయమును తిరిగి నిర్ధారించుకొనుట కొరకై అర్జునుడిచ్చట ఈ విధముగా ప్రశ్నించుచున్నాడు. ఎవరైనను ఆత్మానుభూతి మార్గమును హృదయపూర్వకముగా అంగీకరించినను, జ్ఞానయోగ పద్ధతి మరియు అష్టాంగయోగ పద్ధతి ఈ కాలమునకు మిక్కిలి కష్టమైన విధానములై యున్నవి. కనుకనే ఈ మార్గములందు నిరంతరముగా ఎన్ని యత్నములు చేసినను అనేక కారణముల చేత మానవుడు విజయమును సాధింపలేకపోవచ్చును. మొట్టమొదటి విషయమేమనగా, మానవునికి ఈ విధానము ననుసరించుట యందు తగినంత శ్రద్ధను కలిగియుండక పోవచ్చును. అంతేకాకుండ, ఆధ్యాత్మిక మార్గమును అంగీకరించుట అనగా దాదాపు మాయాశక్తిపై యుద్ధము ప్రకటించుటయే యగును. దానికి ఫలితముగా ఎవరైనను అట్లు మాయాశక్తి బంధముల నుండి తప్పించుకొనుటకు యత్నింపగనే మాయ వివిధములైన ఆకర్షణలచే సాధకునికి అపజయమును కలిగించుటకు యత్నింపవచ్చును. వాస్తవమునకు బద్ధజీవుడు భౌతిక ప్రకృతి గుణములచే అప్పటికే ఆకర్షింపబడి యుండుట చేత, ఆధ్యాత్మిక నియమముల ననుసరించు చున్నప్పటికిని తిరిగి మాయలో పడుటకు అవకాశము కలదు. ఇదియే ఆధ్యాత్మిక మార్గము నుండి పతనము నొందుట (యోగాచ్చలిత మానస:) యనబడును. ఈ విధముగా ఆత్మానుభూతి మార్గము నుండి వైదొలగుట వలన కలిగెడి ఫలితములను తెలుసుకొనుటకు అర్జునుడు ఉత్సాహపడుచున్నాడు.

## 6.38

**కచ్చిన్నోభయవిభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రాహ్మణ: పథి ॥**

**అనువాదము**

**మహానుబాహుడవైన ఓ శ్రీకృష్ణా! ఆధ్యాత్మికమార్గము నుండి వైదొలగిన అట్టి మానవుడు ఆధ్యాత్మిక జయమును మరియు లౌకిక జయమును రెండింటిని పొందనివాడై ఎచ్చోటను స్థానము లేకుండా వాయువుచే చెదరగొట్టబడిన మేఘము వలె నశింపడా?**

**భాష్యము**

మానవాభ్యుదయమునకు రెండు మార్గములు గలవు. లౌకికవాదులకు ఆధ్యాత్మికత నందు ఆసక్తియుండదు. కనుకనే వారు ఆర్థికాభివృద్ధి ద్వారా లౌకిక పురోగతిని పొందుట యందు గాని, తగిన కర్మల ద్వారా ఉన్నత లోకములను చేరుట యందు గాని ఆసక్తిని కలిగియుందురు. కాని ఎవ్వరైనను ఆధ్యాత్మిక మార్గమును పాటించినచో అట్టి భౌతిక కార్యములను విడిచి భౌతిక సుఖము లనబడు వాటినన్నింటిని త్యజింపవలసి వచ్చును. ఇట్టి ఉత్తమ స్థితిని పొందగోరు యోగి ఉత్తీర్ణుడు కానిచో బాహ్యమునకు రెండు విధములా నష్టపోయిన వాడగును. మరోమాటలో, అతడు భౌతిక సుఖమును అనుభవింపలేడు, అట్లే ఆధ్యాత్మిక విజయమును కూడ పొందలేడు. అతనికి స్థిరమైన స్థానముండదు. అతడు వాయువు చేత చెదరగొట్టబడిన మేఘము వలె నుండును. కొన్నిమార్లు అవకాశమున మేఘము ఒక చిన్న మేఘము నుండి విడివడి పెద్ద మేఘముతో కలియుచుండును. కాని అది పెద్ద మేఘముతో కలియజాలనిచో వాయువుచే చెదరగొట్టబడి విశాలమైన ఆకాశమున జాడలేకుండపోవును. బ్రహ్మము, పరమాత్మ, భగవానునిగా వ్యక్తమగునట్టి పరతత్త్వపు అంశరూపమే జీవుడు అని ఎరుగగలిగే ఆత్మానుభూతి మార్గమే 'బ్రాహ్మణ: పథి' యనబడును. శ్రీకృష్ణభగవానుడే ఆ పరతత్త్వపు సంపూర్ణస్వరూప మగుటచే అతనిని శరణు పొందినవాడు సఫలత సాధించిన పరిపూర్ణ యోగి కాగలడు. కాని బ్రహ్మానుభూతి మరియు పరమాత్మనుభూతి ద్వారా ఇట్టి జీవితలక్ష్యమును చేరగలుగుటకు ఎన్నోజన్మలు అవసరమగును(బహూనాం జన్మనామన్తే). కనుకనే ప్రత్యక్ష విధానమైన భక్తియోగము లేక కృష్ణచైతన్యమే సర్వోత్తమమైన ఆధ్యాత్మికానుభూతి మార్గమై యున్నది.

## 6.39

**ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తు మర్హస్యశేషత: ।**
**త్వదన్య: సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥**

**అనువాదము**

**ఓ కృష్ణా! ఈ నా సందేహమును సంపూర్ణముగా తొలగించుమని నిన్ను ప్రార్థించు చున్నాను. ఈ సందేహమును ఛేదించుటకు నీవు తప్ప ఇతరులెవ్వరును కనబడుటలేదు.**

## భాష్యము

శ్రీకృష్ణుడు భూత, భవిష్యత్తు, వర్తమానములను పూర్తిగా నెరిగినవాడు. జీవులన్నియు తమ వ్యక్తిత్వముతో గతము నందును, వర్తమానము నందును, భవిష్యత్తు నందును నిలిచి యుందురనియు, భౌతిక బంధముల నుండి విముక్తిని పొందినప్పటికిని వారట్లే భవిష్యత్తు కాలము నందు కూడ వ్యక్తిత్వముతో కొనసాగు చుందురనియు భగవద్గీత ఆరంభమున(2.12) భగవానుడు తెలిపియుండెను. ఈ విధముగా జీవుని భవిష్యత్తును గూర్చిన ప్రశ్నకు అతడు ఇదివరకే స్పష్టముగా సమాధానమిచ్చెను. కాని ఇప్పుడు అర్జునుడు సామాన్యజీవుని విషయమును గూర్చికాకుండ, ఆధ్యాత్మికమార్గము నందు విజయమును సాధింపలేని యోగి భవిష్యత్తును గూర్చి తెలియగోరుచున్నాడు. వాస్తవమునకు శ్రీకృష్ణునితో సమానులు గాని, అతని కంటె అధికులు గాని ఎవ్వరును లేరు. కనుకనే యోగులు మరియు తత్త్వవేత్తలని పిలువబడు వారు కూడ ప్రకృతి దయపై ఆధారపడి యుండువారే కనుక ముమ్మాటికి శ్రీకృష్ణునికి సమానులు కాజాలరు. శ్రీకృష్ణుడు భూత భవిష్యత్తు వర్తమానములను సంపూర్ణముగా ఎరిగియుండుటచే అతని తీర్పు సర్వ సందేహములకు సంపూర్ణ సమాధానము. కాని అతనిని మాత్రము ఎవ్వరును ఎరుగజాలరు. శ్రీకృష్ణుడు మరియు కృష్ణచైతన్యము గల భక్తులు మాత్రమే ఏది ఎట్టిదను విషయమును పూర్తిగా ఎరిగియుందురు.

## 6.40

**శ్రీభగవానువాచ**

**పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।**

**న హి కళ్యాణకృత్కశ్చిద్ దుర్గతిం తాత గచ్ఛతి ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ పార్థా! శుభకార్యముల యందు నియుక్తుడైన వాడు ఈ లోకమున గాని, ఆధ్యాత్మిక లోకమున గాని వినాశమును పొందడు. మిత్రమా! మంచి చేయువాడెన్నడును చెడుచే పరాజితుడు కాడు.**

## భాష్యము

శ్రీమద్భాగవతము(1.5.17) నందు నారదముని వ్యసదేవునికి ఈ విధముగా ఉపదేశించుచున్నాడు :

త్యక్త్వా స్వధర్మం చరణాంబుజం హరేర్భజన్నపక్వో థ పతేత్తతో యది
యత్ర క్వ వాభద్రమభూదముష్య కిం కో వార్థ ఆప్తో భజతాం స్వధర్మత:

"ఎవరైనను భౌతికవాంఛల నన్నింటిని విడిచి దేవాదిదేవునికి పూర్తిగా శరణు పొందినచో ఏ విధమైన నష్టము గాని పతనము గాని కలుగబోదు. కాని భక్తుడు కానివాడు తన విధ్యుక్త ధర్మములందు సంపూర్ణముగా నెలకొనినను ఎట్టి లాభమును పొందక పోవచ్చును."

భౌతికాభ్యుదయము కొరకై శాస్త్రవిహితములైన కర్మలనేకము గలవు. జీవితము నందలి ఆధ్యాత్మిక పోరోగతి కొరకు అనగా కృష్ణచైతన్యము కొరకై యోగి అట్టి సమస్త భౌతిక కార్యకలాపాలను త్యజింపవలెను. ఎవ్వరైనను పూర్తిగా కృష్ణచైతన్యమును అనుసరించినచో దాని ద్వారా అతడు అత్యున్నత పరిపూర్ణత్వమును పొందవచ్చును.

కాని అట్టి పరిపూర్ణత్వ స్థితిని పొందజాలనిచో అతడు భౌతికముగాను మరియు ఆధ్యాత్మికము గాను నష్టపోవచ్చునని ఎవరైనను వాదింపవచ్చును. విధ్యుక్త ధర్మములను విధిగా నిర్వహింపని వాడు తత్ఫలితములను అనుభవింపవలసి వచ్చునని శాస్త్రగ్రంథము లందు నిర్దేశింపబడినది. కనుకనే ఆధ్యాత్మిక కర్మలను చక్కగా నిర్వర్తింప లేనివాడు కూడ ఈ కర్మఫలముచే ప్రభావితుడు కాగలడని భావించు అవకాశము కలదు. కాని ఈ విషయమున ఉత్తీర్ణుడు కాని యోగి ఎట్టి కలతను పొందనవసరము లేదని శ్రీమద్భాగవతము నిశ్చయముగా తెలుపుచున్నది. నిర్దిష్ట ధర్మములను పరిపూర్ణముగా నిర్వహింప నందుకు అతడు దుష్ఫలితములకు గురియైనను ఎట్టి నష్టమును పొందడు. ఎందుకనగా శుభప్రదమైన కృష్ణచైతన్యము ఎన్నడును విస్మరింపబడదు. అంతేకాకుండ, ఆ విధముగా నెలకొనినట్టివాడు తదుపరి జన్మమున నిమ్నకులములో జన్మించినను దానిని కొనసాగింపగలుగును. అట్లుగాక, మానవుడు విధ్యుక్త ధర్మములను శ్రద్ధగా నిర్వహించినను కృష్ణచైతన్యము లేనివాడైనచో శుభఫలములను పొందలేకపోవచ్చును.

దీనిని మనము ఈ క్రింది విధముగా అర్థము చేసుకొనవచ్చును. మానవులను క్రమబద్ధులు, క్రమబద్ధులు కానివారని రెండు భాగములుగా విభజింపవచ్చును. మరుజన్మను గూర్చిన జ్ఞానము ఏ మాత్రము లేకుండా లేదా ముక్తిని గూర్చిన చింతను కలిగియుండక కేవలము పశుప్రాయమైన ఇంద్రియ తృప్తియందే నెలక్రమబద్ధులు కొని యుండెడివారు క్రమబద్ధులు కానివారు. శాస్త్రగ్రంథము లందు నిర్దేశింపబడిన విధ్యుక్త ధర్మములను, సిద్ధాంతములను విధిగా అనుసరించు వారు క్రమబద్ధులు. క్రమబద్ధులు కానివారు నాగరికులైనను, అనాగరికులైనను, విద్యావంతులైనను, విద్యలేనివారైనను, బలవంతులైనను, బలహీనులైనను, సర్వులు పశుప్రవృత్తులతో నిండియుందురు. వారి కార్యము లెప్పుడును శుభప్రదములు కాజాలవు. ఎందుకనగా ఆహార, నిద్ర, భయ, మైథునములను పశుప్రవృత్తులలో నెలకొనినట్టివారు ఎల్లప్పుడు దుఃఖపూరితమైన భౌతికజీవితము నందే శాశ్వతముగా నిలిచియుందురు. అట్లుగాక శాస్త్రనిర్దేశముల ననుసరించి క్రమబద్ధమైన జీవితమును గడుపుతూ క్రమముగా కృష్ణచైతన్యమున పురోభివృద్ధిని సాధించువారు తప్పక జీవితాభ్యుదయమును పొందగలుగుదురు.

ఈ పుణ్యమార్గమును అనుసరించువారిని తిరిగి మూడు తరగతులుగా విభజింప వచ్చును :(1) శాస్త్రము లందు నిర్దేశింపబడిన నియమ నిబంధనల ననుసరించుచు భౌతిక సంపదల ననుభవించువారు, (2) భౌతిక జీవితము నుండి మోక్షమును పొందుటకై యత్నించువారు, (3) కృష్ణచైతన్యవంతులైన భక్తులు. భౌతిక సుఖము కొరకై శాస్త్రములందు నిర్దేసింపబడిన నియమ నిబంధనల ననుసరించు వారిని మరల రెండు తరగతులుగా విభజింపవచ్చును. వారు కామ్యకర్మల ఫలములను కోరువారు, ఇంద్రియతృప్తి కొరకై కర్మఫలములను కోరనివారు. ఇంద్రియతృప్తి కొరకై కామ్యకర్మ ఫలములను కోరువారు ఉన్నత ప్రమాణము గల జీవితమును లేక ఉన్నత లోకములను కూడా పొందగలుగునట్లుగా అభివృద్ధిని సాధింపవచ్చునేమో గాని భౌతిక జీవితము నుండి వారు విముక్తులు కానందున నిజమైన మంగళకరమైన మార్గము ననుసరించువారు కాజాలరు. మానవుని ముక్తి వైపునకు నడిపించు కర్మలు మాత్రమే వాస్తవమునకు మంగళకరమైన కర్మలు. చరమమైన ఆత్మానుభూతికి లేక భౌతిక దేహబంధముల నుండి ముక్తికొరకు ఉద్దేశింపబడని ఏ కర్మయు మంగళకరము కానేరదు. కేవలము కృష్ణచైతన్యముతో కూడిన కర్మయే మంగళకరమైనది. కనుకనే కృష్ణచైతన్య మార్గము నందు అభివృద్ధిని సాధించుట కొరకై దేహమునకు కలుగు అన్నిరకాల అసౌకర్యములను స్వచ్ఛందముగా భరించు వారెవరైనను దృఢమైన శ్రద్ధ గల

ఉత్తమయోగి అనబడును. ఇట్టి అష్టాంగయోగ విధానపు ముఖ్యప్రయోజనము కృష్ణచైతన్యపు చరమానుభూతిని పొందుట కొరకై ఉద్దేశింపబడి యున్నందున అష్టాంగయోగ అభ్యాసము కూడ మంగళకరమైనట్టిదే. ఈ విషయమున తమ శక్త్యానుసారము యత్నించు వారెవ్వరైనను పతన భయమును కలిగి యుండనవసరము లేదు.

## 6.41

**ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీ: సమా: ।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టో భిజాయతే ॥**

### అనువాదము

**ఉత్తీర్ణుడు కాని యోగి (యోగభ్రష్టుడు) పుణ్యజీవులు వసించు పుణ్యలోకము లందు అనేకానేక సంవత్సరములు సుఖముల ననుభవించిన పిదప పవిత్రుల కుటుంబమున గాని లేదా శ్రీమంతుల గృహమున గాని జన్మించును.**

### భాష్యము

యోగభ్రష్టులను రెండు తరగతులుగా విభజింపవచ్చును : 1. స్వల్పకాల యోగాభ్యాసము పిమ్మట పతనము నొందినవారు, 2. దీర్ఘకాల యోగాభ్యాసము పిమ్మట పతనము నొందినవారు. స్వల్పకాల యోగాభ్యాసము చేసిన పిమ్మట పతితుడైన యోగి (పుణ్యజీవులు ప్రవేశించుటకు అనుమతించబడు) ఉన్నత లోకములను చేరును. అక్కడ దీర్ఘకాలము నివసించిన పిమ్మట తిరిగి ఈ లోకము నందు పవిత్రమైన బ్రాహ్మణ వైష్ణవ కుటుంబమున గాని లేదా సంపన్నుల గృహము నందు గాని జన్మించును.

ఈ అధ్యాయపు చివరి శ్లోకమున వివరింపబడినట్లు కృష్ణచైతన్యము నందు పరిపూర్ణత్వమును పొందుటయే యోగాభ్యాసపు వాస్తవ ప్రయోజనము. కాని దీర్ఘకాలము యోగమును అభ్యసింపజాలక భౌతికాకర్షణలచే ప్రభావితులై యోగమునందు ఉత్తీర్ణులు కాలేనివారికి భగవానుని కృపచే వారి భౌతిక వాంఛలను తృప్తి పరచుకొను అవకాశమివ్వబడును. అటుపిమ్మట వారికి పవిత్ర కుటుంబమున కాని లేదా సంపన్నుల గృహమున కాని సుఖముగా జీవించుటకు అవకాశము కల్పింపబడును. అట్టి కుటుంబము లందు జన్మించినవారు తమకు లభించిన సౌకర్యములను వినియోగించుకొని తిరిగి పరిపూర్ణ కృష్ణచైతన్యము నందు పురోభివృద్ధిని సాధించుటకు యత్నింపవచ్చును.

## 6.42

**అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥**

**అనువాదము**

**లేక (దీర్ఘకాల యోగాభ్యాసము పిమ్మటయు ఉత్తీర్ణుడు కానిచో) అట్టి యోగి గొప్ప జ్ఞానవంతులైన యోగుల కుటుంబమున జన్మించును. కాని ఈ జగత్తులో అట్టి జన్మము నిశ్చయముగా మిక్కిలి అరుదు.**

**భాష్యము**

గొప్పజ్ఞానవంతులైన యోగుల కుటుంబమున లేదా శుద్ధభక్తుల కుటుంబమున కాని జన్మించుట ఇచ్చట ప్రశంసింపబడినది. ఎందుకనగా, అట్టి కుటుంబమున జన్మించిన శిశువునకు జీవితారంభము నుండి ఆధ్యాత్మిక జీవితమునకు ప్రోత్సాహము లభించును. ఇట్టిది ముఖ్యముగా 'ఆచార్యుల' లేక 'గోస్వాము'ల కుటుంబములలో జరుగును. అట్టి కుటుంబముల వారు సంప్రదాయము మరియు శిక్షణ వలన గొప్పపాండిత్యము మరియు భక్తితోను కూడియుండుటచే, ఆ కుటుంబమున జన్మించినవారు ఆధ్యాత్మికాచార్యులు కాగలరు. భారతదేశము నందు అట్టి 'ఆచార్య' కుటుంబము లనేకము గలవు. కాని తగినంత విద్య మరియు శిక్షణ లోపించి యున్నందున అవి ప్రస్తుతము పతనము చెందినవి. అయినను భగవానుని కృపచే తరతరములుగా శుద్ధభక్తులను తయారుచేయు అట్టి కుటుంబములు ఇంకను కొన్ని కలవు. అట్టి కుటుంబములలో జన్మించుట నిశ్చయముగా గొప్ప అదృష్టము. భగవత్కృప చేతనే మా ఆధ్యాత్మికాచార్యులైన ఓం విష్ణుపాద శ్రీ శ్రీమద్ భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి మహారాజు గారికిని, మాకును అట్టి కుటుంబములలో జన్మించు అవకాశము కలిగినది. ఆ విధముగా జీవితారంభము నుండియు మేము శ్రీకృష్ణభగవానుని భక్తియుక్తసేవ యందు సుశిక్షితులమైతిమి. తదుపరి భగవానుని దివ్యసంకల్పముచే నేను గురుశిష్య పరంపరలోని నా ఆధ్యాత్మికాచార్యుని కలిసికొంటిని.

## 6.43

**తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।**
**యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునన్దన ॥**

**అనువాదము**

**ఓ కురునందనా! అట్టి జన్మను పొందిన పిమ్మట అతడు పూర్వజన్మమునకు సంబంధించిన ఆధ్యాత్మిక చైతన్యమును పునరుద్ధరించుకొని పరిపూర్ణవిజయమును సాధించుటకు తిరిగి అధికమైన అభివృద్ధికై యత్నించును.**

**భాష్యము**

పూర్వజన్మమునకు సంబంధించిన ఆధ్యాత్మిక చైతన్యమును జాగృతము చేయుటకు ఉత్తమ బ్రాహ్మణ కుటుంబమున తన మూడవజన్మను పొందిన భరతమహారాజు వృత్తాంతము చక్కని ఉదాహరణము. భరతమహారాజు ప్రపంచ

సార్వభౌముడు. అతని కాలము నుండియే దేవతలలో ఈ లోకము భారతవర్షముగా ప్రసిద్ధి నొందినది. పూర్వము ఇది ఇలావృత వర్షమని తెలియబడెడిది. బాల్యము నందే ఆ చక్రవర్తి ఆధ్యాత్మిక సంసిద్ధి కొరకు యత్నించినను విజయమును సాధింపలేకపోయెను. తరువాతి జన్మమున అతడు ఉత్తమ బ్రాహ్మణ కుటుంబమున జన్మించెను. అతడు నిర్జన ప్రదేశములో నివసిస్తూ మౌనిగా ఉండుటచేత అతడు జడభరతుదని పిలువబడెను. కాని అతడు గొప్పయోగి యని తదనంతరము రాహుగణుడను మహారాజు గుర్తింపగలిగెను. అతని జీవితచరిత్ర నుండి యోగాభ్యాస యత్నము లెన్నడును వృథాకావని భగవానుని కృపచే తెలియుచున్నది. అనగా యోగాభ్యాసకుడు కృష్ణచైతన్యము నందలి పరిపూర్ణత్వము కొరకై మరల మరల అవకాశములను పొందుచునే యుండును.

## 6.44

**పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశో పి స: ।**

**జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥**

**అనువాదము**

**పూర్వాభ్యాసముచే పొందిన దివ్యచైతన్యము కారణముగా అతడు కోరకనే అప్రయత్నముగా యోగసిద్ధాంతముల వైపునకు ఆకర్షింపబడును. జిజ్ఞాసువైన అట్టియోగి శాస్త్రములందు తెలుపబడిన కర్మసిద్ధాంతములకు సదా అతీతుడై యుండును.**

**భాష్యము**

పురోగతి చెందిన యోగులు శాస్త్రములందు తెలుపబడిన కర్మల పట్ల అంతగా ఆకర్షింపబడరు. కాని వారు అత్యున్నత యోగమైన సంపూర్ణ కృష్ణచైతన్యమునకు తమను ఉద్ధరింపజేసెడి యోగసిద్ధాంతములచే సహజముగనే ఆకర్షింపబడుదురు. శ్రీమద్భాగవతము (3.33.7) నందు ఉత్తమ యోగులు అట్లు వైదిక కర్మల పట్ల చూపు నిర్లక్ష్యమును గూర్చి ఈ విధముగా వివరింపబడినది :

అహో బత శ్వపచో తో గరీయాన్ యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్
తేపుస్తపస్తే జుహువు: సస్నురార్యా బ్రహ్మానూచుర్నామ గృణన్తి యే తే

"హే ప్రభూ! నీ పవిత్ర నామములను కీర్తించువారు శునక మాంసమును తిను చండాలుర కుటుంబములో జన్మించినను ఆధ్యాత్మిక జీవితము నందు గొప్ప పురోగతిని సాధించినట్టివారే. అట్లు కీర్తించు భక్తులు నిశ్చయముగా అన్నిరకములైన తపస్సులను, యజ్ఞములను ఆచరించినట్టివారే. అన్ని పుణ్యతీర్థములలోను స్నానమాచరించినట్టి వారే, సకల శాస్త్రగ్రంథముల అధ్యయనమును చేసినట్టివారే యగుడురు."

హరిదాస ఠాకూరును శ్రీ చైతన్య మహాప్రభువు తన ముఖ్యశిష్యులలో ఒకనిగా గ్రహించుట మనునది దీనికి సుప్రసిద్ధమైన ఉదాహరణగా చెప్పబడినది. హరిదాస ఠాకూరు మహ్మదీయ కుటుంబమున జన్మించినను శ్రీ చైతన్య మహాప్రభువు అతనిని 'నామాచార్య' స్థానమునకు ఉద్ధరించిరి. "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అని ప్రతిదినము భగవానుని దివ్యనామమును మూడు లక్షలసార్లు శ్రద్ధగా జపించుటయే అందుకు కారణము. అతడు నిరంతరము

భగవానుని పవిత్ర నామజపమును చేయుట చేత పూర్వజన్మమున 'శబ్దబ్రహ్మము' అని పిలువబడు ప్రసిద్ధమైన వేదము లందలి కర్మవిధానము లన్నింటిని పూర్తిచేసినట్లుగా అవగత మగుచున్నది. కనుకనే పవిత్రులు కానిదే ఎవ్వరును కృష్ణచైతన్య సిద్ధాంతములను అవలంబించుట గాని భగవానుని పవిత్రనామమైన 'హరేకృష్ణ' మహామంత్ర జప కీర్తనము లందు నెలకొనుట గాని సంభవింపదు.

## 6.45

**ప్రయత్నాద్ యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిష: ।**
**అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ ॥**

**<u>అనువాదము</u>**

**సమస్త కల్మషముల నుండి శుద్ధిపడిన యోగి మరింత అధిక పురోగతి కొరకు శ్రద్ధతో యత్నించినపుడు బహుజన్మల అభ్యాసముల పిదప పరిపూర్ణత్వమును పొంది, అంత్యమున పరమగతిని పొందును.**

**<u>భాష్యము</u>**

ప్రత్యేకముగా పవిత్రము లేక సంపన్నమైనట్టి లేక ధార్మిక కుటుంబము నందు జన్మించిన వ్యక్తి యోగాభ్యాసము కొరకై తనకు అనుకూల పరిస్థితులు కలిగెనని గుర్తించును. కనుకనే అతడు అసంపూర్ణముగా మిగిలిన తన కార్యమును దృఢనిశ్చయముతో ఆరంభించి, సమస్త భౌతిక కాలుష్యముల నుండి సంపూర్ణముగా ప్రక్షాళితుడగును. చివరికి అతడట్లు సమస్త కాలుష్యముల నుండి విముక్తుడవ్వగానే పరమ సంసిద్ధిని అనగా కృష్ణచైతన్యమును పొందును. అట్టి కృష్ణచైతన్య మనునది అన్నిరకములైన కాలుష్యముల నుండి విముక్తి పొందిన సంపూర్ణ స్థితి. ఈ విషయము భగవద్గీత(7.28) నందు ఇట్లు నిర్ధారింపబడినది :

యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతా: ॥

" అనేకానేక జన్మలయందు పుణ్యకర్మల నొనరించి సర్వపాపముల నుండియు మరియు మొహపూరితమైన ద్వంద్వభావముల నుండియు పూర్తిగా విముక్తుడైనప్పుడు మానవుడు భగవానుని ప్రేమయుక్త సేవయందు నెలకొనగలడు."

## 6.46

**తపస్విభ్యో ధికో యోగీ జ్ఞానిభ్యో పి మతో ధిక:।**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥**

### అనువాదము

**ఓ అర్జునా! యోగి యపస్వి కంటెను, జ్ఞాని కంటెను, కామ్యకర్మలు చేయువాని కంటెను అధికుడు. అందుచే అన్నిపరిస్థితుల యందును నీవు యోగివి కమ్ము.**

### భాష్యము

మనము యోగను గూర్చి చర్చించినపుడు దానిని స్వీయ చైతన్యమును పరతత్త్వముతో సందానమొనరించుటగా అన్వయింతుము. అట్టి అభ్యాసము ప్రత్యేక విధానములను అవలంబించు అభ్యాసకులచే వివిధ రకములుగా పేర్కొన బడుచున్నది. సంధాన విధానము ప్రధానముగా కామ్యకర్మములతో కూడినపుడు కర్మయోగమనియు, ప్రయోగాత్మక మైనపుడు జ్ఞానయోగమనియు, దేవాదిదేవునితో భక్తియుక్త సంబధము కలిగియున్నప్పుడు భక్తియోగమనియు (కృష్ణచైతన్యము) చెప్పబడును. తరువాతి శ్లోకము నందు వివరింప బడునట్లు, భక్తియోగము లేక కృష్ణచైతన్యము అన్నియోగములకు చరమపూర్ణత్వమై యున్నది. భగవానుడు ఇక్కడ యోగము యొక్క అధిక్యమును స్థిరపరచెను. కాని దానిని భక్తియోగము కంటెను గొప్పదని చెప్పియుండలేదు. వాస్తవమునకు, భక్తియోగము పరిపూర్ణ ఆధ్యాత్మిక జ్ఞానమైనందున ఏదియు దానిని అధిగమింపజాలదు. ఆత్మజ్ఞానము లేని తపస్సు అసంపూర్ణమైనది. అదేవిధముగా, దేవాదిదేవుని శరణుపొందని ప్రయోగాత్మక జ్ఞానము కూడ అసంపూర్ణమే. కృష్ణచైతన్యము లేని కామ్యకర్మ వృథాకాలయాపన మాత్రమే. కనుకనే ఇక్కడ గొప్పగా ప్రశంసింపబడిన యోగాభ్యాసము భక్తియోగమే. ఈ విషయము రాబోవు శ్లోకమున మరింత స్పష్టముగా వివరించబడినది.

## 6.47

**యోగినామపి సర్వేషాం మద్గతేనార్తరాత్మనా।**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మత: ॥**

### అనువాదము

**అత్యంత శ్రద్ధతో నా భావన యందే సదా నిలిచి యుండువాడును, నన్నే తన యందు సదా స్మరించువాడును మరియు నాకు దివ్యమైన ప్రేమయుక్త సేవను ఒనరించువాడును అగు యోగి యోగులందరి కంటెను అత్యంత సన్నిహితముగా నాతో యోగమునందు కూడినట్టివాడై యున్నాడు. యోగులందరిలో అతడే అత్యున్నతుడు. ఇదియే నా అభిప్రాయము.**

### భాష్యము

ఇక్కడ ‘భజతే’ అను పదము మిక్కిలి ప్రధానమైనది. ‘భజతే’ అను క్రియ ‘భజ్’ అను ధాతువు నుండి ఏర్పడినది. అది సేవకు అవసరమైనప్పుడు వాడబడును. ‘పూజ’ అను అర్థము గల ‘వర్ షిప్’ అను ఆంగ్ల పదమును ‘భజ్’ అనుదానితో సమానమైన

అర్థమునందు వాడరాదు. 'పూజ' అనగా యోగ్యుడైన వానిని ప్రశంసించుట, అతని పట్ల గౌరవమును చూపుట, సన్మానించుట యని అర్థము. కాని ప్రేమవిశ్వాసములతో సేవచేయుట యనునది దేవాదిదేవునకు మాత్రమే ప్రత్యక్షముగా ఉద్దేశింపబడినది. గౌరవనీయుడైన వ్యక్తిని గాని దేవతను గాని పూజింపనిచో మానవుడు అమర్యాదస్థుడుగా భావింపబడవచ్చును. కాని ఎవ్వరైనను దేవాదిదేవుని సేవించుటను మానినచో తీవ్రముగా నిరసింప బడుదురు. ప్రతిజీవి కూడ దేవాదిదేవుని అంశాయైనందున తన నిజస్థితి కారణముగా అతడు ఆ దేవాదిదేవుని సేవించి తీరవలెను. అట్లు చేయనిచో అతడు పతితుడగును. శ్రీమద్భాగవతము (11.5.3) ఇట్లు నిర్ధారించుచున్నది :

య ఏషాం పురుషం సాక్షాద్ ఆత్మప్రభవమీశ్వరమ్
న భజన్త్యవజానన్తి స్థానాద్ భ్రష్టా: పతన్త్యధ:

"సర్వజీవులకు మూలాధారుడైన ఆదిదేవునికి సేవ చేయక ఆ పరమపురుషుని పట్ల తనకు గల ధర్మమును ఉపేక్షించు వాడెవ్వడైనను తన నిజస్థితి నుండి తప్పక పతితుడు కాగలడు."

ఈ శ్లోకము నందు కూడా 'భజన్తి' అను పదము వాడబడినది. అనగా ఈ పదము దేవాదిదేవునికి మాత్రమే వాడదగినది. 'పూజ' యను పదము దేవతల విషయమున లేక సామాన్య జీవుల విషయమున వాడవచ్చును. శ్రీమద్భాగవతము నందలి శ్లోకము నందు వాడబడిన 'అవజానన్తి' అను పదము భగవద్గీత(9.11) నందును గోచరించును. "అవజానన్తి మాం మూఢా:" అనగా మూర్ఖులు మాత్రమే దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అపహాస్యము చేయుదురు. అట్టి మూర్ఖులు భగవానుని పట్ల ఎట్టి సేవాభావము లేకుండ భగవద్గీతపై వ్యాఖ్యానములను రచించుటకు యత్నింతురు. తత్ఫలితముగా వారు 'భజన్తి', మరియు 'పూజ' అను పదముల నడుమ గల అర్థభేదమును తగినరీతిన గ్రహింపజాలరు.

వాస్తవమునకు అన్నివిధములైన యోగాభ్యాసముల పరమావధి భక్తి యోగము నందే కలదు. ఇతర యోగములు భక్తియోగము నందలి భక్తి యనెడి కేంద్ర విషయమును చేరుటకు గల సాధనములు మాత్రమే. యోగమనగా వాస్తవమునకు భక్తియోగమనియే అర్థము. ఇతర యోగము లన్నియును భక్తియోగ గమ్యము వైపునకు ప్రయాణించుటకు గల సోపానములు మాత్రమే. కర్మయోగతో ఆరంభమై భక్తియోగతో సమాప్తము నొందువరకు ఆత్మానుభూతి మార్గము అత్యంత దీర్ఘమైనది. అట్టి సుదీర్ఘ మార్గమునకు కర్మఫలాపేక్షలేని కర్మయోగము ఆరంభము వంటిది. జ్ఞానము మరియు వైరాగ్యములతో కర్మయోగము వృద్ధినొందినప్పుడు అట్టి స్థితి జ్ఞానయోగ మనబడును. వివిధములైన ఆసనములు, పద్ధతుల ద్వారా పరమాత్మ ధ్యానము నందు జ్ఞానము వృద్ధియై, మనస్సు పరమాత్మ యందే లగ్నమైనపుడు అది అష్టాంగయోగ మనబడును. ఎవరైనను అష్టాంగ యోగకు అతీతముగా శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని అంగీకరించుట భక్తియోగ మనబడును. వాస్తవమునకు ఈ భక్తియోగమే పరమలక్ష్యము. కాని వారు భక్తియోగమును సూక్ష్మముగా విశ్లేషింపదలచినచో ఇతర యోగములను కూడ అవగాహన చేసుకొనవలసి యుండును. కనుకనే ఆధ్యాత్మిక మార్గమున క్రమముగా పురోభివృద్ధి సాధించు యోగి శాశ్వతమైన అదృష్టముతో కూడిన సత్యమార్గమున నెలకొనినట్టి వాడగును. అట్లుగాక ఏదోఒక ప్రత్యేక స్థితిని చేరి అక్కడే నిలిచిపోయి పురోగతిని సాధింపనివాడు కర్మయోగి, జ్ఞానయోగి, ధ్యానయోగి, రాజయోగి, హఠయోగి అని మున్నగు ప్రత్యేక నామములతో పిలువబడును. ఎవ్వరైనను అదృష్టవశాత్తు భక్తియోగ స్థితిని చేరగలిగినచో అతడు అన్ని ఇతర

యోగలను అధిగమించిన వానిగా పరిగణింపవచ్చును. అనగా మనము హిమాలయములను గూర్చి ప్రసంగించినపుడు, వానిని ప్రపంచమందలి అత్యున్నతమైనట్టి పర్వతములని ఉద్దేశింతుము. దానియందు 'ఎవరెస్టు శిఖరము' అత్యున్నత శిఖరముగా భావింప బడుచున్నది. అట్లే కృష్ణచైతన్యముతో కూడియుండుటయే యోగము నందలి పరమోన్నత స్థితిగా భావింపబడును.

గొప్ప అదృష్టముచేత ఎవ్వరైనను భక్తియోగ మార్గమున కృష్ణచైతన్య స్థితికి చేరి వేదనిర్దేశము ననుసరించి సుస్థిరుడు కాగలడు. ఆదర్శవంతుడైన యోగి శ్యామసుందరుడును, నీలమేఘ శ్యాముడును, సూర్యుని వలె ప్రకాశించు ముఖపద్మము గలవాడును, ఉజ్జ్వలమణులతో పొదగబడిన వస్త్రమును దాల్చినట్టి వాడును, పుష్పమాలలను ధరించినవాడును అగు శ్రీకృష్ణభగవానునిపై తన ధ్యానమును కేంద్రీకరించును. 'బ్రహ్మజ్యోతి' యనబడు అతని తేజోవంతమైన దేహకాంతి సర్వదిక్కులను ప్రకాశింపజేయుచుండును. అతడు రాముడు, నృసింహుడు, వరాహుడు, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు అను అనేక అవతారములలో అవతరించు చుండును. అతడు యశోదామాతకు పుత్రునిగా మానవ రూపమున అవతరించి శ్రీకృష్ణుడు, గోవిందుడు, వాసుదేవునిగా పిలువబడును. అతడు సంపూర్ణమైన ఉత్తమ పుత్రుడు, భర్త, మిత్రుడు, గురువు. అతడు సంపదలతోను, సమస్త దివ్యగుణములతోను నిండియుండును. ఎవ్వరైనను భగవానుని ఈ దివ్య లక్షణములను పూర్తిగా ఎరిగినచో అతడు సర్వోన్నత యోగి అని పిలువబడును.

యోగము నందలి ఇట్టి సర్వోన్నత స్థితి కేవలము 'భక్తియోగ' చేతనే ప్రాప్తింపగలదు. వేదవాఙ్మయము నందు ఇట్లు చెప్పబడినది :

యస్య దేవే పరాభక్తిర్యథా దేవే తథా గురౌ
తస్యైతే కథితా హ్యర్థా: ప్రకాశన్తే మహాత్మన:

"భగవానుని యందు మరియు ఆధ్యాత్మికాచార్యుని యందు సంపూర్ణ విశ్వాసమును కలిగియున్న మహాత్ములకు మాత్రమే వేదవిజ్ఞానపు సారమంతయు అప్రయత్నముగనే వ్యక్తము కాగలదు."(శ్వేతాశ్వతరోపనిషత్తు 6.23)

"భక్తిరస్య భజనమ్ తదిహాముత్రోపాధినైరాస్యేనాముష్మిన్ మన:కల్పనమ్, ఏతదేవ నైష్కర్మ్యమ్" – ఈ జన్మమున గాని, పర జన్మమున గాని, ఎట్టి భౌతిక లాభాపేక్షలేని భగవానుని భక్తియుక్త సేవయే 'భక్తి' యనబడును. అట్టి భౌతిక కోరికల నుండి విడివడి మానవుడు దేవాదిదేవుని యందు సదా తన మనస్సును లగ్నము చేయవలెయును. అదియే 'నైష్కర్మ్యము' యొక్క ప్రయోజనముపై యున్నది," (గోపాలతాపన్యుపనిషత్తు 1.15)

యోగపద్ధతి యందలి సర్వోన్నత స్థితియగు భక్తి లేక కృష్ణచైతన్యమును కొనసాగించుటకు ఇవి కొన్ని సాధన మార్గములై యున్నవి.

**శ్రీమద్భగవద్గీత యందలి 'ధ్యానయోగము' అను షష్ఠాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---------

# సప్తమాధ్యాయము
# భగవద్విజ్ఞానము

**7.1**

**శ్రీభగవానువాచ**

**మయ్యాసక్తమనా: పార్థ యోగం యుంజన్మదాశ్రయ: ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥**

**అనువాదము**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ పార్థా! మనస్సును నా యందే సంలగ్నము చేసి నా సంపూర్ణభావనలో యోగమభ్యసించుట ద్వారా నీవు నిస్సందేహముగా నన్నెట్లు సమగ్రముగా నెరుగగలవో ఇప్పుడు వినుము.**

**భాష్యము**

భగవద్గీత యందలి ఈ సప్తమాధ్యాయమున కృష్ణచైతన్య తత్త్వము సంపూర్ణముగా వివరింపబడినది. శ్రీకృష్ణభగవానుడు సర్వైశ్వర్యసంపన్నుడు. అట్టి ఐశ్వర్యములను అతడు ఎట్లు వ్యక్తము చేయునో ఇందులో వర్ణింపబడినది. అదేవిధముగా, శ్రీకృష్ణుని శరణువేడునట్టి నాలుగు రకములైన అదృష్టవంతులను గూర్చియు, మరియు శ్రీకృష్ణునికి ఎన్నడును శరణువేడినట్టి నాలుగు రకములైన దురదృష్టవంతులను గూర్చియు ఈ అధ్యాయమున వివరింపబడినది.

భగవద్గీత యందలి మొదటి ఆరు అధ్యాయములలో జీవుడు వివిధములైన యోగముల ద్వారా తనను ఆత్మానుభూతి స్థితికి ఉద్ధరించుకోగలుగు అభౌతికమైన ఆత్మస్వరూపిగా వర్ణింపబడినది. శ్రీకృష్ణుని యందు స్థిరముగా మనస్సును కేంద్రీకరించుటయే (కృష్ణచైతన్యము) యోగము లన్నింటి యందును అత్యున్నత యోగమనియు షష్ఠాధ్యాయము చివరన స్పష్టముగా తెలుపబడినది. అనగా శ్రీకృష్ణుని పై మనస్సును కేంద్రీకరించుట ద్వారానే మానవుడు పరతత్త్వమును సంపూర్ణముగా గ్రహింపగలుగును కాని ఇతర విధానముల ద్వారా కాదు. నిరాకార 'బ్రహ్మజ్యోతి' లేక అంతర్యామియైన పరమాత్మానుభూతి యనునవి అసంపూర్ణ మగుటచే అది పరతత్త్వపు సంపూర్ణ జ్ఞానము ఎన్నటికిని కాజాలదు. వాస్తవమునకు అట్టి సంపూర్ణ శాస్త్రీయమైన జ్ఞానము శ్రీకృష్ణభగవానుడే. కృష్ణచైతన్యవంతునికి సర్వము విదితమగును. మానవుడు సంపూర్ణ కృష్ణచైతన్యమునందు ఎట్టి సందేహము లేకుండ శ్రీకృష్ణుడే చరమ జ్ఞానమని తెలిసికొనును. వివిధములైన యోగపద్ధతులు అట్టి కృష్ణచైతన్య మార్గమునకు సోపానముల వంటివి మాత్రమే. కనుకనే కృష్ణచైతన్యము నందు ప్రత్యక్షముగా నెలకొనినవాడు అప్రయత్నముగనే 'బ్రహ్మజ్యోతి' మరియు పరమాత్మలకు సంబంధించిన జ్ఞానమును పరిపూర్ణముగా పొందగలుగును. కృష్ణచైతన్య యోగమును అభ్యసించుట ద్వారా మానవుడు సర్వమును అనగా పరతత్త్వమును, జీవులను, భౌతిక ప్రకృతిని వాని విభిన్న తత్త్వముల వ్యక్తీకరణములను గూర్చి పూర్తిగా ఎరుగగలుగును.

కనుకనే షష్ఠాధ్యాయపు చివరి శ్లోకమునందు చెప్పబడినట్లు, ప్రతియొక్కరు యోగాభ్యాసము నారంభింపవలెను. శ్రీకృష్ణభగవానుని పై మనస్సును కేంద్రీకరించుట నవవిధములైన భక్తియుక్త సేవా సాధన ద్వారానే సాధ్యమగును. వానిలో 'శ్రవణము' మొదటిది మరియు ఎంతో ప్రధానమైనది. కనుకనే భగవానుడు అర్జునునితో "తచ్ఛృణు" – "నా నుండి వినుము" అని చెప్పెను. శ్రీకృష్ణుని కంటె గొప్ప ప్రామాణికుడు మరొకడుండరు. కనుక అతని ద్వారా శ్రవణము చేయు గొప్ప అవకాశము మానవుని పరిపూర్ణ కృష్ణచైతన్యవంతునిగా చేయగలదు. కనుక ప్రతియొక్కరు ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని నుండి గాని లేదా శ్రీకృష్ణుని శుద్ధభక్తుని నుండి గాని తత్త్వమును అభ్యసింపవలెను. అంతేకాకుండ లౌకిక పాండిత్యముచే గర్వించు అభక్తుని నుండి కాని డాంబికుని నుండి కాని ఎన్నడును శ్రవణము చేయరాదు.

దేవాదిదేవుడు మరియు పరతత్త్వమును అగు శ్రీకృష్ణుని అవగాహన చేసికొనువిధానము శ్రీమద్భాగవతము నందలి ప్రథమ స్కంధపు ద్వితీయాధ్యాయపు శ్లోకము(17-21) లందు ఇట్లు వర్ణింపబడినది :

శృణ్వతాం స్వకథా: కృష్ణ: పుణ్యశ్రవణకీర్తన:
హృద్యన్తస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్

నష్టప్రాయేష్వభద్రేషు నిత్యం భాగవతసేవయా
భగవత్యుత్తమశ్లోకే భక్తిర్భవతి నైష్ఠికీ

తదా రజస్తమోభావా: కామలోభాదయశ్చ యే
చేత ఏతైరనావిద్ధం స్థితం సత్త్వే ప్రసీదతి

ఏవం ప్రసన్నమనసో భగవద్భక్తియోగత:
భగవత్తత్త్వవిజ్ఞానం ముక్తసంగస్య జాయతే

భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిద్యన్తే సర్వసంశయా:
క్షీయన్తే చాస్య కర్మాణి దృష్ట ఏవాత్మనీశ్వరే

"శ్రీకృష్ణుని గూర్చి వేదవాఙ్మయము నుండి శ్రవణము చేయుట లేదా ఆ భగవానుని నుండియే భగవద్గీతను ప్రత్యక్షముగా శ్రవణము చేయుటయే సరియైన పద్ధతి. అందరి హృదయము లందును నివసించు శ్రీకృష్ణుడు తనను గూర్చి శ్రవణము చేసిన వానికి ఆప్తమిత్రునిగా వర్తించి నిత్యశ్రవణానురక్తుడైన అతనిని పవిత్రుని చేయును. ఈ విధముగా భక్తుడు తనయందు నిగూఢముగా నున్నట్టి ఆధ్యాత్మిక జ్ఞానమును సహజముగానే వృద్ధిచేసుకొనగలడు. శ్రీమద్భాగవతము నుండియు మరియు భక్తుల నుండియు శ్రీకృష్ణుని గూర్చి అధికముగా శ్రవణము చేసినకొలది భగవానుని భక్తియుక్తసేవ యందు అతడు మరింత అధికముగా స్థిరత్వమును పొందగలడు. భక్తియుక్త సేవాభివృద్ధి ద్వారా అతడు రజస్తమోగుణముల నుండియు అజ్ఞానము నుండియు విముక్తుడగును. ఆ విధముగా అతని కామము, లోభము నశింపగలవు. అట్టి కల్మషములు తొలగినంతనే భక్తుడు శుద్ధతత్త్వము నందు స్థితుడై, భక్తియుక్త సేవచే సంతృప్తుడై, భగవతత్త్వవిజ్ఞానమును పరిపూర్ణముగా అవగాహన చేసికొనును. ఈ విధముగా భక్తియోగ క్లిష్టమైన హృదయగ్రంథిని ఛేదించి పరతత్త్వమైన దేవాదిదేవుని అవగాహన చేసుకొనుస్థితికి (అసంశయం సమగ్రమ్) అతనిని వెంటనే చేర్చగలదు."

కనుకనే శ్రీకృష్ణుని నుండి గాని కృష్ణచైతన్యవంతుడైన కృష్ణభక్తుని నుండి గాని శ్రవణము చేయుట ద్వారానే ఎవరైనను కృష్ణసంబంధ విజ్ఞానమును అవగతము చేసికొనగలడు.

**7.2**

**జ్ఞానం తే హం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషత: ।**
**యజ్ జ్ఞాత్వా నేహ భూయో న్యజ్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥**

**<u>అనువాదము</u>**

**నీకిప్పుడు నేను ఈ భౌతిక, ఆధ్యాత్మిక శక్తులతో గూడిన సంపూర్ణ జ్ఞాన విజ్ఞానములను సంపూర్ణముగా విశదీకరించెదను. దీనిని తెలిసికొనిన పిమ్మట నీవు తెలిసికొన వలసిన దేదియును మిగిలి యుండదు.**

**<u>భాష్యము</u>**

సంపూర్ణజ్ఞానము నందు భౌతిక జగత్తు, దాని వెనుక గల తత్త్వము మరియు ఆ రెండింటికిని మూలకారణముల జ్ఞానము ఇమిడియున్నది. ఇదియే దివ్యజ్ఞానము. అర్జునుడు తనకు పరమభక్తుడు మరియు ఆప్త మిత్రుడైనందున భగవానుడు అతనికి పైన పేర్కొనబడిన జ్ఞానవిధానమును వివరింప దలిచెను. భగవానుని నుండియే ప్రత్యక్షముగా వచ్చుచున్న గురుశిష్య పరంపర మార్గమున గల భక్తునికి మాత్రమే సంపూర్ణ జ్ఞానము ప్రాప్తించునని చతుర్థాధ్యాయపు ఆరంభమున వివరించిన విషయమునే శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ తిరిగి నిర్ధారించు చున్నాడు. కనుకనే ప్రతియొక్కరును ఎవరు సర్వాకారణములకు కారణుడో మరియు సమస్త యోగాభ్యాసములకు ఏకైక ధ్యానధ్యేయమో అతడే సమస్త జ్ఞానమునకు మూలమని తెలుసుకొనగలుగు బుద్ధికుశలుడై యుండవలెను. ఆ విధముగా సర్వకారణకారణము విదితమైనపుడు తెలిసికొన దగినదంతయు తెలిబడి, తెలియవలసిన దేదియును ఇక మిగిలియుండదు. కనుకనే వేదములు : "కస్మిన్ భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" అని (ముండకోపనిషత్తు 1.1.3) తెలుపుచున్నది.

**7.3**

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వత: ॥**

**<u>అనువాదము</u>**

**వేలాది మనుష్యులలో ఎవరో ఒక్కరు మాత్రమే సంపూర్ణ సిద్ధిని సాధించుటకు యత్నించును. ఆ విధముగా యత్నించి సిద్ధి పొందిన వారిలో కూడ ఎవరో ఒక్కడు మాత్రమే నన్ను యథార్థముగా తెలుసుకొనగలుగుచున్నాడు.**

## భాష్యము

మానవులలో అనేకరకాల తరగతుల వారు కలరు. అట్టి వేలాదిమందిలో ఒక్కడు మాత్రమే ఆధ్యాత్మికానుభూతి నందు ఆసక్తిని కలిగి ఆత్మయననేమో, దేహమననేమో, పరతత్త్వమననేమో ఎరుగుటకు యత్నించును. సాధారణముగా మానవులు పశుప్రవృత్తులై ఆహారము, భయము, నిద్ర, మైథునముల యందు మాత్రమే నెలకొనియుందురు. అధ్యాయములు ఆధ్యాత్మిక జ్ఞానము నందును, ఆత్మ మరియు పరమాత్మలను అవగాహన చేసుకొనుట యందును, జ్ఞానయోగ మరియు ధ్యానయోగాముల ద్వారా ఆత్మసాక్షాత్కారమును పొందు విధానము నందును, దేహాత్మల భేదము(భౌతిక పదార్థము ఆత్మ నుండి వేరుగా గాంచుట) గూర్చియు ఎరుగుట యందును ఆసక్తులైన వారి కొరకై నిర్దేశింపబడినవి. కాని వాస్తవమునకు కృష్ణచైతన్యము నందలి వ్యక్తులు మాత్రమే శ్రీకృష్ణుని గూర్చి సంపూర్ణముగా ఎరుగగలుగుదురు. ఇతర తత్త్వవేత్తలు కూడ నిరాకర బ్రహ్మానుభూతిని పొందిన పొందవచ్చును. ఎందుకనగా, నిరాకార బ్రహ్మానుభూతిని పొందుట శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట కంటెను మిక్కిలి సులభమైనది. శ్రీకృష్ణుడు పరమపురుషుడు. నిరాకారబ్రహ్మము మరియు పరమాత్మల జ్ఞానములకు కూడ అతీతమైనవాడు. కనుకనే యోగులు మరియు జ్ఞానులైనవారు శ్రీకృష్ణుని అవగాహన చేసుకొను యత్నములలో భ్రమనొందుదురు. నిరాకార బ్రహ్మవాదులలో అగ్రగణ్యుడైన శ్రీపాద శంకరాచార్యులు శ్రీకృష్ణుని దేవాదిదేవుడని తన గీతాభాష్యములో అంగీకరించినను, అతని అనుయాయులు మాత్రము శ్రీకృష్ణుని దేవాదిదేవుడని అంగీకరింపరు. మానవుడు నిరాకార బ్రహ్మానుభూతిని కలిగియున్నను శ్రీకృష్ణుని అవగతము చేసుకొనుట మిక్కలి కష్టకార్యమగుటయే అందులకు కారణము.

శ్రీకృష్ణుడే దేవాదిదేవుడును, సర్వకారణములకు కారణమును, ఆదిపురుషుడైన గోవిందుడును అయియున్నాడు. "ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానంద విగ్రహ: అనాదిరాదిర్గోవింద: సర్వకారణకారణమ్." (బ్రహ్మ సంహిత 5.1) అభక్తులు అతనిని ఎరుగుట గొప్ప కష్టము. అట్టి అభక్తులు భక్తిమార్గము లేక భక్తియుక్త సేవా మార్గము అతి సులభమైనదని ప్రకటించినను దానిని అవలంబింప లేరు. ఒకవేళ వారు చెప్పినట్లు భక్తిమార్గము సులభమైనచో వారెందుకు కఠిన మార్గమునే ఆవలంబింతురు? వాస్తవమునకు, భక్తిమార్గము సులభమైనది కాదు. భక్తిజ్ఞానము లేని అప్రమాణికులైన వారు అవలంబించు నామమాత్ర భక్తిమార్గము సులభము అయిన కావచ్చునేమో కాని నియమ నిబంధనల ననుసరించి వాస్తవముగా దానిని అభ్యసింపవలసి వచ్చినపుడు మానసిక కల్పనాపరులైన పండితులు మరియు తాత్త్వికులు ఆ మార్గమున కొనసాగలేక వైదొలగుదురు. శ్రీల రూప గోస్వామి 'భక్తిరసామృత సింధువు' (1.2.101) నందు ఈ విధముగా ఉదాహరించిరి :

శ్రుతిస్మృతిపురాణాదిపంచరాత్రవిధిం వినా
ఐకాన్తికీ హరేర్భక్తిరుత్పాతాయైవ కల్పతే

"ఉపనిషత్తులు, పురాణములు, నారద పంచరాత్రము వంటి ప్రామాణిక వైదిక గ్రంథముల ననుసరించి చేయబడని భక్తియుక్తమైన భగవత్ సేవ కేవలము సమాజము నందు సంక్షోభమును మాత్రమే కలిగించును." (బ్రహ్మయామలము)

బ్రహ్మానుభూతి కలిగిన అద్వైతికి గాని, పరమాత్మానుభూతి కలిగిన యోగికి గాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని యశోదా తనయునిగా లేదా అర్జున రథసారథిగా అవగాహన చేసికొనుట అసంభవము. గొప్పగొప్ప దేవతలే శ్రీకృష్ణుని విషయమున కొన్నిమార్లు

భ్రాంతి నొందుచుందురు. 'ముహ్యన్తి యత్సూరయ:'. ఈ విషయమున శ్రీకృష్ణభగవానుడు (భాగ. 1.1.1) నందు కూడా ఇట్లు పలికెను : "మాం తు వేదన కశ్చన"- "ఎవ్వరును నన్ను యథాతథముగా ఎరుగజాలరు." ఎవ్వరైనను అతనిని ఎరుగగలిగినను అట్టి మహాత్ములు అత్యంత అరుదుగా నుందురు. (స మహాత్మ సుదుర్లభ ). కనుకనే మానవుడు గొప్ప పండితుడైనను లేదా తత్త్వవేత్తయైనను భక్తియుక్త సేవ నొనరించనిదే భగవానుని యథార్థముగా(తత్త్వత:) ఎరుగజాలడు. కేవలము శుద్ధభక్తులు మాత్రమే సర్వకారణములకు కారణమును, సర్వశక్తి సంపన్నత్వమును, సంపూర్ణ సంపద, సంపూర్ణ యశస్సు, సంపూర్ణ శక్తి, సంపూర్ణ సౌందర్యము, సంపూర్ణ జ్ఞానము, సంపూర్ణ వైరాగ్యము అను షడ్గుణైశ్వర్య సంపన్నుడైన శ్రీకృష్ణుని భావనాతీతములైన అచింత్య దివ్యగుణములను కొద్దిగా అవగతము చేసికొనగలరు. తన భక్తుల పట్ల శ్రీకృష్ణుడు పరమ దయను కలిగి యుండుటయే అందుకు కారణము. బ్రహ్మానుభూతికి పరమావధియైన అతనిని భక్తులు మాత్రమే యథారూపమున అనుభూత మొనర్చుకొనగలరు. కనుకనే 'భక్తిరసామృత సింధువు'(1.2.234) నందు ఇట్లు చెప్పబడినది :

అత: శ్రీకృష్ణనామాది న భవేద్ గ్రాహ్యమింద్రియై:
సేవోన్ముఖే హి జిహ్వాదౌ స్వయమేవ స్ఫురత్యద:

"పరిమిత ఇంద్రియములచే ఎవ్వరును శ్రీకృష్ణుని యథార్థముగా అవగాహన చేసుకొనలేరు. కాని భక్తులు తనకు చేయు ప్రేమతో కూడిన దివ్యసేవతో సంతృప్తి నొంది అతడే భక్తులకు స్వయముగా ప్రకటించుకొనును." (పద్మపురాణము)

## 7.4

**భూమిరాపో నలో వాయు: ఖం మనో బుద్ధిరేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥**

## అనువాదము

**భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, మరియు అహంకారము అను ఈ ఎనిమిది అంశముల సముదాయము నా భిన్న ప్రకృతి యనబడును.**

## భాష్యము

భగవతత్త్వ విజ్ఞానము భగవానుని దివ్యస్థితిని మరియు అతని విభిన్న శక్తులను గూర్చి విశ్లేషించి చర్చించును. 'సాత్వత తంత్రము' నందు వివరింప బడినట్లు, ఆ భగవానుని వివిధ 'పురుషావతారము'ల యందలి శక్తికే 'ప్రకృతి' యని పేరు :

విష్ణోస్తు త్రీణి రూపాణి పురుషాఖ్యాన్యథో విదు:
ఏకం తు మహత: స్రష్టృ ద్వితీయం త్వండసంస్థితమ్
తృతీయం సర్వభూతస్థం తాని జ్ఞాత్వా విముచ్యతే

"భౌతిక జగత్తు సృష్టికై శ్రీకృష్ణభగవానుని స్వాంశరూపము మూడు విష్ణు రూపములను దాల్చును. అందులో మొదటిదైన మహావిష్ణువు 'మహత్తత్త్వము' అని తెలియబడు సమస్త

భౌతిక శక్తిని సృష్టించును. రెండవ విష్ణురూపము గర్భోదకశాయి విష్ణువు వివిధ వ్యక్తీకరణలకై అన్ని విశ్వములందు ప్రవేశించును. ఇక మూడవ విష్ణు రూపము క్షీరోదకశాయి విష్ణువు సకల విశ్వము లందును పరమాత్మ రూపమున వ్యాపించును. అతడు పరమాత్మగా పిలువబడుచు అణువణువు నందును నిలిచియుండును. ఈ ముగ్గురు విష్ణువులను గూర్చి ఎరిగిన వాడు భౌతిక బంధముల నుండి విముక్తిని సాధింపగలడు."

ఈ భౌతిక జగత్తు భగవానుని విభిన్న శక్తులలో ఒకానొక శక్తి యొక్క తాత్కాలిక ప్రదర్శనము. అట్టి భౌతిక జగత్తు యొక్క కార్యకలాపము లన్నియు 'పురుషావతారములు'గా పిలువబడు శ్రీకృష్ణుని స్వాంశరూపములైన ముగ్గురు విష్ణువుల ద్వారా నిర్దేశింపబడు చుండును. సాధారణముగా భగవద్విజ్ఞానము లేనివారు ఈ జగత్తు జీవుల విషయ భోగానుభవమునకై కలదని భావింతురు. అంతేకాకుండ వారు జీవులే భౌతిక ప్రకృతికి కారణములు, నియామకులు, భోక్తలుగను భావింతురు. భగవద్గీత ననుసరించి అట్టి నాస్తికమైన ఈ అభిప్రాయము సరియైనది కాదు. వాస్తవమునకు శ్రీకృష్ణుడే సమస్త సృష్టికి మూలకారణమని ప్రస్తుత శ్లోకమున చెప్పబడినది. శ్రీమద్భాగవతము కూడ దీనినే నిర్ధారించుచున్నది. భౌతిక సృష్టి యందలి మూలకము లన్నియును భగవానుని విభిన్న శక్తులు. నిరాకారవాదుల చరమగమ్యమైన 'బ్రహ్మజ్యోతి' కూడ ఆధ్యాత్మికాకాశము నందు వ్యక్తమైన భగవానుని ఆధ్యాత్మికశక్తియే. వైకుంఠ లోకములలో వలె 'బ్రహ్మజ్యోతి'లో ఆధ్యాత్మిక వైవిధ్యములు గోచరించవు. అయినను నిరాకారవాదులు ఈ 'బ్రహ్మజ్యోతి'నే శాశ్వత చరమగమ్యముగా భావింతురు. పరమాత్మ రూపము కూడ క్షీరోదకశాయి విష్ణువు యొక్క తాత్కాలికమైన సర్వవ్యాపక అంశమై యున్నది. ఆధ్యాత్మిక జగత్తు నందు ఆ పరమాత్మ రూపము నిత్యమై యుండదు. కనుకనే వాస్తవమునకు పరతత్త్వమనగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే. అతడే సర్వశక్తిమంతుడు. అతడే వివిధములైన విభిన్న శక్తులను మరియు అంతరంగిక శక్తులను కలిగి యున్నాడు.

పైన తెలుపబడినట్లు భౌతిక ప్రకృతి యందు ముఖ్యముగా ఎనిమిది అంశములు కలవు. వీనిలో భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము లనునవి మహత్తర సృష్టి లేదా స్థూలసృష్టిగా పిలువబడును. వీనియందే శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధమను ఐదు ఇంద్రియార్థములును ఇమిడియున్నవి. భౌతిక విజ్ఞానశాస్త్రము నందు ఈ పది అంశముల కంటె అధికములైనవి ఎవియు లేవు. కాని మనస్సు, బుద్ధి, అహంకారము అను మిగిలిన మూడు అంశములు భౌతికవాదులచే నిర్లక్ష్యము చేయబడుచుండును. మనోకర్మల యందు మునిగిన తాత్త్వికులు కూడ సర్వమునకు మూలకారణము శ్రీకృష్ణుడని ఎరుగ లేనందున జ్ఞానము నందు అసంపూర్ణులై యున్నారు. 'నేను', 'నాది' అను అహంకార భావనమే భౌతిక స్థితికి మూలకారణము. అట్టి అహంకారము భౌతిక కర్మలకు ఉపయోగపడు దశేంద్రియములను కూడియుండును. బుద్ధి యనునది 'మహత్తత్త్వ' మనబడు సర్వభౌతిక సృష్టిని సూచించును. కనుక భగవానుని విభిన్నములైన ఈ అష్టశక్తుల నుండి భౌతిక జగత్తు యొక్క ఇరువది నాలుగు అంశములు వ్యక్తమగుచున్నవి. ఇవి నాస్తికమైన 'సాంఖ్య' తత్త్వమునకు చర్చనీయాంశమైన విషయములు. వాస్తవమునకు అవియన్నియును మొదట శ్రీకృష్ణుని శక్తి నుండి ఉద్భవించి, అతని నుండి విడివడియున్నవి. కాని అల్పజ్ఞులు నాస్తికులైన 'సాంఖ్య' తత్త్వవేత్తలు అట్టి శ్రీకృష్ణుని సర్వకారణకారణునిగా ఎరుగ జాలరు. భగవద్గీత యందు తెలుపబడినట్లు శ్రీకృష్ణుని బాహ్యశక్తి వ్యక్తీకరణమే 'సాంఖ్య' తత్త్వము నందు చర్చనీయాంశము.

**7.5**
**అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥**

## అనువాదము

**ఓ మహాబాహుడవైన అర్జునా! వాటికి అన్యముగా న్యూనమైన భౌతిక ప్రకృతి వనరులను ఉపయోగించుకొను జీవులను కూడియున్న నా ఉన్నతమైన శక్తి వేరొక్కటి కలదు.**

## భాష్యము

జీవులు దేవాదిదేవుని ఉన్నతమైన ప్రకృతికి (శక్తికి) చెందినవారని ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. భూమి, జలము, అగ్ని, వాయువు,ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అను వివిధాంశములుగా వ్యక్తమగు భౌతిక పదార్థమే న్యూనశక్తి. భూమ్యాదులగు స్థూల విషయములు మరియు మనస్సాది సూక్ష్మ విషయములను రెండు ప్రకృతి రూపములను న్యూనశక్తి నుండి ఉత్పాదింప బడినట్టివే. వివిధ ప్రయోజనములకై ఈ న్యూనశక్తులను వినియోగించుకొను జీవులు దేవాదిదేవుని ఉన్నతశక్తికి సంబంధించిన రూపములు. అట్టి ఈ ఉన్నతశక్తి వలననే సమస్త జగత్తు నడుచుచున్నది. ఉన్నతశక్తికి చెందిన జీవుడు ప్రేరేపింపనిదే భౌతిక జగత్తు నడవలేదు. శక్తులు సర్వదా శక్తిమంతుల చేతనే నియంత్రింపబడి యున్నందున జీవులు సదా భగవానునిచే నియంత్రింపబడెడివారే. కనుక వారికెన్నడును స్వతంత్రమైన ఉనికి అనునది ఉండదు. కొందరు అల్పజ్ఞులు భావించునట్లు వారెన్నడును భగవానునితో సమానశక్తిమంతులు కాజాలరు. భగవానునికిని మరియు జీవులకును నడుమ గల భేదమును శ్రీమద్భాగవతము (10.87.30) నందు ఈ క్రింది విధముగా చెప్పబడినది :

అపరిమితా ధ్రువాస్తనుభృతో యది సర్వగతాన్
తర్హి న శాస్యతేతి నియమో ధ్రువ నేతరథా
అజని చ యన్మయం తదవిముచ్య నియన్తృ భవేత్
సమమనుజానతాం యదమతం మతదుష్టతయా

“నిత్యుడవైన ఓ దేవాదిదేవా! బద్ధజీవులు నీవలనే నిత్యులును మరియు సర్వ వ్యాపకులును అయినచో నీ ఆధీనములో వారెన్నడును ఉండరు. కాని ఆ జీవులు సూక్ష్మశక్తులుగా అంగీకరింపబడినచో వెంటనే వారు నీ పరమ నియంత్రణకు లోబడియుందురు. కనుకనే జీవులు నిన్ను శరణుజొచ్చుటయే నిజమైన ముక్తి. అట్టి శరణాగతియే వారికి ఆనందమును చేకూర్చగలదు. అట్టి స్వరూపస్థితి యందే వారు ప్రకృతి నుండి విముక్తులగుదురు. కనుకనే భగవానుడు మరియు జీవులును సర్వవిధములుగా సమానులే అను అద్వైతవాదమును తమ పరిమిత జ్ఞానముతో ప్రతిపాదించు అల్పజ్ఞులైన మానవులు దోషపూరితమైన, కలుషితమైన అభిప్రాయమును కలిగియున్నట్టి వారగుదురు.”

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే పరమ నియంత్రకుడు. జీవులందరును అతనిచే నియంత్రింపబడెడి వారు. ఈ జీవులు భగవానునితో గుణైక్యమును కలిగి యున్నందున వారందరు భగవానుని ఉన్నతమైన శక్తిగా గుర్తింపబడిరి. కాని శక్తి పరిమాణములో వారెన్నడును భగవానునితో సమానులు కాజాలరు. స్థూలమును సూక్ష్మమును అయిన

న్యూనశక్తిని (భౌతిక పదార్థము) వినియోగించు కొనునపుడు ఉన్నత శక్తికి చెందిన జీవుడు తన వాస్తవ ఆధ్యాత్మిక మనస్సును మరియు బుద్ధిని విస్మరించును. జీవునిపై భౌతికశక్తి ప్రభావమే ఈ విస్మరణకు కారణము. కాని జీవుడు భౌతిక మాయాశక్తి ప్రభావము నుండి బయటపడినప్పుడు ముక్తిని పొందగలడు. మాయాశక్తి కారణమున జీవుడు అహంకారముచే, "నేను భౌతిక దేహమును మరియు ఈ భౌతిక వస్తువు లన్నియును నావి" అని భావనను కలిగియుండును. అన్నివిధముల భగవానునితో సమానుడనను భావముతో సహా సమస్త భౌతిక భావముల నుండి విముక్తు డైనప్పుడు జీవుడు తన నిజస్వరూప స్థితిని గుర్తించును. అనగా శ్రీకృష్ణభగవానుని వివిధ శక్తులలో జీవుడు ఒకడని, అట్టిజీవుడు భౌతిక సంపర్కము నుండి విడివడినప్పుడు పరిపూర్ణ కృష్ణచైతన్యమును (ముక్తిని) పొందుననియు గీత నిర్ధారించుచున్నట్లు మనము నిశ్చయింపవచ్చును.

## 7.6

**ఎతోద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।**
**అహం కృత్స్నస్య జగత: ప్రభవ: ప్రలయస్తథా ॥**

## అనువాదము

**సృజింపబడిన సర్వజీవులకు ఈ రెండు ప్రకృతులే కారణములై యున్నవి. ఈ జగత్తు నందలి భౌతికమును, ఆధ్యాత్మికమును అగు సర్వమునకు మూలమును మరియు ప్రళయమును నేనే యని నిశ్చయముగా నెరుగుము.**

## భాష్యము

దృశ్యమాన జగత్తంతయు భౌతిక ఆధ్యాత్మిక పదార్థముల సమ్మేళనముచే ఏర్పడినదే. ఆద్యాత్మిక పదార్థము (ఆత్మ) సృష్టికి మూలకారణము కాగా భౌతిక పదార్థము ఆత్మ చేతనే సృష్టింపబడినది. అనగా ఆత్మ ఎట్టి స్థితియందును భౌతిక పదార్థముచే సృష్టింపబడదు. వాస్తవమునకు, ఈ భౌతిక జగత్తు ఆధ్యాత్మికశక్తి ఆధారము పైననే సృష్టింపబడినది. భౌతిక పదార్థము(దేహము) నందు ఆత్మ నిలుచుట చేతనే స్థూలదేహము వృద్ధినొందుచున్నది. ఉన్నత శక్తియైన ఆత్మ ఉనికి చేతనే శిశుదేహము క్రమముగా బాలునిగను, పిదప యువకుని గాను మార్పు చెందుచున్నది. అట్లే, పరమాత్మ స్వరూపుడైన విష్ణువు ఉనికి చేతనే బ్రహ్మాండమైన విశ్వమంతయు వృద్ధినొందినది. కనుకనే భౌతిక పదార్థము, ఆత్మ యనునవి శ్రీకృష్ణభగవానుని శక్తులుగా తెలియబడుచున్నవి. వాటి కలియిక చేతనే బ్రహ్మాండమగు విశ్వరూపము సృష్టింపబడుచున్నది. కనుక భగవానుడే సర్వమునకు మూలకారణము. భగవానుని అంశయైన ఒక చిన్ని జీవి ఒక గొప్ప ఆకాశమునంటు భవంతిని గాని లేదా గొప్ప నగరమును గాని లేదా గొప్ప కర్మాగారమును గాని సృష్టింపవచ్చునేమో గాని విశాలమైన విశ్వమును మాత్రము సృష్టింపజాలదు. విశ్వమునకు పరమాత్మయే (విభుఆత్మ) కారణుడు. అటువంటి అణు, విభు ఆత్మల సర్వమునకు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే మూలకారణడు. కనుకనే అతడు సర్వకారణములకు ఆదికారణము. ఈ విషయము 'కఠోపనిషత్తు' (2.2.13) నందు : "నిత్యోనిత్యానం చేతనశ్చేతనానాం" అని నిర్ధారింపబడినది.

**7.7**
**మత్త: పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥**

## అనువాదము

**ఓ ధనంజయా! నాకంటెను శ్రేష్ఠమైన సత్యమింకొకటి లేదు. దారము నందు ముత్యములు కూర్చబడినట్లు సమస్తము నా పైననే ఆధారపడియున్నది.**

## భాష్యము

పరతత్త్వము సాకారమా లేక నిరాకారమా అను సామాన్య వివాదము కలదు. కాని భగవద్గీతకు సంబంధించినంత వరకు పరతత్త్వమనగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే. ఈ విషయమే భగవద్గీత యందు అడుగడుగునా నిర్ధారింపబడినది. ప్రత్యేకముగా ఈ శ్లోకము నందు పరతత్త్వము సాకారమని నొక్కిచెప్పబడినది. దేవాదిదేవుడే పరతత్త్వమని 'బ్రహ్మ సంహిత' (5.1) యందు కూడ ధ్రువీకరింప బడినది. అది "ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానందవిగ్రహ:"-"ఆదిదేవుడును, ఆనందనిధి, గోవిందుడును, సచ్చిదానంద విగ్రహుడైన శ్రీకృష్ణుడే పరతత్త్వమైన దేవాదిదేవుడు." నిస్సందేహముగా, ఈ ప్రమాణము లన్నియును పరతత్త్వము సర్వకారణ కారణుడైన దివ్యపురుషుడని నిరూపించుచున్నవి. కాని నిరాకారవాదులు 'శ్వేతాశ్వతరోపనిషత్తు'(3.10) నందు తెలుపబడిన మంత్రమును ఆధారముగా చేసికొని తమ నిరాకారవాదనను చేయుదురు : "తతో యదుత్తరతరం తద రూప మనామయమ్ / య ఏతద్విదురమృతాస్తే భవన్త్యథేతరే దుఃఖమేవాపి యన్తి"-"ప్రథమ జీవియైన బ్రహ్మదేవుడు ఈ భౌతిక జగత్తు నందు దేవతలు, మానవులు జంతువుల కంటెను అత్యున్నతుడుగ భావింపబడుచున్నాడు. కాని ఆ బ్రహ్మదేవునకు అతీతముగా భౌతికరూపము లేనట్టి మరియు భౌతిక కల్మష రహితమునైన తత్త్వము (పరమపురుషుడు) మరొకటి కలదు. అతనిని తెలిసికొనినవాడు కూడ అతనివలె భౌతికాతీతుడు కాగా, అతనిని తెలిసికొనలేని వారు భౌతిక జగత్తు నందు దుఃఖముల ననుభవింతురు."

నిరాకారవాది ఈ ఉపనిషత్తు వాఖ్యము నందలి 'అరూపమ్' అను పదమునకు మిక్కిలి ప్రామాణ్యమిత్తురు. వాస్తవమునకు ఈ 'అరూపమ్' అను పదము నిరాకారమును సూచించుట లేదు. అది పైన ఉదాహరింపబడిన 'బ్రహ్మ సంహిత' నందు వర్ణింపబడినట్లు సచ్చిదానంద స్వరూపమును సూచించుచున్నది. 'శ్వేతాశ్వతరోపనిషత్తు' నందలి (3.8,9) ఇతర శ్లోకములు కూడా ఈ విషయమునే నిర్ధారించుచున్నవి :

వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తామస: పరస్తాత్
తమేవ విదిత్వా తి మృత్యుమేతి నాన్య: పన్థా విద్యతే యనాయ

యస్మాత్పరం నాపరమస్తి కిఞ్చిద్ యస్మాన్నాణీయో న జ్యాయో స్తి కిఞ్చిద్
వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేకస్తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్

"భౌతికములైన తమోభావన లన్నింటికిని అతీతుడైన దేవాదిదేవుని నేను ఎరుగుదును.
అతనిని ఎరిగినవాడే జననమరణ బంధముల నుండి విముక్తుడు కాగలడు. ఆ
పరమపురుషుని గూర్చిన ఈ జ్ఞానము కంటె విముక్తికి మరొక మార్గము లేదు.

'పరమపురుషుడు దివ్యదగుటచే అతనికంటెను శ్రేష్ఠమైన సత్యము మరొకటి లేదు. అతడే అణువుకంటె అణువు మరియు మహత్తుకంటెను మహత్తరుడు. అతడు మౌనముతో కూడిన వృక్షము వలె నిలిచి ఆధ్యాత్మిక జగత్తునంతటిని ప్రకాశింప జేయును. వృక్షము తన వ్రేళ్ళను వ్యాపింపజేయునట్లు, అతడు తన విస్తృతమైన శక్తులను వ్యాపింపజేయును."

ఈ శ్లోకములను బట్టి పరతత్త్వమనగా భౌతికము మరియు ఆధ్యాత్మికము లనెడి వివిధ శక్తులచే సర్వవ్యాపియై యుండు దేవాదిదేవుడేయని ఎవరైనను నిర్ణయింపవచ్చును.

**7.8**

**రసో/హమప్సు కౌన్తేయ ప్రభాస్మి శశిసూర్యయో: ।**
**ప్రణవ: సర్వవేదేషు శబ్ద: ఖే పౌరుషం నృషు ॥**

**<u>అనువాదము</u>**

**కౌన్తేయ! నీటి యందు రుచిని, సూర్యచంద్రుల యందు కాంతిని, వేద మంత్రము లందు ఓంకారమును, ఆకాశము నందు శబ్దమును, నరుని యందు సామర్థ్యమును నేనే అయియున్నాను.**

**<u>భాష్యము</u>**

ఈ శ్లోకము నందు భౌతికము మరియు ఆధ్యాత్మికము లనెడి తన వివిధశక్తులచే శ్రీకృష్ణభగవానుడు ఏ విధముగా సర్వవ్యాపకుడై యుండునో వివరింప బడినది. అతని ఈ భిన్నశక్తుల ద్వారానే భగవానుడు తొలుత దర్శింపబడి నిరాకార రూపముగా అనుభవమునకు వచ్చును. సూర్యమండలము నందుండెడి సాకారుడైన సూర్యదేవుడు తన సర్వవ్యాపకశక్తి (సూర్యకాంతి) ద్వారా దర్శనీయుడైనట్లు, శ్రీకృష్ణభగవానుడు తన దామమునందు నిలిచియున్నను సర్వత్రా వ్యాపించి యుండెడి తన శక్తులద్వారా దర్శనీయుడగును. ఉదాహరణకు, రుచి యనునది నీటియందలి ప్రధాన విషయము. ఉప్పుతో కలిసియుండుట చేత ఎవ్వరును సముద్రనీటిని త్రాగుటకు ఇష్టపడరు. నీటి యందలి రుచిని బట్టియే నీటిచే ఎవ్వరైనను ఆకర్షింపబడుదురు. అట్టి శుద్ధమైన రుచి భగవానుని శక్తులలో ఒకటి. నిరాకారవాది కూడ నీటిరుచి ద్వారా దాని యందు భగవానుని ఉనికిని దర్శించును. మానవుని దాహమును తీర్చుటకు దయతో రుచిగల నీటి నొసగుచున్న ఆ భగవానుని మహిమను సాకారవాది కీర్తించును. పరతత్త్వమును గుర్తించు విధానమిదియే. వాస్తవమునకు, సాకర మరియు నిరాకారవాదములకు ఎట్టి విరోధము లేదు. భగవత్తత్త్వము నెరిగినవాడు సాకారభావము మరియు నిరాకార భావము లనునవి ఏకకాలమున సమస్తము నందు నెలకొని యున్నవనియు మరియు ఆ తత్త్వము లందు ఎట్టి వైరుధ్యము లేదనియు గ్రహింపగలుగును. కనుకనే శ్రీచైతన్య మహాప్రభువు ఏకకాలమున ఏకత్వము మరియు భిన్నత్వములను తెలిపెడి 'అచిన్త్యభేదాభేదతత్త్వము' అనెడి ఉదాత్తమగు తమ సిద్ధాంతమును స్థాపించిరి.

సూర్యచంద్రుల యొక్క కాంతి మొదట భగవానుని నిరాకార తేజమైన 'బ్రహ్మజ్యోతి' నుండియే వెలువడుచున్నది. అదేవిధముగా, సర్వవేద మంత్రముల ఆది పదమైన 'ప్రణవము' లేదా 'ఓంకారము' దేవాదిదేవునే సంబోధించును. నిరాకారవాదులు

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అతని అసంఖ్యాకములైన నామముల ద్వారా సంబోధించుటకు వెనుకాడుచుండుటచే దివ్యధ్వనియైన 'ఓంకార'మును ప్రతిధ్వనింప జేయుట యందు అధికాసక్తిని చూపుదురు. కాని, 'ఓంకార' మనునది శ్రీకృష్ణునికి శబ్దప్రాతినిధ్యమేనని వారెరుగజాలరు. వాస్తవమునకు కృష్ణచైతన్యము సార్వత్రికమై సర్వత్రా వ్యాపించి యున్నది. కృష్ణచైతన్యమును ఎరిగినవాడు నిజముగా ధన్యుడు. శ్రీకృష్ణుని ఎరుగనివారు భ్రమలో నున్నట్టివారే. కనుకనే కృష్ణపరిజ్ఞానము ముక్తియనియు, శ్రీకృష్ణుని గూర్చి ఎరుగకుండుట బంధమనియు చెప్పవచ్చును.

## 7.9

**పుణ్యో గన్ధ: పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥**

### అనువాదము

**నేను భూమి యొక్క ఆద్యమైన సుగంధమును, అగ్నియందు ఉష్ణమును, జీవుల యందలి ప్రాణమును, తపస్వుల యందు తపస్సును అయియున్నాను.**

### భాష్యము

'పుణ్యము' అనగా శిథిలము కానిది; అట్టి 'పుణ్యము' ఆద్యమైనట్టిది. పుష్పము, భూమి, జలము, అగ్ని, వాయువు మొదలైనవానికి ఒక ప్రత్యేకమైన వాసన(గంధము)యున్నట్లే, భౌతికజగత్తు నందు ప్రతి వస్తువును ఒక ప్రత్యేకమైన వాసనను కలిగియుండును. ఆద్యమై సర్వత్రా వ్యాపించియుండి కలుషితము గానటువంటి పరిమళము శ్రీకృష్ణుడే. అట్లే ప్రతివస్తువు ఒక ప్రత్యేకమైన సహజ రుచిని కలిగియుండును. కాని ఈ రుచి రసాయన మిశ్రణముచే మార్పు చెంద గలదు. ఈ విధముగనే ఆద్యమైన ప్రతివస్తువును ఒక వాసనను (సువాసనయు) ఒక రుచిని కలిగియుండును. ఇక 'విభావసు' యనగా అగ్ని, అగ్నిలేనిదే కర్మాగారములను నడుపుట, వంటచేయుట వంటి కార్యములను మనము చేయజాలము. అట్టి అగ్ని మరియు అగ్నియందలి ఉష్ణము శ్రీకృష్ణుడే. వైదిక వైద్యశాస్త్రము ననుసరించి ఉదరములో జఠరాగ్ని మందగించుటయే అజీర్తికి కారణము. కనుక ఆహారము జీర్ణమగుటకు కూడ అగ్నికావలెను. కృష్ణచైతన్యమున భూమి, నీరు, అగ్ని, వాయువు, సర్వచేతన పదార్థములు, రసాయనములు మరియు మూలకములన్నింటికిని శ్రీకృష్ణుడే కారణమని మనమెరుగుదుము. మానవుని ఆయు:పరిమాణము కూడ శ్రీకృష్ణుని చేతనే నిర్ణయింప బడుచున్నది. కనుక శ్రీకృష్ణుని అనుగ్రహముతో మానవుడు తన ఆయు:పరిమితిని పొడిగించు కొనుట లేక తగ్గించుకొనుటను చేసుకొనవచ్చును. ఈ విధముగా ప్రతి రంగము నందును కృష్ణచైతన్యము పనిచేయుచున్నది.

## 7.10

**బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।**
**బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ ॥**

## అనువాదము

**ఓ పృథాకుమారా! నేనే సర్వప్రాణులకు సనాతన బీజముననియు, బుద్ధిమంతుల యందలి బుద్ధిననియు, శక్తిమంతుల యందలి శక్తిననియు తెలిసికొనుము.**

## భాష్యము

బీజమనగా విత్తనము(కారణము). శ్రీకృష్ణుడు సమస్తమునకు బీజమై యున్నాడు. స్థావర జంగమములైన జీవులు ఎన్నో గలవు. పక్షులు,జంతువులు, మానవులు అనేక ఇతర జీవులు జంగమములు(కదులుచుండునవి)కాగా, మొక్కలు వృక్షాదులు మున్నగునవి స్థావరములు – ఇవి కదలకుండ ఒకచోటనే నిలిచి యుండును. ప్రతిజీవియు ఎనుబదినాలుగు లక్షల జీవరాశులలో ఏదియో ఒక రకమునకు చెందియుండును. అందులో కొన్ని చేతనములు మరికొన్ని అచేతనములు. అయినను అన్నింటికీని బీజప్రదాత శ్రీకృష్ణుడే. వేదగ్రంథము లందు తెలుపబడినట్లు, దేనినుండి సమస్తము ఉద్భవించునో అదియే పరబ్రహ్మము లేదా పరతత్త్వమని తెలుపబడినది. శ్రీకృష్ణుడే పరతత్త్వము మరియు పరబ్రహ్మమును. బ్రహ్మము నిరాకారము కాగా, పరబ్రహ్మము మాత్రము సాకారము. నిరాకారబ్రహ్మము సాకార పరబ్రహ్మమునకు చెందినదని భగవద్గీత (14.27) నందు తెలుపబడినది. కనుకనే శ్రీకృష్ణుడే సమస్తమునకు కారణము మరియు మూలమై యున్నాడు. వృక్షపు మూలము వృక్షము నంతటిని పోషించు నట్లుగా, సర్వమునకు సనాతన మూల కారణమగుట చేత శ్రీకృష్ణుడు భౌతిక జగత్తు నందలి సమస్తమును పోషించుచున్నాడు. ఈ విషయము 'కఠోపనిషత్తు' (2.2.13) నందు కూడ ఇట్లు నిర్ధారింపబడినది :

నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానామ్
ఏకోబహూనాం యో విదధాతి కామాన్

"అతడు నిత్యులైనవారిలో పరమశాశ్వతుడు. సర్వప్రాణులలో సర్వోత్తమ ప్రాణి. సమస్త జీవులను అతడే పోషించుచున్నాడు." వాస్తవమునకు బుద్ధిని ఉపయోగించకుండ ఎవ్వరును ఏ కార్యమును చేయజాలరు. అట్టి బుద్ధికిని తానే కారణమని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. మానవుడు బుద్ధిమంతుడు కానిదే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగాహన చేసికొనజాలడు.

**7.11**
**బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోऽస్మి భరతర్షభ ॥**

## <u>అనువాదము</u>

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! బలవంతులలోని కామరాగరహితమైన బలమును మరియు ధర్మసిద్ధాంతములకు విరుద్ధము కానటువంటి కామ సంభోగమును నేనే అయియున్నాను.**

## <u>భాష్యము</u>

బలవంతుని బలము స్వలాభము కొరకు కాకుండ సదా బలహీనులను రక్షించుట కొరకై వినియోగింప బడవలెను. అట్లే ధర్మసిద్ధాంతములకు విరుద్ధము గాని సంభోగము సంతానోత్పత్తికే గాని అన్యమునకు కాదు. అటుపిమ్మట తమ సంతానమును కృష్ణచైతన్యవంతులుగా చేయుట తల్లిదండ్రుల బాధ్యతయై యున్నది.

**7.12**
**యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే ।**
**మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥**

## <u>అనువాదము</u>

**సత్త్వగుణముతో కూడినట్టిగాని, రజోగుణముతో కూడినట్టిగాని లేదా తమో గుణముతో కూడినట్టిగాని భావము లన్నియును నాశక్తి నుండే ఉద్భవించినవని నీవెరుగుము. ఒకవిధముగా నేనే సర్వమున్నైనను స్వతంత్రుడను. ప్రకృతి త్రిగుణములు నా యందున్నను నేను వాటికి లోబడియుండును.**

## <u>భాష్యము</u>

భౌతిక జగత్తు నందలి సమస్త భౌతిక కార్యకలాపములు భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణముల చేతనే నిర్వహింపబడుచున్నవి. ఈ త్రిగుణములన్నియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నుండియే వెలువడినను, అతడెన్నడును వాటిచే ప్రభావితుడు కాజాలడు. ఉదాహరణకు రాజ్యాంగ శాసనములచే ఎవ్వరైనను శిక్షింప బడవచ్చునేమో కాని ఆ రాజ్యాంగమును తయారుచేసిన రాజు రాజ్యాంగ నియమములకు మాత్రము లోబడియుండడు. అట్లే భౌతిక ప్రకృతికి సంబంధించన సత్త్వరజస్తమో గుణము లన్నియును దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని నుండియే ఉద్భవించినను అతడెన్నడును భౌతిక ప్రకృతిచే ప్రభావితుడు కాజాలడు. కనుకనే అతడు 'నిర్గుణుడు'. అనగా గుణములు అతని నుండియే ఉద్భవించినను అతనిపై ఏ విధమైన ప్రభావమును కలిగింప జాలవు. అదియే దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని ప్రత్యేక లక్షణములలో ఒకటి.

## 7.13
## త్రిభిర్గుణమయైర్భావైరేభి: సర్వమిదం జగత్ ।
## మోహితం నాభిజానాతి మామేభ్య: పరమవ్యయమ్ ॥

## అనువాదము

**సమస్త విశ్వము సత్త్వరజస్తమస్సులను త్రిగుణములచే మోహింప జేయబడినదై ఈ గుణములకు అతీతుడను మరియు అవ్యయుడను అగు నన్ను ఎరుగజాలకున్నది.**

## భాష్యము

సమస్త జగత్తు భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములచే మోహింప జేయబడినది. అట్టి త్రిగుణములచే మోహమునకు గురియైనవారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఈ భౌతిక ప్రకృతికి అతీతుడని ఎరుగజాలరు.

భౌతిక ప్రకృతి ప్రభావమునకు లోబడియున్నట్టి ప్రతిప్రాణియు ఒక ప్రత్యేక దేహమును, ఒక ప్రత్యేక మనస్తత్త్వమును, తదనుగుణమైన జీవ శాస్త్రోచితములైన కర్మలను కలిగియుండును. ఈ త్రిగుణముల ననుసరించి, కర్మల యందు చరించు మానవులు నాలుగు రకములుగా నుందురు. సత్వగుణము నందు సంపూర్ణముగా నిలిచియుండు వారు బ్రాహ్మణులు. రజోగుణము నందు సంపూర్ణముగా నిలిచియుండు వారు క్షత్రియులు. రజస్తమోగుణములు రెండింటి యందున్న వారు వైశ్యులు. కేవలము తమోగుణము నందుండు వారు శూద్రులు. శూద్రుల కంటెను తక్కువైనవారు జంతువులు లేక పశుప్రాయ జీవనులని పిలువ బడుదురు. ఏమైనను, ఈ ఉపాధులన్నియును శాశ్వతములు కావు. నేను బ్రాహ్మణుడైనను, క్షత్రియుడైనను, వైశ్యుడైనను, శూద్రుడైనను లేక మరేదైనను ఈ జీవితము తాత్కాలికమే. ఈ జీవితము తాత్కలికమైనను దీని తరువాత మనకు ఏ జన్మలభించునో ఎరుగుము. మాయాశక్తి ప్రభావమున దేహాత్మబుద్ధికి లోబడి మనము మనలను నేను భారతీయుడను, అమెరికాదేశస్థుడను, బ్రాహ్మణుడను, హిందువును, మహమ్మదీయుడనని అనేక రకములుగా భావించు చుందుము. ఈ విధముగా భౌతిక ప్రకృతి త్రిగుణములచే బంధింపబడినచో మనము ఆ గుణములన్నింటి వెనుక నున్నట్టి దేవాదిదేవుని విస్మరింతుము. కనుకనే త్రిగుణములచే మోహితులైన ప్రాణులు ఈ భౌతిక నేపథ్యము వెనుక నున్నది తానేననుచు ఎరుగాలేకున్నారని శ్రీకృష్ణభగవానుడు తెలుపుచున్నాడు.

మానవులు, దేవతలు,జంతువులు వంటి అనేక రకముల జీవులు గలరు. వీరందరును భౌతిక ప్రకృతి ప్రభావముచే నిర్గుణుడైన శ్రీకృష్ణభగవానుని విస్మరించి యున్నారు. రజస్తమో గుణము లందున్న వారే కాకుండ సత్త్వగుణము నందున్న వారు కూడా పరతత్త్వపు నిరాకార బ్రహ్మభావమును అధిగమించి పోజాలరు. సౌందర్యము, ఐశ్వర్యము, జ్ఞానము, బలము, కీర్తి, వైరాగ్యములను సంపూర్ణముగా కలిగియున్న శ్రీకృష్ణభగవానుని దివ్యరూపముచే వారు భ్రాంతినొందుదురు. శ్రీకృష్ణభగవానుని అవగాహన చేసికొనుట సత్త్వగుణము నందున్న వారికి కూడ సాధ్యము కాదన్నచో, రజస్తమోగుణము లందున్న వారికి ఇక ఎట్టి ఆశ మిగిలి యుండగలదు? కాని కృష్ణచైతన్యము ఈ త్రిగుణములకు అతీతమైనట్టిది. దానియందు ప్రతిష్ఠితులైనట్టివారు నిజముగా ముక్తపురుషులు.

## 7.14

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే ॥**

## అనువాదము

**భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములతో కూడిన నా ఈ దైవీమాయ నిశ్చయముగా దాటశక్యము కానిది. కాని నన్ను శరణు పొందిన వారు దీనిని సులభముగా దాటగలుగుదురు.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు అసంఖ్యాకములైన దివ్యశక్తులు గలవు. జీవులన్నియు అతని శక్తులలో భాగములైన కారణముగా మాయా(భౌతిక) శక్తి సంపర్కముచే వారి ఆదియైన ఉన్నతశక్తి కప్పబడియుండును. ఈ విధముగా మాయాశక్తిచే కప్పబడినప్పుడు ఎవ్వరును దాని ప్రభావము నుండి తప్పించుకొన జాలరు. ఇదివరకే చెప్పబడినట్లు, భౌతికములు మరియు ఆధ్యాత్మికములైన ప్రకృతులు రెండును శ్రీకృష్ణభగవానుని నుండియే ఉత్పన్నమగు చున్నందున నిత్యము లైనట్టివి. జీవులు భగవానుని నిత్యమైన ఉన్నత ప్రకృతికి చెందినవారు. కాని న్యూన శక్తియైన ప్రకృతి సంపర్కముచే (భౌతికపదార్థ సంపర్కము) వారి భ్రాంతి కూడ నిత్యమగుచున్నది. కనుకనే బద్ధజీవుడు 'నిత్యబద్ధుడు' అని చెప్పబడుచున్నాడు. అతడు ఏ సమయమున ఈ భౌతిక ప్రకృతికి బద్ధుడైనాడనే చరిత్రను కనుగొనుట ఎవ్వరికినీ సాధ్యము కాదు. తత్ఫలితముగా, భౌతిక ప్రకృతి న్యూనశక్తి స్వరూపమే అయినను భౌతిక ప్రకృతి బంధముల నుండి జీవి విడివడుట మిక్కిలి కష్టము. ఎందుకనగా, జీవుడు అధిగమింప లేనటువంటి భగవత్సంకల్పము ననుసరించియే భౌతిక ప్రకృతి వర్తించుచున్నది. భౌతిక ప్రకృతి న్యూనమైనను శ్రీకృష్ణభగవానునితో సంబంధమును కలిగి అతని సంకల్పము ననుసరించి వర్తించు చున్నందున దివ్యప్రకృతిగా ఇక్కడ వర్ణింపబడినది. న్యూనమైనను భగవానుని దివ్య సంకల్పముచే వర్తింపబడు చున్నందున భౌతిక ప్రకృతి విశ్వము యొక్క సృష్టి, స్థితి, లయము లందు అత్యద్భుతముగా వర్తించుచుండును. "మాయాం తు ప్రకృతిం విద్యాన్ మాయినం తు మహేశ్వరమ్" – "మాయ అసత్యము లేదా తాత్కాలికమైనను దాని వెనుక దివ్య ఇంద్రజాలకుడైన దేవాదిదేవుడు గలడు. అతడే మహేశ్వరుడు మరియు దివ్యనియామకుడు" అని 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (4.10) కూడ ఈ విషయమును నిర్ధారించుచున్నది.

'గుణము' అను దానికి మరొక అర్థము త్రాడు. బద్ధజీవుడు మాయ అను త్రాళ్ళతో గట్టిగా బంధింపబడి యుండునని అవగతము చేసికొనవలెను. కాళ్లుచేతులు కట్టబడిన వ్యక్తి తనంతట తానుగా బంధముల నుండి విడిపించు కొనజాలడు. బంధరహితుడైన మరొకడు అతనికి సహాయము చేయవలెను. బద్ధుడైనవాడు బద్ధుడైన మరొకనికి సహాయము చేయజాలడు. కనుక రక్షించువాడు బంధవిముక్తుడై యుండవలెను. కనుక కేవలము శ్రీకృష్ణభగవానుడు లేదా అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుడు మాత్రమే బద్ధజీవునికి బంధవిముక్తిని కలిగింప గలడు. అట్టి దివ్యసహాయము లేనిదే ఎవ్వరును భౌతిక ప్రకృతి బంధముల నుండి విముక్తిని పొందజాలరు. కృష్ణచైతన్యము లేక భక్తియుక్తసేవ అనునది మానవునికి అట్టి బంధముల నుండి విముక్తి పొందేందుకు తోడ్పడగలదు. శ్రీకృష్ణభగవానుడు మాయకు ప్రభువగుటచే బద్ధజీవుని ముక్తుని

చేయమని దాటశక్యము గాని అట్టి మాయను ఆజ్ఞాపించును. సహజముగా తన సంతానమైన జీవునిపై గల పితృవాత్సల్యము మరియు శరణాగతుడైన జీవుని పట్ల గల అవ్యాజకృప చేతనే భగవానుడు అట్టి ముక్తిని కలిగింపుమని ఆజ్ఞాపించును. కనుకనే శ్రీకృష్ణభగవానుని పాదపద్మములను శరణువేడుటయే అతి కఠినమైన భౌతిక ప్రకృతి బంధముల నుండి విముక్తి సాధించుటకు గల ఏకైక మార్గము.

'మామేవ' అను శబ్దమునకు కూడ విశేష ప్రాధాన్యము కలదు. ఇక్కడ 'మామ్' అనగా శ్రీకృష్ణునే (విష్ణువునే) అని అర్థము. దానికి బ్రహ్మ లేదా శివుడని అర్థము కాదు. బ్రహ్మరుద్రాదులు అత్యున్నతులైనను విష్ణుస్థాయికి కొంచెము ఇంచుమించుగా సమానమైన స్థితియందున్న వారైనను మాయాబంధముల నుండి జీవునికి ముక్తిని కలిగింపజాలరు. రజస్తమో గుణావతారములకు అది సాధ్యము కాదు. మరోమాటలో, బ్రహ్మ మరియు శివుడును కూడ మాయాప్రభావమునకు లోబడియుందురు. విష్ణువు ఒక్కడే మాయకు ప్రభువు. కనుకనే అతడు మాత్రమే బద్ధజీవునికి ముక్తిని ప్రసాదింపగలడు. "శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట చేతనే ముక్తి లభింపగలదు" – "తమేవ విదిత్వా" అని 'శ్వేతాశ్వతరోపనిషత్తు'(3.8) కూడ దీనిని నిర్ధారించి తెలుపుచున్నది. "ముక్తిప్రదాతా సర్వేషాం విష్ణురేవ న సంశయః"- "సర్వులకు ముక్తిప్రదాత విష్ణువనుటలో ఎట్టి సందేహము లేదు" అని మహాశివుడు ఈ విధముగా ఘంటాకర్ణునకు తెలిపెను (పద్మపురాణము,6.253.176).

## 7.15

**న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః ।**
**మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥**

## అనువాదము

**దుష్టులైన మూఢులు, నరాధములు, మాయచే హరింపబడిన జ్ఞానము గలవారును, దానవ ప్రవృత్తియైన నాస్తిక స్వభావమును కలిగి యుండువారును నన్ను శరణు పొందజాలరు.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పాదపద్మములకు కేవలము శరణు నొందుట ద్వారా మానవుడు అత్యంత కఠినమైన ప్రకృతి నియమములను అధిగమింప గలడని భగవద్గీత యందు చెప్పబడినది. అయినను విద్యావంతులైన తాత్త్వికులు, శాస్త్రజ్ఞులు, వ్యాపారస్థులు, పాలకులు, ప్రజానాయకులు వంటి ఎందరో సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణభగవానుని పాదపద్మములను శరణు పొందకుండుటకు కారణమేమి? అని ఈ సందర్భమున ఒక ప్రశ్న ఉదయించును. మానవులకు మార్గదర్శకులైనట్టి వారు కొందరు గొప్ప ప్రణాళికలు మరియు గొప్ప పట్టుదలతో భౌతిక ప్రకృతి నియమముల నుండి 'ముక్తి'ని పొందుటకు అనేక సంవత్సరములు అనేక జన్మములలో వివిధ మార్గముల ద్వారా యత్నించిరి. కాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పాదపద్మములకు శరణుపొందుట ద్వారా మాత్రమే ముక్తి సాధ్యమగు చున్నప్పుడు మేధావులను మరియు గొప్పగా శ్రమించు వారైనట్టి నాయకులు ఎందుకు ఈ సులభ విధానమును అవలంబించుట లేదు?

ఈ ప్రశ్నకు భగవద్గీత మిక్కిలి స్పష్టముగా సమాధానమిచ్చుచున్నది. మానవ సంఘమునకు వాస్తవ మార్గదర్శకులైన బ్రహ్మ, శివుడు, కపిలుడు, సనకాది కుమారులు, మనువు, వ్యాసుడు, దేవలుడు, అసితుడు, జనకుడు, ప్రహ్లాదుడు, బలిమహారాజు, అట్లే తదనంతరము వారైన శ్రీమధ్వాచార్యులు, శ్రీరామానుజాచార్యులు, శ్రీచైతన్య మహాప్రభువు ఇంకను అనేకులు శ్రద్ధను కలిగినటువంటి తాత్త్వికులు, రాజకీయవేత్తలు, విద్యాబోధకులు, విజ్ఞానవేత్తలు మున్నగు వారు సర్వశక్తిమంతుడు, పరమోన్నత ప్రామాణికుడైనట్టి పరమపురుషుని పాదపద్మములను శరణుపొంది యుండిరి. నిజమైన తత్త్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, బోధకులు, నేతలు కానివారు మాత్రమే భౌతిక లాభముల కొరకై తమనుతాము గొప్పగా ప్రదర్శించుకొనుచు భగవానుని ప్రణాళికను గాని, మార్గమును గాని అంగీకరింపరు. వారు భగవానుని గూర్చిన నిజమైన అవగాహన లేకుండ తమ భౌతికప్రణాళికలను తయారుచేసుకొని వానిని ఆచరించుచు, వ్యర్థ ప్రయత్నములతో భౌతిక జీవితసమస్యలను పరిష్కరించుకొనుటకు బదులు వాటిని మరింతగా పెంపొందించుకొందురు. ఎందుకనగా భౌతికప్రకృతి శక్తివంత మైనందున అది సర్వదా అట్టినాస్తికుల అప్రమాణిక ప్రణాళికలను నిరోధించి వారి 'ప్రణాళికా సంఘము'ల ప్రణాళికలను వ్యర్థము చేయును.

నాస్తికులైనట్టి యోజనకర్తలు ఇక్కడ 'దుష్కృతిన:' (చెడుకార్యములు ఆచరించువారుగా) అను శబ్దముచే వర్ణింపబడినారు. 'కృతి' అనగా గణనీయమైన కార్యమును చేసినవాడని భావము. నాస్తిక యోజనాపరులు కొన్నిమార్లు బుద్ధి గలవారుగా లేక గొప్పవారుగా గాని కనిపించుదురు. ఎందుకనగా మంచిదైనను చెడుదైనను గొప్ప గొప్ప ప్రణాళికలను నిర్వహించుటకు గొప్పబుద్ధి అవసరము. కాని వారి అట్టి నాస్తికబుద్ధి దేవాదిదేవుని విధానమునకు వ్యతిరేకముగా ఉపయోగించబడుట చేత నాస్తికులు 'దుష్కృతిన:' అని పిలువబడుదురు. అట్టి నాస్తికుల బుద్ధి మరియు ప్రయత్నములు చెడుమార్గమును పట్టియుండునని ఈ పదము సూచించుచున్నది.

భౌతికశక్తి సంపూర్ణముగా దేవాదిదేవుని నిర్దేశము ననుసరించి వర్తించునని భగవద్గీత యందు స్పష్టముగా తెలుపబడినది. దానికెన్నడును స్వతంత్రమైన అధికారము లేదు. వస్తువు యొక్క చలనమునకు అనుగుణముగా దాని ఛాయ చరించునట్లుగానే అది వర్తించుచుండును. అయినప్పటికిని భౌతికశక్తి మిక్కిలి శక్తివంతమై యుండును. కాని భక్తిలేని కారణముగా నాస్తికుడు ఆ భౌతిక ప్రకృతి వర్తించు విధానమును గాని, దేవాదిదేవుని సంకల్పమును గాని ఎరుక లేకుండును. శాస్త్రజ్ఞులు, తత్త్వవేత్తలు, నేతలు, బోధకులని లౌకికముగా గొప్పపేరు పొందిన హిరణ్యకశిపుడు మరియు రావణుల ప్రణాళిక లన్నియును రూపులేకుండ పోయినట్లే, మాయ మరియు రజస్తమో గుణముల కారణముగా నాస్తికుడైనట్టివాని ప్రణాళికలన్నియును భంగపడును. క్రింద వివరింపబడినట్లు, ఇట్టి 'దుష్కృతులు' నాలుగు రకములుగా నుందురు.

(1) 'మూఢులు' జంతువుల వలె కష్టించుచు అజ్ఞానముతో నిండియుందురు. వారు తమ శ్రమఫలమును తామే అనుభవింపగోరుదురు. దానిని వారు భగవానునితో పంచుకొనగోరరు. అత్యంత కష్టకార్యములను చేయు జంతువునకు సరియైన నిదర్శనము గాడిద. ఈ అల్పజంతువుతో యజమాని అత్యంత కష్టమైన పనులను చేయించుచుండును. గాడిద యజమాని చెప్పినట్లు రేయింబవళ్ళు పనిచేయుచు వాస్తవమునకు తాను ఎవ్వరికొరకు పని చేయుచున్నదో తెలియకుండును. అది కొంత గడ్డిని తిని పొట్ట నింపుకొనుటతో తృప్తినొందుతుండును. యజమాని వచ్చి దండించునేమోనను భయముతో స్వల్పకాలము నిద్రించును. ఆడగాడిదతో మరలా

మరలా తన్నులు తినుచున్నను అది తన కామదాహమును తీర్చుకొనుటకు యత్నించుట యందే నిమగ్నమై, కొన్నిమార్లు అది వేదాంతమును, కవిత్వమును కూడ ఆలపించుచుండును. వాస్తవమునకు, ఆ ఒంగ్రడ పెట్టుధ్వని కేవలము ఇతరులకు చికాకును మాత్రమే తెప్పించును. తానెవరి కొరకు శ్రమించవలెనో ఎరుగని కామ్యకర్మరతుడైన అజ్ఞాని పరిస్థితి కూడ ఇట్టిదే. అతడు కర్మము యజ్ఞము కొరకే ఉద్దేశింపబడినదను జ్ఞానమును కలిగియుండడు.

తాము స్వయంగా సృష్టించుకొనినట్టి పనులభారములను నిర్వహించుటకై రేయింబవళ్ళు కష్టించి పనిచేయువారు తరచుగా జీవాత్మ యొక్క నిత్యత్వమును గూర్చి వినుటకు సమయము లేదని చెప్పుచుందురు. అట్టి 'మూఢులు' నశ్వరములైన భౌతిక లాభమే జీవిత సర్వస్వమని భావింతురు. అయినను అట్టి 'మూఢులు' తమ పరిశ్రమ ఫలములలోని అతి స్వల్పభాగమును మాత్రమే అనుభవింతురు. అయినప్పటికిని వాటికొరకే వారు తమ జీవితములను అర్పింతురు. భౌతిక లాభము కొరకై వారు కొన్నిమార్లు రేయింబవళ్ళు నిద్రలేకుండా గడుపుదురు. అజీర్తి లేదా కడుపులో వ్రణములు కలిగినను, తగినంత ఆహారము తినలేకున్నను వారు వాటిని లక్ష్యపెట్టక తృప్తి చెందుతుందురు. కేవలము వారు తమ మిథ్యా యజమానుల లాభము కొరకై రేయింబవళ్ళు తీవ్రముగా శ్రమించి పనిచేయుటలో మునిగియుంటారు. వాస్తవ యజమానియైన శ్రీకృష్ణభగవానుని గుర్తింపక అట్టివారు తమ అమూల్యమైన కాలమును ధనపరాయణులను సేవ యందే వృథా చేయు చుందురు. దురదృష్టవశాత్తు వారు యజమానుల కందరకును యజమానియైన దేవాదిదేవునికి శరణుపొందుటకు గాని దేవాదిదేవుని గూర్చి భక్తుల నుండి శ్రవణము చేయుటకు కాలమును వినియోగించుటను చేయరు. మలమును భక్షించు పందులు నెయ్యితోను, పంచదారలతోను చేసిన మధుర పదార్థములను అంగీకరింప జాలనట్లు, తాత్కాలికమైన భౌతిక జగత్తునకు సంబంధించిన ఇంద్రియ భోగవిషయములను గూర్చి నిర్విరామముగా వినగలిగిన మూర్ఖుడైనట్టి కర్మి ఈ భౌతిక జగత్తును నడిపించు శాశ్వతశక్తిని గూర్చి వినుటకు సమయమును కలిగియుండడు.

(2) 'నరాధముడు' దుష్కృతులలో రెండవ తరగతికి సంబంధించినవాడు. నరుడు అనగా మానవుడు మరియు అధముడు అనగా నీచుడైనవాడనియు అర్థము. మొత్తము ఎనుబదినాలుగు లక్షల వివిధ జీవరాసులలో మానవజాతులు నాలుగులక్షల రకములు. వీనిలో మిక్కిలి అనాగరికములైన అల్ప మానవజాతులు అసంఖ్యాకములుగా నున్నవి. క్రమబద్ధమైన సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక జీవన సిద్ధాంతములు కలిగియున్నట్టివారే నాగరిక మానవులు. సాంఘికముగను మరియు రాజకీయముగను వృద్ధినొందినను ధర్మజీవన విధానమును కలిగి యుండనివారు 'నరాధములు'గా భావింపబడుదురు. ధర్మసిద్ధాంతములను అనుసరించుటకు గల ప్రయోజనము పరతత్త్వమును గూర్చియు, అతనితో మానవునకు గల సంబంధమును గూర్చియు ఎరుగుటయే యగును. కనుక భగవద్ రహితమైన ధర్మము ఎన్నడును ధర్మము కానేరదు. భగవానుడైన శ్రీకృష్ణుడు తనకంటే అధికుడు లేడనియు మరియు తానే పరమసత్య స్వరూపుడననియు భగవద్గీత యందు స్పష్టముగా తెలిపియున్నాడు. అట్టి సర్వశక్తిమంతుడు, పరమ సత్యము అయినట్టి దేవాదిదేవుడైన శ్రీకృష్ణునితో తనకుగల నిత్య సంబంధమును పునరుద్ధరించు కొనుటకై నాగరిక మానవజన్మ ఉద్దేశింపబడినది. ఈ సదవకాశమును పోగొట్టుకొనినవారు 'నరాధములు'గా పరిగణింపబడుదురు. శిశువు తల్లిగర్భమున మిక్కిలి అసౌకర్యముతో కూడిన పరిస్థితి యందున్నప్పుడు ముక్తికై భగవానుని ప్రార్థించుననియు, తాను బయటపడగానే భగవానునినే అర్చింతునని వాగ్దానము

చేయుననియు శాస్త్రముల ద్వారా మనకు తెలియుచున్నది. ప్రతిజీవియు శ్రీకృష్ణభగవానునితో నిత్య సంబంధమును కలిగియున్నందున తాను కష్టదశలో నున్నప్పుడు ఆ విధముగా భగవానుని ప్రార్థించుట సహజము. కాని గర్భము నుండి బయటపడినంతనే తన జనన దుఃఖములను మరియు తనను రక్షించు భగవానుని గూర్చి కూడ శిశువు మాయాప్రభావమున విస్మరించును.

కనుకనే నిగూఢమైయున్న భగవచ్చైతన్యమును శిశువులలో జాగృతము చేయుట పోషకుల బాధ్యతయై యున్నది. ధర్మజీవనమునకు మార్గదర్శకమైన 'మనుస్మృతి' నందు చెప్పబడినట్లు భగవచ్చైతన్యమును జాగృతము చేయుటకొరకే దశవిధ సంస్కార విధానములును, వర్ణాశ్రమ ధర్మవిధానమును ఉద్దేశింపబడినవి. కాని ఏ విధానము కూడ ఖచ్చితముగా ప్రపంచములో ఏ ప్రాంతము నందునను అనుసరింప బడకున్నందున ప్రస్తుత జనాభాలో 99.9 శాతము జనులు నరాధములై యున్నారు.

జనాభా సర్వము నరాధము లైనప్పుడు, సహజముగా వారి నామమాత్ర విద్యాజ్ఞానములు సర్వశక్తిమంతమైన భౌతిక ప్రకృతి శక్తిచే శూన్యము చేయబడును. భగవద్గీత ననుసరించి (5.18) విద్యావంతుడైన బ్రాహ్మణుని, శునకమును, గోవును, ఏనుగును, చండాలుని సమానదృష్టితో దర్శించువాడే పండితుడు. నిజమైన భక్తుని దృష్టి అట్టిదై యుండును. దేవాదిదేవుని అవతారమైన శ్రీ నిత్యానంద ప్రభువు నరాధములైనట్టి జగాయ్, మధాయ్ అను ఇరువురు సోదరులను ఉద్ధరించి, మానవాధములపై కూడ ఏ విధముగా నిజమైన భక్తుడు దయను ప్రసరింపగలడో చూపియుండెను. కనుక దేవాదిదేవునిచే నిరసింపబడిన నరాధముడు కేవలము భక్తుని కృపచేతనే తిరిగి తన ఆధ్యాత్మిక చైతన్యమును పునరుద్ధరించు కొనగలడు.

శ్రీ చైతన్య మహాప్రభువు భాగవత ధర్మమును(భక్తులు కార్యక్రమములు) ప్రచారము చేయుచు భగవత్ సందేశమును వినయముతో కూడి శ్రవణము చేయవలెనని ఉపదేశించి యుండెను. ఆ సందేశపు సారాంశమే ఈ భగవద్గీత. నరాధములు ఈ విధముగా వినయమును గూడి శ్రవణము చేయు విధానము చేతనే ఉద్ధరింపబడుదురు. కాని దురదృష్టవశాత్తు వారు ఈ సందేశమును శ్రవణము చేయుటకు నిరాకరింతురు. ఇక ఆ దేవాదిదేవుని సంకల్పమునకు శరణు నొందుటను గూర్చి చెప్పేదేమున్నది? 'నరాధములు' ఉద్దేశపూర్వకముగా మానవుని ప్రధాన ధర్మమును నిర్లక్ష్యపరుచుదురు.

(3) దుష్కృతులలో మూడవ తరగతివారు 'మాయయాపహృత జ్ఞానా:' అనగా మాయాశక్తి ప్రభావముచేత జ్ఞానము అపహరింప బదినవారని భావము. సాధారణముగా వారిలో చాలామంది గొప్ప తత్త్వవేత్తలు, కవులు, విద్యావంతులు, శాస్త్రజ్ఞులుగా పేరు గాంచినవారైనను మాయచే తప్పుదారి పట్టిన వారగుదురు. తత్కారణముగా వారు దేవాదిదేవుని పట్ల అవిధేయులై యుందురు.

వర్తమాన కాలములో మాయయాపహృత జ్ఞానుల సంఖ్య అధికముగా నున్నది. భగవద్గీతకు సంబంధించిన విద్వాంసుల యందు కూడ ఇట్టివారు అనేకులు గలరు. భగవద్గీత యందు శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని సరళమును మరియు సుస్పష్టమైన భాషలో చెప్పబడినది. అతనితో సమానులు గాని అతని కంటె అధికులుగాని ఎవరును లేరు. మానవులందరికిని ఆది పితయైన బ్రహ్మదేవునికి కూడ అతడే తండ్రి అని పేర్కొనబడెను. వాస్తవమునకు, శ్రీకృష్ణుడు బ్రహ్మదేవునికే కాకుండ సమస్త జీవజాతులకు కూడ తండ్రియని

చెప్పదగినవాడు. నిరాకార బ్రహ్మముకు మరియు పరమాత్మకును అతడే మూలము. సర్వజీవుల యందున్న పరమాత్ముడు అతని స్వాంశరూపమే. సర్వమునకు అతడే మూల కారణము. కనుక ప్రతియొక్కరు అతని పాదపద్మములను శరణు పొందవలెను. స్పష్టములైన ఇట్టి వాక్యములెన్ని ఉన్నప్పటికిని 'మాయయాపహృత జ్ఞానులు' భగవానుని నిరసించి అతనిని కూడ సామాన్య మానవునిగానే భావింతురు. భగవానుని దివ్యమైన, నిత్యమైన రూపము ననుసరించియే ధన్యమైన మనవ రూపము రూపొందింప బడినదని వారెరుగజాలరు.

మాయయాపహృత జ్ఞానులగు వారి అప్రామాణిక గీతాభాస్యములు పరంపరానుగతమైన భాష్యములకు భిన్నములై ఆధ్యాత్మికావగాహన మార్గమున కేవలము అవరోధములే యగును. అటువంటి మోహితులైన భాష్యకారులు శ్రీకృష్ణభగవానుని పాదపద్మములను శరణుపొందుట గాని, ఆ దేవాదిదేవుని శరణు పొందుమని ఇతరులకు బోధించుట గాని చేయరు.

(4) దుష్కృతులలో చివరి తరగతివారు 'ఆసురం భావమాశ్రితా' లేక రాక్షస సిద్ధాంతముల ననుసరించువారు. అట్టివారు బహిరంగంగా నాస్తికత్వమును ప్రదర్శింతురు. వారిలో కొందరు దేవాదిదేవుడు ఈ భౌతిక జగత్తు నందు అవతరించడని వాదించుచుందురు. కాని ఎందుకు అవతరింపడను విషయమునకు తగిన కారణములను వారు చెప్పజాలరు. మరికొందరు భగవద్గీత యందు చెప్పిన దానికి విరుద్ధముగా శ్రీకృష్ణభగవానుడు నిరాకార బ్రహ్మమునకు అధీనుడని వివరింతురు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పట్ల ద్వేషమును కలిగియుండి అట్టి రాక్షస స్వభావము గలవాడు తమ ఇచ్చానుసారము అప్రమాణికములైన అనేక అవతారములను సృష్టించుచుండును. భగవానుని నిందించుటయే జీవిత సిద్ధాంతముగా కలిగిన అట్టి రాక్షస స్వభావులెన్నటికిని శ్రీకృష్ణభగవానుని పాదపద్మములను శరణుపొందజాలరు.

దక్షిణభారతవాసి ఆళవందారుగా ప్రసిద్ధులైన శ్రీయమునాచార్యులు ఇట్లు పలికిరి: "హే ప్రభూ! నీవు అసాధారణమైన గుణములతోను, లక్షణములతోను, లీలలుతోను కూడియున్నను, సత్వగుణముతో కూడిన శాస్త్రములన్నియు నీ మహాత్మ్యమును నిర్ధారించినప్పటికిని, దివ్యగుణ సంపన్నులును, ఆధ్యాత్మిక జ్ఞాననిష్ఠాతులును మరియు సుప్రసిద్ధ మహానుబావులు నిన్ను గుర్తించి ప్రశంసించి యున్నను, నాస్తిక సిద్ధాంతములతో కూడియున్నవారు నిన్ను ఎరుగజాలరు." (స్తోత్రరత్న, 15)

కనుకనే పైన పేర్కొనబడిన (1) మూఢులు, (2) నరాధములు, (3) మయాపహృతజ్ఞానులు, (4) రాక్షస ప్రవృత్తి గలవారు, ప్రామాణిక వేదగ్రంథములు ఎంతగా ఆదేశించినను దేవాదిదేవుని పాదపద్మములకు ఎన్నడును శరణుపొందరు.

**7.16**
**చతుర్విధా భజన్తే మాం జనా: సుకృతినో/ర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**

## అనువాదము

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువు, పరతత్త్వజ్ఞానము నన్వేషించువాడు అనెడి నాలుగు రకముల పుణ్యాత్ములు నాకు భక్తియుక్త సేవ చేయనారంభింతురు.**

## భాష్యము

దుష్కృతులకు భిన్నముగా, శాస్త్రములందు తెలుపబడిన నియమ నిబంధనలకు కట్టుబడి వర్తించువారు 'సుకృతులు' అనబడుదురు. అనగా వారు శాస్రములందు చెప్పబడిన సాంఘిక మరియు నైతిక నియమములను పాటించుచు దాదాపు శ్రీకృష్ణభగవానుని పట్ల భక్తిని కలిగియుందురు. వీరిలో కొందరు ఆపదల యందు గలవారు(ఆర్తులు), ధనమును వాంఛించువారు (అర్థార్థులు), కొన్నిమార్లు జ్ఞానమును కోరువారు(జిజ్ఞాసులు), పరమసత్య జ్ఞానము నన్వేషించు వారు (జ్ఞానులు) అని నాలుగు తరగతుల భక్తుల గలరు. ఇట్టివారు వివిధ పరిస్థితుల యందు దేవాదిదేవుని సేవించుటకు వత్తురు. తమ సేవకు ప్రతిఫలమును కోరి యుండుటచే వాస్తవమునకు వారు శుద్ధభక్తులు కాజాలరు. శుద్ధభక్తి యనునది కాంక్షలు మరియు వాంఛలకు అతీతమైనట్టిది. అట్టి శుద్ధభక్తిని 'భక్తిరసామృత సింధువు' (1.1.11) ఈ విధముగా నిర్వచించినది :

అన్యాభిలాషితాశూన్యం జ్ఞానకర్మాద్యనావృతమ్
అనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తిరుత్తమా

"కామ్యకర్మల ద్వారా గాని, తాత్త్వికకల్పనల ద్వారా గాని భౌతికలాభాపేక్ష లేకుండగ అనుకూలముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రతియొక్కరు దివ్యమైన ప్రేమయుక్త సేవ నొనరింపవలెను. అదియే శుద్ధభక్తియుక్త సేవ యనబడును."

ఈ నాలుగు రకముల మానవులు భక్తియుక్త సేవ చేయుటకై దేవాదిదేవుని సమీపించి శుద్ధభక్తుని సాంగత్యములో పూర్తిగా పరిశుద్ధులైనవారు శుద్ధభక్తులు కాగలరు. కాని దుష్కృతులకు సంబంధించినంత వరకు వారి జీవితములు స్వార్థపూరితము, క్రమరహితము, ఆధ్యాత్మిక గమ్యము లేనందున వారికి భక్తియుక్త సేవయందు నెలకొనుట గొప్పకష్టము. కాని వారిలో కొందరు యాదృచ్ఛికముగా శుద్ధభక్తుల సాంగత్యమును పొందినచో వారు కూడ శుద్ధభక్తులు కాగలుగుదురు.

ఎల్లప్పుడును కామ్యకర్మలందు ఆసక్తులై యుండెడివారు భౌతికమైన ఆపద సంభవించినపుడు భగవానుని చేరి ఆ సమయమున శుద్ధభక్తుల సాంగత్యమును పొంది తమ ఆర్తి చేత భగవద్భక్తులగుదురు. నిరాశ పొందినవారు కూడ కొన్నిమార్లు శుద్ధభక్తుల సాంగత్యమును పొంది భగవానుని గూర్చి ఎరుగుటకు ఆసక్తులగుదురు. అట్లే శుష్కవేదాంతులు కూడా తమ జ్ఞానవిషయమున నిరాశ పొందినవారై కొన్నిమార్లు భగవానుని గూర్చి వాస్తవముగా తెలిసికొనగోరి, భక్తియుక్త సేవ చేయుటకై భగవానుని వద్దకు

వత్తురు. ఈ విధముగా వారు ఆ భగవానుని కృప మరియు భక్తుల కృపచే నిరాకారబ్రహ్మ భావనలను, పరమాత్మ భావనలను అధిగమించి సాకారబ్రహ్మ భావనకు వత్తురు. ఆర్తులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు, అర్థార్థులు భౌతికవాంఛల నుండి విముక్తులై భౌతిక లాభములు ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఏమాత్రము దోహదము కావని పూర్తిగా గ్రహించినపుడే వారు శుద్ధభక్తులగుదురు. అట్టి పవిత్ర స్థితి ప్రాప్తించనంతవరకు భగవానుని దివ్యసేవ యందు నెలకొనియున్నట్టి భక్తులు కామ్యకర్మలచేత లౌకిక జ్ఞానాన్వేషణము వంటి వానిచే కలుషితమై పోవుదురు. కనుక శుద్ధభక్తియుక్త సేవాస్థితి యందు నెలకొనుటకు పూర్వము మానవుడు వీటినన్నింటిని అధిగమింపవలసి యుండును.

## 7.17

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే।**
**ప్రియో హి జ్ఞానినో త్యర్థమహం స చ మమ ప్రియ: ॥**

### అనువాదము

**వీరిలో పరిపూర్ణజ్ఞానము కలిగి సదా శుద్ధభక్తియుక్త సేవ యందు నెలకొని యుండెడివాడు అత్యంత ఉత్తముడు. ఏలయన నేనతనికి మిక్కిలి ప్రియుడను; అతడును నాకు మిక్కిలి ప్రియుడు.**

### భాష్యము

ఆర్తి, జిజ్ఞాసు, అర్థార్థి, జ్ఞాని అనువారలు భౌతికవాంఛాకాలుష్యము నుండి విడివడినప్పుడు శుద్ధభక్తులు కాగలరు. వీరిలో పరతత్త్వ జ్ఞానమును కలిగి సమస్త భౌతికవాంఛల నుండి విముక్తుడైనవాడు భగవానునికి నిజమైన భక్తుడగును. ఇట్టి సుకృతులైన నాలుగురకముల భక్తులలో పరిపూర్ణ జ్ఞానవంతుడై భక్తియుక్త సేవ యందు నెలకొనియుండెడి వ్యక్తి అత్యుత్తముడని భగవానుడు చెప్పుచున్నాడు. జ్ఞానము నన్వేషించువాడు తన ఆత్మ భౌతిక దేహము కంటె భిన్నమని ఎరిగి మరింతగా పురోగతిని సాధించిన పిమ్మట నిరాకార బ్రహ్మానుభూతిని గూర్చియు మరియు పరమాత్మానుభూతిని గూర్చియు జ్ఞానమును పొందును. పూర్తిగా పవిత్రుడైనవాడు భగవానునికి నిత్యదాసుడై యుండుటయే తన సహజ స్థితియని గుర్తించును. కనుక శుద్ధభక్తుల సాంగత్యమున జిజ్ఞాసువును, ఆర్తుడును, అర్థార్థి, జ్ఞాని అందరును క్రమముగా పవిత్రులగుదురు. కాని ప్రయత్నదశలో భగవానుని గూర్చిన పరిపూర్ణ జ్ఞానమును కలిగియుండి, భక్తియుక్త సేవ యందు నెలకొనినవాడు భగవానునికి మిక్కిలి ప్రియమగును. భగవద్విజ్ఞానపు అనుభూతిని పొందినవాడు భక్తియుక్త సేవచే రక్షింపబడుట చేత భౌతిక కాలుష్యము లేవియు అతనిని అంటజాలవు.

**7.18**
**ఉదారా: సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థిత: స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥**

**అనువాదము**

**ఈ భక్తులందరును నిస్సంశయముగా ఉదాత్తులే యైనను వీరిలో నా జ్ఞానము నందు స్థితుడైన వానిని నన్నుగానే నేను భావింతును. నా దివ్యమైన సేవ యందు నియుక్తుడైనందున అతడు అత్యుత్తమము మరియు పరమగమ్యమైన నన్ను తప్పక పొందగలడు.**

**భాష్యము**

జ్ఞానము నందు పరిపూర్ణత్వము నొందని భక్తులు భగవానునికి ప్రియము కాజాలరని ఎన్నడును భావింపరాదు. ఎవరైనను భగవానుని కొరకు ఏ ప్రయోజనముతో సమీపించినను వారు 'మహాత్మ'లగుటచే వారందరును
దాత్తులేనని భగవానుడు చెప్పుచున్నాడు. భక్తియుక్తసేవకు ప్రతిఫలముగా కొంత లాభము కలుగవలెనని వాంఛించు భక్తులను కూడ భగవానుడు అంగీకరించును. వారి భక్తియందు ప్రేమభావ వినిమయము ఉండుటయే అందులకు కారణము. ప్రేమ కారణముగనే వారు భగవానుని నుండి కొంత భౌతిక లాభమును ఆశించుదురు, అది ప్రాప్తించిన పిమ్మట వారు మిక్కిలి సంతృప్తి చెంది మరింత అధికముగా భక్తియుక్త సేవ యందు పురోగతిని సాధించుదురు. కాని పరిపూర్ణ జ్ఞానవంతుడైన భక్తుడు కేవలము భక్తి మరియు ప్రేమలతో భగవానుని సేవించుటయే తన ఏకైక ప్రయోజనమని భావించుట చేత ఆ భగవానునికి మిక్కిలి ప్రియమైనవాడుగ భావింపబడును. అట్టి భక్తుడు భగవానునితో సంబంధము లేకుండ అతనిని సేవింపకుండా క్షణకాలమైనను జీవింపలేడు. అదేవిధముగా భగవానుడు కూడ అట్టిభక్తుని యెడ గొప్పప్రీతిని కలిగియుండి అతనిని వీడి దూరముగా నుండజాలడు.

శ్రీమద్భాగవతము(9.4.68) నందు భగవానుడిట్లు తెలిపెను :
సాధవో హృదయం మహ్యం సాధూనాం హృదయం త్వహమ్
మదన్యత్తే న జానన్తి నాహం తేభ్యో మనాగపి

"భక్తులు సదా నా హృదయము నందు నిలిచియుందురు. నేనెప్పుడును భక్తుల హృదయము నందు వసింతును. భక్తులు నన్ను తప్ప అన్యమును ఎరుగరు మరియు నేనును భక్తులను ఎన్నడును మరువను. నాకు మరియు వారికిని మధ్య గొప్ప సన్నిహిత సంబంధము కలదు. అట్టి పరిపూర్ణ జ్ఞానవంతులైన శుద్ధభక్తులు ఆధ్యాత్మికతకు ఎన్నడును దూరము కానందునే వారు నాకు మిక్కిలి ప్రియులు."

**7.19**
**బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే ।**
**వాసుదేవ: సర్వమితి స మహాత్మా సుదుర్లభ: ॥**

## అనువాదము

**జ్ఞానవంతుడైనవాడు పెక్కుజననమరణముల పిదప నన్నే సర్వ కారణములకు కారణునిగను మరియు సమస్తముగను తెలిసికొని నన్ను శరణుజొచ్చును. అట్టి మహాత్ముడు మిక్కిలి అరుదు.**

## భాష్యము

భక్తియుక్త సేవ లేక ఆధ్యాత్మిక కర్మలను కొనసాగించుచు జీవుడు అనేక జన్మముల పిదప దేవాదిదేవుడే ఆధ్యాత్మికానుభూతికి చరమలక్ష్యమను శుద్ధజ్ఞానము నందు వాస్తవముగా స్థితుడు కాగలడు. ఆధ్యాత్మికానుభూతి యొక్క ఆరంభదశ యందు మానవుడు భౌతిక వస్తువులపై ఆసక్తిని తొలగించుకొను యత్నము చేయునపుడు కొంత నిరాకార తత్త్వము వైపునకు ఆసక్తిని కనపరచ వచ్చును. కాని అతడు తన యత్నములో మరింత పురోభివృద్ధిని సాధించినప్పుడు ఆధ్యాత్మిక జీవితమున కొన్నికర్మలు కలవనియు, అవియే భక్తియుక్త సేవతో కూడి యుండుననియు అవగతము చేసికొనగలుగును. ఆవిధముగా అతడు దేవాదిదేవుని పట్ల ఆసక్తుడై అతనిని శరణుపొందును. అట్టి సమయమున అతడు శ్రీకృష్ణభగవానుని కృపయే సర్వస్వమనియు, అతడే సర్వకారణ కారణమనియు, ఈ భౌతిక జగత్తు అతని నుండి స్వతంత్రమై యుండదని అవగాహనము చేసికొనును. ఈ జగత్తు ఆధ్యాత్మిక వైవిధ్యము యొక్క వికృత ప్రతిబింబమనియు మరియు ప్రతిదియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణునితో సంబంధము కలిగి యున్నదనియు అతడు అప్పుడు గుర్తింపగలుగును. ఈ విధముగా అతడు సర్వమును వాసుదేవునికి లేక శ్రీకృష్ణునికి సంబంధించినదిగా భావించును. వాసుదేవుని గూర్చిన అట్టి విశ్వజనీన దృష్టి శ్రీకృష్ణభగవానుని శరణుపొందుటయే ఉత్తమోత్తమ గమ్యమనెడి భావనకు చేర్చగలదు. కాని అట్లు శరణాగతులైన మహాత్ములు మిక్కిలి అరుదుగా నుందురు.

'శ్వేతాశ్వతరోపనిషత్తు' నందలి తృతీయాధ్యాయము నందలి శ్లోకములు (14,15) చక్కగా ఇట్లు వివరించుచున్నవి :

సహస్రశీర్షా పురుష: సహస్రాక్ష:సహస్రపాత్
స భూమిం విశ్వతో వృత్వాత్యాతిష్ఠద్దశాంగులమ్
పురుష ఏవేదం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్
ఉతామృతత్వస్యేశానో యదన్నేనాతిరోహతి

'ఛాందోగ్యోపనిషత్తు'(5.1.15) నందు : "న వై వాచో న చక్షూంషి న శ్రోత్రాణి న మనాంసీత్యాచక్షతే ప్రాణ ఇత్యేవాచక్షతే ప్రాణా హ్యేవైతాని సర్వాణి భవతి"- "ప్రాణి దేహములో వాక్ శక్తి కాని, దృశ్యశక్తి కాని, శ్రవణశక్తి కాని లేదా ఆలోచనాశక్తి కాని ముఖ్యములు కాకుండ వాటికి కారణమైన ప్రాణమే సమస్త కార్యకలాపములకు కేంద్రము" అని చెప్పబడినది. అట్లే వాసుదేవుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు సర్వమునకు మూలమై యున్నాడు. ఈ దేహము నందు వాక్ శక్తి, దృశ్యశక్తి, శ్రవణశక్తి, ఆలోచనాశక్తి అనెడి శక్తులనేకము గలవు. కాని అవియన్నియును శ్రీకృష్ణభగవానునితో సంబంధమును

కలిగియుండనిచో వ్యర్థములే యగును. వాసుదేవుడే సర్వవ్యాపకుడు మరియు సమస్తమగుట చేతను సంపూర్ణ జ్ఞానముతో భక్తుడు అతనిని శరణుపొందును (భగవద్గీత 7.17 మరియు 11.40 శ్లోకములతో పోల్చిచూడుడు).

### 7.20

**కామైస్తైస్తైర్హృతజ్ఞానా: ప్రపద్యన్తే/న్యదేవతా: ।**
**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతా: స్వయా ॥**

## అనువాదము

**భౌతిక వాంఛలచే జ్ఞానము అపహరింపబడినవారు ఇతర దేవతలకు శరణు జొచ్చి తమ స్వభావ గుణముల ననుసరించి ఆయా ప్రత్యేక పూజా విధానముల ననుసరింతురు.**

## భాష్యము

సమస్త భౌతిక కల్మషముల నుండి ముక్తులైనవారు దేవాదిదేవుని శరణుపొంది అతని భక్తియుక్త సేవ యందు నెలకొందురు. భౌతిక కాలుష్యము పూర్తిగా ప్రక్షాళితము కానంతవరకు వారు అభక్తులుగనే పరిగణింపబడుదురు. కాని భౌతిక వాంఛలను కలిగియున్నను దేవాదిదేవుని శరణుపొందిన వారు బాహ్యప్రకృతిచే అంతగా ఆకర్షింపబడరు. ఎందుకనగా వారు సరియైన గమ్యమును చేరియున్నందున వెంటనే కామము నుండి విముక్తులగుదురు. శ్రీమద్భాగవతము (2.3.10) నందు ఇట్లు ఉపదేశింపబడినది :

అకామ: సర్వకామో వా మోక్షకామ ఉదారధీ:
తీవ్రేణ భక్తియోగేన యజేత పురుషం పరమ్

"శుద్ధభక్తుడై సర్వవిధములైన భౌతికవాంఛల నుండి విముక్తుడైనను లేదా సర్వ విధములైన భౌతికవాంఛలతో నిండియున్నను లేదా భౌతిక సంపర్కము నుండి విముక్తిని వాంఛించుచున్నను మానవుడు అన్ని సమయము లందును వాసుదేవుని శరణుపొంది అతనినే ఆరాధింపవలెను."

ఆధ్యాత్మిక జ్ఞానమును కోల్పోయిన మందబుద్ధులు తమ భౌతికవాంఛల తక్షణప్రాప్తి కొరకై ఇతర దేవతలను ఆశ్రయింతురు. సాధారణముగా అట్టివారు దేవాదిదేవుని సమీపింపరు. రజస్తమో గుణము లందున్న వారు వివిధ దేవతలను ఆరాధింతురు. ఆ యా పూజా విధి విధానముల ననుసరించుచు వారు తృప్తినొందుదురు. అట్టి దేవతారాధకులు అల్పమైన కోరికలచే ప్రేరితులై పరమగమ్యమును ఎట్లు పొందవలేనో ఎరుగకుందురు. కాని భగవద్భక్తులు మాత్రము ఆ విధముగా తప్పుత్రోవపట్టరు. వైదిక సాహిత్యము నందు వివిధ ప్రయోజనములకై వివిధ దేవతలను పూజింప వలెనని ప్రతిపాదింపబడి యున్నందున (ఉదాహరణకు రోగియైనవాడు సూర్యుని పూజింపవలెను) దేవాదిదేవుని భక్తులు కానివారు కొన్ని ప్రయోజనములను ఆశించి భగవానుని కాకుండ వివిధ దేవతలను పూజించుటయే మేలని భావింతురు. కాని శుద్ధభక్తుడు దేవాదిదేవుడైన కృష్ణభగవానుడే సర్వులకు ప్రభువని ఎరిగియుండును. 'శ్రీ

చైతన్య చరితామృతము' (ఆదిలీల 5.142) నందు ఇట్లు తెలుపబడినది : "ఏకలే ఈశ్వర కృష్ణ, ఆర సబ భృత్య"- "దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడొక్కడే ప్రభువు, ఇతరులందరును అతని సేవకులు." కనుకనే శుద్ధభక్తుడు తన భౌతిక వాంఛా తృప్తికొరకై ఎన్నడును దేవతల నాశ్రయింపడు. అతడు కేవలము దేవాదిదేవుని పైననే ఆధారపడును. శుద్ధభక్తుడు తనకు భగవానుడేది ప్రసాదించినను దానితో సంతృప్తి చెందును.

## 7.21

**యో యో యాం యాం తనుం భక్త: శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥**

### అనువాదము

**నేను అందరి హృదయములందు పరమాత్మ రూపమున నిలిచియుందును. ఎవరైనను ఒక దేవతను పూజింపగోరినంతనే నేను అతని శ్రద్ధను స్థిరము చేసి ఆ ప్రత్యేక దేవతకు అతడు భక్తుడగునట్లు చేయుదును.**

### భాష్యము

భగవానుడు సర్వజీవులకు స్వాతంత్ర్యము నొసగియున్నాడు. కనుక ఎవరైనను భౌతిక సుఖానుభవమును వాంఛించి దానిని దేవతల నుండి పొంద గోరినచో అందరి హృదయము లందును పరమాత్మ రూపమున నెలకొనినట్టి దేవాదిదేవుడు వారి భావములను అవగాహనము చేసికొని వారు కోరినట్లు చేసికొనుటకు అవకాశమును కల్పించును. జీవులందరికి పరమపితగా అతడు వారి స్వాతంత్ర్యములో జోక్యము చేసికొనక, వారు తమ భౌతిక వాంఛల నన్నింటిని తీర్చుకొనుటకు అనువుగా అన్ని సౌకర్యములను సమకూర్చును. సర్వశక్తిమంతుడైన భగవానుడు జీవులకు భౌతికజగత్తు నందు సుఖముల ననుభవించుటకు తగిన సౌకర్యముల నొసగి మాయాశక్తి వలలో చిక్కుకొనునట్లు ఎందుకు చేయుచున్నాడని కొందరు ప్రశ్నింపవచ్చును. దేవాదిదేవుడు పరమాత్మ రూపమున హృదయము నందు నెలకొనియుండి, అట్టి అవకాశములను మరియు సౌకర్యములను చేకూర్చనిచో జీవుల స్వాతంత్ర్యమను పదమునకు అర్థము ఉండదనుటయే ఆ ప్రశ్నకు సమాధానము. కనుకనే అతడు జీవులందరికిని పూర్తి స్వాతంత్ర్యమును, వారు కోరినది కోరినట్లుగా సమకూర్చును. కాని అతని చరమోపదేశమును భగవద్గీత(18.66) నందు చూడవచ్చును. మానవుడు సర్వధర్మములను వీడి భగవానునికి మాత్రమే సంపూర్ణముగా శరణుపొందవలెను. అట్టి ఆదేశపాలనము మానవునికి ఆనందమును చేకూర్చును.

జీవులు మరియు దేవతలు ఇరువురును కూడ దేవాదిదేవుని సంకల్పమునకు అధీనులై యుందురు. కనుక జీవుడు తన ఇచ్ఛానుసారము ఏదేని దేవతను పూజింపజాలడు. అట్లే దేవాదిదేవుని అనుమతి లేనిదే దేవతలు కూడ అతనికి ఎట్టివరములను ప్రసాదింపజాలరు. సాధారణముగా చెప్పబడునట్లు, దేవాదిదేవుని సంకల్పము లేకుండ గడ్డిపోచయైనను కదలదు. అట్లే భౌతిక జగత్తు నందు ఆర్తులైనవారు వైదిక సాహిత్యము నందు ఆదేశింపబడినట్లు వివిధ దేవతల నాశ్రయింతురు. అనగా ఏదైన ఒక ప్రత్యేక వస్తువును(వరమును) వాంఛించు మానవుడు దానినొసగు ఆయా దేవతలను పూజించుచుండును. ఉదాహరణకు రోగగ్రస్థుడైనవాడు

సూర్యదేవుని పూజింపవలెననియు, విద్యను కోరువాడు సరస్వతీ దేవిని పూజింపవలెననియు, అందమైన భార్యను కోరువాడు శివుని పత్నియైన ఉమాదేవిని పూజింపవలెననియు చెప్పబడుచున్నది. ఈ విధముగా వివిధ గుణములకు సంబంధించిన వివిధ దేవతార్చన విధానములను గూర్చిన ఉపదేశములు శాస్త్రములందు కలవు. ఏదేని ఒక ప్రత్యేకవ్యక్తి ఒక ప్రత్యేక భౌతిక సుఖమును అనుభవింప దలచినప్పుడు, ఆ వరమును ఆ ప్రత్యేక దేవత నుండి పొందవలెనను గట్టి వాంఛను భగవానుడే వాని యందు కలిగింప జేయును. ఆ విధముగా అతడు ఆ వరమును పొందుచుండును. ఏదేని ప్రత్యేక దేవత యందు జీవునకు ప్రత్యేక భక్తిభావమును కూడ దేవాదిదేవుడే కలిగించు చుండును. దేవతలు జీవులయందు అట్టి సన్నిహితత్వమును కలిగింపజాలరు. కాని అది దేవుడైనందున శ్రీకృష్ణభగవానుడే సర్వప్రాణుల హృదయములందు పరమాత్మగా నెలకొని యుండుటచే ఆయా దేవతలను పూజించుటకు కావలసిన ప్రేరణను మానవునకు ఒసగుచుండును. వాస్తవమునకు దేవతలందరును దేవాదిదేవుని విశ్వరూపమందలి వివిధ భాగము లగుటచే వారికి ఎట్టి స్వాతంత్ర్యము లేదు. "దేవాదిదేవుడు పరమాత్మ రూపమున దేవతల హృదయములందు నెలకొని యుండును. కనుక అతడు జీవుల కోరికలు దేవతల ద్వారా తీరునట్లు ఏర్పాట్లను చేయుచుండును. ఈ విధముగా దేవతలు మరియు జీవులు ఇరువురును కూడ భగవానుని దివ్యసంకల్పము పై ఆధారపడి యుందురు. కనుక వారెన్నడును స్వతంత్రులు కాజాలరు" అని వేదవాఙ్మయము నందు తెలుపబడినది.

## 7.22

**స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధనమీహతే ।**
**లభతే చ తత: కామాన్మయైవ విహితాన్ హి తాన్ ॥**

## అనువాదము

**అట్టి శ్రద్ధతో కూడినవాడై మానవుడు ఏదేని ఒక దేవతారాధనను చేపట్టి తద్ద్వారా తన కోరికలను ఈడేర్చుకొనును. కాని వాస్తవమునకు ఆ వరములన్నియు నా చేతనే ఒసగబడుచున్నవి.**

## భాష్యము

దేవాదిదేవుని అనుమతి లేకుండ దేవతలు తమ భక్తులకు ఎట్టి వరములను ప్రసాదింపజాలరు. సర్వము శ్రీకృష్ణభగవానునికి చెందినదను విషయమును జీవులు మరిచినను దేవతలు మాత్రము మరువరు. కనుకనే దేవతలను పూజించుట మరియు వారి ద్వారా వాంఛసిద్ధి యనునవి పూర్వ నిర్దేశము ననుసరించి దేవాదిదేవుని చేతనే జరుగును కాని దేవతల చేత జరగదు. అల్పజ్ఞుడైన జీవుడు ఈ విషయము నెరుగడు. కనుక మూర్ఖముగా అతడు స్వల్ప లాభముల కొరకై దేవతల నాశ్రయించును. కాని శుద్ధభక్తుడు మాత్రము ఏదైన అవసరము కలిగినప్పుడు ఆ దేవాదిదేవునే ప్రార్థించును. అయినను, ఆ విధముగా భౌతిక లాభమును అర్థించుట శుద్ధభక్తుని లక్షణము కాదు. సాధారణముగా జీవుడు తన వాంఛను పూరించుకొనుట యందు అత్యాసక్తిని కలిగియుండుట చేత దేవతల నాశ్రయించును. జీవుడు తనకు తగనటువంటి దానిని దేనినో వాంఛించునప్పుడే ఆ విధముగా జరుగుచుండును. దేవాదిదేవుడు స్వయముగా అట్టివాంఛను పూరింపడు. ఒకవైపు ఆదిదేవుని ఆరాధించుచునే మరొకవైపు భౌతిక

భోగవాంఛలతో కూడియుండుట యనునది విరుద్ధకోరికలను కలిగి యుండుట వంటిదని 'శ్రీ చైతన్య చరితామృతము' తెలుపుచున్నది. దేవాదిదేవునికి చేయబడు భక్తియుక్త సేవ మరియు దేవతలకు చేయబడు పూజ సమానస్థితి యందున్నట్టివి కావు. ఎందుకనగా దేవతాపూజ భౌతికమైనది. దేవాదిదేవునకు చేయు భక్తియుక్త సేవ పూర్తిగా ఆధ్యాత్మికమైనది.

భగవద్ధామమును తిరిగి చేరవలెనని వాంఛించు జీవునికి భౌతిక వాంఛలు అవరోధముల వంటివి. కనుక సాధారణముగా అల్పజ్ఞులగు జీవులు వాంఛించు భౌతిక లాభములు శుద్ధభక్తునకు ఒసగబడవు. కావున అట్టి అల్పజ్ఞులు దేవాదిదేవుని భక్తియుక్త సేవ యందు నెలకొనుటకు బదులు భౌతిక జగత్తునకు సంబంధించిన దేవతల పూజకే ప్రాధాన్యమిత్తురు.

## 7.23

**అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।**
**దేవాన్దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి ॥**

### అనువాదము

**అల్పబుద్ధులు దేవతలను పూజింతురు. కాని వారొసగెడి ఫలములు అల్పములు మరియు తాత్కాలికములై యున్నవి. దేవతలను పూజించువారు దేవతా లోకములను చేరగా, నా భక్తులు మాత్రము అంత్యమున నా పరంధామమునే చేరుదురు.**

### భాష్యము

ఇతర దేవతలను పూజించువారు కూడా దేవాదిదేవుని చేరగలరని భగవద్గీతకు వ్యాఖ్యానము రచించినవారిలో కొందరు చెప్పుదురు. కాని ఇక్కడ దేవతలను పూజించువారు ఆ దేవతలు నివసించు లోకములనే చేరుదురని స్పష్టముగా తెలుపబడినది. అనగా సూర్యుని పూజించువారు సూర్యలోకమును చేరగా, చంద్రుని పూజించువారు చంద్రలోకమును చేరుదురు. అట్లే ఇంద్రుని వంటి దేవతను పూజింపగోరినచో వారు ఆ ప్రత్యేక దేవతాలోకమునకు సంబంధించిన లోకమును మానవుడు పొందగలడు. అంతేకాని ఏ దేవతను పూజించినను చివరకు అందరును దేవాదిదేవుని చేరుదురనునది సత్యము కాదు. అట్టి భావన ఇక్కడ ఖండింపబడినది. అనగా దేవతలను పూజించువారు భౌతిక జగత్తునందలి ఆ యా దేవతల లోకములను చేరుదురనియు, దేవాదిదేవుని భక్తులు మాత్రము దేవాదిదేవుని పరంధామమునే నేరుగా చేరుదురని స్పష్టముగా చెప్పబడినది.

దేవతలు దేవాదిదేవుని విశ్వరూపము నందలి వివిధభాగములే అయినచో ఆ భగవానుని అర్చించుట వలన కలిగెడి ఫలితము దేవతలను పూజించుట చేతను కలుగవలెనని కొందరు ప్రశ్నింపవచ్చును. ఏమైనను దేవతారాధకులు అల్పబుద్ధులగుటచే శరీరమందలి ఏ భాగమునకు ఆహారమును సమకూర్చవలెనో ఎరుగరు. వారిలో మరింతగా మూర్ఖులైన కొందరు దేహమునకు అనేక భాగములు గలవనియు వానికి ఆహారము సమకూర్చు విధానములు కూడ అనేకములు గలవనియు మూర్ఖముగా వాదించుదురు. కాని వాస్తవమునకు వారి వాదము యుక్తమైనది కాదు. ఎందుకనగా

ఎవరైనను దేహమునకు కర్ణముల ద్వారా గాని, నేత్రముల ద్వారా గాని ఆహారమును అందించగలరా? దేవతలు శ్రీకృష్ణుని విశ్వరూప మందలి వివిధ భాగములని వారెరుగజాలరు. అంతేకాకుండ, అజ్ఞానము చేత వారు ప్రతిదేవతయు ప్రత్యేక భగవానుడనియు లేదా దేవాదిదేవునితో సమానమనియు మూర్ఖముగా విశ్వసింతురు.

దేవతలే కాకుండ సాధారణ జీవులు కూడ దేవాదిదేవుని అంశలై యున్నారు. బ్రాహ్మణులు ఆ దేవాదిదేవుని శిరోభాగమనియు, క్షత్రియులు అతని భుజము లనియు, వైశ్యులు అతని ఊరువులనియు, శూద్రులు అతని పాదము లనియు మరియు వారందరును వివిధములైన ప్రయోజనములను నేరవేర్చుదురనియు శ్రీమద్భాగవతమున తెలుపబడినది. తన పరిస్థితితో నిమిత్తము లేకుండా, ఎవరైనను తనను మరియు దేవతలను దేవాదిదేవుని అంశలుగా ఎరుగ గలిగినచో వారి జ్ఞానము పరిపూర్ణము కాగలదు. కాని ఈ విషయమును అతడు అవగాహన చేసుకొననిచో వారు భగవద్ధామమును పొందక వివిధ దేవతా లోకములను పొందవలసివచ్చును. భక్తులు అట్టి గమ్యస్థానము నెన్నడును చేరారు.

ఈ భౌతిక జగత్తు నందలి లోకములు, దేవతలు, వారిని పూజించువారు సర్వము నశ్వరము లగుటచే దేవతల వరములచే కలుగు ఫలితములు కూడ నశ్వరములై యున్నవి. కనుకనే దేవతలను పూజించుటచే కలుగు ఫలములు నశ్వరములనియు, కేవలము అల్పజ్ఞులైన జీవుల చేతనే అట్టి దేవతార్చనము చేయబడుననియు ఈ శ్లోకమున స్పష్టముగా చెప్పబడినది. కృష్ణచైతన్యముతో కూడిన శుద్ధభక్తుడు దేవాదిదేవుని భక్తియుక్త సేవ యందు నెలకొని జ్ఞాన పరిపూర్ణమగు నిత్యానంద మయమైన జీవన స్థితిని సాధించును. కనుక అతడు సాధించు సిద్ధి సామాన్య దేవతార్చకుడు పొందు సిద్ధికి పూర్తిగా భిన్నమై యుండును. ఎందుకనగా ఆదిదేవుడైన శ్రీకృష్ణుడు అనంతుడు. అట్లే అతని ఉపకారములు అనంతములు. అతని అనుగ్రహము అనంతము. కనుకనే అతడు తన శుద్ధభక్తులపై చూపు కృప కూడ అనంతమై యున్నది.

## 7.24

**అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయ: ।**
**పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్ ॥**

### అనువాదము

**నన్ను సంపూర్ణముగా ఎరుగని మందబుద్ధులు దేవాదిదేవుడనైన నేను (శ్రీకృష్ణుడు) తొలుత నిరాకారుడనై యుండి ఇప్పుడు ఈ రూపమును దాల్చితినని భావింతురు. అజ్ఞానవశమున వారు నాశరహితమును మరియు అత్యుత్తమమును అగు నా దివ్యస్వభావమును ఎరుగలేరు.**

### భాష్యము

దేవతలను పూజించువారు మందబుద్ధులు లేదా బుద్ధిహీనులని పైన వర్ణింపబడిరి. ఇక్కడ నిరాకారవాదులు కూడ అదేవిధముగా వర్ణింపబడిరి. శ్రీకృష్ణభగవానుడు తన సాకార స్వరూపమున అర్జునుని ఎదుట సంభాషిస్తున్నను నిరాకారవాదులు అజ్ఞానముచే దేవాదిదేవుడు రూపరహితుడని వాదింతురు. ఈ సందర్భమున శ్రీరామానుజాచార్యుల

గురుపరంపరకు చెందిన పరమభక్తుడైన శ్రీయమునాచార్యులు (స్తోత్రరత్నము-15) ఈ చక్కని శ్లోకమును ఇట్లు రచించి యుండిరి. అతడిట్లు చెప్పుచున్నాడు :

త్వాం శీలరూపచరితై: పరమప్రకృష్టై: ।
సత్త్వేన సాత్త్వికతయా ప్రబలైశ్చ శాస్త్రై: ॥
ప్రఖ్యాతదైవపరమార్థవిదాం మతైశ్చ ।
నైవాసురప్రకృతయ: ప్రభవన్తి బోద్ధుమ్ ॥

"ప్రియమైన ఓ ప్రభూ! వ్యాసదేవుడు మరియు నారదుడు వంటి భక్తులు నీవు దేవాదిదేవుడవని ఎరిగియున్నారు. వివిధ వేదవాఙ్మయ భాగములను అవగాహన చేసుకొనుట ద్వారా మానవుడు నీ దివ్యగుణ లక్షణములను, రూపములను, కర్మలను ఎరిగి నీవే దేవాదిదేవుడవని గ్రహింపగలడు. కాని రజస్తమోగుణము లందున్న దానవులును, భక్తులు కానివారును మాత్రము నిన్నెన్నడును ఎరుగజాలరు. అట్టి భక్తిహీనులు వేదాంతమును, ఉపనిషత్తులను, ఇతర వేదవాఙ్మయ భాగములను గూర్చిగొప్ప నైపుణ్యముతో చర్చించినను దేవాదిదేవుని అవగాహన చేసికొనుట వారికి సాధ్యము కాదు."

"కేవలము వేదాంతాధ్యయనము ద్వారా దేవాదిదేవుడు తెలియబడడు" అని 'బ్రహ్మ సంహిత'(5.33) యందు చెప్పబడినది. దేవాదిదేవుని కృప చేతనే అతనిని ఎరుగగలుగుదుము. కనుకనే దేవతలను పూజించువారే కాకుండ కృష్ణ చైతన్యము అనునది ఏ మాత్రము లేక కేవలము వేదాంతచర్చ మరియు వేదవాఙ్మయమును గూర్చిన ఊహాగానాలలో నిమగ్నులై యుండువారు కూడ మందబుద్ధి లేననియు ఈ శ్లోకమున స్పష్టముగా చెప్పబడినది. అట్టివారికి భగవత్ స్వరూపమును అవగతము చేసుకొనుట సాధ్యము కాని విషయము. పరతత్త్వము అనునది నిరాకారమనెడి భావనలో నున్నవారు 'అబుద్ధయ:' అని వర్ణింపబడిరి. అనగా వారు పరతత్త్వపు సర్వోన్నత రూపమును ఎరుగనివారని భావము. ఆధ్యాత్మికానుభూతి యనునది నిరాకార బ్రహ్మానుభూతితో ఆరంభమై పిదప పరమాత్మానుభూతికి పురోగమించుననియు, కాని పరతత్త్వపు చరమానుభూతి శ్రీకృష్ణభగవానుడేననియు శ్రీమద్భాగవతము(1.2.11) నందు తెలుపబడినది. ఆధునిక నిరాకారవాదులు మరింత మందబుద్ధులై యున్నారు. ఎందుకనగా శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని ప్రత్యేకించి పలికినట్టి తమ పూర్వాచార్యులైన శ్రీపాద శంకరాచార్యుల వారిని కూడ వారు అనుసరింపరు. కనుకనే నిరాకారవాదులు శ్రీకృష్ణుని నిజతత్త్వమును ఎరుగజాలక అతనిని దేవకీవసుదేవుల పుత్రుడనియో, రాకుమారుడనియో లేక శక్తివంతుడైన జీవుడనియో భావింతురు. ఇట్టి భావన కూడ భగవద్గీత(9.11) యందు, "అవజానన్తి మాం మూఢా: మానుషీం తనుమాశ్రితమ్"-"మూర్ఖులు మాత్రమే నన్ను సాధారణ మానవునిగా భావింతురు" అని ఖండింపబడినది.

సత్యమేమనగా భక్తియుక్త సేవ చేయకుండ మరియు కృష్ణచైతన్యమును పెంపొందించు కొనకుండ ఎవ్వరును శ్రీకృష్ణుని ఎరుగజాలరు. ఈ విషయమును శ్రీమద్భాగవతము(10.14.29) ఇట్లు నిర్ధారించుచున్నది :

అథాపి తే దేవ పదాంబుజద్వయప్రసాదలేశానుగృహీత ఏవ హి
జానాతి తత్త్వం భగవన్మహిమ్నో న చాన్య ఏకో పి చిరం విచిన్వన్

"హే ప్రభూ! నీ పాదపద్మముల కృప లేశమాత్రము లభించినను మానవుడు నీ స్వరూప గొప్పతనమును అవగాహనము చేసికొనగలడు. కాని దేవాదిదేవుడైన నిన్ను అవగతము

చేసికొనుటకు కేవలము ఊహాగానములు మాత్రమే చేయువారు అనేక సంవత్సరములు వేదాధ్యయనము గావించినను నిన్ను ఎరుగజాలరు."

కేవలము ఊహాగానములచే గాని, వేదవాఙ్మయ భాగములను చర్చించుటచే గాని ఎవ్వరును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గాని అతని నామ రూప గుణములను గాని గ్రహింపజాలరు. భక్తియుక్తసేవ ద్వారానే మానవుడు దేవాదిదేవుని అవగాహన చేసుకొనగలడు. "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరేరామ హరేరామ రామ రామ హరే హరే" అను మహామంత్ర జపకీర్తనలతో ప్రారంభమగు కృష్ణచైతన్యము నందు మానవుడు పూర్తిగా నెలకొనినప్పుడే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగతము చేసికొనగలడు. భక్తిహీనులైన నిరాకారవాదులు శ్రీకృష్ణుని దేహము పాంచభౌతికమనియు మరియు అతని లీలలు, రూపము, అతనికి సంబంధించిన సమస్తము 'మాయ' అనియు పలుకుదురు. కనుకనే అట్టి నిరాకారవాదులు మాయావాదులని పిలువబడుదురు. వాస్తవమునకు పరతత్త్వమును వారెరుగజాలరు.

"కామైస్తైస్తైర్హృ తజ్ఞానా: ప్రపద్యన్తే/న్యదేవతా:" – "మోహముతో కూడిన కోరికలచే అంధులైనవారే వివిధ దేవతలను శరణు పొందురు" అని ఇరువదియవ శ్లోకము స్పష్టముగా తెలుపుచున్నది. దేవాదిదేవునితో పాటు వివిధ లోకములు కలిగిన ఇతర దేవతలు కలరనియు మరియు దేవాదిదేవుడు కూడ దివ్యలోకమును కలిగి యున్నాడనియు అంగీకరింపబడినది. ఇరువది మూడవ శ్లోకమున తెలుపబడినట్లు, "దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి" అనగా దేవతలను పూజించువారు దేవతల లోకములనే చేరుదురు, కృష్ణభక్తులు కృష్ణలోకమును చేరుదురు. ఇది ఇట్లు ఇంత స్పష్టముగా తెలుపబడి యున్నను మూర్ఖులైన నిరాకారవాదులు శ్రీకృష్ణభగవానుడు రూపరహితుడనియు, ఈ రూపము లన్నియును కాల్పనికము లనియు (ఉపాధి) వాదించుచుందురు. గీతాధ్యయనము పిమ్మట దేవతలు మరియు వారి లోకములు నిరాకారములనెడి భావన ఎట్లు కలుగును? కనుకనే నిశ్చయముగా దేవతలు గాని, శ్రీకృష్ణభగవానుడు గాని నిరాకారులు కారు. వారందరును సాకార రూపమును కలిగియున్నట్టివారే. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు తన స్వీయలోకమును కలగియున్నట్లే, దేవతలును తమ తమ లోకములను కలిగియున్నారు.

కనుక పరతత్త్వము రూపరహితము మరియు అతనికి రూపమనునది ఆపాదింపబడినదని చెప్పు మాయావాదము ఎన్నటికిని సత్యము కానేరదు. ఇది ఆపాదింపబడినది కాదని ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. దేవతల రూపములు మరియు దేవాదిదేవుని రూపమును వేరువేరుగా ఒకే సమయమున స్థితమై యున్నవనియు మరియు శ్రీకృష్ణుడు సచ్చిదానంద విగ్రహుడనియు(శాశ్వతము, జ్ఞానము, ఆనందపూర్ణము) భగవద్గీత ద్వారా మనము స్పష్టముగా తెలుసుకొన గలము. పరతత్త్వము సహజముగా 'ఆనందమయ:' అనగా ఆనందమయమనియు మరియు అది అపరిమిత కళ్యాణగుణములకు నిధి యనియు వేదములు నిర్ధారించు చున్నవి. "ఆనందమాయో భ్యాసాత్" అని 'బ్రహ్మసూత్రము' లందు కూడ నిర్ధారింపబడినది. భగవానుడు తాను 'అజుడు'(పుట్టుకలేనివాడు) అని గీతలో చెప్పినను అతడు అవతరించుచునే యుండును. ఈ సత్యముల నన్నింటిని మనము భగవద్గీత నుండి అవగాహన చేసుకొనవలెను. వాస్తవమునకు ఏ విధముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు రూపరహితుడని చెప్పబడునో మనకు అవగతము కాని విషయము. కనుకనే పరతత్త్వము నందు కాల్పనిక రూపము ఆపాదింపబడునని పలుకు అద్వైతుల వివర్తవాదము గీతావాక్యముల ననుసరించి సత్యము కాదు. పరతత్త్వమైన శ్రీకృష్ణభగవానుడు

దివ్యరూపము మరియు దివ్యగుణములను కలిగియున్నాడని ఇక్కడ స్పష్టముగా తెలియబడినది.

### 7.25

**నాహం ప్రకాశ: సర్వస్య యోగమాయాయాసమావృత: ।**
**మూఢో యం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ ॥**

## అనువాదము

**మూఢులకు మరియు మందబుద్ధులకు నేనెన్నడును వ్యక్తము కాను. వారికి నేను నా యోగమాయచే కప్పబడియుందును. అందుచే వారు నేను అజుడననియు, అవ్యయుడననియు ఎరుగరు.**

## భాష్యము

శ్రీకృష్ణుడు భూమిపై అవతరించి ఒకప్పుడు సర్వులకు దర్శనమిచ్చెను కావున ఇప్పుడు మాత్రము ఎందులకు సర్వులకు దర్శనమిచ్చుట లేదని ఎవరైనను వాదింపవచ్చును. కాని వాస్తవమునకు ఆ సమయమున కూడ శ్రీకృష్ణుడు సర్వులకు వ్యక్తము కాలేదు. అతడు భూమిపై అవతరించి యున్నప్పుడు కొద్దిమంది మాత్రమే అతనిని దేవాదిదేవునిగా గ్రహింపగలిగిరి. కురుసభలో రాజసూయయాగ సందర్భమున శ్రీకృష్ణుడు అగ్రపూజకు అర్హుడు కాడని శిశుపాలుడు అభ్యంతరము తెలిపినప్పుడు, భీష్ముడు శ్రీకృష్ణుని సమర్థించి అతనిని దేవాదిదేవునిగా ప్రకటించెను. అట్లే పాండవులు మరియు ఇతరులు కొద్దిమంది మాత్రమే శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని గ్రహింపగలిగిరి. అందరును ఆ విధముగా గ్రహింపలేకపోయిరి. అతడెన్నడును అభక్తులకు మరియు సామాన్యజనులకు వ్యక్తము కాలేదు. కనుకనే తన శుద్ధభక్తులు తప్ప మిగిలిన వారందరును తనను తమవంటివాడనే భావింతురని శ్రీకృష్ణుడు గీతయందు పలికియుండెను. భక్తులకు ఆనందనిధిగా గోచరించు అతడు అజ్ఞానులైన అభక్తులకు తన 'యోగమాయ'చే కప్పబడియుండును.

శ్రీకృష్ణభగవానుడు 'యోగమాయ' అను తెరచే కప్పబడి యున్నందున సామాన్యజనులు ఆతనిని తెలిసికొనలేరని కుంతీదేవి తన ప్రార్థనలలో తెలియజేసెను (శ్రీమద్భాగవతము 1.8.19). ఈ 'యోగమాయ' అను తెర 'ఈశోపనిషత్తు' (15వ, మంత్రము) నందును స్థిరీకరింపబడినది. దీనియందు భక్తుడు భగవానుని ఇట్లు ప్రార్థించెను :

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే

"హే ప్రభూ! సమస్త విశ్వమును పోషించువాడవు నీవే. నీకు చేయబడు భక్తియుక్త సేవయే అత్యుత్తమ ధర్మాచరణము. కనుకనే నన్ను కూడా పోషింపుమని నిన్ను నేను ప్రార్థించుచున్నాను. నీ దివ్యరూపము యోగమాయచే కప్పబడియున్నది. అట్టి యోగమాయ బ్రహ్మజ్యోతిచే కప్పబడినదై యున్నది. నీ సచ్చిదానంద విగ్రహమును దర్శించుటకు అవరోధము కలిగించుచున్న ఆ ప్రకాశమాన కాంతిని దయతో ఉపసంహరింపుమని నేను ప్రార్థించుచున్నాను."

సచ్చిదానంద విగ్రహుడైన దేవాదిదేవుడు బ్రహ్మజ్యోతి లేక అంతరంగ శక్తిచే కప్పబడియుండుట వలన మందబుద్ధులైన నిరాకారవాదులు భగవానుని దర్శింపలేకున్నారు.

శ్రీమద్భాగవతము(10.14.7) నందు కూడ బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుని ఇట్లు ప్రార్థించెను : "ఓ దేవాదిదేవా! ఓ పరమాత్మా! ఓ అచింత్యశక్తి స్వరూపా! నీ శక్తి మరియు లీలలను ఎవరు గణింపగలరు? నీవు నీ యోగమాయ శక్తిని ఎల్లప్పుడును విస్తరించుచున్నందున నిన్నెవ్వరును అవగాహన చేసికొనజాలరు. విజ్ఞానవేత్తలు మరియు పండితులైన వారు భౌతికజగత్తు లేదా వివిధ గ్రహముల అణుమయ నిర్మాణమును పరీక్ష చేయగలుగుదురేమో గాని నీవు వారి ఎదుట నిలిచియున్నను వారు నీ శక్తిసామర్థ్యములను గణింపజాలరు." దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు అజుడే గాక 'అవ్యయుడు' కూడ అయియున్నాడు. అతని నిత్యరూపము జ్ఞానముతో కూడుకున్నట్టిది కాగా అతని సర్వశక్తులు అక్షయములై (నాశరహితములై) యున్నవి.

## 7.26

**వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥**

### అనువాదము

**ఓ అర్జునా! దేవాదిదేవుడనైన నేను గతములో జరిగిన సమస్తమును, ప్రస్తుతము జరుగుచున్న సర్వమును, భవిష్యత్తులో జరుగుచున్న సర్వమును ఎరుగుదును. అదేవిధముగ జీవులందరిని నేను ఎరుగుదును. కాని నన్నెవ్వరును ఎరుగరు.**

### భాష్యము

సాకార మరియు నిరాకార తత్త్వములకు సంబంధించన వివాదము ఇక్కడ స్పష్టముగా వివరింపబడినది. మాయావాదులు భావించునట్లుగా దేవాదిదేవుడు, శ్రీకృష్ణుని రూపము 'మాయ'(భౌతికము) అయినచో, సాధారణ జీవుల వలె అతడును దేహమును మార్చుచు గడచిన జన్మను విస్మరింపవలెను. భౌతిక దేహధారు లెవ్వరును గడచిన జన్మను గుర్తించుకొనుట లేక రాబోవు జన్మమును గూర్చి భవిష్యత్తు పలుకుట లేక ప్రస్తుత జన్మము యొక్క ఫలితమును ఊహించుట గాని చేయలేరు. కనుకనే భూత, భవిష్యత్తు, వర్తమానములను అతడు ఎరుగజాలడు. భౌతిక కల్మషముల నుండి విముక్తిని పొందనిదే ఎవ్వరును భూత, భవిష్యత్తు, వర్తమానములను ఎరుగజాలరు.

సాధారణ మానవునికి భిన్నముగా శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ తాను భూత కాలమున గడచిన సర్వమును, ప్రస్తుతము జరుగుచున్న సమస్తమును, భవిష్యత్తులో జరుగనున్న సర్వమును సంపూర్ణముగా ఎరుగుదునని స్పష్టముగా చెప్పుచున్నాడు. చతుర్థాధ్యాయము నందు శ్రీకృష్ణభగవానుడు లక్షలాది సంవత్సరముల క్రిందట సూర్యదేవుడైన వివస్వానునకు తాను బోధించిన విషయమును శ్రీకృష్ణుడు జ్ఞప్తి యందుంచు కొనినట్లు మనము చూచియుంటిమి. సర్వజీవుల హృదయములందు పరమాత్మగా నెలకొని యున్నందున అతడు సమస్త జీవులను ఎరిగియున్నాడు. కాని శ్రీకృష్ణుడు ఆ విధముగా సర్వజీవుల యందు పరమాత్మగా నిలిచియున్నను మరియు దేవాదిదేవునిగా స్థితుడై యున్నను, మందబుద్ధులు నిరాకార బ్రహ్మానుభూతిని గూర్చి

తెలిసికొన సమర్థులైనను అతనిని పరమపురుషునిగా ఎరుగ లేకున్నారు. యథార్థమునకు శ్రీకృష్ణభగవానుని దివ్యదేహము నశ్వరము కానిది. అతడు సూర్యుని వంటివాడు. 'మాయ' మేఘము వంటిది. భౌతిక జగత్తులోని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాదులు కలిగిన ఆకాశమును మేఘములు కొన్నిమార్లు తాత్కాలికముగా కప్పివేసినను వాస్తవమునకు అది మన దృష్టిని కప్పివేయుటయే యగును. ఏలయన సూర్యచంద్రాదులు వాస్తవమునకు కప్పబడరు. అట్లే 'మాయ' కూడ శ్రీకృష్ణభగవానుని కప్పలేదు. అతడే తన యోగమాయచే మందబుద్ధులగు మానవులకు గోచరించక యుండును. ఈ అధ్యాయము నందలి మూడవశ్లోకమున తెలుపబడినట్లు, అనేక లక్షలమంది జనులలో అతికొద్దిమంది మాత్రమే మానవజన్మను సఫలము చేసికొనుటకు యత్నింతురు. అట్లు యత్నించి సఫలీకృతులైన వేలాదిమందిలో ఒకానొకడు మాత్రమే శ్రీకృష్ణుని వాస్తవముగా అవగతము చేసుకొనగలడు. ఎవ్వరైనను నిరాకార బ్రహ్మానుభూతిని గాని పరమాత్మానుభూతిని గాని సాధించినను వారు కృష్ణచైతన్యము నందు పరిపూర్ణులు కానిదే ఎవ్వరును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగతము చేసికొనజాలరు.

## 7.27

**ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరన్తప ॥**

### అనువాదము

**ఓ భరతవంశీయుడా! ఓ శత్రుంజయా! కోరిక మరియు ద్వేషముల వలన జనించిన ద్వంద్వములచే మోహితులై జీవులందరును మోహము నందే జన్మించు చున్నారు.**

### భాష్యము

శుద్ధజ్ఞానస్వరూపుడైన దేవాదిదేవునికి అధీనుడై ఉండుటయే జీవుని సహజస్థితి. అట్టి శుద్ధజ్ఞానము నుండి జీవుడు మోహముచే విడివడినప్పుడు మాయాశక్తికి లోబడి దేవాదిదేవుని గ్రహింపజాలడు. అట్టి మాయాశక్తి కోరిక, ద్వేషములనెడి ద్వంద్వములందు వ్యక్తమగుచున్నది. అట్టి కోరిక మరియు ద్వేషము చేత అజ్ఞాని దేవాదిదేవునితో ఐక్యము కావలెనని వాంఛించి, శ్రీకృష్ణుడు దేవాదిదేవుడను విషయమున అసూయను కలిగియుండును. కోరిక చేతను, ద్వేషము చేతను కలుషితులు గాని శుద్ధభక్తులు శ్రీకృష్ణభగవానుడు తన అంతరంగ శక్తి ద్వారా అవతరించునని తెలిసికొందురు. కాని ద్వంద్వముల చేతను అజ్ఞానము చేతను మోహితులైనవారు దేవాదిదేవుడు భౌతిక శక్తులచే సృజింపబడునని భావింతురు. అది వారి దురదృష్టము. మోహితులైన అట్టి మానవులు : "ఇది నా భార్య, ఇది నా గృహము, ఈ గృహమునకు నేను యజమానిని, ఈవిడకు నేను భర్తను" అని భావించుచు గౌరవాగౌరవములు, సుఖదుఃఖములు, స్త్రీపురుషులు, శుభాశుభములనెడి ద్వంద్వములలో మునిగియుందురు. ఇవియే మోహకారక ద్వంద్వములు. అట్లు మోహితులగు వారు పూర్తిగా మూర్ఖులగుట చేత వారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగతము చేసికొనజాలరు.

**7.28**
**యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతా: ॥**

## అనువాదము

**పూర్వజన్మములందు, ప్రస్తుత జన్మమునందు పుణ్యకర్మల నొనరించుచు పాపములను పూర్తిగ నశింపజేసికొనిన మానవులు ద్వంద్వ మోహముల నుండి విడివడినవారై నా భక్తియుక్తసేవ యందు దృఢనిశ్చయముతో నెలకొనెదరు.**

## భాష్యము

ఆధ్యాత్మిక స్థితిని పొందుటకు అర్హులైనవారు ఈ శ్లోకమున పేర్కొన బడిరి. పాపులు, నాస్తికులు, మూర్ఖులు, వంచకులైన వారికి కోరిక మరియు ద్వేషములనెడి ద్వంద్వములను అతిక్రమించుట మిక్కిలి కష్టము. కేవలము ధర్మ నియమానుసారముగా జీవితమును గడుపుచు పుణ్యకర్మల నొనర్చుట ద్వారా, పాపఫలములను నశింపజేసికొనినవారే భక్తియుక్త సేవను అంగీకరించి క్రమముగా దేవాదిదేవుని శుద్ధజ్ఞానమును పొందు స్థితికి ఎదగగలరు. పిమ్మట వారు క్రమముగా భగవానుని పారవశ్యముతో ధ్యానింప గలుగుదురు. ఆధ్యాత్మిక స్థితి నందు నెలకొనుటకు ఇదియే సరియైన పద్ధతి. శుద్ధభక్తుల సాంగత్యమున కృష్ణచైతన్యము ద్వారా ఇట్టి పురోభివృద్ధి సాధ్యపడగలదు. ఎందుకనగా, మహాభక్తుల సాంగత్యమున మానవుడు భ్రాంతి నుండి విడివడగలడు.

ఎవరేని నిజముగా ముక్తిని వాంఛించినచో వారు భక్తులను సేవించవలెనని శ్రీమద్భాగవతము(5.5.2) నందు తెలుపబడినది (మహాత్సేవాం ద్వారమహుర్వి ముక్తే:). కాని భౌతిక భావన కలిగిన భౌతికవాదులతో సాంగత్యము కలిగినవాడు జీవితము యొక్క తమోమయ ప్రాంతమును చేర్చు మార్గము ననుసరించిన వారగుదురు(తమోద్వారం యోషితాం సంగిసంగమ్). బద్ధజీవుల నందరిని భ్రాంతి నుండి ఉద్ధరించుటకై భగవద్భక్తులందరూ జగమంతటను సంచరించు చుందురు. శ్రీకృష్ణభగవానునికి దాసులమనెడి తమ నిజస్థితిని విస్మరించుట యనునది ఆ భగవానుని శాసనమును ఉల్లంఘించుటయేనని నిరాకారవాదులు ఎరుగజాలరు. కనుక మానవుడు తన నిజస్వరూప స్థితియైన శ్రీకృష్ణుని సేవ యందు పున: ప్రతిష్ఠితుడు కానంతవరకు ఆ దేవాదిదేవుని అవగాహన చేసుకొనుట గాని, దృఢనిశ్చయముతో దివ్యమైన అతని భక్తియుక్తసేవ యందు పూర్తిగా నిమగ్నుడై యుండుట గాని సంభవింపదు.

**7.29**
**జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥**

## అనువాదము

**వృద్ధాప్యము మరియు మృత్యువుల నుండి ముక్తిని పొందుటకై యత్నించు బుద్ధిమంతులు భక్తియుక్త సేవతో నన్ను ఆశ్రయించు చున్నారు. ఆధ్యాత్మిక కర్మలను గూర్చి సమగ్రముగా నెరింగిన వారగుటచే యథార్థముగా వారు బ్రహ్మస్వరూపులై యున్నారు.**

## భాష్యము

జననము, మరణము, వృద్ధాప్యము, వ్యాధులనునవి పాంచభౌతిక దేహమును మాత్రమే ప్రభావితము చేయును గాని ఆధ్యాత్మిక దేహమును కాదు. ఆధ్యాత్మిక దేహమునకు జననము, మరణము, వృద్ధాప్యము, వ్యాధులు వంటివి అంటవు. కనుక ఆధ్యాత్మిక దేహమును పొందినవాడు భగవానుని పార్షదులలో ఒకడై నిత్యమైన భక్తియుక్త సేవను చేయుచు వాస్తవముగా ముక్తిని పొందిన వాడగును. 'అహం బ్రహ్మాస్మి'- నేను బ్రహ్మమును. మానవుడు తాను వాస్తవమునకు బ్రహ్మమునని అనగా జీవాత్మ యని ప్రతియొక్కరు తెలిసికొనవలెనని చెప్పబడినది. ఇట్టి బ్రహ్మానుభూతి భక్తియుక్తసేవ యందు కలదని ఈ శ్లోకము వివరించుచున్నది. శుద్ధభక్తులైనవారు బ్రహ్మభూత స్థితి యందు నెలకొని ఆధ్యాత్మిక కార్యకలాపములను గూర్చి సంపూర్ణముగా ఎరిగియుందురు.

నాలుగు రకములైన సకామ భక్తులు కూడ దివ్యమైన భగవత్సేవ యందు నెలకొన గలిగినచో వాంఛిత గమ్యములను పొందగలుగుదురు. అయినను దేవాదిదేవుని కృపతో వారు పూర్తిగా కృష్ణచైతన్యమును పొందినప్పుడు ప్రత్యక్షముగా అతని దివ్యసాంగత్యము ననుభవింతురు. కాని దేవతలను పూజించువారు దివ్యధామము నందలి దేవాదిదేవుని ఎన్నడును పొందజాలరు. వారేకాకుండ మందబుద్ధులైన బ్రహ్మానుభూతిని పొందినవారు కూడ శ్రీకృష్ణుని దివ్యధామమైన గోలోక వృందావనమును పొందజాలరు. వాస్తవముగా కృష్ణచైతన్యముతో (మామాశ్రిత్య) తమ కార్యకలాపములను కొనసాగించుచు కృష్ణలోకమును చేరుటకు యత్నించు చుండువారే వాస్తవమునకు 'బ్రహ్మము'గా పిలువబడుటకు అర్హులు. అట్టివారికి శ్రీకృష్ణుని గూర్చి ఎట్టి అపోహలు గాని, సందేహములు గాని లేకుండును. కనుకనే వారు యథార్థముగా బ్రహ్మస్వరూపులై యున్నారు.

శ్రీకృష్ణభగవానుని అర్చావిగ్రహమును పూజించుట యందు నియుక్తు లైనవారు లేక భౌతిక బంధవిముక్తి కొరకే ఆ భగవానుని ధ్యానించువారు కూడ భగవానుని అనుగ్రహముచే రాబోవు అధ్యాయమున తెలుపబడినట్లు, బ్రహ్మము యొక్క 'అధిభూతాది' భావముల నెరుగగలరు.

## 7.30
**సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదు: ।**
**ప్రయాణ కాలే/పి చ మాం తే విదుర్యుక్తచేతస: ॥**

### అనువాదము

**నా యందు సంలగ్నమైన మనస్సు కలిగినవారు దేవాదిదేవుడనైన నన్నే భౌతిక జగత్తును, సర్వదేవతలను, సమస్త యజ్ఞములను నియమించువానిగా తెలిసికొని మరణసమయమందును నన్ను(దేవాదిదేవుడు) అవగాహనతో ఎరిగియుందురు.**

### భాష్యము

కృష్ణచైతన్యమున వర్తించు వ్యక్తులు దేవాదిదేవుని పరిపూర్ణముగా అవగాహనము చేసుకొను మార్గము నుండి ఎన్నడును వైదొలగరు. దేవాదిదేవుడు భౌతిక జగత్తును మరియు దేవతలను కూడా ఎట్లు పరిపాలించునో కృష్ణచైతన్యపు దివ్యసాంగత్యము ద్వారా మానవుడు తెలిసికొనగలడు. అట్టి కృష్ణచైతన్యముతో గల దివ్యసాంగత్యము ద్వారా మానవుడు క్రమముగా దేవాదిదేవుని యందు పూర్తి విశ్వాసమును పొందును. అట్టి కృష్ణచైతన్యవంతుడు మరణ సమయమున కూడ శ్రీకృష్ణుని మరవబోడు. ఆ విధముగా సహజముగనే అతడు దేవాదిదేవుని కృష్ణలోకమైన గోలోక వృందావనమును చేరగలడు.

ఏ విధముగా మానవుడు పరిపూర్ణ కృష్ణచైతన్యవంతుడు కాగలడో సప్తమాధ్యాయము ప్రత్యేకముగా వివరించినది. కృష్ణచైతన్యవంతులైన భక్తుల సాంగత్య మనునది అట్టి కృష్ణచైతన్యమును పొందుటలో మొట్టమొదటి అంశము. ఎందుకనగా అట్టి సాంగత్యము ఆధ్యాత్మిక మైనందున మానవునికి దేవాదిదేవునితో ప్రత్యక్ష సంబంధమును కలుగజేయును. తద్ద్వారా శ్రీకృష్ణుని కృపచే మానవునికి శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని అవగాహన కాగలదు. సత్సాంగత్యముచే కృష్ణచైతన్యము నందు క్రమముగా వృద్ధినొందిన వ్యక్తి శ్రీకృష్ణుని విస్మరించుటచేతనే తాను భౌతిక ప్రకృతి నియమములచే బంధింపబడినట్లు గ్రహింపగలుగును. కృష్ణచైతన్యమును పునరుద్ధరించుకొనుటకు మానవజన్మము చక్కని అవకాశ మైనందున, దానిని దేవాదిదేవుని అవ్యాజకృపను పొందుటకు సంపూర్ణముగా ఉపయోగించ వలెనని కూడ అతడు నిశ్చయముగా తెలిసికొనును.

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, బ్రహ్మజ్ఞానము, పరమాత్మ జ్ఞానము, జన్మమృత్యు జరావ్యాధుల నుండి ముక్తి మరియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని భక్తియుక్త సేవలు అనెడి అనేక అంశములెన్నో ఈ అధ్యాయము నందు చర్చింప బడినవి. అయినను కృష్ణచైతన్యమున పురోభివృద్ధి సాధించినవాడు అనేక విధములైన పద్ధతులను లెక్కచేయక కృష్ణచైతన్య కార్యకలాపముల యందే ప్రత్యక్షముగా నెలకొనును.ఆ విధముగా అతడు శ్రీకృష్ణుని నిత్యదాసునిగా తన సహజ స్థితిని వాస్తవముగా పొందగలుగును. అట్టిస్థితిలో అతడు భక్తితో శ్రవణము, కీర్తనములను చేయుట యందు దివ్యానందమును పొందును. అట్లు చేయుట ద్వారా తన అవసరము లన్నియును సిద్ధించునను విశ్వాసమును పొందును. నిశ్చయముతో కూడిన అతని అట్టి శ్రద్ధయే 'దృఢవ్రతము' అని పిలువబడును. అదియే భక్తియోగకు లేక దివ్యప్రేమ యుక్తసేవకు ఆరంభమని సకల శాస్త్రములు తెలుపుచున్నవి. భగవద్గీత యందలి ఈ సప్తమాధ్యాయము అట్టి శ్రద్ధ యొక్క సారంశమై యున్నది.

**శ్రీమద్భగవద్గీత యందలి 'భగవద్విజ్ఞానము' అను సప్తమాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---

# అష్టమాధ్యాయము
# భగవత్ప్రాప్తి

**8.1**

**అర్జున ఉవాచ**

**కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పోరుషోత్తమ ।**
**అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే ॥**

## అనువాదము

**అర్జునుడు ప్రశ్నించెను : ఓ ప్రభూ! ఓ పురుషోత్తమా! బ్రహ్మమననేమి? ఆత్మ యననేమి? కామ్యకర్మలననేమి? భౌతిక సృష్టియననేమి? దేవతలననెవరు? దయతో ఇది నాకు వివరింపుము.**

## భాష్యము

ఈ అధ్యాయమున బ్రహ్మమననేమి? వంటి అర్జునుని వివిధ ప్రశ్నలకు శ్రీకృష్ణభగవానుడు సమాధానమిచ్చుచున్నాడు. కామ్యకర్మలు, భక్తియుక్త సేవ, యోగసిద్ధాంతములు, శుద్ధమైన భక్తియుక్త సేవను గూర్చి కూడ దీనియందు భగవానుడు వివరించుచున్నాడు. పరతత్త్వ మనునది బ్రహ్మముగా, పరమాత్మగా, భగవానునిగా చెప్పబడుచున్నదని శ్రీమద్భాగవతము (1.2.11) తెలుపుచున్నది. వాస్తవమునకు జీవాత్మయైన ప్రాణికూడ బ్రహ్మముగానే చెప్పబడుచుండును. దేహము, ఆత్మ, మనస్సు యనువానిగా అన్వయింపదగిన ఆత్మను గూర్చి కూడ అర్జునుడు తెలియగోరుచున్నాడు. వైదిక నిఘంటువు ననుసరించి ఆత్మ అనగా మనస్సు, ఆత్మ, దేహము, ఇంద్రియములనియు భావము.

ఇక్కడ అర్జునుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పురుషోత్తముడనియు, పరమ పురుషుడనియు సంబోధించెను. అనగా అతడు ఈ ప్రశ్నలను శ్రీకృష్ణుని ఒక మిత్రునిగా భావించి కాకుండ నిశ్చితమైన సమాధానము లొసగు సమర్థుడైన పరమ ప్రామాణికుని గాను, పరమపురుషుని గాను ఎరిగి ప్రశ్నించుచున్నాడు.

## 8.2

**అధియజ్ఞ: కథం కో ౖత దేహే స్మిన్మధుసూదన ।**
**ౖపయాణకాలే చ కథం జ్ఞేయో/సి నియతాత్మభి: ॥**

### అనువాదము

**ఓ మధుసూదనా! యజ్ఞౖపభువెవ్వరు? అతడు ఏ విధముగా దేహము నందు వసించుయుండును? భక్తియుక్త సేవ నందు నిలిచినవారు మరణ సమయమున నిన్నెట్లు ఎరుగజాలుదురు?**

### భాష్యము

'అధియజ్ఞ:' పదము ఇంౖదుని గాని, విష్ణువును గాని సూచింపవచ్చును. విష్ణువు ౖబాహ్మరుౖదాదులతో కూడిన ౖపధాన దేవతలలో ముఖ్యుడు. కార్యనిర్వాహక దేవతలలో ఇంౖదుడు ముఖ్యుడు. కనుకనే ఇంౖదుడు మరియు విష్ణువు ఇరువురును యజ్ఞములచే అర్చింపబడుదురు. కాని ఎవరు వాస్తవముగా యజ్ఞపతి మరియు భగవానుడు ఏ విధముగా జీవుని దేహములో వసించి యుండుననియు అర్జునుడు ౖపశ్నించుచున్నాడు.

ౖశీకృష్ణుడు మధువనెడి రాక్షసుని సంహరించి యున్నందున అర్జునుడు అతనిని ఇక్కడ 'మధుసూదన' అని సంబోధించుచున్నాడు. అర్జునుడు కృష్ణచైతన్యము గల భక్తుడగుట చేత వాస్తవమునకు అతని మనస్సునందు ఇట్టి సందేహములు ఉదయించకూడదు. కనుక ఈ సందేహములు రాక్షసుల వంటివి. ౖశీకృష్ణుడు రాక్షసులను సంహరించుటలో కడునేర్పరి. కనుక తన మనస్సులో ఉదయించుచున్న సందేహరూప రాక్షసులను అతడు నశింపజేయునని భావించి అర్జునుడు ఇక్కడ ఆ దేవాదిదేవుని 'మధుసూదన' అని సంబోధించుచున్నాడు.

జీవితమున మనము చేసినదంతయు మరణకాలమున పరీక్షింపబడుచుండుట చేత ఈ శ్లోకము నందలి 'ౖపయాణకాలే' అను పదము మిక్కిలి ౖపధానమైనది. నిరంతరము కృష్ణచైతన్యము నందు నెలకొనినవారిని గూర్చి ఎరుగుటలో అర్జునుడు మిక్కిలి ఆతురతను కలిగియున్నాడు. అంత్యకాలమున వారి స్థితి ఎట్లుండును? మరణసమయమున దేహకర్మలన్నియును కలతచెంది మనస్సు సరియైన స్థితిలో నిలువజాలకుండును. దేహపరిస్థితి కారణముగా కలతనొందిన మానవుడు భగవానుని స్మరింపలేకపోవచ్చును. కనుకనే మహాభక్తుడైన కులశేఖర మహారాజు : "ౖపియమైన ౖపభూ! నేనిపుడు పూర్తి ఆరోగ్యముతోనున్నాను. నా మనస్సనెడి రాజహంస నీ పాదపద్మనాళమును చేరగలిగి యుండుటచే, నేను శీౖఘమే మరణించుట ఉత్తమము" అని ౖపార్థించెను (ముకుందమాల స్తోౖతము,33). జలపక్షియైనట్టి హంస పద్మములలోనికి జొచ్చుకొని పోవుటలో వినోదము ననుభవించును. పద్మములందు ౖపవేశించుట దాని స్వభావసిద్ధమైన ౖకీడ. కనుకనే ఈ ఉపమానము ఇక్కడ వాడబడినది. కులశేఖర మహారాజు భగవానునితో : "హే ౖపభు! నా మనస్సు ఇప్పుడు కలతలు లేకుండ నిర్మలముగా నున్నది. నేను మిక్కిలి ఆరోగ్యముగా నున్నాను. కనుక నేను నీ పాదపద్మములను స్మరించుచు తక్షణమే మరణించినచో, నిశ్చయముగా నా భక్తియుక్త సేవ పరిపూర్ణము కాగలదు. కాని నేను నా సహజ మరణమునకై వేచియుండినచో అప్పుడు నా దేహకార్యము లన్నియును చెదిరిపోవుట చేతను నా గొంతు కఫముతో నిండిపోవుటచే నీ నామమును స్మరింపగలనో లేదో నేనెరుగజాలను. కనుక వెంటనే మరణించుటయే

ఉత్తమము" అని విన్నవించుకుంటున్నాడు. అట్టి మరణ సమయమున మానవుడు శ్రీకృష్ణుని పాదపద్మముల యందు మనస్సును ఎట్లు స్థిరముగా నిలుపగలుగునని అర్జునుడు ప్రశ్నించుచున్నాడు.

**8.3**

**శ్రీభగవానువాచ**

**అక్షరం బ్రహ్మ పరమం స్వభావో/ధ్యాత్మముచ్యతే ।**

**భూత భావోద్భవకరో విసర్గ: కర్మసంజ్ఞిత: ॥**

**అనువాదము**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : నాశరహితమును, గుణాతీతమైనట్టి జీవుడే బ్రహ్మమనియు మరియు అతని నిత్యస్వభావమే అధ్యాత్మమనియు చెప్పబడును. ప్రాణుల భౌతిక దేహోద్భవమునకు సంబంధించిన కార్యమే 'కర్మము' లేక కామ్యకర్మము అని చెప్పబడుచున్నది.**

**భాష్యము**

బ్రహ్మము నాశరహితమును మరియు శాశ్వతము. దాని సహజస్థితి యందు ఎన్నడును ఎట్టి మార్పు ఉండదు. అట్టి బ్రహ్మమునకు అతీతముగా నున్నదే పరబ్రహ్మము. బ్రహ్మము జీవుని సూచింపగా పరబ్రహ్మము దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సూచించును. అట్టి జీవుడు భౌతిక జగత్తునందు స్వీకరించెడి స్థితి అతని నిజస్థితికి భిన్నమైనది. భౌతిక చైతన్యములో అతడు భౌతిక ప్రకృతిపై ఆధిపత్యము వహించుటకు, ప్రభువుగా మారుటకు యత్నించినను, ఆధ్యాత్మిక చైతన్యములో అనగా కృష్ణచైతన్యము నందు దేవాదిదేవుని సేవించుటయే అతని స్థితి. అట్టి భౌతిక చైతన్యము నందున్నంత కాలము అతడు భౌతిక జగత్తున వివిధ దేహములను పొందవలసివచ్చును. అదియే భౌతిక చైతన్యపు ప్రభావము వలన కలిగెడి వైవిధ్యముతో కూడిన సృష్టి లేదా కర్మము అనబడును.

వైదిక సారస్వతము నందు జీవుడు జీవాత్మగా మరియు బ్రహ్మముగా చెప్పబడెనే గాని పరబ్రహ్మముగా ఎన్నడును చెప్పబడలేదు. అట్టి జీవుడు కొన్నిమార్లు తమోమయమైన భౌతిక చైతన్యముతో తాదాత్మ్యము చెంది తాను జడపదార్థమేనని భావించును. మరికొన్నిమార్లు ఉన్నతమైన ఆధ్యాత్మికశక్తితో తాదాత్మ్యము చెంది తాను పరాప్రకృతియేనని గుర్తించుచుండును. ఈ విధముగా అతడు వివిధ స్థితులను పొందుచుండును. కనుకనే జీవాత్మ భగవానుని 'తటస్థశక్తి'గా పిలువ బడును. జీవాత్మ భౌతిక లేక ఆధ్యాత్మిక ప్రకృతులతో తనకున్న తాదాత్మ్యము ననుసరించి, అతడు భౌతిక దేహమును గాని లేదా ఆధ్యాత్మిక దేహమును గాని పొందుచుండును. భౌతిక ప్రకృతిలో అతడు ఎనుబది నాలుగు లక్షల జీవ జాతులలోని ఏదేని ఒక జన్మను పొందినను ఆధ్యాత్మిక స్వభావమున మాత్రము ఒకే ఆధ్యాత్మిక దేహమును కలిగియుండును. భౌతిక ప్రకృతిలో అతడు కొన్నిమార్లు తన కర్మననుసరించి మానవునిగా, దేవతగా, జంతువుగా, పక్షిగా వ్యక్తమగు చుండును. కాని భౌతికములైన స్వర్గలోకములను పొంది అక్కడి సౌకర్యముల ననుభవించుటకు అతడు కొన్నిమార్లు యజ్ఞముల నాచరించు చుండును.

కాని తన పుణ్యఫలము నశించినంతనే తిరిగి భూమిపై మానవరూపమున జన్మించు చుండును. ఇదియే 'కర్మము' అనబడును.

వైదిక యజ్ఞవిధానమును 'ఛాందోగ్యోపనిషత్తు' (పంచాగ్నివిద్యా) వివరించు చున్నది. దానిప్రకారము యజ్ఞవేదిక పై పంచాగ్నుల యందు ఐదు రకములైన ఆహుతులు చేయబడును. స్వర్గలోకములు, మేఘములు, భూమి, పురుషుడు, స్త్రీ యనునవి పంచాగ్నులుగా భావింపబడును. శ్రద్ధ, చంద్రుడి పైన భోక్త, వర్షము, ధాన్యము, వీర్యము, లనునవి పంచాహుతులుగా భావింపబడును.

యజ్ఞాచరణ విధానములందు జీవుడు ప్రత్యేక స్వర్గలోకములను పొందుటకై ప్రత్యేక యజ్ఞముల నొనరించి, తత్ఫలితముగా వాటిని పొందుచుండును. కాని యజ్ఞఫలము నశించినంతనే జీవాత్మలు వర్షపు చినుకుల యందు ప్రవేశించి భూమిని చేరి తరువాత దాన్యరూపమును పొందును. ఈ ధాన్యములు మానవులచే భుజింపబడి పిదప వీర్యరూపమును పొంది స్త్రీ గర్భమున చేరి తిరిగి మానవదేహమును పొందును. మానవజన్మలో జీవాత్మ తిరిగి యజ్ఞము నాచరించుచు ఈ చక్రమును కొనసాగించు చుండును. ఈ విధముగా జీవాత్మ భౌతిక మార్గము నందు శాశ్వతముగా రాకపోకలు సల్పుచుండును. కాని కృష్ణచైతన్యవంతుడైన వ్యక్తి అట్టి యజ్ఞములను పరిహరించును. అతడు ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము నందు నెలకొని భగవద్ధామమును చేరుటకు యత్నించును.

భగవద్గీతకు వ్యాఖ్యానమును రచించు కొందరు నిరాకారవాదులు భౌతిక జగత్తు నందు పరబ్రహ్మము జీవరూపము దాల్చునని అయుక్తముగా వాదించుచు, తమ వాదమును సమర్థించుటకు గీతయందలి పంచదశాధ్యాయపు ఎడవ శ్లోకమును ఉదాహరింతురు. కాని ఆ శ్లోకము నందు భగవానుడు 'జీవి నా నిత్యమైన అంశము' అని కూడ చెప్పుచున్నాడు. అట్టి భగవానుని అంశయైన ప్రాణి భౌతిక జగత్తునకు పతనము చెందవచ్చును. గాని భగవానుడెన్నడును అట్లు పతనము నొందదు(అచ్యుతుడు). కనుకనే పరబ్రహ్మము జీవుని రూపమును పొందుననెడి భావము అంగీకార్యము కాదు. బ్రహ్మము (జీవుడు) పరబ్రహ్మము కంటెను (దేవాదిదేవునికి) భిన్నుడని వైదిక వాఙ్మయమునందు తెలుపబడిన విషయమును జ్ఞప్తి యందుంచుకొనుట అత్యంత ముఖ్యము.

**8.4**

**అధిభూతం క్షరో భావ: పురుషశ్చాధిదైవతమ్ ।**

**అధియజ్ఞో హమేవాత్ర దేహే దేహభృతాం వర ॥**

**<u>అనువాదము</u>**

**ఓ దేహధారులలో శ్రేష్ఠుడా! నిత్యపరిణామశీలమైన భౌతిక ప్రకృతి అధిభూత మనబడును. సూర్యచంద్రుల వంటి సర్వదేవతలను కూడియుండెడి విశ్వరూపమే అధిదైవత మనబడును. దేహధారుల హృదయములో పరమాత్మ**

**రూపమున నిలిచియుండెడి దేవాదిదేవుడనైన నేనే అధియజ్ఞుడను (యజ్ఞప్రభువును).**

## భాష్యము

భౌతిక ప్రకృతి నిత్యపరిణామశీలమై యుండును. భౌతిక శరీరములు సాధారణముగా ఆరు దశలను పొందును. అవి పుట్టును, పెరుగును, కొంతకాలము నిలిచి యుండును, ప్రత్యుత్పత్తులను కావించును, క్షీణించును, చివరికి నశించును. అట్టి ఈ భౌతిక ప్రకృతియే 'అధిభూత' మనబడును. అది ఒక నిర్దిష్టమైన సమయమున సృష్టింపబడి మరొక నిర్దిష్ఠ సమయమున నశింపజేయబడును. సమస్త దేవతలును మరియు వారి సమస్త లోకములతోడను కూడిన భగవానుని విశ్వరూపమే 'అధిదైవత' మనబడును. దేహమునందు జీవాత్మతో పాటుగా భగవానుడైన శ్రీకృష్ణుని సంపూర్ణ ప్రాతినిధ్యమైన పరమాత్మ కూడ నిలిచియుండును. 'అధియజ్ఞుడు' అనబడుచు ఆ పరమాత్మయే హృదయము నందు నెలకొని యుండును. ఈ శ్లోకము నందలి 'ఏవ' అను పదము ప్రత్యేక ప్రాధాన్యమును కలిగియున్నది. ఎందుకనగా ఈ పదముచే భగవానుడు పరమాత్మ తనకంటే భిన్నుడు కాడని నొక్కి చెప్పుచున్నాడు. దేవాదిదేవుడైన పరమాత్మ జీవాత్మ చెంతనే నిలిచియుండి, జీవాత్మ చేయు కర్మలన్నింటికిని సాక్షిభూతుడై ఆత్మ యొక్క వివిధ చైతన్య భేదములకు కారణమగుచున్నాడు. పరమాత్మ జీవాత్మకు స్వతంత్రముగా వర్తించుటకు అవకాశమిస్తూ అతని కర్మలన్నింటికిని సాక్షియై యుండును. భగవానుని ఇట్టి వివిధ రూపములు మరియు సర్వకార్యము లనునవి దివ్యసేవ యందు నెలకొనిన కృష్ణచైతన్యవంతునికి సహజముగనే విదితము కాగలవు. పరమాత్మ స్వరూపమున వ్యక్తమగు పరమపురుషుని సమీపింపలేని నూతన అభ్యాసకుడు 'అధిదైవత' మనబడు భగవానుని బ్రహ్మాండమైన విశ్వరూపమును ధ్యానించును. కనుకనే అధోలోకములు పాదములుగను, సూర్యచంద్రులు నేత్రములుగను, శిరస్సు ఊర్ధ్వలోకములుగను పరిగణింపబడు 'విరాట్ పురుషుని' లేక విశ్వరూపమును ధ్యానింపవలెనని ఆరంభకునికి ఆదేశింప బడుచుండును.

## 8.5

**అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేవరమ్ ।**

**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥**

## అనువాదము

**అంత్యకాలమున కూడ నన్నే స్మరించుచు దేహమును విడుచువాడు తక్షణమే నా దివ్యభావమును పొందుచున్నాడు. ఈ విషయమున ఎట్టి సందేహము లేదు.**

## భాష్యము

కృష్ణచైతన్యపు ప్రాముఖ్యము ఈ శ్లోకము నందు నొక్కిచెప్పబడినది. కృష్ణచైతన్యముతో దేహమును వీడిన వారెవరైనను తక్షణమే దేవాదిదేవుని దివ్య భావమును పొందగలరు. దేవాదిదేవుడు విశుద్ధులలో విశుద్ధుడు. కనుక కృష్ణచైతన్యము నందు స్థిరముగా నెలకొనియుండెడి భక్తుడెవరైనను కూడ శుద్ధుడు కాగలడు. ఈ శ్లోకము నందు 'స్మరణ్' అను పదము మిక్కిలి ప్రధానమైనది. భక్తియుక్తసేవతో కృష్ణచైతన్యమును అభ్యసింపని అపరిశుద్ధాత్మునికి శ్రీకృష్ణుని స్మరించుట అసాధ్యము. కనుక మానవుడు

జీవితారంభము నుండియే కృష్ణచైతన్యమును అభ్యసింపవలెను. మానవుడు జీవితాంతమున విజయమును పొందగోరినచో దానికై శ్రీకృష్ణుని స్మరణ అనునది అత్యంత అవసరము. కనుక మానవుడు "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును నిరంతరము జపించుట మరియు కీర్తించుటను చేయవలెను. ప్రతియొక్కరును వృక్షము వలె గొప్ప ఓర్పును (తరోరివ సహిష్ణునా) కలిగి యుండవలెనని శ్రీ చైతన్య మహాప్రభువు ఉపదేశించి యుండిరి. కనుక 'హరే కృష్ణ' మహామంత్రమును జపించు వానికి ఎన్ని ఆటంకములు కలిగినను వాటినన్నింటిని అతడు సహిస్తూ, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రజపమును కొనసాగించినచో జీవితాంతమున కృష్ణ చైతన్యపు సంపూర్ణ ప్రయోజనమును అతడు నిశ్చయముగా పొందగలడు.

## 8.6

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేవరమ్ ।**

**తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావిత: ॥**

### అనువాదము

**ఓ కౌంతేయా! దేహమును త్యజించునపుడు మానవుడు ఏ భావమును స్మరించునో అదే భావమును అతడు నిశ్చయముగా పొందును.**

### భాష్యము

అత్యంత క్లిష్టమైన మరణ సమయమున మానవుడు తన భావమును మార్చుకొను విధానము ఇక్కడ వివరింపబడినది. జీవితాంతమున శ్రీకృష్ణుని స్మరించుచు శరీరమును విడుచు మానవుడు దేవాదిదేవుని దివ్యస్వభావమునే పొందగలడు. కాని శ్రీకృష్ణునకు అన్యమైన దానిని చింతించువాడు కూడ అట్టి స్థితిని పొందగలడనుట ఏమాత్రము సత్యము కాదు. ఈ విషయమును ప్రతియొక్కరు మిక్కిలి శ్రద్ధతో గమనించవలెను. కాని మనస్సు సరియైన స్థితి యందు నెలకొనియుండగా మరణించుట ఎట్లు సంభవము? ఉదాహరణకు భరత మహారాజు గొప్ప మహానుభావుడే అయినను అంత్యకాలమున ఒక జింకను స్మరించుట చేత తరువాతి జన్మమున జింక దేహమునకు పరిణామము చెందవలసి వచ్చెను. జింకదేహములో అతడు పూర్వజన్మ స్మృతిని కలిగి యున్నప్పటికిని, ఆ జంతు శరీరమునే అంగీకరింపవలసి వచ్చెను. మానవుని జీవిత కాలమున కలిగిన ఆలోచనలే ప్రోగుపడి మరణ సమయమున మానవుని ఆలోచనలను ప్రభావితము చేయును కనుక ప్రస్తుత జీవితమే తరువాతి దేహమును తయారు చేయుచున్నదని చెప్పవచ్చును. మానవుడు ప్రస్తుత జన్మమున సత్త్వగుణము నందు నెలకొని సదా శ్రీకృష్ణుణ్ణే స్మరించుటను అభ్యసించినచో జీవితాంతమున శ్రీకృష్ణుని స్మరించుట ఎవరికైనను సాధ్యపడును. అదియే శ్రీకృష్ణుని దివ్య స్వభావమును (ధామమును) పొందుటకు తోడ్పడును. మానవుడు దివ్యమైన శ్రీకృష్ణుని సేవయందు పూర్తిగా నెలకొనినచో అతని తరువాతి జన్మము భౌతికము కాకుండ ఆధ్యాత్మికమే కాగలదు. కనుక అంత్యకాలమున మానవుని స్థితిని జయప్రదముగా మార్చుటకు, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్ర జపకీర్తనమే అత్యుత్తమ విధానమై యున్నది.

## 8.7

**తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనో బుద్ధిర్మామేవైష్యస్యసంశయ: ॥**

### అనువాదము

**అందుచే, ఓ అర్జునా! సర్వకాలముల యందును నీవు నన్నే (శ్రీకృష్ణుని) స్మరించుచు నీ విధ్యుక్త ధర్మమైన యుద్ధము నొనరింపుము. నీ కర్మలను నాకు అర్పించుట ద్వారా మరియు నీ మనోబుద్ధులను నా యందు స్థిరముగా నిలుపుట ద్వారా నీవు నిస్సందేహముగా నన్ను పొందగలవు.**

### భాష్యము

శ్రీకృష్ణుడు అర్జునునకు చేసిన ఈ ఉపదేశము కామ్యకర్మల యందు మునిగియుండెడి మానవులందరికి అత్యంత ముఖ్యమైనది. మానవుని తన విధ్యక్త ధర్మములను లేదా కర్మలను త్యజించుమని భగవానుడిక్కడ తెలుపుట లేదు. అనగా వాటిని కొనసాగించుచునే 'హరేకృష్ణ' మహామంత్ర జపకీర్తనముల ద్వారా శ్రీకృష్ణుని స్మరింపవలెను. ఈ పద్ధతి మానవుని భౌతిక కాలుష్యముల నుండి విముక్తుని చేసి, మనోబుద్ధులను శ్రీకృష్ణుని యందు సంలగ్నము కావించును. దివ్యమైన శ్రీకృష్ణుని నామమును కీర్తించుట ద్వారా మానవుడు నిస్సందేహముగా దివ్యలోకమైన కృష్ణధామమును చేరగలడు.

## 8.8

**అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్ ॥**

### అనువాదము

**ఓ పార్థా! మనస్సును సదా నా స్మరణము నందే నియుక్తముజేసి ఏ మాత్రము మార్గము తప్పక నన్నే దేవాదిదేవునిగా ధ్యానించువాడు తప్పక నన్ను చేరగలడు.**

### భాష్యము

ఈ శ్లోకమునందు శ్రీకృష్ణభగవానుడు తన స్మరణ ప్రాముఖ్యమును నొక్కిచెప్పుచున్నాడు. అట్టి శ్రీకృష్ణుని స్మరణశక్తి 'హరే కృష్ణ' మహామంత్ర జపకీర్తనముల ద్వారా మానవుని హృదయము నందు జాగృతము చేయబడును. అట్టి శ్రీకృష్ణుని నామము యొక్క శ్రవణ కీర్తనముల యందు మానవుని కర్ణములు, జిహ్వ, మనస్సు సంపూర్ణముగా నెలకొనుచున్నందున ఈ యౌగిక ధ్యానమును అభ్యసించుట చాలా సులభము. ఇట్టి ధ్యానము పరమపురుషుని పొందుటకు తోడ్పడగలదు. 'పురుషమ్' అనగా భోక్త. జీవులు భగవానుని 'తటస్థశక్తి'కి చెందిన వారైనను వారు భౌతిక కల్మషములతో కూడుకొనియున్నారు. వారు తమనుతామే భోక్తలమని భావించినను వాస్తవమునకు వారు పరమభోక్తలు కాజాలరు. దేవాదిదేవుడే తన వివిధావతారము లందును, నారాయణ, వాసుదేవాది స్వాంశ రూప విస్తరణము లందును పరమభోక్తయని ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది.

భక్తుడు 'హరేకృష్ణ' మహామంత్ర జపకీర్తనలను చేయుచు తన ఆరాధనకు లక్ష్యమైన భగవానుని నారాయణ, కృష్ణ, రామాది ఏ రూపము లోనైనా నిరంతరము స్మరింపవచ్చును. ఈ అభ్యాసము అతనిని పవిత్రుని చేయగలదు. నిరంతర జపకీర్తనల వలన అతడు అంత్యకాలమున భగవద్ధామమునకు బదిలీ చేయ బడును. యోగాభ్యాసము నందు అంతరంగము నందు నెలకొనిన పరమాత్మను ధ్యానించినట్లే 'హరేకృష్ణ' జపకీర్తనము ద్వారా మానవుడు తన మనస్సును సదా భగవానుని యందు నిలుపవలెను. మనస్సు సదా చంచలమైనది. కనుక దానిని బలవంతముగా నైనను శ్రీకృష్ణుని స్మరించునట్లు చేయుట అత్యంత అవసరము. గొంగళిపురుగు తాను భ్రమరమును కావలెనని సదా తలంచుచు అది ఈ ప్రస్తుత జన్మము నందే భ్రమరముగా మారు వృత్తాంతము ఇక్కడ సాధారణముగా ఉదాహరింపబడును. అట్లే మనము నిరంతరము శ్రీకృష్ణుని స్మరించినచో జీవితాంతమున శ్రీకృష్ణుని వంటి దేహస్వభావమును పొందుట నిశ్చయము.

## 8.9

**కవిం పురాణమనుశాసితారమణోరణీయాంసమనుస్మరేద్య: ।**

**సర్వస్య ధాతారమచిన్త్యరూపమాదిత్యవర్ణం తమస: పరస్తాత్ ॥**

### అనువాదము

**సర్వజ్ఞుడుగను, అతి ప్రాచీనుడుగను, శాసించువాడుగను, అణువుకంటె మిక్కిలి సూక్ష్మమైనవాడుగను, సర్వమును పోషించువాడుగను, భౌతిక భావాతీతుడుగను, ఊహింపశక్యము కాని రూపము గలవానిగను సదా దివ్యరూపుడుగను పరమపురుషుని స్మరింపవలెను. సూర్యుని వలె తేజస్సు గలవాడును, దివ్యుడును అగు అతడు భౌతిక ప్రకృతికి అతీతుడు.**

### భాష్యము

ఈ శ్లోకమున దేవాదిదేవుని స్మరించు విధానము తెలుపబడినది. ముఖ్యమైన విషయమేమనగా, అతడు నిరాకారుడో లేక శూన్యుడో కాడు. నిరాకారమైనట్టి, శూన్యమైనట్టి దానిని ఎవ్వరును ధ్యానింపజాలరు. అది మిక్కిలి కష్టము. కాని శ్రీకృష్ణుని స్మరించు విధానము మిక్కిలి సులభమైనది. అదే ఇక్కడ వాస్తవముగా పేర్కొనబడినది. మొట్టమొదట మనము భగవానుడు పురుషుడని (రూపసహితుడని) ఎరుగవలెను. మనము శ్రీరాముని గాని శ్రీకృష్ణుని గాని పరమ పురుషులుగానే ధ్యానింపవలెను. ఎవరైనను శ్రీరాముని స్మరించినను శ్రీకృష్ణుని స్మరించినను అతడెట్లుండునో భగవద్గీత యందలి ఈ శ్లోకము నందు వర్ణింపబడినది. భగవానుడు 'కవి' అని ఇక్కడ వర్ణింపబడెను. అనగా అతడు భూత, భవిష్యత్తు, వర్తమానముల నెరుగును. కనుకనే సర్వజ్ఞుడు. సర్వమునకు మూల కారణమగుటచే అతడే పురాణపురుషుడు. సర్వము అతని నుండియే ఉద్భవించినది. అతడు విశ్వమునకు పరమ నియంత్రకుడు. మానవ సమాజమునకు పోషకుడు, శిక్షకుడు అతడే. అతడు సూక్ష్మాతి సూక్ష్మమైనవాడు. ఆత్మ అనునది వెంట్రుక కొనలో పదివేలవవంతు రూపమును దాల్చియుండును. కాని భగవానుడు ఈ సూక్ష్మాంశము యొక్క హృదయము నందు కూడ ప్రవేశించుటచే అతడు

ఊహించుటకు వీలులేనంతటి సూక్ష్మమైనవాడు. కనుకనే అతడు అణువుకంటెను మిక్కిలి సూక్ష్మమైనవాడని చెప్పబడియున్నాడు. దేవాదిదేవుడుగా అతడు అణువు నందును మరియు అతిసూక్ష్మమైనట్టి దాని హృదయ మందును ప్రవేశించి పరమాత్మగా దానిని నియంత్రించు చుండును. అతి సూక్ష్మమైనను అతడు సర్వవ్యాపకుడై సమస్తమును పోషించుచున్నాడు. అతని వలననే గ్రహమండలము లన్నియును పాలింపబడుచున్నవి. పెద్ద పెద్ద గ్రహములు సులభముగా అంతరిక్షము నందు ఎట్లు తేలుచున్నవని మనము తరచుగా ఆశ్చర్యపడు చుందుము. వాస్తవమునకు దేవాదిదేవుడే తన అచింత్యశక్తిచే అతి పెద్ద గ్రహములను మరియు నక్షత్ర మండలమును నిల్పుచున్నాడని ఇక్కడ చెప్పబడినది. కనుకనే, ఈ సందర్భమున 'అచింత్యము' అను పదము మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొన్నది. భగవానుని శక్తి మన ఆలోచనాపరిధికి, భావనకు అతీతమగుట చేతనే అచింత్యమను పదము ఎంతో ముఖ్యమైనది. వాస్తవమునకు ఈ విషయమును గూర్చి ఎవరు చర్చింపగలరు? అతడు ఈ భౌతిక జగత్తు నంతటిని వ్యాపించి యున్నను దానికి అతీతుడై యుండెను.ఆధ్యాత్మిక జగత్తుతో పోల్చిచూచినచో అతిస్వల్పమైనట్టి ఈ భౌతిక జగత్తును గూర్చి కూడ మనము అర్థము చేసికొనజాలము. కనుక దానికి అతీతమైన దానిని మనమెట్లు అర్థము చేసికొనగలము? కనుక 'అచింత్యము' అనగా ఈ భౌతిక జగత్తునకు అతీతమైనది మరియు మన హేతువాదమునకు, తర్కమునకు, తాత్త్విక భావనాకల్పనలకు అందనిదని అర్థము. కనుక వివేకవంతులు వ్యర్థవాదములను, ఊహాగానాలను త్యజించి, వేదములు, భగవద్గీత, శ్రీమద్భాగవతము వంటి ధర్మగ్రంథములందు తెలుపబడిన విషయములను అంగీకరించి అవి తెలుపు సిద్ధాంతముల ననుసరింప వలెను. అదియే మానవునికి సరియైన అవగాహన శక్తినొసగును.

## 8.10

**ప్రయాణకాలే మనసాచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।**

**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్ ॥**

### అనువాదము

**మరణ సమయమున ప్రాణ వాయువును భ్రూమధ్యమున నిలిపి, యోగశక్తిచే చలించని మనస్సుతో సంపూర్ణ భక్తిభావముతో దేవాదిదేవుని స్మరించెడివాడు తప్పక పరమపురుషుని పొందగలడు.**

### భాష్యము

మరణసమయమున మనస్సు భక్తితో దేవాదిదేవునిపై నెలకొని యుండ వలెనని ఈ శ్లోకమున స్పష్టముగా చెప్పబడినది. యోగను అభ్యసించువారు ప్రాణవాయువును కనుబొమ్మల నడుమకు('ఆజ్ఞాచక్రము'నకు) చేర్చవలెనని ఇక్కడ ఆదేశింపబడినది. ఆ విధముగా షట్ చక్రముల పై ధ్యానముతో కూడిన 'షట్చక్రయోగ' ఇక్కడ సూచింపబడుచున్నది. శుద్ధభక్తుడు అట్టి షట్చక్ర యోగమును అభ్యసింపడు. కాని అతడు సర్వాదా కృష్ణచైతన్యము నందు నెలకొని యుండుటచే మరణకాలము నందును దేవాదిదేవుని కృపచేతనే అతనిని స్మరింపగలుగును. ఈ విషయము పదునాలుగవ శ్లోకమున స్పష్టముగా వివరింపబడినది.

ఈ శ్లోకమున 'యోగబలేన' అను పదమునకు ప్రత్యేక ప్రాధాన్యత కలదు. ఎందుకనగా 'షట్చక్రయోగ'ను గాని భక్తియోగను గాని అభ్యసింపకుండ మరణ సమయమున ఎవ్వరును ఇట్టి ఆధ్యాత్మిక స్థితిని పొందజాలరు. ఎవ్వరును మరణ సమయమున హఠాత్తుగా దేవాదిదేవుని స్మరింపజాలరు. అతడు ఏదియో ఒక యోగవిధానమును (ముఖ్యముగా భక్తియోగమును) అభ్యసించియే తీరవలెను. మరణ సమయమున మనస్సు ఎంతగానో కలత చెందియుండును గనుక మానవుడు జీవితకాలము నందు యోగద్వార ఆధ్యాత్మిక స్థితిని అభ్యసింపవలెను.

## 8.11

**యదక్షరం వేదవిదో వదన్తి విశన్తి యద్యతయో వీతరాగాః ।**
**యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥**

### అనువాదము

**వేదముల నెరిగినవారును, ఓంకారమును ఉచ్చరించువారును, సన్న్యాసాశ్రమము నందున్న గొప్ప మహర్షులును బ్రహ్మమును పొందుదురు. అట్టి పరిపూర్ణత్వమును కోరువారు బ్రహ్మచర్యవ్రతము నభ్యసింతురు. దేనివలన వారు మోక్షమును పొందుదురో ఆ విధానమును నేను ఇప్పుడు నీకు సంగ్రహముగా వివరింతును.**

### భాష్యము

శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు ప్రాణవాయువును కనుబొమ్మల నడుమ నిలుపు 'షట్చక్ర' యోగాభ్యాసమును ఉపదేశించి యుండెను. అర్జునునకు ఆ 'షట్చక్ర' యోగను ఎట్లు అభ్యసింపవలెనో తెలియదని భావించి రాబోవు శ్లోకము లందు భగవానుడు ఆ విధానమును వివరింపనున్నాడు. పరబ్రహ్మము అద్వితీయు డైనను వివిధ వ్యక్తరూపములను మరియు లక్షణములను కలిగియుండునని భగవానుడు చెప్పుచున్నాడు. ముఖ్యముగా నిరాకారవాదులకు 'అక్షరము' అనగా ఓంకారము, పరబ్రహ్మముతో సమానము. శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ వైరాగ్యముతో కూడిన మునులు ప్రవేశించు నిరాకారబ్రహ్మమును గూర్చి వివరించుచున్నాడు.

వైదిక విజ్ఞాన మార్గము నందు ఓంకారమును జపించుట మరియు సంపూర్ణ బ్రహ్మచర్యమున ఆధ్యాత్మికాచార్యుని చెంత నివసించుచు నిరాకార బ్రహ్మమును గూర్చి ఎరుగుట శిష్యులకు ఆది నుండియే బోధింపబడును. ఆ విధముగా వారు బ్రహ్మము యొక్క రెండు లక్షణములను గ్రహింతురు. ఆధ్యాత్మిక జీవితమున ప్రగతిని సాధించుటకు సాధకునకు ఇట్టి అభ్యాసము అత్యంత అవసరము. నేటికాలమున అట్టి బ్రహ్మచర్య జీవితము సాధ్యము కాదు. ప్రపంచ సాంఘిక వ్యవస్థ పూర్తిగా మారిపోవుట చేత సాధకునకు జీవితారంభము నుండియే బ్రహ్మచర్యమును అభ్యసించుట సాధ్యము కాకున్నది. ప్రపంచ మంతటను వివిధ విజ్ఞానశాఖలతో కూడిన పలు సంస్థలున్నప్పటికిని సాధకులకు బ్రహ్మచర్య నియమములను బోధించు ప్రామాణిక సంస్థ ఒక్కటియు లేదు. అట్టి బ్రహ్మచర్యమును పాటింపకుండ ఆధ్యాత్మిక జీవన పురోగతిని సాధించుట మిక్కిలి కష్టము. కనుకనే కలియుగమునకు సంబంధించిన శాస్త్రనియమము ననుసరించి "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ

హరేరామ రామరామ హరేహరే” అని శ్రీకృష్ణుని పవిత్ర నామసంకీర్తన తప్ప దేవాదిదేవుని పొందుటకు మరొక మార్గము లేదని శ్రీ చైతన్య మహాప్రభువు ప్రకటించి యుండిరి.

## 8.12

**సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।**
**మూర్ధ్న్యాధాయాత్మన: ప్రాణమాస్థితో యోగధారణామ్ ॥**

### అనువాదము

**సర్వేంద్రియ కర్మల నుండి విడివడి యుండుటయే యోగస్థితి. సర్వేంద్రియ ద్వారములను మూసివేసి, మనస్సును హృదయము నందును, ప్రాణవాయువును శీర్షాగ్రము నందును నిలిపి మానవుడు యోగము నందు ప్రతిష్ఠితుడగును.**

### భాష్యము

యోగాభ్యాసమునకు మానవుడు మొట్టమొదట భోగేంద్రియ ద్వారముల నన్నింటిని మూసివేయవలెనని ఇక్కడ సూచింపబడుచున్నది. ఇట్టి అభ్యాసమునకే ‘ప్రత్యాహారము’ అనగా ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములను మరలించుట అని పేరు. జ్ఞానేంద్రియములైన నేత్రములు, కారణములు, నాసిక, జిహ్వ, స్పర్శ అనువానిని సంపూర్ణముగా నిగ్రహించి వానిని ఇంద్రియ తృప్తియందు నిమగ్నములు కాకుండ చేయవలయును. ఈ విధముగా మనస్సు హృదయము నందు గల పరమాత్మపై నెలకొని, ప్రాణవాయువు శీర్షాగ్రమునకు ఉద్ధరింపబడును. ఈ పద్ధతి షష్ఠాధ్యాయము నందు స్పష్టముగా వివరింపబడినది. కాని ఇదివరకే తెలుపబడినట్లు, ఈ యోగాభ్యాసము ప్రస్తుత యుగమునకు ఆచరణీయము కాదు. కలియుగమునకు కృష్ణచైతన్యమే ఏకైక ఉత్తమ మార్గము. మానవుడు భక్తియుక్త సేవ యందు శ్రీకృష్ణుని పైననే సదా మనస్సును కేంద్రీకరింప గలిగినచో అచంచలమైన సమాధిస్థితి యందు నెలకొనుట అతనికి మిక్కిలి సులభతరము కాగలదు.

## 8.13

**ఓం ఇత్యేకాక్షరం వ్యాహరన్మామనుస్మరన్ ।**
**య: ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥**

### అనువాదము

**ఇట్టి యోగవిధానము నందు నెలకొని దివ్యాక్షరముల సమాహారమైన ఓంకారమును ఉచ్చరించిన పిదప యోగి దేవాదిదేవుడనైన నన్ను స్మరించుచు దేహమును త్యజించినచో నిశ్చయముగా ఆధ్యాత్మిక లోకములను పొందగలడు.**

## భాష్యము

ఓంకారము, బ్రహ్మము, శ్రీకృష్ణభగవానుడును అభిన్నులని ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. 'ఓం' అనునది శ్రీకృష్ణుని నిరాకారశబ్ద రూపమే. కాని 'హరేకృష్ణ' అను మహామంత్ర ధ్వనిలో 'ఓం' కలదు. 'హరేకృష్ణ' మహామంత్ర జపమే ఈ యుగమునకు ప్రత్యేకముగా ఆదేశింపబడినది. కనుకనే జీవితాంతమున మానవుడు "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అను మహామంత్రమును జపిస్తూ దేహమును విడిచినచో, తన అభ్యాసము ననుసరించి అతడు ఆధ్యాత్మిక లోకము లందు ఎదియోనొక దానిని తప్పక పొందును. కృష్ణభక్తులు కృష్ణలోకమైన గోలోక వృందావనమున ప్రవేశింతురు. ఆధ్యాత్మిక జగత్తునందు ఇంకను వైకుంఠ లోకములని తెలియబడు అనేక లోకములు సాకారవాదుల కొరకై గలవు. కాని నిరాకారవాదులు మాత్రము చివరికి 'బ్రహ్మజ్యోతి' యందే లీనమగుదురు.

## 8.14

**అనన్యచేతా: సతతం యో మాం స్మరతి నిత్యశ: ।**

**తస్యాహం సులభ: పార్థ నిత్యయుక్తస్య యోగిన: ॥**

## అనువాదము

**ఓ పార్థా! అనన్య చిత్తముతో నన్ను స్మరించువానికి, అతని నిరంతర భక్తియుక్త సేవ కారణమున నేను సులభముగా లభ్యుడనై యున్నాను.**

## భాష్యము

దేవాదిదేవుని భక్తియోగముతో సేవించు శుద్ధభక్తులు పొందు పరమ గమ్యమును ఈ శ్లోకమున ముఖ్యముగా వివరించుచున్నది. గడిచిన అధ్యాయపు శ్లోకము లందు ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులనెడి నాలుగు రకములైన భక్తులు పేర్కొనబడిరి. కర్మయోగము, జ్ఞానయోగము, హఠయోగము వంటి వివిధ ముక్తి విధానములు కూడ వివరింపబడినవి. ఈ యోగవిధానములు భక్తిని కొద్దిగా కలిగియున్నను, ఈ శ్లోకము నందు ప్రత్యేకించి జ్ఞాన, కర్మ, హఠాది ఎట్టి మిశ్రణములేని శుద్ధభక్తి యోగమును ప్రత్యేకించి పేర్కొనబడినది. 'అనన్యచేతా:' అను పదముతో సూచింపబడినట్లు శుద్ధభక్తి యోగము నందు భక్తుడు శ్రీకృష్ణుని తప్ప మరిదేనిని వాంఛింపడు. 'బ్రహ్మజ్యోతి' నందు ఐక్యము కావలెనని గాని, భవబంధముల నుండి విముక్తిని పొందవలెనని గాని, మరిదేనిని గాని శుద్ధభక్తుడు వాంఛింపడు. కనుకనే 'శ్రీ చైతన్య చరితామృతము' (మధ్యలీల 19.149) నందు శుద్ధబక్తుడు 'నిష్కాముడు'గా పిలువబడెను. అనగా స్వలాభము కొరకు ఎట్టి వాంఛను కలిగి యుండడు. పరమశాంతి అతనికే తప్ప స్వార్థలాభము కొరకు యత్నించు వారికి లభింపదు. జ్ఞాన, కర్మ లేదా హఠయోగులు ఏదియో కొంత స్వార్థమును కలిగి యున్నను శుద్ధభక్తుడు దేవాదిదేవుని ప్రియమునకు అన్యమైన దేనిని కోరడు. కనుకనే తన పట్ల నిశ్చలమైన భక్తి గల వారికి తాను సులభముగా లభింతునని భగవానుడు తెలియజేయుచున్నాడు.

శుద్ధభక్తుడు సదా శ్రీకృష్ణునకు గల వివిధ రూపములలో ఏదేని ఒకదాని ద్వారా భక్తియుక్త సేవ యందు నెలకొని యుండును. శ్రీకృష్ణునకు శ్రీరాముడు, నృసింహుడు

వంటి స్వాంశరూపములు మరియు అవతారములు అనేకము కలవు. దేవాదిదేవుని ఈ దివ్యరూపములలో ఏదియో ఒకదాని యందు ప్రేమతో కూడిన భక్తియుక్తసేవతో భక్తుడు తన మనస్సును నెలకొల్పవచ్చును. ఇతర యోగాభ్యాసకులు పొందు వివిధ కష్టములను అటువంటి భక్తుడు ఎన్నడును పొందడు. భక్తియోగము మిక్కిలి సరళము, పవిత్రము, సులభము, ఎవ్వరైనను 'హరేకృష్ణ' మహామంత్ర జపముతో అట్టిభక్తిని ఆరంభింపవచ్చును. భగవానుడు అందరిపట్ల దయను కలిగియుండును. కాని ఇదివరకే వివరింపబడినట్లు, అచంచలమైన మనస్సుతో తనను సర్వదా సేవించు వారి పట్ల అతడు ప్రత్యేకమైన దయను చూపుచుండును.అట్టి భక్తులకు అతడు అనేక విధములుగా తోడ్పడు చుండును. కనుకనే సంపూర్ణ శరణాగతుడు, దేవాదిదేవుని భక్తియుక్త సేవ యందు నెలకొనినవాడు దేవాదిదేవుని యథార్థముగా ఎరుగగలడని 'కఠోపనిషత్తు' (1.2.23)తెలుపుచున్నది: "యమేవైష వృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్." అట్లే భగవద్గీత (10.10) యందు చెప్పబడినట్లు, భక్తుడు అంత్యమున తన ధామమును పొందగలుగునట్లుగా భగవానుడు అట్టి భక్తునకు తగిన బుద్ధిని ప్రసాదించును(దదామి బుద్ధియోగం తమ్).

శుద్ధభక్తుని ప్రత్యేక లక్షణమేమనగా అతడెప్పుడును నిశ్చలమైన భక్తితో దేశకాల పరిస్థితులను పట్టించుకొనక శ్రీకృష్ణునినే సదా స్మరించుచుండును. భక్తుడైన వాని భక్తియందు ఎట్టి అవరోధములు కలగకూడదు. అతడు ఏ ప్రదేశమందైనను, ఏ కాలమందైనను తన సేవను నిర్వహింప సమర్థుడై యుండవలెను. వృందావనము లేదా శ్రీకృష్ణభగవానుడు లీలలనొనర్చిన ఏదేని పుణ్యక్షేత్రము నందు నివసింపవలెనని కొందరు పలికినను, వాస్తవమునకు శుద్ధభక్తుడు ఏ ప్రదేశము నందు నివసించినను, అతడు తన భక్తియుక్తసేవా బలముతో తాను నివసించు ప్రదేశము నందే వృందావన వాతావరణమును సృష్టించుకొనగలడు. శ్రీ అద్వైతాచార్యుడు శ్రీ చైతన్య మహాప్రభువుతో : "హే ప్రభూ! నీవెచ్చట నుందువో అచ్చటనే వృందావన ముండును" అని పలికిరి.

'సతతమ్' (ఎల్లప్పుడు) మరియు 'నిత్యశః'(నిత్యము లేక ప్రతిరోజు) అను పదములతో తెలుపబడినట్లు శుద్ధభక్తుడు సర్వదా శ్రీకృష్ణునే స్మరించుచు ధ్యానించు చుండును. ఇవియే శుద్ధభక్తుని లక్షణములు. అట్టివారికి భగవానుడు సులభముగా లభ్యుడగును. కనుకనే అన్నియోగముల కంటెను భక్తియోగమే ఉత్తమమని భగవద్గీత ఆదేశించుచున్నది. సాధారణముగా భక్తియోగులు ఐదురకములుగా భక్తియుక్త సేవను చేయుచుందురు. 1. శాంతభక్తుడు : శాంతరసముతో భక్తియుక్త సేవ యందు నెలకొనినట్టివాడు; 2. దాస్యభక్తుడు : దాసునిగా భక్తియుక్తసేవ యందు నెలకొనినట్టివాడు; 3. సఖ్యభక్తుడు : మిత్రునిగా సేవించువాడు; 4. వాత్సల్య భక్తుడు : తల్లిదండ్రుల వలె సేవించువారు; 5. మాధుర్యభక్తుడు : మాధుర్య భావముతో ప్రియురాలిగా సేవించెడివాడు. ఈ మార్గము లన్నింటిలోను, శుద్ధభక్తుడు దేవాదిదేవుని దివ్యసేవ యందు నిరంతరము నెలకొనియుండి అతనిని విస్మరింపకుండును. కనుక అతనికి భగవానుడు అత్యంత సులభముగా లభింపగలడు. అట్టి శుద్ధభక్తుడు దేవాదిదేవుని క్షణమైనను విస్మరింపజాలడు. అట్లే దేవాదిదేవుడు కూడ శుద్ధభక్తుని క్షణమైనను విస్మరింపడు. కృష్ణచైతన్య విధానమున, "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అను మహామంత్ర జపకీర్తనల వలన కలుగు గొప్ప వరము ఇదియే.

## 8.15

**మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమ శాశ్వతమ్ ।**
**నాప్నువన్తి మహాత్మాన: సంసిద్ధిం పరమాం గతా: ॥**

## అనువాదము

**భక్తియోగులైన మహాత్ములు నన్ను పొందిన పిమ్మట అత్యున్నతమైన సంసిద్ధిని పొందిన వారగుటచే దుఃఖాలయమైన ఈ అనిత్య జగత్తునకు ఎన్నడును తిరిగిరారు.**

## భాష్యము

అనిత్యమైన ఈ భౌతికజగత్తు జన్మము, వార్ధక్యము, రోగము, మరణము లనెడి దుఃఖములచే నిండియున్నందున, సంసిద్ధిని పొంది దివ్య కృష్ణలోకమైన గోలోక వృందావనమును పొందిన మహాత్ముడు సహజముగానే ఈ లోకమునకు తిరిగి రాగోరడు. అట్టి దివ్యధామము 'అవ్యక్తము', 'అక్షరము', 'పరమగతి' అని వేదవాఙ్మయము నందు వర్ణింపబడినది. అనగా ఆ లోకము మన భౌతిక దృష్టికి అతీతమైనది మరియు అచింత్యమైనది. కాని అది పరమగతియై యుండి మహాత్ములకు అత్యున్నత గమ్యమై యున్నది. మహాత్ములైన వారు శుద్ధభక్తుల నుండి దివ్య సందేశములను గ్రహించుచు క్రమముగా కృష్ణచైతన్యముతో భక్తియుక్త సేవను పెంపొందించు కొనుచుందురు. వారు భగవత్సేవ యందు నెలకొని యుండుట చేత భౌతికమైనట్టి స్వర్గాది ఉన్నత లోకములను గాని, చివరికి వైకుంఠ లోకములను గాని వాంఛింపరు. వారు కేవలము శ్రీకృష్ణుని మరియు శ్రీకృష్ణుని సాంగత్యమును తప్ప అన్యమైన దేనిని వాంఛింపరు. వాస్తవమునకు అదియే జీవితపు అత్యున్నత పరిపూర్ణత్వము. ఈ శ్లోకము ముఖ్యముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని సాకారవాదులైనట్టి భక్తుల గూర్చియే ప్రత్యేకముగా ప్రస్తావించుచున్నది. అట్టి కృష్ణచైతన్యముతో కూడిన భక్తులు జీవిత సంసిద్ధిని పొందగలరు. అనగా వారే సర్వోన్నత జీవులగుదురు.

## 8.16

**ఆబ్రహ్మభువనాల్లోకా: పునరావర్తినో/ర్జున ।**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥**

## అనువాదము

**భౌతిక జగత్తు నందలి అత్యున్నత లోకము మొదలుకొని అత్యధమ లోకము వరకు గల సర్వలోకములు జన్మమృత్యుభరితమైన దుఃఖప్రదేశములే. కాని ఓ కౌంతేయా! నా లోకమును చేరినవాడు పునర్జన్మను పొందడు.**

## భాష్యము

కర్మయోగులు, జ్ఞానయోగులు, హఠయోగు లందరును శ్రీకృష్ణుని దివ్యధామమును చేరి పునరావృత్తి రహితులగుటకు పూర్వము భక్తియోగము నందు లేక కృష్ణచైతన్యమున పరిపూర్ణత్వమును పొందవలసి యుండును. దేవతా లోకములైనట్టి ఉన్నత లోకములను పొందినవారు కూడ జన్మమృత్యువులకు తిరిగి గురియగుచుందురు. భూలోకవాసులు

ఉన్నత లోకములకు ఉద్ధరింప బడునట్లుగనే బ్రహ్మలోకము, చంద్రలోకము, ఇంద్రలోకము వంటి ఉన్నత లోకములకు చెందిన వారు భూలోకమునకు పతనము చెందుచుందురు. ‘చాందోగ్యోపనిషత్తు’ నందు బ్రహ్మలోకమును ప్రాప్తింపజేసెడి ‘పంచాగ్నివిద్య’ అను యజ్ఞము ఉపదేశించబడినది. అట్టి యజ్ఞము ద్వారా మానవుడు బ్రహ్మలోకమును పొందినను, అక్కడ అతడు కృష్ణచైతన్యమును అలవరచుకొననిచో భూలోకమునకు తిరిగి రావలసి వచ్చును. ఉన్నత లోకములందు కృష్ణచైతన్యమును కొనసాగించువారు క్రమముగా మరింత ఉన్నతమైన లోకములకు ఉద్ధరింప బడుదురు. విశ్వప్రళయ కాలమునందు అతడు శాశ్వత ఆధ్యాత్మిక జగత్తును చేరును. శ్రీ బలదేవ విద్యభూషణుడు తమ భగవద్గీత భాష్యమున ఈ క్రింది శ్లోకమును ఉదహరించుచున్నాడు :

బ్రహ్మణా సహ తే సర్వే సమ్ప్రాప్తే ప్రతిసంచరే ।
పరస్యాన్తే కృతాత్మాన: ప్రవిశన్తి పరం పదమ్ ॥

“భౌతిక విశ్వమునకు ప్రళయము సంభవించినపుడు కృష్ణచైతన్యము నందు నిరంతరము నెలకొనియున్నట్టి బ్రహ్మ మరియు అతని భక్తులందరును తమ తమ కోరికల ననుసరించి ఆధ్యాత్మిక జగత్తు నందలి ప్రత్యేక ఆధ్యాత్మిక లోకములను చేరుచుందురు.” (కూర్మపురాణము 1.11.284)

## 8.17

**సహస్రయుగపర్యన్తమహర్యద్బ్రహ్మణో విదు: ।**
**రాత్రిం యుగసహస్రాన్తాం తే హోరాత్రవిదో జనా: ॥**

## అనువాదము

**మానవ పరిగణనము ననుసరించి వేయి మహాయుగముల కాలము బ్రహ్మదేవునికి ఒక దినమగును. అతని రాత్రి కూడ అంతే పరిమాణమును కలిగియుండును.**

## భాష్యము

భౌతిక జగత్తు యొక్క కాలపరిమాణము పరిమితమైనది. అది కల్పములుగా తెలుపబడుచుండును. అట్టి కల్పము బ్రహ్మదేవునికి ఒక పగలు. బ్రహ్మదేవుని ఆ ఒక్క పగటి సమయమున సత్య, త్రేత, ద్వాపర, కలియుగములతో కూడిన మహాయుగములు వేయిమార్లు మారుచుండును. అజ్ఞానము మరియు దుర్గుణములు ఏవియును లేకుండా కేవలము సద్గుణము, విజ్ఞానము, ధర్మములచే కూడియుండు సత్యయుగము 17,28,000 సంవత్సరముల కాలపరిమితిని కలిగి యుండును. త్రేతాయుగము నందు దుర్గుణము ప్రవేశించును. దీని పరిమాణము 12,96,000 సంవత్సరములు. ద్వాపర యుగమున సద్గుణములు, ధర్మము మరింతగా క్షీణించి దుర్గుణము అభివృద్ధి నొందును. దాని కాలపరిమితి 8,64,000 సంవత్సరము లుండును. చివరిదియైన కలియుగము నందు సద్గుణము దాదాపు అదృశ్యమై కలహము, అజ్ఞానము, అధర్మము, దుర్గుణము, వ్యసనాది లక్షణములు తీవ్రముగా విజృంభించును. ఈ యుగపు కాలపరిమితి 4,32,000 సంవత్సరములు (ఈ యుగమును మనము జరిగిన 5,000 సంవత్సరముల నుండి అనుభవించు చున్నాము). కలియుగము నందు దుర్గుణము మరియు పాపము విపరీతముగా వృద్ధినొందుటచే యుగాంతమున దేవాదిదేవుడే స్వయముగా కల్కి

అవతారమును దాల్చి దానవులను వధించి, తన భక్తులను రక్షించి మరియొక సత్యయుగమును ప్రారంభించును. ఆ విధముగా జగత్కార్యము కొనసాగు తుండును. అట్లు నాలుగు యుగములు వేయిమార్లు మారినప్పుడు అది బ్రహ్మదేవునకి ఒక పగలు. అతని రాత్రియు అంతే పరిమాణమును కలిగి యుండును. బ్రహ్మదేవుడు అట్టి 'శత సంవత్సరము'ల కాలము జీవించిన పిమ్మట తన దేహమును త్యజించును. ఈ శత సంవత్సరముల భూపరిగణనము ననుసరించి మొత్తము 311.04 లక్షలకోట్ల భూసంవత్సరములగును. ఈ సంఖ్య పరిగణన ననుసరించి బ్రహ్మయొక్క ఆయువు అద్భుతము, అనంతము, ఆశ్చర్యముగను గోచరించును. కాని నిత్యత్వదృష్టితో చూచినచో అది ఒక మెరుపు మెరిసినంతటి స్వల్పకాలము మాత్రమే. అట్లాంటిక్ మహాసముద్రము నందు ఏర్పడు నీటిబుడగల వలె ఈ 'కారణ సముద్రము' నందు అసంఖ్యాకములైన బ్రహ్మలు ఆవిర్భవిస్తూ అస్తమించు చుందురు. బ్రహ్మ మరియు అతని సృష్టి యనునది భౌతిక జగత్తు నందలి భాగములు. కనుక అవి నిత్యపరివర్తన శీలములై యుండును.

భౌతిక జగత్తు నందలి బ్రహ్మదేవుడు కూడ జననము, వార్ధక్యము, రోగము, మరణములకు అతీతుడు కాజాలడు. కాని అతడు ఈ విశ్వకలాప నిర్వహణమున ప్రత్యక్షముగా దేవాదిదేవుని సేవయందు నియుక్తుడైనందున వెంటనే ముక్తిని పొందగలడు. మహాతపస్వులు (సన్న్యాసులు) బ్రహ్మలోకమునకు ఉద్ధరింప బడుదురు. ఈ బ్రహ్మలోకము భౌతికజగత్తున అత్యున్నతమై ఉన్నతలోక వర్గమున నున్న స్వర్గాది లోకములన్నియు అంతరించిన పిదపను మిగిలియుండును. కాని కాలక్రమమున భౌతిక ప్రకృతి నియమము ననుసరించి బ్రహ్మయు, బ్రహ్మలోక నివాసులందరును మరణమునకు గురికావలసియే వచ్చును.

### 8.18

**అవ్యక్తాద్వ్యక్తయ: సర్వా: ప్రభవన్త్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥**

### <u>అనువాదము</u>

**బ్రహ్మదేవుని పగటి సమయము ఆరంభమైనంతనే జీవులందరును అవ్యక్త స్థితి నుండి వ్యక్తము చెంది, పిదప అతని రాత్రి ప్రారంభమైనంతనే తిరిగి అవ్యక్తము నందు లీనమగుదురు.**

### 8.19

**భూతగ్రామ: స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమే వశ: పార్థ ప్రభవత్యహరాగమే ॥**

**అనువాదము**

**బ్రహ్మదేవుని పగటి సమయము ఆరంభమైనపుడు జీవులందరును మరల మరల వ్యక్తమగుచు అతని రాత్రి ఆరంభమైనంతనే వివశులై నశింతురు.**

**భాష్యము**

ఈ భౌతిక జగత్తునందే కొనసాగుటకు యత్నించు మందబుద్ధులు ఉన్నత లోకములను చేరినను, నిశ్చయముగా ఈ భూలోకమునకు తిరిగి రావలసి వచ్చును. వారు బ్రహ్మదేవుని పగటి సమయమున ఈ భౌతిక జగత్తు నందలి ఊర్ధ్వ, అధోలోకములందు తమ కార్యములను ప్రదర్శింపగలరు. కాని బ్రహ్మదేవుని రాత్రి అరుదెంచగనే వారందరును నశించిపోవుదురు. వారు తమ భౌతిక కామ్యకర్మలకై బ్రహ్మదేవుని పగటి సమయమున పలు విధములైన దేహములను పొందుదురు. అతని రాత్రిసమయమున శరీరహీనులై వారు విష్ణుభగవానుని దేహమున నిలిచియుండి, తిరిగి బ్రహ్మదేవుని పగలు ఆరంభమైనంతనే తిరిగి వ్యక్తమగుచుందురు. 'భూత్వా భూత్వా ప్రలీయతే' – పగటిపూట వ్యక్తమై రాత్రి యందు తిరిగి నశింతురు. చివరికి బ్రహ్మదేవుని జీవితము ముగియగానే వారందరును నశించి కోట్లాది సంవత్సరములు అవ్యక్తమందు నిలిచిపోవుదురు. మరియొక యుగము నందు బ్రహ్మదేవుడు తిరిగి జన్మించగనే వారును తిరిగి వ్యక్తమగుదురు. ఈ విధముగా వారు భౌతిక జగత్తు మాయచేత బద్ధులగుదురు. కాని వివేకవంతులైన మానవులు కృష్ణచైతన్యవంతులై, "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అను మహామంత్రమును జపిస్తూ భగవానుని భక్తియుక్తసేవ యందు తమ మానవజన్మను పూర్తిగా వినియోగింతురు. ఆ విధముగా ఈ జీవితము నందే దివ్యమైన కృష్ణలోకమును చేరి పునర్జన్మలకు గురికాకుండ శాశ్వతానందమును పొందగలుగుదురు.

### 8.20

**పరస్తస్మాత్తు భావో న్యో వ్యక్తో వ్యక్తాత్సనాతన: ।**
**య: స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥**

**అనువాదము**

**ఈ వ్యక్తావ్యక్త జగత్తునకు అతీతమైన, శాశ్వతమైన మరియొక అవ్యక్త ప్రకృతి కలదు. అది పరమోత్కృష్టమును, నాశరహితమును అయియున్నది. ఈ భౌతిక జగత్తు నందు గల సమస్తము నశించినను అది మాత్రము యథాతథముగా నిలిచి యుండును.**

<u>భాష్యము</u>

శ్రీ కృష్ణుని ఉత్కృష్టమైన ఆధ్యాత్మికశక్తి దివ్యమును, శాశ్వతమును అయియున్నది. బ్రహ్మదేవుని పగటి సమయమునందు వ్యక్తమై, అతని రాత్రి సమయమున నశించు భౌతిక జగత్తు యందలి మార్పులకు అది అతీతమై యుండును. శ్రీకృష్ణుని ఉన్నతశక్తి భౌతిక ప్రకృతి గుణమునకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఉన్నత మరియు న్యూనప్రకృతులు ఇదివరకే సప్తమాధ్యాయమున వివరింపబడినవి.

**8.21**

**అవ్యక్తో/క్షర ఇత్యుక్తస్తమాహు: పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥**

<u>అనువాదము</u>

**వేదాంత తత్త్వజ్ఞులు దేనిని అవ్యక్తమనియు, అక్షరమనియు వర్ణింతురో, ఏది పరమ లక్ష్యముగా తెలియబడుచున్నదో, ఏ ప్రదేశమును పొందిన పిమ్మట జీవులు వెనుకకు తిరిగిరాడో అదియే నా దివ్యధామము.**

<u>భాష్యము</u>

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని దివ్యధామము 'బ్రహ్మ సంహిత' యందు 'చింతామణి ధామము' అనగా కోరికలన్ని నేరవేరునట్టి స్థానముగా వర్ణింపబడినది. గోలోక వృందావనముగా పిలువబడు శ్రీకృష్ణుని ధామము చింతామణులతో నిర్మితమైన సౌధములతో అలరారుచుండును. అక్కడ కోరినంతనే అన్నిరకములైన భక్ష్యములను (ఫలములను) సమకూర్చు 'కల్పవృక్షములు' మరియు ఆక్షయముగా పాలనొసగు 'సురభి' ధేనువులనబడు కామధేనువులు కూడ ఉండును. ఈ ధామము నందు భగవానుడు లక్షలకొలది లక్ష్మీదేవిలచే సేవింపబడుచుండును. ఆది దేవుడును మరియు సర్వకారణకారణుడైన గోవిందునిగా అతడు అక్కడ పిలువ బడును. అతడు మధురముగా వేణునాదము చేయుచుండును. (వేణుం క్వణన్తమ్). అతని దివ్యరూపము సర్వజగన్మోహనకరమైనది. అతని నేత్రములు పద్మదళముల వలెను, అతని దేహఛాయ నీలమేఘ వర్ణమును బోలియుండును. పరమాకర్షకుడైన అతని సౌందర్యము వేలాది మన్మథులను అతిశయించునంత మనోహరముగా నుండును. అతడు పీతాంబరమును ధరించి కంఠమున దివ్యమైన పుష్పమాలను, శిరమున నెమలి ఫించమును దాల్చియుండును. ఆధ్యాత్మిక జగత్తు నందలి పరమోన్నత లోకమైన తన దివ్యధామమును(గోలోక వృందావనము) గూర్చి శ్రీకృష్ణుడు భగవద్గీత యందు ఇక్కడ సూచనప్రాయముగా మాత్రమే తెలిపి యున్నాడు. దాని విస్తృతమైన వివరణము 'బ్రహ్మ సంహిత' యందు తెలుపబడినది. భగవద్ధామమునకు పరమైనది మరొకటి లేదనియు, అదియే పరమ గమ్యస్థానము : "పురుషాన్న పరం కిఞ్చిత్ సా కాష్ఠా సా పరా గతి:" అని కఠోపనిషత్తు (1.3.11) నుండి తెలియుచున్నది. జీవుడు దానిని పొందిన పిమ్మట ఈ భౌతిక జగత్తునకు ఎన్నడును తిరిగిరాడు. ఒకేరకమైన లక్షణములను కలిగి యున్నందున ఆ శ్రీకృష్ణుని దివ్యదామమునకు మరియు శ్రీకృష్ణునికిని ఎట్టి భేదము లేదు. ఈ భూమిపై ఢిల్లీనగరమునకు ఈశాన్యముగా తొంబదిమైళ్ళ దూరములో గల వృందావనమునకు ప్రతిరూపము. శ్రీకృష్ణభగవానుడు ఈ భువిపై అవతరించినపుడు భారతదేశములోని

మథురా మండలములోని ఎనుబదినాలుగు చదరపుమైళ్ళ విస్తీర్ణము గల వృందావనమును ఆ ప్రత్యేక ప్రదేశము నందు క్రీడించియుండెను.

**8.22**

**పురుష: స పర: పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా ।**
**యస్యాన్త:స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥**

**అనువాదము**

**సర్వులకన్నను అధికుడైన దేవాదిదేవుడు అనన్య భక్తిచేతనే పొందదగినవాడు. అతడు తన దివ్యధామము నందు నిలిచియున్నను సర్వవ్యాపియై యున్నాడు మరియు అతని యందే సమస్తము స్థితిని కలిగియున్నది.**

**భాష్యము**

పరమపురుషుడైన శ్రీకృష్ణుని ధామమే పునరావృత్తి రహితమైన పరమ గమ్యస్థానమని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. 'బ్రహ్మ సంహిత' అట్టి దివ్య ధామమును 'ఆనందచిన్మయ రసము'గా వర్ణించినది. అనగా అక్కడ సర్వము ఆధ్యాత్మికానందముతో నిండియుండును. అక్కడ ప్రకటితమగు వైవిధ్యమంతయు ఆధ్యాత్మిక ఆనందమయమే గాని భౌతికము కాదు. సప్తమాధ్యాయము నందు వివరింపబడినట్లు అక్కడ ప్రకటితమగు జగత్తు సర్వము శ్రీకృష్ణభగవానుని ఆధ్యాత్మిక శక్తికి సంబంధించినదే కనుక అక్కడి వైవిధ్యము దేవాదిదేవుని స్వరూపశక్తి విస్తారమే అయియున్నది. ఈ భౌతిక జగత్తునకు సంబంధించినంత వరకు భగవానుడు తన దివ్యధామము నందే సదా నిలిచియున్నను, తన భౌతిక శక్తిచే సర్వ వ్యాపకుడై యుండును. ఈ విధముగా భగవానుడు తన ఆధ్యాత్మిక మరియు భౌతికశక్తుల ద్వారా ఆధ్యాత్మిక మరియు భౌతిక జగత్తుల రెండింటి యందును సర్వత్రా నిలిచి యుండును. 'యస్యాన్త: స్థాని' అనగా సర్వము అతని యందే నిలిచియున్నదని భావము. అనగా అతని ఆధ్యాత్మిక లేక భౌతిక శక్తి యందు సర్వము నిలిచి యుండును. ఈ రెండు శక్తుల ద్వారానే భగవానుడు సర్వవ్యాపియై యుండును.

'భక్త్యా' అను పదము ద్వారా ఇక్కడ స్పష్టముగా సూచింపబడినట్లు దివ్యమైన కృష్ణలోకము నందు గాని, అసంఖ్యాకములుగా గల వైకుంఠలోకము లందు గాని ప్రవేశించుట కేవలము భక్తియుక్త సేవ ద్వారానే సాధ్యము కాగలదు. ఇతర విధానమేదియును ఆ దివ్యధామమును చేరుటకు తోడ్పడజాలదు. దేవాదిదేవుని మరియు అట్టి ధామమును "ఏకో వశీ సర్వగ: కృష్ణ" – ఆ దివ్యధామమున శ్రీకృష్ణుడను నామము గల దేవాదిదేవుడొక్కడే యుండునని 'గోపాలతాపన్యుపనిషత్తు' (1.19) వర్ణించుచున్నది. అతడు దివ్యకరుణామూర్తి. కనుకనే, దేవాదిదేవుడు ఏకరూపమున అక్కడ స్థితుడైనప్పటికిని అతడు కోట్లాది స్వాంశ రూపములుగా విస్తరించి యుండును. ఫలములను, పుష్పములను, పత్రములను కలిగియుండి నిశ్చలముగా నిలిచియున్న వృక్షముతో అట్టి వేదములు పోల్చబడినవి. శ్రీకృష్ణుని స్వాంశరూపములైన వైకుంఠాధిపతులు చతుర్బాహువులను కలిగి పురుషోత్తముడు, త్రివిక్రముడు, కేశవుడు, మాధవుడు, అనిరుద్ధుడు, హృషీకేశుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, శ్రీధరుడు,

వాసుదేవుడు, దామోదరుడు, జనార్ధనుడు, నారాయణుడు, వామనుడు, పద్మనాభుడు వంటి వివిధ నామములతో పిలువబడుదురు.

భగవానుడు తన దివ్యధామమైన గోలోక వృందావనమున సదా నిలిచి యున్నను సర్వత్రా వ్యాపించి యుండుట చేత సమస్తము సలక్షణముగా కొనసాగు చుండునని, 'గోలోక ఏవ నివసత్యఖిలాత్మభూత:' అని 'బ్రహ్మ సంహిత'(5.37) స్థిరపరచుచున్నది. అట్లే 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (6.8) నందు తెలుపబడినట్లు, శ్రీకృష్ణభగవానుడు అత్యంత దూరము నందున్నను అతని శక్తులు సర్వవ్యాపక శక్తులగుటచే జగత్తు నందలి సర్వమును దోషరహితముగా క్రమపద్ధతిలో ఎటువంటి పొరపాటు జరగకుండా నిర్వహించుచున్నవి (పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ).

**8.23**

**యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగిన: ।**
**ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥**

**అనువాదము**

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! ఏయే కాలములందు ఈ జగత్తును వీడుటద్వారా యోగి వెనుకకు తిరిగి వచ్చుట జరుగునో లేక తిరిగిరాకుండునో నీకు నేనిప్పుడు వివరించెదను.**

**భాష్యము**

సంపూర్ణముగా శరణాగతులైనట్టి దేవాదిదేవుని శుద్ధభక్తులు తామెప్పుడు ఏ విధముగా శరీరమును విడువవలసి వచ్చుననెడి విషయమును ఏ మాత్రమును పట్టించుకొనరు. సర్వమును కేవలము శ్రీకృష్ణుని చేతులలో విడిచి వారు అత్యంత సులభముగను, ఆనందముగను భగవద్ధామమును చేరుదురు. కాని శుద్ధభక్తులు కానివారును, కర్మజ్ఞాన హఠయోగాది ఆత్మానుభూతి పద్ధతులపై ఆధారపడి యుండెడివారును, తగిన కాలమునందు దేహమును విడిచి జనన మరణములతో కూడిన ఈ జగత్తునకు తిరిగివత్తురో లేదో నిశ్చయించుకోవలసి యున్నది.

యోగి పరిపూర్ణత్వమును సాధించినచో ఈ భౌతిక జగత్తును వీడుటకు సరియైన స్థితిని, సందర్భమును, కాలమును నిర్ణయించుకోగలడు. కాని అతడు పరిపూర్ణత్వమును పొందనిచో అతని సఫలత యాదృచ్ఛికముగా తగిన సమయమున జరుగు అతని దేహత్యాగముపై ఆధారపడియుండును. యుక్తములైన ఏ సమయమున మరణించినచో మానవుడు తిరిగి జన్మింపడో అట్టి విషయములను గూర్చి శ్రీకృష్ణభగవానుడు రాబోవు శ్లోకమున వివరింపనున్నాడు. ఆచార్యులైన శ్రీ బలదేవ విద్యాభూషణుల వ్యాఖ్యానము ననుసరించి 'కాల:' అను సంస్కృత పదము ఇక్కడ కాలము యొక్క అధిష్ఠానదేవతను సూచించుచున్నది.

## 8.24

**అగ్నిర్జ్యోతిరహ: శుక్ల: షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనా: ॥**

### అనువాదము

**పరబ్రహ్మము నెరిగిన బ్రహ్మవిదులు అగ్నిదేవుని ప్రభావము నందును, కాంతి యందును, పగటియందలి ఏదేని శుభఘడియ యందును, శుక్లపక్షము నందును లేక సూర్యుడు ఉత్తరమునకు ప్రయాణించు ఉత్తరాయణ పుణ్యకాలము నందలి ఆరు మాసము లందును ఈ జగమును వీడుట ద్వారా ఆ పరబ్రహ్మమును పొందుదురు.**

### భాష్యము

అగ్ని, కాంతి, దినము, శుక్లపక్షము అనువాటిని గూర్చి తెలిపినపుడు వానికి 'అతివాహిక' దేవతలు (అధిష్ఠానదేవతలు)కలరనియు, వారు జీవాత్మ అంతిమ యాత్రకు తగిన ఏర్పాట్లను చేయుదురనియు మనమెరగవలెను. మరణ సమయమున మనస్సు జీవుని మరొకజన్మను పొందునట్లు చేయును. కాని జీవులు పైన తెలుపబడిన సమయము లందు యాదృచ్ఛికముగా గాని, ప్రయత్న పూర్వకముగా గాని దేహమును విడిచినచో వారు నిరాకార 'బ్రహ్మజ్యోతి'ని పొందగలుగుదురు. యోగాభ్యాసము నందు ప్రగతి సాధించిన యోగులు తాము దేహత్యాగామును చేయుటకు తగిన ప్రదేశమును మరియు కాలమును నిర్ణయించు కోగలరు. ఇతరులకు అది సాధ్యము కాదు. ఒకవేళ యాదృచ్ఛికముగా వారు ఆ శుభఘడియలో మరణించినచో వారు మరల జననమరణ చక్రమునందు తిరిగి ప్రవేశింపరు. లేనిచో వారు తిరిగి జన్మించుటకు అవకాశములు ఉండును. కాని కృష్ణచైతన్యవంతుడైన శుద్ధభక్తుడు తన దేహమును శుభసమయమున విడిచినను, అశుభ సమయమున విడిచినను, యాదృచ్ఛికముగా లేక పూర్వనిర్దేశ ప్రకారముగా విడిచినను తిరిగి వచ్చుననెడి భయమును ఏమాత్రము కలిగియుండడు.

## 8.25

**ధూమో రాత్రిస్తథా కృష్ణ: షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥**

### అనువాదము

**ధూమ సమయము నందును, రాత్రియందును, కృష్ణపక్షము నందును, సూర్యుడు దక్షినమునకు ప్రయాణించు దక్షిణాయన సమయము నందును మరణించు యోగి చంద్రలోకమును పొందినను మరల వెనుకకు తిరిగివచ్చును.**

### భాష్యము

భూలోకమున కామ్యకర్మలు మరియు యజ్ఞవిధానము లందు నిష్ణాతులైనవారు మరణానంతరము చంద్రలోకమును పొందుదురని శ్రీమద్భాగవత తృతీయ స్కంధమున కపిలముని తెలిపెను. అట్టి ఉన్నత జీవులు చంద్రలోకమున దేవతల గణనము ప్రకారము పదివేల సంవత్సరములు జీవించి సోమరసమును పానము

చేయుచు జీవితమును అనుభవింతురు. కాని చివరికి వారు మరలా భూలోకమునకే తిరిగి వత్తురు. దీనినిబట్టి భౌతిక ఇంద్రియములకు అనుభూతము కాకున్నను, చంద్రలోకమున ఉన్నతులైన జీవులు నివసించుచుదురని తెలియుచున్నది.

**8.26**

**శుక్లకృష్ణే గతీ హ్యేతే జగత: శాశ్వతే మతే ।**

**ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పున: ॥**

**అనువాదము**

**వేదాభిప్రాయము ననుసరించి శుక్లగతి కృష్ణగతి అని ఈ జగత్తును విడిచిపోవు మార్గములు రెండు కలవు. శుక్లగతిన మరణించువాడు తిరిగి రాకుండును, కృష్ణగతిన మరణించువాడు తిరిగి వచ్చును.**

**భాష్యము**

మరణము మరియు పునరాగమనములను గూర్చిన ఇదే వివరణను ఆచార్య శ్రీల బలదేవ విద్యాభూషణులు 'ఛాందోగ్యోపనిషత్తు' (5.10.3-5) నుండి ఉదాహరించిరి. కామ్యకర్మల యందు శ్రమించువారును, కల్పితమైన తాత్త్విక భావములతో కూడినవారును అనంతకాలము నుండి జననమరణములకు లోనగు చున్నారు. నిజమునకు శ్రీకృష్ణుని శరణుపొందని కారణముగా వారెన్నడును పరమగతిని పొందలేరు.

**8.27**

**నైతే సృతీ పార్థ జానన్యోగీ ముహ్యతి కశ్చన ।**

**తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥**

**అనువాదము**

**ఓ అర్జునా! భక్తులు ఈ రెండు మార్గముల నెరిగినప్పటికిని ఎన్నడును కలత నొందరు. కనుక నీవు భక్తియందు సదా స్థిరుడవు కమ్ము.**

**భాష్యము**

భౌతిక జగత్తును వీడునప్పుడు ఆత్మ అనుసరించెడి వివిధ మార్గముల వలన ఎన్నడును కలత చెందకూడదని శ్రీకృష్ణుడు అర్జునునకు ఇక్కడ బోధించుచున్నాడు. దేవాదిదేవుని భక్తుడెన్నడును తాను యాదృచ్ఛికముగా మరణింతునో, ప్రమాదము వలన మరణింతునో లేదా పూర్వనిర్దేశము ననుసరించి మరణింతునోనని చింతింపరాదు. భక్తుడు కేవలము కృష్ణచైతన్యము నందు స్థిరముగా నెలకొని నిరంతరము 'హరే కృష్ణ' మహా మంత్రమును జపింపవలెను. పైన తెలిపిన ఈ రెండు మార్గములందు దేనిని గూర్చి చింతించినను అది కేవలము కలతకు మాత్రమే కారణమగునని అతడెరుగవలెను. శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు

నిరంతరము నెలకొని యుండుటయే కృష్ణచైతన్యమున నెలకొనుటకు గల అత్యుత్తమమైన మార్గము. కనుకనే భగవద్ధామమును చేరుమార్గము సుఖకరము, నిశ్చితము, సరళమగును. ఈ శ్లోకమున 'యోగయుక్త:' అను పదము ప్రత్యేకించి ప్రధానమైనది. యోగము నందు స్థితుడైనట్టివాడు తన కర్మలన్నింటి యందు ఎల్లప్పుడు కృష్ణచైతన్యవంతుడై యుండును. కనుకనే ప్రతియొక్కరూ భౌతిక విషయము లందు అనాసక్తులై కృష్ణచైతన్యము నందే సర్వమును ఒనరింపవలెనని శ్రీల రూప గోస్వామి ఉపదేశించిరి(అనాసక్తస్య విషయాన్ యథార్హముపయుంజత:) 'యుక్తవైరాగ్యము' అనబడు ఈ విధానము చేతనే మానవుడు పరిపూర్ణత్వమును సాధింపగలడు. కనుకనే భక్తుడెన్నడును ఈ వివిధ మార్గములచే కలతనొందడు. ఎందుకనగా అతడు భక్తియుక్త సేవ ద్వారా తాను దివ్యధామమును చేరుట నిశ్చయమని ఎరుగుటయే అందులకు కారణము.

## 8.28

**వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరంస్థానముపైతి చాద్యమ్ ॥**

### అనువాదము

**వేదాధ్యయనము వలనను, తీవ్ర తపస్సులతో కూడిన యజ్ఞాచరణము వలనను, దానముల వలనను, భక్తియుక్త సేవామార్గమును చేపట్టు మానవునికి ఆధ్యాత్మికములు మరియు కామ్యకర్మలు అనుసరించుట వలనను కలుగు ఫలితములు లభింపకపోవు. కేవలము భక్తియుక్త సేవ నాచరించుట ద్వారా అతడు వీటన్నింటిని పొందుటయే గాక అంత్యమున శాశ్వతమైన దివ్యధామమును సైతము చేరగలడు.**

### భాష్యము

ఈ శ్లోకము కృష్ణచైతన్యము మరియు భక్తియుక్త సేవను గూర్చి ప్రత్యేకముగా వర్ణించు సప్తమ, అష్టమాధ్యాయముల సారాంశము. మానవుడు ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము నందు వేదాధ్యయనము కావించుచు అతని నిర్దేశమున అనేకరకాల తపోనిష్ఠలను ఆచరించవలెను. బ్రహ్మచారి ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రమము నందు సేవకునిగా జీవించుచు, ప్రతి గృహము నుండి భిక్షను స్వీకరించి దానిని గురువునకు అర్పింపవలెను. అతడు గురువు గారి ఆజ్ఞననుసరించియే ఆహారమును గ్రహింపవలెను. ఒకవేళ గురువు భోజనమునకు పిలువకున్నచో అతడు ఆరోజు ఉపవసింపవలెను. ఇవియే బ్రహ్మచర్యమును అభ్యసించువానికి విధింపబడిన కొన్ని వైదిక నియమములు.

శిష్యుడు ఆ విధముగా గురువు ఆశ్రయమున ఐదు నుండి ఇరువది సంవత్సరముల కాలము వరకు వేదాధ్యయనము చేసిన పిమ్మట అతడు పరిపూర్ణ లక్షణములు కలిగిన మానవునిగా రూపొందును. వాస్తవమునకు వేదాధ్యయనము అనునది కల్పనాపరుల వినోదము కొరకు గాక మానవుని ఉత్తమ శీలాభివృద్ధి కొరకు ఉద్దేశింపబడినది. ఈ శిక్షణము ముగిసిన పిమ్మట వివాహము చేసికొని గృహస్థాశ్రమము నందు ప్రవేశించుటకు బ్రహ్మచారికి అవకాశమివ్వబడును. గృహస్థునిగా ఇంకను అధికమైన ఆత్మవికాసమును పొందుటకై అతడు అనేకమైన యజ్ఞములను చేయుచు భగవద్గీత పదిహేడవ అధ్యాయము నందు వర్ణింపబడినట్లు, దేశకాలపాత్రతల

ననుసరించి సత్త్వరజస్తమో గుణములతో కూడిన దానభేదములను ఎరిగి దానములను కూడ చేయవలసి యుండును. గృహస్థాశ్రమము నుండి విరమించి అతడు వానప్రస్థాశ్రమమును గ్రహించిన పిమ్మట వనములందు నివసించుట, వల్కములను ధరించుట, క్షౌరము చేసికొన కుండుట వంటి అనేకరకాల కఠిన తపముల నాచరింపవలెను. ఈ విధముగా బ్రహ్మచార్యాశ్రమమును, గృహస్థాశ్రమమును, వానప్రస్థాశ్రమమును, ఆ పిదప సన్న్యాసాశ్రమమును చక్కగా అవలంబించుట ద్వారా మానవుడు జీవితము నందలి పరిపూర్ణత్వ స్థితికి ఉద్ధరింపబడును. అట్టివారిలో కొందరు స్వర్గలోకములకు ఉద్ధరింపబడుదురు. వారు తమ అభ్యాసము నందు మరింత అభివృద్ధిని సాధించినప్పుడు ఆధ్యాత్మిక జగత్తునందలి నిరాకార 'బ్రహ్మజ్యోతి' నందు గాని, వైకుంఠ లోకము నందు గాని కృష్ణలోకము నందు గాని ముక్తిని సాధింపగలరు. ఈ మార్గమే వేదవాఙ్మయము నందు నిర్దేశింపబడినది.

కాని కృష్ణచైతన్యపు విశిష్టత యేమనగా కేవలము శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనుట ద్వారానే మానవుడు వివిధాశ్రమముల యందలి సర్వకర్మలను వెంటనే అధిగమించినవాడగును.

'ఇదం విదిత్వా' అను పదములు శ్రీకృష్ణుడు ఈ అధ్యాయము నందును మరియు సప్తమాధ్యాయము నందును చేసిన ఉపదేశములను మానవుడు అవగాహన చేసికొనవలెనని సూచించుచున్నవి. ఈ అధ్యాయములను పాండిత్యము ద్వారా లేదా ఊహాకల్పనలచే కాకుండ, భక్తుల సాంగత్యమున శ్రవణము చేస్తూ అవగాహన చేసుకొనుటకు ప్రయత్నింపవలెను. గీతయందలి సప్తమాధ్యాయము నుండి ద్వాదశాధ్యాయముల వరకు గల అధ్యాయములన్నియు భగవద్గీత సారమై యున్నవి. మొదటి ఆరు అధ్యాయములును చివరి ఆరు అధ్యాయములును ఆచ్ఛాదనలుగా కలిగిన ఈ నడుమ గల ఆరు అధ్యాయములు భగవానునిచే ప్రత్యక్షముగా రక్షింపబడుచున్నవి. భక్తుల సాంగత్యమున భగవద్గీతను (ముఖ్యముగా మధ్యనున్న ఈ ఆరు అధ్యాయములను) అవగాహన చేసుకొను అదృష్టము మానవునికి కలిగినచో అతడు తపస్సులను, యజ్ఞములను, దానములను, భావనా కల్పన లన్నింటిని అధిగమించిన వాడగును. దానితో మానవజన్మ వెంటనే సఫలమై మహోన్నతమగును. ఎందుకనగా వానిద్వారా కలుగు ఫలముల నన్నింటిని మానవుడు కేవలము కృష్ణచైతన్యమున నెలకొని సులభముగా పొందగలడు.

భగవద్గీత యందు ఏ కొద్దిపాటి విశ్వాసమున్నను మానవుడు భగవద్గీతను భక్తుని నుండియే అభ్యసింపవలెను. ఎందుకనగా భగవద్గీత భక్తులకు మాత్రమే పూర్తిగా అవగతమగుననియు, ఇతరులెవ్వరును భగవద్గీత ముఖ్యోద్దేశ్యమును పూర్తిగా ఎరుగలేరనియు చతుర్థాధ్యాయపు ఆరంభమున స్పష్టముగా చెప్పబడినది. కనుకనే భగవద్గీతను మానసిక కల్పనాపరుల నుండి కాకుండ కృష్ణభక్తుల నుండి మాత్రమే నేర్చుకొనవలెను. ఇదియే శ్రద్ధావిశ్వాసములకు నిదర్శనము. భక్తుల సాంగత్యమునకై అన్వేషించి దానిని పొందినప్పుడే మానవుడు భగవద్గీత అధ్యయనమును వాస్తవముగా ఆరంభించి దానిని అవగాహన చేసుకొనుటకు అర్హుడగును. భక్తుల సాంగత్యమున కలుగు పురోగతిచే మానవుడు భక్తియుక్త సేవ యందు నెలకొనగలడు. ఈ సేవ శ్రీకృష్ణభగవానుని గూర్చియు మరియు అతని నామ రూప గుణ లీలలను గూర్చిన సమస్త సందేహములను పూర్తిగా తొలగించును. ఈ సందేహము లన్నియును నశించినప్పుడు మానవుడు తన అధ్యయనము నందు మరింత అధికముగా సుస్థిరుడగును. అప్పుడతడు భగవద్గీత అధ్యయనము నందు రుచిని పొంది, శ్రీకృష్ణుని గూర్చి సదా స్మరించగలిగే కృష్ణచైతన్య

స్థితికి చేరుకొనును. అట్టి కృష్ణచైతన్యపు స్థితి అభివృద్ధియైనప్పుడు అతడు కృష్ణప్రేమయందు పూర్తిగా నిమగ్నమగును. మానవజన్మ యందలి ఇట్టి అత్యున్నత పరిపూర్ణత్వ స్థితి, ఆధ్యాత్మికాకాశము నందలి కృష్ణలోకమైన గోలోక వృందావనమునకు భక్తుని చేర్చును. అక్కడ భక్తుడు శాశ్వతానందమును పొందును.

**శ్రీమద్భగవద్గీత యందలి 'భగవత్ప్రాప్తి' అను అష్టమాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

---------

# నవమాధ్యాయము
# పరమగుహ్య జ్ఞానము

### 9.1
**శ్రీభగవానువాచ**

**ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్॥**

**అనువాదము**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ప్రియమైన అర్జునా! నీవు నా యెడ ఎన్నడును అసూయ కలవాడవు కానందున, అనుభవసహితమగు ఈ గుహ్యతమ జ్ఞానమును మరియు విజ్ఞానమును నీకు తెలియజేసెదను. దీనిని తెలిసిన పిమ్మట భౌతిక జీవితస్థితి వలన కలిగెడి క్లేశముల నుండి నీవు విముక్తుడవు కాగలవు.**

**భాష్యము**

భక్తుడు దేవాదిదేవుని గూర్చి అధికముగా శ్రవణము చేసినకొలది మరింత అధికముగా ఆత్మవికాసము నొందుచుండును. ఇట్టి శ్రవణ విధానము శ్రీమద్భాగవతము నందు ఈ విధముగా ప్రశంసింపబడినది : "దేవాదిదేవుని సందేశములు పరమశక్తివంతములు. భగవత్ సంబంధిత విషయములను భక్తుల సాంగత్యములో చర్చించినచో అవి అనుభూతికి వచ్చును. అది అనుభవపూర్వకమైన జ్ఞానమగుట చేత ఇది ఎన్నడును మానసిక కల్పనాపరుల లేక లౌకిక విద్వాంసుల సాంగత్యమున సాధింపబడుటకు వీలులేదు."

భక్తులు సదా శ్రీకృష్ణభగవానుని సేవయందు నెలకొనియుందురు. అట్లు కృష్ణచైతన్యవంతుడైన జీవుని మనోగతమును, శ్రద్ధను గ్రహించిన భగవానుడు భక్తుల సాంగత్యమున తనను గూర్చిన జ్ఞానమును పూర్తిగా అవగాహన చేసికొను బుద్ధిని అతనికి ప్రసాదించును. శ్రీకృష్ణుని గూర్చిన చర్చ అత్యంత శక్తివంతమైనది. మానవుడు అట్టి సాంగత్య భాగ్యమును పొంది ఈ జ్ఞానమును అవగతము చేసికొనుటకు ప్రయత్నించినచో తప్పక ఆధ్యాత్మికానుభూతిని పొందగలడు. శ్రీకృష్ణభగవానుడు తన శక్తివంతమైన సేవయందు అర్జునుడు మరింత అధికమైన ఉన్నత స్థితి నొందునట్లుగా ప్రోత్సహించుటకై తానిదివరకు వివరించిన విషయము కంటెను పరమ రహస్యమైన విషయములను ఈ నవమాధ్యాయమున వివరించు చున్నాడు.

భగవద్గీత ఆరంభము నందలి ప్రథమాధ్యాయము దాదాపు మిగిలిన గ్రంథము నంతటికిని ఉపోద్ఘాతము వంటిది కాగా ద్వితీయ మరియు తృతీయ అధ్యాయములందు వివరింపబడిన ఆధ్యాత్మికజ్ఞానము 'గుహ్యము' అయియున్నది. సప్తమ, అష్టమ అధ్యాయము లందు చర్చింపబడిన విషయములు ప్రత్యేకించి భక్తియుక్త సేవకు సంబంధించినవి. అవి కృష్ణచైతన్యము నందు పురోగతిని అవి కృష్ణచైతన్యము నందు పురోగతిని కలిగించును కనుక అవి 'గుహ్యతరము' అని చెప్పబడినవి. కాని ఈ నవమాధ్యాయమున వివరింపబడిన విషయములు శుద్ధభక్తికి సంబంధించిన వైనందున

'గుహ్యతమము' అని పిలువబడును. శ్రీకృష్ణభగవానుని అట్టి గుహ్యతమజ్ఞానమును పొందినవాడు సహజముగా లోకాతీతుడగును. కనుక అతడు భౌతిక జగత్తు నందున్నను భౌతిక క్లేశములను పొందడు. దేవాదిదేవునికి ప్రేమయుక్త సేవను హృదయపూర్వకముగా చేయదలచినవాడు, భౌతిక జీవితము నందలి బద్ధ స్థితి యందున్నప్పటికిని అతనిని ముక్తునిగానే భావింపవలెనని 'భక్తిరసామృత సింధువు' చెప్పుచున్నది. అట్లే భగవద్గీత దశమాధ్యాయము నందు కూడా భక్తి మార్గము నందు నెలకొనినవాడు ముక్తపురుషుడని తెలుపబడినది.

నవమాధ్యాయపు ఈ ప్రథమ శ్లోకమునకు విశేష ప్రాధాన్యము కలదు. దీనియందలి 'ఇదం జ్ఞానమ్' (ఈ జ్ఞానము) అను పదము శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనములు అను నవవిధ కార్యములతో కూడిన శుద్ధభక్తియుక్త సేవను సూచించుచున్నది. ఈ భక్తియుక్త సేవయందలి ఈ నవ విధానములను అభ్యసించుట ద్వారా మానవుడు ఆధ్యాత్మిక చైతన్యమునకు (కృష్ణచైతన్యమునకు) ఉద్ధరింపబడును. ఆ విధముగా హృదయము భౌతిక కాలుష్యము నుండి శుద్ధి పడినంతటనే అతడు శ్రీకృష్ణునికి సంబంధించిన విజ్ఞానమును పూర్తిగా అవగాహన చేసికొనగలడు. వాస్తవమునకు జీవుడు భౌతికావస్థకు సంబంధించినవాడు కాదనెడి విషయమును గ్రహించుట మాత్రమే సరిపోదు. అది ఆధ్యాత్మికానుభూతికి ఆరంభము మాత్రమే. పిదప ప్రతియొక్కరు దేహమునకు సంబంధించిన కార్యకలాపములకు, దేహాత్మభావన తొలిగినవాని ఆధ్యాత్మిక కార్యకలాపములకును నడుమ గల భేదమును చక్కగా గుర్తింపవలెను.

శ్రీకృష్ణభగవానుని మహత్తరమైన శక్తిని గూర్చియు, అతని వివిధ మహత్త్వములను గూర్చియు, ఉన్నత న్యూనప్రకృతుల గూర్చియు మరియు సమస్త భౌతిక జగత్తును గూర్చియు ఇదివరకే సప్తమాధ్యాయమున చర్చించి యున్నాము. ఇప్పుడు ఈ నవమాధ్యాయమున ఆ భగవానుని వైభవములు మరింతగా విశదీకరింపబడనున్నవి.

ఈ శ్లోకము నందలి 'అనసూయవే' అను సంస్కృత పదము కూడా మిక్కిలి ప్రధానమైనది. సాధారణముగా గీతావ్యాఖ్యాతలు మహా విద్వాంసులైనను, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పట్ల అసూయను కలిగియుందురు. జ్ఞానవంతులైన గొప్ప పండితులు కూడా భగవద్గీతకు అసమంజసమైన వ్యాఖ్యానములను రచించు చుందురు. వారు శ్రీకృష్ణుని పట్ల అసూయను కలిగి యున్నందున వారి వ్యాఖ్యానములు వ్యర్థములై యుండును. కేవలము భగవద్భక్తులచే రచింపబడినట్టి వ్యాఖ్యానములు మాత్రమే వాస్తవమునకు ప్రామాణికములైనవి. అసూయాగ్రస్తుడైన వాడెవ్వడును భగవద్గీతను యథాతథముగా వివరింపలేడు. మరియు శ్రీకృష్ణుని గూర్చిన పరిపూర్ణ జ్ఞానమును అందించుట గాని చేయలేడు. శ్రీకృష్ణుని గూర్చి ఎరుగకయే విమర్శలు కావించువాడు నిశ్చయముగా మూర్ఖుడు. కనుక అట్టి వ్యాఖ్యానములను జాగరూకతతో త్యజింపవలెను. శ్రీకృష్ణుని పరమ పవిత్రునిగను, దివ్య పురుషునిగను, దేవాదిదేవునిగను గ్రహింపగలిగిన వారికి ఈ అధ్యాయములు మిక్కిలి ప్రయోజనకరములు కాగలవు.

## 9.2
**రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥**

**అనువాదము**

**ఈ జ్ఞానము విద్యల కెల్ల రాజువంటిది. సర్వ రహస్యములలో పరమ రహస్యమైనది. పరమ పవిత్రమైన ఈ జ్ఞానము అనుభవపూర్వకముగా ఆత్మ యొక్క ప్రత్యక్ష జ్ఞానమును కలుగజేయుటచే ధర్మము యొక్క పరిపూర్ణ స్థితియై యున్నది. ఇది శాశ్వతమైనది మరియు ఆచరించుటకు మిక్కిలి సౌఖ్యకరమైనది.**

**భాష్యము**

భగవద్గీత యందలి ఈ అధ్యాయము పూర్వము వివరింపబడిన సకల తత్త్వములు మరియు సిద్ధాంతముల యొక్క సారాంశమైనందున ఇది రాజవిద్యగా పిలువబడుచున్నది. భారతదేశము నందలి తాత్త్వికులలో గౌతముడు, కణాదుడు, కపిలుడు, యాజ్ఞవల్క్యుడు, శాండిల్యుడు, వైశ్వానరుడు అనువారు ముఖ్యులు. అందులో 'వేదాంతసూత్ర' రచయితయైన వ్యాసదేవుడు అత్యంత ప్రధానుడు. కనుక ఇక్కడ ఆధ్యాత్మిక జ్ఞానము నందు గాని లేదా తత్త్వము నందు గాని ఎట్టి కొరతయు లేదు. అట్టి సమస్త జ్ఞానమునకు రాజుగా ఈ నవమాధ్యాయమును శ్రీకృష్ణభగవానుడు వర్ణించుచున్నాడు. అనగా ఈ అధ్యాయము వేదాధ్యాయనము మరియు వివిధ వేదాంత తత్త్వముల అధ్యయనము వలన కలిగెడి జ్ఞానము యొక్క సారమై యున్నది. గుహ్యము లేదా దివ్యములైన జ్ఞానము ఆత్మకును మరియు దేహమునకును నడుమ గల భేదమును అవగాహన చేసికొనుట యందు కేంద్రీకరింపబడుట చేతనే ఈ నవమాధ్యాయము రాజగుహ్యముగా కూడా తెలుపబడినది. అట్టి రాజగుహ్య జ్ఞానమునకు పరిపూర్ణత్వమే భక్తియుక్తసేవ.

సాధారణముగా జనులు ఇట్టి గుహ్యమైన జ్ఞానము నందు కాకుండ, భౌతికమైన జ్ఞానము నందు శిక్షితులై యుందురు. సామాన్య విద్యకు సంబంధించినంత వరకు జనులు రాజనీతి, సామాజిక శాస్త్రము, భౌతిక శాస్త్రము, రసాయన శాస్త్రము, గణితశాస్త్రము, ఖగోళశాస్త్రము, యంత్ర శాస్త్రముల వంటి వాటితోనే సంబంధమును కలిగియుందురు. ప్రపంచమంతటా అనేకములైన విజ్ఞానశాఖలు మరియు గొప్ప విశాలమైన విశ్వవిద్యాలయములు ఎన్నో గలవు. కాని దురదృష్టవశాత్తు ఆత్మజ్ఞానమును గూర్చి బోధించు విశ్వవిద్యాలయము గాని, విద్యాసంస్థగాని ఎక్కడను లేదు. వాస్తవమునకు ఆత్మ దేహమునందు మిక్కిలి ప్రధానమైనది. ఆత్మలేనిచో దేహమునకు విలువయే లేదు. అయినను జనులు ప్రధానమైన ఆత్మను నిర్లక్ష్యపరుస్తూ జీవితపు దేహావసరములకే అధికముగా ప్రాధాన్యమిస్తుంటారు.

భగవద్గీత ముఖ్యముగా ద్వితీయాధ్యాయము నుండి ఆత్మ యొక్క ప్రాముఖ్యమును నొక్కిచెప్పుచున్నది. ఆరంభము నందే శ్రీకృష్ణభగవానుడు ఈ దేహము నశ్వరమనియు మరియు ఆత్మ అనశ్వరమనియు (అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తా: శరీరిణ:) తెలిపియుండెను. ఆత్మ దేహము కంటెను భిన్నమనియు దాని స్వభావము నిర్వికల్పమనియు, నాశరహితమనియు, శాశ్వతమనియు తెలిసి కొనుటయే ఆ జ్ఞానము నందలి గుహ్యభాగము. కాని, వాస్తవమునకు ఇది ఆత్మను గూర్చిన పూర్తి విషయమును తెలుపజాలదు. కొన్నిమార్లు కొందరు జనులు జీవాత్మ దేహము కంటెను భిన్నమనియు,

దేహము నశించిన పిమ్మట లేదా ముక్తినొందిన పిమ్మట ఆత్మ శూన్యము నందు నలిచి నిరాకారమగునని భావించు చుందురు. కాని వాస్తవమునకు అది సత్యము కాదు. దేహము నందు గల క్రియాశీలమైన ఆత్మ దేహము నుండి ముక్తిని పొందిన పిమ్మట ఎట్లు క్రియారహిత మగును? అట్టి ఆత్మ ఎల్లప్పుడును క్రియాశీలమే. ఆత్మ నిత్యమైనచో దాని క్రియాశీలత్వము కూడ నిత్యమై యుండవలెను. భగవద్ధామము నందలి ఆ నిత్యమైన ఆత్మ యొక్క కార్యకలాపములే ఆధ్యాత్మిక జ్ఞానపు పరమ గుహ్యమైన భాగములు. కనుకనే ఆత్మ యొక్క కార్యకలాపములు ఇక్కడ 'రాజవిద్య'గా (పరమ గుహ్యజ్ఞానము) పేర్కొనబడినవి.

వేదవాఙ్మయమున తెలుపబడినట్లు, ఈ జ్ఞానము సమస్త కర్మల యొక్క అత్యంత పవిత్ర రూపమై యున్నది. 'పద్మపురాణము' నందు మానవుల పాపకర్మలు విశ్లేశింపబడి వారి పాపములే వాటికి మూలమని నిరూపింపబడినది. కామ్యకర్మల యందు నెలకొనినవారు ఆ పాపఫలముల వివిధ రూపములతోను మరియు వివిధ దశలతోను ఎల్లప్పుడు బద్ధులై యుందురు. ఉదాహరణకు, ఏదైన ఒక వృక్షపు విత్తనమును నాటినప్పుడు అది వెంటనే వృక్షముగా పెరగదు. దానికి కొంతకాలము పట్టును. మొదట అది చిన్నమొలకగా నుండి పిదప వృక్షరూపమును దాల్చి పిమ్మట పుష్పములను, ఫలములను అందించును. ఇట్లు అది సంపూర్ణ రూపమును పొందిన పిమ్మట ఆ వృక్షపు విత్తనము నాటినవాడు దాని ఫలపుష్పముల ననుభవించును. అట్లే, మానవుడు ఏదైన పాపకార్యమును ఆచరించినపుడు అది విత్తనము వలె ఫలించుటకు కొంతసమయము తీసికొనును. అనగా, ఆ కార్యములో వివిధ దశలుండును. కనుక అట్టి పాపకార్యములను నిలిపివేసినను అతడు పూర్వము చేసిన పాపకర్మల ఫలితముల ననుభవింపవలసి వచ్చును. కొన్ని పాపములు బీజరూపములో నుండగా, మరికొన్ని ఫలించి యుండును. ఫలరూపములు దాల్చిన పాపముల చేతనే మనము కలతను, బాధను పొందుచుందుము (ప్రారబ్ధకర్మలు).

సప్తమాధ్యాయము నందలి ఇరువది ఎనిమిదవ శ్లోకమున వివరింప బడినట్లు, అన్నిరకముల పాపకర్మ ఫలములను పూర్తిగ నశింప చేసికొనిన వాడును మరియు భౌతికజగత్తు యొక్క ద్వంద్వముల నుండి విముక్తిని పొందిన కారణముగా పుణ్యకార్యములందు నెలకొనినట్టి వ్యక్తి దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని భక్తియుక్త సేవయందు నెలకొనగలడు. అనగా శ్రీకృష్ణభగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనినవారు సమస్త పాపఫలముల నుండి ముందే ముక్తినొంది యున్నారు. ఈ విషయము 'పద్మపురాణము' నందు ఇట్లు నిర్ధారింపబడినది :

అప్రారబ్ధఫలం పాపం కూటం బీజం ఫలోన్ముఖమ్ ।
క్రమేణైవ ప్రలీయన్తే విష్ణుభక్తిరాతాత్మనామ్ ॥

"శ్రీకృష్ణుని భక్తియుక్తసేవ యందు నేలకొనినవారికి సర్వపాపఫలములు ఫలవంతములైనను, సంచితములైనను లేదా బీజరూపములో నున్నను అవి క్రమముగా నశించిపోవును." భక్తియుక్త సేవ యొక్క పవిత్రీకరణ శక్తి మిక్కిలి బలవత్తరమగుటచే అది 'పవిత్రమ్ ఉత్తమమ్' అని చెప్పబడినది. 'ఉత్తమమ్' అనగా దివ్యము. 'తమస్సు' అనగా భౌతిక జగత్తు లేక అంధకారము. కనుకనే ఉత్తమమనగా భౌతికకర్మలకు అతీతమైనట్టిది. కొన్నిమార్లు భక్తులు లౌకికుల వలె కర్మల యందు నెలకొనినట్లు కనపడినను వారి భక్తియుక్తసేవా కార్యకలాపములను ఎన్నడును భౌతికకర్మలుగా భావింపరాదు. భక్తియోగమును ఎరిగి, దానితో సంబంధము కలిగినవాడు మాత్రమే అవి భౌతికములు

కావని ఎరుగగలడు. అవియన్నియును ప్రకృతి త్రిగుణములచే కలుషితములు కాకుండ ఆధ్యాత్మికములును, భక్తిపూర్ణములు అయియుండును.

భక్తియుక్త సేవ నిర్వహణము మిక్కిలి సంపూర్ణమైనందున మానవుడు దాని ఫలితములను ప్రత్యక్షముగా పొందవచ్చునని ఇక్కడ తెలుపబడినది. ఈ ప్రత్యక్ష ఫలితము వాస్తవముగా అనుభవపూర్వకమై యుండును. శ్రీకృష్ణుని పవిత్ర నామములను (హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే) అని దోషరహితముగా జపించు మానవుడు ఆధ్యాత్మికానందమును పొందుతూ భౌతిక కాలుష్యముల నుండి శీఘ్రమే విముక్తుడై పవిత్రుడగును. దీనిని మనము ప్రత్యక్షముగా గమనింపవచ్చును. మానవుడు శ్రవణమునే కాకుండ భక్తియుక్త సేవాసందేశములను ప్రచారము చేయుటకు లేదా కృష్ణచైతన్య ఉద్యమ కార్యకలాపములకు తోడ్పడినచో క్రమముగా మానవుడు మరింత ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధింపగలడు. ఈ ఆధ్యాత్మిక జీవితాభివృద్ధి అనునది అతని ఏ విధమైన పూర్వపు విద్యలపై లేదా యోగ్యతలపై కాని ఆధారపడి యుండదు. ఈ విధానము పరమ పవిత్రమైనందున కేవలము దీనియందు నెలకొనుట ద్వారా మానవుడు పవిత్రుడు కాగలడు.

‘వేదాంత సూత్రము’ (3.2.26) లందు కూడ ఇదే విషయము ఇట్లు వివరింపబడినది : “ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్” అనగా “భక్తియుక్త సేవ మిక్కిలి శక్తివంతమగుటచే, అట్టి భక్తియుక్త సేవాకార్యములందు నెలకొనినంతనే మానవుడు తప్పక జ్ఞానవికాసము నొందును.” పూర్వజన్మమున దాసీపుత్రుడైన నారదుని వృత్తాంతము ఇందుకు చక్కని నిదర్శనము. ఆ జన్మమున అతనికి ఉన్నత విద్యగాని, ఉన్నత కులమున జన్మించుట గాని జరుగలేదు. కాని అతని తల్లి మహాభక్తుల సేవయందు నెలకొనినపుడు అతడు కూడా వారి సేవయందు నెలకొనెను. కొన్నిమార్లు తల్లి లేనటువంటి సమయమున స్వయముగా అతడే అట్టి గొప్ప భక్తులను సేవించుచుండెను. నారద ముని స్వయముగా ఇట్లు చెప్పుచున్నాడు :

ఉచ్ఛిష్టలేపాననుమోదితో ద్విజై: సకృత్ స్మ భుఞ్జే తదపాస్తకిల్బిష: ।
ఏవం ప్రవృత్తస్య విశుద్ధచేతసస్తద్ధర్మ ఏవాత్మరుచి: ప్రజాయతే ॥

శ్రీమద్భాగవతము నందలి ఈ శ్లోకమునందు (1.5.25) నారదుడు తన పూర్వజన్మ వృత్తాంతమును శిష్యుడైన వ్యాసదేవునికి వర్ణించుచున్నాడు. చాతుర్మాస్య సమయమున గొప్పభక్తులకు బాలసేవకుడిగా సేవలనందించుచు వారి సన్నిహిత సాంగత్యమును పొందితినని నారదుడు చెప్పుచున్నాడు. వారి ఆహారపాత్రలను శుభ్రము చేయుట యందు నెలకొనిన అతడు కొన్నిమార్లు పాత్రలలో ఆ భక్తులు విడిచిన కొద్దిపాటి ప్రసాదమును ఉచ్ఛిష్టముగా గ్రహింపదలచెను. పిమ్మట ఉచ్ఛిష్టమునకై వారిని అర్థించి వారు అనుమతితో దానిని భుజించి తత్ఫలితముగా సర్వపాపఫలముల నుండి విముక్తుడయ్యెను. అట్లు ఆ భుక్తశేషమును సేవింపగా, క్రమముగా అతడు కూడ ఆ మునుల వలెనే పవిత్ర హృదయుడయ్యెను. ఆ గొప్పభక్తులు శ్రవణ కీర్తనముల ద్వారా నిరంతర భక్తియుక్త సేవాభిరుచిని ఆస్వాదించు చుండిరి. నారదుడు కూడ క్రమముగా అదే రుచిని పెంపొందించుకొనెను. నారదుడు ఇంకను శ్రీమద్భాగవతము (1.5.26) నందు ఇట్లు చెప్పుచున్నాడు :

తత్రాన్వహం కృష్ణకథా: ప్రగాయతామనుగ్రహేణాశృణవం మనోహరా: ।
తా: శ్రద్ధయా మే నుపదం విశృణ్వత: ప్రియశ్రవస్యఙ్గ మమాభవద్రుచి: ॥

అట్టి మునుల సాంగత్యమున నారదుడు శ్రీకృష్ణభగవానుని వైభవముల శ్రవణ కీర్తనము లందు రుచిని పొంది, భక్తియుక్త సేవ పట్ల గొప్ప కోరికను పెంపొందించు కొనెను. కనుకనే 'వేదాంత సూత్రము' నందు చెప్పబడినట్లు, "ప్రకాశశ్చ కర్మణ్య భ్యాసాత్" – భక్తియుక్తసేవ యందు నెలకొనినట్టివారికి సర్వము అప్రయత్నముగనే ప్రకటితమగుటయు అవగాహనము చేసుకొనుటయు సంభవించును. దీనినే 'ప్రత్యక్షము' అనగా నేరుగా అనుభూతిని పొందుట యని అందురు.

'ధర్మ్యమ్' అను పదమునకు ధర్మమార్గమని అర్థము. వాస్తవమునకు నారదుడు దాసీపుత్రుడు. గురుకులమున విద్యనభ్యసించు అవకాశము అతనికి లభింపలేదు. కేవలము అతడు తన తల్లికి ఆమె పనులలో సహకరించు చుండెడి వాడు. కాని అదృష్టవశాత్తు అతని తల్లి భక్తులకు సేవ చేయు అవకాశమును పొంది యున్నందున, బాలుడైన నారదుడు కూడ అట్టి భక్తులను సేవించు అవకాశమును పొంది, వారి సాంగత్యములో సర్వధర్మముల పరమ లక్ష్యమును పొందగలిగెను. శ్రీమద్భాగవతము(1.2.6) నందు చెప్పబడినట్లు (స వై పుంసాం పరోధర్మో యతో భక్తిరధోక్షజే) భక్తియుక్త సేవయే సమస్త ధర్మముల పరమ లక్ష్యము. ధార్మిక జనులు కూడ సాధారణముగా భక్తియుక్త సేవను పొందుటయే ధర్మము యొక్క పరిపూర్ణత్వ స్థితియని ఎరుగజాలరు. అష్టమాధ్యాయపు చివరి శ్లోకపు భాష్యమునందు ఇదివరకే చర్చింపబడినట్లు, ఆత్మానుభూతి కొరకు సాధారణముగా వైదికజ్ఞానము కావలెను (వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ). కాని ఇక్కడ నారదుడు ఎన్నడును గురుకులమునకు వెల్లకపోయినను వేద సిద్ధాంతములను అభ్యసింపకున్నను వేదాధ్యయనపు అత్యున్నతమైన ఫలములను సాధింపగలిగెను. ఈ విధానము మిక్కిలి శక్తివంత మైనదగుటచే క్రమముగా మతనియమములను పాటింపక పోయినను మానవుడు పరిపూర్ణత్వమును పొంద వచ్చును. కాని అది ఎట్లు సాధ్యమగును? ఈ విషయము 'ఛాందోగ్యోపనిషత్తు' (6.14.2) నందు "ఆచార్యవాన్ పురుషోవేద" అని చెప్పబడినది. అనగా మానవుడు విద్యావంతుడు కాకపోయినను లేక ఎన్నడును వేదాధ్యయనమును చేయక పోయినను, అతడు మహనీయులైన గొప్ప ఆచార్యుల సాంగత్య మందున్నచో ఆత్మానుభూతికి కావలసిన సమస్త జ్ఞానమును పొందగలడని నిర్ధారింపబడినది.

భక్తియుక్త సేవావిధానము మిక్కిలి సుఖకరమైనది(సుసుఖమ్) ఎందుకు? భక్తియుక్త సేవ విష్ణువు యొక్క శ్రవణకీర్తనాదులను కలిగియుండును (శ్రవణం కీర్తనం విష్ణో:). మానవుడు భగవానుని వైభవములను శ్రవణము చేయవచ్చును లేక ఆధ్యాత్మిక జ్ఞానమును గూర్చి ప్రామాణికాచార్యులు చేయు తాత్త్విక ప్రవచనములకు వెళ్ళవచ్చును. కేవలము కూర్చుని వాటిని శ్రవణము చేసినంత మాత్రముననే మానవుడు జ్ఞానసముపార్జన చేయగలడు. భగవానునికి అర్పింప బడిన రుచికరమైన పదార్థముల శేషమును ప్రసాద రూపమున గ్రహింప వచ్చును. ఈ విధముగా ప్రతి దశయందును భక్తియుక్త సేవ ఆనందముతో కూడి సుఖకరము అయియుండును. మిక్కిలి పేదరికములో కూడ మానవుడు ఈ భక్తియుక్త సేవను అవలంబింపవచ్చును. భక్తుడు ఏది అర్పించినను దానిని తాను ప్రీతితో స్వీకరింతురని శ్రీకృష్ణభగవానుడు పలికెను(పత్రం పుష్పం ఫలం తోయం).ఎట్టి సాంఘికస్థితి యందున్నను, మానవుడు ప్రపంచము నందలి అన్ని ప్రదేశము లందును, సులభముగా లభించునట్టి పత్రము, పుష్పము, ఫలము, జలము వంటివాటిని అర్పించినచో భగవానుడు వాటిని తప్పక అంగీకరించును. ఇందుకు చరిత్ర యందు ఉదాహరణలు ఎన్నో గలవు. శ్రీకృష్ణభగవానుని పాదపద్మములకు అర్పింపబడిన తులసీపత్రములను ఆస్వాదించుట ద్వారా సనత్కుమారుని వంటి

గొప్పఋషులు మహాభక్తులైరి. కనుకనే భక్తియుక్త సేవా విధానము మిక్కిలి సరళమైనది. దీనిని ఎవరైనను అత్యంత ఆనందముతో నిర్వహింప వచ్చును. తనకు ప్రేమతో సమర్పించువాటిని మాత్రమే భగవానుడు స్వీకరించును.

భక్తియుక్తసేవ నిత్యమనియు ఇక్కడ చెప్పబడినది. అది ఎన్నడును మాయావాద తత్త్వవేత్తలు చెప్పునట్టిది కాదు. వారు కొన్నిమార్లు భక్తియుక్త సేవా విధానమును అవలంబించినను దానిని ముక్తి నొందువరకే కొనసాగింతు మరియు, ముక్తిని పొందిన పిమ్మట తాము భగవానునిలో ఇక్యమగుదుమనియు భావింతురు. కాని అట్టి తాత్కాలికమైన భక్తియుక్త సేవ శుద్ధభక్తియుక్త సేవగా అంగీకరింపబడదు. నిజమైన భక్తియుక్త సేవ ముక్తినొందిన పిమ్మటను కొనసాగుచునే యుండును. భగవద్ధామమును చేరినపుడు భక్తుడు దేవాదిదేవుని సేవయందే నెలకొని యుండును. అంతేకాకుండ, అతడు పరమపురుషునిలో ఇక్యమగుటకు ఎన్నడును యత్నింపడు.

భగవద్గీత (18.54) నందు చెప్పబడినట్లు, ముక్తి పిదపనే నిరంతర భక్తియుక్త సేవ ఆరంభమగును. మానవుడు ముక్తిని పొంది 'బ్రహ్మభూత' స్థితి యందు నెలకొనినప్పుడే వాస్తవమైన భక్తియుక్త సేవ ఆరంభమగుచున్నది.(సమ: సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్). కర్మయోగము, జ్ఞానయోగము, అష్టాంగయోగము లేదా మరో ఇతర యోగముల ద్వారాను శ్రీకృష్ణభగవానుని పరిపూర్ణముగా అవగాహన చేసికొనుట ఎవ్వరికిని సాధ్యము కాజాలదు. ఈ యోగపద్ధతుల ద్వారా భక్తియోగ వైపునకు మానవుడు కొంత ప్రగతి సాధింప వచ్చునేమో గాని భక్తియుక్త సేవాస్థితికి రాకుండ ఎవ్వరును దేవాదిదేవుని యథార్థముగా అవగతము చేసికొనజాలరు. కనుకనే మానవుడు భక్తియుక్త సేవా విధానమును నిర్వహిస్తూ (ముఖ్యముగా మహాత్ముల ద్వారా శ్రీమద్భాగవతమును లేదా భగవద్గీతను శ్రవణము చేయుట ద్వారా) పవిత్రుడైనప్పుడే శ్రీకృష్ణుని గూర్చిన జ్ఞానమును అవగాహన చేసికొనగలడని శ్రీమద్భాగవతము(1.2.20) నందు నిర్ధారింపబడినది : "ఏవం ప్రసన్నమనసో భగవద్భక్తియోగత:" అనగా హృదయము కల్మషముల నుండి శుద్ధి నొందినప్పుడు మాత్రమే మానవుడు భగవత్తత్త్వము నేరుగగలడు. ఈ విధముగా కృష్ణచైతన్య విధానము లేక భక్తియుక్త సేవావిధానము విద్యలలోకెల్లా మరియు రహస్య జ్ఞానములలోకెల్ల రాజుయై యున్నది. ధర్మము యొక్క పవిత్ర రూపమైన దీనిని ఎట్టి కష్టము లేకుండా ఆనందముగా నిర్వహింపవచ్చును. కనుకనే ప్రతియొక్కరు ఈ భక్తిమార్గమును తప్పక అవలంబింపవలసి యున్నది.

## 9.3

**అశ్రద్ధదానా: పురుషా ధర్మస్యాస్య పరన్తప ।**
**అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని ॥**

### అనువాదము

**ఓ శత్రుంజయుడా! ఈ భక్తియుక్త సేవ యందు శ్రద్ధలేనివారు నన్ను పొందజాలరు. అందుచే వారు ఈ భౌతిక జగత్తు నందలి జననమరణ మార్గమునకే తిరిగివత్తురు.**

### భాష్యము

శ్రద్ధలేనివారు భక్తియుక్త సేవావిధానమును నిర్వహింప లేరన్నది ఈ శ్లోకపు సారాంశము. భక్తుల సాంగత్యమున శ్రద్ధయనునది ఏర్పడును. దురదృష్టవంతులు

మహాత్ముల ద్వారా వేదవాఙ్మయమున చెప్పబడిన నిదర్శనములను శ్రవణము చేసిన పిమ్మట కూడ భగవానుని యందు శ్రద్ధను కనపరచరు. సంశయాత్ము లైనందున వారు భగవానుని భక్తియుక్తసేవ యందు స్థిరముగా నుండజాలరు. కనుకనే ఈ విధముగా కృష్ణచైతన్యము నందు పురోగతికి విశ్వాసము లేదా శ్రద్ధ యనునది మిక్కిలి ప్రధాన అంశముగా పేర్కొనబడినది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సేవించుట చేతనే మానవుడు పరిపూర్ణత్వమును సాధింప గలడనెడి సంపూర్ణ విశ్వాసమే శ్రద్ధయని 'శ్రీ చైతన్య చరితామృతము'(మధ్యలీల 22.62) నందు తెలుపబడినది. అదియే నిజమైన శ్రద్ధ. శ్రీమద్భాగవతము (4.31.14) నందు ఇట్లు తెలుపబడినది :

యథాతారోర్మూలనిషేచనేన తృప్యన్తి తత్స్కన్ధభుజోపశాఖా: ।
ప్రాణోపహారాచ్చ యథేన్ద్రియాణాం తథైవ సర్వార్హణమచ్యుతేజ్యా ॥

"వృక్షమూలమునకు నీరుపోయుట ద్వారా దాని కొమ్మలను, రెమ్మలను, పత్రములను సంతృప్తి పరచవచ్చును. అట్లే ఉదరమునకు ఆహారమును అందించుట ద్వారా దేహమందలి ఇంద్రియముల నన్నింటిని తృప్తిపరచినట్లు, శ్రీకృష్ణభగవానుని దివ్యసేవ యందు నెలకొనియుండుట ద్వారా మానవుడు సమస్త దేవతలను మరియు ఇతర సమస్తజీవులను అప్రయత్నముగనే సంతృప్తి పరచినవాడగును." కనుక ప్రతియొక్కరు సర్వవిధములైన ఇతర కర్మలను, ధర్మములను విడిచి శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవను అవలంబింపవలెను. భగవద్గీతను పఠించిన పిమ్మట మానవుడు వెంటనే ఈ భగవద్గీత సారాంశమునకే అరుదెంచవలెను. ఇట్టి జీవిత తత్త్వము పట్ల విశ్వాసమును కలిగియుండుటయే శ్రద్ధ యనబడును.

అట్టి శ్రద్ధను పెంపొందించు కొనుటయే కృష్ణచైతన్య విధానము. కృష్ణచైతన్యము కలిగిన మానవులు మూడు తరగతులుగా నుందురు. శ్రద్ధలేనివారు మూడవ తరగతికి చెందినవారు. వారు పైకి భక్తియుక్త సేవ యందు నెలకొనినను పరమోన్నత స్థితిని మాత్రము పొందజాలరు. బహుశ: కొంతకాలము పిదప వారు పతనము చెందవచ్చును. వారు భక్తియుక్త సేవ యందు నెలకొనినను సంపూర్ణమైన శ్రద్ధ విశ్వాసము లేనందున కృష్ణచైతన్యమున కొనసాగుట వారికి అత్యంత కష్టము. మా ప్రచారోద్యమ కార్యక్రమముల విషయమున మాకు ప్రత్యక్షానుభవము కలదు. మా ప్రచారోద్యమమున కొందరువ్యక్తులు కొన్ని గుప్తమైన ఉద్దేశ్యములతో కృష్ణ చైతన్యమును స్వీకరించుదురు మరియు ఆర్థికముగా కొంత మెరుగు సాధించగనే దీనిని విడిచి తమ పూర్వపు మార్గములనే అనుసరింతురు. కేవలము శ్రద్ధ ద్వారా మాత్రమే మానవుడు కృష్ణచైతన్యమున పురోగతి సాధింపగలడు. శ్రద్ధ యొక్క అభివృద్ధికి సంబంధించినంత వరకు భక్తియుక్త సేవకు సంబంధించిన శాస్త్రములందు నిష్ణాతుడై, సంపూర్ణ శ్రద్ధను కలిగిన మానవుడు కృష్ణచైతన్యమున మొదటి తరగతికి చెందిన భక్తుడని చెప్పవచ్చును. రెండవ తరగతికి చెందిన భక్తుడు ఆధ్యాత్మిక గ్రంథములను పూర్తిగా అవగాహనము చేసికొనలేకపోయినను, కృష్ణభక్తియే లేక కృష్ణసేవయే ఉత్తమ విధానమని దృఢముగా విశ్వసించి అధికమైన శ్రద్ధతో దానిననుసరించును. ఈ విధముగా ఇరువురును మూడవ తరగతి భక్తుని కంటె ఉన్నతులు. కృష్ణచైతన్యమున మూడవ తరగతి భక్తులు సంపూర్ణ శాస్త్రజ్ఞానమును, దృఢమైన విశ్వాసమును లేక కృష్ణచైతన్యము నందలి అట్టి మూడవ తరగతికి చెందిన భక్తుడు పతనము చెందు అవకాశము గలదు. కాని రెండవ తరగతికి చెందిన భక్తుడు పతనము నొందడు. ఇక కృష్ణచైతన్యము నందలి మొదటి తరగతికి చెందిన భక్తుని విషయమున పతనము చెందు అవకాశమే లేదు. ఈ మొదటి తరగతికి చెందిన భక్తుడు తన సాధనలో తప్పక పురోగమించి అంత్యమున ఫలమును పొందును. కృష్ణచైతన్యము

నందలి మూడవ తరగతికి చెందిన భక్తుడు శ్రీకృష్ణుని భక్తియుక్త సేవ ఉత్తమమనెడి విశ్వాసమును కలిగి యున్నను, భగవద్గీత మరియు శ్రీమద్భాగవతముల ద్వారా శ్రీకృష్ణుని గూర్చిన తగినంత జ్ఞానమును పొందియుందని కారణముగా వారు కర్మయోగము, జ్ఞానయోగముల పట్ల కొంత అభిరుచిని కలిగియుండుటచే కొన్నిమార్లు కలత చెందుచుండును. కాని కర్మయోగము లేదా జ్ఞానయోగమనేడి కల్మషముల ప్రభావము నుండి బయటపడినంతనే వారు కృష్ణచైతన్యము నందలి రెండవ తరగతి భక్తుడుగనో లేక ఉత్తమ తరగతి భక్తుడుగనో ప్రగతిని సాదింపగలడు. శ్రీకృష్ణభగవానుని యందలి శ్రద్ధ కూడ మూడుదశలుగా విభజింపబడి శ్రీమద్భాగవతము నందు వివరింపబడినది. శ్రీకృష్ణునిపై గల ఉత్తమమైన ఆసక్తి (మొదటి తరగతి), మధ్యమమైన ఆసక్తి (రెండవ తరగతి), కనిష్ఠ ఆసక్తి (మూడవ తరగతి) అని మూడుదశలు కలవని శ్రీమద్భాగవతము నందలి ఏకాదశ స్కంధమున తెలుపబడినది. శ్రీకృష్ణుని గూర్చియు మరియు భక్తియుక్త సేవ మహత్త్వమును గూర్చియు శ్రవణము చేసిన పిమ్మటను అది కేవలము ప్రశంస మాత్రమే యని భావించు వారు భక్తియుక్త సేవ యందు నెలకొనినట్లు కనబడినను ఆ మార్గము నందు కొనసాగలేరు. అట్టివారికి పరిపూర్ణత్వమును సాధించు అవకాశములు అతి స్వల్పములు. కనుక భక్తియుక్త సేవా నిర్వహణమున శ్రద్ధ యనునది అత్యంత ముఖ్యమైనది.

## 9.4

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్.స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థిత: ॥**

### అనువాదము

**అవ్యక్త రూపముతో కూడిన నాచే ఈ సమస్త జగత్తు వ్యాప్తమై యున్నది. జీవులన్నియు నా యందు కలవు. కాని నేను వాని యందు లేను.**

### భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు జడమైన ఇంద్రియములకు గోచరింపడు. ‘పద్మపురాణము’ నందు ఇట్లు తెలుపబడినది :

అత: శ్రీకృష్ణనామాది న భావేద్గ్రాహ్యమింద్రియై: ।
సేవోన్ముఖే హి జిహ్వాదౌ స్వయమేవ స్ఫురత్యద: ॥
(భక్తిరసామృత సింధువు 1.2.234)

శ్రీకృష్ణభగవానుని నామ, వైభవ, లీలాదులు భౌతిక ఇంద్రియములచే గ్రహింప బడవు. సరియైన మార్గదర్శకత్వమున శుద్ధభక్తియుక్త సేవ యందు నెలకొనిన మానవునికే అతడు స్వయముగా వ్యక్తమగును. కనుకనే “ప్రేమాంజనచ్ఛురితభక్తి విలోచనేన సంత: సదైవ హృదయేషు విలోకయన్తి” అని ‘బ్రహ్మ సంహిత’(5.38) యందు తెలుపబడినది. అనగా దేవాదిదేవుడైన గోవిందుని పట్ల దివ్యమైన ప్రేమను పెంపొందించు కొనినవాడు భగవానుని నిరంతరము తన వెలుపలను, లోపలను చూడగలడు. ఈ విధముగా సామాన్య జనులకు అతడు దర్శనీయుడు కాదు. భగవానుడు సర్వవ్యాపియై సర్వత్రా నిలిచియున్నను భౌతిక ఇంద్రియములకు గోచరింపడని ఇక్కడ చెప్పబడినది. ఇదే విషయము ‘అవ్యక్తమూర్తినా’ అను శబ్దము ద్వారా ఇక్కడ సూచింపబడినది.

వాస్తవమునకు మనము అతనిని చూడలేకపోయినను సమస్తము అతని పైననే ఆధారపడియున్నది. సప్తమాధ్యాయమున ఇదివరకే చర్చింపబడినట్లు, వ్యక్తమైన ఈ భౌతిక జగత్తంతయు అతని ఉత్తమమైన ఆధ్యాత్మిక శక్తి, న్యూనమైన భౌతిక సమ్మేళనము చేతనే ఏర్పడినది. సూర్యకాంతి విశ్వమంతటను వ్యాపించి యుండునట్లు, భగవానుని శక్తి కూడ సృష్టి అంతటను వ్యాపించియున్నది. సర్వమును ఆ శక్తి పైననే ఆధారపడి యున్నది.

భగవానుడు సర్వత్రా వ్యాపించి యుండుటచే అతడు తన వ్యక్తిగత రూపమును కోల్పోయెనని ఎవ్వరును భావింపరాదు. అట్టి వాదనను ఖండించుటకే భగవానుడు : “నేను సర్వత్రా గలను, సర్వమును నాయందు గలదు. అయినను నేను సర్వమునకు అతీతుడను” అని చెప్పుచున్నాడు. ఉదాహరణకు ఒక రాజు తన శక్తికి వ్యక్తరూపమైన ప్రభుత్వమునకు అధికారియైనను ప్రభుత్వము నందలి వివిధ పరిపాలన శాఖలు రాజు యొక్క శక్తులే కాని అన్యములు కావు. ప్రతి శాఖయు రాజుగారి శక్తిపైననే ఆధారపడియున్నది. కాని రాజు స్వయముగా ప్రతి శాఖయందును ప్రత్యక్షమై యుండవలెనని మనము అనలేము. ఇది లౌకికమైన ఉదాహరణము. అట్లే ఈ భౌతిక జగత్తు నందును ఆధ్యాత్మిక ప్రపంచము నందును మనము చూచునదంతయు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని శక్తిపైననే ఆధారపడి యున్నది. భగవానుని వివిధ శక్తుల విస్తారము చేతనే సృష్టి జరుగుచున్నది. “విష్టభ్యాహమిదం కృత్స్నమ్” అని భగవద్గీత (10.42) నందు చెప్పబడినట్లు, తన వివిధ శక్తుల వ్యాప్తిరూపమైన ప్రాతినిధ్యముచే శ్రీకృష్ణభగవానుడు సర్వత్రా ప్రత్యక్షముగా నిలిచియుండును.

## 9.5

**న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥**

## అనువాదము

**అయినను సృష్టించబడిన సమస్తము నా యందు స్థితిని కలిగియుండదు. అచింత్యమైన నా యోగైశ్వరమును గాంచుము! నేను సర్వజీవులను పోషించు వాడనైనను, సర్వవ్యాపకుడనైనను ఈ వ్యక్త జగత్తునందలి భాగమును కాను. కాని నేనే ఈ సర్వసృష్టికి మూలకారణుడను.**

## భాష్యము

సర్వము తనపై ఆధారపడి యున్నదని భగవానుడిక్కడ చెప్పుచున్నాడు (మత్స్థాని సర్వభూతాని). ఈ విషయమును మరోవిధముగా తప్పుగా అర్థము చేసికొనకూడదు. వాస్తవమునకు విశ్వము యొక్క భరణపోషణలతో ప్రత్యక్షముగా భగవానునకు ఎట్టి సంబంధము లేదు. కొన్నిమార్లు కొన్ని ప్రపంచ చిత్రములలో భూగోళము నంతటిని ‘అట్లాస్’ తన భుజములపై మోయుచున్నట్లుగా మనము చూస్తుంటాము. అట్టి కార్యములో అతడు మిక్కిలి అలసినట్లుగా ఆ చిత్రమున కనిపించును. ఇదే భావనను శ్రీకృష్ణభగవానుడు సమస్త విశ్వమును భరించు చున్నాడనెడి విషయమున మనము ఊహింపరాదు. ఎందుకనగా, సర్వము తనపైననే ఆధారపడియున్నను తాను మాత్రము వాటికి దూరముగా నున్నట్లు భగవానుడిక్కడ

చెప్పుచున్నాడు. గ్రహమండలము లన్నియు అంతరిక్షమున తేలుచున్నవి. ఈ అంతరిక్షము దేవాదిదేవుని శక్తియైనను, అతడు అంతరిక్షము కంటెను భిన్నుడు. అతని స్థితి భిన్నమైనది. కనుకనే "జీవులందరును అచింత్యమైన నా శక్తి పైననే ఆధారపడి యున్నను, దేవాదిదేవుడనైన నేను వారికి దూరముగనే యున్నాను" అని భగవానుడు చెప్పుచున్నాడు. ఇదియే శ్రీకృష్ణుని అచింత్యమైన యోగవైభవము.

వైదిక నిఘంటువగు 'నిరుక్తి'యందు ఇట్లు తెలుపబడినది : "యుజ్యతే నేన దుర్ఘటేషు కార్యేషు"- "భగవానుడు తన శక్తిని ప్రదర్శించుచు ఊహాతీతములు, అద్భుతములునైన లీలలను చేయుచున్నాడు." భగవానుడు వివిధ దివ్యశక్తులను కలిగియున్నాడు. అతని సంకల్పము పరమసత్యము. ఈ విధముగా దేవాదిదేవుని స్వరూపమును అవగాహనము చేసికొనవలెను. మనము ఏదైన కార్యమును చేయవలెనని తలచినప్పుడు దానికి ఎన్నో అవరోధములు ఏర్పడవచ్చును. కొన్నిమార్లు మనము ఆశించినట్లుగా చేయుటకు సాధ్యము కాదు. కాని శ్రీకృష్ణభగవానుడు ఏదేని ఒక కార్యమును చేయగోరినప్పుడు, అతని సంకల్ప మాత్రముననే సర్వమును సంపూర్ణముగా నిర్వహింపబడు చుండుటచే, మనము అది ఎట్లు చేయబడుచున్నదో ఊహింపజాలము. భగవానుడు ఈ విషయమునే వివరించు చున్నాడు. అతడు ఈ భౌతికమైన సమస్త సృష్టిని పోషించి పాలించుచుండు వాడైనను వాస్తవమునకు దానిని స్పృశింపనైన స్పృశింపడు. కేవలము అతని దివ్యసంకల్పము చేతనే సర్వము సృష్టింపబడి, పాలింపబడి, పోషింపబడి చివరికి లయము చేయబడుచున్నది. కాని పరతత్త్వమగుటచే అతనికిని మరియు అతని మనస్సునకు నడుమ ఎట్టి భేదమును లేదు. మనకును మన భౌతిక మనస్సునకును భేదముండును. ఏకకాలమున భగవానుడు సర్వము నందు వసించియున్నను, అతడు అట్లు స్వయముగా ఎట్లు రూపసహితుడై యుండునో సామాన్య మానవుడు గ్రహింపజాలడు. అతడు ఈ భౌతిక సృష్టికి భిన్నముగా నున్నను సర్వము అతని పైననే ఆధారపడియున్నది. ఇది ఇక్కడ 'యోగమైశ్వరమ్' అని దేవాదిదేవుని యోగశక్తిగా వివరింపబడినది.

**9.6**

**యథాకాశస్థితో నిత్యం వాయు: సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥**

**<u>అనువాదము</u>**

**సర్వత్రా వీచునట్టి ప్రచండవాయువు సర్వదా ఆకాశము నందే స్థితిని కలిగి యుండునట్లు, సృజింపబడిన సమస్త జీవులు నా యందు స్థితిని కలిగి యున్నవని గ్రహింపుము.**

**<u>భాష్యము</u>**

సామాన్య మానవునికి బ్రహ్మాండమైన ఈ భౌతిక సృష్టి భగవానునిపై ఎట్లు ఆధారపడియున్నదో ఊహించుట కష్టము. కాని మన అవగాహనకు తోడ్పడు ఒక ఉదాహరణను భగవానుడు అందించుచున్నాడు. మనము ఊహించ గలిగిన వానిలో ఆకాశము మిక్కిలి విస్తృతమైనది. అట్టి ఆకాశమున వాయువు మిక్కిలి గొప్పదైన సృష్టి. వాయువు ప్రతి దాని చలనమును ప్రభావితము చేయును. ఆ విధముగా వాయువు మిక్కిలి విస్తృతమైనను అది ఆకాశపరిధిని దాటకుండ ఆకాశము నందే స్థితిని కలిగియుండును. అట్లే అద్భుతమైన అన్ని అంతరిక్ష సృష్టులు కూడ శ్రీకృష్ణభగవానుని దివ్యసంకల్పము

చేతనే స్థితిని కలిగియుండి అతని సంకల్పమునకు లోబడి వర్తించును. సాధారణముగా చెప్పబడునట్లు, దేవాదిదేవుని సంకల్పము లేనిదే గడ్డిపోచయైనను కదలదు. ఈ విధముగా సర్వమును భగవానుని సంకల్పము ననుసరించియే వర్తించుచున్నది. అతని సంకల్పము చేతనే సర్వము సృష్టింపబడి, పోషింపబడి, చివరికి లయము చెందును. వాయువు యొక్క కార్యకలాపములకు ఆకాశము అతీతముగా నుండునట్లు, భగవానుడు సమస్తమునకు అతీతముగా నున్నాడు.

'తైత్తిరీయోపనిషత్తు' (2.8.1) నందు : "యద్భీషా స్మాద్ వాత: పవతే" – "భాగావానుని భయము చేతనే వాయువు వీచుచున్నది" అని చెప్పబడినది. అట్లే 'బృహదారణ్యకోపనిషత్తు' (3.8.9) నందు : "ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధ్రుతౌ తిష్ఠత ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి ద్యావాపృథివ్యౌ విధ్రుతే తిష్ఠత:" – దేవాదిదేవుని పర్యవేక్షనమున అతని దివ్య శాసనము చేతనే సూరుడు, చంద్రుడు, ఇతరములైన పెద్ద గ్రహములు వాటివాటి కక్ష్యలలో సంచరించు చున్నవని చెప్పబడినది." 'బ్రహ్మ సంహిత' (5.52) నందు కూడ ఇట్లు చెప్పబడినది :

యచ్చక్షురేష సవితా సకలగ్రహాణామ్
రాజా సమస్తసురమూర్తిరశేషతేజా: ।
యస్యాజ్ఞయా భ్రమతి సంభృతకాలచక్రో
గోవిందమాదిపురుషం తమహం భజామి ॥

ఇది సూర్యుని చలన వర్ణనము. సూర్యుడు పరమపురుషుని ఒక నేత్రముగా పరిగణింప బడేననియు మరియు అతడు వేడి వెలుతురులను వ్యాపింప జేయు బ్రహ్మాండమైన శక్తిని కలిగి యున్నాడనియు చెప్పబడినది. అయినను అతడు ఆ గోవిందుని శాసనమునకు, దివ్యసంకల్పమునకు లోబడి తనకు నిర్దేశింప బడిన కక్ష్యనందే పరిభ్రమించును. కనుక మనకు భౌతిక సృష్టి అద్భుతముగను మరియు విస్తృతముగను కనిపించినను, అది దేవాదిదేవుని సంపూర్ణ ఆధీనము నందే నిలిచి యుండునని వేదవాఙ్మయమున మనకు నిదర్శనము కనిపించు చున్నది. ఈ అధ్యాయము నందలి రాబోవు శ్లోకములలో ఈ విషయము మరింతగా వివరింపబడినది.

## 9.7
**సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥**

### అనువాదము
**ఓ కౌంతేయా! కల్పాంతమున సకల జీవరాసులు నా ప్రకృతి యందు ప్రవేశించును. మరియొక కల్పారంభమున నేనే నా శక్తిచే వాటిని తిరిగి సృజింతును.**

### భాష్యము
ఈ భౌతికసృష్టి యొక్క సృష్టి, స్థితి, లయములు సంపూర్ణముగా దేవాదిదేవుని దివ్యసంకల్పము పైననే పూర్తిగా ఆధారపడి యుండును. ఇక్కడ 'కల్పక్షయము' నందు అనగా బ్రహ్మదేవుడు మరణించిన పిదప యని అర్థము. బ్రహ్మదేవుడు నూరు

సంవత్సరములు జీవించును. బ్రహ్మదేవుని ఒక పగలు మన 4,300,000,000 భూలోక సంవత్సరములతో సమానమని పరిగణింప బడినది. అతని రాత్రి సమయము కూడా అంతే కాలపరిమాణము గలది. అతని మాసమున అట్టి ముప్పది పగళ్ళును, రాత్రులును ఉండగా, అతని సంవత్సర కాలములో పన్నెండు అట్టి మాసము లుండును. అటువంటి వంద సంవత్సరములు గడచిన పిమ్మట బ్రహ్మదేవుడు దేహమును త్యజించినప్పుడు ప్రళయము సంభవించును. అనగా మరల ఈ విశ్వసృష్టి చేయవలసిన అవసరమైనప్పుడు భగవానుని సంకల్పముచే అది తిరిగి ప్రకటితమగును. కనుకనే "బహు స్యాం" – "నేనొక్కడనే అయినను బహురూపములు పొందుదును" అని తెలుపబడినది (ఛాందోగ్యోపనిషత్తు 6.2.3). అతడు ఈ భౌతికశక్తి యందు వ్యాపించినప్పుడు సమస్త విశ్వము తిరిగి ప్రకటితమగును.

## 9.8

**ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పున: పున: ।**
**భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్ ॥**

### అనువాదము

**ఈ సమస్త విశ్వము నా అధీనమున కలదు. అది నా సంకల్పము చేతనే అప్రయత్నముగా మరల మరల సృష్టింపబడుచు, నా సంకల్పము చేతనే అంత్యమున లయము నొందుచుండును.**

### భాష్యము

భౌతిక జగత్తు దేవాదిదేవుని న్యూనశక్తి యొక్క వ్యక్తీకరణము. ఇదివరకే ఇది ఎన్నోసార్లు వివరింపబడినది. సృష్టి సమయమున భౌతికశక్తి 'మహత్తత్త్వము'గా రూపొందును. భగవానుడు తన మొదటి పురుషావతారమైన మహావిష్ణువుగా దానియందు ప్రవేశించును. అతడు కారణ సముద్రమున శయనించి తన శ్వాస ద్వారా అసంఖ్యాకములైన విశ్వములను సృష్టించును. దేవాదిదేవుడు వాని యందు ద్వితీయ పురుషావతారమైన గర్భోదకశాయి విష్ణువుగా ప్రవేశించును. ప్రతి విశ్వము కూడ ఈ విధముగానే సృజింపబడినది. పిమ్మట భగవానుడు క్షీరోదకశాయి విష్ణువుగా ఆ విశ్వముల యందలి చిన్న కణములతో సహా సర్వము నందును ప్రవేశించును. ఈ విధముగా భగవానుడు అన్నింటి యందును ప్రవేశించుననెడి సత్యము ఇక్కడ వివరింపబడినది.

ఇక జీవులకు సంబంధించినంత వరకు వారందరును భౌతిక ప్రకృతి గర్భము నందుంచబడగా, వారు వారివారి పూర్వకర్మఫలముల ననుసరించి వివిధ స్థితులను పొందుదురు. అట్లు భౌతికజగత్తు యొక్క కార్యకలాపములు ప్రారంభమగును. సృష్టి ఆరంభమైన క్షణము నుండియే వివిధ జీవుల కార్యకలాపములు కూడ ఆరంభమగును. అనగా ఇది పరిణామ ప్రక్రియ ననుసరించి జరుగుట లేదు. జగత్తు సృష్టితోపాటు వివిధ జీవరాశులు కూడ సృష్టింప బడినవి. అనగా మానవులు, జంతువులు, మృగములు, పక్షులు మున్నగునవి ఏకకాలమున సృష్టింపబడినవే. ఎందుకనగా గడిచిన ప్రళయ సమయమున (కల్పాంతమున) జీవులు ఏ కోరికలను కలిగియుందురో దాని ననుసరించియే వారు తిరిగి సృష్టింపబడుదురు. ఈ విధానమున జీవులు చేయవలసిన దేదియును లేదని 'అవశమ్' అను పదము ద్వారా స్పష్టముగా సూచింపబడినది. అనగా గడిచిన కల్పము నందలి గడిచిన జన్మ స్వభావము ననుసరించి జీవుడు తిరిగి సృష్టింపబడును. ఇదియంతయు భగవత్సంకల్పము ననుసరించియే జరుగుచుండును. ఇదియే దేవాదిదేవుని దివ్యమైన అచింత్యశక్తి. ఈ విధముగా వివిధ

జీవరాసులను సృష్టించిన పిదప వాటితో అతడు ఎట్టి సంబంధమును కలిగియుండడు. వివిధ జీవుల కోరికలను నెరవేర్చుట కొరకై జగత్తు సృష్టింపబడుచున్నందున భగవానుడు దానితో ఎట్టి సంబంధమును పెట్టుకొనడు.

**9.9**
**న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ ।**
**ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు ॥**

**<u>అనువాదము</u>**

**ఓ ధనంజయా! ఈ కర్మయంతయు నన్ను బంధింపదు. నేను తటస్థుని వలె నుండి ఈ భౌతిక కర్మలన్నింటి యెడ సదా ఆసక్తి లేనట్టివాడనై యుందును.**

**<u>భాష్యము</u>**

ఈ విషయమున దేవాదిదేవునికి ఎట్టి కర్మము లేదని మనము భావింప కూడదు. ఆధ్యాత్మిక జగత్తులో అతడు సదా దివ్యకర్మల యందు నిమగ్నుడై యుండును. 'బ్రహ్మ సంహిత'(5.6) నందు : "ఆత్మారామస్య తస్యాస్తి ప్రకృత్యా న సమాగమ" – "అతడు సచ్చిదానంద పూర్ణములైన దివ్యలీలల యందు సదా నిమగ్నుడై యుండును. ఈ భౌతిక కర్మలతో అతనికెట్టి సంబంధము లేదు" అని చెప్పబడినది. భౌతిక కర్మలన్నియును వివిధములైన అతని శక్తులచే నిర్వహింప బడును. సృష్టింపబడిన జగత్తు యొక్క భౌతికకర్మల యెడ అతడు సర్వదా తటస్థుడుగా నుండును. ఆ తటస్థత్వమే ఇక్కడ 'ఉదాసీనవాత్' యను పదముచే పేర్కొనబడినది. భౌతిక కర్మల యందలి ప్రతి సూక్ష్మవిషయమును నియంత్రించు చున్నప్పటికిని అతడు తటస్థుని వలె వర్తించుచుండును. ఉన్నత న్యాయస్థానమున కూర్చుండునట్టి న్యాయాధికారిని ఇక్కడ ఉదాహరణగా చెప్పవచ్చును. అతని ఆజ్ఞ ననుసరించి కొందరికి మరణశిక్ష, మరికొందరికి కారాగారవాసము, మరికొందరికి గొప్ప సంపద నొసగుట వంటి అనేక విషయములు జరుగుచున్నను అతడు మాత్రము అక్కడ జరుగు లాభనష్టములతో సంబంధము లేక తటస్థుడై యుండును. అట్లే జగత్తు యొక్క ప్రతి కార్యమందును తన ప్రమేయము ఉన్నప్పటికిని భగవానుడు సదా తటస్థుడై యుండును. కనుకనే 'వేదాంత సూత్రము'(2.1.34) నందు "వైషమ్యనైర్ఘృణ్యే న"- ఈ భౌతిక జగత్తు ద్వంద్వములతో అతనికెట్టి సంబంధము లేదని చెప్పబడినది. కనుకనే అతడు ఈ ద్వంద్వములకు అతీతుడు. అట్లే భౌతిక జగత్తు యొక్క సృష్టి నందు కాని లయము నందు కాని అతడు ఆసక్తిని కలిగియుండడు. జీవులు తమ పూర్వకర్మల ననుసరించి పలు విధములైన జన్మలను పొందుచుండును. భగవానుడు వాని విషయములో ఎట్టి జోక్యమును చేసుకొనడు.

## 9.10

**మయాధ్యక్షేణ ప్రకృతి: సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! నా శక్తులలో ఒకటైన ఈ భౌతిక ప్రకృతి నా అధ్యక్షతన వర్తించుచు స్థావర జంగమములను సృష్టించుచున్నది. దాని నియమము ననుసరించియే ఈ జగత్తు మరల మరల సృష్టించబడుచు లయము నొందుచున్నది.**

## భాష్యము

దేవాదిదేవుడు భౌతిక జగత్తు కార్యకలాపములకు అతీతముగా నున్నప్పటికిని తానే సర్వమునకు పరమాధ్యక్షుడనని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. దేవాదిదేవుడే ఈ సృష్టికి కారణమైన దివ్యసంకల్పము మరియు పూర్వరంగము. కాని అతని నిర్వహణము మాత్రము భౌతికప్రకృతిచే కొనసాగింప బడుచుండును. శ్రీకృష్ణుడు భగవద్గీత(14.4) నందు వివిధ రూపములలో, జాతులలో గల జీవులన్నింటికిని నేనే తండ్రినని చెప్పుచున్నాడు.సంతానము కొరకై తండ్రి తల్లి గర్భము నందు బీజప్రదానము చేయునట్లు, దేవాదిదేవుడు కేవలము తన వీక్షనముచే జీవులందరిని భౌతిక ప్రకృతి గర్భమున బీజరూపము నందుంచగా, వారు తమ పూర్వపు కోరికలు, కర్మల ననుసరించి వివిధ రూపములలో మరియు జాతులలో జన్మింతురు. ఈ జీవులందరును భగవానుని వీక్షణము చేతనే జన్మించినను, తమ కర్మానుసారము మరియు కోరికల ననుసరించి వివిధ దేహములను పొందవలసివచ్చును. కనుక భగవానునికి ఈ భౌతిక సృష్టితో ఎట్టి సంబంధము లేదు. కేవలము భగవానుని అట్టి వీక్షణము చేతనే భౌతిక ప్రకృతి క్రియాశీలమగుటయు వెంటనే సర్వము సృష్టింపబడుటయు సంభవించును. ఈ విధముగా భగవానుడు భౌతిక ప్రకృతిపై దృష్టి సారించు చున్నందున సృష్టి విషయమున అతడు కర్మనొనరించు చున్నాడను విషయము సందేహరహితమైనను భౌతిక జగత్తు వ్యక్తీకరణము నందు అతనికి ఎట్టి ప్రత్యక్ష సంబంధము లేదు. ఈ విషయమున స్మృతి (విష్ణుపురాణము 1.2.30) ఒక చక్కని ఉపమానమును ఒసగుచున్నది. సువాసన కలిగిన పుష్పము మానవుని ముందున్నప్పుడు దాని సుగంధము అతని ఘ్రాణశక్తిచే స్పృశింపబడును. అయినను మానవుని ఘ్రాణశక్తి మరియు పుష్పములు ఒకదాని నుండి మరొకటి భిన్నములుగా నుండును. భౌతిక జగత్తునకు మరియు దేవాదిదేవునికిని నడుమ ఇట్టి సంబంధమే గలదు. వాస్తవమునకు భౌతికజగత్తులో ఎట్టి సంబంధము లేకున్నను అతడు తన వీక్షణము ద్వారానే దానిని సృష్టించి నియమించును. సారాంశమేమనగా, దేవాదిదేవుని అధ్యక్షత లేకుండ భౌతిక ప్రకృతి ఏమియును చేయజాలదు. అయినను దేవాదిదేవుడు సర్వవిధములైన భౌతిక కర్మలపట్ల అనాసక్తుడై యుండును.

## 9.11
**అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥**

**అనువాదము**

**సర్వమునకు పరమప్రభువునైన నా దివ్యత్వమును వారెరుగక నేను మానవ రూపమున అవతరించినపుడు మూఢులు నన్ను అపహాస్యము చేయుదురు.**

**భాష్యము**

ఈ అధ్యాయము నందలి ఇతర శ్లోకముల వివరణల ననుసరించి మానవ రూపమున అవతరించినప్పటికిని దేవాదిదేవుడు సామాన్య మానవుడు కాడని స్పష్టమగుచున్నది. వాస్తవమునకు సమస్త విశ్వపు సృష్టిస్థితి లయములను గావించు శ్రీకృష్ణభగవానుడు సాధారణ మానవుడు కాజాలడు. అయినను శ్రీకృష్ణుడు కేవలము శక్తివంతుడైన మానవుడేగాని అంతకుమించి ఏదియును కాడని భావించు మూర్ఖులు కలరు. కాని వాస్తవమునకు 'బ్రాహ్మ సంహిత' యందు నిర్ధారింపబడినట్లు శ్రీకృష్ణుడే ఆదిదేవుడు మరియు దేవాదిదేవుడు (ఈశ్వర: పరమ: కృష్ణ:).

వాస్తవమునకు నియంత్రించెడి ఈశ్వరులు అనేకులు గలరు. వారిలో ఒకరికంటెను ఒకరు అధికులుగా నున్నట్లు కనిపింతురు. భౌతిక జగత్తు నందలి సామాన్య లౌకిక కార్యములందు కూడా మనము ఒక అధికారిని, అతని పైని ఒక కార్యదర్శిని, అతని పైని ఒక అధ్యక్షుని చూచుచుందుము. వారందరును తమ పరిధిలో నియంతలైనను మరొకని చేత నియంత్రింపబడుదురు. కాని 'బ్రహ్మ సంహిత' యందు శ్రీకృష్ణభగవానుడు పరమ నియంతమైన పరమేశ్వరుడని చెప్పబడినది. భౌతిక మరియు ఆధ్యాత్మిక జగత్తులలో నిశ్చయముగా అనేకమంది అధికారులు కలరు. కాని శ్రీకృష్ణుడు మాత్రము పరమేశ్వరుడు (ఈశ్వర: పరమ: కృష్ణ:) మరియు అతని దేహము సచ్చిదానందమయమైనది. అనగా అభౌతికము.

గత శ్లోకములలో వర్ణింపబడిన అద్భుత కార్యములను భౌతిక దేహధారులు ఎన్నడును చేయజాలరు. శ్రీకృష్ణభగవానుని దేహము సచ్చిదానందమయమైనది. శ్రీకృష్ణుడు సామాన్య మానవుడు కాకపోయినను, మూఢులు అతనిని అపహాస్యము చేయుచు సామాన్య మానవునిగానే భావింతురు. అతని దేహము ఇక్కడ 'మానుషీం' అని చెప్పబడినది. ఎందుకనగా అతడు అర్జునునికి మిత్రునిగను, కురుక్షేత్ర సంగ్రామముతో సంబంధము గల రాజకీయవేత్తగను, సామాన్య మానవునిగను వ్యవహరించు చున్నాడు. ఈ కార్యములే కాకుండ అనేక ఇతర విషయము లందును అతడు సామాన్య మానవుని వలెనే వర్తించినను వాస్తవమునకు అతని దేహము సచ్చిదానంద మయమైనట్టిది. వైదికభాష యందును ఈ విషయము ఇట్లు స్థిరీకరింపబడినది. "సచ్చిదానందరూపాయ కృష్ణాయ" - "నిత్యానందమయ జ్ఞానరూపుడగు శ్రీకృష్ణభగవానునకు నా ప్రణామముల నర్పింతును." (గోపాలతాపన్యుపనిషత్తు, 1.1) ఈ ఉపనిషత్తు నందే ఇందుకు సంబంధించిన వర్ణనలు అనేకము గలవు, "తమేకం గోవిందమ్ సచ్చిదానందవిగ్రహమ్" - "నీవు గోవులకును మరియు ఇంద్రియములకును ఆనందమును కలిగించు గోవిందుడవు. నీ రూపము సచ్చిదానంద మయమైనది." (గోపాలతాపన్యుపనిషత్తు, 1.35)

ఈ విధముగా శ్రీకృష్ణభగవానుని దేహము దివ్యగుణభరితము మరియు జ్ఞానానందపూర్ణమైనను, పలువురు నామమాత్ర విద్వాంసులు మరియు గీతాభాష్యకారులు

శ్రీకృష్ణుణ్ణి సామాన్య మానవుడని పలుకుచు అపహాస్యము చేయుదురు. మానవుడు తన పూర్వపుణ్యఫలితముల కారణముచే గొప్ప పండితునిగా జన్మించి యుండవచ్చును. కాని శ్రీకృష్ణుని గూర్చిన ఇట్టి భావనకు అల్పజ్ఞానమే కారణము. కనుకనే అతడు మూర్ఖుడుగా పేర్కొనబడును. ఎందుకనగా, 'మూఢులు' మాత్రమే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సామాన్య మానవుగా భావింతురు. వారు శ్రీకృష్ణభగవానుని గుహ్యమైన లీలలను గూర్చియు అతని వివిధ శక్తులను గూర్చియు ఎరుగక పోవుటయే వారి అట్టి భావనకు కారణము. శ్రీకృష్ణభగవానుని దేహము సంపూర్ణ జ్ఞానానందములకు చిహ్నమనియు, అతడే సమస్తమునకు అధికారియనియు, ఎవరికైనను అతడు ముక్తిని ప్రసాదింప గలడనియు వారెరుగ జాలరు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు అనేక దివ్యగుణములను కలిగియున్నదని ఎరుగనందున వారు అతనిని అపహాస్యము చేయుదురు.

అంతేకాకుండ భౌతికజగత్తున దేవాదిదేవుని అవతారము అతని అంతరంగ శక్తి యొక్క వ్యక్తీకరణమని మూఢులెరగరు. అతడే భౌతికశక్తికి ప్రభువు. ఇదివరకే పలుచోట్ల వివరింపబడినట్లు, "మమ మాయా దురత్యయా"- భౌతికశక్తి అత్యంత శక్తిమంతమైనను తన ఆధీనమునందే ఉండుననియు మరియు తనను శరణు పొందినవాడు ఈ భౌతికశక్తి ఆధీనము నుండి సులభముగా విముక్తుడు కాగలడనియు శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు. ఈ విధముగా శ్రీకృష్ణునకు శరణు పొందిన జీవుడు భౌతికశక్తి ప్రభావము నుండి విముక్తుడు కాగలిగినచో, సమస్త విశ్వము యొక్క సృష్టి, స్థితి, లయములను కావించు దేవాదిదేవునకు మన దేహముల వంటి భౌతిక దేహము లెట్లుండును? కనుక శ్రీకృష్ణుని గూర్చిన ఇట్టి భావనము నిశ్చయముగా మూర్ఖత్వమే. సామాన్య మానవుని వలె కనిపించు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడే అణువు మొదలుగా సమస్త విశ్వమును నియంత్రించు వాడని ఆ మూర్ఖులెరగరు. వాస్తవమునకు అత్యంత సూక్ష్మములు మరియు అత్యంత ఘనమైన విషయములు వారి భావనకు అతీతములు. కనుక మానవరూపము వంటి రూపము నందున్నవాడు ఏకకాలమున అనంతమును మరియు సూక్ష్మాతిసూక్ష్మమును ఏ విధముగా నియంత్రింపగలడో వారు ఊహింప జాలరు. వాస్తవమునకు భగవానుడు సూక్ష్మాతిసూక్ష్మమును మరియు అనంతమును నియత్రించుచున్నను ఈ భౌతికసృష్టికి అతీతుడై యుండును. ఊహాతీతమైనట్టి భగవానుని దివ్య అచింత్యశక్తిని గూర్చి తెలుపునపుడు(యోగమైశ్వరమ్) అనగా అతడు సూక్ష్మాతిసూక్ష్మమును మరియు ఘనములలోకెల్ల ఘనమును ఒకే కాలమున నియంత్రిప గలడనియు, అట్లు నియంత్రించు చున్నను వాటికి అతీతముగా నుండగలడనియు స్పష్టముగా చెప్పబడినది. సామాన్య మానవుని వలె అవతరించు శ్రీకృష్ణుడు ఎట్లు అనంతమును మరియు సూక్ష్మాతి సూక్ష్మమైన దానిని నియంత్రింపగలడో మూర్ఖులు ఊహింప లేకున్నను, శుద్ధభక్తులు మాత్రము అతడు దేవాదిదేవుని ఎరిగియున్నందున అట్టి విషయమును అంగీకరింతురు. కనుక వారు అతనికి సంపూర్ణ శరణాగతులై కృష్ణచైతన్యము నందు భగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనియుందురు.

భగవానుడు మానవరూపమున అవతరించుటను గూర్చి సాకార మరియు నిరాకారవాదుల నడుమ అనేక వివాదములు గలవు. కాని కృష్ణవిజ్ఞానమును అవగాహనము చేసికొనుట యందు ప్రామాణిక శాస్త్రగ్రంథములైన భగవద్గీత, శ్రీమద్భాగవతములను పరిశీలించినచో శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని సులభముగా మనము అవగాహన చేసుకొనవచ్చును. అతడు భూమిపై సామాన్య మానవునిగా అవతరించినను వాస్తవమునకు అతడు సామాన్య మానవుడు కాడు. శ్రీమద్భాగవతము(1.1.20) నందు శౌనకాది మహర్షులు శ్రీకృష్ణుని లీలలను గూర్చి ప్రశ్నించినపుడు ఇట్లు చెప్పబడినది :

కృతవాన్ కిల కర్మాణి సహ రామేణ కేశవ: ।
అతిమర్త్యాని భగవాన్ గూఢ: కపటమానుష: ॥

“దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు బలరాముని గూడి సామాన్యమానవుని వలె క్రీడించుచు, ఆ కపట రూపమున అనేక మానవాతీతకర్మల నోనరించెను.” భగవానుడు సామాన్య మానవునిగా అవతరించుట యనునది మూర్ఖులను భ్రాంతికి గురిచేయును. శ్రీకృష్ణుడు భూమిపై నున్నప్పుడు చేసిన అద్భుత కార్యములను ఏ మానవుడును చేయజాలడు. శ్రీకృష్ణుడు తొలుత తన తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులకు చతుర్భుజ రూపమున దర్శనమిచ్చి, పిదప తల్లిదండ్రుల ప్రార్థనపై సాధారణ శిశువుగా మార్పునొందును. శ్రీమద్భాగవతము(10.3.46) నందు ఈ విధముగా తెలుపబడెను. “బభూవ ప్రాకృత: శిశు:” అనగా అతడు తల్లిదండ్రుల ప్రార్థనపై సామాన్యమానవ శిశువుగా మార్పునొందెను. ఇక్కడ భగవానుడిట్లు మానవ రూపమున అవతరించుట యనునది అతని దివ్యదేహము యొక్క లక్షణములందలి ఒక లక్షణమని తెలుపబడినది. గీత యొక్క ఏకాదశాధ్యాయమున శ్రీకృష్ణుని చతుర్భుజ రూపమును అర్జునుడు దర్శింపగోరినట్లు తెలుపబడినది (తేనైవ రూపేణ చతుర్భుజేన). ఆ రూపమును దర్శించిన పిమ్మట అర్జునుడు తిరిగి ప్రార్థించినపుడు శ్రీకృష్ణుడు తన సహజ మానవరూపమును ధరించెను. (మానుషం రూపమ్). దేవాదిదేవుని ఈ వివిధ లక్షణములు నిశ్చయముగా సాధారణ మానవునికి గల సామాన్య లక్షణములు కావు.

మాయావాద తత్త్వముతో ప్రభావితులై శ్రీకృష్ణుని పరిహసించు కొందరు ఆ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సామాన్యమానవునిగా నిరూపించుట కొరకు శ్రీమద్భాగవతము (3.29.21) నందు : “అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థిత: సదా” అను శ్లోకమును ఉదహరించు చుందురు. “నేను ప్రతిజీవి యందును ప్రత్యక్షమై యుండును” అని దాని అర్థము. కాని ఈ ప్రత్యేక శ్లోకవిషయమున శ్రీకృష్ణుని అవమానించు తత్త్వము కలిగిన అప్రామాణికులైన వ్యక్తుల వ్యాఖ్యానముల ననుసరించుట కంటెను వైష్ణవాచార్యులైన శ్రీల జీవగోస్వామి మరియు శ్రీల విశ్వనాథ చక్రవర్తుల వారి వ్యాఖ్యానముల ననుసరించుట ఉత్తమము. శ్రీల జీవగోస్వామి ఆ శ్లోకమునకు వ్యాఖ్యానమును రచిస్తూ, శ్రీకృష్ణుడు తన స్వాంశ రూపమైన పరమాత్మగా సమస్త స్థావర జంగమ వస్తువుల యందు నిలిచి యుండునని తెలిపిరి. కనుక కనిష్ఠాధికారియైన భక్తుడు దేవాలయము లందు గల భగవానుని రూపమైన అర్చామూర్తికి మాత్రమే ప్రాధాన్యమిస్తూ ఇతర జీవులను గౌరవింపనిచో, దేవాలయము నందలి భగవానుని రూపమును పూజించుట నిరుపయోగామగును. భగవద్భక్తులు మూడురకములుగా నుందురు. వారిలో కనిష్ఠాధికారి(ప్రారంభికభక్తుడు) మూడవ రకమునకు చెందినవాడు. అట్టి కనిష్ఠ భక్తులు ఇతరభక్తుల కంటెను దేవాలయము నందలి అర్చామూర్తికే అధిక ప్రాధాన్య మిచ్చుచుందురు. కనుక శ్రీల విశ్వనాథ చక్రవర్తి ఠాకూరు ఈ విధమైన మనస్తత్త్వము తప్పక సరిదిద్దబడవలెనని హెచ్చరించి యుండిరి. శ్రీకృష్ణుడు జీవులందరి హృదయము లందు పరమాత్మగా నెలకొనియుండుట చేత భక్తుడు ప్రతి దేహమును భగవన్మందిర మైనట్లుగా దర్శింపవలెను. భగవానుని మందిరమును గౌరవించునట్లే పరమాత్మ నెలకొనినట్టి ప్రతిదేహమునకు కూడ మానవుడు తగిన గౌరవమివ్వ వలెను. అనగా ప్రతియొక్కరిని గౌరవింపవలెనే గాని ఎవ్వరినీ కించపరచరాదు.

దేవాలయ పూజను తిరస్కరించు నిరాకారవాదులు కూడ కొందరు గలరు. భగవానుడు సర్వత్ర నిండియుండగా ఎవరైనను ఒక్కదేవాలయ పూజకే ఎందుకు

పరిమితులు కావలెనని వారు ప్రశ్నింతురు. కాని నిజముగా భగవానుడు సర్వ వ్యాపియైనచో దేవాలయము నందు గాని అందులో అర్చామూర్తి యందు గాని లేకుండునా యనునది వారికి వేయవలసిన మారు ప్రశ్న. ఈ విధముగా సాకారవాదులు మరియు నిరాకారవాదులు నిరంతరము ఒకరితోనొకరు పోరాడు చున్నను కృష్ణచైతన్యవంతుడైన భక్తుడు మాత్రము 'బ్రహ్మ సంహిత' (5.37) నందు నిర్ధారింపబడినట్లు, శ్రీకృష్ణుడు దేవాదిదేవుడు, సర్వవ్యాపకుడని ఎరుగును. భగవానుడు సదా తన ధామమైన గోలోక వృందావనమున నివసించు చున్నను తన వివిధ శక్తులు మరియు ప్రధాన విస్తారముల ద్వారా అతడు భౌతిక మరియు ఆధ్యాత్మిక జగత్తులలో సర్వత్రా నిలిచియుండును.

### 9.12

**మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతస: ।**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితా: ॥**

## అనువాదము

**ఆ విధముగా మోహితులైనవారు దానవ మరియు నాస్తిక భావములచే ఆకర్షితులగుదురు. అట్టి భ్రాంత స్థితిలో వారి ముక్తికి సంబంధించిన ఆశలు, కామ్యకర్మలు, జ్ఞాన సముపార్జన లన్నియును వ్యర్థములగును.**

## భాష్యము

తమనుతాము కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవ యందు నెలకొనినట్లుగా భావించుచునే ఆంతరంగమున మాత్రము దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పరతత్త్వముగా అంగీకరింపని భక్తులెందరో కలరు. భగవద్ధామమును తిరిగి చేరుట అను భక్తియుక్త సేవా ఫలమును వారెన్నడును ఆస్వాదింపజాలరు. అదేవిధముగా, శ్రద్ధతో కూడిన కామ్యకర్మలందు మరియు పుణ్యకర్మలందు నెలకొనినవారును, భౌతిక బంధముల నుండి విముక్తిని వాంఛించువారును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నిరసించుదురు కనుక విజయమును పొందజాలరు. మరోమాటలో, శ్రీకృష్ణుని పట్ల అపహాస్య భావముతో వర్తించువారు అసుర స్వభావమును లేదా నాస్తిక స్వభావమును కలిగినట్టివారు. భగవద్గీత యందలి సప్తమాధ్యాయము నందు వివరింపబడినట్లు, అట్టి అసుర ప్రవృత్తి గలవారు ఎన్నడును శ్రీకృష్ణుని శరణుపొందరు. కనుక పరతత్త్వమును అవగాహన చేసికొనుటకు యత్నించువారు చేయు మానసిక కల్పనలు సాధారణ జీవుడు మరియు శ్రీకృష్ణుడును ఏకమే, సమానమేనను అభిప్రాయమునకు వారిని చేర్చును. అట్టి మిథ్యాభావనలో మానవుని ప్రస్తుత దేహము భౌతిక ప్రకృతిచే కప్పబడి యున్నదనియు, అతడు ఈ భౌతిక దేహము నుండి విముక్తుడైనంతనే అతనికి మరియు భగవానునికి నడుమ భేదము ఉండదనియు వారు భావింతురు. కాని శ్రీకృష్ణునితో ఏకము కావలెననెడి వారి యత్నములు భ్రాంతి కారణముచే వ్యర్థములగును. అట్టి అసుర మరియు నాస్తిక ప్రవృత్తితో కూడియున్న జ్ఞానసంపాదనము ఎల్లప్పుడు వ్యర్థమని ఈ శ్లోకమున సూచింపబడినది. అట్టి అసుర ప్రవృత్తి గల వ్యక్తులకు 'వేదాంత సూత్రము'లు, ఉపనిషత్తుల వంటి వేదవాఙ్మయము నందలి జ్ఞానసముపార్జనము నిరుపయోగమే కాగలదు.

కనుకనే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సామాన్య మానవునిగా భావించుట మహాపరాధము. అట్లు భావించెడివారు శ్రీకృష్ణుని శాశ్వత స్వరూపమును అవగాహన చేసుకొనజాలరు. కనుక తప్పక భ్రాంతికి గురియగుదురు. 'బృహద్విష్ణు స్మృతి' స్పష్టముగా ఇట్లు చెప్పుచున్నది :

యో వేత్తి భౌతికం దేహం కృష్ణస్య పరమాత్మన:
స సర్వాస్మాద్బహిష్కార్య: శ్రౌతస్మార్తవిధానత:
ముఖం తస్యావలోక్యాపి సచేలం స్నానమాచరేత్

"శ్రీకృష్ణుని దేహమును భౌతికమని భావించు వారిని శృతి మరియు స్మృతుల కర్మ కలాపము లన్నింటి నుండి బహిష్కరింపవలెను. ఎవరైనను అతను ముఖమును పొరపాటున చూచినచో, అట్టి అంటువ్యాధి నుండి విడివడుటకై వెంటనే గంగలో స్నానము చేయవలెను." శ్రీకృష్ణుని దేవాదిదేవత్వము పట్ల అసూయ కలిగిన వారగుటచే కొందరు ఆ విధముగా అతనిని అవమానింతురు. నిశ్చయముగా వారు మరల మరల నాస్తిక, రాక్షస జీవజాతులలో జన్మ తర్వాత జన్మ పొందుటయే వారి గతి. తత్కారణముగా వారి నిజమైన జ్ఞానము శాశ్వతముగా భ్రాంతికిలోనై యుండి క్రమముగా వారు సృష్టియందలి అంధకార బంధురమైన లోకము లందు పడిపోవుదురు.

## 9.13

**మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితా: ।
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥**

**అనువాదము**

**ఓ పార్థా! భ్రాంతచిత్తులు కానటువంటి మహాత్ములు మాత్రము దైవీప్రకృతిని ఆశ్రయించి యుందురు. వారు నన్ను ఆదియును, అవ్యయుడును అగు దేవాదిదేవునిగా నెరిగియుండుటచే నా భక్తియుక్త సేవలో సంపూర్ణముగా నిమగ్నులై యుందురు.**

**భాష్యము**

ఈ శ్లోకమున మహాత్ములైన వారి వర్ణనము స్పష్టముగా ఒసగబడినది. అంతకు పూర్వమే దైవీప్రకృతిలో స్థితిని పొంది యుండుటయే మహాత్ముల ప్రథమ లక్షణము. అతడెన్నడును భౌతిక ప్రకృతికి అధీనుడై యుండడు. అది ఎట్లు సాధ్యమనెడి విషయము సప్తమాధ్యాయము నందు(భ.గీ.7.14) ఇదివరకే ఇట్లు వివరింపబడినది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని శరణు పొందినవాడు శీఘ్రమే భౌతిక ప్రకృతి యొక్క ఆధీనము నుండి విముక్తుడగును. అదియే మహాత్ముని నిజమైన యోగ్యత. కనుక మానవుడు తన ఆత్మను దేవాదిదేవునికి అర్పించినంతనే భౌతిక ప్రకృతి నియంత్రణ నుండి విముక్తుడగుననునది ప్రాథమిక సూత్రము. తటస్థ శక్తియైన జీవుడు భౌతికశక్తి నియంత్రణ నుండి విడివడినంతనే ఆధ్యాత్మిక ప్రకృతి పర్యవేక్షణము నందుంచబడును. అట్టి ఆధ్యాత్మిక ప్రకృతి పర్యవేక్షణమే 'దైవీప్రకృతి' లేక దివ్యప్రకృతి యని పిలువబడుచున్నది. అనగా శ్రీకృష్ణభగవానునికి శరణు పొంది ఆ విధముగా పురోగతి నొందినపుడు మానవుడు 'మహాత్ముడు' అనెడి స్థితిని పొందగలడు.

శ్రీకృష్ణుడే ఆదిపురుషుడు మరియు సర్వకారణములకు కారణమనియు ఎట్టి సందేహము లేకుండ సంపూర్ణముగా ఎరిగియుండుట చేత మహాత్ముడైనవాడు తన మనస్సును శ్రీకృష్ణునిపై నుండి ఇతరము వైపునకు మరలింపడు. మహాత్ములైన శుద్ధభక్తుల సాంగత్యము వలననే అట్టి మహాత్ముడు రూపొందగలడు. శుద్ధభక్తులైన వారు చతుర్భుజములతో కూడిన మహావిష్ణువు వంటి శ్రీకృష్ణుని ఇతర రూపము పట్ల ఆకర్షితులు కాకుండ కేవలము అతని ద్విభుజ రూపము చేతనే ఆకర్షింప బడుదురు. వారెన్నడును శ్రీకృష్ణుని ఇతర రూపముల పట్ల గాని, ఇతర దేవతల పట్ల గాని, మానవుల పట్ల గాని ఆకర్షితులు కారు. సంపూర్ణ కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణుణ్ణి మాత్రమే ధ్యానింతురు. కృష్ణచైతన్యమున వారు నిశ్చలమైన భగవత్సేవ యందు సదా నెలకొని యుందురు.

**9.14**

**సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతా: ।**
**నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥**

**అనువాదము**

**ఈ మహాత్ములు సదా నా మహిమలను కీర్తించుచు, దృఢనిశ్చయముతో యత్నించుచు, నా ముందు నమస్కరించుచు, నన్ను నిత్యము భక్తితో పూజింతురు.**

**భాష్యము**

సామాన్య మానవునికి అధికారికముగా ముద్రవేసి మహాత్మునిగా చేయజాలము. మహాత్ముని లక్షణములు ఇక్కడ వర్ణింపబడినవి. మహాత్ముడైనవాడు సదా దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని మహిమలను కీర్తించుట యందే లగ్నమై యుండును. అతనికి మరో ఇతర కార్యములుండవు. భక్తుడు సదా భగవానుని మహిమలను కీర్తించుట యందే నెలకొనియుండును. అనగా అతడు నిరాకారవాది కాదు. భగవానుని మహిమలను కీర్తించు విషయము చర్చకు వచ్చినప్పుడు మానవుడు దేవాదిదేవుని పవిత్రనామము, నిత్యరూపము, దివ్యగుణములు, దివ్యలీలలు, వైభవములు వంటి లక్షణములను ప్రశంసించుచు పరమపురుషుని కీర్తింపవలెను. కనుక మహాత్ముడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పట్ల ఆసక్తుడై యుండును.

శ్రీకృష్ణభగవానుని నిరాకార లక్షణమైన 'బ్రహ్మజ్యోతి' పట్ల ఆసక్తుడై యుండెడి వాడు భగవద్గీత యందు మహాత్మునిగా వర్ణింపబడలేదు. అట్టివాడు తదుపరి శ్లోకమున ఇందుకు భిన్నముగా వర్ణింపబడెను. శ్రీమద్భాగవతమున తెలుప బడినట్లు, దేవతను గూర్చి గాని, మానవుని గూర్చి గాని కాకుండ విష్ణువు యొక్క శ్రవణ, కీర్తనములతో మహాత్ముడు భక్తియుక్త సేవయందు నిరంతరము నెలకొని యుండును. అదియే భక్తి – "శ్రవణం కీర్తనం విష్ణో: స్మరణం" అనగా విష్ణువును గూర్చి వినుట, కీర్తించుట, స్మరించుట. అట్టి మహాత్ముడు దివ్యమైన భక్తి యొక్క పంచ రసములలో ఏదేని ఒక భక్తిరసము ద్వారా అంత్యమున దేవాదిదేవుని సాంగత్యమును పొందవలెనని దృఢనిశ్చయమును కలిగియుండును. దానియందు విజయమును సాదించుటకు అతడు తన మనోవాక్కాయ కర్మలన్నింటిని ఆ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సేవయందే వినియోగించును. అదియే సంపూర్ణ కృష్ణచైతన్యము.

భక్తియుక్త సేవ యందు 'వ్రతములు' అని పిలువబడు కొన్ని కార్యములు గలవు. ఏకాదశుల రోజున మరియు శ్రీకృష్ణాష్టమి రోజున ఉపవసించుట యనునవి అట్టి దృఢవ్రతములలో కొన్ని. దివ్యధామమున దేవాదిదేవునితో సాంగత్యమును వాంఛించు వారి కొరకై అట్టి నియమ నిబంధనలన్నీ మహనీయులైన ఆచార్యులచే ఏర్పాటు చేయబడినవి. మహాత్ములు అట్టి నియమ నిబంధన లన్నింటిని శ్రద్ధగా పాటింతురు. కావున తప్పక కోరిన ఫలమును పొందగలరు.

ఈ అధ్యాయపు రెండవ శ్లోకమున వర్ణింపబడినట్లు భక్తియుక్త సేవ సులభమే కాకుండ, ఆనందముతో కూడ ఆచరింప సాధ్యమైనట్టిది. కనుక మానవుడు కఠినమైన తపోనిష్ఠలను అవలంబింప నవసరము లేదు. కనుక మానవుడు తాను బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్న్యాసాశ్రమములలో దేని యందున్నను, ఏ స్థితి యందున్నను, ప్రపంచమున ఎక్కడ నివసించు చున్నను కేవలము అనుభవజ్ఞులైన ఆధ్యాత్మికాచార్యుని పర్యవేక్షనమున దేవాదిదేవునకు భక్తియుక్త సేవ నొనరుచ్చు భక్తితో కూడిన జీవితమును గడపవచ్చును. ఆ విధముగా అతడు నిజమైన మహాత్ముడు కావచ్చును.

## 9.15

**జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥**

## అనువాదము

**జ్ఞానసముపార్జన యజ్ఞమునందు నెలకొనిన ఇతరులు దేవాదిదేవుడనైన నన్ను ఏకత్వ భావముతోనూ, కొందరు వివిధ రూపునిగను, మరికొందరు విశ్వరూపునిగను పూజింతురు.**

## భాష్యము

పూర్వపు శ్లోకముల సారాంశమే ఈ శ్లోకము. సంపూర్ణ కృష్ణచైతన్యము నందుండి శ్రీకృష్ణుని తప్ప అన్యమును ఎరుగనివారు మహాత్ములుగా పిలువబడుదురనియు భగవానుడు అర్జునునకు చెప్పుచున్నాడు. అట్టి మహాత్మస్థితికి చెందకున్నను శ్రీకృష్ణుని అనేకరకాలుగా పూజించువారు కొందరు గలరు. వారిలో కొందరు ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులుగను ఇదివరకే వర్ణింపబడి యున్నారు. వీరికంటెను తక్కువ స్థితిలో గల ఇతరులు తిరిగి మూడు రకములుగా విభజింపబడిరి : మొదటిరకము వారు తమ ఆత్మనే భగవానునిగా భావించి తమనుతాము పూజించుకొందురు. రెండవరకము వారు భగవానునికి ఏదోఒక తోచిన రూపమును ఆపాదించి దానిని పూజింతురు. ఇక మూడవరకము వారు భగవానుని 'విశ్వరూపము'ను అంగీకరించి దానిని పూజింతురు. ఈ మూడు రకములలో తమను ఏకత్వవాదులుగా భావించుచు, తమనుతామే భగవానునిగా భావించుచు తమనే పూజించుకొను అధములు కూడ అధికముగా నుందురు. అట్టి మానవులు తామే భగవానునిగా భావించుచు అట్టి మానసిక ప్రవృత్తితో తమనుతాము పూజించుకొందురు. ఇది కూడ ఒక విధమైన దేవపూజయే. ఎందుకనగా, అట్లుచేయువారు తాము భౌతిక శరీరధారులు కామనియు, కేవలము ఆధ్యాత్మిక ఆత్మస్వరూపుల మేననియు పూర్తిగా ఎరిగియుందురు. కనీసము వారి యందు అట్టి భావనము ప్రబలముగానైన ఉండును. సాధారణముగా, నిరాకార వాదులు దేవాదిదేవుని ఈ విధముగానే పూజింతురు.

ఏ రూపమైనను భగవానుని రూపమేననెడి భావనలో ఇతర దేవతార్చనము చేయువారు రెండవ తరగతికి చెందినవారు. ఇక మూడవ తరగతికి చెందినవారు ఈ విశ్వమునకు అతీతమైన దానిని ఊహింపలేక విశ్వమునే దివ్యవ్యవస్థగా లేక దివ్యజీవునిగా భావించి దానినే పూజింతురు. అట్టి విశ్వము కూడా భగవానుని రూపమే అయియున్నది.

**9.16**

**అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మన్త్రో హమహమేవాజ్య మహమగ్నిరహం హుతమ్ ॥**

## అనువాదము

**కాని నేనే క్రతువును, నేనే యజ్ఞమును, పూర్వుల కొసగబడు ఆహుతిని, ఔషధమును, దివ్యమంత్ర జపమును అయియున్నాను. ఆజ్యమును, అగ్నిని, హుతమును కూడా నేనే.**

## భాష్యము

'జ్యోతిష్టోమము' అను వైదిక యజ్ఞము కూడ శ్రీకృష్ణుడే. అట్లే స్మృతుల యందు తెలుపబడిన 'మహాయజ్ఞము' కూడా అతడే. పితృలోకమునకు అర్పింపబడు హోమద్రవ్యము లేక పితృలోక ప్రీత్యర్థమే చేయబడు యజ్ఞము కూడా శ్రీకృష్ణుడే. అట్టి ఆహుతలు నెయ్యిరూపున గల ఔషధముగా పరిగణింపబడును. ఈ సందర్భమున జపింపబడు మంత్రములు కూడ శ్రీకృష్ణుడే. యజ్ఞములందు ఆహుతి చేయుటకు పాలతో చేయబడినట్టి ఇతర పదార్థము లన్నియును శ్రీకృష్ణుడే. పంచభూతములలో అగ్ని కూడ ఒకటియైనందున అది కూడ శ్రీకృష్ణుడే. కనుకనే అది శ్రీకృష్ణుని ప్రత్యేకశక్తిగా భావింపబడును. మరోమాటలో, వేదములందు తెలుపబడిన 'కర్మకాండ' విభాగములలో నిర్దేశింపబడిన వైదిక యజ్ఞము లన్నియు వాస్తవమునకు శ్రీకృష్ణుడే. అనగా శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవయందు నెలకొనినవారు వేదములందు తెలుపబడిన సమస్త యజ్ఞములను నిర్వహించినట్టి వారిగనే భావింపవలెను.

**9.17**

**పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్రం ఓంకార ఋక్సామ యజురేవ చ ॥**

## అనువాదము

**నేను ఈ జగత్తునకు తండ్రిని, తల్లిని, పోషకుడను, పితామహుడను అయి యున్నాను. జ్ఞానలక్ష్యమును, పవిత్రము చేయువాడను, ఓంకారమును నేనే. ఋగ్వేదము,సామవేదము, యజుర్వేదములు కూడా నేనే.**

## భాష్యము

చేతనాచేతన సృష్టులన్నియు శ్రీకృష్ణుని శక్తి యొక్క వివిధ లీలల వ్యక్తీకరణమై యున్నది. ప్రస్తుత భౌతిక స్థితిలో మనము శ్రీకృష్ణుని తటస్థ శక్తులేయైన వివిధ జీవులతో

వివిధ సంబంధమును కల్పించుకొందుము. ప్రకృతి కారణముగా అట్టిజీవులలో కొందరు మనకు తండ్రిగను, తల్లిగను, తాతగను, సృష్టికర్తగను కనిపింతురు. కాని వాస్తవమునకు అట్లు గోచరించు వారందరును శ్రీకృష్ణుని యందలి అంశలే. కనుకనే తల్లి తండ్రి వంటి వివిధ రూపములలో కనిపించునట్టి జీవులందరును శ్రీకృష్ణుడే కాని మరొక్కరు కాదు. ఈ శ్లోకము నందలి 'ధాతా' యను పదమునకు 'సృష్టికర్త'యని అర్థము. మన తల్లిదండ్రులు మాత్రమే కాకుండ సృష్టికర్త, పితామహి. పితామహులు వంటివారు కూడ శ్రీకృష్ణుని అంశలే! వాస్తవమునకు శ్రీకృష్ణుని అంశలై యున్నందున జీవులందరును శ్రీకృష్ణులే. కనుక వేదములన్నియు శ్రీకృష్ణునే ఉద్దేశించుచున్నవి. కనుకనే మనము వేదముల నుండి ఎరుగుటకు యత్నించినను అది శ్రీకృష్ణుని గూర్చిన జ్ఞానమును పొందుటలోని పురోగతియే యగును. మన సహజస్థితిని పవిత్రీకరించు కొనుటకు తోడ్పడు జ్ఞానము కూడ శ్రీకృష్ణుడే. అల్లే శాస్త్రసిద్ధాంతములను అవగాహన చేసుకొనుట యందు జిజ్ఞాసువైన జీవుడు కూడ శ్రీకృష్ణుని అంశభూతుదగుటచే అతడును శ్రీకృష్ణుడే. వేదమంత్రము లందు 'ప్రణవము' అని పిలువబడు 'ఓంకార' దివ్యధ్వని కంపనము కూడ శ్రీకృష్ణుడే. సామ, యజుర్వేద, ఋగ్వేదము మరియు అథర్వణ వేదములందలి మంత్రము లన్నింటియందు 'ప్రణవము' లేక 'ఓంకారము' మిక్కిలి ప్రధానమగుటచే దానిని కూడ శ్రీకృష్ణుడేనని అవగాహనము చేసికొనవలెను.

## 9.18

**గతిర్భర్తా ప్రభు: సాక్షీ నివాస: శరణం సుహృత్ ।**
**ప్రభవ: ప్రలయ: స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥**

### అనువాదము

**గమ్యమును, పోషకుడను, ప్రభువును, సాక్షిని, నివాసమును, ఆశ్రయమును, మిక్కిలి సన్నిహిత మిత్రుడును నేనే. నేనే సృష్టిని, ప్రళయమును, సర్వాధారమును, నిధానమును, నిత్య బీజమును అయియున్నాను.**

### భాష్యము

'గతి:' యనగా మనము చేరగోరు గమ్యస్థానమని భావము. జనులు తెలియ కున్నను వాస్తవమునకు వారందరికీ చరమగమ్యము శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణుని ఎరుగనివాడు పెడదారి పట్టినవాడే యగును. అంతేకాకుండ అట్టివాని నామమాత్ర పురోగతి యంతయూ పాక్షికము లేదా భ్రాంతిమాత్రమే కాగలదు. వివిధ దేవతలను తమ గమ్యస్థానములుగా భావించువారు పలువురున్నారు. వారు ఆ యా స్థానములకు తదనుగుణములైన నియమములను శ్రద్ధతో అవలంబించుటచే చంద్రలోకము, సూర్యలోకము, ఇంద్రలోకము, మహర్లోకము అను వివిధ లోకములను పొందుదురు. శ్రీకృష్ణుని సృష్టియే అయినందున ఆ లోకము లన్నియు ఏకకాలమున శ్రీకృష్ణునితో సమానము లగుటయు మరియు కాకపోవుటయు సంభవించును. అట్టిలోకములు కృష్ణశక్తి యొక్క వ్యక్తీకరణము లగుటచే శ్రీకృష్ణునితో సమానమైనను వాస్తవమునకు అవి శ్రీకృష్ణుని సంపూర్ణ జ్ఞానమును పొందుటకు ఒక ముందు అడుగుగా మాత్రమే ఉపయోగపడును. అనగా శ్రీకృష్ణుని వివిధ శక్తులను శమీపించుట లేదా వాటిని గమ్యముగా భావించుట యనునది శ్రీకృష్ణుని పరోక్షముగా సమీపించుటయే. కాని ఎవ్వరైనను కాలము మరియు శక్తి యనునవి వ్యర్థము కాకూడదని భావించినచో ప్రత్యక్షముగా శ్రీకృష్ణునే సమీపింపవలెను. ఉదాహరణకు అనేక అంతస్థులు కలిగిన భవంతి యొక్క చివరి అంతస్థును చేరుటకు యంత్ర

సహాయమున వెళ్ళుటకు అవకాశమున్నచో మెట్టు మెట్టు చొప్పున ఎక్కుట ఎందుకు? సర్వము శ్రీకృష్ణుని శక్తిపైననే ఆధారపడి యున్నందున శ్రీకృష్ణుని ఆశ్రమము లేకుండ ఏదియును స్థితిని కలిగియుండలేదు. సర్వము శ్రీకృష్ణునికే చెంది యుండుట చేతను, సర్వమును అతని శక్తిపైననే ఆధారపడి యుండుట చేతను, వాస్తవమునకు సర్వమునకు ఆ శ్రీకృష్ణుడే పరమ నియామకుడు. అతడు అందరి హృదయము లందు పరమాత్మగా నెలకొని యుండుటచే అతడే దివ్యసాక్షి. మన నివాసములు, దేశములు లేక లోకములన్నియు శ్రీకృష్ణుడే! శ్రీకృష్ణుడే చరమాశ్రయ మైనందున రక్షణము కొరకు గాని లేదా దుఃఖనివారణము కొరకు గాని మనము అతనినే ఆశ్రయింపవలెను. మనకు ఏదేని రక్షణము అవసరమైనప్పుడు దానిని సమకూర్చునది ఒక సజీవశక్తియై యుండవలెనని మనము గుర్తింపవలెను. శ్రీకృష్ణుడే పరమపురుషుడు. అతడే మన పుట్టుటకు కూడ కారణుడైనందున లేదా దివ్యజనకుడగుటచే అతనికంటె గొప్ప మిత్రుడు గాని, గొప్ప శ్రేయోభిలాషి గాని మనకు మరొకడుండజాలడు. సమస్త సృష్టికి శ్రీకృష్ణుడే ఆదికారణుడు మరియు ప్రళయానంతరము సర్వమునకు చరమ నిదానమునై యున్నాడు. కనుకనే శ్రీకృష్ణుడే సర్వకారణములకు మూలకారణము.

**9.19**

**తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।**
**అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥**

**అనువాదము**

**ఓ అర్జునా! వేడినొసగువాడును నేనే. వర్షమును నిరోదించువాడను మరియు కురిపించువాడను నేనే. అమృతతత్వమును మరియు మృత్యువును నేనే. సత్, అసత్తులు రెండును నా యందే కలవు.**

**భాష్యము**

శ్రీకృష్ణభగవానుడు తన వివిధ శక్తులచే విద్యుత్తును, సూర్యుల ద్వారా వేడిని, వెలుతురును వ్యాపింపజేయు చుండును. వేసవికాలమున ఆకాశము నుండి వర్షము కురియకుండ నిరోధించువాడును, వర్షాకాలమున నిర్విరామముగా కుండపోత వర్షములు కురిపించువాడును శ్రీకృష్ణుడే. మన జీవితకాలమును పొడిగించుచు మనలను పోషించు ప్రాణశక్తి కూడ శ్రీకృష్ణుడే. అంత్యమున శ్రీకృష్ణుడే మృత్యువుగా మనలకు దర్శనమిచ్చును. శ్రీకృష్ణుని వివిధ శక్తులను విశ్లేషించి చూచినచో, శ్రీకృష్ణునకు భౌతికము మరియు ఆధ్యాత్మికముల నడుమ ఎట్టి భేదము లేదని మనము నిర్ణయించుకోవచ్చును. అనగా భౌతికము(అసత్), ఆధ్యాత్మికము(సత్) రెండును అతడే. కనుకనే కృష్ణచైతన్యమున పురోగమించిన స్థితియందు మానవుడు అట్టి సత్తు, అసత్తుల నడుమ భేదమును గాంచడు. అతడు అన్నింటియందు శ్రీకృష్ణునినే దర్శించును.

ఆధ్యాత్మికము (సత్తు) మరియు భౌతికము(అసత్తు) రెండును శ్రీకృష్ణుడు అయినందున సర్వ భౌతిక వ్యక్తీకరణములతో కూడిన బ్రహ్మాండమైన విశ్వరూపము కూడ శ్రీకృష్ణుడే. అంతేకాకుండ ద్విభుజములు గల శ్యామసుందరునిగా వేణు నాదమును చేయు వృందావన మందలి అతని దివ్యలీలలన్నియు ఆ దేవాదిదేవునికి సంబంధించినవే.

## 9.20

**త్రైవిద్యా మాం సోమపా: పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే।**
**తే పుణ్యమాసాద్య సురేన్ద్రలోకమశ్నన్తి దివ్యాన్దివి దేవభోగాన్ ॥**

### అనువాదము

**స్వర్గలోకములను వాంఛిస్తూ వేదాధ్యయనము చేయువారు మరియు సోమరసమును పానము చేయువారు పరోక్షముగా నన్నే పూజింతురు. పాప ఫలముల నుండి పవిత్రులై అట్టివారు పుణ్యలోకమైన ఇంద్రలోకమును పొంది దేవభోగముల ననుభవింతురు.**

### భాష్యము

ఈ శ్లోకము నందలి 'త్రైవిద్యా:' అను పదము సామవేదము, యజుర్వేదము, ఋగ్వేదములను సూచించుచున్నది. ఇట్టి త్రివేదములను అధ్యయనము చేసిన బ్రాహ్మణుని 'త్రివేది' అందురు. ఈ వేదములందు తెలుప బడిన జ్ఞానము యెడ ఆకర్షణను కలిగియుండువారు సమాజమున తప్పక గౌరవింపబడుదురు. కాని దురదృష్టవశాత్తు వేదాధ్యయనము వలన కలుగు పరమ ప్రయోజనమును తెలియని గొప్ప వేదపండితులే అధికముగా నున్నారు. కనుకనే శ్రీకృష్ణుడిచ్చట 'త్రివేదులకు' తానే అంతిమ లక్ష్యమని ప్రకటించు చున్నాడు. నిజమైన 'త్రివేదులు' శ్రీకృష్ణభగవానుని పాదపద్మముల నాశ్రయించి అతని ప్రీత్యర్థమై శుద్ధభక్తి యుక్తసేవ యందు నెలకొనియుందురు. అట్టి భక్తియుక్త సేవ 'హరే కృష్ణ' మహామంత్రమును జపించుటతోను మరియు అదేసమయమున శ్రీకృష్ణుని గూర్చి యథార్థముగా ఎరుగుటకొరకును చేయు ప్రయత్నముతోను ఆరంభమగును. కాని దురదృష్టవశాత్తు శ్రద్ధగా వేదాధ్యయనము చేయువారు సాధారణముగా ఇంద్రుడు, చంద్రుడు వంటి దేవతల కొరకై యజ్ఞములు చేయుట యందే అధికాసక్తిని చూపుదురు. అట్టి ప్రయత్నములచే వివిధ దేవతార్చకులు ప్రకృతి యొక్క రజోతమో గుణకాలుష్యముల నుండి తప్పక శుద్ధిపొంది మహర్లోకము, జనలోకము, తపోలోకము వంటి ఊర్ధ్వలోకములకు(స్వర్గలోకములను) చేరుదురు.

ఒకమారు అట్టి ఉన్నత లోకములను పొందిన పిమ్మట మానవుడు ఈ భూలోకము కంటెను అనేక వందల, వేల రెట్లు అధికముగా తన ఇంద్రియములకు సుఖము కలిగించు కొనవచ్చును.

## 9.21

**తెతం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే ॥**

### అనువాదము

**ఈ విధముగా విస్తృతమైన స్వర్గలోక భోగముల ననుభవించి తమ పుణ్య కార్యముల ఫలము క్షీణించినంతనే వారు భూలోకమునకు తిరిగి వత్తురు. ఈ విధముగా త్రివేదముల సిద్ధాంతముల ననుసరించుట ద్వారా ఇంద్రియ**

**భోగములను వాంఛించువారు కేవలము జననమరణములనే మరల మరల పొందుదురు.**

భాష్యము

ఊర్ధ్వలోకములకు ఉద్ధరింపబడినవాడు దీర్ఘాయువును మరియు ఇంద్రియ భోగానుభవమునకు అధికమైన వసతులను పొందగలిగినను ఆతడచ్చట శాశ్వతముగా నుండుటకు అనుమతింపబడడు. అతడు చేసిన పుణ్యకర్మల ఫలములు క్షీణించినంతనే అతడు తిరిగి ఈ భూమిపైకి పంపబడును. 'వేదాంత సూత్రము' లందు చెప్పబడినట్లు (జన్మాద్యస్య యత:) సంపూర్ణ జ్ఞానమును పొంద నట్టివాడు, అనగా సర్వకారణకారణుడైన శ్రీకృష్ణుని అవగతము చేసుకొనుటలో విఫలుడైనవాడు, జీవితపు పరమలక్ష్యమును పొందజాలక పైకిక్రిందికిని తిరుగుచుండు చక్రము (రంగులరాట్నము) పై కూర్చున్నవానివలె కొన్నిమార్లు ఊర్ధ్వ లోకమునకు ఉద్ధరింపబడుతూ, మరికొన్నిమార్లు తిరిగి క్రిందకు చేరుచుండును. సారాంశమేమనగా, మానవుడు తిరిగి క్రిందికి తిరిగి వచ్చే అవకాశమే లేనటువంటి ఆధ్యాత్మిక లోకమునకు ఉద్ధరింపబడుటకు బదులు అతడు కేవలము ఊర్ధ్వ, అధోలోకముల నడుమ జననమరణ చక్రము నందే తిరుగాడుచుండును. కనుక మానవుడు జ్ఞానానందపూరితమైన శాశ్వతజీవితమును అనుభవించుటకు ఆధ్యాత్మిక లోకమును పొంది, తిరిగి ఈ దుఃఖపూరితమైన భౌతిక జీవితమునకు తిరిగి రాకుండుటకై యత్నించుట మంచిది.

**9.22**

**అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనా: పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

అనువాదము

**కాని నా దివ్యరూపమును ధ్యానించుచు అనన్య భక్తిచే నన్ను సదా అర్చించు వారి యోగక్షేమములను నేనే వహింతును(వారికి లేనివాటిని సమకూర్చుదును, వారికున్న వాటిని రక్షింతును).**

భాష్యము

కృష్ణచైతన్యము లేకుండ క్షణకాలమును జీవింపలేనివాడు శ్రవణము, కీర్తనము, స్మరణము, వందనము, అర్చనము, పాదపద్మముల సేవ ఇతర సేవలను చేయుట, సఖ్యము, ఆత్మనివేదనముల ద్వారా భక్తియుక్త సేవ యందు నెలకొని యుండి దినములోని ఇరువది నాలుగు గంటలు శ్రీకృష్ణుని స్మరించుట కంటె అన్యమును కావింపడు. అట్టి కార్యములన్నియు భక్తుని ఆత్మానుభూతి యందు పరిపూర్ణుని కావింపగలవు. కనుకనే అవి సర్వ మంగళకరములు మరియు ఆధ్యాత్మిక శక్తివంతములై యుండును. కనుక దేవాదిదేవుని సాంగత్యమును పొందుటయే అతని ఏకైక వాంఛ కాగలదు. అట్టి భక్తుడు నిస్సందేహముగా ఎట్టి అవరోధములు లేకుండా భగవానుని చేరగలడు. ఇదియే 'యోగ' మనబడును. భగవానుని కృపచే అట్టి భక్తుడు ఎన్నడును ఈ భౌతిక జీవన స్థితికి తిరిగిరాడు. 'క్షేమము' అను పదము భగవానుని దయతో కూడిన రక్షణమును సూచించుచున్నది. భగవానుడు 'యోగ' ద్వారా కృష్ణచైతన్యము పొందుటకు భక్తునకు తోడ్పడును. అతడు సంపూర్ణ కృష్ణచైతన్యవంతుడైన పిమ్మట దుఃఖపూరితమైన బద్ధజీవితమునకు తిరిగి పతనము చెందకుండ భగవానుడు రక్షించును.

**9.23**
**యే ప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః ।**
**తే పి మామేవ కౌన్తేయ యజన్త్యవిధిపూర్వకమ్ ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! అన్యదేవతలకు భక్తులై వారిని శ్రద్ధతో పూజించువారు వాస్తవమునకు అవిధిపూర్వకముగా నన్నే పూజించుచున్నారు.**

## భాష్యము

దేవతలను పూజించుట యందు నెలకొనినవారు చేసెడి అట్టి పూజ పరోక్షముగా తనకే అర్పింపబడినను వారు నిజమునకు బుద్ధిమంతులు కారని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు. ఉదాహరణకు, ఒకడు కొమ్మలపైనను, ఆకులపైనను నీరుపోయుచు వ్రేళ్ళకు నీరు అందించనిచో తగిన జ్ఞానము లేనివాడుగా లేక నియమపాలనము లేనివాడుగా పరిగణింపబడును. అట్లే, ఉదరమునకు ఆహారమును అందించు విధానమే శరీరము యొక్క వివిధ అవయవములకు పుష్టిని కలిగించుట లేదా సేవించుట కాగలదు. వాస్తవమునకు దేవతలు దేవాదిదేవుని ప్రభుత్వము నందలి వివిధ అధికారులు మరియు నిర్దేశకుల వంటివారు. మానవుడు అధికారుల చేతను నిర్దేశకుల చేతను కాకుండ ప్రభుత్వముచే చేయబడిన శాసనముల ననుసరింపవలెను. అట్లే ప్రతివ్యక్తియు దేవాదిదేవునే పూజింపవలెను. తద్వారా భగవానుని ప్రభుత్వము నందలి వివిధ అధికారులు మరియు నిర్దేశకు లందరును సహజముగనే తృప్తినొందెదరు. అధికారులు మరియు నిర్దేశకులు ప్రభుత్వ ప్రతినిధులుగా తమ కార్యములందు నెలకొని యున్నందున వారికి లంచమివ్వజూచుట వాస్తవమునకు చట్టవిరుద్ధమగును. ఈ విషయమే ఇక్కడ 'అవిధిపూర్వకమ్' అని చెప్పబడినది. అనగా శ్రీకృష్ణభగవానుడు అనవసరమైన అన్య దేవతార్చనమును ఇక్కడ ఆమోదించుట లేదు.

**9.24**
**అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।**
**న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే ॥**

## అనువాదము

**నేనే సర్వయజ్ఞములకు భోక్తను మరియు ప్రభువును అయియున్నాను. అందుచే నా వాస్తవమైన దివ్యస్వభావమును గుర్తింపలేనివారు పతనము చెందుదురు.**

## భాష్యము

వైదిక గ్రంథము లందు పలువిధములైన యజ్ఞాచరణములు నిర్దేశింపబడి యున్నను, వాస్తవమునకు అవియన్నియును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సంతృప్తి పరచుట కొరకే నిర్దేశింప బడినవని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. 'యజ్ఞ'మనగా విష్ణువు. భగవద్గీత(3.9) యజ్ఞుడు లేదా విష్ణువును సంతృప్తిపరచుట కొరకై ప్రతియొక్కరూ కర్మనొనరింపవలెనని స్పష్టముగా తెలుపబడినది. మానవ నాగరికతకు పరిపక్వరూపమైన వర్ణాశ్రమ ధర్మము ప్రత్యేకించి విష్ణువును సంతృప్తి పరచుట కొరకై

ఉద్దేశింపబడినది. కనుకనే శ్రీకృష్ణభగవానుడు ఈ శ్లోకమున : "నేనే పరమ ప్రభువును కావున సర్వయజ్ఞములకు నేనే భోక్తను" అని పలుకు చున్నాడు. కాని మందబుద్ధులు ఈ సత్యము నెరుగక తాత్కాలిక లాభముల కొరకై దేవతలను పూజింతురు. కనుక వారు భౌతికజీవనస్థితికి పతనము చెంది ఎన్నడును మానవజన్మ యొక్క వాంఛిత లక్ష్యమును పొందజాలరు. అయినను ఎవరైనను భౌతికవాంఛలు నెరవేరవలెనని వాంఛించినచో, అది శుద్ధభక్తి కాకున్నను వారు వాటికొరకై భగవానుని ప్రార్థించుటయే ఉత్తమము. తద్వారా వారు వాంఛిత ఫలములను పొందుదురు.

## 9.25

**యాన్తి దేవవ్రతా దేవాన్పితౄన్యాన్తి పితృవ్రతా: ।**
**భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినో௨పి మామ్ ॥**

## అనువాదము

**దేవతలను పూజించువారు దేవతలలో జన్మింతురు. పితృదేవతలను పూజించు వారు పితృలోకమునకు చేరుదురు. భూతప్రేతములను పూజించువారు వాని యందే జన్మింతురు. కాని నన్ను పూజించువారు నాతోనే నివసింతురు.**

## భాష్యము

చంద్రలోకమును గాని, సూర్యలోకమును గాని లేదా మరియే ఇతర లోకమును గాని మానవుడు చేరగోరినచో ఆ ప్రయోజనమునకై ప్రత్యేకముగా వేదములందు నిర్దేశింపబడిన సాంకేతికములైన 'దర్శపౌర్ణమాసి' వంటి నియమముల ననుసరించుట ద్వారా వాంఛితమైన గమ్యమును సాధింపగలడు. ఇవి వేదముల యందలి 'కర్మకాండ' భాగములందు విశదముగా వర్ణింపబడిన ఈ పద్ధతులు వివిధ ఉన్నత లోకములందలి దేవతల కొరకు 'ప్రత్యేక' పూజలను నిర్దేశించుచున్నవి. అట్లే ప్రత్యేక యజ్ఞముల ద్వారా మానవుడు పితృలోకములను చేరవచ్చును. లేదా పెక్కు భూతప్రేతలోకములను చేరి యక్షునిగా గాని, రాక్షసునిగా గాని లేక పిశాచముగా గాని మారవచ్చును. పిశాచపూజను వాస్తవమునకు 'క్షుద్రదేవతా పూజ' అందురు. అట్టి క్షుద్రదేవతా పూజను అభ్యసించు వారెందరో గలరు. వారు దానిని ఆధ్యాత్మికమని భావించినను అట్టి కర్మలన్ని పూర్తిగా భౌతికములైనవి. అట్లే దేవాదిదేవునే అర్చించు శుద్ధభక్తుడు వైకుంఠ లోకములను గాని, కృష్ణలోకమును గాని తప్పక పొందును. దేవతలను పూజించుట ద్వారా దేవతా లోకములను, పితృదేవతలను పూజించుట ద్వారా పితృలోకములను, క్షుద్రదేవతలను పూజించుట ద్వారా పిశాచలోకములను మానవుడు పొందు చుండగా, శుద్ధభక్తుడు ఎందుకు వైకుంఠ లోకములను లేదా కృష్ణలోకమును పొందకుండునను ముఖ్యమైన విషయమును ఈ శ్లోకము ద్వారా సులభముగా గ్రహింపవచ్చును. దురదృష్టవశాత్తు, శ్రీకృష్ణుడు మరియు విష్ణువు వసించు ఈ దివ్య లోకములను గూర్చిన సమాచారము చాలామందికి తెలియదు. అది తెలియనందునే వారు పతితులగుదురు. నిరాకారవాదులు కూడ 'బ్రహ్మజ్యోతి' నుండి పతితులగుదురు. కనుకనే కేవలము 'హరే కృష్ణ' మహామంత్రమును జపించుట ద్వారా మానవుడు ఈ జీవితమున పరిపూర్ణత్వమును సాధించి తిరిగి భగవద్ధామమును చేరగలడనెడి మహత్తరమైన సందేశమును కృష్ణచైతన్యోద్యమము మానవ సమాజమంతటికిని అందించుచున్నది.

## 9.26
**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మన: ॥**

## అనువాదము

**ఎవరైనను నాకు ప్రేమతోడను, భక్తితోడను పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని లేదా జలమును గాని అర్పించినచో దానిని నేనంగీకరింతును.**

## భాష్యము

నిత్యానందము కొరకై శాశ్వతమును మరియు ఆనంద నిధానమును అగు భగవద్ధామమును పొందుటకు వివేకవంతుడైనవాడు కృష్ణచైతన్యవంతుడై శ్రీకృష్ణభగవానుని దివ్యమైన ప్రేమయుక్త సేవయందు నెలకొనవలెను. అట్టి అద్భుత ఫలమును కలుగజేయు పద్ధతి వాస్తవమునకు అత్యంత సులభము. ఎట్టి యోగ్యత లేని పరమ దరిద్రునికి కూడ అది ఆచరణ సాధ్యమగును. కేవలము శ్రీకృష్ణభగవానునికి శుద్ధభక్తుడై యుండుటయే ఈ విషయమున వాంఛనీయమగు ఏకైక యోగ్యత. మానవుని దేశకాల పరిస్థితులతో దానికెట్టి సంబంధమును లేదు. ఈ విధానము మిక్కిలి సులభమైనది. మానవుడు భక్తితోను ప్రేమతోను దేవాదిదేవునికి పత్రమును గాని, జలమును గాని, ఫలమును గాని అర్పింప వచ్చును. భగవానుడు దానిని సంతోషముతో అంగీకరించును. కనుక కృష్ణచైతన్య విధానము అత్యంత సులభము మరియు విశ్వజనీన మైనందున దీనియందు ఎవ్వరికినీ నిషేధము లేదు. అట్టియెడ ఈ సులభమైన మార్గము ద్వారా కృష్ణచైతన్యమును పొంది అత్యున్నతమైన నిత్యానంద జ్ఞానమయమైన పరిపూర్ణ జీవితమును వాంఛింపని అజ్ఞాని ఎవడుండును? శ్రీకృష్ణుడు ప్రేమపూర్వక సేవనే వాంఛించును గాని అన్యమును కాదు. తన శుద్ధభక్తులు సమర్పించు చిన్న పుష్పము నైనను శ్రీకృష్ణుడు అంగీకరించును. అభక్తుల నుండి అతడు ఎట్టి కానుకను కోరడు. ఆత్మారాము డైనందున అతడు ఇతరుల నుండి కోరునదేదియును లేదు. అయినను అతడు ప్రేమానురాగ భావముతో తన భక్తులు సమర్పించు దానిని ప్రీతితో స్వీకరించును. అట్టి కృష్ణచైతన్యమును వృద్ధి పరచుకొనుటయే జీవితము నందలి అత్యున్నత పరిపూర్ణత్వ స్థితి. ‘భక్తి’ లేక భక్తియుక్త సేవయే శ్రీకృష్ణుని పొందుటకు ఏకైక మార్గమని ఖచ్చితముగా నొక్కిచెప్పుటకై ఈ శ్లోకమున ‘భక్తి’ అను పదము రెండుమార్లు వాడబడినది. బ్రాహ్మణుడగుట, పండితుడగుట, ధనవంతుడగుట లేదా గొప్ప తత్త్వవేత్తయగుట వంటి ఇతర ఏ విధానము చేతను మానవుడు తాను సమర్పించు దానిని శ్రీకృష్ణుడు అంగీకరించునట్లుగా చేయజాలడు. మూలసిద్ధాంతమైన భక్తిలేకుండ ఎవ్వరును దేనిని భగవానునిచే అంగీకరింపజాలరు. కనుకనే ‘భక్తి’కి ఎన్నడును భౌతికమైన కారణమేదియును లేదు. ఈ విధానము శాశ్వతమైనది. అదియే పరతత్త్వమునకు చేయబడు ప్రత్యక్ష సేవాకార్యరూపము.

శ్రీకృష్ణుడు తానే భోక్తననియు, దేవాదిదేవుడననియు, సమస్త యజ్ఞములకు పరమ లక్ష్యమనియు నిర్ధారించిన పిమ్మట తనకెట్టి యజ్ఞఫలములను సమర్పింప వలెనో ప్రకటించు చున్నాడు. భగవానుని దివ్యమైన భక్తియుక్త సేవను పొందుటయే ప్రతియొక్కరి జీవితలక్ష్యము. దీనికై ఎవ్వరైనను భగవత్సేవ యందు నెలకొని పవిత్రుడు కాగోరినచో, అతడు ముందుగా భగవానుడు తన నుండి ఏమి ఆశించునో ఎరుగుట అత్యంత ప్రధానము. శ్రీకృష్ణుని ప్రేమించువాడు, శ్రీకృష్ణుడు కోరిన వాటినన్నింటిని

సమర్పిస్తూ అతడు వాంఛించనట్టి ఎట్టి కానుకను అతనికి సమర్పింప కుండును. కనుక మాంసము, మత్స్యములు, గ్రుడ్లు శ్రీకృష్ణునకు సమర్పింపరాదు. అతడు అటువంటి వాటిని వాంఛించినచో వాటిని తనకు అర్పింపుమని చెప్పి యుండెడివాడు. అట్లు చెప్పకుండ తనకు పత్రము, పుష్పము, ఫలము, జలమును సమర్పింప వలెనని అతడు స్పష్టముగా పలికి, “ఇట్టి కానుకలను నేను అంగీకరింతును” అని చెప్పుచున్నాడు. కనుక అతడు మాంసమును, చేపలను, గ్రుడ్లను స్వీకరింపడని మనము అవగతము చేసుకొనవలెను. కాయకూరలు, ధాన్యము, ఫలములు, పాలు, జలము వంటి పదార్థములు మానవునికి తగిన ఆహారములుగా శ్రీకృష్ణభగవానుడు నిర్దేశించు చున్నాడు, వీటికి అన్యమైన వాటిని అర్పించినచో అతడు అంగీకరింపడు. కనుక వాటిని అతనికి సమర్పింపరాదు. ఒకవేళ మనము అట్టి ఇతర పదార్థములను సమర్పింప యత్నించినచో, ప్రేమతో కూడిన స్థితి యందు భక్తినొనరించినవారము కాజాలము.

శ్రీకృష్ణభగవానుడు తృతీయాధ్యాయము నందలి పదమూడవ శ్లోకమున, “యజ్ఞశేష పదార్థములే పరమ పవిత్రము లైనవనియు, జీవితమందు పురోగతిని మరియు భౌతికబంధముల నుండి ముక్తిని వాంఛించువారికి అదియే భుజించుటకు యోగ్యమనియు” వివరించెను. ఆ శ్లోకము నందు తనకు నివేదన చేయకుండ ఆహారమును భుజించువారు పాపమునే భుజిస్తున్నారని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు. అట్టివారు భుజించు ప్రతిముద్ద భౌతిక క్లేశములనే మరింత వృద్ధిచేయుచుండును. కాని శుభ్రములును సాధారనములైన కాయకూరలతో కూడిన సాత్త్వికాహారమును సిద్ధముచేసి, శ్రీకృష్ణభగవానుని చిత్రపటమునకో లేదా అతని విగ్రహమునకో గాని నివేదించి, అతని ముందు వినమ్రముగా నమస్కరించుచు, తాను అర్పించిన దానిని స్వీకరింపవలెనని ప్రార్థించినచో, అట్టి జీవిత విధానము నందు మానవుడు క్రమముగా పురోగతి సాదింపగలడు. దేహము పవిత్రమై బుద్ధి వికసితమైనప్పుడు స్పష్టమైన అవగాహన యనునది వృద్ధియగును. అన్నింటికి మించి ఆ నివేదనను ప్రేమభావముతోనే అర్పింపవలెను. ఏలయన సర్వము శ్రీకృష్ణునికే చెంది యుండుటచే అతనికి ఎట్టి ఆహారము అవసరము లేదు. తనను ఆ విధముగా తృప్తిపరచుటకు యత్నించు భక్తుని నిమిత్తమే అతడు దానిని స్వీకరించును. కనుక ఆహారమును సిద్ధము చేయుట, సేవించుట, నివేదించుట యనెడి కార్యములందు శ్రీకృష్ణుని పట్ల ప్రేమభావముతో వర్తించుట అత్యంత ముఖ్యాంశము.

పరతత్త్వము, ఇంద్రియరహితమని భావించు నిరాకార తత్త్వవేత్తలు భగవద్గీత యందలి ఈ శ్లోకమును ఏమాత్రము అవగాహన చేసికొనలేరు. వారికి ఇది ఉపమానము గానో, భగవద్గీతను బోధించు శ్రీకృష్ణుని భౌతిక ప్రవృత్తికి నిదర్శనము గానో వారు భావింతురు. వాస్తవమునకు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునికి ఇంద్రియములు గలవు. అతని ఇంద్రియములన్నీ ఇతర ఏ ఇంద్రియముల కార్యమునైనను చేయగల సామర్థ్యమును కలిగియుండును. శ్రీకృష్ణభగవానుడు సర్వశక్తిమంతుడను దాని భావమిదియే. ఇంద్రియములు లేనిచో అతనిని సర్వశక్తిమంతుడని పరిగణించుటకు వీలులేదు. సప్తమాధ్యాయము నందు తాను జీవులను ప్రకృతి గర్భమున సృజించుచున్నాడని శ్రీకృష్ణుడు వివరించెను. కేవలము అతడు భౌతిక ప్రకృతిని వీక్షించినంత మాత్రముననే అది జరుగును. అట్లే ఈ సందర్భమున ఆహారపదార్థములను అర్పించుచు భక్తులు పలుకు ప్రేమపూర్వకమైన పలుకులను శ్రీకృష్ణుడు ఆలకించుటయే ఆరగించుటతోను, ఆస్వాదించుటతోను అన్నివిధముల సమానమగును. అతని సంపూర్ణత్వము కారణమున అతని శ్రవణము ఆరగించుట మరియు ఆస్వాదించుట అను కార్యముతో సర్వ సమానమైనదను ఈ విషయమును నొక్కి

చెప్పవలసియున్నది. శ్రీకృష్ణుడు తనను గూర్చి తాను వర్ణించిన విధముగను, ఎటువంటి స్వకల్పనలు, వ్యాఖ్యానములు లేకుండగను ఆ దేవాదిదేవుని అంగీకరించు భక్తుడే పరతత్త్వము నివేదన ఆహారమును ఆరగించి ఆస్వాదించగలదని అవగాహన చేసికొనగలడు.

## 9.27

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! నీవు దేనిని చేయుదువో, దేనిని భుజింతువో, దేనిని హోమము చేయుదువో, దేనిని దానము చేయుదువో, నీవు ఏ తపస్సు నాచరించుదువో వాటి నన్నింటిని నాకు అర్పణముగా చేయుము.**

## భాష్యము

ఎట్టి పరిస్థితి యందైనను తాను ఈ విధముగా శ్రీకృష్ణుని విస్మరింప కుండునట్లుగా తన జీవితమును మలచుకొనుట ప్రతియొక్కరి కర్తవ్యము. ప్రతివ్యక్తియు తన దేహపోషణ కొరకు కర్మచేయవలసి వచ్చును. కనుక శ్రీకృష్ణుడు ఇక్కడ తనకొరకు కర్మ చేయమని ఆదేశిస్తున్నాడు. ప్రతియొక్కరు తాను జీవించుటకు ఆహారమును భుజించుట అవసరమైనందున శ్రీకృష్ణునకు అర్పింపబడిన ఆహారమును ప్రసాదరూపమున గ్రహింపవలెను. అట్లే నాగరికుడైన మానవుడు కొన్ని ధార్మిక కార్యములను చేయుచుండవలెను. కనుక శ్రీకృష్ణుడు దానిని, “నా కొరకు చేయుము” అని ఆదేశిస్తున్నాడు. దీనికే ‘అర్చన’ అని పేరు. ప్రతియొక్కరు ఏదియో ఒకదానిని దానము చేయు స్వభావమును కలిగియుందురు. కనుక శ్రీకృష్ణుడు దానిని “నా కొసంగుము” అని చెప్పుచున్నాడు. సంపాదించబడిన అదనపు ధనమును మానవుడు కృష్ణచైతన్యోద్యమపు ప్రచారము కొరకై వినియోగింప వలెనని అర్థము. ధ్యానవిధానము ఈ యుగమునకు ఆచరణయోగ్యము కానిదైనను, ప్రస్తుత కాలమందు జనులు దానియందే అధికాసక్తిని కనపరుస్తున్నారు. కాని ఎవ్వరైనను ‘హరేకృష్ణ’ మహామంత్రమును జపమాలపై జపించుచు, దినమునకు ఇరువదినాలుగు గంటలు శ్రీకృష్ణుని ధ్యానింప గలిగినచో భగవద్గీత (6.47) నందు వివరింపబడినట్లు, అతడు గొప్ప ధ్యానతత్పరుడు మరియు గొప్పయోగి యని చెప్పబడును.

## 9.28

**శుభాశుభఫలైరేవం మోక్షసే కర్మబన్ధనై: ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥**

## అనువాదము

**ఈ విధముగా నీవు కర్మబంధముల నుండియు వాని శుభాశుభఫలముల నుండియు విముక్తుడవు కాగలవు. ఇట్టి సన్న్యాస యోగసిద్ధాంతముతో నా యందు మనస్సును స్థిరపరచుట ద్వారా నీవు విముక్తుడవై నన్ను పొందుదువు.**

## భాష్యము

ఉత్తమమైన మార్గదర్శకత్వము ననుసరించి కృష్ణచైతన్యమున వర్తించు వాడు యుక్తుడని పిలువబడును. దీనికి 'యుక్తవైరాగ్యము' అనునది పారిభాషిక పదము. శ్రీల రూప గోస్వామి ఈ విషయమును గూర్చి ఇంకను ఇట్లు వివరించిరి :

అనాసక్తస్య విషయాన్ యథార్హముపయుంజత: ।
నిర్బంధ: కృష్ణసంబంధే యుక్తం వైరాగ్యముచ్యతే ॥
(భక్తిరసామృత సింధువు 1.2.255)

మనము భౌతిక జగత్తు నందున్నంత కాలము కర్మ చేయవలసియే యుండును. కర్మను విరమించుట సాధ్యము కాదు. కనుకనే కర్మల ఒనరించి ఆ ఫలములను శ్రీకృష్ణునకు సమర్పించినచో అది 'యుక్తవైరాగ్యము' అనబడును. వైరాగ్యము నందు వాస్తవముగా నెలకొనినపుడు అట్టి కర్మలు మనోదర్పణమును పరిశుభ్రము చేయగలవు. ఇక కర్త క్రమముగా ఆధ్యాత్మికానుభూతి నందు క్రమపురోగతి సాధించిన కొలది అతడు దేవాదిదేవునికి సంపూర్ణ శరణాగతుడై చివరికి విముక్తుడగును. అతడు పొందు ఈ ముక్తి ప్రత్యేకముగా వివరింపబడినది. ఈ ముక్తి ద్వారా అతడు 'బ్రహ్మజ్యోతి' నందు ఐక్యము కాకుండ తప్పక భగవద్ధామమున ప్రవేశించునని 'మాముపైష్యసి' (నన్ను పొందును) అను పదము ద్వారా స్పష్టముగా చెప్పబడినది. వాస్తవమునకు ఐదు రకములైన వివిధ ముక్తిదశలు కలవు. ఇదివరకు చెప్పబడినట్లు, జీవితమంతయు దేవాదిదేవుని ఆదేశముల ననుసరించి భక్తియోగను కొనసాగించినట్టి భక్తుడు ఆధ్యాత్మికముగా అత్యున్నతమైన స్థితిని పొంది, దేహత్యాగానంతరము ఆ భగవద్ధామమును చేరి దేవాదిదేవుని ప్రత్యక్ష సాంగత్యమున సేవ చేయగలుగును.

తన జీవితమును భగవానుని సేవకు అర్పించుట తప్ప ఇతరాసక్తి లేనివాడు నిజమైన 'సన్యాసి'. అట్టివాడు తనను నిత్యసేవకునిగాను భగవానుని దివ్య సంకల్పముపై ఆధారపడినట్టి వానిగను భావించును. కనుక అతడు ఏమి చేసినను భగవానుని ప్రయోజనము కొరకే చేయును. అతడు ఏ కార్యమును చేసినను భగవత్సేవ రూపమునే చేయును. వేదములందు పేర్కొనబడిన కర్మకాండ పట్ల గాని లేదా విధ్యుక్త ధర్మముల పట్లగాని అతడు ఆసక్తిని ప్రదర్శింపడు. వేదము లందు పేర్కొనబడిన నిర్దిష్ట ధర్మములను చేయుట సామాన్య మానవునికి కర్తవ్య మైనను భక్తులకు కాదు. కనుక భగవానుని సేవయందు పూర్తిగా నిమగ్నమైనట్టి శుద్ధభక్తులు కొన్నిమార్లు వైదికకర్మలకు విరుద్ధముగా కనపడవచ్చును కాని వాస్తవమునకు అది సత్యము కాదు.

కనుకనే గొప్ప బుద్ధిమంతుడు కూడ శుద్ధభక్తుని పలుకులను, కార్యకలాపములను గ్రహింపజాలడని వైష్ణవాచార్యులు చెప్పుచున్నారు. "తాంర వాక్య క్రియా ముద్రా విజ్ఞేహ నా భుజోయ్" (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 23.39). భగవానుని సేవలో ఆ విధముగా సర్వదా నెలకొని యుండువాడును, భగవానుని ఎట్లు సేవింపవలెనని చింతించువాడును, అందుకొరకై ప్రణాళికలను రూపొందించెడి వాడును వర్తమాన కాలమున పూర్తిగా ముక్తుడైనవానిగా పరిగణింపబడును. భవిష్యత్తు నందు అతడు తప్పక తిరిగి భగవద్ధామమును చేరగలడు. భౌతిక విమర్శలకు శ్రీకృష్ణుడు అతీతుడై యుండునట్లుగనే అట్టి శుద్ధభక్తుడు కూడ సర్వవిధములైన భౌతికవిమర్శలకు అతీతుడై యుండును.

## 9.29

**సమో హం సర్వభూతేషు న మే ద్వేష్యో స్తి న ప్రియః ।**
**యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥**

## అనువాదము

**నేనెవరిని ద్వేషింపను, ఎవరి యెడను పక్షపాతమును కలిగియుండను, నేనందరి యెడను సమానుడను. కాని భక్తితో సేవ చేయువాడు నాకు మిత్రుడై నా యందుండును మరియు నేనును అతనికి మిత్రుడనై యుందును.**

## భాష్యము

శ్రీకృష్ణుడు సర్వుల పట్ల సమభావము గలవాడైనచో మరియు అతనికి ఎవ్వరును ప్రత్యేక మిత్రులు కానిచో తన దివ్యసేవయందు సదా నెలకొని యుండెడి భక్తుల యెడ అతడెందుకు ప్రత్యేకశ్రద్ధ వహించునని ఎవరైనను ప్రశ్నింప వచ్చును. కాని వాస్తవమునకు ఇది సహజమే గాని భేదభావము కాదు. ఉదాహరణకు, ఈ భౌతిక జగత్తునందు ఎవరైనను గొప్పదాత యని పేరు గాంచినప్పటికిని వారు తమ సంతానము యెడ ప్రత్యేక శ్రద్ధను కలిగియుండును. అదేవిధముగా, వివిధ రూపములలో నున్న సర్వజీవులను సంతానముగా భావించి వారి జీవితావసరములకు కావలసిన వాటినన్నింటిని భగవానుడు ఉదారముగా సమకూర్చును. భూమియని గాని, కొండయని గాని, జలము యని గాని ఎట్టి భేదభావము లేకుండా వర్షించు మేఘము వంటివాడు దేవాదిదేవుడు. అయినను తన భక్తుల పట్ల అతడు ప్రత్యేక శ్రద్ధను కలిగియుండును. అట్టిభక్తులే ఈ శ్లోకము నందు పేర్కొనబడిరి. వారెల్లప్పుడును కృష్ణచైతన్యము నందు నెలకొని యుండుటచే అట్టి భక్తులు సదా శ్రీకృష్ణుని యందే స్థితిని కలిగియుందురు. కనుకనే 'కృష్ణచైతన్యము' అను పదము అట్టి చైతన్యము నందున్న మహాత్ములే శ్రీకృష్ణుని యందు నిలిచియున్నట్టి వారని సూచించుచున్నది. భాగవానుడిక్కడ 'మయి తే '(వారు నా యందున్నారు) అని స్పష్టముగా చెప్పుచున్నాడు. సహజముగా భగవానుడు కూడ వారి యందుండును. ఇట్టి పరస్పరానుభవమే ఈ "యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భాజామ్యహమ్" (4.11) అను భగవానుని వాక్యములను కూడ వివరించును : "నన్ను ఎవరు ఏ విధముగా శరణుపొందుచున్నారో, తదనుగుణముగా నేను వారిపట్ల శ్రద్ధ వహింతును" అని దాని భావము. భగవానుడు మరియు భక్తుడు ఇరువురును చైతన్యవంతు లైనందున వారి నడుమ ఇట్టి దివ్య పరస్పరానుభూతి, ఆశ్రయత్వము సమంజసమే. ఉదాహరణకు ఒక వజ్రము బంగారపు ఉంగరములో పొదగబడినప్పుడు

అది మిక్కిలి ఆకర్షణీయముగా కనిపించును. బంగారము శ్లాఘింపబడుటయే కాకుండ అదే సమయమున వజ్రము కూడ శ్లాఘింపబడును. వాస్తవమునకు భగవానుడు మరియు జీవుడు ఇరువురును సర్వదా ప్రకాశమానులై యుందురు. జీవుడు దేవాదిదేవుని సేవించుటలో ఆసక్తుడైనచో బంగారమువలె శోభించును. భగవానుడు వజ్రము వంటివాడు. కనుకనే ఈ కలయిక మిక్కిలి సుందరముగా నుండును. శుద్ధస్థితి యందు నెలకొనినట్టి జీవులే భక్తులనబడుదురు. దేవాదిదేవుడు తన భక్తులకు తానే స్వయముగా భక్తుడగును. భక్తులు మరియు భగవానుని నడుమ ఇట్టి పరస్పర వినిమయ సంబంధము లేనిచో సాకారతత్త్వము కూడ లేనట్లే. నిరాకారతత్త్వమున భగవానునికి మరియు భక్తునికి నడుమలేని అట్టి దివ్యపరస్పర సంబంధము అనునది సాకారతత్త్వము నందుండును.

భగవానుడు కల్పవృక్షము వంటివాడను ఉదాహరణ తరుచుగా ఇవ్వబడు చుండును. ఈ కల్పవృక్షము నుండి ఎవరు ఏది కోరినను భగవానుడు దానిని సమకూర్చుచుండును. ఇక్కడ అట్టి అభిప్రాయమునకు సంపూర్ణ వివరణ లభించు చున్నది. శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ భక్తపక్షపాతిగా పేర్కొనబడినాడు. భక్తుల పట్ల భగవానునికి గల ప్రత్యేక కృపకు ఇదియే నిదర్శనము. భక్తుల పట్ల భగవానుడు చూపెడు ఆ భావము(ప్రేమ వినిమయము) కర్మసిద్ధాంతములకు లోబడి యుండునదిగా ఎన్నడును పరిగణింపరాదు. అది భగవానుడు మరియు భక్తులు నిలిచి యుండెడి దివ్యస్థితికి సంబంధించినది. కనుకనే భగవానుని భక్తియుక్త సేవ ఈ భౌతిక జగత్తునకు సంబంధించిన కార్యకలాపము కాదు. అది సచ్చిదానందపూరితమై యుండునట్టి ఆధ్యాత్మిక జగత్తు నందలి భాగము.

## 9.30

**అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మన్తవ్య: సమ్యగ్ వ్యవసితో హి స: ॥**

### అనువాదము

**మిక్కిలి హేయమైన కార్యము నొనరించినప్పటికిని మానవుడు భక్తియుక్తసేవ యందు నియుక్తుడై యున్నచో, అతడు తన సంకల్పమున స్థిరనిశ్చయుడై యున్నందున అతనిని సాధువుగనే పరిగణింపవలెను.**

### భాష్యము

ఈ శ్లోకమునందు వాడబడిన 'సు-దురాచార:' అను పదము మిక్కిలి అర్థవంతమైనది. మనము దీనిని సరిగా అర్థము చేసికొనవలెను. జీవుడు ఈ జగత్తు నందు రెండురకాల కర్మలను చేయుచుండును. ఒకటి బద్ధకర్మలు, రెండవది నిజస్వరూప స్థితికి అనుగుణమైన కర్మలు. దేహరక్షణము కొరకు లేదా సమాజము మరియు దేహమునకు సంబంధించిన నియమ నిబంధనల ననుసరించుట కొరకై బద్ధజీవన స్థితియందు నిశ్చయముగ వివిధ కర్మలు గలవు. అవియే బద్ధజీవన కర్మలనబడును. ఇవికాకుండ తన ఆధ్యాత్మిక స్వభావమును సంపూర్ణముగా ఎరిగి కృష్ణచైతన్యము నందు లేక భగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనినట్టి జీవునకు గల కార్యకలాపములు ఆధ్యాత్మికము లనబడును. అట్టి కర్మలు అతని నిజస్థితి యందు చేయబడును. కావున అవి సాంకేతికముగా భక్తియుక్త సేవలనబడును. కనుక బద్ధస్థితి యందున్నప్పుడు భక్తియుక్త సేవ మరియు దేహమునకు సంబంధించిన బద్ధకర్మలు రెండును సమాంతరములుగా కొనసాగు చుండును. అయినను కొన్నిమార్లు అట్టి ఈ

కార్యములు పరస్పర విరుద్ధములగు చుండును. ఈ విషయమున భక్తుడు సాధ్యమైనంత వరకు తన భక్తికి మరియు సహజస్థితికి ఆటంకము కలిగించు దీనిని చేయకుండ అత్యంత జాగరూకుడై యుండును. కృష్ణచైతన్య అనుభవపు పురోగతిపైననే తన కర్మల పరిపూర్ణత్వము ఆధారపడి యుండునని అతడెరుగును. అయినను కొన్నిమార్లు అట్టివ్యక్తి సంఘము లేదా చట్టరీత్యా మిక్కిలి హేయముగా కనిపించు ఏదైన కార్యమును చేసినట్లుగా కనిపించవచ్చును. కాని అట్టి తాత్కాలిక పతనము అతనిని ఏ విధముగను అనర్హుని చేయజాలదు. ఒకవ్యక్తి పతితుడైనను అత్యంత శ్రద్ధతో భక్తియుక్త సేవ యందు నెలకొనినచో, భగవానుడు హృదయము నందు పరమాత్మగా నెలకొని అతనిని పవిత్రుని చేసి, ఆ పాపకార్యమును క్షమించునని శ్రీమద్భాగవతము తెలుపుచున్నది. భౌతిక కాలుష్యము మిక్కిలి బలమైనడగుటచే భగవత్సేవ యందు సంపూర్ణముగా నెలకొనినట్టి యోగి కూడ కొన్నిమార్లు మాయకు గురియగు చుండును. కాని కృష్ణచైతన్యము మిక్కిలి శక్తిమంతమైనడగుటచే భక్తుని అట్టి తాత్కాలిక పతనమును వెంటనే సరిదిద్దగలదు. కనుకనే భక్తియుక్త సేవా విధానము సదా విజయమునే కలిగించును. అట్టి ధర్మమార్గము నుండి యాదృచ్ఛికముగా పతనము చెందిన భక్తుడిని ఎన్నడును నిందింపరాదు. ఎందుకనగా రాబోవు శ్లోకమున వివరింపబడినట్లు, భక్తుడు కృష్ణచైతన్యము నందు పూర్తిగా నెలకొని నంతనే కాలక్రమమున అట్టి యాదృచ్ఛిక పతనములు నిలిపివేయబడును.

కనుక కృష్ణచైతన్యమున నెలకొనినట్టి వ్యక్తి శ్రద్ధతో "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అని మహామంత్రమును జపించుచు, పొరపాటున గాని లేదా యాదృచ్ఛికముగా గాని పతితుడైనట్లు కనిపించినను అతడు తన ఆధ్యాత్మిక స్థితినందే నిలిచి యున్నట్లుగా పరిగణింపవలెను. కనుకనే 'సాధురేవ' (సాధువుగనే) యని నొక్కి చెప్పబడినది. యాదృచ్ఛికముగా పతనము చెందిన భక్తుని నిందింపరాదు కనుక ఈ పదము అభక్తులైనవారికి హెచ్చరిక వంటిది. అనగా భక్తుడు యాదృచ్ఛికముగా పతనము చెందినను సాధువుగనే పరిగణింపబడవలెను. 'మన్తవ్య:' అను పదము ఈ విషయమున మరింత శక్తిమంతమైనది. ఎవరైనను ఈ ఆదేశమును అనుసరింపక యాదృచ్ఛిక పతనమునకు భక్తుని నిందించినచో వారు దేవాదిదేవుని ఆజ్ఞను ఉల్లంఘించిన వారగుదురు. కనుకనే దృఢనిశ్చయముతో అనన్యముగా భక్తియుక్తసేవ యందు నెలకొని యుండుటయే భక్తుని ఏకైక యోగ్యత కావలెను.
'నృసింహపురాణము' నందు ఈ క్రింది శ్లోకము కలదు :

భగవతి చ హరావనన్య చేతా భృశమలినో పి విరాజతే మనుష్య: ।
న హి శశకలుషచ్ఛవి: కదాచిత్ తిమిరపరాభవతాముపైతి చన్ద్ర: ॥

"సంపూర్ణముగా భగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనినవాడు కొన్నిమార్లు హేయ కార్యములను చేయునట్లు గోచరించినను, ఆ కార్యములను కుందేటిగుర్తు వలె కనిపించు చంద్రుని యందలి మచ్చలుగా మాత్రమే పరిగణింపవలెను. ఆ మచ్చలు వెన్నెలను ప్రసరించుటలో ఎట్టి అవరోధములు కాజాలవు. అట్లే భక్తుడు తన సాధువర్తనము నుండి యాదృచ్ఛిక పతనము నొందుట అతనిని పాపిగా చేయజాలదు."

దీనినిబట్టి దివ్యమైన భక్తియుక్తసేవ యందు నెలకొనినట్టి భక్తుడు ఎట్టి హేయ కార్యములైనను చేయవచ్చునని ఎవ్వరును తప్పుగా అర్థము చేసికొనరాదు. భౌతిక కల్మషముల బలవత్తరమైన శక్తికారణముగా కలుగు యాదృచ్ఛిక పతనమును మాత్రమే ఈ శ్లోకము సూచించుచున్నది. వాస్తవమునకు భక్తియుక్త సేవ యనునది దాదాపు మాయపై యుద్ధమును ప్రకటించుటయే అగును. మానవుడు మాయాశక్తితో యుద్ధము

చేయగలిగినంత శక్తిమంతుడు కానంతవరకు ప్రమాదవశాత్తు భక్తులు పతనములకు గురికావలసి వచ్చును. కాని అతడు శక్తిమంతుడైనచో పూర్వము తెలిపినట్లుగా అట్టి పతనమునకు ఎన్నడును గురికాడు. కనుక ఈ శ్లోకమును ఆధారము చేసికొని పాపపు పనులను చేయుచునే తనను తాను భక్తునిగా భావించుట ఎవ్వరికిని తగదు. అతడు భక్తియుక్త సేవ ద్వారా తన స్వభావమును మరియు శీలమును వృద్ధిపరచుకొననిచో అతడు ఉత్తమ భక్తుడు కాజాలడని అవగాహన చేసుకొనవలెను.

**9.31**
**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి ।**
**కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్త: ప్రణశ్యతి ॥**

**అనువాదము**

**అతడు శీఘ్రమే ధర్మాత్ముడై శాశ్వతమైన శాంతిని పొందును. ఓ కౌంతేయా! నా భక్తుడెన్నడును నశింపడని ధైర్యముగా ప్రకటింపుము.**

**భాష్యము**

ఈ శ్లోకమును తప్పుగా అర్థము చేసికొనరాదు. దురాచారుడైనవాడు భగవద్భక్తుడు కాజాలడని సప్తమాధ్యాయమున చెప్పబడినది. అట్లే భగవద్భక్తుడు కాని వానికి ఎట్టి సద్గుణములు ఉండవు. అప్పుడు యాదృచ్ఛికముగా లేక ప్రయత్నపూర్వకముగా పాపమును చేయువాడు ఎట్లు శుద్ధభక్తుడగును? ఇట్టి ప్రశ్న ఇక్కడ ఉదయించుట సహజమే. గీతయందలి సప్తమాధ్యాయమున చెప్పబడినట్లు, ఎన్నడును భగవానునికి భక్తియుక్త సేవను చేయని దురాచారులకు శ్రీమద్భాగవతము (5.18.12) నందు చెప్పబడినట్లు ఎట్టి సద్గుణములు ఉండజాలవు. కాని భక్తుడైనవాడు అట్లుగాక నవవిధ భక్తిమార్గముల యందు నెలకొని, హృదయము నందలి భౌతిక కాలుష్యము లన్నింటిని ప్రక్షాళించుకొను విధానము నందు ఆసక్తుడై యుండును. కనుక అతని పాపములన్నియు సహజముగనే నశించుపోవును. భక్తుడు సదా తన హృదయము నందు దేవాదిదేవుని స్థిరముగా నిలిపియుండుటచే, అతని పాపము లన్నియును సహజముగనే నశించి పోవును. దేవాదిదేవుని గూర్చిన నిరంతర స్మరణ అతనిని సహజముగనే పరమ పవిత్రునిగా చేయును. ఉన్నత స్థితి నుండి పతనము చెందిన వారెవరైనను తిరిగి పవిత్రులగుటకు కొన్ని కర్మవిధానములను, కొన్ని 'ప్రాయశ్చిత్త' కర్మలను ఆచరింప వలెనని వేదముల ననుసరించి కొన్ని నియమములు కలవు. నిరంతరము హృదయము నందు దేవాదిదేవుని స్మరించు చుండుట చేత పవిత్రీకరణ విధానము ఇదివరకే భక్తుని హృదయమున నెలకొని యున్నందున అది భక్తియోగమునకు అన్వయింపదు. కనుకనే "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అను మహామంత్ర జపకీర్తనలను నిరంతరము కొనసాగింపవలెను. ఇది యాదృచ్ఛిక పతనముల నుండి భక్తుని రక్షించును. ఆ విధముగా అతడు సమస్త భౌతిక కాలుష్యముల నుండి సదా విముక్తుడై యుండగలడు.

**9.32**
**మాం హి పార్థ వ్యపాశ్రిత్య యే పి స్యు: పాపయోనయ: ।**
**స్త్రియో వైశ్యస్తథా శూద్రాస్తే పి యాన్తి పరాం గతిమ్ ॥**

**అనువాదము**

**ఓ పార్థా! నన్ను శరణుజొచ్చువారు అధమజన్ములైన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు అయినప్పటికిని పరమగతిని పొందగలరు.**

**భాష్యము**

భక్తియుక్తసేవ యందు ఉత్తమ, అధమ తరగతులకు చెందిన జనుల నడుమ భేదము లేదని దేవాదిదేవుడు ఇక్కడ స్పష్టముగా ప్రకటించుచున్నాడు. భౌతిక జీవిత భావనము నందున్నప్పుడు అట్టి భేదములు ఉండవచ్చును. కాని భగవానుని దివ్యమైన భక్తియుక్త సేవయందు నెలకొనినవానికి అట్టి భేదము లుండవు. ప్రతియొక్కరు పరమగతిని పొందుటకు అర్హులై యున్నారు. శ్రీమద్భాగవతము(2.4.18) నందు చండాలుడని (శునకమాంసము భుజించు వారు) పిలువబడు అత్యంత నీచజాతికి చెందినవారు కూడ శుద్ధభక్తుని సాంగత్యమున పవిత్రులు కాగలరని చెప్పబడినది. కనుక భక్తియుక్త సేవ మరియు శుద్ధభక్తుల మార్గదర్శనము అనునవి మిక్కిలి శక్తిమంతము లగుటచే ఉత్తమ, అధమ తరగతి జనుల నడుమ ఎట్టి భేదముండదు. ఎవ్వరైనను అట్టి భక్తిని గ్రహింపవచ్చును. అతి సామాన్యుడు కూడ శుద్ధభక్తుని శరణు పొందినచో చక్కని మార్గదర్శనముచే పవిత్రుడు కాగలడు. వాస్తవమునకు వివిధ ప్రకృతి గుణముల ననుసరించి మానవులు సత్త్వగుణ ప్రధానులు (బ్రాహ్మణులు), రజోగుణ ప్రధానులు (క్షత్రియులు లేక పరిపాలకులు), రజస్తమోగుణ మిశ్రితులు(వైశ్యులు లేక వర్తకులు) తమోగుణ ప్రధానులు (శూద్రులు లేక కార్మికులు) అని నాలుగు తరగతులుగా విభజింపబడిరి. ఈ నాలుగు తరగతుల కంటెను తక్కువైనవారు 'చండాలురు' పాపకుటుంబమున జన్మింతురు. సాధారణముగా అట్టి పాపజన్మల సాంగత్యమును ఉన్నత తరగతికి చెందినవారు అంగీకరింపరు. కాని భక్తియుక్త సేవావిధానము మిక్కిలి శక్తిమంత మైనదగుటచే శుద్ధభక్తుడు సమస్త నీచజను లందరిని కూడ అత్యున్నత జీవన పరిపూర్ణత్వమును పొందునట్లుగా చేయగలుగును. మానవుడు శ్రీకృష్ణభగవానుని ఆశ్రయించినప్పుడే అది సాధ్యమగును. 'వ్యపాశ్రిత్య' అను పదముచే సూచింపబడినట్లు మానవుడు శ్రీకృష్ణుని పూర్తిగా శరణు పొంద వలెను. అప్పుడు అతడు గొప్పజ్ఞానుల కంటెను, యోగుల కంటెను కూడ గొప్పవాడు కాగలడు.

**9.33**
**కిం పునర్బ్రాహ్మణా: పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।**
**అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వమామ్ ॥**

**అనువాదము**

**ఇక ధర్మాత్ములైన బ్రాహ్మణుల గూర్చియు, భక్తుల గూర్చియు, రాజర్షుల గూర్చియు వేరుగా చెప్పవలెనా! అందుచే అనిత్యము, దుఃఖపూరితమును అగు ఈ లోకమునకు వచ్చి యున్నందున నా ప్రేమయుక్త సేవలో నియుక్తుడవగుము.**

## భాష్యము

ఈ భౌతిక జగత్తున జనులలో వివిధ వర్గములు గలవు. వాస్తవమునకు ఈ జగత్తు ఎవ్వరికిని సుఖకరమైన ప్రదేశము కాదు. కనుకనే 'అనిత్యమసుఖం లోకమ్' అని స్పష్టముగా తెలుపబడినది. ఈ ప్రపంచము అశాశ్వతమును, దుఃఖపూరితమును, సజ్జనులు నివసించుటకు యోగ్యము కాదని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. దేవాదిదేవుడు ఈ జగత్తును అశాశ్వతమైనదిగను, దుఃఖపూరిత మైనదిగను ప్రకటించెను. కొందరు తత్త్వవేత్తలు, ముఖ్యముగా మాయావాదులు ఈ ప్రపంచమును మిథ్య అని చెప్పుదురు. కాని భగవద్గీత ననుసరించి ఈ జగత్తు అశాశ్వతమే గాని మిథ్యకాదు. మిథ్యత్వమునకు మరియు అనిత్యత్వమునకు నడుమ గొప్ప భేదము గలదు. ఈ భౌతిక జగత్తు అశాశ్వతమైనది. కాని దీనికి అతీతముగా నిత్యమైన జగత్తు మరొకటి కలదు. ఈ జగత్తు దుఃఖపూరితమైనది. కాని దీనికి అతీతమైన మరొకజగత్తు నిత్యమైనది మరియు ఆనందముతో కూడియున్నట్టిది.

అర్జునుడు రాజర్షుల వంశములో జన్మించెను. శ్రీకృష్ణుడు అతనికి కూడ : "నా భక్తియుక్త సేవను చేపట్టి శీఘ్రమే తిరిగి నా ధామమును చేరుము" అని చెప్పుచున్నాడు. దుఃఖపూరితము మరియు అశాశ్వతమైన ఈ లోకము నందు ఎవ్వరును నిలిచిపోరాడు. ప్రతివ్యక్తియు దేవాదిదేవుని ఆశ్రయించి శాశ్వత ఆనందమును పొందవలెను. దేవాదిదేవుని భక్తియుక్త సేవయే అన్ని తరగతుల జనుల సమస్యలు పరిష్కరింపబడుటకు గల ఏకైక విధానము. కనుక ప్రతివ్యక్తి కృష్ణచైతన్యమును అలవరచుకొని తమ జీవితమును పరిపూర్ణము చేసుకొనవలెను.

### 9.34

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణ: ॥**

## అనువాదము

**నీ మనస్సును సదా నా చింతన యందే నిమగ్నము చేయుము. నా భక్తుడవు కమ్ము. నాకు నమస్కరింపుము. నన్ను పూజింపుము. ఈ విధముగా నా యందు సంపూర్ణమగ్నుడవై నీవు నన్ను తప్పక చేరుదువు.**

## భాష్యము

కలుషితమైన ఈ భౌతికజగత్తు బంధముల నుండి విముక్తిని పొందుటకు కృష్ణచైతన్యమే ఏకైక మార్గమని ఈ శ్లోకమునందు స్పష్టముగా చెప్పబడినది. భక్తియుక్త సేవను దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునకే అర్పింపవలెనని స్పష్టముగా ఇక్కడ తెలుపబడిన విషయమునకు కొన్నిమార్లు అప్రామాణికులైన గీతా వ్యాఖ్యాతలు అర్థమును మార్చిచెప్పుదురు. దురదృష్టవశాత్తు అట్టి వ్యాఖ్యాతలు అసంభవములైన విషయముల వైపునకే పాఠకుని మనస్సును మరలింతురు. శ్రీకృష్ణునికి మరియు అతని మనస్సునకు భేదము లేదని అట్టి వ్యాఖ్యాతలకు తెలియదు. శ్రీకృష్ణుడు పరతత్త్వమే గాని సామాన్య మానవుడు కాడు. శ్రీకృష్ణునకు అతని దేహమునకును, అతని మనస్సునకు మధ్య ఎట్టి భేదములుండవు. అవియన్నియును అభేదములు మరియు సంపూర్ణములైనట్టివి. శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి వారు 'శ్రీ చైతన్య చరితామృతము' (ఆదిలీల 5.41) నందలి శ్లోకమునకు వారు రచించిన 'అనుభాష్యము'

అను వ్యాఖ్యానమున : "దేహదేహి విభేదో యం నేశ్వరే విద్యతే క్వచిత్" అను 'కూర్మపురాణము' నందలి శ్లోకమును ఉదహరించిరి. దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికిని, అతని దేహమునకును, ఎట్టి భేదమును లేదని దీని అర్థము. కాని కృష్ణసంబంధమైన విజ్ఞానమును ఎరుగనందున అట్టి వ్యాఖ్యాతలు శ్రీకృష్ణుని దేవాదిదేవత్వమును మారుగాపరచి, దేవాదిదేవుడు అతని దేహము లేదా మనస్సు కంటె భిన్నమని వక్రముగా వ్యాఖ్యానింతురు. ఇది నిజానికి కృష్ణతత్త్వమునకు సంబంధించిన అజ్ఞానమైనను, అట్టివారు సామాన్యులను మోసపుచ్చి లాభమును గడించుచుందురు.

కొందరు అసుర ప్రవృత్తి గలవారు కూడ శ్రీకృష్ణుని ధ్యానింతురు. వారు శ్రీకృష్ణుని మేనమామయైన కంసుని వలె ద్వేషముతో శ్రీకృష్ణుని గూర్చి నిరంతరము స్మరించు చుందురు. కంసుడు నిరంతరము శ్రీకృష్ణుని తన శత్రువుగా స్మరించెను. శ్రీకృష్ణుడు ఎప్పుడు వచ్చి తనను సంహరించునోనను భయమును అతడెల్లప్పుడును కలిగియుండెను. వాస్తవమునకు ఆ విధమైన స్మరణము మనకు ఏ రకముగను తోడ్పడజాలదు. శ్రీకృష్ణుని ప్రతియొక్కరు భక్తితో కూడిన ప్రేమతో స్మరింపవలెను. అదియే నిజమైన భక్తి. మానవుడు కృష్ణసంబంధ విజ్ఞానమును నిరంతరము అభ్యసింపవలెను. కాని అనుకూలమైన అభ్యాసమనగానేమి? ప్రామాణికుడైన గురువు నుండి గ్రహించునదే అట్టి అనుకూలమైన అభ్యాసము కాగలదు. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనియు, అతని దేహము భౌతికము కాదనియు, సచ్చిదానందమయ మైనట్టిడనియు ఎన్నోసార్లు వివరించి యుంటిమి. శ్రీకృష్ణుని గూర్చిన ఇట్టి వివరణము మానవుడు భక్తుడగుటకు తోడ్పడును. అప్రామాణికుల వలన శ్రీకృష్ణుని మరొక విధముగా అవగాహన చేసికొనుట నిరుపయోగమే కాగలదు.

కనుక మానవుడు శాశ్వతము, ఆద్యము అయిన శ్రీకృష్ణుని రూపము నందే తన మనస్సును కేంద్రీకరింపవలెను. శ్రీకృష్ణుని దేవాదిదేవుడని హృదయ పూర్వకముగా విశ్వసించి అతనిని ఆరాధింపవలెను. భారతదేశమున శ్రీకృష్ణుని ఆరాధించుట కొరకై అనేక వేల మందిరములు కలవు. అక్కడ భక్తియుక్త సేవ నిరంతరము అభ్యసింపబడును. ఇట్లు అభ్యసించునప్పుడు ప్రతియొక్కరు శ్రీకృష్ణునకు ప్రణామముల నర్పింపవలెను. శ్రీవిగ్రహము ఎదుట శిరస్సు వంచి తమ మనోవాక్కాయ కర్మలనన్నింటిని భక్తియందే నిమగ్నము కావింపవలెను. తద్ద్వారా అన్యచింత లేకుండ మానవుడు కృష్ణచైతన్యము నందు పరిపూర్ణముగా నెలకొన గలడు. ఇది అతడు కృష్ణలోకమును పొందుటకు తోడ్పడును. కనుక ఎవరును కపటులు, అప్రామాణికులైన వ్యాఖ్యాతల రచనల వలన నిజమైన మార్గము నుండి వైదొలగరాదు. అతడు శ్రీకృష్ణుని గూర్చిన శ్రవణకీర్తనలతో ఆరంభమగు నవవిధభక్తియుక్త సేవ విధానమునందు నెలకొనవలెను. అట్టి శుద్ధభక్తియుక్త సేవయే మానవ సమాజమునకు లభించిన అత్యుత్తమ వరప్రసాదము.

భగవద్గీత యందలి సప్తమ, అష్టమాధ్యాయము లందు ఊహాకల్పిత జ్ఞానమునకు, యోగమునకు, కామ్యకర్మములకును అతీతమైన శుద్ధభక్తియుక్త సేవ స్పష్టముగా వివరింపబడినది. పూర్తిగా పవిత్రులు కానివారు భగవానుని ఇతర తత్త్వములైన నిరాకార బ్రహ్మజ్యోతి మరియు పరమాత్మ వైపునకు ఆకర్షితులైనను, శుద్ధభక్తుడు మాత్రము దేవాదిదేవుని ప్రత్యక్ష సేవనే స్వీకరించును.

ఇతర దేవతలను పూజించుటలో నెలకొనినట్టి గొప్ప మందమతి యనియు, అతడు శ్రీకృష్ణభగవానుని దివ్యానుగ్రహమును ఎన్నటికిని పొంద జాలడనియు

స్పష్టముగా తెలుపు శ్రీకృష్ణుని గూర్చిన పద్యమొకటి కలదు. ఆరంభమున కొన్నిమార్లు భక్తుడు ఉత్తమస్థితి నుండి పతనము చెందవచ్చును. అయినను ఇతర తత్త్వవేత్తల కంటెను, యోగులకంటెను అతడు అధికుడుగనే భావింపవలెను. కృష్ణచైతన్యము నందు నిరంతరము నెలకొని యుండెడివాడు పరిపూర్ణుడైన సాధుపురుషుడు. యాదృచ్ఛికముగా జరుగు అతని పతనములు క్రమముగా నశించి, నిస్సందేహముగా అతడు పరిపూర్ణస్థితి యందు శీఘ్రమే నెలకొనగలడు. దేవాదిదేవుడే స్వయముగా తన శుద్ధభక్తుల సంరక్షణాభారమును యుండెడివాడు స్వీకరించును. కనుక అట్టివారు పతనము చెందుటకు అవకాశమే లేదు. కనుక బుద్ధిమంతుడు ప్రత్యక్షముగా కృష్ణచైతన్య విధానమును అవలంబించి ఈ భౌతిక జగత్తు నందు సుఖముగా జీవించవలెను. అట్టి భక్తుడు అంత్యమున శ్రీకృష్ణభగవానుని పరమాణుగ్రహమును పొందును.

**శ్రీమద్భగవద్గీత యందలి 'పరమగుహ్య జ్ఞానము' అను నవమాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

-----

# దశమాధ్యాయము
# భగవద్విభూతి

## 10.1

**శ్రీభగవానువాచ**
**భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచ: ।**
**యత్తే హం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥**

**అనువాదము**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : మహాబాహువులు గల ఓ అర్జునా! మరల ఆలకింపుము. నీవు నాకు ప్రియమిత్రుడవగుటచే ఇంతవరకు వివరించిన దానికంటెను ఉత్తమ జ్ఞానమును నీ హితము కొరకై నేను తెలుపుదును.**

**భాష్యము**

బలము, కీర్తి, ఐశ్వర్యము, జ్ఞానము, సౌందర్యము, వైరాగ్యము అనేది ఆరు విభూతులను సంపూర్ణముగా కలిగియుండెడివాడు భగవానుడు లేక దేవాదిదేవుడు అని పరాశరముని 'భగవానుడు' అను పదమును గూర్చి వివరించి యుండిరి. శ్రీకృష్ణుడు భూమిపై అవతరించినపుడు ఈ ఆరు విభూతులను ప్రదర్శించి యున్నందున పరాశరుని వంటి గొప్పమునులు శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అంగీకరించిరి. ఇప్పుడు శ్రీకృష్ణుడే స్వయముగా తన విభూతులను మరియు కర్మలను గూర్చిన మిక్కిలి రహస్యమైన జ్ఞానమును అర్జునునకు బోధించు చున్నాడు. సప్తమాధ్యాయపు ఆరంభము నుండి భగవానుడు తన వివిధ శక్తులను గూర్చియు మరియు అవి వర్తించు విధానమును గూర్చియు ఇదివరకే వివరించి యుండెను. ఇప్పుడు అతడు ఈ అధ్యాయమున తన ప్రత్యేక విభూతులను గూర్చి అర్జునునకు వివరించు చున్నాడు. దృఢనిశ్చయముతో కూడిన భక్తిని స్థాపించుట కొరకై అతడు తన వివిధశక్తులను స్పష్టముగా గడచిన అధ్యాయమునందు వివరించి యుండెను. శ్రీకృష్ణభగవానుడు తిరిగి ఈ అధ్యాయమున తన వివిధ విభూతి వైభవములను గూర్చి అర్జునునకు తెలియజేయుచున్నాడు.

దేవాదిదేవుని గూర్చి ఎంత అధికముగా శ్రవణము చేసినచో అంత అధికముగా మానవుడు భక్తియుక్త సేవయందు స్థిరత్వమును పొందును. ప్రతియొక్కరు దేవాదిదేవుని గూర్చి భక్తుల సాంగత్యమున శ్రవణము చేయవలెను. అది వారి భక్తియుక్త సేవను వృద్ధిచేయును. కృష్ణచైతన్యము నందు నిజమైన జిజ్ఞాసను కలిగియున్నట్టి భక్తుల సమాజమున మాత్రమే భగవానుని గూర్చిన ప్రసంగములు జరుగుచుండును. ఇతరులు అట్టి ప్రసంగములలో పాల్గొనజాలరు. అర్జునుడు తనకు మిక్కిలి ప్రియుడగుటచే అతని హితము కొరకు అట్టి ప్రసంగములు చేయబడుచున్నవని భగవానుడిక్కడ స్పష్టముగా చెప్పుచున్నాడు.

## 10.2
## న మే విదు: సురగణాః ప్రభవం న మహర్షయ: ।
## అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశ: ॥

**అనువాదము**

**దేవతాసమూహములు గాని, మహర్షులు గాని నా ఉత్పత్తిని లేదా విభూతులను ఎరుగజాలరు. ఏలయనగా సర్వవిధముల ఆ దేవతలకును, మహర్షులకును నేనే మూలము.**

**భాష్యము**

'బ్రహ్మ సంహిత' (5.1) యందు చెప్పబడినట్లు, శ్రీకృష్ణభగవానుడే పరమపురుషుడు. అతనికంటె గొప్పవాడు మరొక్కడు లేదు. అతడే సర్వ కారణములకు మూలకారణుడు. సర్వదేవతలకు, మహర్షులకు తానే కారణమని భగవానుడిక్కడ స్వయముగా చెప్పుచున్నాడు. దేవతలు గాని మహర్షులు గాని శ్రీకృష్ణుని అవగాహన చేసికొనజాలరు. వారే అతని నామమును గాని, స్వరూపమును గాని ఎరుగజాలకున్నచో, అల్పమైన ఈ లోకమునకు చెందిన నామమాత్ర పండితుల పరిస్థితిని గూర్చి ఏమి చెప్పగలము? దేవాదిదేవుడు సామాన్యమానవుడుగా ఈ భూమిపై అవతరించి, అద్భుతములను, అసాధారణమైన లీలలను ఎందుకు చేయునో ఎవ్వరును ఎరుగజాలరు. కనుక శ్రీకృష్ణుని అవగాహన చేసికొనుటకు పాండిత్యమొక్కటే అర్హతకాదని మనము గ్రహింపవలెను. దేవతలు మరియు మహర్షులు కూడ తమ మానసిక కల్పనలచే శ్రీకృష్ణుని అవగాహన చేసికొనుటకు ప్రయత్నించినను విఫలులైరి. కనుకనే గొప్పగొప్ప దేవతలు కూడ శ్రీకృష్ణభగవానుని అవగాహన చేసికొనజాలరని శ్రీమద్భాగవతము నందు స్పష్టముగా చెప్పబడినది. తమ పరిమితి ఇంద్రియముల ననుసరించి మానసిక కల్పనలు చేయుటకు యత్నించినను త్రిగుణములచే వ్యక్తము కానట్టి నిజతత్త్వమునకు విరుద్ధభావమైన నిరాకారతత్త్వమునే వారు చేరగలరు. వారు మానసిక కల్పనలను చేసినను అట్టి బుద్ధిహీనమైన కల్పనలచే శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట అసాధ్యము.

పరతత్త్వమును తెలిసికొనదలచిన వారికొరకై శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ పరోక్షముగా తాను దేవాదిదేవుడనినియు, పరమపురుషుడనినియు చెప్పుచున్నాడు. ఈ విషయమును ప్రతియొక్కరు గమనింపవలెను. స్వయముగా ప్రత్యక్షమై యున్నట్టి అచింత్యుడైన భగవానుని ఎరుగుట ఎవ్వరికిని సాధ్యము కాకున్నను అతడు మాత్రము సర్వత్రా నిలిచియే యుండును. అట్టి సచ్చిదానంద స్వరూపుడైన శ్రీకృష్ణభగవానుని మనము భగవద్గీత మరియు శ్రీమద్భాగవతము నందలి అతని ఉపదేశములను అధ్యయనము చేయుట ద్వారా యథార్థముగా అవగాహన చేసికొనగలము. భగవానుని ఒక నియమించు శక్తిగా, నిరాకార బ్రహ్మముగా భావించుట అతని న్యూనశక్తి యందున్న వారిచే చేయబడుచుండును. కాని ఎవరైనను గుణాతీతస్థితిని పొందనిదే దేవాదిదేవుని దివ్యస్థితిని అవగతము చేసుకొనజాలరు.

జనులలో అధికశాతము శ్రీకృష్ణుని నిజస్థితిని అవగాహన చేసికొనజాలరు. కనుక అట్టి కల్పనాపరులను అనుగ్రహించుటకై భగవానుడు తన అవ్యాజకృపతో భూమిపై అవతరించును. ఆ విధముగా పరమపురుషుడు అసాధారణ లీలలను ప్రదర్శించు చున్నను ఈ కల్పనాపరులు భౌతిక కాలుష్యము వలన నిరాకారబ్రహ్మమే పరమోత్కృష్టమని భావించుచుందురు. దేవాదిదేవునికి పూర్తిగా శరణుపొందిన భక్తులు మాత్రమే దేవాదిదేవుని కృపతో అతడు శ్రీకృష్ణుడని ఎరుగ గలుగుదురు. కనుక భగవానుని

నిరాకార బ్రహ్మతత్త్వమును గూర్చి భక్తులెవ్వరును ఆసక్తిని కనపరచరు. కనుక వారి భక్తిశ్రద్ధలు వెంటనే వారిని దేవాదిదేవుని శరణు పొందునట్లుగా చేయును. శ్రీకృష్ణుని అవ్యాజకృప కారణముననే వారు అతనిని ఎరుగ గలుగుదురు. ఇతరులెవ్వరును అతనిని ఎరుగజాలరు. కనుక ఆత్మ యననేమి? పరబ్రహ్మయననేమి? అని తెలిసికొని ఆ దేవాదిదేవుణ్ణే మనము ఆరాధింపవలెనని మహర్షులు సైతము అంగీకరించిరి.

### 10.3
### యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
### అసమూఢ: స మర్త్యేషు సర్వపాపై: ప్రముచ్యతే ॥

## అనువాదము

**నన్ను పుట్టుకలేనివానిగను, అనాదిగను, సర్వలోకములకు దివ్యప్రభువుగను ఎరిగినవాడు మాత్రమే మానవులందరిలోను భ్రాంతిరహితుడై, సర్వ పాపముల నుండి విముక్తుడగును.**

## భాష్యము

సప్తమాధ్యాయము మూడవ శ్లోకము నందు చెప్పబడినట్లు, "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే" – అధ్యాత్మికానుభూతి స్థితికి తమను ఉద్ధరించుకొనుటకు యత్నించువారు సామాన్య మానవులు కాజాలరు. ఆధ్యాత్మికానుభూతికి సంబంధించిన జ్ఞానము ఏ మాత్రము లేని కోట్లాది మానవుల కంటెను వారు నిశ్చయముగా ఉత్తములు. కాని ఆ విధముగా తమ ఆధ్యాత్మిక స్థితిని అవగాహన చేసుకొనుటకు యత్నించువారిలో శ్రీకృష్ణుని దేవాదిదేవునిగను, సర్వమునకు ప్రభువుగను, పుట్టుక లేనివానిగను అవగాహనకు వచ్చినవాడు ఆత్మానుభూతి ప్రాప్తిలో సఫలమైనట్టివాడు. శ్రీకృష్ణునిదివ్యస్థితిని సంపూర్ణముగా అవగాహన చేసుకొనగలిగిన స్థితియందే మానవుడు అన్నివిధములైన పాపఫలముల నుండి పూర్తిగా విముక్తుడగును.

ఇక్కడ భగవానుడు 'అజ:' – పుట్టుకలేనివాడుగా వర్ణింపబడెను. కాని ద్వితీయాధ్యాయము ఇరవయ్యవ శ్లోకమున జీవులుకూడ 'అజ:' అని తెలుపబడినను భగవానుడు వారికి భిన్నమైనవాడు. భౌతిక బంధముల కారణముగా జనన మరణములను పొందుచుండు జీవులకు భగవానుడు భిన్నుడు. బద్ధజీవులు తమ దేహములను మార్చుచుందురు. కాని భగవానుని దేహము మార్పునకు గురికాదు. అతడు ఈ భౌతిక ప్రపంచమునకు అరుదెంచునప్పుడు 'అజుని'గనే అరుదెంచెను. కనుక చతుర్థాధ్యాయము నందలి ఆరవశ్లోకమున భగవానుడు తన 'ఆత్మమాయ' శక్తిచే న్యూనమును, భౌతికమునైన శక్తికి అధీనుడు కాడనియు, సర్వదా స్వరూప శక్తియందే స్థితుడై యుండుననియు చెప్పబడినది.

ఈ శ్లోకమునందలి 'వేత్తి లోకమహేశ్వరమ్' అను పదముల ననుసరించి, శ్రీకృష్ణభగవానుడు విశ్వమునందలి సమస్త లోకము లన్నింటికిని దివ్యప్రభువనెడి విషయమును మానవుడు ఎరుగవలెనని సూచించుచున్నవి. అతడు సృష్టికి పూర్వము కూడ స్థితిని కలిగియుండెను. అదేవిధముగా, అతడు తన సృష్టికి అతీతుడును అయియున్నాడు. దేవతలందరును ఈ భౌతిక జగత్తున సృష్టింపబడిరి. కాని శ్రీకృష్ణునికి సంబంధించినంత వరకు అతడు సృష్టింపబడలేదని చెప్పబడినది. కనుకనే దేవతల యందు శ్రేష్ఠులైన బ్రహ్మరుద్రాదుల కంటెను కూడ శ్రీకృష్ణుడు భిన్నుడు. అతడు

బ్రహ్మను, శివుని మరియు ఇతర దేవతలను సృష్టించి యున్నందున సర్వలోక మహేశ్వరుడై యున్నాడు.

కనుకనే సమస్త సృష్టికి శ్రీకృష్ణుడు భిన్నుడు. అట్టి దేవాదిదేవుని యథాతథముగా ఎరిగినవాడు వెంటనే సర్వపాపఫలముల నుండి విముక్తుడగును వాస్తవమునకు పరమపురుషుని జ్ఞానమునందు నెలకొని యుండుటకు మానవుడు సర్వపాపకర్మల నుండి విముక్తుడు కావలెను. కనుకనే భగవద్గీత(18.55) యందు తెలుపబడినట్లు భక్తియుక్త సేవ ద్వారానే శ్రీకృష్ణభగవానుడు అవగతమగును కాని ఇతర విధానములచే కాదు.

శ్రీకృష్ణుని సాధారణ మానవునిగా అవగాహన చేసుకొనుటకు ఎవ్వరును యత్నింపరాదు. పూర్వము చెప్పబడినట్లు, మూర్ఖులు మాత్రమే అతనిని సామాన్య మానవునిగా భావింతురు. ఆ విషయము ఇక్కడ మరొక రూపమున వ్యక్తము చేయబడినది. మూర్ఖత్వము లేకుండా ఆ దేవాదిదేవుని దివ్యస్థితిని అవగాహనము చేసికొనగలిగినంతటి బుద్ధి కలిగినవాడు సర్వపాపఫలముల నుండి విముక్తుడు కాగలడు.

శ్రీకృష్ణుడు దేవకీసుతునిగా తెలియబడుచున్నచో అతడు ఎట్లు అజుడు (పుట్టుక లేనివాడు) కాగలడను ప్రశ్న ఉదయించును. ఈ విషయము కూడ శ్రీమద్భాగవతము నందు వివరింపబడినది. శ్రీకృష్ణుడు దేవకీవసుదేవుల ఎదుట ప్రత్యక్షమైనప్పుడు సామాన్య శిశువుగా జన్మింపలేదు. తొలుత అతడు తన మూల రూపముతో దర్శనమిచ్చి పిదప సాధారణ శిశువుగా మారెను.

శ్రీకృష్ణుని నిర్దేశము ననుసరించి చేయబడిన దంతయు ఆధ్యాత్మికమగును. అది శుభమైనను, అశుభమైనను భౌతిక కర్మఫలములచే కలుషితము కాజాలదు. వాస్తవమునకు భౌతిక ప్రపంచమున శుభమైనదేదియు లేనందున ప్రపంచము నందలి శుభములు, అశుభములు అను భావన దాదాపు మానసిక కల్పనయే. భౌతిక ప్రకృతియే అశుభమైనందున అందులోని సర్వము అశుభమైనదైనను మనము దానిని శుభమైనదని భావింతుము. వాస్తవమునకు కృష్ణచైతన్యముతో చేయబడు భక్తియుక్త సేవలయందే నిజమైన శుభము ఆధారపడి యుండును.కనుకనే మన కార్యములు శుభకరములు కావలెనని వాంఛించినచో, మనము ఖచ్చితముగా దేవాదిదేవుని నిర్దేశముల ననుసరించి కర్మచేయవలసి వచ్చును. అట్టి నిర్దేశములు భగవద్గీత మరియు శ్రీమద్భాగవతములు వంటి ప్రామాణిక ధర్మగ్రంథముల నుండి గాని, ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని నుండి గాని ఎరుగ వచ్చును. భగవానుని ప్రతినిధియగుటచేత ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము భగవానుని ప్రత్యక్ష నిర్దేశమే కాగలదు. గురువు, సాధువు, శాస్త్రము యొక్క నిర్దేశములు ఎల్లప్పుడును ఒకేవిధముగా నుండును. ఇట్టి మూడు మూలముల నిర్దేశము లందు ఎట్టి వైరుధ్య ముండదు. అట్టి నిర్దేశముల ననుసరించి చేయబడిన కర్మలు ఈ భౌతిక జగత్తునకు సంబంధించిన పాపపుణ్యకర్మల ఫలములకు అతీతములై యుండును. కర్మల నాచరించుట యందు భక్తుల భౌతికాతీత ప్రవృత్తి అట్టి వైరాగ్యముతోనే కూడియుండును. అదియే సన్న్యాసమని పిలువబడును. భగవద్గీత యందలి షష్ఠాధ్యాయము నందలి మొదటి శ్లోకమున చెప్పబడినట్లు, కేవలము దేవాదిదేవునిచే ఆదేశింపబడి యున్నందున తన ధర్మమని భావించి కర్మల నాచరించువాడును, మరియు తన కర్మలకు ఫలములను ఆశింపనివాడును మాత్రమే (అనాశ్రిత: కర్మఫలమ్) నిజమైన సన్యాసి. కనుకనే శ్రీకృష్ణభగవానుని నిర్దేశముల ననుసరించి వర్తించువాడే నిజమైన సన్యాసి మరియు యోగి కాగలడు. అంతియేగాని కేవలము సన్న్యాస వేషధారణము కావించినవాడు లేదా బూటకపు యోగి సన్న్యాసి కాజాలడు.

**10.4 - 5**
**బుద్ధిర్ జ్ఞానమసమ్మోహ: క్షమా సత్యం దమ: శమ: ।**
**సుఖం దుఃఖం భవో భావో భయం చాభయమేవ చ ॥**

**అహింసా సమతా తుష్టిస్తపో దానం యశో యశ: ।**
**భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధా: ॥**

**అనువాదము**

**బుద్ధి, జ్ఞానము, సంశయము మరియు భ్రాంతిరాహిత్యము, క్షమాగుణము, సత్యము, ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము, సుఖదుఃఖములు, జనన మరణములు, భయము, భయరాహిత్యము, అహింస, సమత్వము, తృప్తి, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి మున్నగు జీవుల వివిధ గుణములన్నియు నా చేతనే సృజింపబడినవి.**

**భాష్యము**

జీవుల వివిధ గుణములు మంచివైనను, చెడువైనను అవియన్నియును శ్రీకృష్ణుని చేతనే సృష్టింపబడినవి. అవియే ఇక్కడ వర్ణింపబడినవి.

విషయములను సరియైన దృక్పథముతో విశ్లేషించు శక్తికి సంబంధించినదే 'బుద్ధి' యనబడును. ఏది భౌతికము, ఏది ఆధ్యాత్మికమనెడి అవగాహనయే జ్ఞానము. విశ్వవిద్యాలయపు విద్యచే పొందబడు సామాన్యజ్ఞానము భౌతిక విషయమునకు మాత్రమే సంబంధించిన జ్ఞానమగుటచే అది ఇక్కడ వాస్తవ జ్ఞానముగా అంగీకరింపబడుటలేదు. వాస్తవజ్ఞానము అనగా ఆధ్యాత్మికము మరియు భౌతికముల నడుమ గల భేదమును గుర్తింపగలుగుటయే. కాని నేటి ఆధునిక విద్యావిధానమున ఆధ్యాత్మికత్వమునకు సంబంధించిన ఎట్టి విజ్ఞానము లేదు. కేవలము జనులు భౌతిక మూలకములు మరియు దేహావసరములను గూర్చి మాత్రమే శ్రద్ధవహించు చున్నందున విశ్వవిద్యాలయపు జ్ఞానము సంపూర్ణము కాజాలదు.

'అసమ్మోహ:' – సంశయము మరియు భ్రాంతి నుండి విముక్తి. మానవుడు సందేహములను విడిచి ఆధ్యాత్మికతత్త్వమును అవగాహన చేసికొనినప్పుడు అట్టి స్థితిని సాధింపవచ్చును. అట్టివాడు ఆలస్యముగానైనను నిస్సందేహముగా భ్రాంతి నుండి విముక్తుడగును. కనుక దేనిని కూడా గ్రుడ్డిగా అంగీకరింప రాదు. అన్ని విషయములను శ్రద్ధ మరియు జాగరూకతతో అంగీకరింపవలసి యున్నది. 'క్షమ'- సహనమును, క్షమాగుణములను అభ్యసింపవలెను. అనగా మానవుడు సహనశీలుడై ఇతరుల స్వల్పదోషములను మన్నింపవలెను. 'సత్యమ్'- సత్యమనగా ఇతరుల లాభము కొరకు వాస్తవ విషయములను యథాతథముగా తెలియజేయవలెను. సత్యములను ఎప్పుడూ తప్పుగా ప్రదర్శింపరాదు. ఇతరులకు ప్రియమైనట్టి సత్యమునే పలుకుట సాంఘిక మర్యాదయైనను, వాస్తవమునకు అది సత్యము కాదు. కావున ఇతరులందరు సత్యమును అవగాహన చేసికొనునట్లు ఖచ్చితముగా పలుకవలెను. దొంగను దొంగయని పలికి జనులను హెచ్చరించినచో అది సత్యము కాగలదు. కొన్నిమార్లు సత్యము అప్రియమైనను ఎవరును దానిని పలుకుట మానరాదు. ఇతరుల లాభముకొరకు వాస్తవములను యథాతథముగా ప్రదర్శింప వలెనని సత్యసంధత కోరును. అదే సత్యమునకు గల నిర్వచనము.

'దమ:' అనగా ఇంద్రియములను అనవసరమగు ఇంద్రియ భోగాను భవము లందు వినియోగింపకుండుట. వాస్తవమునకు ఇంద్రియావసరములను తీర్చుకొను విషయమునందు ఎట్టి నిషేధము లేదు. కాని అనవసరమైన ఇంద్రియ భోగానుభవము ఆధ్యాత్మికాభివృద్ధికి ఆటంకమును కలిగించును. కనుక అనవసర వినియోగము నుండి ఇంద్రియములను నిరోదింపవలెనని ఇక్కడ తెలుపబడినది. అట్లే మానవుడు అనవసరములైన ఆలోచనల నుండి మనస్సును నిరోదింపవలెను. అదే 'శమ:' అనబడును. ధనార్జనమును గూర్చిన ఆలోచనల యందే మానవుడు కాలమును గడుపరాదు. అది ఆలోచనాశక్తిని దుర్వినియోగ పరచుటయే కాగలదు. అట్టి ఆలోచనాశక్తిని మానవజన్మ ముఖ్యలక్ష్యమును తెలుసుకొనుటకు మరియు దానిని ప్రామాణికముగా ప్రచారము చేయుటకు వినియోగింపవలెను. శాస్త్రము లందు నిష్ణాతులు, సాధువులు, ఆధ్యాత్మికాచార్యులు మరియు ఆలోచనాశక్తి యందు పరిణితి చెందినవారి సాంగత్యముచే అట్టి ఆలోచనాశక్తిని మానవుడు పెంపొందించుకోవలెను. కృష్ణచైతన్య జ్ఞానమునకు సంబంధించిన విజ్ఞానమును అలవరచుకొనుటకు అనుకూలమైన దానియందే నిజమైన సుఖము లేక ఆనందము కలదు. అట్లే కృష్ణచైతన్యమును అలవరచు కొనుటకు ప్రతికూలమైనదియే బాధాకరము లేక దుఃఖకరమై యున్నది. కనుక కృష్ణచైతన్యము యొక్క అభివృద్ధికి అనుకూలమైన దానిని అంగీకరించి, ప్రతికూలమైన దానిని వర్జింపవలెను.

'భవ :' (జన్మము) యనునది దేహమునకు సంబంధించినదని అవగతము చేసికొనవలెను. ఆత్మకు సంబంధించినంత వరకు అట్టి జననము గాని, మరణము గాని లేవని భగవద్గీత ఆరంభము నందే చర్చించియున్నాము. అట్టి జనన మరణములు భౌతిక ప్రపంచము నందు దేహధారణకు సంబంధించినవి. భవిష్యత్తును గూర్చిన చింతయే 'భయము'నకు కారణము. కృష్ణచైతన్యవంతుడు తాను చేయు కర్మలచే నిశ్చయముగా ఆధ్యాత్మికాకాశము నందు గల భగవద్ధామమును తిరిగి చేరును కనుక అతనికి భయముండదు. కనుక అతని భవిష్యత్తు సదా ఉజ్జ్వలమై యుండును. కాని ఇతరులు వారి భవిష్యత్తును గూర్చి గాని భవిష్యత్తు జన్మను గూర్చిగాని తెలియనందున ఎల్లప్పుడు చింతతో కూడి యుందురు. కనుక మనము అట్టి చింతలకు దూరము కావలెనని వాంఛించినచో శ్రీకృష్ణుని అవగాహన చేసికొని, ఎల్లప్పుడు కృష్ణచైతన్యము నందు నెలకొని యుండుటయే ఉత్తమ మార్గము. తద్వారా మనము సమస్త భయముల నుండి విముక్తుల మగుదుము. శ్రీమద్భాగవతము(11.2.37) నందు : "భయం ద్వితీయాభినివేశత: స్యాత్" – "భౌతిక శక్తి యందు నిమగ్నులమై యుండుట చేతనే భయము కలుగును" అని చెప్పబడినది. కాని మాయాశక్తి నుండి విముక్తులైన వారు తాము భౌతిక శరీరులము కామని, శ్రీకృష్ణభగవానుని అంశలమని దృఢవిశ్వాసము కలిగినవారును, దేవాదిదేవుని దివ్యమైన భక్తియుక్త సేవయందు నెలకొనినట్టివారును ఎట్టి భయమును కలిగి యుండనవసరము లేదు. వారి భవిష్యత్తు మిక్కిలి ఉజ్జ్వలమై యుండును. అనగా ఈ భయమనునది కృష్ణచైతన్యవంతులు కాని వ్యక్తులకే కలుగును. 'అభయము'(నిర్భయత్వము) యనెడి గుణము కృష్ణచైతన్యము నందుండు వారికి మాత్రమే సాధ్యపడును.

'అహింస' అనగా ఇతరులకు కలతను లేదా దుఃఖమును కలుగజేయు కార్యమును చేయకుండుట. రాజకీయవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, లోకోపకారులు వంటి వారిచే వాగ్దానము చేయబడు భౌతిక కార్యములు ఆధ్యాత్మిక దృష్టిలోపించి నందున వారికి సత్ఫలితములనీయవు. మానవులు తమకు ఏది ప్రయోజనకరమో వారెరుగక పోవుటయే

అందుకు కారణము. మానవజన్మ యొక్క పరిపూర్ణ ప్రయోజనము సిద్ధించు విధానము నందు ప్రజలందరికిని శిక్షణ మొసగుటయే 'అహింస' అను పదమునకు అర్థము. మానవదేహము ఆత్మానుభూతి కొరకై ఉద్దేశింపబడినది. కనుక అట్టి ప్రయోజనమును సాధింపలేని ఉద్యమము లేదా ప్రణాళిక ఏదైనను మానవ దేహము పట్ల చేయబడు హింసయే కాగలదు. జనులకు భావి ఆధ్యాత్మికానందమును కలుగజేయు కార్యమే అహింసగా పిలువబడును.

'సమత' అనగా ఆసక్తి నుండియు, ద్వేషముల నుండియు విముక్తిని సూచించును. అధికాసక్తిని కలిగియుండుట లేదా అధికమైన అనాసక్తిని కలిగి యుండుట యుక్తము కాదు. కనుక ఈ భౌతిక జగత్తును రాగద్వేష రహితముగా అంగీకరింపవలెను. కృష్ణచైతన్యమును కొనసాగించుటకు అనుకూలమైన దానిని అంగీకరించి ప్రతికూలమైన దానిని నిరాకరింపవలెను. అదియే 'సమత' యనబడును. కృష్ణచైతన్య నిర్వహణ యందలి ప్రయోజనము ననుసరించి కాకుండ మరియే విధముగను కృష్ణచైతన్యవంతుడు అంగీకరింపవలసినది గాని లేదా నిరాకరింపవలసినది గాని ఉండదు.

'తుష్టి:' అనగా సంతృప్తి. మానవుడు అనవసర కార్యములచే భౌతిక వస్తువులను అధికాధికముగా సేకరించుటకు ఆరాటపడరాదు. భగవానుని కృపచే లభించిన దానితోనే ప్రతియొక్కరు సంతృప్తి నొందవలెను. అట్లు సంతృప్తి చెందుటయే 'తుష్టి:' యనబడును. 'తపస్సు' అనగా నిష్ఠతో కూడినదని భావము. ప్రాత:కాలముననే నిద్రలేచుట, స్నానమాచరించుట వంటి వేదములందు చెప్పబడిన నియమ నిబంధనలెన్నో ఇక్కడ అన్వయించును. కొన్నిమార్లు ప్రాత:కాలముననే నిద్రలేచుట అత్యంత కష్టమైనను మానవుడు దానిని స్వచ్ఛందముగా స్వీకరించుటనే తపస్సు యనబడును. అట్లే మాసమందలి కొన్నిరోజులలో ఉపవాసములు చేయవలెనను నిబంధనలు గలవు. అట్టి ఉపవాసములను చేయుట మానవులకు ఇష్టము లేకపోవచ్చును. కాని మానవుడు కృష్ణచైతన్య జ్ఞానమునందు పురోగతి చెందవలెననెడి తన స్థిరనిశ్చయము కారణముగా అట్టి దేహకష్టములను అతడు అనుభవింపవలెను. అయినను అట్టి వేదనియమములకు విరుద్ధముగా గాని, అనవసరముగా గాని ఉపవాసము చేయరాదు. రాజకీయ ప్రయోజనముల కొరకై ఎన్నడును ఉపవాసము చేయకూడదు. అది తమోగుణముచే చేయబడు ఉపవాసముగా భగవద్గీత(17.5,6)యందు వర్ణింపబడినది. రజస్తమోగుణములచే చేయబడు ఎట్టి కార్యమును ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడదు. సాత్త్వికముగా ఏమి చేసినను అది మానవునికి పురోగతిని కలిగించును. వైదిక నియమముల ననుసరించి చేయబడు ఉపవాసము మానవుని ఆధ్యాత్మిక జ్ఞానమును ఖచ్చితముగా వృద్ధిచేయును.

ఇక 'దానము'నకు సంబంధించినంత వరకు మానవుడు తాను సంపాదించిన దానిలో సగభాగమును సత్ప్రయోజనములకై దానము చేయవలెను. సత్ప్రయోజనములు అనగానేమిటి? కృష్ణచైతన్యము కొరకై చేయబడు కార్యమే సత్ప్రయోజనము. అది కేవలము సత్ప్రయోజనమే కాకుండ సర్వోత్తమ ప్రయోజనమై యున్నది. శ్రీకృష్ణభగవానుడు మంగళకరుడగుటచే అతని ప్రయోజనమునకై చేయబడు కర్మమేదైనను మంగళకరము మరియు ప్రయోజనకరమైనట్టిదే కాగలదు. కనుకనే కృష్ణచైతన్యమునందు నెలకొనిన వ్యక్తికే దానమీయవలెను. శాస్త్రగ్రంథముల ననుసరించి బ్రాహ్మణులకే దానము చేయవలెనని చెప్పబడినది. పూర్తిగా శాస్త్ర ప్రకారము కాకున్నను ఇట్టి ఆచారము ఇప్పటికి పాటింపబడుచున్నది. కాని బ్రాహ్మణులకే

దానమును ఎందుకు ఇవ్వవలెను? వారు ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనము నందు నెలకొని యుండుటయే దానికి కారణము. బ్రాహ్మణుడు బ్రహ్మతత్త్వమును అవగాహనము చేసుకొనుటకు తన జీవితకాలము నంతటిని వినియోగింప వలెనని చెప్పబడినది. "బ్రహ్మజానాతీతి బ్రాహ్మణ:"- బ్రహ్మమును ఎరిగిననాడే బ్రాహ్మణుడని పిలువబడును. అట్టి బ్రాహ్మణుడు సర్వదా ఉన్నతమైన ఆధ్యాత్మిక సేవయందు నెలకొని జీవనోపాధిని సంపాదించు కొనుటకు తగిన సమయము లేకుండుట చేత బ్రాహ్మణులకు దానము చేయవలెనని తెలుపబడినది. దానము సన్న్యాసాశ్రమము నందున్నవానికి కూడ చేయవలెనని శాస్త్రములు తెలుపుచున్నవి. సన్న్యాసులైన వారు ధనము కొరకు కాకుండ, ధర్మప్రచారము కొరకై ఇంటింటికి తిరుగుతు యాచిస్తూ, గృహస్థులను అజ్ఞానమను నిద్రనుండి మేల్కొల్పుచుందురు. గృహస్థులు సంసార విషయములందు మునిగి జీవితపు వాస్తవ ప్రయోజనమును విస్మరించుదురు. కనుక వారి యందలి కృష్ణచైతన్యమును జాగృతము చేయుట కొరకై సన్న్యాసులు యాచకులుగా వారివద్దకు వెళ్ళి కృష్ణచైతన్యము నందు వారికి ఆసక్తి ఏర్పడునట్లుగా చేయుదురు. 'కఠోపనిషత్తు' (1.3.14) నందు చెప్పబడినట్లు, మానవుడు జాగరూకుడై మానవ జీవిత లక్ష్యమును సాధించవలసి యున్నందున అట్టి జ్ఞానము మరియు విధానము సన్న్యాసులచే ప్రచారము చేయబడుచున్నది. కనుక ఏదో వ్యర్థప్రయోజనము కొరకు కాకుండ సన్న్యాసులకును, బ్రాహ్మణులకును ఇతర సత్ప్రయోజనముల కొరకై దానము చేయవలసి యున్నది.

'యశస్సు' అనగా కీర్తి. ఎవరైనను గొప్ప భక్తుడని తెలియబడినప్పుడు నిజముగా యశోవంతుడగునని శ్రీ చైతన్య మహాప్రభువు చెప్పియుండిరి. అదియే నిజమైన యశస్సు. ఎవరైన మానవుడు కృష్ణచైతన్యమున గొప్పవాడని తెలియ బడినచో అతడు నిజముగా యశోవంతుడగును. అట్టి యశము లేనివాడే యశోరహితుడు.

ఈ గుణములన్నియు విశ్వమందలి మానవ సమాజము నందును మరియు దేవతలందును గోచరించును. నిజమునకు ఇతర గ్రహములందు కూడ ఎన్నోజీవులు గలవు. వారు కూడ ఈ గుణములను కలిగియుందురు. కృష్ణచైతన్యమున పురోగమించువారి కొరకై శ్రీకృష్ణుడు ఈ గుణములను సృజించి యున్నాడు. ఆ విధముగా యత్నించు కృష్ణచైతన్యవంతుడు తనయందు ఈ గుణములను వృద్ధిచేసుకొనును. అనగా దేవాదిదేవుని భక్తియుక్తసేవ యందు నెలకొనినవాడు దేవాదిదేవుని నిర్దేశముల ననుసరించి ఈ సద్గుణముల నన్నింటిని తన యందు వృద్ధిచేసుకొనును.

మనము చూచు శుభాశుభములనెడి రెండింటికిని మూలము శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణునిలో లేనిదేదియు ఈ భౌతిక జగత్తు నందు తనంతటతానుగా ప్రకటము కాజాలదు. అనగా విషయములు భిన్నముగా గోచరించినను సమస్తము శ్రీకృష్ణుని నుండియే కలుగుచున్నవని గ్రహించుటయే నిజమైన జ్ఞానము.

## 10.6

**మహర్షయ: సప్త పూర్వే చత్వారో మనవస్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమా: ప్రజా: ॥**

### అనువాదము

**సప్తమహర్షులును, వారికి పూర్వము సనక సనందాదులైన నల్గురు మహర్షులును మరియు మనువులును (మానవజాతిని పుట్టించినవారు) నా మానసము నుండియే ఉద్భవించిరి. వివిధ లోకము లందలి సర్వజీవులు వారి నుండి జన్మించిరి.**

### భాష్యము

భగవానుడు విశ్వము నందలి జనసముదాయము యొక్క వంశక్రమానుగత సారాంశమును ఇక్కడ వివిరించుచున్నాడు. తొలుత ఆదిజీవుడైన బ్రహ్మదేవుడు హిరణ్యగర్భుదని తెలియబడు దేవాదిదేవుని శక్తి నుండి ఉద్భవించెను. తదుపరి బ్రహ్మనుండి సనకుడు, సనందుడు, సనాతనుడు, సనత్కుమారుడను నలుగురు మహర్షులును, చతుర్దశ మనువులును అవతరించిరి. ఆ తరువాత సప్త ఋషులును ఉద్భవించిరి. ఈ ఇరువది ఐదుగురు మహాపురుషులు విశ్వము నందలి జీవులందరికి ప్రజాపతులుగా ప్రసిద్ధినొందిరి. అసంఖ్యాకములుగా నున్నట్టి విశ్వములలో అసంఖ్యాక లోకములు కలవు. ప్రతి లోకమును వివిధ జనులచే నిండియున్నవి. వారందరును ఆ ఇరువది యైదుగురు ప్రజాపతుల నుండియే జన్మించిరి. శ్రీకృష్ణుని కృపచే విశ్వమును సృష్టించు జ్ఞానమును పొందుటకు పూర్వము బ్రహ్మదేవుడు వేయి దేవతా సంవత్సరములు తపమాచరించెను. తదుపరి బ్రహ్మ నుండి సనక, సనందన, సనత్కుమారులును, ఆ తర్వాత రుద్రుడును పిమ్మట సప్తఋషులును ఉదయించిరి. ఈ విధముగా బ్రాహ్మణులు మరియు క్షత్రియులు మొదలైన వారందరు భగవానుని శక్తి నుండి ఉద్భవించినట్టివారే. కనుకనే బ్రహ్మదేవుడు పితామహునిగను(తాతయని) మరియు శ్రీకృష్ణుడు తాతకు తండ్రియైన ప్రపితామహునిగను తెలియబడిరి. ఈ విషయము భగవద్గీత (11.39) నందు చెప్పబడినది.

## 10.7

**ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వత: ।**
**సో వికల్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయ: ॥**

### అనువాదము

**నా ఈ దివ్యవిభూతిని, యోగశక్తిని యథార్థముగా నెరిగినవాడు నా విశుద్ధ భక్తియుక్త సేవలో నియుక్తుడు కాగలడు. ఈ విషయమున ఎట్టి సందేహము లేదు.**

### భాష్యము

దేవాదిదేవునికి సంబంధించిన జ్ఞానము ఆధ్యాత్మిక పరిపూర్ణత్వము యొక్క అత్యున్నత దశ. దేవాదిదేవుని వివిధ దివ్యవిభూతుల యందు దృఢ నిశ్చయము కలుగనిదే ఎవ్వరును పూర్తిగా భక్తియుక్త సేవయందు నెలకొనజాలరు. సాధారణముగా జనులు భగవానుడు గొప్పవాడని తెలిసియుందురు. గాని అతడెట్లు గొప్పవాడనెడి విషయమును వివరముగా వారెరుగరు. ఆ వివరములు ఇక్కడ సమగ్రముగా తెలుపబడుచున్నవి. మానవుడు భగవానుడెట్లు గొప్పవాడో వాస్తవముగా ఎరిగినప్పుడు సహజముగానే అతడు శరణాగతుడై భగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనును.

అతడు భగవానుని దివ్యవిభూతులను యథార్థముగా ఎరిగినప్పుడు అతనికి శరణాగతుదగుట కంటెను మరొక మార్గము లేదు. ఈ యథార్థమైన జ్ఞానమును భగవద్గీత, శ్రీమద్భాగవతము మరియు అట్టి ఇతర గ్రంథములలో గల వర్ణనలను బట్టి తెలిసికొనవచ్చును.

ఈ విశ్వపాలన కొరకు విశ్వమందంతటను నియమింపబడిన అనేక దేవతలు కలరు. వారిలో బ్రహ్మ, శివుడు, సనకసనందనాది కుమారులు, ఇతర ప్రజాపతులు ముఖ్యమైనవారు. విశ్వజనులకు గల పలువురు పితృదేవతలు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నుండియే జన్మించిరి. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే ఈ పితృదేవతలకు పరమపితయై యున్నాడు.

వాస్తవమునకు ఇవియన్నియును శ్రీకృష్ణభగవానుని కొన్ని విభూతులు మాత్రమే. ఈ విభూతుల యందు దృఢమైన విశ్వాసము కలిగిన మానవుడు అధికమైన శ్రద్ధతో సందేహరహితముగ శ్రీకృష్ణుని అంగీకరించి భక్తియుక్త సేవ యందు నెలకొనగలడు. శ్రీకృష్ణభగవానుని ప్రేమయుక్త సేవ యెడ ఆసక్తిని మరియు శ్రద్ధను పెంపొందించు కొనుటకు ఈ ప్రత్యేకమైన జ్ఞానము ఎంతగానో అవసరము. శ్రీకృష్ణభగవానుని దివ్యత్వమును ఎరుగుట యందు ఎవ్వరును నిర్లక్ష్యమును వహింపరాదు. శ్రీకృష్ణుని దివ్యత్వము నెరుగుటచే మానవుడు హృదయ పూర్వకముగా భక్తియుక్త సేవయందు ప్రతిష్ఠితుడగును.

## 10.8

**అహం సర్వస్య ప్రభవో మత్త: సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజన్తే మాం బుధా భావసమన్వితా: ॥**

## అనువాదము

**సర్వములైన ఆధ్యాత్మిక మరియు భౌతిక జగత్తులకు నేనే కారణభూతుడను. సర్వము నా నుండియే ఉద్భవించుచున్నది. ఈ విషయమును సంపూర్ణముగా నెరిగిన బుధజనులు నా భక్తియుక్త సేవయందు నెలకొని నన్ను హృదయ పూర్వకముగా భజింతురు.**

## భాష్యము

వేదములను సంపూర్ణముగా అధ్యయనము చేసినవాడును, శ్రీ చైతన్య మహాప్రభువు వంటి ప్రామాణికాచార్యుల నుండి జ్ఞానమును సంపాదించినవాడును, ఆ బోధనలను ఏ విధముగా ఆచరణలో పెట్టవలెనో ఎరిగినవాడును అగు పండితుడు శ్రీకృష్ణుడే భౌతిక, ఆధ్యాత్మిక జగత్తుల రెండింటి యందలి సర్వమునకు మూలాధారమని ఎరిగి దేవాదిదేవుని భక్తియుక్తి సేవ యందు సుస్థిరుడగును. అర్థరహిత వ్యాఖ్యానములచే గాని, మూర్ఖులచే గాని ప్రభావితుడు కాకుండ, తన భక్తిమార్గము నుండి వైదొలగకుండును. వైదిక గ్రంథములన్నియు శ్రీకృష్ణుడే బ్రహ్మకును, శివునికిని, ఇతర దేవతలకును కారణభూతుడను విషయమును అంగీకరించు చున్నవి. అథర్వణ వేదమునందలి 'గోపాలతాపన్యుపనిషత్తు' (1.22) నందు : "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ గాపాయతి స్మ కృష్ణ:"- "బ్రహ్మదేవునకు ఆదిలో వేదవిజ్ఞానమును బోధించినవాడును మరియు పూర్వము వేదవిజ్ఞానమును విస్తరింప జేసినవాడును శ్రీకృష్ణుడే" అని చెప్పబడినది. అదేవిధముగా 'నారాయణోపనిషత్తు'(1) నందు కూడ :

"అథ పురుషో హ వై నారాయణో కామయత ప్రజా: సృజేయేతి"- "అప్పుడు దేవాదిదేవుడైన నారాయణుడు జీవులను సృజింపదలచెను" అని తెలుపబడినది. అదే ఉపనిషత్తు ఇంకను ఇట్లు కొనసాగించును : "నారాయణాద్ బ్రహ్మ జాయతే, నారాయణాద్ ప్రజాపతి: ప్రజాయతే, నారాయణాద్ ఇంద్రో జాయతే, నారాయణాదష్టౌ వసవో జాయన్తే, నారాయణాద్ ఏకాదశ రుద్రా జాయన్తే, నారాయణాద్ ద్వాదశా దిత్యా:" అనగా "నారాయణుని నుండియే బ్రహ్మదేవుడు మరియు ప్రజాపతులు ఉద్భవించిరి. నారాయణుని నుండియే ఇంద్రుడు జన్మించెను. నారాయణుని నుండియే అష్టవసువులు జన్మించిరి, నారాయణుని నుండియే ఏకాదశ రుద్రులు ఉద్భవించిరి మరియు నారాయణుని నుండియే ద్వాదశాదిత్యులును జన్మించిరి." అట్టి నారాయణుడు శ్రీకృష్ణభగవానుని స్వరూపాంశమే.

'నారాయణోపనిషత్తు'(4) నందే : "బ్రహ్మణ్యో దేవకీపుత్రా:" – "దేవకీ పుత్రుడైన శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని చెప్పబడినది." 'మహోపనిషత్తు'(1) నందు తిరిగి : "ఏకో వై నారాయణ ఆసీన్న బ్రహ్మ న ఈశానో నాపో నాగ్ని సమౌ నేమే ద్యావాపృథివీ న నక్షత్రాణి న సూర్య:" – "సృష్టికి ఆరంభమున దేవాదిదేవుడైన నారాయణుడొక్కడే యుండెను. బ్రహ్మదేవుడు కాని, శివుడు కాని, జలము కాని, అగ్నికాని, చంద్రుడు కాని, ఆకాశమున నక్షత్రములు కాని, సూర్యుడు కాని లేకుండిరి" అని తిరిగి చెప్పబడుచున్నది. అదేవిధముగా 'మహోపనిషత్తు'(1) నందు కూడా శివుడు దేవాదిదేవుని ఫాలభాగము (నుదుటి) నుండి ఉద్భవించెనని తెలుప బడినది. కనుకనే వేదములు బ్రహ్మరుద్రాదులను సృష్టించిన దేవాదిదేవుడే పూజనీయుడని తెలుపుచున్నది.

'మోక్షధర్మము' నందు శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పుచున్నాడు :

ప్రజాపతిం చ రుద్రం చాప్యహమేవ సృజామి వై ।
తౌ హి మాం న విజానీతో మమ మాయావిమోహితౌ ॥

"ప్రజాపతులును, శివుడు మరియు ఇతరులును నా మాయాశక్తిచే భ్రాంతులగుటచే తాము నాచే సృజింపబడినట్లు ఎరుగకున్నను వాస్తవముగా నా చేతనే సృష్టింప బడిరి."
'వరాహపురాణము' నందు కూడ ఇట్లు చెప్పబడినది :

నారాయణ: పరో దేవస్తస్మాజ్జాతశ్చతుర్ముఖ: ।
తస్మాద్ రుద్రో భవద్దేవ: స చ సర్వజ్ఞతాం గత: ॥

"నారాయణుడు దేవాదిదేవుడు. అతని నుండియే బ్రహ్మ జన్మించెను. అతని నుండి రుద్రుడు ఉద్భవించెను."

శ్రీకృష్ణభగవానుడు సమస్త సృష్టికి మూలాధారుడు. కనుక అతడు సర్వమునకు మూలకారణుడని చెప్పబడుచున్నాడు. కనుకనే నిమిత్తమాత్రుడై భగవానుడు : "సర్వమును నా నుండియే ఉద్భవించుట చేత సర్వమునకు నేనే మూలకారణుడను. సర్వమును నా ఆధీనము నందే కలదు. నాకంటెను అధికు లెవ్వరును లేరు" అని అతడు తెలుపుచున్నాడు. శ్రీకృష్ణుని కంటె అన్యమైన దివ్యనియామకుడు మరియొకడు లేడు. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని నుండి వైదిక గ్రంథముల ఆధారముతో శ్రీకృష్ణుని గూర్చి ఈ విధముగా అవగాహన చేసికొనినవాడు, తన శక్తినంతటిని కృష్ణచైతన్యములో నిమగ్నము చేసి నిజమైన పండితుడగును. అట్టివానితో పోల్చి

చూచినచో శ్రీకృష్ణుని గూర్చి యథార్థముగా ఎరుగనట్టి ఇతరులందరును మూర్ఖులే. కేవలము మూర్ఖుడు మాత్రమే శ్రీకృష్ణుని సాధారణ మానవునిగా భావించును. కనుక కృష్ణచైతన్యవంతుడు అట్టి మూర్ఖుల వాక్కులచే ఎన్నడును భ్రాంతి చెందరాదు. అతడు భగవద్గీతపై గల అప్రామాణిక వ్యాఖ్యానములను మరియు వివరణములను తిరస్కరించి కృష్ణచైతన్యమున దృఢనిశ్చయము మరియు స్థిరత్వముతో కొనసాగవలెను.

## 10.9

**మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్త: పరస్పరమ్ ।**
**కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ ॥**

## అనువాదము

**నా శుద్ధభక్తుల ఆలోచనలన్నియు నా యందే నిమగ్నమై, వారి జీవితములు సంపూర్ణముగా నా సేవ కొరకే అర్పణమై యుండును. నా గూర్చి ఒకరికొకరు బోధించు కొనుచు మరియు చర్చించు కొనుచు నిరంతరము వారు గొప్ప సంతృప్తిని మరియు ఆధ్యాత్మికానందము ననుభవింతురు.**

## భాష్యము

శుద్ధభక్తులు వారి లక్షణములు ఇక్కడ పేర్కొనబడినవి. వారు భగవానుని దివ్యమైన ప్రేమయుక్తసేవ యందు సంపూర్ణముగా నెలకొనియుందురు. వారి మనస్సులు శ్రీకృష్ణుని పాదపద్మముల నుండి మరల్చబడజాలవు. వారి చర్చ లెప్పుడును ఆధ్యాత్మిక విషయములకు సంబంధించినవిగానే యుండును. కనుకనే ఈ శ్లోకములందు శుద్ధభక్తుల లక్షణములు ప్రత్యేకముగ వర్ణింపబడినవి. అట్టి శుద్ధభక్తులు ప్రతిదినము ఇరువది నాలుగుగంటలు ఆ దేవాదిదేవుని గుణములను మరియు లీలలను కీర్తించుట యందే నిమగ్నులై యుందురు. వారి హృదయములు మరియు ఆత్మలును సదా శ్రీకృష్ణుని యందే లగ్నమై యుండును. ఇతర భక్తులతో దేవాదిదేవుని గూర్చి చర్చించుట యందు వారు ఆనందము ననుభవింతురు.

భక్తియుక్తసేవ యొక్క ప్రాథమిక దశ యందు సేవ ద్వారా భక్తుడు ఆధ్యాత్మికానందము ననుభవించును. పరిపక్వస్థితిలో వారు భగవత్ప్రేమ యందే వాస్తవముగా స్థితులగుదురు. అట్టి ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొనిన పిమ్మట భగవానునిచే తన దివ్యధామము నందు ప్రదర్శింపబడు నిత్యలీలలను వారు అనుభవింపగలరు. భక్తియుక్త సేవను జీవి యొక్క హృదయమునందు బీజమును నాటుటగా శ్రీ చైతన్య మహాప్రభువు పోల్చియుండిరి. విశ్వమునందలి వివిధ లోకము లందు నిరంతరముగా పరిభ్రమించు జీవులు అసంఖ్యాకులుగా నుందురు. శుద్ధభక్తుని సాంగత్యమును పొంది భక్తియుక్త సేవను అవగాహనము చేసుకొను అవకాశమును అనంతకోటి జీవరాశులలో భాగ్యవంతులైన కొద్దిమంది మాత్రమే పొందుదురు. ఈ భక్తియుక్త సేవ యనునది బీజము వంటిది. అట్టి భక్తిబీజము జీవి హృదయమునందు నాటబడిన పిమ్మట అతడు, “హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే” అను మహామంత్రమును కీర్తించుటను, శ్రవణము చేయుటను నిరంతరము కొనసాగించినచో, నిత్యము జలము నందించుట చేత వృక్షబీజము మొలకెత్తునట్లుగా, ఆ భక్తి బీజము మొలకెత్తగలదు. పిమ్మట ఆధ్యాత్మిక సేవ అనెడి భక్తిలత, క్రమముగా వృద్ధినొంది భౌతికజగత్తు యొక్క ఆచ్ఛాదనము(కోశము)ను

ఛేదించుకొని ఆధ్యాత్మికాకాశము నందలి 'బ్రహ్మజ్యోతి'ని చేరును. ఆధ్యాత్మిక జగత్తునందు ఆ లత శ్రీకృష్ణుని దివ్య లోకమగు గోలోక వృందావనముగా పిలువబడు అత్యున్నత లోకమును చేరునంత వరకు పెరిగి పెరిగి చివరికది శ్రీకృష్ణుని పాదపద్మముల ఆశ్రయమును పొంది అక్కడ విశ్రమించును. ఒక మొక్క క్రమముగా పెరిగి ఫలపుష్పములను అందించునట్లుగా, భక్తిలత కూడ అట్లే ఫలపుష్పములను అందించును. అట్టి సమయమున కూడా భక్తిలతకు శ్రవణ కీర్తనల రూపమున జలసేవ ప్రక్రియ కొనసాగుతూనే యుండును. ఇట్టి భక్తిలత 'శ్రీ చైతన్య చరితామృతము' (మధ్యలీల 19వ, అధ్యాయము) నందు స్పష్టముగా వివరింప బడినది. పరిపక్వమైన భక్తిలత శ్రీకృష్ణభగవానుని పాదపద్మముల ఆశ్రయమును పొందిన పిమ్మట, భక్తుడు భగవత్ప్రేమ యందు పూర్తిగా లీనమగునని అందులో వివరింపబడినది. అప్పుడు, నీరు లేకుండ చేప జీవింపలేనట్లుగా, భక్తుడు దేవాదిదేవుని సంబంధము లేకుండా క్షణకాలమైనను జీవింపజాలడు. అట్టి స్థితిలో దేవాదిదేవుని సంబంధము వలన భక్తుడు ఆధ్యాత్మిక లక్షణములను వాస్తవముగా పొందును.

దేవాదిదేవునికిని మరియు అతని భక్తులకును నడుమ గల సంబంధమును గూర్చి తెలుపు వర్ణనలతోనే శ్రీమద్భాగవతము పూర్తిగా నిండియున్నది. కనుకనే భాగవతము (12.13.18)నందు చెప్పబడినట్లు : "భక్తులకు శ్రీమద్భాగవతము అత్యంత ప్రియమై యుండును"-"శ్రీమద్భాగవతం పురాణమమలం యద్వైష్ణవానాం ప్రియమ్." ఈ వర్ణనలలో భౌతికమైన ధర్మము, అర్థము, కామము, మోక్షములను గూర్చిన చర్చ లేదు. దేవాదిదేవుని మరియు అతని భక్తుల దివ్య స్వభావములను గూర్చి సంపూర్ణముగా వివరించునట్టి ఏకైక గ్రంథమే శ్రీమద్భాగవతము. యువతీ యువకులు ఒకరినొకరి సాహచర్యము ఆనందమును పొందునట్లుగా కృష్ణచైతన్యము నందు పరిపూర్ణత నొందిన మహాత్ములు అట్టి దివ్యశాస్త్రములను శ్రవణము చేయుట యందు నిరంతరము ఆనందమును పొందుచుందురు.

## 10.10

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే ॥**

### అనువాదము

**ప్రేమతో నా సేవయందు నిరంతరాసక్తులై యుండువారికి నన్ను చేరగల బుద్ధియోగమును నేనొసగుదును.**

### భాష్యము

ఈ శ్లోకమునందు 'బుద్ధియోగమ్' అను పదము ఎంతో ప్రధానమైనది. ద్వితీయాధ్యాయమున శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు ఉపదేశించుచు తాను అనేక విషయములను గూర్చి చర్చించితిననియు మరియు ఇకపై 'బుద్ధియోగ' విధానము ద్వారా కూడ బోధించుచున్నట్లు పలికియున్న విషయమును మనము ఇక్కడ గుర్తు చేసికొనవచ్చును (2.39). ఇప్పుడు అట్టి బుద్ధియోగము ఇక్కడ వివరింపబడు చున్నది. 'బుద్ధియోగ'ము అనగా కృష్ణచైతన్యముతో కర్మచేయుట. అదియే అత్యుత్తమ బుద్ధి మరియు జ్ఞానమనబడును. 'బుద్ధి' అనగా వివేకము. 'యోగ' అనగా యోగక్రియలు. మానవుడు భగవద్ధామమును తిరిగిచేరుటకు ప్రయత్నిస్తూ, కృష్ణచైతన్యముతో

భక్తియుక్తసేవ యందు పూర్తిగా నెలకొనినచో అతని కర్మలు బుద్ధియోగ మనబడును. మరోమాటలో చెప్పవలెననిన, భౌతిక జగత్తు బంధముల నుండి సులభముగా విడివడు విధానమే బుద్ధియోగము. పురోగతికి పరమలక్ష్యము శ్రీకృష్ణుడు. కాని ప్రజలు ఈ విషయమును ఎరుగరు. కనుక ఆధ్యాత్మికాచార్యుని మరియు భక్తుల సాంగత్యము అత్యంత ప్రధానమని ప్రతియొక్కరు ఎరుగవలెను. ఆ విధముగా లక్ష్యము నిర్ణయింపబడినప్పుడు మానవుడు ఆ మార్గమున క్రమముగా ముందుకు ప్రయాణించినచో పరమలక్ష్యము ప్రాప్తింపగలదు.

మానవుడు జీవితలక్ష్యమును ఎరిగినను తన కర్మఫలముల పట్ల ఆసక్తిని కలిగియున్నచో అతడు కర్మయోగమును అవలంబించు వాడగును. అట్లే, అతడు శ్రీకృష్ణుడే గమ్యమని ఎరిగినను, మానసిక కల్పనలచే శ్రీకృష్ణుని అవగాహన చేసుకొన యత్నించువాడు జ్ఞానయోగమును అవలంబించు వాడగును. అతడు తన గమ్యమును పూర్తిగా నెరిగి, కృష్ణచైతన్యము నందు భక్తియుక్త సేవ ద్వారా శ్రీకృష్ణుని పొందగోరినపుడు, అతడు సంపూర్ణము మరియు సమగ్రమైన భక్తియోగమును లేదా బుద్ధియోగమును అవలంబించిన వాడగును. ఇదియే మానవ జీవితము యొక్క అత్యున్నత పరిపూర్ణ స్థితి.

మానవుడు ఆధ్యాత్మికాచార్యుని పొందినను మరియు ఏదేని ఒక ఆధ్యాత్మిక సంస్థతో సంబంధమును కలిగియున్నను, అతడు అధ్యాత్మికముగా పురోభివృద్ధిని సాధింప లేకపోయినచో, ఎట్టికష్టము లేకుండా అతడు చివరికి తనను చేరునట్లుగా శ్రీకృష్ణుడే అతనికి అంతరంగము నుండి ఆదేశముల నిచ్చుచుండును. ఒకవ్యక్తి కృష్ణచైతన్యమున సదా నెలకొని ప్రేమ మరియు భక్తిలతో కూడి వివిధ సేవలను అందించుటయే అందుకు కావలసిన యోగ్యత. అతడు శ్రీకృష్ణుని కొరకై ఏదేని ఒక కార్యమును ప్రేమతో చేయుచుండవలెను. ఆత్మానుభూతి మార్గము నందు పురోగతిని సాధించుటకు కావలసిన బుద్ధిని భక్తుడు కలిగిలేకున్నను, భక్తియుక్త సేవాకార్యములందు శ్రద్ధగా నెలకొనినచో, భగవానుడే అతనికి పురోగతి సాధించుటకు మరియు అంత్యమున తనను చేరుటకు అవకాశమిచ్చును.

## 10.11

**తేషామేవానుకమ్పార్థమహమజ్ఞానజం తమః ।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥**

### అనువాదము

**నేను వారి యెడ ప్రత్యేకానుగ్రహమును చూపుట కొరకు వారి హృదయము లందు వసించుచు, తేజోమయమైన జ్ఞానదీపముచే అజ్ఞానము వలన పుట్టిన తమస్సును నశింపజేయుదును.**

### భాష్యము

శ్రీ చైతన్య మహాప్రభువు "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే / హరేరామ హరేరామ రామరామ హరేహరే" అను మహామంత్ర సంకీర్తనమును వారణాసి పట్టనమందు ప్రచారము చేయుచున్నప్పుడు వేలకొలది ప్రజలు అతనిని అనుసరించసాగిరి. ఆ కాలమున వారణాసిలో గొప్ప పలుకుబడి కలిగిన పండితుడు ప్రకాశనంద సరస్వతి శ్రీ చైతన్య మహాప్రభువు భావావేశపరుడై నందుకు హేళనచేసెను.

భక్తులైనవారు అజ్ఞానాంధకారములో నుండి, తత్త్వరీత్యా భావావేశపరులై యుందురని కొన్నిమార్లు కొందరు మాయావాది తత్త్వవేత్తలు భావించుటయే అందుకు కారణము. కాని వాస్తవమునకు అది సత్యము కాదు. గొప్ప గొప్ప విద్వాంసులెందరో భక్తితత్త్వమును గూర్చి సమగ్రముగా విశదపరిచిరి. కాని భక్తుడు వారి గ్రంథముల నుండి గాని, ఆధ్యాత్మికాచార్యుని ఆదేశముల నుండి గాని లాభము పొందలేకున్నను, అతడు శ్రద్ధతో భక్తియుక్త సేవయందు పాల్గొనినచో శ్రీకృష్ణుడు స్వయముగా అతని హృదయము నుండియే అతనికి తోడ్పడగలడు. కనుక శ్రద్ధతో కృష్ణచైతన్యము నందు నెలకొనిన భక్తుడు ఎన్నడును జ్ఞానహీనుడుగా నుండజాలడు. సంపూర్ణ కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవయందు నెలకొనుటయే అతనికి కావలిసినట్టి యోగ్యత.

యుక్తాయుక్త విచక్షణ లేకుండా ఎవ్వరును శుద్ధజ్ఞానమును పొందజాలరని ఆధునిక తత్త్వవేత్తలు భావింతురు. అట్టివారికి దేవాదిదేవుడు ఈ శ్లోకమునందు తగు సమాధానమిచ్చెను. శుద్ధ భక్తియుక్త సేవయందు నెలకొనినట్టివారు తగినంత విద్యలేకున్నను, వైదిక సిద్ధాంతములను గూర్చిన తగినంత జ్ఞానము లేకున్నను ఈ శ్లోకములో తెలుపబడినట్లు దేవాదిదేవుని సహాయమును తప్పక పొందుదురు.

పరతత్త్వమైన తనను కేవలము మానసిక కల్పనల ద్వారా అవగాహన చేసికొనుట సాధ్యపడదని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు బోధించును. పరతత్త్వమైన భగవానుడు మహత్తరుదగుటచే మానసిక కల్పనల ద్వారా అతనిని అవగాహనము చేసికొనుట లేదా పొందగలుగుట అసాధ్యము. మానవుడు భక్తి లేకుండ మరియు పరతత్త్వము నందు అనురాగము లేకుండ కోట్లాది సంవత్సరములు మానసిక కల్పనలను కొనసాగించినను పరతత్త్వమును(శ్రీకృష్ణుని) ఎరుగజాలడు. కేవలము భక్తియుక్త సేవ ద్వారానే పరతత్త్వమైన శ్రీకృష్ణుడు సంతృప్తి చెంది ఊహాతీతమైన తన అంతరంగ శక్తి ద్వారా శుద్ధభక్తుని హృదయమున తననుతాను వ్యక్తము చేసికొనగలడు. శుద్ధభక్తుని హృదయము నందు ఎల్లప్పుడును శ్రీకృష్ణుడుండును. సూర్యసముడైన శ్రీకృష్ణుని అట్టి ఉనికిచే భక్తుని హృదయము నందలి అజ్ఞానాంధకారము వెంటనే పటాపంచలైపోవును. ఇదియే శ్రీకృష్ణుడు తన శుద్ధభక్తుల పట్ల చూపు ప్రత్యేక కృపయై యున్నది.

కోటానుకోట్ల జన్మల యందలి భౌతిక సంపర్క మాలిన్యముచే మానవుని హృదయము ఎల్లపుడును భౌతికత్వమనెడి ధూళిచే కప్పబడి యుండును. కాని అతడు భక్తియుక్త సేవయందు నెలకొని నిరంతరము 'హరేకృష్ణ' మహామంత్రమును జపించినచో వెంటనే హృదయమాలిన్యము తొలగి అతడు శుద్ధజ్ఞానస్థితికి ఉద్ధరింప బడ గలుగును. పరమలక్ష్యమైన విష్ణువు కేవలము హరినామ సంకీర్తనము చేత మరియు భక్తియుక్త సేవచేత మాత్రమే లభించును. అంతేగాని మానసికకల్పనలు లేదా హేతువాదముతో కాదు. శుద్ధభక్తుడు ఏనాడును భౌతిక జీవితావసరములను గూర్చిన చింత మరియు ఆందోళనలను కలిగి యుండనవసరము లేదు. ఎందుకనగా, భక్తుడు తన హృదయము నుండి అజ్ఞానాంధకారమును తొలగించు కొనినంతనే, ప్రేమతో కూడిన భక్తియుక్త సేవ యందు సంతృప్తుడైన దేవాదిదేవుడు అతనికి సహజముగనే సర్వమును సమకూర్చును. ఇదియే భగవద్గీత ఉపదేశముల సారాంశము. కనుక భగవద్గీత అధ్యయనము ద్వారా మానవుడు దేవాదిదేవునకు సంపూర్ణ ఆత్మసమర్పణతో అతని శుద్ధభక్తియుక్త సేవయందు నెలకొనగలడు. భగవానుడే అతని సంరక్షణభారమును స్వీకరించినపుడు సర్వవిధములైన భౌతిక ప్రయత్నముల నుండి అతడు సంపూర్ణముగా విముక్తుడగును.

**10. 12 - 13**
**అర్జున ఉవాచ**
**పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।**
**పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్ ॥**

**ఆహుస్త్వామృషయ: సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాస: స్వయం చైవ బ్రవీషి మే ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : నీవు దేవాదిదేవుడవు, పరంధాముడవు, పరమపవిత్రుడవు, పరతత్త్వమువు, శాశ్వతుడవు, దివ్యుడవు, ఆదిపురుషుడవు, అజుడవు, విభుడవు. నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు వంటి మహర్షు లందరును నిన్ను గూర్చిన ఈ సత్యమునే ధ్రువపరచియున్నారు. ఇప్పుడు స్వయముగా నీవు కూడ అదే విషయమును నాకు తెలియజేయుచున్నావు.**

**భాష్యము**

ఈ రెండు శ్లోకము లందును పరమపురుషుడు ఆధునిక తత్త్వవేత్తలకు ఒక అవకాశ మొసగుచున్నాడు. భగవానుడు జీవాత్మకు భిన్నుడని ఇక్కడ స్పష్టముగా తెలియబడుటయే అందుకు కారణము. ఈ అధ్యాయము నందలి అతి ముఖ్యమైన నాలుగు శ్లోకములను(8-11) వినిన పిదప అర్జునుడు సర్వసందేహముల నుండి విముక్తుడై శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అంగీకరించెను. కనుకనే అతడు "నీవే పరబ్రహ్మవు, దేవాదిదేవుడవు" అని ధైర్యముగా ప్రకటించెను. సమస్తము తన నుండియే ఉద్భవించినదనియు మరియు దేవమనుష్యాది జీవులందరును తన పైననే ఆధారపడియున్నారని శ్రీకృష్ణుడు పూర్వమే తెలిపియుండెను. కాని అజ్ఞానముచే మానవులు మానవులు మరియు దేవతలు తామే పరతత్త్వమని భావిస్తూ తాము దేవాదిదేవునికి ఆధీనులము కామని భావింతురు. కాని అట్టి అజ్ఞానము భక్తియుక్త సేవ ద్వారానే పూర్తిగా తొలుగునని శ్రీకృష్ణభగవానునిచే గడిచిన శ్లోకమునందు ఇదివరకే వివరింపబడినది. ఇప్పుడు భగవాని కృపచే అర్జునుడు వేదనిర్దేశముల ననుసరించి, అతనిని పరతత్త్వముగా అంగీకరించు చున్నాడు. శ్రీకృష్ణుడు తనకు ఆప్త మిత్రుడగుటచే అతనిని నీవే పరతత్త్వమనియు, దేవాదిదేవుడవనియు అర్జునుడు ముఖస్తుతి చేయుటలేదు. అతడు వేదానుసారమే అట్లు కీర్తించెను. ఈ రెండు శ్లోకము లందును అర్జునుడు చెప్పినదంతయు వేదములచే నిర్ధారింపబడుచున్నది. దేవాదిదేవుని భక్తియుక్తసేవ యందు నెలకొనినవాడే శ్రీకృష్ణుని అవగతము చేసికొన గలడనియు, ఇతరులు అట్లు అర్థము చేసుకొనుటకు సమర్థులు కారనియు వేదవాక్యములు నొక్కిచెప్పుచున్నవి. ఈ శ్లోకమున అర్జునుడు పలికిన ప్రతిపదము వేదనిర్దేశముచే నిర్ధారింపబడుచున్నది.

'కేనోపనిషత్తు' నందు పరబ్రహ్మము సర్వమునకు ఆశ్రయస్థానమని చెప్పబడినది. సర్వము తనపైననే ఆధారపడియున్నదని పూర్వమే శ్రీకృష్ణుడు పలికి యున్నాడు. సర్వమునకు ఆధారభూతుడైన దేవాదిదేవుని గూర్చి నిరంతరము స్మరించువానికి మాత్రమే అతడు అనుభూతుడగునని 'ముండకోపనిషత్తు' ధ్రువపరచు చున్నది. అట్లు శ్రీకృష్ణుని గూర్చి సదా స్మరించుట యనునది నవవిధ భక్తియుక్త సేవావిధానములలో ఒకటైన 'స్మరణము'. శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవద్వారానే మానవుడు తన సహజస్థితిని ఎరిగి భౌతికదేహము నుండి విడివడగలడు.

వేదములలో పరమపురుషుడు పవిత్రులలో పరమ పవిత్రునిగా అంగీకరింప బడినాడు. శ్రీకృష్ణుడు పవిత్రులలో పరమ పవిత్రుడని అవగాహన చేసికొనినవాడు సర్వ పాపకార్యముల నుండి పవిత్రుడు కాగలడు. దేవాదిదేవునికి శరణు పొందనిదే ఎవ్వరును పాపకర్మల నుండి విడివడలేరు. శ్రీకృష్ణుని పరమ పవిత్రుడని అర్జునుడు అంగీకరించుట వేదనిర్దేశములకు చక్కగా సమన్వయించు చున్నది. ఈ విషయము నారదాది మహర్షులచే కూడ ధ్రువపరచబడినది.

శ్రీకృష్ణుడు దేవాదిదేవుడు. మానవుడు నిరంతరము అతనినే ధ్యానించుచు అతనితో ఆధ్యాత్మిక సంబంధము ననుభవింపవలెను. అతడు పరబ్రహ్మము; భగవానుడు జననమరణములకును శరీరావసరములకును అతీతుడు. ఈ విషయమును అర్జునుడే కాకుండ అన్ని వైదిక గ్రంథములు, పురాణములు, చరిత్రలు కూడ ధ్రువీకరించుచున్నవి. సమస్త వైదిక గ్రంథము లందును శ్రీకృష్ణుడు ఈ విధముగనే వర్ణింపబడియున్నాడు. భగవానుడు కూడ స్వయముగా చతుర్థాధ్యాయము నందు : "నేను పుట్టుకలేని వాడనైనప్పటికిని ధర్మసంస్థాపనార్థము ఈ భూమిపై అవతరించు చుండును" అని తెలిపెను. అతడే ఆదిదేవుడు. సర్వ కారణములకు కారణుడగుట చేత అతనికి ఏ కారణము లేదు. సర్వము అతని నుండియే ఉద్భవించును. ఇట్టి దివ్యజ్ఞానము దేవాదిదేవుని కృపచేతనే ప్రాప్తించును.

ఇక్కడ అర్జునుడు శ్రీకృష్ణుని కృపచేతనే తన భావములను వ్యక్తపరచగలిగెను. భగవద్గీతను మనము అవగాహన చేసికొనదలచినచో ఈ రెండు శ్లోకము లందు చెప్పబడిన విషయములను యథాతథముగా అంగీకరించి తీరవలెను. దీనిని పరంపరా విధానము అనగా గురుశిష్య పరంపరను అంగీకరించుట అందురు. ఈ పరంపరను అంగీకరించనిదే ఎవరును భగవద్గీతను అవగాహన చేసికొన జాలరు. ఇది సాధారణ లౌకికవిద్యచే సాధ్యము కాదు. దురదృష్టవశాత్తు, లౌకిక విద్యాసంపదచే గర్వితులైనవారు కొందరు వైదిక గ్రంథములందు గొప్ప నిదర్శనములు లభించుచున్నను శ్రీకృష్ణుడు సాధారణ మానవుడేనను తమ విశ్వాసమును మూర్ఖత్వముతో ఎన్నడును వీడకుందురు.

## 10.14

**సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ ।**
**న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవా: ॥**

## అనువాదము

**ఓ కృష్ణా! నీవు నాకు తెలిపినదంతయు సత్యమని సంపూర్ణముగా నేను అంగీకరించుచున్నాను. ఓ దేవాదిదేవా! దేవతలు గాని, దానవులు గాని నీ స్వరూపమును ఎరుగజాలరు.**

## భాష్యము

శ్రద్ధలేనివారు, దానవప్రవృత్తి గలవారు శ్రీకృష్ణభగవానుని అర్థము చేసికొనజాలరని అర్జునుడు ఇక్కడ చెప్పుచున్నాడు. దేవతలే అతనిని తెలిసికొన జాలరనినచో, ఈ ఆధునిక జగత్తునకు చెందిన పండితులని పిలువబడువారిని గూర్చి

ప్రత్యేకించి తెలుపనవసరము లేదు. కాని దేవాదిదేవుని కృపచే శ్రీకృష్ణుడే పరతత్త్వము, పరిపూర్ణముగను అర్జునుడు గ్రహింపగలిగెను. భగవద్గీతకు ప్రామాణికుడైన అట్టి అర్జునుని మార్గమునే ప్రతియొక్కరు అనుసరింపవలెను. చతుర్థాధ్యాయమున వర్ణింపబడినట్లు, భగవద్గీతను అర్థము చేసుకొనుటకు కావలసిన గురుశిష్య పరంపరా విధానము నష్టమైనది. కనుక శ్రీకృష్ణుడు తిరిగి ఆ పరంపరను అర్జునునితో పున:స్థాపించెను(4.2,3). ఎందుకనగా భగవానుడు అర్జునుని ఆప్తమిత్రునిగను మరియు భక్తునిగని భావించెను. కనుకనే మా ఈ 'గీతోపనిషత్తు యొక్క ఉపోద్ఘాతము' నందు చెప్పబడినట్లు గురుశిష్య పరంపరా విధానముతోనే భగవద్గీతను అవగతము చేసికొనవలెను. అట్టి పరంపరా విధానము నశించి యుండుట చేతనే దానిని పునరుద్ధరించుటకు అర్జునుడు ఎన్నుకోబడెను. శ్రీకృష్ణుడు పలికిన దానినంతటిని అర్జునుడు అంగీకరించి నట్లుగనే మనమును అట్లే తప్పక అంగీకరించి అనుసరింపవలెను. అప్పుడే మనకు భగవద్గీత సారము అవగతము కాగలదు. పిమ్మట శ్రీకృష్ణుడే దేవాదిదేవుడను విషయమును మనము సంపూర్ణముగా అవగాహన చేసుకొనగలుగుదుము.

## 10.15

**స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।**
**భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥**

### అనువాదము

**ఓ పురుషోత్తమా! సర్వకారణుడా! సర్వేశ్వరా! దేవదేవా! జగత్పతీ! నీవొక్కడవే నీ అంతరంగ శక్తి ద్వారా నిజముగా నిన్నెరుగుదువు.**

### భాష్యము

అర్జునుడు మరియు అతని మార్గమును అనుసరించు వారి వలె భక్తియుక్త సేవ ద్వారా దేవాదిదేవునితో సంబంధమును కలిగియున్నవారు ఆ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ఎరుగగలుగుదురు. దానవ, నాస్తిక ప్రవృత్తి గల వ్యక్తులు శ్రీకృష్ణుని ఎన్నడును ఎరుగజాలరు. దేవాదిదేవుని నిజతత్త్వము నుండి దూరముగా గొనిపోవు మానసికకల్పనలు వాస్తవమునకు గొప్ప పాపములు. ఆ విధముగా శ్రీకృష్ణుని ఎరుగజాలనివాడు భగవద్గీతపై వ్యాఖ్యానము చేయుటకు యత్నింపరాదు. భగవద్గీత శ్రీకృష్ణుడు చేసిన ఉపదేశము. అది కృష్ణసంబంధ విజ్ఞానమగుటచే శ్రీకృష్ణుని నుండి అర్జునుడు అవగతము చేసికొనినట్లుగానే మనము అవగతము చేసికొనవలెను. నాస్తికులైన వ్యక్తుల నుండి దానిని గ్రహింపరాదు.

శ్రీమద్భాగవతము నందు ఇట్లు తెలుపబడినది (1.2.11) :

వదన్తి తత్ తత్త్వవిదస్తత్త్వమ్ యద్ జ్ఞానమద్వయమ్ ।
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే ॥

పరతత్త్వమనునది నిరాకారబ్రహ్మము, సర్వాంతర్యామియైన పరమాత్మ, అంత్యమున దేవాదిదేవునిగా మూడుదశలలో అనుభూతికి వచ్చును. పరతత్త్వమును అవగాహన చేసుకొను మానవుడు అంత్యమున దేవాదిదేవుని అనుభూతికి చేరును. దేవాదిదేవుని స్వరూపమును సామాన్య మానవుడు గాని, బ్రహ్మానుభూతి లేదా పరమాత్మానుభూతి పొందిన ముక్తపురుషుడు గాని అవగాహన చేసికొనజాలడు. కనుకనే

అట్టివారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణునిచే స్వయముగా ఉపదేశింపబడిన భగవద్గీత శ్లోకముల ద్వారా భగవానుని నిజతత్త్వమును ఎరుగుటకు యత్నింపవచ్చును. కొన్నిమార్లు నిరాకారవాదులు శ్రీకృష్ణుని భగవానుడని గాని లేదా అతని ప్రామాణికత్వమును గాని అంగీకరింతురు. అయినను ముక్తపురుషులలో పలువురు శ్రీకృష్ణుని పురుషోత్తమునిగా ఎరుగజాలరు. కనుకనే అర్జునుడిక్కడ శ్రీకృష్ణుని 'పురుషోత్తముడు' అని సంబోధించుచున్నాడు. శ్రీకృష్ణుడే సర్వజీవులకు పరమపిత అని జనులు ఎరుగక పోవచ్చునని అర్జునుడు అతనిని 'భూతభావన' అనియు సంబోధించుచున్నాడు. జనులు శ్రీకృష్ణుడు సర్వజీవులకు తండ్రియని ఎరిగినను అతడే పరమేశ్వరుడని తెలియకపోవచ్చును. కనుకనే అతనిని అర్జునుడు 'భూతేశ' అనగా పరమేశ్వరుడని సంబోధించెను. ఎవరైనను అతనిని సర్వజీవులను నియంత్రించు పరమేశ్వరుడని ఎరిగినను దేవతలందరికిని అతడే మూలాధారుదని ఎరుగక పోవచ్చును. కనుక అర్జునుడిక్కడ శ్రీకృష్ణుడు దేవతలకు కూడ పూజనీయుడైన 'దేవదేవుడు' అని కీర్తించెను. ఎవరైనను అతడే దేవతలకు పూజనీయుడైన దేవాదిదేవుడని ఎరిగినను, అతడే సమస్తజగత్తునకు అధిపతియని ఎరుగక పోవచ్చును. కనుక అతడు 'జగత్పతే' యని తిరిగి సంబోధింపబడినాడు. ఈ విధముగా ఈ శ్లోకము నందు అర్జునుని అనుభవముచే శ్రీకృష్ణునికి సంబంధించిన నిజతత్త్వము నిర్ధారితమైనందున శ్రీకృష్ణుని అవగాహన చేసికొనుట కొరకు మనము అర్జునుని అడుగుజాడల ననుసరింపవలెను.

## 10.16

**వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయ: ।**
**యాభిర్విభూతిభిర్లోకానిమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥**

## అనువాదము

**నీవు ఏ దివ్యవిభూతుల ద్వారా ఈ లోకములన్నింటి యందును వ్యాపించి యుందువో వాటన్నింటిని దయతో నాకు వివరముగా తెలియజేయుము.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని గూర్చిన తన అవగాహనముచే అర్జునుడు అప్పటికే సంతృప్తి చెందియున్నట్లుగా ఈ శ్లోకమున కనిపించుచున్నది. శ్రీకృష్ణుని కృపచే అర్జునుడు ఆత్మానుభూతిని, బుద్ధి, జ్ఞానము మరియు వానిద్వారా తెలిసికొనదగిన సమస్త విషయములను ఎరుగగలిగి శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అవగాహన చేసికొనెను. అతనికి నిజముగా ఎట్టి సందేహము లేకున్నను ఇక్కడ అర్జునుడు శ్రీకృష్ణుని సర్వవ్యాపక లక్షణమును వివరింపుమని అడుగుచున్నాడు.ఎందుకనగా, సామాన్యజనులు ముఖ్యముగా నిరాకారవాదులు దేవాదిదేవుని ఈ సర్వవ్యాపక లక్షణమునకే అధిక ప్రాధాన్యమిచ్చుచుందురు. కనుకనే తన వివిధ శక్తుల ద్వారా శ్రీకృష్ణుడు ఏ విధముగా సర్వవ్యాపియై యుండునో అర్జునుడు ఇక్కడ ప్రశ్నించుచున్నాడు. అర్జునుడు సామాన్యజనుల పక్షమున ఈ ప్రశ్నను అడిగినట్లుగా ప్రతియొక్కరును గుర్తింపవలెను.

## 10.17

**కథం విద్యామహం యోగింస్త్వాం సదా పరిచిన్తయన్ ।**
**కేషు కేషు చ భావేషు చిన్త్యో ऽ సి భగవన్మయా ॥**

## అనువాదము

**ఓ కృష్ణా! ఓ యోగీశ్వరా! నిన్ను సర్వదా నేనెట్లు చింతించగలను మరియు నిన్నెట్లు ఎరుగగలను? ఓ దేవాదిదేవా! ఏ యే రూపములందు నిన్ను స్మరింపవలెను?**

## భాష్యము

గడచిన అధ్యాయములందు చెప్పబడినట్లు దేవాదిదేవుడు తన 'యోగమాయ' శక్తిచే కప్పబడియున్నాడు. కేవలము శరణాగతులైన మహాత్ములు మరియు భక్తులు మాత్రమే అతనిని దర్శింపగలరు. ఇప్పుడు అర్జునుడు తన మిత్రుడైన శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని విశ్వసించినను సామాన్య మానవుడు కూడ ఏ విధానముచే భగవానుని సర్వవ్యాపక స్వభావము నెరుగగలడో, అట్టి సర్వసాధారణ పద్ధతిని అతడు తెలియగోరుచున్నాడు. శ్రీకృష్ణుడు 'యోగమాయ' శక్తిచే కప్పబడి యుండుటచే సామాన్య మానవులే కాకుండ దానవులు, నాస్తికులు వంటివారు కూడ అతనిని ఎరుగజాలరు. ఉత్తమ భక్తుడు తానెరుగుటయే కాకుండ మానవు లందరును భగవానుని ఎరుగవలెనని వాంఛించును. కనుకనే భక్తుడును మరియు గొప్పవైష్ణవుడైన అర్జునుడు కరుణాపూర్ణుడై తన ప్రశ్నచే భగవానుని సర్వవ్యాపకత్వమును సామాన్యుడు కూడ ఎరుగునట్లు అవకాశమును కల్పిస్తున్నాడు. శ్రీకృష్ణుని ప్రత్యేకముగా 'యోగిన్' అని సంబోధించుచున్నాడు. ఎందుకనగా, శ్రీకృష్ణుడు 'యోగమాయా' శక్తికి ప్రభువు. అట్టి యోగమాయ కారణముననే భగవానుడు సామాన్యునకు గోచరించుట లేక గోచరింపకుండుట జరుగుచుండును. శ్రీకృష్ణుని పట్ల ప్రేమలేని సామాన్యమానవుడు నిరంతరము అతనిని గూర్చి స్మరింప జాలడు. కనుక అతడు భౌతిక భావనతో స్మరింపవలసి వచ్చును. అర్జునుడు ఈ జగత్తునకు సంబంధించిన భౌతిక ప్రవృత్తి కలిగిన వ్యక్తుల ఆలోచనా విధానమును పరిగణనకు తీసుకొనుచున్నాడు. ఇక్కడ 'కేషు కేషు చ భావేషు' అను పదములు భౌతిక ప్రకృతికి సంబంధించినవని ('భావము' అనగా భౌతిక విషయములు) సూచించును. భౌతికవాదులు శ్రీకృష్ణుని ఆధ్యాత్మికముగా ఎరుగజాలరు. కనుక వారు భౌతిక వస్తువులపై మనస్సును కేంద్రీకరించి, భౌతిక రూపముల ద్వారా ఏ విధముగా శ్రీకృష్ణుడు వ్యక్తమగుచున్నాడో చూచుటకు యత్నింపవలెనని ఆదేశింపబడినది.

## 10.18

**విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తిమే మృతమ్ ॥**

## అనువాదము

**ఓ జనార్దనా! నీ యోగ విభూతిని దయతో తిరిగి సమగ్రముగా వివరింపుము. ఎంత అధికముగా శ్రవణము చేసినచో అంత అధికముగా నీ వచనామృతమును**

**ఆస్వాదింప గోరినందున నిన్ను గూర్చి ఎంత శ్రవణము చేసినను తృప్తికలుగుట లేదు.**

## భాష్యము

నైమిశారణ్యమున శౌనక ప్రముఖులైన ఋషులు కూడ సూత గోస్వామితో ఈ విధముగనే పలికియుండిరి :

వయం తు న వితృప్యామ ఉత్తమశ్లోకవిక్రమే ।
యచ్ఛృణ్వతాం రసజ్ఞానాం స్వాదు స్వాదు పదే పదే ॥

"ఉత్తమ శ్లోకుడైన శ్రీకృష్ణుని దివ్యలీలలను నిర్విరామముగా ఎంతగా శ్రవణము చేసినను ఎవ్వరును తృప్తినొందలేరు. శ్రీకృష్ణునితో దివ్యసంబంధము కలిగిన వ్యక్తులు అతని లీలావర్ణములను పదే పదే ఆస్వాదింప గోరుచుందురు." (శ్రీమద్భాగవతము 1.1.19) ఈ విధముగా అర్జునుడు శ్రీకృష్ణుని గూర్చియు, ముఖ్యముగా అతడు ఎట్లు సర్వవ్యాపియై యున్నాడను విషయమును గూర్చియు ఎరుగుటకు ఆసక్తి చూపుచున్నాడు.

శ్రీకృష్ణునకు సంబంధించిన ఏ వర్ణనమైనను లేదా విషయమైనను వాస్తవమునకు 'అమృతము'తో సమానము. అట్టి అమృతమును ఎవ్వరైనను అనుభవపూర్వకముగా ఆస్వాదింపవచ్చును. ఆధునిక కథలు, నవలలు, చరిత్రల వంటి గ్రామ్యకథలు శ్రీకృష్ణుని దివ్యలీలలకు భిన్నములైనవి. ఎందుకనగా భౌతికమైన కథలను వినునపుడు ఎవరికైనను కొంతకాలమునకు విసుగు పుట్ట వచ్చును. కాని శ్రీకృష్ణుని గూర్చి వినునపుడు అట్టి విసుగు ఎన్నటికిని పుట్టదు. కనుకనే విశ్వచరిత్ర యంతయు దేవాదిదేవుని వివిధావతార లీలలతో నిండి యున్నది. భగవానుని అట్టి వివిధ అవతారముల యందలి లీలలను వర్ణించు చరిత్రలే పురాణములు. కనుకనే వాటిని ఎన్నిమార్లు పఠించినను వానియందలి విషయములు నిత్యనూతనములుగా నుండును.

## 10.19

**శ్రీభగవానువాచ**
**హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యన్తో విస్తరస్య మే ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడిట్లు పలికెను : సరియే! నా వైభవోపేతమైన సృష్టి విస్తారములను గూర్చి నీకు తెలియజేసెదను. కాని ఓ అర్జునా! నా విభూతి అనంతమైనందున కేవలము వానిలో ప్రధానమైన వానిని మాత్రమే నీకు తెలుపుదును.**

## భాష్యము

శ్రీకృష్ణుని మహత్త్వమును మరియు అతని విభూతుల మహత్త్వమును సంపూర్ణముగా గ్రహించుట సాధ్యము కాదు. జీవుని ఇంద్రియములు పరిమితము లగుటచే అవి శ్రీకృష్ణుని లీలలను గూర్చి సంపూర్ణముగా ఎరుగుటకు అతనిని అనుమతింపవు. అయినను భక్తులైనవారు శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుటకు సదా

యత్నించుచుందురు. అంతేకాని ఏదేని ఒక ప్రత్యేక సమయమున లేదా ప్రత్యేక జీవనస్థితిలో అతనిని పూర్తిగా అవగతము చేసుకొనియే తీరుదుమనెడి భావనతో కాదు. పైగా శ్రీకృష్ణునికి సంబంధించిన విషయములు అత్యంత మధురములై భక్తులకు అమృతప్రాయములుగా తోచును. కనుకనే వారు కృష్ణకథల యందు దివ్యానందము ననుభవింతురు. శుద్ధభక్తులు శ్రీకృష్ణుని దివ్యవిభూతులను, అతని వివిధశక్తులను చర్చించుట యందు దివ్యానందము ననుభవింతురు. కనుకనే వారు అతనిని గూర్చి శ్రవణమును చర్చను చేయగోరుచుందురు. తన విభూతుల యొక్క విస్తృతిని జీవులు గ్రహింపజాలరని ఎరిగియున్నందున శ్రీకృష్ణుడు తన భిన్నశక్తులలోని ప్రధాన వ్యక్తీకరణములను మాత్రమే తెలుపుటకు అంగీకరించెను. ఇక్కడ 'ప్రాధాన్యత:' అను పదము ఎంతో ముఖ్యమైనది. ఎందుకనగా దేవాదిదేవుని విభూతులు అపరిమితములగుటచే వానిలో ప్రధానములైన వివరములలో కొన్నింటిని మాత్రమే మనమర్థము చేసుకొన గలుగుదుము. వాటినన్నింటిని అవగతము చేసుకొనగలుగుట సాధ్యము కాదు. ఈ శ్లోకమునందు వాడబడిన 'విభూతి' అను పదము ఈ సమస్త సృష్టి నంతటిని నియంత్రించు అతని విభూతులను సూచించును. 'అమరకోశము' అను నిఘంటువు నందు 'విభూతి:' అను పదము అసాధారణమైన వైభవమును సూచించునని తెలుపబడినది.

నిరాకారవాదులు లేక సర్వము బ్రహ్మమయమని భావించువారు శ్రీకృష్ణభగవానుని అసాధారణ విభూతులను, అతని దివ్యశక్తులను అవగాహన చేసికొనజాలరు. భౌతికము మరియు ఆధ్యాత్మిక జగత్తు లందంతటను అతని దివ్యశక్తులు సర్వరూపములలో విస్తరించియున్నవి. కాని ఇప్పుడు సామాన్య మానవుడు ప్రత్యక్షముగా దర్శింపగల దానిని మాత్రమే శ్రీకృష్ణుడు ఇక్కడ వర్ణించు చున్నాడు. ఈ విధముగా వైవిధ్యముతో కూడిన అతని శక్తితో కొంతభాగము మాత్రమే ఇక్కడ వర్ణింపబడినది.

## 10.20

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థిత: ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ ॥**

## అనువాదము

**ఓ అర్జునా! నేను సర్వజీవ హృదయములందు నెలకొని యున్నట్టి పరమాత్మను, సర్వజీవులకు ఆదియు, మధ్యమును, అంతమును నేనే అయియున్నాను.**

## భాష్యము

ఈ శ్లోకమున అర్జునుడు 'గుడాకేశుడు'గా సంబోధింపబడెను. అనగా నిద్ర యనెడి అంధకారమును జయించినవాడని అర్థము. అజ్ఞానాంధకారమున నిద్రించువారికి దేవాదిదేవుడు ఎట్లు భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులందు వివిధ రకాలుగా ప్రకటితమగునో అవగతము చేసుకొనుట సాధ్యము కాదు. కనుకనే శ్రీకృష్ణుడు అర్జునుని ఇట్లు సంబోధించుట ప్రాధాన్యతను సంతరించుకొన్నది. అర్జునుడు అట్టి అంధకారమునకు అతీతుడగుటచే దేవాదిదేవుడు అతనికి వివిధములైన తన విభూతులను వివరించుటకు అంగీకరించెను.

తాను తన స్వరూపాంశ విస్తారము ద్వారా సమస్త విశ్వమునకు ఆత్మనై యున్నానని శ్రీకృష్ణుడు తొలుత అర్జునునకు తెలిపెను. భౌతికసృష్టికి పూర్వము శ్రీకృష్ణభగవానుడు తన స్వరూపాంశముచే మూడు పురుషావతారములను దాల్చును. అతని నుండియే సమస్తము ఆరంభమగును. కనుకనే అతడే (విశ్వపు మూల తత్త్వమైన 'మహత్తత్త్వము'నకు ఆత్మ) యగుచున్నాడు. అనగా భౌతికశక్తి అంతయును సృష్టికి కారణము కాదు. వాస్తవమునకు మహావిష్ణువు 'మహత్తత్త్వ' మనెడి సంపూర్ణ భౌతికశక్తి యందు ప్రవేశించును. అతడే 'ఆత్మ'. మహావిష్ణువు సృష్టింపబడిన విశ్వము నందు ప్రవేశించి, స్వయముగా పరమాత్మగా ప్రతిజీవి యందును ప్రకటమగును. ఆత్మ ఉనికి కారణముగా దేహము నిలిచియుండుననియు, ఆత్మ ఉనికి లేనిచో దేహము వృద్ధినొందదనియు మనము అనుభవపూర్వకముగా ఎరిగియున్నాము. అట్లే పరమాత్ముడు, శ్రీకృష్ణుడు ప్రవేశించనిదే భౌతికసృష్టి కూడ వృద్ధినొందదు. 'సుబలోపనిషత్తు' నందు చెప్పబడినట్లు : "ప్రకృత్యాదిసర్వ భూతాంతర్యామీ సర్వశేషీ చ నారాయణ:"- "సమస్త విశ్వము నందును దేవాదిదేవుడు సర్వాంతర్యామిగా నెలకొనియున్నాడు."

శ్రీమద్భాగవతము నందు మూడు పురుషావతారములు వర్ణింపబడినవి. 'సాత్వత తంత్రము' నందు కూడ : "విష్ణోస్తు త్రీణి రూపాణి పురుషాఖ్యాన్యథో విదు:" అనగా శ్రీకృష్ణుడు ఈ భౌతిక సృష్టియందు కారణోదకశాయి విష్ణువు, గర్భోదకశాయి విష్ణువు మరియు క్షీరోదకశాయి విష్ణువు అను మూడు రూపము లందు వ్యక్తమగునని వర్ణింపబడినది. కారణోదకశాయి విష్ణువు లేక మహావిష్ణువు 'బ్రహ్మ సంహిత' (5.47)నందు : "య: కారణార్ణవజలే భవతి స్మ యోగనిద్రామ్"- "దేవాదిదేవుడు, సర్వకారణకారణుడైన శ్రీకృష్ణుడు కారణోదక జలములందు మహావిష్ణువు రూపమున శయనించు చుండునని వర్ణింపబడినది." కనుకనే దేవాదిదేవుడే విశ్వమునకు ఆదియును, సృష్టులన్నింటికి పోషకుడును, సర్వశక్తికి అంతమును అయియున్నాడు.

## 10.21

**ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్ ।
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ ॥**

## అనువాదము

**ఆదిత్యులలో నేను విష్ణువును, తేజస్సులలో ప్రకాశమానమైన సూర్యుడను, మరుత్తులలో మరీచిని, నక్షత్రములలో చంద్రుడను అయియున్నాను.**

## భాష్యము

ఆదిత్యులు పన్నెండుగురు కలరు. వారిలో శ్రీకృష్ణుడు ప్రధానుడు. ఆకాశమున ప్రకాశించు తేజస్సులలో సూర్యుడు ముఖ్యుడు. 'బ్రహ్మ సంహిత' (5.52) యందు సూర్యుడు దేవాదిదేవుని సముజ్జ్వల నేత్రముగా అంగీకరింపబడెను. ఆకాశమున యాభైరకాల వాయువులు వీచుచుండును. వాటికి అధిష్ఠాన దేవతయైన మరీచి శ్రీకృష్ణుని ప్రతినిధి.

రాత్రి సమయమున ప్రకాశించు నక్షత్రము లందు చంద్రుడు మిక్కిలి ప్రధానుడు. ఈ విధముగా అతడు శ్రీకృష్ణునికి ప్రతినిధి యగును. ఈ శ్లోకము ననుసరించి చంద్రుడు

కూడ ఒక నక్షత్రమని తెలియుచున్నది. కనుక ఆకాశము నందు ప్రకాశించుచున్న నక్షత్రములు కూడా సూర్యకాంతిని ప్రతిబింబించును. విశ్వము నందు అనేక సూర్యులు గలరనెడి సిద్ధాంతమును వేదవాఙ్మయము అంగీకరించుటలేదు. సూర్యుడొక్కడే సూర్యుని కాంతి ప్రతిబింబించుట ద్వారా చంద్రుడును, నక్షత్రములును ప్రకాశించుచున్నవి. చంద్రుడు ఒక నక్షత్రమని భగవద్గీత ఇక్కడ చెప్పుచుండుటచే ఆకాశమున తళుకుతళుకుమని మెరుయు నక్షత్రములు చంద్రుని పోలినవే గాని సూర్యులు కాజాలవు.

## 10.22

**వేదానాం సామవేదో స్మి దేవానామస్మి వాసవ: ।**
**ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥**

## అనువాదము

**వేదములలో నేను సామవేదమును, దేవతలలో స్వర్గాధిపతియైన ఇంద్రుడను, ఇంద్రియములలో మనస్సును, జీవుల యందలి చేతనమును అయియున్నాను.**

## భాష్యము

భౌతిక పదార్థమునకు మరియు జీవాత్మకును నడుమ భేధమేమనగా భౌతిక పదార్థము జీవుని వలె చైతన్యమును కలిగియుండదు. కనుక ఈ చైతన్యము దివ్యమును నిత్యమును అయియున్నది. అట్టి చైతన్యమెన్నడును భౌతికపదార్థ సమ్మిశ్రణముచే ఉత్పాదింపబడదు.

## 10.23

**రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।**
**వసూనాం పావకశ్చాస్మి మేరు: శిఖరిణామహమ్ ॥**

## అనువాదము

**రుద్రులందరిలో నేను శివుడను, యక్షరాక్షసులలో ధనాధిపతినైన కుబేరుడను, వసువులలో అగ్నిని, పర్వతములలో మేరువును అయియున్నాను.**

## భాష్యము

రుద్రులు పదునొకండుగురు కలరు. వారిలో శివుడు(శంకరుడు) ముఖ్యమైనవాడు. అతడు ఈ విశ్వమునందు తమోగుణమునకు అధికారము వహించు దేవాదిదేవుని అవతారము. యక్షరాక్షసుల నాయకుడు మరియు దేవతల కోశాధికారియైన కుబేరుడు దేవాదిదేవునికి ప్రతినిధియే. సమృద్ధియైన ప్రకృతి వనరులకు మిక్కిలి ప్రసిద్ధమైనది మేరుపర్వతము.

## 10.24

**పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।**
**సేనానీనామహం స్కన్ద: సరసామస్మి సాగర: ॥**

### అనువాదము

**ఓ అర్జునా! పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతిగా నన్నెరుగుము. సేనా నాయకులలో కార్తికేయుడను, జలనిధులలో నేను సముద్రుడనై యున్నాను.**

### భాష్యము

స్వర్గలోక దేవతలలో ఇంద్రుడు ముఖ్యదేవత. అతడే స్వర్గాధిపతియని తెలియబడును. అతడు పరిపాలించు లోకమునకు ఇంద్రలోకము అని పేరు. బృహస్పతి ఇంద్రునికి పురోహితుడు. ఇంద్రుడు రాజులందరిలో ముఖ్యుడగుటచే బృహస్పతి పురోహితు లందరిలో ముఖ్యుడయ్యెను. రాజులందరిలో ఇంద్రుడు ముఖ్యుడైనట్లుగా శివపార్వతుల పుత్రుడైన స్కందుడు(కార్తికేయుడు) సేనానాయకు లందరిలోకి ముఖ్యుడు. అదేవిధముగా జలనిధులలో సముద్రము మిక్కిలి గొప్పదైనది. ఈ ప్రాతినిధ్యము లన్నియును శ్రీకృష్ణుని మహత్త్వమును సూచించు సూచనలను మాత్రమే ఒసగుచున్నవి.

## 10.25

**మహర్షీణాం బృగురహం గిరామ స్మ్యేకమక్షరమ్ ।**
**యజ్ఞానాం జపయజ్ఞో స్మి స్థావరాణాం హిమాలయ: ॥**

### అనువాదము

**మహర్షులలో నేను భృగువును, ధ్వని ప్రకంపనలలో దివ్యమైన ఓంకారమును, యజ్ఞములలో పవిత్రనామ జపయజ్ఞమును, స్థావరములలో హిమాలయమును అయియున్నాను.**

### భాష్యము

విశ్వమునందలి ప్రథమ జీవియైన బ్రహ్మదేవుడు వివిధ జీవజాతుల సృష్టికై పలువురు పుత్రులను సృజించెను. అట్టి పుత్రులలో భృగుమహర్షి మిక్కిలి శక్తిమంతుడైన ఋషి. అన్ని దివ్యధ్వని ప్రకంపనములలో 'ఓంకారము' శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. యజ్ఞము లన్నింటిలో "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను నామ జప (సంకీర్తన) యజ్ఞము శ్రీకృష్ణునికి విశుద్ధమైన ప్రాతినిధ్యము వహించును. కొన్నిమార్లు జంతుబలితో కూడిన యజ్ఞములు ఆదేశింపబడినను, ఈ హరినామ సంకీర్తన యజ్ఞము నందు అట్టి హింసకు తావు లేదు. కనుకనే ఇది మిక్కిలి సరళము మరియు విశుద్ధమైయున్నది. సృష్టియందు ఉదాత్తమైన దంతయు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. కనుక ప్రపంచము నందలి అత్యున్నత పర్వతములైన హిమాలయములు కూడ శ్రీకృష్ణునికే ప్రాతినిధ్యము వహించును. గడిచిన శ్లోకమునందు మేరుపర్వతమును గూర్చి చెప్పబడినను మేరు హిమాలయముల వలె స్థావరములు గాక కొన్నిమార్లు చలనశీలమై యుండును. ఈ విధముగా హిమాలయములు మేరువుకంటె గొప్పవి.

### 10.26
**అశ్వత్థ: సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారద: ।**
**గంధర్వాణాం చిత్రరథ: సిద్ధానాం కపిలో ముని: ॥**

## అనువాదము

**వృక్షములలో నేను రావివృక్షమును, దేవర్షులలో నారదుడను, గంధర్వులలో చిత్రరథుడను, సిద్ధులలో కపిలుడను అయియున్నాను.**

## భాష్యము

అశ్వత్థవృక్షము (రావిచెట్టు) అత్యంత ఉన్నతమును మరియు సుందరమును అగు వృక్షములలో ఒకటి. భారతదేశపు జనులు తమ నిత్య ప్రాత:కాల కర్మలలో ఒకటిగా దానిని పూజింతురు. అట్లే, విశ్వములందరలి దేవతలలో అత్యున్నతమైన భక్తుడుగా పరిగణింపబడెడి దేవతలతో సైతము పూజలందుకొనును. ఈ విధముగా భక్తునిగా అతడు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. గంధర్వలోకము శ్రావ్యముగా గానము చేయు జీవులతో నిండియుండును. వారందరిలో ఉత్తమ గాయకుడు చిత్రరథుడు. సిద్ధ పురుషులలో దేవహూతి కుమారుడైన కపిలుడు శ్రీకృష్ణునకు ప్రతినిధి. అతడు శ్రీకృష్ణుని అవతారముగా భావింపబడుచున్నాడు. అతడు తెలిపిన తత్త్వము శ్రీమద్భాగవతమున పేర్కొనబడినది. తరువాతి కాలమున మరొక కపిలుడు ప్రసిద్ధుడయ్యెను. కాని అతని సిద్ధాంతము నాస్తికమైనట్టిది. కనుకనే వారిరువురి నడుమ అపారమైన అంతరము కలదు.

### 10.27
**ఉచ్చై:శ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥**

## అనువాదము

**అశ్వములలో అమృతము కొరకై సాగర మంథనము కావించిన సమయమున ఉద్భవించిన ఉచ్చైశ్రవముగా నన్నెరుగుము. గజరాజులలో నేను ఐరావతమును మరియు నరులలో రాజును అయియున్నాను.**

## భాష్యము

భక్తులగు దేవతలు మరియు రాక్షసులును ఒకమారు సముద్ర మంథనము నందు పాల్గొనిరి. ఆ మంథనము వలన అమృతము మరియు విషము రెండును ఉద్భవించినవి. అట్టి ఉద్భవించిన విషమును పరమశివుడు త్రాగెను. అమృతము నుండి ఉద్భవించిన అనేకమైనవాటిలో 'ఉచ్చైశ్రవ' నామము గల అశ్వమొకటి. అమృతము నుండి ఉద్భవించిన మరొక జంతువు 'ఐరావతము' అను పేరు గల గజము. ఈ రెండు జంతువులను అమృతము నుండి ఉద్భవించి నందున అవి ప్రత్యేక ప్రాముఖ్యమును సంతరించుకున్నవి. అవి శ్రీకృష్ణునకు ప్రాతినిధ్యము హించుచున్నవి.

నరులలో రాజు శ్రీకృష్ణునకు ప్రతినిధి. ఎందుకనగా శ్రీకృష్ణుడు విశ్వపోషకుడు. రాజులు(దైవగుణములను కలిగియున్నందున రాజులుగా నియమింపబడిరి) తమ

రాజ్యములను పరిపాలించువారై యున్నారు. యుధిష్ఠర మహారాజు, పరిక్షిన్మహారాజు, శ్రీరామచంద్ర ప్రభువు వంటి ధర్మాత్ములైన రాజులు ఎల్లప్పుడు తమ ప్రజల సంక్షేమమును గూర్చియే యోచించిరి. వైదిక గ్రంథము లందు రాజు భగవానుని ప్రతినిధిగా పరిగణింపబడెను. కాని నేటి యుగమున ధర్మసిద్ధాంతములకు కలిగిన నష్టము కారణముగా రాజవంశములు క్షీణించి క్రమముగా రద్దు చేయబడినవి. అయినను పూర్వకాలమున ధర్మాత్ములైన రాజుల సంరక్షణలో జనులు సుఖముగా జీవించిరని మనము అవగాహన చేసికొనవలెను.

## 10.28

**ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।**
**ప్రజనశ్చాస్మి కన్దర్ప: సర్పాణామస్మి వాసుకి: ॥**

### అనువాదము

**ఆయుధములలో నేను వజ్రాయుధమును, గోవులలో సురభియను కామదేనువును, ప్రజోత్పత్తి కారకులలో ప్రేమాధిదేవతయైన మన్మథుడను. సర్పములలో వాసుకిని అయియున్నాను.**

### భాష్యము

మహత్తర ఆయుధమైన వజ్రాయుధము శ్రీకృష్ణుని శక్తికి ప్రాతినిధ్యము వహించును. ఆధ్యాత్మిక జగత్తునందలి కృష్ణలోకమునందు ఎప్పుడైనను, ఎంత అయినను క్షీరము నొసగగల గోవులు అసంఖ్యాకములుగా గలవు. అట్టి గోవులు ఈ భౌతిక జగత్తు నందుండవు. అవి కృష్ణలోకమున మాత్రమే ఉన్నట్లుగా పేర్కొన బడినవి. 'సురభి' అను నామము గల పెక్కు గోవులను భగవానుడు పోషించుచు వాటిని కాచుటయందు నిమగ్నుడై యుండునని చెప్పబడినది. సత్సంతానమునకు జన్మనిచ్చుటకు కావలసిన కామవాంఛయే కందర్పుడు. కనుక అతడు శ్రీకృష్ణునికి ప్రతినిధి. కొన్నిమార్లు సంభోగక్రియ కేవలము ఇంద్రియతృప్తి కొరకే చేయబడు చుండును. అదియెన్నడును శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహింపదు. కేవలము సత్సంతాన ప్రాప్తికై కావలసిన కామవాంఛ కందర్పునిగా పిలువబడి శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును.

## 10.29

**అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్ ।**
**పితౄణామర్యమా చాస్మి యమ: సంయమతామహమ్ ॥**

### అనువాదము

**పెక్కు పడగలు గల నాగములలో నేను అనంతుడను, జలవాసులలో వరుణదేవుడను, పితృదేవతలలో అర్యముడను, ధర్మనిర్వాహకులలో మృత్యుదేవతయైన యముడను అయియున్నాను.**

### భాష్యము

జలవాసులలోకెల్ల వరుణదేవుడు శ్రేష్ఠుడైనట్లుగా పెక్కు పడగలు గల నాగులలో అనంతుడు శ్రేష్ఠుడైనట్టివాడు. వారిరువురును శ్రీకృష్ణునికి ప్రతినిధులు. అర్యముడు

అధిపతిగా గల పితృలోకమొకటి గలదు. అతడు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. దుష్కృతులైన వారిని దండించుటకు గల పెక్కు మందిలో యమధర్మరాజు ముఖ్యుడు. అతని లోకము భూలోకమునకు సమీపమున అనగా క్రింద గలదు. అతడు ఆ లోకమునందే వసించును. మరణానంతరము పాపాత్ములు అక్కడకు తీసుకుపోబడుదురు. యముడు వారికి వివిధ రకములైన శిక్షలను విధించుచుండును.

## 10.30

**ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాల: కలయతామహమ్ ।**
**మృగాణాం చ మృగేన్ద్రోఽహం వైనతేయశ్చ పక్షిణాం ॥**

### అనువాదము

**నేను దైత్యులలో భక్తుడయిన ప్రహ్లాదుడును, అణచువారిలో కాలమును, మృగములలో సింహమును. పక్షులలో గరుత్మంతుడను అయియున్నాను.**

### భాష్యము

దితి మరియు అదితి అక్కాచెల్లెండ్రు. అదితి కుమారులు ఆదిత్యులనియు దితి కుమారులు దైత్యులనియు పిలువబదిరి. ఆదిత్యు లందరును భగవద్భక్తులు. దైత్యులందరును నాస్తికులు. ప్రహ్లాదుడు అట్టి దైత్య కుటుంబమున జన్మించినప్పటికిని అతడు బాల్యము నుండి మహాభక్తుడు. భక్తియుక్త సేవ చేతను, దైవీస్వభావము చేతను అతడు శ్రీకృష్ణుని ప్రతినిధిగా పరిగణింప బడుచున్నాడు.

దమనశక్తి లేక అణచగల శక్తితత్త్వములు అనేకములున్నవి. అయినను కాలము మాత్రము భౌతిక విశ్వము నందలి సమస్తమును అణచివేయునదై యున్నది. కనుక అది శ్రీకృష్ణునకు ప్రాతినిధ్యము వహించును. అన్ని మృగముల లోకి సింహము మిక్కిలి భయంకరము మరియు శక్తిమంతమైనది. అట్లే లక్షలాది పక్షిజాతులలో విష్ణువునకు వాహనమైన గరుడుడు మిక్కిలి గొప్పవాడు.

## 10.31

**పవన: పవతామస్మి రామ: శస్త్రభృతామహమ్ ।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥**

### అనువాదము

**పవిత్ర మొనర్చువానిలో నేను వాయువును. శస్త్రధారులలో శ్రీరాముడను. జలచరములలో మకరమును. ప్రవహించు నదులలో గంగానదిని అయియున్నాను.**

### భాష్యము

మకరము జలమునందు వసించు జంతువు లన్నింటిలోకి అతి పెద్దది. అది నిక్కముగా మానవునకు ప్రమాదకరమైనట్టిది. అట్టి మకరము శ్రీకృష్ణునకు ప్రాతినిధ్యము వహించును.

## 10.32

**సర్గాణామాదిరన్తశ్చ మధ్యం చైవాహమర్జున ।
అధ్యాత్మవిద్యా విద్యానాం వాద: ప్రవదతామహమ్ ॥**

### అనువాదము

**ఓ అర్జునా! సమస్త సృష్టికి ఆది, అంతము, మధ్యమము కూడా నేనే. అదేవిధముగా నేను శాస్త్రములలో ఆత్మకు సంబంధించిన ఆధ్యాత్మిక విజ్ఞాన శాస్త్రమును. తర్కములలో నేను తత్త్వనిర్ణయమును అయియున్నాను.**

### భాష్యము

భౌతిక తత్త్వముల సృష్టి యనునది సమస్త సృష్టులలో ఆదియైనది. ఇదివరకే వివరింపబడినట్లు, జగత్తంతయు విష్ణువు చేతను, క్షీరోదకశాయి విష్ణువు చేతను సృష్టింపబడి, పోషింపబడి, పిదప శివునిచే లయ మొందింపబడును. బ్రహ్మదేవుడు వాస్తవమునకు పరతంత్రుడైన సృష్టికర్త. విశ్వపు ఈ సృష్టి, స్థితి, లయ కారకులందరును దేవాదిదేవుని భౌతిక గుణావతారములు. కనుకనే సృష్టికంతటికిని భగవానుడే ఆదియును, మాధ్యమును, అంత్యమును అయియున్నాడు.

ఉన్నత విజ్ఞానము కొరకు నాలుగు వేదములు, షడంగములు, 'వేదాంత సూత్రము'లు, న్యాయశాస్త్రములు, ధర్మశాస్త్రములు, పురాణములు వంటి అనేక గ్రంథములు గలవు. మొత్తము మీద ఉన్నత విజ్ఞానము కొరకు గ్రంథములలో పదునాలుగు విభాగములు కలవు. వీటిలో ఆధ్యాత్మిక విద్యను అందించునట్టి గ్రంథము ముఖ్యముగా 'వేదాంత సూత్రము' శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును.

తార్కికుల నడుమ పలు రకములైన వాదములు జరుగుచుండును. తన పక్షమును నిదర్శనముతో సమర్థించుటయే కాకుండ, ప్రతివాది పక్షమును తర్కముతో ఒడింప యత్నించుట (సమర్థించకపోవుట) జల్పవాద మనబడును. ప్రతిపక్షమును ఒడించుతయే ప్రధానముగా భావించి చేయునది వితండవాదమని పిలువబడును. కాని వాస్తవతత్త్వ నిర్ణయమును ప్రతిపాదించునది నిజమైన వాదము. అట్టి పరమార్థమును అనగా సత్యమును ప్రదర్శించు ఈ వాదము శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును.

## 10.33

**అక్షరాణామకారో స్మి ద్వన్ద్వ: సామాసికస్య చ ।
అహమేవాక్షయ: కాలో ధాతా హం విశ్వతోముఖ: ॥**

### అనువాదము

**అక్షరములలో నేను 'అ'కారమును. సమాసములలో ద్వంద్వ సమాసమును. నేనే అక్షరమైన కాలమును, సృష్టికర్తలలో బ్రహ్మను అయియున్నాను.**

## భాష్యము

సంస్కృత అక్షరములలో తొలి అక్షరమైన 'అ'కారము వేద వాఙ్మయమునకే ఆరంభము. 'అ'కారము లేకుండ ఏదియును ధ్వనింప చేయుటకు వీలులేనందున అది ధ్వనికి ఆరంభము. సంస్కృతమున సమాన పదములు అనేకము గలవు. అందులో 'రామకృష్ణులు' అనునది ద్వంద్వసమాసము. ఈ సమాసమున రాముడు మరియు కృష్ణుడు అను పదములు రెండును సమాన రూపమును (ప్రాధాన్యము) కలిగియుండును. కనుకనే దీనికి ద్వంద్వ సమాసమని పేరు.

అన్ని విధములైన సంహారములలో కాలము చరమమైనది. ఎందుకనగా అది అన్నింటిని సంహరించును. కాలక్రమమున సృష్ట్యాంతమున గొప్ప అగ్ని పుట్టి, సర్వమును నాశనము చేయునందున కాలము శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును.

సృష్టికర్తలైన జీవులలో చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు ముఖ్యుడు. కనుక అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును.

### 10.34

**మృత్యు: సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తి: శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతి: క్షమా ॥**

## అనువాదము

**సర్వమును మ్రింగి వేయునటువంటి మృత్యువును మరియు సృష్టింపబడనున్న సర్వజీవులకు ఉద్భవమును నేనే అయియున్నాను. స్త్రీల యందలి యశస్సు, వైభవము, మనోహరమగు వాక్కు, జ్ఞాపకశక్తి, బుద్ధి, సహనమును నేనే.**

## భాష్యము

మానవుడు జననముతోనే ప్రతిక్షణము మరణించుట ఆరంభించును. ఈ విధముగా మృత్యువు జీవుని ప్రతిక్షణము కబళించుచున్నది. కాని దాని చిట్టచివరి అఘాతమే మృత్యువుగా పిలువబడును. ఆ మృత్యువే శ్రీకృష్ణుడు. భవిష్యత్తు పురోగతికి సంబంధించి నంతవరకు జీవులు పుట్టుట, పెరుగుట, కొంతకాలము స్థితిని కలిగియుండుట, ఇతరములను సృష్టించుట, కీర్తించుట, చివరికి నశించుట యనెడి ఆరువిధములైన మార్పులను ప్రధానముగా పొందు చుందురు. ఇట్టి మార్పులన్నింటిలో మొదటిదైన గర్భము నుండి జననము అదియు శ్రీకృష్ణుడే. ఆ జన్మమే భవిష్యత్తు కర్మలన్నింటికిని ఆరంభము.

కీర్తి, శ్రీ:, వాక్కు, స్మృతి, బుద్ధి, ధృతి, సహనము అని పేర్కొనబడిన ఏడు విభూతులు స్త్రీలింగములుగా భావింపబడును. వానినన్నింటిని గాని లేక కొన్నింటిని గాని కలిగియున్నచో మానవుడు కీర్తిమంతుడగును. ఎవరైనను ఒకడు ధర్మాత్మునిగా ప్రసిద్ధి నొందినచో అతనిని కీర్తిమంతుడు, వైభవోపేతుడు కాగలడు. ఉదాహరణకు సంస్కృతము పరిపూర్ణమైన భాషయైనందున అది ప్రశంసింపబడినది. ఏదేని విషయమును అధ్యయనము చేసిన పిమ్మట మానవుడు దానిని గుర్తించుకొన గలిగినచో వానిని 'స్మృతి' శోభితుదని చెప్పుదురు. పలు విషయములపై పెక్కు గ్రంథములను పఠించుటయే కాకుండ, వానిని అవగాహన చేసికొని అవసర మైనప్పుడు ఉపయోగించుట

'మేధ' యనబడును. అది మరియొక విభూతి. చంచలత్వమును జయించు శక్తియే 'ధృతి:' యనబడును. పరిపూర్ణ యోగ్యతలను కలిగియుండి మానవుడు నమ్రతను, మృదు స్వభావమును కలిగి సుఖదుఃఖము లందు సమత్వమును చూపగల శక్తిని కలిగియున్నచో అతని ఆ లక్షణము(విభూతిని) 'క్షమా' అనబడును.

## 10.35

**బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసామహం ।**
**మాసానాం మార్గశీర్షో హమృతూనాం కుసుమాకర: ॥**

## అనువాదము

**సామవేద మంత్రములలో నేను బృహత్సామమును, కవితా ఛందస్సులలో గాయత్రిని, మాసములలో మార్గశీర్షమును, ఋతువులలో వసంత ఋతువును అయియున్నాను.**

## భాష్యము

వేదములలో తాను సామవేదమునని భగవానుడు ఇదివరకే వివరించి యున్నాడు. వివిధ దేవతలచే గానము చేయబడిన అందమైన గీతములతో సామవేదము నిండియుండును. అట్టి గీతములలో 'బృహత్సామము' అనునది ఒకటి. ఇది అసాధారణమైన మాధుర్యమును కలిగియుండును. దీనిని అర్ధరాత్రి సమయము నందు గానము చేయుదురు.

సంస్కృతమున కవిత్వమునకు నిశ్చితములైన నియమములు అనేకము కలవు. ఆధునిక కవిత్వములో జరుగునట్లు దానియందు ప్రాస మరియు ఛందములు తోచినట్లుగా రచింపబడవు. అట్లు నియమబద్ధముగా రచింపబడిన కవిత్వములలో గాయత్రీ మంత్రము ప్రసిద్ధమైనది. యోగ్యులైన బ్రాహ్మణులచే జపింపబడు ఈ గాయత్రీ మంత్రము మిక్కిలి ప్రధానమైనది. ఈ మంత్రము శ్రీమద్భాగవతము నందు పేర్కొనబడినది. ఈ గాయత్రీ మంత్రము ప్రత్యేకముగా భగవదనుభూతి కొరకై ఉద్దేశింపబడి యున్నందున అది దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. ఆధ్యాత్మికముగా పురోగతి చెందిన వారికొరకే ఈ మంత్రము ఉద్దేశింపబడినది. దీనిని జపించుటలో ఆధ్యాత్మిక సాఫల్యమును పొందువాడు భగవానునితో గుణైక్యమును పొందును. కాని ఈ మంత్రమును జపించుటకు మొదట పరిపూర్ణత్వము నొందిన మానవుని లక్షణములను, భౌతిక ప్రకృతి నియమముల ననుసరించి సత్త్వగుణములను అలవరచుకొనవలెను. వైదిక జీవన విధానమందు గాయత్రీ మంత్రము మిక్కిలి ప్రధానమైనది. అది పరబ్రహ్మపు ధ్వని అవతారముగా పరిగణింప బడుచున్నది. దానిని ఆరంభించినది బ్రహ్మదేవుడు, మరియు అది అతని నుండియే గురుశిష్య పరంపర ద్వారా తర్వాతి తరముల వారికి అందింపబడినది.

భారతదేశమున మార్గశీర్షమాసము(నవంబరు-డిసెంబరు) అన్ని మాసములలోకి ఉత్తమమైనదిగా పరిగణింపబడును. ఎందుకనగా ఆ మాసమున జనులు పొలముల నుండి ధాన్యమును సేకరించి ఆనందముతో నుందురు. అదేవిధముగా, ఋతువుల యందు వసంత ఋతువు ప్రపంచమంతటికిని అత్యంత ప్రియమైనది. అప్పుడు వాతావరణము అతి వేడిగ గాని, అతి శీతలముగ గాని లేకుండ వృక్షము లన్నియును

వికాసము నొంది పుష్పములతోను మరియు ఫలములతోను నిండియుండును. శ్రీకృష్ణుని లీలలను స్మరింపజేయు అనేక ఉత్సవములను కూడ ఈ వసంతఋతువు నందే జరుపబడుచుండును. కనుకనే ఋతువు లన్నింటిలోకి వసంతఋతువు అత్యంత ఆనందదాయకమైనదిగా పరిగణింపబడును. అది దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రతినిధి.

## 10.36

**ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్ ।**
**జయో స్మి వ్యవసాయో స్మి సత్త్వం సత్త్వవతామహమ్ ॥**

## అనువాదము

**మోసములలో నేను జూదమును. తేజస్సు గలవారిలో తేజస్సును. అలాగుననే జయమును, సాహసమును, బలవంతులలో బలమును నేనే.**

## భాష్యము

విశ్వమందంతటను అనేకరకాల మోసకారులు కలరు. మోసము లన్నింటిలోకి జూదము అగ్రగణ్యమై యున్నది. కనుకనే అది శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. దేవాదిదేవునిగా శ్రీకృష్ణుడు సామాన్యమానవుని కంటెను గొప్పగా వంచింపగలడు. ఒకవేళ శ్రీకృష్ణుడే ఎవ్వరినైనను వంచింప దలచినచో, ఆ వంచనలో ఎవ్వరును అతనిని అధిగమింపజాలరు. అతని మహత్త్వము కేవలము ఒక రంగమందునే కాకుండ అన్ని రంగములందు గొప్పదై యుండును.

విజయవంతులలో అతడు విజయము. తేజస్సులలో అతడే తేజస్సు. యత్నశీలురలో గొప్ప యత్నశీలుడు, సాహసవంతులలో అతడు మిక్కిలి సాహసవంతుడు. బలవంతులలో మిక్కిలి బలశాలి. శ్రీకృష్ణుడు ఈ భూమిపై అవతరించి నప్పుడు ఎవ్వరును అతనిని బలములో అధిగమింపలేకపోయిరి. అతడు బాల్యము నందు గోవర్ధన పర్వతము నెత్తెను. అట్టి శ్రీకృష్ణుని మోసము నందు గాని, తేజస్సు నందు గాని, విజయము నందు గాని, సాహసము నందు గాని మరియు బలము నందు గాని ఎవ్వరును అధిగమింపలేరు.

## 10.37

**వృష్ణీనాం వాసుదేవో స్మి పాణ్డవానాం ధనంజయ: ।**
**మునీనామప్యహం వ్యాస: కవీనాముశనా కవి: ॥**

## అనువాదము

**వృష్టివంశస్థులలో నేను వాసుదేవుడను, పాండవులలో అర్జునుడను, మునులలో వ్యాసుడను. ఆలోచనాపరులైన గొప్ప కవులలో ఉశనుడను యగుదును.**

## భాష్యము

శ్రీకృష్ణుడు ఆద్యుడైన దేవాదిదేవుడు. బలదేవుడు శ్రీకృష్ణుని ప్రథమ స్వరూపాంశ విస్తరణము. శ్రీకృష్ణుడు మరియు బలరాముడు కూడ వసుదేవుని పుత్రులుగా అవతరించిరి. కనుక వారిరువురిని కూడ వాసుదేవులని పిలువవచ్చును. మరొకదృష్టితో చూచినచో, శ్రీకృష్ణుడు ఎన్నడును వృందావనమును వీడడు. కనుక వృందావనమున కాకుండ ఇతర ప్రదేశములందు కనిపించు శ్రీకృష్ణుని రూపములన్నియు అతని స్వరూపాంశములే. అనగా శ్రీకృష్ణుని స్వరూపాంశయైన వాసుదేవుడు శ్రీకృష్ణునికి భిన్నుడు కాదు. భగవద్గీత యందలి ఈ శ్లోకము నందు సూచింపబడిన వాసుదేవ పదము బలదేవుడు లేక బలరాముడినే సూచించు చున్నదని తెలుసుకోవలెను. ఎందుకనగా బలరాముడే సర్వావతారములకు మూలాధారము. కనుక అతడు వాసుదేవునికి కూడ మూలాధారమై యున్నాడు. శ్రీకృష్ణభగవానుని అవ్యవహిత స్వరూపాంశ విస్తార రూపములు 'స్వాంశము'లుగా పిలువబడును. ఇవియేగాక 'విభిన్నాంశములు' అని పిలువబడు ఇతర విస్తృతరూపములు (జీవులు) కూడ కలవు.

పాండురాజు పుత్రులలో ధనంజయునిగా పేరుగాంచిన అర్జునుడు నరులలో శ్రేష్ఠుడైనందున శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. మునులు లేక వేదవిజ్ఞాన పారంగతులైన మానవులలో వ్యాసుడు శ్రేష్ఠుడు. ఎందుకనగా, అతడు ఈ కలియుగము నందలి సాధారణ మానవులకు అవగతమగునట్లు అనేక విధములుగా వేదవిజ్ఞానమును విశదీకరించెను. అంతేకాకుండ, వ్యాసుడు కూడ శ్రీకృష్ణుని అవతారముగా ప్రసిద్ధుడగుచేత అతడు కూడ శ్రీకృష్ణుని ప్రతినిధియే. కవులనగా ఎట్టి విషయమును గూర్చియైనను సమగ్రముగా ఆలోచింప సమర్థులు. అట్టి కవులలో దానవులకు గురువైన ఉశనుడు (శుక్రాచార్యుడు) అసాధారణ మేధాసంపన్నుడు మరియు దూరదృష్టి కలిగిన రాజకీయవేత్త. కనుక శుక్రాచార్యుడు శ్రీకృష్ణుని విభూతికి మరొక ప్రతినిధియై యున్నాడు.

## 10.38

**దణ్డో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్ ।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్ ॥**

**అనువాదము**

**చట్టవిరుద్ధతను అణుచు సాధనములలో నేను శిక్షను, జయము కోరు వారిలో నేను నీతిని, రహస్య విషయములలో నేను మౌనమును, జ్ఞానవంతులలో నేను జ్ఞానమును అయియున్నాను.**

**భాష్యము**

దండన సాధనములు అనేకములు కలవు. వానిలో దుష్కృతులను శిక్షించునవి మిక్కిలి ప్రధానమైనవి. అట్టి దుష్కృతులు శిక్షింపబడినప్పుడు, ఆ శిక్షను అమలుపరచువాడు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. ఏ కార్యరంగము నందైనను విజయము సాధింప యత్నించు వారిలో మిక్కిలి విజయవంతమైన అంశము నీతి. శ్రవణము, చింతనము, ధ్యానము అను రహస్యమైన కార్యము లందు మౌనము ముఖ్యమైనది. ఎందుకనగా మౌనము ద్వారా మానవుడు వేగముగా పురోగతిని సాధింపగలడు. జ్ఞానవంతుడు భౌతిక మరియు ఆధ్యాత్మిక పదార్థముల నడుమ గల భేదమును, భగవానుని ఉన్నతన్యూన ప్రకృతులలో గల భేదమును విశ్లేషించ గలిగియుండును. అట్టి జ్ఞానము స్వయముగా శ్రీకృష్ణుడే.

**10.39**
**యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున ।**
**న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్ ॥**

## అనువాదము

**ఇంకను, ఓ అర్జునా! సర్వజీవులకు జన్మకారకమైన బీజమును నేనే. స్థావర జంగములైన వస్తువులలో నేను లేకుండ ఏదియును స్థితిని కలిగియుండలేదు.**

## భాష్యము

ప్రతిదానికిని ఒక కారణముండును. ఆ కారణము లేదా బీజము శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణుని శక్తిలేకుండా ఏదియును స్థితిని కలిగియుండజాలదు. కనుకనే అతడు సర్వశక్తిమంతుడని చెప్పబడుచున్నాడు. అతని శక్తిలేకుండ స్థావరములు గాని, జంగమములు గాని ఎవియు మనుగడను కలిగియుండలేదు. కనుకనే శ్రీకృష్ణుని శక్తిపై ఆధారపడనిదిగా గోచరించునది 'మాయ' (లేనటువంటిది)గా పిలువబడును.

**10.40**
**నాన్తో స్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప ।**
**ఏష తూద్దేశత: ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥**

## అనువాదము

**ఓ శత్రుంజయుడా! నా దివ్య విభూతులకు అంతమనునది లేదు. నేను నీకు తెలిపినదంతయు నా అనంత విభూతుల యొక్క సూచన మాత్రమే.**

## భాష్యము

వైదిక గ్రంథములందు తెలుపబడినట్లు దేవాదిదేవుని విభూతులు మరియు శక్తులు వివిధ రీతుల అవగతము చేసికొనబడినను, అట్టి విభూతులకు పరిమితి యనునది లేదు. కనుకనే సమస్త విభూతులు మరియు శక్తులెన్నడును సంపూర్ణముగా వివరింపబడజాలవు. అర్జునుని జిజ్ఞాసను సంతృప్తిపరచుట కొరకు కొన్ని ఉదాహరణలు మాత్రమే వర్ణింపబడినవి.

**10.41**
**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజో ంశసంభవమ్ ॥**

## అనువాదము

**సంపన్నములును, సుందరములును, వైభవోపేతములును అగు సమస్త సృష్టి విస్తారములు నా తేజోంశము నుండియే ఉద్భవించినవిగా తెలిసికొనుము.**

## భాష్యము

భౌతిక మరియు ఆధ్యాత్మిక జగత్తుల యందలి ఎట్టి వైభవోపేతము లేదా సుందర సృష్టియైనను శ్రీకృష్ణుని విభూతి యొక్క అంశమాత్ర వ్యక్తీకరణమేయని ఎరుగవలెను. కనుక విశేష వైభవములతో కూడినదేదైనను శ్రీకృష్ణుని విభూతికి ప్రాతినిధ్యముగా భావింపవలెను.

## 10.42

**అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ ॥**

## అనువాదము

**కాని ఓ అర్జునా! ఈ సవిస్తరమైన జ్ఞానమునకు అవసరమేమున్నది? కేవలము నా ఒక అంశ మాత్రము చేతనే నేను ఈ సమస్త విశ్వమును వ్యాపించి పోషించుచుండును.**

## భాష్యము

పరమపురుషుడు, సమస్త విశ్వము నందును అన్ని వస్తువుల యందును పరమాత్మగా ప్రవేశించి యున్నట్లుగా ప్రతిపాదింపబడినది. సమస్త విషయములు ఏ విధముగా విభూతి సంపన్నములు మరియు వైభవోపేతములుగా నుండునో తెలిసికొనుట వలన లాభము లేదని శ్రీకృష్ణుడు ఇక్కడ అర్జునునకు చెప్పుచున్నాడు. శ్రీకృష్ణుడు పరమాత్మగా ప్రకాశించుట చేతనే ప్రతిదియు స్థితిని కలిగియున్నదని అతడెరుగవలెను. మహత్తర జీవియైన బ్రహ్మదేవుని మొదలుగా అతి సూక్ష్మమైన చీమ వరకును గల సమస్త జీవుల యందును భగవానుడు పరమాత్మగా వాటియందు ప్రవేశించి వానిని పోషించుట చేతనే అవి స్థితిని కలిగియున్నవి.

మానవుడు ఏ దేవతను పూజించినను చివరకు దేవాదిదేవుని చెంతకే లేక పరమగమ్యమునకే ఆ పూజ చేరునను సిద్ధాంతమును ప్రచారము చేయు సంఘము ఒకటి కలదు. బ్రహ్మరుద్రాదులు వంటి గొప్పదేవతలు కూడ దేవాదిదేవుని విభూతి అంశమాత్రమునకు ప్రాతినిధ్యము వహించు చున్నందున అట్టి దేవతల పూజ కూడ ఇక్కడ పూర్తిగా నిరసింపబడుచున్నది. జన్మించిన వారందరకును అతడే మూలము. అతని కంటెను గొప్ప వారెవరును లేరు. అతడు 'అసమౌర్ధ్వ' యనబడును. అనగా అతనికంటె అధికులును, అతనితో సమానులు కాని కాజాలరని అర్థము. 'పద్మపురాణము' నందు దేవతలు (బ్రహ్మరుద్రాదులైనను సరియే) శ్రీకృష్ణభగవానునితో సమానమని భావించువాడు తక్షణమే నాస్తికుడగునని (పాషండుడగునని) చెప్పబడినది. శ్రీకృష్ణుని దివ్య విభూతులను, శక్తుల విస్తారమును పూర్తిగా అధ్యయనము చేసిన మానవుడే నిస్సందేహముగా దేవాదిదేవుని దివ్యస్థితిని ఎరిగి అతని ఆరాధనము నందు ఏకాగ్రతతో మనస్సును లగ్నము చేయగలడు. అట్టి శ్రీకృష్ణభగవానుడు తన స్వరూపాంశమైన పరమాత్మగా సమస్తము నందు సర్వవ్యాపకుడగు చున్నాడు. కనుకనే శుద్ధభక్తులు సంపూర్ణ కృష్ణచైతన్యముతో భక్తియుక్త సేవ యందు తమ మనస్సును కేంద్రీకరించి యుందురు. కనుకనే వారెల్లప్పుడును ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొనియుందురు. శ్రీకృష్ణభగవానుని యొక్క భక్తియోగము మరియు అర్చనము అనునది ఎనిమిది నుండి పదునొకండవ శ్లోకము వరకు ఈ అధ్యాయము నందు

స్పష్టముగా సూచింపబడినది. వాస్తవమునకు అదియే శుద్ధమైన భక్తియుక్త సేవామార్గము. మానవుడు భగవానుని సాహచర్యమున అత్యున్నత పరిపూర్ణత్వమును ఎలా సాధింపగలడో ఈ అధ్యాయము నందు సవివరముగా తెలుపబడినది. శ్రీకృష్ణుని నుండి వచ్చుచున్న గురుశిష్య పరంపర యందలి శ్రీల బలదేవ విద్యాభూషణులు ఈ అధ్యాయముపై తన వ్యాఖ్యానమును ముగించుచు ఈ క్రింది విధముగా తెలిపియుండిరి :

యచ్ఛక్తిలేశాత్ సూర్యాద్యా భవంత్యత్యుగ్రతేజస: ।
యదంశేన ధృతం విశ్వం స కృష్ణో దశమే ర్చ్యతే ॥

"శ్రీకృష్ణభగవానుని ఉత్కృష్టమైన శక్తిలేశము నుండియే శక్తిమంతుడైన సూర్యుడు కూడ తేజమును పొందుచున్నాడు. శ్రీకృష్ణుని స్వరూపాంశ చేతనే ప్రపంచమంతయు పోషింపబడుచున్నది. కనుకనే శ్రీకృష్ణభగవానుడు పూజనీయుడు."

**శ్రీమద్భగవద్గీత యందలి 'భగవద్విభూతి' అను దశామాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

-----

# ఎకాదశాధ్యాయము
# విశ్వరూపము

**11.1**
**అర్జున ఉవాచ**
**మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్ ।**
**యత్త్వయోక్తం వచస్తేన మోహో௨యం విగతో మమ ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : ఈ పరమ రహస్యములైన ఆధ్యాత్మిక విషయములను గూర్చి నీవు దయచే నాకు చేసిన ఉపదేశముల శ్రవణము ద్వారా ఇప్పుడు నా మోహము తొలగిపోయినది.**

**భాష్యము**

ఈ అధ్యాయము శ్రీకృష్ణుడు సర్వాకారణములకు కారణుడని ప్రకటించు చున్నది. ఎవని నుండి భౌతిక విశ్వములు ఉద్భవించునో అట్టి మహావిష్ణువునకు కూడ అతడే కారణము. శ్రీకృష్ణుడు అవతారము కాదు. అతడు సర్వావతారములకు కారణభూతుడు(అవతారి). ఆ విషయము గడచిన అధ్యాయమునందు విశదముగా వివరింపబడినది.

ఇప్పుడు అర్జునుడు తన మోహము తొలగినదని చెప్పుచున్నాడు. అనగా అర్జునుడు శ్రీకృష్ణుని సామాన్యమానవునిగా లేక తన మిత్రునిగా భావింపక, సర్వమునకు మూలాధారునిగా భావించుచున్నాడు. అర్జునుడు పరమ ఉత్తేజితుడై శ్రీకృష్ణుని వంటి గొప్పమిత్రుడు తనకు లభించినందుకు ఆనంద భరితుడగుచున్నాడు. కాని ఇప్పుడు తాను శ్రీకృష్ణుని సర్వకారణకారణునిగా అంగీకరించినను, ఇతరులు ఆ విధముగా అంగీకరింపరేమోనని అతడు భావించుచున్నాడు. కనుకనే శ్రీకృష్ణుని దివ్యత్వమును సర్వులకు విశదపరచుటకై ఈ అధ్యాయమున విశ్వరూపమును చూపుమని శ్రీకృష్ణుని ప్రార్థించుచున్నాడు. వాస్తవమునకు ఎవరైనను శ్రీకృష్ణుని విశ్వరూపమును చూచినపుడు అర్జునుని వలెనే భయభ్రాంతులగుదురు. కాని శ్రీకృష్ణుడు పరమ దయాళువైనందున విశ్వరూపమును చూపిన పిమ్మట తన మూలరూపమును తిరిగి పొందియుండెను. “నీ హితము కొరకు నేనిది ఉపదేశించు చున్నాను” అని పలుమార్లు శ్రీకృష్ణుడు చెప్పిన విషయమును అర్జునుడు పూర్తిగా అంగీకరించు చున్నాడు. కనుకనే అర్జునుడు ఇదియంతయు శ్రీకృష్ణుని కృపచేతనే జరుగుచున్నదని కృతజ్ఞతాపూర్వకముగా ఇక్కడ పలుకుచున్నాడు. శ్రీకృష్ణుడే సర్వకారణములకు కారణుడనియు, పరమాత్మగా సర్వుల హృదయము లందు నెలకొనియున్నాడనియు, అర్జునుడిప్పుడు పూర్తి నిశ్చయమునకు వచ్చెను.

## 11.2

**భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।**
**త్వత్త: కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥**

### అనువాదము

**ఓ కమలపత్రాక్షా! సర్వజీవుల జననమరణములను గూర్చి వివరముగా నీ నుండి నేను శ్రవణము చేసితిని మరియు అక్షరములైన నీ మహాత్మ్యములను కూడ గుర్తించితిని.**

### భాష్యము

అర్జునుడు ఆనందపరవశుడై, శ్రీకృష్ణుని 'కమలపత్రాక్ష' (శ్రీకృష్ణుని నేత్రములు కమలపత్రముల వలె కనిపించును) అని సంబోధించుచున్నాడు. ఎందుకనగా, శ్రీకృష్ణుడు అతనికి : "అహం కృత్స్నస్య జగత: ప్రభవ: ప్రళయస్తథా"- "ఈ సమస్త భౌతిక జగత్తు యొక్క సృష్టినాశములకును నేనే మూలకారణుడను" అని నిశ్చయముగా పలికెను(భ గీ. 7.6). అర్జునుడు ఈ విషయమును గూర్చి భగవానుని నుండి సవివరముగా వినియుండెను. భగవానుడు సమస్త సృష్టి లయములకు కారణభూతుడైనను వాటికి అతీతుడై యుండుననియు అర్జునుడు ఎరుగును. భగవానుడు భగవద్గీత(9.5) నందు స్వయముగా తెలిపినట్లు తాను సర్వవ్యాపియైనను సర్వత్రా వ్యక్తిగతముగా నిలిచియుండడు. శ్రీకృష్ణుని ఈ అచింత్యమైన ఆ దివ్యవిభూతినే తాను పూర్తిగా అవగాహన చేసికొనినట్లు అర్జునుడు అంగీకరించుచున్నాడు.

## 11.3

**ఎవమేతద్యథాత్థ త్వమాత్మానం పరమేశ్వర ।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ ॥**

### అనువాదము

**ఓ పురుషోత్తమా! ఓ పరమేశ్వరా! నీవు వర్ణించునట్లుగా నీ యథార్థ రూపమును నేను నా యెదుట చూడగలిగినను, నీవు ఏవిధముగా ఈ విశ్వము నందు ప్రవేశించితివో నేను గాంచగోరుచున్నాను. నీ యొక్క ఆ బ్రహ్మాండమైన రూపమును నేను దర్శించగోరుదును.**

### భాష్యము

భౌతిక విశ్వము నందు తాను తన స్వరూపాంశముచే ప్రవేశించి యున్నందున అది సృష్టినొంది, కొనసాగుచున్నదని శ్రీకృష్ణభగవానుడు (భ.గ.10.42) నందు తెలిపెను. తనకు సంబంధించి నంతవరకు అర్జునుడు శ్రీకృష్ణుని బోధనలచే ప్రేరితుడయ్యెను. కాని శ్రీకృష్ణుడు సామాన్య మానవుడేనని భావించు భవిష్యత్తు జనులకు విశ్వాసము కలిగించుట కొరకై, అర్జునుడు ఆ దేవాదిదేవుని విశ్వరూపమును చూడగోరెను. తద్వారా భగవానుడు విశ్వమునకు అతీతుడైయున్నను ఏ విధముగా విశ్వకార్యము నొనరించునో అతడు తెలుసుకోదలచెను. అర్జునుడు శ్రీకృష్ణుని 'పురుషోత్తమ' అని సంబోధించుట యందును ప్రాధాన్యత కలదు. భగవానుడు అంతర్యామి యైనందున అర్జునుని ఆంతరమందును నిలిచియున్నాడు. కనుక అర్జునుని అంతరము నందలి కోరికను కూడ

అతడెరుగును. స్వయంరూపము నందు దర్శించుటచే సంపూర్ణముగా తృప్తినొంది యున్నందున తనను విశ్వరూపము నందు చూడవలెనను ప్రత్యేక వాంఛ అర్జునునకు ఎట్టిది లేదనియు, కేవలము ఇతరులకు విశ్వాసమును కలిగించుట కొరకై అతడు విశ్వరూపమును చూడగోరు చున్నాడని శ్రీకృష్ణుడెరుగును. భవిష్యత్తు కాలమున భగవానుని అవతారములుగా నటించు కపటులు అనేకమంది యుండవచ్చును. కనుక ఆ విషయమున ఒక ప్రమాణమును ఏర్పరుచుటకు అర్జునుడు విశ్వరూపమును గాంచగోరెనని శ్రీకృష్ణుడు ఎరుగును. కనుకనే తాము అవతారములమని ప్రకటించు కొనువారి విషయమున జనులు అధిక జాగరూకులై యుండవలెను. తాను శ్రీకృష్ణుడనని చెప్పుకొనువాడు విశ్వరూపమును చూపి తాను చెప్పునది సత్యమని జనులకు నిరూపించుటకై సంసిద్ధుడై యుండవలెను.

## 11.4

**మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥**

## అనువాదము

**హే ప్రభూ! యోగేశ్వరా! నీ విశ్వరూపమును గాంచుటకు నేను సమర్థుడనని నీవు తలచినచో దయయుంచి ఆ అపరిమితమైన విశ్వరూపమును నాకు చూపుము.**

## భాష్యము

భౌతికేంద్రియముల ద్వారా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని దర్శింప లేరనియు, శ్రవణము చేయలేరనియు, గ్రహింపలేరనియు చెప్పబడినది. కాని ఆరంభము నుండియే మానవుడు ప్రేమయుక్త సేవలో నెలకొనినచో ఆ భగవానుని వ్యక్తరూపమును దివ్యజ్ఞానముచే గాంచగలుగును. ప్రతిజీవియు వాస్తవమునకు ఆధ్యాత్మిక విస్ఫులింగము మాత్రమే. కనుకనే జీవునకు దేవాదిదేవుని దర్శించుట గాని, అవగాహన చేసుకొనుట గాని సాధ్యపడదు. కనుకనే భక్తుడైన అర్జునుడు తన ఊహాశక్తి లేదా కల్పనాశక్తిపై ఆధారపడక, సామాన్యజీవిగా తన పరిమితిని అంగీకరించి, శ్రీకృష్ణభగవానుని అపరిమేయమైన స్థితిని కీర్తించుచున్నాడు. పరిమితుడైన జీవునికి అపరిమితము మరియు అనంతమునైన భగవానుని స్వరూపమును గూర్చి ఎరుగుట సాధ్యపడదని అర్జునుడు అవగాహన చేసుకొన గలిగెను. అపరిమితుడైనవాడు తననుతాను వ్యక్తపరచు కొనినపుడే అతని కృపచేతనే అతని అపరిమిత స్వభావమును ఎరుగుట సాధ్యపడగలదు. శ్రీకృష్ణభగవానుడు అచింత్యశక్తి సంపన్నుడు కనుకనే 'యోగేశ్వర' అను పదము కూడ మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొన్నది. అనగా అతడు అపరిమితుడైనను తాను తన ఇచ్చానుసారము కృపతో తనంతటతాను వ్యక్తము కాగలడు. కనుకనే, అర్జునుడిక్కడ శ్రీకృష్ణుని ఆజ్ఞాపించక అతని అవ్యాజమైన, అచింత్యమైన కృపకొరకై ప్రార్థించు చున్నాడు. మానవుడు కృష్ణచైతన్యము నందు తనకు పూర్తిగా శరణాగతుడై భక్తియుక్త సేవ యందు నెలకొననిదే ఎవ్వరికినీ తనను వ్యక్తపరచుకోవలసిన అవసరము శ్రీకృష్ణునకు లేదు. కనుక తమ మానసిక కల్పనాశక్తిపై ఆధారపడు మానవులకు శ్రీకృష్ణభగవానుని దర్శించుట అసాధ్యము.

**11.5**
**శ్రీభగవానువాచ**
**పశ్య మే పార్థ రూపాణి శతశో థ సహస్రశ: ।**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥**

## అనువాదము

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : ప్రియమైన ఓ అర్జునా! పృథాకుమారా! వందలకొలది, వేలకొలదిగా గల నానావిధములును, దివ్యములును, పలు వర్ణములును అగు రూపములును (నా విభూతులను) ఇప్పుడు గాంచుము.**

## భాష్యము

అర్జునుడు శ్రీకృష్ణుని అతని విశ్వరూపము నందు గాంచగోరెను. అది దివ్యరూపమే అయినప్పటికిని విశ్వసృష్టికొరకే వ్యక్తమైనందున భౌతిక ప్రకృతి యొక్క తాత్కాలిక కాలమునకు ప్రభావితమై యుండును. భౌతిక ప్రకృతి వ్యక్తమగుట మరియు అవ్యక్తమగుట జరుగునట్లే, శ్రీకృష్ణుని విశ్వరూపము కూడ వ్యక్తము మరియు అవ్యక్తమగుచుండును. శ్రీకృష్ణుని ఇతర రూపముల వలె ఆధ్యాత్మిక ఆకాశమున విశ్వరూపము శాశ్వతముగా నెలకొనియుండదు. వాస్తవమునకు భక్తుడైనట్టివాడు ఎన్నడును అట్టి విశ్వరూపమును చూచుటకు ఆరాటపడడు. కాని అర్జునుడు శ్రీకృష్ణుని ఆ విధముగా చూడగోరినందున ఆ దేవాదిదేవుడు దానిని చూపుచున్నాడు. సామాన్య మానవుల కెవ్వరికిని అట్టి విశ్వరూపమును దర్శించుట సాధ్యము కాదు. మానవునకు విశ్వరూపమును దర్శించు విధముగా తగిన శక్తిని ప్రసాదింపవలెను.

**11.6**
**పశ్యాదిత్యాన్వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా ।**
**బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత ॥**

## అనువాదము

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! ఇచ్చట ఆదిత్యులను, వసువులను, రుద్రులను, అశ్వినీ కుమారులను, మరుత్తులను, సమస్త ఇతర దేవతలను గాంచుము. ఆలాగుననే ఇదివరకెన్నడును ఎవ్వరును చూడనట్టియు, విననట్టియు పలు అద్భుత విషయములను గాంచుము.**

## భాష్యము

అర్జునుడు శ్రీకృష్ణుని ఆప్తమిత్రుడైనను, విజ్ఞులలో అగ్రగణ్యుడైనను, శ్రీకృష్ణుని గూర్చి సర్వము నెరుగుట అతనికి ఇంకను సాధ్యము కాలేదు. ఆ వ్యక్తరూపములను, వ్యక్తీకరణములను మానవులు కని, విని యుండలేదని ఇచ్చట తెలుపబడినది. ఈ అద్భుత రూపములను శ్రీకృష్ణభగవానుడు ఇప్పుడు ప్రకటించు చున్నాడు.

## 11.7
**ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥**

### అనువాదము

**గుడాకేశా! నీవు చూడగోరు సమస్తమును నా దేహమున ఇప్పుడు ఒక్కమారుగా గాంచుము. నీవు ప్రస్తుతము ఏది చూడగోరినను మియు భవిష్యత్తున ఏది చూడదలచినను ఈ విశ్వరూపము నీకు చూపగలదు. స్థావర జంగమాదులన్నియు ఒకే స్థానమున దీనియందే సంపూర్ణముగా కలవు.**

### భాష్యము

ఒక్కచోటనే కూర్చుండి ఎవ్వరును సమస్త విశ్వమును గాంచలేరు. ఎంతటి గొప్ప శాస్త్రజ్ఞుడైనను విశ్వమునందలి ఇతర భాగములందు ఏమి జరుగు చున్నదో చూడలేడు. కాని అర్జునుని వంటి భక్తుడు మాత్రము విశ్వములో గల ఏ భాగము నందైనను జరుగు సర్వమును గాంచగలుగును. శ్రీకృష్ణభగవానుడు భూతభవిష్యత్ వర్తమానములందు దేనినైనను చూచుటకు కావలసిన శక్తిని ప్రసాదించు చున్నాడు. ఈ విధముగా శ్రీకృష్ణుని కృపచేతనే అర్జునుడు సర్వమును వీక్షింప సమర్థుడయ్యెను.

## 11.8
**న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షు: పశ్య మే యోగమైశ్వరమ్ ॥**

### అనువాదము

**కాని ప్రస్తుత చర్మచక్షువులచే నన్ను దర్శింపలేవు. అందుచే నేను నీకు దివ్య చక్షువులను ఒసగుచున్నాను. నా యోగ వైభవమును చూడుము.**

### భాష్యము

శుద్ధభక్తులు శ్రీకృష్ణుని అతని ద్విభుజరూపము కంటెను అన్యమైన ఏ రూపము నందున చూడగోరడు. అతడు భగవానుని విశ్వరూపమును మనస్సుతో కాకుండ, దివ్యచక్షువులతో అతని కృపద్వారా గాంచవలెను. కనుకనే శ్రీకృష్ణుని విశ్వరూపమును దర్శించుటకు మనస్సును కాకుండ దృష్టిని మార్చుకొనవలెనని అర్జునుడు ఉపదేశింపబడెను. శ్రీకృష్ణుని విశ్వరూపము అంత ప్రాధన్యమైనది కాదు. రాబోవు శ్లోకములందు ఈ విషయము స్పష్టమగును. అయినను అర్జునుడు దానిని చూడగోరి యున్నందున ఆ విశ్వరూపమును దర్శించుటకు కావలసిన ప్రత్యేక దృష్టిని భగవానుడు అతనికి ప్రసాదించెను.

శ్రీకృష్ణునితో దివ్యమైన ప్రేమపూర్వక సంబంధము నందు(రస) చక్కగా నెలకొనిన భక్తులు అతని విభూతి ప్రదర్శనముచే కాకుండ అతని ప్రేమలక్షణములచే ఆకర్షింపబడుదురు. శ్రీకృష్ణునితో క్రీడించువారును, అతని మిత్రులును, అతని తల్లిదండ్రులు అతని విభూతులను చూపుమని ఎన్నడును కోరలేదు. శుద్ధప్రేమలో వారెంతగా మునిగి యుండిరనగా శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని కూడ వారెరుగకుండిరి. తమ

ప్రేమ వినిమయము లందు వారు శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనెడి విషయమును కూడ విస్మరింతురు. శ్రీకృష్ణునితో క్రీడించిన బాలురందరును గొప్ప పుణ్యాత్ములనియు మరియు అనేకజన్మల పిదపనే వారు అట్లు శ్రీకృష్ణునితో క్రీడింప గలిగిరనియు శ్రీమద్భాగవతమున చెప్పబడినది. ఆ బాలురు శ్రీకృష్ణుడే దేవాదిదేవుడని కూడ ఎరుగకుండిరి. వారు కేవలము అతనిని ఆప్తమిత్రునిగానే భావించిరి. కనుకనే శ్రీ శుకదేవగోస్వామి ఈ క్రింది శ్లోకము నందు ఇట్లు చెప్పియున్నాడు :

ఇత్థం సతాం బ్రహ్మసుఖానుభూత్యా దాస్యం గతానాం పరదైవతేన ।
మాయాశ్రితానాం నరదారకేణ సాకం విజహ్రు: కృతపుణ్యపంజా: ॥

“మహర్షులచే నిరాకార బ్రహ్మముగాను, భక్తులచే దేవాదిదేవునిగాను, సామాన్య మానవులచే సామాన్య బాలునిగాను భావింపబడు పరమపురుషుడు ఈతడే. తమ పూర్వజన్మము లందు పెక్కు పుణ్యకార్యముల నొనరించిన ఈ బాలురు ఇప్పుడు ఆ దేవాదిదేవునితో క్రీడించుచున్నారు.”(శ్రీమద్భాగవతము 10.12.11)

సత్యమేమనగా, భక్తుడు భగవానుని ‘విశ్వరూపము’ను చూచుట యందు ఆసక్తిని కలిగియుండడు. కాని శ్రీకృష్ణుడు పలికిన వాక్యలను ధ్రువపరచుట కొరకు అర్జునుడు ఆ విశ్వరూపమును చూడగోరెను. ఎందుకనగా, శ్రీకృష్ణుడు సిద్ధాంత పూర్వకముగా లేదా తత్త్వపూర్వకముగా మాత్రమే కాకుండ, వాస్తవముగనే తననుతాను దేవాదిదేవునిగా అర్జునునకు ఎట్లు నిరూపించుకొనెనో భావిష్యత్కాలమున జనులు అవగతము చేసికొనగలరు. అర్జునుడు గురుశిష్య పరంపరా విధానమునకు ఆద్యుడైనందున దీనిని సమర్థించుట మిక్కిలి అవసరము. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగతము చేసుకొనుట యందు నిజమైన ఆసక్తిని కలిగినవారు మరియు అర్జునుని అడుగుజాడల ననుసరించువారు శ్రీకృష్ణుడు సిద్ధాంతపూర్వకముగానే కాకుండ వాస్తవముగానే తననుతాను దేవాదిదేవునిగా వ్యక్తపరచుకొనెనని అవగతము చేసికొనవలెను.

మేము ఇదివరకే వివరించియున్నట్లు, అర్జునుడు విశ్వరూపమును ప్రత్యేకముగా చూడగోరి యుండలేదని శ్రీకృష్ణుడు ఎరుగును. కనుక అతడు అర్జునునకు విశ్వరూపమును చూచుటకు అవసరమైన శక్తిని ప్రసాదించెను.

## 11.9

**సంజయ ఉవాచ**
**ఏవముక్త్వా తతో రాజన్మహాయోగేశ్వరో హరి: ।**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥**

### <u>అనువాదము</u>

**సంజయుడు పలికెను : ఓ రాజా! మహా యోగేశ్వరుడును దేవాదిదేవుడనైన శ్రీకృష్ణభగవానుడు ఆ విధముగా పలికి అర్జునునకు తన విశ్వరూపమును చూపెను.**

**11.10 - 11**
**అనేకవక్త్రనయనమనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥**

**దివ్యమాల్యామ్బరధరం దివ్యగంధానులేపనమ్ ।**
**సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్ ॥**

## అనువాదము

**అర్జునుడు ఆ విశ్వరూపమున అనేక ముఖములను, నేత్రములను, అద్భుతదృశ్యములను గాంచెను. ఆ రూపము పలు దివ్యాభరణములచే అలంకరింపబడి, ఎత్తబడిన పెక్కు దివ్యాయుధములను ధరించియుండెను. అతడు దివ్య పూమాలలను మరియు వస్త్రములను ధరించియుండెను. పలు దివ్య సుగంధములు అతని దేహమునకు పూయబడియుండెను. అంతయు ఆశ్చర్యమయముగను, ప్రకాశమానముగను, అనంతముగను, సర్వ వ్యాపకముగను ఉండెను.**

## భాష్యము

అర్జునుడు వీక్షించుచున్న హస్తములకును, ముఖములకును, పాదములకును, ఇతర వ్యక్తరూపముల సంఖ్యకును పరిమితి లేదను విషయమును ఈ శ్లోకములందు వాడబడిన 'అనేక' అను పదము సూచించుచున్నది. ఈ వ్యక్త రూపము లన్నియు విశ్వము నందంతటను వ్యాపించియున్నవి. అయినను భగవానుని కృపచే అర్జునుడు ఒక్కచోటనే నిలిచి వాటినన్నిటిని దర్శింపగలిగెను. శ్రీకృష్ణభగవానుని అచింత్యశక్తియే దానికి కారణము.

**11.12**
**దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా ।**
**యది భా: సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మన: ॥**

## అనువాదము

**వందలకొలది వేలకొలది సూర్యులొకేసారి ఆకాశమున ఉదయించినచో వాటి కాంతి, విశ్వరూపము నందలి పరమపురుషుని తేజస్సును పోల్చగలదు.**

## భాష్యము

అర్జునుడు వీక్షించిన దృశ్యము వర్ణనాతీతము. అయినను సంజయుడు ఆ అద్భుతకాంతి యొక్క మనోచిత్రమును ధృతరాష్ట్రునకు వివరింప యత్నించు చున్నాడు. సంజయుడు గాని ధృతరాష్ట్రుడు గాని యుద్ధరంగమున లేకున్నను వ్యాసుని కృపచే సంజయుడు అక్కడ జరిగినదంతయు యథాతథముగా గాంచ గలిగెను. కనుకనే అతడు అక్కడి పరిస్థితిని సాధ్యమైనంత వరకు అవగతమగునట్లు వేలాదిసూర్యులు ఉదయించుట వంటి ఊహాత్మక భావములతో పోల్చుచున్నాడు.

### 11.13
**తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।**
**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥**

## అనువాదము

**ఆ సమయమున అర్జునుడు పెక్కువేల సంఖ్యలుగా విభజింపబడియున్నను ఒకేచోట నిలిచియున్న విశ్వము యొక్క అనంత రూపములను శ్రీకృష్ణభగవానుని విశ్వరూపమున గాంచెను.**

## భాష్యము

ఈ శ్లోకమునందలి 'తత్ర'(అచట) అను పదము మిక్కిలి ప్రధానమైనది. అర్జునుడు విశ్వరూపమును చూచినపుడు శ్రీకృష్ణార్జును లిరువురును రథముపైననే కూర్చుండిరనియు ఆ పదము సూచించుచున్నది. శ్రీకృష్ణభగవానుడు దివ్యదృష్టిని అర్జునునకు మాత్రమే ప్రసాదించుటచే యుద్ధరంగము నందు అతడు తప్ప ఇతరులెవ్వరును ఆ రూపమును దర్శింపలేకపోయిరి. శ్రీకృష్ణుని దేహమునందు అర్జునుడు అనేక వేలాదిలోకములను చూడగలిగెను. అనేక లోకములు మరియు వేలాది విశ్వములు గలవని వైదిక గ్రంథముల నుండి మనకు తెలియుచున్నది. వానిలో కొన్ని మట్టిచే, కొన్ని బంగారముచే, కొన్ని రత్నములచే చేయబడినవనియు, వానిలో వానిలో కొన్ని అతి పెద్దవనియు, మరికొన్ని అతి చిన్నవనియు మనకు తెలియు చున్నది. కేవలము తన రథముపై కూర్చుండి వీనినన్నింటిని అర్జునుడు దర్శింప గలిగెను. కాని శ్రీకృష్ణార్జునుల నడుమ ఏమి జరుగుచున్నదో ఇతరులెవ్వరును ఎరుగజాలకుండిరి.

### 11.14
**తత: స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయ: ।**
**ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥**

## అనువాదము

**అంతట సంభ్రమమునకు గురియైనవాడును, ఆశ్చర్యచకితుడైనవాడును, రోమాంచితుడైన వాడును అగు అర్జునుడు శిరము వంచి నమస్కరించుచు ముకుళిత హస్తములతో దేవాదిదేవుని ప్రార్థింపదొడగెను.**

## భాష్యము

దివ్యదర్శన మైనంతటనే, శ్రీకృష్ణార్జునుల నడుమ గల సంబంధము వెంటనే మారిపోయెను. పూర్వము వారి సంబంధము స్నేహము (సఖ్యరస)పై ఆధారపడినది. కాని విశ్వరూప సందర్శనమైనంతనే అర్జునుడు అత్యంత గౌరవముతో ప్రణామముల నర్పిస్తూ, ముకుళిత హస్తములతో శ్రీకృష్ణుని ప్రార్థించుచున్నాడు. అతడు విశ్వరూపమును ప్రశంసించు చున్నాడు. ఈ విధముగా ఇప్పుడు అర్జునుని సంబంధము సఖ్యరసము కాకుండ అద్భుతరసముగా మార్పునొందెను. శుద్ధభక్తులు శ్రీకృష్ణుని సమస్త సంబంధములకు(రసములకు) నిధానముగా దర్శించుదురు. శాస్త్రములందు పేర్కొనబడిన పండ్రెండు రసములు శ్రీకృష్ణుని యందు గలవు. ఇరువురు జీవుల నడుమను, దేవతల నడుమను లేదా దేవాదిదేవునికిని మరియు భక్తుల నడుమ

పరస్పరము వినిమయము జరుగు సర్వ రససంబంధముల కన్నింటికిని అతడే నిధి వంటివాడని చెప్పబడినది.

ఇక్కడ అర్జునుడు అద్భుతరస సంబంధముచే ఉత్తేజితుడయ్యెను. అతడు సహజముగానే సమచిత్తుడును, శాంతుడును అయినప్పటికిని అద్భుతరస భావముతో పారవశ్యమునకు లోనయ్యెను. రోమములు నిక్కబొడుచు కొనగా, ముకుళిత హస్తములతో అతడు పరమపురుషునికి ప్రణామములను అర్పింప సాగెను. అతడు దేవాదిదేవుని అద్భుతములచే ప్రభావితుడయ్యెనే గాని భయమునకు గురికాలేదు.అతనికి అద్భుతరసము అను భావన వెంటనే వ్యక్తమయ్యెను. సహజ ప్రేమయుక్తమైన అతని సఖ్యసంబంధము అద్భుతరసముతో ప్రభావితమవ్వగా అతడు ఆ విధముగా వర్తించెను.

## 11.15

**అర్జున ఉవాచ**

**పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసఙ్ఘాన్ ।**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థమృషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥**

### అనువాదము

**అర్జునుడు పలికెను : ప్రియమైన కృష్ణా! సమస్త దేవతలు, ఇతర సమస్త జీవులు నీ దేహమునందు సమావిష్టులై యుండుటను నేను గాంచుచున్నాను. పద్మాసనుడైన బ్రహ్మను, శివుని, మహర్షు లందరిని, దేవతా సర్పములను కూడ నీయందు నేను దర్శించుచున్నాను.**

### భాష్యము

అర్జునుడు విశ్వమునందలి సర్వమును విశ్వరూపమున దర్శించు చున్నాడు. అనగా, విశ్వము నందలి ప్రథమ జీవియైన బ్రహ్మను, విశ్వపు అధో ప్రాంతములందు గర్భోదకశాయి విష్ణువు శయనించి యున్నట్టి దేవతా సర్పమును అతడు దర్శించుచున్నాడు. వాసుకి అని పిలువబడు సర్పములు ఇంకను కొన్ని గలవు. ఇక్కడ అర్జునుడు గర్భోదకశాయి విష్ణువు మొదలుగా విశ్వము నందలి ప్రథమ జీవియైన బ్రహ్మదేవుడు వసించు పద్మలోకము యొక్క అత్యంత ఉన్నత భాగము వరకును అర్జునుడు చూడగలిగెను. అనగా కేవలము రథముపై ఒకేచోట కూర్చుండిన అర్జునుడు ఆదినుండి అంతరము వరకును సర్వమును దర్శింపగలిగెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని కృపచేతనే ఇది సాధ్యమయ్యెను.

## 11.16

**అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతో నన్తరూపమ్ ।**
**నాన్తం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥**

### అనువాదము

**హే విశ్వ ప్రభూ! హే విశ్వరూపా! నీ దేహమునందు అపరిమితముగా సర్వత్ర వ్యాపించియున్న అనేక బాహువులను, ఉదరములను, ముఖములను,**

**నేత్రములను నేను గాంచుచున్నాను. నీ యందు ఆది మధ్యాంతరములను నేను గాంచలేకున్నాను.**

## భాష్యము

శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైన భగవానుడు మరియు అపరిమితుడు. కనుక అతని ద్వారా సమస్తమును గాంచవచ్చును.

## 11.17

**కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్ ।**
**పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాద్దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్ ॥**

## అనువాదము

**జ్వలించు అగ్ని లేక అపారమయిన సూర్యుని తెజస్సువలె సర్వదిక్కులకు వ్యాపించుచున్న తేజోమయమైన కాంతి వలన నీ రూపమును గాంచుట కష్టమగుచున్నది. అయినను పెక్కు కిరీటముల చేతను, గదలచేతను, చక్రముల చేతను అలంకరింపబడిన నీ ఉజ్జ్వల రూపమును సర్వత్ర నేను గాంచుచున్నాను.**

## 11.18

**త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**త్వమవ్యయ: శాశ్వతధర్మగోప్తా సనాతనస్త్వం పురుషో మతో మే ॥**

## అనువాదము

**దివ్యమైన ఆదిధ్యేయము నీవే. విశ్వమంతటికిని పరమాధారము నీవే. అవ్యయుడవు మరియు సనాతనుడవు నీవే. శాశ్వత ధర్మరక్షకుడవు, దేవాదిదేవుడవు నీవే. ఇదియే నా అభిప్రాయము.**

## 11.19

**అనాదిమధ్యాన్తమనన్తవీర్యమనన్తబాహుం శశిసూర్యనేత్రమ్ ।**
**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥**

## అనువాదము

**ఆదిమధ్యాంతరహితునిగను, అపరిమిత వైభవము గలవానినిగను, అనేక బాహువులు గలవానినిగను, సూర్యచంద్రులు నేత్రములుగా గలవానినిగను, ప్రజ్వలించుచున్న అగ్ని వెలువడుచున్న ముఖము కలవానినిగను, సర్వతేజముతో ఈ సమస్త విశ్వమును తపింపజేయుచున్న వానినిగను నిన్ను గాంచుచున్నాను.**

## భాష్యము

దేవాదిదేవుని షడ్గుణైశ్వర్యములు అనంతములు. ఈ సందర్భమున మరియు అనేక ఇతరచోట్ల పునరుక్తి కనిపించును. కాని శాస్త్రముల ననుసరించి శ్రీకృష్ణుని వైభవముల పునరుక్తి అనునది సారస్వత లోపము కాదు. సంభ్రమము కాని ఆశ్చర్యము కాని పారవశ్యము కాని కలిగినపుడు మాటలలో పునరుక్తి కలుగుచుండుననియు చెప్పుదురు. అది దోషమేమియు కాదనియు తెలుపబడినది.

## 11.20

**ద్యావాపృథివ్యోరిదమన్తరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వా: ।**
**దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥**

## అనువాదము

**నీవు ఒక్కడవేయైనను సమస్త ఆకాశమును, సర్వలోకములను మరియు వాని నడుమగల ప్రదేశము నంతటిని వ్యాపించియున్నావు. ఓ మహానుభావా! అద్భుతమును, భయంకరమును అగు ఈ రూపమును గాంచి లోకము లన్నియును కలత నొందుచున్నవి.**

## భాష్యము

'ద్యావాపృథివ్యో:'(స్వర్గమునకును, భూమికిని నడుమ గల ప్రదేశము) మరియు 'లోకత్రయమ్'(ముల్లోకములు) అను పదములు ఈ శ్లోకమున ప్రధాన్యమును కలిగియున్నవి. ఎందుకనగా భగవానుని ఈ విశ్వరూపమును అర్జునుడొక్కడే కాకుండ ఇతర లోకములందలి వారు కూడా దర్శించుచునట్లు కనిపించును. అర్జునుడు ఈ విశ్వరూపమును దర్శించుట స్వప్నము కాదు. భగవానునిచే దివ్యదృష్టి ఒసగబడిన వారందరును రణరంగమున విశ్వరూపమును దర్శించిరి.

## 11.21

**అమీ హి త్వాం సురసఙ్ఘా విశన్తి కేచిద్భీతా: ప్రాంజలయో గృణన్తి ।**
**స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసఙ్ఘా: స్తువన్తి త్వాం స్తుతిభి: పుష్కలాభి: ॥**

## అనువాదము

**దేవతా సమూహములన్నియును నిన్ను శరణువేడి నీ యందు ప్రవేశించు చున్నవి. వారిలో కొందరు భయపడినవారై ముకుళిత హస్తములతో ప్రార్థించు చున్నారు. మహర్షులు, సిద్ధసమూహములు రోదిస్తూ, "శాంతి! శాంతి!" అనుచు వైదిక మంత్రములచే నిన్ను స్తుతించుచున్నారు.**

## భాష్యము

సర్వలోకముల యందలి దేవతలు అద్భుతమైన విశ్వరూపపు భయంకరాకృతిచే మరియు దాని దేదీప్యమాన తేజమును చూచి భయమునొంది తమ రక్షణ కొరకై ప్రార్థించిరి.

**11.22**

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వే ఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।
గన్ధర్వయక్షాసురసిద్ధసఙ్ఘా వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥

**అనువాదము**

పరమశివుని పలురూపములును, ఆదిత్యులును, వసువులును, సాధ్యులును, విశ్వదేవతలును, అశ్వినీ కుమారులును, మరుత్తులును, పితృదేవతలును, గంధర్వులును, యక్షులును, అసురులును, సిద్ధులును నిన్ను ఆశ్చర్యచకితులై గాంచుచున్నారు.

**11.23**

రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహుబాహూరుపాదమ్ ।
బహూదరం బహుదంష్ట్రాకరాలం దృష్ట్వా లోకా: ప్రవ్యథితాస్తథాహమ్ ॥

**అనువాదము**

ఓ మహాబాహో! పెక్కు ముఖములతోడను, నేత్రములతోడను, బాహువులతోడను, ఊరువుల తోడను, పాదముల తోడను, ఉదరముల తోడను, భయంకరములైన దంతములతోడను కూడిన నీ మహారూపమును గాంచి దేవతలతో కూడిన లోకములన్నియు వ్యథ చెందుచున్నవి. వారివలెనే నేనును కలత చెందుచున్నాను.

**11.24**

నభ:స్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్ ।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా ధృతిం న విన్దామి శమం చ విష్ణో ॥

**అనువాదము**

సర్వవ్యాపకుడవైన ఓ విష్ణూ! ఆకాశమును తాకు పెక్కుప్రకాశమాన వర్ణములతో కూడిన నిన్నును, తెరవబడిన నీ ముఖములను, తేజోవంతములైన నీ విశాల నేత్రములను గాంచి నా మనస్సు భీతిచే కలతనొందినది. మనోస్థిరత్వమును గాని, సమత్వమును గాని నేను ఏ మాత్రము నిలుపుకొనలేకున్నాను.

**11.25**
**దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని ।**
**దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥**

## అనువాదము

**ఓ దేవాదిదేవా! ప్రపంచశరణ్యా! మండుచున్న ప్రళయాగ్నిని బోలిన నీ ముఖములను, భయంకరములైన దంతములను గాంచి సమత్వమును నిలుపుకొనలేక సర్వదిక్కులను విస్మరించితిని. సర్వవిధముల నేను భ్రాంతుడనైతిని, దయతో నా పట్ల ప్రసన్నుడవు కమ్ము.**

**11.26- 27**
**అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రా: సర్వే సహైవావనిపాలసఙ్ఘై: ।**
**భీష్మో ద్రోణ: సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యై: ॥**

**వక్త్రాణి తే త్వరమాణా విశన్తి దంష్ట్రాకరాలాని భయానకాని ।**
**కేచిద్విలగ్నా దశనాన్తరేషు సందృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గై: ॥**

## అనువాదము

**భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మున్నగువారి తోడను, ప్రతిపక్షపు రాజుల తోడను, ధృతరాష్ట్రుని పుత్రులందరును, మా పక్షము నందలి యోధాగ్రగణ్యులును, నీ భయంకరములైన నోళ్లయందు వేగముగా ప్రవేశించుచున్నారు. నీ దంతముల నడుమ చూర్ణము చేయబడిన తలలతో తగుల్కొనిన కొందరిని నేను గాంచు చున్నాను.**

## భాష్యము

అర్జునుడు చూడగోరు విషయములను తాను చూపెదనని పూర్వపు శ్లోకమున శ్రీకృష్ణభగవానుడు వాగ్దానము చేసియున్నాడు. ఇపుడు అర్జునుడు తన ప్రతిపక్షము నందలి సేనా నాయకులందరిని(భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, ధృతరాష్ట్రుని పుత్రులందరును) వారి సేనలు మరియు తన స్వంత సేనలు నశించు చుండుటను చూచుచున్నాడు. అనగా కురుక్షేత్ర రణరంగము నందు సమావేశమైన వారిలో ఎంతోమంది యోధులు మరణించిన పిమ్మటను అర్జునుడు విజయవంతుడు కాగలడనుటకు ఇది మరియొక సూచనయై యున్నది. అజేయుడని భావింపబడు భీష్ముడు కూడ నశించునని ఇక్కడ పేర్కొనబడినది. అట్లే కర్ణుడును మరణింపగలడు. ప్రతిపక్షము నందలి భీష్ముని వంటి మహాయోధులే గాక అర్జునుని పక్షము నందలి మహాయోధులు కూడ కొందరు నశింతురని తెలుపబడినది.

**11.28**
**యథా నదీనాం బహవో ఽమ్బువేగా: సముద్రమేవాభిముఖా ద్రవన్తి ।**
**తథా తవామీ నరలోకవీరా విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి ॥**

**<u>అనువాదము</u>**

**నదీ ప్రవాహములు సముద్రము నందు ప్రవహించునట్లుగా, ఈ మహా యోధులందరును నీ నోళ్ళయందు ప్రవేశించి మండిపోవుచున్నారు.**

**11.29**
**యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా విశన్తి నాశాయ సమృద్ధవేగా: ।**
**తథైవ నాశాయ విశన్తి లోకాస్తవాపి వక్త్రాణి సమృద్ధవేగా: ॥**

**<u>అనువాదము</u>**

**అత్యంత వేగముతో మిడుతలు తమ వినాశము కొరకై జ్వలించుచున్న అగ్నియందు ప్రవేశించునట్లు, జనులందరును నీ నోళ్ళ యందు ప్రవేశించుటను నేను గాంచుచున్నాను.**

**11.30**
**లేలిహ్యసే గ్రసమాన: సమన్తాల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భి: ।**
**తెజోభిరాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రా: ప్రతపన్తి విష్ణో ॥**

**<u>అనువాదము</u>**

**ఓ విష్ణూ! నీవు సమస్త జనులను నీ మండుచున్న నోళ్ళ ద్వారా అన్ని వైపుల నుండియు మ్రింగివేయుచున్నట్లు నేను గాంచుచున్నాను. విశ్వమంతటిని నీ తేజస్సుతో ఆవరించి, భయంకరములను, తపింపజేయునవియును అగు కిరణములచే నీవు వ్యక్తమగుచున్నావు.**

**11.31**
**ఆఖ్యాహి మే కో భగవానుగ్రరూపో నమో ఽస్తు తే దేవవర ప్రసీద ।**
**విజ్ఞాతుమిచ్ఛామి భవన్తమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥**

**<u>అనువాదము</u>**

**ఓ దేవదేవా! ఇంతటి భయంకర రూపముతోనున్న నీవెవరవో నాకు దయతో తెలియజేయుము. నేను నీకు ప్రణామముల నర్పించెదను. నన్ను**

**అనుగ్రహింపుము. నీవు ఆదిపురుషుడవు. నీ కార్యమెట్టిదో ఎరుగ లేకున్నందున, నిన్ను గూర్చి నేను తెలిసికొనగోరుచున్నాను.**

**11.32**
**శ్రీభగవానువాచ**
**కాలో స్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్త: ।**
**ఋతే పి త్వాం న భవిష్యన్తి సర్వే యే వస్థితా: ప్రత్యనీకేషు యోధా: ॥**

**అనువాదము**

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : నేను లోకముల నన్నింటిని నాశనము చేయు కాలమును. జనులందరినీ నశింపజేయుటకే నేనిచటకు అరుదెంచితిని. నీవు(పాండవులు) తప్ప ఇచ్చటనున్న ఇరుపక్షము లందలి యోధులందరును చంపబడుదురు.**

**భాష్యము**

శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనియు, తనకు మిత్రుడని తెలిసినను అతని వివిధ రూప ప్రదర్శనచే అర్జునుడు విభ్రాంతుడయ్యెను. కనుకనే, అతడు సర్వ వినాశకరశక్తి యొక్క వాస్తవ ప్రయోజనమును గూర్చి మరల అడిగెను. పరమసత్యము సమస్తమును(చివరికి బ్రాహ్మణులను కూడా) నశింప జేయునని వైదిక గ్రంథములందు తెలుపబడినది. 'కఠోపనిషత్తు'(1.2.25) నందు ఈ క్రింది విధముగా తెలుపబడినది :

యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదన: ।
మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర స: ॥

"అంత్యమున బ్రాహ్మణులును, క్షత్రియులును, ఇతరు లందరును దేవాదిదేవునిచే ఆహారము వలె మ్రింగివేయబడుదురు." దేవాదిదేవుని ఈ ప్రస్తుత రూపము సర్వమును హరించునటువంటిది. ఈ విధముగా శ్రీకృష్ణుడు తనను సర్వ వినాశకరమైన కాలరూపముగా ప్రదర్శించు చున్నాడు. కొందరు పాండవులు తప్ప యుద్ధరంగము నందున్న వారందరును అతనిచే మ్రింగివేయ బడుదురు.

అర్జునుడు యుద్ధము పట్ల సుముఖముగా లేకుండెను. యుద్ధము చేయకుండుటయే ఉత్తమమనియు అతడు భావించెను. అప్పుడు ఎట్టి వినాశమును లేదా నిరాశయు సంభవింపదనియు అతడు భావించెను. భగవానుడు తాను సంకల్పించి యుండుటచే, అతడు యుద్ధము చేయకున్నను, అక్కడి వారందరును నశించి తీరుదురనియే దానికి సమాధానముగా చెప్పుచున్నాడు. అర్జునుడు ఒకవేళ యుద్ధమును మానినచో వారు మరోవిధముగా మరణింతురు. అర్జునుడు యుద్ధము చేయకున్నను వారి మరణము ఏ విధముగను నిరోధించుటకు వీలులేదు. వాస్తవమునకు వారు ఇదివరకే మరణించి యున్నారు. కాలము వినాశరూపము. దేవాదిదేవుని సంకల్పము ననుసరించి వ్యక్తరూపములన్నియు నశింపవలెను. అదియే ప్రకృతి నియమము.

## 11.33

**తస్మాత్త్వముత్తిష్ఠయశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।
మయైవైతే నిహతా: పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥**

### అనువాదము

**అందుచే లెమ్ము. యుద్ధసన్నద్ధుడవై కీర్తినొందుము. శత్రువులను జయించి సర్వ సమృద్ధమైన రాజ్యము ననుభవింపుము. ఓ సవ్యసాచీ! నా పూర్వప్పు ఏర్పాటుచే వారందరును ఇదివరకే మరణించి యున్నందున ఈ యుద్ధమున నీవు కేవలము నిమిత్తమాత్రుడవు కమ్ము.**

### భాష్యము

'సవ్యసాచిన్' యను పదము యుద్ధరంగమున అత్యంత నిపుణతో బాణప్రయోగము చేయగలవానిని సూచించును. ఈ విధముగా అర్జునుడు శత్రు సంహారము కొరకు బాణప్రయోగమును చేయగల సమర్థుడైన యోధుడని సంబోధింపబడెను. ఈ శ్లోకమున 'నిమిత్తమాత్రమ్'(కేవలము నిమిత్తమాత్రుడవు కమ్ము) అను పదము కూడ మిక్కిలి ప్రధానమైనది. దేవాదిదేవుని సంకల్పము ననుసరించి ఈ సమస్త జగత్తు నడుచుచున్నది. తగినంత జ్ఞానములేని మూఢులు ప్రకృతి ఎట్టి ప్రణాళిక లేకనే నడుచుచున్నదనియు మరియు సృష్టులన్నియును యాదృచ్ఛికముగా సంభవించినవనియు భావింతురు. సృష్టి ప్రారంభమున, "బహుశ: అది అట్లుండెను కాబోలు", "ఇది ఇట్లుండెను కాబోలు" లేదా "అట్లుండిన ఉండవచ్చును" అని సూచించు నామమాత్రపు శాస్త్రవేత్తలు కొందరందురు. కాని ఈ విషయమున "బహుశ:" లేక "ఉండిన ఉండవచ్చును" అను భావములకు తావులేదు. ఈ భౌతిక జగత్తున ప్రత్యేకముగ నిర్వహింపబడు ప్రణాళిక ఒకటి కలదు. ఈ ప్రణాళికేమిటి? ఈ భౌతిక సృష్టియనునది బద్ధజీవులు భగవద్ధామమును తిరిగి చేరుటకు ఒక అవకాశమై యున్నది. భౌతిక ప్రకృతి పై అధికారమును చెలాయించు మానసిక స్వభావమును కలిగి యుండినంత కాలము జీవులు బద్ధులై యుందురు. కాని ఎవరైనను శ్రీకృష్ణభగవానుని సంకల్పము నెరిగి కృష్ణచైతన్యమును అలవరచుకొనినచో మిక్కిలి బుద్ధిశాలి యగును. విశ్వము యొక్క సృష్టిలయములు భగవానుని దివ్యనిర్దేశము ననుసరించి జరుగుచుండును. కురుక్షేత్ర సంగ్రామము కూడా భగవానుని సంకల్పము ననుసరించియే ఏర్పాటు చేయబడినది. కనుకనే అర్జునుడు యుద్ధము చేయుటకు నిరాకరించు చుండగా, దేవాదిదేవుని కోరిక ననుసరించి యుద్ధము చేయమని బోధింపబడెను. అప్పుడే అర్జునుడు సంతృప్తి నొందగలడు. ఎవరైనను కృష్ణచైతన్యము నందు సంపూర్ణముగా నెలకొని జీవితమును భగవానుని దివ్యసేవకొరకై అంకితము చేసినచో వారు పరిపూర్ణులగుదురు.

## 11.34

**ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥**

### అనువాదము

**ద్రోణుడు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు, ఇతర మహాయోధులందరును నాచే ఇదివరకే సంహరింపబడిరి. అందుచే నీవు వారిని సంహరింపుము. ఏ మాత్రము వ్యథనొందక కేవలము యుద్ధము నొనరింపుము. నీవు తప్పక నీ శత్రువులను యుద్ధమున జయింపగలవు.**

### భాష్యము

ప్రతి ప్రణాళికయు దేవాదిదేవుని చేతనే ఏర్పాటు చేయబడుచుండును. కాని భక్తుల పట్ల పరమదయాళుడైన అతడు తన సంకల్పము ననుసరించి, తన పథకములను అమలుపరచు భక్తులకు కొంత ప్రతిష్ఠను చేకూర్చదలచును. కనుకనే మానవుడు ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి కృష్ణచైతన్యమున వర్తించుచు, దేవాదిదేవుని అవగాహన చేసుకొనునట్లుగా ప్రతియొక్కరు తమ జీవితములను మలచుకొనవలెను. శ్రీకృష్ణభగవానుని సంకల్పము అతని కృపచేతనే తెలియబడును. అతని భక్తుల సంకల్పములు కూడ ఆ దేవాదిదేవుని సంకల్పములు వలెనే శుభకరములై యుండును. కనుక మానవుడు అట్టి సంకల్పము ననుసరించి జీవిత సమరమున విజయమును సాధింపవలెను.

## 11.35

**సంజయ ఉవాచ**
**ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమాన: కిరీటీ ।**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీత: ప్రణమ్య ॥**

### అనువాదము

**సంజయుడు ధృతరాష్ట్రునితో ఇట్లు పలికెను : ఓ రాజా! దేవాదిదేవుని ఈ పలుకులను వినిన పిమ్మట కంపించుచున్న అర్జునుడు ముకుళిత హస్తుడై, మరల మరల అతనికి ప్రణామముల నర్పించెను. భీతిని కూడినవాడై అతడు గద్గద స్వరముతో శ్రీకృష్ణునితో ఇట్లు పలికెను.**

### భాష్యము

ఇదివరకే వివరింపబడినట్లు, దేవాదిదేవుని విశ్వరూపముచే సృష్టింప బడిన సంఘటనల కారణముగా అర్జునుడు ఆశ్చర్యముతో విభ్రాంతుడై శ్రీకృష్ణునకు గౌరవపూర్వక ప్రణామములను తిరిగి తిరిగి అరింపసాగెను. అతడు మిత్రుని వలె కాకుండ, ఆశ్చర్యచకితుడైన భక్తునిగా గద్గద స్వరముతో ఇట్లు ప్రార్థింపసాగెను.

**11.36**
**అర్జున ఉవాచ**
**స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।**
**రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి సర్వే నమస్యన్తి చ సిద్ధసఙ్ఘా: ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : ఓ హృషీకేశా! నీ నామమును వినినంతనే లోకమంతయు సంతోషించుచున్నది. ఈ విధముగా ప్రతియొక్కరు నీ యెడ ఆసక్తులగుచున్నారు. సిద్ధసమూహములు నీకు సగౌరవముగా ప్రణమిల్లుచున్నారు. రాక్షసులు భయకంపితులై పలుదిక్కుల పలాయనమగుచున్నారు. ఇదియంతయు యుక్తముగనే జరుగుచున్నది.**

**భాష్యము**

కురుక్షేత్ర సంగ్రామ ఫలితమును శ్రీకృష్ణుని ద్వారా వినినంతనే అర్జునుడు జ్ఞానవికాసము నొందెను. కనుకనే పరమభక్తునిగా మరియు మిత్రునిగా అతడు శ్రీకృష్ణునిచే సర్వమును యుక్తముగనే చేయబడినదని పలికెను. శ్రీకృష్ణుడే భక్తులకు పోషకుడు మరియు పరమారాధకుడనియు, అతడే దుష్టులను నశింప జేయువాడనియు అర్జునుడు స్పష్టముగా నిర్ధారించుచున్నాడు. భగవానుని కార్యములు సర్వులకు సమాన హితమునే కలిగించును. కురుక్షేత్ర సంగ్రామ సమయమున శ్రీకృష్ణుడు అక్కడ నిలిచియుండుటచే ఊర్ధ్వలోకము లందలి దేవతలు, సిద్ధులు, స్వర్గలోకము లందలి జ్ఞానులు, దానిని వీక్షించు చుండిరనియు అర్జునుడు ఎరుగగలిగెను. అర్జునుడు భగవానుని విశ్వరూపమును దర్శించినపుడు దేవతలు సంతోషించిరి. కాని రాక్షసులు మరియు నాస్తికులైన ఇతరులు భగవానుని మహిమలను విని సహింపలేకపోయిరి. దేవాదిదేవుని వినాశకర రూపము పట్ల కలిగిన సహజ భయముచే వారు అక్కడి నుండి పారిపోయిరి. శ్రీకృష్ణుడు తన భక్తుల పట్లను మరియు నాస్తికుల పట్లను వ్యవహరించు విధానము అర్జుననిచే ప్రశంసింప బడినది. శ్రీకృష్ణుడేది చేసినను అది సర్వులకు హితమునే చేకూర్చునని ఎరుగుటచే భక్తులు అన్నివేళలా భగవానుని కీర్తించును.

**11.37**
**కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్ గరీయసే బ్రహ్మణో ప్యాదికర్త్రే ।**
**అనన్త దేవేశ జగన్నివాస త్వమక్షరం సదసత్తత్పరం యత్ ॥**

**అనువాదము**

**ఓ మహాత్మా! బ్రహ్మదేవుని కంటెను గొప్పవాడా! నీవు ఆది సృష్టికర్తవు. అట్టి నీకు వారెందులకు సగౌరవముగా ప్రణమిల్లరు? ఓ అనంతా! దేవాదిదేవా! జగన్నివాసా! నీవు అక్షయుడవైన ఆధారభూతుడవు. సర్వకారణకారణుడవు, ఈ భౌతిక సృష్టికి అతీతుడవు.**

## భాష్యము

శ్రీకృష్ణుడు సర్వులచే ఆరాధనీయుడని ఇట్లు ప్రణామములను అర్పించుట ద్వారా అర్జునుడు సూచించు చున్నాడు. అతడే సర్వవ్యాపి మరియు ప్రత్యగాత్మలకు పరమాత్మయై యున్నాడు. అర్జునుడు శ్రీకృష్ణుని 'మహాత్మా'అని సంబోధించుట చేత భగవానుడు మహోదాత్తుడు, అప్రమేయుడని తెలియుచున్నది. 'అనన్త' అను పదము దేవాదిదేవుని శక్తి మరియు ప్రభావములచే ఆవరింపబడినది ఏదియును జగత్తునందు లేదనియు సూచించుచున్నది. 'దేవేశ' అను పదము దేవతల నందరిని నియంత్రించుచు ఆతడు వారికంటె అధికుడై యున్నాడని సూచించుచున్నది. అతడే సమస్త విశ్వమునకు మూలాధారము. అతని కంటెను అధికులెవ్వరును లేనందున సిద్ధాత్మలు మరియు శక్తిమంతులైన దేవతలందరు సగౌరవముగా శ్రీకృష్ణభగవానునికి ప్రణామముల నర్పించుట యుక్తమేనని అర్జునుడు భావించెను. శ్రీకృష్ణుడు బ్రహ్మదేవుని సృష్టించి యున్నందున, అతడు బ్రహ్మదేవుని కంటెను అధికుడని ప్రత్యేకముగా పెర్కొనినాడు. శ్రీకృష్ణుని స్వరూపాంశయైన గర్భోదకశాయి విష్ణువు యొక్క నాభికమల నాళము నుండి బ్రహ్మ జనించెను. కనుక బ్రహ్మ, బ్రహ్మ నుండి ఉద్భవించిన శివుడు మరియు ఇతర సమస్త దేవతలందరును శ్రీకృష్ణభగవానునకు గౌరవపూర్వకముగా ప్రనామములను అర్పింపవలెను. బ్రహ్మరుద్రాదులు, ఇతర దేవతలు దేవాదిదేవునికి ప్రణామములను అర్పింతురని శ్రీమద్భాగవతమున తెలుపబడినది. 'అక్షరమ్' అను పదము మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొన్నది. ఎందుకనగా, ఈ భౌతిక సృష్టి నశ్వరమైనను భగవానుడు దానికి అతీతుడు, సర్వకారణకారణుడు. కనుక, ఆతడు భౌతిక ప్రకృతి యందలి బద్ధజీవులందరి కంటెను మరియు స్వయముగా భౌతిక సృష్టి కంతటికిని అత్యంత ఉన్నతుడై యున్నాడు. కనుకనే శ్రీకృష్ణభగవానుడు పరమపురుషుడు.

### 11.38

**త్వమాదిదేవ: పురుష: పురాణస్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనన్తరూప ॥**

## అనువాదము

**నీవు ఆదిదేవుడవు, సనాతన పురుషుడవు, భౌతిక జగత్తునకు పరమోత్కృష్టమైన ఆశ్రయమువు. నీవు సర్వమును ఎరిగినవాడవు. తెలియదగిన సర్వము నీవే. ప్రకృతి గుణములకు అతీతుడవైన దివ్య శరణ్యుడవు నీవే. ఓ అనంతరూపా! ఈ సమస్త విశ్వము నీచే వ్యాపింప బడియున్నది.**

## భాష్యము

సమస్తము దేవాదిదేవునిపై ఆధారపడియున్నది. కనుక, అతడు 'పరం నిధానమ్'. 'నిధానమ్' అనగా సర్వమును బ్రహ్మతేజస్సు కూడ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పైననే ఆధారపడి యున్నదని అర్థము. ఈ జగత్తునందు జరుగుచున్న దానినంతటిని అతడు సంపూర్ణముగా ఎరుగును. ఇక జ్ఞానమునకు అవధి యనునది ఉన్నచో ఆతడే సమస్త జ్ఞానమునకు పరమావధి. కనుకనే తెలిసినవాడును, తెలియదగిన వాడును అతడే. సర్వవ్యాపకుడగుటచే జ్ఞానధ్యేయము కూడ అతడే. ఆధ్యాత్మిక జగత్తునకు కూడ అతడే

మూలకారణము. కనుక అతడే గుణాతీతుడు. అట్లే ఆధ్యాత్మిక జగత్తునందలి పరమపురుషుడు కూడ అతడే.

## 11.39

**వాయుర్యమో గ్నిర్వరుణ: శశాఙ్క: ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।**
**నమో నమస్తే స్తు సహస్రకృత్వ: పునశ్చ భూయో పి నమో నమస్తే ॥**

### అనువాదము

**వాయువు మరియు పరమ నియామకుడవు నీవే! అగ్ని, జలము, చంద్రుడవు నీవే! ఆదిజీవియైన బ్రహ్మవు మరియు ప్రపితామహుడవు కూడ నీవే! కనుకనే నీకు వేయిమార్లు తిరిగి తిరిగి గౌరవపూర్వక ప్రణామముల నర్పించుచున్నాను.**

### భాష్యము

వాయువు సర్వవ్యాపకుడు, దేవతలందరకును ముఖ్య ప్రతినిధి యగుటచే భగవానుడిక్కడ వాయువుగా సంబోధింపబడెను. విశ్వము నందలి ప్రథమ జీవియైన బ్రహ్మకు కూడ అతడు తండ్రి యగుటచే సకల ప్రాణులకు శ్రీకృష్ణుడు ప్రపితామహుడని అర్జునుడు సంబోధించుచున్నాడు.

## 11.40

**నమ: పురస్తాదథ పృష్ఠతస్తే నమో స్తు తే సర్వత ఏవ సర్వ ।**
**అనన్తవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతో సి సర్వ: ॥**

### అనువాదము

**నీకు ముందు నుండి, వెనుక నుండి, సర్వాదిక్కుల నుండి నమస్కారముల నర్పించుచున్నాను. ఓ అనంతవీర్యా! నీవు అమిత విక్రమ సంపన్నుడవు మరియు సర్వవ్యాపకుడవు. కనుకనే సర్వమును నీవే అయియున్నావు.**

### భాష్యము

మిత్రుడైన శ్రీకృష్ణుని పట్ల తనకు కలిగిన ప్రేమపారవశ్యముచే అర్జునుడు అతనికి అన్నివైపుల నుండి నమస్కారములను అర్పించుచున్నాడు. శ్రీకృష్ణుడు సర్వశక్తులకును, పరాక్రమములకును ప్రభువనియు, యుద్ధరంగము నందు కూడియున్న మహాయోధులందరి కంటెను అత్యంత గొప్పవాడనియు అర్జునుడు అంగీకరించుచున్నాడు. 'విష్ణుపురాణము'(1.9.69) నందు ఇట్లు చెప్పబడినది :

యో యం తవాగతో దేవ సమీపం దేవతాగణ: ।
స త్వమేవ జగత్స్రష్టా యత: సర్వగతో భవాన్ ॥

“ఓ దేవాదిదేవా! నిన్ను సమీపించు వారెవ్వరైనను (దేవతలైనను) నీ చేత సృష్టింప బడినవారే”.

**11.41 - 42**
**సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ హే యాదవ హే సఖేతి ।**
**అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి ॥**

**యచ్చావహాసార్థమసత్కృతో సి విహారశయ్యాసనభోజనేషు ।**
**ఏకో థ వాప్యచ్యుత తత్సమక్షం తత్ క్షామయే త్వామహమప్రమేయమ్ ॥**

## అనువాదము

**నీ మహిమలను తెలియక నిన్ను మిత్రునిగా భావించి, "ఓ కృష్ణా!", "ఓ యాదవా!", "ఓ మిత్రమా!" అని సంబోధించి యుంటిని. ప్రేమతో గాని లేదా మూర్ఖత్వముతో గాని నేనొనరించిన దానినంతటిని దయతో క్షమింపుము. మనము విశ్రాంతి గైకొనునప్పుడు, ఒకే శయ్యపై శయనించినప్పుడు, కూర్చుండినపుడు, కలిసి భుజించినపుడు ఒంటరిగా కొన్నిమార్లు మరియు పలుమిత్రుల సమక్షమున మరికొన్నిమార్లు నిన్ను నేను వేళాకోళముగా అగౌరవపరచి యుంటిని. ఓ అచ్యుతా! ఆ అపరాధము లన్నింటికిని నన్ను క్షమింపుము.**

## భాష్యము

శ్రీకృష్ణుడు విశ్వరూపముతో తన యెదుట వ్యక్తమైనప్పటికిని, అర్జునుడు తనకు శ్రీకృష్ణునితో గల సఖ్యసంబంధమును స్మరించి స్నేహము వలన ఉత్పన్నమైనట్టి పలు సామాన్య వ్యవహారములకు తనను మన్నింపుమని శ్రీకృష్ణుని అర్థించు చున్నాడు. ఆప్తమిత్రునిగా భావించి శ్రీకృష్ణుడు తనకంతయు వివరించినను, శ్రీకృష్ణుడు అట్లు విశ్వరూపమును ధరింపగలడని అంతకు పూర్వము తనకు తెలియనట్లుగా అర్జునుడు అంగీకరించుచున్నాడు. భగవానుని విభూతులను గుర్తింపక, అతనిని "ఓ మిత్రమా!", "ఓ కృష్ణా!", "ఓ యాదవా!" వంటి సంబోధనములచే తానెన్నిమార్లు భగవానుని అగౌరవపరచెనో అర్జునుడు ఎరుగడు. కాని పరమ కృపాళువైన శ్రీకృష్ణుడు అట్టి దివ్యవిభూతి సంపన్నుడైనను అర్జునునితో మిత్రుని రూపమున వ్యవహరించెను. భగవానునికిని మరియు భక్తునికిని నడుమగల దివ్యప్రేమయుక్త సేవాసంబంధము అట్లే యుండును. శ్రీకృష్ణునికి మరియు జీవునికిని నడుమగల సంబంధము నిత్యమైనదనియు మరియు మరచి పోరానిదనియు అర్జునుని స్వభావము నుండి మనము గ్రహింపవచ్చును. అర్జునుడు విశ్వరూప వైభవమును చూచినప్పటికిని, శ్రీకృష్ణునితో తనకు గల సన్నిహిత స్నేహసంబంధమును మరవజాలడు.

**11.43**
**పితాసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**న త్వత్సమో స్త్యభ్యధిక: కుతో న్యో లోకత్రయే ప్యప్రతిమప్రభావ ॥**

## అనువాదము

**స్థావర, జంగమములతో కూడిన ఈ సమస్త సృష్టికి నీవే తండ్రివి. దానికి ముఖ్య పూజనీయుడగు పరమాచార్యుడవు నీవే. నీతో సమానుడెవ్వడును లేడు. నీతో**

**ఏకమైనవాడు గాని మరొకడుండజాలడు. అపరిమిత శక్తి సంపన్నుడవైన ఓ ప్రభూ! అట్టియెడ ముల్లోకములలో నీ కంటెను అధికు డెవడుండును?**

<u>భాష్యము</u>

పుత్రునకు తండ్రి పూజనీయుడైనట్లు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు అందరికిని పూజనీయుడై యున్నాడు. అతడు ఆది యందు బ్రహ్మకు వేదములను ఉపదేశించుట చేతను, ఇప్పుడు అర్జునునకు భగవద్గీతను బోధించుట చేతను, అతడే పరమాచార్యుడు. కనుకనే అతడు ఆదిగురువుగా తెలియబడెను. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యులుగా తెలియబడు వారెవ్వరైనను శ్రీకృష్ణుని నుండి వచ్చుచున్నట్టి గురుశిష్యపరంపర నుండి వచ్చినవారై యుండవలెను. అట్లు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహింపనివాడు ఆధ్యాత్మిక విషయములకు బోధకుడు లేదా ఆధ్యాత్మికాచార్యుడు కాజాలడు.

ఇక్కడ శ్రీకృష్ణభగవానునకు ప్రణామములు అన్ని విధములుగా చేయబడు చున్నవి. అతని మహాత్త్వము అప్రమేయమైనది. భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులందు అతనితో సమానుడు గాని, అతని కంటె అధికుడు గాని మరొకడు లేనందున దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని కంటెను గొప్పవాడు మరొకడుండజాలడు. సర్వులు అతని కంటేను తక్కువవారే. ఎవ్వరును అతనిని అధిగమింపజాలరు. 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (6.8) నందు ఇట్లు తెలుపబడినది :

న తస్య కార్యం కరణం చ విద్యతే ।
న తత్సమాశ్చాభ్యధికశ్చ దృశ్యతే ॥

సామాన్య మానవుని వలెనే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు కూడ దేహమును, ఇంద్రియములును కలిగియుండును. అతనికిని అమరియు అతని ఇంద్రియములు దేహము, మనస్సునకును నడుమ ఎట్టి భేదముండదు. కాని అతనిని గూర్చి పూర్తిగా ఎరుగని మూర్ఖులే అతని ఆత్మ, మనస్సు, హృదయాదు లన్నియును అతని కంటెను భిన్నమని చెప్పుదురు. కాని వాస్తవమునకు శ్రీకృష్ణుడు పరతత్త్వము. కనుకనే అతని కర్మలు, శక్తులు దివ్యములై యుండును. అతనికి మనకున్నట్లు వంటి ఇంద్రియములు లేకున్నను, ఇంద్రియ కార్యము లన్నింటిని అతడు నిర్వహింపగలుగుట చేతనే అతని ఇంద్రియములు అసంపూర్ణములు లేక పరిమితములు కావని తెలుపబడినది. అతని కంటెను అధికులెవ్వరును లేరు. అట్లే, అతనితో సమాను లెవ్వరును లేరు. ప్రతియొక్కరు అతని కంటెను తక్కువైనవారే.

దేవాదిదేవుని జ్ఞానము, శక్తి, కర్మలు అన్నియు దివ్యములైనట్టివి. భగవద్గీత (4.9) నందు చెప్పబడినట్లు :

జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వత: ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సో ర్జున ॥

" శ్రీకృష్ణుని దివ్యమైన జన్మను, కర్మలను సంపూర్ణముగా నెరిగినవాడు దేహమును విడిచిన పిమ్మట అతనిని చేరి ఈ దుఃఖపూరితమైన జగత్తునకు తిరిగిరాడు." కనుక శ్రీకృష్ణుని కర్మలు ఇతరుల కర్మల కంటెను భిన్నములని మనమందరము ఎరుగవలెను. అందులకు శ్రీకృష్ణుడు తెలిపిన నియమములను పాటించుటయే అత్యుత్తమ విధానము. అది మానవుని పరిపూర్ణుని చేయగలదు. భగవానునకు ఎవ్వరును యజమానులు కారని,

ప్రతియొక్కరును అతనికి సేవకులేనని కూడ చెప్పబడినది. 'శ్రీ చైతన్య చరితామృతము'(ఆదిలీల 5.142) నందు "ఏకలే ఈశ్వర కృష్ణ, ఆర సబ భృత్య" – "శ్రీకృష్ణుడొక్కడే దేవాదిదేవుడు. ఇతరులందరును అతనికి సేవకులు" అను ఈ విషయమును సమర్థించుచున్నది. అనగా ప్రతియొక్కరూ అతని ఆజ్ఞను పాటింపవలెను. ఎవ్వరును అతని ఆజ్ఞను నిరాకరింపజాలరు. ప్రతియొక్కరూ అతని పర్యవేక్షణమున అతని నిర్దేశము ననుసరించియే వర్తించు చున్నారు. 'బ్రహ్మ సంహిత' నందు చెప్పబడినట్లు దేవాదిదేవుడే సర్వ కారణములకు కారణుడు.

## 11.44

**తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యు: ప్రియ: ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥**

### అనువాదము

**ప్రభూ! నీవు ప్రతిజీవికిని పూజనీయుడవైన దేవాదిదేవుడవు. కనుకనే నేను నీ యెదుట సాష్టాంగపడి గౌరవపూర్వకముగా ప్రణమిల్లుచు నీ దయ కొరకై అర్థించుచున్నాను. తండ్రి పుత్రుని అవిధేయతను, మిత్రుడు మిత్రుని అమర్యాదను, ప్రియుడు ప్రియురాలి వేళాకోళమును సహించునట్లు నేనేమైన తప్పులను చేసినచో దయతో నన్ను సహింపుము.**

### భాష్యము

కృష్ణభక్తులు శ్రీకృష్ణునితో వివిధరకాల సంబంధములను కలిగి యుందురు. ఒకరు శ్రీకృష్ణుని పుత్రునిగను, మరొకరు భర్తగను, మిత్రునిగను లేదా ప్రభువుగను భావింపవచ్చును. శ్రీకృష్ణునికి అర్జునునికి మధ్యగల సంబంధము సఖ్యముతో కూడినట్టిది. తండ్రి, భర్త, యజమానుడు సహించునట్లుగా శ్రీకృష్ణుడు కూడ సహించుచుండును.

## 11.45

**అదృష్టపూర్వం హృషితో స్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।**
**తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥**

### అనువాదము

**నేనిదివరకెన్నడును చూడనటువంటి ఈ విశ్వరూపమును గాంచిన పిమ్మట నాకు మిగుల సంతోషము కలిగినది. కాని అదే సమయమున మనస్సు భయముతో కలత చెందినది. కనుక ఓ దేవాదిదేవా! జగన్నివాసా! నన్ననుగ్రహించి నీ దేవాదిదేవుని రూపమును తిరిగి నాకు చూపుము.**

### భాష్యము

శ్రీకృష్ణునకు ఆప్త మిత్రుడైనందున అర్జునుడు అతని యెడ ఎల్లప్పుడును సంపూర్ణ విశ్వాసమును కలిగియుండెను. ప్రియమిత్రుడు తన మిత్రుని వైభవమును చూచి సంతసించునట్లుగా అర్జునుడును తన మిత్రుడైన శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనియు

మరియు అద్భుతమైన అట్టి విశ్వరూపమును చూపగలిగెననియు ఎరిగి మిక్కిలి సంతసించెను. కాని అదే సమయమున (ఆ విశ్వరూపమును చూచిన పిమ్మట) తన నిర్మలమైన స్నేహభావముచే తాను దేవాదిదేవుని పట్ల అనేక అపరాధములను చేసితినని కూడ భయమును పొందెను. ఆ విధముగా భయము నొందనవసరము లేకున్నను అతని మనస్సు భయముతో కలత చెందెను. శ్రీకృష్ణుడు ఏ రూపమునైనను దరించగలుగును. కనుకనే శ్రీకృష్ణుని తన నారాయణ రూపమును చూపుమని అర్జునుడు అర్థించుచున్నాడు. భౌతికజగత్తు తాత్కాలికమైనట్లే ప్రస్తుత ఈ విశ్వరూపము కూడ భౌతికము, తాత్కాలికమైనది. కాని వైకుంఠ లోకము లందు మాత్రము అతడు దివ్యమగు చతుర్భుజ నారాయణ రూపమును కలిగియుండును. ఆధ్యాత్మిక జగత్తునందలి అసంఖ్యాకములైన లోకములలో శ్రీకృష్ణుడు తన స్వరూపాంశములతో ప్రతిలోకము నందును వివిధ నామములతో ప్రత్యక్షమై యుండును. కనుక వైకుంఠ లోకములందు వ్యక్తమగు అతని వివిధ రూపములలోని ఒక రూపమును అర్జునుడు చూడగోరెను. ప్రతి వైకుంఠలోకము నందును నారాయణ రూపము చతుర్భుజములను కలిగియుండును. అట్టి చతుర్భుజము లందు శంఖము, చక్రము, గద, పద్మము వంటివాటిని ధరించి యుండును. చతుర్భుజముల యందలి శంఖ, చక్ర, గద, పద్మములను ధరించు వివిధ హస్తములను బట్టి నారాయణ రూపములకు వివిధ నామములు కలుగును. ఈ నారాయణ రూపములన్నియు శ్రీకృష్ణునికి భిన్నములు కావు. కనుక అర్జునుడు అతని చతుర్భుజ రూపమును చూడగోరుచున్నాడు.

## 11.46

**కిరీటినం గదినం చక్రహస్తమిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో భవ విశ్వమూర్తే ॥**

### అనువాదము

**ఓ విశ్వరూపా! సహస్రబాహో! తలపై కిరీటమును, హస్తములలో శంఖమును, చక్రమును, గదను, పద్మములను కలిగియుండెడి నీ చతుర్భుజ రూపమును గాంచగోరుదును. ఆ రూపము నందు నిన్ను దర్శింప వాంఛించుచున్నాను.**

### భాష్యము

'బ్రహ్మ సంహిత' (5.39) నందు : "రామాదిమూర్తిషు కలానియమేన తిష్ఠన్" భగవానుడు నిత్యము వందలకొలది, వేలకొలది రూపములతో కూడి యుండును. రాముడు, నృసింహుడు, నారాయణుడు అనునవి వానిలో ముఖ్య రూపములని చెప్పబడినవి. అట్టి రూపములు అసంఖ్యాకములుగా కలవు. కాని శ్రీకృష్ణుడు తాత్కాలికమైన విశ్వరూపమును ధరించిన ఆదిదేవుడనియు అర్జునుడెరుగును. ఇప్పుడు అతని దివ్యరూపమైన నారాయణ రూపమును చూపుమని ప్రార్థించుచున్నాడు. ఈ శ్లోకమున శ్రీకృష్ణుడు స్వయం భగవానుడనియు, మరియు అతని నుండియే ఇతర రూపములు ఉద్భవించుననియు తెలిపిన శ్రీమద్భాగవతము(1.3.28) నందలి విషయమును నిస్సందేహముగా నిర్ధారించు చున్నది. తన ప్రధాన స్వరూపాంశములైన వివిధరూపములు అతనికి అభిన్నములు. అట్టి అసంఖ్యాక రూపము లన్నింటి యందును, దేనియందైనను అతడు భగవానుడే. ఈ రూపము లన్నింటి యందును అతడు నవకిశోరుని వలె ప్రకాశించుట యనునది దేవాదిదేవుని శాశ్వత ముఖ్యలక్షణము.

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గూర్చి ఎరిగినవాడు భౌతిక జగత్తు యొక్క సమస్త కల్మషముల నుండి శీఘ్రమే ముక్తుడు కాగలడు.

## 11.47

**శ్రీభగవానువాచ**
**మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।**
**తేజోమయం విశ్వమనన్తమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥**

### అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ ప్రియమైన అర్జునా! ప్రసన్నుడనైన నేను నా అంతరంగ శక్తిచే భౌతిక జగత్తు నందలి ఈ దివ్యమగు విశ్వరూపమును నీకు చూపియుంటిని. తేజోమయమును, అనంతమును, ఆద్యమును అగు ఈ రూపమును నీకు ముందెవ్వరును గాంచియుండలేదు.**

### భాష్యము

అర్జునుడు శ్రీకృష్ణుని విశ్వరూపమును చూడగోరెను. కనుక తన భక్తుడైన అర్జునుని పట్ల గల దయతో భగవానుడు సర్వత్రా తేజోమయమును, వైభవములతో కూడిన తన విశ్వరూపమును అతనికి చూపెను. ఈ రూపము సూర్యుని వలె ప్రకాశించుచుండెను. దాని పెక్కు ముఖములు వేగముగా మార్పు చెందుచుండెను. మిత్రుడైన అర్జునుని కోరికను తీర్చుటకొరకై శ్రీకృష్ణుడు ఈ రూపమును చూపియుండెను. తన 'యోగమాయా శక్తి' ద్వారా శ్రీకృష్ణుడు ప్రదర్శించిన ఆ విశ్వరూపము మానవ ఊహకు అతీతమైనది. అర్జునునికి పూర్వమెవ్వరును భగవానుని ఈ విశ్వరూపమును దర్శించి యుండలేదు. కాని భక్తుడైన అర్జునునకు ఈ రూపము శ్రీకృష్ణునిచే చూపబడినందున స్వర్గలోకము లందును మరియు ఊర్ధ్వలోకము(ఆధ్యాత్మికలోకము) లందును గల ఇతర భక్తులందరును దానిని దర్శింపగలిగిరి. వారు దానిని అంతకు పూర్వమెన్నడును చూచి యుండలేదు. కాని అర్జునుని కారణమున వారు కూడ ఇప్పుడు దానిని దర్శింపగలిగిరి. గురుశిష్య పరంపరానుగతులైన భక్తులందరును శ్రీకృష్ణుని కృపచే అర్జునునికి చూపబడిన ఆ విశ్వరూపమును వారును దర్శింపగలిగిరి. శ్రీకృష్ణుడు సంధి రాయబారమునకై వెళ్ళినపుడు దుర్యోధనునకు కూడ ఆ విశ్వరూపమును చూపియుండెనని కొందరు వ్యాఖ్యానించి యుండిరి. దురదృష్టవశాత్తు, దుర్యోధనుడు ఆ సంధి రాయబారమును అంగీకరించలేదు. ఆ సమయమున శ్రీకృష్ణుడు తన విశ్వరూపము లందలి కొన్ని రూపములనే ప్రదర్శించి యుండెను. కాని ఆ రూపములు అర్జునునికి చూపబడిన ఈ రూపము కంటెను భిన్నమైనవి. కనుకనే, ఈ రూపమును పూర్వమెవ్వరును దర్శించి యుండలేదని స్పష్టముగా చెప్పబడినది.

## 11.48

**న వేదయజ్ఞాధ్యయనైర్న దానైర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రై: ।**
**ఏవంరూప: శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥**

## అనువాదము

**ఓ కురుప్రవీరా! ఈ నా విశ్వరూపమును నీకు పూర్వము ఎవ్వరును గాంచి యుండలేదు. ఏలయన, వేదాధ్యయనముచే గాని, యజ్ఞాచరణముచే గాని, దానములచే గాని, పుణ్యకర్మలచే గాని, తీవ్రములైన తపస్సులచే దివ్యదృష్టి**

## భాష్యము

ఈ సందర్భమున దివ్యదృష్టి యననేమో స్పష్టముగా అవగతము చేసికొనవలెను. దివ్యదృష్టిని ఎవరు పొందగలరు? దివ్యమనగా దేవతలకు సంబంధించినది. మానవుడు దేవతల వలె దివ్యత్వమును సాధింపనిదే ఎవ్వరును దివ్యదృష్టిని పొందజాలరు. దేవతలనగా ఎవరు? 'పద్మపురాణము' నందు విష్ణుభక్తులే దేవతలని చెప్పబడినది(విష్ణుభక్త: స్మృతో దైవ). విష్ణువు నందు విశ్వాసము లేని నాస్తికులు కాని, శ్రీకృష్ణుని నిరాకార రూపమునే దేవాదిదేవుడని భావించువారు కాని దివ్యదృష్టిని పొందలేరు. ఒకవంక శ్రీకృష్ణుని నిరసించుచునే, మరొకవంక దివ్యదృష్టిని పొందుట ఎవ్వరికినీ సాధ్యము కాదు. దైవపురుషులు కాకుండ ఎవ్వరును దివ్యదృష్టిని పొందజాలరు. అనగా గలవారే అర్జునుని వలె విశ్వరూపమును గాంచగలుగుదురు.

భగవద్గీత విశ్వరూప వర్ణనను వర్ణించుచున్నది. అర్జునునకు పూర్వము ఎవ్వరికిని ఈ వర్ణనము గూర్చి తెలియకున్నను, ఈ సంఘటన పిదప, ఎవరికైనను విశ్వరూపము అనగానేమిటో కొంత అభిప్రాయము ఏర్పడగలదు. వాస్తవముగా దైవత్వమును కలిగినవారు భగవానుని అట్టి విశ్వరూపమును దర్శింప గలుగుదురు. శ్రీకృష్ణునికి శుద్ధభక్తుడు కానిదే ఎవ్వరును అట్టి దైవస్వభావమును పొందజాలరు. వాస్తవమునకు దైవస్వభావము గలవారు మరియు దివ్యదృష్టి గల భక్తులు భగవానుని విశ్వరూపమును దర్శించుట యందు ఆసక్తిని కనపరచరు. గతశ్లోకము నందు వర్ణింపబడినట్లు, అర్జునుడు శ్రీకృష్ణభగవానుని చతుర్భుజ నారాయణ రూపమును దర్శింపగోరెను. అతడు విశ్వరూపముచే నిజముగా భయమునకు గురయ్యెను.

ఈ శ్లోకమున 'వేదయజ్ఞాధ్యయనై:' వంటి కొన్ని ముఖ్యమైన పదములు గలవు. అవి వేదాధ్యయనమును, యజ్ఞనిర్వహణ విషయములను సూచించును. 'వేద' అను పదము నాలుగు వేదములు అనగా ఋగ్, యజుర్, సామ, అథర్వములు. అష్టాదశపురాణములు, ఉపనిషత్తులు, మరియు వేదాంత సూత్రములు వంటి వివిధ వైదిక గ్రంథములను సూచించును. వాటిని గృహము నందు కాని ఇతర ప్రదేశము లందు కాని మానవుడు అధ్యయనము చేయవచ్చును. అట్లే, యజ్ఞాచరణ విధానమును అధ్యయనము చేయుటకొరకు కల్పసూత్రములు మరియు మీమాంస సూత్రములు వంటి సూత్రములు గలవు. 'దానై:' అను పదము భగవానుని దివ్యమైన ప్రేమయుక్త సేవయందు నెలకొనినట్టి బ్రాహ్మణులకును మరియు వైష్ణవులకును చేయు దానమును సూచించును. అట్లే 'క్రియాభి:' (పుణ్యకార్యములు) అను పదము, అగ్నిహోత్రకర్మలను మరియు వివిధ వర్ణముల వారికి నిర్దేశింపబడిన ధర్మములను సూచించును. స్వచ్ఛందముగా దైహిక బాధలను అంగీకరించుట 'తపస్సు' యనబడును. మానవుడు ఇట్టి తపస్సు, దానములను చేసినను, వేదాధ్యయనము వంటివానిని నిర్వహించినను అర్జునుని వలె భక్తుడు గానిచో విశ్వరూపమును దర్శింపలేరు. నిరాకారవాదులు కూడా తాము భగవానుని

విశ్వరూపమును దర్శించుచున్నట్లుగా ఊహించుకొను చుందురు. కాని నిరాకారవాదులు భక్తులు కారని భగవద్గీత ద్వారా మనకు తెలియుచున్నది. కనుకనే వారు భగవానుని విశ్వరూపమును దర్శింపలేరు.

సాధారణ మానవులే వారు అవతారమనుచు సత్యవిరుద్ధముగా ప్రచారము చేయుచు అవతారములను సృష్టించు వ్యక్తులు అనేకులు కలరు. కాని, వాస్తవమునకు ఇదంతయు మూర్ఖత్వమే. కనుకనే భగవద్గీతా సిద్ధాంతములను మనము తప్పక అనుసరించవలెను. అట్లు చేయనిచో, సంపూర్ణమైన ఆధ్యాత్మిక జ్ఞానమును పొందుట సాధ్యము కాదు. భగవద్విజ్ఞాన అధ్యయనము నందు భగవద్గీత ప్రాథమిక గ్రంథముగా పరిగణింపబడినను, అది సంపూర్ణమగుటచే ఈ శాస్త్రము ఏది ఎట్టిదో విచక్షణ చేయగలిగిన జ్ఞానమును మానవునకు కలిగింపగలదు. మిథ్యావతారముల ననుసరించువారు కూడ తాము భగవానుని దివ్యావతారములైన విశ్వరూపమును దర్శించితిమని చెప్పినను అది ఎన్నటికిని ఆమోదయోగ్యము కాదు. ఎందుకనగా, శ్రీకృష్ణభగవానునికి భక్తులు కానిదే ఎవ్వరును దేవాదిదేవుని ఆ విశ్వరూపమును దర్శింపజాలరని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. కనుకనే మానవుడు మొట్టమొదట శ్రీకృష్ణునికి శుద్ధభక్తుడు కావలెను. అప్పుడే వారు తాము దర్శించిన అట్టి విశ్వరూపమును చూపగలుగుదునని ప్రకటింపవచ్చును. కృష్ణభక్తులు ఎన్నడును అసత్యావతారములను గాని, అసత్యావతారముల ననుసరించు అనుచరులను గాని అంగీకరింపజాలరు.

## 11.49

**మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్ ।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥**

### అనువాదము

**నా ఈ భయంకరమైన రూపమును చూచి నీవు భ్రాంతుడవును, కలత నొందినవాడవు అయితివి. అదియంతయు ఇపుడు అంతరించును గాక! ఓ భక్తా! అన్ని కలతల నుండియు విముక్తుడవు కమ్ము. నీవు కోరిన రూపమును ప్రశాంత మనస్సుతో ఇప్పుడు గాంచుము.**

### భాష్యము

భగవద్గీత(1.33) ఆరంభము నందు పూజ్యుడు పితామహుడైన భీష్ముని మరియు గురువైన ద్రోణుని వధించుట పట్ల అర్జునుడు కలత చెందెను. కాని పితామహుని వధించుట యందు భయము నొందనవసరము లేదని శ్రీకృష్ణుడు అతనికి తెలిపెను. ధృతరాష్ట్రుని పుత్రులు కౌరవసభలో ద్రౌపదిని వివస్త్రను చేయుటకు ప్రయత్నించినపుడు భీష్మద్రోణులు మౌనము వహించిరి. ధర్మనిర్వహణ యందు అట్టి నిర్లక్ష్యమునకు కారణముగా అట్టివారిని వధించి తీరవలెను. వారి అధర్మపూరితమైన చర్యల వలన వారిదివరకే సంహరింపబడిరని తెలియజేయుటకే శ్రీకృష్ణుడు అర్జునునకు విశ్వరూపమును చూపెను. సాధారణముగా భక్తులెప్పుడును శాంతులగుటచే అట్టి భయంకర కార్యములను చేయజాలరు. కనుక అర్జునునకు విశ్వరూపము చూపబడినది. విశ్వరూప ప్రదర్శన ప్రయోజనము సిద్ధించి యున్నందున అర్జునుడు చతుర్భుజ రూపమును గాంచగోరగా, శ్రీకృష్ణుడు ఆ రూపమును అతనికి చూపెను. ప్రేమభావముల పరస్పర వినిమయమునకు అవకాశము లేనందున భగవానుని విశ్వరూపము పట్ల

భక్తుడు ఎట్టి అధికాసక్తిని కలిగియుండడు. అతడు కేవలము దేవాదిదేవుని చతుర్భుజ రూపమునకు భక్తిపూర్వకమైన నమస్సులను అర్పింపవలెనని గాని లేక ద్విభుజ కృష్ణరూపమును గాంచవలెనని గాని కోరుదురు. తద్వారా అతడు దేవాదిదేవునితో ప్రేమయుక్త సేవయందు భావవినిమయము కావింపగలడు.

## 11.50

**సంజయ ఉవాచ**

**ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా స్వకం రూపం దర్శయామాస భూయ: ।**
**ఆశ్వాసయామాస చ భీతమేనం భూత్వా పున: సౌమ్యవపుర్మహాత్మా ॥**

### అనువాదము

**సంజయుడు ధృతరాష్ట్రునితో ఇట్లు పలికెను : దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు ఆ విధముగా అర్జుననితో పలికి తన చతుర్భుజ రూపమును తిరిగి ప్రదర్శించెను. చివరికి భీతుడైన అర్జుననకు ఆ విధముగా ఓదార్చుచు అంత్యమున తన ప్రసన్న ద్విభుజ రూపమును చూపెను.**

### భాష్యము

శ్రీకృష్ణుడు దేవకీవసుదేవులకు పుత్రుడుగా అవతరించునప్పుడు తొలుత చతుర్భుజ నారాయణ రూపమున దర్శనమిచ్చెను. కాని తల్లిదండ్రులు ప్రార్థింపగనే ఆతడు తిరిగి సామాన్యశిశువుగా మార్పునొందెను. అదేవిధముగా అర్జునుడు తన చతుర్భుజ రూపమును చూచుట యందు అధికాసక్తిని కలిగియుండడని శ్రీకృష్ణుడెరుగును. కాని అర్జునుడు దానిని చూడగోరుటచే శ్రీకృష్ణుడు తొలుత తన చతుర్భుజ రూపమును చూపి పిదప తన సహజ ద్విభుజ రూపమును ప్రదర్శించెను. ఈ శ్లోకమున 'సౌమ్యవపు:' అను పదము మిక్కిలి ప్రధానమైనది. 'సౌమ్యవపు:' అనగా మిక్కిలి సుందరమైన రూపము గలవాడని అర్థము. శ్రీకృష్ణుడు ధరిత్రిపై ప్రత్యక్షమైనపుడు, ప్రతియొక్కరు అతని సుందర రూపముచే ఆకర్షింపబడిరి. శ్రీకృష్ణుడు విశ్వనిర్దేశకుడగుటచే తన భక్తుడైన అర్జునుని భయమును తొలగించి, అతనికి తిరిగి తన సుందర ప్రసన్న రూపమును చూపెను. 'బ్రహ్మ సంహిత'(5.38) యందు : "ప్రేమాంజనచ్ఛురితభక్తివిలోచనేన"-"ప్రేమ అను అంజమును(కాటుకను) కనులకు పూసుకొనినవాడే శ్రీకృష్ణభగవానుని దివ్యసుందర రూపమును చూడగలడు" అని చెప్పబడినది.

## 11.51

**అర్జున ఉవాచ**

**దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।**
**ఇదానీమస్మి సంవృత్త: సచేతా: ప్రకృతిం గత: ॥**

### అనువాదము

**ఆ విధముగా అర్జునుడు శ్రీకృష్ణుని ఆద్యరూపమును గాంచినంతనే ఇట్లు పలికెను : ఓ జనార్దనా! అత్యంత సుందరమైన ఈ నీ మానవరూపమును గాంచి శాంతచిత్తుడనై నా సహజ స్వభావమును పొందితిని.**

## భాష్యము

ఇక్కడ 'మానుషం రూపం' అను పదములు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు సహజముగా ద్విభుజుడను విషయమును స్పష్టముగా సూచించుచున్నవి. శ్రీకృష్ణుడు సామాన్య మానవుడేనను భావనలో ఆ దేవాదిదేవుని అపహాస్యము చేయువారు అతని దివ్యస్వభావమును ఎరుగరని ఇక్కడ నిరూపింపబడినది. శ్రీకృష్ణుడు సామాన్య మానవుడైనచో తొలుత విశ్వరూపమును చూపుట గాని, ఆ పిదప చతుర్భుజ నారాయణ రూపమును చూపుటకు గాని అతనికెట్లు సాధ్యపడును? కనుక, శ్రీకృష్ణుడు సామాన్య మానవుడేనని భావించుచు, నిరాకారబ్రహ్మమే శ్రీకృష్ణుని లోపలి నుండి పలుకుచున్నదని వ్యాఖ్యానించుచు పాఠకుని తప్పుద్రోవ పట్టించువారు వాస్తవముగా జనులకు గొప్ప అన్యాయము చేసినవారగుదురు. ఈ విషయమే భగవద్గీత యందు ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. శ్రీకృష్ణుడు వాస్తవముగా తన విశ్వరూపమును మరియు చతుర్భుజ నారాయణ రూపమును కూడ ప్రదర్శించెను. కనుక అతడెట్లు సామాన్య మానవుడు కాగలడు? సత్యదర్శి యైనందున శుద్ధభక్తుడు భగవద్గీతపై గల అట్టి తప్పుడు వ్యాఖ్యానములచే కలత నొందడు. భగవద్గీత యందలి మూలశ్లోకములు సూర్యుని వలె సుస్పష్టములుగా నున్నవి. వానిని అర్థము చేసికొనుటకు మూర్ఖపు వ్యాఖ్యాతల ఎట్టి దీపపు కాంతియు వాటికి అవసరము లేదు.

## 11.52

**శ్రీభగవానువాచ**
**సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణ: ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ప్రియమైన ఓ అర్జునా! నీ విపుడు దర్శించుచున్న నా ఈ రూపము గాంచుటకు మిక్కిలి దుర్లభమైనది. మిక్కిలి ప్రియమైన ఈ రూపమును దర్శించు నవకాశమునకై దేవతలు కూడ నిత్యము వేచియుందురు.**

## భాష్యము

ఈ అధ్యాయము నందలి నలుబది ఎనిమిదవ శ్లోకమున శ్రీకృష్ణభగవానుడు తన విశ్వరూప ప్రదర్శనమును ముగించి, అట్టి తన విశ్వరూపము అనేకమైన పుణ్యకార్యములు, యజ్ఞాదులచే కూడ దర్శింప సాధ్యము కానిదని అర్జునునకు తెలిపెను. ఇక్కడ 'సుదుర్దర్శమ్' అను పదము శ్రీకృష్ణుని ద్విభుజ రూపము మరింత రహస్యమైనదని సూచించుచున్నది. తపస్సు, వేదాధ్యయనము, తాత్త్విక చింతనము లేదా కల్పనములనెడి వివిధ కార్యములతో స్వల్పముగా భక్తియుక్త సేవను కూడ మిళితము చేయుట ద్వారా ఎవ్వరైనను శ్రీకృష్ణుని విశ్వరూపమును దర్శింప గలుగుదురు. కాని ఇదివరకే వివరింపబడినట్లు, భక్తిలేకుండా మాత్రము అది సాధ్యము కాదు. అట్టి విశ్వరూప సందర్శనమునకు అతీతమైన శ్రీకృష్ణుని ద్విభుజ రూపమును దర్శించుట బ్రహ్మ, శివుడు వంటి దేవతలకు కూడ మిక్కిలి దుర్లభము. సదా వారు అతనిని దర్శింప గోరుదురనుటకు శ్రీమద్భాగవతము నందు మనకు ఆధారములు లభించును. శ్రీకృష్ణుడు, తన తల్లియైన దేవకీ గర్భము నందున్నప్పుడు, స్వర్గము నుండి దేవతలందరును, ఆ అద్భుతమును చూడవచ్చి, భగవానుడు దృష్టికి గోచరింపకున్నను,

అతనికి అనేక విధములైన ప్రార్థనలను అర్పించి, అతనిని దర్శించుటకు వేచియుండిరి. కాని అజ్ఞాని శ్రీకృష్ణుడు సాధారణ మానవుడేనని భావించి, అతనిని నిరసించుచు, దేవాదిదేవునికి కాకుండ అంతర ముందున్న ఏదియో నిరాకార తత్త్వమును గౌరవింప దలచును. కాని ఇవియన్నియును మూర్ఖత్వపు లక్షణములు. శ్రీకృష్ణుని ద్విభుజరూపమును గాంచుటకు బ్రహ్మ, శివుడు వంటి దేవతలు కూడ నిత్యకాంక్షులై యుందురు.

భగవద్గీత(9.11) నందు ఇట్లు నిర్ధారింపబడినది : "అవజానన్తి మాం మూఢా: మానుషీం తనుమాశ్రితమ్" – తనను అపహాస్యము చేయు మూర్ఖులకు శ్రీకృష్ణుడు దర్శనీయుడు కాడు. 'బ్రహ్మ సంహిత' యందు నిర్ధారింపబడినట్లు మరియు భగవద్గీత యందు శ్రీకృష్ణునిచే స్వయముగా తెలుపబడినట్లు, శ్రీకృష్ణుని దేహము పూర్తిగా దివ్యము మరియు సచ్చిదానందమయమైనట్టిది. అతని దేహము ఎన్నడును భౌతిక దేహము వంటిది కాదు. కాని భౌతిక దృష్టితో భగవద్గీతను లేక అట్టి ఇతర వైదిక గ్రంథములను పఠించుచు శ్రీకృష్ణుని గూర్చి అధ్యయనము చేయగోరు కొందరికి అతడు ఎల్లప్పుడును అర్థము గాని సమస్యగానే మిగులును. ఈ విధమైన భౌతిక విధానమును అవలంబించు వారికి శ్రీకృష్ణుడు గొప్ప చారిత్రిక పురుషుడు, గొప్ప తత్త్వవేత్త మాత్రమే. శ్రీకృష్ణుడు అత్యంత శక్తిమంతుడైనను సామాన్య మానవుడేననియు, అతడు భౌతిక దేహమును గ్రహింపవలసి వచ్చెననియు వారు భావింతురు. చివరికి వారి భావనలో పరతత్త్వము అనగా నిరాకారము. ఆ నిరాకారతత్త్వము నుండియే అతడు భౌతిక ప్రకృతికి సంబంధించిన సాకారరూపమును దాల్చెనని వారు భావింతురు. దేవాదిదేవుని గూర్చి మాయావాదులు చేయు భౌతిక పరిగణనలో ఇదియొకటి. అతనికి సంబంధించినది జ్ఞానాన్వేషణముకై ప్రయత్నించు వారు కూడ శ్రీకృష్ణుని గూర్చి తాత్త్విక కల్పనలను చేయుచు, దేవాదిదేవుడు విశ్వరూపము కంటెను తక్కువ ప్రాధాన్యము గలవాడని భావింతురు. కనుకనే అర్జునునకు చూపబడిన విశ్వరూపము అతని స్వయంరూపము కంటెను మరింత ప్రధానమైనదని కొందరు భావింతురు. వారి ఉద్దేశ్యము ననుసరించి పరమపురుషుని మానవ రూపము కేవలము ఊహాత్మకమైనట్టిది. చివరికి వారు పరతత్త్వము నిరాకారమనియే విశ్వసింతురు. కాని ప్రామాణికాచార్యుల నుండి శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయు ఆధ్యాత్మిక విధానము భగవద్గీత(4.34) యందు వివరింపబడినది. అదియే నిజమైన వైదిక విధానము. నిజముగా అట్టి వైదిక మార్గము నందున్న వారు ప్రామాణికాధికారుల నుండియే శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుదురు. శ్రీకృష్ణుని గూర్చి మరల మరల శ్రవణము చేయుట ద్వారా వారికి శ్రీకృష్ణుడు ప్రియమగును. మనము పలుమార్లు ఇదివరకే చర్చించినట్లుగా, శ్రీకృష్ణుడు తన 'యోగమాయా' శక్తిచే కప్పబడి యున్నందున సర్వులకు దర్శనీయుడు గాని, విదితుడు గాని కాజాలడు. ఎవరికైతే అతడు తనను ప్రకటింప దలచుకొనునో వారే అతనిని గాంచగలుగుదురు. వేదవాఙ్మయము నందు ఈ విషయము నిర్ధారింపబడినది. శరణాగతి చేసికొనినవానికే పరతత్త్వము వాస్తవముగా అవగతమగును. కృష్ణచైతన్యవంతుడైన శుద్ధభక్తుడు సదా శ్రీకృష్ణభగవానునికి భక్తియుక్త సేవచేయుట చేతను, దివ్యదృష్టిని పొంది, శ్రీకృష్ణుడే స్వయముగా వ్యక్తమగుట చేతను, అతనిని గాంచగలడు. అట్టిది దేవతలకు కూడ సాధ్యము కాదు. కనుక వారికి కూడ శ్రీకృష్ణుని అర్థము చేసుకొనుట దుర్లభము. కనుకనే ఉత్తములైన దేవతలు నిత్యము శ్రీకృష్ణుని ద్విభుజ రూపమును దర్శించుటను కాంక్షింతురు. సారాంశమేమనగా, శ్రీకృష్ణుని విశ్వరూపమును దర్శించుట మిక్కిలి దుర్లభము మరియు ఎవరికిని సాధ్యము కానిదైనను, అతని స్వయం స్వరూపమైన శ్యామసుందర రూపమును అవగాహన చేసుకొనుట అంతకంటెను దుర్లభము.

**11.53**
**నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।**
**శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥**

**అనువాదము**

**దివ్య చక్షువులతో నీవు గాంచుచున్న ఈ రూపము కేవలము వేదాధ్యయనముచే గాని, తీవ్ర తపశ్చర్యలచే గాని, దానముచే గాని, పూజలచే గాని అవగతము కాదు. మానవుడు నన్ను యథార్థముగా గాంచుటకు ఇవియన్నియును సాధనములు కాజాలవు.**

**భాష్యము**

శ్రీకృష్ణుడు తన తల్లిదండ్రులైన దేవకీవసుదేవులకు తొలుత చతుర్భుజునిగా దర్శనమిచ్చి పిదప ద్విభుజ రూపమునకు మార్పుచెందెను. నాస్తికులైన వారికి లేదా భక్తియుక్త సేవను అంగీకరింపని వారికి ఈ రహస్యమును అవగాహన చేసుకొనుట చాలా కష్టము. వేదవాఙ్మయము కేవలము వ్యాకరణ జ్ఞానరూపమున లేదా విద్యాయోగ్యతల రూపమున అధ్యయనము చేయు పండితులకు శ్రీకృష్ణుని అవగతము చేసుకొనుట సాధ్యపడదు. అట్లే, బాహ్యముగా పూజలు చేయుటకు మందిరములకు వెళ్ళువారికి కూడ అతనిని అవగాహన చేసుకొనుట కష్టమే. వారు మందిరములను దర్శించుకొనినను యథార్థ రూపమున శ్రీకృష్ణుని ఎరుగజాలరు. రాబోవు శ్లోకమున శ్రీకృష్ణునిచే స్వయముగా వివరింప బడినట్లు, భక్తియుక్త సేవ మార్గము చేతనే శ్రీకృష్ణుడు యథార్థముగా అవగతము కాగలడు.

**11.54**
**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధో ఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప ॥**

**అనువాదము**

**ఓ ప్రియమైన అర్జునా! కేవలము అనన్యమైన భక్తియుక్త సేవచేతనే నేను యథార్థముగా నీ ఎదుట నిలిచినరీతి తెలియబడగలను మరియు ప్రత్యక్షముగా దర్శింపనగుదును. ఈ విధముగా మాత్రమే నీవు నా రహస్యములను అవగాహన చేసికొనగలుగుదువు.**

**భాష్యము**

అనన్యమైన భక్తియుక్త సేవా విధానము చేతనే శ్రీకృష్ణభగవానుడు అవగతము కాగలడు. మానసికకల్పనా పద్ధతుల ద్వారా భగవద్గీతను అవగాహన చేసుకొనుటకు యత్నించు అప్రమాణిక వ్యాఖ్యాతలు తాము కేవలము కాలమును వృథాపరచు చున్నామని అవగతము చేసుకొనునట్లుగా ఈ విషయమును శ్రీకృష్ణభగవానుడు ఈ శ్లోకమున స్పష్టముగా వివరించుచున్నాడు. శ్రీకృష్ణుని లేదా శ్రీకృష్ణుడు ఏ విధముగా చతుర్భుజ రూపముతో తల్లిదండ్రుల ఎదుట ప్రత్యక్షమై పిదప ద్విభుజ రూపమునకు మారెనను విషయమును ఎవ్వరును ఎరుగజాలరు. ఈ విషయములు వేదాధ్యయనముచే గాని, తత్త్వవిచారములచే గాని అవగాహన చేసికొనుట దుర్లభము. కనుకనే ఎవ్వరును అతనిని

చూడలేరనియు లేదా ఈ విషయములను అవగాహన చేసికొనజాలరనియు ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. అయినను వైదిక గ్రంథములందు మిక్కిలి అనుభవము గలవారు మాత్రము అట్టిగ్రంథముల ద్వారా అతనిని గూర్చి అనేక విధములుగా ఎరుగ గలుగుదురు. భక్తియుక్త సేవ నొనర్చుటకు ప్రామాణిక శాస్త్రములందు నియమ నిబంధనలు అనేకము గలవు. ఎవరైనను శ్రీకృష్ణభగవానుని అవగతము చేసికొన గోరినచో, మానవుడు ప్రామాణిక గ్రంథము లందు వర్ణింపబడిన నియమ నిబంధనలను తప్పక అనుసరింపవలెను. అట్టి నియమముల ననుసరించి వారు తపస్సు చేయవచ్చును. ఉదాహరణకు, తీవ్రమైన తపస్సును ఆచరించుటకు అతడు కృష్ణాష్టమి రోజున మరియు మాసమందలి శుక్లపక్ష, కృష్ణపక్ష ఏకాదశి పుణ్యదినములందు ఉపవాసము చేయవలెను. అట్లే కృష్ణతత్త్వమును గాని కృష్ణచైతన్యమును గాని ప్రపంచమంతటను ప్రచారము చేయుటకై శ్రీకృష్ణుని భక్తియుక్త సేవ యందు నెలకొనిన కృష్ణభక్తులకు దానము చేయవలెను. కృష్ణభక్తిని సర్వత్రా ప్రచారము చేయుచున్న కృష్ణచైతన్య సంఘము మానవాళికి ఒక అద్వితీయ వరప్రసాదము. అట్టి అత్యంత దుర్లభమైన కృష్ణప్రేమను శ్రీ చైతన్య మహాప్రభువు ఉదారముగా సర్వులకు పంచిపెట్టినందుననే, అతనిని మహావదాన్యాయ అవతారమని శ్రీల రూపగోస్వామి ప్రశంసించి యుండెను. కనుక ఎవరైనను కృష్ణచైతన్యమును ప్రచారము చేయుట యందు నెలకొనియున్న భక్తులకు దానమిచ్చినచో అట్టి దానము ప్రపంచము నందలి అత్యుత్తమమైన దానము కాగలదు. ఒకవేళ ఎవరైనను నిర్దేశానుసారము మందిరము నందు(విష్ణువు లేదా శ్రీకృష్ణుని అర్చావిగ్రహములు కలిగిన మందిరములు ఎన్నోగలవు) అర్చన పూజలను కావించుట ద్వారా, దేవాదిదేవునికి చేయు సేవ మరియు ప్రణామముల నర్పించుట ద్వారా పురోగతిని సాధించుటకు ఒక అవకాశమేర్పడును. భక్తియోగ యందు ఆరంభదశలో నున్నవారికి మందిరములోని అర్చనాపూజలు ఎంతో అవసరము. ఈ విషయము వైదిక గ్రంథమైన 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (6.23) నందు ఇట్లు నిర్ధారింపబడినది :

యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ ।
తస్యైతే కథితా హ్యర్థా: ప్రకాశన్తే మహాత్మన:॥

"దేవాదిదేవుని యందు అచంచలమైన భక్తిని కలిగి, తనను నిర్దేశించు గురువు నందు అచంచలమైన శ్రద్ధను కలిగినవాడు, ఆత్మజ్ఞానముచే దేవాదిదేవుని దర్శింపగలదు." అంతేగాని, ఎవ్వరును మానసిక కల్పనలచే శ్రీకృష్ణభగవానుని ఎరుగజాలరు. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని ఆధ్వర్యమున ప్రత్యక్ష శిక్షణము పొందినవారికి శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట సాధ్యపడును. శ్రీకృష్ణుని అవగాహనను ఆరంభించుటయు అతనికి సాధ్యపడును. శ్రీకృష్ణుని అవగాహన చేసికొనుటకు మరి యే ఇతర మార్గములను అవలంబింప రాదనియు, బోధింప రాదనియు లేదా విజయవంతము కాజాలవనియు సూచించుటకే 'తు' అను పదము ఇక్కడ ప్రత్యేకముగా వాడబడినది.

శ్రీకృష్ణుని స్వయం రూపములైన ద్విభుజ, చతుర్భుజ రూపములు 'సుదుర్దర్శమ్' (చూచుటకు కష్టతరమైనవి) గా వర్ణింపబడెను. అవి అర్జునునకు చూపిన తాత్కాలిక విశ్వరూపమునకు పూర్తిగా భిన్నమైనవి. విశ్వరూపమును చతుర్భుజ నారాయణుని రూపము, శ్రీకృష్ణుని ద్విభుజ రూపములు శాశ్వతములు మరియు దివ్యము లైనట్టివి. అర్జునునకు చూపబడిన విశ్వరూపము తాత్కాలికమైనట్టిది. 'త్వదన్యేన న దృష్ట పూర్వమ్' (శ్లోకము 47) అను పదము, ఆ మరెవరును దర్శించ లేదనియు

సూచించుచున్నది. భక్తులకు దానిని చూపనవసరము లేదనియు అది తెలుపుచున్నది. కాని అర్జునుని అభ్యర్థనపై శ్రీకృష్ణుడు ఆ రూపమును చూపెను. తద్ద్వారా భవిష్యత్తు నందు ఎవరైనను ఎప్పుడైనను తాను భగవానుని అవతారమని ప్రకటించినచో జనులు అతనిని విశ్వరూపమును చూపుమని ప్రశ్నించుటకు అవకాశము లభించినది.

గతశ్లోకము నందు మరల మరల వాడబడిన 'న' అను పదము సంప్రదాయ సిద్ధముగా వైదిక విద్యను అభ్యసించుట ద్వారా కలిగిన యోగ్యతలచే ఎవ్వరును గర్వింపరాదని సూచించుచున్నది. ప్రతియొక్కరు శ్రీకృష్ణుని భక్తియుక్త సేవను అవలంబింపవలెను. అటుపిమ్మటనే వారు భగవద్గీతకు వ్యాఖ్యానములను రచించుటకు యత్నింపవలెను.

శ్రీకృష్ణుడు విశ్వరూపము నుండి చతుర్భుజ నారాయణుని రూపమునకును, పిదప తన సహజ ద్విభుజరూపమునకు మార్పుచెందును. దీనిని బట్టి వైదిక గ్రంథములందు పేర్కొనబడిన చతుర్భుజ రూపములును మరియు ఇతర రూపము లన్నియును మూలమైన ద్విభుజ శ్రీకృష్ణుని రూపము నుండియే ప్రభవించినవని స్పష్టమగుచున్నది. ఈ రూపముల కన్నింటికిని అతడే మూలము. శ్రీకృష్ణుడు ఈ రూపము లన్నింటికి మూలమనినచో నిరాకార భావమును గూర్చి వేరుగా చెప్పనవసర మేమున్నది. చతుర్భుజ రూపములలోని మహావిష్ణువు రూపము కూడ (మహావిష్ణువుగా తెలియబడు అతడు కారణసముద్రము నందు శయనించి యుండగా, శ్వాస నుండి అసంఖ్యాక విశ్వములు బయటకు వెల్వడుతు తిరిగి లోనికి ప్రవేశించు చుండును) ఆ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని స్వాంశయేనని స్పష్టముగా చెప్పబడినది. 'బ్రహ్మ సంహిత'(5.48) నందు ఇట్లు తెలుపబడినది :

యస్యైకని:శ్వసిత కాలమథావలంబ్య
జీవన్తి లోమవిలజా జగదండనాథా: ।
విష్ణుర్మహాన్ స ఇహ యస్య కళావిశేషో
గోవిందమాదిపురుషం తమహం భజామి ॥

"కేవలము ఉచ్ఛ్వాసనిశ్వాసముల చేతనే, ఎవ్వని యందు అసంఖ్యాకములైన విశ్వములు ప్రవేశించి, తిరిగి అతని నుండియే బయల్వెడలు చున్నవో, అట్టి మహావిష్ణువు శ్రీకృష్ణుని స్వరూపాంశమే. కనుకనే సర్వకారణ కారణుడైన ఆ గోవిందుని(శ్రీకృష్ణుని) నేను భజింతును." కనుకనే ప్రతియొక్కరు శ్రీకృష్ణుని నిత్య జ్ఞానానందపూర్ణుడైన ఆదిదేవునిగా అర్చింపవలెను. భగవద్గీత యందు నిర్ధారింప బడినట్లు, శ్రీకృష్ణభగవానుడే సమస్త విష్ణురూపములకును, సర్వావతారములకును మూలాధారము. అతడే ఆద్యుడైన ఆదిదేవుడు.

వైదిక గ్రంథము 'గోపాలతాపన్యుపనిషత్తు'(1.1) నందు ఈ విధముగా గోచరించుచున్నది :

సచ్చిదానందరూపాయ కృష్ణాయాక్లిష్టకారిణే ।
నమో వేదాన్తవేద్యాయ గురవే బుద్ధిసాక్షిణే ॥

"సచ్చిదానందరూపుడైన శ్రీకృష్ణునికి నేను ప్రణామముల నర్పింతును. అతనిని అవగాహన చేసికొనుట యనగా వేదములను అవగాహన చేసుకొనుటయేనని భావము. కనుక అతడు ఆది గురువగుట చేతను, నేను ఆ దేవాదిదేవునకు ప్రణామముల

నర్పింతును." తరువాత : "కృష్ణో వై పరమం దైవతమ్"- "శ్రీకృష్ణుడే దేవాదిదేవుడు." (గోపాలతాపన్యుపనిషత్తు 1.3) ఇంకను ఆ ఉపనిషత్తు నందే : "ఏకో వశీ సర్వగ: కృష్ణ ఈఢ్య:"-"శ్రీకృష్ణుడొక్కడే దేవాదిదేవుడు మరియు అతడే పూజనీయుడు." "ఏకో పి సన్ బహుధా యో వభాతి"-"శ్రీకృష్ణుడొక్కడైనను అసంఖ్యాక రూపములతోను, విస్తృతావతారములతోను వ్యక్తమగు చున్నాడనియు తెలుపబడినది."(గోపాలతాపన్యుపనిషత్తు 1.21) 'బ్రహ్మ సంహిత' (5.1) ఇట్లు చెప్పు చున్నది :

ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానందవిగ్రహ: ।
అనాదిరాదిర్గోవింద: సర్వకారణకారణమ్ ॥
"దేవాదిదేవుడు సచ్చిదానంద విగ్రహుడైన శ్రీకృష్ణుడు. అతడు సర్వమునకు
ఆద్యుదగుటచే ఆదిరహితుడు, సర్వకారణకారణుడు."

'విష్ణుపురాణము' (4.11.2) నందు ఇట్లు చెప్పబడినది : "యత్రావతీర్ణం కృష్ణాఖ్యం పరం బ్రహ్మ నరాకృతి"-"పరబ్రహ్మము రూపసహితము. ఆ పరబ్రహ్మ తత్త్వమే శ్రీకృష్ణుడు. అతడు కొన్నిమార్లు భూమిపై అవతరించు చుండును." అట్లే శ్రీమద్భాగవతము యందు దేవాదిదేవుని పలు అవతారములు వర్ణనలు గలవు. ఈ అవతార పట్టిక నందు శ్రీకృష్ణుని నామము కూడ కనిపించును. కాని శ్రీకృష్ణుడు అవతారము కాదనియు, ఆద్యుడైన దేవాదిదేవుదనియు దానియందు పిదప పేర్కొనబడినది : "ఏతే చాంశకలా: పుంస: కృష్ణస్తు భగవాన్ స్వయమ్." (భాగ.1.3.28)

అట్లే భగవద్గీత(7,7) నందు శ్రీకృష్ణభగవానుడు : "మత్త: పరతరం నాన్యత్"-"దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునిగా నా రూపము కంటెను పరమైన దేదియు లేదు" అని చెప్పియున్నాడు. భగవద్గీత(10.2) నందు : "అహమాదిర్హి దేవానామ్" –"నేనే సర్వదేవతలకు మూలమును" అని చెప్పియున్నాడు. శ్రీకృష్ణుని నుండి భగవద్గీతను అవగాహన చేసికొనిన పిమ్మట అర్జునుడు కూడ ఈ విషయమునే గీత (10.12) యందు : "పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్" – "నీవే దేవాదిదేవుదనియు, పరతత్త్వమనియు, సర్వమునకు ఆధారుదవనియు నేనిపుడు పూర్తిగా అవగాహన చేసుకొనగలిగితిని" అని నిర్ధారించెను. కనుకనే, శ్రీకృష్ణుడు, అర్జునునకు చూపిన విశ్వరూపము దేవాదిదేవుని మూలరూపము కాదు. కృష్ణరూపమే మూలమైనది. భగవానుని పట్ల ప్రేమ మరియు భక్తిలేనివారికి శ్రద్ధను కలిగించుటకే వేలకొలది శిరస్సులతోను, హస్తములతోను కూడిన విశ్వరూపము ప్రకటింపబడినది.

వివిధ దివ్యసంబంధముల (రసము) ద్వారా భగవానుని పట్ల ప్రేమ భావమును కలిగియున్న శుద్ధభక్తులకు విశ్వరూపమెన్నడును ఆకర్షణీయము కాదు. దేవాదిదేవుడు, మూలరూపమైన శ్రీకృష్ణరూపముల యందే దివ్యప్రేమ వినిమయము కావించును. కనుక సఖ్యరసమున శ్రీకృష్ణునితో సన్నిహిత సంబంధమును కలిగియున్న అర్జునునకు ఆ విశ్వరూప ప్రదర్శనము ఏమాత్రము ప్రీతిని కలిగింపకుండెను. పైగా అది భయంకరముగా కూడ నుండెను. శ్రీకృష్ణుని నిత్య సన్నిహిత సహచరుడైన అర్జునుడు దివ్యచక్షువులను కలిగి యున్నందున అతడు సామాన్య మానవుడు కాదు. కనుకనే అతడు విశ్వరూపముచే ఆకర్షింప బడలేదు. కామ్యకర్మలచే తమనుతాము ఉద్ధరించు కొనదలచు వారికి ఆ రూపము అద్భుతముగా తోచవచ్చునేమో కాని, భక్తియుక్త సేవ యందు నెలకొనిన భక్తులకు శ్రీకృష్ణుని ద్విభుజరూపమే మిక్కిలి ప్రియమైనది.

**11.55**
**మత్కర్మకృన్మత్పరమో మద్భక్త: సఙ్గవర్జిత: ।**
**నిర్వైర: సర్వభూతేషు య: స మామేతి పాణ్డవ ॥**

**<u>అనువాదము</u>**

**ఓ ప్రియమైన అర్జునా! నా శుద్ధభక్తియుక్తసేవ యందు నెలకొని యందు వాడును, కామ్యకర్మలు, మనోకల్పనలనెడి కల్మషముల నుండి విముక్తుడైన వాడును, నన్నే తన జీవిత పరమలక్ష్యముగా భావించి నా కొరకై కర్మ నొనరించువాడును, సర్వజీవుల యెడ మిత్రత్వమును కలిగియుండువాడును అగు మానవుడు నన్నే తప్పక చేరును.**

**<u>భాష్యము</u>**

ఆధ్యాత్మికాకాశము నందలి కృష్ణలోకమున దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని చేరి, అతనితో సన్నిహిత సంబంధమును పొందవలెనని వాంఛించువాడు ఆ దేవాదిదేవుడే స్వయముగా తెలిపినటువంటి ఈ సూత్రమును తప్పక అనుసరింపవలెను. కనుకనే ఈ శ్లోకము, భగవద్గీత సారముగా పరిగణింప బడుచున్నది. భౌతిక జగత్తు నందు నిమగ్నులై భౌతిక ప్రకృతిపై ఆధిపత్యమును వహింపవలెనని కోరువారును, నిజమైన ఆధ్యాత్మిక జీవితమును గూర్చి ఎరుగనివారును అగు బద్ధజీవుల కొరకై నిర్దేశింపబడిన గ్రంథమే భగవద్గీత. మానవుడు తన స్వరూపస్థితిని, భగవానునితో తనకు గల నిత్య సంబంధమును ఎట్లు తెలుసుకొనవలెనో చూపి, ఏ విధముగా అతడు తిరిగి భగవద్ధామమును చేరగలడో బోధించుట కొరకే భగవద్గీత ఉద్దేశింపబడినది. ఈ శ్లోకము నందు మానవుడు తన ఆధ్యాత్మిక కార్యమైన భక్తియుక్తసేవ యందు విజయము సాధించు విధానము స్పష్టముగా వివరింపబడుచున్నది.

కర్మకు సంబంధించినంత వరకు మానవుడు తన శక్తినంతటిని కృష్ణచైతన్యమునకు సంబంధించిన కార్యముల వైపునకు మరల్చవలెను. 'భక్తిరసామృత సింధువు' (1.2.255) నందు ఇట్లు చెప్పబడినది :

అనాసక్తస్య విషయాన్ యథార్హముపయుంజత: ।
నిర్బన్ధ: కృష్ణసమ్బన్ధే యుక్తం వైరాగ్యముచ్యతే ॥

శ్రీకృష్ణునితో సంబంధము గల ఏ కర్మనైనను మానవుడు చేయవలెను. అదియే 'కృష్ణకర్మ' అని పిలువబడును. మానవుడు పలుకర్మలలో పాల్గొనినను తమ కర్మ ఫలముల యందు ఆసక్తుడు కాకుండ, వాటిఫలమును శ్రీకృష్ణునకే అర్పింపవలెను. ఉదాహరణకు ఎవ్వరైనను వ్యాపరమును చేయుచున్నచో దానిని కృష్ణచైతన్య కర్మగా మార్చేందుకు దానిని శ్రీకృష్ణుని కొరకే చేయవలెను. శ్రీకృష్ణుడే ఆ వ్యాపారమునకు యజమానుడైనచో దానివలన వచ్చు లాభమును శ్రీకృష్ణుడే అనుభవింపవలెను. ఆ వ్యాపారస్థుడు కోట్లాదిరూపాయల ధనమునార్జించి దానినంతటిని శ్రీకృష్ణునకు అర్పింపదలచినచో అట్లు చేయవచ్చును. అది శ్రీకృష్ణుని కొరకు చేయు కర్మయే యగును. తమ ఇంద్రియతృప్తి కొరకు పెద్ద భవంతిని నిర్మించుకొనుటకు బదులుగా అతడు శ్రీకృష్ణుని కొరకు అందమైన మందిరమును నిర్మింపచేసి అందులో శ్రీకృష్ణుని శ్రీవిగ్రహమును ప్రతిష్ఠించి, ప్రామాణిక భక్తి శాస్త్రము లందు చెప్పబడినట్లు, దేవాదిదేవుని సేవకొరకై అన్ని ఏర్పాట్లను చేయవచ్చును. ఇదియంతయు 'కృష్ణకర్మ'యే. ఎవ్వరును

తాము చేయు కర్మ ఫలముల యందు ఆసక్తులై యుండరాదు. ఆ ఫలము లన్నింటిని శ్రీకృష్ణునకే అర్పింపవలెను. శ్రీకృష్ణునికి అర్పించిన పదార్థములను ప్రసాదముగా గ్రహింప వలెను. ఎవ్వరైనను శ్రీకృష్ణుని కొరకు ఒకపెద్ద భవంతిని నిర్మించి, దానియందు శ్రీకృష్ణుని విగ్రహమును ప్రతిష్ఠించినను వారక్కడ నివసించుటలో ఎట్టి నిషేధమును లేదు. కాని వారు ఆ భవంతి యజమానుడు శ్రీకృష్ణుడేనని గ్రహింపవలెను. అట్టి భావనయే కృష్ణచైతన్య మనబడును. ఒకవేళ ఎవరికైనను శ్రీకృష్ణుని కొరకు మందిరమును నిర్మించగల సామర్థ్యము లేనిచో, కనీసము కృష్ణమందిరమును శుభ్రపరచుట యందైనను నెలకొనవచ్చును. అది కూడ 'కృష్ణకర్మ'యే. అట్లే ఖాళీ ప్రదేశమును కలిగియున్న వారెవ్వరైనను (భారతదేశమున అతి బీదవాడైనను ఎంతోకొంత స్థలమును కలిగియుండును) అందులో శ్రీకృష్ణుని సేవకొరకై పూలమొక్కలను నాటవచ్చును. దానియందు తులసీవనమును పెంచి తులసీ దళములను శ్రీకృష్ణునకు అర్పింపవచ్చును. తులసీదళములు మిక్కిలి ప్రధానము లగుట చేతను, శ్రీకృష్ణుడు వాటి ఉపయోగములను భగవద్గీత(9.26) నందు ఉపదేశించి యుండుట చేతను, ఎవరైనను తులసి మొక్కలను నాటవచ్చును. 'పత్రం పుష్పం ఫలం తోయమ్' – ఎవరైనను తనకు పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని లేదా జలమును గాని అర్పింపవలెనని శ్రీకృష్ణుడు కోరుకొనెను. అట్టి సమర్పణముచే అతడు సంతృప్తుడగును. ఈ పత్రము ప్రత్యేకముగా తులసీ దళములనే సూచించును. కనుక ఎవ్వరైనను తులసీ మొక్కను నాటి దానికి నీరుపోయవచ్చును. ఈ విధముగా నిరుపేద కూడ శ్రీకృష్ణుని సేవ యందు నెలకొనవచ్చును. మానవుడు శ్రీకృష్ణునికి సంబంధించన కార్యము లందు నెలకొనుట ఎట్లో తెలియజేయుటకు ఇవి కొన్ని ఉదాహరణలు.

'మత్పరమ:' అను పదము శ్రీకృష్ణుని సాంగత్యమున అతని దివ్యధామము నందు నివసించుటయే జీవితము యొక్క అత్యున్నత పరిపూర్ణత్వమని భావించు వానిని సూచించుచున్నది. అట్టి భక్తుడు చంద్రలోకమును గాని, సూర్యలోకమును గాని లేదా స్వర్గలోకమును గాని, ఈ విశ్వము నందు గల అత్యంత ఉన్నత లోకమైన బ్రహ్మలోకమును గాని చేరవలెనని వాంఛింపడు. అతడు వాటిపట్ల ఎట్టి ఆకర్షణను కలిగియుండడు. కేవలము ఆధ్యాత్మిక లోకమును చేరుటయందే అతడు ఆసక్తుడై యుండును. అతడు అత్యున్నత ఆధ్యాత్మిక లోకమైన గోలోక వృందావనమును (కృష్ణలోకమును) చేరగోరినందున, ఆధ్యాత్మిక జగత్తు నందు ప్రకాశవంతమైన అట్టి లోకమును గూర్చి పూర్తి జ్ఞానమును కలిగి యున్నందున ఆ భక్తుడు ఏ ఇతర లోకము లందును ఆసక్తిని కలిగియుండడు. 'మద్భక్త:' అను పదముచే సూచింపబడినట్లు, అతడు ముఖ్యముగా శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము (భగవదాజ్ఞలను నిర్వహించుట), సఖ్యము, ఆత్మనివేదనములను నవవిధ భక్తిమార్గముల ద్వారా భక్తియుక్త సేవ యందు పూర్తిగా నెలకొనియుండును. మానవుడు ఈ నవవిధ భక్తిమార్గము లన్నింటిలో గాని, ఎనిమిదింటిలో గాని, ఏడింటిలో గాని లేదా కనీసము ఒక్కదానిలో గాని నెలకొనినచో అతడు తప్పక పరిపూర్ణత్వమును సాధింపగలుగును.

ఈ శ్లోకమున 'సఙ్గవర్జిత:' అను పదము మిక్కిలి ప్రధానమైనది. శ్రీకృష్ణునికి వ్యతిరేకులైన వారికి భక్తులు దూరముగా నుండవలెను. నాస్తికులైన వారే కాకుండ, కామ్యకర్మల యందును, మానసిక కల్పనల యందును ఆసక్తులై యుండువారు కూడ శ్రీకృష్ణునికి వ్యతిరేకులే. కనుకనే భక్తియుక్త సేవయొక్క విశుద్ధ రూపము 'భక్తిరసామృత సింధువు' (1.1.11) నందు ఇట్లు వర్ణింపబడినది :

అన్యాభిలాషితాశూన్యం జ్ఞానకర్మాద్యనావృతమ్ ।

ఆనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తిరుత్తమా ॥

ఎవరైనను శుద్ధమగు భక్తియుక్త సేవను అవలంబింప దలచినచో, అతడు తప్పక అన్ని రకములైన భౌతిక కాలుష్యముల నుండి విముక్తులు కావలెనని ఈ శ్లోకము నందు శ్రీల రూప గోస్వామి స్పష్టముగా చెప్పుచున్నాడు. అట్టివాడు కామ్యకర్మరతులు, మానసిక కల్పనాపరుల సాంగత్యమునకు దూరముగా నుండవలెను. అట్టి అవాంఛనీయములైన సాంగత్యము నుండియు మరియు భౌతికవాంఛా కాలుష్యముల నుండియు విముక్తుడైనప్పుడే ఎవరైనను శ్రీకృష్ణునికి సంబంధించిన జ్ఞానమును అనుకూలముగా అలవరచుకొనును. అదియే శుద్ధభక్తియుక్త సేవ యనబడును. శ్రీల సనాతన గోస్వామి తాను రచించిన 'హరిభక్తివిలాసము' (11.676) నందు 'వైష్ణవ తంత్రము' నుండి ఈ విధముగా ప్రస్తావించెను : "ఆనుకూల్యస్య సంకల్ప: ప్రాతికూల్యస్య వర్జనమ్" – "భక్తుడు శ్రీకృష్ణుని గూర్చియే చింతించుచు, అతనికి ప్రతికూలముగా కాకుండ అనుకూలముగానే వర్తింప వలెను." కంసుడు శ్రీకృష్ణునికి విరోధి. శ్రీకృష్ణుడు అవతరించినప్పటి నుండియు అతడు శ్రీకృష్ణుని చంపవలెనని ఎన్నోవిధముల యత్నించెను. అయినను అతడు అందులో ఎన్నటికిని విజయము సాధింప లేకపోవుటచే ఎల్లప్పుడును శ్రీకృష్ణుని గూర్చియే స్మరించు చుండెను. అట్లు అతడు పనిచేయుచున్నను, భుజించు చున్నను, నిద్రించు చున్నను అన్నివిధముల కృష్ణచైతన్యమును కలిగియుండెను. కాని ఈ కృష్ణచైతన్యము అతనికి అనుకూలమైనది కాదు. కనుకనే అతడు అట్లు ఇరువది నాలుగుగంటలు శ్రీకృష్ణుని గూర్చి చింతించినను దానవునిగానే పరిగణింపబడెను. చివరికి శ్రీకృష్ణుడు అతనిని వధించుట కూడ సంభవించెను. శ్రీకృష్ణునిచే వధింపబడు వారెవరైనను వెంటనే మోక్షమును పొందుదురనునది వాస్తవమైనను అదియెన్నడును శుద్ధభక్తుల లక్ష్యము కాదు. శుద్ధభక్తుడు ముక్తిని కూడ వాంఛింపడు. పరమోన్నత లోకమైన గోలోక వృందావనమును చేరవలెనని కూడ అతడు వాంఛింపడు. తానెక్కడున్నను శ్రీకృష్ణుని సేవించుటయే అతని ఏకైక లక్ష్యము.

కృష్ణభక్తుడు సర్వులకు మిత్రుడు. కనుకనే అతడు 'నిర్వైర:' అని ఇక్కడ చెప్పబడినది. కాని అది ఎట్లు సాధ్యము? కృష్ణచైతన్యవంతుడైన భక్తుడు, శ్రీకృష్ణుని పట్ల భక్తియుక్త సేవయే అన్ని జీవిత సమస్యల నుండి మానవునికి విముక్తిని కలిగించునని ఎరుగును. ఈ విషయము నందు అతనికి స్వానుభవము కలదు. కనుకనే అతడు ఈ కృష్ణచైతన్య విధానమును మానవ సమాజమున ప్రవేశ పెట్టగోరును. భగవద్భక్తులు భగవత్ చైతన్యమును ప్రచారము చేయుటకు తమ జీవితములను కూడ పణముగా పెట్టిన ఉదంతములు చరిత్రలో అనేకము గలవు. వానిలో మిక్కిలి సుపరిచితమైన ఉదాహరణము ఏసుక్రీస్తు. భక్తులు కానివారు అతనిని సిలువపై నెక్కించి చంపిరి. కాని అతడు భగవత్ చైతన్యమును విస్తరింపజేయుట కొరకై తన జీవితమును త్యాగము చేసెను. స్థూలదృష్టికి మాత్రమే అతడు చంపబడినట్లు కనబడును. అట్లే భారతదేశము నందు కూడ ప్రహ్లాదుడు, హరిదాస ఠాకూరుల వంటివారి ఉదాహరణలెన్నో గలవు. కృష్ణచైతన్యమును ప్రచారము చేయుటకొరకై వారు అంతటి కష్టమును కొనితెచ్చుకొనిరి. అది మిక్కిలి కఠినమైనదని తెలుపుటయే దానికి సమాధానము. ఎవరైనను దుఃఖముతో బాధ పడుచున్నచో దానికి శ్రీకృష్ణునితో తనకు గల నిత్య సంబంధమును విస్మరించుటయే కారణమని కృష్ణచైతన్య వంతుడెరుగును. కనుకనే ఎవ్వరైనను మానవ సమాజమునకు చేయగల అత్యున్నత పరోపకార మేమిటనగా, పొరుగు వానిని భౌతిక సమస్యలన్నింటి నుండి కాపాడుటయే. ఆ విధముగా శుద్ధభక్తుడు శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనియుండును. ఇపుడు తనకొరకు సర్వమును కోల్పోయి తన సేవయందు నెలకొని యుండు వాని పట్ల శ్రీకృష్ణుడెంతటి దయను కలిగియుండునో

సులభముగా మనము ఊహింపవచ్చును. కనుకనే అట్టి వ్యక్తులు దేహమును విడిచిన పిమ్మట దివ్యలోకమును తప్పక చేరుదురు.

సారాంశమేమనగా, తాత్కాలిక ప్రదర్శనయైన శ్రీకృష్ణుని విశ్వరూపము, సర్వమును కబళించు కాలరూపము, చతుర్భుజ విష్ణురూపము కూడ శ్రీకృష్ణుని చేతనే ప్రదర్శింపబడెను. ఈ విధముగా ఈ ప్రదర్శనల కన్నింటికిని మూలము శ్రీకృష్ణుడే. అంతేకాని ఆదియైన విశ్వరూపము లేదా విష్ణువు నుండి శ్రీకృష్ణుడు ప్రకటము కాలేదు. శ్రీకృష్ణుడే సమస్త రూపములకు మూలాధారుడు. కనుకనే విష్ణుతత్త్వములు, వందలకొలది వేలకొలది కలవు. కాని భక్తునకు స్వయంరూపమైన ద్విభుజ శ్యామసుందర రూపము తప్ప అతని మరి యే ఇతర రూపము వాస్తవమునకు ప్రధానమైనది కాదు. శ్రీకృష్ణుని శ్యామసుందర రూపమునకు భక్తి మరియు ప్రేమలతో ఆకర్షితులైనవారు అతనిని ఎల్లప్పుడు హృదయము నందు చూడగలరనియు, అన్యమును చూడగోరని 'బ్రహ్మ సంహిత' యందు చెప్పబడినది. కనుకనే శ్రీకృష్ణుని స్వయంరూపమే ప్రధానమైనది మరియు పరమ శ్రేష్ఠమైనదను ఈ ఏకాదశ అధ్యాయపు సారాంశమును ప్రతియొక్కరు అవగాహన చేసుకొనవలసియున్నది.

**శ్రీమద్భగవద్గీత యందలి 'విశ్వరూపము' అను ఏకాదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

------

# ద్వాదశాధ్యాయము
# భక్తియోగము

### 12.1
**అర్జున ఉవాచ**
**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమా: ॥**

## అనువాదము

**అర్జునుడు ప్రశ్నించెను : నీ భక్తియుక్త సేవలో సదా తగినరీతి నియుక్తులైన వారు మరియు అవ్యక్తము, నిరాకార బ్రహ్మమును ఉపాసించువారు అను ఇరువురిలో ఎవరు గొప్ప యోగపరిపూర్ణులని భావింపబడుదురు?**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుడు సాకార, నిరాకార, విశ్వరూపముల గూర్చియు పలు రకములైన భక్తులు మరియు యోగులను గూర్చియు ఇంతవరకు వివరించెను. సాధారణముగా ఆధ్యాత్మికులను సాకారవాదులు మరియు నిరాకారవాదులు అని రెండు తరగతులుగా విభజింపవచ్చును. సాకారవాదియైన భక్తుడు తన సంపూర్ణశక్తిని వినియోగించి పరమపురుషుని భక్తియుక్త సేవ నెలకొని యుండును. నిరాకారవాది ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని సేవయందు నెలకొనకుండ, అవ్యక్తమును నిరాకారమునైన బ్రహ్మమును ఉపాసించుట యందు నెలకొని యుండును.

ఈ అధ్యాయమున పరతత్త్వానుభూతికి గల అనేక పద్ధతులలో భక్తియుక్త సేవ అనగా భక్తియోగము అనునది అత్యుత్తమమైనదని మనకు తెలియుచున్నది. ఎవరైనను దేవాదిదేవుని సన్నిహిత సాంగత్యమును వాంఛించినచో వారు భక్తియుక్త సేవను తప్పక స్వీకరింపవలెను.

భక్తియుక్త సేవ ద్వారా దేవాదిదేవుని ప్రత్యక్షముగా ఆరాధించువారు సాకారవాదులని పిలువబడుదురు. నిరాకార బ్రహ్మమును ఉపాసించుటలో నిమగ్నులైన వారు నిరాకారవాదు లనబడుదురు. వీరిరువురిలో ఏ పద్ధతి ఉత్తమ మైనదని అర్జునుడిక్కడ ప్రశ్నించుచున్నాడు. పరతత్త్వానుభూతికి వివిధ మార్గములు కలవు. కాని శ్రీకృష్ణుడు ఈ అధ్యాయమున తనకు చేయబడు భక్తియుక్త సేవయే అనగా భక్తియోగము అత్యుత్తమ మైనదని సూచించుచున్నాడు. దేవాదిదేవుని సాంగత్యమును పొందుటయే భక్తియోగము. ఇది మిక్కిలి ప్రత్యక్షమార్గమే కాకుండ మిక్కిలి సులభతరమైన సాధన విధానమై యున్నది.

భగవద్గీత యొక్క ద్వితీయాధ్యాయమునందు జీవి ఆధ్యాత్మిక విస్ఫులింగ మనియు భౌతిక దేహము కాదనియు మరియు పరతత్త్వము దివ్యమైన సంపూర్ణతత్త్వమనియు దేవాదిదేవుడు వివరించియున్నాడు. సప్తమాధ్యాయమున అట్టి జీవుడు సంపూర్ణతత్త్వపు అంశయైన కారణముగా తన శ్రద్ధనంతటిని సంపూర్ణ తత్త్వము

వైపునకే మరలింపవలెనని భగవానుడు ఆదేశించియున్నాడు. తిరిగి అష్టమాధ్యాయమున శరీరమును త్యజించునట్టి సమయమున శ్రీకృష్ణభగవానుని స్మరించు మానవుడు వెంటనే ఆధ్యాత్మిక జగత్తులోని కృష్ణలోకమునకు చేర్చబడునని చెప్పబడినది. శ్రీకృష్ణుని గూర్చియే సదా అంతరంగమున స్మరించెడి వ్యక్తి యోగులందరిలోకి పరమశ్రేష్ఠుడని షష్ఠాధ్యాయపు చివరన శ్రీకృష్ణుడు స్పష్టముగా తెలిపియున్నాడు. ఈ విధముగా మానవుడు శ్రీకృష్ణుని స్వరూపము నందే ఆసక్తిని కలిగియుండ వలెననుట అన్ని అధ్యాయముల సారము. అదియే అత్యున్నత ఆధ్యాత్మికానుభూతి.

అయినను శ్రీకృష్ణుని స్వరూపము నందు ఆసక్తిని కలిగియుండని వారు కొందరుందురు. అట్లు అతని రూపము నందు తీవ్ర అనాసక్తులైన వారు తమ గీతాభాష్యములందు జనులను శ్రీకృష్ణుని నుండి మరలించి, వారి సమస్త భక్తిని నిరాకర బ్రహ్మజ్యోతి వైపునకు మరలునట్లుగా చేయగోరుదురు. పరతత్త్వము యొక్క అవ్యక్తమును మరియు ఇంద్రియాతీతమైన (అక్షరము) నిరాకారబ్రహ్మమే రూపమును ఉపాసించుటకే వారు ప్రాధాన్యమిత్తురు.

అధ్యాత్మికులలో రెండుతరగతుల వారు కలరు. వాస్తవమునకు ఏ విధానము సులభతరము మరియు ఏ తరగతి వారు మిక్కిలి పరిపూర్ణులనెడి ప్రశ్నను పరిష్కరించుటకు అర్జునుడు యత్నించుచున్నాడు. అనగా తాను శ్రీకృష్ణుని స్వరూపము నందు ఆసక్తుడై యున్నందున తన పరిస్థితిని తెలియగోరుచున్నాడు. అతడు నిరాకారబ్రహ్మము పట్ల ఆసక్తుడు కాలేదు. కనుక అతడు తన స్థితి సురక్షితమైనదో కాదో తెలుసుకొనదలచెను. వాస్తవమునకు, ఈ భౌతికజగత్తు నందు కాని దేవాదిదేవుని ఆధ్యాత్మిక జగత్తు నందు కాని నిరాకార అంశమును ధ్యానింప గలుగుట మిక్కిలి కష్టము. ఎందుకనగా పరతత్త్వపు నిరాకార అంశమును సంపూర్ణముగా అనుభూతి చెందుట ఎవరికిని సాధ్యము కాదు. కనుక “అట్లు కాలమును వృథాచేయుట వలన లాభమేమిటి?” అని అర్జునుడు తెలుపగోరు చున్నాడు. ఇతర రూపముల నన్నింటిని అవగతము చేసుకొనగలుగుటయే కాకుండ తన కృష్ణప్రేమ యందు కలతయు సంభవింపనందున శ్రీకృష్ణుని స్వరూపము నందే ఆసక్తుడగుట పరమోత్తమమని అర్జునుడు ఏకాదశాధ్యాయమున అనుభవపూర్వకముగా గ్రహించగలిగెను. అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించినట్టి ఈ ముఖ్యమైన ప్రశ్న పరతత్త్వపు సాకార మరియు నిరాకార భావములకు గల భేదమును విశదీకరింపగలదు.

**12.2**

**శ్రీభగవానువాచ**

**మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
**శ్రద్ధయా పరయో పేతాస్తే మే యుక్తతమా మతా: ॥**

**<u>అనువాదము</u>**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : నా స్వరూపము నందు మనస్సును స్థిరముగా నిలిపి అలౌకికమును, అధికమునైన శ్రద్ధతో సదా నన్ను ఉపాసించుట యందు నియుక్తులైనవారు అత్యంత పరిపూర్ణులని నేను భావింతును.**

**భాష్యము**

అర్జునుని ప్రశ్నకు సమాధానముగా శ్రీకృష్ణభగవానుడు తన స్వరూపముపై మనస్సును కేంద్రీకరించి శ్రద్ధాభక్తులతో తనను ఆరాధించువాడు యోగము నందు పరిపూర్ణుడని స్పష్టముగా చెప్పుచున్నాడు. సర్వము శ్రీకృష్ణుని కొరకే చేయబడుచుండుట చేత అట్టి కృష్ణచైతన్యమున నెలకొనినవానికి ఎట్టి భౌతిక కర్మలుండవు. అట్టి కృష్ణచైతన్యమున నందే శుద్ధభక్తు డెల్లప్పుడు నెలకొని యుండును. కొన్నిమార్లు అతడు జపించుచుండును. కొన్నిమార్లు శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుచుండును లేదా పఠనము చేయుచుండును. మరికొన్నిమార్లు శ్రీకృష్ణుని కొరకై ప్రసాదమును సిద్ధము చేయుచుండును. లేక శ్రీకృష్ణుని కొరకై అవసరమైనదేదియో ఖరీదు చేయుటకు అంగడికి వెడుతుండును. కొన్నిమార్లు అతడు మందిరమును గాని భగవానుని భోజనపాత్రలను గాని శుభ్రపరచుట వంటి కార్యములందు నెలకొనియుండును. ఈ విధముగా అతడు ఏమి చేసినను తన కార్యములను కృష్ణసంబంధములుగా చేయకుండ క్షనమైనను గడపడు. అట్టి కర్మ సంపూర్ణముగా సమాధిస్థితియై యుండును.

**12.3 - 4**

**యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।**
**సర్వత్రగామచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥**

**సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥**

**అనువాదము**

**కాని సర్వేంద్రియ నిగ్రహము మరియు సర్వుల యెడ సమభావము కలిగి ఇంద్రియాతీతమును, సర్వవ్యాపకమును, అచింత్యమును, మార్పులేనిదియు, నిశ్చలమును, స్థిరమును, అవ్యక్తతత్త్వమైన పరతత్త్వపు నిరాకార భావనను పరిపూర్ణముగా ఉపాసించు సర్వభూతహితులైన వారు కూడ అంత్యమున నన్ను పొందుదురు.**

**భాష్యము**

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ప్రత్యక్షముగా ఆరాధింపక, పరోక్ష విధానమున అదే గమ్యమును సాధింప యత్నించువారు కూడ చివరికి ఆ పరమ గమ్యమైన శ్రీకృష్ణునినే చేరుదురు. "పెక్కు జన్మల పిదప జ్ఞానియైనవాడు వాసుదేవుడే సర్వస్వమని ఎరిగి నన్ను శరణుపొందును." (భ,గీ.7.19) అనేక జన్మల పిదప మానవుడు సంపూర్ణ జ్ఞానమును పొందినంతనే శ్రీకృష్ణభగవానుని శరణుపొందును. ఈ శ్లోకము నందు చెప్పబడిన విధానము ననుసరించి, ఎవరైనను దేవాదిదేవుని చేరదలచినచో, ఇంద్రియములను నియంత్రించి, సర్వులకు సేవ చేయుచు, సర్వజీవుల సంక్షేమ కార్యము లందు నెలకొనవలసి యుండును. అనగా ప్రతియొక్కరు శ్రీకృష్ణభగవానుని చేరవలయునని తెలియుచున్నది. అట్లు చేయనిచో సంపూర్ణానుభూతి కలుగజాలదు. అట్టి శ్రీకృష్ణుని సంపూర్ణముగా శరణు పొందుటకు పూర్వము మానవుడు తీవ్రతపస్సు నొనరింపవలసి యుండును.

జీవాత్మ యందు పరమాత్మను చూచుటకై మానవుడు దర్శన, శ్రవణ, ఆస్వాదన, కర్మ వంటి ఇంద్రియ కార్యములను అరికట్టవలెను. అప్పుడే అతడు పరమాత్ముడు సర్వగతుడని ఎరుగగలుగును. ఈ సత్యదర్శనము పిమ్మట అతడు ఏ జీవిని ద్వేషింపడు. అట్టి భావనలో అతడు బాహ్యాచ్ఛాదనమును కాకుండ, ఆత్మనే దర్శించు చుండుటచే మానవునికిని, జంతువునకును నడుమ బేధమును చూడడు. కాని ఇట్టి నిరాకార బ్రహ్మానుభూతి విధానము సాధారణ మానవునికి అత్యంత కఠినమైనది.

**12.5**
**క్లేశో దికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దు:ఖం దేహవద్భిరవాప్యతే ॥**

**అనువాదము**

**పరమపురుషుని అవ్యక్త నిరాకార తత్త్వము నందు ఆసక్తమైన చిత్తము గలవారికి పురోగతి యనునది మిగుల క్లేశకరము. ఆ విధానమున ప్రగతి సాధించుట దేహధారులకు ఎల్లప్పుడును కష్టతరమే.**

**భాష్యము**

పరమపురుషుని అవ్యక్తము, అచింత్యమైన నిరాకార తత్త్వమార్గము ననుసరించు ఆధ్యాత్మికవాదుల సమూహము జ్ఞానయోగులనియు, సంపూర్ణ కృష్ణచైతన్యములో దేవాదిదేవుని భక్తియుక్తసేవ యందు నెలకొనిన ఆధ్యాత్మికులు భక్తియోగులని చెప్పబడుదురు. ఇప్పుడు ఇక్కడ ఈ జ్ఞానయోగమునకును, భక్తియోగమునకు నడుమ గల భేదము స్పష్టముగా విశదీకరింపబడినది. చివరికి మానవుని భక్తియోగము వలన పొందు గమ్యమునకే జ్ఞానయోగ విధానము చేర్చినప్పటికిని అది మిక్కిలి క్లిష్టమైనది. కాని భక్తియోగము దేవాదిదేవుని ప్రత్యక్ష సేవా మార్గమైనందున అది అత్యంత సులభమైనదే కాకుండ జీవాత్మకు సహజ ధర్మమై యున్నది. జీవాత్మకు అనాదికాలముగా బద్ధుడై యున్నాడు. జీవికి తాను దేహమును కాదని సిద్ధాంతపూర్వకముగా అవగాహన చేసికొనుట గొప్ప కష్టము, కనుక భక్తియోగి శ్రీకృష్ణుని శ్రీవిగ్రహమును ఆరాధనీయమైనదిగా అంగీకరించును. ఎందుకనగా మనస్సులో కొద్దిపాటి దేహభావన స్థిరమై యుండుటచే, దానిని ఆ విధముగా అతడు అర్చనలో వినియోగించును. అయినను మందిరములో అర్చావిగ్రహ రూపములో గల దేవాదిదేవుని ఆరాధనము భౌతిక ప్రతిమకు చేయబడు పూజ కాజాలదు. ఆరాధన సగుణముగా (గుణసహితము) మరియు నిర్గుణముగా (గుణరహితము) అను రెండు విధములుగా నుండునని వేదవాఙ్మయము నుండి నిదర్శనము లభించుచున్నది. భగవానుని రూపము భౌతిక గుణములతో రూపొందింపబడుటచే మందిరము నందలి విగ్రహమును ఆరాధించుట సగుణారాధనము అని తెలియబడును. కాని భగవానుని రూపము ఆ విధముగా భౌతికములైన శిల, దారువు, లేదా తైలవర్ణ పటములతో సూచింప బడినను అదెన్నడును వాస్తవమునకు భౌతికము కాజాలదు. అదియే దేవాదిదేవుని దివ్యస్వరూపమై యున్నది.

ఒక సాధారణ ఉదాహరణను ఇక్కడ చెప్పవచ్చును. మనము మన మార్గ మధ్యమున కొన్ని తపాలాపెట్టెలను చూచుచుందుము. మనము ఆ పెట్టెలో

ఉత్తరములను వేసినచో అవి ఎటువంటి ఆటంకము లేకుండా గమ్యస్థానమును చేరును. కాని ఏదేని పాతపెట్టె లేక తపాలా కార్యాలయము వారిచే ప్రయాణీకరింప బడనట్టి అనుకరణపూర్వకమైన నకిలీ పెట్టె అట్టి కార్యమును చేయజాలదు. అట్లే 'అర్చావిగ్రహము' అని పిలువబడు 'శ్రీవిగ్రహ'రూపములో భగవానుడు ప్రామాణీకృతమైన ప్రాతినిధ్యమును కలిగియున్నాడు. వాస్తవమునకు ఈ 'అర్చావిగ్రహము' ఆ దేవాదిదేవుని అవతారమే. భగవానుడు ఆ రూపము ద్వారా సేవలను గ్రహించును. దేవాదిదేవుడు సర్వశక్తిమంతుడు, సర్వ సమర్థుడగుటచే భక్తుని సేవను అర్చావిగ్రహ అవతారము ద్వారా స్వీకరించును. బద్ధజీవితము నందు గల వ్యక్తికి సౌకర్యము కలిగించుటకై అతడట్లు 'అర్చావిగ్రహ' అవతారము ద్వారా భక్తుని సేవలను గ్రహించును.

కనుకనే దేవాదిదేవుని శీఘ్రముగను మరియు ప్రత్యక్షముగను చేరుటకు భక్తునకు ఎట్టి కష్టమును లేదు. కాని ఆధ్యాత్మికానుభూతి కొరకై నిరాకార మార్గమును అనుసరించు వారలకు మార్గము కష్టతరమగును. వారు ఉపనిషత్తుల వంటి వైదిక గ్రంథముల ద్వారా దేవాదిదేవుని అవ్యక్తరూపమును అవగతము చేసికొని, భాషను అభ్యసించి, వానియందలి అగోచర భావములను అవగాహన చేసికొనవలసి యుండును. ఈ విధానముల నన్నింటిని వారు అనుభూతి చెందవలసి యుండును. సామాన్యమానవులకు ఇది అంత సులభమైనది కాదు. కాని కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవయందు నెలకొనినవారు కేవలము ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని మార్గనిర్దేశము నందు వర్తించుచు, శ్రీవిగ్రహములకు క్రమపద్ధతిలో ప్రణమిల్లుచు, శ్రీకృష్ణుని మహిమలను శ్రవణము చేయుచు, భగవానునికి అర్పింపబడిన ఆహారమును ప్రసాదముగా భుజించుచు దేవాదిదేవుని అతి సులభముగా అనుభూతి పొందగలుగుదురు. చిట్టచివరికి పరతత్త్వానుభూతి కలుగక పోవుటమను ప్రమాదముతో కూడిన అతికష్టమైన మార్గమును నిరాకారవాదులు అనవసరముగా ఎన్నుకొనిరనుటలో ఎట్టి సందేహము లేదు. కాని సాకారవాది ఎట్టి బాధ, ప్రమాదము, కష్టము గాని లేకుండా దేవాదిదేవుని ప్రత్యక్షముగా పొందగలుగును. ఇందుకు సంబంధించిన విషయము శ్రీమద్భాగవతము (4.22.40) నందు కూడ గలదు : మానవుడు చివరకు ఏ విధముగానైనను దేవాదిదేవునికి శరణు పొందవలసి యున్నప్పుడు (ఈ శరణాగతికే భక్తి అని పేరు) అట్లు చేయుటకు బదులుగా బ్రహ్మమనమేదో, బ్రహ్మము కానిదేదో తెలుసుకొనుటకు శ్రమపడుచు, తమ జీవితము నంతటిని ఆ విధముగా గడిపినచో ఫలితము క్లిష్టతరమే కాగలదు. కనుక చివరి ఫలితము అనిశ్చితమై యున్నందున ఈ క్లిష్టతరమైన ఆత్మానుభూతి మార్గమును ఎవ్వరును అనుసరింపరాదని ఇక్కడ ఆదేశింపబడుచున్నది.

జీవుడు శాశ్వతమైన ప్రత్యగాత్మ. అట్టి నిత్యుడైన జీవుడు నిరాకార బ్రహ్మమున లీనము కాగోరినచో తన నిజస్వరూపమునకు సంబంధించిన 'సత్', 'చిత్', (నిత్యమైన, జ్ఞానమయమైన) అంశముల అనుభూతినే పొందగలడు. కాని అతనికి 'ఆనందము' అను అంశము మాత్రము అనుభూతికి రాదు. జ్ఞానయోగ విధానమున అత్యంత నిష్ణాతుడైనట్టి ఆధ్యాత్మికవాది ఎవరైనను భక్తుని కృపచే భక్తియోగకు లేక భక్తియుక్త సేవకు రావచ్చును. అట్లు భక్తియోగకు వచ్చినను ఆ నిరాకార భావమును అతడు విడువజాలడు. కనుక అది బాధాకరమే కావచ్చును. కనుక అతడు ఆ అవ్యక్త తత్త్వమును ఆరాధించు బద్ధజీవి, అభ్యాసకాలమందును మరియు అనుభవకాలమందును కూడ ఎల్లప్పుడును కష్టములకే గురియగు చుండును. వాస్తవమునకు ప్రతిజీవాత్మయు పాక్షికముగా స్వతంత్రమైనదే. ఈ అవ్యక్తానుభూతి తన ఆనందమయ తత్త్వమునకు పూర్తిగా వ్యతిరేకమైనదని అతడు తప్పక గ్రహింపవలెను. కనుకనే ఈ విధానమును ఎవ్వరును అవలంబింప రాదు. ప్రతిజీవునికి భక్తియుక్తసేవ యందు సంపూర్ణ వ్యాపకమును కలిగించు కృష్ణచైతన్య మార్గమే అత్యుత్తమమైనది. అట్టి ఈ భక్తియుక్త సేవను విస్మరించినచో మానవుడు నాస్తికుడగు ప్రమాదము కలదు. ఈ శ్లోకమున చెప్పబడినట్లు, ఇంద్రియాతీతమును, అవ్యక్తమును అయిన అచింత్య తత్త్వముపై ధ్యానమును ఏకాగ్రము చేయు విధానమును

ఎన్నడును ముఖ్యముగా ఈ యుగమున ప్రోత్సహింపకూడదు. అది శ్రీకృష్ణభగవానునిచే ఆదేశింపబడలేదు.

**12.6 - 7**

**యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరా: ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్తఉపాసతే ॥**

**తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
**భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్ ॥**

## అనువాదము

**కాని ఓ పార్థా! సర్వకర్మలను నాకు అర్పించి అన్యచింత లేక నాకు భక్తులై, మనస్సును నా యందే లగ్నము చేసి సదా నన్ను ధ్యానించుచు, నా భక్తియుక్త సేవలో నన్ను ఉపాసించెడి వారిని శీఘ్రమే జననమరణ రూప సంసార సాగరము నుండి ఉద్ధరింతును.**

## భాష్యము

భౌతిక జీవితము నుండి భక్తులు వెంటనే భగవానునిచే ఉద్ధరింప బడుదురు. కనుక భక్తులు గొప్ప అదృష్టవంతులని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. శుద్ధభక్తియుక్త సేవ యందు నెలకొనిన మానవుడు, భగవానుడు మహత్తరుడనియు మరియు జీవాత్మ అతనికి సేవకుడనియు అనుభవపూర్వకముగా గ్రహించును. భగవానుని సేవించుటయే జీవుని నిజధర్మము. అతడెట్లు చేయనిచో 'మాయ'ను సేవింపవలసివచ్చును.

పూర్వము తెలుపబడినట్లు, భక్తియుక్త సేవచేతనే భగవానుని మహత్త్వము గుర్తింపబడును. కనుక ప్రతియొక్కరు పరిపూర్ణభక్తులు కావలెను. శ్రీకృష్ణుని పొందుటకై వారు తమ మనస్సులను శ్రీకృష్ణుని పైననే సంపూర్ణముగా లగ్నము చేయవలెను. వారు శ్రీకృష్ణుని కొరకై కర్మనొనరింపవలెను. వారు ఏ రకమైన కర్మ యందు నెలకొనినను దానిని కేవలము శ్రీకృష్ణుని కొరకే చేయవలెను. అది భక్తియుక్త సేవకు ప్రమాణము. భక్తుడు దేవాదిదేవుని సంతృప్తి పరచుట కంటెను అన్యమైన ఇతర ఏ సిద్ధిని కోరడు. శ్రీకృష్ణుని సంతృప్తి పరచుటయే భక్తుని జీవిత లక్ష్యము. అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామము నందు చేసినట్లు, భక్తుడు కూడ శ్రీకృష్ణుని సంతృప్తికై సర్వమును త్యాగము చేయగలడు. అట్టి విధానము చాలా సులభమైనది. మానవుడు తన విధ్యుక్త ధర్మములను నిర్వర్తిస్తూనే, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును స్మరింపవలెను. అట్టి దివ్యస్మరణ అతనిని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని వైపునకు ఆకర్షితుని చేయును.

ఆ విధముగా తనసేవ యందే నెలకొనినట్టి శుద్ధభక్తుని సంసార సాగరము నుండి వెంటనే ఉద్ధరింతునని దేవాదిదేవుడు ఇక్కడ వాగ్దానము చేయుచున్నాడు. యోగసాధనము నందు పురోగతి సాధించినవారు యోగవిధానము ద్వారా తమ ఇచ్చానుసారము ఆత్మను తాము కోరిన లోకమునకు బదిలీ చేయగలుగుదురు. అట్లే, ఇతరులు అనేక విధముల ఈ అవకాశములను ఉపయోగించు కొందురు. కాని భక్తునికి సంబంధించినంత వరకు భగవానుడే స్వయముగా వారిని తన వెంటగొని పోవునని

ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. భక్తుడు ఆధ్యాత్మిక జగత్తును చేరుటకు గొప్ప అనుభవజ్ఞుడు కానవసరము లేదు.

ఈ విషయమున 'వరాహపురాణము' నందు ఈ శ్లోకము గలదు :

నయామి పరమం స్థానమర్చిరాదిగతిం వినా ।
గరుడస్కంధమారోప్య యథేచ్ఛమని వారిత: ॥

ఈ శ్లోకపు సారాంశమేమనగా భక్తుడు తన ఆత్మను ఆధ్యాత్మిక లోకములకు బదిలీచేయుటకు అష్టాంగయోగ పద్ధతిని అభ్యసింపనవసరము లేదు. ఎందుకనగా, దేవాదిదేవుడే స్వయముగా ఈ బాధ్యతను వహించును. తానే స్వయముగా తరింపజేయుచున్నానని దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ స్పష్టముగా చెప్పుచున్నాడు. బాలుని తల్లిదండ్రులు రక్షణ విషయమున సంపూర్ణ శ్రద్ధవహించి యుండుటచే అతని స్థితి మిక్కిలి సురక్షితమగును. అట్లే భక్తుడు యోగాభ్యాసముచే ఇతర లోకములకు చేర యత్నింప నవసరము లేదు. దేవాదిదేవుడే అపారమైన కృపతో వెంటనే తన గరుడ వాహనముపై అరుదెంచి భక్తుని సంసార సాగరము నుండి ఉద్ధరించును. సముద్రములో పడినవాడు ఈతలో ఎంతటి గొప్ప నేర్పరియైనను రక్షింపబడుటకు తీవ్రముగా ఎంత యత్నించినను తననుతాను రక్షించుకొనలేడు. కాని ఎవరైనను చేయూత నందించి నీటినుండి అతనిని పైకి తీసినచో అతడు సులభముగా రక్షింపబడును. అట్లే భగవానుడు కూడ భక్తుని సంసారసాగరము నుండి ఉద్ధరించును. అందులకై భక్తుడు సులభమైన కృష్ణచైతన్య విధానమును అభ్యసించుచు పూర్తిగా భక్తియుక్త సేవ యందు నెలకొని యుండుటయే చేయవలయును. కనుకనే బుద్ధిమంతుడు ఇతర మార్గము లన్నింటి కంటెను భక్తియోగ, భక్తియుక్త సేవకే ఎల్లపుడు ప్రాధాన్యమివ్వవలెను. 'నారాయణీయము' నందు ఇట్లు సమర్థింపబడినది :

యా వై సాధనసంపత్తి: పురుషార్థచతుష్టయే ।
తయా వినా తదాప్నోతి నరో నారాయణాశ్రయ: ॥

మానవుడు కామ్యకర్మలు లేదా మానసిక కల్పనావిధానముతో జ్ఞానసముపార్జన వంటి వివిధ విధానములందు నెలకొనరాదనేది ఈ శ్లోకపు సారాంశము. దేవాదిదేవుని యెడ భక్తి కలిగినవాడు ఇతర యోగవిధానముల ద్వారా మానసిక కల్పనము, కర్మాచరణము, యజ్ఞము, దానము వంటివాటి ద్వారా కలుగు ప్రయోజనము లన్నింటిని పొందగలడు. భక్తియుక్త సేవ యొక్క ప్రత్యేక వరదానమిదియే.

కేవలము "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని నామసంకీర్తనను చేయుట ద్వారా భక్తుడు పరమలక్ష్యమును సులభముగను మరియు సుఖకరముగను పొందగలడు. అట్టి లక్ష్యమును పొందుట మరి యే ఇతర ధర్మవిధానము చేతను సాధ్యపడదు.

భగవద్గీత సారాంశము(18.66) నందు ఇట్లు చెప్పబడినది :

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ: ॥

ఆత్మానుభూతికి సంబంధించిన ఇతర విధానము లన్నింటిని త్యజించి మానవుడు కృష్ణచైతన్యముతో భక్తియుక్త సేవను మాత్రమే ఒనరించవలెను. అది మానవుని జీవిత సంసిద్ధిని పొందునట్లుగా చేయగలదు. దేవాదిదేవుడే అతని సంపూర్ణ బాధ్యతను వహించును కనుక అతడు పూర్వజన్మములోని పాపకార్యములను పరిగణించ నవసరము లేదు. కావున మానవుడు ఆధ్యాత్మికానుభూతి విషయము నందు తనను తానే స్వయముగా ఉద్ధరించుకొనుటకు వ్యర్థముగా ఇతర ప్రయత్నములేవి చేయనవసరము లేదు. ప్రతియొక్కరు సర్వశక్తిమంతుడును, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని శరణుపొందుదురు గాక! అదే జీవితపు అత్యున్నత పరిపూర్ణత్వము.

## 12.8

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయ: ॥**

## అనువాదము

**దేవాదిదేవుడనైన నాయందే నీ మనస్సును స్థిరముగా నిలుపుము. నీ బుద్ధినంతయు నా యందే నియుక్తము చేయుము. ఈ విధముగా సదా నా యందే నీవు నిస్సంశయముగా నివసింతువు.**

## భాష్యము

శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవయందు నెలకొనినవాడు ఆ దేవాదిదేవునితో ప్రత్యక్ష సంబంధమును కలిగి జీవించును. కనుక ఆరంభము నుండియే అతని స్థితి ఆధ్యాత్మికమని తెలుపుటలో ఎట్టి సందేహము లేదు. వాస్తవమునకు భక్తుడెన్నడును భౌతికస్థితి నందు కాకుండ శ్రీకృష్ణుని యందే సదా నిలిచియుండును. శ్రీకృష్ణునికి మరియు అతని నామమునకు బేధము లేదు; కనుక భక్తుడు 'హరేకృష్ణ' మహామంత్రమును ఉచ్చరించినంతనే శ్రీకృష్ణుడు మరియు అతని అంతరంగశక్తి భక్తుని జిహ్వాపై నాట్యమాడును. భక్తుడు వివిధ పదార్థములను శ్రీకృష్ణునకు సమర్పించినపుడు శ్రీకృష్ణుడు ప్రత్యక్షముగా ఆ ఆహారపదార్థములను గ్రహించును. పిమ్మట అట్టి ప్రసాదమును స్వీకరించిన భక్తుడు కృష్ణమయుడగును. ఈ విధానము భగవద్గీత యందును, ఇతర వేదవాఙ్మయము నందును ఉపదేశింపబడినను, అట్టి భక్తియుక్త సేవయందు నెలకొనినవాడు అది ఎట్లు సాధ్యమనెడి విషయమును అవగాహన చేసుకొనజాలడు.

**12.9**
**అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥**

**అనువాదము**

**ప్రియమైన ఓ అర్జునా! ధనంజయా! స్థిరముగా నా యందు మనస్సును లగ్నము చేయ నీవు సమర్థుడవు కానిచో, భక్తియోగము నందలి విధివిధానములను అనుసరింపుము. ఈ విధముగా నన్ను పొందు కోరికను వృద్ధి చేసుకొనుము.**

**భాష్యము**

ఈ శ్లోకమున భక్తియోగమునకు సంబంధించిన రెండు విధానములు సూచింపబడినవి. అందులో మొదటిది దివ్యప్రేమ ద్వారా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పట్ల ఆసక్తిని వాస్తవముగా వృద్ధిచేసికొనిన వారికి అన్వయింపబడును. రెండవది, దివ్యప్రేమ ద్వారా దేవాదిదేవుని యందు ఇంకను ఆసక్తిని పెంపొందించుకొనని వారికి అన్వయింపబడును. ఈ రెండవ తరగతి వారికి వివిధ రకములైన విధి విధానములు నిర్దేశింపబడియున్నవి. అంత్యమున శ్రీకృష్ణుని పట్ల ఆసక్తి కలిగిన స్థితికి మానవుడు(కృష్ణానురాగస్థితి) ఉద్ధరింపబడుటకై వాటిని అనుసరింపవచ్చును.

భక్తియోగమనగా ఇంద్రియముల పవిత్రీకరణమని భావము. ప్రస్తుతము భౌతిక స్థితిలో ఇంద్రియములు ఇంద్రియతృప్తి యందు నెలకొని యున్నందున సదా అపవిత్రములై యుండును. కాని భక్తి యోగాభ్యాసముచే ఈ ఇంద్రియములు పవిత్రములగును. పవిత్రస్థితిలో అవి దేవాదిదేవునితో ప్రత్యక్ష సంబంధమును పొందును. ఈ భౌతిక జగత్తు నందు నేనొక యజమానునకు సేవకునిగా నెలకొని యుండవచ్చును, అయినను అతనిని నిజమైన ప్రేమతో సేవింపను, కేవలము కొంత ధనము కొరకై అతనిని సేవింతును. అదేవిధముగా, యజమానుడు కూడ ప్రేమను కలిగియుండడు. నా నుండి సేవను గ్రహించి, నాకు కొంత ధనమునిచ్చు చుండును. కనుక ఇక్కడ ప్రేమ యనెడి ప్రశ్నయే ఉదయింపదు. కాని మానవుడు ఆధ్యాత్మిక జీవితము నందు శుద్ధప్రేమ స్థితికి ఉద్ధరింప బడవలసినదే. ప్రస్తుత ఇంద్రియములచే నిర్వహింపబడెడి భక్తియుక్త సేవాభ్యాసము చేతనే అట్టి ప్రేమస్థితి ప్రాప్తింపగలదు.

ప్రస్తుతము ఈ భగవత్ప్రేమ ప్రతియొక్కరి హృదయము లందును నిద్రాణమై యున్నది. అది హృదయమందు అనేక విధములుగా వ్యక్తము చేయబడు చున్నను భౌతిక సంపర్కముచే కలుషితమై యుండును. కనుకనే హృదయమును మొదట భౌతిక సంపర్కము నుండి శుద్ధికావింపవలెను. తద్వారా నిద్రాణమై యున్నట్టి సహజమైన కృష్ణప్రేమ వెంటనే జాగృతము కాగలదు. దానికై అనుసరింప వలసిన విధానమంతయు ఇదియే.

భక్తియోగము నందలి సాధనభక్తిని అభ్యసించుట కొరకై మానవుడు నిష్ణాతుడైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి కొన్ని నియమముల ననుసరింపవలెను. భక్తుడు ప్రాత:కాలముననే నిద్రలేచి స్నానమాచరించుట, మందిరమునకు వెళ్ళి ప్రార్థనలను అర్పించుట, హరేకృష్ణ మహా మంత్రమును జపించుట, శ్రీవిగ్రహముల కొరకై పూలను సేకరించుట, శ్రీవిగ్రహముల కొరకై భోగప్రసాదమును సిద్ధము చేయుట తదుపరి ప్రసాదమును గ్రహించుట వంటి కార్యములను చేయవలయును. ఇట్లు అతడు

అనుసరింపవలసిన నియమ నిబంధనలనేకము గలవు. అతడు భగవద్గీత మరియు శ్రీమద్భాగవతమును శుద్ధభక్తుల నుండి నిత్యము శ్రవణము చేయవలెను. ఈ విధమైన అభ్యాసము ఎవ్వరినైనను భగవత్ప్రేమ స్థితికి ఉద్ధరింపగలదు. అప్పుడతడు నిశ్చయముగా భగవద్ధామమును చేరగలడు. ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి నియమ నిబంధనలతో ఆచరించు భక్తియోగాభ్యాసము ఎవ్వరినైనను నిశ్చయముగా భగవత్ప్రేమ స్థితికి గొనిపోగలదు.

## 12.10

**అభ్యాసే ప్యసమర్థో సి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥**

## అనువాదము

**భక్తియోగ నియమములను కూడ నీవు అభ్యసింపజాలనిచో నా కొరకు కర్మ నొనరించుటకు యత్నింపుము. ఏలయన నా కొరకు కర్మచేయుట ద్వారా నీవు పరిపూర్ణ స్థితిని పొందగలవు.**

## భాష్యము

ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి భక్తియోగము నందలి విధినియమములను కూడ అభ్యసింప లేనివారు దేవాదిదేవుని కొరకు కర్మచేయుట ద్వారా ఈ పరిపూర్ణస్థితిని పొందగలుగును. ఆ కర్మను ఏ విధముగా నిర్వహింప వలెనో అట్టి విషయము ఏకాదశాధ్యాయపు ఏబదియైదవ శ్లోకమున ఇదివరకే వివరింపబడినది. మానవుడు కృష్ణచైతన్య ప్రచారోద్యమమునకు అనుకూలముగా నుండవలెను. అట్టి కృష్ణచైతన్య ప్రచారోద్యమమున నెలకొనినట్టి ఎంతోమంది భక్తులకు సహాయమును అందింపవచ్చును. కనుక ఎవ్వరైనను భక్తియోగకు సంబంధించిన నియమ నిబంధనలను ప్రత్యక్షముగా అభ్యసింప లేకపోయినను, వారట్టి ప్రచార కార్యక్రమములకు తోడ్పడవచ్చును. ప్రపంచములోని ప్రతి కార్యము కొరకై కొంత స్థలము, పెట్టుబడి, వ్యవస్థ, పరిశ్రమ లనునవి అవసరములు. ఏదేని వ్యాపారమునకు స్థలము, పెట్టుబడి, పరిశ్రమ మరియు దానిని నడుపుటకు వ్యవస్థ అవసరమైనట్లే, శ్రీకృష్ణుని సేవకొరకు కూడా ఇవియన్నియు అవసరములగును. కాని ఆ రెండు కర్మలలో భేదామేమనగా, భౌతికస్థితి యందు మానవుడు ఇంద్రియతృప్తి కొరకై కర్మచేయును. రెండవ స్థితిలో కర్మను శ్రీకృష్ణుని సంతృప్తికొరకై చేయును. అప్పుడది ఆధ్యాత్మిక కర్మయగును. ఎవరైనను తగినంత ధనమును అధికముగా కలిగియున్నచో, వారు కృష్ణచైతన్య ప్రచార కార్యక్రమముల కొరకు కార్యాలయ భవనమును గాని మందిరమును గాని నిర్మింపవచ్చును. లేక కృష్ణసంబంధ విజ్ఞానమును ముద్రించుటకు తోడ్పడవచ్చును. ఇంకను వివిధములైన కృష్ణపరకర్మలనేకము గలవు. మానవుడు అట్టికర్మల యందు ఆసక్తుడై యుండవలెను. ఎవరైనను తమ కర్మల ఫలితమును సంపూర్ణముగా త్యాగము చేయకున్నచో దానియందు కొద్ది శాతమైనను కృష్ణచైతన్య ప్రచారము కొరకు త్యాగము చేయవచ్చును. ఈ విధముగా కృష్ణచైతన్యోద్యమ ప్రచారమునకై చేయు స్వచ్ఛంద సేవ మానవుని క్రమముగా అత్యున్నతమైన భగవత్ప్రేమ స్థితికి ఉద్ధరించును. కనుక అతడు పరిపూర్ణుడగును.

## 12.11

**అథైతదప్యశక్తో సి కర్తుం మద్యోగమాశ్రిత:।**
**సర్వకర్మఫలత్యాగం తత: కురు యతాత్మవాన్॥**

## అనువాదము

**అయినను ఒకవేళ నీవు నా భావనను కలిగి కర్మను చేయుట యందును అసమర్థుడవైనచో సర్వకర్మఫలములను విడిచి ఆత్మస్థితుడవగుటకు యత్నింపుము.**

## భాష్యము

సాంఘీక, కుటుంబ, మతసంబంధ పరిస్థితులచే గాని లేదా ఇతర ఆటంకములచే గాని మానవుడు కృష్ణచైతన్య ప్రచారోద్యమ కార్యక్రమములకు తోడ్పడలేకవచ్చును. అట్టి కార్యములలో ప్రత్యక్షముగా పాల్గొనినచో కుటుంబసభ్యుల నుండి ఆటంకములు గాని లేక పెక్కు ఇతర కష్టములు గాని కలుగవచ్చును. అట్టి సమస్య కలిగినవాడు తమ సంచిత కర్మఫలముల ద్వారా లభించిన ధనమును ఏదేని ఒక సత్కార్యమునకై త్యాగము చేయవచ్చునని ఉపదేశింపబడినది. అట్టి విధానములు వేదగ్రంథములందు వివరింపబడినవి. వివిధములైన యజ్ఞములు మరియు ప్రత్యేక పుణ్యకార్యముల యొక్క(పూర్వకర్మల ఫలమంతయు వినియోగించుటకు వీలైన ప్రత్యేక కార్యములు) వర్ణనలు అనేకము గలవు. వానిని చేయుటచే మానవుడు క్రమముగా జ్ఞానస్థితికి ఉద్ధరింపబడవచ్చును. కృష్ణచైతన్య కార్యములందు ఆసక్తిలేనివాడు కూడ కొన్నిమార్లు ఏదోఒక వైద్యాలయమునకు లేదా ఇతర సాంఘీక సంస్థకు గాని తాను కష్టపడి ఆర్జించిన దానిని దానము చేయుచుండును. ఇట్టి దానము కూడ ఇక్కడ సమర్థింపబడినది. ఎందుకనగా, ఎవరైనను తమ కర్మఫలములను త్యాగము చేయుటను అభ్యసించుట ద్వారా మానవుడు క్రమముగా తమ మనస్సును నిశ్చయముగా శుద్ధి చేసుకొన గలడు. అట్టి శుద్ధస్థితిలో అతడు కృష్ణచైతన్యము అనగానేమిటో అవగాహన చేసుకొనును. వాస్తవమునకు కృష్ణచైతన్యము స్వయముగా మనస్సును శుద్ధి చేయగల సామర్థ్యమును కలిగియున్నందున అది మరి యే ఇతర అనుభవము పైనను ఆధారపడదు. కాని కృష్ణచైతన్యమును ప్రత్యక్షముగా అంగీకరించుటలో ఆటంకములు కలిగినచో, మానవుడట్లు తన కర్మఫలములను త్యాగము చేయవచ్చును. కనుక ఆ విధముగా సంఘసేవ, సమాజసేవ, జాతిసేవ, దేశము కొరకు త్యాగము వంటివానిని అంగీకరింపవచ్చును. ఎందుకనగా మానవుడు వానివలన ఎప్పుడో ఒకప్పుడు దేవాదిదేవుని శుద్ధప్రేమయుక్త సేవాస్థితికి రావచ్చును. కనుకనే భగవద్గీత (18.46) నందు : "యత: ప్రవృత్తిర్భూతానాం" శ్రీకృష్ణుడే దివ్యకారణమని తెలియకున్నను, దివ్యకారణము కొరకు ఎవరైనను త్యాగము చేయ నిశ్చయించినచో అట్టి త్యాగవిధానము చేత అతడు శ్రీకృష్ణుడే దివ్యకారణమనెడి అవగాహనకు క్రమముగా అరుదెంచగలడు.

**12.12**
**శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ ॥**

**అనువాదము**

**ఈ అభ్యాసమును నీవు చేయలేకపోయినచో జ్ఞానసముపార్జనము నందు నియుక్తుడవగుము. అయినప్పటికిని జ్ఞానము కంటెను ధ్యానము, ధ్యానము కంటెను సర్వకర్మఫల త్యాగమును మేలైనట్టిది. ఏలయన అట్టి సర్వకర్మఫల త్యాగము వలన మానవుడు మనశ్శాంతిని పొందగలుగును.**

**భాష్యము**

గడచిన శ్లోకములందు చెప్పబడినట్లు, భక్తియుక్త సేవ రెండు రకములు. భక్తియోగ యొక్క విధినియమముల ననుసరించు చేయు మార్గము ఒకటి కాగా, దేవాదిదేవుని యందు పూర్తి ఆసక్తిని కలిగియుండు మార్గము మరొకటి. కృష్ణచైతన్య నియమములను వాస్తవముగా పాటింపలేని వారు జ్ఞానసముపార్జన చేయుట ఉత్తమము. ఎందుకనగా, అట్టి జ్ఞానసముపార్జనచే మానవుడు తన నిజస్థితిని అవగాహన చేసుకొనగలడు. అట్టిజ్ఞానము క్రమముగా ధ్యానస్థితికి పెంపొంద గలదు. ధ్యానము వలన క్రమముగా మానవుడు దేవాదిదేవుని అవగాహన చేసికొనగలడు. ఆత్మయే బ్రహ్మము అని తెలియజేయుటకు కొన్ని విధానములు గలవు. భక్తియుక్త సేవయందు నెలకొనుటకు ఆసక్తుడు కానిచో వారు అట్టి ధ్యానమును అవలంబింపవచ్చును. అతడు అట్టి ధ్యానము చేయలేనిచో వైదిక గ్రంథము లందు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులకు విధింపబడిన విధ్యుక్త ధర్మములను పాటింపవచ్చును. వీనిని మనము భగవద్గీత యందలి చివరి అధ్యాయము నుండి తెలుసుకోగలుగుదుము. కాని అన్ని మార్గము లందును మానవుడు తన కర్మయొక్క ఫలమును త్యాగము చేయవలసియే యున్నది. అనగా కర్మఫలములను ఏదో సత్కార్యము కొరకై వినియోగింప వలసి యుండును.

సారాంశమేమనగా, అత్యున్నత గమ్యమైన దేవాదిదేవుని చేరుటకు రెండు విధానములు గలవు. ఒక విధానము క్రమానుగతి వృద్ధి ద్వారా కాగా, రెండవది ప్రత్యక్ష విధానము. కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవ నొనర్చుట ప్రత్యక్ష విధానము. ఇతర విధానము నందు మానవుడు కర్మఫలత్యాగము చేయవలసి యుండును. అప్పుడు మానవుడు ఆత్మజ్ఞాన స్థితికిని, తరువాత ధ్యానస్థితికిని, ఆ తరువాత పరమాత్మావగాహన స్థితికిని అనంతరము దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగాహనకు చేరగలడు. మానవుడు ఈ క్రమవిధానమును గాని ప్రత్యక్ష విధానమును గాని ఎన్నుకోవచ్చును. ప్రత్యక్ష విధానము అందరికి సాధ్యము కాదు. కనుక పరోక్ష విధానము కూడ మంచిదే. కాని అర్జునునికి పరోక్ష విధానము ఉపదేశింప బడలేదని మనము గ్రహింపవలెను. ఎందుకనగా, అతడు ఇదివరకే ప్రేమతో దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవాస్థితి యందు నెలకొనియుండెను. అట్టిస్థితి యందు నెలకొనినవారి కొరకే ఆ పరోక్ష విధానము నిర్దేశింపబడినది. వారు త్యాగము, ఆత్మజ్ఞానము, ధ్యానము, బ్రహ్మానుభూతి, పరమాత్మానుభూతికి క్రమముగా వృద్ధినొందు విధానమును తప్పక పాటింపవలెను. కాని భగవద్గీత యందు ప్రత్యక్ష విధానమే నొక్కి చెప్పబడినది. కనుక ప్రతియొక్కరు ప్రత్యక్ష విధానమును స్వీకరించి దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునికి శరణు పొందవలెనని ఆదేశింపబడిరి.

## 12.13 - 14

**అద్వేష్టా సర్వభూతానాం మైత్ర: కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకార: సమదుఃఖసుఖ: క్షమీ ॥**

**సంతుష్ట: సతతం యోగీ యతాత్మ దృఢనిశ్చయ: ।**
**మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్త: స మే ప్రియ: ॥**

### అనువాదము

**ద్వేషము లేనివాడును, జీవులందరికిని దయతో కూడిన మిత్రుడును, యజమానిత్వ భావము లేనివాడును, అహంకారరహితుడును, సుఖదుఃఖములు రెండింటి యందును సమభావము కలవాడును, సహనశీలుడును, సదా సంతృప్తుడును, ఆత్మనిగ్రహము గలవాడును, తన మనోబుద్ధులను నా యందు లగ్నముచేసి దృఢనిశ్చయముతో నా భక్తియుక్త సేవ యందు నిమగ్నుడైనట్టి వాడును అగు నా భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడు.**

### భాష్యము

విశుద్ధమైన భక్తియుక్త సేవా విషయమునకే తిరిగి వచ్చుచు భగవానుడు ఈ రెండు శ్లోకములందును శుద్ధభక్తిని దివ్యగుణ లక్షణములను వర్ణించు చున్నాడు. శుద్ధభక్తుడు ఎట్టి పరిస్థితి యందును కలతనొందడు. అతడు ఎవ్వరిని ద్వేషింపడు. అదేవిధముగా, అతడు తన శత్రువులకు కూడ శత్రువుకాడు. పైగా అతడు : "నా పూర్వపాపకర్మల కారణముగా ఇతడు నా శత్రువుగా వర్తించు చున్నాడు. కనుక ఎదిరించుట కంటె కష్టమును సహించుటయే మేలు" అని భావించును. శ్రీమద్భాగవతము(10.14.8) ఇట్లు తెలుపుచున్నది : "తత్తే నుకంపాం సుసమీక్షమాణో భుంజాన ఏవాత్మకృతం విపాకమ్" అనగా భక్తుడు కలతకు గురియైనప్పుడు లేదా కష్టము ప్రాప్తించినప్పుడు దానిని భగవానుడు తన పై చూపు కృపగా భావించును. "నా పూర్వజన్మ పాపముల వలన ఇప్పుడు అనుభవించుచున్న కష్టము కంటెను అత్యంత దుర్భరమైన కష్టమును నేను అనుభవింపవలసి యున్నది. కాని దేవాదిదేవుని కృప వలననే నేను పొందవలసి యున్నటువంటి శిక్షనంతటిని పొందుట లేదు. ఆ శిక్షలో స్వల్పభాగమును మాత్రమే పొందుచున్నాను" అని భక్తుడు భావించును. కనుకనే అతడు దుఃఖపూరితము లైనట్టి పరిస్థితులెన్ని ఎదురైనను తానెల్లప్పుడును శాంతుడును, కలత నొందని వాడును, ఓర్పుతో కూడినవాడును అయియుండును. భక్తుడు తన శత్రువుతో సహా ప్రతియొక్కరి పట్లను దయను కలిగియుండును. 'నిర్మమ:' అనగా భక్తుడు తాను భౌతిక శరీరము కాదనెడి విషయమును పూర్తిగా ఎరుగుటచే అతడు దేహమునకు సంబంధించిన బాధలకును, కష్టములకును అధిక ప్రాధాన్య మివ్వడని అర్థము. దేహాత్మబుద్ధి లేనందున అతడు అహంకారము నుండి విముక్తుడై సుఖదుఃఖములందు సదా సమభావమును కల్గియుండును. అతడు క్షమాగుణమును కలిగి, భగవానుని కృపచే లభించిన దానితోడనే సంతృప్తుడగును. కష్టసాధ్యమైన దానినేదో పొందుటకు అతడు అతిగా ప్రయత్నింపక ఎల్లప్పుడు సంతృప్తుడై యుండును. ఆధ్యాత్మికాచార్యుడు చేసిన బోధనలందు నెలకొని యుండుటచే అతడు పరిపూర్ణ యోగి యనబడును. ఇంద్రియము లన్నియు నియంత్రింపబడి యున్నందున అతడు ధీరుడును మరియు స్థిరనిశ్చయుడై యుండును. ఎవ్వరును స్థిరనిశ్చయముతో కూడిన భక్తియుక్త సేవ నుండి అతనిని మరల్చలేనందున, ఆ భక్తుడు మిథ్యావాదములచే ఎన్నడును ప్రభావితుడు కాజాలడు. శ్రీకృష్ణుడు నిత్యుడైన భగవానుడనెడి సంపూర్ణ జ్ఞానమును కలిగియుండుటచే అతనిని

ఎవ్వరును కలత పరచలేరు. ఈ శుభలక్షణము లన్నియును అతడు తన మనోబుద్ధులను పూర్తిగా దేవాదిదేవుని యందు స్థిరీకరించుటకు సమర్థుని చేయగలవు. వాస్తవమునకు అట్టి ప్రామాణికమైనట్టి భక్తియుక్త సేవ నిస్సందేహముగా అరుదుగా కన్పించును. కాని భక్తుడు భక్తియుక్త సేవ విధినియమములను శ్రద్ధగా అనుసరించుట ద్వారా అట్టి దివ్యస్థితియందు నెలకొనగలడు. సంపూర్ణ కృష్ణచైతన్యముతో చేయబడు అతని కర్మలచే భగవానుడు సదా సంతృప్తి చెందియుండుటచే అట్టి భక్తుడు తనకు మిక్కిలి ప్రియుడగునని భగవానుడు చెప్పుచున్నాడు.

**12.15**
**యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ య: ।**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో య: స చ మే ప్రియ: ॥**

**అనువాదము**

**ఎవ్వరికినీ కష్టమును కలిగించనివాడును, ఎవరిచేతను కలతకు గురికాని వాడును, సుఖదుఃఖము లందును మరియు భయోద్వేగములందును సమచిత్తుడై యుండునట్టి మానవుడు నాకు మిక్కిలి ప్రియుడు.**

**భాష్యము**

భక్తుని లక్షణములు ఇంకను కొన్ని ఇక్కడ వర్ణింపబడుచున్నవి. అట్టి భక్తునిచే ఎవ్వనికిని కష్టముగాని, వేదనగాని, భయము గాని, అసంతృప్తిగాని కలుగదు. భక్తుడు అందరి పట్ల దయను కలిగియుండుటచే ఇతరులకు వేదన కలిగించునట్లు ఎన్నడును వర్తింపడు. అట్లే ఇతరులు తనకు వేదన కల్గింప యత్నించినను అతడు కలత నొందడు. భగవానుని కృపచే అతడు ఎట్టి బాహ్యక్షోభములచే కలత నొందకుండునట్లుగా అభ్యాసము కావించియుండును. వాస్తవమునకు భక్తుడు ఎల్లప్పుడు పూర్తిగా కృష్ణచైతన్యము నందును భక్తియుక్త సేవయందును నెలకొని యుండుటచే, అట్టి భౌతిక పరిస్థితులు అతనికి ఎట్టి కలతను కలిగింపజాలవు. సాధారణముగా భౌతికభావన కలిగిన మానవుడు తన ఇంద్రియ తృప్తికి ఏదేని లభించినచో అమితానందమును పొందును. ఇతరులు ఇంద్రియ తృప్తికై దేనినైనను పొంది తాను వాటిని పొందనప్పుడును అతడు అసూయతో శోకించును. శత్రువు నుండి దాడి సంభవించుటకు అవకాశమున్నచో అతడు భయగ్రస్థుడగును. ఏదైనా ఒక కార్యమును విజయవంతముగా నిర్వహింప లేకపోయినచో విషాదమునకు గురియగును. ఇట్టి కలత లన్నింటికిని అతీతుడైన భక్తుడు శ్రీకృష్ణునికి పరమప్రియమగును.

**12.16**
**అనపేక్ష: శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథ: ।**
**సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్త: స మే ప్రియ: ॥**

## అనువాదము

**సాధారణ కర్మవిధానముల నాశ్రయింపనివాడును, పవిత్రుడును, సమర్థుడును, ఉదాసీనుడును, సమస్త బాధల నుండి విముక్తుడైనవాడును, ఏదేని ఫలము కొరకై తీవ్రకృషి చేయనివాడును అగు నా భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడు.**

## భాష్యము

ఎవ్వరైనను భక్తునకు ధనమును అర్పింపవచ్చును. కాని భక్తుడు మాత్రము దానిని సంపాదించుటకు ఆరాటపడరాదు. భగవానుని కృప కారణముచే అప్రయత్నముగా ధనము లభించినచో అతడు పొంగిపోడు. సహజముగా భక్తుడు దినమునకు కనీసము రెండుసార్లు స్నానము చేయుచు భక్తియుక్త సేవ కొరకు తెల్లవారు ఝాముననే నిద్రలేచును. ఈ విధముగా అతడు అంతరము నందును బాహ్యము నందును కూడ సహజముగనే శుచిని కలిగియుండును. జీవితపు సమస్త కర్మల సారమంతటిని పూర్తిగా ఎరిగియుండుట చేతను, ప్రామాణిక శాస్త్రముల యందు విశ్వాసము గలవాడగుట చేతను, భక్తుడెల్లప్పుడును సర్వ సమర్థుడై యుండును. భక్తుడెప్పుడును ఒక ప్రత్యేక పక్షమున చేరనందున చింతారహితుడై యుండును. అతడు సర్వోపాధుల నుండి విముక్తుడై యుండుట చేత ఎన్నడును బాధపడడు. అతడు తన దేహము ఒక ఉపాధి అని తెలిసి యున్నందున ఏదేని దేహబాధలు కలిగినచో అతడు వాటినుండి అతీతుడై యుండును. అదేవిధముగా భక్తియోగ నియమములకు విరుద్ధ వలసినదైనటువంటి దేనికొరకును అతడు యత్నింపడు. ఉదాహరణకు, ఒకపెద్ద భవంతిని నిర్మించుటకు గొప్ప శక్తిసామర్థ్యముల అవసరముండును. అట్టి కార్యక్రమములు తన భక్తిని పెంపొందించు కొనుటకు లాభకరములు కానిచో భక్తుడైనవాడు అట్టి కార్యములను అంగీకరింపడు. కాని భగవానునికి మందిరమును నిర్మించుటకు అతడు సిద్ధపడును. దానికొరకు అతడు అన్నిరకములైన ఇబ్బందులను సహించును గాని తన బంధువుల కొరకు భవనమును నిర్మించుటకు యత్నింపడు.

**12.17**
**యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ య: స మే ప్రియ: ॥**

## అనువాదము

**ఉప్పొంగుట గాని దుఃఖించుట గాని తెలియనివాడు, శోకించుట గాని వాంఛించుట గాని ఎరుగనివాడు, శుభాశుభములు రెండింటిని విడిచిన వాడును అగు భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడు.**

## భాష్యము

భౌతికములైన లాభనష్టములు సంభవించినప్పుడు శుద్ధభక్తుడు హర్షమును గాని శోకమును గాని పొందడు. పుత్రుని గాని, శిష్యుని గాని పొంద వలెననెడి ఆరాటమును కలిగియుండడు. అట్లే, వారిని పొందనందుకు కలతకు గురికాడు. తనకు మిక్కిలి ప్రియమైన దానిని కోల్పోయినపుడు అతడు శోకింపడు. అట్లే, తాను కోరినది లభింపనపుడు అతడు కలత నొందడు. అట్టి భక్తుడు సర్వశుభములను, అశుభములను మరియు పాపకార్యములను ఎదుర్కొని నపుడు అతడు వాటికన్నింటికిని అతీతుడై యుండును. దేవాదిదేవుని సంతృప్తికై అతడు అన్నిరకముల కష్టములను అంగీకరించును. భక్తియుక్త సేవా నిర్వహణలో అతనికేదియును ఆటంకము కాజాలదు. అట్టి భక్తుడు శ్రీకృష్ణునికి మిక్కిలి ప్రియుడు.

**12.18 - 19**

**సమ: శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయో: ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమ: సఙ్గవివర్జిత: ॥**

**తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సన్తుష్టో యేన కేనచిత్ ।**
**అనికేత: స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నర: ॥**

## అనువాదము

**శత్రుమిత్రుల యెడ సమభావము కలిగినవాడును; మానావమానము లందును, శీతోష్ణములందును, సుఖదుఃఖములందును, నిందాస్తుతులందును సమబుద్ధి గలవాడును, దుష్టసాంగత్యము నుండి సదా విడివడి యుండువాడును, సదా మౌనము వహించువాడును, దేనిచేతనైనను సంతుష్టి నొందువాడును, నివాసమేదైనను లెక్కచేయనివాడును, జ్ఞానమునందు స్థితుడైనవాడును, నా భక్తియుక్త సేవ యందు నెలకొనినట్టివాడును అగు మానవుడు నాకు మిక్కిలి ప్రియుడు.**

## భాష్యము

భక్తుడు ఎల్లప్పుడును చెడు సాంగత్యమునకు దూరముగా నుండును. కొన్నిమార్లు ప్రశంసింపబడుట మరొకప్పుడు నిందింపబడుట యనునది మానవ సమాజపు స్వభావము. కాని భక్తుడు అట్టి కృత్రిమములైన కీర్తి అపకీర్తులకును, సుఖదుఃఖములకును సదా అతీతుడై సహనమును కలిగియుండును. శ్రీకృష్ణునికి సంబంధించిన విషయములను తప్ప అతడు మరిదేనిని గూర్చియు చర్చింపనందున అతడు 'మౌనీ' యనబడును. మౌని అనగా అసలు మాట్లాడకుండ నుండుట అని అర్థము కాదు. అసంబద్ధములైన విషయములను చర్చింపకూడదని అర్థము. వాస్తవమునకు ప్రతియొక్కరు అవసరములైన విషయములనే చర్చింపవలెను. దేవాదిదేవుని గూర్చిన చర్చయే భక్తునికి అవసరమైనది. అతడు అన్ని సందర్భము లందును ఆనందముగా నుండును. కొన్నిమార్లు భుజించుటకు రుచిగల పదార్థములను పొందినను, మరికొన్నిమార్లు పొందకపోయినను అతడు సదా సంతృప్తుడై యుండును. అతడు వసతి సౌకర్యము ఎట్టిదైనను లెక్కచేయడు. కొన్నిమార్లు అతడు చెట్టుక్రింద వసింపవచ్చును, మరికొన్నిమార్లు విలాసవంతమగు భవనము నందు నివసింపవచ్చును. ఈ రెండింటిచే అతడు ఆకర్షింపబడడు. అతడు తన నిశ్చితాభిప్రాయము నందును మరియు జ్ఞానము

నందును స్థిరుడై యుండును. కనుక అతడు స్థిరుడనియు చెప్పబడును. భక్తుని ఈ గుణలక్షణముల వర్ణనలలో కొన్ని పునరుక్తులు కనపడవచ్చును. భక్తుడు ఈ గుణలక్షణము లన్నింటినీ సంపాదింపవలెనని నొక్కిచెప్పుటకే అట్లు చేయబడినది. శుభలక్షణములు లేనిదే ఎవ్వరును శుద్ధభక్తులు కాజాలరు. "హరావభక్తస్య కుతో మహద్గుణా:" (భా.గ.5.18.12) అనగా భక్తుడు కానివానికి శుభలక్షణములు ఉండజాలవు. కనుక భక్తునిగా గుర్తింపబడు గోరువాడు ఈ శుభలక్షణములను పెంపొందించుకోవలెను. కాని ఈ గుణములను సాధించుటకై భక్తుడు ప్రత్యేకముగా ప్రయత్నింప నవసరము లేదు. కృష్ణచైతన్యము నందు, భక్తియుక్త సేవ యందు నిమగ్నత అనునది అట్టి గుణలక్షణములను పెంపొందించు కొనుటకు సహజముగానే అతనికి తోడ్పడును.

## 12.20

**యే తు ధర్మామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమో భక్తాస్తే తీవ మే ప్రియా:**

## అనువాదము

**నన్నే పరమగమ్యముగా చేసికొని, అమృతపథమైన ఈ భక్తియుక్త సేవా మార్గము ననుసరించుచు, శ్రద్ధతో దీనియందు సంపూర్ణముగా నియుక్తులైన వారు నాకు అత్యంత ప్రియులు.**

## భాష్యము

ఈ అధ్యాయపు రెండవ శ్లోకము "మయ్యావేశ్య మనో యే మామ్" (నా యందు మనస్సును సంలగ్నము చేసి) నుండి చివరి ఈ శ్లోకమైన "యే తు ధర్మామృతమిదమ్" ( ఈ నిత్యసేవా ధర్మము) వరకు శ్రీకృష్ణభగవానుడు తనను చేరుటకు గల దివ్యసేవా విధానములను వివరించెను. ఈ భక్తియుక్త సేవా కార్యములు శ్రీకృష్ణునకు మిక్కిలి ప్రియములు. మరియు వానియందు నెలకొనిన వారిని అతడు ప్రేమతో అనుగ్రహించును. నిరాకార బ్రహ్మోపాసన మార్గము నందు నెలకొనిన వాడు శ్రేష్ఠుడా లేక దేవాదిదేవుని ప్రత్యక్ష సేవయందు నెలకొనిన శ్రేష్ఠుడా అని అర్జునుడు ప్రశ్నించెను. దేవాదిదేవుని భక్తియుక్త సేవయందు నెలకొని యుండుటయే ఆధ్యాత్మికానుభూతి పద్ధతులలో అత్యంత శ్రేష్ఠమనుటలో ఎట్టి సందేహము లేదని శ్రీకృష్ణుడు స్పష్టముగా సమాధానము చెప్పియున్నాడు. మరోలా చెప్పాలంటే, మానవుడు సత్సాంగత్యముచే శుద్ధప్రేమ యుక్త సేవయందు ఆసక్తిని పెంపొందించు కొనుననియు పిమ్మట ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని అంగీకరించి అతని నుండి శ్రవణకీర్తనలను చేయుటకు ఆరంభించి శ్రద్ధ, ఆసక్తి, భక్తిభావములతో భక్తియుక్త సేవకు సంబంధించిన నియమ నిబంధనలను పాటించుచు శ్రీకృష్ణభగవానుని దివ్యసేవయందు నెలకొనుననియు ఈ అధ్యాయమున నిర్ణయింపబడినది. కనుక ఆత్మానుభూతికి (శ్రీకృష్ణభగవానుని పొందుటకు) భక్తియుక్త సేవయే పరమోత్తమ మార్గమనుటలో ఎట్టి సందేహము లేదు. ఈ అధ్యాయమున తెలుపబడినట్లు పరతత్త్వపు నిరాకారతత్త్వభావన మనునది మానవుడు ఆధ్యాత్మికానుభూతి కొరకు శరణుపొందుట వరకు మాత్రమే ఉచితమైనది. అనగా శుద్ధభక్తులతో సాంగత్యమును పొందుటకు అవకాశము కలుగనంత వరకే నిరాకార తత్త్వభావన లాభకరముగా నుండును. పరతత్త్వపు నిరాకారభావనలో మానవుడు ఆత్మానాత్మవిచక్షణ కొరకు నిష్కామముగా కర్మచేయుచు, ధ్యానించుచు, జ్ఞానసముపార్జనము చేయును. శుద్ధభక్తుని సాంగత్యము పొందనంత వరకే మానవునికి

ఇది అవసరము. కాని అదృష్టవశాత్తు ఎవ్వరైనను కృష్ణచైతన్యములో భక్తియుక్త సేవయందు ప్రత్యక్షముగా నెలకొనవలెనను కోరికను వృద్ధిచేసికొనినచో, ఆత్మానుభూతి నందు క్రమముగా ఒక మెట్టు నుండి మరొక మెట్టుకు పురోగమించ నవసరము లేకుండును. భగవద్గీత యందలి ఈ నడుమ గల ఆరు అధ్యాయము లందు వర్ణింపబడినట్టి భక్తియుక్త సేవ మిక్కిలి అనుకూలమైనది. భగవానుని కృపచే సర్వము అప్రయత్నముగనే నిర్వహింపబడును. కనుక అట్టి భక్తియుక్తసేవ యందు నెలకొనినవాడు దేహపోషణల కొరకై చింతింప నవసరము లేదు.

**శ్రీమద్భగవద్గీత యందలి ‘భక్తియోగము’ అను ద్వాదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

------

# త్రయోదశాధ్యాయము
# ప్రకృతి, పురుషుడు, చైతన్యము

**13.1 - 2**
**అర్జున ఉవాచ**
**ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞమేవ చ ।**
**ఏతద్ వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥**

**శ్రీభగవానువాచ**
**ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహు: క్షేత్రజ్ఞ ఇతి తద్విద: ॥**

**అనువాదము**

**అర్జునుడిట్లు పలికెను : ప్రియమైన కృష్ణా! ప్రకృతిని గూర్చియు పురుషుని (భోక్త)గూర్చియు, క్షేత్రమును గూర్చియు, క్షేత్రము నెరింగినవానిని గూర్చియు, జ్ఞానమును మరియు జ్ఞానలక్ష్యమును గూర్చియు నేను తెలియగోరుచున్నాను.**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ కౌంతేయా! ఈ దేహము క్షేత్రమనియు మరియు ఈ దేహము నెరిగినవాడు క్షేత్రజ్ఞుడనియు పిలువబడును.**

**భాష్యము**

'ప్రకృతి', 'పురుషుడు'(భోక్త), 'క్షేత్రము'(దేహము), 'క్షేత్రజ్ఞుడు'(క్షేత్రము నెరిగినవాడు), జ్ఞానము, జ్ఞానలక్ష్యములను గూర్చి ఎరుగవలెనని అర్జునుడు ఉత్సాహ పడుచుండెను. అర్జునుడు ఈ విషయములను గూర్చి విచారణ చేసినప్పుడు ఈ దేహము క్షేత్రమనబడుననియు, దేహము నెరిగినవాడు క్షేత్రజ్ఞునిగా పిలువబడుననియు శ్రీకృష్ణభగవానుడు తెలిపెను. ఈ దేహము బద్ధజీవికి కర్మక్షేత్రము. బద్ధజీవి భౌతిక జీవితమున చిక్కుకొని ప్రకృతిపై ఆధిపత్యము వహింపవలెనని యత్నించును. ఆ విధముగా భౌతిక ప్రకృతిపై ఆధిపత్యము వహించు తన సామర్థ్యము ననుసరించి అతడు కర్మక్షేత్రమును పొందును. దేహమే ఆ కర్మక్షేత్రము. ఆ దేహము ఎట్టిది? ఆ దేహము ఇంద్రియములతో కూడినట్టిది. బద్ధజీవి ఇంద్రియ సుఖముల ననుభవింపగోరును. ఆ ఇంద్రియ సుఖమును అనుభవించుటకు గల సామర్థ్యము ననుసరించి అతనికి ఒక దేహము(కర్మక్షేత్రము)అందింపబడును. కనుక దేహము బద్ధజీవుని క్షేత్రమని లేక కర్మక్షేత్రమని చెప్పబడినది. దేహాత్మబుద్ధి లేకుండా అట్టి దేహము నెరిగినవాడు క్షేత్రజ్ఞుడనబడును. క్షేత్రమునకు మరియు క్షేత్రజ్ఞునకు అనగా దేహమునకు మరియు దేహము నెరింగిన వానికి నడుమ గల భేదమును ఎరుగుట కష్టమేమి కాదు. ఉదాహరణకు బాల్యము నుండి వృద్ధాప్యము వరకును దేహమునందు అనేక మార్పులు జరుగుచున్నను దేహధారి మాత్రము ఏ మార్పు నొందకుండును. ఈ విధముగా క్షేత్రమునకు మరియు క్షేత్రజ్ఞునికి నడుమ భేదము గలదు. ఇట్లు బద్ధజీవుడు తాను దేహము కంటె భిన్నుడనని అవగాహన చేసుకొనగలడు. జీవుడు దేహము నందు స్థితిని కలిగి యుండుననియు, ఆ దేహము శైశవము నుండి బాల్యమునకు, బాల్యము నుండి యౌవనమునకును, యౌవనము నుండి వృద్ధాప్యమునకు మార్పు చెందుచున్నదనియు మరియు దేహము గలవాడు (దేహయజమాని) తన దేహము అట్లు మార్పు

చెందుచున్నట్లు ఎరుగననియును 'దేహినో స్మిన్' అను శ్లోకము ద్వారా వర్ణింపబడినది(2.13). దేహయజమానియే 'క్షేత్రజ్ఞుడు' అనుట స్పష్టము. జీవుడు "నేను సుఖముగా నున్నాను", "నేను పురుషుడను", "నేను స్త్రీని", "నేను శునకమును", "నేను మార్జాలమును" అని భావించుచుండును. ఇవి క్షేత్రజ్ఞుని ఉపాధులు మాత్రమే. కాని క్షేత్రజ్ఞుడు దేహము కంటెను భిన్నుడు. వస్త్రముల వంటి అనేక వస్తువులను మనము వినియోగించుచున్నను, వాటికంటే మనము భిన్నులమని ఎరుగుదుము. అట్లే కొద్దిగా ఆలోచించినచో మనము దేహము కంటె భిన్నులమని స్పష్టముగా ఎరుగగలుగుదుము. నేను లేదా నీవు లేదా దేహము గల వారెవరైనను క్షేత్రజ్ఞుడనియు అనగా కర్మక్షేత్రమును ఎరిగిన వారమనియు చెప్పబడుదుము. దేహము క్షేత్రము లేక కర్మక్షేత్రమని పిలువబడును.

భగవద్గీత యందలి మొదటి ఆరు అధ్యాయము లందు దేహము నెరిగిన వానిని (జీవుడు) గూర్చియు మరియు ఎట్టిస్థితిలో అతడు దేవాదిదేవుని ఎరుగ గలడనెడి విషయమును గూర్చియు వివరముగా వర్ణింపబడినది. భగవద్గీత నడుమ గల ఆరు అధ్యాయములందు దేవాదిదేవుని గూర్చియు భక్తియుక్త సేవా విషయమున జీవాత్మ మరియు పరమాత్మకును నడుమ గల సంబంధమును గూర్చియు వర్ణింపబడినది. ఈ అధ్యాయము నందు దేవాదిదేవుని దివ్యస్థితియు మరియు జీవాత్మ యొక్క పరతంత్ర స్థితియు స్పష్టముగా తెలుపబడినది. జీవులు అన్ని పరిస్థితుల యందును పరతంత్రులైనను, మరుపు కారణముగా వారు దుఃఖముల పాలవుతున్నారు. కాని పుణ్యకర్మలచే జ్ఞానవంతులైనచో ఆర్తి, జిజ్ఞాసు, అర్థార్థి, జ్ఞాని అను వివిధ రూపములలో పరమపురుషుని చేరుదురని కూడ వర్ణింపబడినది. ఇప్పుడు ఈ త్రయోదశాధ్యాయపు ఆరంభము నుండి జీవుడు భౌతిక ప్రకృతితో ఎట్లు సంపర్కమునకు వచ్చునో మరియు ఏ విధముగా అతడు ప్రకృతి బంధముల నుండి శ్రీకృష్ణభగవానుని కృపచే కామ్యకర్మలు, జ్ఞానసముపార్జనము, భక్తియుక్త సేవ యనెడి వివిధ విధానముల ద్వారా విముక్తుడగునో వివరింపబడినది. జీవుడు భౌతిక దేహము కంటెను పూర్తిగా భిన్నుడైనప్పటికిని ఏదోవిధముగా అతడు దానితో సంబంధము గలవాడగును. ఆ విషయము కూడ వివరింపబడినది.

## 13.3

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోర్ జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥**

### అనువాదము

**ఓ భరతవంశీయుడా! సర్వ దేహములందును నేను కూడా క్షేత్రజ్ఞుడనని నీవు ఎరుగుము. దేహమును మరియు దేహము నెరిగిన వానిని తెలిసికొనుటయే జ్ఞానమనబడును. అదియే నా అభిప్రాయము.**

### భాష్యము

దేహము మరియు దేహము నెరిగినవాని గూర్చియు, ఆత్మ మరియు పరమాత్ముని గూర్చియు చర్చించునపుడు భగవానుడు, జీవుడు, భౌతిక పదార్థము అను మూడు విభిన్నాంశములు మనకు గోచరించును. కర్మక్షేత్రమైన ప్రతి దేహము నందు జీవాత్మ, పరమాత్మ అను రెండు ఆత్మలు గలవు. అట్టి పరమాత్మ దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని

స్వరూపాంశమగుటచే శ్రీకృష్ణభగవానుడు, "నేను కూడా క్షేత్రజ్ఞుడను. కాని నేను దేహము నందలి జీవాత్మ యనబడు క్షేత్రజ్ఞుడను కాను. నేను పరమక్షేత్రజ్ఞుడను. నేను పరమాత్మగా ప్రతిదేహము నందును నెలకొని యున్నాను" అని చెప్పుచున్నాడు.

భగవద్గీత ననుసరించి ఈ కర్మక్షేత్రమును గూర్చియు, కర్మక్షేత్రము నెరిగిన క్షేత్రజ్ఞుని గూర్చియు, సూక్ష్మాతిసూక్ష్మముగా పరిశీలిస్తూ అధ్యయనము చేయువాడు ఆ సంపూర్ణ జ్ఞానమును పొందగలుగును.

"జీవుల దేహము లన్నింటి యందును నేను క్షేత్రజ్ఞుడనై యుందును" అని భగవానుడు చెప్పుచున్నాడు. జీవుడు తన దేహమును గూర్చి మాత్రమే ఎరిగి యుండవచ్చును. కాని అతనికి ఇతర దేహముల గూర్చిన జ్ఞానముండదు. పరమాత్మగా సర్వ దేహములందు నెలకొనినట్టి దేవాదిదేవుడు మాత్రము సమస్త దేహములను గూర్చిన సర్వ విషయముల నెరుగును. అతడు వివిధ జీవజాతుల వివిధ దేహములను సంపూర్ణముగా ఎరిగియుండును. దేశపౌరుడు తనకున్న కొద్దిపాటి భూభాగమును గూర్చి ఎరుగవచ్చును. కాని దేశమునేలెడి రాజు తన రాజప్రాసాదమును గూర్చియే కాకుండ పౌరులందరును వ్యక్తిగతముగా కలిగి యున్నట్టి ఆస్తులన్నింటిని గూర్చియు ఎరిగియుండును. అదేవిధముగా, జీవుడు వ్యక్తిగతముగా తన దేహమునకు యజమాని కావచ్చును. కాని పరమపురుషుడు సర్వదేహములకును యజమానుడై యుండును. రాజ్యము నేలెడి రాజు రాజ్యమునకు ప్రధాన యజమానుడు. పౌరుడు అప్రధాన యజమానుడు. అట్లే పరమపురుషుడు దేహము లన్నింటికిని సర్వాధికారి.

దేహము ఇంద్రియములను కూడియుందును. పరమపురుషుడు 'హృషీకేశుడు' అనగా ఇంద్రియములను నియంత్రించువాడు అని అర్థము. రాజ్యములోని సమస్త కార్యములకును రాజు ప్రధాన నిర్వాహకుడైనట్లు, దేవాదిదేవుడు సర్వేంద్రియములకు ఆది నియామకుడు. "నేను కూడా క్షేత్రజ్ఞుడను" అని భగవానుడు చెప్పుచున్నాడు. అనగా అతడు పరమ క్షేత్రజ్ఞుడనియు, జీవాత్మ తన ప్రత్యేక దేహమును మాత్రమే ఎరుగుననియు భావము. కనుకనే వేదవాఙ్మయమైన మహాభారతము(12.339.6) నందు ఇట్లు చెప్పబడినది :

క్షేత్రాణి హి శరీరాణి బీజం చాపి శుభాశుభే।
తాని వేత్తి న యోగాత్మ తత: క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥

"ఈ దేహము క్షేత్రమనబడును. దీనియందు క్షేత్రజ్ఞుడు (దేహము యొక్క యజమాని) మరియు క్షేత్రక్షేత్రజ్ఞులను గూర్చి తెలిసిన పరమపురుషుడు నివసించును. కనుక భగవానుడు సర్వక్షేత్రజ్ఞుడని చెప్పబడినాడు." కర్మక్షేత్రమైన దేహమునకును, కర్మజ్ఞునకును, పరమ కర్మజ్ఞునకును నడుమ గల భేదము ఈ విధముగా వివరింపబడినది. దేహము, ఆత్మ, పరమాత్మల వాస్తవస్థితిని గూర్చి పూర్తిగా ఎరుగుటయే వైదిక గ్రంథములందు జ్ఞానముగా చెప్పబడుచున్నది. అదియే శ్రీకృష్ణుని అభిప్రాయము. ఆత్మ మరియు పరమాత్మలు ఒకటేయైనను అదేసమయమున వాటి మధ్య భేదము గలదను అవగాహనయే జ్ఞానము. కర్మక్షేత్రమైన దేహమును మరియు దేహము నెరిగిన క్షేత్రజ్ఞుని ఎరుగలేనివాడు సంపూర్ణ జ్ఞానవంతుడు కాజాలడు. ఏదేని ఒక చిత్రమును చూచువాడు చిత్రకారుని గూర్చియు, చిత్రమును గూర్చి, చిత్రఫలకమును గూర్చి ఎట్టి భ్రమకు గురికానట్లుగా మానవుడు ప్రకృతి యొక్కయు, పురుషుని యొక్కయు (ప్రకృతి యొక్క భోక్త), ఈశ్వరుని యొక్కయు (ప్రకృతిని జీవాత్మను నియమించు క్షేత్రజ్ఞుడు)

స్థితిని సంపూర్ణముగా అవగాహనము చేసుకొనవలెను. ఈ మూడింటికి సంబంధించిన వివిధ స్థితులకు సంబంధించిన విషయమున ఎవరును ఎట్టి భ్రమకు గురికారాదు. కర్మక్షేత్రమైన ఈ భౌతిక జగత్తుయే ప్రకృతి. అట్టి ప్రకృతిని అనుభవించువాడు జీవుడు. ఈ రెండింటిని నియంత్రించువాడు పరమేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు. ఈ విషయమున 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (1.12) నందు ఇట్లు చెప్పబడినది :

భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా ।
సర్వం ప్రోక్తం త్రివిధం బ్రహ్మమేతత్ ॥

"బ్రహ్మభావములు మూడు విధములుగా గలవు. ప్రకృతియే కర్మక్షేత్ర రూపమైన బ్రహ్మము, జీవుడు కూడా బ్రహ్మము. అతడు భౌతిక ప్రకృతిని నియంత్రించుటకు యత్నించు చుండును. ప్రకృతి మరియు జీవుడు వీరిరువురిని నియంత్రించు వాడు కూడా బ్రహ్మమే. కాని అతడే నిజమైన నియామకుడు."

ఈ అధ్యాయమున క్షేత్రము నెరిగిన ఈ ఇరువురు క్షేత్రజ్ఞులలో ఒకడు చ్యుతుడనియు, మరొకడు అచ్యుతుడనియు కూడ వివరింపబడినది. ఒకడు దివ్యుడు, మరొకడు పరతంత్రుడు. ఈ ఇరువురు క్షేత్రజ్ఞులు ఒక్కరేనని భావించువాడు, "నేను కూడా క్షేత్రజ్ఞుడను" అని స్పష్టముగా చెప్పుచున్నట్టి దేవాదిదేవుని వాక్కులను నిరాకరించిన నిరాకరించిన వారగుదురు. త్రాడును చూచి పామని భ్రమించువాడు జ్ఞానవంతుడు కాడు. వాస్తవమునకు అనేక రకములైన దేహములు మరియు అనేక రకములైన దేహయజమానులు కూడ గలరు. ప్రతిజీవాత్మయు భౌతిక ప్రకృతిపై అధికారము చెలాయించుటకు తగిన వ్యక్తిగత సామర్థ్యమును కలిగియుండుటచే ఈ వివిధ దేహము లేర్పడుచున్నవి. కాని వాటన్నింటి యందును దేవాదిదేవుడు దివ్య నియామకుడుగా నిలిచియున్నాడు. కనుకనే ఇక్కడ 'చ' అను పదము మహత్త్వపూర్ణమైనది. ఎందుకనగా, అది దేహములన్నింటి సంఖ్యను సూచించుచున్నది. (క్షేత్రసముచ్చయ). శ్రీల బలదేవ విద్యాభూషణుల అభిప్రాయము కూడ ఇదియే. జీవాత్మకు భిన్నముగా ప్రతి దేహము నందు శ్రీకృష్ణుడు అంతర్యామి రూపమున నెలకొని యున్నాడు. క్షేత్రమునకు మరియు దాని భోక్తకు పరమాత్ముడే నియామకుడని తెలుసుకొనుటయే నిజమైన జ్ఞానమని శ్రీకృష్ణుడు ఇక్కడ స్పష్టముగా చెప్పుచున్నాడు.

## 13.4

**తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్ ।**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥**

## అనువాదము

**ఇప్పుడు ఈ క్షేత్రమును, అది నిర్మింపబడిన విధానమును, దానియందలి మార్పులను, దేనినుండి అది ఉద్భవించినదనెడి విషయమును, క్షేత్రజ్ఞుడెవడు మరియు అతని ప్రభావములను గూర్చిన నా సంక్షిప్త వర్ణనను ఆలకింపుము.**

## భాష్యము

భగవానుడు కర్మక్షేత్రమును, కర్మక్షేత్రపు జ్ఞాతయైన క్షేత్రజ్ఞుని వారి సహజ స్థితులను గూర్చి ఇక్కడ వర్ణించుచున్నాడు. ఈ దేహము ఎట్లు నిర్మింప బడుచున్నది, ఏ

మూలకములచే ఇది ఏర్పడుచున్నది. ఎవరి అధీనమున ఈ దేహము పనిచేయుచున్నది, దీనియందు మార్పులు ఎట్లు కలుగుచున్నవి, ఈ మార్పులు ఎక్కడ నుండి కలుగు చున్నవి, అట్టి మార్పులకు కారనములేవి? జీవాత్మకు చరమగమ్యమేది? ఆత్మ యొక్క నిజమైన రూపమేది? అను విషయములను ప్రతియొక్కరు ఎరుగవలసియున్నది. అట్లే, జీవాత్మకును పరమాత్మకును నడుమ గల భేదమును, వాటి వివిధములైన ప్రభావములు, శక్తులు వంటి వానిని కూడ మానవుడు ఎరుగవలసి యున్నది. ఎవరైనను, దేవాదిదేవుడు స్వయంగా ఉపదేశించిన వర్ణనముల నుండి ఈ భగవద్గీతను అవగాహన చేసికొనినచో సర్వము స్పష్టము కాగలదు. కాని దేహము లన్నింటి యందున్న దేవాదిదేవుడు జీవాత్మతో సమానుడని ఎవ్వరును భావింపరాదు. అట్టిభావన కొంతవరకు శక్తిమంతుడైనవానిని శక్తిహీనుడితో సమానము చేయుటయే కాగలదు.

**13.5**

**ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధై: పృథక్ ।**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితై: ॥**

## అనువాదము

**క్షేత్రము మరియు క్షేత్రజ్ఞులను గూర్చిన ఆ జ్ఞానము పలువురు ఋషులచే వివిధ వేదగ్రంథము లందు వర్ణింపబడినది. అట్టి జ్ఞానము విశేషముగా 'వేదాంత సూత్రము' లందు కార్యకారణములతో హేతుబద్ధముగా ప్రకటింపబడినది.**

## భాష్యము

వాస్తవమునకు ఈ క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానమును విశదీకరించుటలో దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే అత్యున్నత ప్రామాణికాధికారి. అయినను విద్వాంసులు మరియు ప్రామాణికాధికారుల పూర్వపు ప్రామాణిక గ్రంథముల నుండి ఎల్లప్పుడును నిదర్శనములను చూపుచుందురు. ప్రామాణిక గ్రంథములుగా అంగీకరింపబడిన 'వేదాంత సూత్రము'లను నిదర్శనములుగా చూపుచు ఇక్కడ శ్రీకృష్ణుడు ఆత్మపరమాత్మల యొక్క ద్వైతాద్వైతములకు సంబంధించిన మిక్కిలి వివాదాస్పదమైన విషయమును వివరించుచున్నాడు. కనుకనే తొలుత అతడు "ఇది పలువురు ఋషుల అభిప్రాయముల ననుసరించి యున్నది" అని చెప్పుచున్నాడు. అట్టి ఋషులలో 'వేదాంత సూత్ర' కర్తయైన వ్యాసదేవుడు ఒక గొప్పఋషి. 'వేదాంత సూత్రము'లందు ద్వైతత్వము పూర్తిగా వ్యక్తము చేయబడినది. వ్యాసదేవుని తండ్రియైన పరాశరముని కూడ గొప్పఋషియే. అతడు తన 'విష్ణుపురాణము' (2.13.69-71) నందు : "అహం త్వం చ తథాన్యే..." అని రచించియుండెను. అనగా "నీవును, నేనును పలువురును ఇతర జీవులందరును భౌతిక దేహముల యందున్నను వాస్తవమునకు మనమందరము ఆధ్యాత్మిక ప్రకృతికి చెందినవారమే. కాని ఇప్పుడు భిన్నమైన మన వివిధ కర్మల ననుసరించి భౌతిక ప్రకృతికి సంబంధించిన వివిధ గుణములచే బంధితులమైతిమి. కనుక కొందరు ఉత్తమ గుణస్థితి యందుండగా, మరికొందరు అధమ స్థితి యందున్నారు. కాని ఈ ఉత్తమ, అధమ స్వభావము లనునవి అజ్ఞానము వలన కలుగుచు అసంఖ్యాకులైన జీవులుగా ప్రకటమగుచుండును. కాని పతనము లేనటువంటి పరమాత్ముడు మాత్రము ప్రకృతికి సంబంధించిన త్రిగుణములచే కలుషితుడు కాకుండ దివ్యుడై యున్నాడు." అట్లే మూల వేదగ్రంథము లందు జీవాత్మకును, పరమాత్మకును,

దేహమునకును నడుమ గల భేదము వివరముగా చెప్పబడినది. దీనిని వివరించిన పలువురు మహర్షులలో పరాశరముని ప్రముఖునిగా పరిగణింపబడుచున్నాడు. ఈ విషయమే ముఖ్యముగా 'కఠోపనిషత్తు'(2.2.13) నందు కూడ చెప్పబడినది.

ఈ శ్లోకము నందలి 'చంధోభి:' అను పదము వివిధ వైదిక గ్రంథములను సూచించును. ఉదాహరణకు యజుర్వేద శాఖయైన 'తైత్తిరీయోపనిషత్తు'- ప్రకృతిని, జీవుని, దేవాదిదేవుని గూర్చి వర్ణించుచున్నది.

ఇదివరకే చెప్పబడినట్లు, దేహము కర్మక్షేత్రము. దీనిలో ఆత్మ మరియు పరమాత్మ అను ఇరువురు క్షేత్రజ్ఞులు గలరు. ఈ అంశము 'తైత్తిరీయోపనిషత్తు' (2.5.1) నందు "బ్రహ్మపుచ్చం ప్రతిష్ఠా" యని చెప్పబడినది. 'అన్నమయ' (జీవనము కొరకై ఆహారముపై ఆధారపడుట) – అనబడు దేవాదిదేవుని శక్తి యొక్క వ్యక్తీకరణ మొకటి కలదు. వాస్తవమునకు ఇది దేవాదిదేవుని గూర్చిన భౌతికానుభూతి. 'ప్రాణమయ' మందు పరతత్త్వమును ఆహారము నందు అనుభూత మొనర్చుకొనిన పిమ్మట, మానవుడు దానిని జీవలక్షణములతో లేక జీవరూపములలో అనుభూతి చెందవచ్చును. 'జ్ఞానమయ' మందు పరతత్త్వపు అనుభూతి యనునది జీవలక్షణములను దాటి ఆలోచన, అనుభూతి, కోరిక అనువాటి వరకును వ్యాపించును. తరువాత 'విజ్ఞానమయ' అనబడు బ్రహ్మానుభూతి ఉండును. ఇందులో జీవుని నిజతత్త్వము అతని మనస్సు మరియు జీవ లక్షణములకు భిన్నముగా నుండును. ఆ తరువాతదే దివ్యానంద స్వభావపు అనుభూతియైన 'ఆనందమయ' అను అత్యున్నత స్థితి. ఈ విధముగా బ్రహ్మానుభూతికి ఐదు దశలు గలవు. వీటినన్నింటిని కలిపి 'బ్రహ్మపుచ్చమ్' అనబడును. ఈ ఐదింటిలోని అన్నమయ, ప్రాణమయ, జ్ఞానమయములను మొదటి మూడుస్థితులు జీవుల కర్మక్షేత్రములతో కూడియున్నవి. ఈ జీవుల కర్మక్షేత్రము లన్నింటికి అతీతముగా 'ఆనందమయుడు' అని పిలువబడు పరమ పురుషుడుండును. 'వేదాంత సూత్రము' (1.1.12) కూడా పరమపురుషుని వర్ణించును, "ఆనందమయో భ్యాసాత్" అనగా దేవాదిదేవుడు స్వభావముచే ఆనందమయుడై యుండునని వర్ణించును. దివ్యానందము ననుభవించుటకే అతడు 'విజ్ఞానమయ', 'ప్రాణమయ', 'జ్ఞానమయ' మరియు 'అన్నమయ' కోశముల లోనికి విస్తరించును. కర్మక్షేత్రములో జీవి భోక్తగా పరిగణింపబడును. 'ఆనందమయుడు' అయిన భగవానుడు అతనికి భిన్నుడు. అనగా జీవుడు ఒంటరిగా కాకుండ ఆనందమయుడైన భగవానునితో కలిసి భోక్తయగుటకు నిశ్చయించు కొనినచో అపుడు పరిపూర్ణుడగును. పరమక్షేత్రజ్ఞునిగా భగవానుని తత్త్వము, పరతంత్ర క్షేత్రజ్ఞునిగా జీవుని తత్త్వము, కర్మక్షేత్రపు స్వభావముల యథార్థ చిత్తరువు ఇదియే. ఈ సత్యమునకై మానవుడు 'బ్రహ్మ సూత్రము'లందు (వేదాంత సూత్రములు) అన్వేషింపవలెను.

'బ్రహ్మ సూత్రము' లందలి ధర్మములు కార్యకారణముల ననుసరించి చక్కగా ఏర్పరుపబడినవని ఈ శ్లోకమున చెప్పబడుచున్నది. "న వియదశ్రుతే:" (2.3.1), "నాత్మా శ్రుతే:"(2.3.16), "పరాత్తు తచ్ఛ్రుతే:" (2.3.39) అనునవి 'బ్రహ్మ సూత్రము'లోని కొన్ని సూత్రములు. వీనిలో మొదటిసూత్రము కర్మ క్షేత్రమును, రెండవ సూత్రము జీవుని, మూడవసూత్రము వివిధ జీవరాసులలోని పరమార్థమైన పరమపురుషుని సూచించును.

**13.6 - 7**
**మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ ।**
**ఇన్ద్రియాణి దశైకం చ పంచ చేన్ద్రియగోచరా: ॥**

**ఇచ్ఛా ద్వేష: సుఖం దుఃఖం సఙ్ఘాతశ్చేతనా ధృతి: ।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥**

## అనువాదము

**పంచమహాభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము, దశేంద్రియములు, మనస్సు, పంచేంద్రియ విషయములు, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, సముదాయము, చైతన్యము, విశ్వాసము అనునవి సంగ్రహముగా కర్మ క్షేత్రముగను, దాని అంత:ప్రక్రియలుగను భావింపబడుచున్నవి.**

## భాష్యము

మహర్షుల ప్రామాణిక వచనములు, వేదమంత్రముల ననుసరించి మరియు 'వేదాంత సూత్రము'ల ననుసరించియు ఇరువది నాలుగు ప్రపంచ నిర్మాణ మూలకములను ఈ క్రింది విధముగా అవగాహనము చేసుకొనవచ్చును. వానిలో మొదటిది భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము – అను పంచ 'మహాభూతములు'. తరువాత అహంకారము, బుద్ధి, ప్రకృతి యొక్క త్రిగుణముల 'అవ్యక్త' స్థితియు, ఆ తరువాత నాసిక, నేత్రములు, వీనులు, జిహ్వ, స్పర్శ అనెడి పంచ జ్ఞానేంద్రియములు, ఆ పిదప వాక్కు, పాదములు, హస్తములు, గుదము, జననేంద్రియములనెడి పంచ కర్మేంద్రియములు. అనంతరము ఆ ఇంద్రియముల పైన మనస్సు గలదు. ఈ మనస్సు అంతరము నందుండుటయే దానిని అంతరేంద్రియమని చెప్పవచ్చును. కనుక ఈ మనస్సుతో కలిసి మొత్తము పదునొకండు ఇంద్రియములు గలవు. తరువాత శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనెడి అయిదు ఇంద్రియార్థములు గలవు. ఈ ఇరువది నాలుగు అంశముల సముదాయమే కర్మక్షేత్రముగా పిలువబడుచున్నది. ఎవరైనను ఈ ఇరువదినాలుగు అంశములను విశ్లేషణాత్మకముగా అధ్యయనము చేసినచో కర్మక్షేత్రము అతనికి పూర్తిగా తెలియగలదు. ఇక అంత:ప్రక్రియలైన కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము లనునవి దేహమున పంచభూతముల ప్రాతినిధ్యములు. అదేవిధముగా, చైతన్యము చేతను, విశ్వాసము(ధృతి:) చేతను సూచింపబడు జీవలక్షనములు మనస్సు, బుద్ధి, అహంకారము అనునవి సూక్ష్మశరీరపు వ్యక్తరూపములు. ఈ సూక్ష్మాంశములు కర్మక్షేత్రము నందే చేర్చబడినవి.

పంచ మహాభూతములు మిథ్యా అహంకారము యొక్క స్థూల ప్రాతినిధ్యములు కాగా మిథ్యాహంకారము తన మూలస్థితియైన 'తామసబుద్ధి'కి ప్రాతినిధ్యము వహించును. ఇట్టి భౌతిక భావన లేక తామసబుద్ధి భౌతిక ప్రకృతి గుణముల అవ్యక్తస్థితిని సూచించును. అట్టి భౌతికప్రకృతి త్రిగుణముల అవ్యక్తస్థితినే 'ప్రధానము'గా పిలువబడును.

ఈ ఇరువదినాలుగు తత్త్వములను వాని అంత:ప్రక్రియలతో సహా సవివరముగా తెలుసుకొనగోరువాడు తత్త్వశాస్త్రమును మరింత వివరముగా అధ్యయనము చేయవలయును. భగవద్గీత యందు సారాంశము మాత్రమే అందింపబడినది.

ఈ ఇరువదినాలుగు అంశముల ప్రాతినిధ్యమే దేహము. అట్టి దేహము జన్మించుట, పెరుగుట, స్థితిని కలిగియుండుట, ఇతర దేహములను సృజించుట, క్షీణించుట, చివరికి నశించుట అను ఆరు విధములైన మార్పులకు లోనగును. కనుకనే కర్మక్షేత్రము అశాశ్వతమైన భౌతిక పదార్థము. అయినను క్షేత్రము నెరిగినట్టి వాడును మరియు దానికి యజమానియైన క్షేత్రజ్ఞుడును మాత్రము దానికి భిన్నుడై యుండును.

**13.8 - 12**

**అమానిత్వమదమ్భిత్వమహింసా క్షాన్తిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥**

**ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ ।**
**జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥**

**అసక్తిరనభిష్వఙ్గః పుత్రదారగృహాదిషు ।**
**నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు ॥**

**మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।**
**వివిక్తదేశసేవిత్వమరతిర్జనసంసది ॥**

**అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।**
**ఏతజ్ జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతో న్యథా ॥**

## అనువాదము

**వినమ్రత, గర్వరాహిత్యము, అహింస, సహనము, సరళత్వము, ప్రామాణికుడైన అధ్యాత్మికాచార్యుని ఆశ్రయించి సేవించుట, శౌచము, స్థిరత్వము, ఆత్మనిగ్రహము, ఇంద్రియార్థముల పరిత్యాగము, అహంకార రాహిత్యము, జన్మమృత్యుజరా వ్యాధుల దోషమును గుర్తించుట, అనాసక్తి, బిడ్డలు, భార్య, గృహము – మున్నగు బంధముల నుండి విముక్తి సుఖదుఃఖ సమయములందు సమానత్వము, నా యందు నిత్యమగు అనన్యమైన భక్తి, నిర్జన ప్రదేశమున నివసింపవలెనను కోరిక, సామాన్య జనసమూహము నందు అనాసక్తి, ఆత్మానుభూతి ప్రాముఖ్యమును అంగీకరించుట, పరతత్త్వము యొక్క తాత్త్వికాన్వేషణము అనునవన్నియును జ్ఞానమని నేను ప్రకటించుచున్నాను. వీటికి అన్యమైనది ఏదైనను అజ్ఞానమే.**

## భాష్యము

ఈ ఇరువది అంశములు గల జ్ఞానవిధానము కొన్నిమార్లు కర్మక్షేత్రపు అంతఃప్రక్రియయని మందబుద్ధులు తప్పుగా భావించుదురు. కాని వాస్తవజ్ఞాన విధానమిదియే. ఇట్టి విధానమును అంగీకరించినచో పరతత్త్వమును చేరుటకు అవకాశము కలుగును. ఇదివరకు వివరింపబడినట్లు, ఈ జ్ఞానము కర్మక్షేత్రము నందలి ఇరువదినాలుగు అంశముల యొక్క అంతఃప్రక్రియ గాక ఆ అంశముల యొక్క బంధముల నుండి విముక్తినొందుటకు గల నిజమైన మార్గమిదియే. బద్ధజీవి ఇరువది నాలుగు తత్త్వములచే తయారుచేయబడిన ఆచ్ఛాదనమగు దేహముచే బంధింపబడి యున్నాడు. ఇక్కడ వర్ణింపబడిన జ్ఞానవిధాన మనునది అతడు దానినుండి

బయటపడుటకు గల మార్గమై యున్నది. ఈ జ్ఞానవిధాన వర్ణనము లన్నింటిలోకి అత్యంత ముఖ్యమైన విషయము పదునొకండవ శ్లోకమందలి మొదటి పాదము నందు చెప్పబడినది. "మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ"- జ్ఞానవిధానము భగవానుని శుద్ధభక్తియుక్త సేవ యందే పరిసమాప్తి నొందును. కనుక ఎవ్వరైనను భగవానుని పట్ల అనన్యమైన భక్తియుక్త సేవను స్వీకరింపక పోయినచో మిగిలిన పంతొమ్మిది జ్ఞానప్రక్రియలు విలువ రహితములు కాగలవు. కాని వారు సంపూర్ణమైన కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణుని భక్తియుక్త సేవను స్వీకరించినచో, మానవుని యందు మిగిలిన ఆ పంతొమ్మిది అంశములు అప్రయత్నముగనే వృద్ధినొందగలవు. శ్రీమద్భాగవతము (5.8.12) నందు "యస్యాస్తి భక్తిర్భగవత్య కించనా సర్వైర్గుణైస్తత్ర సమాసతే సురా:"-"భక్తియుక్త సేవాస్థితిని పొందినటువంటి మానవుని యందు జ్ఞానమునకు సంబంధించిన సమస్త సద్గుణములును వృద్ధి నొందగలవు" అని చెప్పబడినది. అదేవిధముగా, యెనిమిదవ శ్లోకమున తెలుపబడినట్లు ఆధ్యాత్మికాచార్యుని అంగీకరింప వలెననెడి నియమము మిక్కిలి ప్రధానమైనది. వాస్తవమైన ఆధ్యాత్మిక జీవితము ఆధ్యాత్మికాచార్యుని అంగీకరించినప్పుడే ఆరంభమగుట చేత భక్తియుక్త సేవను అవలంబించు వారికి కూడా గురువును అంగీకరించుట అత్యంత ముఖ్యమైనది. ఈ జ్ఞానవిధానమే వాస్తవమైన మార్గమని దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ స్పష్టముగా చెప్పుచున్నాడు. దీనికి అన్యముగా ఊహింపబడున దంతయు అర్థరహితమే.

ఇక్కడ సూచింపబడిన జ్ఞానమునకు సంబంధించిన అంశములను ఈ విధముగా వివరింపవచ్చును. మొదటిది 'అమానిత్వమ్' (వినమ్రత) అనగా ఇతరులచే గౌరవింప బడవలెనని ఆరాటపడకుండుట. జీవితపు భౌతిక భావము, మనలను ఇతరుల నుండి గౌరవము పొందుటకు ఆరాటపడునట్లుగా చేయును. కాని తాను దేహము కాదనెడి సంపూర్ణ జ్ఞానము గల మానవుని దృష్టిలో ఈ దేహమునకు సంబంధించన గౌరవ, అగౌరవములు రెండును వ్యర్థములే. కనుక మానవుడు ఇట్టి భ్రాంతితో కూడినట్టి భౌతిక గౌరవము కొరకై ఆరాటపడరాదు. 'అదంభిత్వమ్' అనగా కొందరు తమ మత విషయములందు ప్రసిద్ధులగుటకు ఎక్కువగా ఆరాటపడుచుందురు. తత్ఫలితముగా వారు కొన్నిమార్లు ధర్మ నియమము లనగానేమిటో ఎరుగకుండగనే, వానిని సరిగా అనుసరింప నటువంటి ఏదోఒక సంఘములో చేరి, తమను తాము ధర్మోపదేశకులుగా ప్రచారము చేసికొను చుండుటయు కనిపించుచుండును. కాని వాస్తవమైన ఆధ్యాత్మిక జ్ఞానపురోగతికి సంబంధించినంత వరకు తాను ఎందుకంత ప్రగతి సాధించు చున్నాడో తెలుసు కొనుట కొరకై చక్కని పరీక్ష అవసరము. జ్ఞానమునందలి ఈ వివిధాంశముల ద్వారా అతడు సత్యాసత్యములను నిర్ణయించుకోగలడు.

'అహింసా' అనగా దేహమును చంపకుండుట లేక దేహమును నాశనము చేయకుండుట అని సాధారణముగా అర్థము చెప్పుచుందురు. కాని వాస్తవమునకు అహింస అనగా ఇతరులను కష్టపెట్టకుండుట అని అర్థము. సాధారనముగా జనులు జీవితపు భౌతిక భావనలో అజ్ఞానముచే బందితులై, నిరంతరము వివిధములైన భౌతిక క్లేశములచే బాధింపబడుతుంటారు. కనుక జనులను ఆధ్యాత్మిక జ్ఞానస్థితికి ఉద్ధరింపకపోయినచో, ఎవరైనను వారిపట్ల హింస నాచరించినట్లే యగును. జనులు ఆత్మవికాసము నొంది భౌతిక బంధములను విడుచునట్లుగా నిజమైన జ్ఞానమును శక్త్యానుసారము వారికి తప్పక ఉపదేశింపవలెను. అదియే వాస్తవమైన అహింస.

'క్షాంతి:'- సహనము అనగా ఇతరుల నుండి కలుగు గౌరవములను, అగౌరవములను సహించుటను అభ్యసించుట. సాధారణముగా ఎవరైనను ఆధ్యాత్మిక

పురోగతికై యత్నించునప్పుడు ఇతరుల నుండి ఎన్నో అవమానములు మరియు అగౌరవములను ఎదుర్కొనవలసి వచ్చుచుండును. ప్రకృతి స్వభావము అట్లు నిర్మింపబడుట చేతనే ఇట్లు జరుగుట సర్వసాధారణమని భావింపవలెను. ఉదాహరణకు ఇదేండ్ల వయస్సుగల ప్రహ్లాదుడు ఆధ్యాత్మిక జ్ఞానసముపార్జన అభ్యాసము నందు నెలకొనియుండుటచే, అతని భక్తికి వ్యతిరేకుడైన తండ్రి అతనిని ఎన్నో కష్టములకు గురిచేసెను. తండ్రి అనేక విధములుగ అతనిని చంప యత్నించెను. అయినను ప్రహ్లాదుడు దానినంతటిని సహించెను. ఆధ్యాత్మిక జ్ఞానసముపార్జన యందు పలురకాల అవరోధములు కలుగవచ్చును. కనుక మనము వానినన్నింటిని సహించి దృఢనిశ్చయముతో పురోగతిని సాధింపవలెను.

'ఆర్జవమ్' అనగా ఎట్టి తంత్రము (దాపరికము) లేకుండా, శత్రువుకు కూడ సత్యమును తెలుపగలుగునంతటి ఋజుత్వమును కలిగియుండుట. 'ఆచార్యోపాసనమ్'- ఆధ్యాత్మికాచార్యుని సేవించుటకు సంబంధించినంత వరకు, అట్టి ప్రామాణికుడైన ఆచార్యుని ఉపదేశము లేకుండ ఎవ్వరును ఆధ్యాత్మిక జ్ఞానమున పురోగతిని సాధింపజాలరు. కనుక ఆధ్యాత్మికాచార్యుని అంగీకరించుట ఎంతో అవసరము. మానవుడు ఆధ్యాత్మికాచార్యుని వినయముతో సమీపించి, శిష్యుడైన తన పట్ల సంతృప్తుడై ఆశీర్వదించునట్లుగా గురువునకు అన్నిరకాల సేవలను చేయవలెను. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుడు శ్రీకృష్ణునికి ప్రతినిధి యైనందున అతడు శిష్యుని ఆశీర్వదించినచో, శిష్యుడు విధినియమములను పాటించకపోయినను, అతని ఆశీర్వాదము వెంటనే శిష్యునికి ఆధ్యాత్మిక పురోగతి కలుగునట్లు చేయగలదు. ఎట్టి సందేహములు లేకుండ ఆధ్యాత్మికాచార్యుని సేవించువానికి అట్టి నియమములు సులభతరములగును.

'శౌచమ్' అనునది ఆధ్యాత్మిక జీవమునందు అభివృద్ధిని సాధించుటకు ఎంతగానో అవసరము. అట్టి శుచిత్వము అంతరము మరియు బాహ్యము అని రెండురకములు. బాహ్య శుచిత్వమనగా స్నానము చేయుట, కాని అంతర శుచిత్వము కొరకు మానవుడు శ్రీకృష్ణుని సదా స్మరించుచు, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును జపింపవలెను. ఇట్టి అంతరశుచిత్వ విధానము ప్రోగు పడిన సంచిత కర్మ దూళినంతటిని మనస్సు నుండి తొలగించి వేయగలదు.

'స్థైర్యమ్' అనగా ఆధ్యాత్మిక జీవితము నందు పురోగతిని సాధింప వలెనను ధృఢనిశ్చయమును కలిగియుండుట. అట్టి ధృఢనిశ్చయము లేకుండ ఎవరును వాస్తవమైన ప్రగతిని సాధింపజాలరు. ఇక 'ఆత్మనిగ్రహము' అనగా ఆధ్యాత్మిక పురోగతికి హానికరమైన దేనిని కూడ అంగీకరింపకుండుట. మానవుడు అట్టి అభ్యాసమును అలవరచుకొని ఆధ్యాత్మిక పురోగతి మార్గమునకు ప్రతికూలమైన సర్వమును త్యజింపవలెను. అదియే నిజమైన 'వైరాగ్యము'. ఇంద్రియములు బలవంతము లగుటచే సదా తృప్తినొందుటకై ఆరాటపడుచుండును. కాని ఎవరును అవసరములైన ఇంద్రియ వాంఛలను తీర్చుకొనుటకు యత్నింపరాదు. ఆధ్యాత్మిక జీవన పురోగతికై భక్తియుక్త సేవ యందు నెలకొనుట కొరకై దేహమును తగినట్లుగా నిలుపుకొనుటకు మాత్రమే ఇంద్రియములను తృప్తిపరచవలెను. ఇంద్రియములలో అత్యంత ముఖ్యమైనది మరియు నియత్రింపబడనిది నాలుక. ఎవరైనను నాలుకను నియంత్రింప గలిగినచో ఇతర ఇంద్రియము లన్నియును నియంత్రింప బడగలవు. పలుకుట మరియు రుచిచూచుట యనునవి అట్టి నాలుక యొక్క కార్యములు. కనుక ఒక క్రమప్రకారముగా

అట్టి నాలుకను శ్రీకృష్ణునకు అర్పింప బడిన ఆహారమును ప్రసాదముగా రుచిచూచుట యందును, 'హరేకృష్ణ' మహా మంత్రమును నిరంతరము జపించుట యందును నెలకొల్పవలెను. నేత్రములకు సంబంధించినంత వరకు వాటిని శ్రీకృష్ణుని సుందర రూపమును తప్ప మరిదేనిని దర్శించుట యందు నిలుపరాదు. ఆ విధముగా నేత్రములు నియంత్రింప బడగలవు. అట్లే, శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుట యందు కర్ణములను మరియు శ్రీకృష్ణునకు అర్పింపబడిన పుష్పములను వాసన చూచుట యందు నాసికను నెలకొల్పవలెను. ఇదియే భక్తియుక్త సేవా విధానము. ఇక్కడ భక్తియుక్త సేవా విజ్ఞానమును మాత్రమే భగవద్గీత ప్రతిపాదించు చున్నట్లు తెలియవచ్చును. వాస్తవమునకు భక్తియుక్త సేవయే ముఖ్యమైన ఏకైక ప్రయోజనము. అల్పజ్ఞులైన కొందరు గీతావ్యాఖ్యాతలు పాఠకుల మనస్సును ఇతర విషయముల వైపునకు మరల్చుట కొరకై యత్నింతురు. కాని భగవద్గీత యందు భక్తియోగ (భక్తియుక్తసేవ) తప్ప మరే ఇతర విషయము లేదు.

'అహంకారమ్' అనగా దేహమే తానని భ్రమించుట. ఎవరైనను తాను దేహమును కానని, ఆత్మనని అవగాహన కలిగినపుడే వాస్తవ అహంకారమునకు వచ్చును. వాస్తవ అహంకారము(స్వత్వము)సత్యమైనది. దురహంకారమే నిరసింప బడుచున్నది గాని వాస్తవ అహంకారము కాదు. 'బృహదారణ్యకోపనిషత్తు' (1.4.10) నందు : 'అహం బ్రహ్మాస్మి'- 'నేను బ్రహ్మమును, నేను జీవాత్మను' అని చెప్పబడినది. 'నేను' అను ఈ భావము ఆత్మానుభూతి స్థితిని పొందిన ముక్తస్థితి యందు నిలిచియుండును. ఇట్టి 'నేను' అను ఈ భావనను దేహమునకు అన్వయించినచో అట్టి భావము అహంకారమగును. 'నేను' అను భావమును ఆత్మకు అన్వయించినప్పుడు అది నిజమైన అహంకారమగును. అహంకారమును విడువవలెనని కొందరు తత్త్వవేత్తలు తెలిపినను, అట్టి అహంకారము ఆత్మ యొక్క చిహ్నమై యున్నందున దానిని త్యజించుట అసాధ్యము. కాని ఆత్మను దేహముతో గుర్తించుట యను దేహాత్మబుద్ధిని మాత్రము మనము తప్పక త్యజింపవలెను.

జననమరణవ్యాధి వృద్ధాప్యము వలన కలుగు దుఃఖమును మనము అవగాహనము చేసుకొనుటకు యత్నింపవలెను. వివిధ వైదిక గ్రంథములలో జననమును గూర్చిన అనేక వర్ణనలు గలవు. ముఖ్యముగా శ్రీమద్భాగవతము తృతీయ స్కంధములోని తృతీయ అధ్యాయమున జననమునకు పూర్వస్థితి, తల్లి గర్భమున శిశువు యొక్క ఉనికి, గర్భము నందలి వేదన వంటివి విశదముగా వర్ణింపబడినవి. జననము అనునది నిశ్చయముగా దుఃఖకరమని అవగాహన చేసుకొనవలెను. కాని తల్లిగర్భము నందు మనమెంతటి వేదన ననుభవించితిమో విస్మరించుట చేత మనము ఈ నిరంతర జననమరణ చక్రమునకు పరిష్కారమును చూపుటకు యత్నింపుము. అదేవిధముగా మరణ సమయమున వివిధరకాల దుఃఖము లుండును. అవికూడ ప్రామాణిక వేదగ్రంథము లందు వర్ణింపబడినవి. అట్టి విషయములను గూర్చి తప్పక చర్చింపవలెను. ఇక వృద్ధాప్యము మరియు వ్యాధుల విషయములలో ప్రత్యక్షానుభవము మనకుండును. వ్యాధిగ్రస్థులు కావలెనని లేదా వృద్ధాప్యము రావలెనని ఎవరును కోరుకొనరు. కాని వీటిని పరిహరించలేము. కనుక ఈ జన్మము, మృత్యువు, వృద్ధాప్యము మరియు వ్యాధులతో కూడిన జీవితమును గూర్చి నిరాశతో కూడిన వైరాగ్యదృష్టిని కలిగి యుండనిదే మనము ఆధ్యాత్మిక జీవితము నందు పురోగతికి ప్రోత్సాహము లభింపదు.

గృహము భార్య, పుత్రులందు అనాసక్తిని కలిగియుండుట అనగా వారిపట్ల ప్రేమానురాగములను కలిగియుండరాదని అర్థము కాదు. వాస్తవమునకు అవి ప్రేమకు సహజ విషయములు. కాని ఆధ్యాత్మిక పోరోగతికి అనుకూలముగా లేనిచో వాని

విషయమున ఎవరును ఆసక్తిని కలిగియుండరాదు. గృహమును ఆనందనిలయము చేసికొనుటకు కృష్ణచైతన్యమే అత్యుత్తమ మార్గము. కృష్ణచైతన్యము యనునది అత్యంత సులభమైనందున కృష్ణచైతన్యవంతుడు తన గృహమును తప్పక ఆనందనిలయము కావించుకొనును. "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును జపించుట, శ్రీకృష్ణునకు అర్పింపబడిన ఆహారమును స్వీకరించుట, భగవద్గీత మరియు శ్రీమద్భాగవతము వంటి గ్రంథములను గూర్చి కొంత చర్చించుట, శ్రీ విగ్రహములను ఆరాధించుటమను నాలుగు విషయములు దివ్యానందమును కలిగించును. కనుక గృహయజమాని కుటుంబ సభ్యులందరికీని ఈ విధమైన శిక్షణ నొసగవలెను. అతడు కటుంబ సభ్యులందరితోను కలిసి ప్రాత:కాలము మరియు సాయంకాలము లందు, "హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును కీర్తింపవలెను. ఈ విధముగా పైన తెలుపబడిన నాలుగు రకాల భక్తినియమముల ననుసరించుచు గృహస్థజీవితమును సంపూర్ణముగా కృష్ణచైతన్య భావనను పెంపొందించుకొనేలా మలచుకొనగలిగినచో, గృహస్థుడు గృహస్థ జీవితమును విడిచి సన్న్యాస జీవితమును గ్రహింపనవసరము లేదు. కాని గృహవాతావరణము ఆధ్యాత్మిక పురోగతికి అనుకూలముగా లేనిచో అట్టి గృహస్థ జీవితమును త్యజింపవలెను. శ్రీకృష్ణుని అవగతము చేసికొనుటకు లేదా సేవించుటకు మానవుడు తన సర్వస్వమును అర్జునుని వలె త్యాగము చేయవలసి యున్నది. అర్జునుడు మొదట తన బంధువులను సంహరించుటకు ఇష్టపడలేదు. అయినను వారు కృష్ణచైతన్య పురోగతికి ఆటంకములు కలిగింతురని గ్రహించినపుడు శ్రీకృష్ణుని ఉపదేశముల ననుసరించి వారిని యుద్ధములో సంహరించెను. అన్ని సందర్భము లందును మానవుడు గృహస్థ జీవితమందలి సుఖదుఃఖములకు దూరముగా నుండవలెను. ఎందుకనగా ఈ జగత్తునందు ఎవ్వరును సంపూర్ణ సౌఖ్యవంతులుగా లేక సంపూర్ణ దుఃఖవంతులుగా గాని యుండలేరు.

వాస్తవమునకు సుఖదుఃఖము లనునవి భౌతిక జీవితముతో అనుబంధము గల అంశములు. కనుక భగవద్గీత యందు ఉపదేశింపబడినట్లు మానవుడు వాటిని సహించుటను అలవరచుకొనవలెను. సుఖదుఃఖముల రాకపోకలను ఎవ్వరును నిరోధింపజాలరు కనుక మానవులు భౌతిక జీవన విధానము నందు ఆసక్తిని విడువవలెను. అప్పుడు సుఖదుఃఖము లనెడి రెండు స్థితుల యందు సమచిత్తము సహజముగానే కలుగగలదు. సాధారణముగా మనము కోరినది లభించినప్పుడు సంతోషించి, కోరనిది లభించినప్పుడు దుఃఖింతుము. కాని మనము నిజముగా ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొనినచో అట్టి విషయములు మనకు ఏ విధముగాను కలతను కలిగింపవు. అట్టి స్థితిని చేరుటకు మనము అవిచ్ఛిన్నమైన భక్తియుక్తసేవను అభ్యసింపవలెను. నవమాధ్యాయపు చివరి శ్లోకమున వర్ణింప బడినట్లు, అట్టి శ్రీకృష్ణభగవానుని నిరంతరము అనన్యభక్తితో సేవించుట అనగా కీర్తనము, శ్రవణము, అర్చనము, వందనము వంటి నవవిధ భక్తియుక్త సేవా విధానము లందు నెలకొని యుండుటయే. అట్టి విధానమును మానవుడు తప్పక అనుసరింపవలెను.

సహజముగా మానవులు ఆధ్యాత్మిక జీవిత విధానమును అలవరచు కొనినప్పుడు వారు భౌతిక భావములు గలవారితో కలియుటను వాంఛింపరు. అది అతని తత్త్వమునకు విరుద్ధముగా నుండును. అవాంఛనీయ సాంగత్యము లేకుండ నిర్జన ప్రదేశము లందు నివసించుట తనకెంత ఇష్టమో మానవుడు తననుతాను పరీక్షించు కొనవచ్చును. సహజముగా భక్తుడు అనవసరపు వినోదము, చలనచిత్రములు, సాంఘీక కార్యక్రమములు యనునవి కాలమును వృథా పరచునటు వంటివని తెలిసియుండుటచే

వానియందు రుచిని కలిగియుండడు. లైంగిక జీవితమును గూర్చిగాని లేదా అనేక ఇతర విషయములను గూర్చిగాని పరిశోధన జరుపు పరిశోధకులు మరియు తత్త్వవేత్తలనేకులు గలరు. కాని భగవద్గీత ననుసరించి అట్టి పరిశోధన కార్యములు మరియు తాత్త్వికములైన భావనా కల్పనలు యనునవి ప్రయోజన శూన్యములు మరియు అసందర్భములు. భగవద్గీత ననుసరించి, మానవుడు అట్టి తాత్త్విక వివేచనను కలిగి యుండి ఆత్మ స్వభావమును గూర్చి ఎరుగుటకు మాత్రమే పరిశోధనము చేయవలసి యున్నదని ఇక్కడ ఆదేశింపబడుచున్నది.

కనుక ఆత్మానుభూతికి సంబంధించినంత వరకు ప్రత్యేకముగా భక్తియోగమే ఆచరణ యోగ్యమైనదని ఇక్కడ స్పష్టముగా పేర్కొనబడినది. అట్టిభక్తిలో ఆత్మ, పరమాత్మల నడుమ గల సంబంధమును మానవుడు తప్పక గుర్తింపవలెను. కనీసము భక్తిభావనలో జీవాత్మ మరియు పరమాత్మ ఎన్నడును ఒక్కటి కాజాలవు. ఇదివరకే స్పష్టముగా చెప్పబడినట్లు, పరమాత్మను జీవాత్మ సేవించుట 'నిత్యము', కనుక భక్తి లేక భక్తియుక్త సేవ కూడ నిత్యమే. అట్టి తాత్త్విక సంకల్పము నందు మానవుడు నెలకొని యుండవలెను.

ఇది శ్రీమద్భాగవతము(1.2.11) నందు : "వదన్తి తత్తత్త్వవిదస్తత్త్వం యజ్జ్ఞానమద్వయమ్..."-"పరతత్త్వమును నిజముగా నెరిగినవాడు ఆ పరతత్త్వము బ్రహ్మము, పరమాత్మ, భగవానుడు అను మూడుదశలలో అనుభూతికి వచ్చునని ఎరుగును" అని వివరింపబడినది. భగవానుని అనుభవము అనునది పరతత్త్వపు చరమానుభూతి. కనుక మానవుడు దేవాదిదేవుని అవగాహనము చేసుకొను స్థితిని పొంది భాగవానుని భక్తియుక్త సేవయందు నెలకొని యుండవలెను అదియే జ్ఞానము యొక్క పరిపూర్ణత్వము.

'వినమ్రత' మొదలుకొని ఈ చివరి పరతత్త్వానుభూతిని పొందు స్థితి వరకును గల ఈ విధానము భవంతి యొక్క క్రింది అంతస్థు నుండి అత్యున్నత అంతస్థు వరకును చేర్చునట్టి సోపాన పరంపర వంటిది. ఈ సోపాన పరంపర ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయాది పలు అంతస్థులను చేరిన మానవులు అనేకమంది కలరు. కాని శ్రీకృష్ణుని అవగాహమను అత్యున్నతమైన చివరి అంతస్థును చేరకపోయినచో, అతని జ్ఞానము నిమ్నస్థితి యందున్నట్లేనని భావము. ఎవరైనను భగవానునితో పోటీచేయుచు, ఆ సమయము నందే ఆధ్యాత్మిక జ్ఞానము నందు అభ్యుదయమును పొందగోరువాడు తప్పక నిరాశను పొందవలసియే వచ్చును. ఈ శ్లోకమున స్పష్టముగా తెలుపబడినట్లు, వినమ్రత లేకుండ అవగాహనము అనునది నిజముగా సాధ్యపడదని స్పష్టముగా చెప్పబడినది. తానే భగవానుడనని భావించుట దురహంకారమునకు సూచన. మానవుడు ప్రకృతి నియమములచే ఎల్లప్పుడు పీడింపబడుతున్నప్పటికిని అజ్ఞానముచే 'నేనే భగవానుడను' అని భావించు చుండును. కనుకనే 'అమానిత్వము' లేక నమ్రత అనునది జ్ఞానమునకు ప్రథమ సోపానము. మానవుడు వినమ్రుడై తాను పరమ పురుషునికి సేవకుడనని ఎరుగవలెను. పరమపురుషునికి ఎదురు తిరుగు స్వభావముచే మానవుడు భౌతిక ప్రకృతికి అధీనుడగును. కావున ప్రతియొక్కరును ఈ సత్యము నెరిగి దానిపట్ల విశ్వాసమును కలిగియుండవలెను.

### 13.13
### జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్ జ్ఞాత్వా మృతమశ్నుతే ।
### అనాది మత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥

## అనువాదము

**దేనిని తెలిసికొనుట ద్వారా నీవు అమృతత్త్వమును అస్వాదింపగలవో అట్టి తెలియదగిన దానిని నేను వివరింతును. ఆది లేనిదియు, నాకు ఆధీనమును అగు బ్రహ్మము(జీవాత్మ) ఈ భౌతిక జగత్తు నందలి కార్యకారణములకు అతీతమై యుండును.**

## భాష్యము

భగవానుడు ఇంతవరకు కర్మక్షేత్రమును గూర్చి మరియు కర్మక్షేత్రము నెరిగిన క్షేత్రజ్ఞుని గూర్చి వివరించి యున్నాడు. అట్లే క్షేత్రజ్ఞుని ఎరుగు విధానమును గూర్చి కూడ అతడు విశదీకరించి యున్నాడు. ఇప్పుడు తెలిసికొనదగిన దానిని గూర్చి వివరింపదలచి తొలుత ఆత్మను గూర్చియు, పిదప పరమాత్మను గూర్చియు వివరింప నారంభించుచున్నాడు. అట్టి క్షేత్రజ్ఞుని గూర్చియు ఆత్మపరమాత్మల రెండింటి గూర్చియు జ్ఞానము గలవాడు జీవితామృతమును ఆస్వాదింపగలడు. జీవాత్మ నిత్యమని ద్వితీయాధ్యాయమున తెలుపబడిన విషయమే ఇక్కడ కూడ నిర్ధారింప బడినది. వాస్తవమునకు జీవుడెన్నడు జన్మించెనో తెలుపు ప్రత్యేకమైన తేదీ ఏదియును లేదు. అట్లే పరమ పురుషుని నుండి జీవాత్మ వ్యక్తమైనట్టి చరిత్రను కూడ ఎవ్వరును తెలుపజాలరు. కనుకనే అతడు ఆదిరహితుడు. 'కఠోపనిషత్తు' (1.2.18) ఇట్లు నిర్ధారించుచున్నది : "న జాయతే మ్రియతే వా విపశ్చిత్"- "దేహము నెరిగిన క్షేత్రజ్ఞుడు అజుడు, అమరుడు, జ్ఞానసంపూర్ణుడు."

వైదిక గ్రంథమైన 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (6.16) నందు : "ప్రధాన క్షేత్రజ్ఞునిగా మరియు భౌతిక ప్రకృతి త్రిగుణములకు ప్రభువు"గా నున్నాడని తెలుపబడినది. జీవులు సర్వదా అట్టి శ్రీకృష్ణభగవానుని సేవయందు నెలకొని యుందురని 'పద్మపురాణము' నందు తెలుపబడినది (దాసభూతో హరేరేవ నాన్యస్యైవ కదాచన). శ్రీ చైతన్య మహాప్రభువు తన బోధనల యందు కూడ దీనిని నిర్ధారించి యున్నారు. కనుక ఈ శ్లోకము నందు తెలుపబడిన బ్రహ్మము యొక్క వర్ణనము జీవాత్మకు సంబంధించినది. బ్రహ్మము అను పదము జీవునికి అన్వయింప బడినపుడు ఆతడు 'ఆనందబ్రహ్మము' కాకుండ 'విజ్ఞానబ్రహ్మము' అని గ్రహింపవలెను. పరబ్రహ్మమైన దేవాదిదేవుడే 'ఆనందబ్రహ్మము'.

## 13.14

**సర్వత: పాణిపాదం తత్ సర్వతో క్షిశిరోముఖమ్ ।**
**సర్వత: శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥**

## అనువాదము

**సర్వత్ర అతని హస్తములు, పాదములు, నయనములు, శిరములు, ముఖములు, కర్ణములు వ్యాపించి యున్నవి. ఈ విధముగా పరమాత్మ సర్వమును ఆవరించి యుండును.**

## భాష్యము

సూర్యుడు అపరిమితములైన తన కిరణములను ప్రసరించు చున్నట్లే, పరమాత్ముడు లేక దేవాదిదేవుడు కూడ తన శక్తిని సర్వత్రా వ్యాపింప జేయు చుండును. అతడు తన సర్వవ్యాపక రూపముతో స్థితిని కలిగియుండగా, ప్రథమ గురువు అయిన బ్రహ్మ మొదలుగా అల్పమైన చీమ వరకు గల సర్వజీవులు అతని యందు స్థితిని కలిగియున్నవి. అసంఖ్యాకములుగా గల శిరములు, పాదములు, హస్తములు, నయనములు, అసంఖ్యాక జీవులన్నియును పరమాత్మ యందే స్థితిని కలిగియున్నవి. అట్లే జీవులందరును కూడ పరమాత్ముని అంతరంగము మరియు బాహ్యములందు స్థితులై యున్నవి. కనుక పరమాత్మ సర్వవ్యాపకుడు. పరమాత్మ వలెనే తాను కూడ సర్వత్రా పాదములు మరియు హస్తములను కలిగియున్నాడని జీవుడెన్నడును చెప్పజాలడు. అది ఎన్నటికిని సాధ్యపడదు. వాస్తవమునకు తన హస్తములు, పాదములు మరియు నయనములు సర్వత్రా వ్యాపించి యున్నను అజ్ఞానముచే తాను దానిని తెలియ లేకున్నాననియు, కాని తగిన జ్ఞానమును పొందిన పిమ్మట తానట్టిస్థితిని వచ్చుననియు జీవుడు అజ్ఞానముచే భావించినచో అట్టి భావన సత్యవిరుద్ధమే కాగలదు. ప్రకృతిచే బద్ధుడైన జీవుడు ఎన్నడును పరమాత్ముడు కాజాలడు. పరమాత్ముడు ఎల్లప్పుడు జీవాత్మ కంటెను భిన్నుడు. ఉదాహరణకు భగవానుడు పరిమితి అనునది లేకుండా తన హస్తములను వ్యాపింపగలడు. కాని జీవాత్మ అట్లు చేయజాలడు. కనుక ఎవరైనను తనకు పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని లేదా జలమును గాని అర్పించినచో తాను గ్రహింతునని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీత (9.26) నందు చెప్పియున్నాడు. భూలోకమునకు అత్యంత దూరములో గల ఆ భగవానుడు ఏ విధముగా మనము అర్పించువాటిని గ్రహింపగలడను ప్రశ్నకు అతని సర్వశక్తిమత్వమే సమాధానము. అతడు భూమికి అత్యంత దూరమున గల తన స్వధామము నుండియే తనకు సమర్పించిన దానినంతటిని గ్రహించుటకు హస్తములను విస్తరింపగలడు. అదియే ఆ పరమపురుషుని దివ్యశక్తి. 'బ్రహ్మ సంహిత' (5.37) నందు : "గోలోక ఏవ నివసత్యఖిలాత్మభూత:" – "అతడు తన స్వధామమున దివ్యలీలల యందు నిమగ్నుడై యున్నప్పటికిని సర్వవ్యాపకుడై యుండును" అని చెప్పబడినది. భగవానుని వలె తానును సర్వవ్యాపినని జీవుడెన్నడును చెప్పజాలడు. కనుకనే ఈ శ్లోకము పరమాత్మనే(దేవాదిదేవుని) వర్ణించుచున్నది. గాని ప్రత్యగాత్మను కాదు.

## 13.15

**సర్వేన్ద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।**
**అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥**

## అనువాదము

**పరమాత్ముడు సర్వేంద్రియములకు మూలాధారుడైనను ఇంద్రియరహితుడు. అతడు సర్వజీవులను పోషించువాడైనను అనాసక్తుడు. అతడు ప్రకృతి గుణములకు అతీతుడు. మరియు వానికి ప్రభువును అయియున్నాడు.**

## భాష్యము

జీవులవలె పరమ పురుషుడు జీవుల సర్వేంద్రియములకు కారణభూతుడైనను అట్టి భౌతికేంద్రియములను కలిగియుండడు. వాస్తవమునకు జీవాత్మలు కూడ ఆధ్యాత్మిక ఇంద్రియములనే కలిగియున్నను, బద్ధస్థితి యందు అవి భౌతికాంశములచే ఆవరింపబడి యుండుటచే వాటి ద్వారా భౌతిక కర్మలే ప్రకటమగుచుండును. పరమపురుషుని ఇంద్రియములు అట్లు ఆవరింపబడి యుండవు. అవి దివ్యములగుటచే 'నిర్గుణము'లుగా పిలువబడుచున్నవి. గుణమనగా భౌతిక ప్రకృతి త్రిగుణములు. అతని ఇంద్రియములు భౌతిక ఆచ్ఛాదనా రహితములు. అవి మన ఇంద్రియముల వంటివి కావని అవగతము చేసికొనవలెను. మన ఇంద్రియ కార్యకలాపము లన్నింటికి అతడే మూలకారణుడైనను, అతడు మాత్రము గుణరహితమైన తన దివ్యేంద్రియములను కలిగియుండును. ఈ విషయమే "అపాణి పాదో జవనో గ్రహీతా" అను శ్లోకము ద్వారా 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (3.19) నందు చక్కగా వివరింపబడినది. దేవాదిదేవునకు భౌతిక గుణకాలుష్యముతో కూడిన హస్తములుండవు. కాని అతడు దివ్యహస్తములను కలిగియుండి తనకు సమర్పింపబడిన కానుకను దేనినైనను గ్రహింపగలుగును. ఇదియే బద్ధజీవునకు మరియు పరమాత్మనకు నడుమ గల భేదము. అతనికి భౌతిక నేత్రములు లేకపోయినను అతడు దివ్యనేత్రములను కలిగియున్నాడు. లేనిచో అతడెట్లు చూడగలుగును? వాస్తవమునకు అతడు భూత, భవిష్యత్తు, వర్తమానముల నన్నింటిని చూడగలడు. ఆతడు జీవుల హృదయము లందు నెలకొనిన పరమాత్ముడైనందున మన పూర్వకర్మలను, ప్రస్తుత కర్మలను, రాబోవు భవిష్యత్తును కూడ ఎరుగగలుగును. భగవానుడు సర్వమును ఎరిగి యున్నను అతనిని ఎవ్వరును ఎరుగలేరని భగవద్గీత (7.26) నందు నిర్ధారింపబడినది. పరమపురుషునకు మనకున్నటువంటి పాదములు లేవని చెప్పబడినది. కాని అతని పాదములు దివ్యములు. వాటితో అతడు సర్వత్రా సంచరించగలడు. మరోలా చెప్పవలెననిన, భగవానుడు నిరాకారుడు కాదు. అతడు పాదములు, హస్తములు, నేత్రములు మున్నగు వాటినన్నింటిని కలిగియున్నాడు. మనము ఆ పరమపురుషుని అంశలమగుటచే మనము కూడ వాటినన్నింటిని కలిగియున్నాము. కాని అతని ఇంద్రియములు భౌతిక ప్రకృతి గుణసంపర్కముచే కలుషితములు కావు.

శ్రీకృష్ణభగవానుడు తన 'యోగమాయా శక్తి'చే యథారూపమున అవతరించునని భగవద్గీత(4.6) నందు కూడ నిర్ధారింపబడినది. అతడు అతడు భౌతిక ప్రకృతికి ప్రభువగుటచే దానివలన అతడెన్నడును ప్రభావితుడు కాడు. వైదిక గ్రంథము లందు అతని దేహస్వరూప మంతయు దివ్యమని వర్ణించుటను మనము చూడవచ్చును. అతడు 'సచ్చిదానంద విగ్రహము' అని పిలువబడు శాశ్వత స్వరూపమును కలిగియుండును. అతడు సకల విభూతిసంపన్నుడు. అతడే సర్వైశ్వర్యములకును,

సర్వశక్తులకును యజమానుడు. బుద్ధిమంతులలో అత్యంత శ్రేష్ఠుడు, జ్ఞానసంపూర్ణుడు అతడే. వాస్తవమునకు ఇవియన్నియును దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని లక్షణములలో కొన్నిమాత్రమే. అతడే జీవులందరికీ పోషకుడు మరియు సర్వ కార్యకలాపములకు సాక్షిగా నుండును. పరమపురుషుడు సర్వదా దివ్యుడని మనము వైదికగ్రంథముల నుండి ఎరుగగలుగుదుము. మనము అతని శిరస్సును, ముఖమును, హస్తములను, పాదములను చూడలేకున్నను వాటినతడు కలిగియుండును. మనము ఆధ్యాత్మికస్థితికి ఉద్ధరింపబడినపుడే భగవానుని దివ్య రూపమును చూడగలుగుదుము. ప్రస్తుత పరిస్థితుల యందు మన ఇంద్రియములు భౌతిక కాలుష్యములచే ప్రభావితములై యుండుట చేత మనమాతని దివ్య రూపమును చూడలేకున్నాము. కనుకనే భౌతికత్వముచే మరింత అధికముగా ప్రభావితులై కలుషితులై యుండెడి నిరాకారవాదులు పరమపురుషుని అవగాహన చేసుకొనజాలరు.

## 13.16

**బహిరన్తశ్చ భూతానామచరం చరమేవ చ ।**
**సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్ ॥**

## అనువాదము

**పరమాత్ముడు స్థావర జంగమములైన సర్వజీవుల అంతర్బాహ్యములలో నిలిచి యుండును. సూక్ష్మత్వకారణముగా అతడు భౌతికేంద్రియముల శక్తిచే చూచుటకు గాని, తెలిసికొనుటకు గాని అతీతుడు అయియున్నాడు. అత్యంత దూరము నందున్నను అతడు సర్వులకు సమీపముననే ఉండును.**

## భాష్యము

వైదికగ్రంథముల ననుసరించి పరమపురుషుడైన నారాయణుడు ప్రతిజీవి యొక్క అంతరము మరియు బాహ్యము నందు నిలిచి యుండునని మనము తెలుసుకొనగలము. అతడు భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులు రెండింటి యందును ప్రత్యక్షమై యుండును. అతడు అత్యంత దూరమందున్నను మనకు సమీపము నందే యుండును. ఇవియన్నియును వైదిక గ్రంథముల వచనములు. 'కఠోపనిషత్తు' (1.2.21) నందు : "ఆసీనో దూరం వ్రజతి శయానో యాతి సర్వత:" అని చెప్పుచున్నది. దేవాదిదేవుడు ఎల్లప్పుడును దివ్యానందమున నిమగ్నుడై యుండుటచే, అతడు ఎట్లు తన సంపూర్ణ వైభవములను అనుభవించు చున్నాడను దానిని మనము ఈ భౌతిక ఇంద్రియములతో చూచుట గాని, తెలుసుకొనుట గాని చేయజాలము. కనుకనే అతనిని అవగాహన చేసుకొనుటకు భౌతికములైన మన మనస్సు, ఇంద్రియములు పనిచేయజాలవని వైదిక గ్రంథములందు చెప్పబడినది. కాని భక్తియుక్తసేవ యందు కృష్ణచైతన్యమును అభ్యసించుటచే ఇంద్రియములను, మనస్సును పవిత్రీకరించు కొనినవాడు అతనిని నిత్యము దర్శింపగలడు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని పట్ల ప్రేమను పెంపొందించు కొనిన భక్తుడు, అతనిని నిత్యము దర్శింపగలడని 'బ్రహ్మ సంహిత' (5.38) నందు నిర్ధారింపబడినది. భగవద్గీత (11.54) నందు : "భక్త్యా త్వనన్యయా శక్య:"- "భక్తియుక్త సేవ ద్వారానే అతడు దర్శింపబడి అవగతమగును" అని చెప్పబడినది.

## 13.17

**అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।**
**భూతభర్తృ చ తజ్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥**

**అనువాదము**

**పరమాత్ముడు సర్వజీవుల యందు విభజింపబడినట్లు కనిపించినను అతడెన్నడును విభజింపబడక ఎకైకుడుగా నిలిచియుండును. అతడు సర్వజీవులను పోషించువాడైనను, సర్వులను కబళించునది మరియు వృద్ధి నొందించునది అతడే యని అవగాహనము చేసుకొనవలెను.**

**భాష్యము**

భగవానుడు ప్రతివ్యక్తి హృదయము నందును పరమాత్మగా నెలకొని యున్నాడు. దీనిభావము అతడు విభజింప బడినాడనియా? అట్లెన్నడును కాబోదు. వాస్తవమునకు అతడు ఒక్కడే. ఈ విషయమున సూర్యుని ఉదాహరణను చెప్పవచ్చును. మధ్యాహ్నకాలమున సూర్యుడు తానుండవలసిన స్థానమున నిలిచి యుండును. ఎవరైనను ఏ దిక్కునందైనను ఐదువేల మైళ్ళు ప్రయాణించి వెళ్ళి : "సూర్యుడెక్కడున్నాడు?" అని ప్రశ్నించినచో ఎల్లరును సరిగ్గా తమ శిరస్సుపై ప్రకాశించుచున్నాడని సమాధానము చెప్పుదురు. శ్రీకృష్ణభగవానుడు అవిభక్తుడైనను విభక్తుడైనట్లుగా కన్పించునని చెప్పుటకు వైదిక గ్రంథము లందు ఈ ఉదాహరణ మివ్వబడినది. సూర్యుడు ఒక్కడేయైనను పలు ప్రదేశములలో జనులకు ఏక కాలమున కనబడునట్లుగా, విష్ణువొక్కడేయైనను తన సర్వశక్తిమత్వముచే సర్వత్రా ప్రత్యక్షమై యుండునని కూడ వైదిక గ్రంథములందు చెప్పబడినది. పరమ పురుషుడే జీవులందరికిని పోషకుడైనను, ప్రళయకాలమున సర్వమును కబళించును. కురుక్షేత్రమున సమావేశమైనట్టి యోధులందరిని కబళించుటకే తాను వచ్చినట్లు భగవానుడు ఏకాదశాధ్యాయము నందు చెప్పినప్పుడు ఈ విషయము నిర్ధారించ బడినది. కాలస్వరూపమున అతడు సర్వమును కబళించునని కూడ ఆ అధ్యాయము నందు పేర్కొనియుండెను. అతడే సర్వులను నశింపజేయువాడు. సృష్ట్యారంభమున జీవులందరిని వారి మూలస్థితి నుండి వృద్ధిచేసి చివరకు ప్రళయకాలమున వారందరిని అతడు కబళించివేయును. అతడే సర్వజీవులకును మూలాధారుడనియు మరియు పరమాశ్రయుడనియు వేదమంత్రములు నిర్ధారించుచున్నవి. సృష్టి అనంతరము సర్వమును, సర్వశక్తిమంతుడైన అతని శక్తిపైననే ఆధారపడి ప్రళయానంతరము తిరిగి అతనినే చేరి అతని యందే విశ్రమించును. దీనిని 'తైత్తిరీయోపనిషత్తు' (3.1.1) ఇట్లు స్థిరపరచుచున్నది: "యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి తద్బ్రహ్మ తద్విజిజ్ఞాసస్వ."

## 13.18
## జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమస: పరముచ్యతే ।
## జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥

### అనువాదము

**తేజోవంతములైన సర్వ వస్తువులందు కాంతికాధారుడు అతడే. భౌతికత్వమును అంధకారమునకు అతీతుడైన అతడు అవ్యక్తుడై యుండును. జ్ఞానము మరియు జ్ఞానవిషయము, జ్ఞానగమ్యము కూడా అతడే. అతడే ఎల్లరి హృదయము లందు ప్రతిష్ఠితుడై యున్నాడు.**

### భాష్యము

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రముల వంటి కాంతివంతములైన వాటి కాంతికి పరమాత్ముడే, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే కారణము. ఆధ్యాత్మిక జగత్తు నందు దేవాదిదేవుని దివ్యతేజస్సు విస్తరించి యుండుటచే అక్కడ సూర్యుడు లేదా చంద్రుని అవసరము లేదని వైదిక గ్రంథములందు తెలుపబడినది. కాని భౌతిక జగత్తున భగవానుని తేజస్సుయైన 'బ్రహ్మజ్యోతి', భౌతిక రూపమున 'మహత్తత్త్వము'చే (భౌతికాంశములు) కప్పబడి యుండుటచేత ఈ భౌతిక జగత్తు నందు కాంతికొరకై సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు వంటివాని సహాయము కావలెను. కాని ఆధ్యాత్మిక జగత్తున ఇట్టి వస్తువులతో ఏ మాత్రము అవసరము లేదు. భగవానుని ప్రకాశమానమైన కాంతి చేతనే సర్వమును ప్రకాశింప జేయబడుచున్నదనియు వేదములందు స్పష్టముగా తెలుపబడినది. కనుకనే అతడు భౌతిక జగత్తునందు స్థితిని కలిగియుండడని స్పష్టమగుచున్నది. భగవానుడు అత్యంత దూరములో గల ఆధ్యాత్మిక జగత్తునందలి దివ్యధామము నందు స్థితుడైయుండును. ఈ విషయమును వేదములు కూడ సమర్థించుచున్నవి : "ఆదిత్యవర్ణం తమస:పరస్తాత్" – "సూర్యుని వలె నిత్యకాంతిమంతుడైన భగవానుడు ఈ జగత్తు నందలి అంధకారమునకు అతీతముగా నుండును." (శ్వేతాశ్వతరోపనిషత్తు 3.8)

దేవాదిదేవునికి సంబంధించిన జ్ఞానము దివ్యమైనది. బ్రహ్మమును గూర్చిన విషయము ఆధ్యాత్మిక జ్ఞానసారమని వైదిక గ్రంథములు నిర్ధారించుచున్నవి. ఆధ్యాత్మిక జగత్తును చేరగోరు వానికి అట్టి జ్ఞానమును ప్రతియొక్కరి హృదయము లందు ప్రతిష్ఠితుడైన పరమపురుషుడే స్వయముగా అందించుచున్నాడు. "తం హ దేవమాత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" – "ఎవరైనను ముక్తిని వాంఛించినచో దేవాదిదేవుని తప్పక శరణువేడవలెను" అని 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (6.18) చెప్పుచున్నది. ఇక చరమ జ్ఞానగమ్యమునకు సంబంధించినంత వరకు : "తమేవ విదిత్వాతి మృత్యుమేతి" – "ఎవరైనను అతనిని ఎరుగుట చేతనే జన్మమృత్యువుల పరిధిని అధిగమించ గలుగుదురు" అని 'శ్వేతాశ్వతరోపనిషత్తు'(3.8) స్థిరీకరించెను.

పరమాత్ముడు ప్రతియొక్కరి హృదయము లందును పరమ నియామకునిగా నెలకొని యున్నాడు. అతని హస్తములు మరియు పాదములు సర్వత్రా వ్యాపించి యున్నవి. కాని ఈ విషయమును జీవాత్మకు వర్తింపజేయుట సమంజసము కాదు. కనుక జీవాత్మ, పరమాత్మ లిరువురును క్షేత్రజ్ఞులని మనము అంగీకరింపక తప్పదు. జీవుని హస్తములు మరియు పాదములు స్థానికముగా ఒకే ప్రదేశమునకు పరిమితములై

యుండును. కాని శ్రీకృష్ణభగవానుని హస్తములు మరియు పాదములు సర్వత్రా వ్యాపించియుండును. 'శ్వేతాశ్వతరోపనిషత్తు' (3.17) ఇట్లు నిర్ధారించినది : "సర్వస్య ప్రభుమీశానం సర్వస్య శరణం సుహృత్"-"ఆ దేవాదిదేవుడే సమస్త జీవులకు ప్రభువు. కనుకనే సర్వజీవులకు అతడు చరమాశ్రయమై యున్నాడు." కనుక పరమాత్మ, జీవాత్మలు ఎల్లప్పుడును భిన్నులే యనెడి సత్యమును నిరాకరించుటకు వీలులేదు.

### 13.19

**ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసత: ।**
**మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥**

## అనువాదము

**ఈ విధముగా క్షేత్రము(దేహము), జ్ఞానము, జ్ఞేయములను గూర్చి నాచే నీకు సంక్షేపముగా చెప్పబడినది. నా భక్తులు మాత్రమే దీనిని పూర్తిగా అవగాహనము చేసికొని నా భావమును పొందుదురు.**

## భాష్యము

భగవానుడు ఇంతవరకు దేహమును, జ్ఞానమును, జ్ఞేయములను గూర్చి సంక్షేపముగా వివరించెను. వాస్తవమునకు ఈ జ్ఞానము – జ్ఞాత, జ్ఞేయము, జ్ఞాన విధానములనెడి మూడు అంశములకు సంబంధించినది. ఈ మూడును కృష్ణకలిసినప్పుడే అది 'విజ్ఞానము' లేక విజ్ఞానశాస్త్రము అని చెప్పబడును. అట్టి సంపూర్ణ జ్ఞానమును కేవలము శ్రీకృష్ణభగవానుని శుద్ధభక్తులే ప్రత్యక్షముగా అవగాహన చేసుకొనగలుగుదురు. ఇతరులకు అది సాధ్యము కాదు. చివరిదశలో ఈ మూడు అంశములు ఏకమగునని అద్వైతులు చెప్పుదురు. కాని భక్తులు ఈ విషయమును అంగీకరింపరు. జ్ఞానము మరియు జ్ఞానాభివృద్ధి అనగా కృష్ణచైతన్యమున తనను గూర్చి తాను అవగాహనము చేసుకొనుటయని అర్థము. మనము భౌతిక చైతన్యముతో నడుపబడుచుందుము. కాని మనము మన చైతన్యము నంతటిని కృష్ణపరమైన కార్యకలాపముల వైపునకు మరల్చినచో, శ్రీకృష్ణుడే సర్వస్వమని గుర్తించి యథార్థ జ్ఞానమును పొందుదుము. మరోమాటలో, జ్ఞానము అనగా భక్తియుక్త సేవను సంపూర్ణముగా అవగాహనము చేసుకొనుట యందలి ప్రాథమిక దశ మాత్రమే. పంచదశాధ్యాయము నందు ఈ విషయము స్పష్టముగా వివరింపబడినది.

సారాంశము చెప్పవలెనన్నిన, ఆరు మరియు ఎడవ శ్లోకము లందలి 'మహాభూతాని' మొదలుకొని 'చేతనా ధృతి:' వరకుగల శబ్దములు భౌతికాంశములు మరియు జీవలక్షణములు కొన్నింటిని గూర్చి వివరించునని అవగాహన చేసుకొనవచ్చును. వీటి కలయిక చేతనే దేహము లేక కర్మక్షేత్రము తయారగు చున్నది. ఎనిమిది నుండి పన్నెండవ శ్లోకము వరకు గల శ్లోకములు 'అమానిత్వమ్' మొదలుకొని 'తత్త్వజ్ఞానార్థదర్శనమ్' వరకు జీవాత్మ మరియు పరమాత్మ అను ఇరువురు క్షేత్రజ్ఞులను తెలిసికొనగలిగే జ్ఞానవిధానమును వర్ణించును. అదేవిధముగా పదమూడు నుండి పదునెనిమిదవ శ్లోకము వరకు గల శ్లోకములు 'అనాదిమత్పరమ్' మొదలుకొని 'హృది సర్వస్య విష్ఠితమ్' వరకును గల శ్లోకములు జీవాత్మ మరియు పరమాత్మలు లేక పరమపురుషుని వర్ణించును.

ఈ విధముగా ఇంతవరకు కర్మక్షేత్రము(దేహము), జ్ఞానవిధానము, ఆత్మ పరమాత్మలను మూడు అంశములు వర్ణింపబడినవి. భగవానుని శుద్ధభక్తులు మాత్రమే ఈ మూడంశములను స్పష్టముగా అవగాహనము చేసికొనగలరని ఇక్కడ ప్రత్యేకముగా చెప్పబడినది. కనుకనే భక్తులకు భగవద్గీత పూర్తి ప్రయోజనకరమైనది. వాస్తవమునకు వారే పరమపురుషుని పరమగమ్యమైన శ్రీకృష్ణుని పొందగలుగుదురు. అనగా భక్తులు మాత్రమే భగవద్గీతను అవగాహన చేసికొని వాంఛనీయ ఫలితములను పొందగలుగుదురు గాని ఇతరులు కాదు.

## 13.20

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసమ్భవాన్ ॥**

### అనువాదము

**భౌతిక ప్రకృతి మరియు జీవులు రెండును అనాది యని తెలిసికొనవలెను. వాని యందలి సకల పరివర్తనములు మరియు భౌతిక గుణము లనునవి భౌతిక ప్రకృతి నుండి ఉద్భవించినవి.**

### భాష్యము

ఈ అధ్యాయము నందు తెలుపబడిన జ్ఞానము ద్వారా ఎవరైనను కర్మక్షేత్రము(దేహము) మరియు దేహము నెరిగిన క్షేత్రజ్ఞులను (జీవాత్మ, పరమాత్మ) గూర్చి ఎరుగవచ్చును. కర్మక్షేత్రమైన దేహము భౌతిక ప్రకృతిమయమైనట్టిది. దానియందు బద్ధుడై దేహకర్మల ననుభవించు జీవాత్మాయే పురుషుడు లేక జీవుడు. అతడే జ్ఞాత. అతనితో పాటు గల మరొక జ్ఞాతయే పరమాత్ముడు. కాని ఈ ఆత్మ, పరమాత్మ రూపములు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని విభిన్న వ్యక్తీకరణము లేనని మనము అవగాహనము చేసుకొనవలెను. జీవాత్మ ఆ భగవానుని శక్తికి సంబంధించినది కాగా, పరమాత్మ రూపము అతని స్వరూపాంశ విస్తరణమై యున్నది.

భౌతిక ప్రకృతి, జీవాత్మ రెండును నిత్యములైనవి. అనగా సృష్టికి పూర్వము కూడ అవి స్థితిని కలిగియున్నవని భావము. భౌతిక ప్రకృతి పరమపురుషుని శక్తిని నుండి ఉద్భవించినది. జీవులు కూడ పరమపురుషుని శక్తినుండి ఉద్భవించిన వారైనను ఉన్నతశక్తికి సంబంధించినవారై యున్నారు. అట్టి జీవులు మరియు భౌతిక ప్రకృతి ఈ జగత్తు యొక్క సృష్టికి పూర్వమే స్థితిని కలిగియున్నారు. భౌతిక ప్రకృతి, పరమపురుషుడైన శ్రీమహావిష్ణువు నందు లీనమై అవసరమైనప్పుడు 'మహత్తత్త్వము' అను సాధనము ద్వారా వ్యక్తమగును. అట్లే, జీవులు కూడ భగవానుని యందే అవ్యక్తముగా నిలిచియుందురు. కాని వారు బద్ధులై, పరమ పురుషుని సేవపట్ల విముఖులగుట చేత ఆధ్యాత్మిక జగత్తునందు ప్రవేశించుటకు అవకాశమును కోల్పోయిరి. కాని భౌతిక ప్రకృతి వ్యక్తీకరణ ద్వారా జీవులు భౌతిక జగత్తు నందు వర్తించుటకు, తిరిగి ఆధ్యాత్మిక జగత్తు నందు ప్రవేశించు అర్హతను సాధించుటకై అవకాశమివ్వబడు చున్నారు. భౌతిక జగత్తు యొక్క సృష్టి రహస్యమిదియే. యథార్థమునకు జీవుడు శ్రీకృష్ణభగవానుని ఆధ్యాత్మికాంశము. కాని జీవుడు తన తిరుగుబాటు ధోరణి వలననే భౌతిక ప్రకృతిలో బంధింపబడుట సంభవించినది. శ్రీకృష్ణభగవానుని అంశలైన ఈ జీవులు భౌతిక ప్రకృతిలో సంబంధమును ఎట్లు పొందెనను విషయము యథార్థమునకు

అంత ముఖ్యమైనది కాదు. దేవాదిదేవుడు అది ఎట్లు మరియు ఎందుకు అట్లు జరుగునో ఎరుగును. కనుకనే భౌతిక ప్రకృతిచే ఆకర్షితులైనవారు జీవనమునకై తీవ్రసంఘర్షణ చేయుచున్నారని భగవానుడు ధర్మశాస్త్రము లందు చెప్పుచున్నాడు. కాని మనకు సంబంధించినంత వరకు ఈ శ్లోకములందలి విషయముల ద్వారా, త్రిగుణములచే కలుగు భౌతిక ప్రకృతి ప్రభావములు మరియు సర్వ పరివర్తనము లనునవి భౌతిక ప్రకృతి నుండి ఉద్భవించినవేనని మనము నిశ్చయముగా ఎరుగవలెను. జీవులకు సంబంధించిన సమస్త పరివర్తనములకును మరియు వైవిధ్యములకును దేహమే కారణము. ఆత్మ దృష్ట్యా జీవులందరును సమానులే.

## 13.21

**కార్యకారణకర్తృత్వే హేతు: ప్రకృతిరుచ్యతే ।**
**పురుష: సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥**

## అనువాదము

**భౌతిక కార్యకారణము లన్నింటికిని ప్రకృతియే హేతువనియు, జగత్తు నందలి వివిధ సుఖదుఃఖానుభవములకు జీవుడే కారణమనియు చెప్పబడుచున్నది.**

## భాష్యము

జీవుల యందలి వివిధ ఇంద్రియముల వ్యక్తీకరణకు భౌతిక ప్రకృతియే కారణము. ఎనుబది నాలుగులక్షల జీవరాసులన్నియును భౌతిక ప్రకృతి నుండియే ఉద్భవించినవి. ఇవియన్నియును వాస్తవమునకు భిన్న దేహములందు జీవింపగోరు జీవుని యొక్క వివిధములైన ఇంద్రియవాంఛల చేత కలుగుచున్నవి. అతడు అట్టి వివిధ దేహములందు ప్రవేశపెట్టబడినప్పుడు వివిధములైన సుఖదుఃఖముల ననుభవించును. అతడు అనుభవించు ఆ భౌతిక సుఖదుఃఖములకు అతని దేహమే కారణము కాని స్వయముగా అతడు కారణము కాదు. నిజస్థితిలో జీవుడు నిస్సందేహముగా ఆనందము ననుభవించును. కనుక అట్టి స్థితియే అతని వాస్తవ స్వరూప స్థితి. కాని ప్రకృతిపై అధికారము చేలాయింపగోరుటచే అతడు ఈ భౌతిక జగత్తును చేరుట సంభవించెను. అట్టి భావనలు ఆధ్యాత్మిక జగత్తు నందుండవు. అది సదా అట్టివాని నుండి శుద్ధమై యుండును. భౌతిక జగత్తు నందు ప్రతియొక్కరును వివిధ దేహసుఖముల కొరకై తీవ్రముగా యత్నించు చుందురు. స్పష్టముగా తెలుపవలెనన్నిన, ఈ దేహమనునది ఇంద్రియ కార్యముల పరిణామమని తెలుపవలసివచ్చును. ఈ ఇంద్రియములే కోరికలను పూరించు కొనుటకు గల సాధనములు (కారణములు). సారాంశమేమనగా, అట్టి దేహము మరియు సాధనముల వంటి ఇంద్రియము లన్నియును ప్రకృతిచే ప్రసాదింపబడు చున్నవి. తరువాతి శ్లోకమున స్పష్టముగా చేయబడినట్లు, జీవుడు తన గతజన్మ కర్మల మరియు వాంఛలకు సంబంధించిన పరిస్థితుల ననుసరించి పతితుడో, ధన్యుడో అగుచుండును. జీవుని కర్మలు మరియు వాంఛల ననుసరించి భౌతిక ప్రకృతి అతనిని వివిధ దేహముల యందుంచును. అట్టి దేహములను పొందుటకును మరియు వానికి అనుగుణముగా సుఖమును గాని దుఃఖమును గాని అనుభవించుటకును జీవుడే కారణము. దేహము భౌతిక పదార్థమగుటచే ప్రకృతి నియమముల ననుసరించి వర్తించును. కనుకనే జీవుడు అట్లు దేహమును పొందినంతనే ప్రకృతి అధీనమునకు వచ్చును. ఆ సమయమున ప్రకృతి నియమములను మార్చు శక్తి జీవునకే మాత్రమును యుండదు. ఉదాహరణకు జీవుడు ఒక శునక దేహము నందుంచ బడినంతనే అతడు

శునకము వలె వర్తింప వలసివచ్చును. మరోవిధముగా అతడు వర్తింపలేడు. ఒకవేళ జీవుడు సూకర శరీరమును పొందినచో తప్పక మలభక్షణము గావించుచు సూకరము వలె వర్తింపవలసి వచ్చును. అట్లే జీవుడు దేవతా శరీరము నందుంచ బడినచో, అతడు ఆ శరీరానుగుణముగా వర్తింపవలెను. అదియే ప్రకృతి నియమము. కాని జీవుడు పొందు అన్ని స్థితులందును పరమాత్మ జీవాత్మతో కూడియుండును. వేదములందలి 'ముండకోపనిషత్తు'(3.1.1) నందు : "ద్వా సుపర్ణా సయుజా సఖాయా" అని వివరింపబడినది. జీవుని పట్ల గొప్ప దయ కలిగిన పరమపురుషుడే అతనిని ఎల్లప్పుడు అనుసరించుచు అన్ని పరిస్థితుల యందును పరమాత్మగా అతని చెంతనే నిలిచియుండును.

## 13.22

**పురుష: ప్రకృతిస్థో హి భుజ్క్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణసఙ్గో స్య సదసద్యోనిజన్మసు ॥**

### అనువాదము

**భౌతికప్రకృతి యందు త్రిగుణముల ననుభవించుచు జీవుడు ఈ విధముగా జీవనము సాగించును. భౌతిక ప్రకృతితో అతనికి గల సంపర్కమే దీనికి కారణము. ఆ విధముగా అతడు ఉత్తమ, అధమ జన్మలను పొందుచుండును.**

### భాష్యము

జీవులు ఒక దేహము నుండి మరియొక దేహమునకు ఏ విధముగా పరిణామము చెందుననెడి విషయమును అవగాహనము చేసికొనుటకు ఈ శ్లోకము అత్యంత ప్రధానమైనది. మానవుడు జీర్ణములైన వస్త్రములను మార్చునట్లే, జీవుడు జన్మాంతరమున ఒక దేహమును విడిచి మరొక దేహమునకు పరిణామము చెందునని ద్వితీయాధ్యాయము నందు చెప్పబడినది. భౌతిక జీవితము నందలి ఆసక్తియే ఇట్టి వస్త్రముల వంటి దేహముల మార్పునకు కారణము. అట్టి మిథ్యా భావనచే బంధింపబడి యున్నంతవరకు అతడు ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పు చెందవలసియే యుండును. భౌతిక ప్రకృతిపై అధికారము చెలాయింపవలెననెడి అతని కోరికయే అతనిని అట్టి అవాంఛిత పరిస్థితుల యందు నెలకొల్పుచుండును. భౌతిక వాంఛ ప్రభావముచే జీవుడు కొన్నిమార్లు దేవతగను, మరికొన్నిమార్లు మానవుడుగను, కొన్నిమార్లు జంతు దేహమును, కొన్నిమార్లు పక్షిదేహమును, కొన్నిమార్లు క్రిమి దేహమును, కొన్నిమార్లు జలచర దేహమును, కొన్నిమార్లు సాధుజన్మను, కొన్నిమార్లు కీటక దేహమును పొందుచుండును. ఇది ఇట్లు అనంతముగా కొనసాగుచునే యుండును. ఈ విధమైన అన్ని స్థితుల యందును జీవుడు తానే తన పరిస్థితులకు ప్రభువునని భావించుచుండును. కాని వాస్తవమునకు అతడు భౌతిక ప్రకృతి ప్రభావమునకు అధీనుడై యుండును.

జీవుడు అట్టి వివిధ దేహములందు ఎట్లు ఉంచబడునో ఇక్కడ వివరింప బడినది. వివిధ ప్రకృతి గుణములతోడి అతనికి గల సంపర్కమే అందుకు కారణము. కనుక, ఎవరైనను ఈ త్రిగుణములకు అతీతులై నిజస్థితి యందు నెలకొనవలసి యున్నది. ఆ విధముగా నిజస్థితి యందు నెలకొనుటయే కృష్ణచైతన్యము. అట్టి దివ్యమైన కృష్ణచైతన్య స్థితియందు నెలకొననంత వరకు జీవుడు తన భౌతిక చైతన్యము కారణముగా ఒక

దేహము నుండి మరొక దేహమునకు పరిణామము చెందవలసియే యుండును. అతడు అనాదికాలము నుండి భౌతిక వాంఛలను కలిగియుండుటయే అందులకు కారణము. జీవుడు అట్టి భౌతికభావనను మార్చుకోవలెను. భౌతిక భావన యందు లేదా చైతన్యము నందు మార్పు యనునది ప్రామాణికుల ద్వారా శ్రవణము చేయుట ద్వారానే సాధ్యము కాగలదు. అర్జునుడు, శ్రీకృష్ణుని నుండి భగవతత్త్వమును గూర్చి శ్రవణము చేయుట యనునది ఈ విషయమున ఉత్తమమైన ఉదాహరణము. జీవుడు అట్లు శ్రవణ విధానమును అనుసరించినచో భౌతిక ప్రకృతిపై ఆధిపత్యము వహింప వలెననెడి అతని చిరకాలవాంఛ క్రమముగా నశింపగలదు. అతడు అట్లు తన ఆ భౌతికవాంఛను నశింప జేసికొనిన పరిణామము ననుసరించి అతనికి ఆధ్యాత్మికానందము లభింప గలదు. దేవాదిదేవుని సాంగత్యమున జీవుడు జ్ఞానవంతుడైన కొలది, ఆ జ్ఞాన పరిమాణము ననుసరించి అతడు శాశ్వతానందముతో కూడిన జీవితమును ఆస్వాదించునని వేదమంత్రములలోని 'తైత్తిరోపనిషత్తు'(2.1) నందు చెప్పబడినది.

## 13.23

**ఉపద్రష్టానుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వర: ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహే స్మిన్ పురుష: పర: ॥**

## అనువాదము

**అయినను ఈ దేహము నందు దివ్య ప్రభువును, దివ్య యజమానుడును, పర్యవేక్షకుడును, అనుమతించువాడును, పరమాత్మగా ప్రసిద్ధి నొందినవాడును అగు దివ్యభోక్త మరియొకడు కలడు.**

## భాష్యము

ఎల్లప్పుడును జీవాత్మతో కూడియుండు పరమాత్మడు పరమపురుషుని ప్రతినిధియని ఇక్కడ చెప్పబడినది. అట్టి పరమాత్మ ఎన్నడును సామాన్య జీవుడు కాడు. అద్వైత తత్త్వవేత్తలు దేహము నెరిగిన క్షేత్రజ్ఞుడు ఒక్కడేయని భావించుట వలన ఆత్మ మరియు పరమాత్మల నడుమ భేదము లేదని భావింతురు. దీనిని స్పష్టపరచుటకు భగవానుడు తాను ప్రతి దేహమునందును పరమాత్మగా ప్రాతినిధ్యము వహించు చుందునని చెప్పుచున్నాడు. అతడు సదా జీవాత్మ కంటె భిన్నమైనవాడు. కనుకనే 'పర'(దివ్యుడు)యని చెప్పబడెను. జీవాత్మ ఒక ప్రత్యేక క్షేత్రము నందలి కర్మల ననుభవించును. కాని పరమాత్ముడు మాత్రము అల్పభోక్తగా లేక దేహకర్మల యందు పాల్గొనువాడుగా కాకుండ సాక్షిగను, పర్యవేక్షకునిగను, అనుమతించువానిగను, దివ్యభోక్తగను వర్తించును. కనుకనే అతడు ఆత్మగా కాకుండ పరమాత్మగా తెలుపబడెను. అతడు సదా దివ్యుడు. ఆత్మ మరియు పరమాత్మ భిన్నులనుట మిక్కిలి స్పష్టము. పరమాత్మకు సర్వత్రా పాణిపాదము లుండును. కాని జీవాత్మకు అట్లు ఉండవు. దేవాదిదేవునికి ప్రతినిధిగా పరమాత్మ హృదయము నందు నెలకొని జీవాత్మ వాంఛించునట్టి భోగానుభవమునకు అనుమతించు చుండును. పరమాత్ముని అనుమతి లేనిదే జీవాత్మ ఏదియును చేయజాలదు. కనుకనే, జీవాత్మ 'భుక్తము', అనుభవింపబడువాడు మరియు లేక పోషింపబడునది. పరమాత్మ 'భోక్త', అనుభవించువాడు లేక పోషించు వాడనియు తెలియబడుచున్నారు. అట్టి పరమాత్మ అసంఖ్యాకములైన జీవులందరి యందును మిత్రునిగా నిలిచియుండును.

వాస్తవమేమనగా, ప్రతిజీవియు శ్రీకృష్ణభగవానుని నిత్యాంశయై యున్నాడు. వారిరువురును సదా సన్నిహితమైన సఖ్యసంబంధమును కలిగియుందురు. కాని భగవానుని ఆజ్ఞను నిరాకరించి, ప్రకృతిపై ఆధిపత్యము చెలాయించుటకు స్వతంత్రముగా వర్తించు స్వభావము జీవునకు గలదు. అతడు ఈ స్వభావమును కలిగి యున్నందునే భగవానుని తటస్థశక్తియని చెప్పబడును. అనగా జీవుడు వాంఛించినచో భౌతిక శక్తియందు గాని, ఆధ్యాత్మిక శక్తియందు గాని నిలువగలిగిన సామర్థ్యమును కలిగియుండును. జీవుడు భౌతిక శక్తిచే బద్ధుడై యున్నంత కాలము భగవానుడు అతనిని ఆధ్యాత్మిక శక్తి వైపునకు మరల్చుట కొరకై పరమాత్మ రూపమున మిత్రునిగా అతని చెంత నిలిచియుండును. భగవానుడు అతనిని ఆధ్యాత్మికశక్తి చెంతకు గొనిపోవుటకు ఎల్లప్పుడు ఆరాటపడుచుండును. కాని తనకున్న స్వల్పమైన స్వాతంత్ర్యము కారణముగా జీవుడు ఆ శక్తి యొక్క సాంగత్యమును ఎల్లప్పుడు నిరాకరించు చుండును. జీవుడు అట్లు తన స్వాతంత్ర్యమును దుర్వినియోగ పరచుటయే అతని బద్ధజీవితమందలి భౌతిక సంఘర్షణకు కారణమై యున్నది. కనుక భగవానుడు సదా లోపలనుండియు మరియు బయటినుండియు ఎల్లప్పుడు జ్ఞానోపదేశమును చేయుచుండును. భగవద్గీత యందు చెప్పబడినట్లుగా, దేవాదిదేవుడు బయటినుండి నిర్దేశించుచుండును. భౌతిక క్షేత్రము నందలి జీవుని కర్మలు అతని శాశ్వతానందమునకు తోడ్పడవని జీవునకు ఆంతరము నుండి బోధించుటకు యత్నించును. కనుకనే, "సర్వమును త్యజించి, నీ శ్రద్ధను నా వైపునకు మరలింపుము. అప్పుడు నీవు సౌఖ్యవంతుడవగుదువు" అని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు. ఈ విధముగా పరమాత్మ యందు లేక దేవాదిదేవుని యందు శ్రద్ధను కలిగిన జ్ఞానవంతుడు సచ్చిదానంద మయమైన జీవితము వైపునకు పురోగమింప నారంభించును.

### 13.24

**య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ ।**
**సర్వథా వర్తమానో పి న స భూయో భిజాయతే ॥**

## అనువాదము

**భౌతిక ప్రకృతి, జీవుడు, త్రిగుణముల అంత:ప్రక్రియకు సంబంధించిన ఈ తత్త్వమును అవగాహన చేసుకొనినవాడు నిశ్చయముగా ముక్తిని పొందును. అతని వర్తమాన స్థితి ఎట్లున్నను అతడు తిరిగి జన్మింపడు.**

## భాష్యము

భౌతిక ప్రకృతి, పరమాత్మ, జీవాత్మ, వాని పరస్పర సంబంధము యొక్క స్పష్టమైన అవగాహన గల మానవుని ముక్తికి అర్హుని చేయును. ఇట్టి అవగాహనము భౌతిక ప్రకృతికి అతడు తిరిగి రాకుండునట్లుగా అతని దృష్టిని సంపూర్ణముగా ఆధ్యాత్మిక వాతావరణము వైపునకే మరలించును. ఇదియే జ్ఞానము యొక్క ఫలితము. జీవుడు యాదృచ్ఛికముగా భౌతిక స్థితికి పతితుడయ్యెనని స్పష్టముగా అవగాహన చేసుకొనుటయే జ్ఞానప్రయోజనము. కనుక జీవుడు ప్రామాణికులైన సాధుపురుషులు మరియు ఆధ్యాత్మికాచార్యుని సాంగత్యమున తమ నిజస్థితిని అవగాహన చేసికొనుటకు యత్నింపవలెను. పిదప దేవాదిదేవునిచే వివరింపబడినట్లు భగవద్గీతను అవగాహన చేసికొని, ఆధ్యాత్మిక చైతన్యమునకు లేక కృష్ణచైతన్యమునకు మరలవలెను. అప్పుడు

అతడు ఈ భౌతిక జగత్తునకు తిరిగి రాడనుట నిశ్చయము. అతడు సచ్చిదానందమయ జీవనము కొరకై ఆధ్యాత్మిక జగత్తునకు బదిలీ చేయబడును.

**13.25**
**ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా ।**
**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥**

## అనువాదము

**కొందరు ధ్యానము చేతను, మరికొందరు జ్ఞానాభ్యాసము చేతను, ఇంకను కొందరు నిష్కామ కర్మచేతను పరమాత్మను తమయందే దర్శింతురు.**

## భాష్యము

మానవుని ఆత్మానుభూతి అన్వేషణకు సంబంధించిన విషయమున బద్ధజీవులు రెండు తరగతులుగా విభజింపబడిరని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు చెప్పుచున్నాడు. నాస్తికులును, నిరీశ్వరవాదులును, సంశయాత్ములును, ఆధ్యాత్మికావగాహన భావనకు దూరులై యుందురు. అట్టివారికి అన్యముగా ఆధ్యాత్మిక జీవితము నందు శ్రద్ధ కలిగినవారు మరికొందరుందురు. వారు ధ్యాన యోగులనియు, తాత్త్వికులనియు, నిష్కామ కర్ములనియు పిలువబడుదురు. అద్వైత సిద్ధాంతమును స్థాపించుటకు ఎల్లప్పుడు యత్నించువారు కూడ నాస్తికులు మరియు నిరీశ్వరవాదులుగనో పరిగణింపబడుదురు. మరోమాటలో, దేవాదిదేవుని భక్తులు మాత్రమే సరియైన ఆధ్యాత్మిక అవగాహనము నందు స్థితిని కలిగియుందురు. ఈ ఆధ్యాత్మిక జగత్తు భౌతిక ప్రకృతికి అతీతమైనదనియు, అదేవిధముగ పరమాత్మగా ఎల్లరియందు నెలకొనియుండు శ్రీకృష్ణభగవానుడును భౌతిక ప్రకృతికి అతీతమైనవాడనియు వారెరుగుదురు. పరతత్త్వమును జ్ఞానాభ్యాసముచే అవగాహన చేసికొనువారు కొందరుందురు. వారు వారు కూడ శ్రద్ధ గలవారుగనే పరిగణింపబడుదురు. సాంఖ్యతత్త్వవేత్తలు ఈ భౌతిక జగత్తును ఇరువది నాలుగు తత్త్వములుగా విశ్లేషించి, జీవాత్మను ఇరువదియైదవ అంశముగా పరిగణింతురు. అట్టి జీవాత్మ స్వభావము భౌతికాంశములకు అతీతమైనదని వారు అవగాహన చేసికొన గలిగినపుడు వారు జీవాత్మకుపైన దేవాదిదేవుడు కలడని కూడ గ్రహింప గలుగుదురు. భగవానుడు యారువదియారవ తత్త్వము కాగలడు. ఈ విధముగా వారు కూడ కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవాప్రమాణమునకు క్రమముగా చేరగలుగుదురు. అదేవిధముగా ఫలాపేక్ష లేకుండ కర్మల నొనరించువారు కూడ వారి ప్రవృత్తిలో పరిపూర్ణులుగనే భావింపబడుదురు. అట్టివారికి కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవాస్థితికి పురోగమించుటకు అవకాశమివ్వబడును. వీరేగాక శుద్ధచైతన్యము గల మరికొందరు పరమాత్మను ధ్యానముచే కనుగొనుటకు యత్నించుచుదురనియు ఇక్కడ తెలుపబడినది. అట్టివారు పరమాత్మను తమయందు దర్శించినపుడు వారు ఆధ్యాత్మిక స్థితి యందు ప్రతిష్ఠితులగుదురని కూడ ఇక్కడ చెప్పబడినది. అట్లే జ్ఞానాభ్యాసము చేత పరమాత్మను అవగాహన చేసికొన యత్నించువారు కొందరును, హఠయోగమును అభ్యసించువారు మరికొందరు యుందురు. 'హఠయోగ'ము ద్వారా దేవాదిదేవుని సంతృప్తి పరచుటకు యత్నించు వారు బాల్యోచిత కర్మల ద్వారా అట్టి దానిని సాధింప యత్నించు వారగుదురు.

**13.26**
**అన్యే త్వేవమజానన్త: శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।**
**తే పి చాతితరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణా: ॥**

## అనువాదము

**మరికొందరు ఆధ్యాత్మిక జ్ఞానముతో పరిచయము లేకున్నను ఇతరుల నుండి పరమపురుషుని గూర్చి శ్రవణము చేసి అతనిని పూజింప నారంభింతురు. ప్రామాణిక పురుషుల నుండి శ్రవణము చేయు ప్రవృత్తి గలవారగుటచే వారును జనన మరణ మార్గమును అధిగమింతురు.**

## భాష్యము

ఈ శ్లోకము ఆధునిక సమాజమునకు ప్రత్యేకముగా వర్తించును. ఎందుకనగా ఆధునిక సమాజమునందు ఆధ్యాత్మిక విషయములను గూర్చిన విద్య యనునది ఏ మాత్రము లేదు. ఆదునిక సమాజమున కొందరు నాస్తికులుగనో, నిరీశ్వరవాదులుగనో లేదా తాత్త్వికులుగనో కన్పింపవచ్చును. వాస్తవమునకు సరియైన తత్త్వజ్ఞానము ఎవ్వరికినీ లేదు. కనుక సాధారణ మానవునకు సంబంధించి నంత వరకు అతడు సజ్జనుడైనచో శ్రవణము ద్వారా పురోగతి నొందుటకు అవకాశము కలదు. అట్టి శ్రవణ విధానము ఎంతో ముఖ్యమైనది. ఆధునిక జగత్తున కృష్ణచైతన్యమును ప్రచారము చేసిన శ్రీ చైతన్య మహాప్రభువు ఈ శ్రవణ విధానమునకు గొప్ప ప్రాధాన్యమిచ్చిరి. ఎందుకనగా, సామాన్య మానవుడు ముఖ్యముగా ప్రామాణిక ఆధారముల నుండి శ్రవణము చేయుట ద్వారానే పురోభివృద్ధిని సాధింపగలడని శ్రీ చైతన్యమహాప్రభువు తెలిపియుండిరి. అట్టి శ్రవణము నందు అత్యంత ముఖ్యమైనది, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రపు దివ్యశబ్ద ప్రకంపనము. కనుక మానవులందరూ ప్రామాణికులైన వారినుండి శ్రవణ లాభమును పొంది క్రమముగా సర్వమును అవగాహన చేసికొనవలెయును. తదనంతరము పరమపురుషుని ఆరాధన నిస్సందేహముగా ప్రారంభమగును. ఈ యుగమున పరతత్త్వము నెరుగుటకు ఎవ్వరును తమ సాంఘీక స్థితిని మార్చుకోనవసరము లేదనియు, కల్పితహేతువాదము ద్వారా అవగాహన చేసుకొనుటకు యత్నించుటను విడనాడవలెననియు శ్రీ చైతన్య మహాప్రభువు తెలిపియుండెను. మానవుడు భగవత్తత్త్వ విజ్ఞానము కలిగిన మహాపురుషునకు దాసుడు కావలసియున్నది. శుద్ధభక్తుని ఆశ్రయమును పొంది, అతని నుండి ఆత్మానుభూతిని గూర్చి శ్రవణము చేసి, అతని అడుగుజాడల ననుసరించు నంతటి అదృష్టవంతుడైనచో మానవుడు శుద్ధభక్తుని స్థితికి క్రమముగా ఉద్ధరింప బడును. కనుకనే ప్రత్యేకముగా ఈ శ్లోకము నందు శ్రవణ విధానము దృఢముగా ఉపదేశింపబడినది. వాస్తవమునకు అదియే అత్యంత సమంజసము. సామాన్య మానవుడు నామమాత్ర తాత్త్వికులనబడు వారియంత సమర్థుడు కాకున్నను, ప్రామాణిక పురుషుల ద్వారా చేయబడు శ్రద్ధాపూరితమైన శ్రవణము అతనికి భౌతికజీవితమును అధిగమించుటకు మరియు భగవద్ధామమును తిరిగి చేరుటకు తోడ్పడును.

**13.27**
**యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ ॥**

## అనువాదము

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! నీవు గాంచునట్టి స్థావర జంగమ రూపమేదైనను క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమేనని తెలిసికొనుము.**

## భాష్యము

భౌతిక సృష్టికి పూర్వమే స్థితిని కలిగియున్నట్టి భౌతిక ప్రకృతి మరియు జీవుల గూర్చి ఈ శ్లోకమున వివరింపబడినది. సృష్టింపబడిన ప్రతిదియు జీవుడు మరియు ప్రకృతి కలియిక చేతనే ఏర్పడినది. ఈ జగత్తున వృక్షములు, పర్వతములు, కొండలు వంటి అనేక స్థావరరూపములను జంగమ రూపములను ఈ జగత్తు నందు కలవు. అవియన్నియు భౌతిక ప్రకృతి మరియు ఉన్నత ప్రకృతియైన జీవుని కలయిక చేతనే ఏర్పడినవి. ఉత్తమ ప్రకృతికి సంబంధించిన జీవుని యొక్క స్పర్శ లేనిదే ఏదియును వృద్ధినొందదు. ఈ విధముగా భౌతిక ప్రకృతి మరియు జీవుల నడుమ సంబంధము అనాదిగా కొనసాగుచున్నది. ఈ సంయోగమనునది పరమపురుషునిచే కల్పింపబడుచున్నది. కనుక పరా అపరా ప్రకృతులు రెండింటిని భగవానుడు నియంత్రించువాడై యున్నాడు. భౌతిక ప్రకృతి భగవానునిచే సృష్టింపబడినది. పరాప్రకృతియైన జీవుడు భౌతిక ప్రకృతి యందు ప్రవేశపెట్టబడగా సర్వకార్యములు మరియు సర్వసృష్టులు కొనసాగుచున్నవి.

**13.28**
**సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్ ।**
**వినశ్యత్స్వవినశ్యన్తం య: పశ్యతి స పశ్యతి ॥**

## అనువాదము

**సర్వదేహములందు జీవాత్మను అనుసరించు పరమాత్మను గాంచువాడు మరియు నశ్వరమైన దేహమునందలి ఆత్మ, పరమాత్మ లిరువురిని ఎన్నడును నశింపని వారుగా తెలిసికొనగలిగినవాడు యథార్థదృష్టిని కలిగినవాడు.**

## భాష్యము

దేహము, దేహము యొక్క యజమాని లేక జీవుడు, జీవుని యొక్క మిత్రుడు – సత్సాంగత్యముచే ఈ మూడు కలిసియుండుటను చూడగలిగినవాడు నిజమైన జ్ఞానవంతుడు. ఆధ్యాత్మిక విషయములను యథార్థముగా నెరిగినవాని సాంగత్యము లేకుండా ఎవ్వరును ఆ మూడింటిని దర్శింపజాలరు. అట్టి సాంగత్యమును పొందలేనివారు అజ్ఞానులు. వారు దేహమును మాత్రమే గాంచుచు దేహము నశించిన పిమ్మట సర్వము ముగియునని భావింతురు. కాని వాస్తవమునకు అట్టి భావన సరియైనది కాదు. దేహము నశించిన పిదపను ఆత్మ, పరమాత్మ లిరువురును నిలిచి యుందురు. అంతియేగాక వారు శాశ్వతముగా వివిధ స్థావర జంగమ రూపములలో తమ అస్తిత్వమును

కొనసాగింతురు. జీవాత్మ దేహమునకు యజమాని యైనందున 'పరమేశ్వర' అను సంస్కృత పదమునకు కొన్నిమార్లు జీవాత్మగా కూడా అర్థము చెప్పబడుచున్నది. అట్టి ఆత్మ దేహము నశించిన పిమ్మట మరొక దేహమును పొందుచుండును. ఈ విధముగా ఆత్మ దేహమునకు యజమానిగా తెలియబడు చుండును. కాని కొందరు 'పరమేశ్వర' అను పదమునకు పరమాత్ముడని వివరించుదురు. ఈ రెండు భావవివరణము లందును ఆత్మ మరియు పరమాత్మలు రెండును నశింపక శాశ్వతముగా కొనసాగుచునేయుండును. ఈ విధముగా ఆత్మ పరమాత్మలను దర్శించువాడు జరుగుచున్న దానిని యథార్థముగా దర్శించువాడగును.

## 13.29

**సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥**

## అనువాదము

**సర్వత్ర ప్రతిజీవి యందును సమముగా ప్రత్యక్షమైయుండు పరమాత్మను దర్శించువాడు తన మనస్సుచే తనను తాను హీనపరచుకొనడు. ఈ విధముగా అతడు పరమగతిని పొందగలడు.**

## భాష్యము

జీవుడు తన భౌతిక స్థితిని అంగీకరించుటచే తన వాస్తవ ఆధ్యాత్మిక స్థితికంటెను భిన్నముగా నిలిచియుండును. కాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు పరమాత్మ రూపమున సర్వత్రా నిలిచియున్నాడని అతడు అవగాహన చేసికొనినచో, అనగా అతడు ప్రతిజీవి యందును దేవాదిదేవుని దర్శింపగలిగినచో తన విధ్వంసకరమైన మనోప్రవృత్తికి లోనుకాకుండ, క్రమముగా ఆధ్యాత్మిక జగత్తు వైపునకు పురోగమించును. సాధారణముగా మనస్సు ఇంద్రియతృప్తి కార్యములకు అలవాటు పడియుండును. కాని దానిని పరమాత్మ వైపునకు మరలించినచో మానవుడు ఆధ్యాత్మిక అవగాహన యందు పురోగతిని సాధింపగలడు.

## 13.30

**ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథాత్మానమకర్తారం స పశ్యతి ॥**

## అనువాదము

**భౌతిక ప్రకృతిచే సృష్టింపబడిన దేహము చేతనే సర్వకర్మలు చేయబడు చున్నవనియు మరియు తాను అకర్తననియు గాంచగలిగినవాడు యథార్థముగా దర్శించువాడగును.**

## భాష్యము

ఈ దేహము పరమాత్ముని నిర్దేశము ననుసరించి భౌతిక ప్రకృతిచే నిర్మింపబడినది. అట్టి దేహపరమగు సమస్త కార్యములకు ఆత్మ కర్త కాదు. సుఖము కొరకు

గాని దుఃఖము కొరకు గాని ఎవరు ఏది చేయవలసి యున్నను, బలవంతముగా దేహస్థితి ననుసరించి అతడు అట్లు చేయవలసి వచ్చును. కాని వాస్తవమునకు ఆత్మ అట్టి సమస్త దేహకార్యములకు దూరముగా నుండును. మానవుని పూర్వజన్మ వాంఛల ననుసరించి అతనికి ఈ దేహము అందింపబడును. కనుకనే ఆ కోరికలను తీర్చుకొనుటకు అతడు తదనుగుణముగా వర్తించు చుండును. వాస్తవమునకు, జీవుడు తన వాంఛలను పరిపూర్ణము చేసుకొనుటకై పరమ పురుషునిచే రూపొందింపబడిన యంత్రము వంటిది ఈ దేహము. అట్టి వాంఛల చేతనే మానవుడు సుఖదుఃఖముల ననుభవించుట కొరకై వివిధ పరిస్థితుల యందుంచబడును. జీవుని యొక్క ఆధ్యాత్మికదృష్టి అభివృద్ధి నొందినంతటనే, మానవుడు తనను తన దైహికకార్యముల నుండి అన్యముగా గుర్తించును. అట్టి ఆధ్యాత్మికదృష్టి కలిగినవాడే యథార్థముగా దర్శించు ద్రష్టయగును.

## 13.31

**యదా భూతపృథగ్భావమేకస్థమనుపశ్యతి ।**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥**

## అనువాదము

**బుద్ధిమంతుడైనవాడు భిన్నదేహముల కారణముగా భిన్న వ్యక్తిత్వములను దర్శించుటను విరమించి, జీవులు ఏ విధముగా సర్వత్రా విస్తరించిరో గాంచినపుడు అతడు బ్రహ్మభావమును పొందును.**

## భాష్యము

జీవాత్మ వివిధకోరికల ననుసరించియే వారి వివిధ దేహములు సృజింపబడు చున్నవనియు, నిజముగా ఆ దేహములన్నీ ఆత్మకు సంబంధించినవి కావనియు దర్శించగలిగినపుడే, మానవుడు యథార్థదృష్టి కలిగినవాడగును. జీవితము యొక్క భౌతిక భావన దృష్టిలో మనము కొందరిని జీవులుగను, కొందరిని దేవతలుగను, కొందరిని మానవులుగను, ఇంకొందరిని శునక, మార్జాలాది రూపములుగను చూచుచుందుము. ఇట్టి దృష్టి భౌతికమే గాని యథార్థదృష్టి కాజాలదు. ఈ భేధభావమునకు దేహాత్మబుద్ధియే కారణము. కాని వాస్తవమునకు భౌతిక దేహము నశించిన పిమ్మట మిగులునది ఆత్మ ఒక్కటియే. భౌతిక ప్రకృతి సంపర్కముచే అట్టి ఆత్మ వివిధములైన దేహములను పొందుచుండును. మానవుడు దీనిని గ్రహించినపుడు ఆధ్యాత్మిక దృష్టిని పొందును. ఈ విధముగా మానవుడు, జంతువు, అధికుడు, అల్పుడు అను భేదభావముల నుండి విముక్తుడై, చైతన్యమును శుద్ధపరచుకొనినవాడు తన ఆధ్యాత్మిక స్వరూపమున కృష్ణచైతన్యమును పెంపొందించు కొనగలుగును. అట్టి భక్తుడు ఏ విధముగా సర్వమును దర్శించునో తరువాతి శ్లోకమున వివరింపబడినది.

## 13.32

**అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాయమవ్యయః ।**
**శరీరస్థో పి కౌన్తేయ న కరోతి న లిప్యతే ॥**

### అనువాదము

**ఓ కౌంతేయా! ఆధ్యాత్మికదృష్టిని కలిగినవారు అవ్యయమైన ఆత్మను దివ్యమైనదిగను, నిత్యమైనదిగను, త్రిగుణాతీతమైనదిగను దర్శింతురు. అట్టి ఆత్మదేహముతో సంపర్కము కలిగియున్నను కర్మనొనరింపదు మరియు బద్ధము కాదు.**

### భాష్యము

భౌతిక దేహము జన్మించుచున్నందున జీవుడు జన్మించినట్లు గోచరించు చుండును. కాని వాస్తవమునకు జీవుడు శాశ్వతుడు, జన్మలేనటు వంటివాడు. దేహము నందున్నను అతడు దివ్యుడు మరియు నిత్యుడు. కనుక అతడు నాశనము చేయబడడు. స్వభావరీత్యా అతడు ఆనందపూర్ణుడు. అతడు ఎట్టి భౌతిక కార్యకర్మల యందు నెలకొనడు. కనుక భౌతిక దేహము నందున్నను అతడు చేయుకర్మలు అతనిని బంధింపవు.

## 13.33

**యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే ।**
**సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥**

### అనువాదము

**ఆకాశము సర్వవ్యాపకమైనను సూక్ష్మత్వ కారణముగా దేనితోను కలియదు. అట్లే బ్రహ్మభావములో స్థితమైన ఆత్మదేహము నందంతట నిలిచియున్నను దేహముతో కలియదు.**

### భాష్యము

వాయువు లేక ఆకాశము అనునది జలము, బురద, మలము వంటి దేనియందు ప్రవేశించినను దేనితోడను కలియదు. అట్లే జీవుడు తన సూక్ష్మస్వభావముచే వివిధ దేహములందు నిలిచినను వాటికి అతీతముగా నుండును. కనుకనే జీవుడు ఈ దేహములో ఎట్లు నిలిచియున్నాడో మరియు దేహము నశించిన పిమ్మట ఎట్లు దేహము నుండి బయటపడునో, భౌతిక దృష్టితో దర్శించుట అసాధ్యము. శాస్త్రజ్ఞులెవ్వరును కూడ దీనిని కనుగొనజాలరు మరియు ధ్రువపరచలేరు.

**13.34**
**యథా ప్రకాశయత్యేక: కృత్స్నం లోకమిమం రవి: ।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥**

**అనువాదము**

**ఓ భరతవంశీయుడా! సూర్యుడొక్కడేయైన ఈ విశ్వము నంతటిని ప్రకాశింప జేయునట్లు, దేహమునందలి జీవాత్మ సమస్త దేహమును చైతన్యముతో ప్రకాశింపజేయును.**

**భాష్యము**

చైతన్యమునకు సంబంధించిన సిద్ధాంతము లనేకము గలవు. భగవద్గీత యందు ఇక్కడ సూర్యుని మరియు సూర్యకాంతి ఉదాహరణము ఇవ్వబడినది. సూర్యుడు ఒకే ప్రదేశమున నిలిచియుండి విశ్వమునంతటిని ప్రకాశింప జేయు చున్నట్లు, దేహమునందలి హృదయములో నెలకొనియున్నట్టి అణు ఆత్మ చైతన్యముచే దేహమునంతటిని ప్రకాశింప జేయుచున్నది. ఈ విధముగా సూర్యకాంతి సూర్యుని ఉనికికి నిదర్శనమైనట్లే, దేహమునందలి చైతన్యము ఆత్మ ఉనికికి నిదర్శనము. దేహము నందు ఆత్మ నెలకొనినప్పుడు చైతన్యము దేహమంతటను విస్తరించి యుండును. కాని దేహము నుండి ఆత్మ వెడలి పోయినంతనే చైతన్యము కూడ వెడలిపోవును. ఆత్మలేని దేహము చైతన్య రహిత మగునని వివేకవంతు డెవ్వడైనను దీనిని సులభముగా గ్రహించును. కనుకనే చైతన్యము భౌతిక వస్తువుల సమ్మేళనముచే ఏర్పడినట్టిది కాదు. అది జీవాత్మ లక్షణమని తెలియబడుచున్నది. జీవుని ఈ చైతన్యము పరమపురుషుని దివ్య చైతన్యముతో గుణైక్యమును కలిగియున్నప్పటికిని అది దివ్యమైనది కాదు. ఎందుకనగా జీవుని చైతన్యము ఒక ప్రత్యేక దేహమునకే పరిమితమై యుండి, ఇతర దేహములను గూర్చి తెలియకుండును. కాని జీవాత్మకు మిత్రుడుగా సమస్త దేహము లందు గల పరమాత్మ సమస్త దేహముల జ్ఞానమును కలిగియుండును. పరమపురుషుని దివ్య చైతన్యమునకును ప్రత్యగాత్మ చైతన్యమునకును నడుమ గల భేదమిదియే.

**13.35**
**క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాన్తి తే పరమ్ ॥**

**అనువాదము**

**దేహము మరియు దేహము నెరిగిన క్షేత్రజ్ఞునకు నడుమ గల భేదమును జ్ఞానచక్షువులచే దర్శించి, భౌతిక ప్రకృతి బంధము నుండి ముక్తి నొందు విధానము నెరుగ గలిగినవాడు పరమగతిని పొందగలరు.**

**భాష్యము**

దేహము, దేహ యజమానియైన ఆత్మ, పరమాత్ముడు అనెడి మూడు అంశముల నడుమ గల భేదమును మానవుడు తప్పక ఎరుగ వలెననుటయే ఈ త్రయోదశాధ్యాయపు సారాంశము. ఈ అధ్యాయము నందు ఎనిమిదవ శ్లోకము నుండి పన్నెండవ శ్లోకము

వరకు వర్ణింపబడినట్లు, ప్రతియొక్కరు ముక్తినొందు విధానమును గుర్తింపవలెను. అప్పుడే వారు పరమగతిని పొందగలరు.

శ్రద్ధావంతుడైన మానవుడు మొదట సత్సాంగత్యమును పొంది శ్రీకృష్ణభగవానుని గూర్చి శ్రవణము చేయవలెను. ఆ విధముగా అతడు క్రమముగా ఆత్మవికాసము నొందవలెను. అట్టి మానవుడు ఆధ్యాత్మికాచార్యుని అంగీకరించినచో, భౌతిక మరియు ఆధ్యాత్మికముల నడుమ గల భేదమును ఎరుగగలుగును. అప్పుడు అది మరింత ఆధ్యాత్మికానుభూతికి సోపానము కాగలదు. ఆధ్యాత్మికాచార్యుడు వివిధోపదేశముల ద్వారా జీవితము యొక్క భౌతిక భావనల నుండి విముక్తి పొందు మార్గమును శిష్యులకు బోధించును. ఉదాహరణకు ఇక్కడ భగవద్గీత యందు భౌతికములైన భావముల నుండి విముక్తి కలిగించుటకు శ్రీకృష్ణభగవానుడు అర్జునునికి ఉపదేశము కావించుచున్నట్లుగా మనము గాంచుచున్నాము.

ఈ దేహము భౌతిక పదార్థమనియు మరియు ఇరువది నాలుగు అంశములచే దానిని విశ్లేషింపవచ్చునని ఎవ్వరైనను గ్రహింపవచ్చును. ఈ దేహము స్థూలవ్యక్తీకరణము. మనస్సు మరియు దాని తత్త్వమునకు సంబంధించిన కార్యములు సూక్ష్మ వ్యక్తీకరణములు. ఈ రెండింటికిని నడుమగల అంత:ప్రక్రియయే జీవలక్షణములు. కాని వీటికన్నింటికిని పై నున్నదే ఆత్మ. ఈ ఆత్మతో పాటు పరమాత్మ కూడ కలదు. ఆత్మ మరియు పరమాత్మలు రెండు భిన్నములే గాని ఏకములు కావు. ఆత్మ మరియు ఇరువదినాలుగు భౌతికాంశముల సంయోగము చేతనే ఈ భౌతిక జగత్తు వర్తించుచున్నది. సమస్త భౌతిక జగత్తును ఈ విధమైన ఆత్మ మరియు భౌతికతత్త్వముల కలయికగా గాంచుచు పరమాత్ముని నిజస్థితిని దర్శింపగలిగినవాడు ఆధ్యాత్మిక జగత్తును చేరుటకు అర్హుడగుచున్నాడు. ఈ విషయము లన్నియును చింతనము మరియు ఆత్మానుభూతి కొరకై ఉద్దేశింప బడి యున్నవి. కనుక ఆధ్యాత్మికాచార్యుని సహాయముచే ఈ అధ్యాయము నందలి విషయములను మానవుడు సంపూర్ణముగా అవగాహన చేసికొనవలెను.

**శ్రీమద్భగవద్గీత యందలి 'ప్రకృతి, పురుషుడు, చైతన్యము' అను త్రయోదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

------

# చతుర్దశాధ్యాయము
# ప్రకృతి త్రిగుణములు

### 14.1
**శ్రీభగవానువాచ**
**పరం భూయ: ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**
**యజ్ జ్ఞాత్వా మునయ: సర్వే పరాం సిద్ధిమితో గతా: ॥**

## అనువాదము

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : దేనిని తెలిసికొని మునులందరును పరమ సంసిద్ధిని పొందిరో అట్టి జ్ఞానములలో కెల్ల ఉత్తమమైన ఈ దివ్య జ్ఞానమును నీకిప్పుడు నేను మరల తెలియజేయుదును.**

## భాష్యము

సప్తమాధ్యాయము నుండి ద్వాదశాధ్యాయపు చివరి వరకును శ్రీకృష్ణభగవానుడు పరతత్త్వమును, దేవాదిదేవుడును అగు తనను గూర్చి స్పష్టముగా వివరించి యున్నాడు. ఇప్పుడు భగవానుడు తిరిగి అర్జుననకు మరింత అధికమైన జ్ఞానవికాసమును కల్పించుచున్నాడు. ఎవ్వరైనను తాత్త్వికచింతన విధానము ద్వారా ఈ అధ్యాయమును అవగాహన చేసుకొనినచో వారు వెంటనే భక్తియోగ (భక్తియుక్త సేవ)ను కూడ అవగాహన చేసుకొనగలరు. నమ్రతతో జ్ఞానమును పెంపొందించు కొనుట ద్వారా జీవుడు భౌతికబంధముల నుండి విముక్తుడు కావచ్చునని గడచిన త్రయోదశాధ్యాయమున స్పష్టముగా వివరింపబడినది. అట్లే ప్రకృతి త్రిగుణముల సంపర్కము చేతనే జీవుడు భౌతిక జగత్తున బద్ధుడగునని కూడ వివరింపబడినది. ఇప్పుడు ఈ అధ్యాయము నందు ఆ ప్రకృతి త్రిగుణములెట్టివో, అవి ఎట్లు వర్తించునో, అవి ఎట్లు బంధమోక్షములను కలిగించునో దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు వివరించు చున్నాడు. ఈ అధ్యాయము లందు తెలుపబడిన జ్ఞానము పూర్వపు అధ్యాయములందు విశదీకరింపబడిన జ్ఞానము కంటెను ఉత్తమమని దేవాదిదేవుడు ప్రవచించు చున్నాడు. అట్టి జ్ఞానమును అవగాహన చేసికొనుట ద్వారా పలువురు మహర్షులు పరమ సంసిద్ధిని సాధించి ఆధ్యాత్మిక జగత్తునకు చేరిరి. అట్టి జ్ఞానమునే భగవానుడిప్పుడు మేలైన పద్ధతిన వివరించుచున్నాడు. ఈ జ్ఞానము ఇంతవరకు వివరింపబడిన ఇతర అన్ని జ్ఞానవిధానముల కంటెను మిక్కిలి ఉత్కృష్టమైనది. దీనిని అవగాహనము చేసుకొనుట ద్వారా పలువురు మునులు సంసిద్ధిని పొందిరి. కనుకనే ఈ చతుర్దాశాధ్యాయమును అవగాహన చేసుకొనినవారు పరిపూర్ణత్వమును పొందగలరని తప్పక ఆశింపవచ్చును.

**14.2**
**ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।**
**సర్గే పి నోపజాయన్తే ప్రలయే న వ్యథన్తి చ ॥**

## అనువాదము

**ఈ జ్ఞానము నందు స్థిరత్వము నొందుట ద్వారా ముని నాతో సమానమైన స్వభావమును పొందగలడు. అట్లు ప్రతిష్ఠితుడైన అతడు సృష్టిసమయమున జన్మింపడు. అట్లే ప్రళయ సమయమున వ్యథ నొందడు.**

## భాష్యము

సంపూర్ణ ఆధ్యాత్మిక జ్ఞానమును పొందిన పిమ్మట మానవుడు జన్మమృత్యు పరంపర నుండి విముక్తుడై దేవాదిదేవునితో గుణైక్యమును పొందును. అయినను, జీవాత్మగా అతడెన్నడును తన వ్యక్తిత్వమును కోల్పోవడు. కనుకనే ఆధ్యాత్మిక జగత్తు నందలి దివ్యలోకములను చేరిన ముక్తాత్మలు పరమపురుషుని దివ్యమైన ప్రేమయుక్త సేవ యందు నెలకొని, అతని పాదపద్మములనే సదా దర్శింప గోరుదురని వైదిక గ్రంథముల ద్వారా తెలియుచున్నది. కనుకనే ముక్తి నొందిన పిమ్మట కూడ శుద్ధభక్తులు తమ వ్యక్తిత్వమును కోల్పోవరు.

సాధారణముగా, ఈ భౌతిక జగత్తునందు మనము సంపాదించు జ్ఞానమంతయు త్రిగుణములచే కలుషితమై యుండును. భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములచే కలుషితము గాని జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానము అని పిలువబడును. అట్టి ఆధ్యాత్మిక జ్ఞానము నందు నెలకొనినవాడు దేవాదిదేవునితో సమాన స్థితి యందు నిలుచును. ఆధ్యాత్మికాకాశమును గూర్చిన జ్ఞానము లేనటువంటి నిరాకారవాదులు భౌతిక దేహములకు సంబంధించిన భౌతిక కర్మల నుండి ముక్తి నొందినంతనే వైవిధ్యమనునది లేకుండ ఈ ఆధ్యాత్మిక వ్యక్తిత్వము రూపరహిత మగునని పలుకుదురు. వాస్తవమునకు ఈ భౌతిక జగత్తునందు భౌతిక వైవిధ్యమున్నట్లే, ఆధ్యాత్మిక జగత్తు నందు కూడా వైవిధ్యముండును. ఈ విషయమును ఎరుగనివారే ఆధ్యాత్మిక స్థితి వైవిధ్యమునకు విరుద్ధమని భావింతురు. కాని వాస్తవమునకు ముక్తి పిమ్మట ఆధ్యాత్మిక జగత్తు నందు మానవుడు ఆధ్యాత్మిక రూపమును పొందును. అట్టి ఆధ్యాత్మిక జగత్తు నందు కూడ అనేక ఆధ్యాత్మిక కార్యకలాపములు గలవు. అక్కడి ఆధ్యాత్మిక స్థితియే భక్తిమయ జీవితమనబడును. అట్టి ఆధ్యాత్మికస్థితి కలుషితము కానట్టిదని చెప్పబడును. అక్కడ మానవుడు భగవానునితో గుణైక్యమును కలిగియుండునని చెప్పబడినది. అట్టి జ్ఞానమును పొందుటకు మానవుడు ఆధ్యాత్మిక గుణములను వృద్ధి చేసికొనినవాడు భౌతిక జగత్తు సృష్టిచే గాని ప్రళయముచే గాని కలత చెందడు.

## 14.3
**మమ యోనిర్మహద్ బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।**
**సమ్భవ: సర్వభూతానాం తతో భవతి భారత ॥**

## అనువాదము

**ఓ భరతవంశకుమారా! బ్రహ్మముగా పిలువబడు మహత్తత్త్వము సమస్త ప్రాణుల జననమునకు ఆధారమై యున్నది. సర్వజీవుల జన్మను సంభవింపజేయుచు నేనే ఆ బ్రహ్మము నందు బీజప్రదానము కావించుచున్నాను.**

## భాష్యము

ఇదియే విశ్వము నందు జరుగుచున్న సమస్తమునకు వివరణము : విశ్వము నందు జరుగు దానికంతకును క్షేత్రము(దేహము) మరియు క్షేత్రజ్ఞుని(ఆత్మ) సంయోగమే కారణము. ఇట్టి భౌతిక ప్రకృతి మరియు జీవుల సంయోగము దేవాదిదేవుని చేతనే సాధ్యము కావింపబడుచున్నది. వాస్తవమునకు 'మహత్తత్త్వము' సమస్త విశ్వమునకు మూలకారణము. ప్రకృతి యొక్క త్రిచ గుణములతో కూడి యుండు మహత్తత్త్వమే కొన్నిమార్లు బ్రహ్మముగా పిలువబడును. దేవాదిదేవుడు దానియందే బీజప్రదానము చేయగా అసంఖ్యాకమగు విశ్వములు వ్యక్తములగును. భౌతికవస్తు సర్వస్వమైన అట్టి మహత్తత్త్వము 'ముండకోపనిషత్తు' (1.1.9) నందు బ్రహ్మముగా వర్ణింపబడినది : "తస్మాదేతద్ బ్రహ్మ నామరూపమన్నం జాయతే." అట్టి బ్రహ్మము నందు భగవానుడు జీవులను బీజరూపము నందుంచును. భూమి, జలము, అగ్ని, వాయువు మొదలుగా గల ఇరువదినాలుగు అంశములు కలిసి భౌతికశక్తిగా పరిగణింపబడును. అవియే 'మహద్బ్రహ్మము' అనబడు భౌతిక ప్రకృతిని నిర్మించును. సప్తమాధ్యాయము నందు వర్ణింపబడినట్లు దీనికి అతీతమైన ఉన్నత ప్రకృతియే 'జీవుడు'. దేవాదిదేవుని సంకల్పముచే భౌతిక ప్రకృతి యందు ఉన్నత ప్రకృతి సంయోగము కావింపబడును. పిదప ఈ భౌతిక ప్రకృతి యందు జీవులన్నియు జన్మించును.

తేలు బియ్యపురాసులలో గ్రుడ్లుపెట్టును. దానితో తేలు బియ్యము నుండియే జన్మించునని కొన్నిమార్లు చెప్పబడుచుండును. కాని వాస్తవమునకు తేలు జన్మకు బియ్యము కారణము కాదు. వాస్తవమునకు బియ్యపురాసులలో తల్లి తేలుచే గ్రుడ్లు అక్కడ పెట్టబడినవి. అట్లే భౌతిక ప్రకృతి జీవుల జన్మకు కారణము కాదు. దేవాదిదేవుని చేతనే నిజమునకు బీజమొసగబడుచున్నది. కాని వారు భౌతిక ప్రకృతి నుండి ఉద్భవించినట్లుగా కనబడుదురు. ఈ విధముగా తన పూర్వకర్మల ననుసరించి ప్రతి జీవుడు ప్రకృతిచే సృష్టింపబడిన వివిధ దేహములను పొందును. తద్వారా ప్రతిజీవుడు తన పూర్వకర్మల ననుసరించి ఆ దేహములలో సుఖించుటయో లేదా దుఃఖించుటయో జరుగుచుండును. అనగా ఈ భౌతిక జగత్తులోని జీవులన్నింటి వ్యక్తీకరణములకు భగవానుడే కారణము.

**14.4**
**సర్వయోనిషు కౌన్తేయ మూర్తయ: సమ్భవన్తి యా: ।**
**తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రద: పితా ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! సమస్త జీవజాతులు భౌతిక ప్రకృతి యందు జన్మించుట చేతనే సృష్టింపబడు చున్నదనియు మరియు నేనే వీటన్నింటికి బీజప్రదాతనైన తండ్రిననియు అవగాహన చేసికొనవలెను.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడే జీవులన్నింటికిని ఆదిజనకుడని ఈ శ్లోకమున స్పష్టముగా వివరింపబడినది. జీవులు భౌతిక ప్రకృతి మరియు ఆధ్యాత్మిక ప్రకృతి యొక్క సంయోగముచే కలిగినట్టివి. అట్టిజీవులు ఈ లోకము నందే కాకుండ ప్రతిలోకము నందును అనగా అత్యంత ఉన్నత లోకమైన బ్రహ్మలోకము నందు కూడ గోచరించుదురు. అట్టి జీవులు భూమి యందును, జలము నందును, అగ్ని యందును అన్నిచోట్ల నుండును. ఈ భూత ఉద్భవముల కన్నింటికిని తల్లియైన భౌతిక ప్రకృతి మరియు శ్రీకృష్ణుని బీజప్రదానములే కారణములు. సారాంశమేమనగా, తమ పూర్వకర్మల ననుసరించి సృష్టికాలమున వివిధ రూపములను పొందు జీవులు భౌతిక ప్రకృతి గర్భమున ఉంచబడుదురు.

**14.5**
**సత్త్వం రజస్తమ ఇతి గుణా: ప్రకృతిసమ్భవా: ।**
**నిబధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥**

## అనువాదము

**ఓ మహా బాహుడవైన అర్జునా! భౌతికప్రకృతి సత్త్వరజస్తమోగుణములనెడి గుణములను కలిగియుండును. నిత్యుడైన జీవుడు భౌతిక ప్రకృతిలో (దేహముతో) సంపర్కమును పొందినప్పుడు ఈ గుణములచే బద్ధుడగును.**

## భాష్యము

జీవుడు ఆధ్యాత్మిక స్వభావమును కలిగియుండుట చేత వాస్తవమునకు అతనికి భౌతిక ప్రకృతితో ఎట్టి సంబంధమును లేదు. అయినను, అతడు భౌతిక జగత్తుచే బద్ధుడగుట చేత భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణముల మాయ ననుసరించి వర్తించుచుండును. జీవులు ప్రకృతి గుణముల ననుసరించి వివిధ దేహములను కలిగి యుండుటచేత ఆ గుణముల ననుసరించియే వారు వర్తింప వలసి వచ్చును. ఇట్టి వర్తనమే వివిధములైన సుఖదుఃఖములకు కారణమగుచున్నది.

### 14.6
**తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।
సుఖసఙ్గేన బధ్నాతి జ్ఞానసఙ్గేన చానఘ ॥**

## అనువాదము

**ఓ పాపరహితుడా! సత్త్వగుణము మిగిలిన రెండు గుణముల కంటెను పవిత్రమైన డగుటచే ప్రకాశమానమై మానవుని సర్వపాపఫలముల నుండి విముక్తిని చేయును. ఆ గుణము నందున్న వారు సౌఖ్యము చేతను, జ్ఞానము చేతను బద్ధులగుదురు.**

## భాష్యము

భౌతిక ప్రకృతిచే బద్ధులైన జీవులు అనేకరకములుగా నుందురు. వారిలో ఒకడు సౌఖ్యవంతుడు, మరొకడు మిక్కిలి క్రియాశీలుడు, మరొకడు నిస్సహాయునిగా నుండును. మనస్సునకు సంబంధించిన ఇట్టి భావములే ప్రకృతి యందు జీవుల బద్ధస్థితికి కారణములగు చున్నవి. జీవులు ఎట్లు వివిధరకాలుగా బద్ధులై యుందురో ఈ అధ్యాయమున వివరింపబడినది. మొదట ఇక్కడ సత్త్వగుణము పరిశీలింప బడుచున్నది. సత్త్వగుణమును అలవరచుకొనుట ద్వారా మానవుడు బద్ధులైన ఇతర గుణముల వారి కంటెను వివేకవంతుడగును. భౌతిక జగత్తు నందలి సత్త్వగుణాభివృద్ధికి ఫలితమిదియే. ఆ విధముగా సత్త్వగుణమును వృద్ధిచేసికొనిన మానవుడు భౌతిక దుఃఖములచే అంతగా పీడింపబడడు. అంతేకాకుండ, అట్టివాడు భౌతిక జ్ఞానపురోగతి భావనను కలిగియుండును. అట్టి సత్త్వగుణమునకు ప్రతినిధియే బ్రాహ్మణుడు. కనుక బ్రాహ్మణుడు సత్త్వగుణము నందు స్థితుడై యుండవలెను. సత్త్వగుణము నందలి సుఖభావనకు మానవుడు తాను దాదాపు సర్వపాపముల నుండి విముక్తిని పొందియున్నాననెడి అవగాహనయే కారణము. కాని వాస్తవమునకు వైదిక గ్రంథముల ననుసరించి సత్త్వగుణమనగా ఉన్నత జ్ఞానము మరియు అధికమైన సుఖభావనమని భావము.

జీవుడు సత్త్వగుణము నందు స్థితుడైనంతనే తాను జ్ఞానములో ప్రగతి చెందితిననియు మరియు ఇతరులకంటెను మెరుగనియు భావించుచు బద్ధుడగును. అదియే ఇక్కడ వచ్చిన సమస్య. శాస్త్రజ్ఞులు మరియు తాత్త్వికులు దీనికి ఉత్తమ నిదర్శనములు. వారిరువురును తమ జ్ఞానముచే గర్వము గలవారై తమ జీవిత పరిస్థితులను సాధారణముగా మెరుగు పరచుకొని యున్నందున భౌతిక సుఖమును అనుభవించు చున్నట్లుగా భావింతురు. బద్ధజీవితము నందు అధిక సుఖమును పొందుచున్నామనెడి భావము వారిని భౌతిక ప్రకృతి సత్త్వగుణముచే బంధించు చున్నది. సత్త్వగుణము నందు వర్తించుట యందు ఆకర్షింప బడినవారు ఆ విధముగా ఆ గుణమున వర్తించుట యందు ఆకర్షితులై యున్నంత కాలము, ప్రకృతి యందలి త్రిగుణములలో ఏదోఒక రకమైన దేహమును వారు ధరింప వలసివచ్చును. ఈ విధముగా ముక్తికి గాని లేక ఆధ్యాత్మిక జగత్తును గాని పొందుటకు వారికి ఎట్టి అవకాశమును లేదు. జీవుడు మరల మరల తత్త్వవేత్తగా, విజ్ఞానవేత్తగా, లేదా కవిగా యగుటకు అవకాశమును పొందవచ్చును. అట్లు నిరంతరము ఒకేరకమైన జననమరణములనెడి ప్రతికూల పరిస్థితుల యందు చిక్కుకోవలసి వచ్చును. కాని భౌతికశక్తి యొక్క మాయ కారణముగా అతడు అట్టి జీవితము సుఖకరమనియే భావించును.

**14.7**
**రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గసముద్భవమ్ ।**
**తన్నిబధ్నాతి కౌన్తేయ కర్మసఙ్గేన దేహినమ్ ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! రజోగుణము అపరిమితములైన కోరికలు మరియు ఆకాంక్షల వలన ఉద్భవించుచున్నది. దీని కారణమున జీవుడు కామ్యకర్మలచే బద్ధుడగును.**

## భాష్యము

స్త్రీపురుషుల నడుమ గల ఆకర్షణము రజోగుణలక్షణము. స్త్రీ పురుషుని పట్ల ఆకర్షణమును కలిగియుండుట మరియు పురుషుడు స్త్రీ పట్ల ఆకర్షణమును కలిగియుండుట రజోగుణమనబడును. ఇట్టి రజోగుణము అధిక మైనప్పుడు మానవుడు భౌతిక సుఖములకై ప్రాకులాడును. అతడు ఇంద్రియ తృప్తిని పొందగోరును. అట్టి ఇంద్రియ తృప్తిసుఖము కొరకు రజోగుణముతో కూడిన మానవుడు సమాజము నందు లేదా దేశమునందు లేదా గౌరవమును మరియు చక్కని గృహము, భార్య, సంతానముతో కూడిన సుఖసంసారమును వాంఛించును. ఇవియన్నియును రజోగుణము నుండి పుట్టునటువంటివి. ఇట్టివానికై ప్రాకులాడునంత కాలము మానవుడు ఎంతగానో శ్రమింపవలసి వచ్చును. కనుక రజోగుణము నందున్నవాడు తన కర్మఫలముల పట్ల సంపర్కమును కలిగి యుండుననియు, ఈ విధముగా ఆ కర్మలచే బంధింపబడుననియు ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. తన భార్యను, సంతానమును, సమాజమును సంతృప్తి పరచుటకును మరియు తన గౌరవమును నిలుపుకొనుటకును మానవుడు సదా కర్మయందు నిమగ్నుడు కావలసి యుండును. దీనినిబట్టి భౌతిక ప్రపంచ మంతయు ఇంచుమించుగా రజోగుణము నందే నిలిచియుండును. ఆధునిక నాగరికత రజోగుణము దృష్ట్యా ప్రగతి చెందినదిగా పరిగణింపబడుచున్నది. వాస్తవమునకు పూర్వము సత్త్వగుణాభివృద్ధియే ప్రగతిగా పరిగణింపబడెడిది. సత్త్వగుణము నందు స్థితులైన వారికే ముక్తిలేదనినచో రజోగుణమున బద్ధులైన వారిని గూర్చి ప్రత్యేకముగా చెప్పేదేమున్నది?

**14.8**
**తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।**
**ప్రమాదాలస్యనిద్రాభిస్తన్నిబధ్నాతి భారత ॥**

## అనువాదము

**ఓ భరతవంశీయుడా! అజ్ఞానము వలన పుట్టిన తమోగుణము బద్ధ జీవులందరికిని మొహకారణమని యెరుంగుము. బద్ధజీవుని బంధించు నటువంటి బుద్ధిహీనత, సోమరితనము, నిద్ర యనునవి ఈ తమోగుణపు ఫలములై యున్నవి.**

## భాష్యము

ఈ శ్లోకము నందలి 'తు' అను పదము ప్రత్యేక ప్రయోగము మిక్కిలి ప్రధానమైనది. తమోగుణము బద్ధజీవి యొక్క ఒక విచిత్ర లక్షణమని దీని అర్థము. తమోగుణము సత్త్వగుణమునకు పూర్తిగా విరుద్ధమైనది. సత్త్వగుణము నందు మానవుడు జ్ఞానాభివృద్ధిచే ఏది ఎట్టిదో ఎరుగగలుగును. కాని తమోగుణము దానికి పూర్తిగా వ్యతిరేకమైనది. తమోగుణ

మాయలో గల ప్రతియొక్కడు బుద్ధిహీనుడగుటచేత ఏది ఎట్టిదో ఎరుగకుండును. దానితో మానవుడు ప్రగతి నొందుటకు బదులుగా పతనము నొందును. అట్టి తమోగుణ నిర్వచనము వైదిక గ్రంథము లందు ఇట్లు వర్ణింపబడినది : "వస్తుయాతాత్మ్య జ్ఞానావరకం విపర్యయ జ్ఞానజనకం తమ:" అనగా తమోగుణ మాయచే మానవుడు దేనిని కూడా యథాతథముగా అవగాహన చేసుకొనజాలడు. ఉదాహరణకు ప్రతివ్యక్తి తన తాత మరణించెననియు, తాను కూడ మరణింతు ననియు, మానవుడు మరణించు స్వభావము కలవాడనియు ఎరిగియుండును. అట్లే, అతని సంతానము కూడ మరణించును. అనగా మరణము అనివార్యము. అయినను నిత్యమైన ఆత్మకొరకు శ్రద్ధవహింపక జనులు రేయింబవళ్ళు శ్రమపడుతు వెర్రిగా ధనమును కూడబెట్టు చుందురు. ఇదియే బుద్ధిహీనత (వెర్రి). ఇట్టి బుద్ధిహీనత కారణముగా వారు ఆధ్యాత్మిక ప్రగతి పట్ల విముఖులై యుందురు. అట్టివారు మిక్కిలి సోమరులై యుందురు. ఆధ్యాత్మికావగాహన కొరకై సత్సంగములకు ఆహ్వానింప బడినప్పుడు వారు ఆసక్తిని చూపరు. అట్టివారు రజోగుణము చేత నియంత్రింపబడు వారి వలె క్రియాశీలురుగా కూడ నుండరు. తమోగుణము నందున్న వారి మరియొక లక్షణమేమనగా అవసరమగు దానికంటెను అధికముగా నిద్రించుట. సాధారణముగా మానవునకు ఆరుగంటల నిద్ర చాలును. కాని తమోగుణము నందున్న వాడు రోజుకు కనీసము పది లేక పన్నెండు గంటలు నిద్రించును. అట్టివాడు ఎల్లప్పుడు చింతలతో నిండియుండి మత్తుపదార్థములకును, నిద్రకును అలవాటు పడియుండును. తమోగుణ బద్ధుడైన మానవుని లక్షణములు ఇవియే.

## 14.9

**సత్త్వం సుఖే సంజయతి రజ: కర్మణి భారత ।**
**జ్ఞానమావృత్య తు తమ: ప్రమాదే సంజయత్యుత ॥**

## అనువాదము

**ఓ భరతవంశస్థుడా! సత్త్వగుణము మానవుని సుఖము నందు బంధించును. రజోగుణము అతనిని కామ్యకర్మమునందు బంధించును. తమోగుణము జ్ఞానము నావరించి బుద్ధిహీనత యందు అతనిని బంధించును.**

## భాష్యము

తత్త్వజ్ఞుడు కాని, విజ్ఞానశాస్త్రజ్ఞుడు కాని, విద్యాధికుడు కాని తన ప్రత్యేక జ్ఞానరంగమునందు నెలకొని ఆ విధముగా సంతృప్తుడై యుండునట్లు, సత్త్వగుణము నందున్నవాడు తన కర్మచే లేదా జ్ఞానసముపార్జనా యత్నముచే సంతృప్తుడై యుండును. రజోగుణము నందున్నవాడు కామ్యకర్మల యందు నెలకొని శక్త్యానుసారముగా ధనమును సంపాదించి కూడబెట్టును. పిదప అట్టి ధనమును సత్కార్యములకై వినియోగించును. అతడు కొన్నిమార్లు వైద్యశాలలను నిర్మించుట, ధర్మసంస్థలకు దానమిచ్చుట వంటి కర్మలను చేయుచుండును. ఇవి రజోగుణము నందున్నవాని లక్షణములు. తమోగుణలక్షణము మానవుని జ్ఞానమును కప్పి వేయును. ఇట్టి తమోగుణము నందున్నవాడు చేయు కార్యము అతనికి గాని, ఇతరులెవరికిని గాని మేలును చేయజాలదు.

**14.10**
**రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత।**
**రాజ: సత్త్వం తమశ్చైవ తమ: సత్త్వం రజస్తథా॥**

## అనువాదము

**ఓ భరతవంశస్థుడా! కొన్నిమార్లు రజస్తమోగుణములను జయించి సత్త్వగుణము ప్రబలమగుచుండును. మరికొన్నిమార్లు రజోగుణము సత్త్వతమోగుణములను జయించుచుండును. మరికొన్నిమార్లు తమోగుణము సత్త్వరజోగుణములను జయించుచుండును. ఈ విధముగా గుణముల నడుమ ఆధిపత్యము కొరకు సదా పోటీ జరుగుచుండును.**

## భాష్యము

రజోగుణము ప్రబలమైనప్పుడు సత్త్వగుణము మరియు తమోగుణము వృద్ధిజయింపబడును. సత్త్వగుణము ప్రబలమైనప్పుడు రజస్తమోగుణములు జయింపబడును. తమోగుణము ప్రబలమైనప్పుడు రజసత్త్వగుణములు జయింపబడును. త్రిగుణముల నడుమ ఇట్టి పోటీ ఎల్లప్పుడు కొనసాగుచునే యుండును. కనుకనే వాస్తవముగా కృష్ణచైతన్యము నందు పురోగతిని సాధింపదలచువాడు ఈ త్రిగుణములను అధిగమింపవలెను. మానవుని యందు ప్రబలమైనట్టి ఏదో ఒక గుణము అతని వ్యవహారములు, కర్మలు, ఆహారము వంటి సమస్త కార్యముల ద్వారా వ్యక్తమగుచుండును. ఈ విషయము రాబోవు అధ్యాయములందు వివరింపబడును. కాని మానవుడు వాంఛించినచో సాధన ద్వారా సత్త్వగుణమును వృద్ధిచేసికొని రజస్తమోగుణములను జయింపవచ్చును. అట్లే అతడు రజోగుణమును వృద్ధిచేసికొని సత్త్వతమోగుణములను జయింపవచ్చును. ఈ విధముగా తమోగుణమును వృద్ధిచేసికొని అతడు సత్త్వరజోగుణములను జయింపవచ్చును. ఈ విధముగా ఈ మూడు ప్రకృతి గుణములు మూడు విధములైనను మానవుడు దృఢనిశ్చయమును కలిగియున్నచో సత్త్వగుణము నందు స్థితుడు కావచ్చును. పిదప ఆ సత్త్వగుణమును కూడ అతడు అధిగమించి 'వసుదేవ స్థితి' యను శుద్ధ సత్త్వమునకు చేరగలడు. అట్టి స్థితియందే మానవుడు భగవద్విజ్ఞానమును అవగాహన చేసికొనగలడు. అనగా మానవుని కర్మల ననుసరించి అతడు ఎట్టి గుణమునందు స్థితుడై యున్నాడో ఎరుగవచ్చును.

**14.11**
**సర్వద్వారేషు దేహే స్మిన్ ప్రకాశ ఉపజాయతే।**
**జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత॥**

## అనువాదము

**దేహము నందలి ద్వారము లన్నియును జ్ఞానముచే ప్రకాశింప జేయబడినప్పుడు సత్త్వగుణము యొక్క వృద్ధి అనుభవమునకు వచ్చును.**

## భాష్యము

దేహమునకు రెండు నయనములు, రెండు కర్ణములు, రెండు నాసికా రంధ్రములు, నోరు, జననావయవములు, పృష్ఠము అను నవద్వారములు గలవు. ఈ

నవద్వారములలో ప్రతిదియు సత్త్వగుణ లక్షణములచే ప్రకాశింపజేయ బడినప్పుడు మానవుడు సత్త్వగుణమును వృద్ధిచేసుకొనెనని అవగాహన చేసికొన వలెను. సత్త్వగుణమున మానవుడు అన్ని విషయ వస్తువులను వాస్తవదృష్టితో చూడగలుగుటయు, వాస్తవదృష్టితో వినగలుగుటయు, వాస్తవదృష్టితో రుచిచూచుటయు చేయగలుగును. అప్పుడతడు అంతర బాహ్యములందు శుద్ధుడగును. నవద్వారము లందును ఆనందము మరియు సౌఖ్యలక్షనముల వృద్ధి కనిపించును. అదియే సత్త్వగుణపు వాస్తవస్థితి.

## 14.12

**లోభ: ప్రవృత్తిరారమ్భ: కర్మణామశమ: స్పృహా ।**
**రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ ॥**

### అనువాదము

**ఓ భరతవంశ శ్రేష్ఠుడా! రజోగుణము వృద్ధినొందినప్పుడు లోభము, కామ్యకర్మ తత్పరత, కార్యములందు తీవ్రయత్నము, అణచ సాధ్యము గాని కోరిక, తపనయను లక్షణములు వృద్ధినొందును.**

### భాష్యము

రజోగుణము నందున్నవారు తానిదివరకు పొందియున్న స్థితిలో ఎన్నడును సంతృప్తుడై యుండడు. తన స్థితిని వృద్ధిచేసుకొనుటకై ఆకాంక్షించు చుండును. అతడు నివసించుటకు గృహమును నిర్మింపదలచినచో తాను ఆ గృహము నందే శాశ్వతముగా నివసింప బోవుచున్నట్లు ఒక రాజప్రాసాదము వంటి గొప్ప భవంతిని నిర్మించుటకు శాయశక్తుల త్నించును. అతడు ఇంద్రియ భోగానుభవమును అధికముగా వాంఛించును. ఇంద్రియ తృప్తికి అంతమనునది ఉండదు. అతడు ఎల్లప్పుడును తన కుటుంబముతో గృహమునందే నిలిచి ఇంద్రియ భోగానుభవమును కొనసాగింపదలచును. అట్టి కోరికకు విరామము అనునది ఉండదు. ఈ చిహ్నము లన్నింటిని రజోగుణ లక్షణములుగా ఎరుగవలెను.

## 14.13

**అప్రకాశో ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।**
**తమస్యేతాని జాయన్తే వివృద్ధో కురునన్దన ॥**

### అనువాదము

**ఓ కురునందనా! తమోగుణము వృద్ధినొందినప్పుడు అజ్ఞానాంధకారము, సోమరితనము, బుద్ధిహీనత, మోహము యనునని వ్యక్తములగును.**

### భాష్యము

ఆధ్యాత్మిక ప్రకాశము లేనప్పుడు జ్ఞానము లోపించును. తమోగుణము నందున్నవాడు నియమముల ననుసరింపకుండ తనకు తోచినట్లు ప్రయోజన శూన్యముగా కర్మనొనరించును. పనిచేయుటకు తగిన సామర్థ్యమును కలిగి యున్నను

అతడెట్టి యత్నములను గావింపడు. ఇదియే మోహమనబడును. చైతన్యమును కలిగియున్నట్టివాడు క్రియారహితుడై యుండును. ఇవియన్నియును తమోగుణము నందున్నవానికి లక్షణములు.

### 14.14

**యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।**
**తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే ॥**

## అనువాదము

**సత్త్వగుణము నందుండి మరణించినవాడు మహర్షుల యొక్క ఉన్నత పవిత్ర లోకములను పొందును.**

## భాష్యము

సత్త్వగుణము నందున్నవాడు బ్రహ్మలోకము లేదా జనలోకము వంటి ఉన్నత లోకములను పొంది స్వర్గసుఖముల ననుభవించును. ఈ శ్లోకము నందు 'అమలాన్' అను పదము ప్రధానమైనది. దానిని రజస్తమోగుణముల నుండి విడివడియున్న లోకములనియే దాని భావము. కలుషభరితమైన ఈ భౌతిక జగత్తునందు సత్త్వగుణమనునది అత్యంత పవిత్రమై యున్నది. వివిధ జీవుల కొరకు వివిధ లోకములు కలవు. సత్త్వగుణము నందు మరణించువారు మహర్షులు మరియు మహాభక్తులును నివసించు లోకములకు ఉద్ధరింపబడుదురు.

### 14.15

**రజసి ప్రలయం గత్వా కర్మసఙ్గిషు జాయతే ।**
**తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥**

## అనువాదము

**రజోగుణము నందుండి మరణించువాడు కామ్యకర్మరతుల యందు జన్మించును. తమోగుణము నందుండి మరణించువాడు జంతు రాజ్యమున జన్మించును.**

## భాష్యము

జీవుడు మానవజన్మ స్థితిని పొందిన పిమ్మట మరల నీచస్థితికి పతనము పొందరని కొందరు అభిప్రాయ పడుదురు. కాని అట్టి భావన సరియైనది కాదు. ఈ శ్లోకము ననుసరించి తమోగుణమును వృద్ధిపరచుకొనిన వారు మరణానంతరము జంతురూపమునకు పతితులగుదురు. తిరిగి ఆ స్థితి నుండి మానవజన్మను పొందుటకు వారు పరిణామ సిద్ధాంతము ద్వారా తమను తాము ఉద్ధరించుకోవలసి యుండును. కనుకనే మానవ జీవితము యెడ నిజమైన శ్రద్ధ గలవారు సత్త్వగుణమును అవలంబించి, సత్సాంగత్యమున గుణములను అధిగమించి కృష్ణచైతన్యము నందు నెలకొనవలెను. మానవజన్మ ఉద్దేశమిదియే. లేనిచో మానవుడు తిరిగి మానవజన్మనే పొందవచ్చునను హామీ ఏదియు లేదు.

## 14.16
**కర్మణ: సుకృతస్యాహు: సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।**
**రజసస్తు ఫలం దుఃఖమజ్ఞానం తమస: ఫలమ్ ॥**

## అనువాదము

**పుణ్యకర్మ ఫలితమైన నిర్మలత్వము సత్త్వగుణప్రధానమైనదిగా చెప్పబడును. కాని రజోగుణము నందు ఆచరింపబడిన కర్మము దుఃఖములను కలిగించును. తమోగుణమున చేయబడిన కర్మము అజ్ఞానమును కలిగించును.**

## భాష్యము

సత్త్వగుణమున చేయబడు పుణ్యకర్మల ఫలితము నిర్మలము లేక శుద్ధమై యుండును. కనుక మోహరహితులైన ఋషులు సదా ఆనందమయ స్థితి నందే నెలకొని యుందురు. కాని రజోగుణమునందు చేయబడు కార్యములు కేవలము దుఃఖపూరితములై యుండును. భౌతికానందము కొరకు చేయబడు ఎట్టి కర్మయైనను అపజయమును పొందక తప్పదు. ఉదాహరణకు ఎవరైనను ఆకాశమునంటు ఎత్తయిన భవంతిని నిర్మింపదలచినచో అట్టి భవన నిర్మాణమునకు అత్యంత అధికమైన భౌతిక మానవ పరిశ్రమ అవసరమగును. దానికొరకై ధనవ్యయము చేయు యజమానుడు కావలసినంత పెద్ద మొత్తమును సంపాదించు కొనవలెను. అంతేకాకుండ భవన నిర్మాణమునకై మానవులు శ్రమించి పని చేయవలసి వచ్చును. ఈ విధముగా ప్రతి అడుగున అట్టి కార్యమునందు దుఃఖములు అధికముగా నుండును. కనుక రజోగుణప్రభావము నందు చేబడిన ఏ కార్యమందైనను తప్పక గొప్ప దుఖముండునని భగవద్గీత చెప్పుచున్నది. "నాకు ఈ గృహము కలదు, ఇంత ధనము కలదు" అని కొద్దిగా మానసిక ఆనందమును పొందవచ్చును. కాని అది నిజమైన సుఖము కాదు.

తమోగుణమునకు సంబంధించినంత వరకు ఆ గుణమునందు కర్త జ్ఞానహీనుడై యుండుటచే అతని కర్మలన్నియును వర్తమానమున దుఃఖమును కలిగించుటయే కాకుండ పిదప అతడు జంతుజాలమున జన్మించునట్లు చేయును. జంతు జీవితమెప్పుడును దుఃఖముతో నిండియుండును. కాని 'మాయా' శక్తి ప్రభావము నందుండుటచే ఆ జంతువులు ఈ విషయము నెరుగజాలవు. అట్టి అమాయక జంతువులను వధించుటకు కూడ తమోగుణ ప్రభావమే కారణము. అజ్ఞానము చేత జంతువులను వధించువారు భవిష్యత్తులో తాము చంపు జంతువు తమను చంపుటకు తగిన దేహమును పొందగలదని ఎరుగజాలరు. కాని అది ప్రకృతి నియమము. మానవ సంఘమున హంతకుని ఉరితీయుట ప్రభుత్వ చట్టము. అట్టి ప్రభుత్వ శాశనము వలెనే శ్రీకృష్ణభగవానుని సంపూర్ణ చట్టము ఒకటున్నదని మానవులు అజ్ఞానవశమున గ్రహింపకుందురు. ప్రతిజీవియు దేవాదిదేవుని సంతానమే యైనందున భగవానుడు చిన్న చీమనైనను చంపుటను సహింపడు. అట్టి ప్రతికార్యమునకు మానవుడు ఫలితము ననుభవింపవలసి వచ్చును. జిహ్వారుచి కొరకై జంతువులను వధించుట గొప్ప అజ్ఞానపూరితమైనది. భగవానుడు ఎన్నో మంచి వస్తువులను ఆహార నిమిత్తమై సమకూర్చి యుండుటచే జంతువులను చంపనవసరము మానవునకు లేదు. ఎవరైనను ఏ విధముగానైన మాంసభక్షణను కొనసాగించినచో వారు అజ్ఞానముతో వర్తించు చున్నారనియు మరియు తమ భవిష్యత్తును అంధకార బంధురము కావించు కొనుచున్నారని ఎరుగవలెను. అన్నిరకములైన జంతువధలలో గోవధ అత్యంత ఘోరమైనది. ఎందుకనగా, గోవులు మనకు క్షీరము నొసగి ఆనందమును కలిగించు

చున్నవి. కనుక గోవధ నీచాతినీచమైన అధమ అజ్ఞానముతో కూడుకున్నట్టి కార్యము. ఋగ్వేదము(9.4.64) : 'గోభి: ప్రీణితమత్సరమ్' అని తెలుపుచున్నది – గోక్షీరముతో సంపూర్ణముగా సంతృప్తుడైన పిమ్మట ఆ గోవునే వధింపగోరువాడు అజ్ఞానాంధ కారములో నున్నవాడని అర్థము. 'విష్ణుపురాణము'(1.19.65) నందు ఈ క్రింది ప్రార్థన ఇట్లు తెలుపబడినది :

నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ ।
జగద్ధితాయ కృష్ణాయ గోవిన్దాయ నమో నమ: ॥

"ఓ ప్రభూ! ఓ గోవిందా! నీకు ప్రణామములు! నీవు గోవులకును, బ్రాహ్మణులకును, సమస్త మానవాళికిని, ప్రపంచమునకును శ్రేయోభిలాషివి." సారాంశమేమనగా, ఈ శ్లోకము నందు గోబ్రాహ్మణుల రక్షణమును గూర్చి ప్రత్యేకముగా పేర్కొనబడినది. బ్రాహ్మణులు ఆధ్యాత్మిక విద్యకు మరియు గోక్షీరములు అమూల్యమైన ఆహారమునకు చిహ్నములు. కనుక ఈ ఇరువురు జీవులకు అనగా గోబ్రాహ్మణులకు తప్పక రక్షణ కలిగింపవలెను. అదియే నాగరికత యొక్క నిజమైన పురోగతియై యున్నది. కాని నేటి వర్తమాన మానవ సమాజమునందు ఆధ్యాత్మిక జ్ఞానము నిరసింప బడుచున్నది. గోవధ ప్రోత్సహింప బడుచున్నది. కనుకనే మానవ సమాజము తప్పుమార్గమున పురోగమించుచు తమ వినాశనమునకు మార్గమును సుగమము చేసుకొనుచున్నదని అవగతము చేసుకొనవలెను. జనులను తమ తదుపరి జన్మలలో జంతువులగుటకు ప్రోత్సహించు నాగరికత ఎన్నడును నిజమైన మానవ నాగరికత కాజాలదు. నేటి మానవ నాగరికత పూర్తిగా రజస్తమో గుణములచే పెడదారి పెట్టబడుచున్నది. ఇది మిక్కిలి ప్రమాదకర మైనందున మానవాళిని ఈ గొప్ప ప్రమాదము నుండి రక్షించుటకు సమస్తదేశములు కృష్ణచైతన్యమును సులభ విధానమును వారికి అందించుటకై శ్రద్ధ వహింపవలెను.

## 14.17

**సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతో జ్ఞానమేవ చ ॥**

### అనువాదము

**సత్త్వగుణము నుండి యథార్థ జ్ఞానము వృద్ధినొందును. రజోగుణము నుండి లోభము వృద్ధినొందును. తమోగుణము నుండి అజ్ఞానము, బుద్ధిహీనత, మోహము యనునవి వృద్ధినొందుచున్నవి.**

### భాష్యము

నేటి ఆధునిక నాగరికత జీవుల నిజస్వభావమునకు అనుకూలము కానందున కృష్ణచైతన్యము ఆదేశింపబడుచున్నది. కృష్ణచైతన్యము ద్వారా సమాజము సత్త్వగుణమును పెంపొందించుకొనును. ఆ విధముగా సత్త్వగుణము అభివృద్ధి చెందినపుడు ప్రజలు వాస్తవదృష్టిని పెంపొందించుకొని విషయములను యథాతథముగా ఎరుగగలుగుదురు. తమోగుణము నందు జనులు పశుప్రాయులై దేనిని కూడా స్పష్టముగా అవగాహన చేసికొనజాలరు. ఉదాహరణకు ఒక జంతువును వధించుట ద్వారా తరువాతి జన్మలో ఆ జంతువు చేతనే తాము వధింపబడవలసి వచ్చునని తమోగుణము నందు జనులు ఎరుగజాలరు. వాస్తవ జ్ఞానమును బోధించు విద్యలేని

కారణమున వారట్లు బాధ్యతారహితులగు చున్నారు. ఈ బాధ్యతారాహిత్యమును నివారించుటకు సామాన్యజనులలో సత్త్వగుణాభివృద్ధి కొరకు విద్య తప్పనిసరగును. సత్త్వగుణము నందు నిజముగా విద్యావంతు లైనప్పుడు వారు స్థిరబుద్ధి గలవారై యథార్థజ్ఞానమును సంపాదించ గలుగుదురు. అపుడు వారు శాంతిసౌభాగ్యములతో విలసిల్లగలుగుదురు. ప్రపంచములోని జనులు అధిక భాగము అట్టి శాంతిసౌభాగ్యములను పొందలేకున్నను, జనులలో కొద్ది శాతమైనను కృష్ణచైతన్యమును వృద్ధిచేసికొని సత్త్వగుణము నందు నిలిచినచో ప్రపంచము నందంతటను శాంతిసౌభాగ్యములకు అవకాశమేర్పడును. అట్లుగాక ప్రపంచము రజస్తమోగుణములనే ఆశ్రయించినచో శాంతిసౌభాగ్యములకు ఏ మాత్రము ఆస్కారముండదు. రజోగుణమునందు జనులు లోభులగుదురు. వారి ఇంద్రియ భోగవాంఛకు పరిమితి ఉండదు. ఒకనికి ఇంద్రియ తృప్తికై తగినంత ధనము, సమస్త సంపదలున్నను అతడు సుఖశాంతులను కలిగియుండునట్లుగా మనము చూచుచుందుము. అతడు రజోగుణము నందు నిలిచియుండుట చేతనే అది ఎన్నటికిని సాధ్యము కాదు. ఎవరైనను ఆనందమును వాంఛించినచో వారికి ధనము ఏ విధముగను తోడ్పడదు. ఆనందమును వాంఛించినచో అతడు కృష్ణచైతన్యమును అభ్యసిస్తూ సత్త్వగుణమునకు ఉద్ధరించుకొనవలెను. ఒకడు రజోగుణము నందు నిలిచియున్నప్పుడు అతడు మానసిక అశాంతితో నిండి యుండుటయే కాకుండ, అతని వృత్తివ్యాపారములు కూడ మిక్కిలి క్లేశకరములుగా నుండును. తన స్థితిని లేదా పరపతిని కాపాడుకొనుటకై అవసరమైన ధనమును సంపాదించుటకు అతడు ఎన్నో ఉపాయములను పథకములను రూపొందించ వలసివచ్చును. వాస్తవమునకు అవన్నియును మిక్కిలి దుఃఖకరములు. తమోగుణమున ప్రజలు బుద్ధిహీనులగుదురు. పరిస్థితుల ప్రభావముచే వారు శోకితులై మత్తుపదార్థములకు అలవాటుపడి మరింతగా తమోగుణమున మునిగి పోవుదురు. వారి భవిష్యత్తు మిక్కిలి అంధకారమగును.

## 14.18

**ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛన్తి తామసాః ॥**

## అనువాదము

**సత్త్వగుణము నందున్నవారు క్రమముగా ఊర్ధ్వలోకములకు ఉద్ధరింపబడుదురు. రజోగుణము నందున్నవారు భూలోకమునందు నివసింతురు. హేయమైన తమోగుణము నందున్నవారు నరక లోకములకు పతనము చెందుదురు.**

## భాష్యము

త్రిగుణముల యందలి కర్మల వలన కలిగెడి ఫలితములు ఈ శ్లోకమున మిక్కిలి స్పష్టముగా వివరింపబడినవి. స్వర్గలోకములతో కూడిన ఊర్ధ్వగ్రహమండల మొకటి కలదు. ఆ లోకములందు ప్రతియొక్కరు మిక్కిలి ఉదాత్తులై యుందురు. సత్త్వగుణము నందలి పురోగతి ప్రమాణము ననుసరించి జీవుడు ఈ గ్రహమండల మందలి వివిధ లోకములకు ఉద్ధరింపబడవచ్చును. విశ్వము నందలి ప్రథమ పురుషుడైన బ్రహ్మదేవుడు నివసించు బ్రహ్మలోకము (సత్యలోకము) అత్యున్నతమైనట్టిది. బ్రహ్మలోకము నందలి అద్భుతమైన జీవనస్థితి పరిగణకు అతికష్టమైనదని ఇదివరకే

మనము తెలిసికొంటిమి. కాని అత్యంత ఉన్నత స్థితియైన సత్త్వగుణము ద్వారా అట్టి జీవితపరిస్థితి ప్రాప్తింపగలదు.

రజోగుణము సత్త్వ, తమోగుణముల నడుమ యుండుటచే మిశ్రితమైనది. మానవుడు సదా ఒకేగుణప్రభావము నందుండజాలడు. కాని అతడు రజోగుణము నందుండి పోయినచో అతడు ఈ భూలోకము నందే రాజుగనో, సంపన్నుడుగనో జన్మను పొందుచుండును. కాని వాస్తవమునకు రజోగుణము నందును అతడు సర్వదా నిలువలేనందున పతనము చెందుటయు సంభవించును. రజస్తమోగుణము లతో కూడిన ఈ భూలోకవాసులు కృత్రిమముగా యంత్ర సహాయమున ఊర్ధ్వ లోకముల నెన్నడును చేరజాలరు. అంతేకాకుండ, రజోగుణము నందున్నవాడు తదుపరి జన్మమున బుద్ధిహీనుడగుటకును అవకాశము కలదు.

అధమ గుణమైన తమోగుణము ఇక్కడ అత్యంత హేయమైనదిగా వర్ణింప బడినది. అట్టి తమోగుణమున చేసిన కర్మకు ఫలితము మిక్కిలి ప్రమాదకరముగా నుండును. కనుకనే భౌతిక ప్రకృతి యందు అది మిక్కిలి అధమమైన గుణము. మానవజాతులకు క్రిందిస్థాయి పక్షులు, మృగములు, సరీసృపములు, వృక్షములు మున్నగు ఎనుబదిలక్షల జీవజాతులున్నవి. జీవుని తమోగుణ ప్రాబల్యము ననుసరించి ఈ వివిధ హేయస్థితుల యందు అతడు ప్రవేశపెట్టబడు చుండును. ఈ శ్లోకము నందు 'తామసా:' యను పదము మిక్కిలి ప్రధానమైనది. ఉన్నత గుణమునకు వృద్ధిచెందకుండ నిరంతరము తమోగుణము నందే కొనసాగు వారిని ఆ పదము సూచించును. వారి భవిష్యత్తు మిక్కిలి అంధకారముగా నుండును.

రజస్తమోగుణము లందున్న మానవులు సత్త్వగుణమునకు ఉద్ధరింప బడుటకు ఒక అవకాశము కలదు. అదియే కృష్ణచైతన్యము. కాని ఈ అవకాశమును వినియోగించు కొనలేనివారు తప్పక అధమ గుణములందే కొనసాగుదురు.

### 14.19

**నాన్యం గుణేభ్య: కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సో ధిగచ్ఛతి ॥**

## అనువాదము

**సర్వకర్మల యందును ప్రకృతి త్రిగుణముల కంటెను అన్యుడైన కర్త మరొక్కడు లేదని సరిగా గ్రహించి, త్రిగుణాతీతమైన పరమపురుషుని ఎరుగ గలిగినపుడు మానవుడు నా దివ్యభావమును పొందును.**

## భాష్యము

మహాత్ముల నుండి ప్రకృతి త్రిగుణములకు సంబంధించిన కర్మలను సరిగా అవగాహనము చేసుకొనుట ద్వారా మానవుడు వాటిని సులభముగా అధిగమింపగలడు. శ్రీకృష్ణుడే నిజమైన అధ్యాత్మికాచార్యుడు. అతడే ఈ ఆధ్యాత్మిక జ్ఞానమును అర్జునునికి బోధించుచున్నాడు. అట్లే పూర్తిగ కృష్ణచైతన్యము నందు నిష్ణాతులైన వారి నుండియే ప్రకృతి గుణములకు సంబంధించిన కర్మల జ్ఞానమును మానవుడు నేర్చుకోవలసి యున్నది. అట్లుకానిచో అతని జీవితము పెడదారి పట్టును. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని బోధన ద్వారా జీవుడు తన ఆధ్యాత్మిక స్థితిని, భౌతిక దేహమును, తన

ఇంద్రియములను గూర్చియు, తాను ఏ విధముగా బంధింపబడిన విధమును గూర్చియు, భౌతిక ప్రకృతి త్రిగుణముల మాయలో తానున్న విధమును గూర్చియు ఎరుగగలుగును. ఈ గుణముల వశము నందునప్పుడు అతడు నిస్సహాయుడగును. కాని అతడు తన నిజస్థితిని గ్రహింప గలిగినపుడు ఆధ్యాత్మిక స్థితికి అవకాశమును కలిగించు గుణాతీత స్థితిని చేరగలడు. వాస్తవమునకు జీవుడెన్నడును వివిధ కర్మలకు కర్త కాడు. అతడు భౌతిక ప్రకృతికి చెందిన ఒక ప్రత్యేక గుణముచే నడుపబడు ప్రత్యేకమైన దేహము నందుండుటచే బలవంతముగా అట్లు వర్తింపజేయుబడుచున్నాడు. మానవుడు ఆధ్యాత్మిక జ్ఞానము నందు నిష్ణాతుడైన మహాత్ముని సహాయము లేనిదే తాను వాస్తవముగా ఎట్టి స్థితి యందున్నాడో తెలిసికొనజాలడు. ప్రామాణికుడైన అధ్యాత్మికాచార్యుని సాంగత్యమున అతడు తన నిజస్వరూపమును గుర్తించి, అట్టి అవగాహన ద్వారా పూర్తిగా కృష్ణచైతన్యము నందు నెలకొనగలడు. కృష్ణచైతన్యమున నెలకొనినవాడు ప్రకృతి గుణములచే నియత్రింపబడడు. శ్రీకృష్ణుని శరణుపొందినవాడు భౌతిక ప్రకృతి కర్మల నుండి విముక్తుడగునని సప్తమాధ్యాయము పదునాలుగవ శ్లోకమున ఇదివరకే చెప్పబడినది. అనగా యథార్థ దృష్టి కలిగినవానిపై భౌతిక ప్రకృతి ప్రభావము క్రమముగా క్షీణించును.

## 14.20

**గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదు:ఖైర్విముక్తో మృతమశ్నుతే ॥**

## అనువాదము

**దేహధారియగు జీవుడు భౌతిక దేహముతో కూడియున్న ఈ త్రిగుణములను అధిగమించినప్పుడు జననమరణవార్ధక్యముల నుండియు మరియు వాని దుఃఖముల నుండియు విడివడి ఈ జన్మము నందే అమృతత్వమును పొందును.**

## భాష్యము

మానవుడు ఈ ప్రస్తుత దేహమునందే సంపూర్ణ కృష్ణచైతన్యమున ఎట్లు ఆధ్యాత్మిక స్థితిలో నెలకొనగలడో ఈ శ్లోకమునందు వివరింపబడినది. 'దేహీ' అను సంస్కృత పదమునకు దేహము గలవాడని అర్థము. జీవుడు భౌతిక దేహధారియైనను ఆధ్యాత్మిక జ్ఞానప్రగతి ద్వారా ప్రకృతి త్రిగుణముల ప్రభావము నుండి అతడు విముక్తుడు కావచ్చును. ఈ దేహమును విడిచిన పిమ్మట తప్పక ఆధ్యాత్మిక జగత్తును చేరనున్నందున అతడు ఈ ప్రస్తుత దేహము నందే ఆధ్యాత్మిక జీవితానందమును అనుభవింపగలడు. అనగా కృష్ణచైతన్యముతో చేయబడు భక్తియుక్త సేవ యనునది భౌతిక బంధ విముక్తికి ఒక లక్షణమై యుండును. ఈ విషయము అష్టాదశాధ్యాయమున వివరింపబడును. అనగా మానవుడు భౌతిక ప్రకృతి త్రిగుణముల ప్రభావము నుండి విముక్తుడైనప్పుడు భక్తియుక్త సేవను ఆరంభించును(భ.గీ.18.54).

## 14.21
**అర్జున ఉవాచ**
**కైర్లిఙ్గైస్త్రీన్ గుణానేతానతీతో భవతి ప్రభో ।**
**కిమాచార: కథం చైతాంస్త్రీన్ గుణానతివర్తతే ॥**

## అనువాదము

**అర్జునుడు ప్రశ్నించెను : ప్రియమైన హే ప్రభూ! ఈ త్రిగుణములకు అతీతుడైన వాడు ఏ లక్షణముల ద్వారా తెలియబడును? అతని ప్రవర్తనమెట్టిది? ప్రకృతి త్రిగుణములను అతడు ఏ విధముగా అధిగమించును?**

## భాష్యము

ఈ శ్లోకము నందలి అర్జునుని ప్రశ్నలు మిక్కిలి సమంజసములుగా నున్నవి. భౌతిక త్రిగుణములకు అతీతుడైనట్టి మహాత్ముని లక్షణములను అతడు తెలియగోరుచున్నాడు. మొదట అతడు త్రిగుణాతీతుడైన మహాత్ముని లక్షణములను గూర్చి విచారణ కావించుచున్నాడు. అట్టివాడు భౌతిక ప్రకృతి త్రిగుణ ప్రభావమును ఇదివరకే అధిగమించినట్లు మానవుడు ఎట్లు తెలుసుకొనును? ఇక రెండవ ప్రశ్నలో అట్టి మహాత్ముడు ఎట్లు జీవించును? అతని కర్మలెట్టివి? ఆ కర్మలు నియమబద్ధములైనవా, కావా? ఏ సాధనములచే అట్టి ఆధ్యాత్మిక స్వభావమును పొందగలడో తెలుపుమని అర్జునుడు ప్రశ్నించుచున్నాడు. ఈ విషయము అత్యంత ముఖ్యమైనది. నిరంతరము భౌతికాతీత స్థితియందు నెలకొనుటకు తగిన ప్రత్యక్ష సాధనములను ఎరుగనిదే ఎవ్వరును అట్టి లక్షణములను కలిగియుండు అవకాశము లేదు. కనుకనే అర్జునుడు అడిగిన ఈ ప్రశ్నలన్నియును మిక్కిలి ప్రధానమైనవి. శ్రీకృష్ణభగవానుడు ఆ ప్రశ్నలన్నింటికిని సమాధానమిస్తున్నాడు.

**14.22 - 25**
**శ్రీభగవానువాచ**
**ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాణ్డవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥**

**ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।**
**గుణా వర్తన్త ఇత్యేవం యో వతిష్ఠతి నేఙ్గతే ॥**

**సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరస్తుల్యనిన్దాత్మసంస్తుతిః ॥**

**మానాపమానయోస్తుల్యస్తుల్యో మిత్రారిపక్షయోః ।**
**సర్వారమ్భపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥**

## అనువాదము

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ పాండుపుత్రా! ప్రకాశము, ఆసక్తి, మోహము కలిగినప్పుడు వానిని ద్వేషింపనివాడును మరియు అవి లేనప్పుడు వానిని ఆకాక్షింపనివాడును; ప్రకృతి గుణములే పనిచేయుచున్నవని యెరిగి వాని ద్వారా కలుగు ఈ ప్రకాశాదుల యందు నిశ్చయత్వమును మరియు స్థిరత్వమును కలిగి ఉదాసీనుడై, ఆధ్యాత్మిక స్థితి యందే నెలకొని యుండు వాడును; తన ఆత్మయందే ప్రతిష్ఠితుడై సుఖదుఃఖములను సమానముగా భావించెడి వాడును; మట్టిముద్ద, రాయి, బంగారములను సమదృష్టితో వీక్షించెడివాడును; ప్రియాప్రియములందు సమముగా వర్తించెడివాడును; నిందాస్తుతుల యందు, మానావమానముల యందు సమత్వమున నిలుచు ధీరుడును; శత్రుమిత్రులను సమముగా చూచువాడును; భౌతిక కర్మల నన్నింటిని విడిచినవాడును అగు మానవుడు ప్రకృతి త్రిగుణములను అధిగమించిన వాడుగ చెప్పబడును.**

## భాష్యము

అర్జునుడు మూడు ప్రశ్నలను ముందుంచగా శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ వానికి ఒకదాని తరువాత ఒకదానికి సమాధానములు చెప్పుచున్నాడు. గునాతీతస్థితి యందు నెలకొనిన మానవుడు ద్వేషమును కలిగి యుండడనియు మరియు దేనికొరకు ప్రాకులాడడనియు తొలుత శ్రీకృష్ణుడు ఈ శ్లోకము లందు సూచించు చున్నాడు. జీవుడు భౌతిక దేహమును దాల్చి ఈ భౌతిక ప్రపంచము నందు వసించినపుడు ప్రకృతికి సంబంధంచిన త్రిగుణములలో ఏదియో నొకదాని ఆధీనము నందున్నట్లు తెలిసికొనవలెను. దేహము నుండి విముక్తుడైనప్పుడే అతడు భౌతిక ప్రకృతి గుణముల బంధముల నుండి కూడ విముక్తుడగును. కాని భౌతికదేహము నుండి బయటపడనంత వరకు అతడు ఉదాసీనుడై వర్తింప వలెను. అప్రయత్నముగనే దేహాత్మబుద్ధిని విస్మరించునట్లుగా అతడు శ్రీకృష్ణభగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనవలెను. దేహాత్మబుద్ధి భావనలో మానవుడు కేవలము ఇంద్రియతృప్తి కొరకే వర్తించును. కాని ఆ చైతన్యము శ్రీకృష్ణుని వైపునకు మరల్చబడినప్పుడు ఇంద్రియతృప్తి కార్యములు అప్రయత్నముగనే నిలిచిపోవును. వాస్తవమునకు జీవునకు ఈ భౌతిక శరీరావసరము గాని భౌతిక దేహనిర్దేశములను అంగీకరింప నవసరము గాని లేదు. దేహము నందలి భౌతిక గుణములు వర్తించుచునే ఉండును. కాని జీవాత్మ ఆధ్యాత్మిక స్వరూపుడుగా

అట్టికర్మలకు అతీతుడుగా నుండును. కాని అతడెట్లు కర్మలకు అతీతుడుగా ఉండగలడు? వాస్తవమునకు అతడు దేహము ననుభవింపవలెనను కోరికను గాని దానినుండి బయటపడవలెనని వాంఛను గాని కలిగియుండడు. ఆ విధముగా ఆధ్యాత్మిక స్థితి యందు నిలుచుట ద్వారానే భక్తుడు సహజముగనే విముక్తుడగును. భౌతిక ప్రకృతి త్రిగుణములు ప్రభావము నుండి బయటపడుటకు అతడు ప్రత్యేకించి ప్రయత్నింప నవసరము లేదు.

అట్టి త్రిగుణాతీత స్థితియందు నెలకొనిన వాని కర్మలకు సంబంధించినదే తరువాతి ప్రశ్న. భౌతిక భావనస్థితి యందున్నవాడు దేహమునకు లభించెడి గౌరవాగౌరములచే కలతనొందినను త్రిగుణాతీతస్థితి యందుండువాడు అట్టి మిథ్యా గౌరవములచే కలత నొందడు. అతడు కృష్ణచైతన్యమున తన విధ్యుక్తధర్మమును నిర్వర్తించుచు,ఇతరులు తనను గౌరవింతురా లేక అగౌరవింతురా అను విషయమును పట్టించుకొనడు. కృష్ణచైతన్యమున తన విధ్యుక్త ధర్మనిర్వహణకు అనుకూలమైన వానినే అతడు అంగీకరించును. అట్లుకానిచో రాయి లేక బంగారము మరి యే ఇతర భౌతిక వస్తువులతోను అతనికి అవసరము లేదు. తన కృష్ణభక్తిని కొనసాగించుటకు తోడ్పడు ప్రతివ్యక్తిని అతడు ఆప్తమిత్రునిగా భావించును. అదేవిధముగా శత్రువులనబడు వానిని కూడ ద్వేషింపడు. అతడు భౌతిక జీవితముతో తనకెట్టి సంబంధము లేదని సంపూర్ణముగా ఎరిగియుండుటచే అతడు సమబుద్ధిగలవాడై, సర్వమును సమానస్థితిలో గాంచును. తాత్కాలిక సంచలనములు మరియు కలతల పరిస్థితిని ఎరిగియుండుటచే అతడు సాంఘీక, రాజకీయ సంఘటనలచే ప్రభావితుడు కాజాలడు. తన కొరకై అతడెట్టి ప్రయత్నములను చేయడు. కాని శ్రీకృష్ణుని కొరకై దేనినైనను చేయుటకు యత్నించును. ఇట్టి ప్రవర్తన చేతనే అతడు వాస్తవముగా గుణాతీతస్థితి యందు ప్రతిష్ఠితుడగును.

**14.26**

**మాం చ యో వ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥**

**<u>అనువాదము</u>**

**అన్ని పరిస్థితుల యందును నిశ్చలముగా నా సంపూర్ణమైన భక్తియుక్త సేవ యందు నిమగ్నుడై యుండువాడు శీఘ్రమే భౌతిక ప్రకృతి త్రిగుణములను అతిక్రమించి బ్రహ్మభావ స్థితిని పొందును.**

**<u>భాష్యము</u>**

గుణాతీత స్థితిని పొందుటకు సాధనమేమిటి? అని అర్జునుడు అడిగిన తృతీయ ప్రశ్నకు ఈ శ్లోకమే సమాధానము. ఇదివరకే వివరింపబడినట్లు, భౌతిక జగత్తు భౌతిక ప్రకృతి ప్రభావమునకు లోబడి వర్తించుచున్నది. కనుక మానవుడు ప్రకృతి త్రిగుణముల కార్యకలాపములచే కలత నొందరాదు. తన చైతన్యమును అట్టి కర్మలలో నెలకొల్పుటకు బదులు దానిని శ్రీకృష్ణునికి సంబంధించిన కార్యముల వైపునకు మరల్చవలెను. శ్రీకృష్ణునికి సంబంధించిన కర్మలే భక్తియోగముగా తెలియబడుచున్నవి. అనగా నిరంతరము శ్రీకృష్ణుని కొరకు కర్మచేయుట. ఇట్టి భక్తియోగము నందు శ్రీకృష్ణుని సేవ మాత్రమే కాకుండ, అతని స్వరూపాంశ విస్తరణములైనట్టి రామ, నారాయణాది రూపముల సేవ కూడ ఇమిడియున్నది. శ్రీకృష్ణుడు అసంఖ్యాకములైన

స్వాంశరూపములను కలిగి యున్నాడు. శ్రీకృష్ణునికి సంబంధించిన ఏ రూపములకైనను లేక అతని స్వరూపాంశ విస్తరణల సేవయందైనను నెలకొనినచో మానవుడు గుణాతీతస్థితి యందు స్థితుడైనట్లుగానే పరిగణింపబడును. శ్రీకృష్ణుని సమస్త స్వాంశరూపములు సచ్చిదానందమయములని మనమందరము గ్రహింపవలెను. దేవాదిదేవుని అట్టి సచ్చిదానందమయ రూపములన్నియు సర్వశక్తిమంతములు, సర్వజ్ఞాన సహితములు మరియు సకల దివ్యగుణములతో కూడియుండును. కనుక మానవుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సేవయందు లేదా ఆ భగవానుని స్వరూపాంశ విస్తరణ రూపముల సేవయందు అచంచలమైన ధృఢనిశ్చయముతో నెలకొనినచో దాటశక్యము గాని ప్రకృతి త్రిగుణములను కూడ అతడు సులభముగా దాటగలుగును. ఈ విషయము సప్తమాధ్యాయపు పదునాలుగవ శ్లోకమునందు ఇదివరకే వివరింపబడినది. శ్రీకృష్ణునకు శరణుపొందినవాడు శీఘ్రమే భౌతిక ప్రకృతి గుణ ప్రభావములను అధిగమింపగలడు. కృష్ణచైతన్యమున లేదా భక్తియుక్త సేవ యందు నెలకొనుట యనగా శ్రీకృష్ణునితో గుణైక్యమును పొందుట యని భావము. తన స్వభావము సచ్చిదానందమయమని శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు. బంగారు కణములు బంగారపు గని భాగము లైనట్లే జీవులందరును దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అంశలే. ఈ విధముగా జీవుడు తన ఆధ్యాత్మిక స్థితిలో శ్రీకృష్ణునితో గుణైక్యమును కలిగియున్నాడు. కాని వారిరువురి నడుమ వ్యక్తిత్వ భేదము మాత్రము శాశ్వతముగా కొనసాగుచునే యుండును. లేనిచో వారి నడుమ భక్తియోగమనెడి ప్రశ్నయే ఉదయింపదు. భక్తియోగము నందు భగవానునకు మరియు భక్తునకు నడుమ ప్రేమవినిమయ కార్యములనునవి శాశ్వతముగా కొనసాగుతుండును. కనుకనే భక్తియోగమందు భగవానుడు మరియు భక్తులయందు వారి భిన్నవ్యక్తిత్వములు నిత్యముగా కొనసాగును. లేనిచో భక్తియోగమను పదమునకు అర్థమే ఉండదు. భగవానునితో గుణైక్యమును పొందనిదే మానవుడు దేవాదిదేవుని సేవింపజాలడు. ఎవరైనను రాజునకు అంతరంగిక సేవకుడు కావలెననినచో దానికి తగిన యోగ్యతను సంపాదింప వలెననుట తెలిసిన విషయమే కదా! ఆ విధముగా బ్రహ్మభావ స్థితిని పొందుటయే లేక భౌతిక సంపర్కము నుండి విడివడుటయే శ్రీకృష్ణభగవానుని సేవించుటకు కావలసిన యోగ్యత. ఈ విషయమున : "బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి" అని 'బృహదారణ్యకోపనిషత్తు' (4.4.6) నందు వివరింపబడినది. బ్రహ్మమగుట చేతనే ఎవ్వరైనను పరబ్రహ్మమును పొందగలుగుదురని దీని భావము. ప్రతియొక్కరు పరబ్రహ్మముతో గుణైక్యమును పొందవలసి యున్నది. అట్టి పరబ్రహ్మ ప్రాప్తిచే ఎవ్వరును వ్యక్తిగత ఆత్మలుగా తమ శాశ్వత జీవస్వరూపమును కోల్పోవరు.

## 14.27

**బ్రాహ్మణో హి ప్రతిష్ఠా హమమృతస్యావ్యయస్య చ ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ ॥**

## అనువాదము

**అమరమును, అనశ్వరమును, శాశ్వతమును, పరమానందమునకు సహజ స్థితియును అగు నిరాకార బ్రహ్మమునకు నేను మూలాధారమునై యున్నాను.**

## భాష్యము

అమరత్వము, అనశ్వరత్వము, శాశ్వతత్వము, పరమానందము అనువానితో కూడియుండుటయే బ్రహ్మము యొక్క సహజస్థితి. అట్టి బ్రహ్మానుభూతి యనునది ఆధ్యాత్మికానుభూతికి ఆరంభ దశ. పరమాత్మానుభూతి యనునది ఆధ్యాత్మికానుభూతి యందలి మధ్యమ లేక ద్వితీయ దశగా తెలియబడుచున్నది. ఇక దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు పరతత్త్వపు చరమానుభూతియై యున్నాడు. కనుక పరమాత్మ మరియు నిరాకారబ్రహ్మము పరమపురుషుని యందే గలవు. భౌతిక ప్రకృతి పరమపురుషుని న్యూనశక్తి వ్యక్తీకరణమని సప్తమాధ్యాయమున వివరింప బడినది. న్యూనమైన భౌతిక ప్రకృతి యందు ఉన్నత ప్రకృతికి చెందిన అంశలైన జీవులను భగవానుడు బీజరూపమున ఉంచును. అదియే భౌతిక ప్రకృతి యందు జరిగెడి ఆధ్యాత్మిక స్పర్శ. ఈ భౌతిక ప్రకృతిచే బద్ధుడైన జీవుడు ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనమును ఆరంభించినపుడు భౌతిక జీవనస్థితి నుండి తననుతాను ఉద్ధరించుకొని క్రమముగా పరతత్త్వపు బ్రహ్మభావన స్థితికి అరుదెంచును. జీవితము నందు ఇట్టి బ్రహ్మానుభూతిని పొందుటయే ఆత్మానుభూతి తొలిదశ. అట్టి స్థితిలో మానవుడు భౌతిక స్థితికి అతీతుడై యుండునే గాని వాస్తవముగా బ్రహ్మానుభూతిలో పరిపూర్ణత్వమును పొందజాలడు. అతడు కోరుకొనినచో బ్రహ్మానుభూతి నందు కొనసాగుచు క్రమముగా పరమాత్మానుభూతిని, ఆ పై దేవాదిదేవుని చరమాను భూతియైన శ్రీకృష్ణభగవానుని పొందవచ్చును. దీనికి వైదిక గ్రంథములందు అనేక ఉదాహరణలు గలవు. సనకసనందనాది నలుగురు కుమారులు తొలుత పరతత్త్వపు నిరాకార బ్రహ్మభావము నందే స్థితిని కలిగియుండి క్రమముగా భక్తియుక్త సేవాస్థితికి వృద్ధిచెందిరి. ఆ విధముగా నిరాకార బ్రహ్మభావమునకు అతీతముగా తననుతాను ఉద్ధరించు కొననివాడు పతనము చెందు అవకాశము కలదు. కనుకనే నిరాకార బ్రహ్మస్థితికి చేరినను మానవుడు పరమపురుషుని గూర్చి తెలుసుకొననిచో అతని జ్ఞానము పరిపూర్ణము కాజాలదని శ్రీమద్భాగవతము (10.2.32) నందు చెప్పబడినది. కనుకనే బ్రహ్మభావమునకు ఉద్ధరింపబడినను మానవుడు శ్రీకృష్ణభగవానుని భక్తియుక్తసేవ యందు నిమగ్నము కానిచో పతనము చెందుటకు అవకాశము కలదు. ఈ విషయము 'తైత్తిరీయోపనిషత్తు'(2.7.1) నందు "రసో వై స: రసం హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి" – "దేవాదిదేవుడు, ఆనంద నిధానమును అయినట్టి శ్రీకృష్ణుని అవగతము చేసికొనినప్పుడు మానవుడు వాస్తవముగా దివ్యానందమును పొందును" అని చెప్పబడినది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడు. భక్తుడు అతనిని సమీపించినపుడు ఆ షడ్గుణైశ్వర్యముల వినిమయము జరుగగలదు. రాజసేవకుడు దాదాపు రాజుతో సమానమైన భోగముల ననుభవించును. అట్లే శాశ్వతము, అనశ్వరమునైన ఆనందమును, నిత్యమైన జీవితము భక్తియుక్తసేవతో కూడియుండును. కనుకనే బ్రహ్మానుభూతి లేక శాశ్వతత్త్వము లేక అనశ్వరమైన ఆనందము భక్తియుక్త సేవ యందు ఇమిడియున్నది. భక్తియుక్త సేవయందు నెలకొని యుండువాడు దానిని ఇదివరకే పొందియుండును.

జీవుడు స్వభావముచే బ్రహ్మమేయైనను భౌతికజగత్తుపై ఆధిపత్యము వహింపవలెనను కోరికను కలిగియుండుట చేత పతితుడగుచుండును. తన సహజస్థితిలో జీవుడు భౌతిక ప్రకృతి త్రిగుణములకు అతీతుడై యుండును. కాని భౌతిక ప్రకృతి సంపర్కము అతనిని సత్త్వరజస్తమో గుణముల యందు బంధించును. ఈ త్రిగుణముల సంపర్కము చేతనే అతనికి భౌతిక జగత్తుపై అధికారము వహింపవలెననెడి కోరిక ఉదయించును. కాని సంపూర్ణ కృష్ణచైతన్యమున భక్తియుక్తసేవ యందు నెలకొనుటచే అతడు వెంటనే గుణాతీత స్థితి యందు నెలకొనగలుగును. ఆ విధముగా భౌతిక ప్రకృతిపై ఆధిపత్యము వహింప వలెనను అతని అధర్మమైన కోరిక తొలగింపబడుట సంభవించును. కనుకనే శ్రవణము, కీర్తనము, స్మరణాది నవవిధ భక్తిపద్ధతులతో కూడిన భక్తియుక్త సేవా విధానమును భక్తుల సాంగత్యములో అభ్యసింపవలెను. అట్టి సాంగత్యము వలన మరియు ఆధ్యాత్మికాచార్యుని ప్రభావము వలన అధికారము వహింప

వలననెడి మానవుని భౌతిక వాంఛ నశించి అతడు శ్రీకృష్ణభగవానుని దివ్యమగు ప్రేమయుక్త సేవయందు ప్రతిష్ఠితుడగును. ఈ విధానమే ఈ అధ్యాయము నందలి ఇరువది రెండవ శ్లోకము మొదలుకొని ఈ చివరి శ్లోకము వరకు వివరింపబడినది. వాస్తవమునకు శ్రీకృష్ణభగవానునికి చేయు భక్తియుక్త సేవ మిక్కిలి సులభమైనది. భక్తుడు భగవత్సేవ యందు సదా నిమగ్నుడై యుండవలెను. శ్రీకృష్ణునకు అర్పించిన ఆహారపదార్థములను ప్రసాదరూపమున గ్రహింపవలెను. భగవానుని పాదపద్మములకు సమర్పింపబడిన పుష్పముల సువాసనను ఆఘ్రాణింపవలెను. భగవానుడు తన దివ్యలీలల నొనరించిన ప్రదేశములను దర్శింపవలెను. భగవానుని వివిధ లీలలను మరియు భక్తులతో అతని ప్రేమ వినిమయ విషయములను పఠించవలెను. “హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే” అను మహామంత్రమును నిరంతరము జపింపవలెను. భగవానుడు అవతరించిన రోజున మరియు అతని భక్తుల ఆవిర్భావ తిరోభావ తిథులయందు ఉపవసించుట యనునవియే ఆ భక్తియందలి కార్యక్రమములు. అట్టి విధానమును అనుసరించుట ద్వారా మానవుడు సర్వవిధములైన భౌతిక కామ్యకర్మల నుండి పూర్తిగా విముక్తుడగును. ఆ విధముగా ‘బ్రహ్మజ్యోతి’ యందు లేదా వివిధ బ్రహ్మానుభూతి భావనల యందు ప్రతిష్ఠితుడైనట్టివాడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణునితో గుణైక్యమును పొందగలడు.

**శ్రీమద్భగవద్గీత యందలి ‘ప్రకృతి త్రిగుణములు’ అను**
**చతుర్దాశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

------

# పంచదశాధ్యాయము
# పురుషోత్తమ యోగము

**15.1**
**శ్రీభగవానువాచ**
**ఊర్ధ్వమూలమధఃశాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**
**ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥**

**అనువాదము**

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను : వ్రేళ్ళు ఊర్ధ్వముగను, శాఖలు క్రిందుగను, వేదఋక్కులే పత్రములుగను కలిగిన శాశ్వతమైన అశ్వత్థవృక్షమొకటి కలదని చెప్పబడినది. ఈ వృక్షము నెరిగినవాడే వేదముల నెరిగినవాడగును.**

**భాష్యము**

భక్తియోగపు ప్రాముఖ్యమును గూర్చి చర్చించిన పిమ్మట "వేదముల ప్రయోజనమేమిటి?" యని ఎవరైన ప్రశ్నింపవచ్చును. వేదాధ్యయన ప్రయోజనము శ్రీకృష్ణుని ఎరుగుటయేనని ఈ అధ్యాయమున వివరింపబడినది. కృష్ణచైతన్య వంతుడై భక్తియుక్త సేవయందు నెలకొనినవాడు వేదములను ఎరిగియే యుండును.

భౌతిక జగత్తు బంధము ఇక్కడ అశ్వత్థవృక్షముతో పోల్చబడినది. కామ్యకర్మల యందు ఆసక్తుడైనవాడు ఈ అశ్వత్థవృక్షపు తుదిని తెలియక అతడు ఒకకొమ్మ నుండి మరొక కొమ్మకును అక్కడి నుండి మరొక కొమ్మకును సదా మారుచుండును. భౌతిక ప్రపంచమును ఈ అశ్వత్థ వృక్షమునకు అంతమనునది లేదు. అట్టి ఈ వృక్షమునందు ఆసక్తుడైనవానికి ముక్తి లభించు అవకాశము లేదు. మానవుని ఉద్ధరించుటకై ఉద్దేశింపబడిన వేదమంత్రములు ఈ వృక్షమునకు పత్రములుగ పేర్కొనబడినవి. దీనివ్రేళ్ళు విశ్వము నందలి అత్యున్నత లోకమైన బ్రహ్మలోకము నుండి ఆరంభమగుటచే అవి పై భాగమునకు పెరుగును. ఈ అవ్యయమైన మాయావృక్షమును అవగతము చేసుకొనగలిగినచో మానవుడు దానినుండి బయటపడగలడు.

భౌతికజగత్తు బంధముల నుండి విముక్తి నొందుటకు గల ఈ పద్ధతిని సంపూర్ణముగా అవగాహనము చేసికొనవలెను. భౌతిక బంధముల నుండి విముక్తికి అనేక విధానములు గలవని గడిచిన అధ్యాయములందు వివరింప బడినది. దేవాదిదేవుని భక్తియుక్త సేవయే అందుకు అత్యుత్తమ పద్ధతియని త్రయోదశాధ్యాయము వరకును మనము గాంచియున్నాము. ఇప్పుడు భౌతిక కర్మల యందు అనాసక్తి మరియు భగవానుని భక్తియుక్త సేవ యందు ఆసక్తి యనునవి భక్తియుక్త సేవకు మూల సిద్ధాంతములని తెలియవచ్చినది. ఈ అధ్యాయపు ఆరంభమున భౌతిక జగత్తు పట్ల గల ఆసక్తిని ఛేదించుకొను విధానము చర్చింపబడినది. ఈ భౌతిక ప్రపంచమనెడి వృక్షపు

వ్రేళ్ళు ఊర్ధ్వభాగమునకు పెరుగునని వర్ణింపబడినది. మహాతత్త్వము నుండి విశ్వము నందలి అత్యున్నత లోకము ప్రారంభమగునని భావము. అక్కడ నుండియే విశ్వమును ఈ సంసార వృక్షము వివిధములైన గ్రహమండలము లందు వివిధ శాఖలతో విస్తరించి యున్నది. దానిఫలములు ధర్మము, కామము, మోక్షములని జీవుల కర్మ ఫలితములను సూచించును.

ఈ జగత్తు నందు కొమ్మలు క్రిందిభాగమునకు, వ్రేళ్ళు పైభాగమునకు గల వృక్షము మనకెక్కడను ప్రత్యేకముగ కనిపించక పోయినను, అట్టి వృక్షమును జలాశయముల ప్రక్కన చూడవచ్చును. నీటిఒడ్డున గల వృక్షముల శాఖలు క్రింది భాగమునకు వ్రేళ్ళు పైభాగమునకు ఉన్నట్లుగను జలము నందు ప్రతిబింబించును. మరోమాటలో చెప్పవలెననిన, ఈ భౌతిక జగత్తు అనెడి అశ్వత్థవృక్షము ఆధ్యాత్మిక జగత్తు అనెడి నిజమైన వృక్షమునకు ప్రతిబింబము. వృక్షము యొక్క ప్రతిబింబము జలము నందు కనిపించునట్లు, ఆధ్యాత్మిక జగత్తునకు ప్రతిబింబమైన భౌతిక జగత్తు కోరిక యందు స్థితమై యుండును. అనగా కోరికయే భౌతిక లోకజీవితమునకు కారణమై యున్నది. ఈ భౌతిక జీవితము నుండి విముక్తిని వాంఛించువాడు ఈ సంసార వృక్షమును సవివరమైన అధ్యయనముచే సంపూర్ణముగా ఎరుగవలెను. అప్పుడు అతడు దానితో తనకు గల సంబంధమును ఛేదించుకోగలడు.

ఈ సంసార వృక్షము నిజమైన ఆధ్యాత్మిక వృక్షమునకు ప్రతిబింబ మైనందున దానికి ప్రతిరూపమై యున్నది. వాస్తవమునకు ఆధ్యాత్మిక జగత్తునందు సర్వము కలదు. నిరాకారవాదులు బ్రహ్మమే ఈ భౌతిక వృక్షమునకు మూలమని భావింతురు. సాంఖ్యదర్శనము ననుసరించి ఈ మూలము నుండి ప్రకృతి, పురుషుడు, పిదప త్రిగుణములు, పిమ్మట పంచ మహాభూతములు, తదనంతరము దశేంద్రియములు, మనస్సు మున్నగునవి కలుగుచున్నవి. ఈ విధముగ వారు సమస్త భౌతిక జగత్తును ఇరువదినాలుగు తత్త్వములుగా విభజింతురు. బ్రహ్మమే సర్వసృష్టులకును మూలాధారమైనచో ఈ భౌతిక జగత్తు బ్రహ్మమను కేంద్రము యొక్క 180 డిగ్రీల కోణాంశము కాగలదు. పిదప కేంద్రము యొక్క మిగిలిన 180 డిగ్రీల కోణాంశము ఆధ్యాత్మిక జగత్తును సూచించును. కనుక భౌతిక జగత్తు ఆధ్యాత్మిక జగత్తునకు వికృత ప్రతిబింబమై యున్నది. కనుకనే ఆధ్యాత్మిక జగత్తు అట్టి వైవిధ్యమును తప్పక కలిగి యుండుననియు, కాని అది యథార్థమైన వైవిధ్యమనియు గ్రహింపవలెను. ప్రకృతి పరమపురుషుని బాహ్యశక్తి యనియు, పరుషుడు స్వయముగా పరమ పురుషుడేననియు భగవద్గీత యందు వివరింప బడినది. ఈ విశ్వప్రకటనము భౌతికమగుటచే తాత్కాలిక మైనట్టిది. కొన్నిమార్లు కనిపించి, కొన్నిమార్లు కనిపించనట్టి ప్రతిబింబము తాత్కాలికమైనట్టిదే కదా! కాని ఈ ప్రతిబింబమునకు కారణమైన మూలము మాత్రము శాశ్వతమైనది. కనుకనే ఆధ్యాత్మిక వృక్షపు భౌతిక ప్రతిబింబమును ఛేదింపవలెను. ఒకవ్యక్తి వేదముల నెరిగినవాడని తెలుపబడినప్పుడు అతడు ఈ భౌతిక జగత్తు యెడ ఆసక్తిని ఛేదించుకొనుట ఎట్లో తెలిసికొనెనని భావింపవలెను. అతడు ఆ విధానమును ఎరుగ గలిగినప్పుడే వేదములను కూడ నిజముగా ఎరుగగలుగును. వేదముల యందలి కర్మకాండకు సంబంధించిన నియమములచే ఆకర్షితుడైనవాడు సంసారమను ఆ వృక్షపు సుందరమైన పచ్చని ఆకులచే ఆకర్షింపబడిన వాడగును. కనుక అతడు వేదముల యొక్క యథార్థ ప్రయోజనమును ఎరుగజాలడు. దేవాదిదేవుడే స్వయముగా తెలిపినట్లు ప్రతిబింబమైన ఈ సంసార వృక్షమును ఛేదించి, ఆధ్యాత్మిక జగత్తు యనెడి యథార్థ వృక్షమును పొందుటయే వేదముల ప్రయోజనము.

## 15.2

**అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలా: ।
అధశ్చ మూలాన్యనుసంతతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥**

### అనువాదము

**ఈ వృక్షశాఖలు భౌతికప్రకృతి త్రిగుణములచే పోషింపబడి ఊర్ధ్వ, అధోముఖములుగా వ్యాపించియున్నవి. దీని చిగురాకులే ఇంద్రియార్థములు. అధోముఖముగను ఉన్న వృక్షపు వ్రేళ్ళు మానవలోకపు కామ్యకర్మలకు సంబంధించినవై యున్నవి.**

### భాష్యము

అశ్వత్థవృక్ష వర్ణనము ఇక్కడ మరింతగా వివరింపబడినది. అన్ని వైపులకును వ్యాపించియున్నట్టి దానిశాఖల అధోభాగములందు జంతువులు, మానవులు, అశ్వములు, గోవులు, శునకములు, మార్జాలములు వంటి వివిధ జీవుల రూపములుండును. జీవులన్నియు ఈ విధముగా శాఖల క్రింది భాగమున నిలిచియుండగా, వృక్షపు ఊర్ధ్వభాగములందు దేవతలు, గంధర్వులు వంటి ఉన్నత జీవజాతులకు చెందిన ఉన్నతరూపము లుండును. వృక్షము జలముచే పోషింప బడునట్లు, ఈ సంసార వృక్షము భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములచే పోషింపబడును. కొన్నిమార్లు తగినంత నీరు లేనందున కొంత భూభాగము బీడుపడుటయు, మరికొన్నిమార్లు కొంత భూభాగము పచ్చగా ప్రకాశించు చుండుటను మనము చూచుచుందుము. అట్లే ప్రకృతి త్రిగుణము లందు ఏ ప్రత్యేక గుణపరిమాణము ప్రభావముగా నుండునో దాని ననుసరించి వివిధ జీవజాతులు కూడ వ్యక్తములగుచుండును.

సంసారవృక్షపు చిగురాకులే ఇంద్రియార్థములుగా పరిగణింపబడినవి. భౌతిక ప్రకృతి యందలి వివిధ గుణముల అభివృద్ధి వలన మనము వివిధములైన ఇంద్రియములను పెంపొందించుకొందుము. అట్టి ఇంద్రియముల ద్వారా మనము వివిధములైన ఇంద్రియార్థముల ననుభవింతుము. ఈ విధముగా వివిధములైన ఇంద్రియార్థము లందు ఆసక్తి కలిగియుండెడి కర్ణములు, నాసిక, నేత్రములు వంటి ఇంద్రియములే సంసార వృక్షశాఖాగ్రములు. శబ్ద, రూప, స్పర్శ వంటి ఇంద్రియార్థములే చిగురాకులు. వివిధరకాల దుఃఖముల వలనను ఇంద్రియ భోగముల ఫలములైన ఆసక్తి మరియు అనాసక్తులు ఈ వృక్షపు ఉపమూలములు. సర్వదిక్కులకు వ్యాపించియున్నట్టి ఈ ఉపమూలముల నుండియే పాపపుణ్యములకు సంబంధించిన ప్రవృత్తులు ఉద్భవించునని భావింపబడుచున్నది. ఈ వృక్షపు యథార్థమైన మూలము బ్రహ్మలోకము నందుండును. మిగిలిన ఉపమూలములు మర్త్యలోకము లందుండును. ఊర్ధ్వలోకములందు పుణ్యకర్మల ఫలితముల ననుభవించిన పిమ్మట జీవుడు ఈ మర్త్యలోకమునకు తిరిగివచ్చి, తిరిగి ఊర్ధ్వలోకములకు ఉద్ధరింపబడుటకు తన కామ్యకర్మలను కొనసాగించును. కనుకనే మానవులు నివసించు ఈ మర్త్యలోకము కర్మక్షేత్రముగా భావింపబడుచున్నది.

**15.3 - 4**

**న రూపమస్యేహ తథోపలభ్యతే నాన్తో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూలమసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా ॥**

**తత: పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తన్తి భూయ: ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యత: ప్రవృత్తి: ప్రసృతా పురాణీ ॥**

**అనువాదము**

**ఈ వృక్షపు యథార్థ రూపమును ఈ జగత్తు నందు చూడబడదు. దాని ఆదినిగాని, అంతమునుగాని లేదా మూలమునుగాని ఎవ్వరును అవగతము చేసికొనజాలరు. కాని మానవుడు ధృఢనిశ్చయముతో అనాసక్తి అను ఆయుధముతో దృఢమైన వ్రేళ్ళు గల ఈ సంసార వృక్షమును ఛేదింపవలెను. ఆ పిదప పునరావృత్తి రహితమైన దివ్యపదమును అన్వేషించి, అనాదికాలము నుండి ఎవని వలన సర్వము ఆరంభమయ్యెనో మరియు ఎవని నుండి సర్వము వ్యాప్తినొందెనో అట్టి దేవాదిదేవుని అచ్చట శరణుపొందవలెను.**

**భాష్యము**

ఈ అశ్వత్థవృక్షపు యథార్థరూపము ఈ భౌతిక జగత్తు నందు తెలియబడదని ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. వ్రేళ్ళు ఊర్ధ్వముగా నుండుటచే ఈ నిజమైన వృక్షపు వ్యాప్తిక్రిందుగా నుండును. అట్టి వృక్షము యొక్క భౌతిక విస్తారము నందు బద్ధుడైనపుడు మానవుడు అది ఎంతవరకు వ్యాపించి యున్నదనెడి విషయమును గాని దాని మొదలును గాని గాంచలేడు. అయినప్పటికిని, మానవుడు ఈ వృక్షకారణమును కనుగొనియే తీరవలెను. “నేను నా ఫలానా తండ్రి పుత్రుడను. నా తండ్రి ఫలానా వారి పుత్రుడు. నాతండ్రి యొక్క తండ్రి ఫలానా వారి పుత్రుడు.” ఈ విధముగా పరిశోధించుచు పోయినచో చివరకు అతడు గర్భోదకశాయి విష్ణువు నుండి ఆవిర్భవించిన బ్రహ్మదేవుని చేరును. బ్రహ్మదేవుడు సర్వులకు మూలమని తెలియును. చివరకు బ్రహ్మదేవునికి ఆదియైన శ్రీకృష్ణుని చేరిన పిమ్మట పరిశోధన కార్యము సమాప్తమగును. దేవాదిదేవుని గూర్చిన సంపూర్ణ జ్ఞానము గల వ్యక్తుల సాంగత్యమున ప్రతియొక్కరు దేవాదిదేవుని రూపమైన ఈ సంసారవృక్షపు మూలాధారములను అన్వేషింపవలెను. అప్పుడు అట్టి అవగాహనచే మానవుడు క్రమముగా యథార్థతత్త్వపు విపరీత ప్రతిబింబము పట్ల అనాసక్తుడై, జ్ఞానముచే బంధమును ఛేదించి యథార్థవృక్షము నందు ప్రతిష్ఠితుడగును.

ఈ సందర్భమున ‘అసంగ’ అను పదము మిక్కిలి ప్రధానమైనది. ఎందుకనగా, ఇంద్రియ భోగములందు ఆసక్తి మరియు భౌతిక ప్రకృతిపై అధికారము వహింపవలెనను భావన మిక్కిలి బలమైనది. కనుక ప్రామాణిక గ్రంథముల ననుసరించి ఆధ్యాత్మిక జ్ఞానమును గూర్చి చర్చించుట ద్వారా మానవుడు అనాసక్తిని అభ్యసింపవలెను. వాస్తవముగా జ్ఞానవంతులైన వ్యక్తుల నుండి శ్రవణము చేయవలెను. భక్తుల సాంగత్యమున చేయబడు అట్టి ఆధ్యాత్మిక చర్చలకు ఫలితముగ అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గూర్చి ఎరుగగలుగును. అప్పుడు అతని ప్రథమ కర్తవ్యము భగవానుని శరణుపొందుటయే. దేనిని చేరిన పిమ్మట మానవుడు ఈ విపరీత ప్రతిబింబమైన సంసార వృక్షమునకు తిరిగిరాడో ఆ ప్రదేశము యొక్క వర్ణన కూడ ఈ శ్లోకమునందు తెలుపబడినది. ఎవని నుండి సమస్తము ఉద్భవించినదో అట్టి ఆది మూలము దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడే. అట్టి భగవానుని కృపను పొందుటకు శరణాగతియే

మార్గము. శ్రవణ కీర్తినాదిపద్ధతులతో చేయబడు భక్తియుక్త సేవకు ఫలితమిదియే. ఈ భౌతిక జగత్తు వ్యాప్తికి భగవానుడే కారణము. భగవానుడే స్వయముగా "అహం సర్వస్య ప్రభవ:" – "నేనే సర్వమునకు మూలాధారము" అని ఇదివరకే వివరించి యున్నాడు(భ.గీ. 10.8). కనుకనే భౌతిక జీవితమనెడి అత్యంత ధృఢమైన ఈ సంసార వృక్షపుబంధము నుండి విడివడుటకు మానవుడు శ్రీకృష్ణభగవానుని శరణుపొందవలెను. అట్లు అతనికి శరణు పొందినంతనే మానవుడు అప్రయత్నముగనే ఈ భౌతిక జీవితము నుండి విముక్తుడగును.

## 15.5

**నిర్మానమోహా జితసఙ్గదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామా: ।**
**ద్వన్ద్వైర్విముక్తా: సుఖదుఃఖసంజ్ఞైర్ గచ్ఛన్త్యమూఢా: పదమవ్యయం తత్ ॥**

### అనువాదము

**దురభిమానము, భ్రాంతి, దుస్సాంగత్యముల నుండి విడివడినవారును, శాశ్వతత్త్వమును అవగతము చేసికొనినవారును, కామవర్జితులును, సుఖదుఃఖములనెడి ద్వంద్వముల నుండి విముక్తులైన వారును, భ్రాంతిరహితులై ఏ విధముగా దేవాదిదేవుని శరణువేడవలెనో ఎరిగినవారును అగు మానవులు అట్టి శాశ్వత రాజ్యమును పొందగలుగుదురు.**

### భాష్యము

శరణాగతి విధానము ఈ శ్లోకమునందు చక్కగా వర్ణింపబడినది. మానవుడు గర్వముచే భ్రాంతి చెందకుండుటయే దానికి కావలిసిన మొదటి యోగ్యత. భౌతిక ప్రకృతికి తానే ప్రభువునని భావించుచు గర్వించుట చేత బద్ధజీవునకు దేవాదిదేవుని శరణుపొందుట మిక్కిలి కష్టము. కాని మానవుడు యథార్థ ఆధ్యాత్మిక జ్ఞానసముపార్జనము ద్వారా తాను భౌతిక ప్రకృతికి ప్రభువును కాననియు, దేవాదిదేవుడే ప్రభువనియు ఎరుగవలెను. గర్వముచే కలుగు భ్రాంతి నుండి విముక్తుడైనపుడు అతడు శరణాగతి విధానమును ఆరంభింపగలడు. ఈ భౌతిక జగత్తు నందు ఎల్లప్పుడు ఏదోఒక గౌరవమును ఆశించువానికి దేవాదిదేవుని శరణుపొందుట సాధ్యపడదు. మాయా లేదా మోహముచే కలుగు గర్వము వలన మానవుడు ఈ లోకమున జన్మించి స్వల్పకాలము జీవించి, చివరికి మరణించు వాడైనను ఈ జగత్తునకు తానే ప్రభువుననెడి మూర్ఖభావమును కలిగియుండును.ఈ జగత్తునకు వచ్చి, కొంతకాలము నిలిచి, తిరిగి వెడలిపోవు అతడు అనవసరముగా అట్టి భావముచే విషయములను కష్టతరము గావించుకొని ఎప్పుడును కష్టదశలోనే నిలిచియుండును. ఈ జగత్తు సర్వము ఈ భావముతోనే కొనసాగుచున్నది. ఈ భావముతోనే భూమి మానవ సమాజమునకు సంబంధించినదని భావించు ప్రజలు తామే ప్రభువులమనెడి భ్రాంతితో భూమిని అనేక భాగములుగా విభజించియుండిరి. మానవుడే ఈ జగత్తునకు యజమానుడను భ్రాంతి నుండి ప్రతియొక్కరు బయటపడవలసి యున్నది. అట్టి అసత్యభావము నుండి విముక్తులైన పిమ్మట మానవుడు కుటుంబ, సాంఘిక, జాతీయ ఆసక్తులచే కలిగెడి సమస్త కపట సాంగత్యముల నుండి విముక్తులగుదురు. ఈ దోషపూరిత సాంగత్యములే జీవుని భౌతిక జగత్తునందు బంధించును. ఈ స్థితిని దాటిన మానవుడు ఆధ్యాత్మిక జ్ఞానమును పెంపొందించు కొనవలెను. వాస్తవముగా తనకు చెందినదేదో, తనకు చెందనిదేదో ఎరుగు జ్ఞానమును అతడు సంపాదింపవలెను. విషయములను యథాతథముగ అవగాహనము

చేసికొనినప్పుడు అతడు సుఖదుఃఖములు, బాధావినోదములు వంటి ద్వంద్వముల నుండి విముక్తుడగును. అతడు జ్ఞానము నందు పరిపూర్ణుడైనప్పుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని శరణుపొందుట సాధ్యము కాగలదు.

**15.6**
**న తద్భాసయతే సూర్యో న శశాఙ్కో న పావకః ।**
**యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥**

## అనువాదము

**అట్టి నా దివ్యధామము సూర్యునిచే గాని, చంద్రునిచే గాని, అగ్నిచే గాని, విద్యుత్తులచే గాని ప్రకాశింపజేయబడదు. దానిని చేరినవారు తిరిగి ఈ భౌతిక జగత్తున కెప్పుడును తిరిగిరారు.**

## భాష్యము

కృష్ణలోకము, గోలోక వృందావనమని ప్రసిద్ధినొందిన దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని దివ్యధామము(ఆధ్యాత్మిక జగత్తు) ఇక్కడ వర్ణింపబడినది. ఆధ్యాత్మిక లోకములన్నియు స్వయం ప్రకాశమానము లైనందున అక్కడ సూర్యకాంతిని, చంద్రకాంతికిని, అగ్నికిని, విద్యుత్తునకు గాని అవసరములేదు. ఈ విశ్వమున సూర్యుడొక్కడే స్వయం ప్రకాశకమైన గ్రహము. కాని ఆధ్యాత్మిక జగత్తు నందలి గ్రహము లన్నియును స్వయం ప్రకాశమానములే. వైకుంఠ లోకములనబడు ఈ లోకముల ప్రకాశమాన కాంతియే 'బ్రహ్మజ్యోతి' యనబడు తేజోమయమైన ఆకాశమును రూపొందించును. వాస్తవమునకు ఈ కాంతి అంతయు కృష్ణలోకమైన గోలోక వృందావనము నుండియే వెలువడుచున్నది. ఆ ప్రకాశించు కాంతి యొక్క అతికొద్ది భాగము 'మహత్తత్త్వము'చే అనగా భౌతిక జగత్తుచే కప్పబడినను, మిగిలిన భాగమంతయు వైకుంఠము లనబడు ఆధ్యాత్మిక లోకములతో నిండి యుండును. ఆ లోకము లన్నింటిలోకి ముఖ్యమైనదే గోలోక వృందావనము.

అంధకార బంధురమైన ఈ భౌతిక జగత్తు నందున్నంత కాలము జీవుడు బద్ధజీవితము నందుండును. కాని అసత్యము, విపరీతమునైన ఈ భౌతిక సంసార వృక్షమును ఛేదించుట ద్వారా ఆధ్యాత్మికాకాశమును చేరినంతనే అతడు విముక్తుడగును. అప్పుడు అతడు ఈ భౌతిక జగత్తునకు తిరిగివచ్చు అవకాశమే లేదు. బద్ధజీవితమున జీవుడు భౌతిక జగత్తునకు తానే ప్రభువునని భావించును. కాని ముక్తస్థితి యందు అతడు ఆధ్యాత్మిక జగత్తునందు ప్రవేశించి పరమ పురుషునకు సహచరుడగును. అక్కడ అతడు సచ్చిదానందముల ననుభవించును.

వాస్తవమునకు, ఇట్టి దివ్యవిషయముల పట్లనే మానవుడు ఆకర్షింపబడవలెను. అట్టి శాశ్వత జగత్తును చేరుటకు మరియు యథార్థ తత్త్వము యొక్క ప్రతిబింబమైన ఈ జగత్తు నుండి విముక్తుడగుటను సదా వాంఛింపవలెను. ఈ భౌతిక జగత్తు నందు అధిక ఆసక్తి కలవానికి అట్టి ఆసక్తిని ఖండించుట అత్యంత కష్టమైనను అతడు కృష్ణచైతన్య వంతుడైనచో క్రమముగా దానినుండి అనాసక్తుడగుటకు అవకాశము కలదు. కనుక, మానవుడు కృష్ణచైతన్యము నందు నెలకొనిన భక్తుల సాంగత్యమును పొందవలెను. అట్లు కృష్ణచైతన్యమున నెలకొనిన వారికొరకై అన్వేషించి భక్తియుక్త సేవ నొనరించు విధానమును అభ్యసింపవలెను. ఈ విధముగా అతడు భౌతిక జగత్తు పట్ల గల ఆసక్తిని

ఛేదింపవచ్చును. కేవలము కాషాయవస్త్రములను ధరించుట ద్వారా ఎవ్వరును భౌతిక జగత్తు ఆకర్షణల నుండి విడివడజాలరు. దానికొరకు వారు శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవయందు ఆసక్తులు కావలెను. కనుకనే ద్వాదశాధ్యాయమున వివరింపబడినట్లు, భక్తియుక్తసేవా మార్గమే యథార్థవృక్షము యొక్క అశాశ్వతము మరియు విపరీత ప్రతిబింబమైన ఈ సంసార వృక్షము నుండి బయటపడుటకు ఏకైక మార్గమని ప్రతియొక్కరు ధృఢముగా విశ్వసింపవలెను. అన్నిరకములైన విధానములు భౌతిక ప్రకృతిచే కలుషితములై యుండుననియు, భక్తియుక్త సేవ మాత్రమే శుద్ధముగా దివ్యమైనదనియు చతుర్దశాధ్యాయమున వివరింపబడినది.

ఇక్కడ 'పరమం మమ' అను పదములు ఎంతో ప్రధానమైనవి. వాస్తవమునకు ప్రతీది పరమపురుషుని సంపదయే. అయినను షడ్గుణైశ్వర్యములు కలిగిన ఆధ్యాత్మిక జగత్తుయే 'పరమమ్' అని తెలుపబడినది. ఆధ్యాత్మిక జగత్తున సూర్యకాంతికి గాని చంద్రకాంతికి గాని నక్షత్రములకు గాని అవసరము లేదని (న తత్ర సూర్యో భాతి న చంద్రతారకమ్) అని 'కఠోపనిషత్తు'(2.2.15) సమర్థించు చున్నది. ఎందుకనగా ఆధ్యాత్మిక జగత్తంతయు పరమపురుషుని 'స్వరూప'శక్తిచే ప్రకాశింపబడి యుండుట చేత అట్టి దివ్యధామము కేవలము శరణాగతి చేతనే తప్ప ఇతర సాధనములచే పొందబడదు.

### 15.7

**మమైవాంశో జీవలోకే జీవభూత: సనాతన: ।**
**మన:షష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥**

## అనువాదము

**ఈ బద్ధజగత్తు నందలి జీవులందరును నా శాశ్వతాంశములు. బద్ధజీవనము కారణముగా మనస్సుతో కలిపి ఆరైన ఇంద్రియముల నాకర్షించి వారు తీవ్రసంఘర్షణ కావించుచున్నారు.**

## భాష్యము

ఈ శ్లోకమునందు జీవుని యథార్థమునకు ఈ జీవుడు దేవాదిదేవుని శాశ్వతాంశము. అనగా అతడు బద్ధజీవితము నందు వ్యక్తిత్వమును కలిగి, ముక్తస్థితి యందు ఆ దేవాదిదేవునితో ఐక్యమగునని అర్థము కాదు. అతడు శాశ్వతముగా దేవాదిదేవుని నుండి విడివడియే యుండును. ఈ విషయమే 'సనాతన:' అను పదము ద్వారా స్పష్టపరచబడినది. వేదముల ననుసరించి దేవాదిదేవుడు అసంఖ్యాకములైన రూపములుగా విస్తరించు చుండును. వానిలో స్వరూపాంశ విస్తరణలు విష్ణు తత్త్వములనియు, జీవులన్నియు విభిన్నాంశములనియు చెప్పబడును. అనగా విష్ణుతత్త్వములు స్వాంశ విస్తరణములు కాగా, జీవులు విభక్త(విభిన్నాంశ) విస్తరణలు మరియు శాశ్వత సేవకులు. శ్రీకృష్ణభగవానుడు తన స్వరూపాంశ విస్తరణములచే రాముడు, నృసింహ దేవుడు, విష్ణుమూర్తి ఇంకను అనేక వైకుంఠాధిపతులగా వివిధ రూపములతో వైకుంఠ లోకము లందు వ్యక్తమగుచుండును. విభిన్నాంశము లైనట్టి జీవులు శాశ్వతముగా తమ వ్యక్తిత్వములను కలిగియుండును. దేవాదిదేవుని స్వరూపాంశ విస్తరణలు నిత్యములై యుండునట్లే, భగవానుని విభిన్నాంశములైన జీవులు కూడ తమ వ్యక్తిత్వములను కలిగియుందురు. దేవాదిదేవుని విభిన్నాంశములుగా జీవులు భగవానుని గుణలక్షణములను స్వల్పమాత్రమున కలిగియుందురు. అట్టి లక్షనములలో స్వాతంత్ర్య

మనునది ఒకటి. అనగా ప్రతిజీవి కూడ స్వంత వ్యక్తిత్వము మరియు స్వల్పమైన స్వాతంత్ర్యమును కలిగియున్నాడు. అట్టి స్వల్ప స్వాతంత్ర్యమును దుర్వినియోగపరచుట చేతనే అతడు బద్ధుడగును. సద్వినియోగ పరచుటచే విముక్తుడగుచుండును. ఈ బంధ ముక్తస్థితులనెడి రెండింటి యందును జీవాత్మ దేవాదిదేవునితో గుణైక్యమును శాశ్వతముగా కలిగియుండును. ముక్తస్థితి యందు అతడు ఈ భౌతిక స్థితి నుండి విముక్తుడై శ్రీకృష్ణభగవానుని దివ్యసేవ యందు నెలకొనియుండును. కాని బద్ధస్థితి యందు భౌతిక ప్రకృతి త్రిగుణములచే ప్రభావితుడై, భగవానుని దివ్యమైన ప్రేమయుక్త సేవను విస్మరించును. దానికి ఫలితముగా, అతడు ఈ భౌతిక జగత్తునందు తన జీవితమునకై తీవ్ర సంఘర్షణను కావింపవలసి వచ్చును.

మానవులు, శునకములు, మార్జాలములు, జంతువుల వంటి జీవులే కాకుండ, భౌతికజగత్తును పరిపాలించు బ్రహ్మ, శివ, విష్ణువు కూడ శ్రీకృష్ణభగవానుని అంశలే. భగవానుని అంశలందరును శాశ్వత వ్యక్తీకరణలే కాని తాత్కాలిక వ్యక్తరూపములు కారు. ఇక్కడ తీవ్రముగా సంఘర్షణము చేయుచుండునను అర్థము కలిగిన 'కర్షతి' యను పదము మిక్కిలి ప్రధానమైనది. బద్ధజీవుడు ఇనుపగొలుసులతో బంధింపబడినట్లుగా అతడు తన అహంకారముచే బంధింపబడి యున్నాడు. భౌతిక జీవితము నందు అతనిని నడిపించు ముఖ్యసాధనము మనస్సు, ఇంద్రియములలో ముఖ్యమైన అట్టి మనస్సు సత్త్వగుణము నందున్నప్పుడు అతని కార్యములు యోగ్యమైనవిగా యుండును; రజోగుణము నందున్నప్పుడు అతని కార్యములు దుఃఖపూరితములై యుండును; మనస్సు తమోగుణము నందున్నప్పుడు అతడు జంతుజాతులందు ప్రవేశించును. ఈ శ్లోకమున బద్ధజీవులు మనస్సు, ఇంద్రియములతో కూడిన భౌతిక దేహముతో కప్పబడి యుందురనియు, ముక్తులైనప్పుడు అట్టి భౌతిక ఆచ్ఛాదనము నశించి అతని ఆధ్యాత్మిక దేహము వ్యక్తమగుననియు స్పష్టమగుచున్నది. 'మాధ్యందినాయన శ్రుతి' నందు, "స వా ఏష బ్రహ్మనిష్ఠ ఇదం శరీరం మర్త్యమతిసృజ్య బ్రహ్మాభిసంపద్య బ్రహ్మణా పశ్యతి బ్రహ్మణా శృణోతి బ్రహ్మణైవేదం సర్వమనుభవతి" – "జీవుడు భౌతిక దేహచ్ఛాదనమును విడిచి ఆధ్యాత్మిక జగత్తును చేరినపుడు తన ఆధ్యాత్మిక దేహమును పునరుద్ధరించుకొని, అట్టి ఆధ్యాత్మిక దేహముతో అతడు దేవాదిదేవుని ప్రత్యక్షముగా దర్శింపగలడు. దేవాదిదేవునితో ముఖాముఖి సంభాషింపగలడు, వినగలడు మరియు అతనిని యథార్థముగా అవగాహన చేసికొనగలడు" అని తెలుపబడినది. "వసంతి యత్ర పురుషా: సర్వే వైకుంఠమూర్తయ:" అని శ్రీమద్భాగవతము (3.15.14) నందు తెలుపబడినట్లు, భగవద్ధామమున ప్రతియొక్కరు దేవాదిదేవుని దేహము వంటి లక్షణములు గల దేహములను కలిగియుందురు. దేహనిర్మాణమునకు సంబంధించినంత వరకు ముక్తజీవులకును మరియు విష్ణుమూర్తులకును నడుమ ఎట్టి భేదమును లేదు. అనగా ముక్తినొందిన పిమ్మట జీవుడు దేవాదిదేవుని కృపచే ఆధ్యాత్మిక దేహమును పొందగలుగును.

ఈ శ్లోకమున "మమైవాంశ:"(దేవాదిదేవుని విభిన్నాంశము) అను పదము కూడ మిక్కిలి ప్రధానమైనది. ఇక్కడ దేవాదిదేవుని అంశ భాగము అనగా భిన్నమైన భౌతిక వస్తువు యొక్క విరిగిన ఏదోభాగము వంటిది కాదు. ఆత్మను ఛేదించలేమని ద్వితీయాధ్యాయము నుండి మనము తెలిసికొంటిమి. కనుక ఈ అంశ భాగమును భౌతికముగా అవగాహన చేసుకొనుట సాధ్యము కాదు. ఆత్మ ముక్కలుగా చేయబడి తిరిగి అతుకుటకు వీలయ్యేడి భౌతిక పదార్థము కాదు. 'సనాతన:' అనెడి సంస్కృత పదప్రయోగము వాడబడుటచే ఆ భౌతిక భావనము ఇక్కడ సరిపోదు. అది నిత్యమైనది. ద్వితీయాధ్యాయపు ఆరంభమున 'దేహినో స్మిన్ యథా దేహే' అను శ్లోకము ద్వారా

ప్రతిదేహము నందును దేవాదిదేవుని అంశయైన ఆత్మ నిలిచియుండునని కూడ తెలుపబడినది. అట్టి అంశభాగము దేహబంధము నుండి విముక్తి నొందినప్పుడు ఆధ్యాత్మిక జగత్తు నందు ఏదేని ఒక ఆధ్యాత్మిక లోకమున తన పూర్వపు ఆధ్యాత్మిక దేహమును పునరుద్ధరించుకొని దేవాదిదేవుని సాహచర్యము ననుభవించును. బంగారము నందలి భాగము కూడ బంగారమే అయినట్లు, దేవాదిదేవుని అంశయైనందున జీవుడు అతనితో గుణైక్యమును కలిగి యుండునని ఇక్కడ మనము అవగాహనము చేసికొనవలెను.

**15.8**

**శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వర: ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥**

**అనువాదము**

**వాయువు గంధమును మోసుకొనిపోవునట్లు, జీవుడు భౌతిక జగత్తున విభిన్నములైన తన భౌతిక భావసంస్కారములను ఒక దేహము నుండి మరొక దేహమునకు గొనిపోవుచుండును. ఈ విధముగా అతడొక దేహమును గ్రహించి, తిరిగి మరియొక దేహమును గ్రహించుటకై దానిని విడిచి వేయును.**

**భాష్యము**

ఇక్కడ జీవుడు 'ఈశ్వరుడు' అనగా దేహమునకు నియామకునిగా వర్ణింపబడెను. ఇష్టమైనచో అతడు తన ఉన్నత జన్మకు సంబంధించిన దేహమును పొందవచ్చును. లేదా నీచదేహము లందు ప్రవేశింపవచ్చును. ఈ విషయమున అతనికి స్వల్పమైన స్వాతంత్ర్యము గలదు. దేహమందలి మార్పుదేహియైన అతని పైననే ఆధారపడియున్నది. అతడు రూపొందించుకొనిన చైతన్యము మరణ సమయమున అతనిని మరొక విధమైన దేహమునకు గొనిపోవును. అతడు శునకములు, మార్జాలములు వంటి జంతువుల చైతన్యమును పెంపొందించు కొనినచో అతడు తప్పక అట్టి శునకముల, మార్జాలముల దేహమునే పొందవలసి వచ్చును. దైవీగుణములందు అతని చైతన్యము లగ్నమైనచో మరణానంతరము దేవతా శరీరమును పొందును. ఒకవేళ అతడు కృష్ణచైతన్య వంతుడైనచో ఆధ్యాత్మిక జగత్తు నందలి కృష్ణలోకమునకు చేరి శ్రీకృష్ణుని సాహచర్యమును పొందును. కనుక దేహము నశించిన పిమ్మట సర్వము ముగియుననుట భ్రాంతి. ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పుచెందు జీవుని వర్తమాన దేహము మరియు దానియందలి కర్మలు భవిష్యత్తు జన్మకు నాంది కాగలవు. మానవుడు తన కర్మ ననుసరించియే భిన్నమైన దేహములను పొంది, కాలక్రమమున ఈ దేహమును విడువవలసి వచ్చును. జీవభావములను తనతో మరొక దేహమునకు గొనిపోవు సూక్ష్మశరీరమే తరువాతి జన్మలోని మరొక దేహమును సిద్ధపరచు చున్నదని ఇక్కడ పేర్కొనబడినది. ఒక దేహము నుండి మరొక దేహమునకు మార్పు చెందుట మరియు దేహము నందున్నప్పుడు వివిధ సంఘర్షణలకు గురియగుట యనెడి ఈ విధానము 'కర్షతి' లేక జీవన సంఘర్షణమని చెప్పబడును.

**15.9**
**శ్రోత్రం చక్షు: స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥**

## అనువాదము

**జీవుడు ఈ విధముగా మరొక స్థూలదేహమును గ్రహించి మనస్సుతో కూడియున్న ఒకానొక రకమైన కర్ణములను, నయనములను, జిహ్వను, నాసికను, స్పర్శశక్తిని పొందును. అట్లు అతడు ప్రత్యేక వర్గమునకు చెందిన ఇంద్రియార్థముల ననుభవించును.**

## భాష్యము

మరోమాటలో చెప్పవలెననిన, జీవుడు తన చైతన్యమును మార్జాలముల, శునకముల గుణములతో కలుషితము చేసుకొనినచో అతడు మరుసటి జన్మమున శునక దేహమును లేదా మార్జాల దేహమును గాని పొంద వలసి వచ్చును. వాస్తవమునకు చైతన్యమనునది నీటివలె స్వచ్ఛమైనది మరియు పవిత్రమైనది. స్వచ్ఛమైన నీరు ఏదేని రంగుతో కలిసినచో అది మార్పుచెందును. అట్లే, ఆధ్యాత్మికమైన ఆత్మ యొక్క శుద్ధచైతన్యము భౌతికగుణముల కలయిక ననుసరించి తదనుగుణముగా మారిపోవును. వాస్తవమునకు కృష్ణచైతన్యమే శుద్ధచైతన్యము. కనుకనే కృష్ణచైతన్యము నందు నెలకొనినవాడు పవిత్ర జీవనుడగును. కాని అతడు తన చైతన్యమును ఏదేని ఒక విధమైన భౌతిక భావనతో కలుషితము కావించుకొనినచో అతడు భవిష్యత్తు జన్మమున తదనుగుణమైన దేహమును పొందును. అతడు మానవ దేహమునే తిరిగి పొందుననెడి నియమ మేదియును లేదు. ఎనుబది నాలుగు లక్షల జీవరాసులలో అతడు శునకముల, మార్జాలముల, సూకరముల వంటి జంతు దేహమును గాని దేవతా శరీరమును గాని లేదా మరొక ఇతర దేహమును గాని పొందవచ్చును.

**15.10**
**ఉత్క్రామన్తం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుష: ॥**

## అనువాదము

**జీవుడు ఏ విధముగా తన దేహమును విడుచునో, ప్రకృతి గుణముల ప్రభావమున ఎట్లు శరీరము నందుండి దానిని అనుభవించునో మూఢులు ఎరుగజాలరు. కాని జ్ఞానచక్షువులు కలిగినవారు ఈ విషయమును చక్కగా గాంచగలరు.**

## భాష్యము

'జ్ఞానచక్షుష:' అను పదము ఇక్కడ చాలా ప్రధానమైనది. జ్ఞానము లేకుండా ఎవ్వరును జీవుడు ఏ విధముగా ఈ ప్రస్తుత దేహమును విడిచివేయునని గాని, తరువాతి జన్మమున అతడు ఎట్టి దేహరూపమును పొందునని గాని లేదా అతడెందుకు ఒక ప్రత్యేక దేహమున వసించుచున్నాడని గాని ఎరుగజాలరు. దీనికై ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని నుండి గాని భగవద్గీత నుండి గాని, తత్సంబంధమైన ఇతర శాస్త్రగ్రంథముల నుండి గాని శ్రవణము చేసిపొందిన విశిష్టమైన జ్ఞానము అత్యంత అవసరము. ఈ విషయముల

నన్నింటిని అవగాహన చేసికొనుటకు అభ్యసించినవాడు నిజమైన అదృష్టవంతుడు. ప్రతిజీవుడు వివిధ పరిస్థితులలో దేహమును విడుచుచుండును. వివిధ పరిస్థితులలో జీవించు చుండును. అట్లే గుణప్రభావమున కొన్ని పరిస్థితుల యందు భోగించుచుండును. అట్టి ఇంద్రియ భోగమను భ్రాంతి యందే అతడు పలు విధములైన సుఖదుఃఖములను అనుభవించు చుండును. కామము మరియు కోరికచే శాశ్వతముగా అజ్ఞానులైనవారు తమ దేహమార్పు విషయమును గాని, ప్రస్తుత దేహమున ఎందుకు వసించియున్నామని గాని అవగాహన చేసుకొనగలిగే శక్తిని కోల్పోవుదురు. వారు దానిని అవగాహన చేసికొనజాలరు. ఆధ్యాత్మిక జ్ఞానమును అలవరచుకొనినవారు జీవాత్మ దేహము కంటెను భిన్నమైనదనియు, అది దేహములను మార్చుకొని వివిధ రకములుగా భోగించు చున్నదనియు ఎరుగ గలుగుదురు. అట్టిజ్ఞానము గలవాడు బద్ధజీవుడు ఎట్లు ఈ భౌతిక జగత్తునందు దుఃఖము ననుభవించు చున్నాడో అవగాహన చేసుకొనగలడు. కనుకనే కృష్ణచైతన్యము నందు గొప్ప పురోగతి సాధించినవారు సామాన్య జనులకు ఈ జ్ఞానమును తమ శక్తికొలది అందించుటకు యత్నింతురు. ఎందుకనగా, బద్ధజీవితము మిక్కిలి క్లేశకరమైనది. కనుక సామాన్యజనులు బద్ధజీవితము నుండి బయటపడి కృష్ణచైతన్యవంతులై ఆధ్యాత్మిక లోకమునకు బదిలీయగునట్లుగా తమనుతాము విముక్తులను కావించుకొనవలెను.

## 15.11
**యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్ ।**
**యతన్తో ప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః ॥**

## అనువాదము

**ఆత్మానుభూతి నందు ప్రతిష్ఠితులైనట్టి యత్నశీలురైన యోగులు దీనినంతటిని స్పష్టముగా గాంచగలుగుదురు. కాని అచేతనులు మరియు ఆత్మానుభూతి నందు స్థితిని పొందనివారు ప్రయత్నించి నప్పటికిని ఏమి జరుగుచున్నదో గాంచలేరు.**

## భాష్యము

ఆత్మానుభూతి మార్గము నందు పలువురు యోగులున్నను ఆత్మానుభూతిని పొందనివాడు దేహి యొక్క దేహమునందు ఎట్టి మార్పులు కలుగుచున్నవో చూడలేడు. కనుకనే ఈ సందర్భమున 'యోగినః' అను పదము ఎంతో ముఖ్యమైనది. వర్తమాన కాలమందు ఎందరో నామమాత్ర యోగులు మరియు అనేక నామమాత్ర యోగసంఘములు గలవు. వాస్తవమునకు వారందరును ఆత్మానుభూతి విషయమున అంధులు. వారు కేవలము ఏదోఒక విధమైన దేహవ్యాయామమునకు అలవాటుపడి, దేహము ధృఢముగా మరియు ఆరోగ్యముగా నున్నచో తృప్తిపడుదురు. వారికి ఇతర జ్ఞానమేదియు నుండదు. వారే 'యతన్తో ప్యాకృతాత్మనః' అనబడుదురు. ఏదో యోగవిధానము అని పిలువబడు దానిని అభ్యసించినను ఆత్మానుభూతిని వారు పొందినవారు కాజాలరు. వారెన్నడును ఆత్మ పరిణామ ప్రక్రియను అవగతము చేసికొనజాలరు. వాస్తవముగా యోగవిధానము నందుండి ఆత్మను, జగత్తును, దేవాదిదేవుడు అను అంశములను అవగాహన చేసికొనినవారు మాత్రమే అనగా కృష్ణచైతన్యము నందు శుద్ధమైన భక్తియుక్త సేవయందు నెలకొనిన భక్తియోగులు మాత్రమే ఏది ఎట్లు జరుగుచున్నదో యథాతథముగా అవగాహన చేసుకొన గలుగుదురు.

## 15.12
**యదాదిత్యగతం తేజో జగద్భాసయతే ఖిలమ్ ।**
**యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥**

## అనువాదము

**సమస్త జగత్తునందలి అంధకారమును నశింపజేయు సూర్యుని తేజస్సు నా నుండియే ఉద్భవించుచున్నది. అదేవిధముగా చంద్రుని తేజస్సు మరియు అగ్నితేజస్సు కూడా నా నుండియే కలుగుచున్నవి.**

## భాష్యము

మందబుద్ధులు ఏది ఏవిధముగా జరుగుచున్నదో అవగాహన చేసికొన జాలరు. కాని భగవానుడు ఇక్కడ వివరించు విషయమును అవగాహన చేసికొనుట ద్వారా ఎవరైనను క్రమముగా జ్ఞానమునందు స్థితుడు కాగలడు. ప్రతియొక్కరు సూర్యుడు , చంద్రుడు, అగ్ని, విద్యుత్తులను చూచుచుందురు. అట్టి సూర్యుని, చంద్రుని, అగ్ని, విద్యుత్తు యొక్క కాంతి దేవాదిదేవుని నుండియే కలుగుచున్నదని వారు అవగాహన చేసికొనుటకు యత్నింపవలెను. కృష్ణచైతన్యమునకు ఆరంభమైనటు వంటి అట్టి భావనము ఈ భౌతిక జగత్తునందు బద్ధజీవునకు గొప్ప ఆధ్యాత్మిక పురోగతిని కలిగింపగలదు. జీవులు ముఖ్యముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నిత్యాంశములు. జీవులు ఏ విధముగా తిరిగి భగవద్ధామమును చేరగలుగుదురనెడి విషయమున భగవానుడిక్కడ కొన్నిసూచనల నొసుగుచున్నాడు.

ఈ శ్లోకమును బట్టి సూర్యుడు గ్రహమండల మంతటిని ప్రకాశింపజేయు చున్నాడని మనము అవగాహన చేసుకొనవచ్చును. వాస్తవమునకు భిన్న విశ్వములు మరియు సూర్యమండలములు అనేకము గలవు. అదేవిధముగా సూర్యులు, చంద్రులు మరియు గ్రహములు కూడా గలవు. కాని ప్రతి విశ్వము నందు ఒక్క సూర్యుడు మాత్రమే ఉండును. భగవద్గీత(10.21) యందు చెప్పబడినట్లు, చంద్రుడు నక్షత్రములలో ఒకడై యున్నాడు. 'నక్షత్రాణామహం శశీ'- ఆధ్యాత్మికాకాశము నందలి దేవాదిదేవుని దివ్యతేజస్సే సూర్యకాంతికి కారణము. అట్టి సూర్యుడు ఉదయించగనే జీవుల కర్మలు కూడ ఆరంభమగును. ఆహార పదార్థములను సిద్ధము చేసికొనుటకును లేదా కర్మాగారములు వంటివాటిని నడిపించుటకు లేదా ఇతర అనేక కార్యములకు అగ్నిని ఉపయోగింతురు. ఇట్లు అగ్ని సహాయముతో అనేక కార్యములు జరుగు చున్నవి. కనుకనే సూర్యోదయము, అగ్ని, చంద్రకాంతు లనునవి జీవులకు మిక్కిలి ఆహ్లాదకరములై యుండును. ఏ జీవియు ఎట్టి తోడ్పాటు లేకుండ మనుగడను కొనసాగింపలేదు. కనుక ఎవరైనను సూర్యుని, చంద్రుని, అగ్ని యొక్క తేజోవైభవములు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నుండియే ఉద్భవించు చున్నవని మానవుడు ఎరుగగలిగినచో వారియందు కృష్ణచైతన్యము ఆరంభమగును. ఆహ్లాదకరమైన ఔషధులన్నియు చంద్రకాంతి చేతనే పోషింపబడుచున్నవి. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని కృపచేతనే తాము జీవించు చున్నామనియు, అట్టి ఆహ్లాదకరమైన చంద్రకాంతిని అనుభవించు ప్రతియొక్కరును సులభముగా అవగాహన చేసుకొనగలుగుదురు. భగవానుని కృపలేనిదే సూర్యుడు కాని, చంద్రుడు కాని, అగ్నికాని ఉండజాలవు మరియు వాటి సహాయము లేకుండ ఎవరును జీవింపజాలరు. బద్ధజీవుని యందు కృష్ణచైతన్యమును ప్రేరేపించుటకు ఇవి కొన్ని సూచనలై యున్నవి.

## 15.13

**గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా ।**
**పుష్ణామి చౌషధీ: సర్వా: సోమో భూత్వా రసాత్మక: ॥**

### అనువాదము

**నేను ప్రతి గ్రహమునందును ప్రవేశింతును. నా శక్తి చేతనే అవి తమ కక్ష్య యందు నిలిచియున్నవి. నేనే చంద్రుడనై సర్వ ఔషధులకు జీవరసమును సమకూర్చుచున్నాను.**

### భాష్యము

భగవానుని శక్తిచేతనే గ్రహములన్నియు అంతరిక్షమున తేలుచున్నవని ఈ శ్లోకము ద్వారా తెలియుచున్నది. 'బ్రహ్మ సంహిత'(5.35) యందు చర్చింప బడినట్లు, అతడు ప్రతి అణువు నందును, ప్రతి గ్రహము నందును, ప్రతిజీవుని యందును ప్రవేశించును. దేవాదిదేవుని సంపూర్ణాంశయైన పరమాత్మయే గ్రహము లందును, విశ్వమందును, జీవుని యందును, అణువు నందును కూడా ప్రవేశించునని చెప్పబడినది. అతని ప్రవేశము వలన సర్వము తగినరీతిన వ్యక్తమగు చున్నది. ఆత్మ యున్నంతవరకు మానవుడు నీటిపై తెలగలడు. కాని ఆత్మ దేహమును విడిచినంతటనే మృత్యువు ననుభవించి దేహము నీటియందు మునిగిపోవును. శరీరము నీటియందు క్రుల్లినప్పుడు అది గడ్డిపోచవలె నీటిపై తేలుననుట సత్యమేయైనను, మరణించిన వెంటనే అతని దేహము నీటిలో మునిగి పోవును. అట్లే ఈ గ్రహము లన్నియును అంతరిక్షమున తేలుటకు దేవాదిదేవుని దివ్యశక్తి వానియందు ప్రవేశించి యుండుటయే కారణము. పిడికిలి యందలి మట్టి పిడికిలిచే భరింపబడునట్లు, అతని శక్తి ప్రతి గ్రహమును భరించుచున్నది. పిడికిలిని బిగించి పట్టుకొనినచో ఆ మట్టి క్రిందపడిపోవుటకు అవకాశము లేదు. కాని దానిని గాలిలో విడిచినచో అది క్రింద పడిపోవును. అట్లే అంతరిక్షమున తేలుచున్న ఈ గ్రహము లన్నియును వాస్తవమునకు పరమపురుషుని విశ్వరూపము నందలి పిడికిలిలో భరింపబడుచున్నవి. అతని బలము మరియు అతని శక్తుల చేతనే స్థావర జంగమ వస్తువు లన్నియును తమతమ స్థానములలో నిలిచియున్నవి. వైదిక గ్రంథము లందు దేవాదిదేవుని కారణమున సూర్యుడు ప్రకాశించు చున్నాడనియు, గ్రహములు స్థిరముగా తమ కక్ష్యలో పరిభ్రమించు చున్నవనియు చెప్పబడినది. దేవాదిదేవుడు లేనిచో గ్రహము లన్నియు చెల్లాచెదురై గాలిలో దుమ్మువలె నశించును. అట్లే దేవాదిదేవుని కృపచేతనే చంద్రుడు ఓషధుల నన్నింటిని పోషించుచున్నాడు. చంద్రుని ప్రభావముచే ఔషధులు వృద్ధికరములగును. చంద్రకాంతి లేనిచో ఔషధులు, సస్యములు వృద్ధినొందుట గాని, రుచికరములగుట గాని సంభవింపదు. పరమపురుషుడు సర్వము సమకూర్చుచుండుట చేతనే మానవుడు పనిచేయుటయు, సుఖముగ జీవించుటయు, ఆహారమును ఆస్వాదించుటయు జరుగుచున్నది. లేనిచో మానవజాతి నిలిచియుండెడిది కాదు. 'రసాత్మక:' అను పదము ఎంతో ముఖ్యమైనది. పరమపురుషునిచే చంద్రుని ప్రభావముచే సస్యములన్నియును ఆస్వాదనీయము లగుచున్నవి.

## 15.14

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణీనాం దేహమాశ్రిత: ।**
**ప్రాణాపానసమాయుక్త: పచామ్యన్నం చతుర్విధమ్ ॥**

### అనువాదము

**ప్రాణుల దేహములందలి జఠరాగ్నిని నేను. ప్రాణాపాన వాయువులతో కూడి నేను నాలుగు విధములైన ఆహార పదార్థములను జీర్ణము చేయుచున్నాను.**

### భాష్యము

ఆయుర్వేద శాస్త్రము ననుసరించి ఉదరములోనికి పంపబడిన ఆహారము నంతటిని జీర్ణము చేయుటకు ఉదరమందు అగ్ని కలదని మనకు తెలియుచున్నది. అట్టి అగ్ని తగినట్లుగా ప్రజ్వలింపక పోయినచో ఆకలి కలుగదు. అది సరియైన రీతిలో ప్రజ్వలించునప్పుడే ఆకలి కలుగును. కొన్నిమార్లు ఆ అగ్ని సరిగా ప్రజ్వలింపక పోయినచో వైద్యము అవసరమగును. ఏమైనను, ఈ అగ్ని దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించును. దేవాదిదేవుడు అగ్నిరూపము నందుండి అన్నిరకములైన ఆహారములను జీర్ణము చేయుచున్నాడని 'బృహదారణ్య కోపనిషత్తు' (5.9.1) నిర్ధారించుచున్నది : "ఆయమగ్నిర్వైశ్వానరో యో యమంత: పురుషే యేనేదమన్నం పచ్యతే." ఈ విధముగా అన్నిరకముల ఆహారపదార్థములను జీర్ణము చేయుటకు అతడు తోడ్పడుచున్నందున భోజన విషయమున జీవుడు స్వతంత్రుడుకాడు. జీర్ణక్రియ యందు భగవానుడు తోడ్పడకపోయినచో జీవునకు ఆహారమును భుజించుటకు అవకాశము కలుగదు. ఈ విధముగా భగవానుడు ఆహారద్రవ్యములను ఉత్పాదించుచు మరియు ఉదరమున జీర్ణము చేయుచున్నాడు. కనుకనే అతని కృపచేతనే మనము జీవితము ననుభవించుచున్నాము. 'వేదాంత సూత్రము' (1.2.27) నందు కూడా ఈ విషయము స్థిరీకరింపబడినది : "శబ్దాదిభ్యో న్త: ప్రతిష్ఠానాచ్చ..." అనగా భగవానుడు శబ్దము నందు, దేహము నందు, వాయువు నందే కాకుండ జీర్ణశక్తి రూపమున కూడ ఉదరమందు ప్రతిష్ఠితుడై యున్నాడు. ఆహారములు నాలుగు రకములు : కొన్ని భక్ష్యములు (త్రాగునటువంటివి), భోజ్యములు (నమలబడేవి), లేహ్యములు (పీల్చుతూ తినునవి). వీటన్నింటిని జీర్ణముచేయు శక్తి భగవానుడే.

## 15.15

**సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్త: స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్ ॥**

### అనువాదము

**నేను సర్వుల హృదయము లందు నిలిచియున్నాను. నా నుండియే స్మృతి, జ్ఞానము, మరుపు అనునవి కలుగుచున్నవి. నేనే సమస్త వేదముల ద్వారా తెలియదగినవాడను. వాస్తవమునకు వేదాంతకర్తను, వేదముల నెరిగినవాడను నేనే.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పరమాత్మ రూపమున ప్రతియొక్కరి హృదయము నందును నిలిచియుండును. అట్టి హృదయస్థ పరమాత్మ నుండియే జీవుని సర్వకర్మలు ఆరంభమగుచున్నవి. జీవుడు తన గతజన్మకు సంబంధించిన విషయము నంతటిని విస్మరించినను సమస్త కర్మలకు సాక్షిగా పరమాత్మ రూపమున నుండు భగవానుని నిర్దేశము ననుసరించియే వర్తింపవలసి వచ్చును. కనుకనే అతడు తన పూర్వకర్మముల ననుసరించియే తన కర్మలను ఆరంభించును. కర్మ నొనరించుటకు కావలసిన జ్ఞానము, స్మృతి అతనికి సమకూర్చబడును. అంతేకాకుండ, తన గతజన్మమును గూర్చిన మరుపు కూడ అతనికి కలుగుచున్నది. ఈ విధముగా భగవానుడు సర్వవ్యాపకుడే కాకుండ ప్రతివ్యక్తి హృదయము నందు అంతర్యామిగా నుండును. కనుక అతడే వివిధ కర్మఫలములను ప్రసాదించు చుండును. శ్రీకృష్ణభగవానుడు నిరాకారబ్రహ్మము మరియు పరమాత్మను మాత్రమే కాకుండ వేదముల అవతారముగ కూడ అతడు పూజనీయుడు. జనులు తమ జీవితమును ధర్మబద్ధముగా మరియు భక్తికి అనుగుణముగా మలచుకొని భగవద్ధామమును తిరిగి చేరువిధముగా వేదములు తగిన నిర్దేశముల నొసగు చున్నవి. అట్టి వేదములు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గూర్చియే సంపూర్ణజ్ఞానము నొసగును. వ్యాసదేవుని అవతారమున ఆ దేవాదిదేవుడే 'వేదాంత సూత్రము'లకు కర్తయై యున్నాడు.

### 15.16

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షర: సర్వాణి భూతాని కూటస్థో౽క్షర ఉచ్యతే ॥**

## అనువాదము

**నశ్వరులు, అనశ్వరులని జీవులు రెండు రకములు. భౌతిక జగత్తు నందలి ప్రతిజీవియు నశ్వరము కాగా, ఆధ్యాత్మిక జగత్తు నందు ప్రతిజీవియు అనశ్వరమని చెప్పబడినది.**

## భాష్యము

ఇదివరకే వివరింపబడినట్లు, దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు వ్యాసదేవుని అవతారమున 'వేదాంత సూత్రము'లను రచించెను. ఇక్కడ భగవానుడు అట్టి 'వేదాంత సూత్రము' లందలి అంశముల సారాంశమును అందించుచున్నాడు. అసంఖ్యాకములైన జీవులను నశ్వరములు (క్షరులు) మరియు అనశ్వరములుగా (అక్షరులు) విభజింపవచ్చునని అతడు చెప్పుచున్నాడు. వాస్తవమునకు జీవాత్మలు దేవాదిదేవుని శాశ్వత విభిన్నాంశములు. భౌతిక జగత్తులో సంపర్కమును పొందినప్పుడు అవి 'జీవభూతులు' అని చెప్పబడుచున్నవి. ఈ శ్లోకము నందు తెలుపబడిన 'క్షర: సర్వాణి భూతాని' అను సంస్కృత పదములకు నశ్వరములని అర్థము. కాని దేవాదిదేవునితో గుణైక్యము (కూటస్థ:) కలిగినవారు అనశ్వరులుగా లేదా అక్షరులుగా పిలువబడుదురు. ఇక్కడ ఐక్యమనగా అక్షరపురుషులకు వ్యక్తిత్వము ఉండదని అర్థము కాదు. భగవానుడు మరియు ఆ అక్షర పురుషులకు నడుమ అనైక్యత లేదని మాత్రమే అది సూచించును. అక్షరులు సృష్టి ప్రయోజనమునకు అనుకూలురై యుందురు. వాస్తవమునకు ఆధ్యాత్మిక జగత్తు నందు సృష్టి యనెడి విషయము లేకున్నను 'వేదాంత

సూత్రము’లందు చెప్పబడినట్లు, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు వ్యక్తములైన వాటన్నింటికిని మూలాధార మైనందున అటువంటి భావము ఇక్కడ వివరింపబడినది.

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని వచనము ననుసరించి జీవాత్మలు రెండు తరగతులుగా నున్నారు. వేదములు దీనికి నిదర్శనము నొసగు చున్నందున ఈ విషయమున ఎట్టి సంశయమునకు తావు లేదు. భౌతిక జగత్తు నందు మనస్సు మరియు పంచేంద్రియములను కూడి ఈ ప్రపంచమున తీవ్రసంఘర్షణకు లోనయ్యెడి జీవులు సదా మార్పు చెందునటువంటి భౌతిక దేహములను కలిగి యున్నారు. జీవుడు బద్ధుడై యున్నంతకాలము అతని శరీరము భౌతిక పదార్థ సంపర్కముచే మార్పు చెందుచుండును. భౌతిక పదార్థము మార్పు చెందుచుండుట చేత జీవుడు కూడ మార్పు చెందుచున్నట్లుగా గోచరించును. కాని ఆధ్యాత్మిక జగత్తు నందు దేహము భౌతికము కానందున అది ఎట్టి మార్పునకు గురికాదు. భౌతిక జగత్తున జీవుడు జన్మించుట, వృద్ధినొందుట, కొంతకాలము జీవించుట, తిరిగి ఉత్పాదించుట, క్షీణించుట, నశించుట అను ఆరు విధములైన మార్పులను పొందును. ఇవి భౌతిక దేహమునకు సంబంధించిన మార్పులు. కాని ఆధ్యాత్మిక జగత్తున దేహము మార్పునొందదు. అక్కడ వృద్ధాప్యము లేదు, జననము లేదు, మరణము లేదు. అక్కడ సర్వము గుణసాదృశ్యమును కలిగియుండును. “క్షర: సర్వాణి భూతాని”- తొలుత సృష్టింపబడిన జీవుడైన బ్రహ్మ మొదలుగా అతి చిన్న చీమ వరకును భౌతిక వస్తువులతో సంపర్కము కలిగిన ప్రతిజీవియు తన దేహమును మార్చుచుండును. కనుకనే వారందరును నశ్వరులు. ఆధ్యాత్మిక జగత్తునందు జీవులు గుణైక్యమును కలిగి ఎల్లప్పుడు ముక్తులై యుందురు.

## 15.17

**ఉత్తమ: పురుషస్త్వన్య: పరమాత్మేత్యుదాహృత: ।
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వర: ॥**

### అనువాదము

**ఈ ఇరువురు గాక మూడులోకము లందును ప్రవేశించి వాటిని పోషించు సాక్షాత్తు అక్షయుడును, ప్రభువును పరమాత్ముడును అగు ఉత్తమ పురుషుడును కలడు.**

### భాష్యము

ఈ శ్లోకమునందలి అభిప్రాయము ‘కఠోపనిషత్తు’(2.2.13) మరియు ‘శ్వేతాశ్వతరోపనిషత్తు’(6.13) నందు చక్కగా వివరింపబడినది. బద్ధ, ముక్తస్థితి యందున్న అసంఖ్యాకములైన జీవులందరి పైన పరమాత్మగా హృదయము నందు నెలకొనిన దేవాదిదేవుడు కలడని అందులో స్పష్టముగా చెప్పబడినది. “నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానామ్” అనునది ఆ ఉపనిషత్తు నందలి వాక్యము. బద్ధ, ముక్తస్థితి యందున్న జీవులన్నింటిలో, వాటిని పోషించుచు కర్మానుసారముగా వారి భోగానుభవమునకు అవకాశమొసగు దేవాదిదేవుడను శ్రేష్ఠపురుషుడు మరొకడు కలడని దీనిసారాంశము. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే పరమాత్మగా ప్రతియొక్కరి హృదయము నందును నెలకొనియున్నాడు. ఆతనిని ఎరుగగలిగిన బుద్ధిమంతుడు, సంపూర్ణ శాంతిని పొందుటకు అర్హుడగును అన్యులు కారు.

## 15.18

**యస్మాత్ క్షరమతీతో హమక్షరాదసి చోత్తమ: ।**
**అతో స్మి లోకే వేదే చ ప్రథిత: పురుషోత్తమ: ॥**

## అనువాదము

**క్షర, అక్షర పురుషులకు అతీతుడను, ఉత్తమోత్తముడను అగుటచే నేను జగము నందును మరియు వేదములందును పురుషోత్తమునిగా ప్రసిద్ధి నొందితిని.**

## భాష్యము

బద్ధజీవుడు గాని ముక్తజీవుడు గాని ఎవ్వరును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అధిగమింపజాలరు. కనుకనే ఆతడు పురుషోత్తమునిగా తెలియబడినాడు. దీనినిబట్టి జీవులును మరియు దేవాదిదేవుడును సర్వదా భిన్న వ్యక్తులేనని ఇక్కడ స్పష్టమగుచున్నది. వారిరువురి నడుమ భేదమేమనగా జీవులు తమ బద్ధస్థితి యందు కాని, ముక్తస్థితి యందు కాని పరిమాణమున దేవాదిదేవుని అచింత్యమైన శక్తులను అధిగమింపజాలరు. దేవాదిదేవుడు మరియు జీవులు ఒకేస్థితికి చెందిన వారు లేదా సర్వవిధముల సమానులని భావించుట సరియైనది కాదు. వారిరువురి నడుమ ఉన్నతము మరియు సామాన్యము లనెడి సమస్య ఎల్లప్పుడును కొనసాగుతుండును. కనుకనే 'ఉత్తమ' అను పదము ఇక్కడ ప్రాధాన్యతను సంతరించుకొన్నది. ఎవరును దేవాదిదేవుని అధిగమింపజాలరు.

ఇక్కడ 'లోకే'యను పదము 'పౌరుషాగమమందు'(స్మృతులయందు) అని సూచించుచున్నది. 'లోకృతే వేదార్థో నేన' అనగా వేదముల ప్రయోజనము స్మృతి గ్రంథములచే వివరింపబడినదని 'నిరుక్తి' నిఘంటువు సమర్థించుచున్నది.

పురుషోత్తముడు పరమాత్మ రూపమున వేదముల యందు వర్ణింపబడెను. "ఏవమేవైష సంప్రసాదో స్మాచ్ఛరీరాత్ సముత్థాయ పరం జ్యోతిరుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే స ఉత్తమ: పురుష:" అను వాక్యము 'ఛాందోగ్యోపనిషత్తు' (8.12.3) నందు గోచరించును : "ముక్తజీవుని దేహము నుండి వెలువడెడి పరమాత్మ నిరాకార బ్రహ్మజ్యోతిలో ప్రవేశించి తన రూపమున తనదైన స్వరూప స్థితి యందు నిలిచి యుండును." అతడే పురుషోత్తముడని దాని అర్థము. దీనినిబట్టి దేవాదిదేవుడు పరంజ్యోతియైన తన ఆధ్యాత్మిక తేజమును ప్రదర్శించుచు, వ్యాపింప జేయు చున్నాడని దీని భావము. జీవుల హృదయమున నెలకొనిన పరమాత్మ అనెడి అంశమును కూడ ఆ పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు కలిగియున్నాడు. అతడే సత్యవతీ, పరాశరులకు పుత్రుడుగా అవతరించి వేదవ్యాసునిగా వేదజ్ఞానమును వివరించెను.

**15.19**
**యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥**

## అనువాదము

**ఓ భారతా! సంశయరహితముగా నన్ను పురుషోత్తముడని తెలియగలిగినవాడే సర్వజ్ఞుడు. అందుచే అతడు నా భక్తియుక్త సేవయందు సంపూర్ణముగా నిమగ్నుడగును.**

## భాష్యము

జీవుల యొక్కయు పరబ్రహ్మము యొక్క సహజ స్థితికి సంబంధించిన తాత్త్విక విచారములు లేదా ఊహాగానాలు అనేకములు గలవు. కాని తనను పురుషోత్తమునిగా ఎరిగినవాడే వాస్తవమునకు సర్వమును ఎరిగినవాడని శ్రీకృష్ణభగవానుడు స్పష్టముగా ఈ శ్లోకము నందు వివరించు చున్నాడు. అపరిపక్వ జ్ఞానము గలవాడు పరతత్త్వమును గూర్చి ఊహాకల్పనల యందే కాలమును గడుపును. కాని పరిపూర్ణ జ్ఞానము గలవాడు తన కాలమును వృథాచేయకుండ కృష్ణచైతన్యము నందు ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని భక్తియుక్త సేవ యందు నెలకొనును. భగవద్గీత యందంతటను ఈ భక్తియోగమే నొక్కిచెప్పబడినది. అయినను పరతత్త్వము మరియు జీవులు సమానమేనని భావించెడి మూర్ఖ వ్యాఖ్యాత లెందరో కలరు.

వేదజ్ఞానము 'శృతి'యని పిలువబడును. అనగా అది శ్రవణము ద్వారా అభ్యసింపబడునది. వాస్తవమునకు శ్రీకృష్ణభగవానుడు మరియు అతని ప్రామాణిక ప్రతినిధుల నుండియే వేదవిజ్ఞానమును గ్రహింపవలెను. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు ప్రతి విషయమును చక్కగా వివరించి యున్నందున ప్రతియొక్కరు దీనినుండియే శ్రవణమును చేయవలెను. అంతేకాని కేవలము సూకరముల వంటి జంతువుల వలె వినుట మాత్రమే చాలదు. విషయమును ప్రామాణికుల నుండి అవగతము చేసికొనుటకు యత్నింపవలెను. కాని కేవలము పాండిత్యముతో ఊహాగానాలను చేయరాదు. అనగా జీవులు సదా దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు అధీనులేనని ఎరుగవలెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని వాక్యము ననుసరించి దీనిని అట్లు అవగాహన చేసుకొనినవాడే వేదముల ప్రయోజనమును ఎరిగిన వాడగును. ఇతరులెవ్వరును వేదప్రయోజనమును ఎరుగలేరు.

ఈ శ్లోకము నందలి 'భజతే' యను పదము మిక్కిలి ప్రధానమైనది. సాధారణముగా శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవా సంబంధమున 'భజతి' యను పదము చాలాచోట్ల వాడబడినది. మానవుడు కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవ యందు నెలకొనినచో సమస్త వేదజ్ఞానము నెరిగినవాడుగా భావింపబడును. కనుకనే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని భక్తియుక్త సేవయందు నెలకొనినచో పరమ సత్యమును అవగాహన చేసుకొనుట కొరకై మరి యే ఇతర ఆధ్యాత్మిక విధానము అవసరము లేదని వైష్ణవపరంపర యందు చెప్పబడుచున్నది. భగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనియుండుట చేత అతడు ఇదివరకే యథార్థస్థితిని చేరినవాడగును. పరతత్త్వమును గూర్చిన అవగాహన కొరకై కావలసిన ప్రాథమిక విధానముల నన్నింటిని వారు ముగించిన వారగుదురు. కాని ఎవరైనను లక్షలాది జన్మలలో పరతత్త్వమును గూర్చి ఊహాగానాలను, తత్త్వవిచారము

కావించిన పిమ్మటయు శ్రీకృష్ణుడే దేవాదిదేవుడనియు, ప్రతియొక్కరు అతనికే శరణు పొందవలెనను యథార్థ విషయమును అవగతము చేసికొననిచో అతని లక్షలాది జన్మముల తాత్త్విక చింతన మంతయు వృథా కాలవ్యయమే కాగలదు.

**15.20**
**ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయానఘ ।**
**ఏతద్ బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్కృతకృత్యశ్చ భారత ॥**

**అనువాదము**

**పాపరహితుడవైన ఓ భారతవంశకుమారా! వేదములందలి అత్యంత రహస్యమైన ఈ భాగమును నీకిప్పుడు నేను వెల్లడించితిని. దీనిని అవగాహన చేసికొనినవాడు బుద్ధిమంతుడు కాగలడు. అతని ప్రయత్నములు పరిపూర్ణ విజయమును సాధింపగలవు.**

**భాష్యము**

భగవానుడిక్కడ సమస్త గ్రంథముల సారాంశమిదియేనని స్పష్టముగా చెప్పుచున్నాడు. ప్రతియొక్కరు దేవాదిదేవునిచే తెలుపబడిన ఈ విషయములను యథాతథముగా అంగీకరింపవలెను. ఈ విధముగా ఎవ్వరైనను బుద్ధిమంతులు, ఆధ్యాత్మికజ్ఞాన పరిపూర్ణులగుదురు. అనగా దేవాదిదేవుని ఈ తత్త్వమును ఎరుగుట చేతను, అతని దివ్యసేవ యందు నెలకొనుట చేతను ప్రతియొక్కరు భౌతిక ప్రకృతి త్రిగుణముల కాలుష్యముల నుండి విముక్తు లగుదురు. వాస్తవమునకు భక్తియుక్తసేవ యనునది ఆధ్యాత్మిక అవగాహనము నందలి ఒక విధానము. భక్తియుక్తసేవ ఉన్నచోట భౌతికకాలుష్యము నిలువజాలదు. ఆధ్యాత్మికత్వమును కూడియుండుట చేత భక్తియుక్త సేవ మరియు భగవానుడనెడి అంశముల నడుమ భేదముండదు. వాస్తవమునకు శుద్ధభక్తి శ్రీకృష్ణభగవానుని అంతరంగశక్తి ఆధ్వర్యముననే కొనసాగును. భగవానుడు సూర్యుడైనచో అజ్ఞానము అంధకారము వంటిది. సూర్యుడు ఉన్నచోట అంధకారమనెడి ప్రశ్నయే ఉదయించనట్లు, ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి చేయబడు భక్తియుక్త సేవ యున్నచోట అజ్ఞానమునకు తావే లేదు.

కనుకనే ప్రతియొక్కరు బుద్ధిమంతులు మరియు పవిత్రులగుటకు కృష్ణచైతన్యమును స్వీకరించి భక్తియుక్తసేవ యందు నెలకొనవలసియున్నది. శ్రీకృష్ణభగవానుని అవగాహన చేసికొని భక్తియుక్త సేవ యందు నెలకొననంత వరకు ఎవ్వరును సంపూర్ణజ్ఞానము కలవారు కాజాలరు. సామాన్య మానవుని దృష్టిలో వారు బుద్ధిమంతులైనను వాస్తవమునకు పూర్తి బుద్ధిమంతులు కాజాలరు.

అర్జునునికి వాడబడిన 'అనఘా' అను పదము ఇక్కడ మిక్కిలి ప్రధానమైనది. 'పాపరహితుడు' అను ఆ సంబోధనకు భావమేమనగా, సర్వపాపముల నుండి విడివడనిదే శ్రీకృష్ణుని అవగాహన చేసుకొనుట ఎవరికైనను అత్యంత కష్టమని భావము. అన్ని కాలుష్యముల నుండి సమస్త పాపకల్మషముల నుండి విముక్తుడైనపుడే మానవుడు శ్రీకృష్ణుని అవగాహన చేసికొనగలుగును. కాని భక్తియుక్తసేవ పవిత్రము మరియు

శక్తివంతమగుటచే దానియందు నెలకొనిన వారెవ్వరైనను సహజముగానే పాపరహితస్థితికి ఉద్ధరింపబడుదురు.

సంపూర్ణ కృష్ణచైతన్యము నందలి శుద్ధభక్తుల సాంగత్యమున భక్తియుక్త సేవ నొనరించునప్పుడు మానవుడు కొన్నింటిని సమూలముగా నశింపచేసుకొనవలెను. అట్లు నశింప చేసుకొనవలసిన వానిలో అత్యంత ముఖ్యమైనది హృదయ దౌర్బల్యము. అతడు దానిని అధిగమింపవలెను. భౌతిక ప్రకృతిపై అధికారము చెలాయింప వలెనను కోరిక చేతనే పతనము ఆరంభమగును. ఆ విధముగా మానవుడు పరమపురుషుని భక్తియుక్తసేవను విడుచును. మరొక హృదయ దౌర్బల్యమేమనగా, భౌతిక ప్రకృతిపై అధికారము వహింపవలెనను ప్రవృత్తిని పెంపొందించుకొనిన కొలది జీవుడు భౌతిక వస్తువుల యందును, భౌతిక వస్తు స్వామ్యము నందును ఆసక్తుడగును. భౌతిక జీవిత సమస్యలకు ఈ హృదయ దౌర్బల్యములే కారణము. జీవుడు ఈ హృదయ దౌర్బల్యముల నుండి బయటపడు విధానమును ఈ అధ్యాయము నందలి మొదటి ఐదు శ్లోకములు వర్ణించును. ఆరవ శ్లోకము నుండి తుదిశ్లోకము వరకును గల మిగిలిన భాగము 'పురుషోత్తమ యోగము'ను గూర్చి చర్చించును.

**శ్రీమద్భగవద్గీత యందలి 'పురుషోత్తమ యోగము' అను పంచదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

--------

# షోడశాధ్యాయము
# దైవాసుర స్వభావములు

**16.1 - 3**
**శ్రీభగవానువాచ**
**అభయం సత్త్వసంశుద్ధిర్ జ్ఞానయోగావ్యవస్థితి: ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥**

**అహింసా సత్యమక్రోధస్త్యాగ: శాన్తిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్యం మార్దవం హ్రీరచాపలమ్ ॥**

**తేజ: క్షమా ధృతి: శౌచమద్రోహో నాతిమానితా ।**
**భవన్తి సమ్పదం దైవీమభిజాతస్య భారత ॥**

**<u>అనువాదము</u>**

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : ఓ భరతవంశీయుడా! భయరాహిత్యము, జీవనస్థితి పవిత్రీకరణము, ఆధ్యాత్మికజ్ఞాన సముపార్జనము, దానగుణము, ఆత్మనిగ్రహము, యజ్ఞాచరణము, వేదాధ్యయనము, తపస్సు, సరళత్వము, అహింస, సత్యము, క్రోధరాహిత్యము, త్యాగము, శాంతి, ఇతరుల దోషముల నెన్నకుండుట, జీవులందరి యెడ దయ, లోభరాహిత్యము, మృదుత్వము, సిగ్గు, ధృఢనిశ్చయము, తేజస్సు, క్షమ, ధైర్యము, శుచిత్వము, అసూయారాహిత్యము, గౌరవవాంఛ లేకుండుట అను ఈ దైవగుణములు దైవీస్వభావము కలిగిన పురుషుల యందుండును.**

**<u>భాష్యము</u>**

పంచదశాధ్యాయపు ఆరంభమున ఈ భౌతికజగత్తు యొక్క అశ్వత్థవృక్షము వివరింపబడినది. ఆ వృక్షము నుండి వచ్చు అదనపు వ్రేళ్ళు శుభాశుభములుగా తెలియబడు జీవుల కర్మలతో పోల్చబడినవి. నవమాధ్యాయమున కూడ దైవీస్వభావము కలిగిన దేవతల గూర్చియు, అసుర స్వభావము కలిగిన అసురుల గూర్చియు వర్ణింపబడినది. ఇక ఇప్పుడు వైదికకర్మల ననుసరించి సాత్త్విక కర్మలు ముక్తి పథమున పురోగమించుటకు దోహదములుగా పరిగణింపబడును. అట్టి కర్మలు 'దైవీప్రకృతి' లేక దైవస్వభావమును కలిగినవని తెలియబడుచున్నవి. దైవీప్రకృతి యందు నెలకొనినవారు ముక్తిమార్గమున నిశ్చయముగా పురోగతిని సాధింపగలరు. అట్లుగాక రజస్తమోగుణము లందు వర్తించు వారికి ముక్తినొందు అవకాశమే లభింపదు. వారు ఈ భౌతిక ప్రపంచమున మానవులుగా లేక జంతుజాతులలో జన్మించుటయో లేక ఇంకను నీచమైన జన్మలకు పతనమగుటయో జరుగును. ఈ షోడశాధ్యాయమున భగవానుడు దైవీప్రకృతిని మరియు దానికి సంబంధించిన గుణములను, అట్లే అసురీప్రకృతిని దానికి

సంబంధించిన గుణములను వర్ణించుచున్నాడు. ఈ దైవాసుర గుణముల లాభనష్టములను కూడ భగవానుడు వివరించుచున్నాడు.

దైవీగుణములతో లేక దైవీప్రవృత్తులతో జన్మించినవానిని సూచించు 'అభిజాతస్య' అను పదము మిక్కిలి ప్రధానమైనది. ధార్మిక వాతావరణమున శిశువును ఉత్పాదించుట వైదిక ధర్మగ్రంథములలో గర్భాధాన సంస్కారముగా పేర్కొనబడినది. తల్లిదండ్రులు తమకు దైవీగుణములు గల శిశువు కావలెనని వాంఛించినచో మానవసంఘ జీవనమునకై ఉద్దేశింపబడిన పది సంస్కారములను తప్పక పాటింపవలెను. సత్సంతానార్థము కొరకు గల కామము శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించునని మనము ఇదివరకే భగవద్గీత (7.11) నుండి ఎరిగి యుంటిమి. అనగా సంభోగప్రక్రియ కృష్ణచైతన్యముతో కూడియున్నచో అది తప్పు కాదు. కనుక కృష్ణచైతన్యవంతులైన భక్తులు జంతువులైన శునకములు, మార్జాలముల వలె సంతానమును పొందక, సంతానము జన్మించిన పిదప కృష్ణచైతన్య వంతులగునట్లుగా తయారుచేయవలెను. కృష్ణచైతన్యము నందు నెలకొనిన తల్లిదండ్రులకు జన్మించు సంతానము యొక్క అదృష్టమిదియే.

సంఘము నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమములుగా విభజించు వర్ణాశ్రమ ధర్మవ్యవస్థ మానవులను జన్మను బట్టి విభజించుటకు ఉద్దేశింపబడలేదు. అట్టి వర్ణాశ్రమ విభజన జ్ఞానమునకు సంబంధించినది. సమాజమును శాంతిసౌభాగ్యములతో విలసిల్లునట్లుగా చేయుటయే దాని ప్రయోజనము. ఇక్కడ తెలుపబడిన గుణలక్షణములు, మానవుడు ఆధ్యాత్మిక అవగాహనము నందు ప్రగతి సాధించుటకును, భౌతిక జగత్తునుండి విముక్తి నొందుటకును ఉద్దేశింపబడిన దైవలక్షణములుగా వర్ణింపబడినవి.

వర్ణాశ్రమవ్యవస్థ యందు సన్న్యాసాశ్రమము నందున్న వ్యక్తి అన్ని వర్ణములకును, ఆశ్రమములకును అధిపతిగా లేదా ఆధ్యాత్మికాచార్యునిగా పరిగణింపబడును. సమాజము నందలి నాలుగు వర్ణముల వారికి అనగా క్షత్రియ, వైశ్య, శూద్రులకు బ్రాహ్మణుడు గురువుగా పరిగణింపబడును. వర్ణాశ్రమ వ్యవస్థ యందు అత్యున్నతుడైన సన్న్యాసి బ్రాహ్మణునికి కూడ ఆధ్యాత్మికాచార్యునిగా పరిగణింపబడును. అట్టి సన్యాసికి ఉండవలసిన మొట్టమొదటి అర్హత భయరాహిత్యము(అభయమ్). సన్న్యాసికి యైనవాడు ఎటువంటి సహాయము లేకుండ లేదా సహాయము గలదనెడి హామీ లేకుండ ఒంటరిగా జీవించవలసి వచ్చుటయే అందుకు కారణము. అతడు కేవలము దేవాదిదేవుని అనుగ్రహముపై ఆధారపడి జీవింపవలెను. ఎవరైనను : "బంధము లన్నింటిని త్రెంచుకొనినచో నన్నెవరు రక్షింతురు?" అని భావించినచో, అట్టి వారు సన్న్యాస జీవితమును స్వీకరింపరాదు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు పరమాత్మ రూపమున అందరి హృదయము లందు నెలకొని యున్నాడనియు, సర్వమును అతడు వీక్షించు చున్నాడనియు, ఎవరేది చేయదలచు చున్నారో సమస్తమును అతడు ఎరుగుననియు ప్రతియొక్కరు ఎరుగవలెను. శ్రీకృష్ణుడు పరమాత్మ రూపమున తనను శరణుపొందిన జీవిని తప్పక రక్షించునని ప్రతియొక్కరు దృఢమైన విశ్వాసమును కలిగియుండవలెను. "నేనెప్పుడును ఒంటరిగా నుండను. కీకారణ్యమున నేను వసించినను శ్రీకృష్ణుడు నాతో కూడియుండి నన్ను అన్నివిధముల రక్షించును" అని ప్రతి యొక్కరు భావింపవలెను. అట్టి విశ్వాసమే 'అభయమ్' లేక భయము లేకుండుట యనబడును. అట్టి భయరాహిత్యమను మానసికస్థితి యనునది సన్న్యాసాశ్రమము నందున్నవానికి అత్యంత అవసరము.

'సత్త్వసంశుద్ధి:' – పిమ్మట సన్న్యాసి తన జీవితమును పవిత్రము చేసుకొన వలెను. సన్న్యాసాశ్రమము నందు పాటింపవలసిన నియమ నిబంధన లనేకము గలవు. సన్న్యాసికి స్త్రీలతో ఎట్టి సన్నిహిత సంబంధమును కలిగి యుండరాదను నియమము అన్నింటిలోకి మిక్కిలి ప్రధానమైనది. ఏకాంత ప్రదేశమున స్త్రీతో సంభాషించుట అతనికి నిషేధింపబడినది. శ్రీ చైతన్య మహాప్రభువు ఆదర్శవంతుడైన సన్న్యాసి. అతడు జగన్నాథ పూరీ క్షేత్రమునందు నివసించుచున్నప్పుడు భక్తులైన స్త్రీలు ప్రణామము లర్పించుట కొరకు కూడ అతని సమీపమునకైనను వచ్చెడివారు కారు. దూరము నుండియే ప్రణామము లర్పింప వలెనని వారు ఆదేశింపబడెడివారు. ఇది స్త్రీజాతిపై అతనికి ద్వేషము కలదనుటకు చిహ్నము కాదు. సన్న్యాసియైన వాడు స్త్రీతో సన్నిహిత సంబంధమును కలిగి యుండకూడదనెడి నియమమును విధించుటయే దాని ఉద్దేశ్యము. మానవుడు తమ జీవితమును పవిత్రీకరించు కొనుటకు వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి తీరవలెను. స్త్రీలతో సన్నిహిత సంబంధములు మరియు ఇంద్రియతృప్తి కొరకై ధనమును కూడబెట్టుట వంటివి సన్న్యాసికి నిషేధములు. పైన తెలిపినట్లు, శ్రీ చైతన్య మహాప్రభువు ఆదర్శ సన్న్యాసి యైనందున అతడు స్త్రీల విషయమున కఠిన నియమములను పాటించెనని వారి జీవితము నుండి మనకు తెలియుచున్నది. మహాప్రభువు పతిత జీవులందరిని ఉద్ధరింప గల దేవాదిదేవుని పరమ ఔదార్య అవతారముగా పరిగణింప బడినను వారు సన్న్యాసాశ్రమమున స్త్రీసాంగత్యమునకు సంబంధించిన నియమ నిబంధనలను ఖచ్చితముగా పాటించిరి. మహాప్రభువు యొక్క అంతరంగిక సహచరులలో ఒకరైన ఛోటాహరిదాసు ఒకప్పుడు ఒకయువతి వంక మోహదృష్టితో చూచుటచే వారు వెంటనే అతనిని తన అంతరంగిక సహచరబృందము నుండి బహిష్కరించిరి. "సన్న్యాసి లేదా భౌతిక ప్రకృతి బంధముల నుండి విముక్తిని వాంఛించు వానికి, ఆధ్యాత్మిక ప్రవృత్తికి తననుద్ధరించుకొని భగవద్ధామమును చేరుటకు యత్నించు మానవునికి కాంతాకనకములపై దృష్టితగదు. వాటిని అనుభవించుటయే కాదు, అటువంటి దృష్టికూడ నిషేధింప బడినది. అట్టి భావన కలిగినవాడు ధర్మరహితమైనట్టి కోరికలకు బలి అగుటకు మునుపే ఆత్మహత్యను చేసికొనుట మేలు" అని ఆయన పలికిరి. ఇవియే జీవితమును పవిత్రీకరించుకొను విధానములు.

ఇక తదుపరి విషయము 'జ్ఞానయోగవ్యవస్థితి:' అనగా ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనము. ఆధ్యాత్మిక అభ్యుదయమునకు సంబంధించిన తమ నిజ జీవితమును విస్మరించి యుండెడి గృహస్థులకు మరియు ఇతరులకు జ్ఞానమును పంచుటకొరకే సన్న్యాసి జీవితము ఉద్దేశింపబడినది. వాస్తవమునకు సన్న్యాసి తన జీవనాధారము కొరకై ఇంటింటికి వెళ్ళి భిక్షాటనము చేయవలెను. దీని అర్థము అతడు భిక్షకుడని కాదు. ఆధ్యాత్మిక స్థితియందు నెలకొనిన వ్యక్తికి కావలసిన లక్షణములలో వినమ్రత అనునది కూడ ఒకటి. భిక్షనెపమున గృహస్థులను కలిసి వారియందలి కృష్ణచైతన్యమును జాగృతము చేయుటయే వారి ఉద్దేశ్యము కాని భిక్షను స్వీకరించుట కాదు. ఇదియే సన్న్యాసి ధర్మము. సన్న్యాసి నిజముగా ఆధ్యాత్మిక పురోగతిని సాధించినచో, ఆధ్యాత్మికాచార్యుని ఆజ్ఞను పొంది కృష్ణచైతన్యమును గూర్చి సర్వులకు అవగత మగునట్లు ప్రచారము చేయవలెను. కాని అతడు అట్లు అంతగా ఆధ్యాత్మిక పురోగతిని సాధించి యుండక పోయినచో సన్న్యాసాశ్రమమును స్వీకరింపరాదు. ఒకవేళ తగినంత జ్ఞానము లేకుండ మానవుడు సన్న్యాస జీవితమును అంగీకరించినచో, జ్ఞానసముపార్జన కొరకై అతడు ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచారుని నుండి శ్రవణము చేయుట యందు

పూర్తిగా నెలకొని యుండవలెను. సన్న్యాసి నిర్భయుడై సత్త్వసంశుద్ధి యందు (పవిత్రతను), జ్ఞానయోగము నందు స్థితుడై యుండవలెను.

ఇక తదుపరి అంశము 'దానము'. ఇది గృహస్థుల కొరకై ఉద్దేశింపబడినది. గృహస్థులు ధర్మమార్గమున జీవనాధారము కొరకై ధనమును సంపాదించుచు, వచ్చిన రాబడిలో సగము కృష్ణచైతన్యమును ప్రపంచమంతటా ప్రచారము చేయుటకు వినియోగింపవలెను. ఈ విధముగా అట్టి కార్యములందు నెలకొనిన సంఘములకు గృహస్థులు దానము చేయవలెను. దానమెప్పుడును సరియైన వానికే అనగా పాత్రునికే చేయవలెను. గీతయందు మున్ముందు వివరింపబడనట్లుగా, దానము సత్త్వరజోతమో గుణములకు సంబంధించి మూడు రకములుగా నుండును. సాత్త్విక దానమే ధర్మగ్రంథములందు ఉపదేశింపబడినది. రజోగుణ తమోగుణ దానములను అవి ఉపదేశించి యుండలేదు. అట్లు చేసిన దానములు కేవలము ధనవ్యయమగును. కనుకనే కృష్ణచైతన్యమును ప్రపంచమంతటను ప్రచారము చేయుట కొరకై దానము చేయబడవలెను. అదియే సాత్త్విక దానము.

ఇక 'దమము'(ఆత్మనిగ్రహము)నకు సంబంధించినంత వరకు అది అన్ని ఆశ్రమముల వారికి ఉద్దేశింపబడినను గృహస్థుల కొరకు ప్రత్యేకముగా ఉద్దేశింపబడినది. భార్యయున్నను గృహస్థుడు అనవసరముగ సంభోగము కొరకై ఇంద్రియములను వినియోగింపరాదు. దానిని కేవలము సంతానమును పొందుట కొరకై వినియోగింపవలెను. ఈ విషయమున గృహస్థులకు నియమ నిబంధన లనేకము గలవు. సంతానమును వాంఛింపనిచో గృహస్థుడు సంభోగ జీవితమును త్యజింపవలెను. నేటి ఆధునిక సమాజమున మానవుడు సంతానపు బాధ్యత నుండి విడివడుటకై గర్భనిరోధక విధానములతో గాని అంతకంటే అసహ్యకరమైన పద్ధతుల ద్వారా గాని సంభోగ సుఖమును అనుభవించుచున్నారు. ఇది ఆసురీ ప్రవృత్తికి సంబంధించినదే కాని దైవగుణములకు సంబంధించినది కాదు. గృహస్థుడైన వాడు ఆధ్యాత్మిక జీవితమున పురోగతి సాధింప దలచినచో సంభోగ జీవితమును నియంత్రింపవలెను. అతడు కృష్ణసేవా ప్రయోజనార్థము కానిచో సంతానమును అతడు పొందరాదు. కృష్ణచైతన్యము గల సంతానమును అతడు పొంద సమర్థుడైనచో మానవుడు వందలకొలది సంతానమును ఉత్పాదింప వచ్చును. కాని అట్టి సామర్థ్యము లేకుండ అతడు ఇంద్రియతృప్తి కొరకు మాత్రమే దాంపత్య జీవితమును అనుభవించరాదు.

గృహస్థులు ఆచరింపవలసిన మరొకకార్యము 'యజ్ఞము'. యజ్ఞాచరణముల కొరకై అధికమైన ధనము అవసరమగును. బ్రహ్మచర్యము, వానప్రస్థము, సన్న్యాసము వంటి ఆశ్రమముల వారి వద్ద ధనముండదు. వారు భిక్షాటనచే జీవింతురు. కనుకనే గృహస్థులకు వివిధములైన యజ్ఞములు నిర్దేశింపబడినవి. వైదిక గ్రంథము లందు చెప్పబడినట్లు 'అగ్నిహోత్రాది' వంటి అనేక యజ్ఞములను వారు నిర్వర్తింపవలెను. కాని నేటి ఆధునిక కాలమున అట్టి యజ్ఞములు మిక్కిలి వ్యయముతో కూడినవగుటచే ఏ గృహస్థులకైనను వానిని నిర్వహించుట సాధ్యము కాదు. కనుకనే ఈ యుగమునకు నిర్దేశింపబడిన 'సంకీర్తన యజ్ఞము' అత్యుత్తమమైన యజ్ఞమని తెలుపబడినది. "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని చేయబడు కృష్ణనామ సంకీర్తన యజ్ఞమనునది ధనవ్యయము లేని అత్యుత్తమ యజ్ఞము. కనుకనే ప్రతియొక్కరు కూడ ఈ యజ్ఞమును అవలంబించి లాభమును పొందవచ్చును.

కనుక దానము, దమము (ఇంద్రియ నిగ్రహము), యజ్ఞాచరణము (సంకీర్తన యజ్ఞము) అను ఈ మూడు అంశములు గృహస్థులకు ఉద్దేశింపబడినవి.

'స్వాధ్యాయము' లేక వేదాధ్యయనము బ్రహ్మచర్యాశ్రమమమునకు ఉద్దేశింప బడినది. బ్రహ్మచారులు స్త్రీలతో ఎట్టి సంపర్కమును కలిగియుండరాదు. వారు బ్రహ్మచర్య జీవితమును పాటించుచు ఆధ్యాత్మిక జ్ఞానసముపార్జన కొరకు తమ మనస్సును వేదాధ్యయనము నందు నెలకొల్పవలెను. అదియే 'స్వాధ్యాయః' అనబడును.

'తపస్సు' అనునది ప్రత్యేకముగా వానప్రస్థాశ్రమమునకు ఉద్దేశింపబడినది. ఎవ్వరును జీవితాంతము గృహస్థులుగా ఉండరాదు. వారు బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్న్యాసము అనెడి నాలుగు ఆశ్రమములు కలవని గుర్తుంచుకోవలెను. గృహస్థాశ్రమము పిమ్మట వానప్రస్థాశ్రమమును అతడు స్వీకరింపవలెను. మానవుడు వంద సంవత్సరములు జీవించినచో అందులో ఇరువదియైదు సంవత్సరములు బ్రహ్మచర్యము నందును, ఇరువదియైదు సంవత్సరములు గృహస్థ జీవితము నందును, ఇరువదియైదు సంవత్సరములు వానప్రస్థము నందును, మిగిలిన ఇరువదియైదు సంవత్సరములు సన్న్యాస జీవితము నందును గడుపవలెను. ఇవి వైదిక సంప్రదాయమునకు సంబంధించిన నియమ నిబంధనలు. కనుక గృహస్థజీవితమును విడిచి వానప్రస్థమును స్వీకరించువాడు దేహము, మనస్సు, జిహ్వాలకు సంబంధించిన నియమ నిబంధనలను అభ్యసింపవలెను. అదే 'తపస్య'. వర్ణాశ్రమ ధర్మములతో కూడిన సాంఘీక వ్యవస్థయంతయు 'తపస్సు' కొరకే ఉద్దేశింపబడినది. ఎందుకనగా 'తపస్సు' లేకుండ మానవుడు ముక్తిని సాధింపజాలడు. జీవితము నందు తపస్సు అవసరము లేదనియు, కేవలము ఊహాగానాలతోనే జీవితమును గడిపినను, అంతయు చక్కగా కొనసాగునని తెలిపెడి సిద్ధాంతము వైదిక గ్రంథములందు గాని, గీతయందు గాని ఉపదేశింపబడలేదు. అట్టి సిద్ధాంతములు కేవలము అధిక సంఖ్యలో అనుచరులను సంపాదింపగోరు కపట ఆధ్యాత్మికవాదుల చేతనే కల్పింప బడినవి. నియమ నిషేధము లుండినచో జనులు ఆకర్షింపబడరు. కనుకనే కేవలము మతము పేర ప్రదర్శనలకు అధిక సంఖ్యలో అనుచరులను కోరువారు, శిష్యుల జీవితములకు గాని, తమ జీవితములకు గాని నియమములను నిర్దేశింపరు. కాని అట్టి విధానము వేదసమ్మతము కాదు.

బ్రాహ్మణ లక్షణమైన 'ఆర్జవము'నకు సంబంధించినంత వరకు ఏదో ఒక ఆశ్రమమునకు చెందినవారికే కాకుండ బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములకు చెందిన ప్రతియొక్కరు ఈ నియమములను అనుసరింప వలెను. ప్రతియొక్కరును సరళమును, ఋజు స్వభావమును కలిగి యుండవలెను.

'అహింస' అనగా ఏ జీవుని అభ్యుదయ జీవితమును ఆటంకపరచకుండుట, దేహము చంపబడినను ఆత్మ నశింపనందున, జిహ్వాతృప్తి కొరకై జంతువులను వధించుట యందు ఎట్టి హాని లేదని ఎవ్వరును భావింపరాదు. ధాన్యములు, ఫలములు, పాలు సమృద్ధిగా లభించుచున్నను ప్రజలిప్పుడు మాంస భక్షణమునకు అలవాటు పడియున్నారు. వాస్తవమునకు జంతువులను చంపనవసరము ఏమాత్రము లేదు. ఇది అందరికొరకై విధింపబడిన నియమము. మరొక గత్యంతరము లేక జంతువును చంపవలసి వచ్చినను దానిని యజ్ఞము నందు అర్పింపవలెను. ఏమైనను, మానవులకు తగినంత ఆహారము లభించు చున్నప్పుడు, ఆధ్యాత్మికానుభూతి మార్గము నందు

పురోగతి సాధింపగోరువారు జంతువుల పట్ల ఎట్టి హానిని తలపెట్టరాదు. పైన తెలుపబడినట్లు, జీవి పరిణామ అభ్యుదయమునకు ఆటంకము కలిగింప రాడనుటయే 'అహింస' యొక్క నిజమైన అర్థము. పరిణామ సిద్ధాంతము ననుసరించి జంతువులు కూడా ఒకజాతికి చెందిన జంతు జీవితము నుండి మరొక జీవితమునకు మార్పుచెందుచు మానవ జన్మను పొందుటకై అభ్యుదయ పథమున కొనసాగుచుండును. ఒకవేళ అవి చంపబడినచో వాని అభ్యుదయమునకు ఆటంకము కలుగును. జీవుడు జంతు దేహములో నిర్ణయింప బడినంత కాలము జీవింపకనే చంపబడినచో తిరిగి ఆ నిర్ణీత సమయమును పూర్తిచేయుటకు అదే జంతు జన్మమున ప్రవేశింప వలసి వచ్చును. అటుపిమ్మటనే జీవుడు ఉన్నతమైన మరొక జాతిదేహమును పొంద గలడు. కనుకనే మానవుడు తమ జిహ్వాతృప్తి కొరకై వాటి అభ్యుదయమునకు ఆటంకము కలిగింపరాదు. ఇదియే 'అహింస' యనబడును.

'సత్య'మనగా స్వలాభము కొరకై ఎవ్వరును సత్యమును వక్రింపకుండుట. వైదిక గ్రంథము లందు కొన్ని కఠినమైన నియమములున్నను వాటి అర్థమును, ప్రయోజనమును (భావమును) ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని సహాయముతో అభ్యసింపవలెను. అదియే వేదముల నెరుగవలసిన విధానము. 'శృతి' యనగా ప్రామాణికాచార్యుల నుండి శ్రవణము చేయుట. వేదము లందలి విషయమునకు ఎవ్వరును స్వలాభము కొరకై తమ ఇచ్చానుసారము వివరణను కల్పింపరాదు. భగవద్గీత యందలి మూలశ్లోకములకు కూడ విరుద్ధ అర్థము చెప్పు వ్యాఖ్యానము లనేకము గలవు. కనుక ఎవరైనను పదము యొక్క యథార్థ భావమునే ప్రకటింప వలెను. అంతేకాకుండ అతడు ఆ అర్థమును వారు ప్రామాణికాచార్యుని నుండి అభ్యసించి యుండవలెను.

'అక్రోధము' అనగా క్రోధమును నిగ్రహించుట. క్రోధము కలిగేలా ప్రేరేపింపబడినను మానవుడు సహనశీలియై యుండవలెను. ఎందుకనగా ఒకసారి క్రోధమునకు గురియైనచో మానవుని దేహమంతయు మలినమగును. కోపము రజోగుణము మరియు కామముల ఫలితమైనందున, ఆధ్యాత్మిక స్థితి యందు నెలకొని యుండువాడు క్రోధము నుండి తననుతాను నిగ్రహించుకోవలెను. 'అపైశునమ్' అనగా మానవుడు ఇతరుల దోషముల నెన్నకుండుట లేక అనవసరముగా ఇతరులను సరిదిద్దుటకు ప్రయత్నింపకుండుట. ఒక దొంగను దొంగ యని పిలుచుట దోషము నేన్నుట కాదు. కాని సత్యవంతుని దొంగయని పిలుచుట ఆధ్యాత్మికముగా పురోగమించువానికి అపరాధము కాగలదు. 'హ్రీః' అనగా మానవుడు గొప్ప వినమ్రతను కలిగియుండుట. అంతేకాకుండ, అతడు హేయమైన ఎట్టి కార్యములను చేయరాదనియు దాని భావము. 'అచాపలము' (ధృఢ నిశ్చయము) అనగా మానవుడు ఏ ప్రయత్నమందైనను కలత నొందకుండుట లేక నిరాశ చెందకుండుట. ఏదైన ప్రయత్నము నందు అపజయము కలిగినను మానవుడు దానికొరకై చింతింపరాదు. సహనము మరియు ధృఢనిశ్చయమును కూడి అతడు పురోభివృద్ధిని సాధింపవలెను.

ఇక్కడ ప్రయోగింపబడిన 'తేజస్సు' అను పదము క్షత్రియునకు ఉద్దేశింపబడినది. క్షత్రియులెప్పుడును బలవంతులై బలహీనులను రక్షించుట కొరకై సమర్థులై యుండవలెను. వారు తమనుతాము అహింసావాదులుగా ప్రదర్శించు కొనరాదు. హింస అవసరమైనప్పుడు వారు దానిని ప్రదర్శింపవలెను. కాని వారు శత్రువును అణచగలిగినను కొన్ని సమయములందు క్షమాగుణమును కూడ ప్రదర్శింప వచ్చును. శత్రువుల స్వల్పదోషములను అతడు క్షమింపవలెను.

'శౌచమ్' అనగా మనస్సు మరియు దేహములకే కాకుండ వ్యవహార కార్యకలాపము లందు కూడ శుచిత్వమును కలిగియుండుట. ముఖ్యముగా ఇది వైశ్యులకు సంబంధించినది. వారు ఎన్నడును నల్లబజారులో వ్యాపారమును చేయరాదు. 'నాతిమానితా' అనగా గౌరవమును ఆశింపకుండుట. ఇది శ్రామిక తరగతికి చెందిన శూద్రులకు సంబంధించినది. వేదముల ననుసరించి శూద్రులు నాలుగు వర్ణములకు సంబంధించిన వారిలో చివరి వారుగ పరిగణింప బడుదురు. కనుక వారు అనవసరమైన గౌరవమును పొందినప్పుడు గర్వపడక తమ స్థితి యందు తాముండవలెను. సంఘవ్యవస్థను సక్రమముగా కొనసాగించుటకై ఉన్నత వర్ణముల వారి పట్ల గౌరవమర్యాదలను చూపుట శూద్రుల ధర్మము.

పైన పేర్కొనబడిన ఈ ఇరువదియారు లక్షణములు దైవగుణ లక్షణములు. ఇది వర్ణాశ్రమ ధర్మము నందలి భిన్నస్థితుల ననుసరించి అభ్యసింపవలెను. సారాంశమేమనగా, భౌతిక పరిస్థితులు దుర్భారముగా నున్నను, అన్ని వర్ణములకు చెందిన మానవులు అభ్యాసము ద్వారా ఈ గుణములను పెంపొందించు కొనినచో ఆత్మసాక్షాత్కారమనెడి అత్యున్నత స్థితికి క్రమముగా చేరగలుగుట సాధ్యపడును.

## 16.4

**దమ్భో దర్పో భిమానశ్చ క్రోధ: పారుష్యమేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సమ్పదమాసురీమ్ ॥**

## అనువాదము

**ఓ పార్థా! గర్వము, పొగరు, అహంకారము, కోపము, పరుషత్వము, అజ్ఞానము లనెడి లక్షణములు అసుర స్వభావము కలిగినవారికి చెందినవి.**

## భాష్యము

ఈ శ్లోకమున నరకమునకు రాచబాట వివరింపబడినది. అసుర స్వభావము గలవారు తాము విధినియమముల ననుసరింపక పోయినను ధర్మాచరణమును, ఆధ్యాత్మిక జ్ఞానపురోభివృద్ధిని కలిగియున్నట్లు ప్రదర్శన జ్ఞానపురోభివృద్ధిని కలిగియున్నట్లు ప్రదర్శన కావింతురు. వారెల్లప్పుడును ఏదియోఒక లేదా అధిక ధనమును కలిగి యున్నందున పొగరును, గర్వమును కలిగియుందురు. వాస్తవమునకు వారు ఇతరులచే పూజింపబడవలెననియే భావింతురు. గౌరవింపబడుటకు అర్హులు కాకున్నను ఇతరులచే గౌరవము నొందగోరుదురు. స్వల్ప విషయములకు కూడ వారు మిక్కిలి క్రోధమునకు గురై వినయముతో కాకుండ కఠినముగా మాట్లాడుదురు.ఏది చేయదగినదో ఏది చేయరానిదో వారెరుగజాలరు. ప్రతికార్యమును తమ ఇచ్చానుసారము చేయుటయే తప్ప ఎవ్వరి ప్రామాణికత్వమును స్వీకరింపరు. ఈ ఆసురీ లక్షణములను వారు తల్లిగర్భము నందున్నట్టి సమయము నుండియే గ్రహించి, పెరిగినకొలది వారు ఈ అశుభగుణము లన్నింటిని ప్రదర్శింప నారంభింతురు.

16.5
**దైవీ సమ్పద్విమోక్షాయ నిబన్ధాయాసురీ మతా ।**
**మా శుచ: సమ్పదం దైవీమభిజాతో సి పాణ్డవ ॥**

## అనువాదము

**దైవీగుణములు మోక్షమునకు అనుకూలములు. అసుర గుణములు బంధములను కలిగించుచున్నవి. ఓ పాండుపుత్రా! నీవు దైవీగుణములతో జన్మించి యున్నందున శోకింపకుము.**

## భాష్యము

అర్జునుడు అసురగుణములతో కూడి జన్మింపలేదని చెబుతూ శ్రీకృష్ణభగవానుడు అతనిని ప్రోత్సహించును. అర్జునుడు యుద్ధము వలన కలిగే మంచిచెడులను గూర్చి ఆలోచించు చుండుటచే అతడు యుద్ధము నందు పాల్గొనుట ఎన్నటికిని అసురీ స్వభావము కాబోదు. అతడు భీష్ముడు, ద్రోణుడు వంటి గౌరవనీయులైన వ్యక్తులను వధింపవలెనా లేదా అని ఆలోచించుటను బట్టి అతడు క్రోధము, అహంకారము, కఠినత్వముల ప్రభావమునకు లోనుకాలేదని తెలియుచున్నది. కనుకనే అర్జునుడు అసురీ గుణములకు చెందిన వాడు కాడు. వాస్తవమునకు యోధుడైన క్షత్రియునకు శత్రువుపై బాణములు విసరుట దైవీగుణముగనే పరిగణింపబడును. అట్టి ధర్మము నుండి విరమించుటయే అసుర స్వభావము కాగలదు. కనుకనే అర్జునుని శోకమునకు ఎట్టి కారణము లేదు. జీవితము నందలి వివిధ వర్ణాశ్రమ నియమములను యథావిధిగా పాటించు వాడెవడైనను దైవీస్థితి యందే ప్రతిష్ఠితుడగును.

16.6
**ద్వౌ భూతసర్గౌ లోకే స్మిన్ దైవ ఆసుర ఏవ చ ।**
**దైవో విస్తరశ: ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥**

## అనువాదము

**ఓ పృథాకుమారా! ఈ లోకమునందు దైవాసురులనెడి రెండురకముల జీవులు కలరు. దైవీగుణములను ఇదివరకే నేను వివరముగా తెలిపియుంటిని. ఇక అసుర స్వభావము గలవారి గుణములను నా నుండి వినుము.**

## భాష్యము

నిశ్చయముగా అర్జునుడు దైవీగుణములతో జన్మించి యుండెనని అతనికి తెలిపి శ్రీకృష్ణభగవానుడు ఇప్పుడు అసురగుణములను వివరించు చున్నాడు. ఈ జగత్తు నందు బద్ధజీవులు రెండు విధములుగా విభజింపబడి యుందురు. దైవీగుణములతో జన్మించినవారు నియమబద్ధమైన జీవితమును గడుపుదురు. వారు శాస్త్రవిధులను మరియు ప్రామాణికులైన వారి చేత చెప్పబడిన ఆదేశముల ననుసరింతురు. ఎవరైనను ఆచార్యుల చేత ఆదేశింపబడినట్లుగా తమ ధర్మములను నిర్వహింపవలెను. ఇట్టి స్వభావమే దైవీస్వభావ మనబడును. శాస్త్రనియమములను పాటింపక కేవలము తమ ఇచ్చానుసారముగా వర్తించువాడు అసుర స్వభావము గలవారని చెప్పబడును. శాస్త్రములందు చెప్పబడిన విధివిధానముల ననుసరించుట తప్ప దైవీసంపదకు

మరో[ప్రమాణము లేదు. దేవతలు, దానవులు ఇరువురును [ప్రజాపతి నుండియే జన్మించిరని వైదిక [గ్రంథము లందు చెప్పబడినది. కాని వారిరువురి నడుమ భేదమేమనగా ఒకరకము వారు వేదవిధుల ననుసరించగా, రెండవ రకము వారు వానిని అనుసరించరు.

**16.7**

**[ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురా: ।**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥**

## అనువాదము

**అసురీ గుణములు గలవారు చేయవలసినదేదియో, చేయరానిదేదియో ఎరుగకుందురు. శుచిత్వము గాని, సదాచారము గాని, సత్యము గాని వారి యందు గోచరింపదు.**

## భాష్యము

[ప్రతి నాగరిక మానవసమాజము నందు ఆది నుండియు అనుసరించ బడెడి కొన్ని శా[స్త్రనియమ నిబంధనలు ఉండును. మిక్కిలి నాగరికులని [ప్రసిద్ధి పొందినట్టి ఆర్యులు వైదిక నాగరికతను అనుసరించిరి. వైదిక [గ్రంథము లందు చెప్పబడిన విధుల ననుసరింపనివారే అసుర స్వభావులుగా పరిగణింపబడుదురు. కనుకనే అసురస్వభావము గలవారు శా[స్త్రనియమముల నెరుగుట గాని, వాని ననుసరింప వలెనను ఉద్దేశమును కలిగియుండుట గాని జరగదని ఇక్కడ చెప్పబడినది. అట్టివారిలో అధికశాతము ఆ నియమములను ఎరుగకుందురు. కొంతమంది ఆ నియమముల నెరిగినను వానిని అనుసరింప వలెనను ఉద్దేశము వారికి ఉండదు. వైదిక నిర్దేశములందు విశ్వాసము కాని, వాని ననుసరించి నియమానుసారము వర్తింపవలెననెడి సంకల్పము కాని అసుర స్వభావము గల వారికి ఉండదు. వారు అంతర్యము నందు గాని బాహ్యము నందు గాని శుచిని కలిగియుండరు. [ప్రతియొక్కరు స్నానము, దంతధావనము, క్షౌరము, శు[భ్రమైన వ[స్త్రములను ధరించుట వంటి కార్యముల ద్వారా తమ శరీరమును శుచిగా ఉంచుకొనుట యందు [శద్ధ వహింపవలెను. అంతరంగిక శుచిత్వము కొరకు ఎవరైనను, “హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే” అని ఎల్లప్పుడు భగవన్నామములను జపింపవలెను. ఆసురీ స్వభావులు ఈ బాహ్యమైనట్టి, అంతరమైనట్టి శుచిత్వమునకు సంబంధించిన నియమములను అంగీకరించుట గాని వానిని అనుసరించుట గాని చేయరు.

సదాచారమునకు సంబంధించినంత వరకు మానవజాతికి మార్గదర్శకములైన నియమ నిబంధనలు శా[స్త్రములందు అనేకము గలవు. ముఖ్యముగా ‘మను సంహిత’ మానవులకు శాసన [గ్రంథము వంటిది. నేటికిని హిందువులు ‘మను సంహిత’ నే అనుసరింతురు. వారసత్వపు నియమములు మరియు ఇతర న్యాయశా[స్త్రమునకు సంబంధించిన విషయములు ఈ [గ్రంథము నుండియే [గ్రహింపబడినవి. [స్త్రీలకు స్వాతంత్ర్యమును ఇవ్వరాదని అట్టి ‘మను సంహిత’ యందు స్పష్టముగా చెప్పబడినది. అనగా వారిని బానిసల వలె ఉంచవలెనని అర్థము కాదు. వారు పిల్లల వంటివారు. వారిని అత్యంత జా[గత్తగా కాపాడు కోవలెనని అర్థము. సాధారణముగా పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వబడదు. అనగా వారు బానిసలుగా ఉంచబడుదురని అర్థము కాదు. కాని ఇప్పుడు

అసురులు అట్టి నియమములను త్రోసిపుచ్చి, పురుషులకు వలెనే స్త్రీలకు కూడ తగినంత స్వాతంత్ర్యమును ఇవ్వవలెనని భావించుచున్నారు. అయినను అట్టి భావన ప్రపంచపు సాంఘీక స్థితిని ఏ మాత్రము మెరుగు పరచ లేకున్నది. వాస్తవమునకు, స్త్రీకి జీవితము నందలి ప్రతిదశ యందును రక్షణ కల్పింపవలెను. బాల్యమున తండ్రిచే, యవ్వనమున భర్తచే, వృద్ధాప్యమున పుత్రులచే రక్షణ కల్పింపవలెను.'మను సంహిత' ననుసరించి ఇదియే సరియైన సాంఘీక వర్తనము. కాని ఆధునిక విద్యావిధానము స్త్రీ జీవితమున గర్వముతో కూడిన భావమును కృత్రిమముగా కల్పించినది. కనుకనే ప్రస్తుతకాలమున మానవ సమాజము నందు వివాహము లేక దాంపత్యజీవిత మనునది కేవలము కల్పనగా మాత్రమే మిగులుచున్నది. అంతేకాకుండ, నేటికాలమున స్త్రీల నైతికవర్తనము కూడా సరిగా లేదు. కనుకనే అసురీ స్వభావము గలవారు సంఘమునకు శ్రేయోదాయకమగు ఏ ఉపదేశమును అంగీకరింపరు. మహర్షుల అనుభవములను మరియు వారిచే విధింపబడిన నియమ నిబంధనల ననుసరింపక పోవుటచేతనే అసురస్వభావము కలిగిన ప్రజల సాంఘీక స్థితి మిక్కిలి దుఃఖపూరితమై యున్నది.

## 16.8

**అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।**
**అపరాస్పరసమ్భూతం కిమన్యత్ కామహైతుకమ్ ॥**

## అనువాదము

**ఈ జగత్తు అసత్యమనియు, ఆధారము లేనిదనియు, నియామకుడెవ్వడును దీనికి లేదనియు సంగమాభిలాష చేతనే ఉత్పాదితమైనదని దీనికి కామము తప్ప మరొక కారణము లేదనియు వారు పలుకుదురు.**

## భాష్యము

అసురస్వభావులు ఈ జగత్తు మిథ్య యని నిర్ణయింతురు. దీనికి కార్యకారణములు గాని, నియామకుడు గాని, ప్రయోజనము గాని లేవనియు సర్వము మిథ్యయనియు వారు భావింతురు. ఈ జగత్తు భౌతిక క్రియాప్రతిక్రియలచే యాదృచ్ఛికముగా ఏర్పడినదని వారు చెప్పుదురు. ఈ జగత్తు భగవానునిచే ఒక ప్రత్యేక ప్రయోజనార్థమై సృష్టింపబడినదని వారు భావింపజాలరు. ఈ జగత్తు దానంతట అదే వచ్చినదనియు దాని వెనుక భగవానుడు గలడని విశ్వసించ నవసరము లేదనెడిది వారి సొంత సిద్ధాంతము. వారు ఆధ్యాత్మిక పదార్థమునకు మరియు భౌతిక పదార్థమునకు నడుమగల భేదమును గుర్తింపజాలరు. అట్లే, వారు పరమాత్మను కూడ అంగీకరింపరు. వారి ఉద్దేశ్యమున సర్వము భౌతికమే. ప్రపంచమంతయు అజ్ఞానపూరిత మైనదనియు, సర్వము శూన్యమేననియు మరియు వ్యక్తమగు దానికంతటికిని మన అజ్ఞానపు దృష్టియే కారణమనియు వారు భావింతురు. వాస్తవమునకు అస్తిత్వము లేనివాటి నెన్నింటినో మనము స్వప్నము నందు కల్పించుకొనినట్లుగా, వైవిధ్య వ్యక్తీకరణ మంతయు అజ్ఞాన ప్రదర్శనయేనని వారు నిశ్చయముగా పలుకుదురు. కాని మేల్కొనినంతనే అది అంతయు స్వప్నమేనని మనము గుర్తింతుము. కాని వాస్తవమునకు అసుర స్వభావులు జీవితమును స్వప్నమని భావించినను, ఈ స్వప్నమును అనుభవించుటలో అతిప్రవీణులై యుందురు. కనుక జ్ఞానమును సంపాదించుటకు బదులు వారు తమ స్వప్న లోకములందే మరింతగా బంధింప బడుచుందురు. స్త్రీపురుషుల సంగమమునకు ఫలితముగా శిశువు జన్మించినట్లే, ఈ జగత్తు కూడా ఎట్టి ఆత్మ

లేకుండగనే ఏర్పడుచున్నదని వారు చెప్పుదురు. భౌతిక పదార్థముల కలయిక చేతనే జీవులు సృష్టింపబడుచున్నారనియు మరియు ఇక్కడ ఆత్మ యనెడి ప్రశ్నయే ఉదయించదనియు వారు భావింతురు. అనేకమైన జీవులు స్వేదము నుండి, మృతశరీరము నుండి కారణము లేకుండ పుట్టునట్లు, జగత్తంతయు భౌతిక మూలకముల కలయికచే ఏర్పడినదనియు, భౌతిక ప్రకృతియే సృష్టికి కారణమనియు, అంతకుమించి మరే ఇతర కారణమేదియు లేదనియు వారు పలుకుదురు. "మయాధ్యక్షేణ ప్రకృతి: సూయతే సచరాచారమ్"-"నా అధ్యక్షతనే సమస్త జగత్తు వర్తించుచున్నది" అని భగవద్గీత (9.10) యందలి శ్రీకృష్ణభగవానుని పలుకులను వారు విశ్వసింపరు. ఈ జగత్తు సృష్టికి సంబంధించిన పరిపూర్ణ జ్ఞానము అసురులలో ఉండదు. వారిలో ప్రతియొక్కరు దాని విషయమున ఏదోఒక ప్రత్యేక సిద్ధాంతమును కలిగియుందురు. వారు శాస్త్రనిర్దేశములను యథార్థముగను మరియు ప్రామాణికముగను అవగాహన చేసికొనవలెనని భావింపనందున, శాస్త్రముల యొక్క అన్ని వ్యాఖ్యానములు కూడ సమానమైనవే మరియు సరియైనవేనని వారు భావింతురు.

## 16.9

**ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానో ల్పబుద్ధయ: ।**
**ప్రభవన్త్యుగ్రకర్మాణ: క్షయాయ జగతో హితా: ॥**

### అనువాదము

**నష్టాత్ములును, అల్పబుద్ధులును అగు అసురస్వభావము గలవారు ఇట్టి అభిప్రాయములనే అనుసరించుచు ఆహితములును, జగద్వినాశకరములును అగు ఉగ్రకర్మలలో నియుక్తులగుదురు.**

### భాష్యము

అసురస్వభావము గలవారు ప్రపంచ వినాశనమునకు దారిచూపు కర్మల యందే నెలకొనియుందురు. అట్టివారిని భగవానుడు ఇక్కడ అల్పబుద్ధులని చెప్పుచున్నాడు. భగవద్భావన లేని భౌతికవాదులు తాము పురోభివృద్ధిని సాధించు చున్నట్లుగా భావింతురు. కాని భగవద్గీత ననుసరించి వారు జ్ఞానములేని అల్పబుద్ధులు. వారు ఈ భౌతిక జగత్తునందు సాధ్యమైనంత అధికముగా సుఖము ననుభవించుటకు యత్నించుచు, ఇంద్రియతృప్తికి ఏదో ఒక క్రొత్తదానిని కనిపెట్టుట యందు వారెల్లప్పుడు నిమగ్నులై యుందురు. అట్టి భౌతిక పరిశోధనల ఫలితములు మానవ నాగరికత పురోభివృద్ధిగా పరిగణింపబడినను, ఫలితముగా జనులు మరింతగా జంతువుల పట్లను, ఇతర మానవుల పట్లను హింసాప్రవృత్తిని వృద్ధి చేసికొని క్రూరులుగా తయారగుచున్నారు. ఇతర జీవుల పట్ల ఎట్లు వర్తింపవలెనో వారెరుగరు. అట్టి అసురజనుల యందు జంతుహింస మిక్కిలి ధృఢముగా నుండును.వారు చివరికి తమ పరిశోధనల ద్వారా సర్వులకు వినాశమును కలిగించు దేనినో సృష్టించుటకు లేదా కనుగొనుటకు యత్నింతురు. కనుకనే వారు ప్రపంచమునకు శత్రువులుగా పరిగణింపబడుదురు. పరోక్షముగా ఈ శ్లోకము ఇప్పుడు ప్రపంచమంతయు గర్వపడుచున్న అణ్వాయుధ సృష్టిని సూచించుచున్నది. ఏ క్షణమందైనను యుద్ధము ఆరంభమవ్వగానే ఈ అణ్వాయుధములు గొప్ప విధ్వంసమును సృష్టింపవచ్చును. అట్టి వస్తువులు ప్రపంచ వినాశనము కొరకే సృష్టింప బడునని ఇక్కడ సూచింపబడినది. భగవద్భావన లేనట్టి నాస్తికత్వము చేతనే ఇట్టి మానవ సమాజమున అట్టి

మారణాయుధములు కనుగొనబడుచున్నవి. అవి ఎన్నడును ప్రపంచ శాంతిసౌభాగ్యముల కొరకై ఉద్దేశింపబడినవి కావు.

**16.10**
**కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితా: ।**
**మోహాద్ గృహీత్వాసద్గ్రాహాన్ ప్రవర్తన్తే ఽశుచివ్రతా: ॥**

**అనువాదము**

**తృప్తినొందింపరాని కామము నాశ్రయించి గర్వముతోడను, దురహంకారము తోడను, మదముతోడను కూడినవారై భ్రాంతి నొందినటువంటి అసుర స్వభావులు అశాశ్వతములైన విషయముల యందు ఆకర్షితులై సదా అపవిత్ర కార్యములందు వర్తించుచుందురు.**

**భాష్యము**

ఆసుర స్వభావమును గూర్చి ఇక్కడ వర్ణింపబడినది. వారి కామవాంఛకు తృప్తి యనునది ఉండదు. వారు తృప్తినెరుగని భౌతిక భోగానుభవ కోరికలను ఎల్లప్పుడును వృద్ధిచేసుకొనుచునే యుందురు. అశాశ్వతములైన వస్తువులను అంగీకరించుటయే వారెల్లప్పుడు దుఖములందు పూర్తిగా మునిగియున్నను, మాయ కారణమున వారు అట్టి కార్యములందే ఇంకను నిమగ్నులై యుందురు. జ్ఞాన హీనులగుటచే తాము తప్పుదారిన వెడుచున్నామని వారెరుగరు. అశాశ్వతములైన విషయములను అంగీకరించుచు అట్టి వారు తమకుతామే సొంత భగవానుని మరియు మంత్రములను సృష్టించుకొని తదనుగుణముగా జపకీర్తనములను గావింతురు. తత్ఫలితముగా వారు సంభోగసుఖము మరియు ధనమును కూడబెట్టుటమను విషయముల పట్ల అధికముగా ఆకర్షింపబడుచుందురు. ఈ సందర్భమున 'అశుచివ్రతా:' అను పదము మిక్కిలి ముఖ్యమైనది. అనగా అపవిత్రములైన వ్రతములు కలవారు మగువ, మదిర, జూదము, మాంస భక్షణము వంటి (అశుచి) అపవిత్రమైన అలవాట్లచే పూర్తిగా ఆకర్షింపబడుదురు. గర్వము చేతను దురభిమానము చేతను ప్రేరేపింపబడి వేదవిధులచే అంగీకరింప బడని కొన్ని మత సిద్ధాంతములను సృష్టించు కొనుచుందురు. అసుర స్వభావము గల అట్టి వారు ప్రపంచము నందు మిక్కిలి అధములైనను, జనులు వారికి కృత్రిమముగా మిథ్యాగౌరవమును కల్పింతురు. అసుర స్వభావులు నరకమునకు పతనమగు చున్నప్పటికిని తమనుతాము మిక్కిలి పురోభివృద్ధిని సాధించుచున్నట్టి వారిగనే భావింతురు.

**16.11 - 12**

**చిన్తామపరిమేయాం చ ప్రలయాన్తాముపాశ్రితా: ।**
**కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితా: ॥**

**ఆశాపాశశతైర్బద్ధా: కామక్రోధపరాయణా: ।**
**ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్ ॥**

**అనువాదము**

**ఇంద్రియతృప్తియే మానవుల ముఖ్యావసరమని వారు విశ్వసింతురు. ఈ విధముగా జీవితాంతము వరకును వారి దుఃఖము అపరిమితముగా నుండును. వేలాది ఆశాపాశములచే బద్ధులై, కామక్రోధములందు నిమగ్నులై ఇంద్రియ భోగము కొరకు వారు అధర్మమార్గము ద్వారా ధనము నార్జింతురు.**

**భాష్యము**

అసుర స్వభావులు ఇంద్రియభోగమునే జీవిత లక్ష్యమని మరణించు వరకు భావించుచుందురు. మరణానంతరము మరొక జన్మము కలదని గాని, కర్మానుసారము జీవుడు వివిధ దేహములను పొందవలసి వచ్చునని గాని వారు విశ్వసింపరు. వారి జీవిత ప్రణాళిక లేప్పటికిని పూర్తికాని ఒక ప్రణాళిక పిదప మరొక ప్రణాళికను తయారు చేయుచునేయుందురు. అట్టి అసుర స్వభావము కలిగిన ఒకవ్యక్తిని గూర్చి మాకు ప్రత్యక్షానుభవము కలదు. అతడు తన ప్రణాళిక లింకను పూర్తికానందున మరణ సమయమున కూడ తన జీవితమును మరొక నాలుగేండ్లు పొడిగింపవలెనని వైద్యుని ప్రార్థించెను. వైద్యుడు తమ జీవితమును క్షణకాలమైనను పొడిగింపజాలడని అట్టి మూర్ఖులెరుగరు. మరణము సమీపించినప్పుడు మానవుని కోరికలను పట్టించుకొనుట జరుగదు. మానవుడు అనుభవించుటకు నిర్ణయింపబడిన ఆయువు కంటె అధికముగా క్షణకాలము కూడ ప్రకృతి నియమములు అతనికి గడువీయవు.

శ్రీకృష్ణభగవానుని యందు గాని, హృదయస్థుడైన పరమాత్ముని యందు గాని విశ్వాసము లేనటువంటి అసుర స్వభావము గల మానవుడు కేవలము ఇంద్రియతృప్తి కొరకై అన్నిరకములైన పాపకార్యము లొనరించు చుండును. తన హృదయము నందే ఒకసాక్షి నెలకొని యుండునని అతడు ఎరుగజాలడు. సాక్షియైన పరమాత్ముడు జీవాత్మ కర్మలను వీక్షించుచునే యుండును. ఉపనిషత్తుల యందు చెప్పబడినట్లు, ఒకే వృక్షముపై గల రెండు పక్షులలో ఒకటి పనిచేయుచు సుఖదుఃఖములనెడి వృక్షఫలముల ననుభవించు చుండును. రెండవది సాక్షిగా చూచుచుండును. కాని అసురస్వభావము కలవానికి వైదిక గ్రంథజ్ఞానము గాని, వానియందు విశ్వాసము గాని యుండదు. కనుకనే ఫలితములను లెక్కచేయక ఇంద్రియ భోగము కొరకై అతడు స్వేచ్ఛగా దేనినైనను చేయుచుండును.

**16.13 - 15**

**ఇదమద్య మయా లబ్ధమిమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥**

**అసౌ మయా హత: శత్రుర్హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరో హమహం భోగి సిద్ధో హం బలవాన్ సుఖీ ॥**

**ఆఢ్యో భిజనవానస్మి కో న్యో స్తి సదృశో మయా ।**
**యక్ష్యేదాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితా: ॥**

**అనువాదము**

**ఆసురీ స్వభావుడగు మానవుడిట్లు భావించును : "ఇప్పుడు నా వద్ద ఇంత ధనము కలదు. నా ప్రణాళికలచే నేను మరింత ధనమును సంపాదింతును. ఇదియంతయు నాది. భవిష్యత్తులో ఇది మరింత అధికముగా వృద్ధినొందగలదు. అతడు నా శత్రువు. అతనిని నేను వధించితిని. నా ఇతర శత్రువులు కూడా వధింపబడుదురు. నేనే సర్వమునకు ప్రభువును. నేనే భోక్తను. నేను సంపూర్ణుడను, శక్తిమంతుడను మరియు సౌఖ్యవంతుడను. భాగ్యవంతులైన బంధువులతో కూడియుండు నేనే అత్యధిక ధనశాలిని. నన్ను మించిన శక్తిమంతుడు గాని, సౌఖ్యవంతుడు గాని మరొకడు లేడు. నేను యజ్ఞముల నాచరించుచు, దానములు చేయుచు ఈ విధముగా సంతోషించుదును." ఈ విధముగా అట్టివ్యక్తులు అజ్ఞానముచే భ్రాంతికి లోనగుదురు.**

**16.16**

**అనేకచిత్తవిభ్రాన్తా మోహజాలసమావృతా: ।**
**ప్రసక్తా: కామభోగేషు పతన్తి నరకే శుచౌ ॥**

**అనువాదము**

**వారు ఈ విధముగా అనేక చిత్తవిభ్రాంతులచే కలతనొంది, మోహజాలముచే బద్ధులై, ఇంద్రియభోగముల పట్ల మిగుల ఆసక్తిని పొంది నరకమున బడుదురు.**

**భాష్యము**

అసుర స్వభావము గల మానవుని ధనసంపాదన వాంఛకు పరిమితి ఉండదు. అది అపరిమితము. ఇప్పుడు తన వద్ధ ఎంత ధనమున్నది, దానిని వినియోగించి మరింత అధికముగా ధనమును ఎట్లు వృద్ధి చేయగలననెడి పథకములను మాత్రమే రచించు చుండును. దానికొరకు అతడు అధర్మమార్గమున నడుచుటకైనను వెనుదీయక నల్లబజారులో వ్యాపారములను కొనసాగించును. అతడు భూమి, కుటుంబము, గృహము వంటి నిల్వచేసుకొనిన ధనసంపత్తులచే మోహితుడై దానిని మరింతగా వృద్ధిచేసుకొనుటకు పథకములను రచించు చుండును. అతడు తన స్వశక్తిపైననే విశ్వాసమునుంచి తాను పొందుచున్న లాభమంతయు తన గతజన్మ పుణ్యకర్మల ఫలితమని ఎరుగడు. వాస్తవమునకు గృహాదుల వంటి వస్తువులను సేకరించుటకు ఈ

జన్మము నందు అతనికి అవకాశ మివ్వబడినది. కాని అదియంతయు తన పూర్వకర్మల ఫలమని భావింపడు. అతడు తన ధనసంపదలకు తన ప్రయత్నమే కారణమని భావించును. అనగా అసుర స్వభావుడు తన స్వీయ ప్రయత్నమునే విశ్వసించును గాని కర్మ సిద్ధాంతమును కాదు. కాని కర్మసిద్ధాంతము ననుసరించి, మానవుడు గత జన్మమున సత్కర్మలను ఆచరించి యుండినచో ఉన్నత కుటుంబము లందు జన్మించును, ధనవంతుడగును, విద్యావంతుడగును లేక గొప్పసౌందర్యమును కలిగియుండును. అయినను అసుర స్వభావము గలవారు ఇవియన్నియును యాదృచ్ఛికములనియు, తమ సొంత సామర్థ్యము వలననే లభించినవనియు భావించును. మానవుల యందలి వైవిధ్యము, సౌందర్యము మరియు విద్య వంటివాని వెనుకగల ఏర్పాట్లను గూర్చి వారెరుగజాలరు. వారితో పోటీవచ్చు వానిని అట్టి అసుర స్వభావుడు తన శత్రువుగా భావించును. ఇట్టి అసుర స్వభావులు నేటికాలమున అనేకులు గలరు. వారు ఒకరినొకరు శత్రువులై యుందురు. ఈ శత్రుత్వము మొదట వ్యక్తుల నడుమ, కుటుంబముల నడుమ, పిమ్మట సంఘముల నడుమ, చివరికి దేశముల నడుమ క్రమక్రమముగా ధృఢతరమగుచున్నది. కనుకనే ప్రపంచమంతటను యుద్ధము, కలహము శత్రుత్వము యనునవి నిరంతరము కొనసాగుచున్నవి.

అసుర స్వభావము గల ప్రతివ్యక్తియు తాను ఇతరులను నష్టపరచి జీవింప గలనని భావించును. అట్టివాడు సాధారణముగా తానే భగవానుడనని భావించును. అసుర స్వభావము గల ప్రచారకులు తమ శిష్యులకు : "మీరు భగవానుని కొరకు మరొకచోట ఎందుకు వెదుకుచున్నారు? మీరందరును భాగావానులే. మీకు ఏదినచ్చితే అది చేయవచ్చును. భగవానుని విశ్వసించకుము. అతనిని త్యజించుము. అతడు మృతుడు" అని బోధిస్తుంటారు. వాస్తవమునకు ఇట్టి ప్రచారము లన్నియును అసుర స్వభావముతో కూడుకున్నట్టిది.

అసుర స్వభావము గల మానవుడు ఇతరులు తనతో సమానముగనో, అధికముగనో పలుకుబడి గలవారైనను ఇతరులెవ్వరును తనకంటెను అధిక సంపన్నులు లేక అధిక పలుకబడి గలవారు కారని భావించును. ఇక ఉన్నతలోక సముద్ధరణమునకు సంబంధించినంత వరకు యజ్ఞాచరణము లందు అతడు విశ్వాసమును కలిగియుండక, తనదైన సొంత యజ్ఞవిధానమును సృష్టించుకొని యంత్రములను తయారుచేసికొని దానిద్వారా తాను ఉత్తమ లోకములకు చేరగలనని భావించును. అసుర స్వభావము గల అట్టి మానవులకు రావణుడు ఉత్తమమైన ఉదాహరణము. వేదములందు తెలిపిన యజ్ఞములను ఆచరింప కున్నను జనులు ఊర్ధ్వలోకములకు వెళ్ళగలిగేలా అతడొక సోపాన పరంపరను ఏర్పాటు చేయుటకై ప్రయత్నించెను. అట్లే నేటియుగమున కూడ అట్టి అసుర స్వభావము గల వ్యక్తులు యాంత్రిక సాధనముల ద్వారా ఉన్నత గ్రహమండలము లను చేరుటకు తీవ్రముగా యత్నించుచున్నారు. ఇవియన్నియును భ్రాంతికి నిదర్శనములు. దీనికి ఫలితముగా, వారు తమకు తెలియకనే నరకమున పడిపోవు చున్నారు. కనుకనే ఈ శ్లోకమున 'మోహజాలము' అను సంస్కృత పదము మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొన్నది. 'జాల' అనగా వల అని భావము. వలలో చిక్కుకున్న చేపవలె అసుర స్వభావులు మోహజాలమున చిక్కుకొని అందులోనుండి బయటపడు మార్గములేక బంధితులై యుందురు.

### 16.17
**ఆత్మసమ్భావితా: స్తబ్ధా ధనమానమదాన్వితా: ।**
**యజన్తే నామయజ్ఞైస్తే దమ్భేనావిధిపూర్వకమ్ ॥**

## అనువాదము

**స్వయం సంతుష్టులును మరియు ఎల్లప్పుడు గర్వితులును, ధనము మరియు దురభిమానములచేతను భ్రాంతినొందినవారై, వారుకొన్నిమార్లు దంభముతో నియమనిబంధనల ననుసరింపకుండ నామకార్థము యజ్ఞముల నాచరింతురు.**

## భాష్యము

అసుర స్వభావులు తామే సర్వజ్ఞుల మనుకొని ఎట్టి ప్రామాణికతను గాని, శాస్త్రములను గాని లెక్కచేయక యజ్ఞమతాది కర్మలనబడు వానిని నిర్వహించు చుందురు. వారు ప్రామాణికత్వములపై విశ్వాసము లేనివారగుటచే మిక్కిలి గర్వితులై యుందురు. దీనికి కూడబెట్టిన ధనము మరియు దురభిమానములచే కలిగిన భ్రాంతియే కారణము. కొన్నిమార్లు అట్టి అసుర స్వభావులు ప్రచారకులై జనులను తప్పుదారి పట్టించుచు ధర్మసంస్కర్తలుగా లేదా భగవదవతారములుగా ప్రసిద్ధినొందుదురు. వారు యజ్ఞములను ఆచరించు చున్నట్లుగా ప్రదర్శనలు కావింతురు. లేదా వివిధ దేవతలను పూజింతురు లేదా స్వయముగా తమకొక స్వంతభగవానుని కల్పించుకొనుట వంటి కార్యములలో నిమగ్నులగుదురు. సామాన్య జనులు వారిని భగవానునిగా ప్రచారము చేయుచు వారిని పూజింతురు. అజ్ఞానులు వారిని ధర్మనియమము లందు లేదా ఆధ్యాత్మిక జ్ఞానము నందు మిక్కిలి పురోభివృద్ధి చెందినట్టివారిగా భావించు చుందురు. వారు సన్న్యాసి దుస్తులను ధరించి ఆ వేషమున ఎన్నోరకములైన హేయకార్యములను చేయుచుందురు. వాస్తవమునకు ప్రపంచమును త్యజించినట్టి సన్న్యాసికి అనేక నియమ నిబంధనలున్నను అసురులు వాటిని లెక్కజేయరు. ఎవరి మార్గమును వారే తయారు చేసుకొనవచ్చుననియు, ప్రతియొక్కరు అనుసరింప వలసిన ప్రామాణిక మార్గమనునది లేదనియు వారు భావింతురు (యథో మత్, తథో పథ్). నియమ నిబంధనలను లెక్కచేయక పోవుటమను అర్థము గల 'అవిధి పూర్వకమ్' అను పదము ఇక్కడ ప్రత్యేకముగ నొక్కిచెప్పబడినది. ఈ విషయముల కన్నింటికిని సదా అజ్ఞానము మరియు భ్రాంతియే కారణము.

### 16.18
**అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితా: ।**
**మామాత్మపరదేహేషు ప్రద్విషన్తో భ్యసూయకా: ॥**

## అనువాదము

**అహంకారము చేతను, బలము చేతను, గర్వము చేతను, కామము చేతను, క్రోధము చేతను భ్రాంతినొందినవారై అసుర స్వభావము గలవారు తమ దేహము లందును, ఇతర దేహము లందును నిలిచియున్న దేవాదిదేవుడనైన నా యెడ అసూయ గలవారై నిజమైన ధర్మమును దూషింతురు.**

## <u>భాష్యము</u>

అసుర స్వభావము గల మానవుడు భగవానుని దేవాదిదేవత్వమును ఎల్లప్పుడు వ్యతిరేకించుటచే శాస్త్రములను విశ్వసించుటకు అంగీకరింపడు. అతడు శాస్త్రముల పట్లను మరియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అస్తిత్వము పట్లను అసూయను కలిగియుండును. అట్టి దురభిమానమునకు అతని ధనము గౌరవము మరియు బలములే కారణములు. అతడు ఈ వర్తమాన జీవితము భావిష్యజ్జన్మకు కారణమని ఎరుగకపోవుటచే, అతడు తన పట్లను మరియు ఇతరుల పట్లను అసూయను కలిగియుండును. తత్కారణముగా అతడు తన శరీరమునకు మరియు ఇతరుల శరీరమునకును కూడ హింస కల్గించును. జ్ఞానహీనుడగుటచే అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పరమ నియామకత్వమును లెక్కజేయుడు. శాస్త్రము మరియు దేవాదిదేవుని పట్ల అసూయ గలవాడగుతచే భగవానుని అస్తిత్వమునకు, విరుద్ధముగా అతడు మిథ్యావాదములను చేయుచు శాస్త్రప్రమాణముల అధికారమును త్రోసిపుచ్చును. ప్రతికార్యము నందును తానే స్వతంత్రుడను మరియు శక్తిమంతుడనని భావించును. బలము నందు కాని, శక్తి నందు కాని లేదా ధనము నందు కాని మరెవ్వరును తనతో సమానులు కాలేరనియు తాను ఏ విధముగానైన వర్తింపవచ్చుననియు, తననెవ్వరును అడ్డగింపలేరనియు అతడు భావించును. అసుర ప్రవృత్తి కలవాడు తన ఇంద్రియకార్య ప్రగతిని అడ్డగించు శత్రువు ఉన్నాడని తెలిసినచో అతనిని తన శక్తినంతటిని ఉపయోగించి నశింప జేయుటకు పన్నాగములను పన్నును.

### 16.19

**తానహం ద్విషత: క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।**
**క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు ॥**

## <u>అనువాదము</u>

**అసూయ గలిగినట్టియు, క్రూరులైనట్టియు, నరాధములైనట్టియు వారిని వివిధ అసుర జన్మలనెడి సంసార సాగరమున నేను శాశ్వతముగా పడద్రోయుచున్నాను.**

## <u>భాష్యము</u>

ఈ శ్లోకమున ఒక జీవుని ప్రత్యేక దేహమునందు ప్రవేశింప జేయుట యనునది శ్రీకృష్ణభగవానుని విశేష అధికారమని అత్యంత స్పష్టముగా చెప్పబడినది.అసుర స్వభావము కలిగిన మానవుడు భగవానుని పరమాధికారమును అంగీకరింపక, తన ఇచ్చానుసారమే వర్తించినను, అతని భవిష్యత్తు జన్మము మాత్రము అతనిపై కాకుండ దేవాదిదేవుని నిర్ణయము పైననే ఆధారపడి యుండును. జీవుడు మరణానంతరము దైవశక్తి పర్యవేక్షణమున మాతృగర్భమున ప్రవేశపెట్టబడుననియు, అక్కడ అతడు తగిన దేహమును పొందుననియు శ్రీమద్భాగవతపు తృతీయ స్కంధమున తెలుపబడినది. కనుకనే భౌతిక జగత్తున జంతువులు, కీటకములు, మానవులు వంటి పెక్కు జీవజాతులను మనము గాంచుచుందుము. ఇవియన్నియును శ్రీకృష్ణభగవానుని శక్తిచే ఏర్పరుపబడినవే గాని యాదృచ్ఛికములు కావు. అసుఅర స్వభావము గల మానవులకు సంబంధించి నంత వరకు వారు సదా అసుర యోనులందే ఉంచబడుదురనియు, తత్కారణముగా వారు అసూయ కలిగినవారుగను, నరాధములుగను కొనసాగు చుందురనియు ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. అట్టి మానవులు ఎల్లప్పుడు కామపూరితులు గాను, హింసాప్రవృత్తితో నిండియున్నట్టివారు గాను, ద్వేషముతో నిండి

అపవిత్రులుగా నుందురు. అరణ్యములందు నివసించు పలురకములైన వేటగాండ్రు అట్టి అసురజీవజాతికి చెందినవారుగా పరిగణింపబడుదురు.

## 16.20

**ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।**
**మామప్రాప్యైవ కౌన్తేయ తతో యాన్త్యధమాం గతిమ్ ॥**

## అనువాదము

**ఓ కౌంతేయా! అసుర జీవజాతుల యందే మరల మరల జన్మించి అట్టివారు నన్నెన్నడును పొందజాలక క్రమముగా అత్యంత హేయమైన జన్మలకు పతనము నొందుదురు.**

## భాష్యము

భగవానుడు పరమ దయామయుడనెడి విషయము విదితమే. కాని అతడు అసుర స్వభావము గలవారి యెడ మాత్రము ఎన్నడును దయ స్వభావమును కలిగియుండడని మనము ఇక్కడ చూచుచున్నాము. అసుర స్వభావము గలవారు ప్రతిజన్మ యందును అవే అసురయోనుల యందు ఉంచబడుదురనియు, పరమపురుషుని దయను పొందలేక క్రమముగా వారు పతనము చెందుదురనియు కూడ స్పష్టముగా తెలుపబడినది. ఆ విధముగా వారు చివరకు శునక, సూకర, మార్జాలముల వంటి హేయమైన దేహములను పొందుదురనియు స్పష్టముగా చెప్పబడినది.అట్టి దానవ స్వభావులు మరుసటి జన్మలో ఎట్టి స్థితి యందున్నను భగవానుని కృపను పొందు అవకాశమే లేదని కూడ ఇక్కడ స్పష్టముగా తెలుప బడినది. వేదములందు కూడ అట్టి మానవులు క్రమక్రమముగా పతనము చెంది శునకసూకరములుగా జన్మింతురని తెలుపబడినది (ఛాందోగ్యోపనిషత్తు 5.10.7). భగవానుడు అట్టి అసుర స్వభావము గలవారి పట్ల దయలేనివాడైనచో అతనిని సర్వదయామయుడుగా ప్రకటింపకూడదని కూడ ఇక్కడ ఎవ్వరైనను వాదింప వచ్చును. అట్టి ప్రశ్నకు సమాధానముగా దేవాదిదేవుడు ఎవరి పట్లను ద్వేషమును కలిగియుండడని 'వేదాంత సూత్రము'(2.1.34) నుండి ఎరుగవచ్చును. అసుర స్వభావులను అధమజన్మల యందు పడద్రోయుట కూడ భగవానుని దయకు మరియొక లక్షణము. ఉదాహరణకు భగవానునిచే వధింపబడుట అసురులకు శుభమే కాగలదు. ఎందుకనగా, దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునిచే వధింపబడిన వారందరును ముక్తిని పొందియుండిరని వైదిక గ్రంథము లందు చెప్పబడినది. పురాణములందు రావణుడు, కంసుడు, హిరణ్యకశ్యపుడు వంటి అనేకమైన అసురుల చరిత్రలే ఇందుకు నిదర్శనములు. వారిని వధించుటకే భగవానుడు వివిధ అవతారములను దాల్చెను. కనుక దేవాదిదేవునిచే వధింపబడు అదృష్టము కలిగినచో అసురులకు కూడ భగవానుని దయ చూపబడినట్లే యగును.

## 16.21

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మన: ।**
**కామ: క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥**

### అనువాదము

**కామము, క్రోధము, లోభము అనునవి మూడు నరకద్వారములై యున్నవి. అవి ఆత్మ యొక్క పతనమునకు కారణ మగుటచే బుద్ధిమంతుడైన ప్రతి మానవుడు వాటిని త్యజింపవలెను.**

### భాష్యము

అసుర జీవితపు ఆరంభము ఇక్కడ వర్ణింపబడినది. మానవుడు తన కామమును తృప్తినొందించుటకై యత్నించును. అట్లు చేయలేక విఫలుడైనచో లోభము, క్రోధము ఉద్భవించును. అసుర జీవజాతికి పతనము కాకూడదని కోరుకొను బుద్ధిమంతుడు తప్పక ఈ మూడు శత్రువులను విడుచుటకు యత్నింప వలెను. ఎందుకనగా, అవి భౌతికబంధముల నుండి ముక్తినొందు అవకాశము లేకుండునట్లుగా ఆత్మను నాశనము చేయు సమర్థములై యున్నవి.

## 16.22

**ఎతైర్విముక్త:కౌన్తేయ తమోద్వారైస్త్రిభిర్నర: ।**
**ఆచరత్యాత్మన: శ్రేయస్తతో యాతి పరాం గతిమ్ ॥**

### అనువాదము

**ఓ కౌంతేయా! ఈ మూడు విధములైన నరకద్వారముల నుండి తప్పించు కొనినవాడు ఆత్మానుభూతికి అనుకూలములైన కార్యముల నొనరించి క్రమముగా పరమగతిని పొందగలడు.**

### భాష్యము

మానవ జీవితమునకు శత్రువులైన కామక్రోధ లోభముల మూడింటి విషయమున మానవుడు మిక్కిలి జాగరూకుడై యుండవలెను. అతడు ఈ మూడింటి నుండి ఎంతగా బయటపడినచో అంతగా జీవితము పవిత్రమగుచుండును. అప్పుడే అతడు వైదిక గ్రంథములందు చెప్పబడిన నియమ నిభంధనల ననుసరింప గలడు. మానవజన్మకు సంబంధించిన ఆ నియమ నిభంధనల ననుసరించుటచే అతడు క్రమముగా ఆత్మానుభూతిస్థితి మార్గమునందు తనను ఉద్ధరించుకొన గలుగును. అతడు గొప్ప అదృష్టవంతుడైనచో అట్టి సాధనచే కృష్ణచైతన్య స్థితికి చేరగలడు. దానితో సంసిద్ధి అతనికి నిశ్చయము కాగలదు. వైదిక గ్రంథము లందు మానవుడు పవిత్రస్థితికి చేరుటకు చేయవలసిన విధినిషేధములు విశదముగా వివరింపబడినవి. ఈ విధానమంతయు కామ, క్రోధ, లోభములను త్యజించుట పైననే ఆధారపడియున్నది. కామాది త్రిగుణములను త్యజించుటమనెడి ఈ విధానము జ్ఞానమును అలవరచుకొనుట ద్వారా మానవుడు అత్యున్నత స్థితియైన ఆత్మానుభూతి యనెడి స్థితికి ఎదగగలడు. ఈ ఆత్మానుభూతి శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవతో పరిపూర్ణమగును. ఈ భక్తియుక్త సేవతో బద్ధజీవునికి ముక్తి నిశ్చయమై యున్నది. కనుకనే వైదిక విధానము ననుసరించి

జీవితమునకు సంబంధించిన నాలుగు ఆశ్రమములు మరియు నాలుగు వర్ణములు (వర్ణాశ్రమ పద్ధతి) ఏర్పరచబడినది. అట్టి వివిధ వర్ణములకును మరియు ఆశ్రమములకును నియమ నిబంధనలు గలవు. మానవుడు వానిని పాటింప గలిగినచో ఆధ్యాత్మికానుభూతి యందలి అత్యుత్తమ స్థితికి సహజముగానే ఎదగగలడు. పిదప అతడు నిస్సందేహముగా ముక్తిని పొందగలుగును.

## 16.23

**యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥**

## అనువాదము

**శాస్త్రవిధులను త్యజించి ఇష్టానుసారము వర్తించువాడు పరిపూర్ణత్వమును గాని, సుఖమును గాని, పరమ గతిని గాని పొందజాలడు.**

## భాష్యము

ఇదివరకే వర్ణింపబడినట్లు మానవసంఘముల యందలి వివిధ వర్ణములకును, ఆశ్రమములకును సంబంధించిన అనేక రకముల శాస్త్రవిధులు (శాస్త్రనిర్దేశములు) నిర్ణయింపబడినవి. ప్రతియొక్కరు ఆ నియమ నిబంధనలను తప్పక ఆచరింపవలెను. ఒకవేళ మానవుడు వాటి ననుసరింపక తన కామలోభ వాంఛల ననుసరించి ఇచ్ఛానుసారము వర్తించినచో తన జీవితమున ఎన్నడును పరిపూర్ణత్వమును సాధింపజాలడు. మానవుడు ఈ విషయముల నన్నింటిని సిద్ధాంత పూర్వకముగా ఎరిగినను, తన జీవితమున వాటిని అమలు పరచక పోయినచో అతనిని నరాధమునిగా పరిగణింపవలెను. మానవజన్మ యందు జీవుడు బుద్ధికలిగి, అత్యున్నత స్థితికి తన జీవితమును పెంపొందించు కొనుటకై విధింపబడిన నియమముల ననుసరింపవలెను. కాని అతడు వాటి ననుసరింపనిచో తనకుతానే పతనము కావించుకొనినట్టి వాడగును. ఒకవేళ అతడు ఈ నియమ నిబంధనలను మరియు ధర్మనియమములను పాటించినప్పటికిని, చివరికి దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అవగాహనము చేసుకొను స్థితికి రాకున్నచో అతని జ్ఞానమంతయు వ్యర్థమగును. అట్లే, అతడు భగవానుని అస్తిత్వమును అంగీకరించినను, భగవానుని భక్తియుక్తసేవ యందు నెలకొనినచో అతని యత్నము లన్నియు వ్యర్థములగును. కనుకనే మానవుడు కృష్ణచైతన్య స్థితికిని, భక్తియుక్త సేవాస్థితికిని క్రమముగా తనంతటతాను ఉద్ధరించుకొనవలెను. అప్పుడు వెంటనే అతడు అట్టి అత్యున్నత పరిపూర్ణత్వపు స్థితిని పొందును గాని అన్యథా కాదు.

ఇక్కడ 'కామకారతః' అను పదము మిగుల ప్రధానమైనది. తెలిసియే నియమములను ఉల్లంఘించువాడు కామముతో వర్తించినవాడగును. తాను చేయునది నిషిద్ధమని తెలిసియు అతడు అట్లే వర్తించును. దీనికే యథేష్టాచరణ మనబడును. తప్పక చేయవలసియున్న కార్యములను కూడ చేయకుండుట చేతనే అతడు చంచలుడని చెప్పబడుచున్నాడు. అట్టి మానవులను దేవాదిదేవుడు తప్పక శిక్షించును. మానవజన్మ ప్రయోజనమైన పరిపూర్ణత్వమును వారెన్నడును సాధింప జాలరు. మానవ జీవితము ముఖ్యముగా తన అస్తిత్వమును పవిత్రము చేసికొనుట ఉద్దేశింపబడినది.

నియమ నిబంధనల ననుసరింపనివాడు తననుతాను పవిత్రుని కావించుకొనలేడు. అట్లే యథార్థ సౌఖ్యస్థితిని కూడ పొందజాలడు.

## 16.24

**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥**

## అనువాదము

**అందుచే మానవుడు శాస్త్రనియమముల ద్వారా కార్యమననేమో, అకార్యమననేమో అవగాహన చేసికొనవలెను. అట్టి నియమ నిబంధనల నెరిగి మానవుడు కర్మనొనరించినచో అతడు క్రమముగా ఉద్ధరింపబడును.**

## భాష్యము

పంచదశాధ్యాయమున పదిహేనవ శ్లోకమందు తెలుపబడినట్లు, వేదము లందలి నియమ నిబంధన లన్నియు శ్రీకృష్ణభగవానుని ఎరుగుట కొరకై ఉద్దేశింపబడినవి. (15.15). మానవుడు భగవద్గీత నుండి శ్రీకృష్ణభగవానుని అవగాహన చేసికొని భక్తియుక్త సేవ యందు నిమగ్నుడై కృష్ణచైతన్య మందు ప్రతిష్ఠితుడైనచో అతడు వైదిక గ్రంథము లందు చెప్పబడిన అత్యున్నత జ్ఞాన పరి పూర్ణత్వమును పొందినవాడగును. శ్రీకృష్ణభగవానుని పొందుటకై ఉద్దేశింపబడిన ఈ మార్గమును శ్రీ చైతన్య మహాప్రభువు ఎంతో సులభము కావించెను. అతఅను డు జనులకు, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" మహామంత్రమును కీర్తిస్తూ, భక్తియుక్త సేవా కార్యములందు నెలకొని, శ్రీకృష్ణునకు అర్పించిన ఆహారపదార్థములనే ప్రసాద రూపమున గ్రహింపవలెనని బోధించిరి. ఇట్టి భక్తియుక్త సేవ కార్యకలాపము లందు ప్రత్యక్షముగా నెలకొనినవాడు వైదిక గ్రంథముల నన్నింటిని అధ్యయనము చేసినవానిగనే భావింపబడును. అట్టివాడు పరిపూర్ణమైన అవగాహనకు నిశ్చయముగా వచ్చినట్టివాడగును. కాని కృష్ణచైతన్యము లేనివారికిని, శ్రీకృష్ణుని భక్తియుక్త సేవయందు నెలకొననట్టి సామాన్య జనులకు సంబంధించిన నియమ నిబంధనలు వేదనిర్దేశముల ద్వారానే నిర్ణయింపబడును. ఎట్టి వాదము లేకుండా మానవుడు ఆ విధముగా వర్తింపవలెను. అట్లు వేదనియమముల ననుసరించుటనే శాస్త్ర సిద్ధాంతానుసరణ మనబడును. బద్ధజీవులందు కనిపించు నాలుగు ముఖ్య దోషములకు శాస్త్రము అతీతముగా కనిపించును. దోషపూరితమైన ఇంద్రియములు, వంచనప్రవృత్తి (విప్రలిప్స), నిశ్చయముగా దోషాచరణము కలిగియుండుట (ప్రమాదము), నిశ్చయముగా భ్రాంతికి లోనగుట యనునవియే ఆ ముఖ్యమైన దోషములు. బద్ధజీవితము నందు కనిపించు ఈ నాలుగు దోషములే మానవుని నియమ నిబంధనల ననుసరించుట యందు అనర్హునిగా కావించుచున్నవి. కనుకనే, ఈ దోషములకు అతీతములైనట్టి శాస్త్రములచే విధింపబడిన నియమ నిబంధనలు ఎట్టి మార్పులేకుండ మహర్షులు, ఆచార్యులు, మహాత్ములు అంగీకరించిరి.

సాధారణముగ ఆధ్యాత్మిక అవగాహనము నందు నిరాకారవాదులు, సాకారవాదులు అని రెండు పక్షములు భారతదేశము నందు గలవు. ఈ రెండు పక్షముల వారును తమ జీవితమును వేదనియమముల ననుసరించియే కొనసాగించు చుందురు. శాస్త్రనియమముల ననుసరింపకుండ ఎవ్వరును పరిపూర్ణ స్థితికి తమనుతాము

ఉద్ధరించుకొనజాలరు. కనుకనే శాస్త్రముల సారమును పూర్తిగా అవగాహన చేసుకొనినవాడు భాగ్యవంతుడుగా పరిగణింపబడును.

భగవత్తత్త్వ విజ్ఞానమును అవగాహనము చేసుకొను సిద్ధాంతముల పట్ల విముఖతను వహించుటయే మానవుని సమస్త పతనములకు కారణమగును. వాస్తవమునకు అట్టి వైఖరి మానవుల గొప్ప తప్పిదము. కనుకనే దేవాదిదేవుని భౌతిక శక్తియైన 'మాయ' సదా త్రివిధక్లేశముల రూపమున మనలను ఎల్లప్పుడు బాధించుచున్నది. ఆ మాయాశక్తి భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములతో కూడియున్నట్టిది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగాహన చేసుకొను మార్గమున అతడు అడుగుపెట్టుటకు మునుపు మానవుడు కనీసము సత్త్వగుణ స్థితికైనను ఎదుగవలెను. సత్త్వగుణ ప్రమాణమునకు ఎదగనిచో మానవుడు అసురజన్మకు కారణములైన రజస్తమోగుణములందే నెలకొనవలసివచ్చును. రజస్తమోగుణ స్వభావులు శాస్త్రమును, సత్పురుషులను, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నిజమైన అవగాహనను ద్వేషింతురు. వారు ఆధ్యాత్మికాచార్యుని ఉపదేశములను తిరస్కరించి శాస్త్రవిధులను లెక్కపెట్టరు. భక్తియుక్తసేవా మహిమను శ్రవణము చేసిన పిమ్మటను వారు దాని యెడ ఆకర్షింపబడక, సముద్ధారమునకై తమకుతాము కొన్ని పద్ధతులను కల్పించుకొందురు. మానవ సమాజము నందు గల కొన్ని దోషములివి. అవి అసుర జన్మలకు కారణభూతము లగుచున్నవి. అయినను అత్యున్నత స్థితియైన ముక్తి మార్గమున శిష్యుని నడుపగల తగిన ప్రామాణికాచార్యుని నుండి శిక్షణను పొందగలిగినచో మానవుని జీవితము సఫలము కాగలదు.

**శ్రీమద్భగవద్గీత యందలి 'దైవాసుర స్వభావములు' అను షోడశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

-----

# సప్తదశాధ్యాయము
# శ్రద్ధాత్రయ విభాగములు

### 17.1
**అర్జున ఉవాచ**
**యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితా: ।**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమ: ॥**

## అనువాదము

**అర్జునుడు ప్రశ్నించెను : ఓ కృష్ణా! శాస్త్ర గ్రంథముల నియమములను పాటింపక తమ మానసిక కల్పనల ననుసరించి శ్రద్ధతో పూజించువారి స్థితి యెట్టిది? వారు సాత్త్వికులా, రాజసులా లేక తామసులా?**

## భాష్యము

ఏదియో ఒక ప్రత్యేక పూజవిధానము నందు శ్రద్ధ కలిగిన వ్యక్తి క్రమముగా జ్ఞానస్థితికి ఉద్ధరింపబడి శాంతిసౌభాగ్యములతో కూడిన అత్యున్నత పరిపూర్ణ స్థితిని పొందగలడని భగవద్గీత యందలి చతుర్థాధ్యాయపు ముప్పదితొమ్మిదవ శ్లోకమున చెప్పబడినది. శాస్త్రనియముల ననుసరింపని వాడు అసురుడనియు, శాస్త్రనియమములను శ్రద్ధతో పాటించువాడు దేవత లేక దైవీ స్వభావము గలవాడనియు గడిచిన షోడశాధ్యాయము నందు నిర్ణయింపబడినది. ఇప్పుడు శాస్త్రములందు పేర్కొనని నియమములను శ్రద్ధతో అనుసరించువాని స్థితి ఏమిటి? అని అర్జునుని ఈ సందేహమును శ్రీకృష్ణభగవానుడు తీర్చవలెను. ఎవరో ఒక మానవుని భగవానునిగా భావించి అతని యందు విశ్వాసముంచువారు సత్త్వరజోతమోగుణము లందు దేనితో పూజించువారగుదురు? జీవిత పరిపూర్ణత్వపు స్థితిని అట్టి మానవులు పొందగలరా? యథార్థ జ్ఞానస్థితిని పొంది తమకుతాము అత్యున్నత పరిపూర్ణ స్థితికి ఉద్ధరించుకొనుట వారికి సాధ్యమగునా? ఈ విధముగా శాస్త్రనియమముల ననుసరింపక దేనియందో శ్రద్ధను కలిగియుండి వివిధ దేవతలను, ఉపదేవతలను, మానవులను పూజించువారు వారి ప్రయత్నము లందు విజయమును సాధింపగలుగుదురా? ఈ ప్రశ్నలన్నింటిని అర్జునుడు శ్రీకృష్ణుని ముందుంచుచున్నాడు.

**17.2**
**శ్రీభగవానువాచ**
**త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శ్రుణు ॥**

## అనువాదము

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : దేహధారి పొందిన త్రిగుణముల ననుసరించి శ్రద్ధ సాత్త్వికము, రాజసము, తామసము అని మూడు విధములుగా నున్నది. ఈ విషయమును ఇప్పుడు వినుము.**

## భాష్యము

శాస్త్రము నందలి నియమ నిభంధనల నెరిగినను బద్ధకము లేదా సోమరితనము కారణముగా వానిని అనుసరింపని వారు భౌతిక ప్రకృతి గుణములకు అధీనులై యుందురు. సత్త్వరజస్తమో గుణములకు సంబంధించిన తమ పూర్వకర్మల ననుసరించి జీవులు ప్రత్యేక గుణస్వభావమును పొందుదురు. వివిధ ప్రకృతి త్రిగుణములతో జీవునకు గల ఈ సంపర్కము నిరంతరముగా కొనసాగుచునే యున్నది. జీవుడు అట్టి భౌతికప్రకృతితో సంపర్కమును కలిగి యుండుటచే వానితో తనకు గల గుణసంబంధముల ననుసరించి వివిధములైన మనస్తత్త్వములను పొందుచుండును. కాని అతడు ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని సాంగత్యమును పొంది అతనిచే విధింపబడిన శాస్త్రనిబంధనల ననుసరించు వాడు ఈ గుణస్వభావమును మార్చుకొనగలడు. అనగా మానవుడు క్రమముగా తమోగుణము నుండి సత్త్వగుణమునకు గాని, రజోగుణము నుండి సత్త్వగుణమునకు గాని తన స్థితిని మార్చుకొనవచ్చును. సారాంశమేమనగా, ఏదేని ఒక ప్రత్యేక గుణము నందలి గ్రుడ్డివిశ్వాసము మానవుని పరిపూర్ణ స్థితికి ఉద్ధరింప బడుటకు తోడ్పడజాలదు. ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుని సాంగత్యమున అతడు తప్పక ప్రతి విషయమును శ్రద్ధ మరియు బుద్ధితో పరిశీలింపవలెను. ఆ విధముగా మానవుడు తన స్థితిని ఉన్నత ప్రకృతి గుణస్వభావమునకు మార్చుకొనగలడు.

**17.3**
**సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయో యం పురుషో యో యచ్ఛ్రద్ధ: స ఏవ స: ॥**

## అనువాదము

**ఓ భరత వంశకుమారా! మానవుడు వివిధ ప్రకృతి గుణముల యందలి తన స్థితి ననుసరించి తత్సంబంధితమైన శ్రద్ధను కూడియున్నాడని చెప్పబడును.**

## భాష్యము

మానవుడు ఎటువంటి వాడైనను అతడు ఒక ప్రత్యేక శ్రద్ధను తప్పక కలిగియుండును. కాని అతని శ్రద్ధ అతని గుణస్వభావము ననుసరించి సాత్త్వికము, రాజసికము లేదా తామసికముగా భావింపబడును. ఆ విధముగా తన ప్రత్యేక

శ్రద్ధననుసరించి అతడు కొందరు వ్యక్తులతో సాంగత్యము చేయబడును. ఆ విధముగా తన ప్రత్యేక శ్రద్ధననుసరించి అతడు కొందరు వ్యక్తులతో సాంగత్యము చేయుచుండును. కాని యథార్థ విషయమేమనగా, పంచదశాధ్యాయపు సప్తమ శ్లోకమున చెప్పబడినట్లు, ప్రతిజీవి శ్రీకృష్ణభగవానుని అంశభాగమే. కనుక సహజముగనే మానవుడు అన్నిభౌతిక ప్రకృతి గుణములకు అతీతుడై యుండును. కాని అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునితో తనకు గల సంబంధమును విస్మరించి బద్ధజీవితమున భౌతిక ప్రకృతి సంపర్కమును పొందినపుడు అతడు భిన్నభౌతిక ప్రకృతి త్రిగుణములతోడి సాంగత్యము ననుసరించి తన బద్ధస్థితిని కల్పించుకొనుచున్నాడు. అట్టి బంధములకు ఫలితముగా కలిగెడి కృత్రిమ శ్రద్ధ మరియు జీవిత స్థితులనునవి భౌతికములు మాత్రమే. జీవుడు వివిధ భావములచే లేదా జీవిత విధానములచే నడుపబడినప్పటికిని, వాస్తవమునకు అతడును తొలుత 'నిర్గుణుడే' లేక గుణాతీతుడే. కనుకనే దేవాదిదేవునితో తనకు గల నిత్య సంబంధమును పునరుద్ధరించు కొనుటకై ప్రతియొక్కరు తాము పొందిన భౌతిక ప్రకృతి కాలుష్యముల నుండి పవిత్రులు కావలెను. అదియే కృష్ణచైతన్యము, భగవానుని తిరిగి పొందుటకు గల ఏకైక మార్గము. మానవుడు కృష్ణచైతన్యము నందు నెలకొనినచో పరిపూర్ణస్థితికి ఉద్ధరింపగల మార్గము నిశ్చయమగును. ఈ ఆత్మానుభూతి మార్గమును అవలంబింపనిచో అతడు తప్పక ప్రకృతి గుణముల ప్రభావములకు అధీనుడు కాకతప్పదు.

ఈ శ్లోకము నందు 'శ్రద్ధ' అను పదము ఎంతో ప్రధానమైనది. అట్టి 'శ్రద్ధ' మొట్టమొదట సత్త్వగుణము నుండియే ఏర్పడును. మానవుని అట్టి శ్రద్ధ యనునది ఏదేని ఒక దేవత యందు కాని ఉండవచ్చును. కాని అతని దృఢమైన శ్రద్ధ భౌతిక సత్త్వగుణ కార్యముల ఫలితమని భావింపవచ్చును. కాని భౌతిక బద్ధ జీవితము నందు ఏ కార్యములును పూర్తిగా పవిత్రములు కావు. అవి ఇతర గుణములతో మిశ్రితములై యుండును. కావున అవి శుద్ధ సత్త్వగుణ కర్మములుగా కూడ భావింపబడవు. శుద్ధసత్త్వము భౌతిక గుణాతీతమైనట్టిది. శుద్ధసత్త్వము నందే మానవుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని నిజతత్త్వమును ఎరుగగలడు. మానవుని శ్రద్ధ శుద్ధసత్త్వము నందు పూర్తిగా స్థితిని కలిగియుండనంత వరకు, అది భౌతికప్రకృతి గుణములచే ప్రభావితమగుచునే యుండును. కలుషితములైన భౌతిక ప్రకృతి గుణములు హృదయమునకు వ్యాపించి యుండుటచే భౌతిక గుణసంపర్కమునందు హృదయస్థితి ననుసరించి ఎవరి శ్రద్ధయైనను ప్రతిష్ఠితమగు చుండును. అతని హృదయము సత్త్వగుణము నందు స్థితిని పొందియున్నచో అతని శ్రద్ధ కూడ సత్త్వగుణము నందు ప్రతిష్ఠితమై యున్నట్లుగా అవగతమగును. అట్లే అతని హృదయము రజోగుణము నందు స్థితిని పొందియున్నచో అతని శ్రద్ధ కూడ రజోగుణము నందు ప్రతిష్ఠితమగును. ఒకవేళ అతని హృదయము తమోగుణము నందు స్థితమైనచో అతని శ్రద్ధ కూడ తమోగుణము నందు ప్రతిష్ఠితమై కలుషితమగును. ఈ విధముగా ప్రపంచము నందు వివిధములైన శ్రద్ధలు మనకు గోచరించును. అట్టి వివిధములైన ఈ శ్రద్ధల కారణముననే వివిధ మతము లేర్పడుచున్నవి. కాని యథార్థమైన ధర్మమునకు సంబంధించిన శ్రద్ధ సదా శుద్ధతత్త్వము నందే ప్రతిష్ఠితమై యుండును. కాని వివిధ గుణములచే కలుషితమగుట చేతనే మనకు వివిధరకాల మతధర్మములు, నియమములు గోచరించుచున్నవి. ఈ విధముగా వివిధములైన శ్రద్ధల ననుసరించి వివిధ రకములైన పూజావిధానము లేర్పడుచున్నవి.

**17.4**
**యజన్తే సాత్త్వికా దేవాన్యక్షరక్షాంసి రాజసా: ।**
**ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనా: ॥**

## అనువాదము

**సత్త్వగుణము నందు నిలిచినవారు దేవతలను, రజోగుణము నందు నిలిచినవారు యక్షరాక్షసులను, తమోగుణము నందు నిలిచినవారు భూత ప్రేతములను పూజింతురు.**

## భాష్యము

ఈ శ్లోకమునందు శ్రీకృష్ణభగవానుడు వారి వారి బాహ్యకర్మల ననుసరించి వివిధరకాల పూజలను చేయువారిని గూర్చి వర్ణించుచున్నాడు. శాస్త్రనిర్దేశముల ననుసరించి, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడొక్కడే పూజనీయుడు. కాని శాస్త్రనియమముల నెరుగనివారు లేదా దానియందు శ్రద్ధలేనివారు తమ భౌతిక గుణముల ననుసరించి వివిధ పూజ్యవస్తువులను (అన్యులను) పూజించు చుందురు. సత్త్వగుణము నందు నెలకొనినవారు సాధారణముగా దేవతలను పూజింతురు. ఈ దేవతలలో బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు మున్నగు వారున్నారు. అట్టి దేవతలు అనేకులు గలరు. సత్త్వగుణము నందున్న వారు ప్రత్యేక ప్రయోజనములకై ప్రత్యేక దేవతను పూజింతురు. అట్లే రజోగుణము నందున్న వారు రాక్షసులను పూజింతురు. ఈ సందర్భమున రెండవ ప్రపంచ యుద్ధకాలమున కలకత్తా నగరమందలి ఒక వ్యక్తి 'హిట్లరు'ను పూజించిన సంగతిని మనము గుర్తుచేసుకొనవచ్చును. ఆ యుద్ధము వలన ఏర్పడిన వస్తుకొరత వలన నల్లబజారులో వ్యాపారము చేయుట ద్వారా విశేష ధనమును ఆర్జించుటయే అతడట్లు చేయుటకు కారణము. అట్లే రజస్తమోగుణములతో నున్నవారు సాధారణముగా శక్తిమంతుడైన ఒక మానవుని భగవానునిగా ఎన్నుకొందురు. వారెవరినైనను భగవానుని రూపమున పూజించి సమాన ఫలితములను పొందవచ్చునని భావింతురు.

రజోగుణము నందున్నవారు కృత్రిమముగా దేవతలను సృష్టించి పూజించు చుందురనియు, తమోగుణము నందున్నవారు భూతప్రేతములను పూజింతురనియు ఇక్కడ స్పష్టముగా తెలుపబడినది. కొందరు జనులు మరణించినవారి సమాధులను పూజింతురు. వ్యభిచారము కూడ తమోగుణ లక్షణముగ భావింపబడును. అట్లే భారతదేశము నందలి మారుమూల గ్రామములలో భూతపిశాచములను పూజించు వారుందురు. భారతదేశము నందలి నిమ్నజాతి జనులు కొందరు కొన్నిమార్లు అడవికి వెళ్ళి ఏ వృక్షము నందైనను పిశాచమున్నదని తెలిసినచో ఆ వృక్షమును పూజించి బలులర్పించుటను మనము చూచుచుందుము. ఈ విధమైన పూజలు నిజముగా భగవత్పూజలు కాజాలవు. భగవత్పూజ శుద్ధసత్త్వము నందు ఆధ్యాత్మికముగా నెలకొనినవారి కొరకై ఉద్దేశింపబడినది. శ్రీమద్భాగవతము (4.3.23) నందు ఇట్లు చెప్పబడినది : "సత్త్వం విశుద్ధం వసుదేవశబ్దితమ్"- "మానవుడు శుద్ధసత్త్వము నందు నెలకొనినప్పుడే వాసుదేవుని పూజించును." సారాంశమేమనగా, భౌతిక ప్రకృతి గుణముల నుండి పూర్తిగా శుద్ధులై ఆధ్యాత్మిక స్థితియందు నెలకొనినవారు మాత్రమే దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని పూజింపగలరు.

నిరాకారవాదులు సత్త్వగుణము నందున్నట్లుగా భావింపబడుదురు. వారు 'పంచోపాసకులు' అనగా పంచవిధములైన దేవతలను పూజింతురు. అంతేకాకుండ, వారు భౌతిక ప్రపంచమున విష్ణువును నిరాకారునిగా (తాత్త్విక భావనలో) అర్చింతురు. విష్ణువు దేవాదిదేవుని విస్తరణము. కాని నిరాకారవాదులు దేవాదిదేవుని యందు విశ్వాసము లేనివారగుటచే చివరకు విష్ణురూపము కూడ నిరాకార బ్రహ్మము యొక్క మరొక సాత్త్విక అంశయని భావింతురు. అట్లే, వారు బ్రహ్మదేవుని రూపము భౌతిక రజోగుణముతో కూడిన నిరాకారబ్రహ్మమని భావింతురు. ఈ విధముగా వారు కొన్నిమార్లు పూజార్హమగు పంచవిధ దేవతలను ఉపాసము చేసినను నిరాకారబ్రహ్మమే నిజమైన పరతత్త్వమని భావించుటచే చివరికి పూజనీయమైన దేవతారూపముల నన్నింటిని అనగా పంచోపాసనను విడిచి వేయుదురు. శుద్ధసత్త్వస్వభావము కలిగిన భక్తుల సాంగత్యము ద్వారా వివిధమైన భౌతిక గుణములను శుద్ధము చేసుకొనవచ్చునని సారాంశము.

## 17.5 - 6

**అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనా: ।**
**దమ్భాహంకారసంయుక్తా: కామరాగబలాన్వితా: ॥**

**కర్షయన్త: శరీరస్థం భూతగ్రామమచేతస: ।**
**మాం చైవాన్త: శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్ ॥**

### అనువాదము

**శాస్త్రములందు చెప్పబడని తీవ్రతపోనిష్ఠలను గర్వముతోడను అహంకారము తోడను ఒనరించువారును, కామరాగములచే ప్రేరేపింపబడిన వారును, మూఢులును, పంచభూతాత్మకమైన దేహమును మరియు ఆ దేహము నందున్న పరమాత్మను కూడా కష్టపెట్టువారును అసురులుగా తెలియబడుదురు.**

### భాష్యము

శాస్త్రములందు పెర్కొనబడని తపోనిష్ఠావిధానములను సృష్టించుకొను వారు కొందరుందురు. ఉదాహరణకు స్వార్థముతో కూడినట్టి రాజకీయ ప్రయోజనము కొరకు చేయు ఉపవాసములు శాస్త్రములందు ఆదేశింపబడలేదు. ఏదోఒక సాంఘిక లేక రాజకీయ ప్రయోజనముల కొరకు కాకుండ ఆధ్యాత్మికోన్నతి కొరకు మాత్రమే శాస్త్రములు ఉపవాసమును ఆదేశించును. అట్టి తపోనిష్ఠలను పాటించు వ్యక్తులు నిశ్చయముగా అసుర స్వభావులే యగుదురు. వారి కర్మలు సదా శాస్త్రాదేశములకు వ్యతిరేకముగా నుండుటయే కాకుండ సామాన్య జనులకు హితకరములు కాకుండును. వాస్తవమునకు, వారు ఆ కార్యములను గర్వము, అహంకారము, కామము, ఇంద్రియభోగముల పట్ల ఆసక్తితోనే ఆచరింతురు. అట్టికార్యముల వలన దేహనిర్మాణ సాధనములైన పంచభూతముల సముదాయమే కాకుండ, దేహము నందుండెడి పరమాత్మ రూపుడైన దేవాదిదేవుడు కూడ కలత నొందింపబడును. అంతేకాకుండ, రాజకీయ ప్రయోజనముల కొరకు చేయబడు అట్టి అప్రామాణికములైన తపస్సు లేదా ఉపవాసములు ఇతరులను కూడ తప్పక కలత నొందించును. అట్టి తపస్సులు వైదిక గ్రంథము లందు తెలుపబడలేదు. అసుర స్వభావము గలవారు ఈ విధానము ద్వారా తన శత్రువుని గాని, ఎదుటి పక్షమును గాని బలవంతముగా తమ కోరికను అంగీకరించునట్లుగా

చేయవచ్చునని భావించుచుందురు. కాని కొన్నిమార్లు అట్టి ఉపవాసము ద్వారా మరణము కూడ సంభవించు చుండును. దేవాదిదేవుడు అట్టి కార్యములను ఆమోదించుట లేదు. అట్టి కార్యములందు నిమగ్నులైన వారు అసురులని అతడు చెప్పుచున్నాడు. అట్టి ప్రదర్శనలు శాస్త్రాదేశములకు వ్యతిరేకముగా చేయబడుటచే వాస్తవమునకు దేవాదిదేవుని అవమానపరచినట్లే యగును. ఈ సందర్భమున 'అచేతస:' అను పదము ప్రధానమైనది. సామాన్య మానసికస్థితి కలిగినవారు శాస్త్రనియమములను విధిగా పాటింపవలెను. అట్టి స్థితియందు లేనివారు శాస్త్రములను తిరస్కరించి దానికి వ్యతిరేకముగ తమ స్వంత తపోనిష్ఠలను రూపొందించు కొందురు. గత అధ్యాయమున వర్ణింపబడినట్లు, ఆసురీ స్వభావుల చరమగమ్యము ఎటువంటిదో మనము ఎల్లప్పుడును గుర్తించుకోవలెను. భగవానుడు వారిని అసురయోనులందే పడద్రోయును. దానికిఫలితముగా వారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునితో తమకు గల సంబంధమును ఎరుగక జన్మజన్మలలోను అసుర గుణములతోనే జీవింతురు. ఒకవేళ వారు కనుక వేదవిజ్ఞాన మార్గమున నిర్దేశింపగల ఆధ్యాత్మికాచార్యునిచే వేదనిర్దేశములను పొందగల అదృష్టవంతులైనచో, అట్టివ్యక్తులు ఈ భౌతిక బంధముల నుండి విముక్తిని పొంది చివరికి పరమగమ్యమును చేరగలుగుదురు.

## 17.7

**ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియ: ।**
**యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శ్రుణు ॥**

### అనువాదము

**త్రిగుణముల ననుసరించి మానవుడు భుజించు ఆహారము కూడ మూడు విధములుగా నుండును. అట్లే యజ్ఞము, ధానము, తపస్సులు కూడా మూడు విధములుగా నుండును. ఇప్పుడు వాటి నడుమ గల భేదములను గూర్చి వినుము.**

### భాష్యము

భౌతిక ప్రకృతి త్రిగుణముల యందలి భిన్నస్థితుల ననుసరించి ఆహారయజ్ఞ నిర్వహణము లందును, తపోదానము లందును భేదములు గలవు. అవియన్నియు ఎన్నడును సమాన ప్రమాణమున నిర్వహింపబడవు. ఏ విధమైన కర్మలు ఏ భౌతిక ప్రకృతి గుణము లందు నిర్వహింపబడు చున్నవనెడి విషయమును వివరముగా అవగాహనము చేసికొనినవారే నిజమైన బుద్ధిశాలురు. అట్లుగాక, అన్నిరకములైన ఆహారములు, యజ్ఞములు, దానములు వంటివి సమానము లేనని భావించుచు భేదమును గ్రహింపలేనివారు మూఢులు. ఎవరైనను తమకు తోచిన దేదైనను చేయుచు పరిపూర్ణత్వమును పొందవచ్చునని వాదించు ప్రచారకులు కూడ కొందరు గలరు. కాని అట్టి మూర్ఖులైన ప్రచారకులు శాస్త్రాదేశముల ననుసరించి నడుచుకొనువారు కారు. వారు తమకుతోచినట్లుగా నూతన మార్గములను సృష్టించుచు జనులను పెడదారి పట్టించుచున్నారు.

**17.8**
**ఆయు: సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనా: ।**
**రస్యా: స్నిగ్ధా: స్థిరా హృద్యా ఆహారా: సాత్త్వికప్రియా: ॥**

## అనువాదము

**సత్త్వగుణము నందున్న వారికి ప్రియమైన ఆహారములు ఆయు: ప్రమాణమును వృద్ధి చేయును. జీవనమును పవిత్ర మొనర్చును. బలమును, ఆరోగ్యమును, ఆనందమును, తృప్తిని కలిగించును. అట్టి ఆహారములు రసవంతములను, పుష్టికరములను, ఆరోగ్యకరములును, హృదయ ప్రీతికరములును అయియుండును.**

**17.9**
**కట్వమ్లలవణాత్యుష్ణతీక్ ష్ణరూక్షవిదాహిన: ।**
**ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదా: ॥**

## అనువాదము

**మిక్కిలి చేదైనట్టియు, అతి పులుపైనట్టియు, ఉప్పగా నున్నట్టియు, అతి వేడియైనట్టియు, తీవ్రమైనట్టియు, రసహీనమైనట్టియు, మంట కలిగించు నట్టియు ఆహారములు రజోగుణము నందున్న వారికి ప్రీతికరములు. అట్టి ఆహారములు దుఃఖమును, క్లేశమును , రోగమును కలిగించును.**

**17.10**
**యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।**
**ఉచ్చిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥**

## అనువాదము

**భుజించుటకు మూడుగంటలకు ముందు వండబడినవియు, రుచి హీనమైనవియు, చెడువాసనతో కూడి క్రుళ్ళినట్టియు, ఇతరులు తినగ మిగిలినదియు (ఎంగిలి) మరియు నిషిద్ధ పదార్థములతో కూడినదియు అగు ఆహారము తమోగుణము నందున్న వారికి ప్రీతికరములైనవి.**

## భాష్యము

జీవిత ప్రమాణమును వృద్ధిచేయుచు, మనస్సును పవిత్రము చేయుచు, దేహశక్తికి తోడ్పడుటయే ఆహారము యొక్క ఏకైక ప్రయోజనము. జీవిత ప్రమాణమును వృద్ధిచేయునట్టియు, ఆరోగ్యమును పెంపొందించునట్టియు పాలు, బియ్యము, గోధుమలు, పండ్లు, పంచదార, కూరగాయలు వంటి ఆహార పదార్థములు ఆమోదకరమైనవని ప్రామాణికులైనట్టి ప్రాచీన సాధువులు నిర్ణయించిరి. అట్టి ఆహారము సత్త్వగుణము నందున్నవారికి మిక్కిలి ప్రియములు. పేలాలు మరియు ముద్దబెల్లము

వంటి ఇతర ఆహారపదార్థములు సహజముగా రుచికరములు కాకున్నను పాలతో కాని ఇతర ఆహారపదార్థములతో కాని వాటిని కలిపినచో అవి రుచికరములై సాత్త్వికములగును. ఈ ఆహారము లన్నియు సహజముగనే పరిశుద్ధములైనవి. మద్యమాంసముల వంటి అస్పృశ్య పదార్థములకు అవి మిక్కిలి భిన్నములైనవి. ఎనిమిదవ శ్లోకమున చెప్పబడిన కొవ్వు పదార్థములకును మరియు జంతువులను చంపగా లభించెడి క్రొవ్వు పదార్థములకును ఎట్టి సంబంధము లేదు. ఇట్టి క్రొవ్వు పదార్థము లన్నియును అత్యంత అద్భుతాహారమైనట్టి క్షీరరూపమున లభించుచున్నవి. పాలు, వెన్న, మీగడ వంటివి మూగజంతువు యొక్క క్రొవ్వును మరొక రూపమున అందించు నటువంటివి. అవి జంతువధను నివారించుచున్నవి. కాని పశుప్రవృత్తి కారణముగా ఈ జంతువధ నిరాటంకముగా కొనసాగుచున్నది. జీవనమునకు అవసరమైన క్రొవ్వుపదార్థములను పాలరూపమున పొందుట యనునది నాగరిక పద్ధతి కాగా జంతువధ యనునది మిక్కిలి అనాగరికము. మానవులకు ఇది తగనిది. పప్పులు, గోధుమలు వంటి పదార్థముల ద్వారా మాంసకృత్తులు సమృద్ధిగా లభించును.

అతిగా చేదైనట్టివియు, అతిగా ఉప్పుగా నున్నట్టివియు, అతిగా వేడి లేదా అతిగా కారముతో కూడినట్టి రజోగుణ ఆహారములు ఉదరము నందలి రాక్షసపొరను పలచపరచి జీర్ణరసములను తగ్గించి రోగమునకు కారణభూత మగును. అది దుఃఖమునే కలిగించును. తాజాగా లేనటువంటి పదార్థములే ముఖ్యముగా తమోగుణమునకు సంబంధించినవి. భగవానుని ప్రసాదములు తప్ప తినుటకు మూడుగంటల ముందుగా వండబడిన ఆహారము తామసికముగనే పరిగణింపబడును. అట్టి ఆహారపదార్థములు క్రుళ్ళిపోవుట చేత చెడువాసనను కలిగియుండును. అవి తమోగుణముతో కూడిన వ్యక్తులకు ఆకర్షణీయముగా నుండినను సాత్త్వికులకు అసహ్యముగా నుండును.

తొలుత దేవాదిదేవునికి అర్పింపబడినది మరియు సాధువులైనవారి చేత ముఖ్యముగా ఆధ్యాత్మికాచార్యుని చేత భుజింపబడినట్టి భోజనమును ఉచ్ఛిష్టముగా భుజింపవలెను. లేనిచో ఉచ్ఛిష్టము తామసికముగానే పరిగణింపబడును. అది అంటువ్యాధిని మరియు రోగములనే వృద్ధిచేయును. అట్టి ఆహారపదార్థములు తామసులకు రుచికరములుగా నున్నను సాత్త్వికులకు ప్రియములు కాకుండుట చేత అవి వారిచే తాకనైనతాకబడవు. తొలుత దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునకు అర్పింపబడిన ఆహారపదార్థములే అత్యంత శ్రేష్ఠమైన ఆహారము. కాయకూరల తోను, పిండితోను, పాలతోను సిద్ధము చేయబడిన ఆహారపదార్థములు భక్తి మరియు ప్రేమలతో సమర్పింపబడినప్పుడు వాటిని తాను గ్రహింతునని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీత (9.26) నందు చెబుతున్నాడు : "పత్రము పుష్పం ఫలం తోయమ్." దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు స్వీకరించునని భక్తిప్రేమలు మాత్రమే. ప్రసాదమును ప్రత్యేక పద్ధతి ననుసరించి సిద్ధము చేయవలెననియు చెప్పబడినది. ఆ విధముగా శాస్త్రానుసారముగా తయారు చేయబడి, దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి అర్పింపబడిన ఆహారము దివ్యమైనదగుటచే ఎంత కాలవ్యవధియైనను అది గ్రహింప యోగ్యమై యుండును. కనుకనే ఆహారమును అందరికిని పాపరోగ నిరోధకముగా ఆహారయోగ్యముగా, రుచికరముగా చేయుటకై ఎవరైనను దానిని తొలుత శ్రీకృష్ణభగవానునకు అర్పింపవలెను.

## 17.11

**అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదిష్టో య ఇజ్యతే ।**
**యష్టవ్యమేవేతి మన: సమాధాయ స సాత్త్వికః ॥**

### అనువాదము

**శాస్త్ర నిర్దేశానుసారము తమ స్వధర్మమని భావింపబడుచు ఫలములు కోరని వారిచే చేయబడు యజ్ఞము యజ్ఞము లందు సాత్త్విక యజ్ఞమనబడును.**

### భాష్యము

ఏదేనిఒక ప్రయోజనమును మనస్సు నందుంచుకొని యజ్ఞము చేయుట సర్వసాధారణము. కాని ఇక్కడ అటువంటి కోరిక ఏదియు లేకుండ యజ్ఞము చేయవలెనని చెప్పబడినది. అది సదా స్వధర్మమను దృష్టితో చేయవలెను. దేవాలయము లందు గాని, క్రైస్తవ ప్రార్థనా మందిరములందు గాని నిర్వహింపబడు కార్యక్రమములను మనము ఉదాహరణముగా తీసుకొనవచ్చును. సాధారణముగా అవి ఏదేనిఒక ప్రత్యేకమైన భౌతిక ప్రయోజనము కొరకై చేయబడును. కనుక అవి సత్త్వగుణమునకు సంబంధించినవి కావు. ఎవ్వరైనను స్వధర్మమనెడి భావనలో మందిరమునకు లేక చర్చికి వెళ్ళి దేవాదిదేవునకు ప్రణమిల్లి, పుష్పములను మరియు ఆహారపదార్థములను ఎట్టి భౌతిక లాభమును ఆశింపకుండ భక్తితో సమర్పింప వలెను. కేవలము భగవానుని పూజనిమిత్తమే దేవాలయములకు వెళ్ళుట వలన ప్రయోజనము లేదని అందరు భావిస్తుంటారు. కాని శాస్త్రములందు భౌతిక ప్రయోజనములను ఆశించి పూజ చేయవలెనని ఆదేశించుట లేదు. భగవానునికి ప్రణామముల నర్పించుట కొరకు మాత్రమే మానవుడు దేవాలయమునకు వెళ్ళవలెను. అది మానవుని సత్త్వగుణము నందుంచగలదు. కనుక శాస్త్రాదేశముల ననుసరించుట మరియు దేవాదిదేవునికి ప్రణామము లర్పించుట వంటి కార్యములు ప్రతి నాగరికవ్యక్తి ధర్మమై యున్నది.

## 17.12

**అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్ ।**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥**

### అనువాదము

**ఓ భరతశ్రేష్ఠా! ఏదేని ఒక భౌతిక ప్రయోజనము కొరకు లేదా ఆడంబరము కొరకు నిర్వహింపబడు యజ్ఞము రజోగుణ ప్రధానమైనదని యెరుగుము.**

### భాష్యము

కొన్నిమార్లు యజ్ఞములు మరియు కొన్నికర్మలు స్వర్గలోక ప్రాప్తికొరకు లేదా ఈ జగత్తున ఏదేని భౌతిక ప్రయోజనము కొరకు చేయబడుచుండును. అట్టి యజ్ఞములు, ఆచారకర్మలు రజోగుణ ప్రధానములైనవిగా భావింపబడును.

## 17.13
**విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥**

### అనువాదము

**శాస్త్రనిర్దేశముల యెడ గౌరవము లేకుండ, ప్రసాద వితరణము కాని, వేదమంత్ర పఠనము కాని, పురోహితాదులకు సంభావనలు కాని లేకుండ శ్రద్ధారహితముగా చేయబడు యజ్ఞమేదైనను తమోగుణ ప్రధానమైనదిగా భావింపబడును.**

### భాష్యము

తమోగుణముతో కూడియున్నట్టి శ్రద్ధ వాస్తవమునకు శ్రద్ధారాహిత్యమే యనబడును. కొందరు ధనార్జనము కొరకు మాత్రమే ఏదేని దేవతను పూజించి, శాస్త్రాదేశములను లెక్కచేయక ఆ ధనమును వినోదము కొరకు ఉపయోగింతురు. అట్టి ఆడంబరముతో కూడిన మతప్రదర్శనములు నిజమైనవిగా గుర్తింపబడవు. అవియన్నియును తమోగుణమునకు సంబంధించినట్టివే. అవి కేవలము రాక్షస స్వభావమునే కలిగించునే గాని మానవ సమాజమునకు హితకరములు కాజాలవు.

## 17.14
**దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥**

### అనువాదము

**దేవాదిదేవుని, బ్రాహ్మణులను, ఆధ్యాత్మికాచార్యుని, పూజ్యులైన తల్లిదండ్రులు మొదలగు వారిని పూజించుట, శుచిత్వము, సరళత్వము, బ్రహ్మచర్యము, అహింస యనునవి దేహ సంబంధమైన తపస్సని చెప్పబడును.**

### భాష్యము

దేవాదిదేవుడు ఇక్కడ వివిధ రకాల తపస్సులను, నిష్ఠలను వివరించు చున్నాడు. తొలుత అతడు దేహసంబంధమైన తపోనిష్ఠలను వివరించుచున్నాడు. ప్రతియొక్కరు దేవాదిదేవునకు లేక దేవతలకు, సాధువులకు, పరిపూర్ణ యోగ్యులైన బ్రాహ్మణులకును, ఆధ్యాత్మికాచార్యునికి మరియు తల్లిదండ్రుల వంటి పెద్దలను లేక వేదవిజ్ఞాన సంపన్నుడైన ఎవ్వక్తి నైనను గౌరవింపవలను లేదా గౌరవించుటను అభ్యసింపవలెను. వీరందరును గౌరవమును పొందదగినవారు. అట్లే మానవుడు బాహ్యముగను మరియు అంతరముగను శుచిత్వమును అభ్యసించి వ్యవహారము లందు సరళవర్తనుడుగా నుండుటను కూడ అభ్యసింపవలెను. శాస్త్రములు అంగీకరింపని దానినెన్నడును వారు ఆచరింపరాదు. శాస్త్రము లందు మైథునభోగ మనునది వైవాహిక జీవితము నందు తప్ప అన్యముగా అంగీకరింప బడనందున అతడు వివాహేతర సంబంధమును కలిగియుండరాదు. అదియే బ్రహ్మచర్య పాలనము. దేహమునకు సంబంధించిన తపోనిష్ఠలివియే.

**17.15**
**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియాహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥**

## అనువాదము

**సత్యములు, ప్రీతికరములు, హితకరములు, ఇతరులకు ఉద్రేకము కలిగింపని వచనములను పలుకుట మరియు నిత్యము వేదములను అభ్యసించుట యనునవి వాక్కునకు సంబంధించిన తపస్సనబడును.**

## భాష్యము

ఇతరుల మనస్సుకు కలత కలిగించునట్లుగా ఎన్నడును భాషింపరాదు. కాని గురువు తన శిష్యులకు బోధించుట కొరకు సత్యమును పలుకవచ్చును. కాని అతడు తన విద్యార్థులు లేక శిష్యులు కాని వారి మనస్సులు కలత పడునట్లుగా పలుకరాదు. వాక్కునకు సంబంధించినంత వరకు ఇదియే తపస్సు. అంతేకాకుండ, ఎవ్వరును వ్యర్థప్రసంగములను చేయరాదు. భక్తుల సత్సాంగత్యమున శాస్త్రములచే సమర్థింపబడిన విషయములను మాత్రమే చర్చింపవలెను. ఎవరైనను తాను ప్రవచించిన దానిని సమర్థించుటకై ప్రామాణిక శాస్త్రప్రమాణమును వెంటనే నిదర్శనముగా చూపవలెను. దానితోపాటు ఆ ప్రవచనము కూడా శ్రవణానంద కారముగా ఉండవలెను. అట్టిచర్చల ద్వారా ఎవరైనను అత్యున్నతమైన లాభమును పొంది మానవ సమాజమును ఉద్ధరింపగలడు. మానవుడు అపరిమితముగా నున్నట్టి వేదములను అభ్యసించవలెను. ఇదియే వాక్కునకు సంబంధించిన తపస్సనబడును.

**17.16**
**మన:ప్రసాద: సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహ: ।**
**భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే ॥**

## అనువాదము

**తృప్తి, సరళత్వము, మౌనము, ఆత్మనిగ్రహము, జీవిత పవిత్రత్వము యనునవి మనస్సునకు సంబంధించిన తపస్సనబడును.**

## భాష్యము

మనస్సును తపోసంపన్నము చేయుట యనగా దానిని ఇంద్రియతృప్తి ఆసక్తి నుండి దూరము చేయుటయే. ఎల్లప్పుడు ఇతరులకు మేలు చేయుటను గూర్చియే ఆలోచించునట్లుగా దానికి శిక్షణనివ్వవలెను. నిశ్చలమైన ఆలోచన మనస్సునకు గల ఉత్తమ శిక్షణ విధానము. ఎవరును కృష్ణచైతన్యము నుండి ఏమాత్రము పెడదారిపట్టక ఎల్లప్పుడు ఇంద్రియతృప్తిని వర్జింపవలెను. కృష్ణచైతన్యమును కలిగియుండుట అనగా స్వభావమును పవిత్రము చేసికొనుటయే కాగలదు. మనస్సును ఇంద్రియతృప్తికి సంబంధించిన ఆలోచనల నుండి దూరము చేయుట ద్వారా మానసిక సంతృప్తి లభింపగలదు. ఇంద్రియతృప్తిని గూర్చి మనము ఎంతగా ఆలోచింతుమో అంతగా మనస్సు అసంతృప్తికి గురియగును. నేటి యుగమున మనము అనవసరముగా ఇంద్రియతృప్తికి సంబంధించిన అనేక విషయములందు మనస్సును లగ్నము

చేయుదుము. కనుక మన మనస్సు తృప్తి నొందుటకు అవకాశము లేకుండ నున్నది. వేదవాఙ్మయము వైపునకు మనస్సును మరలించుటయే ఉత్తమ మార్గము. అట్టివాఙ్మయము పురాణములు, మహా భారతములందు వలె మనస్సునకు తృప్తికలిగించు కథలను కలిగియుండును. ఆ జ్ఞానమును అవకాశముగా తీసుకొని ఎవరైనను పవిత్రులు కావచ్చును. మనస్సు వంచన స్వభావము లేకుండ ఇతరుల శ్రేయస్సును గూర్చి ఆలోచించవలెను. మౌనము అనగా ఎల్లప్పుడును ఆత్మానుభూతిని గూర్చి ఆలోచించుటయే. ఇట్టి భావనలో కృష్ణచైతన్యవంతుడైన భక్తుడు పూర్తిమౌనమును పాటించును. మనో నిగ్రహమనగా మనస్సును ఇంద్రియ భోగానుభూతి నుండి మరల్చుటయేనని భావము. అంతేకాకుండ, మానవుడు తన వ్యవహార కార్యము లందు న్యాయముగా నుండి తన జీవితమును పవిత్రము చేసుకొనవలెను. ఈ గుణలక్షణము లన్నియును కలిసి మానసిక తపస్సనబడును.

**17.17**
**శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్ త్రివిధం నరైః ।**
**అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే ॥**

**అనువాదము**

**ఆధ్యాత్మిక శ్రద్ధతో కేవలము భగవానుని నిమిత్తమే భౌతిక వాంఛారహితులైన వారిచే చేయబడు ఈ త్రివిధ తపస్సులు సాత్త్విక తపస్సనబడును.**

**17.18**
**సత్కారమానపూజార్థం తపో దమ్భేన చైవ యత్ ।**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్ ॥**

**అనువాదము**

**ఇతరుల నుండి గౌరవము, సన్మానము, పూజలనందుట కొరకు గర్వముతో చేయబడు తపస్సు రజోగుణమునకు సంబంధించినది. అది స్థిరము గాని, శాశ్వతము గాని కాజాలదని చెప్పబడినది.**

**భాష్యము**

కొన్నిమార్లు జనులను ఆకర్షించుటకు మరియు ఇతరుల నుండి గౌరవపూజా సన్మానములను పొందుటకు తపోనిష్ఠలు ఆచరింప బడుచుండును. రజోగుణముతో కూడినవారు తమ అనుయాయులు తమను పూజించునట్లుగా తమ పాదములు కడిగి దక్షిణలు సమర్పించునట్లుగా చేయుచుందురు. కృత్రిమముగా చేయబడెడి అట్టి తపోప్రదర్శనలు రజోగుణమునకు సంబంధించినవిగా భావింపబడును. వాస్తవమునకు వాటి ఫలితములు తాత్కాలికములు. అవి కొంతకాలము సాగవచ్చును కాని శాశ్వతములు కాజాలవు.

**17.19**
**మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ ॥**

## అనువాదము

**తనను తాను హింసించుకొనుటచే గాని, ఇతరులకు హాని లేదా నష్టమునుకలిగించుట కొరకు మూఢత్వముతో చేయబడు తపస్సు తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

## భాష్యము

హిరణ్యకశిపుడు వంటి రాక్షసులు కూడ మూఢతపస్సు నొనరించిన దృష్టాంతములు అనేకము గలవు. అతడు అమరుడగుటకును, దేవతలను వధించుటకును నిష్ఠతో కూడిన కఠిన తపస్సుల నాచరించెను. అతడు బ్రహ్మదేవుని అట్టి వరములకై ప్రార్థించినను చివరికి దేవాదిదేవునిచే సంహరింపబడెను. ఏదో అసంభవమైన దానిని పొందుటకొరకై చేయబడెడి తపస్సు నిశ్చయముగా తమోగుణమునకు సంబంధించినదే.

**17.20**
**దాతవ్యమితి యద్దానం దీయతే నుపకారిణే ।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతిమ్ ॥**

## అనువాదము

**ప్రతిఫల వాంఛ లేకుండా సరియైన ప్రదేశమున మరియు సరియైన కాలమున తగిన వ్యక్తికి స్వధర్మమను దృష్టితో చేయబడు దానము సత్త్వగుణమును కూడినదిగా భావింపబడును.**

## భాష్యము

ఆధ్యాత్మిక కర్మలందు నియుక్తుడైన వ్యక్తికి దానము చేయవలెనని వైదిక గ్రంథములందు ఆదేశింపబడినది. విచక్షణారహితముగా చేయబడు దానము దానియందు ఆదేశింపబడలేదు. ఆధ్యాత్మిక పరిపూర్ణత్వము గలవాడే సదా దానమునకు అర్హుడు. కనుకనే తీర్థక్షేత్రము నందు కాని, గ్రహణ సమయము నందు కాని, మాసాంతము నందు కాని, యోగ్యుడైన బ్రాహ్మణునకు కాని, వైష్ణవభక్తునకు కాని, దేవాలయము లందు కాని దానమును చేయవలెనని ఆదేశింపబడినది. ప్రతి ఫలమును ఆశింపకుండ అట్టి దానములను చేయుచుండ వలెను. దయతో కొన్నిమార్లు పేదవారికి దానము చేయబడుచుండును. కాని ఆ పేదవాడు దానమునకు పాత్రుడు కానిచో అట్టి దానము ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడదు. అనగా పాత్రాపాత్రతలను గుర్తింపకుండ దానము చేయరాదని వైదిక గ్రంథముల అభిప్రాయము.

**17.21**
**యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః ।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥**

**అనువాదము**

**ప్రత్యుపకారవాంఛతో గాని, సకామ ఫలవాంఛతో గాని, అయిష్టతతో గాని ఒనరింపబడు దానము రజోగుణమును కూడినట్టిదని చెప్పబడును.**

**భాష్యము**

దానము కొన్నిమార్లు స్వర్గలోకప్రాప్తి కొరకు గాని, అధికమైన కష్టముతో గాని నేనెందుకు ఈ విధముగా ఇంత ఖర్చు చేసితిననెడి పశ్చాత్తాపముతో గాని చేయబడు చుండును. అట్లే మరికొన్నిమార్లు తమ పై అధికారి కోరిక ననుసరించి కాదనలేక మెహమాటముతో దానము చేయబడుచుండును. ఈ విధములైన దానములు రజోగుణమునకు సంబంధించినవని చెప్పబడును.

అదేవిధముగా ఇంద్రియతృప్తిని ప్రోత్సహించు వివిధ సంఘములకు దానములు చేయు ధర్మసంస్థలనేకములు గలవు. వైదిక గ్రంథములు అట్టి దానములను ఆమోదింపవు. కేవలము సాత్త్వికమైన దానమే వానియందు ఉపదేశింపబడినది.

**17.22**
**అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే ।**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥**

**అనువాదము**

**అపవిత్ర ప్రదేశము నందు తగని కాలమందు అపాత్రులకు చేయబడు దానము లేదా తగిన వ్యక్తులకు శ్రద్ధాగౌరవములు లేకుండా చేయబడు దానము తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

**భాష్యము**

మత్తుపదార్థముల కొరకును, జూదము కొరకును చేయబడు దానములను ఇక్కడ ప్రోత్సహింపరాదు. అట్టిదానము తమోగుణమునకు సంబంధించినది. అవి లాభకరములు కాకపోవుటయే కాకుండ పాపులను ప్రోత్సహించును. అట్లే ఎవరైనా తగినవారికి శ్రద్ధ మరియు గౌరవము లేకుండా దానము చేసినచో అట్టి దానము కూడ తమోగుణమునకు చెందిన దానముగా భావింపబడును.

**17.23**
**ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధ: స్మృత: ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితా: పురా ॥**

**<u>అనువాదము</u>**

**సృష్టి ఆరంభము నుండియు 'ఓం తత్ సత్' అను మూడు పదములు పరతత్త్వమును సూచించుటకు ఉపయోగింపబడినవి. బ్రాహ్మణులచే వేద మంత్రములను ఉచ్చరించునపుడును, పరబ్రహ్మ ప్రీత్యర్థమై యజ్ఞాచరణము కావించునపుడును ఈ మూడు సంజ్ఞాపదములు ఉపయోగింప బడుచుండెను.**

**<u>భాష్యము</u>**

సత్త్వరజస్తమో గుణముల ననుసరించి తపము, యజ్ఞము, దానము, ఆహారములు మూడు విధములుగా విభజింపబడినవని ఇంతవరకు విశదీకరింప బడినవి. ఈ విధముగా ప్రథమ, ద్వితీయ, తృతీయ తరగతులకు చెందినవైనను అవియన్నియును భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములచే నియంత్రింపబడి కలుషితమైనట్టివి. 'ఓం తత్ సత్' – అట్టి కర్మలు శాశ్వతుడైన దేవాదిదేవుని కొరకై ఉద్దేశింపబడినప్పుడు అవి ఆధ్యాత్మిక పురోగతికి సాధనములగును. శాస్త్రాదేశములందు అట్టి ప్రయోజనమే సూచింపబడినది. 'ఓం తత్ సత్' అనెడి ఈ మూడు పదములు ముఖ్యముగా పరతత్త్వమును దేవాదిదేవుని సూచించును. వేదమంత్రములందు 'ఓం' అను పదము ఎల్లప్పుడును గోచరించును.

శాస్త్రనియమముల ననుసరింపకుండ కర్మచేయువాడు పరతత్త్వమును పొందజాలడు. అతడు ఏదో తాత్కాలిక ఫలమును పొందవచ్చును కాని జీవితపు చరమ గమ్యమును మాత్రము సాధింపజాలడు. సారాంశమేమనగా, దానము, యజ్ఞము, తపస్సు అనువానిని సత్త్వగుణముతో చేయవలెను. రజస్తమోగుణము లందు చేయబడినచో అవి తక్కువ తరగతికి చెందినవగును. 'ఓం తత్ సత్' అను మూడు పదములను భగవానుని పవిత్ర నామమునకు సంబంధించి ఉచ్చరింపబడు చుండును. 'ఓం తద్విష్ణో:' అనునది అందులకు ఒక ఉదాహరణము. వేదమంత్రము కాని, భగవానుని పవిత్ర నామము కాని ఉచ్చరింప బడునపుడు తొలుత 'ఓం' అను పదము చేర్చబడుచుండును. కనుకనే దేనినైనను వేదమంత్ర మనుటకు ఇదియే సూచనము. అట్టి ఈ మూడు పదములు వేదమంత్రముల నుండియే గ్రహింపబడినవి. "ఓం ఇత్యేతద్ బ్రాహ్మణో నేదిష్ఠం నామ" (ఋగ్వేద మంత్రము) మంత్రము ఓంకారమును మరియు ప్రథమ నామమును సూచించును. తరువాత : "తత్త్వమసి" అను 'ఛాందోగ్యోపనిషత్తు' (6.8.7) మంత్రము ద్వితీయ నామమును సూచించును. "సదేవ సౌమ్య" అను 'ఛాందోగ్యోపనిషత్తు' (6.2.1) మంత్రము తృతీయ నామమును సూచించును. ఈ మూడింటి కలయికయే 'ఓం తత్ సత్'. పూర్వము తొలిజీవుడైన బ్రహ్మదేవుడు యజ్ఞములను చేసినపుడు ఈ మూడు పదములతోనే దేవాదిదేవుని స్తుతించెను. కనుకనే అదే నియమము గురుశిష్య పరంపరచే కూడ నిరంతరము ఆచరింపబడుచున్నది. కనుకనే ఈ మంత్రమునకు గొప్ప ప్రాధాన్యము కలదు. కనుకనే ఏ కార్యమునైనను 'ఓం తత్ సత్' అనగా దేవాదిదేవుని కొరకు మాత్రమే చేయవలెనని భగవద్గీత ఆదేశించుచున్నది. ఎవరైనను మూడు పదములతో కూడిన దానము, తపస్సు, యజ్ఞమును చేసినచో అతడు కృష్ణచైతన్యముతో వర్తించినవాడగును. మానవుని తిరిగి భగవద్ధామమునకు చేర్చగల ఆధ్యాత్మిక కర్మలను

శాస్త్రీయముగా నిర్వహించు విధానమే అట్టి కృష్ణచైతన్యము. అట్టి ఆధ్యాత్మిక మార్గమున వర్తించుటలో ఎన్నడును శక్తి వృథాకాబోదు.

**17.24**
**తస్మాత్ ఓం ఇత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః ।**
**ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥**

**అనువాదము**

**అందుచే శాస్త్రనియమానుసారము యజ్ఞము, దానము, తపస్సులను చేసెడి తత్త్వజ్ఞులు దేవాదిదేవుని పొందుటకై వానిని ఎల్లప్పుడును 'ఓం' అను పదముతో ప్రారంభింతురు.**

**భాష్యము**

'ఓం తద్విష్ణోః పరమం పదమ్' (ఋగ్వేదము 1.22.20)- విష్ణు పాదపద్మములే పరమభక్తికి పరమాశ్రయములు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని కొరకు చేయబడు కార్యములన్నియు పరిపూర్ణత్వమును నిశ్చయముగా సిద్ధింపజేయును.

**17.25**
**తదిత్యనభిసన్ధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః ।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః ॥**

**అనువాదము**

**మానవుడు పలు విధములైన యజ్ఞము, తపస్సు, దానములను ఫలాపేక్షరహితముగా 'తత్' అను పదముతో గూడి ఒనరింపవలెను. భౌతిక బంధనముల నుండి విడివడుటయే అట్టి ఆధ్యాత్మిక కర్మల ముఖ్య ప్రయోజనము.**

**భాష్యము**

ఆధ్యాత్మిక స్థితికి ఉద్ధరింపబడ వలెనన్నచో మానవుడు భౌతికలాభము కొరకై వర్తింపరాదు. ఆధ్యాత్మిక రాజ్యమునకు అనగా భగవద్ధామమునకు తిరిగి చేరుట యనెడి చరమలాభము కొరకే సమస్త కర్మలను చేయవలెను.

**17.26 - 27**

**సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్ద: పార్థ యుజ్యతే ॥**

**యజ్ఞే తపసి దానే చ స్థితి: సదితి చోచ్యతే ।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥**

## అనువాదము

**ఓ పృథాకుమారా! భక్తియుక్త సేవా యజ్ఞమునకు పరతత్త్వము పరమలక్ష్యము. అది 'సత్' అను పదముచే సూచింపబడును. అట్టి యజ్ఞమును చేయు కర్త కూడ 'సత్' అనియే పిలువబడును. అట్లే పరమ సత్యమునకు అనుగుణమైన యజ్ఞము, తపస్సు, దానము వంటి కార్యములన్నియు పరమపురుషుని సంతృప్తి కొరకే చేయబడును.**

## భాష్యము

'ప్రశస్తే కర్మణి' లేక విధ్యుక్త ధర్మములు అను పదములు గర్భధారణము మొదలుగా జీవితాంతము వరకు మనుజుని జీవన పవిత్రీకరణమునకై వైదిక గ్రంథములందు అనేకమైన శుద్ధికర్మలు విధింపబడినవని సూచించుచున్నవి. అట్టి పవిత్రీకరణ విధానములు జీవుని చరమమోక్షము కొరకై అనుసరింపబడును. అట్టి కార్యము లన్నింటి యందును మానవుడు 'ఓం తత్ సత్' అను మంత్రములను ఉచ్చరింపవలెనని ఆదేశింపబడినది. ఇక్కడ 'సద్భావే' మరియు 'సాధుభావే' అను పదములు ఆధ్యాత్మిక స్థితిని సూచించుచున్నవి. కృష్ణచైతన్యమున వర్తించుట 'సత్త్వము' అనబడును. కృష్ణచైతన్య కార్యములను సంపూర్ణముగా ఎరిగినవాడు 'సాధువు' అనబడును. శ్రీకృష్ణుని గూర్చిన దివ్యజ్ఞాన విషయములు భక్తుల సాంగత్యమున స్పష్టమగునని శ్రీమద్భాగవతము (3.25.25) నందు 'సతాం ప్రసంగాత్' అను పదము ద్వారా చెప్పబడినది. సత్సాంగత్యము లేనిదే ఎవ్వరును దివ్యజ్ఞానమును పొందజాలరు. మంత్రదీక్షను ఒసగునప్పుడు గాని, యజ్ఞోపవీతమును ధరింప జేయునప్పుడు గాని గురువు 'ఓం తత్ సత్' అను పదములను ఉచ్చరించును. అట్లే అన్నిరకములైన యజ్ఞాచరణము లందలి లక్ష్యము 'ఓం తత్ సత్' అను దేవాదిదేవుడే. 'తదర్థీయమ్' అను పదము భగవానునికి సంబంధించిన సేవాకార్యము లన్నింటిని సూచించును. అనగా భగవానుని మందిరము నందు ప్రసాదమును సిద్ధము చేయుట, మందిర కార్యములందు సహకరించుట లేక భగవానుని వైభవ కీర్తిని ప్రచారము చేయుట వంటి సేవల నన్నింటిని అది సూచించుచున్నది. ఈ దివ్యములైన 'ఓం తత్ సత్' అను పదములు సమస్త కార్యములను సంపూర్ణముగా సఫలమొనర్చుట కొరకై అనేక విధములుగా ఉపయోగింపబడు చుండును.

**17.28**
**అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।**
**అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ ॥**

**అనువాదము**

**ఓ పార్థా! పరమపురుషుని యందు శ్రద్ధలేకుండా యజ్ఞము, దానము లేదా తపస్సు రూపమున చేయబడునదేదైనను అశాశ్వతము. అది 'అసత్' యనబడును. అట్టికర్మ ఈ జన్మము నందును మరణానంతరము కూడ నిరుపయోగమే.**

**భాష్యము**

ఆధ్యాత్మిక లక్ష్యము లేకుండ చేయబడు యజ్ఞమైనను, దానమైనను లేదా తపమైనను నిరుపయోగమే కాగలదు. కనుకనే ఈ శ్లోకము ననుసరించి కర్మలు హేయములని చెప్పబడినవి. వాస్తవమునకు ప్రతికర్మయు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని కొరకే కృష్ణచైతన్యముతో చేయవలెను. అట్టి శ్రద్ధ మరియు తగిన నిర్దేశము లేకుండా చేయు కర్మల వలన ఎట్టి ఫలము లభింపబోదు. వైదిక గ్రంథము లన్నింటి యందును దేవాదిదేవుని యందు శ్రద్ధయే ఉపదేశింపబడినది. వేదోపదేశముల ననుసరించుటకు శ్రీకృష్ణభగవానుని అవగాహనహే పరమ లక్ష్యము. ఈ సిద్ధాంతములను పాటింపకుండా ఎవ్వరును విజయమును సాధింప లేరు. కనుకనే ఆరంభము నుండియు ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము ననుసరించి కృష్ణచైతన్యముతో కర్మనొనరించుట అత్యుత్తమమైన పద్ధతి. సర్వమును సఫలము చేయుటకు అదియే ఉత్తమ మార్గము.

బద్ధస్థితి యందలి జనులు దేవతలను భూతప్రేతములను లేదా కుబేరుని వంటి యక్షులను పూజించుటకై ఆకర్షింపబడుదురు. సత్త్వగుణము రజస్తమో గుణముల కంటెను మెరుగైనది. కాని ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము నందు నెలకొనినవాడు త్రిగుణములకు అతీతుడగును. క్రమబద్ధమైన ఉద్ధరణ విధానము ఉన్నప్పటికిని ఎవరైనను శుద్ధభక్తుల సాంగత్యము ద్వారా ప్రత్యక్షముగా కృష్ణచైతన్యము నందు నెలకొనగలిగినచో అది మిక్కిలి ఉత్తమ మార్గము కాగలదు. అదియే ఈ అధ్యాయమున ఉపదేశింపబడినది. ఈ విధానము నందు విజయమును సాధింపగోరినచో మానవుడు మొదట అర్హుడైన ఆధ్యాత్మికాచార్యుని పొంది అతని నిర్దేశము ననుసరించి శిక్షణను పొందవలెను. అప్పుడు అతడు దేవాదిదేవుని యందు శ్రద్ధను పెంపొందించుకొనగలడు. కాలక్రమమున అట్టి శ్రద్ధ పరిపక్వమైనపుడు అదియే భగవత్ ప్రేమగా పిలువబడును. అట్టి ప్రేమయే జీవులందరి పరమలక్ష్యము. కనుకనే ప్రతియొక్కరు ప్రత్యక్షముగా కృష్ణచైతన్యమును అవలంభింపవలెను. ఇదియే సప్తదశాధ్యాయపు సందేశము.

**శ్రీమద్భగవద్గీత యందలి 'శ్రద్ధాత్రయ విభాగములు' అను**
**సప్తదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

-----

# అష్టాదశాధ్యాయము
# ఉపసంహారము – సన్న్యాసము యొక్క పరిపూర్ణత్వము

**18.1**
**అర్జున ఉవాచ**
**సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।**
**త్యాగస్య హృషీకేశ పృథక్కేశినిషూదన ॥**

**అనువాదము**

**అర్జునుడు పలికెను : ఓ మహాబాహో! కేసిసంహార! హృషీకేశా! నేను త్యాగము మరియు సన్న్యాసము అనువాని ప్రయోజనమును తెలిసికొన గోరుచున్నాను.**

**భాష్యము**

వాస్తవమునకు భగవద్గీత పదునేడు అధ్యాయములతోనే ముగిసినది. ఈ ప్రస్తుత పదునెనిమిదవ అధ్యాయము ఇంతవరకు చర్చించిన అంశముల సారాంశముతో కూడిన అనుబంధము. దేవాదిదేవునికి చేయు భక్తియుక్త సేవయే జీవిత పరమలక్ష్యమని గీతయందలి ప్రతి అధ్యాయము నందును దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు నొక్కిచెప్పెను. అదేవిషయము ఈ అష్టాదశాధ్యాయమున పరమ రహస్యమైన జ్ఞానమార్గముగా సంగ్రహింపబడినది. తొలి ఆరు అధ్యాయము లందు : "యోగినామపి సర్వేషామ్..." (6.47) అనగా "తన యందు నన్ను గూర్చియే సదా చింతించువాడు యోగులందరిలోను అత్యుత్తముడు" అని భక్తియుక్త సేవకు ప్రాధాన్యమీయబడినది. ఇక మధ్యనున్న ఆరు అధ్యాయములందు శుద్ధ భక్తియుక్త సేవ మరియు దాని స్వభావ లక్షణములును, కర్మలు చర్చింపబడినవి. చివరి ఆరు అధ్యాయములందు జ్ఞానము, సన్న్యాసము, న్యూన మరియు ఉన్నత ప్రకృతి స్వభావములు, భక్తియుక్త సేవ యనునవి వర్ణింపబడినవి. 'ఓం తత్ సత్' అను పదములచే సూచింపబడు పరమపురుషుని సంబంధముతోనే సమస్త కర్మలు చేయబడవలెనని సారాంశముగా చెప్పబడినది. భగవద్గీత యొక్క ఈ మూడవ భాగము భక్తియుక్త సేవ తప్ప మరేదియు అట్లు జీవిత పరమ ప్రయోజనము కాజాలదని ప్రకటించినది. పూర్వాచార్యులను మరియు 'బ్రహ్మ సూత్రము'లను (వేదాంత సూత్రములను) ఉదాహరించుట ద్వారా ఈ విషయము సమర్థింపబడినది. కొందరు అద్వైతవాదులు 'వేదాంత సూత్రము'ల జ్ఞానమంతయు తమ సొమ్ము అయినట్లు భావింతురు. కాని శ్రీకృష్ణభగవానుడే స్వయముగా 'వేదాంత సూత్రము'లకు కర్త మరియు జ్ఞాత. కనుక వాస్తవమునకు అవి భక్తియుక్త సేవ యొక్క అవగాహనకే ఉద్దేశింపబడినవి. ఆ విషయము పంచదశాధ్యాయమున వివరింపబడినది. సమస్త వైదిక గ్రంథములకు (శాస్త్రములకు) భక్తియుక్త సేవయే పరమలక్ష్యముగా వివరింపబడినది. అదే విషయమును భగవద్గీత కూడ వివరించుచున్నది.

ద్వితీయాధ్యాయమున సమస్త విషయముల సారాంశము వర్ణింప బడినట్లుగా, ఈ అష్టాదశాధ్యాయమున సర్వ ఉపదేశసారము తెలుపబడినది. త్యాగము మరియు ప్రకృతి త్రిగుణములకు అతీతమైన మోక్షప్రాప్తియే జీవిత ప్రయోజనమని సూచింపబడినది. అర్జునుడు ఇక్కడ త్యాగము మరియు సన్న్యాసమనెడి భగవద్గీత

యందలి రెండు ప్రత్యేక భిన్న విషయములను స్పష్టముగా తెలుసుకొనగోరుచు ఆ రెండు పదముల భావమును తెలుపుమని పలుకుచున్నాడు.

శ్రీకృష్ణభగవానుని ఉద్దేశించి పలుకబడిన 'హృషీకేశ' మరియు 'కేశినిషూదన' అను పదములు మిక్కిలి ప్రాధాన్యతను కలిగియున్నట్టివి. ఇంద్రియాధీశుడగు శ్రీకృష్ణుడే హృషీకేశుడు. అట్టి శ్రీకృష్ణుడు ఇంద్రియములకు ప్రభువై అట్టి మనశ్శాంతిని పొందుటకు మనకు తోడ్పడగలడు. కనుకనే తాను సమచిత్తుడగునట్లుగా సమస్తమును సంగ్రహించి తెలుపుమని అర్జునుడు దేవాదిదేవుని కోరుచున్నాడు. అయినను రాక్షసులతో పోల్చబడెడి సందేహములను తాను కలిగియుండుటచే అర్జునుడు తిరిగి శ్రీకృష్ణుని 'కేశినిషూదన' అని సంబోధించు చున్నాడు. కేశి అనువాడు భగవానునిచే సంహరింపబడిన భయంకర రాక్షసుడు. అర్జునుడు తన యందలి అట్టి సందేహమను రాక్షసుని ఇప్పుడు శ్రీకృష్ణుడు సంహరింపవలెనని ఆకాంక్షించుచున్నాడు.

## 18.2

**శ్రీభగవానువాచ**
**కామ్యానం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।**
**సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥**

### <u>అనువాదము</u>

**శ్రీకృష్ణభగవానుడు పలికెను : భౌతికవాంఛలతో కూడిన సమస్త కర్మలను త్యజించుటయే సన్న్యాసమని విజ్ఞులు పలుకగా, సర్వకర్మల ఫలమును విడుచుటయే త్యాగమని బుద్ధిమంతులు పలుకుదురు.**

### <u>భాష్యము</u>

ఫలముల కొరకై కర్మల నొనరించుటను నిశ్చయముగా విడిచి పెట్టవలెను. ఇదియే భగవద్గీత ఉపదేశము. కాని ప్రగతితో కూడిన ఆధ్యాత్మిక జ్ఞానమును చేకూర్చు కార్యముల నెన్నడును విడువరాదు. ఈ విషయము రాబోవు శ్లోకములందు స్పష్టము చేయబడును. ఏదోఒక ప్రత్యేక ప్రయోజనము కొరకై యజ్ఞము నాచరించు విధానములు వైదిక గ్రంథములందు నిర్దేశింపబడియున్నవి. ఉత్తమ పుత్రుని పొందుటకు లేదా ఊర్ధ్వలోకములను పొందుటకు చేయబడు కొన్ని ప్రత్యేక యజ్ఞములున్నను, కోరికలచే ప్రేరితములయ్యేడి యజ్ఞములను విడువవలెను. అయినను హృదయ పవిత్రీకరణకు లేదా ఆధ్యాత్మిక జ్ఞానము నందు పురోభివృద్ధి కొరకును చేయబడు యజ్ఞములను ఎన్నడును త్యజింపరాదు.

**18.3**
**త్యాజం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణ: ।**
**యజ్ఞదానతప:కర్మ న త్యాజమితి చాపరే ॥**

**అనువాదము**

**సర్వకామ్యకర్మలు దోషము వలె త్యాజ్యములని కొందరు విద్వాంసులు పలుకుదురు. అయినను మరికొందరు సాధువులు తపోదాన యజ్ఞాది కర్మల నెన్నడును విడువరాదని పలుకుదురు.**

**భాష్యము**

వైదిక గ్రంథములందు వివాదాస్పదములైన అనేక కర్మలు గలవు. ఉదాహరణకు యజ్ఞము నందు జంతుబలిని సమర్పింప వచ్చునని తెలుపబడినది. అయినను కొందరు అట్టి జంతుబలి అనునది అత్యంత హేయమని పలుకుదురు. వైదిక గ్రంథములందు యజ్ఞసమయమున జంతుబలి ఆదేశింపబడినను వాస్తవమునకు ఆ పశువు వధింపబడినట్లుగా భావింపబడదు. జంతువునకు నూతన జన్మ నొసగుటయే యజ్ఞము యొక్క ఉద్దేశము. యజ్ఞమున వధింపబడిన పిదప జంతువునకు కొన్నిమార్లు నూతన జంతు శరీరము కాని లేదా కొన్నిమార్లు వెంటనే మానవజన్మము కాని అందింపబడు చుండును. కాని ఈ విషయమున మహర్షుల యందు భిన్న అభిప్రాయములు గలవు. జంతుబలి పూర్తిగా నిషిద్ధమని కొందరు పలుకగా, కొన్ని ప్రత్యేక సమయములందు అది సరియైనదేనని మరికొందరు పలుకుదురు. యజ్ఞకర్మకు సంబంధించిన ఈ భిన్నాభిప్రాయము లన్నియు ఇప్పుడు స్వయముగా భగవానునిచే పరిష్కరింపబడుచున్నవి.

**18.4**
**నిశ్చయం శ్రుణుమే తత్ర త్యాగే భరతసత్తమ ।**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధ: సమ్ప్రకీర్తిత: ॥**

**అనువాదము**

**ఓ భరతశ్రేష్ఠా! పురుషవ్యాఘ్రా! త్యాగమును గూర్చిన నా నిర్ణయమును ఇప్పుడు ఆలకింపుము. శాస్త్రములందు అట్టి త్యాగము మూడు విధములని చెప్పబడినది.**

**భాష్యము**

త్యాగమును గూర్చి అనేక అభిప్రాయ భేదములున్నను దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ దానియెడ తన నిర్ణయమును తెలియజేయనున్నాడు. దానినే తుదినిర్ణయముగా మనము భావింపవలెను. సత్యమును పరిశీలించినచో, వేదములనునవి భగవానునిచే స్వయముగా ఏర్పరచబడిన వివిధ నియమములే. ఇక్కడ భగవానుడే స్వయముగా ప్రత్యక్షమై యున్నాడు. అతని పలుకులను తుది నిర్ణయముగా గ్రహింపవలెను. ఏ భౌతిక ప్రకృతి గుణము నందు నిర్వహింప బడినదనెడి విషయము ననుసరించి త్యాగమును గుర్తింపవలెనని భగవానుడు తెలుపుచున్నాడు.

## 18.5

**యజ్ఞదానతప:కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥**

## అనువాదము

**యజ్ఞము, దానము, తపస్సు అనెడి కర్మలను ఎన్నడును త్యజింపరాదు. వానిని తప్పక ఆచరింపవలెను. వాస్తవమునకు యజ్ఞములు, దానములు, తపములు మహాత్ములను కూడ పవిత్రమొనర్చును.**

## భాష్యము

యోగులు మానవ సమాజ పురోభివృద్ధి కొరకై కర్మలను చేయవలెను. మానవుని ఆధ్యాత్మిక జీవితము వైపునకు పురోగమింప జేయుటకు అనేక పవిత్రీకరణ విధానములు గలవు. ఉదాహరణకు వివాహసంస్కారము అట్టి పవిత్రీకరణ విధానములలో ఒకటిగా పరిగణింపబడినది. దానిని 'వివాహ యజ్ఞము' అని పిలువబడును. గృహసంబంధముల నన్నింటిని విడిచిపెట్టి సన్న్యాసమును స్వీకరించిన వ్యక్తి అట్టి వివాహ సంస్కారము ప్రోత్సహింప వచ్చునా? అను ప్రశ్నకు సమాధానముగా మానవకళ్యాణముకై ఉద్దేశింపబడిన ఏ యజ్ఞమునైనను విడువరాదని భగవానుడు ఇక్కడ చెప్పుచున్నాడు. 'వివాహయజ్ఞము' మానవుని మనస్సును నియంత్రించుటకు ఉద్దేశింపబడినది. దానితో అతని మనస్సు ఆధ్యాత్మికాభివృద్ధికి కావలసిన శాంతిని పొందును. కనుక దాదాపు చాలామందికి ఈ వివాహయజ్ఞము ప్రోత్సాహనీయమైనది. సన్న్యాసాశ్రమము నందున్న వారు కూడ ఈ వివాహ యజ్ఞమును ప్రోత్సహింప వచ్చును. సన్న్యాసులు స్త్రీలతో సంపర్కమును కలిగియుండరాదు. కాని సన్న్యాసాశ్రమమునకు క్రిందనున్న ఆశ్రమము వారు కూడా వివాహము చేసుకొనరాదని భావము కాదు. సామాన్య జీవిత స్థితి యందున్నట్టి యువకుడు వివాహపద్ధతి ద్వారా భార్యను స్వీకరింపవచ్చును. నిర్దిష్టములైన యజ్ఞము లన్నియును పరమపురుషుని పొందుట కొరకై ఉద్దేశింపబడినవి. కనుకనే ఆరంభస్థితి యందు వానిని విడువరాదు. అట్లే దానము హృదయ పవిత్రీకరణకై పేర్కొనబడినది. ఇదివరకే తెలిపినట్లు, దానము పాత్రుడైన వానికి అందించినచో అది మానవుని పరిపూర్ణమైన ఆధ్యాత్మిక జీవనము వైపునకు నడిపింపగలదు.

## 18.6

**ఏతాన్యపి తు కర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ ।**
**కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥**

## అనువాదము

**ఓ పార్థా! ఈ కర్మలన్నింటిని ఆసక్తి గాని, ఎట్టి ఫలాపేక్ష గాని లేకుండా స్వధర్మమనెడి భావనలో ఒనరింపవలెను. ఇదియే నా తుది అభిప్రాయము.**

## భాష్యము

యజ్ఞవిధానములు పవిత్రము చేయునట్టివేయైనను మానవుడు వాని ద్వారా ఎట్టి ఫలమును ఆశింపరాదు. అనగా జీవితము నందలి భౌతిక అభ్యుదయమునకు తోడ్పడు యజ్ఞములను విడువవలెనే గాని, జీవితమును పవిత్రము చేయు ఆధ్యాత్మిక

స్థితికి ఉద్ధరించు యజ్ఞములను మానవుడు విడువరాదు. కృష్ణచైతన్యమునకు తోడ్పడు కార్యముల నన్నింటిని ప్రోత్సహింపవలెను. శ్రీమద్భాగవతము నందు కూడ శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవకు దారిచూపెడి ఎట్టి కార్యమునైనను అంగీకరింప వలెనని చెప్పబడినది. ధర్మమునకు అత్యుత్తమ ప్రమాణమిదియే. శ్రీకృష్ణభగవానునికి భక్తియుక్త సేవ చేయుటకు తోడ్పడు ఎట్టి యజ్ఞములనైనను, దానములనైనను మరి యే ఇతర కార్యములనైనను భగవద్భక్తుడు అంగీకరింపవలెను.

**18.7**

**నియతస్య తు సన్న్యాస: కర్మణో నోపపద్యతే ।**
**మోహాత్తస్య పరిత్యాగస్తామస: పరికీర్తిత: ॥**

**<u>అనువాదము</u>**

**విధ్యుక్త ధర్మములను ఎన్నడును విడువరాదు. మోహకారణమున ఎవ్వరైనను తన విధ్యుక్త ధర్మమును విడిచినచో అట్టి త్యాగము తమోగుణమునకు సంబంధించినదిగా చెప్పబడును.**

**<u>భాష్యము</u>**

భౌతికమైన తృప్తి కొరకు చేయబడు కర్మలను తప్పక విడువవలెను. కాని మానవుని ఆధ్యాత్మికోన్నతికి తోడ్పడునటువంటి ప్రసాదమును సిద్ధము చేయుట, భగవానునికి నివేదించుట, ప్రసాదమును గ్రహించుట వంటి కార్యములు మాత్రమే ఆదేశింపబడినవి. సన్న్యాసాశ్రమము నందున్న వ్యక్తి తనకొరకై స్వయముగా ఆహారమును వండుకోరాదని చెప్పబడినది. సన్న్యాసియైన వానికి తనకొరకై వండుకొనుట నిషిద్ధము గాని దేవాదిదేవుని కొరకై వండుట నిషిద్ధము కాదు. అట్లే సన్న్యాసి తన శిష్యుని కృష్ణచైతన్య పురోగతికి తోడ్పడు వివాహ సంస్కారమును సైతము జరిపింపవచ్చును. ఒకవేళ అతడు అట్టి కార్యములను త్యజించినచో వారు తమోగుణమున వర్తించినవాడగును.

**18.8**

**దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్ ।**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥**

**<u>అనువాదము</u>**

**దుఃఖకరములని గాని, దేహమునకు అసౌకర్యము కలుగునను భయము వలన గాని ఎవడైనను విధ్యుక్త ధర్మములను త్యజించినచో అతడు దానిని రజోగుణము నందు త్యాగమొనర్చినవాడగును. అట్టి కార్యమెన్నడును త్యాగము నందలి ఉన్నతస్థితిని కలుగజేయలేదు.**

**<u>భాష్యము</u>**

కృష్ణచైతన్య మందున్నవాడు తాను కామ్యకర్మలను చేయుచున్నాననెడి భయముతో ధనార్జనను విడువరాదు. ఒకవేళ పనిచేయుట ద్వారా తన ధనమును

కృష్ణచైతన్యమునకై వినియోగింప గలిగినచో లేదా బ్రహ్మముహూర్తము నందే నిద్రలేచుటచే తన శుద్ధమైన కృష్ణచైతన్యమున పురోగతి సాధింప గలిగినచో అతడు భయముతో లేక కర్మలు కష్టతరములని గాని భావించి వాటిని విడువరాదు. అట్టి త్యాగము తప్పక రజోగుణమునకు సంబంధించినది. రజోగుణ కర్మ ఫలితమెప్పుడును దుఃఖపూరితముగనే ఉండును. అట్టి భావనలో మానవుడు కర్మను త్యాగము చేసినచో త్యాగఫలమును ఎన్నడును పొందజాలడు.

**18.9**

**కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతే ర్జున ।**
**సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగ: సాత్త్వికో మత: ॥**

**అనువాదము**

**ఓ అర్జునా! తప్పక ఒనరింపవలసియే యున్నందున తన స్వధర్మమును నిర్వహించుచు, సమస్త భౌతిక సంపర్కమును మరియు సర్వాఫలాసక్తిని త్యజింతురో వారి త్యాగము సాత్త్వికమని చెప్పబడును.**

**భాష్యము**

విధ్యుక్త ధర్మములను ఇట్టి భావనలోనే నిర్వహింపవలెను. మానవుడు ఫలముల యెడ ఆసక్తి లేకుండా వర్తింపవలెను. అంతేకాకుండ, అతడు గుణముల నుండియు విడివడి యుండవలెను. కృష్ణచైతన్య వంతుడైన వ్యక్తి ఏదేని కర్మాగారములో పనిచేయుచున్నచో కర్మాగారపు పనినే సర్వస్వమని భావించి తాదాత్మ్యము చెందుట గాని, కర్మాగారము నందలి కార్మికులతో అనవసర సాంగత్యమును కలిగియుండుట గాని చేయడు. కేవలము శ్రీకృష్ణుని కొరకు మాత్రమే అతడు కర్మనొనరించును. ఫలమును శ్రీకృష్ణునకే అర్పించినపుడు అతడు ఆధ్యాత్మికముగా వర్తించనవాడగును.

**18.10**

**న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।**
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయ: ॥**

**అనువాదము**

**అశుభ కర్మల యెడ ద్వేషము గాని, శుభకర్మల యెడ ఆసక్తిగాని లేనట్టి సత్త్వగుణస్థితుడగు మేధావియైన త్యాగికి కర్మయెడ ఎట్టి సంశయములు ఉండవు.**

**భాష్యము**

కృష్ణచైతన్య యందున్న వ్యక్తి లేక సత్త్వగుణ సంపన్నుడైన వ్యక్తి తన దేహమునకు బాధను కలిగించు విషయములను గాని మానవులను గాని ద్వేషింపడు. తన విధ్యుక్త ధర్మములను నిర్వహించుట వలన కలుగు ఇబ్బందులకు భయపడక, అతడు తగిన సమయమున మరియు తగిన ప్రదేశమున కర్మ నొనరించును. ఆధ్యాత్మికస్థితి యందు నిలిచియున్న అట్టివ్యక్తి అత్యంత మేధా సంపన్నుడనియు మరియు తానొనరించు కర్మల యెడ సంశయ రహితుడనియు గుర్తింపవలెను.

**18.11**
**న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషత: ।**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥**

**అనువాదము**

**దేహధారుడైనవానికి సర్వకర్మలను త్యజించుట నిక్కముగా అసాధ్యమైన విషయము. కాని కర్మఫలములను త్యాగమొనర్చినవాడు మాత్రమే నిజమైన త్యాగి యనబడును.**

**భాష్యము**

మానవుడు ఏ సమయము నందు కూడ కర్మను త్యజింపజాలడని భగవద్గీత యందే చెప్పబడినది. కనుకనే శ్రీకృష్ణుని కొరకు కర్మనొనరించుచు, కర్మఫలముల ననుభవింపక శ్రీకృష్ణునికే సర్వమును అర్పించువాడు నిజమైన త్యాగి యనబడును. మా 'అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘము' నందు సభ్యులైన పలువురు తమ కార్యాలయము లందు గాని, కర్మాగారములందు గాని, ఇతర చోట్లగాని కష్టించి పనిచేసినను వారు సంపాదించిన దానినంతటిని సంస్థకే ఇచ్చివేయుదురు. అట్టి మహాత్ములు వాస్తవముగా సన్న్యాసులని, సన్న్యాసాశ్రమము నందు నెలకొనినట్టి వారని చెప్పవచ్చును. ఇక్కడ కర్మఫలములను ఏ విధముగా త్యాగము చేయవలెనో మరియు ఎట్టి ప్రయోజనమునకై కర్మఫలములను త్యజింపవలెనో ఇక్కడ స్పష్టపరుపబడినది.

**18.12**
**అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణ: ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥**

**అనువాదము**

**త్యాగికానటువంటి వానికి మరణానంతరము ఇష్టము, అనిష్టము, ఇష్టానిష్ట మిశ్రము అను త్రివిధ కర్మఫలములు కలుగుచున్నవి. కాని నిజముగా సన్న్యాస జీవితము నందున్న వారికి మాత్రము సుఖదుఃఖములను కలిగించు అట్టి ఫలములు కలుగుటలేదు.**

**భాష్యము**

శ్రీకృష్ణభగవానునితో తనకు గల నిత్య సంబంధ జ్ఞానముతో వర్తించు కృష్ణచైతన్యవంతుడు సర్వదా ముక్తుడై యుండును. కనుకనే మరణానంతరము అతడు తన కర్మఫలములచే సుఖించుట గాని, దుఃఖించుట గాని జరగదు.

**18.13**
**పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।**
**సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥**

**అనువాదము**

**ఓ మహాబాహుడవైన అర్జునా! వేదాంతము ననుసరించి సర్వకర్మలు సిద్ధించుటకు ఐదు కారణములు గలవు. వాని నిపుడు నానుండి వినుము.**

**భాష్యము**

ప్రతికర్మకు కూడ ఫలము నిశ్చయమైనపుడు కృష్ణచైతన్యవంతుడు తాను చేయు కర్మల ప్రతిఫలములచే సుఖదుఃఖములను అనుభవింపడనుట ఎట్లు సంభవము? అను ప్రశ్న ఉదయింపవచ్చును. కాని ఇది ఎట్లు సాధ్యమగునో తెలియ జేయుటకు శ్రీకృష్ణభగవానుడు వేదాంత తత్త్వమును ఉదహరించు చున్నాడు. ప్రతి కార్యమునకును ఐదు కారణములు గలవనియు మరియు ఆ కార్యముల సిద్ధికొరకు మానవుడు ఈ ఐదు కారణములను పరిశీలింప వలెననియు భగవానుడు చెప్పుచున్నాడు. 'సాంఖ్యము' అనగా జ్ఞానకాండము. అట్లే, 'వేదాంతము' సుప్రసిద్ధులైన ఆచార్యులందరిచే ఆమోదింపబడిన జ్ఞానము యొక్క చరమ స్వరూపము. శ్రీ శంకరాచార్యులు కూడా వేదాంత సూత్రములను యథాతథముగా స్వీకరించిరి. కనుక అట్టి ప్రామాణిక గ్రంథముల ప్రమాణమును సర్వదా గ్రహించవలెను.

సర్వప్రాణుల చరమ నియంత్రణ పరమాత్ముని యందే కలదు. ఇదే విషయము భగవద్గీత (15.15) నందు : "సర్వస్య చాహం హృది సన్నివిష్టః"- పరమాత్ముడు ప్రతియొక్కరిని వారి పూర్వకర్మలను గుర్తుచేయుచు అతనిని వివిధ కర్మల యందు నెలకొల్పుచున్నాడు. అంతరము నుండి కలుగు అతని నిర్దేశము నందు చేయబడు కృష్ణచైతన్య కర్మలు ఈ జన్మయందు కాని, మరుజన్మ యందు కాని ఎట్టి ప్రతిచర్యను కలుగజేయవు.

**18.14**
**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।**
**వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥**

**అనువాదము**

**కార్యస్థానము (దేహము), కర్త, వివిధేంద్రియములు, వివిధములైన యత్నములు, చివరికి పరమాత్ముడు అనునవి కార్యము నందలి ఐదంశములై యున్నవి.**

**భాష్యము**

'అధిష్ఠానమ్' అను పదము దేహమును సూచించును. దేహము నందలి ఆత్మ కర్మఫలములను సమకూర్చుటకై వర్తించుచున్నందున 'కర్త' యనబడును. అట్టి ఆత్మయే జ్ఞాత మరియు కర్త అని శృతియందు తెలుపబడినది. "ఏష హి ద్రష్టా స్రష్టా" (ప్రశ్నోపనిషత్తు 4.6). ఇదే విషయము "జ్ఞో త ఏవ" (2.3.17) మరియు "కర్తా శాస్త్రార్థవత్వాత్" (2.3.31) అను 'వేదాంత సూత్రము'ల ద్వారా ఇది నిర్ధారింపబడినది.

ఇంద్రియములు కర్మసాధనములు. అట్టి ఇంద్రియముల ద్వారా ఆత్మ వివిధరకాలుగా వర్తించుచుండును. ప్రతికార్యమునకు వివిధ యత్నములు అవసరములు. కాని మానవుని ఆ కార్యకలాపము లన్నియును మిత్రుని రూపమున హృదయము నందు నెలకొనినట్టి పరమాత్ముని సంకల్పము పైననే చివరికి ఆధారపడియున్నవి. పరమపురుషుడు అన్నింటికి పరమకారణము. ఇట్టి పరిస్థితులలో హృదయము నందు నెలకొనినట్టి పరమాత్మ నిర్దేశమున కృష్ణచైతన్యమున వర్తించువాడు సహజముగ ఎట్టి కర్మచేతను బద్ధుడు కాడు. సంపూర్ణ కృష్ణచైతన్యవంతులు చివరికి వారి కార్యములకు ఏ విధముగను బాధ్యులు కారు. సర్వము దివ్యసంకల్పము, పరమాత్మ, దేవాదిదేవుని పైననే ఆధారపడి యుండును.

## 18.15

**శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నర: ।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవ: ॥**

**అనువాదము**

**శరీరము చేతను, మనస్సు చేతను, వాక్కు చేతను మానవుడు చేయు న్యాయాన్యాయ కర్మలన్నింటికిని ఈ ఐదు అంశములే కారణములు.**

**భాష్యము**

ఈ శ్లోకమున 'న్యాయము' మరియు 'అన్యాయము' (విపరీతము) అను పదములు ఎంతో ప్రధానమైనవి. శాస్త్రాదేశముల ననుసరించి చేయబడు కర్మలు న్యాయమైనవి. వాటికి విరుద్ధముగా చేయబడు కర్మలు విపరీత కర్మలుగా తెలియబడుచున్నవి. కాని ఏ కార్యమునకైనను దాని సంపూర్ణ నిర్వహణ కొరకు ఈ ఐదు అంశములు అత్యంత అవసరములు.

## 18.16

**తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు య: ।**
**పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతి: ॥**

**అనువాదము**

**కనుక ఈ ఐదంశములను పరిశీలింపక తననే కర్తగా భావించువాడు నిక్కముగా బుద్ధిహీనుడు. అట్టి మూఢుడు విషయములను యథార్థదృష్టితో గాంచలేడు.**

**భాష్యము**

పరమాత్మ హృదయము నందు మిత్రుని రూపమున నెలకొని తన కార్యకలాపములను నిర్వహించుచున్నాడని మూఢుడైన వ్యక్తి ఎరుగజాలడు. కార్యస్థానమైన దేహము, కర్త, ఇంద్రియములు, ప్రయత్నము లనునవి కార్యము యొక్క భౌతిక కారణములు కాగా పరమాత్ముడు, దేవాదిదేవుడు చరమ కారణమై యున్నాడు. కనుక ఈ నాలుగు భౌతిక

కారణములనే కాకుండ పరమ కారణమును కూడ పరిశీలింపవలెను. పరమాత్ముని గాంచనివాడు తానే కర్తనని భావించును.

**18.17**
**యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వా పి స ఇమాళ్ లోకాన్న హన్తి న నిబధ్యతే ॥**

**అనువాదము**

**అహంకారముచే ప్రభావితుడు కానివాడును, ఆసక్తి రహిత బుద్ధిని కలిగిన వాడును అగు మానవుడు జగత్తునందు జనులను సంహరించినను సంహార మొనర్చనట్లే యగును. అతడెన్నడును తన కర్మలచే బుద్ధుడు కాడు.**

**భాష్యము**

యుద్ధము చేయకూడదను కోరిక అహంకారము వలన కలుగుచున్నదని ఈ శ్లోకమున శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు చెప్పుచున్నాడు. అర్జునుడు తానే కర్తనని భావించెను. కాని బాహ్యాంతరములందు సూచనలొసుగు భగవానుని గమనింపలేదు. కర్మనొనర్చుటకు ఒక దివ్యప్రేరణము లేక అనుజ్ఞ ఒకటుండునని తెలియనిచో అతడు కర్మను ఎందుకు చేయవలెను? కాని కర్మ సాధనములను, తనను కర్తగను, పరమపురుషుని దివ్య ప్రేరకునిగను ఎరిగిన వాడు ఏ కార్యము చేసినను దోషరహితుడుడగును. అట్టివాడెన్నడును మోహమునకు గురికాడు. నేనే చేయుచున్నాను. నాదే బాధ్యత అనెడి భావములు అహంకారము, నాస్తికత్వము మరియు కృష్ణచైతన్యము లేకపోవుట చేత కలుగుచుండును. పరమాత్ముని లేక దేవాదిదేవుని నిర్దేశము (కృష్ణచైతన్యము) ననుసరించి వర్తించువాడు సంహారకార్య మొనర్చినను సంహరింపనివాడే యగును. అట్టి సంహారముచే కలుగు ప్రతిక్రియ చేత అతడెన్నడును కలతనొందడు. ఒక యోధుడు తన పైఅధికారి ఆజ్ఞననుసరించి వధించినచో అతడు అపరాధదోషమునకు గురికాడు. కాని సైనికుడు తన స్వంత కారణము కొరకు ఎవరినైనను చంపినచో అతడు న్యాయస్థానతీర్పునకు గురిచేయబడును.

**18.18**
**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధ: కర్మసంగ్రహ: ॥**

**అనువాదము**

**జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అనెడి మూడు అంశములు కర్మను ప్రేరేపించగా, ఇంద్రియములు, కార్యము, కర్త యనునవి కర్మయొక్క మూడు అంశములై యున్నవి.**

**భాష్యము**

ప్రతిదినము చేయవలసిన కర్మలకు జ్ఞానము, జ్ఞానలక్ష్యము, జ్ఞాత అను మూడు అంశములు ప్రేరణములై యున్నవి. కర్మనొనరించుటకు అవసరమగు

కర్మసాధనములు, కార్యము, కర్త యనునవి కార్యము నందలి ముఖ్యాంశములు. ఎవరిచే చేయబడినను ప్రతి కర్మనందు ఈ మూడు అంశము లుండును. మానవుడు కార్యమును ప్రారంభించుటకు మునుపు దానికి కొంత ప్రేరణ యనగా ప్రోత్సాహము అవసరమగును. కార్యము సిద్ధించుటకు పూర్వమే ఊహింపబడు పరిష్కారము ఆ కర్మ యొక్క సూక్ష్మరూపము. అటుపిమ్మట కార్యము ఆచరణ రూపమును పొందును. అనగా ఏదేని కర్మనారంభించుటకు మునుపు మానవుడు ఆలోచన, అనుభూతి, సంకల్పమును చేయవలసివచ్చును. అదియే ప్రేరణ మనబడును. అట్టి ప్రేరణము శాస్త్రము నుండి లేక ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము నుండి లభించినను ఒకేరకముగ ఉండును. ఆ విధముగా ప్రేరణము మరియు కర్త ఉన్నప్పుడు వాస్తవమగు కర్మ ఇంద్రియ సహాయమున జరుగబడును. ఇంద్రియములలో ముఖ్యమైన మనస్సు కూడ అందుకు సహకరించును. కర్మ యందలి వీటన్నింటి సముదాయమే కర్మ సంచయమనబడును.

## 18.19

**జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదత: ।**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥**

### అనువాదము

**భౌతికప్రకృతి త్రిగుణముల భేదముల ననుసరించి జ్ఞానము, కర్మము, కర్త యనునవి మూడు రకములు. ఇక వానిని గూర్చి నా నుండి వినుము.**

### భాష్యము

చతుర్దశాధ్యాయమున భౌతిక ప్రకృతి త్రిగుణ భేదములు విస్తారముగా వివరింపబడినవి. ఆ అధ్యాయమున సత్త్వగుణము జ్ఞానప్రదమనియు, rrరజోగుణము భౌతికభావ ప్రధానమైనదనియు, తమోగుణము సోమరితనము మరియు మాంద్యములకు కారణభూతమనియు చెప్పబడినది. భౌతికప్రకృతి గుణములన్నియు బంధకారణములే గాని ముక్తికి మూలకారణములు కావు. సత్త్వగుణము నందు కూడా మానవుడు బద్ధుడై యుండును. అట్టి వివిధ గుణముల ననుసరించి వివిధజనులచే చేయబడు వివిధ రకాల పూజలు సప్తదశాధ్యాయమున వివరింపబడినవి. ఈ శ్లోకమున త్రిగుణముల ననుసరించి వివిధరకాల జ్ఞానములను, కర్తలను, కర్మలను తాను వివరింప బోవుచున్నట్లు శ్రీకృష్ణభగవానుడు తెలుపగోరుచున్నాడు.

**18.20**
**సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।**
**అవిభక్తం విభక్తేషు తజ్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥**

**అనువాదము**

**జీవులు అసంఖ్యాక రూపములుగా విభజింపబడినను ఆ జీవుల యందు అవిభక్తమైయున్నట్టి ఆధ్యాత్మిక స్వభావము ఏ జ్ఞానము ద్వారా గాంచబడునో అట్టి జ్ఞానము సత్త్వగుణముతో కూడినదని తెలిసికొనుము.**

**భాష్యము**

దేవతలు, మానవులు, జంతువులు, పక్షులు, మృగములు, జలచరములు, మొక్కలు వంటి సర్వజీవుల యందు ఆత్మను దర్శింప గలవాడు సత్త్వగుణ ప్రధానమైన జ్ఞానము కలిగినట్టివాడగును. జీవులు పూర్వకర్మల ననుసరించి వివిధ దేహములను పొందినను ఆ జీవులన్నింటి యందును ఆత్మ గలదు. సప్తమాధ్యాయమున వర్ణింపబడినట్లు, ప్రతి శరీరము నందును గల జీవ శక్తి వ్యక్తమగుటకు దేవాదిదేవుని దివ్యశక్తియే కారణము. కనుక భగవానుని అట్టి ఉన్నత శక్తిని జీవశక్తి రూపమున ప్రతిదేహము నందును చూచుట సత్త్వగుణ దృష్టితో చూచుట యగును. దేహములు నశ్వరములైనను అట్టి జీవశక్తి అనశ్వరము. దేహము విషయమున భేదములుండుటచే జీవులయందు భేదములు కనిపించును. బద్ధజీవితమున అనేక భౌతిక జీవరూపములు ఉండుటచే జీవశక్తి విభజింప బడినట్లుగా గోచరించుచుండును. అట్టి నిరాకార జ్ఞానము ఆత్మానుభూతి యందలి ఒక అంశము.

**18.21**
**పృథక్త్వేన తు యజ్ జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।**
**వేత్తి సర్వేషు భూతేషు తజ్ జ్ఞానం విద్ధి రాజసమ్ ॥**

**అనువాదము**

**ఏ జ్ఞానము ద్వారా భిన్న శరీరములందు భిన్న జీవులున్నట్లు మానవుడు గాంచునో అట్టి జ్ఞానము రజోగుణ సంబంధమైనదని నీవెరుగుము.**

**భాష్యము**

భౌతిక దేహమే జీవుడనియు, దేహము నశింపగనే చైతన్యము కూడ నశించిపోవునని భావించు భావము రజోగుణజ్ఞానమని చెప్పబడును. అట్టి జ్ఞానము ననుసరించి వివిధ చైతన్యముల వృద్ధికారణముచే దేహములు ఒక దానికంటె ఒకటి భిన్నములుగా కనిపించును. లేనిచో చైతన్యమును ప్రకటించు మరొక ఆత్మయుండదు. అనగా అట్టి రజోగుణజ్ఞానము ననుసరించి దేహమే ఆత్మకాని దేహమునకు అతీతముగా మరొక ఆత్మలేదు. అట్టిజ్ఞానము ననుసరించి చైతన్యము యనునది తాత్కాలికమైనది. ప్రత్యేక జీవాత్మలుండవు. కాని జ్ఞాన సంపూర్ణమైన బ్రాహ్మన్ మాత్రమే సర్వవ్యాపిగా ఉండుననియు మరియు ఈ దేహము తాత్కాలిక అజ్ఞానము యొక్క వ్యక్తీకరణమనియు భావించుట లేక దేహమునకు అతీతముగా మరొక ఆత్మ గాని పరమాత్మ గాని లేదను ఈ భావనలన్నియును రజోగుణమునకు ఫలితముగా జనించునని భావింపబడుచున్నది.

**18.22**
**యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమ హైతుకమ్ ।**
**అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥**

**అనువాదము**

**ఏ జ్ఞానము ద్వారా మానవుడు అల్పమైనట్టి ఒక కార్యము నందు కారణము మరియు సత్యావగాహనము లేకుండ అదియే సర్వస్వమనెడి భావనలో ఆసక్తుడగునో అట్టి జ్ఞానము తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

**భాష్యము**

ప్రతిజీవుడును బద్ధజీవితమున తమోగుణము నందు జన్మించుట చేత సామాన్య మానవుని 'జ్ఞానము' ఎన్నడును తమోగుణము నందే యుండును. మానవుడు ప్రామాణికుల ద్వారా లేదా ప్రామాణిక శాస్త్రముల ద్వారా గాని వృద్ధి చేసికొననిచో అతని జ్ఞానము దేహము వరకే పరిమితమై యుండును. అట్టి స్థితియందు అతడు శాస్త్రనిర్దేశముల ననుసరించి వర్తింపవలెనను భావనను ఏ మాత్రము కలిగియుండడు. అట్టివానికి ధనమే భగవానుడు. మరియు దేహవాంఛలను తృప్తినొందించుటయే జ్ఞానము. అట్టి జ్ఞానమునకు మరియు పరతత్త్వజ్ఞానమునకును ఎట్టి సంబంధము లేదు. అది దాదాపు ఆహారము, నిద్ర, భయము, మైథునములతో కూడిన పశుజ్ఞానముతో సమానమైనట్టిది. ఈ శ్లోకమున అట్టిజ్ఞానము తమోగుణమునకు సంబంధించిన ఫలముగా వర్ణింప బడినది. ఈ దేహమునకు అతీతమైన ఆత్మజ్ఞానము సాత్త్వికమైనది. భౌతికమైన తర్కము చేతను, మానసిక కల్పనల చేతను చేయబడు సిద్ధాంతములను కల్పించు జ్ఞానము రజోగుణమునకు సంబంధించినది. దేహమును ఏ విధముగా సుఖపెట్టవలెనను భావనకు సంబంధించిన జ్ఞానము తమోగుణ పూరితమైనదని చెప్పబడును.

**18.23**
**నియతం సఙ్గరహితమరాగద్వేషత: కృతమ్ ।**
**అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే ॥**

**అనువాదము**

**క్రమబద్ధమైనదియు, ఆసక్తిలేకుండగను, రాగద్వేషరహితముగను, ఫలాపేక్ష రహితముగను చేయబడునదియునైన కర్మము సత్త్వగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

**భాష్యము**

సమాజము నందలి వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి శాస్త్రమునందు నిర్దేశింపబడిన స్వధర్మములను ఎట్టి ఆసక్తిగాని, స్వామిత్వము గాని లేకుండా రాగద్వేషరహితముగా, నిస్వార్థముగా దేవాదిదేవుని ప్రీతికొరకు కృష్ణచైతన్యము నందు చేయబడినపుడు అట్టి శాస్త్రవిహితములైన స్వధర్మములు సత్త్వగుణ ప్రధానము లనబడును.

**18.24**

**యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పున: ।**
**క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥**

**అనువాదము**

**కాని కోరికలను పూరించుకొనవలెనని భావించువానిచే అహంకార భావన తోడను, అధిక ప్రయాస తోడను చేయబడు కర్మ రజోగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

**18.25**

**అనుబన్ధం క్షయం హింసామనపేక్ష్య చ పౌరుషమ్ ।**
**మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే ॥**

**అనువాదము**

**శాస్త్రనిర్దేశములను నిరసించి భావిష్యద్బంధమును గాని, పరహింసను గాని, పరదుఃఖమును గాని లెక్కచేయక భ్రాంతియందు ఒనర్చబడు కర్మము తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును.**

**భాష్యము**

మానవుడు తాను చేయు కర్మల వివరమును ప్రభుత్వమునకు గాని, యమదూత లనబడు దేవాదిదేవుని ప్రతినిధులకు గాని జవాబు చెప్పుకోవలసి వచ్చును. బాధ్యతారహితముగా చేయబడు కర్మ సర్వదా శాస్త్రాదేశములైన ధర్మ సిద్ధాంతములకు విరుద్ధముగా నుండును. కనుక వినాశకరములుగా పరిణమించును. అట్టి బాధ్యతారహితమైన కర్మలు సదా హింసతో గూడి ఇతర జీవులకు హానినే కలిగించును. స్వానుభవముపై ఆధారపడి అట్టి బాధ్యతారహితమైన కర్మచేయబడును. మరియు అవియన్నియును భ్రాంతితో కూడియున్నట్టివే. భ్రాంతి పూరితమైన ఇట్టి కర్మ తమోగుణమునకు సంబంధించినదిగా చెప్పబడును.

**18.26**

**ముక్తసఙ్గో నహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।**
**సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికార: కర్తా సాత్త్విక ఉచ్యతే ॥**

**అనువాదము**

**భౌతిక ప్రకృతి గుణములతో సంబంధము లేకుండ, అహంకారము లేకుండ, జయాపజయములందు మార్పులేనివాడై, ధృడనిశ్చయము తోడను, ఉత్సాహము తోడను స్వధర్మమును నిర్వర్తించు కర్త సాత్త్వికుడని చెప్పబడును.**

## <u>భాష్యము</u>

కృష్ణచైతన్యవంతుడు ఎల్లప్పుడు భౌతిక ప్రకృతి త్రిగుణములకు అతీతుడై యుండును. అంతేకాకుండ అతడు అహంకారము మరియు గర్వములకు కూడ అతీతుడై యుండును. కనుక తన కొసగబడిన కర్మకు సంబంధించిన ఫలములను అతడు ఆశింపడు. అయినను అట్టి కర్మ పూర్తియగునంత వరకు అతడెల్లప్పుడును ఉత్సాహవంతుడై యుండును. అట్టి కార్యసాధనలో కలుగు క్లేశములను లెక్కపెట్టక ఎల్లప్పుడు ఉత్సాహముతో కూడియుండును. జయాపజయములను పట్టించుకొనక అతడు సుఖదుఃఖము లందు సమచిత్తమును కలిగియుండును. అట్టి కర్త సత్త్వగుణము నందు స్థితుడై యుండును.

## 18.27

**రాగీ కర్మఫలప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకోऽశుచి: ।**
**హర్షశోకాన్విత: కర్తా రాజస: పరికీర్తిత: ॥**

## <u>అనువాదము</u>

**కర్మఫలములను అనుభవింప గోరుచు కర్మ మరియు కర్మఫలముల యెడ ఆసక్తుడై యుండువాడును, లోభియను, అసూయాపరుడును, శుచి రహితుడును, సుఖదుఃఖములచే చలించువాడును అగు కర్త రజోగుణముతో కూడినవాడుగ చెప్పబడును.**

## <u>భాష్యము</u>

భౌతికత్వము లేదా భార్యాపుత్రులు మరియు గృహముల యందు గల అధిక ఆసక్తి కారణముగా మానవుడు ఏదేని ఒక కర్మ లేదా కర్మఫలముల యందు మిక్కిలి ఆసక్తి గలవాడై ఉండును. అట్టివాడు జీవితోద్ధరణమునకు సంబంధించిన కోరికను ఏమాత్రము కలిగియుండడు. ఈ జగత్తును సాధ్యమైనంత వరకు భౌతికముగా సుఖవంతము చేసుకొనుటయే అతని లక్ష్యము. సాధారణముగా లోభియై యుండు అతడు తనకు లభించినది శాస్వతమనియు, ఎన్నడును నశింపదనియు భావించును. అట్టివాడు ఇతరుల పట్ల అసూయాపరుడై ఇంద్రియతృప్తికై ఎట్టి దోషకార్యమునైనను చేయుటకు సిద్ధపడియుండును. తత్కారణముగా అతడు అపరిశుద్ధుడై తన సంపాదన పవిత్రమా లేక అపవిత్రమా అనెడి విషయమును కూడ లెక్కచేయడు. తన కార్యము విజయవంతమైనచో అధిక సంతోషమును, విఫలమైనచో మిక్కిలి చింతించును. రజోగుణముతో కూడిన కర్త ఇట్లుండును.

## 18.28

**అయుక్త: ప్రాకృత: స్తబ్ధ: శఠో నైష్కృతికోऽలస: ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥**

## <u>అనువాదము</u>

**శాస్త్రనిర్దేశములకు విరుద్ధముగా కర్మనొనరించువాడును, భౌతికాసక్తుడును, మొండివాడును, వంచకుడును, ఇతరులను అవమానించుట యందు**

**నేర్పరియును, సోమరియును, సదా చింతితుడును, వృథా కాలవ్యయమును చేయువాడును సదా తమోగుణము నందున్న కర్తయని చెప్పబడును.**

భాష్యము

ఎటువంటి కర్మము చేయదగినదో, ఎట్టి కర్మ చేయరానిదో శాస్త్ర నిర్దేశములందు మనము చూడవచ్చును. అట్టి వైదిక గ్రంథముల నిర్దేశములను లెక్కజేయని వారు చేయకూడని కర్మలనే చేయుచు సాధారణముగా భౌతికాసక్తులై యుందురు. వారు ప్రకృతి గుణముల ననుసరించియే వర్తింతురు. గాని శాస్త్ర నిర్దేశముల ననుసరించి కర్మనొనరింపరు. సాధారణముగ అట్టి కర్తలు మృదు స్వభావులై యుండక మోసకారులు మరియు ఇతరులను అవమానపరచుట యందు నేర్పరులై యుందురు. సోమరులగుటచే వారు నిర్వహింప వలసిన కార్యములు అనేకము ఉన్నప్పటికిని వాటిని సక్రమముగా పూర్తిచేయక తరువాత చేయవచ్చునని ప్రక్కన పెట్టుదురు. తాత్కారణముగా వారెల్లప్పుడును చింతితులై ఒకగంటలో చేయవలసిన కార్యమును సంవత్సరముల కొలది కొనసాగించుచు కాలవిలంబనము చేయుటయందు వారు గొప్ప నేర్పరులై యుందురు. అట్టి కర్తలు తమోగుణము నందు స్థితులైనట్టివారు.

18.29

**బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।**
**ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥**

అనువాదము

**ఓ ధనంజయా! భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణముల ననుసరించి యున్న వివిధములైన బుద్ధి మరియు ధృఢనిశ్చయములను వివరముగా నా నుండి ఆలకింపుము.**

భాష్యము

జ్ఞానము, జ్ఞేయము(జ్ఞానలక్ష్యము), జ్ఞాతయనెడి మూడు అంశములను త్రిగుణముల ననుసరించి వివరించిన పిమ్మట భగవానుడు కర్త యొక్క బుద్ధి మరియు నిశ్చయములను అదేవిధముగా వివరింపనున్నాడు.

18.30

**ప్రవృత్తిం చ నివృత్తం చ కార్యాకార్యే భయాభయే ।**
**బన్ధం మోక్షం చ యో వేత్తి బుద్ధి: సా పార్థ సాత్త్వికీ ॥**

అనువాదము

**ఓ పార్థా! ఏ బుద్ధి ద్వారా మానవుడు ఏది చేయదగినదో ఏది చేయరానిదో, దేనికి భయపడవలెనో దేనికి భయము నొందరాదో, ఏది బంధమును కలిగించునో ఏది ముక్తి దాయకమో తెలిసికొన గలుగునో అట్టి బుద్ధి సత్త్వగుణ ప్రధానమైనది.**

## భాష్యము

శాస్త్రనిర్దేశముల ననుసరించి కార్యముల నొనరించుట లేక చేయదగిన కర్మలను చేయుట 'ప్రవృత్తి' యనబడును. అట్లు శాస్త్రములందు నిర్దేశింపబడని కర్మల నెన్నడును చేయరాదు(నివృత్తి). ఆ శాస్త్రనిర్దేశములను ఎరుగనివాడు కర్మల యందు మరియు కర్మఫలముల యందు(చర్యప్రతిచర్య) బద్ధుడగుచున్నాడు. అట్టి విచక్షణా జ్ఞానమును కలిగించు బుద్ధియే సత్త్వగుణమనబడును.

### 18.31

**యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।**
**అయథావత్ప్రజానాతి బుద్ధి: సా పార్థ రాజసీ ॥**

## అనువాదము

**ఓ పార్థా! ధర్మాధర్మములకు నడుమ గల భేదమును గాని, చేయదగిన కార్యము, మరియు చేయదగని కార్యమునకు నడుమ గల భేదమును గాని తెలిసికొన జాలని బుద్ధి రజోగుణ ప్రధానమైనది.**

### 18.32

**ఆధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।**
**సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధి: సా పార్థ తామసీ ॥**

## అనువాదము

**ఓ పార్థా! అజ్ఞానము మరియు భ్రాంతి కారణముగా అధర్మమును ధర్మముగాను మరియు ధర్మమును అధర్మముగాను భావించుచు, ఎల్లప్పుడును తప్పుదోవన పోవునట్టి బుద్ధి తమోగుణమును కూడినట్టిది.**

## భాష్యము

తమోగుణముతో కూడిన బుద్ధి సదా వర్తించవలసిన విధమునకు విరుద్ధముగా వర్తించు చుండును. అది నిజముగా ధర్మము కానటువంటి వానిని ధర్మములుగా అంగీకరించి నిజమైన ధర్మమును నిరసించు చుండును. అట్టి తమోగుణపూరితులు మహాత్ములైన వానిని సామాన్య మానవునిగా, సామాన్య మానవుని మహాత్మునిగాను అంగీకరింతురు. వారు సత్యమును అసత్యముగా భావించుచు, అసత్యమును సత్యముగా ఆమోదింతురు. కర్మలన్నింటి యందును వారు తప్పుమార్గమునే అనుసరింతురు. కనుకనే వారి బుద్ధి తమోగుణముతో కూడియుండును.

**18.33**
**ధృత్యా యయా ధారయతే మన:ప్రాణేన్ద్రియక్రియా: ।**
**యోగేనావ్యభిచారిణ్యా ధృతి: పార్థ సాత్వకీ ॥**

**అనువాదము**

**ఓ పృథాకుమారా! అవిచ్ఛిన్నమైనదియు, యోగాభ్యాసముచే నిశ్చయముగా కొనసాగునదియు, తత్కారణముగా ఇంద్రియముల యొక్కయు, మనస్సు యొక్కయు, ప్రాణముల యొక్కయు కార్యకలాపములను నియమించునదియు నైన నిశ్చయము సత్త్వగుణమును కూడినట్టిది.**

**భాష్యము**

'యోగము' పరమాత్మను అవగాహన చేసుకొనుటకు ఒక సాధనము. తన మనస్సును, ప్రాణమును, ఇంద్రియములను పరమాత్మ యందు కేంద్రీకరించి, ధృఢనిశ్చయముతో నుండువాడు కృష్ణచైతన్యమున నెలకొనినవాడగును. అట్టి స్థిర నిశ్చయము(ధృతి:) సత్త్వగుణమునకు సంబంధించినది. 'అవ్యభిచారిణ్యా' అను పదము మిక్కిలి ముఖ్యమైనది. ఎందుకనగా కృష్ణచైతన్యమున నెలకొనినవారు ఏ ఇతర కార్యముల చేతను పెడత్రోవపట్టరని ఈ పదము సూచించుచున్నది.

**18.34**
**యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతే ర్జున ।**
**ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి: సా పార్థ రాజసీ ॥**

**అనువాదము**

**ఓ పార్థా! కాని ఏ నిశ్చయముచే మానవుడు ధర్మార్థకామములందలి ఫలముల యెడ ఆసక్తిని వహించునో అట్టి నిశ్చయము రజోగుణ ప్రధానమైనట్టిది.**

**భాష్యము**

ఇంద్రియతృప్తియే ఏకైక వాంఛగా కలిగినట్టియు, మతధర్మకార్యములు మరియు అర్థకార్యముల ఫలములను ఆశించుచు మానవుడు తన మనస్సును, ప్రాణమును, ఇంద్రియములను ఆ విధముగా నియుక్తములుగా చేయు మానవుడు రజోగుణముతో కూడినట్టివాడగును.

**18.35**
**యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।**
**న విముంచతి దుర్మేధా ధృతి: సా పార్థ తామసీ ॥**

**అనువాదము**

**ఓ పార్థా! ఇక స్వప్నము, భయము, శోకము, విషాదము, భ్రాంతి యనువానిని అతిక్రమించి పోజాలని మందబుద్ధితో కూడిన నిశ్చయము తమోగుణమునకు సంబంధించినట్టిది.**

## భాష్యము

సత్త్వగుణముతో కూడినట్టివాడు స్వప్నములను చూడడని భావింపరాదు. ఇక్కడ స్వప్నమనగా అధిక నిద్రయని అర్థము. స్వప్నము సహజమైయున్నందున సత్త్వరజస్తమో గుణములన్నింటి యందును అది కలుగుచుండును. కాని అధిక నిద్రను నివారింపలేనివారు, విషయభోగములను అనుభవించు చున్నామనెడి గర్వమును వీడలేనివారు భౌతిక ప్రకృతిపై ఆధిపత్యమనెడి స్వప్నమును కలిగి యుండువారు, ఇంద్రియ మనో్ప్రాణములను, నిమగ్నము చేయువారు ఆ విధముగా తమోగుణముతో కూడిన నిశ్చయము(ధృతి:) కలిగినవారుగా చెప్పబడుదురు.

## 18.36

**సుఖం త్విదానీం త్రివిధం శ్రుణు మే భరతర్షభ ।**
**అభ్యాసాద్ రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి ॥**

## అనువాదము

**భరత వంశీయులలో శ్రేష్ఠుడా! ఇక సుఖము నందలి మూడురకములను గూర్చి నా నుండి వినుము. వాని ద్వారా బద్ధజీవుడు సుఖము ననుభవించుట, మరికొన్నిమార్లు సర్వదుఃఖముల అంతమును గాంచుట జరుగుచుండును.**

## భాష్యము

బద్ధజీవుడు భౌతిక సుఖమును పదేపదే అనుభవింప యత్నించు చుండును(చరిత్వ చర్వణము). కాని, కొన్నిమార్లు అతడు మహాత్ముల సాంగత్య ఫలముచే అట్టి భౌతిక బంధముల నుండి విముక్తుడగుచుండును. అనగా ఏదియోనొక ఇంద్రియ భోగము నందు సదా నిమగ్నుడై యుండెడి బద్ధజీవుడు తాను కేవలము చేసినదానినే తిరిగి తిరిగి చేయుచున్నానని సత్సాంగత్యము ద్వారా అవగాహన చేసికొనినపుడు నిజమగు కృష్ణచైతన్యము అతని యందు జాగృతము కాగలదు. ఈ విధముగా అతడు కొన్నిమార్లు పునరావృత్తితో కూడిన నామమాత్ర సుఖము నుండి విముక్తి పొందుచుండును.

## 18.37

**యత్తదగ్రే విషమివ పరిణామే మృతోపమమ్ ।**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధిప్రసాదజమ్ ॥**

## అనువాదము

**ఏది ఆరంభము నందు విషప్రాయముగా నుండి అంత్యమున అమృత సమానమగునో, ఏది ఆత్మానుభూతికి మానవుని మేలుకొల్పునో అట్టి సుఖము సత్త్వగుణ ప్రధానమైనదని చెప్పబడును.**

## భాష్యము

ఆత్మానుభూతిని పొందుటకు మానవుడు, మనస్సు, ఇంద్రియములను నిగ్రహించుటకు మరియు మనస్సును ఆత్మయందు కేంద్రీకరించుటకు వివిధ నియమ నిబంధనల

ననుసరింపవలసి వచ్చును. ఆ విధి విధానము లన్నియును క్లేశకరము లగుటచే ఆదిలో అవి మిక్కిలి విషము వలె నుండును. కాని మానవుడు ఆ నియమముల ననుసరించుట యందు సఫలీకృతుడై దివ్యమైన ఆధ్యాత్మిక స్థితికి చేరగలిగినచో అతడు నిజమైన అమృతాస్వాదనమును ప్రారంభించి సుఖజీవితము ననుభవించును.

**18.38**
**విషయేన్ద్రియసంయోగాద్యత్తదగ్రే మృతోపమమ్ ।**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥**

**అనువాదము**

**ఇంద్రియములు ఇంద్రియార్థములతో సంపర్కము నొందగా లభించునటువంటిదియు మరియు ఆదిలో అమృతము వలె, అంత్యమున విషము వలె తోచునదియునైన సుఖము రజోగుణ ప్రధానమైనదని భావింపబడును.**

**భాష్యము**

ఒక యువకుడు ఒక యువతిని కలిసికొనినప్పుడు ఆ యువకుని ఇంద్రియములు యువతిని చూచుటకు, స్పృశించుటకు ఆమెతో భోగించుటకు ప్రేరేపించును. ఆదిలో ఇట్టి ఇంద్రియములకు ప్రీతికరములుగనే తోచినను, అంత్యమున లేదా కొంతకాలమునకు అవి విషతుల్యమగును. వారొకరి నుండి ఒకరు విడిపోవుట లేక విడాకులు పుచ్చుకొనుటయో జరిగినప్పుడు దుఃఖము, విచారము వంటి భావములు కలుగుచుండును. అట్టి సుఖము సదా రజోగుణముతో కూడినట్టిది. అనగా ఇంద్రియములు మరియు ఇంద్రియార్థముల సంయోగముచే లభించు సుఖము చివరకు దుఃఖకారణమే కాగలదు. కావున అది సర్వదా వర్జింపదగినది.

**18.39**
**యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః ।**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥**

**అనువాదము**

**ఆత్మానుభూతికి విముఖ మైనదియు,ఆది నుండి అంత్యము వరకు మోహకారణ మైనదియు, నిద్ర వలనను, సోమరితనము వలనను, మోహము వలనను ఉద్భవించినదియునైన సుఖము తమోగుణ ప్రధానమైనదని చెప్పబడును.**

**భాష్యము**

సోమరితనము మరియు నిద్ర యందు ఆనందమును పొందువాడు తప్పక అజ్ఞానమందును, తమోగుణము నందును స్థితుడైనట్టివాడే. అట్లే ఎట్లు వర్తింపవలెనో ఎట్లు వర్తింపరాదో ఎరుగనివాడు కూడా తమోగుణముతో కూడుకొనినట్టివాడే. తమోగుణము నందున్న వానికి ప్రతిదియు మోహముతో కూడుకున్నట్టిదే. ఆదియందు కాని అంత్యము నందు కాని అతనికి సుఖము లభింపదు. రజోగుణ స్వభావునకు ఆదిలో

ఒకరకమైన సుఖము అంత్యమున దుఃఖము లభించినను, తమోగుణము నందుండు వానికి మాత్రము ఆది మరియు అంతములు రెండింటి యందును దుఃఖమే కలుగును.

**18.40**
**న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పున: ।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభి: స్యాత్ త్రిభిర్గుణై: ॥**

**అనువాదము**
**భౌతిక ప్రకృతి త్రిగుణముల నుండి విడివడినట్టి జీవుడు భూలోకమున గాని, ఊర్ధ్వలోకములలోని దేవతల యందు గాని ఎచ్చోటను లేదు.**

**భాష్యము**
విశ్వమందంతటను గల ప్రకృతి త్రిగుణ ప్రభావమును శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ సంగ్రహపరచుచున్నాడు.

**18.41**
**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరన్తప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణై: ॥**

**అనువాదము**
**ఓ పరంతపా! ప్రకృతి త్రిగుణములచే కలిగిన గుణస్వభావముల ననుసరించి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు విభజింప బడుదురు.**

**18.42**
**శమో దమస్తప: శౌచం క్షాన్తిరార్జవమేవ చ ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥**

**అనువాదము**
**శాంతి, ఇంద్రియ నిగ్రహము, తపస్సు, శుచి, సహనము, నిజాయితీ, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము అను సహజగుణ లక్షణములచే బ్రాహ్మణులు కర్మ చేయుదురు.**

**18.43**
**శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।**
**దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥**

**<u>అనువాదము</u>**
**శౌర్యము, శక్తి, ధృఢనిశ్చయము, దక్షత, యుద్ధమునందు ధైర్యము, ఔదార్యము, నాయకత్వ మనునవి క్షత్రియులకు సహజములైన కర్మస్వభావములు.**

**18.44**
**కృషిగోరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥**

**<u>అనువాదము</u>**
**వ్యవసాయము, గోరక్షణము, వాణిజ్యములు వైశ్యులకు సహజ స్వభావ కర్మములు కాగా, పరిశ్రమ మరియు ఇతరులను సేవించుట యనునవి శూద్రులకు సహజములైన కర్మములు.**

**18.45**
**స్వే స్వే కర్మణ్యభిరత: సంసిద్ధిం లభతే నర: ।**
**స్వకర్మనిరత: సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు ॥**

**<u>అనువాదము</u>**
**ప్రతి మానవుడు తన గుణస్వభావముల ననుసరించి కర్మను చేయుట ద్వారా పరిపూర్ణత్వమును పొందగలడు. ఇప్పుడు దీనిని ఏ విధముగా ఆచరింపవచ్చునో నా నుండి వినుము.**

**18.46**
**యత: ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవ: ॥**

**<u>అనువాదము</u>**
**సర్వజీవులకు మూలకారణమును మరియు సర్వవ్యాపకుడును అగు భగవానుని విధ్యుక్త కర్మలను నిర్వర్తించుట ద్వారా అర్చించుచు మానవుడు పరిపూర్ణత్వమును పొందగలడు.**

## <u>భాష్యము</u>

పంచదశాధ్యాయమున తెలుపబడినట్లు, జీవులందరును దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అంశభాగములై యున్నారు. ఈ విధముగా అతడే సమస్త జీవుల ఆవిర్భావమునకు ఆదికారణము. ఈ విషయము : “జన్మాద్యస్య యత:” అను ‘వేదాంత సూత్రము’చే సమర్థింపబడినది. అంతేకాకుండ భగవద్గీత యందలి సప్తమాధ్యాయము నందు చెప్పబడినట్లు, దేవాదిదేవుడు బాహ్యాంతరములైన తన రెండుశక్తుల ద్వారా సర్వత్రా వ్యాపించియుండును. కనుకనే మానవుడు ఈ రెండు శక్తులతో కూడియున్నట్టి దేవాదిదేవుని అర్చింపవలెను. సాధారణముగా వైష్ణవ భక్తులు అంతరంగశక్తితో కూడిన దేవాదిదేవుని అర్చింతురు. అతని అట్టి ‘అంతరంగశక్తి’ యొక్క వికృత ప్రతిబింబమైన ‘బహిరంగాశక్తి’ పూర్వరంగము వంటిదైనను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు మాత్రము తన స్వరూపాంశమైన పరమాత్మగా సర్వాత్రా నిలిచియుండును. అనగా శ్రీకృష్ణుడే సర్వదేవతల, మానవుల, జంతువుల హృదయము నందు నెలకొనినట్టి సర్వాంతర్యామియై యున్నాడు. ప్రతివ్యక్తియు ఈ విధముగా దేవాదిదేవుని అంశయైయున్నందున అతనికి సేవనొనర్చుట తమ ధర్మమని ప్రతియొక్కరు ఎరుగవలెను. ప్రతియొక్కరు సంపూర్ణ కృష్ణచైతన్యములో శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవయందు నెలకొనవలెనని ఈ శ్లోకమున ఆదేశింపబడినది.

ఇంద్రియములకు ప్రభువైన హృషీకేశునిచే తానొక ప్రత్యేక విధ్యుక్త కర్మ యందు నెలకొనియున్నట్లు ప్రతియొక్కరు భావింపవలెను. పిదప తాము నెలకొని యున్న కర్మద్వారా లభించిన ఫలముతో దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని ప్రతియొక్కరు పూజింపవలెను. మానవుడు ఎల్లప్పుడును కృష్ణచైతన్యముతో ఈ విధముగా ఆలోచించినచో అతడు భగవానుని కృపచే సర్వమును పూర్తిగా అవగతము చేసుకొనగలుగును. అదే జీవిత పరిపూర్ణత్వ స్థితి. భగవద్గీత (12.7) నందు “తేషామహం సముద్ధర్తా” అని భగవానుడు చెప్పుచున్నాడు. అట్టిభక్తుని సంరక్షణ బాధ్యత పట్ల భగవానుడు స్వయముగా శ్రద్ధవహించును. అదియే జీవిత సంసిద్ధి. మానవుడెట్టి స్వధర్మము నందు నెలకొనియున్నను, దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సేవించినచో అతడు అత్యున్నత జీవిత సంసిద్ధిని పొందగలడు.

## 18.47

**శ్రేయాన్ స్వధర్మో విగుణ: పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**

## <u>అనువాదము</u>

**పరమధర్మమును గ్రహించి దానిని సమగ్రముగా చేయుట కంటెను అసమగ్రముగా చేసినను స్వధర్మమునందే నెలకొనియుండుట మానవునికి మేలైనది. స్వభావగుణముల ననుసరించి నిర్దేశింపబడిన కర్మలు ఎన్నడును పాపభూయిష్ఠములు కావు.**

## <u>భాష్యము</u>

భగవద్గీత యందు మానవుల స్వధర్మము(వృత్తిధర్మము) నిర్దేశింప బడినది. పూర్వశ్లోకములందు ఇదివరకే తెలుపబడినట్లు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల ధర్మములు వారివారి ప్రత్యేక గుణముల ననుసరించి నిర్దేశింప బడినవి. ఒకరు మరొకరి ధర్మమును అనుసరింపకూడదు. శూద్రకర్మల యందు ఆసక్తుడైనవాడు బ్రాహ్మణ

కుటుంబము నందు జన్మించినను తనను తాను బ్రాహ్మణునిగా కృత్రిమాభిమానమును వహింపరాదు. ఈ విధముగా ప్రతియొక్కరు కూడ తమ స్వభావ గుణముల ననుసరించియే కర్మచేయవలెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సేవగా కర్మ చేయబడినచో ఎట్టి కర్మయు హేయమైనది కాబోదు. బ్రాహ్మణుని స్వధర్మము నిజముగా సాత్త్వికమైనది. కాని ఒకవ్యక్తి స్వభావరీత్యా సాత్త్వికుడు కానిచో అతడు బ్రాహ్మణుని స్వధర్మమును అనుకరింపరాదు. క్షత్రియునికి లేక పరిపాలకునికి హేయకార్యము లనేకము చేయవలసి వచ్చును. అతడు శత్రువులను చంపుటకు నిర్దాక్షిణ్యము వహింపవలసివచ్చును. కొన్నిమార్లు రాజకీయ తంత్రముల కొరకు అబద్ధములాడుట చేయవచ్చును. అట్టి హింస, కుటిలత్వము అనునవి రాజకీయ వ్యవహారముల యందు కనిపించును. కాని క్షత్రియుడు తన విధ్యుక్త ధర్మములను విడిచి బ్రాహ్మణ ధర్మమును నిర్వహించుటకు యత్నింపరాదు.

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ప్రీతికొరకు ప్రతియొక్కరు కర్మనొనరింపవలెను. ఉదాహరణకు అర్జునుడు క్షత్రియుడైనను శత్రుపక్షముతో పోరాడుటకు సంశయించు చున్నాడు. కాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ప్రీతికొరకు ఆ యుద్ధము చేయబడినచో పతన భయముండదు. వ్యాపారము నందు కూడా కొన్నిమార్లు లాభములను గడించుటకు వ్యాపారస్థుడు అనేక అబద్ధములు చెప్పవలసివచ్చును. అతడట్లు చేయనిచో వ్యాపరము నందు ఎట్టి లాభము లభింపదు. కొన్నిమార్లు వ్యాపారస్థుడు ఖాతాదారునితో తానేమాత్రము లాభము చేసుకొనుట లేదని పలికినను వాస్తవమునకు అది సత్యము కానేరదు. లాభమును గడింపకుండా వ్యాపారస్థుడు వ్యాపారమును చేయజాలడని ప్రతియొక్కరు ఎరుగవలెను. కనుకనే వ్యాపారస్థుడు తానెట్టి లాభమును చేసుకొనుట లేదని చెప్పినప్పుడు అతడు సాధారణమైన స్వల్ప అబద్ధమాడినట్లుగా భావింపవలెను. కాని తప్పనిసరై అబద్ధము చెప్పవలసిన వృత్తిధర్మమున నెలకొనియున్నందున ఆ వృత్తిని విడిచి బ్రాహ్మణ వృత్తిని గ్రహింప వలెనని వర్తకుడు భావింపరాదు. ఆ విధముగా ఆదేశింపబడలేదు. ఎవరైనను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని స్వధర్మకర్మతో సేవింప గలిగినచో అతడు క్షత్రియుడైనను, వైశ్యుడైనను, శూద్రుడైనను ఇబ్బందిలేదు. బ్రాహ్మణులు కూడా వివిధములైన యజ్ఞములను ఆచరించునప్పుడు కొన్నిమార్లు జంతుబలిని అట్టి యజ్ఞములందు ఒనరింప వలసివచ్చును. అట్లే క్షత్రియుడు తన స్వధర్మ నిర్వర్తన యందు శత్రువును చంపవలసి వచ్చినను ఎట్టి పాపము కలుగదు. ప్రతియొక్కరు కూడ యజ్ఞము కొరకు లేక దేవాదిదేవుడైన విష్ణువు ప్రీతికొరకు కర్మ(యజ్ఞము)నొనరింపవలెను; స్వార్థముతో చేయబడునదేదైనను బంధకారణమగును. తృతీయాధ్యాయమున ఇట్టి విషయములు స్పష్టముగను మరియు వివరముగను వివరింపబడినవి. (భ.గీ.3.9). ప్రతియొక్కరు తమ ప్రత్యేక గుణము ననుసరించియే వర్తింప వలెననియు, దేవాదిదేవుని దివ్యసేవకొరకే పనిచేయుటకు నిశ్చయించుకోవలెనని తెలుపుటయే దీని సారాంశము.

## 18.48
**సహజం కర్మ కౌన్తేయ సదోషమపి న త్యజేత్ ।**
**సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥**

## అనువాదము
**అగ్ని పొగచే ఆవరింపబడినట్లు ప్రతి ప్రయత్నము కూడా ఏదియో ఒక దోషముచే ఆవరింపబడి యుండును. అందుచే ఓ కౌంతేయా! దోషముతో కూడియున్నను తన సహజ కర్మను ఎవ్వడును త్యజింపరాదు.**

## భాష్యము
బద్ధజీవితము నందు సర్వకర్మలు భౌతిక ప్రకృతి త్రిగుణములచే కలుషితములై యుండును. బ్రాహ్మణు డైనవాడు జంతువధతో కూడిన కొన్ని యజ్ఞములను నిర్వర్తింపవలసి వచ్చును. అట్లే క్షత్రియుడు ఎంతటి పుణ్యాచరణుడైనను శత్రువుతో యుద్ధము చేయవలసి వచ్చును. దానిని అతడు విడుచుటకు వీలులేదు. అట్లే వైశ్యుడు ఎంతటి ధర్మాత్ముడైనను తన వ్యాపారమును కొనసాగించుట కొరకు తన లాభమును గుప్తముగా ఉంచవలసివచ్చును. ఇవియన్నియును తప్పని సరియైనట్టివి. ఎవరును తప్పించుకొనుటకు వీలులేనివి. అట్లే శూద్రుడు దుష్టుడైన యజమానుని సేవింపవలసి వచ్చినప్పుడు చేయకూడని కార్యమునైనను యజమానుని ఆజ్ఞపై చేయవలసి వచ్చును. అనగా స్వీయస్వభావము ననుసరించి సహజముగా కలుగుచుండుటచే అవి దోషపూరితములైనను ప్రతియొక్కరు తమ స్వధర్మములను కొనసాగింపవలెను.

ఈ విషయమున ఒక చక్కని ఉదాహరణము ఇక్కడ తెలుపబడినది. అగ్ని పవిత్రమైనను దానినుండి పొగవచ్చును. అయినను ఆ పొగ అగ్నిని అపవిత్రము చేయబోదు. పొగను కలిగియున్నను అగ్ని పంచభూతము లన్నింటి లోకి పవిత్రమైనదిగా పరిగణింపబడును. ఎవరైన క్షత్రియుడు తన ధర్మమును విడిచి బ్రాహ్మణ ధర్మమును గ్రహింపదలచినను, ఆ బ్రాహ్మణ ధర్మమున అప్రియములైన కర్మము లుండవని భావించుటకు అవకాశము లేదు. దీనినిబట్టి భౌతికజగత్తు నందు ఎవరును భౌతిక ప్రకృతి ప్రభావముల నుండి సంపూర్ణముగా విడివడి యుండలేరని నిర్ణయింప వచ్చును. కనుకనే ఈ సందర్భమున ధూమాగ్నుల ఉదాహరణము మిక్కిలి సమంజసమై యున్నది. చలికాలమున అగ్ని నుండి వేడిని పొందుట కొరకై యత్నించినపుడు కొన్నిమార్లు అందులోనుండి పొగబయటకు వచ్చి కనులకు మరియు ఇతర శరీరావయవములకు కలత నొందించును. ఇట్టి కలత కలిగించు పరిస్థితులు ఉన్నప్పటికిని మానవుడు అగ్నిని ఉపయోగింపవలసి వచ్చును. అట్లే కలతను కలిగించు విషయములెన్ని ఉన్నప్పటికిని ఎవరును సహజ ధర్మమును విడువరాదు. అంతేకాకుండ వారు కృష్ణచైతన్యము నందు తమ స్వధర్మమును నిర్వహించుచు దేవాదిదేవుని సేవించుటకు దృఢనిశ్చయులై యుండవలెను. అదియే పరిపూర్ణత్వ స్థితి. ఏదేని స్వధర్మమును పరమపురుషుడైన శ్రీకృష్ణభగవానుడు ప్రీతికొరకు నిర్వహించినపుడు ఆ ప్రత్యేక వృత్తిధర్మము నందు గల దోషము లన్నియును పవిత్రీకరింపబడును. ఆ విధముగా భక్తియుక్త సేవయందు కర్మఫలములు పవిత్రమైనప్పుడు మానవుడు ఆత్మదర్శనము నందు పరిపూర్ణుడగును. అదియే ఆత్మానుభూతి యనబడును.

**18.49**
**ఆసక్తబుద్ధి: సర్వత్ర జితాత్మ విగతస్పృహ: ।**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥**

**అనువాదము**

**ఆత్మనిగ్రహము కలవాడును, అనాసక్తుడును, భౌతికసుఖములను త్యజించువాడును అగు మానవుడు సన్న్యాసాభ్యాసము ద్వారా కర్మఫల విముక్తి యనెడి అత్యున్నత పరిపూర్ణత్వ స్థితిని పొందగలడు.**

**భాష్యము**

మానవుడు తాను దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అంశభాగమనియు, తత్కారణముగా తన కర్మఫలముల ననుభవించుటకు తనకెట్టి అధికారము లేదనియు భావించుటయే నిజమైన సన్న్యాసము. వాస్తవముగా అతడు పరమ పురుషుని అంశభాగమగుట చేత అతడు పొందు కర్మఫలము లన్నియును పరమ పురుషుని చేతనే అనుభవింప బడవలెను. ఇదియే నిజమైన కృష్ణచైతన్యము. కృష్ణచైతన్యము నందు వర్తించువాడే నిజమైన సన్న్యాసి అనగా అతడు సన్న్యాసాశ్రమ జీవితము నందున్నట్టివాడు. అట్టి భావనలో వర్తించువాడు సదా దేవాదిదేవుని ప్రీత్యర్థమై వర్తించుచుండును. కనుక సదా సంతృప్తుడై యుండగలడు. భౌతిక విషయము లందు ఆసక్తుడు కాకుండ, భగవానుని దివ్యసేవ వలన పొందబడు ఆధ్యాత్మికానందమునకు భిన్నమైన ఆనందమును పొందుట యందు అతడు అలవాటు లేకుండును. వాస్తవమునకు సన్న్యాసియైనవాడు పూర్వకర్మ ఫలముల నుండి విముక్తుడై యుండునని భావింపబడును. కాని కృష్ణచైతన్య వంతుడైనట్టి వ్యక్తి నామమాత్ర సన్న్యాసమును స్వీకరింపకనే అప్రయత్నముగా ఈ పరిపూర్ణత్వమును పొందగలడు. అట్టి మానసిక స్థితియే 'యోగారూఢ' స్థితి లేక పరిపూర్ణ స్థితి యనబడును. తృతీయాధ్యాయము నందు స్థిరీకరింపబడినట్లు, "యస్త్వాత్మరతిరేవ స్యాత్"- ఆత్మయందే తృప్తినొందు వానికి ఎట్టి కర్మప్రతిఫలముల భయముండదు(భ.గీ.3.17).

**18.50**
**సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే ।**
**సమాసేనైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥**

**అనువాదము**

**ఓ కౌన్తేయా! ఇట్టి సంపూర్ణత్వమును పొందినవాడు నేనిపుడు సంగ్రహముగా చెప్పబోవునట్లు వర్తించుచు అత్యున్నత జ్ఞానస్థితియైన పరబ్రహ్మమును ఏ విధముగా పొందగలడో నీవు ఆలకింపుము.**

**భాష్యము**

కేవలము స్వధర్మము నందు నెలకొని దానిని దేవాదిదేవుని కొరకు ఒనరించుట ద్వారా ఏ విధముగా మానవుడు అత్యున్నత పరిపూర్ణత్వ స్థితిని పొందగలడో భగవానుడు అర్జునునకు ఇక్కడ వర్ణించి చెబుతున్నాడు. మానవుడు దేవాదిదేవుని సంతృప్తి కొరకు తన కర్మఫలములను త్యజించుట ద్వారా బ్రహ్మానుభూతి స్థితిని పొందగలడు. అదియే

ఆత్మానుభూతి విధానము. పరిపూర్ణ జ్ఞానము శుద్ధమైన కృష్ణచైతన్యస్థితిని పొందుట యందే గలదు. ఈ విషయము
రాబోవు శ్లోకములందు వివరింపబడినది.

**18.51- 53**

**బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥**

**వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానస: ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రిత: ॥**

**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమ: శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే ॥**

**అనువాదము**

**బుద్ధిచే పవిత్రుడైనందునను మరియు రాగద్వేషముల నుండి విడివడి యున్న కారణముగా ఇంద్రియార్థములను త్యజించి దృఢనిశ్చయముచే మనస్సును నిగ్రహించి యున్నందునను ఏకాంత ప్రదేశమున వసించువాడును, మితాహారము కలిగినవాడును, మనోవాక్కాయములను నిగ్రహించువాడును, నిత్యము సమాధిస్థితి యందున్నవాడును, అనాసక్తుడును, మిథ్యాహంకారము, మిథ్యాగర్వము, దురభిమానము, కామము, క్రోధముల నుండియు విషయవస్తు స్వీకారము అనువాని నుండి విడివడినవాడును, మమత్వదూరుడును, శాంతిమయుడును అగు మానవుడు నిశ్చయముగా ఆత్మానుభూతి స్థితికి ఉద్ధరింపబడగలడు.**

**భాష్యము**

బుద్ధి పవిత్రమైనప్పుడు మానవుడు సత్త్వగుణము నందు స్థితుడగును. ఈ విధముగా అతడు మనస్సును నియంత్రింపగలిగి ఎల్లప్పుడును సమాధిస్థితి యందు నెలకొనగలడు. ఇంద్రియతృప్తిని కలిగించు వస్తువుల యందు ఆసక్తిని కలిగియుండక అతడు తన కర్మలయందు రాగద్వేషవిముక్తుడై యుండును. అనాసక్తుడైన అట్టివ్యక్తి సహజముగా ఏకాంత ప్రదేశమున నివసింపగోరును. మితముగా భుజించుచు, దేహము, మనస్సు, వాక్కు కర్మలను నియంత్రించు చుండును. అతడు తన దేహమునే ఆత్మగా భావింపనందున (దేహాత్మబుద్ధి) అహంకార రహితుడై యుండును. అట్లే అతడు అనేక భౌతిక వస్తువుల ద్వారా పౌష్టికాహారములను స్వీకరించి తన శరీరమును బలిష్ఠము చేసికొనవాంఛింపడు. దేహాత్మబుద్ధి నుండి విడివడినందున అతనికి గర్వముండదు. భగవానుని కృపచే తనకు లభించిన దానితో అతడు సంతృప్తుడగుచుండును. అట్టివాడు ఇంద్రియతృప్తి లభింపనప్పుడు క్రోధము చెందుట గాని, ఇంద్రితృప్తిని కలిగించు వస్తువులకై తీవ్రయత్నములు సలుపుట గాని చేయడు. ఈ విధముగా అతడు అహంకారము నుండి సంపూర్ణముగా విడివడినపుడు సమస్త భౌతిక విషయముల పట్ల అతడు అనాసక్తుడగును. దీనినే బ్రహ్మానుభూతి లేక 'బ్రహ్మభూత' స్థితి యందురు. ఈ విధముగా మానవుడు భౌతిక జీవితభావన నుండి విముక్తుడైనపుడు శాంతుడై కలతకు గురికాకుండును. భగవద్గీత(2.70) నందు ఇట్లు వర్ణింపబడినది:

ఆపూర్వమాణమచలప్రతిష్ఠం సముద్రమాప: ప్రవిశన్తి యద్వత్
తద్వత్ కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తిమాప్నోతి న కామకామీ

"నదులు సర్వదా నీటిని పూరించుచున్నను నిశ్చలముగా నుండు సముద్రము వలె, అవిచ్ఛిన్నమైన కోరికలు తనయందు ప్రవహించుచున్నను ఆ ప్రవాహముచే కలత నొందని మానవుడే శాంతిని పొందగలడు. తన కోరికలను తృప్తి పరచుట కొరకై యత్నించు వారెల్లప్పుడును అట్టి శాంతిని పొందజాలరు."

**18.54**
**బ్రహ్మభూత: ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమ: సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥**

**అనువాదము**

**ఈ విధముగా బ్రహ్మభూత స్థితియందు ప్రతిష్ఠితుడైనవాడు శీఘ్రమే పరబ్రహ్మనుభూతిని పొంది ప్రసన్నాత్ముడగును. అతడెన్నడును దేనికొరకు శోకింపడు. దేనిని వాంఛింపడు. అట్టివాడు సర్వజీవుల యెడ సమత్వ భావమును కలిగియుండును. అట్టి స్థితి యందే అతడు నా శుద్ధభక్తియుక్త సేవను పొందుచున్నాడు.**

**భాష్యము**

'బ్రహ్మభూత' స్థితి అనగా బ్రహ్మముతో ఐక్యమగుటయే నిరాకారవాదికి చివరిస్థితి. కాని సాకారవాది లేక శుద్ధభక్తుడు శుద్ధమగు భక్తియుక్త సేవ యందు నెలకొనుటకు ఆ స్థితిని కూడా అధిగమించి మరింతగా పురోగమింపవలెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనినవాడు అప్పటికే ముక్తస్థితి యనబడు 'బ్రహ్మభూత' స్థితి లేక బ్రహ్మగుణైక్య స్థితిని పొందియుండెనని అర్థము. వాస్తవమునకు పరబ్రహ్మముతో గుణైక్యమును పొందకుండ ఎవ్వరును దేవాదిదేవునికి సేవనొనర్చజాలరు. కృష్ణచైతన్యమనెడి అట్టి దివ్యస్థితి యందు సేవ్యసేవకుల నడుమ భేదము లేకున్నను ఉన్నత ఆధ్యాత్మిక భావనలో వారి నడుమ తారతమ్యము తప్పక నుండును.

భౌతిక జీవన భావనలో మానవుడు ఇంద్రియ తృప్తికై కర్మ నొనరించినపుడు దుఃఖము కలుగుచుండును. కాని ఆధ్యాత్మిక జగత్తున శుద్ధభక్తియుక్త సేవ యందు నెలకొనినప్పుడు అతనికి దుఃఖమనునది కలుగదు. కృష్ణచైతన్యవంతుడైన భక్తునకు శోకింప వలసిన విషయము గాని, వాంఛింపదగిన విషయము గాని ఏదియును ఉండదు. శ్రీకృష్ణభగవానుడు పూర్ణుడైనందున కృష్ణచైతన్యమున దేవాదిదేవుని సేవయందు నెలకొనిన జీవుడు కూడా పూర్ణుడు కాగలడు. మలినమైన జలము తొలగబడినట్టి నదివలె అతడును సదా స్వచ్ఛముగా నుండును. శుద్ధభక్తుడు శ్రీకృష్ణుని తప్ప అన్యమైన వాటిని గూర్చి చింతింపనందున అతడు సహజముగానే సర్వదా ప్రసన్నుడై యుండును. శ్రీకృష్ణభగవానుని సేవ యందు పరిపూర్ణత్వమును పొంది యుండుటచే అతడు ఏ విధమైన భౌతిక నష్టమునకు శోకింపడు. మరియు ఏ భౌతిక విషయ లాభమును వాంఛింపడు. దేవాదిదేవుని అంశ భాగమగుటచే ప్రతిజీవుడును భగవానుని శాశ్వత దాసుడనని ఎరుగుటచే అట్టి వాడెన్నడును భౌతిక భోగానుభవమును వాంఛింపడు. అట్టివాడు భౌతిక జగత్తున ఒకనిని తక్కువగను మరొకరిని ఎక్కువగను చూడడు. నిమ్న, ఉన్నత స్థితులనునవి తాత్కాలికము లైనట్టివి. అట్లే భక్తునికి తాత్కాలిక వ్యక్తావ్యక్త వస్తువులతో సంబంధము లేదు. అతనికి రాయి మరియు బంగారమును సమానములై

యుండును. ఇదియే 'బ్రహ్మభూత' స్థితి. అట్టిస్థితిని శుద్ధభక్తుడు చాలా సులభముగా పొందగలడు. పరబ్రహ్మము నందు ఐక్యమగుట మరియు వ్యక్తిత్వమును కోల్పోవుట యనెడి భావనలు అట్టిస్థితిలో నరకప్రాయములుగా తోచును. స్వర్గప్రాప్తి యను భావము అతనికి తృణప్రాయమే(భ్రాంతి) యగును. ఇంద్రియములు కోరలు తీసిన పాముల వంటివగును. కోరలు తీసిన పాము నుండి ఏ మాత్రము భయములేనట్లు, సహజముగనే నియంత్రింపబడిన ఇంద్రియముల వలన ఏ విధమైన భయము కలుగదు. భౌతికభావన యందు ఆసక్తుడైన వ్యక్తికి ప్రపంచము దుఃఖపూరిత మైనట్లుగా తోచినను, భక్తునకు సమస్త జగత్తు వైకుంఠము లేక ఆధ్యాత్మిక జగత్తుతో సమానముగా నుండును. భౌతికజగత్తున అత్యంత గొప్పవాడని పేరు గాంచినవారు కూడ అట్టి భక్తుని దృష్టిలో చిట్టిచీమతో సమానమగును. ఈ కలియుగము నందు శుద్ధభక్తియుక్త సేవను ప్రచారము చేసిన శ్రీచైతన్య మహాప్రభువు కృపచేతనే అట్టి స్థితి ప్రాప్తింపగలదు.

## 18.55

**భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వత: ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ॥**

### అనువాదము

**భక్తియుక్త సేవ చేతనే మానవుడు నన్ను యథారూపముగా దేవాదిదేవుడనని అవగాహన చేసికొనగలడు. అట్టి భక్తిచే అతడు నన్ను సంపూర్ణముగా ఎరిగినప్పుడు భగవద్రాజ్యమున ప్రవేశింపగలడు.**

### భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని మరియు అతని స్వరూపాంశములైన విష్ణుతత్త్వములను అవగతము చేసికొనుట మానసిక కల్పనకు గాని, అభక్తులకు గాని సాధ్యము కాదు. ఎవరైనను దేవాదిదేవుని అవగాహన చేసికొనదలచినచో వారు శుద్ధభక్తుని నిర్దేశమున శుద్ధభక్తియుక్త సేవను అవలంబింపవలెను. లేనిచో దేవాదిదేవుని యథార్థ తత్త్వమెప్పుడును గుప్తముగనే ఉండిపోగలదు. భగవద్గీత (7.25) నందు ఇదివరకే చెప్పబడినట్లు : "నాహం ప్రకాశ: సర్వస్య" – అతడు సర్వులకు వ్యక్తము కాదు. విద్యాపాండిత్యముచే కాని, మానసిక కల్పనలచే కాని ఎవ్వరును భగవానుని అవగాహన చేసికొనజాలరు. కృష్ణచైతన్యము నందు వాస్తవముగా నెలకొనినవాడే భక్తియుక్త సేవ ద్వారా శ్రీకృష్ణుడు అనగానేమో ఎరుగగలడు. విశ్వవిద్యాలయ పట్టములు ఇందుకు ఏమాత్రము తోడ్పడజాలవు.

కృష్ణతత్త్వవిజ్ఞానము నందు పూర్తి నిష్ణాతుడైన వ్యక్తి కృష్ణధామమైన ఆధ్యాత్మిక రాజ్యమున ప్రవేశించుటకు అర్హుడగును. 'బ్రహ్మభూత' స్థితిని పొందుట అనగా వ్యక్తిత్వమును కోల్పోవుటయని భావము కాదు. వాస్తవమునకు అట్టి స్థితి యందు కూడ భక్తియుక్త సేవ కలదు. అట్టి భక్తియుక్త సేవ ఉన్నంతకాలము భగవానుడు, భక్తుడు, భక్తియోగ(భక్తియుక్త సేవ) అను మూడు అంశములు కొనసాగుచునే యుండును. అట్టి జ్ఞానము ముక్తినొందిన పిమ్మట కూడ నశింపదు. ముక్తి అనగా భౌతిక జీవిత భావన స్థితి నుండి విడివడుటయే. ముక్తినొందినట్టి ఆధ్యాత్మిక జీవిత స్థితి యందును ఆత్మపరమాత్మల నడుమ భేదము, ఆత్మ యొక్క వ్యక్తిత్వము కొనసాగుచునే యుండును. కాని విశేషమేమనగా, ఈ భావములు శుద్ధమైన కృష్ణచైతన్యము నందు నెలకొనియుండును. 'విశతే'- నా యందు ప్రవేశించును అను పదము పరబ్రహ్మముతో ఐక్యము నొందుట మనెడి భావము గల అద్వైత సిద్ధాంతమును సమర్థించునని

ఎవ్వరును పొరపాటు పడరాదు. ఆ పదము అట్టి భావమును సమర్థించుటలేదు. 'విశతే' అనగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని సాంగత్యమును పొంది అతనికి సేవ చేయుట కొరకై జీవుడు తన వ్యక్తిత్వముతో భగవద్ధామము నందు ప్రవేశించునని అర్థము. ఉదాహరణకు ఒక పచ్చనిపక్షి పచ్చని వృక్షము పైకి చేరుట చెట్టుతో ఏకమగుటకు గాక, ఆ వృక్ష ఫలములను ఆస్వాదించుటకొరకే వృక్షము నందు ప్రవేశించుట అయియున్నది. సాధారణముగా సముద్రము వైపునకు ప్రవహించి దానియందు కలిసిపోవునట్టి నదిని ఉదాహరణగా నిరాకారవాదులు సూచింతురు. ఇది నిరాకారవాదికి ఆనందకారకమైనను సాకారవాదులైనట్టి భక్తులు మాత్రము సముద్రమందలి జలచరములు సముద్రమందే ఉన్నప్పటికిని తమ వ్యక్తిత్వమును కలిగియున్నట్లు, ముక్తి పిదప కూడ తమ వ్యక్తిత్వమును నిలుపుకొని యుందురు. సముద్రపు అంతర్భాగములందు ప్రవేశించిన కొలది అనేకములైన జలచరములు మనలకు గోచరించు చుండును. కనుక కేవలము సముద్ర ఉపరితల పరిజ్ఞానమునే కాకుండ, సముద్రము నందలి అంతర్భాగములలో నివసించు జలచరములను గూర్చిన సంపూర్ణ జ్ఞానమును ప్రతియొక్కరు సంపాదింపవలెను.

శుద్ధభక్తియుక్త సేవ చేతనే భక్తుడు దేవాదిదేవుని దివ్యగుణ లక్షణములను మరియు విభూతులను యథార్థముగా ఎరుగగలడు. ఏకాదశాధ్యాయమున చెప్పబడినట్లు, భక్తియుక్త సేవ ద్వారానే మానవుడు భగవానుని అవగాహన చేసికొనగలడు (11.54). అదేవిషయము ఈ అధ్యాయమున తిరిగి నిర్ధారింప బడినది. భక్తియుక్త సేవ ద్వారానే మానవుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అవగాహన చేసుకొని అతని ధామమునందు ప్రవేశింపగలడు.

భౌతిక భావనల నుండి విముక్తియైనటువంటి 'బ్రహ్మభూత' స్థితిని పొందిన పిమ్మట శ్రీకృష్ణభగవానుని లీలాశ్రవణము చేయుట ద్వారా భక్తియుక్త సేవ ఆరంభమగును. మానవుడు దేవాదిదేవుని గూర్చి శ్రవణము చేసినంతనే 'బ్రహ్మభూత' స్థితి అప్రయత్నముగా వృద్ధియగును. అప్పుడు లోభము మరియు ఇంద్రియ భోగవాంఛ వంటి భౌతిక కాలుష్యములు అంతమగును. లోభము మరియు కోరికలు హృదయము నుండి వైదొలగగనే భక్తుడు భక్తియుక్త సేవ పట్ల మరింత అధికముగా ఆసక్తి గలవాడగును. అట్టి ఆసక్తిచే అతడు భౌతిక సంపర్కము నుండి విముక్తుడగును. అట్టి జీవిత స్థితి యందే అతడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని యథార్థముగా ఎరుగగలడు. శ్రీమద్భాగవతము (1.2.16-21) కూడ దీనినే చెప్పుచున్నది. ముక్తినొందిన పిమ్మట కూడ భక్తియుక్త సేవ కొనసాగుచునే యుండును. "ఆప్రాయణాత్ తత్రాపి హి దృష్టమ్" అనగా ముక్తి పిమ్మటను భక్తియుక్త సేవావిధానము కొనసాగుటను 'వేదాంత సూత్రము' (4.1.12) సమర్థించు చున్నది. నిజమైన ముక్తికి నిర్వచనము జీవుడు తన నిజస్థితి నందు పునఃప్రతిష్ఠితుడగుటయేనని శ్రీమదభాగవతము (2.10.6) నందు కూడ తెలుపబడినది. ప్రతిజీవుడును దేవాదిదేవుని అంశభాగమని ఇదివరకే జీవుని నిజస్థితి వివరింపబడినది. కనుకనే జీవుని నిజస్వరూపస్థితి సేవ చేయుటయే. ముక్తిపిమ్మట ఆ సేవ నిలిచిపోదు. వాస్తవమునకు ముక్తి అనగా అజ్ఞానము నుండి విముక్తి పొందుటయే.

## 18.56

**సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయ: ।**
**మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥**

### అనువాదము

**అన్ని విధములైన కర్మల యందు నియుక్తుడైనను నా శుద్ధభక్తుడు నా రక్షణలో నిలిచి శాశ్వతము, అవ్యయమును అగు ధామమును నా కృపచే చేరగలడు.**

### భాష్యము

'మద్వ్యపాశ్రయ:' అనగా శ్రీకృష్ణభగవానుని రక్షనమున అని భావము. భౌతిక కాలుష్యముల నుండి విడివడుటకు శుద్ధభక్తుడు దేవాదిదేవుని నిర్దేశమున లేక అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశము నందు గాని వర్తించును. శుద్ధభక్తుడు కాలపరిమితి యనునది లేకుండ దినమునకు ఇరువది నాలుగు గంటలు నూటికి నూరుపాళ్ళు దేవాదిదేవుని నిర్దేశము ననుసరించి కార్యకలాపములలో నెలకొనియుండును. ఈ విధముగా కృష్ణచైతన్యము నందు నెలకొనిన భక్తునిపట్ల భగవానుడు పరమదయను కలిగియుండును. తత్కారణముగా ఎన్ని కష్టములెదురైనను చివరికి అతడు దివ్యలోకమును లేక కృష్ణలోకమును చేరగలడు. అతనికి కృష్ణలోక ప్రవేశము నిశ్చయము. ఆ విషయమున ఎట్టి సందేహము లేదు. అట్టి కృష్ణలోకమునందు ప్రతిదియు మార్పురహితమై, శాశ్వతమై, అనశ్వరమై, జ్ఞానపూరితమై యుండును.

## 18.57

**చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పర: ।**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్త: సతతం భవ ॥**

### అనువాదము

**సర్వకర్మల యందు నా పైననే ఆధారపడి సదా నా రక్షణము నందే కర్మ నొనరింపుము. అట్టి భక్తియుక్తసేవలో సంపూర్ణముగా నా యందే చిత్తము కలవాడవగుము.**

### భాష్యము

ఎవడైనను కృష్ణచైతన్యమును కలిగి కర్మను చేయునపుడు తానే జగత్తునకు ప్రభువు కావలెనను భావనతో వర్తింపడు. వాస్తవమునకు ప్రతియొక్కరు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని నిర్దేశము ననుసరించి సేవకుని వలె వర్తింప వలెను. అతడు తన యజమాని ఆజ్ఞ ననుసరించియే వర్తింప వలసి యుండును. సేవకుడు వ్యక్తిగత స్వాతంత్ర్యమును కలిగియుండడు. పరమపురుషుడైన శ్రీకృష్ణుని పక్షమున వర్తించు సేవకుడు కర్మయొక్క లాభనష్టములతో కలతనొందడు. కేవలము అతడు భగవానుని ఆజ్ఞననుసరించి విశ్వాసముతో తన విధ్యుక్త ధర్మములను నిర్వర్తించును. ఇప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుని ప్రత్యక్ష నిర్దేశముల ననుసరించి వర్తించియుండెను. కాని శ్రీకృష్ణుడు లేని సమయమున మానవుడు ఎట్లు వర్తింపవలెనని ఎవరైనను వాదించు అవకాశము కలదు. ఈ గీతా గ్రంథము నందలి శ్రీకృష్ణభగవానుని నిర్దేశముల ననుసరించి మరియు ఆ దేవాదిదేవుని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశముల ననుసరించి ఎవరైనను కర్మ నొనరించినచో శ్రీకృష్ణుని ప్రత్యక్ష నిర్దేశమున వర్తించిన ఫలమే కలుగుననుట దానికి సమాధానము. ఈ శ్లోకము నందలి 'మత్పర:' అను సంస్కృత

పదము మిక్కిలి ప్రధాన్యమును కలిగియున్నది. ఎవరికైనను, కృష్ణచైతన్యమున శ్రీకృష్ణుని ప్రీతికొరకై వర్తించుట తప్ప అన్యమైన జీవితలక్ష్యము మరొక్కటి లేదని ఆ పదము సూచించు చున్నది. ఆ విధముగా వర్తించుచు మానవుడు : "ఈ ప్రత్యేక కర్తవ్యము నొనరించుటకు నేను శ్రీకృష్ణునిచే నియమింపబడితిని" అని శ్రీకృష్ణుని గూర్చియే స్మరింపవలెను. ఇట్లు కర్మనొనరించునప్పుడు అతడు నిరంతరము శ్రీకృష్ణుని గూర్చియే స్మరించును. అదియే సంపూర్ణ కృష్ణచైతన్యము. ఏదియో ఒక కార్యమును తమ ఇచ్ఛానుసారము చేసి, ఆ ఫలమును దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు అర్పింపరాదని ఈ విషయమున ముఖ్యముగా గుర్తింపవలెను. అట్టి కార్యమెన్నడును కృష్ణచైతన్యముతో కూడిన భక్తియుక్తసేవకు సంబంధించినది కాదు. ఎవరైనను శ్రీకృష్ణభగవానుని ఆదేశముల ననుసరించి వర్తింపవలెనను విషయము మిక్కిలి ప్రధానమైనది. శ్రీకృష్ణుని ఆదేశములు గురుశిష్య పరంపర నుండి ప్రామాణికాచార్యుని ద్వారా లభించును. కనుక ఆధ్యాత్మికాచార్యుని ఆదేశమును జీవిత పరమ ధర్మముగా స్వీకరింపవలెను. కనుకనే ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయించి అతని నిర్దేశానుసారము కర్మనొనరించినచో కృష్ణచైతన్యమున జీవిత పరిపూర్ణత్వము నిశ్చయముగా లభించును.

## 18.58

**మచ్చిత్త: సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।**
**అథ చేత్త్వమహంకారాన్న శ్రోష్యసి వినంక్ష్యసి ॥**

**<u>అనువాదము</u>**

**నీవు నా యందు చిత్తము గలవాడవైనచో నా కృపచే బద్ధజీవితపు ఆటంకముల నన్నింటిని అధిగమింప గలుగుదువు. కాని నా మాట వినక అట్టి భావనతో గాక అహంకారముతో వర్తించినచో తప్పక నశింతువు.**

**<u>భాష్యము</u>**

సంపూర్ణ కృష్ణచైతన్యవంతుడు తన భౌతిక జీవితమునకు సంబంధించిన ధర్మముల నిర్వహణను గూర్చి అనవసర చింతను కలిగియుండడు. అట్టి చింతారాహిత్యమును మూర్ఖుడైనవాడు ఏ మాత్రము అవగాహన చేసికొనజాలడు. కృష్ణచైతన్యమున వర్తించువానికి శ్రీకృష్ణభగవానుడు ఆప్త మిత్రుడగును. దేవాదిదేవుడు తన మిత్రుని సౌఖ్యమును గూర్చి ఎల్లప్పుడు ఆలోచించును. దినమునకు ఇరువది నాలుగు గంటలు భగవానుని ప్రీతికొరకై భక్తితో కర్మనొనరించు అతనికి ఆ దేవాదిదేవుడు తననుతాను సంపూర్ణముగా అర్పించుకొనును. కనుకనే దేహాత్మబుద్ధిచే ఎవ్వరును పెడత్రోవపట్టరాదు. భౌతిక ప్రకృతి నియమములకు లేక కర్మ ఫలములకు తాను అతీతుడనని స్వేచ్ఛగా వర్తింపవచ్చునని ఎవరును తప్పుగ భావింపరాదు. వాస్తవమునకు ప్రతియొక్కరు కఠినమైన ప్రకృతి నియమములకు లోబడియే యుందురు. కాని కృష్ణచైతన్యము నందు కర్మ నొనరించినంతనే మానవుడు ముక్తుడై భౌతిక క్లేశముల నుండి విడివడగలడు. కృష్ణచైతన్యము నందు వర్తించనివాడు జన్మమృత్యు సాగరమనెడి సుడిగుండమున తప్పక చిక్కుకొని నశించు చున్నట్లుగా ప్రతియొక్కరు గుర్తింపవలెను. బద్ధజీవులెవరును చేయదగినదేదో, చేయరానిదేదో వాస్తవముగా ఎరుగజాలరు. కృష్ణచైతన్యముతో వర్తించువాడు అంతరంగమున శ్రీకృష్ణునిచే ప్రేరేపింపబడి ఆధ్యాత్మికాచార్యునిచే సమర్థింపబడు చున్నందున స్వేచ్ఛగా పనిచేయగలుగును.

## 18.59

**యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥**

### అనువాదము

**ఒకవేళ నా నిర్దేశము ననుసరించి వర్తించక మిథ్యాహంకారముతో యుద్ధము చేయుటకు నిరాకరించినచో నీవు తప్పుమార్గమును పట్టిన వాడవగుదువు. నీ స్వభావము ననుసరించి నీవు యుద్ధమునందు నెలకొనవలసియే యున్నది.**

### భాష్యము

అర్జునుడు క్షత్రియ గుణస్వభావముతో జన్మించిన యుద్ధవీరుడు. కనుక యుద్ధము చేయుట అతని సహజధర్మము. కాని మిథ్యాహంకారముచే అతడు తన గురువు, పితామహుడు, ఇతర మిత్రులను చంపుటచే పాపఫలములను అనుభవింపవలసి వచ్చునని భయపడుచుండెను. వాస్తవమునకు అర్జునుడు తాను చేయు కర్మల యొక్క శుభాశుభ ఫలితములను తానే నిర్దేశించు చున్నట్లును, తన కర్మలన్నింటికిని తానే సర్వాధికారియైనట్లును భావించు చున్నాడు. తనను యుద్ధము చేయుమని బోధించుచు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు తన ఎదుట ప్రత్యక్షమ యుండెనని అతడు విస్మరించెను. బద్ధజీవుని మరుపు స్వభావమిదియే. ఏది మంచి మరియు ఏది చెడు అనునది దేవాదిదేవుడే నిర్దేశించు చుండును. జీవిత పరిపూర్ణత్వమును పొందుట కొరకై మానవుడు కేవలము కృష్ణచైతన్యమున అట్లు కర్మచేయవలెను. పరమపురుషుని వలె ఎవ్వరును తమ విధిని నిర్ధారించుకోలేరు. కనుక దేవాదిదేవుని ఆదేశములను గ్రహించి, వాటిననుసరించి కర్మచేయుటయే ఉత్తమమైన పద్ధతి. దేవాదిదేవుని ఆదేశమును కాని, అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని ఆదేశమును కాని ఎవ్వరును నిర్లక్ష్యపరచరాదు. కనుక ప్రతియొక్కరు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని ఆజ్ఞలను ఎట్టి సందేహములు లేకుండ అమలుపరచవలెను. అదియే మానవుని అన్ని పరిస్థితుల యందును సురక్షితముగా నుంచగలదు.

## 18.60

**స్వభావజేన కౌన్తేయ నిబద్ధ: స్వేన కర్మణా।
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశో పి తత్ ॥**

### అనువాదము

**ఓ కౌంతేయా! మోహము వలన నీ విప్పుడు నా నిర్దేశము ననుసరించి వర్తించుటకు అంగీకరింపకున్నావు. కాని నీ స్వభావము వలన పుట్టిన కర్మ ప్రభావముచే అవశుడవై నీవు దానిని తప్పక ఒనరింపగలవు.**

### భాష్యము

ఎవరైనను దేవాదిదేవుని నిర్దేశము ననుసరించి వర్తించుటకు నిరాకరించినచో వారు అవశులై తమ గుణముల ననుసరించి వర్తింపవలసి వచ్చును. ప్రతియొక్కరు ప్రకృతి త్రిగుణములలో ఏదియో ఒక గుణసమ్మేళన ప్రభావమునకు లోనై ఆ విధముగ వర్తించుచుందురు. కాని స్వచ్ఛందముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని దివ్యనిర్దేశముల ననుసరించి వర్తించు వారెవరైనను కీర్తిమంతులగుదురు.

### 18.61
**ఈశ్వర: సర్వభూతానాం హృద్దేశే ర్జున తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥**

## అనువాదము
**ఓ అర్జునా! పరమపురుషుడు ఎల్లరి హృదయములందు విరాజమానుడై యుండి, భౌతికశక్తి యంత్రముపై ఆసీనులైనట్లుగా నున్న సర్వజీవుల గతులను నిర్దేశించు చుండును.**

## బాష్యము
అర్జునుడు పరమజ్ఞాత కాడు. యుద్ధము చేయుట లేదా యుద్ధము చేయకుండుట యనెడి అతని నిర్ణయము కేవలము అతని పరిమిత జ్ఞానము పైననే ఆధారపడి యున్నది. జీవులు సర్వజ్ఞులు కారని శ్రీకృష్ణభగవానుడు బోధించి యున్నాడు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు తానే స్వయముగా సర్వాంతర్యామిగా జీవుల హృదయములందు నెలకొని వారిని నిర్దేశించుచుండును. శరీరమును మార్చిన పిమ్మట జీవుడు తన పూర్వకర్మలను విస్మరించును. కాని భూత, భవిష్యత్, వర్తమానములను ఎరుగు పరమాత్మ జీవుని కర్మము లన్నింటికిని సాక్షిగా నిలిచి యుండును. కనుకనే జీవుల కర్మములన్నియు ఆ పరమాత్ముని చేతనే నిర్దేశింప బడును. జీవుడు తనకు అర్హమైనవానిని పొంది పరమాత్మ నిర్దేశమున భౌతిక శక్తిచే సృజింపబడిన దేహమున కొనసాగుచుండును. ఆ విధముగా జీవుడు ప్రత్యేక విధమైన శరీరమున ప్రవేశపెట్టబడినంతనే ఆ దేహమునకు అనుగుణముగా వర్తింపవలసివచ్చును. అధిక వేగముతో ప్రయాణింపగల మోటారు వాహనములో కూర్చునిన వ్యక్తి అల్పవేగము గల వాహనములో కూర్చొనిన వ్యక్తికంటె అధిక వేగముతో ప్రయాణించును. ఆ రెండు వాహనముల యందలి చోదకులు (జీవులు) సమానులేయైనను వారి ప్రయాణ వేగములు వేరుగా నుండును. అట్లే పరమాత్ముని ఆజ్ఞననుసరించి జీవుడు తన పూర్వ ఇచ్చానుసారము వర్తించుటకు అనుగుణమైన ప్రత్యేక దేహమును భౌతిక ప్రకృతి ఏర్పాటు చేయుచుండును. జీవుడు స్వతంత్రుడు కాడు. కనుక ఏ జీవుడును తాను స్వతంత్రుడనని దేవాదిదేవునిపై ఆధారపడుట లేదని భావింపరాదు. జీవుడు సదా భగవానుని నియంత్రణకు లోబడియే యుండును. కనుకనే శరణాగతి యనునది మానవుని ధర్మము. అట్టి ఈ బోధన తదుపరి శ్లోకమునందు చేయబడినది.

### 18.62
**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।**
**తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥**

## అనువాదము
**ఓ భరతవంశీయుడా! అతనినే(భగవానుని) సంపూర్ణముగా శరణువేడుము. అతని కృపచే పరమశాంతిని, దివ్యము శాశ్వతమునైన స్థానమును నీవు పొందగలవు.**

## భాష్యము

ఈ శ్లోకము నందు తెలుపబడినట్లు జీవుడు ఎల్లరి హృదయము లందు నెలకొనియున్నట్టి దేవాదిదేవుని శరణుపొందవలసి యున్నది. అట్టి శరణాగతియే జీవిత స్థితియందలి సమస్త భౌతిక క్లేశముల నుండి అతనిని విముక్తుని చేయగలదు. అట్టి శరణాగతిచే అతడు ఈ జీవితమున సమస్త భౌతిక క్లేశముల నుండి విడివడుటయే కాకుండ చివరికి దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని సైతము చేరగలడు. దివ్యలోకము వైదిక గ్రంథము లందు : "తద్విష్ణో: పరమం పదమ్" అని వర్ణింపబడినది (ఋగ్వేదము 1.22.20). సృష్టియంతయు భగవద్రాజ్యమే కనుక భౌతికమైనదంతయు వాస్తవమునకు ఆధ్యాత్మికమే. కాని ఈ వేదమంత్రమందలి 'పరమం పదమ్' అనునది ప్రత్యేకముగా ఆధ్యాత్మికాకాశము లేక వైకుంఠముగా పిలువబడు సనాతన ధామమును సూచించుచున్నది.

భగవద్గీత యందలి పంచదశాధ్యాయమున : "సర్వస్య చాహం హృది సన్నివిష్ట:" – శ్రీకృష్ణభగవానుడు సర్వజీవుల హృదయము లందు నెలకొని యున్నాడని(15.15) చెప్పబడుచున్నది. కనుకనే హృదయమునందు నెలకొని యున్నట్టి పరమాత్మని ప్రతియొక్కరు శరణు పొందవలెననగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని శరణు పొందవలెననియే భావము. శ్రీకృష్ణుడే దేవాదిదేవునిగా అర్జునునిచే ఇదివరకే అంగీకరింప బడియుండెను. దేవాదిదేవుడు దశమాధ్యాయమున 'పరం బ్రహ్మ పరం ధామ' అని అంగీకరింపబడెను (10.12) అనగా అర్జునుడు శ్రీకృష్ణుని దేవాదిదేవునిగను, సర్వజీవులకు దివ్యధామముగను అంగీకరించి యుండెను. అర్జునుడు ఈ విషయమును తన స్వానుభవము పైననే కాకుండ పరమ ప్రామాణికులైన నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు వంటి పరమ ప్రామాణికుల ప్రమాణములపై ఆధారపడి ఆమోదించెను.

## 18.63

**ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥**

## అనువాదము

**ఈ విధముగ గుహ్యతరమైన జ్ఞానమును నేను నీకు ఉపదేశించితిని. దీనిని పూర్తిగా విమర్శన కావించి, పిదప నీ ఇచ్ఛానుసారము చేయుము.**

## భాష్యము

భగవానుడు ఇదివరకే అర్జునునకు 'బ్రహ్మభూత' జ్ఞానమును వివరించి యుండెను. 'బ్రహ్మభూత' (18.54) స్థితియందు నెలకొనినవాడు సదా ప్రసన్నుడై యుండును. అతడెప్పుడును శోకింపడు. దేనిని వాంఛింపడు. అట్టి దివ్యస్థితికి గుహ్యమైన 'బ్రహ్మభూత' జ్ఞానమే కారణము. శ్రీకృష్ణుడు 'బ్రహ్మభూత' జ్ఞానమునే కాకుండ పరమాత్మ జ్ఞానమును కూడ అర్జునునకు తెలిపియుండెను. అది కూడ బ్రహ్మజ్ఞానమే. కాని 'బ్రహ్మభూత' జ్ఞానము కంటెను పరమాత్మ జ్ఞానము అత్యున్నతమైనది.

ఇక్కడ "యథేచ్ఛసి తథా కురు" – "నీ ఇచ్ఛానుసారము చేయుము" అను పదములు భగవానుడు జీవునికి గల స్వల్ప స్వాతంత్ర్య విషయమున జోక్యము కలుగజేసుకొనడని సూచించుచున్నవి. మానవుడు ఎట్లు తన జీవన స్థితిని మెరుగు

పరుచుకొనగలడో శ్రీకృష్ణభగవానుడు అన్నికోణముల నుండి భగవద్గీత యందు వివరించియుండెను. హృదయము నందు నెలకొనిన పరమాత్మునకు శరణు పొందుమని చెప్పు ఉపదేశము అర్జునునకు చేసిన ఉపదేశము లన్నింటిలోకి ముఖ్యమైనది. దానినిబట్టి సరియైన విచక్షణతో మానవుడు పరమాత్మ ఆజ్ఞల ననుసరించి వర్తించుటకు అంగీకరింపవలెను. అట్టి అంగీకారము మానవునకు సదా మానవజీవితము నందలి అత్యున్నత పరిపూర్ణ స్థితియైన కృష్ణచైతన్యము నందు స్థిరముగా నెలకొనుటకు తోడ్పడును. యుద్ధము చేయుమని అర్జునుని దేవాదిదేవుడు ప్రత్యక్షముగా ఆదేశించుచున్నాడు. దేవాదిదేవుని శరణువేడుట జీవులకు పరమ హితకరము కాగలదు. అది దేవాదిదేవుని హితము కొరకు కాదు. కాని శరణాగతికి ముందు మానవుడు తమ బుద్ధిననుసరించి ఆ విషయమును గూర్చి విమర్శన చేసుకొనుటకు ప్రతియొక్కరూ స్వాతంత్ర్యమును కలిగియున్నారు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ఉపదేశమును అంగీకరించుటకు అత్యుత్తమ మార్గము. శ్రీకృష్ణుని ప్రామాణిక ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నుండి కూడ అట్టి ఉపదేశమే లభింపగలదు.

## 18.64

**సర్వగుహ్యతమం భూయ: శ్రుణు మే పరమం వచ: ।**
**ఇష్టో సి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥**

## అనువాదము

**నీవు నాకు ప్రియ మిత్రుడవైనందున జ్ఞానములలో కెల్ల గుహ్యతమమైనట్టి నా దివ్యోపదేశమును నీకు ఒసగుచున్నాను. ఇది నీ హితము కొరకై యున్నందున దీనిని ఆలకింపుము.**

## భాష్యము

భగవానుడు అర్జునునకు తొలుత గుహ్యమైన జ్ఞానమును (బ్రహ్మజ్ఞానమును) పిదప గుహ్యతర జ్ఞానమును అనగా సమస్త హృదయములలో నెలకొనినట్టి పరమాత్మకు సంబంధించిన జ్ఞానమును అందించు చున్నాడు. ఇప్పుడు అతడు మిక్కిలి గుహ్యతమమైన జ్ఞానవిషయములను అనగా దేవాదిదేవుడగు శ్రీకృష్ణునకు శరణుపొందుము అను దానిని తెలుపుచున్నాడు. నవమాధ్యాయపు చివరన అతడు : “మన్మనా:” – “ఎల్లప్పుడు నన్ను గూర్చియే చింతించుము” అని చెప్పియుండెను (9.34). భగవద్గీతోపదేశ సారమును నొక్కిచెప్పుటకే ఆ ఉపదేశము తిరిగి ఇక్కడ చెప్పబడుచున్నది. భగవద్గీత యొక్క ఈ సారాంశమును శ్రీకృష్ణునకు ప్రియమైన శుద్ధభక్తుడే తప్ప సామాన్య మానవుడు అవగతము చేసికొనజాలడు. శ్రీకృష్ణభగవానుడు చేయుచున్న ఈ ఉపదేశము వేదోపదేశము లలోకి అత్యంత ప్రధానమైనది. ఈ సందర్భమున శ్రీకృష్ణుడు పలుకుచున్నదంతయు జ్ఞానము నందు అత్యంత ముఖ్యమైన భాగమైనందున అర్జునుడే కాకుండ సర్వజీవులు దీనిని అనుసరింపవలెను.

## 18.65

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియో సి మే ॥**

## అనువాదము

**సర్వదా నన్ను గూర్చియే చింతింపుము. నా భక్తుడవు కమ్ము. నన్ను అర్చింపుము మరియు నాకు నమస్కరింపుము. ఈ విధముగా చేసినచో నీవు తప్పక నన్ను చేరుదువు. నీవు నాకు మిక్కిలి ప్రియమిత్రుడవగుటచే నీకిది నేను వాగ్దానము చేయుచున్నాను.**

## భాష్యము

మానవుడు శ్రీకృష్ణభగవానునికి శుద్ధభక్తుడై ఎల్లప్పుడు అతనిని గూర్చియే చింతించుచు అతని కొరకే కర్మనొనరించుట జ్ఞానము నందలి మిక్కిలి రహస్యమైన (గుహ్యతమ) భాగమై యున్నది. ఎవ్వరును కృత్రిమముగా ధ్యానప్రదర్శన చేయరాదు. శ్రీకృష్ణుని గూర్చి నిరంతరము చింతింపగలిగే అవకాశము కలుగునట్లుగ జీవితమును మలచుకొని, తమ దైనందిన కార్యము లన్నియును శ్రీకృష్ణునితో సంబంధము కలిగియుండునట్లుగా ప్రతియొక్కరు చూచుకొనవలెను. ఇరువది నాలుగుగంటలు శ్రీకృష్ణుని గూర్చి చింతించుటయే తప్ప మరేమి చేయకుండునట్లు అతడు జీవితమును మలచుకోవలెను. అట్టి శుద్ధమైన కృష్ణచైతన్యము నందు నెలకొనినవాడు నిశ్చయముగా తన ధామమును చేరగలదని శ్రీకృష్ణభగవానుడు వాగ్దానము చేయుచున్నాడు. అతడు అక్కడ శ్రీకృష్ణుని యొక్క సన్నిహిత సాంగత్యమున ప్రత్యక్షముగ నెలకొనగలడు. అర్జునుడు శ్రీకృష్ణభగవానునికి ప్రియ మిత్రుడగుటచే అతనికి ఈ మిక్కిలి రహస్యమైన (గుహ్యతమ) జ్ఞానము బోధింపబడినది. అర్జునుని మార్గము ననుసరించు ప్రతివ్యక్తియు శ్రీకృష్ణునకు ప్రియమిత్రుడై అర్జునుని వలె పరిపూర్ణత్వమును పొందవచ్చును.

ద్విభుజములు కలిగి వేణువును ధరించి, సుందరమైన వదనమును కలిగి, కేశములందు నెమలి పింఛమును దాల్చిన నీలమేఘ శరీరుడైన కృష్ణరూపము నందే మానవుడు మనస్సును కేంద్రీకరింపవలెనని ఈ శ్లోకము నొక్కిచెప్పుచున్నది. శ్రీకృష్ణభగవానుని గూర్చిన వర్ణనలు 'బ్రహ్మ సంహిత' మరియు ఇతర శాస్త్రము లందు గోచరించుచున్నది. శ్రీకృష్ణభగవానుని అట్టి ఆదిరూపము నందే మానవుడు మనస్సును లగ్నము చేయవలెను. అతడు భగవానుని ఇతర రూపముల వైపునకు కూడ తన శ్రద్ధను మరల్చరాదు. శ్రీకృష్ణభగవానునకు విష్ణువు, నారాయణుడు, శ్రీరాముడు, వరాహాది వంటి అనేక రూపములు గలవు. కాని భక్తుడు మాత్రము ఏ ఇతర రూపములందును ఆసక్తుడు కాకుండ అర్జునుని ఎదుట ప్రత్యక్షమై యున్నట్టి దివ్యరూపము పైననే తన మనస్సును కేంద్రీకరింపవలెను. ఆ విధముగా శ్రీకృష్ణుని సచ్చిదానంద రూపముపై మనస్సును కేంద్రీకరించుటయే పరమ గుహ్యజ్ఞానము. అర్జునుడు శ్రీకృష్ణునికి ప్రియమిత్రుడగుటచే అతనికి ఈ గుహ్యజ్ఞానము వెల్లడింపబడినది.

## 18.66

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ: ॥**

### అనువాదము

**సర్వ విధములైన ధర్మములను త్యజించి కేవలము నన్నే శరణు పొందుము. సర్వ పాపఫలముల నుండి నేను నిన్ను ముక్తిని గావింతును. భయము నొందకుము.**

### భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పరబ్రహ్మ జ్ఞానము, పరమాత్మ జ్ఞానము, సాంఘీక జీవితము నందలి వివిధ వర్ణాశ్రమములకు సంబందించిన ధర్మజ్ఞానము, సన్న్యాసాశ్రమ జ్ఞానము, అనాసక్తి జ్ఞానము, ఇంద్రియ మనోనిగ్రహము వంటి వాటికి సంబందించిన వివిధములైన జ్ఞానములను, ధర్మవిధానములను వివరించి యుండెను. ధర్మవిధానములు వివిధరకాలుగా వర్ణింపబడియుండెను. ఇక ఇప్పుడు శ్రీకృష్ణుడు భగవద్గీత జ్ఞానమును సంగ్రహ పరచుచు తానింతవరకు భోధించిన సమస్త ధర్మవిధానములను విడిచి, కేవలము తనను మాత్రమే శరణుపొందుమని అర్జునునితో చెప్పుచున్నాడు. తానే స్వయముగా రక్షించెదనని భగవానుడు వాగ్దానము చేయుచున్నాడు. కనుక అట్టి శరణాగతియే అర్జునుని తప్పక అన్నిరకములైన పాపఫలముల నుండి రక్షించును.

పాపఫలముల నుండి పూర్తిగా విముక్తుడైనవాడే శ్రీకృష్ణభగవానుని ఆరాధింపగలడని సప్తమాధ్యాయమున చెప్పబడినది(7.28). ఈ విధముగా తాను సర్వపాపఫలముల నుండి విముక్తి పొందనిదే శరణాగతి విధానమును అంగీకరింపజాలరని ఎవరైనను భావింపవచ్చును. అట్టి సందేహముల నివృత్తి కొరకే మానవుడు పాపఫలముల నుండి ముక్తి పొందినప్పటికిని శ్రీకృష్ణభగవానునికి శరణు పొందుట ద్వారా అప్రయత్నముగనే ముక్తిని పొందగలడని ఇక్కడ తెలుప బడినది. సర్వపాపఫలముల నుండి విముక్తుడగుటకు మానవుడు విడిగా ఇతర తీవ్ర ప్రయత్నములేవి చేయనవసరము లేదు. ప్రతియొక్కరు నిస్సందేహముగా శ్రీకృష్ణభగవానుడే సమస్త జీవులకు పరమ రక్షకుడని అంగీకరింపవలెను. కనుకనే ప్రతియొక్కరు ప్రేమ మరియు విశ్వాసములతో దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు శరణుపొందవలెను.

శ్రీకృష్ణభగవానునికి శరణుపొందు విధానము 'హరిభక్తి విలాసము' (11.676) నందు ఈ క్రింది విధముగా వర్ణింపబడినది:

ఆనుకూల్యస్య సంకల్ప: ప్రాతికూల్యస్య వర్జనమ్
రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వే వరణం తథా
ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతి:

"భక్తియోగ విధానము ననుసరించి అంత్యమున శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవకు గొనుపోవునట్టి ధర్మనియమములను మాత్రమే మానవుడు అంగీకరింపవలెను. మానవుడు తానున్న సంఘ వ్యవస్థ స్థితి ననుసరించి ప్రత్యేకమైన వృత్తి ధర్మమును నిర్వహింపవచ్చును. కాని అట్లు తన ధర్మమును నిర్వహించినను దాని ద్వారా అతడు

కృష్ణచైతన్యస్థితికి రాలేకపోయినచో అతని కర్మలన్నియును వ్యర్థములగును. కనుక పరిపూర్ణ కృష్ణచైతన్య స్థితికి తోడ్పడని ఏ కర్మనైనను మానవుడు త్యజింపవలెను. ఎట్టి సందర్భముల లోనైనను శ్రీకృష్ణుడు తనను అన్నిరకములైన కష్టముల నుండి రక్షించుననెడి విశ్వాసమును అతడు పూర్తిగా కలిగియుండవలెను. వాస్తవమునకు దేహమునెట్లు పోషించు కొనవలెననెడి చింత మానవునికి అవసరము లేదు. ఆ బాధ్యతను శ్రీకృష్ణుడే స్వీకరించును. మానవుడు తాను నిస్సహాయుడననియు మరియు జీవనపురోగతికి శ్రీకృష్ణుడొక్కడే మూలాధారమనియు తప్పక భావింపవలెను." ఈ విధముగా మానవుడు సంపూర్ణ కృష్ణచైతన్యముతో భగవానుని భక్తియుక్త సేవయందు అత్యంత శ్రద్ధతో నెలకొని నంతటనే భౌతికప్రకృతి యొక్క గుణసంపర్కము నుండి విముక్తుడగును. జ్ఞాన సముపార్జనము, యోగవిధానము ననుసరించి ధ్యానము చేయుట వంటి వానిపై ఆధారపడిన వివిధ మతవిధానములు, పవిత్రీకరణ విధానములు గలవు. కాని శ్రీకృష్ణునికి శరణు పొందువాడు అట్టి అనేక విధానములను అనుసరింప నవసరము లేదు. సులభమైనట్టి కృష్ణశరణాగతి మాత్రమే అతనిని కాలమును వృథా చేయకుండ కాపాడును. ఆ విధముగా మానవుడు వెంటనే పురోభివృద్ధిని సాధించి సర్వ విధములైన పాపఫలముల నుండి విముక్తుడగును.

మానవుడు శ్రీకృష్ణభగవానుని సుందరరూప సందర్శనముచే ఆకర్షింప బడవలెను. సర్వాకర్షకుడగుట చేతనే అతనికి శ్రీకృష్ణుడనెడి నామము కలిగినది. అత్యంత సుందరము మరియు సర్వశక్తివంతమునైన శ్రీకృష్ణభగవానుని సర్వశక్తి మంతమైన రూపమునకు ఆకర్షితుడైనవాడు గొప్ప అదృష్టవంతుడు. అనేక విధములైన యోగులలో కొందరు నిరాకారబ్రహ్మభావన యందు ఆసక్తులై యుందురు. మరికొందరు పరమాత్మ అంశముచే ఆకర్షింపబడుదురు. కాని దేవాదిదేవుని స్వరూప లక్షణముచే ఆకర్షితుడైనవాడు, అన్నింటికిని మించి శ్రీకృష్ణుడే దేవాదిదేవుడను భావము పట్ల ఆకర్షితుడైనవాడు సర్వోన్నత యోగిసంపన్నుడు. మరోమాటలో, సంపూర్ణ కృష్ణచైతన్యమున శ్రీకృష్ణభగవానునకు చేయబడు భక్తియుక్త సేవయే రహస్యములలోకెల్ల రహస్యమైన జ్ఞానభాగము. ఇదియే భగవద్గీత యొక్క సంపూర్ణ సారాంశము. కర్మయోగులు, జ్ఞానయోగులు, ధ్యానయోగులు, భక్తులనెడి వారందరును యోగులు అని పిలువబడుదురు. కాని యోగులందరిలోకి శుద్ధభక్తుడే శ్రేష్ఠమైనవాడు. 'మా శుచ:'- భయపడకుము (భయము నొందకుము, సంశయింపకుము, చింతింపకుము) అను పదము మిక్కిలి ప్రధానమైనది. సర్వ ధర్మములను విడిచి కేవలము శ్రీకృష్ణునకే శరణుపొందుట మానవునకు ఎట్లు సాధ్యమగునని ఎవరైనను కలత నొందు అవకాశము కలదు. కాని అట్లు కలత నొందనవసరము లేదు.

## 18.67

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యో భ్యసూయతి ॥**

**<u>అనువాదము</u>**

**ఇట్టి గుహ్యతమ జ్ఞానమును తపస్సంపన్నులు కానివారికి గాని, భక్తులు కానివారికి గాని, భక్తియుక్త సేవలో నెలకొనినవారికి గాని, నా యెడ అసూయ కలిగినవారికి గాని ఎన్నడును వివరింపరాదు.**

## భాష్యము

ధర్మవిధానమునకు చెందిన తపస్సులను ఆచరింపనివారికి, కృష్ణచైతన్యమున భక్తియుక్త సేవ కొరకై ప్రయత్నింపని వారికిని, శుద్ధభక్తుని సేవింపని వారికిని, ముఖ్యముగా శ్రీకృష్ణుని చారిత్రాత్మక వ్యక్తిగా మాత్రమే భావించు వారికిని, శ్రీకృష్ణుని మహాత్మ్యము పట్ల అసూయ కలిగియుండు వారికిని ఈ గుహ్యతమ జ్ఞానభాగమును వివరింపరాదు. కొన్నిమార్లు శ్రీకృష్ణుని పట్ల అసూయకలిగి అసుర తత్త్వముతో కూడిన వ్యక్తులు కూడ శ్రీకృష్ణుని మరోవిధముగా పూజించుచు, వ్యాపారార్థమై భగవద్గీతను భిన్న విధములుగ వివరించుటయే వృత్తిగా చేపట్టువారిని మనము చూచుచుందుము. కాని శ్రీకృష్ణుని యథార్థముగా అవగాహన చేసికొన గోరువారు మాత్రము అట్టి భగవద్గీత వ్యాఖ్యానములకు దూరముగా నుండవలెను. యథార్థమునకు ఇంద్రియలోలురైన వారికి భగవద్గీత ప్రయోజనము అవగతము కాదు. ఇంద్రియలోలుడు కాకుండ, వైదిక గ్రంథములందు చెప్పబడిన నియమములను ఖచ్చితముగా పాటించు చున్నప్పటికిని భక్తుడు కానిచో అట్టివాడు కూడ శ్రీకృష్ణుని అవగతము చేసికొనజాలడు. అట్లే కృష్ణభక్తులుగా నటించుచు కృష్ణచైతన్య కార్యకలాపములందు నెలకొనియుండని వారు కూడ శ్రీకృష్ణుని అవగాహన చేసికొనజాలరు. శ్రీకృష్ణుడు భగవద్గీత(7.7) నందు తానే దేవాదిదేవుడ ననియు మరియు తనకు సమానమైనది మరియు తనకంటే అధికమైనది మరొక్కటి లేదని వివరించుటచే అతనిపట్ల అసూయను కలిగినవారు అనేకమంది గలరు. అట్టివారు భగవద్గీతను అవగాహన చేసుకొనజాలరు. కనుక వారికి గీతను వివరింపరాదు. విశ్వాసములేని వ్యక్తులు శ్రీకృష్ణుని మరియు భగవద్గీతను అవగతము చేసుకొనుటకు అవకాశమే లేదు. కనుక ప్రామాణికుడైన శుద్ధభక్తుని నుండి శ్రీకృష్ణుని అవగతము చేసికొనకుండ ఎవ్వరును భగవద్గీత పై వ్యాఖ్యానించుటకు యత్నింపరాదు.

## 18.68

**య ఇదం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥**

## అనువాదము

**ఈ పరమ రహస్యమును భక్తులకు వివరించువానికి శుద్ధభక్తియుక్త సేవ నిశ్చయముగా లభించును. అంత్యమున అతడు తిరిగి నన్ను చేరగలడు.**

## భాష్యము

అభక్తులు శ్రీకృష్ణుని గాని భగవద్గీతను గాని అవగతము చేసికొన జాలరు. కనుక సాధారణముగా భక్తుల సమక్షముననే భగవద్గీతను చర్చింపవలెనని ఉపదేశింపబడినది. శ్రీకృష్ణభగవానుని మరియు భగవద్గీతను యథాతథముగా అంగీకరింపలేనివారు తమ ఇచ్చానుసారము భగవద్గీతను వ్యాఖ్యానించుటకు యత్నించి అపరాధులు కారాదు. శ్రీకృష్ణుని దేవాదిదేవునిగా అంగీకరించుటకు సిద్ధపడిన వారికే భగవద్గీతను వివరింపవలెను. ఈ చర్చనీయ విషయము తాత్త్విక భావకల్పనాపరులకు కాకుండ కేవలము భక్తులకు మాత్రమే సంబంధించినది. భగవద్గీతను యథాతథముగా హృదయపూర్వకముగా శ్రద్ధతో వివరించువాడు, భాక్తియోగమున పురోగమించి శుద్ధమైన భక్తిమయమైన జీవన స్థితిని పొందగలరు. అట్టి శుద్ధభక్తికి ఫలితముగా మానవుడు భగవద్ధామమును తిరిగి తప్పక చేరగలడు.

**18.69**
**న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమ: ।**
**భవితా న చ మే తస్మాదన్య: ప్రియతరో భువి ॥**

**అనువాదము**
**నాకు అతని కంటెను ప్రియమైన సేవకుడు మరొక్కడు ఈ ప్రపంచమున లేడు. అతనికి మించిన ప్రియుడైనవాడు వేరొక్కడు ఉండబోడు.**

**18.70**
**అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయో: ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహమిష్ట: స్యామితి మే మతి: ॥**

**అనువాదము**
**మన ఈ పవిత్రమైన సంవాదమును శ్రద్ధతో అధ్యయనము చేయువాడు జ్ఞానయజ్ఞముచే నన్ను పూజించిన వాడగునని నేను ప్రకటించుచున్నాను.**

**18.71**
**శ్రద్ధావాననసూయశ్చ శ్రుణుయాదపి యో నర: ।**
**సో ౾పి ముక్త: శుభాళ్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ ॥**

**అనువాదము**
**శ్రద్ధను, అసూయారాహిత్యమును గూడి శ్రవణము చేయువాడు కూడ సర్వ పాపఫలముల నుండి విముక్తుడై పుణ్యాత్ములు నివసించు పుణ్యలోకములను పొందగలడు.**

**భాష్యము**
ఈ అధ్యాయము నందలి అరువది ఎడవ శ్లోకమున భగవానుడు తనపట్ల అసూయ గలవారికి గీతాజ్ఞానమును బోధింపరాదని స్పష్టముగా పలికి యున్నాడు. భగవద్గీత భక్తుల కొరకే ఉద్దేశింపబడియున్నది. కాని కొన్నిమార్లు భక్తులు బహిరంగముగా గీతోపన్యాసములను చేయుచుందురు. కాని అట్టి సభలోని శ్రోతలందరూ భక్తులు కాకపోవచ్చును. అయినను అట్టివ్యక్తులు బహిరంగ సభలను ఎందుకు ఏర్పాటు చేయుదురనే ప్రశ్న ఉదయింపవచ్చును. ఉపన్యాసమునకు వచ్చిన ప్రతియొక్కరు భక్తులు కాకపోయినను, వారిలో శ్రీకృష్ణుని పట్ల అసూయ లేనివారు అనేకులు ఉండవచ్చునని ఇక్కడ వివరింపబడినది. అట్టివ్యక్తులు శ్రీకృష్ణుడు దేవాదిదేవుడనెడి విశ్వాసమును కలిగియుందురు. వారు ప్రామాణికుడైన భక్తుని నుండి భగవానుని గూర్చి శ్రవణము చేసినచో వెంటనే సర్వపాపఫలముల నుండి విముక్తులై, పుణ్యాత్ములు నివసించు పవిత్ర లోకములను పొందగలుగుదురు. కనుకనే శుద్ధభక్తుడగుటకు యత్నింపనివాడు కూడ శ్రద్ధతో భగవద్గీతను శ్రవణము చేయుట ద్వారా సమస్త పుణ్యకర్మల ఫలితములను పొందగలడు. భగవద్భక్తుడు ఈ విధముగా అందరికిని

వారివారి సర్వపాపఫలముల నుండి విముక్తులై భగవద్భక్తులగుటకు అవకాశము నొసగుచుండును.

సాధారణముగా పాపకర్మల ఫలముల నుండి విముక్తులైనవారు మరియు ధర్మాత్ములైనవారు కృష్ణచైతన్యమును సులభముగా అంగీకరింతురు. ఇక్కడ 'పుణ్యకర్మణామ్' అను పదము మిక్కిలి ప్రధానమైనది. ఇది వైదిక గ్రంథము లందు పేర్కొనబడిన 'అశ్వమేధ యజ్ఞము' వంటి గొప్పయజ్ఞముల ఆచరణను ఈ పదము సూచించుచున్నది. భక్తియుక్త సేవనొనర్చుట యందు ఆసక్తులైనప్పటికిని పవిత్రులు కానివారు ధ్రువమహారాజు నివసించు ధ్రువలోకమును చేరగలరు. ధ్రువుడు భగవానుని పరమభక్తుడు. అతనికి ధ్రువనక్షత్ర మనబడు ప్రత్యేక లోకము గలదు.

## 18.72

**కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।**
**కచ్చిదజ్ఞానసమ్మోహ: ప్రనష్టస్తే ధనంజయ ॥**

### అనువాదము

**ఓ పార్థా! ధనంజయా! ఏకాగ్రతతో కూడిన మనస్సుతో దీనినంతటిని నీవు శ్రవణము చేసితివా? నీ అజ్ఞానము మరియు మోహము ఇప్పుడు నశించినవా?**

### భాష్యము

శ్రీకృష్ణభగవానుడు ఇక్కడ అర్జునునికి ఆధ్యాత్మికాచార్యునిగా వర్తించు చున్నాడు. కనుకనే అర్జునుడు భగవద్గీతను సరియైన విధముగా అవగతము చేసికొనెనో లేదో యని ప్రశ్నించుట అతని ధర్మమైనది. లేనిచో, అవసరమైనచో భగవద్గీత నంతటిని తిరిగి వివరించుటకు శ్రీకృష్ణుడు సిద్ధముగా నున్నాడు. వాస్తవమునకు, శ్రీకృష్ణుని వంటి గురువు నుండి లేక అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుని నుండి గాని భగవద్గీతను శ్రవణము చేసిననాడు తన అజ్ఞానమంతయు నశించినదని గుర్తించును. భగవద్గీత ఏదియో ఒక కవి లేక నవలారచయితచే రచింపబడిన సామాన్య గ్రంథము కాదు. అది స్వయముగా దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానునిచే చెప్పబడినది. కనుక ఈ బోధనలను శ్రీకృష్ణుని నుండి గాని, అతని ప్రామాణికుడైన ఆధ్యాత్మిక ప్రతినిధి నుండి గాని శ్రవణము చేయగలిగిన అదృష్టవంతుడు తప్పక అజ్ఞానాంధకారము నుండి బయటపడగలడు.

## 18.73

**అర్జున ఉవాచ**

**నష్టో మోహ: స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితో స్మి గతసన్దేహ: కరిష్యే వచనం తవ ॥**

### అనువాదము

**అర్జునుడు పలికెను : ఓ అచ్యుతా! నా మోహము ఇప్పుడు నశించినది. నీ కృపచే నా స్మృతిని తిరిగి పొందితిని. ఇప్పుడు నేను స్థిరుడను, సందేహ రహితుడను అయి నీ ఆజ్ఞానుసారము వర్తించుటకు సిద్ధముగా నున్నాను.**

## భాష్యము

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము వర్తించుటయే జీవుని వాస్తవస్వరూప స్థితియై యున్నది. అతడట్లు నియమబద్ధముగా వర్తించుటకే నిర్దేశింపబడెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణునికి నిత్యదాసునిగా నుండుటయే జీవుని నిజస్వరూప స్థితి (జీవస్వరూపము) అని శ్రీచైతన్య మహాప్రభువు తెలుపుచున్నారు. ఈ సిద్ధాంతమును విస్మరించి జీవుడు భౌతిక ప్రకృతిచే బద్ధుడగుచున్నాడు. కాని అతడు దేవాదిదేవుని సేవించుట ద్వారానే విముక్తుడు కాగలడు. జీవుని వాస్తవ స్వరూప స్థితి ఎల్లప్పుడు దాసునిగా ఉండుటయే. అతడు ఎల్లప్పుడు మాయనో లేక దేవాదిదేవుడైన శ్రీకృష్ణునో సేవింపవలెను. అతడు దేవాదిదేవుని సేవించినచో తన నిజస్థితి యందు నెలకొనగలడు. కాని భౌతికశక్తియైన మాయను సేవింపదలచినో అతడు తప్పక బద్ధుడగును. భ్రాంతి యందు భౌతిక జగత్తున జీవుడు సేవను గూర్చును. అంతేకాకుండ అతడు మోహవాంఛలచే బద్ధుడైనను తననుతాను జగత్తునకు ప్రభువునని భావించును. ఇదే మాయ అనబడును. కాని మానవుడు విముక్తుడైనపుడు అట్టి భ్రాంతి నశించుటచే, అతడు భగవానుని నిర్దేశముల ననుసరించి వర్తించుటకై స్వచ్ఛందముగా శరణాగతుడగును. తాను భగవానుడనని భావించుటయే మాయ చివరి ఉచ్చు. అట్టి భావన జీవుని బంధించుటకు మాయ చివరి జాలమై యున్నది. అట్టి భావన యందు జీవుడు తాను బద్ధుడను కానని కేవలము భగవానుడనని భావించును. కాని అట్టిజీవుడు మూర్ఖముగా తానే భగవానుడనని భావించినచో సందేహమెట్లు కలుగుచున్నదనెడి విషయమును మాత్రము గుర్తింపజాలడు. ఆ విషయమును అతడు పట్టించుకొనడు. కనుకనే ఈ భావనయే మాయ చివరి జాలము. వాస్తవమునకు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అవగాహనము చేసికొని, అతని ఆజ్ఞానుసారము వర్తించుటయే మాయాశక్తి నుండి విముక్తిని పొందుట కాగలదు.

ఈ శ్లోకమున 'మోహ:' అను పదము మిక్కిలి ప్రధానమైనది. జ్ఞానమునకు వ్యతిరేక పదము మోహము. వాస్తవమునకు, ప్రతిజీవియు శ్రీకృష్ణభగవానునకు నిత్యదాసుడనని తెలిసికొనుటయే యథార్థజ్ఞానము. కాని అట్టి భౌతికప్రకృతిపై అధికారము చెలాయింప దలచుటచే జీవుడు భౌతిక జగత్తునకు తానే ప్రభువుననియు భావించును. అదియే అతని మోహము. ఇట్టి మోహము భగవానుని కృపచే లేక శుద్ధభక్తుని కృపచే నశింపగలదు. అట్టి మోహము తొలిగినప్పుడే మానవుడు కృష్ణచైతన్యముతో వర్తించుటకు అంగీకరించును.

శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము వర్తించుటయే కృష్ణచైతన్యము. బద్ధజీవుడు బాహ్యమైన భౌతికశక్తిచే మోహితుడై, శ్రీకృష్ణభగవానుడే సర్వజ్ఞాన సంపూర్ణుడైన ప్రభువనియు, సర్వమునకు అధిపతియనియు ఎరుగజాలడు. భక్తులు కోరినదానిని భగవానుడు ప్రసాదించును. సర్వులకు అతడు మిత్రుడు. అయినను భక్తుని పట్ల ప్రత్యేక ప్రీతిని కలిగియుండును. అతడు ఈ భౌతిక ప్రకృతికిని, సర్వజీవులకును ఈశ్వరుడు. అనంతమైన కాలమును నియంత్రించువాడు అతడే. దేవాదిదేవుడు సర్వ వైభవములతోను, సర్వశక్తులతోను సంపూర్ణుడై యుండును. దేవాదిదేవుడు తననుతాను కూడ భక్తులకు సమర్పించు కొనగలడు. అట్టి శ్రీకృష్ణభగవానుని తెలియనివాడే మాయకు లోబడి భక్తుడు కాజాలక మాయకు దాసుడగును. దేవాదిదేవుని నుండి భగవద్గీతను వినిన పిమ్మట అర్జునుడు సర్వ మోహవిముక్తుడయ్యెను. శ్రీకృష్ణుడు కేవలము తనకు మిత్రుడే కాకుండ దేవాదిదేవుడని కూడ అతడు ఎరుగగలిగెను. అనగా అతడు శ్రీకృష్ణుని యథార్థ స్వరూపమును అవగతము చేసుకొనగలిగెను. కనుకనే భగవద్గీతను అధ్యయనము

చేయుట అనగా శ్రీకృష్ణభగవానుని యథార్థ స్వరూపమును అవగతము చేసికొనుటయేనని తెలియుచున్నది. మానవుడు జ్ఞానపరిపూర్ణుడైనప్పుడు సహజముగా శ్రీకృష్ణుని శరణుపొందును. అనవసరమైన జనబాహుళ్యమును తగ్గించుటయే శ్రీకృష్ణుని పథకమని గుర్తించినంతనే అర్జునుడు దేవాదిదేవుని ఇచ్చానుసారము యుద్ధము చేయుటకు అంగీకరించెను. దేవాదిదేవుని ఆజ్ఞననుసరించి యుద్ధమాచరించుటకు అతడు తిరిగి తన ధనుర్బాణములను చేపట్టెను.

## 18.74

**సంజయ ఉవాచ**

**ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।**
**సంవాదమిమమశ్రౌషమద్భుతం రోమహర్షణమ్ ॥**

### అనువాదము

**సంజయుడు పలికెను : ఈ విధముగా మహాత్ములైన శ్రీకృష్ణుడు మరియు అర్జునుని నడుమ జరిగిన సంవాదమును నేను శ్రవణము చేసితిని. ఆ సంవాదము అద్భుతమైన దగుటచే నా శరీరము రోమాంచమగుచున్నది.**

### భాష్యము

భగవద్గీత ఆరంభమున ధృతరాష్ట్రుడు తన కార్యదర్శియైన సంజయుని కురుక్షేత్ర రణరంగమున ఏమి జరిగెనని ప్రశ్నించెను. సంజయుని హృదయమున అతని ఆధ్యాత్మికాచార్యుడైన వ్యాసుని కృపచే సమస్త విషయములు అవగత మయ్యెను. ఆ విధముగా అతడు యుద్ధరంగ విషయములను విశదీకరించెను. ఇరువురి మహాత్ముల నడుమ భగవద్గీత వంటి అత్యంత ముఖ్యమైన సంవాదము అంతకు ముందెన్నడును జరిగి యుండకపోవుట చేతను మరియు మున్ముందు భవిష్యత్తులో తిరిగి జరుగు అవకాశము లేనందున ఆ సంవాదము అత్యంత అద్భుతముగ నుండెను. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుడు స్వయముగా తనను గూర్చి తన శక్తులను గూర్చి జీవునకు, భగవానుని పరమభక్తుడైన అర్జునునకు వివరించి యుండుట చేత కూడ అది అత్యంత అద్భుతముగ నుండెను. మనము శ్రీకృష్ణభగవానుని అవగతము చేసికొనుటకు అర్జునుని అడుగుజాడల ననుసరించినచో తప్పక మన జీవితములు సౌఖ్యవంతములు మరియు విజయ వంతములు కాగలవు. సంజయుడు దీనినంతటిని అనుభూతి చెంది దానిని అవగాహనము చేసికొనుటకు యత్నించుచు, ధృతరాష్ట్రునకు ఆ సంవాదము నంతటిని వినిపించెను. శ్రీకృష్ణార్జును లెచ్చట నుందురో అచ్చట విజయము తథ్యమని నిర్ధారింపబడినది.

**18.75**
**వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానేతద్ గుహ్యమాహం పరమ్ ।**
**యోగం యోగేశ్వరాత్కృష్ణాత్సాక్షాత్కథయత: స్వయమ్ ॥**

## అనువాదము

**అర్జునునితో స్వయముగా సంభాషించుచున్న యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని నుండి ఈ పరమగుహ్య వచనములను వ్యాసుని అనుగ్రహముచే నేను ప్రత్యక్షముగా వినగలిగితిని.**

## భాష్యము

వ్యాసుడు సంజయునికి ఆధ్యాత్మికాచార్యుడు. తన గురువైన వ్యాసుని కృపచేతనే తాను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగతము చేసికొనగలిగితినని సంజయుడు అంగీకరించుచున్నాడు. దీనినిబట్టి మానవుడు శ్రీకృష్ణుని ప్రత్యక్షముగా కాకుండ ఆధ్యాత్మికాచార్యుని మాధ్యమముగా అవగతము చేసుకొనవలెనని తెలియుచున్నది. భగవదనుభూతి ప్రత్యక్షముగా అనుభవింప వలసినదే అయినను ఆధ్యాత్మికాచార్యుడు మాత్రము దానికి మాధ్యమముగా నుండును. ఇదియే గురుశిష్య పరంపరలోని రహస్యము. ఆధ్యాత్మికాచార్యుడు ప్రామాణికుడైనప్పుడు, మానవుడు అర్జునుడు వినినట్లుగా ఆయన నుండి భగవద్గీతను ప్రత్యక్షముగా శ్రవణము చేయవచ్చును. ప్రపంచము నందంతటను జ్ఞానయోగులు, ధ్యానయోగులు మరియు సిద్ధపురుషులని ఎందరో ఉన్నప్పటికిని శ్రీకృష్ణుడు సమస్త యోగవిధానములకు యోగేశ్వరుడు. అట్టి శ్రీకృష్ణుడు ప్రత్యేకముగా తనకే శరణు పొందుమని భగవద్గీత యందు వివరముగా ఆదేశించెను. అట్లు చేయువాడు యోగు లందరిలోకి అత్యుత్తమ యోగి కాగలడు. ఈ విషయము షష్ఠాధ్యాయపు చివరి శ్లోకమున, "యోగినామపి సర్వేషాం" అని నిర్ధారింపబడినది.

నారదముని శ్రీకృష్ణభగవానునికి ప్రత్యక్ష శిష్యుడు మరియు వ్యాసునికి ఆధ్యాత్మికాచార్యుడు. కనుకనే గురుశిష్యపరంపరలో వచ్చుటచే అర్జునుని వలె వ్యాసుడు కూడ ప్రామాణికుడైన శిష్యుడు. సంజయుడు వ్యాసునికి ప్రత్యక్ష శిష్యుడు. కనుకనే వ్యాసుని కృపచే సంజయుని ఇంద్రియములు పవిత్రము లగుటయు అతడు శ్రీకృష్ణుని ప్రత్యక్షముగా చూచి వినగలుగుటయు సంభవించును. శ్రీకృష్ణుని నుండి ప్రత్యక్షముగా శ్రవణము చేయగలిగినవాడే ఈ గుహ్యతమ జ్ఞానమును ఎరుగగలడు. శ్రీకృష్ణుని నుండి వచ్చుచున్న ప్రామాణికమైన గురుశిష్య పరంపర నుండి రానివాడు శ్రీకృష్ణుని నుండి శ్రవణము చేయలేడు. కనుకనే అతని జ్ఞానము భగవద్గీతను అవగాహనము చేసికొనుటకు సంబంధించినంత వరకు సదా అసంపూర్ణమై యుండును.

భగవద్గీత యందు కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగ వంటి సమస్త యోగవిధానము లన్నియు వివరింపబడినవి. అట్టి యోగపద్ధతు లన్నింటికి శ్రీకృష్ణుడే ఈశ్వరుడు. శ్రీకృష్ణుని నుండి అర్జునుడు ప్రత్యక్షముగా శ్రవణము చేయగలుగుటకు అదృష్టవంతుడైనట్లే, వ్యాసుని కృపచే సంజయుడు కూడ శ్రీకృష్ణుని నుండి ప్రత్యక్షముగా శ్రవణము చేయగలిగెను. వాస్తవమునకు శ్రీకృష్ణుని నుండి ప్రత్యక్షముగా శ్రవణము చేయుటకు లేక వ్యాసుని వంటి ప్రామాణికాచార్యుని మాధ్యమము ద్వారా శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుట యందు ఎట్టి భేదము లేదు. ఆధ్యాత్మికాచార్యుడు కూడ వ్యాసదేవుని ప్రతినిధియే. కనుక, వేదవిధానము ననుసరించి ఆధ్యాత్మికాచార్యుని జన్మోత్సవ సందర్భమున 'వ్యాసపూజ' అను ఉత్సవమును శిష్యులు నిర్వహించుచుందురు.

**18.76**
**రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్ ।**
**కేశవార్జునయో: పుణ్యం హృష్యామి చ ముహుర్ముహు: ॥**

**అనువాదము**

**ఓ రాజా! శ్రీకృష్ణార్జునుల నడుమ జరిగిన అద్భుతమును, పవిత్రమును అగు ఈ సంవాదమును స్మరించిన కొలది ప్రతిక్షణము పులకాంకితుడనై ఆనందము నొందుచున్నాను.**

**భాష్యము**

భగవద్గీత యొక్క అవగాహనము అత్యంత దివ్యమైనది. శ్రీకృష్ణార్జున సంవాద విషయములను అవగాహన చేసికొనగలిగినవాడు మహాత్ముడై అట్టి సంవాద విషయములను మరవకుండును. ఇదియే ఆధ్యాత్మిక జీవితపు దివ్యస్థితి. అనగా భగవద్గీతను ప్రామాణికాచార్యుని నుండి అనగా ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని నుండి శ్రవణము చేయువాడు సంపూర్ణ కృష్ణచైతన్యమును పొందగలుగును. అట్టి కృష్ణచైతన్యమునకు ఫలితమేమనగా, మానవుడు నిరంతరము అధికాధికముగా వికాసము నొందుచు, ఏదియో కొంత సమయము కాకుండ ఎల్లప్పుడును ప్రతి క్షణము జీవితము నందు పరమానందము ననుభవించును.

**18.77**
**తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరే: ।**
**విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పున: పున: ॥**

**అనువాదము**

**ఓ రాజా! అత్యద్భుతమైన శ్రీకృష్ణుని రూపమును స్మరించిన కొలది నేను అధికాధికముగా ఆశ్చర్యమును నొందుచు మరల మరల ఆనందము ననుభవించుచున్నాను.**

**భాష్యము**

వ్యాసుని కృపచే సంజయుడు కూడ అర్జునునకు చూపబడిన శ్రీకృష్ణభగవానుని విశ్వరూపమును దర్శింపగలిగినట్లు ఇక్కడ గోచరించుచున్నది. శ్రీకృష్ణుడు అట్టి విశ్వరూపమును ముందెన్నడును చూపియుండలేదు. అది అర్జునునకు మాత్రమే చూపబడినది. అట్టి రూపము అర్జునునికి చూపబడినప్పుడు కొందరు మహాభక్తులు సైతము ఆ విశ్వరూపమును దర్శింపగలిగిరి. అట్టివారిలో వ్యాసమహర్షి ఒకరు. శ్రీకృష్ణుని పరమభక్తులలో ఒకడైన వ్యాసుడు శక్త్యావేశ అవతారముగా పరిగణింపబడుచున్నాడు. వ్యాసుడు దానిని తన శిష్యుడైన సంజయునికి దర్శింపజేసెను. శ్రీకృష్ణుడు అర్జునునకు చూపబడిన ఆ అద్భుత రూపమును స్మరిస్తూ సంజయుడు మరల మరల ఆనందించుచుండెను.

**18.78**
**యత్ర యోగేశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర: ।**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥**

**అనువాదము**

**ఎచ్చట యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడుండునో, ఎచ్చట మేటి ధనుర్ధారియైన అర్జునుడుండునో, అచ్చట సంపద, విజయము, అసాధారణమైన శక్తి, నీతి నిశ్చయముగా నుండును. అదియే నా అభిప్రాయము.**

**భాష్యము**

భగవద్గీత ధృతరాష్ట్రుని ప్రశ్నతో ఆరంభమైనది. భీష్మ, ద్రోణ, కర్ణాది మహాయోధుల సహాయముతో తన పుత్రులు నిశ్చయముగా విజయమును సాధింప గలుగుదురని అతని విశ్వాసము. అనగా విజయము తమ పక్షమునకే సిద్ధించునని అతడు భావించుచుండెను. కాని యుద్ధరంగమున జరిగిన సన్నివేశమును వర్ణించిన పిమ్మట సంజయుడు ధృతరాష్ట్రునితో : "నీవు జయమును గూర్చి ఆలోచించు చున్నావు. కాని శ్రీకృష్ణార్జునులు ఎచ్చట ఉందురో అచ్చటనే సర్వ శుభములు ఉండునని నా అభిప్రాయము" అని పలికెను. అనగా ధృతరాష్ట్రుడు తన పక్షమున విజయమును ఆశింపరాదని సంజయుడు ప్రత్యక్షముగా నిర్ధారించి యుండెను. శ్రీకృష్ణుడు అక్కడ నిలిచియున్నందున అర్జునుని పక్షమునకే విజయము సిద్ధించుననుట నిశ్చయము. ఇక్కడ శ్రీకృష్ణుడు అర్జునుని రథచోదకుడగుట కూడ ఆ భగవానుని మరొక విభూతిని ప్రకటించుటయై యున్నది. శ్రీకృష్ణుడు సమస్త గుణసంపన్నుడు. శ్రీకృష్ణునకు గల అనేక విభూతులలో వైరాగ్యము ఒకటి. శ్రీకృష్ణుడు వైరాగ్యమునకు కూడ ప్రభువగుటచే అట్టి వైరాగ్యమును అనేక సందర్భము లందు ప్రకటించినట్లు ఎన్నో నిదర్శనములు కలవు.

వాస్తవమునకు యుద్ధము దుర్యోధన ధర్మరాజుల నడుమ జరుగుచుండెను. అర్జునుడు కేవలము తన జ్యేష్ఠసోదరుడైన ధర్మరాజు పక్షమున పోరుచుండెను. ఆ విధముగా శ్రీకృష్ణార్జును లిరువురును ధర్మరాజు పక్షము నందుండుటచే అతనికి విజయము తథ్యము. ప్రపంచమును ఎవరు పరిపాలింపవలెనో నిర్ణయించుట కొరకై ఆ యుద్ధము ఏర్పాటు చేయబడెను. అట్టి రాజ్యాధికారము యుదిష్టిరునకే సంప్రాప్తించునని సంజయుడు జోష్యము చెప్పెను. అంతేకాకుండ యుద్ధమున విజయము సాధించిన పిమ్మట ధర్మరాజు మరింత అధికమైన సుఖసంపదలతో వర్ధిల్లునని కూడ ఇక్కడ సూచింపబడినది. ఎందుకనగా ధర్మరాజు ధర్మాత్ముడు మరియు పవిత్రుడు మాత్రమే కాకుండ గొప్ప నీతిమంతుడు. అతడు జీవితమున ఎన్నడును అసత్యమును పలికియుండలేదు.

భగవద్గీత యుద్ధరంగమున ఇరువురు మిత్రుల నడుమ జరిగిన సంభాషణముగా మాత్రమే భావించు మూర్ఖులనేకులు కలరు. కాని మిత్రుల నడుమ జరిగెడి సాధారణ సంభాషణము ఎన్నటికిని ఒక పవిత్రమైన శాస్త్రగ్రంథము కాజాలదని మరియు శ్రీకృష్ణుడు అర్జునుని అధర్మకార్యమైన యుద్ధమునకు ప్రేరేపించెనని కొందరు తమ అభ్యంతరమును తెలుపుదురు. కాని వాస్తవమునకు భగవద్గీత దివ్య ధర్మోపదేశమనెడి సత్యము ఇక్కడ స్పష్టముగా చెప్పబడినది. గీతయందలి నవమాధ్యాము నందు : "మన్మనా భవ మద్భక్త:"అను ముప్పది నాలుగవ శ్లోకమున ఈ దివ్య ధర్మోపదేశము వివరింపబడినది. అనగా ప్రతియొక్కరు శ్రీకృష్ణభగవానునికి భక్తులు కావలెను. శ్రీకృష్ణునికి శరణు పొందుటయే సర్వధర్మముల సారాంశము(సర్వధర్మాన్ పరిత్యజ్య

మామేకం శరణం వ్రజ). కనుక అత్యున్నతమైన నీతి మరియు పరమ ధర్మముల దివ్యవిధానములతో ఈ భగవద్గీత నిండియున్నది. ఇతర విదానములన్నీ కూడ పవిత్రీకరించునవే యైనను అంత్యమున మానవుని ఈ మార్గమునకే గొనివచ్చును. భగవద్గీత యందలి చివరి ఉపదేశమే నీతి మరియు ధర్మముల విషయమున చరమోపదేశము. అదియే శ్రీకృష్ణభగవానుని శరణాగతి. అట్టి శరణాగతియే అష్టాదశాధ్యాయపు చరమోపదేశము.

జ్ఞానయోగము మరియు ధ్యానయోగము చేత ఆత్మానుభూతిని పొందుట ఒక విధానమైనను, శ్రీకృష్ణుని సంపూర్ణముగా శరణుపొందుట అత్యున్నతమైనట్టి సంపూర్ణసిద్ధి అని భగవద్గీత ద్వారా మనము ఎరుగవచ్చును. భగవద్గీత ఉపదేశముల సారాంశమిదియే. వర్ణాశ్రమ ధర్మములు మరియు ఇతర ధర్మ విధానముల ననుసరించి క్రమసిద్ధాంతములతో కూడిన మార్గము గుహ్యమైన జ్ఞానమార్గము. కాని ధర్మమునకు సంబంధించిన కార్యకలాపములు గుహ్యములేయైనను, ధ్యానము మరియు జ్ఞానసముపార్జనములు అంతకంటెను గుహ్యతరము లైనట్టివి. ఇక సంపూర్ణ కృష్ణచైతన్యముతో శ్రీకృష్ణుని శరణుపొందుట భక్తియుక్త సేవలో గుహ్యతమమైన ఉపదేశము. ఇదియే అష్టాదశాధ్యాయపు సారాంశము.

దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడే పరమసత్యమనుట భగవద్గీత మరియొక లక్షణము. పరతత్త్వము నిరాకారబ్రహ్మముగా, అంతర్యామియైన పరమాత్మగా, అంత్యమున దేవాదిదేవుడైన శ్రీకృష్ణునిగా మూడుదశలుగా అనుభూతమగును. పరతత్త్వము యొక్క పరిపూర్ణ జ్ఞానమనగా శ్రీకృష్ణుని సంపూర్ణ జ్ఞానమనియే భావము. కనుక ఎవరైనను శ్రీకృష్ణుని అవగాహన చేసికొనినచో ఇతర జ్ఞానము మరియు సర్వశాఖలును అట్టి అవగాహనపు అంశభాగములే యగును. శ్రీకృష్ణభగవానుడు ఎల్లప్పుడును శాశ్వతమైన తన స్వరూపాంశ శక్తితో ప్రతిష్ఠితుడై యుండుటచే సదా దివ్యుడై యుండును. అతని శక్తినుండి సృష్టింపబడిన జీవులు రెండు తరగతులుగా విబజింపబడి నిత్యసిద్ధులు మరియు నిత్యబద్ధులుగా తెలియబడు చున్నారు. అసంఖ్యాకములుగా నున్న అట్టి జీవులందరు శ్రీకృష్ణుని అంశలే. భౌతికశక్తి ఇరువదినాలుగు తత్త్వములుగా వ్యక్తము చేయబడినది. భౌతికసృష్టి అనంతకాలముచే ప్రభావితమగుచున్నది. అది బాహ్యశక్తిచే సృష్టి నొందుచు నశించు చుండును. ఈ భౌతిక జగత్తు మరల మరల వ్యక్తావ్యక్తమగుచున్నది.

భగవద్గీత నందు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు, భౌతిక ప్రకృతి, జీవులు, శాశ్వతమైన కాలము, సర్వవిధములైన కర్మలు అను ఐదు విధములైన ముఖ్య తత్త్వవిషయములు చర్చింపబడినవి. సమస్తము దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పైననే ఆధారపడి యున్నది. పరతత్త్వపు నిరాకార బ్రహ్మానుభూతి, పరమాత్మానుభూతి మరియే ఇతర ఆధ్యాత్మిక భావమైనను దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అవగాహన విధానము నందే ఇమిడియున్నవి. దేవాదిదేవుడు, జీవుడు, భౌతిక ప్రకృతి, కాలమనెడి అంశములు స్థూలదృష్టికి భిన్నములుగా తోచినను ఏదియును పరమపురుషుని కంటెను భిన్నమైనది కాదు. కాని దేవాదిదేవుడు ఎల్లప్పుడు అన్నింటికిని భిన్నముగనే నుండును. ఇదియే శ్రీ చైతన్య మహాప్రభువు తెలిపిన 'అచింత్యభేదాభేద' తత్త్వము. ఈ తత్త్వవిధానము నందే పరమసత్యము యొక్క పరిపూర్ణ జ్ఞానము ఇమిడియున్నది.

జీవుడు తన నిజస్థితియందు శుద్ధాత్మ స్వరూపుడే. అతడు పరమాత్మ యొక్క అణు కణము వంటివాడు. ఈ విధముగా శ్రీకృష్ణుని సూర్యునితోను, జీవులను

సూర్యరశ్మితోను పోల్చవచ్చును. జీవులు శ్రీకృష్ణుని ‘తటస్థశక్తి’ యైనందున కొన్నిమార్లు వారు భౌతికశక్తితో గాని, మరికొన్నిమార్లు ఆధ్యాత్మికశక్తితో గాని సంపర్కమును పొందెడి స్వభావమును కలిగియుందురు. మరోమాటలో, జీవుడు భగవానుని రెండు శక్తుల నడుమ స్థితిని కలిగియుండును. అతడు భగవానుని ఉన్నతశక్తికి సంబంధించిన వాడగుటచే అత్యంత సూక్ష్మస్వాతంత్ర్యమును కలిగి యుండును. అట్టి స్వాతంత్ర్యమును సద్వినియోగ పరచుకొనుట ద్వారా అతడు శ్రీకృష్ణభగవానుని ప్రత్యక్ష నిర్దేశమునకు రాగలడు. ఈ విధముగా అతడు హ్లాదినీశక్తి యందు తన వాస్తవ స్వరూప స్థితిని పొందును.

**శ్రీమద్భగవద్గీత యందలి ‘ఉపసంహారము – సన్న్యాసము యొక్క పరిపూర్ణత్వము’ అను అష్టాదశాధ్యాయమునకు భక్తివేదాంత భాష్యము సమాప్తము.**

------

## పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల పరిచయము

---

పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు భారతదేశములోని కలకత్తా నగరములో 1896 వ, సంవత్సరములో జన్మించారు. వారు తమ ఆధ్యాత్మికాచార్యులైన శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి వారిని కలకత్తాలో 1922 వ, సం.లో మొదటిసారి కలుసుకున్నారు. శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతుల వారు ప్రముఖ వైదిక విద్యాసంపన్నులు, 64 గౌడీయ మఠాలను (వైదిక సంస్థలు) స్థాపించారు. వారు విధ్యాసంపన్నులు, యువకులైన ప్రభుపాదుల వారిని చూచి మిక్కిలి సంతోషించి, వైదిక విజ్ఞానాన్ని బోధించడానికి తమ జీవితాన్ని అంకితము చేయుమని ఉపదేశించారు. ఆనాటి నుండి శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ ఠాకూరు వారికి శిష్యులై పదకొండు సంవత్సరాల తరువాత యథావిధిగా దీక్షను తీసుకున్నారు.

మొదటి సమావేశములోనే శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ ఠాకూరు గారు ఆంగ్ల భాష ద్వారా వైదిక విజ్ఞానాన్ని ప్రచారము చేయమని శ్రీల ప్రభుపాదుల వారిని కోరారు. తరువాత సంవత్సరాలలో శ్రీల ప్రభుపాదుల వారు భగవద్గీతకు భాష్యమును రచించి, గౌడీయమఠ కార్యక్రమాలకు తోడ్పడ్డారు. 1944లో 'బ్యాక్ టు గాడ్హెడ్'(భగవద్దర్శనం) అనే ఆంగ్లపక్ష పత్రికను స్థాపించారు. అది ఇప్పుడు పాశ్చాత్యదేశాలలో వారి శిష్యులు చేత ముప్పయి కంటె ఎక్కువ భాషలలో కొనసాగించబడుతుంది.

శ్రీల ప్రభుపాదుల వారి భక్తివిజ్ఞానాలను గుర్తించి 1947లో గౌడీయ వైష్ణవ సంఘం వారికి భక్తివేదాంత బిరుదమును ఇచ్చి గౌరవించింది. 1950లో 54 సంవత్సరాల వయస్సులో ప్రభుపాదుల వారు వైవాహిక జీవితాన్ని విడిచి పెట్టి ఎక్కువకాలము గ్రంథాలను చదవడానికీ, వినియోగించ సాగారు. తరువాత వారు వృందావనానికి వెళ్ళి అక్కడ మధ్యయుగంలో చరిత్ర ప్రసిద్ధి కెక్కిన శ్రీశ్రీ రాధా దామోదర మందిరములో అతి నిరాడంబర జీవితమును గడిపారు. అక్కడే వారు చాలా సంవత్సరాల పాటు ఉండి ఎంతో విద్యా వ్యాసంగం చేసి అనేక గ్రంథాలను రచించారు. 1959 లో సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. తమ జీవిత ముఖ్య రచన అయిన శ్రీమద్భాగవతములోని 18,000 శ్లోకాలకు అనువాదము, వ్యాఖ్యానాలతో కూడిన అనేకసంపుటాలుగా రచనను ప్రారంభించారు. గ్రహాంతర సులభయానం అనే మరో గ్రంథాన్ని కూడా రచించారు.

శ్రీమద్భాగవతము మూడు సంపుటాలుగా ప్రచురించాక ప్రభుపాదుల వారు తమ ఆధ్యాత్మికాచార్యుల కోరికను నెరవేర్చడానికి 1965 లో అమెరికా సంయుక్తరాష్ట్రాలకు వెళ్ళారు. అప్పటి నుండీ వారు భారతీయ వేదాంత గ్రంథాలపై ప్రామాణికాలైన వ్యాఖ్యానాలు, భాషాంతరీకారణాలు, సంగ్రహ వ్యాఖ్యలు 70 సంపుటాలకు పైగా రచించారు.

1965 లో మొట్టమొదటిసారిగా ఒక వాణిజ్యనౌకలో న్యూయార్కు నగరానికి వెళ్ళినప్పుడు వారిదగ్గర ఒక్కపైస కూడ లేదు. తరువాత ఒక సంవత్సరానికి అంటే 1966 జూలైలో వారు అతికష్టము మీద అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘాన్ని (ఇస్కాన్) స్థాపించగలిగారు. పది సంవత్సరాల లోపలే ఆ సమాజము బాగా అభివృద్ధి చెంది ప్రపంచమంతటా వ్యాపించ సాగింది. పాఠశాలలు, మందిరాలను, ఆశ్రమాలు మొదలైన వాటిని నెలకొల్పసాగింది.

1968 లో శ్రీల ప్రభుపాదుల వారు న్యూవర్జీనియాలోని కొండల పైన ఆధ్యాత్మిక సమాజాన్ని స్థాపించి దానికి నూతన వృందావనము అని పేరును పెట్టారు. అక్కడే ఒక వైదిక పాఠశాలను నెలకొల్పి పాశ్చాత్యదేశాలకు సైతము వైదిక గురుకుల విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆ నూతన వృందావనము ఇప్పుడు వేయి ఎకరాలకు పైగా వైశాల్యము గల ప్రదేశములో విరాజిల్లుతుంది. అమెరికాలోని వారి శిష్యులు అలాంటి సంఘాలను ఎన్నింటినో స్థాపించారు.

1972 లో పరమపూజ్యశ్రీ శ్రీమత్ ప్రభుపాదుల వారు పాశ్చాత్య దేశాలలోని డెల్లాస్, టెక్సాస్లలో వైదిక పద్ధతిలో గురుకులాలను ఏర్పాటు చేశారు. 1972 లో ముగ్గురు విద్యార్థులతో ప్రారంభమైన గురుకులము 1975 నాటికి 150 మంది విద్యార్థులతో విరాజిల్లింది.

శ్రీల ప్రభుపాదుల వారు భారతదేశములో అంతర్జాతీయ కేంద్రాలను నిర్మింప చేయడానికి ప్రోత్సహించారు. పశ్చిమ బెంగాలులోని మాయాపూరులో శ్రీధామమనే అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మించ తలపెట్టారు. అతివిస్తృతమైన ఆ పథక నిర్మాణానికి చాలాకాలము పట్టవచ్చును. అది వైదిక శాస్త్రపఠనానికి కూడ అనుకూలముగా నిర్మించబడింది. భారతదేశములోని వృందావనములో మహోన్నతమైన కృష్ణబలరామ మందిరము ఆ పద్ధతుల ప్రకారమే నిర్మించబడింది. అక్కడ ఒక అంతర్జాతీయ అతిథి గృహము కూడ నిర్మించబడింది. పాశ్చాత్యులక్కడ నుండి వైదిక సంస్కృతిని స్వయంగా నేర్చుకునే అవకాశము ఉంది. బొంబాయిలో ప్రధాన సాంస్కృతిక విద్యాకేంద్రము కూడ గలదు. భారతదేశములో సుమారు పద్దెనిమిది ముఖ్యస్థానాలలో ఇతర కేంద్రాల నిర్మాణము కొనసాగుతుంది.

శ్రీల ప్రభుపాదుల వారి ముఖ్యాతి ముఖ్యమైన సేవ గ్రంథరచన. దాని ద్వారా వారు ఎంతో ప్రసిద్ధిని పొందారు. వారి గ్రంథాలు ప్రామాణికత్వానికీ, జ్ఞాన గాంభీర్యానికీ, వైదుష్యానికి పెట్టింది పేరు. అవి విద్వాంసుల చేత ఎంతగానో గౌరవించబడ్డాయి. అనేక కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రామాణిక పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. వారి రచనలు ఎనభైకి పైగా భాషలలోకి అనువదించబడ్డాయి. ప్రభుపాదుల వారి గ్రంథాలను ముద్రించి, ప్రకటించడము కోసమే 1972 లో భక్తివేదాంత బుక్ ట్రస్ట్ అనే సంస్థను స్థాపించారు. అది ఇప్పుడు భారతీయ వైదికతత్త్వ విషయాలపై గ్రంథాలను ప్రచురించే ప్రపంచ ప్రముఖ ప్రచురణ సంస్థగా రూపొందింది.

వార్ధక్యము సమీపించినను షుమారు పన్నెండు సంవత్సరాలలో శ్రీల ప్రభుపాదుల వారు ప్రపంచమంతటా పదునాలుగుసార్లు ఉపన్యాస యాత్ర సాగిస్తూ ఆరుఖండాలలో పర్యటించారు. అంతటి నిర్విరామ కార్యక్రమాలలో నిమగ్నులై యున్నప్పటికీ వారు తమ గ్రంథరచనను కొనసాగిస్తూనే ఉండేవారు. వారి గ్రంథాలన్నింటిని కలిపితే ఒక ప్రఖ్యాత వైదిక వేదాంత సాహిత్య సంస్కృతీ గ్రంథాలయ మవుతుంది.

1977 నవంబరు 14 వ తేదీన వారు ఉత్తరప్రదేశ్ లోని వృందావనమున తిరోభవించు కాలమువరకు నిర్విరామముగా శ్రమించారు. ప్రపంచమంతటా వందకు పైగా ఆశ్రమాలను, మందిరాలను, సంస్థలను స్థాపించి కృష్ణచైతన్య సంఘాన్ని అంతర్జాతీయ సంస్థగా (ఇస్కాన్ గా) తీర్చిదిద్దారు.

------